ఆర్షవిద్యా తరంగిణి

Inspired by the teachings of

**SWAMI PARAMARTHANANDAJI**

# Ekadasa Upanishattula Saram

# ఏకాదశ ఉపనిషత్తుల సారం

స్వామి పరమార్థానంద

ప్రజ్ఞానం బ్రహ్మ - అహం బ్రహ్మాస్మి

తత్త్వమసి - అయమాత్మా బ్రహ్మ

స్వామి పరమార్థానంద బోధనల స్ఫూర్తితో

వారి ఆశీస్సులతో

తెలుగు సేత - మద్దూరి / కస్తూరి రాజ్యశ్రీ

First edition - Year 2026 Guru Purnima day 1000 copies

For Copies
K V Raghava Rao
C - 804 Aparna Cyberzon
Nallagandla, Hyderabad 500019
Mobile: 9849092368

Email: raghavkasturi@gmail.com
Our Youtube Channel Arsha Vidya Tarangini
https://www.youtube.com/@arshavidyatarangini7911/playlists

For softcopies of our books and audio go to
https://arshavidya.app
www.telugubhakti.com

Title - **Ekadasa Upanishattula Saram**

Sanskrit Support – Sri Desu Chaitanya Krishna
DTP – Sri S Rajendra Kumar Moblie - 98661 15622

Printed at
Sai Sri Printers
8-3-945 # 21 Pancom Business Centre,
Ameerpet Hyderabad --500073
e-mail : saisriprinters@yahoo.com
Ph.No.040-23730222,Cell:9985530222 Price Rs. 700

# ఏకాదశ ఉపనిషత్తుల సారం

## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | బ్రహ్మయజ్ఞం | 5 |
| 2. | శ్రీమతి పాపినేని శారదగారి స్పందన | 6 |
| 3. | శ్రీ పరమార్థానంద స్వామీజీ బోధలోని ప్రత్యేకత | 9 |
| 4. | అజో-విభో-కందాళం ఫౌండేషన్‌లో ప్రసంగం | 14 |
| 5. | లౌకిక జీవనవిధానం - కంఫర్ట్ జోన్ | 23 |
| 6. | శ్రీగణపతి ప్రార్థన | 28 |
| 7. | ఏకాదశ ఉపనిషత్తుల సారం - ఉపోద్ఘాతం | 29 |
| 8. | ముండకోపనిషత్ - ముండకం 1 | 49 |
| 9. | ముండకోపనిషత్ - ముండకం 2 | 71 |
| 10. | ముండకోపనిషత్ - ముండకం 3 | 84 |
| 11. | కేనోపనిషత్ | 99 |
| 12. | కఠోపనిషత్ - అధ్యాయం 1 | 120 |
| 13. | కఠోపనిషత్ - అధ్యాయం 2 | 136 |
| 14. | కైవల్యోపనిషత్ | 149 |
| 15. | తైత్తిరీయోపనిషత్ - వల్లీ 1 | 165 |
| 16. | తైత్తిరీయోపనిషత్ - వల్లీ 2 | 182 |
| 17. | తైత్తిరీయోపనిషత్ - వల్లీ 3 | 199 |
| 18. | మాండూక్యోపనిషత్ - ప్రకరణం 1 | 213 |
| 19. | మాండూక్యోపనిషత్ - ప్రకరణం 2 | 243 |
| 20. | మాండూక్యోపనిషత్ - ప్రకరణం 3 | 271 |
| 21. | మాండూక్యోపనిషత్ - ప్రకరణం 4 | 306 |
| 22. | ఈశావాస్యోపనిషత్ | 342 |
| 23. | ఐతరేయోపనిషత్ | 356 |

| | | |
|---|---|---|
| 24. | ప్రశ్నోపనిషత్ | 367 |
| 25. | ఛాందోగ్యోపనిషత్ – అధ్యాయం 1 | 384 |
| 26. | ఛాందోగ్యోపనిషత్ – అధ్యాయం 2 | 402 |
| 27. | ఛాందోగ్యోపనిషత్ – అధ్యాయం 3 | 421 |
| 28. | ఛాందోగ్యోపనిషత్ – అధ్యాయం 4 | 439 |
| 29. | ఛాందోగ్యోపనిషత్ – అధ్యాయం 5 | 460 |
| 30. | ఛాందోగ్యోపనిషత్ – అధ్యాయం 6 | 481 |
| 31. | ఛాందోగ్యోపనిషత్ – అధ్యాయం 7 | 504 |
| 32. | ఛాందోగ్యోపనిషత్ – అధ్యాయం 8 | 526 |
| 33. | బృహదారణ్యకోపనిషత్ – అధ్యాయం 1 | 546 |
| 34. | బృహదారణ్యకోపనిషత్ – అధ్యాయం 2 | 559 |
| 35. | బృహదారణ్యకోపనిషత్ – అధ్యాయం 3 | 573 |
| 36. | బృహదారణ్యకోపనిషత్ – అధ్యాయం 4 | 591 |
| 37. | బృహదారణ్యకోపనిషత్ – అధ్యాయం 5 | 614 |
| 38. | బృహదారణ్యకోపనిషత్ – అధ్యాయం 6 | 631 |
| 39. | ఏకత్వంలో భిన్నత్వం – భిన్నత్వంలో ఏకత్వం | 644 |
| 40. | అద్వైత వేదాంతసారం | 669 |

# బ్రహ్మయజ్ఞమ్

**దుర్లభం త్రయమేవైతత్ దేవానుగ్రహహేతుకమ్।**
**మనుష్యత్వం ముముక్షుత్వం మహాపురుషసంశ్రయః॥** – వివేక చూడామణి

చిన్నవయస్సులోనే తల్లిదండ్రులు, నానమ్మ, మేనత్తలు ఇంట్లో చేసే వేదాంతగోష్ఠిని వింటూ పెరగటంవల్ల ఆధ్యాత్మిక చింతన తనకు తెలియకుండానే ఏర్పడింది అంటారు శ్రీమతి పాపినేని శారద గారు. ఆ శ్రవణసంస్కారం వృథా కాలేదు. అది ఆమెలో తీవ్రముముక్షుత్వాన్ని కలిగించింది.

జె.ఎన్.టి.యు.లో ఇంజనీరింగ్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో మాస్టర్స్ చేసి హైదరాబాద్‌లో జె.ఎన్.టి.యు.లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగధర్మాన్ని నెరవేర్చారు.

అనుకోకుండా అమెరికా వలస వెళ్ళటంవల్ల ఆమె జీవనవిధానమే మారిపోయింది. ఇటు లౌకికంగా విజయ సోపానాలను అధిరోహిస్తే, అటు ఆధ్యాత్మికంగా ఒక దిశానిర్దేశం జరిగింది శ్రీమతి పాపినేని శారద గారికి. అక్కడ ఎమ్మెస్ చేసి ఫోర్డ్ కంపెనీలో 25 సంవత్సరాలు అనేక హోదాల్లో ఉద్యోగం చేశారు. పాశ్చాత్యమాయలో పడిపోకుండా, మాయ అంటే అపరాప్రకృతి అనీ, పరాప్రకృతి వైపు తిరగాలనీ చిన్మయా మిషన్‌లో వివేకచూడామణి, తరువాత ఆర్షవిద్యా తరంగిణిలో ఉపనిషత్తులు, భగవద్గీత అధ్యయనం చేసి, తను నేర్చుకోవటమే కాకుండా మరికొంతమంది శిష్యులకు అద్వైతవేదాంతాన్ని నేర్పిస్తున్నారు.

శ్రీమతి పాపినేని శారద గారు ఏకాదశ ఉపనిషత్తులసారం అనే ఈ గ్రంథరాజానికి బ్రహ్మయజ్ఞం పేరిట బృహత్తరంగా సహకరించారు.

శ్రీమతి పాపినేని శారద గారు, వారి కుటుంబము సదా బ్రహ్మనిష్ఠలో నిలవాలని, వారందరికీ ఆయురారోగ్య ఐశ్వర్యాలను, ఆధ్యాత్మిక చింతనను, వైదికజీవనాన్ని మరింత సమృద్ధిగా ఇవ్వమని ఆ భగవంతుణ్ణి వేడుకుంటున్నాము.

**– రాఘవరావు, రాజ్యశ్రీ**

# శ్రీమతి పాపినేని శారదగారి స్పందన

**ఓం శ్రీ గురుభ్యో నమః**

**బ్రహ్మయజ్ఞానికి ముందుగా నా పరిచయం**

**సదాశివసమారమ్భాం శంకరాచార్యమధ్యమామ్।**

**అస్మదాచార్యపర్యన్తాం వన్దే గురుపరంపరామ్॥**

**జ్ఞానదాతలైన గురువులకు వినయపూర్వక పాదాభివందనములు.**

మన గురువులు శ్రీ కస్తూరి వీరరాఘవరావు గారు వర్ణనాతీతమైన మహిమగల ఏకాదశ ఉపనిషత్తులలోని ప్రతి ఉపనిషత్తుయొక్క ముఖ్యాంశాలన్నింటినీ సంక్షిప్తంగా సాధకుల సౌకర్యార్థము ఒకే గ్రంథములో చేర్చి, సులభశైలిలో, అందరికీ అర్థమయ్యేలా బోధించారు. మన గురుదంపతులు శ్రీ కస్తూరి వీరరాఘవరావు గారు, శ్రీమతి మద్దూరి రాజ్యశ్రీ గారు ఆర్ష విద్యా తరంగిణి తరుపున "ఏకాదశ ఉపనిషత్తుల సారం" అను గ్రంథరాజమును ప్రచురింప సంకల్పించినట్టు నాకు తెలిసింది.

నాకు చిన్ననాటినుండి లౌకికవిద్యతో పాటు ఆధ్యాత్మిక విద్యకు సమానమైన ప్రాధాన్యతను తెలియజేసి, ఎంతో ప్రోత్సహించిన దైవసమానులైన మా తల్లి గారు శ్రీమతి మాదిరెడ్డి సుశీలా రావు గారు, మరియు మా తండ్రి గారు కీర్తిశేషులు శ్రీ మాదిరెడ్డి వెంకట రామకృష్ణారావు గారు, నన్ను ఒక సాధకురాలిగా తీర్చిదిద్దారు. మన గురుదంపతులు ప్రచురించబోయే "ఏకాదశ ఉపనిషత్తుల సారం" అను గ్రంథముతో నాలాంటి మరెందరో సాధకులు లబ్ధి పొందుటకు, ఉపనిషత్తుల సారాన్ని నిజజీవితంలో అభ్యసించిన మా నాన్నగారి స్మృతి చిహ్నంగా, ఆ గ్రంథప్రచురణకు నేను ఆర్థిక సహాయము చేయుటకు అంగీకరించినందుకు, మన గురుదంపతులకు హృదయపూర్వక కృతజ్ఞతాభివందనములు.

మా నాన్నగారు కీ.శే. శ్రీ మాదిరెడ్డి వెంకట రామకృష్ణారావు గారు హైదరాబాద్ ఆల్విన్ కంపెనీలో ఛీఫ్ పర్సనల్ మానేజరుగా1988 లో పదవీ విరమణ చేసి ఆధ్యాత్మికంగా చాలా సాధన చేసి ఎంతో ఎత్తుకు ఎదిగిన జ్ఞాన సంపన్నులు. మా నాన్న గారు, అమ్మ గారు తమ ఇంటనే ధ్యాన కేంద్రాన్ని ఏర్పాటు చేసి 20 ఏళ్ళకి పైగా ఎందరో సాధకులకు మార్గదర్శకులైన తీవ్ర తపన వున్న ఆధ్యాత్మిక సాధకులు.

ఇక నా ఆధ్యాత్మిక వికాసము విషయంలో ఈ గురు పరంపరలో నా ప్రయాణం అంచెలంచెలుగా పురోగమిస్తున్నందులకు ఆ పరమాత్మునికి శతకోటి నమస్కారములు. నా విద్యార్థి దశలో మా నానమ్మగారు కీ.శే. శ్రీమతి మాదిరెడ్డి కాంతామణి గారు

మా ఇంట్లో వున్నప్పుడు, మా నాన్న గారు, వారి తోబుట్టువులు, మా అమ్మగారు, అందరు మా ఇంట్లో కలిసి తరుచుగా వివేకచూడామణి, భగవద్గీత వంటి వేదాంత గ్రంథాలు చర్చిస్తూ, అందులోని సూక్ష్మాంశాలని విశ్లేషించుకునేవారు. నిష్ణాతులైన వారి మాటలు నా లో ఆధ్యాత్మిక బీజాలకి అంకురార్పణ అయితే, మా అమ్మానాన్నగార్ల నిరంతర ప్రోత్సాహము దానిని ఫలపుష్పభరితము చేసింది. నేను అమెరికా లో జాబ్ చేస్తూ మా పిల్లల్ని చూసుకుంటున్నప్పుడు సత్సంగాలకి సమయము లేదంటే, నా ఆధ్యాత్మిక పురోభివృద్ధికి కూడా నా జాబ్ తో సమాన ప్రాధాన్యతను ఇవ్వాలని మా అమ్మానాన్నగార్లు నాకు మార్గదర్శనము చేసేవారు. అందువల్ల ఆధ్యాత్మిక వికాసానికి పెద్దపీట వేసి, మా భర్తగారైన కీ.శే. శ్రీ పాపినేని నాగ వెంకట సుబ్రహ్మణ్యేశ్వర కుమార్ గారి సంపూర్ణ సహకారములతో మాకు అందుబాటులో వున్న చిన్మయా మిషన్ వారి క్లాసులకి, స్వామీజీల సత్సంగాలకి సపరివారంగా వెళ్ళి కొంతవరకు శాస్త్రజ్ఞానమునందు, సంస్కృతభాషయందు అవగాహన పొందగలిగాను.

వర్తమానములో ఈ on-line క్లాసుల ద్వారా నా ఆత్మజ్ఞానాన్ని పెంచుకోవడానికి తోడ్పడుతున్న మన గురుత్రయమైన శ్రీ కస్తూరి వీరరాఘవరావు గారు, శ్రీమతి మద్దూరి రాజ్యశ్రీ గారు, శ్రీ మూల్పూరి విష్ణు ప్రసాద్ గార్లకు అనంతకోటి ప్రణామములు.

మోక్షసాధన హేతుభూతములైన ఉపనిషత్తుల కూర్పు ఈ "ఏకాదశ ఉపనిషత్తుల సారం" అనే గ్రంథరాజము. దీనిలో అన్ని కాన్సెప్టులని, మహావాక్యాలని సోదాహరణంగా, అనేక కథా, కథనాలతో సుస్పష్టంగా వివరించారు మన గురువులు. ఈ గ్రంథము –

– ఆధ్యాత్మిక ప్రయాణం ప్రారంభించేవారికి short and sweet గా సులభశైలిలో సంక్షిప్తంగా, ఎంతో ఉత్సాహంగా పఠించడానికి ఆసక్తికరం గాను,

– ఆధ్యాత్మిక ప్రయాణంలో పండిన వారికి ఒక పునశ్చరణ గాను వుంటుంది.

అలా అందరికీ అనుకూలించి లబ్ధి పొందేలాగ దీనిని మన ముందు వుంచారు మన గురువులు. ఈ "ఏకాదశ ఉపనిషత్తుల సారం" అనే గ్రంథరాజము వేదాంత జిజ్ఞాసువులకు ఒక గొప్ప కానుక కాగలదని ఆశిస్తూ, మన గురుదంపతులకు నా పాదాభివందనములు సమర్పిస్తూ...

నమో నమః శ్రీ గురుపాదుకాభ్యామ్.

ఓం తత్ సత్

శ్రీ కృష్ణార్పణమస్తు

**పాపినేని శారద**

**W/O కీ.శే. పాపినేని నాగ వెంకట సుబ్రహ్మణ్యేశ్వర కుమార్**

గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః ।
గురుః సాక్షాత్ పరబ్రహ్మా తస్మై శ్రీ గురవే నమః ॥



కీ.శే. శ్రీ మాదిరెడ్డి జనార్ధన రావు గారు
కీ.శే. శ్రీమతి మాదిరెడ్డి కాంతామణి గారు



కీ.శే. శ్రీ మాదిరెడ్డి వెంకట రామకృష్ణారావు గారు
శ్రీమతి మాదిరెడ్డి సుశీలా రావు గారు

CS Scanned with CamScanner

# పరమార్థానంద స్వామీజీ బోధలోని ప్రత్యేకత

అద్వైత వేదాంతం మన అణువు అణువునా నిండిపోవటానికి, అందులోని కాన్సెప్ట్‌లకు చిన్న ఉదాహరణలో లేదా కథలో చెబుతారు స్వామీజీ. వాటిలో కొన్నింటిని చూద్దాము.

1. **దుఃఖమిశ్రితత్త్వం** – లౌకిక జీవనంలో ప్రతివస్తువూ సుఖహేతువే కాదు, దుఃఖహేతువు కూడా. ప్రతి కర్మఫలం కూడా దుఃఖమిశ్రితం అంటుంది వేదాంతం. అందువల్ల ఎవరైనా మిమ్మల్ని మీకు ఆనందం కలిగించేవి, మీకు దుఃఖం కలిగించేవి రాయండి అంటే ఒకటే పేరు కింద రాయవచ్చు అంటుంది వేదాంతం. నసీరుద్దీన్ ముల్లా చాలా ఇరుకైన బూటు వేసుకుంటూండేవాడు. అది చాలక ఇంకా గట్టిగా లేసులు కట్టుకునేవాడు. అలా ఎందుకు చేస్తావు అంటే, 'రోజంతా అవి వేసుకుని తిరిగి, అవస్థపడి, ఇంటికి తిరిగివచ్చాక, ఆ బూట్లు విప్పితే కలిగే ఆనందం ఉంటుందీ, అది నేను మాటల్లో చెప్పలేను,' అంటాడు. అలా ప్రతిదీ **దుఃఖమిశ్రితత్త్వం**.

2. **సకామభక్తి** – సకామభక్తి ఒక ఫక్తు వ్యాపారంలాంటిది. నాకిది చేయి, నువ్వు ఇది చేస్తే నేను అది చేస్తాను అంటాము. ఒక భక్తునికి చాలా పెద్ద జబ్బు చేసింది. తనకు ఆ జబ్బు నయం చేస్తే తన బంగారు ఉంగరాన్ని హుండీలో వేస్తానన్నాడు. కాని తీరా అతనికి నయమై, అతను తిరుపతి వెళ్ళేరోజుకి బంగారం ధర చాలా పెరిగిపోయింది. అందుకని తను మొక్కుకున్నరోజుకి బంగారం విలువ ఎంత ఉందో లెఖ్ఖకట్టి, అంత సొమ్ము హుండీలో వేశాడు. అతను తెలివైనవాడైతే, భగవంతుడు ఇంకా తెలివైనవాడు. అతను డబ్బులు వేస్తూండగా అతని చేతి ఉంగరం కూడా జారి హుండీలో పడిపోయింది. పడిపోయినదాన్ని తిరిగి తీసుకోలేడు.

3. **కర్మ చేయాలి, దానిని వదిలి జ్ఞానానికి రావాలి** – ఒక పోల్‌వాల్టర్ కర్ర పట్టుకుని పరిగెత్తుకు వచ్చి, బాగా ఎత్తుకు ఎగిరి, కర్రను వదిలేసి అవతలకు దూకుతాడు. ఎలాగూ వదిలేసేదాన్ని పట్టుకోవటమెందుకు అనుకోడు. అది పట్టుకోలేదో ఎగరలేడు. ఇంతదూరం నేను పట్టుకుని పరిగెత్తాను కదా, ఇప్పుడు ఎందుకు వదిలేయటం అనీ అనడు. వదలందే దూకలేడు. అంటే దాన్ని పట్టుకోవాలి, సరియైన సమయంలో వదలాలి. కర్మ కూడా అంతే. కర్మ చేయాలి, దాన్ని సరియైన సమయంలో వదలాలి.

**కర్మయోగం లేనిదే జ్ఞానయోగం అసాధ్యం**
**జ్ఞానయోగానికి రానిదే కర్మయోగం అసంపూర్ణం**

4. **సంసారం నిజంగా లేదు** – పూర్వం కొందరు చిన్నపిల్లలు ఒక కాయిన్‌గేమ్ ఆడేవారు. ఒక పిల్లవాని నుదుటికి ఒక కాయిన్ గట్టిగా కాసేపు నొక్కిపట్టి ఉంచి, అతనికి తెలియకుండా ఆ కాయిన్‌ను తీసేసేవారు అతని స్నేహితులు. కాని అతనికి తన నుదుటి మీద ఇంకా నాణెం ఉన్నట్టే అనిపిస్తుంది. స్నేహితులు, నీకు మూడు అవకాశాలు ఇస్తాము, నీ తలవెనుక కొట్టుకుని నాణేన్ని కిందపడేయి అంటారు. అతను మూడుసార్లు కొట్టుకున్నా అది పడదు. వారు ఉదారంగా మరికొన్నిసార్లు కొట్టుకోమంటారు నవ్వుల పువ్వుల మధ్య. అక్కడ ఉంటే కదా పడటానికి. చివరికి ఆ విషయం చూపించటానికి అద్దం తెచ్చి చూపిస్తారు. మనమూ ఏమీ తక్కువ తినలేదు అంటుంది శాస్త్రం. మనకు లేనేలేని సంసారం నుంచి బయటపడటానికి విశ్వప్రయత్నం చేస్తున్నాము. గురువు, శాస్త్రమనే దర్పణం తెచ్చి చూపిస్తే గాని మనకు ఆ విషయం తెలియదు. ఇది నమ్మలేము, కానీ సత్యం!

5. **మిథ్య నిర్వచనం** – మిథ్య అంటే సత్ కాదు, అసత్ కాదు. ఇది అర్థం చేసుకోవాలంటే మన స్వప్నవృత్తాంతం తీసుకోవాలి. స్వప్నం సత్‌లోకి వస్తుందా, అసత్‌లోకి వస్తుందా? స్వప్నం లేదు అంటే స్వాప్నికుడు ఒప్పుకోడు. అతను స్వప్నంలో ఉన్నంతవరకూ అతనికి స్వప్నం స్వప్నం అని తెలియదు. అక్కడ ఒక పులిని చూసి ఖంగారు పడతాడు, పరుగులు పెడతాడు, చమటలు పడతాయి. అయితే దీన్ని సత్ అందామా? అతను నిద్రనుంచి లేవగానే పులి మాయమైపోతుంది. పులి ఎక్కడికి వెళ్ళింది? మంచం కిందకి దూరిందా, జూలోకి పారిపోయిందా? అసలు నిజంగా ఉంటే కదా, పారిపోవటానికి. అంటే నిద్ర నుంచి లేవగానే అది అసత్ అయింది. అందువల్ల స్వప్నం నిజంగా ఉంది అనలేము, పూర్తిగా లేదనీ అనలేము. ఇదే సూత్రం జాగ్రత్ ప్రపంచానికీ వర్తిస్తుంది. అందులో ఉన్నంతవరకూ అది సత్. దానినుంచి పారమార్థికస్థాయికి ఎదిగితే అసత్. సదసద్భ్యాం మిథ్యా

6. **పరమాత్మ సృష్టి మహామాయ** – ఇంద్రజాలికుడు ఒక యువతిని ఒక పెట్టెలో పడుకోబెట్టి, ఆమెను పెద్ద కత్తితో రెండు భాగాలుగా కోస్తాడు. కోసి ఆ రెండు పెట్టెలను చెరోవైపుకు త్రోసి, తను వాటి మధ్యలోంచి నడుస్తాడు. కింద రక్తం బొట్లు కారటం కూడా చూస్తాము. తల, మొండెం ఉన్నవైపు నుంచి అరుపులు, కేకలు వినిపిస్తే, కాళ్ళు మాత్రం ఉన్నవైపు కాళ్ళు కదలటం కనిపిస్తుంది. దానిలో కొంత విషాదం చొప్పించి, తన భార్య చనిపోయినట్టు దుఃఖిస్తాడు. ఆమె ద్వైతం (రెండు ముక్కలు) అయినట్టుగా కనిపిస్తుంది కాని నిజానికి ఆమె అద్వైతం (కోయబడలేదు). ఇదంతా మాయ. ఒక మామూలు ఇంద్రజాలికుడు చేసిన మాయను స్వీకరించగా లేనిది, మహామాయావి అయిన పరమాత్మ చేసిన మహా ఇంద్రజాలాన్ని స్వీకరించలేమా?

7. **జగత్తు ప్రయోజనం ఆపేక్షికం మాత్రమే** – ఒక చిన్నపిల్లవాడు తల్లి ఒడిలో పడుకుని నిద్రపోతాడు. ఆ నిద్రలో తన తల్లినుంచి విడిపోయి, ఎక్కడో అడవిలో ఒంటరిగా చిక్కుకుపోయినట్టు కలగంటాడు. తల్లి ఒడిలో ఉండి, తల్లినుంచి దూరమైన ఆ బాలుడిని జాగ్రదవస్థలో ఉన్న తల్లి ఓదార్చలేదు. ఆ మాటకొస్తే ఆ తల్లికి తన తనయుడు అటువంటి కలగంటున్నట్టు కూడా తెలియదు. ఇప్పుడు చెప్పండి! తల్లివల్ల ప్రయోజనం ఉందా, లేదా? ఆవిడ ప్రయోజనం ఆపేక్షిక ప్రయోజనం మాత్రమే. పిల్లవాని స్వప్నంలో ఆమె ఏమీ సహాయపడలేదు. అలాగే జాగ్రత్ ప్రపంచం ఆపేక్షిక సత్యం మాత్రమే. పారమార్థికస్థాయికి ఎదిగితే అది స్వప్నం–2 అవుతుంది.

8. **అధ్యారోప అపవాదం** – కేరళలో ఒక తండ్రికి 17 ఏనుగులు ఉన్నాయి. ఆయనకు ముగ్గురు కొడుకులు ఉన్నారు. ఆ తండ్రి మరణిస్తూ, తన ఏనుగులను తన ముగ్గురు కొడుకులూ ఇలా పంచుకోవాలన్నాడు. పెద్దకొడుకుకి సగం వాటా, రెండవ కొడుకుకి మూడవ వంతు వాటా, మూడవ కొడుకుకి తొమ్మిదవ వంతు వాటా రావాలి. కాని ఏనుగులను కోయకూడదు.

ఆ ఊరి రాజుకి ఈ విషయం తెలిసి, తన ఏనుగు మీద అక్కడికి వచ్చి, తన ఏనుగు మీద కూర్చుని ఉండే సమస్యను పరిష్కారించాడు.

చనిపోయిన తండ్రి 17 ఏనుగులు, రాజు ఏనుగు కలిపితే 18 అవుతాయి (17+1=18)

| | |
|---|---|
| పెద్ద కొడుకుకి 1/2 వాటా | = 18 ÷ 2 = 9 |
| రెండవ కొడుకుకి 1/3 వాటా | = 18 ÷ 3 = 6 |
| మూడవ కొడుకుకి 1/9 వాటా | = 18 ÷ 9 = 2 |
| మొత్తం ఏనుగులు | = 17 |

అలా రాజు ఏనుగులను కోయకుండా, తండ్రి కోరుకున్నట్టుగా పంచాడు. ఎలా చేశాడు? తన ఏనుగును ప్రవేశపెట్టాడు. సమస్యను పరిష్కరించాడు. తన ఏనుగు మీదే తాను వెళ్ళిపోయాడు. ఇదే అధ్యారోప అపవాదం అంటే. వేదాంతం ముందు సృష్టిని ప్రవేశపెడుతుంది, సమస్యను పరిష్కరిస్తుంది, సృష్టిని తాను వెనక్కి తీసేసుకుంటుంది. ఇక్కడ సమస్య ఏమిటి? నిజంగా నానాత్వం ఉన్న జగత్తు రాలేదు. ఉన్నదొకటే బ్రహ్మ. జగత్తును ప్రవేశపెట్టి, జగత్తు నిజంగా లేదు, అది మిథ్య అంటుంది.

9. **సాధ్య సాధన విలక్షణం బ్రహ్మ** – ఒక టాక్సీడ్రైవర్ ఒక అమాయకుడిని అడిగాడుట – 'నా కుటుంబంలో ముగ్గురు సభ్యులు ఉన్నారు. ఒకరు నా భార్య, ఇంకొకరు మా అబ్బాయి.

మూడవది ఎవరు?' అతనికి ఎంతకీ జవాబు తెలియలేదు. డ్రైవరే చెప్పాడు. 'ఆ మూడవది నేనే. తత్ త్వం అసి. అది నేనే. ఆ అమాయకుడు వెళ్ళి తన స్నేహితుడిని ఇదే ప్రశ్న వేశాడు. అతనూ చెప్పలేకపోయాడు. అప్పుడు ఆ అమాయక చక్రవర్తి విజయగర్వంతో 'నా కుటుంబంలో మూడవ వ్యక్తి ఆ టాక్సీడ్రైవరు,' అన్నాడు. బుద్ధిపెట్టి ఆలోచించకపోతే ఇలాగే ఉంటుంది.

సృష్టిలో మూడు వస్తువులు ఉన్నాయి. అవి సాధకుడు, సాధ్యం, సాధన. బ్రహ్మ విషయంలో వేదాంతం రెండు కొట్టివేసింది. బ్రహ్మ సాధ్యమూ కాదు, సాధనా కాదు అంటే బ్రహ్మ లేదు అనేయకూడదు. మూడవ వస్తువు సాధకుడు. బ్రహ్మ ఆత్మరూపంగా ఉన్నాడు.

10. **జ్ఞానం జ్ఞాననిష్ఠగా మారకపోతే** – ఇద్దరు విద్యార్థులు పరీక్ష రాస్తున్నారనుకోండి. ఒక పిల్లవాడు బాగా చదువుకుని వచ్చాడు. కాని ప్రశ్నపత్రాన్ని చూడగానే నేర్చుకున్నదంతా మర్చిపోయాడు. ఇంకొక విద్యార్థి అసలు ఏమీ నేర్చుకోకుండా వచ్చాడు. అంటే ఒక విద్యార్థి నేర్చుకుని మర్చిపోయాడు. ఇంకొక విద్యార్థి అసలు నేర్చుకోలేదు. కాని ఇద్దరి మార్కులూ చూస్తే ఇద్దరికీ సున్నానే వచ్చింది. సాంకేతికపరంగా చూస్తే ఇద్దరి మధ్యా పెద్ద భేదమే ఉంది కాని ఫలితం పరంగా చూస్తే ఇద్దరి పరిస్థితీ ఒకటే.

ఇదే సూత్రం అజ్ఞానికీ, జ్ఞానం పొంది మర్చిపోయిన వ్యక్తికీ వర్తిస్తుంది.

ఒక వ్యక్తి ప్రస్థానత్రయం అంతా నేర్చుకున్నాడు. ఇంకొక వ్యక్తికి ఉపనిషత్తు అంటే ఏమిటోనే తెలియదు. జీవితంలో ఒక క్లిష్టపరిస్థితి ఎదురైతే జ్ఞానికి తన జ్ఞానం అంతా గాలికెగిరిపోతే, అతనికీ, అజ్ఞానికీ మధ్య భేదం లేదు.

11. **నిదిధ్యాసనం ఎందుకు చేయాలి?** – ఒకసారి కొంతమంది మంగలివాళ్ళు కలిసి వారి సంఘం తరపున రామాయణం నాటకం వేద్దామనుకున్నారు. పాపం చాలా కష్టపడి రిహార్సల్సు చేశారు. అనుకున్నరోజు రానే వచ్చింది. దశరథ మహారాజు కొలువులోకి విశ్వామిత్రుడు వస్తాడు. రండి, రండి, మీకేం చేయగలను అని అడగాలి రాజు. కాని, 'రండి, రండి, మీకేం చేయగలను? షేవింగా, కటింగా?' అన్నాడు. ఎందుకు? అతని ఒత్తైన జుట్టు, పొడుగు గడ్డం చూసేసరికి పైన దశరథుడిగా నగలు వేసుకున్నా, అతనిలోని మంగలివాడు పైకొచ్చాడు. అందరూ గొల్లున నవ్వారు. కాని జ్ఞానం పొంది, దాన్ని జ్ఞాననిష్ఠగా మలుచుకోకపోతే మన పరిస్థితీ అంతే. ఈ పాత వాసనలను పోగొట్టుకోవటానికి నిదిధ్యాసన చేయాలి.

12. **జ్ఞాని లక్షణం** – a) He who knows not and who knows not that he knows not is a fool, shun him.
b) He who knows not but he knows that he knows not is simple, teach him.
c) He who knows and knows not that he knows, is asleep, awaken him.
d) He who knows and knows that he knows is wise, follow him.

ఈ వాక్యాల అర్థాలు చూద్దాము.

ఎ) అతనికి తెలియదు, అతనికి తెలియదని కూడా అతనికి తెలియదు. అటువంటి వ్యక్తి మూర్ఖుడు, అతన్ని పట్టించుకోకండి.

బి) అతనికి తెలియదు, కానీ అతనికి తెలియదని అతనికి తెలుసు; అటువంటి వ్యక్తి అమాయకుడు. అతనికి బోధ చేయండి.

సి) అతనికి తెలుసు, కానీ అతనికి తెలుసని అతనికి తెలియదు; అటువంటి వ్యక్తి నిద్రపోతున్నాడు, అతనిని లేపండి.

డి) అతనికి తెలుసు, అతనికి తెలుసని అతనికి తెలుసు. అటువంటి వ్యక్తి జ్ఞాని. అతనిని అనుసరించండి.

నాలగవ రకం వ్యక్తి జ్ఞాని. అతనికి జ్ఞానం ఉంటుంది. అతనికి సరియైనది ఎందుకు సరియైనదో, తప్పైనది ఎందుకు తప్పో స్పష్టంగా తెలుసు.

**– మద్దూరి రాజ్యశ్రీ**

# అజో-విభో-కందాళం ఫౌండేషన్‌లో ప్రసంగం

సభాయై నమః

**అజ్ఞానతిమిరాంధస్య జ్ఞానాంజనశలాకయా।**
**చక్షురున్మీలితం యేన తస్మై శ్రీ గురవే నమః॥**

మా గురుదంపతులు శ్రీమతి మద్దూరి రాజ్యశ్రీ, శ్రీ కస్తూరి వీరరాఘవరావు గార్ల అభినందన సభలో మా సభ్యులందరం పాల్గొనడానికి అవకాశం కలిగించిన అజో-విభో-కందాళం ఫౌండేషన్ వారికి మా ఆర్షవిద్యా తరంగిణి తరపున కృతజ్ఞతలు.

ముందుగా నేను మా గురువులు రచించిన గ్రంథాల గురించి క్లుప్తంగా వివరిస్తానండీ! మనందరి జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు మనకి తెలిసి తెలియకుండా స్పృశించే విషయం 'నేను ఎవరు' అనే ప్రశ్న. ఈ లౌకిక ప్రపంచం చూపే అనేక ఆనందాల్లో ఎక్కడా తృప్తి లభించదు. ఈ ప్రపంచం చూపే ఆనందం తాత్కాలికం అని గ్రహిస్తాం.

అయితే వేల సంవత్సరాలుగా మన మహర్షులు, ఋషులు ఒక గొప్ప రహస్యాన్ని మనకు చెప్పారు. 'నీ నిజస్వరూపం తెలుసుకో!' 'నువ్వే బ్రహ్మ' అని. ఈ అద్భుతమైన తత్త్వాన్ని బోధించే అమృతగ్రంథాలు ఉపనిషత్తులు. 'ఈ ఉపనిషత్తుల్లో ఏముంది?' 'అవి మీకు ఏం చెబుతున్నాయి?' అన్న ప్రశ్నకు సమాధానం మా గురుదంపతులు తెలుగులో రచించిన ప్రస్థానత్రయం గ్రంథరాజాలు. శ్రీశ్రీశ్రీ పరమార్థానంద స్వామీజీ బోధనల స్ఫూర్తితో ప్రస్థానత్రయ మహాగ్రంథాలను తెలుగులో రచించారు మా గురుదంపతులు. ప్రస్థానత్రయంఅంటే అందరికీ తెలిసినదే - ఉపనిషత్తులు, భగవద్గీత, బ్రహ్మసూత్రాలు. బహుశా తెలుగులో ఇంత సులభమైన శైలిలో, ఇంత వివరంగా అద్వైతగ్రంథాలు ఇప్పటి వరకు రాలేదేమో! ఇది ఒక అరుదైన విషయం.

సాధారణంగా మనకి వివిధ సందర్భాలలో భగవద్గీత, ఇతర ఆధ్యాత్మిక గ్రంథాలను వితరణ చేస్తుంటారు. అవి బుక్‌షెల్ఫ్‌కి పరిమితమవడం సర్వసాధారణం. కానీ మా గురువులు రచించిన గ్రంథాలు మనల్ని చదివేలా చేస్తాయి. ఆ శైలి ఎలా ఉంటుందంటే మన ఎదురుగా కూర్చుని మాట్లాడుతున్నట్టు ఉంటుంది.

అన్ని ఉపనిషత్తుల సారం ఒక్కటే - 'బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః'. కానీ ఈ అంశం మా గురువులు రచించిన ఈ ఉపనిషత్తులలో ఏ విధంగా ప్రస్తావించబడింది అంటే ఏ ఉపనిషత్తు ప్రత్యేకత దానిదే!

మా గురుదంపతులు రాజ్యశ్రీ మేడమ్ గారు రాసిన ప్రతి ఉపనిషత్తు గ్రంథం కిందా ఆ ఉపనిషత్తు తెలిపే ముఖ్య అంశం ఒక టాగ్‌లైన్‌లా ఉంటుంది. మచ్చుకకు –

| | | |
|---|---|---|
| ముండకోపనిషత్తు | – | ఏకం నిత్యం సారం సత్యమ్ – కారణబ్రహ్మ<br>అనేకమ్ అనిత్యమ్ అసారమ్ అసత్యమ్ – కార్యజగత్తు |
| తైత్తిరీయోపనిషత్తు | – | సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ<br>ఆనందమే నా స్వరూపం |
| కఠోపనిషత్తు | – | అనుభవిస్తున్న నువ్వే అది ఎప్పటికీ<br>అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ |
| ఛాందోగ్యోపనిషత్తు | – | తత్త్వమసి |

ఇలా అన్ని గ్రంథాలమీద ఆ ఉపనిషత్తుయొక్క ముఖ్యాంశం పేర్కొనబడింది. మా గురువులు రచించిన పుస్తకాల్లో భగవద్గీత మూడు షట్కాలు, బృహదారణ్యకోపనిషత్తు, మాండూక్యోపనిషత్తు తలమానికాలు.

బృహదారణ్యకోపనిషత్తులో ఇతర ఉపనిషత్తులలో వచ్చే అంశాలు అన్నీ ఉన్నాయి. వాటిలో లేనివి కూడా ఉన్నాయి. ఇది ఈ ఉపనిషత్తుయొక్క ప్రత్యేకత. బృహదార్యణకంలోని కొన్ని సత్యాలు –

1) భగవంతుడు ఈ జగత్తును సృష్టించి తనే అనుప్రవేశం చేశాడు.
2) బ్రహ్మజ్ఞానానికి వేదాంతమొక్కటే ప్రమాణం.
3) బ్రహ్మజ్ఞానాన్ని శ్రవణ మనన నిదిధ్యాసనల ద్వారా పొందాలి.
4) ఆత్మజ్ఞానంవల్లనే మోక్షం వస్తుంది.
5) ఆత్మ నిర్వచనం నేతి–నేతి పద్ధతి ద్వారా చేయాలి.

అంతేకాక, ఘటభాష్యం, అనుప్రవేశశ్రుతి భాష్యం, విద్యాసూత్రం వివరణ – ఇలా ఎన్నో భాష్యాలు ఈ ఉపనిషత్తులో సూక్ష్మంగా ఉన్నాయి.

ముండకోపనిషత్తు ఆత్మజ్ఞానాన్ని నాలుగు గెంతులలో పొందేలా చేస్తుంది.

| | | | | |
|---|---|---|---|---|
| మొదటి గెంతు | – | నేను | – | ఆత్మని |
| రెండవ గెంతు | – | నేను | – | బ్రహ్మని |
| మూడవ గెంతు | – | నేను | – | జగత్కారణం |
| నాలుగవ గెంతు | – | నేను | – | కార్యమంతా భాసిల్లుతున్న కారణాన్ని |

ఇప్పుడు అన్ని దశలు కలిపి చూస్తే, నేను = ఆత్మ = బ్రహ్మ = జగత్కారణం = జగత్తనే కార్యమంతటా ఉన్నాను.

ఈ జ్ఞానం పొందిన జ్ఞాని ఈ విషయాన్ని కైవల్యోపనిషత్తులో ఒక అద్భుతమైన మంత్రం ద్వారా చెబుతాడు. వీరి శైలిలోని అందం ఏమిటంటే ఒక ఉపనిషత్తులో చెప్పబడిన అంశానికి మంచి విశ్లేషణ ఇంకొక ఉపనిషత్తులో లభిస్తుంది. అంతా గొలుసుకట్టు లాగా ఒక ఉపనిషత్తునుంచి మరొక ఉపనిషత్తులోకి తీసుకువెళతాయి.

**మయ్యేవ సకలం జాతం । మయి సర్వం ప్రతిష్ఠితమ్।**
**మయి సర్వం లయం యాతి । తద్బ్రహ్మాద్వయమస్మ్యహమ్॥**

అంతా నానుంచే పుట్టింది. నేనే అన్నిటికి స్థితికారణాన్ని. చివరికి అన్నీ నాలో లయమవుతాయి అని శిష్యుడు అంటున్నాడు. బ్రహ్మ సృష్టి, స్థితి, లయ కారణం కదా! నేనే సృష్టి స్థితి లయ కారకుడిని అని చెప్పగలిగితే వేదాంతసారం బాగా వంటబట్టినట్టే కదా!

ఛాందోగ్యోపనిషత్తులో కార్యంనుంచి కారణానికి ఎలా వెళ్ళాలో చాలా తేలికగా అర్థం అయ్యేలా చెప్పబడింది. ఇతర ఉపనిషత్తులలో సృష్టి పాంచభౌతికమని చెప్పబడినా, ఛాందోగ్యోపనిషత్తులో సృష్టి మూడు భూతాలనుంచి వచ్చిందని, అవి అగ్ని, నీరు, పృథివీ అనీ, వాటి రంగులు వరుసగా ఎరుపు, తెలుపు, నలుపు అని వస్తుంది. అందువల్ల జగత్తులో ఎటు చూసినా వాటిలో ఈ మూడు రంగులూ ఉంటాయి.

**త్రీణి రూపాణీత్యేవ సత్యమ్**

జగత్తు అనే కార్యానికి ఈ మూడు రంగుల మూడు భూతాలే కారణం – సత్యం. మరి ఈ మూడు భూతాలకు కారణం – బ్రహ్మ. అందువల్ల బ్రహ్మ సత్యం జగన్మిథ్యా అనే వేదాంతసారం వచ్చేసింది.

ఐతరేయోపనిషత్తులో బ్రహ్మ జగత్తును సృష్టించి తానే ఎలా అనుప్రవేశం చేశాడో వస్తుంది. ఉన్నదంతా జడం కదా! నన్ను ఎవరు, ఎలా తెలుసుకుంటారు అని అనుకుని తనే జీవాత్మగా అనుప్రవేశించాడట. ఎందుకంటే కొన్నాళ్ళయ్యాక అయినా నేను కన్ను కాదు, మనస్సు కాదు అని తెలుసుకుని, మరి ఇవేవీ కాకపోతే నేనెవరు అన్న ప్రశ్న జీవాత్మలో ఉదయిస్తుందని ఆశించి ప్రవేశించాడట.

పై ప్రశ్నకు కేనోపనిషత్తులో జవాబు వస్తుంది. దేనివల్ల ప్రేరేపించబడి మనస్సు, ప్రాణం, వాక్కు, కన్నులు, చెవులు పనిచేస్తున్నాయి అని శిష్యుడు అడిగిన ప్రశ్నకు గురువు –

శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనోయత్ వాచో హ వాచం స ఉ ప్రాణస్య ప్రాణః చక్షుషశ్చక్షు– ఇలా కొనసాగుతుంది మంత్రం.

అంటే ఉదాహరణకి చెవి ఎలా పనిచేస్తుందని అడిగితే గురువు శ్రోత్రస్య శ్రోత్రం అంటాడు. ఇక్కడ మూడు విషయాలు గమనించాలి.

1. ఆత్మ వేరు ,చెవి వేరు.

2. ఆత్మ చెవి అంతటా వ్యాపించి ఉంది.

3. ఆత్మ ఉండటంవల్లనే చెవిని చెవి అని అనగలుగుతున్నాము. చెవితో వినగలుగుతున్నాము.

ఇక కఠోపనిషత్తులో మహావాక్య విశ్లేషణ ఈ విధంగా ఉంటుంది.

| **వ్యష్టిగా జీవాత్మ** | **సమష్టిగా పరమాత్మ** |
|---|---|
| 1. స్థూలశరీరం | స్థూలప్రపంచం |
| 2. సూక్ష్మశరీరం | సూక్ష్మప్రపంచం |
| 3. కారణశరీరం | కారణప్రపంచం |
| 4. చిదాభాస | చిదాభాస |
| 5. చిత్ (బింబచైతన్యం) | చిత్ (బింబచైతన్యం) |

వ్యష్టిలోని మూడు శరీరాలు, వాటిలో ప్రతిబింబించే చిదాభాస, సమష్టిలోని మూడు ప్రపంచాలు, వాటి చిదాభాసకు భిన్నంగా ఉంటాయి. రెండింటిలో ఉన్న 'చిత్' మాత్రము ఒక్కటే! అంటే జీవాత్మ = పరమాత్మల ఐక్యం తెలుపుతుంది.

ఛాందోగ్యోపనిషత్తులో ఉద్దాలకుడనే మహర్షి తన కుమారుడు శ్వేతకేతుకు చేసిన ఉపదేశమే తత్త్వమసి మహావాక్యం. అతని అనుమానం తొలగిస్తూ తొమ్మిదిసార్లు తత్త్వమసి శ్వేతకేతో అంటాడు. అంటే అది నీవే అని దానర్థం. ఆ జీవుడే బ్రహ్మ అని ఈ వివరణలు.

రాజ్యశ్రీ మేడమ్ గారు ఎంత బాగా రాశారంటే, అవి మా అందరి హృదయానికి హత్తుకునేలా. చాలా సందర్భాలలో మేము ఈ ఉపనిషత్తులలోని కాన్సెప్ట్ తీసుకుని స్కిట్స్ క్రింద ప్రజెంట్ చేశాము. తత్త్వమసి మహావాక్యం, సృష్టిప్రకరణం, భగవద్గీతలోని అన్ని యోగముల గురించి, భగవద్గీతలో అర్జునుని ప్రశ్నలకు కృష్ణపరమాత్మ జవాబులు ఇలా ఎన్నో!

నిజానికి ఛాందోగ్యోపనిషత్తు, బృహదారణ్యకోపనిషత్తు, మాండూక్యోపనిషత్తు, బ్రహ్మసూత్రాలు అర్థం చేసుకోవటం చాలా కష్టమంటారు. కానీ మాకు ఎంతో బాగా అర్థమయ్యేలా చెప్పారు మా గురువులు.

బ్రహ్మసూత్రాల్లో నాలుగవది అయిన తత్తు సమన్వయాత్ సూత్రానికి సంబంధించి 21 వాదనల కింద బోధించి, అవి ఇంకా బాగా అర్థమవడానికి 45 మందిని ఎన్నుకుని, ఆన్‌లైన్ క్లాసెస్‌లో మాచేత వాటిని వివరంగా చెప్పించారు.

ఇవన్నీ ఒక ఎత్తు. భగవద్గీత మూడు షట్కాలు ఒక ఎత్తు. చేతిలో వెన్నముద్దలు పెట్టినట్టే! ప్రతి అధ్యాయానికి ఉపోద్ఘాతం, మధ్యలో ముఖ్యాంశాల వివరణ, ప్రతిపదార్థ తాత్పర్యాలు, అన్వయం, చివరికి సారాంశం. ఇవే కాక ఒక్కొక్క శ్లోకం చాలా లోతుగా వివరణ, అవసరమైన చోట వేదాంత ప్రాథమిక అంశాలు, వివిధ ఉపనిషత్తుల భాష్యాలనుంచి వివరణ, ఇవన్నీ ఈ గ్రంథాలలో చూస్తాము. ఏదీ అర్థమవలేదు, కష్టము అని అనిపించలేదు.

ఉదాహరణకి **జాతస్య హి ధ్రువో మృత్యుః –** అన్న శ్లోకాన్ని మూడు ప్రమాణాల (మూడు ప్రమాణాలు అంటే ప్రత్యక్ష ప్రమాణం, అనుమాన ప్రమాణం, శ్రుతి ప్రమాణం) ద్వారా ఎంత బాగా వివరించారంటే, ఇప్పుడు మేము ఎప్పుడు ఆ శ్లోకం చదివినా దాని అర్థం మాకు అలా మనస్సులోకి వచ్చేస్తుంది.

ఆత్మ ఆరు లక్షణాలను ముందుగా శాస్త్రంనుంచి వివరిస్తారు. అవి ఆత్మ నిత్యం, సత్యం, నిర్వికారం, సర్వవ్యాపకం, అప్రమేయం, అకర్తా, అభోక్తా. శ్లోకాలను వివరించేటప్పుడు ఈ లక్షణాలను అన్వయిస్తారు.

భగవద్గీతమీద ఎంతోమంది ఎన్నో పుస్తకాలు రాశారు. కానీ భగవద్గీత ఉపనిషత్తుల సారం ఎలా అయిందో మనం వీరి భగవద్గీత మూడు షట్కాలను చదివితే తెలుస్తుంది. వేదాంతం కూడా బాగా అర్థమవుతుంది. వీరి గ్రంథాల ప్రత్యేకత వీరి శైలే! ఏ విషయమైనా నవ్యతతో, రసవత్తరంగా చెప్పగలిగే సామర్థ్యం మా మేడమ్ గారిది.

గురువులు శ్రీ రాఘవరావుగారు మాలో 30 మందిని గురువులుగా తీర్చిదిద్దారు. నిజానికి దానికోసం మేము పెద్దగా కష్టపడవలసిన అవసరం కూడా రాలేదు. వీరు రాసిన పుస్తకాలను చదివి వినిపించినా చాలు, ఎదుటివారికి బోధించినట్టే ఉంటుంది. భగవద్గీత టీచర్స్ మాన్యువల్. ఇక నా వ్యక్తిగత అనుభవం చెబుతానండీ!

నాకు చిన్నప్పటినుంచి ఏదైనా పుస్తకం చదువుతున్నప్పుడు అందులోని ముఖ్యమైన పాయింట్స్‌ని ఒక నోట్‌బుక్‌లో రాసుకునే అలవాటు. అలా భగవద్గీత చదువుతున్నప్పుడు రాయటం మొదలుపెడితే ప్రతి లైను కూడా ముఖ్యమైనదే! ఇలా కాదని అండర్‌లైన్ చేసుకోవటం మొదలుపెడితే, పేజీలో అంతా పెన్సిల్ గీతలే!

నిజానికి వారే అనేక అంశాలు సైడ్ హెడ్డింగ్స్ పెట్టి, ముఖ్యాంశాలు మళ్ళీ టూకీగా చర్చించి, క్రాస్ రిఫరెన్స్‌లు ఇస్తూ - వివరిస్తారు. మనకి మననం కూడా జరిగిపోతుంటుంది.

ఒక్కసారి ఈ గ్రంథాలు చేతిలోకి తీసుకుంటే చివరిదాకా వదలరు. ఇది నా హామీ! ఒక చిన్న ఉదాహరణ.

భగవద్గీత మూడు షట్కాలు ప్రచురించినప్పుడు గురువులు శ్రీ రాఘవరావు గారు గురుదక్షిణగా రోజుకు 10 పేజీలు చదవమని చెప్పారు. మేము మొదలుపెట్టాము. రాను రాను దానిమీద ఎంత ఆసక్తి ఏర్పడిందంటే, పేజీలు, సమయం, చూసేవాళ్ళము కాదు. తెలియకుండానే చదువుతూ ఉండేవాళ్ళం. మళ్ళీ దానిమీద మా మననం క్లాసులో చర్చించుకుంటూ ఉండేవాళ్ళం.

కొన్ని అంశాలు మాలో జీర్ణించుకుపోయేలా రాశారు. విధా, ఫ్రీవిల్లా? అధ్యారోప అపవాదం, పంచకోశవివేకం, కార్యకారణ సంబంధం, ఏకరూప, అనేకరూప, అరూప భక్తిల గురించి ఇలా ఎన్నో!

మా గురువుల టీచింగ్ స్టైల్ గురించి కూడా ప్రస్తావిస్తానండీ!

మాకు మా గురుదంపతుల పరిచయం తొమ్మిది సంవత్సరాల క్రితం, అప్పటికి మాకు ద్వైతం, విశిష్టాద్వైతం, అద్వైతం అంటే ఏమిటో తెలియదు. ఎంతో ఓపికగా మాచేత అద్వైత ఓనమాలు దిద్దించి, ఒక్కొక్క మెట్టు ఎక్కిస్తూ వచ్చారు. ఈ రోజు మేము భగవద్గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాల గురించి తెలుసుకోగలిగామంటే, అది వారి చలవే!

వారి టీచింగ్ క్లాస్‌రూమ్-టీచింగ్. క్లాసులో పిల్లలకు ఎంతో ఓపికతో వివరిస్తారో, అలాగే చేస్తారు. గురువులు శ్రీ రాఘవరావుగారి బోధన కాన్సెప్ట్ బేస్డ్. సాధారణ వివరణ కంటే ఇంకొంచెం లోతుగా వెళ్ళి, దాని వెనక ఉద్దేశ్యాన్ని, వాటి అంతరార్థాన్ని తన విశ్లేషణలతో స్పష్టంగా, అర్థమయ్యేలా మళ్ళీ మళ్ళీ వినాలనిపించేలా బోధిస్తారు.

మేడమ్ రాజ్యశ్రీ గారి బోధన వినూత్నంగా ఉంటుంది. ముఖ్యమైన అంశాలను పట్టికలు, చార్ట్స్ లాగా తయారుచేసి చెబుతారు ఎంతటి క్లిష్టమైన అంశాలనైనా. అంటే అవి వ్యాసాచార్యులవారి సూత్రాలయినా, శంకరుల భాష్యమైనా మనస్సుకు హత్తుకొనేలా, అరటిపండు ఒలిచి పెట్టినట్టు చెబుతారు.

వారిరువురి బోధన మనస్సుకి ఎంత హత్తుకుపోతుందో మచ్చుకి ఒకటి చెబుతాను. భగవద్గీతలోని 13, 16, 17వ అధ్యాయాలలో సాధకునికి అవసరమైన విలువల గురించి వివరించబడింది. అద్భుతమైన అధ్యాయాలు. సాధకుడు అనుసరించవలసిన జీవనవిధానాన్ని

గురించి బోధింపబడింది. ఆ విలువల గురించి చెప్పేటప్పుడు ఎంతగా మా మనస్సుకు హత్తుకునేలా చెప్పారంటే, మమ్మల్ని మేము introspect చేసుకునేలా! గురువులు చెప్పిన ఈ విలువలని నేను పాటిస్తున్నానా? కొన్ని విలువలను పాటించగలుగుతున్నాను సరే! మరికొన్ని విలువలను నేను పాటించాలంటే నేను ఇంకా ఏమి చేయాలి? – ఇలా మా ఆలోచనా సరళిలోనే మార్పు.

గురువులు శ్రీ రాఘవరావు గారు ఒక కొత్త కాన్సెప్ట్ పరిచయం చేశారు. ఒక క్లాసు అయిన తరువాత, ఆ క్లాసులో చెప్పిన విషయాలని తరువాతి క్లాసులో 12 నుంచి 15 నిముషాలపాటు క్లుప్తంగా మాలో ఒకరి చేత రీకాప్ చేయిస్తారు. అలా మాలో కొంతమంది గురువుల్ని కూడా తయారుచేశారు.

గురువుగారు ఒక్కొక్కసారి ఎంత ఇన్వాల్వ్ అయి బోధిస్తారంటే, ఉద్వేగంతో కళ్ళలో నీళ్ళు వస్తాయి. అలాగే వినే సభ్యులకు కూడా! ఎన్నోసార్లు సభ్యులు తమ ఈ అనుభూతిని ఇతరులతో పంచుకోవటం చూశాము.

అలాగే ఈ క్లాస్‌యొక్క రీకాప్ చేయడానికి నాకు అవకాశం వస్తే బాగుండును అని ఎన్నిసార్లు అనుకునేదాన్నో! నేనే కాదు, ఇది మా ఆర్షవిద్యా తరంగిణి సభ్యుల అందరి అనుభవం కూడా. సాధారణంగా ఒక విషయం నేర్పమని ఎవరినైనా అడిగితే, 'ఇదేమైనా బ్రహ్మవిద్యా' అంటారు. అంటే బ్రహ్మవిద్యకంటే ఏదీ కష్టమైనది లేదని. కాని అటువంటి బ్రహ్మవిద్యని అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్టు బోధిస్తున్నారు మా గురుదంపతులు. అలాగే ఎదుటివారిలోని అభిరుచిని, సృజనాత్మకతను కనుగొనడం, ఆ దిశగా మమ్మల్ని ప్రోత్సహించడం కూడా చేస్తుంటారు మా గురువులు.

**జీవనశైలి**

మా గురువుల జీవనశైలి కూడా మాకు స్ఫూర్తిదాయకం. సింపుల్, మోడెస్ట్, డౌన్ టు ఎర్త్. ఈ విధంగా కూడా వారు మాకు మార్గదర్శకులు. మేము గురువులం అన్న దర్పం ఎక్కడా కనిపించదు. వారితో మాట్లాడాలంటే మేము ఏ కోశానా సంశయించం. అన్నదమ్ములతోనో, అక్కచెల్లెళ్ళతోనో, స్నేహితులతోనో మాట్లాడినట్లుగానే ఉంటుంది.

ఇన్ని సంవత్సరాలలో ఏ రోజూ వారి నోటమ్మట ఒక్క హార్ష్ వర్డ్‌ని మా శిష్యులమెవ్వరమూ వినలేదు. స్థితప్రజ్ఞులు, మృదుస్వభావులు, ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగే తత్త్వం. సాధారణంగా ఏ విషయంలోనైనా ప్రతిభ చూపినవారికి గండపెండేరం కాలికి తొడగడం చూస్తాం. ప్రస్థానత్రయం గ్రంథాలు అన్ని రచించి ప్రచురించిన సందర్భంగా అక్షరలక్షలు విలువ చేసే మేడమ్ గారి చేతులకు మా సభ్యులందరం రెండు కంకణాలు బహూకరించాం.

ఇలా గురువులను సన్మానించుకోవటం, సత్కరించటం ఎక్కడైనా సర్వసాధారణం. కాని మా గురువులు వినూత్నంగా ఈ బృహత్కార్యానికి సహకరించిన వారినందరినీ వారు సన్మానించారు. ఇది చాలా అరుదైన విషయం. ప్రచురణకర్తలు, ప్రూఫ్‌రీడర్స్, బ్రహ్మయజ్ఞానికి సాయపడిన వారికీ, ఇలా అనేక రంగాలలో, అనేకమందిని సత్కరించారు. ఇది వారియొక్క నిరాడంబరతకు, సహృదయానికి తార్కాణం.

వారి ఇల్లు ఒక దేవాలయం. ఒక ప్రక్కన రచనా వ్యాసంగం, ఆన్‌లైన్ క్లాస్ ప్రిపరేషన్, యూట్యూబ్ రికార్డింగ్, మరొకప్రక్క బంధువులు, అతిథులు, మాలాంటి శిష్యుల తాకిడి. ఇవన్నిటినీ సమర్థవంతంగా, ప్రణాళికాబద్ధంగా చేసుకొస్తారు. అందరితో ఆత్మీయంగా, సరదాగా మాట్లాడతారు. వారి టైం మేనేజ్‌మెంట్ మమ్మల్ని ఎప్పుడూ మంత్రముగ్ధుల్ని చేస్తుంది.

మీ జీవితంలో ఆనందకరమైన విషయం ఏమిటని మా ఆర్షవిద్యా తరంగిణి సభ్యులని అడిగితే, అందరూ ముక్తకంఠంతో చెప్పే మాట – గురుదంపతుల పరిచయం అని. ఇలాంటి శ్రోత్రియ నిష్ఠాగరిష్ఠులయిన గురువులు దొరకడం మా అదృష్టం. అక్షరలక్షలు విలువ చేసే ఆ చేతులు మరెన్నో గ్రంథాలని రచించాలని కోరుకుంటున్నాము.

చివరగా శంకరులు రచించిన వివేక చూడామణిలోని ఒక శ్లోకంతో ముగిస్తాను.

**స్వారాజ్యసామ్రాజ్యవిభూతిరేషా**
**భవత్కృపాశ్రీమహిమప్రసాదాత్।**
**ప్రాప్తా మయా శ్రీగురవే మహాత్మనే**
**నమో నమస్తేఽస్తు పునర్నమోఽస్తు ॥**– 2

విశ్వానికి మార్గదర్శం చేసే స్వయం ప్రకాశకమైన ఆత్మసామ్రాజ్యాన్ని మీ కృపవల్ల పొందగలిగాను. ఓ మహాత్మా! ఓ గురుదేవా! మీకు మరల మరల నమస్కరిస్తున్నాను.

ఓం తత్ సత్
సర్వం శ్రీకృష్ణార్పణమస్తు

**రావులపర్తి రాజేశ్వరి**



ఆర్ష సంస్కృతి - సంప్రదాయ - వేదాంత తత్త్వ
త్రివేణీ సంగమ సదృశులు

**శ్రీమతి మద్దూరి రాజ్యశ్రీ - శ్రీ కస్తూరి వీరరాఘవరావు**

పుణ్యదంపతులకు

## ప్రశంసన మాలిక

ఆర్ష విద్యా తరంగిణి సంస్థకు మూలభూతులై, దివ్యతత్త్వప్రతిపాదకమైన "ప్రస్థానత్రయము"లను శ్రీశ్రీశ్రీ పరమార్థానందస్వామి వారి బోధనలతో సమన్వయించి, స్వీయవాదమున తేట తెలుగులో ప్రకటిస్తూ ఆత్మ సంస్కారంతో జీవన పరమార్థాన్ని ఆకళింపు చేసుకొని నిరంతరం ఆధ్యాత్మిక చింతనలో పునీత చేతనులైన పుణ్యదంపతులు మీరు.

గురుకృపా కటాక్షంతో భగవద్గీత, దశోపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు 8 సంవత్సరాల కాలంలో మీరు మీ సత్సంగ సభ్యులకు బోధించడము, పుస్తక రూపంలో వెలువరించడము అనితర సాధ్యము. శ్రుతి, స్మృతి విషయక ఆంధ్ర అనువాదములే గాక,కొన్ని భారతీయవైద్యవిధానములు,ఆరోగ్య సూత్ర గ్రంథములు తెలుగు నుండి ఆంగ్లభాషానువాదాలు, వ్యాసాలు, కథలు, కవితలు, శీర్షికలు, ఛలోక్తులు వంటివి. 'భావం పతిది - భాష సతిది' అన్నట్లు పుంఖానుపుంఖంగా స్వతంత్ర రచనలు చేశారు మీరు.

వృత్తిరీత్యా విదుషీమణి రాజ్యశ్రీగారు ఆంగ్లోపన్యాసకులు - మహోదయులు వీరరాఘవరావు గారు గణిత శాస్త్రోపన్యాసకులుగా జీవనయానం ప్రారంభించి అసంఖ్యాక విద్యార్థులకు, శిష్యగణాలకు నేడు ఆరాధ్యులైన ఆదర్శ గురుదంపతులు మీరు. మీ జీవన మార్గమే మీ రచనల అంతస్సారం.

పుణ్యాత్ములైన మీ కృషికి మీ ఉపజ్ఞకు, మీ ప్రజ్ఞా శేముషికి, నిరంతర ఆధ్యాత్మిక, సామాజిక పరివస్యకు ఉడతా భక్తిగా మా ఫౌండేషన్ అందిస్తున్న అక్షరార్చనము.

**యన్.టి.ఆర్.కళా ప్రాంగణము**
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయము
**హైదరాబాదు**
**సోమవారము, 24.02.25**

బుధజన విధేయం
**అజో - విభొ - కందాళం ఫౌండేషన్**

అసతో మా సద్గమయ । తమసో మా జ్యోతిర్గమయ ।
మృత్యోర్మా అమృతం గమయ ॥ ఓం శాంతిః శాంతిః శాంతిః ॥

# లౌకిక జీవన విధానం - కంఫర్ట్ జోన్

మానవాళి గడిపే జీవనవిధానాన్ని చూస్తే, వారు వారికి వీలుగా ఒక కంఫర్ట్ జోన్ ఏర్పరచుకుంటారు. దానినుంచి బయటకు రావటానికి ఇష్టపడరు. పైగా వారి ఆలోచనే సరియైనదని వారు నమ్మటమే కాక, ఇతరులతో కూడా వాదిస్తారు. అటువంటి కొన్ని కంఫర్ట్ జోన్‌లను చూద్దాము.

**పరోపకారి పాపన్న** – కొంతమంది వారి జీవితాన్ని మానవసేవకే అంకితం చేస్తారు. **పరోపకారమిదం శరీరం** అనే సూత్రానికి మూర్తీభవించినట్టు ఉంటారు.

గుడిలో అభిషేకాలు, అలంకరణలు భారీ ఎత్తున చేస్తే విలవిలలాడతారు. ఆ డబ్బును బీదవారికి వినియోగించవచ్చు కదా అంటారు. మానవసేవయే మాధవసేవ అని వాదిస్తారు.

తద్దినాలు, శ్రాద్ధకర్మలు బ్రాహ్మణులు పెట్టినవి కాని, అవి పితృదేవతలకు అందుతాయని ఏమిటి నమ్మకం? పైగా వారు ఎక్కడో మళ్ళీ పుట్టేసి ఉంటారు అంటారు.

మీ కోరిక ఏమిటి అంటే నాకు మోక్షం వద్దు, మళ్ళీ వచ్చే జన్మలో కూడా మనిషిగా పుట్టి మానవాళికి సేవ చేయాలి అంటారు.

**భక్త శిఖామణి** – వీరిలో కూడా అనేక రకాలమంది ఉంటారు. కొంతమంది భక్తిలో మునిగి తేలుతుంటారు. రోజులో కొన్ని గంటలు అందరు దేవుళ్ళకూ అష్టోత్తరాలు చదివి, వారికి నైవేద్యాలు పెడుతూ ఉంటారు.

కొంతమందిది సకామభక్తి. కోరికల పొట్లాం విప్పుతూనే ఉంటారు. వారి గురించే కాక, వారి కుటుంబం గురించీ, వారి బంధుకోటి గురించీ కోరికలు కోరతారు. కుటుంబం గురించి మంచి కోరటంలో తప్పేమిటి అంటారు పైగా.

కొంతమంది భారీ ఎత్తున పూజలు చేస్తారు. కార్తీకమాసంలో పొద్దున్నే తలారా స్నానం చేసి, రోజూ దీపం వెలిగించి, బ్రాహ్మణునికి దీపదానం చేస్తారు. ఉపవాసం ఉంటారు, కార్తీక పురాణం చదువుతారు. అంతేకాదు అనేక నోములు నోస్తారు. రుద్రయాగం, అతి రుద్రయాగం, మహారుద్రయాగం అలా చేస్తూ ఉంటారు.

కొంతమంది భారీ ఎత్తున ఖర్చుపెట్టి సామూహిక పూజలు చేయిస్తుంటారు లేదా గుళ్ళలో ధ్వజసంభాలు, విగ్రహాలు ఇస్తుంటారు.

కొంతమంది భగవంతుడిని ఏదో ఒక రూపంలో కొలుస్తారు. ఇంకో రూపం తలుచుకోవటానికి కూడా ఇష్టపడరు. ఆ ఏకరూప ఈశ్వరుడిని, అలంకరణలు చేసి మురిసిపోతారు. ఇంట్లో తిరుగుతున్నట్టు భావిస్తారు.

**ఉపాసకులు** – కొంతమంది చాలా శ్రద్ధగా ఉపాసనలు చేస్తారు. వారిలో కొంతమందికి కొన్ని సిద్ధులు కూడా వస్తాయి. వారికి అమ్మవారు పలుకుతుందనో లేదా అమ్మవారు పూనుతుందనో అంటారు. వారి చుట్టూ భక్తులు గుమిగూడి, తమ బాధలు చెప్పుకోవటమో, అమ్మవారికి తమ కోర్కెలు విన్నవించమని కోరటమో చేస్తారు.

**ధ్యానసమాధి** – ఇందులో కూడా అనేక రకాలు ఉన్నాయి. శ్వాసమీద ధ్యాస, నిర్వికల్ప సమాధి, రాజయోగం, కుండలినీధ్యానం. దేనికదే శ్రేష్ఠమైనదని ఆ ధ్యానసాధకులు భావిస్తారు. అలా ధ్యానం చేయటంవల్ల మనస్సు ప్రశాంతంగా ఉంటుందనీ, ఆత్మసాక్షాత్కారం అవుతుందనీ, లోపల శబ్దాలు వినిపిస్తాయనీ, జ్యోతి కనిపిస్తుందనీ వారికి కలిగిన అనుభూతులను వివరిస్తారు.

**సంసారం** – సంసారం నిర్వచనం తెలుసుకోవటానికి కూడా చాలామంది ప్రయత్నించరు. తమిళంలో సంసారం అంటే భార్య. జీవితం ఎలా ఉందని ఎవరినైనా అడిగితే, ఏ భాషలో అడిగినా జవాబు ఒకటే – ఛల్తాహై, ఏదో బండి నడుస్తోంది, it is monotonous అంటారు.

కాని తమాషా దీనినుంచి బయటపడే మార్గం ఏదైనా ఉందా అని ఆలోచించరు. కొంతమంది జీవితం బాగానే ఉందిగా, ఈ వయస్సులో కొత్తగా నేర్చుకునేది ఏమిటి అంటారు.

చిన్న కష్టం వస్తే నాకే ఎందుకు వచ్చింది అంటారు కాని, దీన్ని తప్పించుకునే మార్గం ఉందా అని చూడరు. నా జీవితం ఇలా ముగిసిపోవాల్సిందే, నాకిలా రాసిపెట్టి ఉంది అంటారు.

కొంతమంది తక్కినవారందరూ సుఖపడిపోతున్నారు, నేనే బాధపడుతున్నాను అని సెల్ఫ్‌పిటీతో కృంగిపోతుంటారు.

కొంతమందికి జీవితం సాఫీగానే సాగిపోతుంది. సుఖాలలో మునిగి తేలుతుంటారు. ఇదే జీవితం అనుకుంటారు.

**మోక్షం** – మోక్షం అంటే ఏమిటో తెలీదు. ఒకవేళ తెలిసినా, మరణించాక పుణ్యలోకాలకు వెళ్ళటం అనుకుంటారు. అందువల్ల చిత్రగుప్తుణ్ణి మంచి చేసుకోవటానికి చిత్రగుప్తుని నోము నోచుకుంటారు.

వారి జీవనవిధానాన్నిబట్టి వారికి మోక్షం నిర్వచనం మారుతుంది. సమాజసేవ చేస్తే పుణ్యం వచ్చి మోక్షం వస్తుంది అంటారు. భగవంతునిమీద అనన్యభక్తి ఉంటే చాలు అంటారు. దానికి ద్రౌపది, శబరి ఉదాహరణలు చూపుతారు. ఉపాసన చేస్తే బ్రహ్మలోకానికి వెళతాము అంటారు. ధ్యానం చేస్తే ఆత్మసాక్షాత్కారం పొందుతాము అంటారు.

**శాస్త్రం** – నా గురించి నేను తెలుసుకోవటానికి శాస్త్రం ఎందుకు? అసలు తెలుసుకునేదేముంది? నేనెవరు అని అంతర్ముఖుడినైతే చాలు. ఆత్మసాక్షాత్కారం అవుతుంది. శాస్త్రం నేర్చుకోకుండా జ్ఞానం పొందినవారు లేరా అంటారు.

జ్ఞానయోగానికి రాకుండా గజేంద్రుడు మోక్షం పొందలేదా, ప్రహ్లాదుడు మోక్షం పొందలేదా అంటారు. కొంతమంది, జ్ఞానం పొందినవారు ఏం మారారు అంటారు.

కొంతమంది అక్కడ కొంత, ఇక్కడ కొంత అరకొరగా నేర్చుకుంటారు. ఆ నేర్చుకున్నదాన్నిబట్టి వారి కొన్ని అభిప్రాయాలు ఏర్పరచుకుంటారు. వారు ఏర్పరచుకుంటే ఫర్వాలేదు, ఇతరులమీద బలవంతంగా రుద్దుతారు.

**గురువు** – శాస్త్రాన్నే నమ్మినివారు, గురువుద్వారా నేర్చుకోవాలంటే గురువు ఎందుకు అంటారు. వేదాలను, పురాణాలను ఉటంకిస్తుంటారు. మీ గురువు ఎవరు అంటే ఎవరూ లేరు, నేనే నేర్చుకున్నాను, నాకు బాగా అర్థమయిపోయింది అంటారు. లేకపోతే చాలామంది ప్రసంగాలు అప్పుడప్పుడూ విన్నాను. దాని సారాంశం వంటబట్టింది. కొత్తగా గురువు దగ్గర నేర్చుకోవాల్సిందేమీ లేదు. నాకే అన్నీ తెలుసు.

**భగవంతుడు** – నా స్వయంశక్తితో నేను పైకి వచ్చాను. కట్టుబట్టలతో ఈ ఊరు వచ్చాను. ఈరోజు ఇంత వృద్ధిలోకి వచ్చాను. ఇందులో భగవంతుడు చేసేదేముంది అంటారు కొందరు.

భగవంతుడు ఎక్కడో దూరంగా కూర్చుని, తన వినోదంకోసం మనను సృష్టించాడు. మనను ఆట ఆడిస్తున్నాడు, మనను కష్టపెట్టి తను వినోదిస్తున్నాడు.

భగవంతుడు నిర్దయుడు. మంచివారిని కష్టాల్లో కూరుకుపోయేలా చేస్తున్నాడు, దుర్మార్గులను అందలమెక్కిస్తున్నాడు అంటారు వారు.

అనుకుంటాము కాని మన చేతిలో ఏమీ లేదు. విధి చేతిలో మనం కీలుబొమ్మలం అంటారు మరికొందరు.

ఇవన్నీ ఆత్మజ్ఞానానికి రాకముందు, మనుష్యుల ఆలోచనా తీరు. వీరిలో 95% ఆత్మజ్ఞానానికి రానేరారు. మీరు నమ్ముతారో లేదో కాని, ఇంతవరకూ చెప్పుకువచ్చిన

ఆలోచనల్లో, భావనల్లో ఒక్కటి కూడా సరియైనది కాదు. ఈ మాట మేము చెప్పటం లేదు. శాస్త్రమే చెబుతున్నది. **ఇది సత్యం, సత్యం, పునః సత్యం.** నమ్మకం లేకపోతే **ఏకాదశ ఉపనిషత్తుల సారం** చదివి చూడండి, మీకే తెలుస్తుంది. కాని వేదాంతానికి వచ్చిన 5% మనుష్యులు జాగ్రత్తగా ఉండాలి. ఇందులో వచ్చే సమస్యలు చూద్దాం.

**జ్ఞానం పొందే దశలో భావాలు** – ఎదురుగా కనిపిస్తున్న జగత్తు మిథ్య ఎలా అవుతుంది? దానికి ప్రయోజనం ఉంది, నాకు భిన్నంగా ఉంది, బాహ్యంగా ఉంది, దానితో నేను వ్యవహారం నడుపుతున్నాను, స్పష్టంగా ఉంది అంటారు.

నేనేమిటీ బ్రహ్మ ఏమిటీ, అది అపచారం అంటారు. కొంతమంది మధ్యలో మానేస్తారు కూడా. నేను భగవంతుడిని అనేకన్నా హాయిగా భక్తిపాటలు పాడుకుంటే ఎంత బాగుంటుంది. ఉపనిషత్తులే భిన్నాభిప్రాయాలు వెలిబుచ్చుతున్నది. ఒకపక్క ద్వైతాన్ని వర్ణిస్తుంది, ఇంకొకపక్క అద్వైతం అంటాయి.

ఒక పక్క మనస్సుతో తెలుసుకోలేము అంటూనే మనస్సుతోనే తెలుసుకోగలము అంటుంది.

నేను బ్రహ్మను, నేను పూర్ణుడను అని క్లాసులో ఉన్నంతవరకూ బాగానే అర్థమవుతుంది కాని బయటకు వచ్చి చెప్పులు వేసుకోగానే రాగద్వేషాలు దూసుకువస్తాయి.

నేను బ్రహ్మను, కాని నా భార్యతోనే నాకు తంటా. నేను అసంగం, నేను కుటుంబంతో బంధం పెంచుకోకూడదు అంటే ఈ మోక్షం నాకు వద్దే వద్దు. నాకున్న ఒక్క పుత్రుడితోనూ బంధం తెంచుకోలేను.

నాకు మోక్షం వద్దు, ముందు నాకున్న సమస్యలను తీర్చమనండి. మా అమ్మాయి పెళ్ళి కావాలి, నీటి సమస్య తీరాలి, పనమ్మాయి సమస్య తీరాలి.

నాకు మోక్షం వద్దు, వచ్చే జన్మలో గోపికగా పుట్టి ఒక్కసారన్నా కృష్ణపరమాత్మతో ఆడి, పాడాలి.

స్వామీజీ నన్ను దీవించకపోయినా ఫర్వాలేదు, నా మనవడిని దీవించండి అంటారు.

నిదిధ్యాసనకు కూర్చుంటే నిద్ర ముంచుకు వస్తుంది. వేదాంతం అంతా బాగా అర్థమయింది. ఒక్క బ్రహ్మసత్యం, జగన్మిథ్యా, జీవో బ్రహ్మైవ నాపరః తప్ప అంటారు కొందరు.

శాస్త్రం నువ్వు మోక్షం పొందుతావు, నీకు పునర్జన్మ లేదు అంటుంది. అప్పుడే ఎక్కడ మోక్షం, నేనింకా అన్ని ఉపనిషత్తులూ నేర్చుకోలేదు, బ్రహ్మసూత్రాలు ఇంకా నేర్చుకోలేదు. నాకు రాదు, బహుశా వచ్చే జన్మలో వస్తుందేమో.

నాలో రాగద్వేషాలు పోనే లేదు. నాకు మోకాలి నొప్పి తగ్గలేదు అంటారు.

ఏదైనా కష్టం వస్తే నేను నేర్చుకున్నదంతా గాలికెగిరిపోతున్నది.

స్వామీజీ మీరు బాగా చెబుతున్నారు, వచ్చేజన్మలో కూడా మీరే నాకు గురువుగా రావాలి.

స్వామీజీ నాకు మోక్షం రావాలని దీవించండి!

పైన చెప్పిన భావనలలో మీరు దేనిలో నైనా ఉంటే ఇంకా శ్రవణం చేయాలని అర్థం!

ఇవన్నీ చెప్పిన ఉద్దేశ్యం బ్రహ్మవిద్య గురించి హడలగొట్టటానికి కాదు. బ్రహ్మవిద్య లేదా ఆత్మవిద్యను నేర్చుకోవాలంటే ఓపెన్‌మైండ్ ఉండాలి. ఇప్పుడు చెప్పిన వాటిల్లో మీరు ఏ భావనలో ఉన్నా, క్లాసు బయట చెప్పులు విప్పినప్పుడు, ఆ భావనను కూడా వాటిలో విప్పి, క్లాసులోకి రండి! మీరే వేదాంతం నేర్చుకోవటం ఇంత తేలికా అంటారు! ఈ ఒక్క గ్రంథం, **ఏకాదశ ఉపనిషత్తుల సారం** చదివితేనే చాలు, ఈ ఒక్కొక్క భావననూ పారద్రోలుతుంది.

**– మద్దూరి రాజ్యశ్రీ**

# శ్రీగణపతి ప్రార్థన

ఓం గణానాం త్వా గణపతిగ్ం హవామహే
కవిం కవీనాముపమశ్రవస్తమమ్।
జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత ఆ నః
శృణ్వన్నూతిభిస్సీద సాదనమ్॥

ప్రణో దేవీ సరస్వతీ వాజేభిర్వాజినీవతీ ।
ధీనామవిత్ర్యవతు । గణేశాయ నమః ।
సరస్వత్యై నమః । శ్రీ గురుభ్యో నమః ।
హరిః ఓమ్ ॥
ఓం శాంతిః శాంతిః శాంతిః॥

# ఏకాదశ ఉపనిషత్తుల సారం

## ఉపోద్ఘాతం

**మానవలక్ష్యాలు:** పురుషార్థాలు అన్న పదాన్ని మనం మన శాస్త్రాల్లో తరచు చూస్తాం. అందుకని దాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. పురుషార్థాలంటే మనుష్యలక్ష్యాలు. పురుషః అంటే మనుష్యుడు – స్త్రీ గాని, పురుషుడు గాని. అందుకని దీన్ని మనుష్యార్థాలుగా అనువదించవచ్చు. అర్థః అంటే సంస్కృతంలో అనేక అర్థాలున్నాయి. అర్థఃకి ఒక అర్థం, అర్థమే, అర్థః అంటే ఐశ్వర్యం కూడా. ఈ సందర్భంలో అర్థః అంటే ఒక లక్ష్యం, ఒక గమ్యం. **అర్థ్యతే సర్వైః మనుష్యైః ప్రార్థ్యతే ఇతి అర్థః॥**

దేన్నైతే ప్రతిమానవుడు కోరుతాడో అది **అర్థం.** ప్రతిమనిషి దేన్ని కోరుతాడు? రకరకాల లక్ష్యాలుంటాయి ఒకొక్కరికీ. కాబట్టి ఏ మానవలక్ష్యాన్నైనా అర్థం అంటారు. ఈ రెండు పదాలనీ కలిపితే మానవలక్ష్యాలు అని అర్థం.

శాస్త్రంలో పురుషార్థంకి ఇంకో అర్థం కూడా ఉంది. ఒక సందర్భంలో పురుషార్థం అంటే ఇచ్ఛ. ఇంకో సందర్భంలో పురుషార్థం అంటే ఎన్నుకోవటం. మరో సందర్భంలో ప్రయత్నం అని కూడా వస్తుంది. అంటే ఇచ్ఛ, ఎన్నుకోవటం, ప్రయత్నం – పురుషార్థంకి ద్వితీయ అర్థం.

**ప్రాథమిక అర్థం** – మానవలక్ష్యాలు లేదా మానవగమ్యాలు. ఈ లక్ష్యాలు మానవులు సాధించాల్సినవే. జంతువులకో, వృక్షాలకో ఇది సాధ్యం కాదు. ఈ పురుషార్థాలు అందుబాటులో ఉండటంవల్ల, మనిషి జంతువులు లేదా చెట్లనుంచి విభిన్నంగా ఉన్నాడు. వీటివల్లే తక్కిన అన్ని జీవరాసులకన్నా ఉన్నతంగా ఉన్నాడు.

### మనుష్యుల ప్రత్యేకత

మనుష్యులకి మాత్రమే ఎందుకు ఉన్నాయి ఈ పురుషార్థాలు? మనిషిలోని ఏ శక్తి ఈ ప్రత్యేక అవకాశాన్ని యిచ్చింది, పురుషార్థాలు కోరుకోవటానికి? మనుష్యులు ఎన్నో అంశాలలో జంతువులని, చెట్లని పోలి ఉన్నారని శాస్త్రాలు పలుకుతున్నాయి. తక్కిన జీవరాశులకీ, మనుష్యులకీ మధ్య సాధర్మ్యం ఉంది. కాని మనిషి మాత్రమే వాడగల ఒక ప్రత్యేక లక్షణం ఉంది. ఆ ప్రత్యేక విషయం ఒక అందమైన శ్లోకంలో చెప్పబడింది.

**ఆహారనిద్రాభయమైథునఞ్చ।**
**సామాన్యమేతత్ పశుభిర్నరాణామ్।**
**బుద్ధిర్హి తేషామ్ అధికో విశేషః।**
**బుద్ధ్యా విహీనః పశుభిః సమానః॥**

మనుష్యులకూ, తక్కిన జీవరాశులకూ కొన్ని అంశాలలో పోలికలున్నాయి. అందరూ ఆహారం కోరతారు. పుట్టినప్పటినుంచి ఆహారంకోసం వెతుకులాట మొదలౌతుంది. అలాగే నిద్ర,భయం,వంశాభివృద్ధి కూడా అందరికీ ఉంటుంది. కాని ఆలోచనాశక్తి, విచక్షణాశక్తి, అర్థం చేసుకునే శక్తి, భవిష్యత్తును ఊహించే శక్తి, ముందుచూపులాంటివి ఉండటంవల్ల మనిషి తక్కిన జీవరాశులకన్నా ఉన్నతుడయ్యాడు. భవిష్యత్తుకోసం ప్రణాళికలు వేయటం, భవిష్యత్తు బాగుండాలని కష్టపడటం, అంతా విచక్షణాశక్తి కింద వస్తుంది. దాన్నే మనం బుద్ధి అంటాం.

**బుద్ధిర్హి తేషామ్ అధికో విశేషః** – ఇదీ మనకున్న అధికశక్తి. కేవలం బుద్ధివల్లే మనిషి తక్కిన జీవరాశికన్నా ఉన్నతుడయ్యాడు. బుద్ధ్యా విహీనః – బుద్ధి లేకపోతే లేదా దాన్ని వాడకపోతే, పశువుతో సమానం.అందువల్ల విచక్షణాశక్తి మనుష్యులకి విశేషంగా ఉంది. ఈ ప్రత్యేకమైన శక్తివల్లే మనం స్వయం ప్రతిభ,స్వయం నిర్ణయం చేసుకోగలుగుతున్నాం. తక్కిన వారితో మనని పోల్చుకోగలుగుతున్నాం. ఇవి పశుపక్ష్యాదులు చేయలేవు.

ఒక డాగ్‌షోలో ఏ కుక్కకి బాగా తర్ఫీదునిచ్చారో పరిశీలిస్తారు. కుక్కలచేత అనేక గారడీలు చేయించి వాటికి బంగారు, వెండి, రజత పతకాలిస్తారు. ఒలింపిక్స్‌లోలాగా వాటిని ప్రత్యేక స్థానంలో, ప్రత్యేక మెట్లమీద నిలబెట్టవచ్చు కూడా. ఆ కుక్కల భావాలెలా ఉంటాయి? వాటికి బంగారు పతకం వచ్చినా అవి పొంగిపోవు. రాకపోయినా కృంగిపోవు. అవి నాలుక బయటకి చాచి, అభావంగా యిటూ, అటూ చూస్తాయి అంతే. నిజానికి ఏం జరుగుతుందో వాటికేం అర్థంకాదు. కాని, ఆ కుక్కల యజమానికి మాత్రం కాంప్లెక్స్ ఉంటుంది. అందువల్ల మనకు బుద్ధి ఈ విశేష లక్షణమైన కాంప్లెక్సును పెంచి స్వయం నిర్ణయం, తోటివారితో పోల్చుకోవటం కలుగచేస్తుంది.

ఈ పురుషార్థాలను శాస్త్రం సందర్భాన్నిబట్టి నాలుగుగా, మూడుగా, రెండుగా, ఒకటిగా విభజిస్తుంది. నాలుగుగా అంటే ధర్మ, అర్థ, కామ, మోక్ష పురుషార్థాలు. వీటినే ఇంకో కోణంలో చూస్తే శాంతి, భద్రత, ఆనందం. ఇంకో కోణంలోంచి చూస్తే అసలు ఇన్ని లక్ష్యాలు లేనేలేవు. ఒక్క లక్ష్యం ఉంది అంటుంది. ఒక్క లక్ష్యం కాదు, ఒక్కటే లక్ష్యం ఉందని నొక్కివక్కాణిస్తుంది. అది కూడా ఒక్కరికి కాదు, మొత్తం మానవాళికి అంటుంది. అందువల్ల నాకు అనేక లక్ష్యాలు ఉన్నాయనుకోవటం భ్రాంతి మాత్రమే అంటుంది.

ఏమిటా ఒక్క లక్ష్యం? ఇన్ని లక్ష్యాల ద్వారా ఎవరైనా చివరికి పొందాలని చూసేది ఒక్కటే లక్ష్యం. అదే – ఆనందం. శారీరక ఆనందం, మానసిక ఆనందం, బుద్ధిపరమైన ఆనందం. అలా భిన్నస్థాయిల్లో ఆనందాన్నే కోరుకుంటాడు మనిషి. తనకు ఆనందం కాక వేరే లక్ష్యాలను ఎందుకు కోరుకుంటున్నాడో విశ్లేషిస్తే, చివరికి మిగిలే లక్ష్యం ఆనందమే. అందువల్ల పురుషార్థాలు అనేకంగా కనిపించినా, నాలుగుగా విభజించినా, మూడుగా విభజించినా, అన్నీ లయమయ్యేవి ఒక్క ఆనందంలోనే. అందువల్ల పరమపురుషార్థం ఒక్కటే– అదే ఆనందం.

పరమపురుషార్థం ఆనందం ఒక్కటే అని ఎలా నిరూపిస్తారు? ఎందుకంటే ఇలా ఒక వాక్యం చెపితే చాలదు, దాన్ని తార్కికంగా నిరూపించగలగాలి. శాస్త్రం దీనికి అన్వయ వ్యతిరేక పద్ధతిని ఇస్తున్నది. ఒకటి ఉంటే ఒకటి ఉండి, ఒకటి లేకపోతే రెండోది లేకపోతే దాన్ని అన్వయ వ్యతిరేక ప్రక్రియ అంటారు. ఉదాహరణకు ఒక శ్రీమంతుని చుట్టూ బెల్లం చుట్టూ ఈగలు ముసిరినట్టుగా, భజన చేసేవారు చేరతారు. అతని దగ్గర నిజంగా ధనం లేదు, ఆస్తంతా హారతి కర్పూరంలాగా హరించుకుపోయింది అని వినగానే చెట్టుకొకరు, పుట్టకొకరు మాయమైపోతారు. అంటే ధనం ఉంటే భట్రాజులు ఉన్నారు, ధనం లేకపోతే భట్రాజులు లేరు. అందువల్ల ధనమే అతని వెంట పడటానికి కారణం. దీన్ని సాంకేతికంగా చెప్పాలంటే –

**యత్ సత్వే తత్ సత్వం యదభావే తదభావః**

డబ్బు ఉంటే ఉన్నారు, డబ్బు పోతే వీరూ పోయారు. వస్తువులు, మనుష్యులు, పరిస్థితులు ఆనందాన్ని ఇస్తాయని వాటి వెంట పరుగులు తీస్తాము. నిజం చెప్పాలంటే వాటివల్ల ఆనందం రాదని ఎప్పుడైతే గ్రహిస్తామో, అప్పుడే అంతవరకూ ప్రాకులాడిన లక్ష్యాన్ని చేతిలో ఉన్న వేడివేడి బంగాళాదుంపను చటుక్కున వదిలివేసినట్టుగా వదిలివేస్తాము. మోజు పడి కొనుక్కున్న ఇల్లు వాస్తు బాగాలేదని అమ్మివేస్తాము. ఎంతగానో ఎదురుచూసి చేరిన ఉద్యోగాన్ని నచ్చలేదని వదులుకుంటాము. ఎన్నాళ్లో ప్రేమించి, అగ్నిసాక్షిగా వివాహమాడిన భార్యను వదిలేస్తారు కొందరు.

ఎందుకు? దేనిలో ఆనందం ఉందనుకుని వెంపర్లాడారో, అందులో ఆనందం దొరకదు. దీన్ని దయానందస్వామీజీ అద్భుతంగా చెబుతారు. ముందేమో ఐ లవ్ యూ అంటారుట. దాని తరువాత ఐ అలవ్ యూ (టు గో) అంటారుట. అలవ్‌లో శేష ఉంది. రెండు అర్థాలు వస్తాయి. సంస్కృతంలో అ అనేది వ్యతిరేక అర్థాన్ని సూచిస్తుంది. అలవ్‌లో లవ్ లేదు. ఇంగ్లీషులో అలవ్ అంటే నిన్ను నీ ఇష్టానికి వదిలేస్తున్నాను. విశాల ప్రపంచంలో స్వేచ్ఛగా ఎగరటానికి నిన్ను వదిలేస్తున్నాను అంటారుట.

**యావద్విత్తోపార్జనసక్తః, తావన్నిజపరివారో రక్తః।**
**పశ్చాత్ జీవతి జర్జరదేహే, వార్తాం కోఽపి న పృచ్ఛతి గేహే॥** – భజగోవిందం

నీ దగ్గర విత్తం ఉన్నంతవరకే నీ చుట్టూ జనాలు చుట్టుముడుతారు. ఎప్పుడైతే అది లేదని తెలుసుకుంటారో అప్పుడే మాయమైపోతారు.

వీటన్నింటి సారం ప్రపంచంలో ఎక్కడైనా, ఎవరైనా కోరుకునేది ఆనందమే. ఆ మాటకొస్తే మనుష్యులే కాదు, పశుపక్ష్యాదులు కూడా కోరుకునేది ఈ ఆనందమే. లక్ష్యం ఒక్కటే. కాని ఈ ఆనందాన్ని రెండు రకాలుగా విభజించవచ్చు. అవి విషయానందం, ఆత్మానందం.

విషయానందం అంటే బాహ్యవస్తువులనుంచి పొందే ఆనందం అయితే, ఆత్మానందం అంటే ఆనందం తన స్వస్వరూపం అని తెలుసుకోవటం. విషయానందాన్నే కోశానందం అని కూడా అంటారు.

కోశానందం అంటే ఒక ప్రతిబింబమాధ్యమంలో ఏర్పడిన ప్రతిబింబం. ప్రతిబింబ మాధ్యమాన్నిబట్టి ప్రతిబింబం మారుతూ ఉంటుంది. అద్దం స్పష్టంగా ఉంటే, అందులో ఏర్పడే మీ ప్రతిబింబం కూడా స్పష్టంగా ఉంటుంది. మీరు వేడివేడి నీళ్ళతో స్నానం చేస్తున్నప్పుడు ఆ వేడినీటి ఆవిరి అద్దాన్ని కప్పివేసి, మీ మొహాన్ని సరిగ్గా ప్రతిబింబింపచేయదు. అప్పుడు మీరు అద్దాన్ని తుడిస్తే, మళ్ళీ చక్కగా ప్రతిబింబం ఏర్పడుతుంది. అలాగే మనస్సు ప్రశాంతంగా ఉంటే, ఆనందం బాగా తెలుస్తుంది. తైత్తిరీయంలోని ఐదవ అనువాకంలో ఈ ఆనందంలోని తారతమ్యాలను ప్రియ, మోద, ప్రమోదాలుగా చూశాము. అంటే మనస్సులో ప్రియవృత్తి లేదా మోదవృత్తి లేదా ప్రమోదవృత్తి ఏర్పడుతాయి.

ప్రియం – ఒక వస్తువును చూడగానే కలిగే ఆనందం
మోదం – ఆ వస్తువును మీరు కొంటే కలిగే ఆనందం
ప్రమోదం – ఆ వస్తువును మీరు అనుభవిస్తే కలిగే ఆనందం.

**అనుభవంలోకి వస్తుంది–అనుభవంలోకి రాదు** – కోశానందాలన్నీ అనుభవంలోకి వస్తాయి. అందువల్లనే ఆ ఆనందాల స్థాయిలో తారతమ్యాలు ఉన్నాయి. చివరికి సమాధిస్థితిలో కలిగే ఆనందం కూడా సమాధిలోనే దొరుకుతుంది, లేచాక ఉండదు. అందువల్ల అది కూడా కోశానందంలోకే వస్తుంది. ఇంతకుముందే చూశాము; మాధ్యమం ఎంత బాగుంటే ప్రతిబింబం అంత బాగుంటుంది. సమాధిలో మనస్సు చాలా ప్రశాంతంగా ఉంటుంది. అందువల్ల అప్పుడు ఏర్పడిన ప్రతిబింబ ఆనందం కూడా చాలా ఎక్కువగా ఉంటుంది. కాని సమాధి నుంచి లేవగానే, ఆ ప్రశాంతత పోతుంది, దానితోపాటు ఆనందమూ పోతుంది.

ప్రపంచాన్నంతటినీ చూసే మీ విశాలనేత్రాలను మీరు చూసుకోలేరు. మీ కళ్ళను అద్దంలోనే చూసుకోవాలి. అంటే ప్రతిబింబాన్నే చూడగలరు; ఆ ప్రతిబింబానికి రాకపోకలు ఉంటాయి. అలాగే మీ బింబానందాన్ని మీరు ఎన్నడూ అనుభవించలేరు. దాన్ని ప్రతిబింబమాధ్యమంలోనే అనుభవించగలరు. ఆత్మానందం సబ్జెక్టు, సబ్జెక్టును ఎన్నడూ అనుభవించలేరు; సబ్జెక్టుయొక్క ప్రతిబింబాన్ని, ఆబ్జెక్టుగా చూడగలరు. బింబానందం అనుభవంలోకి రాదు కాబట్టి, దానికి తారతమ్యాలు కూడా ఉండవు.

**విషయప్రాప్తి–జ్ఞానప్రాప్తి** – కోశానందాన్ని రెండు భిన్నపద్ధతుల ద్వారా పొందవచ్చు. ద్విసాధన సాధ్యః. ఆత్మానందాన్ని ఒక్క పద్ధతిద్వారానే తెలుసుకోగలము. ఏకసాధన సాధ్యః.

కోశానందాన్ని అనుభవించాలంటే, ప్రశాంతమనస్సు ఉండాలని చూశాము. ఆ ప్రశాంత మనస్సును రెండు భిన్నమార్గాలద్వారా పొందవచ్చు.

మనస్సు సాధారణంగా ఇప్పుడున్న పరిస్థితులమీద అసంతృప్తిని అనుభవిస్తూ ఉంటుంది. మీకు మీ చుట్టూ ఉన్నవారు ఇలా ఉండాలని, మీకు కొన్ని నియమ నిబంధనలు ఉంటాయి. మీరు ఆశించినట్టు ఈ ప్రపంచం ఉంటే, మీ మనస్సు ప్రశాంతంగా, నిశ్చింతగా ఉంటుంది. కాని ఆశించినట్టు లేకపోతే ఆశాభంగం అవుతుంది. అప్పుడు మనస్సు కలత చెందుతుంది. మనస్సు కలత చెందితే, రజోగుణాత్మకంగా ఉంటుంది మనస్సు. అప్పుడు ఆనందాన్ని అనుభవించలేదు. అటువంటి మనస్సులో ఆందోళన, ఒత్తిడి, చిరాకు, కోపం రాజ్యమేలుతాయి. అంటే సమస్య ఎలా ఏర్పడింది? ఉన్న పరిస్థితి మీ ఆశయాలకు భిన్నంగా ఉండటంవల్ల ఏర్పడింది. వీటి రెండింటి మధ్యా సమతుల్యత ఎలా తీసుకువస్తారు? రెండు విధాలుగా తీసుకురావచ్చు.

ఎ) మీరు ఆశించిన పద్ధతుల్లో ఈ బాహ్యప్రపంచాన్ని మార్చటం ద్వారా సమతుల్యతను సాధించవచ్చు. ఇది బాహ్యంగా తెచ్చే మార్పు. దీన్ని కర్మపద్ధతి అంటారు. కర్మ చేయటం ద్వారా లేదా విషయప్రాప్తి కలగటం ద్వారా దీన్ని సాధించవచ్చు. కాని దీనికి చాలా సమయం పడుతుంది. ఇది అజ్ఞాని పద్ధతి.

బి) బాహ్యప్రపంచం మీరు ఆశించినట్టు లేకపోతే, అది ప్రకృతి నియమం అనీ, దాన్ని మార్చటం మీ చేతుల్లో లేదనీ గ్రహించి, మీరే దానికి తగ్గట్టుగా సర్దుకుపోవటం రెండవ పద్ధతి. దీన్ని వైరాగ్యపద్ధతి అంటారు. ఈ వైరాగ్యం పెంపొందించుకోవాలి అంటే, వివేకం కావాలి. ఇది ఆంతరంగా వచ్చే మార్పు. ఈ మార్పు రావటానికి మీ మనస్సును మార్చుకోవాలి. ఇది జ్ఞాని పద్ధతి.

ఉదాహరణకు మీరు నడిచే దారి మట్టిగా, రాళ్ళమయంగా ఉందనుకోండి. మీ కాళ్ళకు మట్టి అంటకూడదు, రాళ్ళు గుచ్చుకోకూడదు అనుకుంటే, దాన్ని రెండు పద్ధతులద్వారా సాధించవచ్చు. ఒకటి, ఆ దారంతా మెత్తటి తివాచీని పరుచుకురావటం; ఇంకొకటి మీరు చెప్పులు వేసుకోవటం. మీరు చెప్పులు వేసుకుని తిరగటం తేలికైన పద్ధతి; ఖర్చులేని పద్ధతి; సమర్థవంతమైన పద్ధతి కూడా. అంటే రెండవ పద్ధతే శ్రేష్ఠమైన పద్ధతి. ఇదంతా కోశానందం గురించి.

ఇప్పుడు ఆత్మానందాన్ని పొందటం ఎలా? అసలు ఈ ప్రశ్నే తప్పు. ఎందుకంటే ఆత్మానందం మీ అసలు స్వరూపం. ఆత్మానందాన్ని ఏదో కర్మచేసి పొందలేరు. దానికి ఒకటే మార్గం ఉంది. అది జ్ఞానం పొందటంద్వారానే పొందగలరు. ఏమిటా జ్ఞానం? నేను ఆత్మానందాన్ని అనే జ్ఞానం; అంటే నేనే ఆనందస్వరూపాన్ని. ఆనందం ఆబ్జెక్టుగా పొందేది కాదు. నేను ఆనందస్వరూపాన్ని అని మీ ఆనందస్వరూపాన్ని తెలుసుకోవటమే.

**వివేక జన్య – వైరాగ్యజన్య చిత్తప్రసాదః**

ఈ జ్ఞానం పొందాలి. నేను ఆత్మానందాన్ని, నా స్వరూపమే ఆనందం అనే జ్ఞానం పొందాలి.

**అహమేవ ఆనందస్వరూపః అస్మి**

ఈ భేదాలను టూకీగా ఒకసారి ఈ క్రింది పట్టికలో చూద్దాము.

| **కోశానందం** | **ఆత్మానందం** |
|---|---|
| ప్రతిబింబానందం | బింబానందం |
| అనిత్యం | నిత్యం |
| సాతిశయ ఆనందం | నిరతిశయ ఆనందం |
| అనుభవంలోకి వస్తుంది | అనుభవంలోకి రాదు |
| విషయప్రాప్తి | జ్ఞానప్రాప్తి |

ముందు ఉపనిషత్తు కోశానందం గురించి చెప్పి, ఈ కోశానందాన్ని రెండు పద్ధతుల ద్వారా పొందవచ్చు అని చెబుతుంది. అవి విషయప్రాప్తిద్వారా (బాహ్య పద్ధతి), వైరాగ్య ప్రాప్తి ద్వారా (అంతర పద్ధతి). ఉపనిషత్తు రెండు పద్ధతుల గురించి సమాంతరంగా చెబుతూ వస్తుంది. బాహ్యపద్ధతి వాడినా, ఆంతర పద్ధతి వాడినా, రెండింటిలోనూ లక్ష్యం ఒక్కటే. మనస్సును ప్రశాంతంగా చేయటం. దీన్ని చిత్తప్రసన్నత అంటారు లేదా చిత్తప్రసాదత అంటారు.

**ప్రసాదే సర్వదుఃఖానాం హానిరస్యోపజాయతే।**

**ప్రసన్నచేతసో హ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతే ॥** – గీత 2.65

ప్రశాంతమనస్సులో దుఃఖాలన్నీ నాశనమవుతాయి. అటువంటి ప్రసన్నచేతస్సులో జ్ఞానం స్థిరంగా నిలుస్తుంది అంటున్నాడు కృష్ణపరమాత్మ.

మనస్సు ప్రశాంతంగా ఉంటే, అంటే కామక్రోధాలు రాజ్యమేలనప్పుడు మనస్సులో ఆనందం కలుగుతుంది. మీ అబ్బాయి డిస్టింక్షన్‌లో ఇంజనీరింగ్ పాసయితే, ఆనందంలో ఓలలాడుతుంది మీ మనస్సు. కాని ఆ ఆనందం ఎంతోసేపు నిలవదు. 'మంచి యూనివర్సిటీలో సీటు వస్తుందో రాదో?' ఈ బెంగ వెన్నంటి వస్తుంది. అంటే మళ్ళీ ప్రశాంతత కొరవడుతుంది.

అందువల్ల కోశానందాన్ని దుఃఖమిశ్రిత ఆనందం అంటే ఆత్మానందాన్ని దుఃఖ అమిశ్రిత ఆనందం అంటారు. దీన్నే సానుకూలంగా చెప్పాలంటే కేవల ఆనందం. స్వచ్ఛమైన నెయ్యిలాగా స్వచ్ఛమైన ఆనందం.

శాస్త్రం మీరు కోరుతున్న ఆనందం రెండు రకాలుగా అందుబాటులో ఉంది. ఏది కోరుకుంటారో మీ చేతుల్లో ఉంది అంటున్నది. ఈ ఎన్నుకునే స్వేచ్ఛ మనుష్యులకే ఉంది, జంతువులకు లేదు. బుద్ధిశాలి ఏ ఆనందాన్ని కోరుకుంటాడు? ఆర్థికంగా ఇంకొకరిమీద ఆధారపడితే, వారి కనుసన్నల్లో మెలగాల్సి ఉంటుంది. అందువల్ల మనకాళ్ళమీద మనం నిలబడటానికి ప్రయత్నిస్తాము. ఆనందం విషయంలో కూడా అదే చేయమంటుంది శాస్త్రం.

మనమే ఆనందస్వరూపులం అని తెలుసుకుంటే, భిక్షాపాత్ర పట్టుకుని కాసింత ప్రేమ కురిపించమని ఇతరులను వేడుకోనవసరం లేదు. ఎలాగైతే ఇంట్లోనే బోర్‌వెల్ తవ్వించుకున్న వ్యక్తి, ఇష్టం వచ్చినప్పుడు వచ్చే మునిసిపల్ వాటర్ సప్లైమీద ఆధారపడనవసరం లేదో అలాగే తన ఆనందస్వరూపాన్ని తెలుసుకున్న వ్యక్తి ఇతరుల ఇష్టాయిష్టాలమీద ఆధారపడనవసరం లేదు.

కరెంటు కోత అధికంగా ఉంటే, ఇంట్లో యు.పి.యస్. పెట్టుకుంటాము. యు.పి.యస్. అంటే అనింటరప్టెడ్ పవర్ సప్లై. కరెంటు ఉంటే, ప్రభుత్వం ఇచ్చిన కరెంటును వాడతాము. అది లేకపోతే బాధపడుతూ కూర్చోము. మన యు.పి.యస్‌ను వాడతాము. జ్ఞాని కూడా అంతే. అతనికొక యు.ఎ.యస్. ఉంటుంది. అది అనింటరప్టెడ్ ఆనంద సప్లై. కోశానందం కలిగితే దాన్ని అనుభవిస్తాడు. అది అందుబాటులో లేకపోతే బాధపడుతూ కూర్చోడు. తనలోంచే ఆనందాన్ని పొందుతాడు.

అలా అయితే, ఈ ఆత్మానందాన్ని పొందటం ఎలా? ఈ ప్రశ్న అడిగితే, శాస్త్రం మనను చూసి ముసిముసి నవ్వులు నవ్వుతుంది. ఎందుకు? ఆత్మానందం అర్థం తెలియదా మీకు

అంటుంది. ఆత్మ అంటే నేను; ఆత్మానందం అంటే నేను ఆనందస్వరూపుడిని అని అర్థం. నేనే ఆనందస్వరూపుడిని అయితే, ఆనందం ఎలా పొందాలనే ప్రశ్నే తప్పు అంటుంది శాస్త్రం.

సరే అయితే, ప్రశ్న మార్చి వేస్తాను అంటాము మనము. నేనే ఆనందస్వరూపుడిని అయితే, నాకెందుకు తెలియటం లేదు? మీరన్నట్టుగా అది నా స్వస్వరూపం అయితే, నాకు తెలియాలిగా? నేను ఆనందాన్ని అనుభవించాలిగా? నాకెందుకు ఆనందం కలుగటం లేదు? దానికి జవాబు ఒక్కటే. ఆ ఆనందాన్ని ఏదో కప్పేస్తోంది. మీ ఓవర్ హెడ్ ట్యాంక్‌లో నీళ్ళు నిండుగా ఉన్నాయి. కాని మీరు కింద కుళాయి తిప్పితే నీళ్ళు రావటం లేదు. ఎందుకు? అంటే పంపులో ఎక్కడో, ఏదో అడ్డుకుంటోదన్నమాట. అందువల్ల ఆ నీటిని అనుభవించలేకపోతున్నారు. అలాగే ఆత్మానందం లేక కాదు; దాన్ని ఏదో అడ్డుకుంటోంది. ఏదో అడ్డుకునేసరికి, మనకు ఆ విషయం తెలియక, నాకు ఆనందం లేదు అనుకుంటున్నాము. నేనీ ఆనందాన్ని అనుభవించాలి అంటే, ఏం చేయాలి? దాన్ని కనుక్కోవాలి. ఇంగ్లీషులో డిస్కవర్ (discover) అంటారు. disc the cover. Disc అంటే dismiss, dismiss the cover. అంటే ఆటంకాన్ని తొలగించాలి.

అలాగే ఆత్మానందం పొందాలంటే, దాన్ని పొందనీయకుండా అడ్డుపడుతున్న ప్రతిబంధకాన్ని తొలగించాలి.

**ప్రతిబంధ నివృత్త్యా ఆత్మానంద ప్రాప్తిః.**

కాని అక్కడ వాటర్ ట్యాంక్ ఉదాహరణ బాహ్యంగా నివృత్తి గురించి చెబితే, ఇది ఆంతర నివృత్తిని సూచిస్తుంది. కాకపోతే ఆంతర నివృత్తి చేసుకోవాలా, వద్దా అనేది మీమీదే ఆధారపడి ఉంటుంది. మీకు విషయానందం కావాలా, ఆత్మానందం కావాలా అనేది మీ చేతిలోనే ఉంది. మీరు ఆత్మానందం కోరుకుంటే, ఇప్పుడు మీ లక్ష్యం గురించి మీకు స్పష్టమైన అవగాహన ఏర్పడినట్టు అర్థం. ఇప్పుడు ఆ ఆటంకాలెన్నో, ఏమిటో తెలుసుకోవాలి. గుండెలో ఎన్ని బ్లాకులున్నాయో డాక్టర్లు చెప్పినట్టుగా, శాస్త్రం కూడా మీ ఆనందానికి మూడు బ్లాకులున్నాయి అంటున్నది. వాటిని ప్రతిబంధత్రయం అంటున్నది.

బోర్‌వెల్ తవ్వించేటప్పుడు భూమిలో పైన ఉన్న మలినాలను తొలగించుకుంటూ నీటిధార పైకి పెల్లుబికి వచ్చేదాకా ఎలా తవ్వించాలో, అలా మనం కూడా ఈ మూడు వనరులూ దొరికేదాకా, మలినాలను దాటుకుంటూ వెళ్ళి, తవ్వుతూ రావాలి. బోర్‌వెల్ తవ్వినప్పుడు స్వంతంగా నీటిని సృష్టిస్తామా? లేదే! ఉన్న నీటికీ, అది బయటకు పెల్లుబికి రావటానికీ మధ్య అడ్డుగా ఉన్న మూతను తొలగించాము. అలాగే మనలో ఉన్న మలినాలను తొలగిస్తే, మనలో కూడా ఆత్మానందం పొంగిపొరలుతుంది.

**ఆత్మన్యేవాత్మనా తుష్టః యస్తు ఆత్మరతి రేవస్యాత్।**
**ఆత్మ తృప్తస్య మానవః ఆత్మన్యేవ చ సంతుష్టః॥**

ఇది స్వంతంగా ఎవరో పుట్టించిన పుక్కిటి పురాణం కాదు, లేదా కాలక్షేపానికి చెప్పే కబుర్లు కాదు, ఇంకా మాట్లాడితే జనులను ఆకర్షించటానికి చెప్పే మాయమాటలు అసలే కాదు. శాస్త్రప్రమాణం ఉంది దీనికి. ఆ ప్రతిబంధకాలు మూడు పొరలుగా ఉన్నాయి అంటున్నది శాస్త్రం.

మనలోని శాంతి, భద్రత, ఆనందాలను మనకు తెలియకుండా కప్పుతున్న మలినాలు ఏమిటి? అవి కూడా మూడు పొరలుగా ఉన్నాయి – అత్యంత స్థూలమైనది, సూక్ష్మమైనది, అత్యంత సూక్ష్మమైనది. వాటి పేర్లు **మలం, విక్షేపం, ఆవరణం**.

**మలం** – మలం అంటే మనస్సుకు సంబంధించిన అశుద్ధాలు. వాటిని షడ్వికారాలు అంటారు. అవి కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు. అంటే అవి వరుసగా కోరిక, కోపం, దురాశ, పాశం, గర్వం, ఈర్ష్య. ఇవి మన ఆంతర ఆనందాన్ని కప్పివేసే మొట్టమొదటి పొర.

**విక్షేపం** – మనస్సుయొక్క చంచలత్వం. మనస్సు స్థిరంగా లేకుండా, అనునిత్యం బాహ్యంగా పరుగులు తీస్తూ ఉంటుంది. అందువల్ల అంతర్ముఖులమయ్యే అవకాశమే దొరకదు. ఒక కొలనులో నీటి పైభాగం బురదగా ఉన్నా అడుగుభాగాన్ని చూడలేము. అలాగే నీటి పైభాగం ప్రశాంతంగా లేకుండా కదులుతున్నా కూడా అడుగు భాగాన్ని చూడలేము. మనలో ఉన్న రాగద్వేషాలనే మలం బురదతో సమానం. మనస్సుయొక్క చంచలత్వం, చంచలంగా కదులుతున్న నీటితో సమానం. రెండు సందర్భాలలోనూ నీటి అడుగుభాగాన్ని చూడలేనట్టే, రెండు సందర్భాలలోనూ మనమూ మన మనస్సు లోతులను కొలువలేము.

**ఆవరణం** – అజ్ఞానం మన మనస్సును కప్పివేసింది. ఏమిటా అజ్ఞానం? శాంతి, భద్రత, ఆనందాలు మనలోనే దొరుకుతాయనే జ్ఞానాన్ని తెలుసుకోనివ్వని అజ్ఞానం. మనమే ఆనందస్వరూపులం, మనం పూర్ణం అనే సత్యాలు మనకు తెలియనివ్వటం లేదు.

వీటిని ఎలా పోగొట్టుకోవాలి? వీటికి ఆధ్యాత్మిక సాధనలు చేయాలి. ఒక్కొక్క సాధనను యోగం అంటారు. యోగం అంటే సాధకుణ్ణి, తన లక్ష్యంతో కలిపేలా చేసే సాధన. సాధకుడు అయిన ఒక వ్యక్తిని, అతని లక్ష్యాలైన శాంతి, భద్రత, ఆనందాలతో కలిపేది యోగం. నిధి వెతకటానికి చేసే ప్రయత్నంలో ఆ సాధకుడు తనకు ఎదురైన ఆటంకాలను రకరకాల పరికరాలతో ఎదుర్కొంటాడు. వాటన్నిటినీ ఛేదించుకుంటూ వెళ్ళి, తన అంతిమ లక్ష్యాన్ని చేరుకుంటాడు. రామాయణంలో హనుమంతుడు, సీతారాములను కలిపాడు.

రామాయణాన్ని ఆధ్యాత్మిక ప్రయాణంగా అభివర్ణించవచ్చు. ఇప్పుడు ఈ మూడు మలినాలను నివృత్తి చేసే మూడు యోగాలు ఏమిటి?

**కర్మయోగేన మలనివృత్తిః ఉపాసనాయోగేన విక్షేపనివృత్తిః, జ్ఞానయోగేన అజ్ఞాననివృత్తిః**

కర్మయోగంద్వారా మలాన్ని; ఉపాసనయోగంద్వారా విక్షేపాన్ని; జ్ఞానయోగంద్వారా అజ్ఞానాన్ని తొలగించవచ్చు. ఈ మూడు యోగాలు కొత్తగా ఏమీ తీసుకురాలేదు. మనలో ముందే నిక్షిప్తంగా ఉన్న నిధిని మనకు చూపిస్తాయి. కొంతమంది వీలునామా రాయకుండా చనిపోతారు. మళ్ళీ వారసులకు వారి ఆస్తిని చేజిక్కించు కోవటం బ్రహ్మప్రళయం అవుతుంది. వారే వారసులని నిరూపించుకోవటానికి బోలెడు తతంగం  ఉంటుంది. అంతా అయ్యాక, వారికి కొత్తగా డబ్బు వచ్చిందా? వారికి సర్వహక్కులూ ఉన్న ఆస్తి వారికి దక్కింది. 'స్వరాజ్యం నా జన్మహక్కు, నేను పొందితీరతాను,' అన్నాడు లోకమాన్య తిలక్. అలా శాంతి, భద్రత, ఆనందాలు మన జన్మహక్కు. వాటిని పొందితీరాలి. వాటిని మనలోంచి పొందకుండా అడ్డుపడుతున్న మలం, విక్షేపం, అజ్ఞానాలనే మలినాలను వరుసగా కర్మయోగం, ఉపాసనయోగం, జ్ఞానయోగాలతో  తొలగించాలి.

**కర్మయోగం** – కర్మయోగం అంటే సరియైన కర్మ + సరియైన దృక్పథం. సరియైన కర్మ అంటే సాత్త్విక కర్మ. కామక్రోధలోభమోహమదమాత్సర్యాలను పెంచి పోషించకుండా వాటిని తగ్గించే కర్మను సరియైన కర్మ అంటారు.

సరియైన దృక్పథం అంటే ఈశ్వరార్పణభావన, ఈశ్వరప్రసాదబుద్ధిభావన. అంటే మనం ఏదైనా కర్మ చేసినప్పుడు మనం కర్తలం అవుతాము. అలాగే ఆ కర్మఫలాలు వచ్చినప్పుడు వాటిని స్వీకరించే మనం భోక్తలం అవుతాము. కర్మయోగం అంటే కర్తగా మనం చేసే ప్రతి పనినీ ఈశ్వరార్పణభావనతో చేయటం, భోక్తగా మనకు వచ్చిన ప్రతిఫలితాన్నీ ఈశ్వరప్రసాదబుద్ధితో స్వీకరించటం.

కర్మయోగంవల్ల మలనివృత్తి అవుతుంది. దాన్నే సానుకూలంగా చెపితే, చిత్తశుద్ధి ఏర్పడుతుంది. అశుద్ధం పోతే శుద్ధం అవుతుంది కదా!

**ఉపసనా యోగం** – ఉపాసనా యోగం అంటే అనేక ఉపాసనలను చేయటం. ఏ ఉపాసన చేసినా మనస్సు నిశ్చలంగా అవుతుంది. బాహ్యంగా పరుగులు తీసే, చంచలమైన, కుదురులేని, విశ్రాంతిలేని మనస్సుకు కొంత విశ్రాంతి అవసరం. ఉపాసనవల్ల విక్షేపనివృత్తి అవుతుంది. దాన్నే సానుకూలంగా చెపితే, చిత్తనిశ్చలత్వం కలుగుతుంది. చంచలంగా ఉండే మనస్సు నిశ్చలంగా అవుతుంది.

**జ్ఞానయోగం** – జ్ఞానయోగాన్ని ఆత్మవిచారణ అంటారు. నా స్వస్వరూపాన్ని గురించిన విచారణ. నాకు శాంతి బాహ్యంగా లభిస్తుందా, లేక నేనే శాంతి స్వరూపాన్నా? నాకు భద్రత బాహ్యంగా దొరుకుతుందా లేక నేనే ఆత్మనా? నాకు ఆనందం బాహ్యంగా దొరుకుతుందా, లేక నేనే ఆనందస్వరూపాన్నా? నేను సత్, చిత్ , ఆనందస్వరూపాన్ని అని తెలుసుకునేలా చేస్తుంది జ్ఞానయోగం. జ్ఞానయోగం అజ్ఞానాన్ని తొలగిస్తుంది. దీన్నే సానుకూలంగా చెపితే, జ్ఞానం కలుగుతుంది.

కర్మయోగం, ఉపాసనా యోగం, జ్ఞానయోగం అనే ఈ మూడు యోగాలను పాటిస్తే, ఈ మూడు రకాల మలినాలూ తొలగుతాయి. ఏదో ఒకటే పాటించవచ్చా అంటే కుదరదు. ఎందుకంటే మనలో మూడు మలినాలూ ఉన్నాయి. అది కూడా చాలా దట్టంగా పేరుకుపోయి ఉన్నాయి. వీటిని పారద్రోలి, మనం వెంపర్లాడే శాంతి, భద్రత, ఆనందాలను మనలోనే వెతుక్కునేందుకు తోడ్పడుతుంది మన శాస్త్రం. ఈ శాస్త్రం పేరు వేదం. మనకు నాలుగు వేదాలు ఉన్నాయి. అవి అపౌరుషేయాలు. అంటే పురుషబుద్ధినుంచి వచ్చినవి కావు, సాక్షాత్తూ ఆ పరమాత్మనుంచే వచ్చాయి. ఎలాగైతే టీవీకి ట్రాన్స్‌మిషన్ స్టేషన్, రిసీవింగ్ స్టేషన్లు ఉన్నాయో, అలాగే పరమాత్మ ట్రాన్స్‌మిషన్ స్టేషన్, మన ఋషులు రిసీవింగ్ స్టేషన్. పరమాత్మ అందజేసిన వేదాలను ఋషులు అందుకున్నారు.

ఒక్కొక్క వేదంలోనూ నాలుగు భాగాలున్నాయి.

| | | | |
|---|---|---|---|
| **మంత్ర భాగము** | **– దేవతాసూక్తులు** | **– అనుగ్రహసిద్ధి** | **– యోగప్రాప్తి** |
| **బ్రాహ్మణ భాగము** | **– కర్మకాండం** | **– కర్మయోగం** | **– మలనివృత్తి** |
| **ఆరణ్య భాగము** | **– ఉపాసనకాండం** | **– ఉపాసనయోగం** | **– విక్షేపనివృత్తి** |
| **ఉపనిషత్ భాగము** | **– జ్ఞానకాండం** | **– జ్ఞానయోగం** | **– అజ్ఞాననివృత్తి** |

మంత్రభాగాన్ని సంహిత భాగం అని కూడా అంటారు. ఇందులో అనేక దేవతల ప్రార్థనలు వస్తాయి. ప్రార్థన చేస్తేనే, మన సమస్య ఏమిటో మనకు తెలుస్తుంది. సమస్య తెలిస్తే, పరిష్కారం తేలికగా దొరుకుతుంది. అప్పుడు తక్కిన యోగాలకు వస్తాము. భగవంతుని కృప లేకపోతే, ఎన్నడూ మనం అంతర్ముఖులము అవలేము. ఎప్పటికీ లౌకిక వ్యవహారాల్లో కూరుకుపోయి, బాహ్యంగా శాంతి, భద్రత, ఆనందాలను వెతుకుతూ ఉంటాము. సమస్య ఏమిటని చూశాము? **వెతికినా దొరకని చోట వెతకటం**. బట్టలషాపుకు వెళ్ళి చెప్పులు కావాలంటే దొరుకుతాయా? కాని అలాంటి పనే చేశాడు ఒక బ్రాహ్మణుడు ఒకసారి.

కుంభకోణంలో పన్నెండు సంవత్సరాలకు ఒకసారి మేళా జరుగుతుంది. అక్కడికి లక్షలాది ప్రజలు వస్తారు. మహామఖం కొలనులో స్నానాలు చేస్తారు అందరూ. ఒక బ్రాహ్మణుడు

అక్కడ స్నానం చేస్తుండగా అతని చేతికున్న ఉంగరం జారిపడిపోయింది. వెతుకుదామంటే విపరీతమైన జనసందోహం. బయటకు వచ్చేశాడు. వచ్చాక చూస్తే, పక్కనే ఇంకొక కొలను నిర్మానుష్యంగా కనబడింది. 'ఓ, ఇక్కడ హాయిగా వెతుక్కోవచ్చు,' అని మురిసిపోయి, వెతకటం మొదలుపెట్టాడు. అతను వెతకటం చూసి ఎవరో వచ్చి, 'ఏం వెతుకుతున్నావు?' అన్నారు. కారణం చెప్పాడు. అతను కూడా సహాయం చేస్తానన్నాడు. అలా ఒక్కొక్కరూ వచ్చి, వారి వంతు సహాయం వారూ చేయసాగారు. అలా చాలామందే పోగుపడ్డారు. వెతుకుతూనే ఉన్నారు, ఫలితం మాత్రం శూన్యం. చివరకి ఎవరో వచ్చి 'అసలు ఎక్కడ పోగొట్టుకున్నావు నువ్వు?' అన్నాడు. 'ఆ రెండో కొలనులో,' అన్నాడు ఈ అమాయక చక్రవర్తి. 'పిచ్చివాడా, అక్కడ పోగొట్టుకుని ఇక్కడ వెతికితే దొరుకుతుందా?' అని తిట్టాడు అతను. 'ఇక్కడ వెతకటానికి వీలుగా ఉందని వెతుకుతున్నాను,' అన్నాడు మరింత అమాయకంగా. అందరూ ఘొల్లున నవ్వారు. అతన్ని చూచి నవ్వుతాము కాని, మనం చేస్తున్నది మాత్రం ఏమిటి? **వెతికినా దొరకని చోట వెతుకుతున్నాము**. అతను ఉంగరంకోసం వెతికితే మనం శాంతి, భద్రత, ఆనందాలకోసం వెతుకుతున్నాము.

మనం సరియైన చోట వెతకాలంటే, దానికి భగవంతుని అనుగ్రహం కావాలి. అందువల్ల మంత్రభాగం అటువంటి అనుగ్రహాన్ని కలుగజేస్తుంది. మన దృష్టిని భోగంనుంచి యోగం వైపుకు మళ్ళిస్తుంది.

ఆవరణనివృత్తి జ్ఞానయోగంవల్లనే జరుగుతుంది అని చూశాము. ఆవరణనివృత్తి మలనివృత్తి, విక్షేపనివృత్తి చేశాక ఎలా చేయాలో కూడా చూశాము.

**వేద అంతభాగం** – బ్రహ్మజ్ఞానం వేద అంతభాగంలో లభ్యమవుతుంది. వేద అంతభాగానికి అనేక నామాలు ఉన్నాయి.

ఎ) **వేదాంతం** – వేదంయొక్క అంతభాగంలో వస్తుంది కాబట్టి దీన్ని వేదాంతం అంటారు.

బి) **జ్ఞానకాండ** – ఈ వేద అంతభాగంలో బ్రహ్మజ్ఞానం బోధించబడుతుంది కాబట్టి దీన్ని జ్ఞానకాండ అని కూడా అంటారు. ఇందులో కర్మకు ఆస్కారం లేదు. వేదపూర్వభాగం కర్మప్రధానంగా ఉంటే, వేద అంతభాగం జ్ఞానప్రధానంగా ఉంటుంది. అందువల్ల వేదపూర్వభాగాన్ని కర్మకాండ అనీ, వేద అంతభాగాన్ని జ్ఞానకాండ అనీ అంటారు.

సి) **ఆత్మవిద్య** – ఆత్మ అంటే నేను. నా స్వస్వరూపం గురించిన జ్ఞానాన్ని బోధిస్తుంది కాబట్టి, దీన్ని ఆత్మవిద్య అనికూడా అంటారు. నేను సంసారంనుంచి విముక్తి పొందటానికి ప్రయత్నిస్తుంటే, నువ్వు ముందే ముక్తపురుషుడివి అంటుంది వేద అంతభాగం. నేను ముక్తి పొందటానికి ప్రయత్నం చేయనవసరం లేదని తెలుసుకోవటమే ఆత్మవిద్య.

డి) **బ్రహ్మవిద్య** – బ్రహ్మ గురించిన జ్ఞానం బోధిస్తుంది కాబట్టి దీన్ని బ్రహ్మవిద్య అనికూడా అంటారు. జీవాత్మ పరమాత్మ ఐక్యజ్ఞానాన్ని బోధిస్తుంది. ఆత్మ=బ్రహ్మ అని నేర్పిస్తుంది. నువ్వు వెతుకుతున్న బ్రహ్మవు నువ్వే అంటుంది. చైతన్యపరంగా ఆత్మ, బ్రహ్మ ఒకటే. బ్రహ్మ అంటే పూర్ణం, అనంతం, అపరిచ్ఛిన్నం.

ఇ) **ఉపనిషత్తు** – వేద అంతభాగంలో ఉండి, జీవ(ఆత్మ), ఈశ్వర(బ్రహ్మ) ఐక్యం గురించిన జ్ఞానాన్ని బోధించేది ఉపనిషత్తు.

ఉపనిషత్తుకు ఆ పేరు ఎందుకు వచ్చింది?

ఉపనిషత్తు పదాన్ని పదవిచ్ఛేదం చేస్తే ఉప+ని+షద్ అవుతుంది.

**షద్** – షద్ అంటే నాశనం చేసేది. జ్ఞానాన్ని నాశనం చేసేది అనకూడదు. సంసారాన్ని నాశనం చేస్తుంది. అదికూడా దీనికి మూలకారణమైన అజ్ఞానాన్ని. మనం అజ్ఞానంవల్ల సంసారంలో పడి కొట్టుమిట్టాడుతున్నాము. అజ్ఞానంవల్ల అంతా నేనే చేస్తున్నానన్న 'అహం' పెరుగుతుంది. అహంవల్ల కోరిక పుడుతుంది. కోరికవల్ల కర్మలు చేస్తాము. వాటివల్ల సుఖదుఃఖాలు కలుగుతాయి. పుణ్యపాపాలను పెంచుకుంటాము. ఆ పుణ్యపాపాలను హరించుకోవటానికి పునరపి జననం, పునరపి మరణం అనే చక్రంలో పడిపోతుంటాము.

అజ్ఞానం–అహం–కోరిక–కర్మ–సుఖదుఃఖాలు–పుణ్యపాపాలు–పునర్జన్మ. ఈ ఏడు అడుగులు మనం అజ్ఞానంవల్ల వేస్తున్నాము. ఆ అజ్ఞానాన్ని పారద్రోలటంవల్ల మనకు దుఃఖనాశనం కలిగి మోక్షప్రాప్తి కలుగుతుంది. అంటే ఆత్మవిద్య పొందటంవల్ల ఈ సంసారబంధం నుంచి విముక్తి పొందుతాము.

**ఉప** – ఆత్మజ్ఞానంకోసం ఆచార్యుని దగ్గరికి వెళ్ళి ప్రశ్నలు అడిగి, జ్ఞానాన్ని పొందాలి. గురువుని అడగందే బోధ చేయరు. అర్జునుడు శరణువేడి, మార్గం చూపమంటేనే గీతాబోధ వచ్చింది. అది కూడా వినయంగా అడగాలి.

**ని** – నిశ్చయజ్ఞానం. ఆచార్యునినుంచి నిశ్చయజ్ఞానం పొందాలి. ఆచార్యుని దగ్గరకు వెళ్ళగానే ఎన్నాళ్ళు నేర్చుకోవాలి లేదా ఏదైనా క్రాష్‌కోర్సు ఉందా అనకూడదు. నిశ్చయజ్ఞానం కలిగేదాకా వేదాంతం పదే పదే నేర్చుకోవాలి.

సంసారచక్రంనుంచి బయటపడి, మన స్వభావం గురించి నిశ్చయజ్ఞానం కలగాలి. నేను శరీరాన్ని కాదు, మనస్సుకాదు, ఇంద్రియాలు కాదు, జీవాత్మ కాదు, పరమాత్మకి బానిసను కాదు. నేను ఏకాత్మను; నిత్య, ముక్త, శుద్ధ, పరిపూర్ణబ్రహ్మను అని అర్థం చేసుకోవాలి.

అందువల్ల ఉపనిషత్తు అంటే ఆచార్యుని దగ్గరికి వెళ్ళి ఆత్మజ్ఞానం పొందితే, సంసారాన్ని నాశనం చేసే నిశ్చయజ్ఞానం కలిగిస్తుంది అని అర్థం.

ఉపనిషత్తుకు ఇంకొక అర్థం కూడా వస్తుంది. ఉప అంటే అత్యంత సమీపం. ని అంటే నిశ్చయజ్ఞానం. ఉపనిషత్తు అంటే అత్యంత సమీపవిషయమైన బ్రహ్మ గురించిన నిశ్చయజ్ఞానం పొందటం.

ఇది ఉపనిషత్‌కు మరొక అర్థం. ఇంకొక అర్థం కూడా చెప్పవచ్చు. ఉపనిషత్తుయొక్క వాచ్యార్థం తీసుకుంటే దాని అర్థం బ్రహ్మవిద్య లేదా వృత్తిజ్ఞానం. ఈ బ్రహ్మవిద్య ఆలోచన రూపంలో మనస్సులో కలిగే జ్ఞానం. బ్రహ్మవిద్యను ఉపనిషత్ అని ఎందుకు అంటారంటే, ఆ పదంలోనే అది చేసే రెండు పనులను సూచిస్తున్నది. ఇక్కడ ఉపనిషత్‌ను రెండు పదాలుగా విడదీస్తాము. ఉపని+షద్.

**ఉపని** – ఉపనయతి ఇతి ఉపని. రెండింటిని కలుపుతుంది. ఏ రెండింటిని? జీవాత్మనూ, పరమాత్మనూ కలుపుతుంది. జ్ఞానంవల్లనే జీవాత్మ, పరమాత్మల ఐక్యం ఎలా కుదురుతుందని సందేహం రావచ్చు. ఎందుకంటే కాఫీ విషయమే తీసుకోండి. ఇన్ని పాలు పోసి, ఇంత డికాక్షన్ కలిపి, ఇంత పంచదార వేస్తే ఘుమఘుమలాడే చక్కటి ఫిల్టర్ కాఫీ తయారవుతుందని నేర్చుకున్నామనుకోండి. అంతమాత్రాన కాఫీ తయారయిపోతుందా? అవదు! మీరు కాఫీ కలిపే కర్మ చేయాలి.

మరయితే జీవాత్మ, పరమాత్మ ఒకటే అనే ఐక్యజ్ఞానం పొందినంత మాత్రాన ఐక్యం అయిపోతాయా? అవుతాయి. ఎందుకు? ఇక్కడ అజ్ఞానంవల్ల జీవాత్మ వేరు, పరమాత్మ వేరు అనుకుంటున్నారు. అజ్ఞానాన్ని అవిద్య అని కూడా అంటారు. అవిద్యా నివృత్తి అయితే పొరపాటు తొలగుతుంది. పొరపాటు తొలిగితే భేదం ఉందనే అపోహ తొలుగుతుంది. అపోహ తొలగటమే ఐక్యం పొందటం.

ఈ దశలను మళ్ళీ ఒకసారి చూస్తే జీవాత్మ పరమాత్మ ఐక్యజ్ఞానం పొందితే, అజ్ఞానం తొలగుతుంది. అజ్ఞానం తొలిగితే, అజ్ఞానజనిత పొరపాటు తొలగుతుంది. అజ్ఞానజనిత పొరపాటు తొలిగితే జీవాత్మ వేరు, పరమాత్మ వేరు అనే అపోహ తొలగుతుంది. అపోహ తొలగటమే ఐక్యజ్ఞానం పొందటం. అందువల్ల ఉపని అంటే జీవాత్మ, పరమాత్మల ఐక్యజ్ఞానం కలగజేయటం.

**షద్** – అవసాదయతి ఇతి షద్ – నాశనం చేసేది అని అర్థం. దేన్ని నాశనం చేస్తుంది? ఆత్మను, లేదా బ్రహ్మను అనకూడదు. సంసారాన్ని నాశనం చేస్తుంది. సంసారాన్ని అనేక విధాలుగా నిర్వచించవచ్చు. రాగద్వేషాలు సంసారం; కామక్రోధలోభమోహమదమాత్సర్యాలు సంసారం; అహంకార, మమకారాలు సంసారం; బాధపడటం, అపరాధభావన సంసారం.

ఏ నిర్వచనం తీసుకున్నా వీటన్నిటికీ మూలకారణం అజ్ఞానం. అజ్ఞానం నాశనమయితే సంసారం నాశనం అవుతుంది.

బ్రహ్మవిద్యను ఉపనిషత్ అని అనటానికి కారణం టూకీగా –
ఉపని – జీవాత్మ, పరమాత్మలను ఐక్యం చేస్తుంది
షద్ – సంసారాన్ని నాశనం చేస్తుంది.

రెండూ కలిపితే అంతకుముందు చూసిన అర్థం సారాంశమే వస్తుంది. జీవాత్మ, పరమాత్మ ఐక్యజ్ఞానంద్వారా సంసారాన్ని నాశనం చేసేది ఉపనిషత్. ఇది వాచ్యార్థం.

**లక్ష్యార్థం** – ఉపనిషత్ అంటే బ్రహ్మవిద్య అని చూశాము. ఏ విద్య అయినా సరే వృత్తిరూపంలో కలుగుతుంది. వృత్తి అంటే ఆలోచన. ఆలోచనలు మనస్సులో ఏర్పడతాయి. మనస్సు ఆంతరంగా ఉంది. అలాంటప్పుడు బ్రహ్మవిద్య ఆంతరంగా కలగాలి కదా, బాహ్యంగా ఉన్న ఉపనిషత్ గ్రంథాన్ని ఎలా బ్రహ్మవిద్య అంటారని సందేహం కలుగవచ్చు. దానికి జవాబు – ఇక్కడ లక్ష్యార్థాన్ని తీసుకోవాలి.

ఒక వస్తువు గురించి, ఒక పరికరం ఉపయోగించి, నేను నేర్చుకుని, దానికి సంబంధించిన జ్ఞానం పొందుతాను. వీటికి సంస్కృతపదాలను చూద్దాము. నేర్చుకునే నేను ప్రమాతను; వస్తువు ప్రమేయం; పరికరం ప్రమాణం, జ్ఞానం ప్రమా. వీటిని ఒక వాక్యంగా చూస్తే ప్రమాతనైన నేను ఒక ప్రమాణం ఉపయోగించి ప్రమేయం గురించిన ప్రమా పొందుతాను. అంటే ప్రమాతనైన నేను ఉపనిషత్ అనే ప్రమాణం ఉపయోగించి బ్రహ్మ అనే ప్రమేయం గురించిన (బ్రహ్మ ప్రమేయం కాదని తర్వాత నేర్చుకుంటాము, ఇప్పటికి అర్థం చేసుకోవటానికి అలా చెప్పవచ్చు) ప్రమా పొందుతాను. ఇక్కడ ఉపనిషత్ ప్రమాణం అయింది.

ఆ విధంగా ఉపనిషత్ పదానికి రెండు అర్థాలు చెప్పవచ్చు.

వాచ్యార్థం – ప్రమా – బ్రహ్మవిద్య జ్ఞానం కలిగిస్తుంది.
లక్ష్యార్థం – ప్రమాణం – బ్రహ్మవిద్య నేర్చుకోవటానికి తోడ్పడుతుంది.

ఇక్కడ కూడా ఒక సందేహం కలుగవచ్చు. ఉపనిషత్ గ్రంథమే ఎలా సంసారాన్ని నాశనం చేస్తుంది? అలా గ్రంథమే నాశనం చేసేటట్టయితే, ఉపనిషత్‌ను తెచ్చుకుని ఇంట్లో పెట్టుకుంటే సరిపోతుంది కదా! అందువల్లనే లక్ష్యార్థాన్ని కూడా చూడాలి. అది చూసేముందు ఈ ఉదాహరణ చూద్దాము.

**ఎవరెస్ట్ శిఖరం ఎక్కితే ఆనందం కలుగుతుంది**

ఎవరెస్ట్ శిఖరం ఎక్కేది కాళ్ళతో; ఆనందం కలిగేది మనస్సుకు. అదెలా కుదురుతుంది అంటామా? కాళ్ళతో ఎవరెస్ట్ శిఖరం ఎక్కితే, మనస్సుకు ఆనందం కలుగుతుంది అని అర్థం. అంటే కాళ్ళతో ఎక్కటం ఆనందం కలగటానికి కారణహేతువు అవుతుంది. అలాగే ఉపనిషత్ బ్రహ్మవిద్య అని అంటే, ఉపనిషత్‌లోని మంత్రాలు సంసారనాశనజ్ఞానం కలగటానికి కారణహేతువు అవుతాయి. కాబట్టి ఉపనిషత్ అంటే రెండు అర్థాలు చెప్పవచ్చు. జ్ఞానం, జ్ఞానాన్ని కలగజేసే ప్రమాణం.

**ఉపనిషణ్ణం వా అస్యాం పరం శ్రేయః ఇతి ।**
**తదర్థత్వాత్ గ్రంథః అపి ఉపనిషత్॥**

శంకరాచార్యులవారు తన భాష్యంలో ఉపనిషత్తును ఈ విధంగా నిర్వచించారు. ఈ జ్ఞానంలో సర్వోత్తమమైన మోక్షం ఆత్మరూపంగా కూర్చుని ఉంది అనే అర్థం వస్తుంది కాబట్టి ఇది ఉపనిషత్తు అయింది. ఆ జ్ఞానంకోసం ఉద్దేశింపబడిన గ్రంథాన్ని కూడా ఉపనిషత్తు అంటారు.

దీని అర్థం ఉపనిషత్తును అధ్యయనం చేస్తే, మీరే ముక్తపురుషులు అని నేర్చుకుంటారు. దీన్ని ఏదో లౌకికవిద్య నేర్చుకున్నట్టుగా నేర్చుకోకూడదు. లౌకికవిద్య మీ మేధస్సును మెరుగుపరిస్తే, ఆత్మవిద్య మీ మనస్సును శుద్ధి చేస్తుంది. ఆత్మజ్ఞానం పొందితే ఇక్కడే, ఇప్పుడే ఆనందాన్ని పొందుతారు. మీరు వ్యక్తిగతంగా మార్పు పొందుతారు. మీరు బాహ్యంగా వెతికే శాంతి, భద్రత, ఆనందాలు బాహ్యంగా లేవు, మీలోనే ఉన్నాయని నేర్చుకుంటారు.

**ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే** – గీత 2.55

స్థితప్రజ్ఞుడు ఆత్మలోనే రమిస్తాడు. ఆ విధంగా మోక్షం గురించి ఈ బోధలో అంతర్లీనంగా ఉంది. ఈ ఉపనిషత్తు ఎప్పుడో మరణానంతరం వచ్చే ఫలం గురించి చెప్పదు. జీవన్ముక్తిని బోధిస్తుంది. జీవన్ముక్తి అంటే ఇక్కడే, ఇప్పుడే ఆనందాన్ని పొందుతారు.

ఇటువంటి ఉపనిషత్తులు 1180 ఉండేవి ఒకప్పుడు.

**శంకరభాష్యం** – వేదాలు ఉన్నవి నాలుగే అయినా, ఉపనిషత్తులు 1180 ఉన్నాయి. వాటిలో కొన్ని కాలగర్భంలో కలిసిపోయి, 108 మాత్రమే మిగిలాయి. వాటిల్లో కూడా దశ ఉపనిషత్తులని ప్రధాన ఉపనిషత్తులని అంటారు. ఎందుకంటే ఈ దశ ఉపనిషత్తులకీ శంకరాచార్యులవారు భాష్యం చెప్పారు. వీటికి భాష్యాలు రాయటానికి కారణాలు రెండు –

1, ఈ పదీ చదివితే నాలుగు వేదాల సారాంశం వస్తుంది.
2. బ్రహ్మసూత్రాల్లో ఉపనిషత్తు వాక్యాలను తీసుకుని లోతుగా పూర్వాపరాలని విశ్లేషించారు

వ్యాసమహర్షి. ఆ వాక్యాలు ఈ 10 ఉపనిషత్తులనుంచీ అధికశాతం ఉన్నాయి. అందుకని వాటినే తీసుకున్నారు.

ఈ పది ఉపనిషత్తులను ప్రధాన ఉపనిషత్తులనటంలో అర్థం తక్కినవి చిన్న బ్రహ్మ గురించి చెబుతాయని కాదు. బ్రహ్మ ఒక్కటే. ఈశావాస్య ఉపనిషత్తులో 18 మంత్రాల్లో వర్ణించినా, బృహదారణ్యక ఉపనిషత్తులో అరణ్యం అంత పెద్దదిగా వర్ణించినా, రెండింటి సారాంశము ఒకటే. ఈ పదీ శంకరభాష్యంవల్ల ప్రాచుర్యం పొందాయి. వాటిని తేలికగా గుర్తుంచుకోవటానికి చిన్న శ్లోకరూపంలో చెబుతారు.

**ఈశ కేన కఠ ప్రశ్న ముండ మాండూక్య తిత్తిరిః ।**

**ఐతరేయం చ ఛాందోగ్యం బృహదారణ్యకం తథా ॥**

ఈశావాస్య ఉపనిషత్తు పేరు ముందు వచ్చినా, దానితో ఉపనిషత్తు బోధ మొదలుపెడితే, అంతా అయోమయంగా తోస్తుంది. అది పూర్ణం, ఇది పూర్ణం, పూర్ణంలోంచి పూర్ణం తీసేసినా పూర్ణమే మిగులుతుంది అని అంటే, ఒక్క అక్షరం ముక్క కూడా అర్థంకాదు. అలాగే, బృహదారణ్యకం చాలా పెద్దది. దయానందసరస్వతిస్వామి హాస్యంగా ఒక మాట చెబుతారు. ఏదైనా మంత్రం ఎవరైనా చెప్పి, ఇది ఎందులోంచి అంటే బృహదారణ్యకంలోనిది అనాలిట. అవునా, కాదా అని ఎదుటి వ్యక్తి తేల్చటానికి తాతలు దిగివస్తారట. అదీకాక, అది నిజంగానే అందులోనే ఉండే అవకాశమూ ఉంది.

అందుకని ఉపనిషత్తు బోధ ముండకోపనిషత్తుతో మొదలుపెడతారు. శంకరాచార్యుల వారు 10 ఉపనిషత్తులకు వ్యాఖ్యానం చేసినా, కనీసం ఆరు ఉపనిషత్తులనన్నా అధ్యయనం చేయాలనీ, అవి కూడా ఈ వరుసక్రమంలో చేస్తే మంచిదనీ పరమార్థానంద స్వామి చెప్పి, ఆయన అదే వరుసక్రమంలో బోధించారు కూడా. అది – ముండక, కేన, కఠ, కైవల్య (కైవల్యం ఈ పదిలో లేకపోయినా ముఖ్యమైనది) తైత్తిరీయ, ఈశావాస్యమ్. అప్పుడు ఒక నిశ్చయజ్ఞానం కలుగుతుందని చెబుతారు స్వామీజీ.

శంకరాచార్యులవారు ఈ పది ఉపనిషత్తులకే కాదు, మరొక రెండింటికి కూడా భాష్యం రాశారని అంటారు. అవి శ్వేతాశ్వతర ఉపనిషత్, నృసింహ ఉత్తర తాపనీయ ఉపనిషత్.

ఉపనిషత్తుల్లోని సారం ఒక్కటే. అది –

**బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా, జీవో బ్రహ్మైవ నాపరః**

ఇదే విషయాన్ని ఒక్కొక్క ఉపనిషత్ ఒక్కొక్క పద్ధతిలో విశ్లేషిస్తుంది. పంచకోశవివేకం, అవస్థాత్రయ వివేకం, ఆత్మానాత్మ వివేకం, అధ్యారోప అపవాదం – ఇలా కొన్నింటిని వాడతాయి. పద్ధతి వేరైనా లక్ష్యం ఒకటే. జీవ ఈశ్వర ఐక్యాన్ని బోధిస్తాయి.

జీవ ఈశ్వర ఐక్య బోధక వేదవాక్యం

ఇలా ఐక్యాన్ని బోధించే ఏ వాక్యాన్నైనా మహావాక్యం అంటారు. అలాంటి మహావాక్యాలు ఉపనిషత్తుల్లో కోకొల్లలు. కాని బాగా ప్రాచుర్యం పొందిన మహావాక్యాలు నాలుగు ఉన్నాయి.

| **మహావాక్యం** | **ఉపనిషత్** |
| --- | --- |
| ప్రజ్ఞానం బ్రహ్మ | ఐతరేయోపనిషత్ |
| అహం బ్రహ్మాస్మి | బృహదారణ్యకోపనిషత్ |
| తత్త్వమసి | ఛాందోగ్యోపనిషత్ |
| అయమాత్మా బ్రహ్మ | మాండూక్యోపనిషత్ |

సాధారణంగా ఉపనిషత్తుల బోధ గురుశిష్యుల సంవాదరూపంలో సాగుతుంది. ఆ సంవాదం ఒక గురువుకు, ఒక శిష్యునికి మధ్య ఉండవచ్చు; ఒక గురువు, అనేక శిష్యుల మధ్య ఉండవచ్చు; అనేక శిష్యులు, అనేక గురువుల మధ్య ఉండవచ్చు. ముండకోపనిషత్, కఠోపనిషత్ – ఒక గురువు, ఒక శిష్యుని మధ్య జరిగిన సంవాదం; ప్రశ్నోపనిషత్‌లో ఆరుగురు శిష్యులు ఒక గురువును ప్రశ్నలు అడుగుతారు; ఛాందోగ్యోపనిషత్, బృహదారణ్యకోపనిషత్‌లో అనేక శిష్యులను, అనేక గురువులను చూస్తాము.

ఇలా గురుశిష్యుల సంవాదరూపంలోనే ఎందుకు ఉంటుంది? దానికి అనేక కారణాలు చెప్పవచ్చు.

1. **సంప్రదాయ పద్ధతి** – బ్రహ్మవిద్యను గురువుద్వారానే నేర్చుకోవాలి. స్వంతంగా నేర్చుకుంటే తప్పుగా అర్థం చేసుకునే ప్రమాదం ఉంది.

2. **సుఖార్థ ప్రతిబోధనార్థమ్** – సంభాషణరూపంలో ఉంటే విషయం తేలికగా అర్థమవుతుంది. శాస్త్రమే అనేక ప్రశ్నలు వేసి, జవాబులు కూడా ఇస్తుంది.

3. **గురుశిష్య పరంపర** – వేదాన్ని శ్రుతి అంటారు. ఋషులు విని, తమ తర్వాత తరంలోని శిష్యులకు అందజేశారు. సాంప్రదాయ తాళంచెవితో తెరుస్తారు వేదాంతాన్ని.

**ఇతి శుశ్రుమ పూర్వేషాం యే నస్తద్వ్యాచచక్షిరే** – కేన 1.3

ఈ విద్య చెప్పటం చాలా కష్టం కాని, మా గురువులు మాకు చెప్పిన పద్ధతిలో చెబుతాను అంటాడు గురువు కేనోపనిషత్‌లో.

4. **లక్ష్యార్థం** – చాలా పదాలకు లక్ష్యార్థాలు ఉంటాయి. అవి సందర్భాన్నిబట్టి అర్థం చేసుకోవాలి. ముఖ్యంగా ఈశావాస్యోపనిషత్‌లో అనేక పదాలకు నిఘంటువు అర్థం సరిపోదు. కొన్నిచోట్ల పదాల గారడీ వస్తుంది.

**తదేజతి తన్నైజతి తద్దూరే తద్వంతికే** – ఈశావాస్యోపనిషత్ 5

అది కదులుతోంది, కదలటం లేదు; అది దూరంగా ఉంది, దగ్గరగా ఉంది.

**యస్యామతం తస్య మతం మతం యస్య న వేద సః** – కేన 2.3

నాకు బ్రహ్మ తెలుసు అంటే, వారికి బ్రహ్మ తెలియదు; బ్రహ్మ తెలియదు అనుకున్నవారికి బ్రహ్మ తెలుసు.

ఇటువంటి వాక్యాలను గురువు మాత్రమే విడమర్చి చెప్పగలడు. అంతేకాదు, ఒకే పదానికి సందర్భాన్నిబట్టి అర్థం మారుతుంది. ఆత్మ అంటే నేను, బ్రహ్మ, సచ్చిదానంద ఆత్మ– అలా ఏదైనా అర్థం రావచ్చు. దాన్ని కూడా సరిగ్గా అర్థం చేసుకోవాలి. అందువల్ల ఉపనిషత్తులను గురువుద్వారానే నేర్చుకోవాలి. అది కూడా శ్రోత్రియబ్రహ్మనిష్ఠ అయిన గురువుద్వారానే నేర్చుకోవాలి. అది కూడా గురువు దగ్గరకు తానే వెళ్ళాలి. గురువు వద్ద శ్రవణ, మనన, నిదిధ్యాసనలద్వారా నేర్చుకోవాలి.

**శ్రవణం** – ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా కొన్ని సంవత్సరాలపాటు సమర్థుడైన గురువు దగ్గర శాస్త్రాన్ని అధ్యయనం చేయటం. ఇందులో ప్రతిపదమూ ముఖ్యమే. గురువు లేకుండా మనమే చదివితే ఈ డైకాటమీలో పడిపోయి, సమాచారం నేర్చుకోవటంలోనో, ప్రత్యక్ష అనుభవం పొందటంకోసం చూడటమో జరుగుతుంది.

ఉదాహరణకు కుంతి కర్ణుల మధ్య జరిగిన సంభాషణ గురించి చూద్దాం. కుంతి కర్ణుడితో చెబుతుంది, 'కర్ణా, నాకు ఆరుగురు పుత్రులు ఉన్నారు.' అతనికి ఐదుగురి గురించే తెలుసు, నిద్రలో కూడా వారిని మర్చిపోడు. అందుకని అడుగుతాడు, 'ఓ కుంతీ! ఆ ఆరవ పుత్రుణ్ణి చూడాలని ఉంది.' కుంతి, 'తత్త్వమసి,' అంటుంది. అంటే అది నువ్వే. అప్పుడు కర్ణుడు యిలా అన్నాడనుకోండి, 'ఓ కుంతీ, నాకు ఆరవ పుత్రుడి గురించి సమాచారం తెలిసింది. ఇప్పుడు అతన్ని ఎక్కడ కలుసుకోను?' అలా అంటే ఎలా ఉంటుంది? ఆ ప్రశ్న యిక్కడ కుదరదు. అజ్ఞానం తొలగిపోవటమే జ్ఞానం. డైకాటమీ లేదు.

అందువల్ల శ్రవణం అంటే క్రమపద్ధతిలో శాస్త్రం నేర్చుకోవటం. సమర్థుడైన గురువు దగ్గర, కొన్ని సంవత్సరాల పాటు. ఎందుకంటే మనకు అలవాటైన పద్ధతిని పోగొట్టుకోవటానికి సమయం పడుతుంది.

శ్రవణం జరుగుతున్న దశలో ప్రశ్నలు అడగకూడదు. గురువు అనేక కోణాల్లోంచి, అనేక అంశాల గురించి సంపూర్ణంగా వివరిస్తాడు. మనకు సందేహాలు కలిగినా, కొంత భాగం ఒప్పుకోవటానికి సిద్ధంగా లేకపోయినా, వాటిని పక్కన పెట్టుకుని, చెప్పిన విషయాన్ని

అంగీకరించే తత్త్వం పెంచుకోవాలి. మనం గురువు మాటతో విభేదించవచ్చు. కాని గురువు నా మాట వినకపోతే శపిస్తాను అనడు. కాని శ్రవణం పూర్తి అయ్యేదాకా మనం ఆగాలి. మనం ఒక ముగింపుకు రావటం, మనకు తోచిన విశ్లేషణ చేసుకోవటం, విమర్శించటం చేయకూడదు. శ్రవణం దశలో చాలా ఓపిక కావాలి. శ్రవణం అజ్ఞానాన్ని తొలగిస్తుంది.

**మననం** – సంపూర్ణంగా విన్నాక, కొన్నేళ్ళపాటు శ్రవణం చేసాక, మన సందేహాలను వెలిబుచ్చవచ్చు. ఈ అధ్యయనంలో ఒక గొప్పదనం ఉంది. నిజానికి అన్నేళ్ళపాటు శ్రవణం చేసాక, మనలో కలిగే సందేహాలన్నీ అవే మటుమాయమవుతాయి. ఎందుకంటే శాస్త్రం గురుశిష్య సంవాదంలా వుంటుంది. మనకు కలిగే సందేహాలను శాస్త్రంలో శిష్యుడు వేస్తాడు. అయినా మనకు ఏదైనా కొత్త సందేహం కలిగితే, మన తార్కిక మెదడుకి తోచినది, తప్పకుండా అడగవచ్చు, గురువు దాన్ని తీరుస్తాడు. అప్పుడు సందేహాలని దాచుకుంటే, అవి జ్ఞానానికి అడ్డంకులవుతాయి. అందువల్ల మననం సందేహాలను తొలగించి, మనకు నిస్సంశయజ్ఞానం కలిగిస్తుంది.

**నిదిధ్యాసనం** – మనని మనం అంతర్గతంగా చూసుకోవటం. మనకు ఏళ్ళ తరబడి, అలవాటైన పద్ధతిని, తదనుగుణమైన ప్రవర్తనని మార్చుకోవాలి. అది పోతేనే ఈ జ్ఞానం కలుగుతుంది. అందుకని నిదిధ్యాసనం మనకలవాటైన పాత పద్ధతిని మార్చుకుని, ఈ జ్ఞానాన్ని అలవర్చుకునేలా చేస్తుంది. మార్చుకోకపోతే గురువు మన గురించి ఎంత చెప్పినా మన పద్ధతి మారదు.

# ఏకాదశ ఉపనిషత్తుల సారం

## ముండకోపనిషత్ – ముండకం 1

వేదాలు ఉన్నవి నాలుగే అయినా ఉపనిషత్తులు 1180 ఉన్నాయి. వాటిలో కొన్ని కాలగర్భంలో కలిసిపోయి, 108 మాత్రమే మిగిలాయి. వాటిల్లో కూడా 10 ఉపనిషత్తులని ప్రధాన ఉపనిషత్తులని అంటారు. ఎందుకంటే ఈ 10 ఉపనిషత్తులకీ శంకరాచార్యులవారు భాష్యం చెప్పారు. వీటికి రాయటానికి కారణాలు రెండు –

1, ఈ పదీ చదివితే నాలుగు వేదాల సారాంశం వస్తుంది.

2. బ్రహ్మసూత్రాల్లో ఉపనిషత్తు వాక్యాలను తీసుకుని లోతుగా పూర్వాపరాలని విశ్లేషించారు వ్యాసమహర్షి. ఆ వాక్యాలు ఈ 10 ఉపనిషత్తులనుంచీ అధికశాతం ఉన్నాయి. అందుకని వాటినే తీసుకున్నారు.

ఈ పది ఉపనిషత్తులను ప్రధాన ఉపనిషత్తులనటంలో అర్థం తక్కినవి చిన్న బ్రహ్మ గురించి చెప్తాయని కాదు. బ్రహ్మ ఒక్కటే. ఈశావాస్య ఉపనిషత్తులో 18 మంత్రాల్లో వర్ణించినా, బృహదారణ్యక ఉపనిషత్తులో అరణ్యం అంత పెద్దదిగా వర్ణించినా, రెండింటి సారాంశము ఒకటే. ఈ పదీ శంకరభాష్యంవల్ల ప్రాచుర్యం పొందాయి. వాటిని తేలికగా గుర్తుంచుకోవటానికి చిన్న శ్లోకరూపంలో చెప్తారు.

**ఈశ కేన కఠ ప్రశ్న ముండ మాండూక్య తిత్తిరిః ।**
**ఐతరేయం చ ఛాందోగ్యం బృహదారణ్యకం తథా ॥**

ఈశావాస్య ఉపనిషత్తు పేరు ముందు వచ్చినా, దానితో ఉపనిషత్తు బోధ మొదలుపెడితే, అంతా అయోమయంగా తోస్తుంది. అది పూర్ణం, ఇది పూర్ణం, పూర్ణంలోంచి పూర్ణం తీసేసినా పూర్ణమే మిగులుతుంది అని అంటే ఒక్క అక్షరం ముక్క కూడా అర్థంకాదు. అలాగే, బృహదారణ్యకం చాలా పెద్దది. దయానంద సరస్వతి స్వామి హాస్యంగా ఒక మాట చెప్తారు. ఏదైనా మంత్రం ఎవరైనా చెప్పి, ఇది ఎందులోంచి అంటే బృహదారణ్యకం లోది అనాలిట. అవునా, కాదా అని ఎదుటి వ్యక్తి తేల్చటానికి తాతలు దిగివస్తారట. అదీకాక, అది నిజంగానే అందులోనే ఉండే అవకాశమూ ఉంది.

అందుకని ఉపనిషత్తు బోధ ముండకోపనిషత్తుతో మొదలుపెడతారు. శంకరాచార్యుల వారు 10 ఉపనిషత్తులకు వ్యాఖ్యానం చేసినా కనీసం ఆరు ఉపనిషత్తులనన్నా అధ్యయనం చేయాలనీ, అవి కూడా ఈ వరుసక్రమంలో చేస్తే మంచిదనీ పరమార్థానంద స్వామి చెప్పి,

అదే వరుసక్రమంలో బోధించారు కూడా. అది – ముండక, కేన, కఠ, కైవల్య (కైవల్యం ఈ పదిలో లేకపోయినా ముఖ్యమైనది) తైత్తిరీయ, మాండూక్య. అప్పుడు ఒక నిశ్చయజ్ఞానం కలుగుతుందని చెబుతారు స్వామీజీ.

**ముండకోపనిషత్తుకి ఆ పేరు ఎందుకు వచ్చింది?**

ఒక్కొక్క ఉపనిషత్తుకి ఒక్కొక్క పద్ధతిలో పేరు పెట్టారు. అనేక ప్రశ్నలు ఉన్నాయి కాబట్టి ప్రశ్నోపనిషత్తు. కేనేషితం అన్నపదంతో మొదలయినది కాబట్టి కేనోపనిషత్తు. ఈశావాస్యమిదం సర్వంతో మొదలయినది కాబట్టి ఈశావాస్యోపనిషత్తు. ముండక పదంతో మొదలయినది కాబట్టి ముండకోపనిషత్తు అనకూడదు. దీనికి కారణాలు వేరు. అవి –

1. ఇది ప్రాథమిక విద్య లేదా ముఖ్యవిద్యను బోధిస్తుంది. అనేక అంశాలను బోధిస్తుంది. ఇందులోని మంత్రాలని శంకరాచార్యులవారు అనేకసార్లు ఉటంకిస్తుంటారు.

2. ముండకం అనేది ఒక శిరోవ్రతం. గురువు దగ్గరికి మండుతున్న పాత్ర తీసుకుని వెళ్ళాలి. అది శిష్యునిలో మండే కోరికకి ప్రతీక.

3. సన్న్యాసులు శిరోముండనం చేసుకుంటారు. అంటే యజ్ఞయాగాదులు ఇంక చేయరు. వారికి ఉపనిషత్తులను బోధిస్తారు. అంటే సన్న్యాసికుండే వైరాగ్యస్థితి ఉండాలని దాని అర్థం. మనం సంన్యాసం స్వీకరించాలని కాదు.

మన గురువు పూజ్యస్వామీజీ సాధారణంగా ముండకోపనిషత్తులో తన బోధ మొదలు పెడతారనీ చెబుతూ దానికి కారణాలు కూడా చెబుతారు. ఈ ఉపనిషత్తు మరీ పెద్దదీ కాదు, మరీ చిన్నదీ కాదు. ఇందులో వేదాంతసారం అంతా వస్తుంది. అంతేకాక, ఒక క్రమపద్ధతిలో వస్తుంది. అందువల్ల మన స్వామీజీ కూడా తన బోధను ముండకోపనిషత్తుతో మొదలుపెడతారు.

**ఉపనిషత్తు వివరణ** – ముండకోపనిషత్తులో మూడు అధ్యాయాలు ఉన్నాయి. ఒక్కొక్క అధ్యాయంలో రెండేసి ఖండాలు ఉన్నాయి. అన్నీ కలిపి 65 మంత్రాలు ఉన్నాయి. వెరసి మూడు అధ్యాయాలు, ఆరు ఖండాలు, 65 మంత్రాలు ఉన్నాయి. ఇక్కడ అధ్యాయాన్ని ముండకం అని అంటారు. ఖండానికి ఖండం అనే పేరు వస్తుంది.

**శాంతిపాఠం** – ఏ వేదానికి చెందిన ఉపనిషత్తుకు దానికి సంబంధించిన శాంతిపాఠం ఉంటుంది. ముండకోపనిషత్తు అథర్వణ వేదానికి చెందినది. మనం ఇప్పుడు అధ్యయనం చేయబోయే 10 ఉపనిషత్తుల్లో మూడు అథర్వణ వేదానికే చెందుతాయి. అవి ముండకోపనిషత్, మాండూక్యోపనిషత్, ప్రశ్నోపనిషత్. ఇవి కాక మనం ఈ పదిలో లేకపోయినా గురువులు

చిన్మయానంద స్వామీజీకీ, దయానంద స్వామీజీకి ఇష్టం కాబట్టి, అది కూడా ఒక సంపూర్ణమైన ఉపనిషత్తు కాబట్టి, దాని సారం కూడా మనం నేర్చుకుంటాము. అందువల్లనే ఈ అధ్యయనాన్ని ఏకాదశ ఉపనిషత్తుల సారం అంటున్నాము. ఇది కూడా అథర్వణ వేదానికి చెందినదే. ఈ నాలుగు ఉపనిషత్తులకూ శాంతిపాఠం – భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః

## శాంతిపాఠం

**ఓం భద్రం కర్ణేభిఃశృణుయామ దేవాః భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః।**
**స్థిరైరంగైస్తుష్టువాగ్ం సస్తనూభిర్వ్యశేమ దేవహితం యదాయుః।**
**స్వస్తి న ఇన్ద్రో వృద్ధశ్రవాః। స్వస్తి నః పూషా విశ్వవేదాః।**
**స్వస్తి నస్తార్క్ష్యో అరిష్టనేమిః। స్వస్తి నో బృహస్పతిర్దధాతు॥**
**ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

ఒక పని విజయవంతమవ్వాలంటే దానికి మూడు అంశాలు తోడ్పడాలి. ప్రయత్నం–కాలం–దైవం. ప్రయత్నం అంటే మనం అనుకున్నపనిని వీడకుండా అంకితభావంతో ప్రయత్నం చేయటం. కొంతమందికి ఆరంభశూరత్వం ఉంటుంది. వారు చాలా ఉత్సాహంతో మొదలు పెడతారు గాని, ఒక్క ఎదురుదెబ్బతగిలినా చతికిలపడిపోతారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా ముందుకు దూసుకుపోయేలా ఉండాలి. కాలం అంటే సమయం. ఏ పని కూడా రాత్రికి రాత్రి అయిపోదు. దానికి కొంత సమయం వెచ్చించాలి. ఫలితానికి కొంతకాలం వేచి ఉండాలి. మూడోది దైవానుకూలం. మనకు ఎదురయ్యే ఆటంకాలను మనం ఊహించలేము. వాటిని అడ్డుకునే శక్తి లేదు. దీన్ని కర్మ అనీ, అదృష్టం అనీ, దైవానుగ్రహం అనీ అంటారు. ఈ దైవానుగ్రహంకోసం చేసే ప్రార్థన ఈ శాంతిపాఠం.

మానవ ప్రయత్నమూ, ఈశ్వరానుగ్రహమూ రెండూ ఉండాలి. ఈశ్వరానుగ్రహం లేకపోతే ఎంత ప్రయత్నం చేసినా విజయం పొందలేము. అలాగని ఈశ్వరానుగ్రహం చాలని వదిలేసినా చాలదు. ఈశ్వరానుగ్రహం సమృద్ధిగా ఉంది, సూర్యరశ్మి సమృద్ధిగా ఉన్నట్టుగా. అది కూడా మన చుట్టూ ఉంది. దాన్ని మనం తెలుసుకుని, వినియోగించుకోవాలి.

ఉపనిషత్తు నేర్చుకునే విద్యార్థులు శాంతిపాఠం రెండు కారణాల కోసం పఠిస్తారు. అవి – శారీరక ఆరోగ్యం, ఆటంకాలు తొలగటం.

**1. శారీరక ఆరోగ్యం–** ఉపనిషత్తులు నేర్చుకోవటానికి కొన్ని సంవత్సరాలు పడుతుంది. అందుకని శారీరక ఆరోగ్యంకోసం ప్రార్థన చేస్తారు. ఎక్కడో జరిగే క్లాసుకు వెళ్ళాలి. గంట కూర్చోవాలి.

**మనసు** – మనసు బాగుండకపోతే, శరీరం సహకరించినా గురువు బోధ ఎక్కదు.

**బుద్ధి** – ఉపనిషత్తు నేర్చుకోవటం అంటే మామూలు విషయం కాదు. దానికి సూక్ష్మబుద్ధి ఉండాలి. క్షురకుని కత్తి అంత పదునుగా ఉండాలని యమధర్మరాజే స్వయంగా చెప్తాడు. ఇందులో తర్కం చాలా ఉంటుంది. అది అర్థం కావాలి.

**ఇంద్రియాలు** – చెవులు బాగా పనిచేయాలి. గురువు చెప్పేది ఒకటి, మనం వినేది ఒకటి అయితే అర్థం మారిపోతుంది. గురువు నువ్వు ఇమ్మోర్టల్ (శాశ్వతం) అంటే నువ్వు ఇమ్మోరల్ (అనైతికం) అని వింటే ప్రమాదం.

అందుకని శరీరం,మనసు,బుద్ధి, ఇంద్రియాలు బాగుండాలని కోరుకుంటాము. మన ప్రారబ్ధకర్మని తొలగించమనటం లేదు, మనం ముండకోపనిషత్తు నేర్చుకునే ఆ గంటా మన బాధలను కొంచెం ఆపమని కోరుకుంటున్నాము.

**2. ఆటంకాలు** – మనకు కలిగే ఆటంకాలను త్రివిధ ప్రతిబంధకాలు అంటారు. వాటి నివృత్తికోసం ప్రార్థన చేస్తున్నాము. అవి –

**ఆధిదైవిక** – ప్రకృతి వైపరీత్యాలు – వానలు, వరదలులాంటివి. వాటిమీద మనకేమీ అధికారం లేదు.

**ఆధిభౌతిక** – మన తోటి మనుష్యులవల్ల కలిగే ఆటంకాలు. సరిగ్గా మనం ఉపనిషత్తు క్లాసుకి బయల్దేరేముందు ఏ చుట్టమో వస్తే వారిని కాదని వెళ్ళలేము  కాని కొంతవరకూ మనం దీన్ని అదుపులో పెట్టగలము. మన ఇంటికి తరచుగా వచ్చే బంధువులకు నేను బుధ,గురువారాల్లో 10 నుంచి 12 వరకూ ఉండను, ఆధ్యాత్మిక ప్రసంగాలకు వెళతాను, దయచేసి ఆ సమయంలో తప్ప వేరే ఎప్పుడైనా రండి అని వారికి ముందే చెప్పుకోగలం.

**ఆధ్యాత్మికం** – మనకు మనమే పెద్ద ఆటంకం. మూడు అడుగులు ముందుకు వేద్దామనుకుంటే, ఆరు అడుగులు వెనక్కి లాగుతుంది మనసు. అమ్మో, ఆత్మవిద్యా! నాకేం వస్తుంది అనుకుంటాం. దీన్ని చాలామటుకు అదుపులో పెట్టగలం. మన మనసును మనమే నియంత్రించుకోవాలి. ఇదీ శాంతిపాఠం సారాంశం. ఇప్పుడు ముండక ఉపనిషత్తుకు ఉన్న శాంతిపాఠాన్ని చూద్దాము.

**భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః** – భద్రం అంటే సర్వమంగళస్వరూపం. బ్రహ్మ మంగళానాం మంగళం. ఆ బ్రహ్మ గురించి శ్రద్ధగా వినగలుగుగాక. ఒకచెవితో విని ఇంకో చెవితో వదిలేసేలా ఉండకూడదు. ఇది మోక్షాన్నిచ్చే శాస్త్రం. దేవాః అంటే మన ఇంద్రియాలకు అధిష్టాన దేవతలను ప్రార్థిస్తున్నాము. ఉదాహరణకు కన్నుకు అధిష్ఠానదేవత సూర్యుడు.

**భద్రం పశ్యేమ అక్షభిః యజత్రాః –** యజత్రా అన్నా కూడా దేవతే. ఆ మంగళ రూపాన్ని కంటితో చూడనీ. బ్రహ్మ నిజానికి ఇంద్రియ అగోచరం, కాని బ్రహ్మ గురించి చెప్పే ఆచార్యుని మీద దృష్టి నిలిపి, చెవితో శ్రద్ధగా వినాలి. అంటే  కళ్ళు, చెవులు సహకరించాలని కోరుతున్నాము.

ఇంకా సూక్ష్మమైన అర్థం ఉంది. కన్ను చూసేదానికన్నా ఎక్కువగా బుద్ధితో అర్థం చేసుకునేలా చేయి. ఈశావాస్య మిదం సర్వం – అంతటా ఈశ్వరుడే ఉన్నాడు అన్న బుద్ధితో జగత్‌ని చూసేలాగా చేయి.

**స్థిరైః అంగైః తుష్టువాగ్ం సస్తనూభిః –** సస్తనూభిః అంటే దేవతలని అనేక సూక్తుల ద్వారా ప్రార్థించనీ. దేవతాప్రార్థన ద్వారా పుణ్యం పెరిగి, బ్రహ్మవిద్య బోధని పొందనీ. ఆ ప్రార్థన చేయటానికి ఆరోగ్యకరమైన అంగాలనియ్యి.

**దేవహితం యదాయుః వ్యశేమ –** దేవుడిచ్చిన పూర్ణాయుష్షుని అనుభవించనీ. అపమృత్యుపాలు పడకుండా చేయి. ఎందుకు? ఈ విద్య నేర్చుకోవటానికి ఎన్నో ఏళ్ళు కావాలి. శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా నేర్చుకుంటాము. శ్రవణం అంటేనే ఎంతోకాలం, క్రమపద్ధతిలో, ఒక సమర్థవంతమైన గురువు దగ్గర నేర్చుకోవటం. కనీసం ఆరు ఉపనిషత్తులు నేర్చుకోవాలి. దేవుడిచ్చిన ఆయుష్షు అంటే ఆయనిష్ట ప్రకారం ఇచ్చినది అని కాదు అర్థం, మన కర్మఫలం వల్ల మనకు దేవుడు నిర్దేశించిన ఆయుష్షు. దాన్ని పరిపూర్ణంగా అనుభవించనీ.

**స్వస్తి నః ఇంద్రో వృద్ధశ్రవాః –** కొందరు శక్తివంతమైన దేవతలు ఉన్నారు. వారిలో వృద్ధశ్రవాః అంటే చాలా పేరున్న దేవత – ఇంద్రుడు. నః – ఆయన మాకు స్వస్తి – మేలు చేయుగాక.

**స్వస్తి నః పూషా విశ్వవేదాః –** పూషా అంటే సూర్యదేవత. మన పోషణ కర్త సూర్యుడు. పోషణకర్త ఎలా అయ్యాడు? సూర్యుడి కిరణజన్య సంయోగక్రియ వల్ల చెట్లలో పిండిపదార్థాలు తయారవుతాయి. ఆ విధంగా ఆహారం ఉత్పత్తి అవుతోంది. అందుకే సూర్య నమస్కారాలు చేయటం, ఆదిత్య హృదయం చదవటం చేస్తారు. ఆయన విశ్వస్య వేదా – ఆయన సర్వజ్ఞుడు. ఈశ్వరుణ్ణి సూర్యుని రూపంలో కొలుస్తున్నాము. అన్నీ తెలిసిన సూర్యుడిని కొలిస్తే మనకీ జ్ఞానం కలుగుతుందని ఆశ. ఈశ్వరుడిని అర్థం చేసుకునేలా బుద్ధి ప్రకాశం చేయి.

**స్వస్తి నః తార్క్ష్యః అరిష్టనేమిః –** తార్క్ష్యః – గరుత్మంతుడు. ఇప్పుడు ఈశ్వరుణ్ణి గరుత్మంతుని రూపంలో కొలుస్తున్నాము. అరిష్టనేమి – ఆయన కదిలికని ఎవరూ ఆపలేరు. నా ఆధ్యాత్మిక ప్రయాణం కూడా ఆటంకం లేకుండా చేయి.

**స్వస్తి నః బృహస్పతిః దధాతు –** నాలుగో దేవతగా బృహస్పతిని కొలుస్తున్నాము. ఇంద్రదేవుని ముందు కొలిచాము. ఆ ఇంద్రునికి గురువు బృహస్పతి. గురువులకే గురువు అయిన

బృహస్పతిని వాక్పతి అని, బుద్ధికి బృహస్పతి అనీ అంటారు. అందుకని నా బుద్ధిని పదునుగా చేసి నేను అర్థం చేసుకునేలా చేయి.

**ఓం శాంతిః శాంతిః శాంతిః** – త్రివిధ ప్రతిబంధాల నుంచి నన్ను నివృత్తుని చేయి. ఆధిదైవిక, ఆధిభౌతిక, ఆధ్యాత్మిక ఆటంకాలను తొలగించు.

శాంతికి ఇంకో అర్థం కూడా ఉంది. మనం ప్రారబ్ధకర్మతో అవస్థపడుతున్నప్పుడు, ప్రాయశ్చిత్త కర్మల ద్వారా దాని చెడు ఫలితాలని తగ్గించుకోవటానికి ప్రయత్నిస్తాము. దీన్ని శాంతి కర్మ అంటారు. అది కర్మ అవచ్చు, ప్రార్థన అవచ్చు. ఇక్కడ శాంతి ప్రార్థన ఆటంకాలని తొలగించటానికి చేస్తాము. శాంతిపాఠం అంటే గట్టిగా చదవాల్సి ఉంటుంది.

చిన్మయానంద స్వామి చలోక్తిగా ఈ ఓం శాంతిః శాంతిః శాంతిః మూడు రకాలుగా పలకాలని చెబుతారు. మొదటి శాంతి ఆధిదైవిక ఆటంక నివృత్తి కోసం కాబట్టి ఎక్కువ గట్టిగాను, రెండోది తోటిమానవులకు వర్తిస్తుంది కాబట్టి గట్టిగాను, మూడోది మన మనసుకు చెప్పేది కాబట్టి చాలా చిన్న గొంతుతోనూ చెప్పాలంటారు.

మనం శాంతిపాఠం పఠించి మన ప్రతిబంధకాలకు తాత్కాలికంగా స్టే ఆర్డర్ తెచ్చుకున్నాం. కాబట్టి ఇంక ఉపనిషత్తులోకి అడుగుపెడదాము.

ఇప్పుడు మొదటి అధ్యాయాన్ని చూద్దాము. ఇందులో అధ్యాయాన్ని ముండకం అంటారు. మొదటి అధ్యాయంలో రెండు ఖండాలు ఉన్నాయి. మొదటి ఖండాన్ని ప్రధానంగా రెండు అంశాలుగా విభజించవచ్చు. ఇందులో 9 మంత్రాలు ఉన్నాయి.

### ముండకం – 1 ఖండం – 1

1. అవతారిక – మంత్రాలు 1–3
2. బ్రహ్మవిద్యా సంక్షేపం – మంత్రాలు 4–9

1) **అవతారిక – మంత్రాలు 1–3** – అవతారిక అంటే ఉపోద్ఘాతం.

**మంత్రం – 1**

**ఓం బ్రహ్మా దేవానాం ప్రథమః సంబభూవ**
**విశ్వస్య కర్తా భువనస్య గోప్తా।**
**స బ్రహ్మవిద్యాం సర్వవిద్యాప్రతిష్ఠామ్**
**అథర్వాయ జ్యేష్ఠపుత్రాయ ప్రాహ॥**

దేవతలలో బ్రహ్మదేవుడు మొదట ఉద్భవించాడు. ఆయన జగత్తుకు సృష్టికర్తా, స్థితికారకుడు. అన్ని జ్ఞానాలకు ఆధారమైన బ్రహ్మవిద్యను తన జ్యేష్ఠపుత్రుడైన అథర్వునకు బోధించాడు.

మొదటి మూడు మంత్రాలలో ఆత్మజ్ఞానస్తుతి జరుగుతుంది. దాన్ని బ్రహ్మవిద్య అంటారని ఈ మంత్రంలో తెలుసుకుంటాము. ముందే దాని గొప్పతనం తెలిస్తే మనకు దానిమీద శ్రద్ధపుడుతుంది కదా! ఇదికూడా ఒక ప్రకటనలాంటిదే! కాని ఇది మనం రోజూ చూసే ప్రకటనలలాంటిది కాదు.

మన లౌకిక ప్రకటనలలో నిజం తక్కువా, అతిశయోక్తి ఎక్కువా ఉంటాయి. కాని ఇక్కడ అతిశయోక్తి ఏమాత్రం లేదు. ఈ విద్య ఎందుకు గొప్పదంటే ఇది సాక్షాత్తూ ఆ భగవానుని నుంచి వచ్చింది. అపౌరుషేయం. మన ప్రార్థన శ్లోకంలోనే ఉంది కదా! 'సదాశివ సమారంభాం' సాక్షాత్తూ భగవానుడే ఆదిగురువు కాబట్టి, ఆయన సర్వజ్ఞుడు కాబట్టి అది నిర్దిష్ట ప్రమాణం, లోటుపాట్లు లేని విద్య, కాలానికి అతీతమైనది, నిశ్చయఫలప్రదమైనది.

ఇంకో కారణం ఇది బ్రహ్మవిద్య. బోధించేది నిత్య, ముక్త, శుద్ధ, సర్వవ్యాపక బ్రహ్మ గురించి. అందుకని కూడా అది గొప్పది.

కొన్ని ఉపనిషత్తులు కథద్వారా మొదలవుతాయి. ఉదాహరణకు కఠోపనిషత్తులో నచికేతుని కథ ఉంటుంది. ఆ కథ ద్వారా మనకు గురుస్తుతి, శిష్యస్తుతి, శాస్త్రస్తుతి వస్తాయి. మనం కథ నిజానిజాల లోతుల్లోకి వెళ్ళకుండా, ఈ మూడు అంశాలనీ గ్రహించాలి. ఈ మూడు మంత్రాలలో గురుశిష్యుల పరంపరను చూస్తాము. ఈ మంత్రం ద్వారా ఇది దైవబోధ అనీ, సంప్రదాయ పద్ధతిలో గురువునుంచి శిష్యులకు వచ్చిందనీ చెబుతోంది ఉపనిషత్తు. ఆదిగురువు మాట చెప్పలేదు. అది గ్రహించుకోవాలి. విష్ణుమూర్తి అన్నా శివుడు అన్నా ఆయన ప్రథమ గురువు. ఆయనతో కలిపి ఏడుగురు గురువుల పేర్లు వస్తాయి. వారి పేర్లు వరుసగా 1. భగవంతుడు 2. చతుర్ముఖబ్రహ్మ 3. అథర్వుడు 4. అంగిరుడు 5. భారద్వాజుడు 6. అంగిరసుడు (ముందు అంగిరుడు) 7. శౌనకుడు. ముండక ఉపనిషత్తు అంగిరసుడు, శౌనకుల మధ్య జరిగే సంవాదాన్ని చెబుతుంది. ప్రతి గురువూ శ్రేష్ఠమైన గురువని చెబుతోంది ఉపనిషత్తు.

**బ్రహ్మా దేవానాం ప్రథమః సంబభూవ** – ఆదిగురువు గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. రెండోగురువు బ్రహ్మదేవుడు. బ్రహ్మా అని దీర్ఘం తీస్తే బ్రహ్మదేవుడు లేదా చతుర్ముఖ బ్రహ్మ. బ్రహ్మ అంటే నిర్గుణ చైతన్యం. సచ్చిదానంద పరమాత్మ. బ్రహ్మదేవుడు దేవతలలో మొదట ఉద్భవించాడు. మన పురాణాల్లో ఆయన విష్ణుమూర్తి నాభినుంచి ఉద్భవించినట్లు చూస్తాము కదా.

**యో బ్రహ్మాణం విదధాతి పూర్వం। - శాంతి మంత్రం**

విష్ణుమూర్తి బ్రహ్మదేవుని సృష్టించి, ఆయనకు సృష్టికార్యము అప్పచెప్పాడు.

**విశ్వస్య కర్తా, భువనస్య గోప్తా** - మనం బ్రహ్మ సృష్టికర్తా, విష్ణుమూర్తి స్థితికారకుడూ, శివుడు లయకారకుడూ అని వ్యవహరిస్తాము కానీ నిజానికి ముగ్గురూ ఒకటే. అందుకే ఇక్కడ బ్రహ్మను సృష్టికర్తా ఆయనే, స్థితికర్తా ఆయనే అన్నారు. లయకారకుడు కూడా ఆయనే అని కలుపుకోవాలి. ఆయన సర్వజ్ఞుడు కాకపోతే సృష్టికార్యం చేయలేడు. చతుర్ముఖబ్రహ్మ ఆయన. ఆయన నాలుగు ముఖాలూ నాలుగు వేదాలకు ప్రతీక.

**స బ్రహ్మవిద్యాం ప్రాహ** - ఈ బ్రహ్మ, బ్రహ్మవిద్యను బోధించాడు - ఆత్మజ్ఞానాన్ని బ్రహ్మవిద్య అని ఎందుకన్నారు? దానికి రెండు కారణాలు -

1. చతుర్ముఖబ్రహ్మ బోధించాడు కాబట్టి
2. నిర్గుణబ్రహ్మ గురించి బోధించాడు కాబట్టి

అంటే సగుణబ్రహ్మ నిర్గుణబ్రహ్మ గురించి బోధ చేసాడు.

**సర్వవిద్యాప్రతిష్ఠామ్** - అన్ని జ్ఞానాలకూ ఆధారం ఈ బ్రహ్మ విద్య. సర్వవిద్యా ప్రతిష్ఠామ్ అన్నది బ్రహ్మవిద్యకు విశేషణం. తక్కిన విద్యలు మోక్షం ఇవ్వవు. ఇది ఒక్కటే ఇస్తుంది. తక్కిన విద్యలలో ఎంత ఎక్కువ తెలిస్తే, అంత తక్కువగా మనకు తెలుసని తెలుస్తుంది. ఒక విషయం పరిపూర్ణంగా తెలుసని చెప్పలేము.

మిగతా విద్యలు భాగాల్లో లభిస్తే, ఇది పరిపూర్ణజ్ఞానం. లౌకిక విద్య మనకు తెలిసింది చాలా తక్కువ అనిపింపజేస్తే, ఆధ్యాత్మిక విద్య మనకు తెలిసింది చాలా ఎక్కువ అనిపింపజేయదు, మనం అనంతం అని బోధిస్తుంది.

**అథర్వాయ జ్యేష్ఠపుత్రాయ ప్రాహ** - ప్రాహ అంటే చెప్పి వదిలేయలేదు. అర్థమయ్యేవరకూ చెప్పాడు అని అర్థం వస్తుంది. అది కూడా ఎవరికి చెప్పాడు? తన పెద్దకొడుకైన అథర్వునికి చెప్పాడు. ఇలా తండ్రి తన కొడుకుకు విద్య బోధించటం మరికొన్ని ఉపనిషత్తులలో కూడా చూస్తాము. తైత్తిరీయ ఉపనిషత్తులో వరుణుడు తన పుత్రుడు భృగుమహర్షికి, ఛాందోగ్య ఉపనిషత్తులో ఉద్దాలకుడు తన పుత్రుడు శ్వేతకేతునకు చెబుతాడు. కొడుకుకు అదీ జ్యేష్ఠపుత్రునికి చెప్పాడంటే, ఆ విద్య పరిపూర్ణంగా చెప్పాడని అర్థం. మామూలుగా గురువు బోధిస్తే కొంత పక్షపాతం ఉండవచ్చు లేదా గురువుని మించిన శిష్యుడవకూడదని కొంత దాచుకుని చెప్పవచ్చు. కాని స్వయంగా తన పుత్రునికే చెపితే అలా జరగదు. మనకు ఒక విద్య తెలిసి చెప్పకపోతే బ్రహ్మరాక్షసులుగా పుడతాం అంటారు.

మహాగృహస్థుడైన శౌనకుడు శాస్త్రోక్తరీత్యా అంగిరసుని సమీపించి అడిగాడు, 'ఓ భగవంతుడా! ఏ ఒక్కదానిని గురించి తెలుసుకుంటే ఈ సమస్తమూ తెలుసుకోబడుతుంది?' అని అడిగాడు.

ఇంతవరకూ పరంపర ఏర్పడింది. రెండవ మంత్రంలో శిష్యుడు గురువు దగ్గరికి ఎలా వెళ్ళాలి అన్నది తెలుస్తుంది. ఈ వివరణ ద్వారా కొన్ని సత్యాలు చెప్పకనే చెబుతున్నది ఉపనిషత్తు.

**అంగిరసం ఉపసన్నః** – వేదాంతం స్వంతంగా చదవకూడదు. గురువు ముఖతః నేర్చుకోవాలి. పురాణాల్లో కూడా అంతరార్థం ఉంటుంది. రాముడు ఎవరో అన్న మాటని పట్టుకుని సీతని అడవుల్లో వదిలేయటమేమిటి, భార్యమీద ప్రేమ లేదా అనుకుంటాం. రాముడు సీతను వదిలేసిన ఘట్టంలో రాముని రాజుగా చూడాలి. అతనిలోని భర్తను చూడాలంటే అరణ్యకాండకి వెళ్ళాలి. చెట్టుకీ, పుట్టకీ చెప్పుకుని విలవిలా ఏడ్చిన రాముడు అక్కడ కనబడుతాడు.

ధర్మశాస్త్రాన్ని ఎలా అర్థం చేసుకోవాలో చెప్పేందుకు మీమాంసశాస్త్రం ఉంది. బ్రహ్మసూత్రాల్లో 4 అధ్యాయాలు ఉంటే ధర్మసూత్రాల్లో 12 అధ్యాయాలు ఉన్నాయి. జైమిని మహర్షి రచించారు దాన్ని. అందుకే గురువు ఆవశ్యకత ఉందని ముండకం ముందే చెప్తోంది.

**విధివత్** – శిష్యుడు ఎంత గొప్పవాడైనా సరే తానే గురువు దగ్గరకి వెళ్ళాలి. 'విధివత్' అన్నమాట దాన్ని సూచిస్తుంది. తరువాత మంత్రాల్లో సమిధలు చేతపుచ్చుకుని వెళ్ళాలని, సాష్టాంగ నమస్కారం చెయ్యాలని, ప్రశ్నలు వేసి విద్యను పొందాలని వస్తుంది.

**ఉపసన్న** – అతను గురువు దగ్గరికి తానే వెళ్ళాడు. వాహనం పంపిస్తాను రమ్మనలేదు. అది కూడా 'విధివత్' వెళ్ళాడు. శాస్త్రనియమం ప్రకారం వెళ్ళాడు. గురువు, దైవం, రాజుల దగ్గరికి రిక్తహస్తాలతో వెళ్ళకూడదంటారు. గురువు దగ్గరికి సమిధలు తీసుకుని వెళ్ళాలి. సమిధలు ఎందుకంటే ఆ గురువు యజ్ఞం చేసేవాడయితే, సమిధలు వెతుక్కోవటంకోసం సమయం వృథాపరచుకోనవసరం లేదు. అందులో గూడార్థాలు కూడా ఉన్నాయి.

నేను కావలసినన్ని యజ్ఞాలు చేసాను. ఇప్పుడు జ్ఞానకాండకి సిద్ధం. సమిధ అంటే ఎండుపుల్ల. అది నిప్పురవ్వ తగలగానే భగ్గున మండుతుంది. నేను వైరాగ్యంలో ఉన్నాను. జ్ఞాన అగ్ని రగిలిస్తే, వెంటనే పట్టుకుంటాను.

తరువాత సాష్టాంగ నమస్కారం చేయాలి.

**శౌనకో హ వై మహాశాలః** – వెళ్ళిన శిష్యుడెవరు? శౌనక ఋషి. నైమిశారణ్యంలో శుకమహాముని దగ్గర శౌనకాదిఋషులు భాగవతకథలు, పురాణాలు శ్రవణం చేస్తారు. అతనికి మహాశాల అన్న విశేషణం వాడింది. మహాశాల అంటే పెద్ద యజ్ఞశాల లేదా

అన్నశాల ఉందని అర్థం. అంటే అతను ఎన్నో యజ్ఞయాగాదులు చేసాడు. అంటే కర్మయోగం చేసాడు. గృహస్థుగా తన ధర్మం నెరవేర్చి, గోదానం, భూదానం, ధనదానం, అన్నదానంలాంటి దానాలు చేసాడు. అంటే పంచమహాయజ్ఞాలు చేసాడన్నమాట. ఋషియజ్ఞం, దేవయజ్ఞం, పితృయజ్ఞం, మనుష్యయజ్ఞం, భూతయజ్ఞం, ఈ ఐదింటినీ కలిపి పంచమహాయజ్ఞాలంటారు. అంటే ఋషులు ఇచ్చిన వేదాలను గౌరవించటం, దేవుడిని పూజించటం, పితృదేవతలకు తర్పణాలొదలటం, తోటి మానవులకు దానాలు చేయటం, జంతువులను దయగా చూడటం. ఇవి చేయటంవల్ల సాధన చతుష్టయ సంపన్నుడయి చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత పొంది జ్ఞానమార్గానికి అర్హుడయ్యాడని ఈ ఒక్కమాట చెబుతోంది. హ వై అన్నపదాలు నొక్కి చెబుతున్నాయి ఈ మాటని.

**కస్మిన్ను భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతీతి।**

ప్రశ్న అడగాలి. ఇక్కడ అతను అడిగిన ప్రశ్న చూసేముందు మనకొక ప్రశ్న రావచ్చు. అందుకని దానికి పూజ్యస్వామీజీ జవాబు చెబుతారు. శౌనకుడు గురుపరంపరలో ఏడవ వ్యక్తి. అతని గురించి చెప్పినప్పుడు 'విధివత్' అన్నది కదా ఉపనిషత్తు. అంటే తక్కినవారు వెళ్ళలేదా?

దీనికి జవాబుని దేహళీదీపన్యాయం అంటారు. దేహళీ అంటే గుమ్మం. బయట గుమ్మంమీద పెట్టిన దీపకాంతి ఇటు ఇంటిలోపలికీ, అటు ఇంటి బయటకీ ప్రసరిస్తుంది. అలాగే శౌనకుడు శాస్త్రప్రకారం వెళ్ళాడంటే ఆ ముందు వారు వెళ్ళారు, తక్కినవాళ్ళూ అలా వెళ్ళాలి అని అర్థం.

మొదటి రెండు మంత్రాలు గురుపరంపర సాంప్రదాయాన్ని నొక్కివక్కాణిస్తే ఈ మంత్రం శిష్యుని లక్షణాలను చెబుతోంది.

హే భగవంతుడా**! ఏ విషయము తెలిసినట్లైతే, ఇక్కడ సర్వమూ అవగతమౌతుందో, అది తెలియజేయండి.**

ఈ ప్రశ్న చాలా ముఖ్యం. ప్రశ్ననిబట్టి జవాబు వస్తుంది. పూజ్యస్వామీజీ అడుగడుగునా ఈ ప్రశ్నని గుర్తుచేస్తూ ఉంటారు. మనం కనీసం ముండకోపనిషత్తు ముగించేవరకన్నా దీన్ని గుర్తు పెట్టుకోవాలి.

ఇప్పుడు లౌకిక విద్యలో కూడా TOE – Theory Of Everything అంటున్నారు. సృష్టికర్త ఎవరు అనే అంశాన్ని పరిశోధిస్తున్నారు. ఏకవిజ్ఞానేన సర్వవిజ్ఞానం భవతి అనే వాక్యాన్ని అనువదిస్తే, సృష్టి కారణం ఎవరని వస్తుంది. కనిపించే జగత్తు వెనక ఉన్న సత్యం ఏమిటి?

ఇంకొక అర్థం, ఉన్న సత్యం ఒకటే, రెండో సత్యం లేదు లేదు.

**కార్యకారణాల ముఖ్య లక్షణాలు**

1. **కారణం ఏకం** – మట్టి ఒకటే. దాన్నుంచి అనేక నామరూపాలు వస్తాయి. కుండ, కూజా, ప్రమిద, తులసికోట, వగైరా అంటే కారణం ఏకం, కార్యం అనేకం.

2. **కారణం నిత్యం** – మట్టి ముద్దనుంచి కుండ ఏర్పడగానే, దానికొక పుట్టినరోజు ఉంటుంది. మనం మందులు కొన్నప్పుడు చూస్తే వాటిమీద డేట్ ఆఫ్ మాన్యుఫాక్చర్, డేట్ ఆఫ్ ఎక్స్‌పైరీ ఉంటాయి. డేట్ ఆఫ్ ఎక్స్‌పైరీ చూడకుండా మనం మందులు వేసుకుంటే, మనం ఎక్స్‌పైర్ అయ్యే ప్రమాదం ఉంది. అలా కుండ కూడా విరిగిపోయే ప్రమాదం ఉంది. కాని మట్టి చూస్తే కుండ పుట్టకముందూ ఉంది, కుండలోనూ ఉంది, కుండ విరిగిపోయాకా ఉంటుంది. నిత్యం అంటే మూడుకాలాల్లోనూ ఉండేది. **త్రికాలేఽపి తిష్ఠతి.**అంటే కారణం నిత్యం, కార్యం అనిత్యం.

3. **కారణం సారం** – కుండ బరువెంత? అది చూడ్డానికి బరువుగా కనిపించినా నిజానికి ఆ బరువు దానిది కాదు. మరి దేనిది? అది తయారవటానికి మూలకారణమయిన మట్టిది. మన బంగారు గాజులు కొనుక్కొని ఎవరికైనా చూపిస్తే వారేం అడుగుతారు? ఎంత బంగారం పడింది, అంటే బంగారం బరువెంత అంటారు. అంటే కుండలో అంతటా ఉన్నది మట్టే. గాజులో అంతటా ఉన్నది బంగారమే. దాన్నే సారం అంటారు. అందుకని నామ, రూపాలు మాత్రమే కార్యానికి ఉన్నాయి కాని సారం లేదు. అంటే కారణం సారం, కార్యం అసారం.

4. **కారణం సత్యం** – కుండ ఉంది అంటే దాని ఉనికి దేనిది? మట్టిది. గాజులు ఉన్నాయి అంటే వాటి ఉనికి దేనిది? బంగారంది. మట్టి లేకపోతే, కుండ లేదు. బంగారం లేకపోతే గాజులు లేవు. కాని ఇటునుంచి చూస్తే కుండలేకపోయినా మట్టి ఉంది, గాజులు లేకపోయినా బంగారం ఉంది. అంటే కారణం లేకపోతే కార్యం లేదు, కాని కార్యం లేకపోయినా కారణం ఉంది. అలా దేనికి విడిగా ఉనికి ఉంటుందో దాన్ని సత్యం అనీ, స్వతంత్రంగా ఉనికి లేని దాన్ని మిథ్య అనీ అంటారు. ఇక్కడ అసత్యం అందాం. అంటే కారణం సత్యం, కార్యం అసత్యం. సత్యం అంటే స్వతంత్రంగా ఉనికి ఉన్నది.

ఇప్పుడు పై వివరణని క్రోడీకరించి చూస్తే –

**కారణం – ఏకం, నిత్యం, సారం, సత్యం**
**కార్యం – అనేకం, అనిత్యం, అసారం, అసత్యం.**

ఈ లక్షణాలు బాగా గుర్తుపెట్టుకోవాలి. ఇప్పుడు వీటిని జగత్తుకు, బ్రహ్మకు అన్వయిద్దాము.

| **జగత్తు** | | **బ్రహ్మ** |
|---|---|---|
| అనేకం | – అనేక నామరూపాల ప్రపంచం | ఏకం |
| అనిత్యం | – ఆ నామరూపాలకు జనన, మరణాలు ఉన్నాయి | నిత్యం |
| అసారం | – ప్రపంచం సారం లేనిది | సారం |
| అసత్యం | – విడిగా ఉనికి లేదు | సత్యం |

ఈ బాహ్యప్రపంచం మనకు ఆనందం ఇస్తుంది అనుకుంటాము. కాని అది అసారం. దీనికి ఆధారం బ్రహ్మ. ప్రపంచం అసత్యం. బ్రహ్మ లేకుండా దానికి ఉనికి లేదు.

ప్రపంచం అందంగా ఉండవచ్చు. నూతనంగా ఉండవచ్చు. అనేకరకాల వస్తువులతో నిండి ఉండవచ్చు కాని దానికి శాశ్వతత్వం లేదు. శాశ్వతత్వం లేనిచోట భద్రత లేదు. ఈ రెండూ లేనిచోట శాంతి లేదు. శాంతి లేని చోట ఆనందం లేదు. మనం తాపత్రయపడేది మూడింటికోసం. **శాంతి, ఆనందం, భద్రత.** వాటిని టూకీగా పిహెచ్ఎస్ (పీస్, హ్యాపీనెస్, సెక్యూరిటీ) అందాము.

ఈ పిహెచ్ఎస్ కావాలంటే బ్రహ్మవిద్య పొందాలి. అది పొందితే ప్రపంచాన్ని ఆటవస్తువుగా భావించి దానితో ఆడుకుంటాము. కాని పిహెచ్ఎస్ ప్రపంచంనుంచి కోరము. ఇదీ ముండకోపనిషత్తు సారాంశం.

### 2) బ్రహ్మవిద్యా సంక్షేపం – మంత్రాలు 4–9

బ్రహ్మవిద్యా బోధ వార్తలు చదివే పద్ధతిలో సాగుతుంది. వార్తలు చదివేటప్పుడు మూడు దశల్లో చదువుతారు.

వార్తలు చదివే ముందు ముఖ్యాంశాలు

వార్తలు విశదీకరిస్తారు

వార్తలు ముగించే ముందు మళ్ళీ ఒకసారి ముఖ్యాంశాలు.

ఇదే పద్ధతిని బ్రహ్మవిద్యలోనూ, గీతాబోధలోనూ చూస్తాము. ముఖ్యాంశాలను – సంక్షేపం అనీ, విశదీకరణను విస్తారం అనీ, మళ్ళీ ముఖ్యాంశాలను సంక్షేపం అనీ అంటారు. మొదటి సంక్షేపం ఉపోద్ఘాతం అయితే, రెండో సంక్షేపం ఉపసంహారం అవుతుంది. అంతే భేదం.

ఇప్పుడు ఈ మంత్రాల్లో బ్రహ్మవిద్యా సంక్షేపం చూస్తాము. ఇందులో బ్రహ్మ నిర్వచనం రెండు రకాలుగా చూస్తాము. వాటిని సాంకేతికంగా చెబితే – స్వరూపలక్షణం, రెండవది తటస్థలక్షణం.

**మంత్రం - 6**

**యత్ తదద్రేశ్యమ్ అగ్రాహ్యమ్ అగోత్రమ్ అవర్ణమ్**
**అచక్షుః శ్రోత్రం తదపాణిపాదమ్।**
**నిత్యం విభుం సర్వగతం సుసూక్ష్మం**
**తదవ్యయం యద్భూతయోనిం పరిపశ్యన్తి ధీరాః॥**

**ఎ) స్వరూప లక్షణం–** పరావిద్య అక్షరంబ్రహ్మ అయితే, ఏమిటాబ్రహ్మ? ఈ మంత్రం బ్రహ్మ లక్షణాలను వివరిస్తుంది. చాలా సూక్ష్మమైన బ్రహ్మ గురించిన సూక్ష్మమైన వర్ణన. అంత తేలికగా అర్థం కాదు. అయినా ముందు కష్టంగా ఉన్నా, ముందు ముందు స్పష్టంగా ఉంటుంది. వీలున్నంత తేలికగా చూద్దాము.

**బ్రహ్మ అంటే సత్యం, జ్ఞానం, అనంతం బ్రహ్మ.**

ఒక్కొక్క ఉపనిషత్తు ఒక్కొక్క దాని గురించి వివరంగా చెబుతుంది. ఇక్కడ **సత్యం** తీసుకుంది. సత్యం అంటే సత్తా లేదా సత్. అంటే ఉనికి. ఇంగ్లీషులో ఎక్సిస్టెన్స్. వస్తువులను చూసినప్పుడు మనం – దేర్ ఈజ్ ఏ వాల్, దేర్ ఈజ్ ఏ మ్యాన్, దేర్ ఈజ్ ఏ బుక్ అంటాము. అలా అన్నింటికీ సమానంగా దేర్ ఈజ్ వాడతాము కాని ఈజ్‌ని పట్టించుకోము. ఆ ఈజ్ దాని ఉనికిని లేదా సత్తాని తెలుపుతుంది. ఉదాహరణకు ఈ గదిలో ఏముంది అని అడిగితే కుర్చీ ఉంది, బల్ల ఉంది, పుస్తకం ఉంది అంటూ ఎన్నో చెప్పుకుపోతాము కాని కాంతి ఉంది అని చెప్పము. కాంతి మనమీద పడుతున్నా మనం పట్టించుకోము.

వేదాంతం ఒక ప్రశ్న అడుగుతుంది.ఒక వస్తువు ఉంది అని అంటే ఆ వస్తువుకీ – ఉనికికీ ఏమిటి సంబంధం? విషయంలోకి ఎలా వెళ్ళామో చూసారా? దేర్ ఈజ్ తో మొదలుపెట్టాలి. తర్వాత అన్నింటికీ సమానంగా ఉన్న ఆ ఈజ్ ఏమిటి?

వస్తువులో ఒక భాగమా, ఒక లక్షణమా, దాన్నించి ఉత్పత్తి అయిందా? కాదు.ఇది బాగా అర్థం చేసుకోవాలి. అద్వైత వేదాంత పరిచయం పుస్తకంలో ఈ విషయం వివరంగా ఉంది. చైతన్యం గురించి చెప్పేముందు, దాన్ని కాంతితో పోలుస్తాము.

ఒక పుస్తకాన్ని చేతిలో పట్టుకుని చూపిస్తున్నామనుకోండి. అప్పుడు మనకు కాంతి లక్షణాలు 5 తెలుస్తాయి. అవి –

1. కాంతి పుస్తకంలో ఒక భాగం గాని, లక్షణం గాని, దాన్నించి ఉత్పత్తి చెందింది కాని కాదు.

2. కాంతి స్వతంత్రం. అది పుస్తకం అంతటా వ్యాపించి, దాన్ని ప్రకాశింపజేస్తుంది.

3. కాంతి పుస్తకం సరిహద్దులకే పరిమితమవలేదు.

4. కాంతి పుస్తకం నాశనమయితే నాశనమవదు. అలా పుస్తకం పతనం చెందాక కూడా కాంతి ఉంటుంది.

5. కాంతి పుస్తకం తీసినా ఉంటుంది కాని కనపడదు. దాన్ని ప్రతిబింబింపజేసే మాధ్యమం లేదు కాబట్టి అది కనిపించదు. అంతమాత్రాన కాంతి లేనట్టు కాదు.

ఇప్పుడు ఇవే సూత్రాలను చైతన్యానికి అన్వయిస్తూ తిరిగి చెప్పవచ్చు.

1. చైతన్యం శరీరంలో ఒక భాగం కాని, లక్షణం కాని దాన్నించి ఉత్పత్తి చెందింది కాని కాదు.

2. చైతన్యం స్వతంత్రం. అది శరీరం అంతటా వ్యాపించి, దాన్ని ప్రకాశింపజేస్తుంది.

3. చైతన్యం శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు.

4. చైతన్యం శరీరం నాశనమయితే నాశనమవదు. అలా శరీరం పతనం చెందాక కూడా చైతన్యం ఉంటుంది.

5. చైతన్యం శరీరం లేకపోయినా ఉంటుంది. కాని కనబడదు. దాన్ని ప్రతిబింబింపచేసే శరీరం లేదు కాబట్టి అది కనిపించదు. అంతమాత్రాన చైతన్యం లేనట్టు కాదు.

అందువల్ల నిత్య, శుద్ధ, నిర్గుణ, సర్వవ్యాపక చిత్ రూపమే అక్షర బ్రహ్మ. ఎక్కడుంది అక్షరం బ్రహ్మ అంటే మనం దానికి జవాబు చెప్పకూడదు. ఎక్కడ లేదు అని ఎదురుప్రశ్న వేయాలి. ఈజ్‌నెస్ రూపంలో ఉంది. అందుకే ఎవరో చాలా తేలికగా దేవుడిని నిర్వచించారు. వాట్ ఈజ్ గాడ్? వాట్ ఈజ్ – ఈజ్ గాడ్ అంటే ఉన్నదే దేవుడు. ఆ ఈజ్‌నెస్ బ్రహ్మ.
**అద్రేశ్యమ్** – బ్రహ్మ అంతటా ఉంది కాని జ్ఞానేంద్రియాలకు దొరకదు. అద్రేశ్యమ్ అంటే కంటికి కనబడదు అని అర్థం. కాని జ్ఞానేంద్రియాలకు అందదని అర్థం చేసుకోవాలి.
**అగ్రాహ్యమ్** – చేతితో పట్టుకోలేము. అంటే కర్మేంద్రియాలకు అందదు.
**అగోత్రమ్** – గోత్రం లేదు అంటే పుట్టుక లేదు.
**అవర్ణమ్** – బ్రహ్మకు గుణాలు లేవు. బ్రహ్మ నిర్గుణం.
**అచక్షుః శ్రోత్రమ్** – బ్రహ్మ సర్వవ్యాపకం. కాబట్టి శరీరం లేదు. శరీరం లేదు కాబట్టి కళ్ళు, చెవులు లేవు. అంటే జ్ఞానేంద్రియాలు లేవు.
**అపాణి పాదమ్** – చేతులు, కాళ్ళు లేవు. అంటే కర్మేంద్రియాలు కూడా లేవు. ఎందుకు నేతి నేతి పద్ధతిలో (న ఇతి – ఇది కాదు) చెబుతున్నది? మన అపోహను తొలగించటానికి. నేను ఎవరు అనే ప్రశ్నకు నేను శరీరం, నేను ఇంద్రియాలు, నేను మనస్సు లేదా బుద్ధి

అనుకుంటున్నాము. ఇవేవీ నువ్వు కాదు సుమా అని చూపించటానికి కాదు కాదు అని చెబుతున్నది.

**నిత్యమ్** – శాశ్వతం. అన్నీ నాశనమైనా ఉంటుంది. అగోత్రం అంటే పుట్టుక లేదు. నిత్యం అంటే చావు లేదు.

**విభుమ్** – తరువాత చూద్దాము.

**సర్వగతమ్** – ఆకాశంలాగా అంతటా వ్యాపించి ఉంది. నిత్యం అంటే కాలపరిమితి లేదు. సర్వగతం అంటే దేశపరిమితి లేదు.

**సుసూక్ష్మమ్** – అర్థం చేసుకోవటం చాలా కష్టం. ఎందుకు? మనకు తెలిసిన విద్యను ద్వైకాటమీ అంటారు. అందులో చూసే నేను వేరు, చూడబడే వస్తువు వేరు. కాని ఇక్కడ నువ్వు చూడాలనుకునే బ్రహ్మ నువ్వే అంటుంది శాస్త్రం.

**అవ్యయమ్** – మార్పు లేదు. నిర్వికారం అని చెప్పవచ్చు.

**భూతయోనిమ్** – యోని అంటే కారణం. బ్రహ్మ జగత్కారణం.

**విభుమ్** – దీన్ని ఇక్కడ భూతయోనితో కలిపి చదవాలి. విభుమ్ అంటే ఒక్కటే బ్రహ్మ అనేకంగా ప్రకాశించటం. ఏకనిత్యసార సత్యకారణం బ్రహ్మ అనేక అనిత్య అసార అసత్య కార్య ప్రపంచంలో భాసిల్లుతున్నాడు.

**ధీరాః** – ధైర్యశాలి కాదు. ఉపనిషత్తుల్లో ధీరాః శబ్దం తరచు వస్తుంటుంది. దాని అర్థం సూక్ష్మబుద్ధి గల అధికారి.

**పరిపశ్యన్తి** – బ్రహ్మను అంతటా చూస్తాడు.

ఇది స్వరూపలక్షణం. దీని వివరణ ముందు ముందు ఇంకా చూస్తాము.

దీని ద్వారా శిష్యుని ప్రశ్నకు జవాబు వస్తుంది.

**కస్మిన్ను భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి**

ఏ ఒక్కటి తెలిస్తే సర్వమూ తెలుస్తుంది అన్నది ప్రశ్న. ఒక కుండయొక్క పుట్టుక గురించి క్షుణ్ణంగా తెలిస్తే మట్టి ప్రపంచంలోని సమస్త వస్తువుల పుట్టుపూర్వోత్తరాల గురించి తెలిసినట్టే. అందువల్ల కారణబ్రహ్మజ్ఞానం పొందితే, కార్యప్రపంచం అంతటా తెలుస్తుంది.

అందువల్ల బ్రహ్మజ్ఞానాన్ని పరావిద్య అని అంటున్నది ఉపనిషత్తు. మనకు నాలుగు వేదాలు ఉన్నాయి. వాటిని వేదపూర్వభాగం, అంతభాగంగా విభజిస్తారు. వేదపూర్వభాగంలో నాలుగు వేదాల మంత్రాలతో పాటు ఆరు అంగాలు కూడా వస్తాయి. అవి శిక్షా, కల్పం, వ్యాకరణం, నిరుక్తం, ఛందస్సు, జ్యోతిషం. వీటిని అపరావిద్య అంటారు.

4 వేదాలు + 6 అంగాలు = అపరావిద్య.

**యయా తత్ అక్షరమ్ అధిగమ్యతే** – ఈ జ్ఞానంవల్ల అక్షరం బ్రహ్మను పొందుతాడు. పొందుతాడు అంటే వస్తువుగా పొందుతాడని కాదు అర్థం. బ్రహ్మను గురించిన జ్ఞానం పొందుతాడు. ఆత్మ అజ్ఞానం తొలగటమే ఆత్మజ్ఞానం.

ఏకనిత్యసారసత్యవస్తువు గురించి చెప్పేది బ్రహ్మవిద్య.

**బి) తటస్థలక్షణం** – ఇది ఒక వస్తువుయొక్క తాత్కాలిక లక్షణం. శాస్త్రం ఇచ్చే ఉదాహరణ కాకి వాలిన ఇల్లు దేవదత్తుని ఇల్లు. ఇది తాత్కాలికం ఎందుకంటే కాకి ఎప్పటికీ దేవదత్తుని ఇంటి మీదే ఉండదు. ఇక్కడ మనం బ్రహ్మ గురించి చూడబోయే తటస్థలక్షణం – జగత్కారణం బ్రహ్మ. బ్రహ్మను జగత్కారణం అన్నప్పుడు నిర్గుణబ్రహ్మ కాదు.

**బ్రహ్మ + మాయ = ఈశ్వరుడు.**

**బ్రహ్మాశ్రయా సత్త్వరజస్తమోగుణాత్మకా మాయా అస్తి** – తత్త్వబోధ

బ్రహ్మను ఆశ్రయించుకుని సత్త్వ రజః తమో గుణాలు ఉన్న మాయ ఉంది. అందువల్ల జగత్కారణం మాయాసహిత బ్రహ్మ లేదా ఈశ్వరుడు. ఈశ్వరుడు నిమిత్తకారణమా, ఉపాదానకారణమా? సృష్టికి ముందు ఈశ్వరుడు ఒక్కడే ఉన్నాడు.

**సదేవ సౌమ్య ఇదమగ్ర ఆసీత్ ఏకమేవాద్వితీయమ్** – ఛాందోగ్యమ్

భగవంతుడు ఒక్కడే సృష్టికి ముందు ఉంటే ఉపాదానకారణం అంటే నిమిత్తకారణం ఎవరు? నిమిత్తకారణం అంటే ఉపాదానకారణం ఏమిటి? నిమిత్తకారణం అంటే ఒక వస్తువును తయారుచేసే వ్యక్తి. కుండకు నిమిత్తకారణం కుమ్మరి, ఉపాదానకారణం అంటే ఆ వస్తువుకు వాడే ముడిసరుకు. కుండకు ఉపాదానకారణం మట్టి. వీటిని వరుసగా పూజ్యస్వామీజీ మేకర్, మెటీరియల్ అంటారు. ఉపనిషత్తు బ్రహ్మే రెండూ అంటుంది.

అభిన్న నిమిత్త ఉపాదానకారణం

పూజ్యస్వామీజీ మేకర్ అండ్ మెటీరియల్ ఆర్ రోల్డ్ ఇంటు వన్ అంటారు. అదెలా సాధ్యం? ఉపనిషత్తు దీనికోసం ఎక్కడికో వెళ్ళనవసరం లేదు. మీకు ఉదాహరణ మీ కళ్ళ ముందే ఉంది అంటుంది.

**యథోర్ణనాభిః సృజతే గృహ్ణతే చ** – ముండకం

ఇది ఉటంకించకుండా బ్రహ్మను జగత్ కారణంగా వర్ణించలేము. ఊర్ణనాభి అంటే సాలెపురుగు. సాలెపురుగు తనలోంచే దారం తీసుకుని, తన గూడుని కట్టుకుంటుంది. ఇక్కడ జగత్‌యొక్క సృష్టిని నాలుగు దశల్లో వివరిస్తున్నది ఉపనిషత్తు.

1. పూర్తి అవ్యక్త దశ – సర్వజ్ఞః సర్వవిత్ అయిన బ్రహ్మ సంకల్పించాడు
2. వ్యక్తంలోకి రావటానికి సిద్ధంగా ఉన్న దశ – తపసా చీయతే బ్రహ్మ అంటున్నది.
3. సమష్టి సూక్ష్మప్రపంచ సృష్టి – హిరణ్యగర్భ ఉద్భవించాడు.
4. సమష్టి స్థూలప్రపంచ సృష్టి – విరాట్ ఉద్భవించాడు.

రెండవ అధ్యాయలో వివరంగా చూస్తాము.

**ముండకం – 1 ఖండం – 2**

ఇందులో 13 మంత్రాలు ఉన్నాయి. ఈ ఖండం మొత్తం బ్రహ్మవిద్యకు లేదా పరావిద్యకు రావటానికి చేయాల్సిన సాధనలను పేర్కొంటున్నది. బ్రహ్మవిద్య కానిదంతా అపరావిద్యే. అపరావిద్య గురించి చెబుతున్నది. ప్రథమ అధ్యాయంలోని ద్వితీయ ఖండంలో మొత్తం ఒక సాధకుని ప్రయాణం గురించి వస్తుంది. దాన్నే వేదాంతసారంగా, గీతాసారంగా చెబుతాము.

ఒక సాధకుడు కర్మయోగం పాటించి, చిత్తశుద్ధి పొంది, ఉపాసనయోగం పాటించి చిత్త ఏకాగ్రత పొంది, జ్ఞానయోగానికి వచ్చి శ్రోత్రియబ్రహ్మనిష్ఠుడైన గురువు దగ్గర శ్రవణ, మనన, నిదిధ్యాసన చేసి జ్ఞానం పొంది, మోక్షం పొందాలి. ఈ ఖండంలో కర్మవల్ల, ఉపాసనలవల్ల కలిగే ఫలాలను, వాటి పరిమితులను కూడా విశ్లేషిస్తుంది ఉపనిషత్తు. కర్మ, ఉపాసనలవల్ల సాధన చతుష్టయ సంపత్తి లేదా అధికారిత్వం ఏర్పడుతుంది.

**తదేతత్ సత్యమ్** – పుణ్యకర్మలు చేస్తే పుణ్యలోకాలకు వెళతామని గ్యారంటీ ఉందా? వేదం ఈ హామీ ఈ విషయం చెప్పకముందే ఇస్తోంది. శ్రద్ధాభక్తులతో చేయండి. ఫలితం పొంది తీరుతారు అంటోంది. పూర్వకాలంలో మాటలే నమ్మకం, ప్రామిసరీ నోటులు లేవు. ఇప్పుడవి ఉన్నా వాటికి విలువ లేదు. తదేతత్ సత్యమ్ అంటే ఇది నిజం. కర్మలు, ఉపాసనలవల్ల ఇహాముత్ర ఫలభోగాలు వస్తాయి. అది నిజం అని ఒక పక్క నొక్కివక్కాణిస్తూనే వాటివల్ల మోక్షం రాదనీ, అశాశ్వతమైన ఫలాలనే పొందుతారనీ కూడా గట్టిగానే తిడుతుంది.

1) **కర్మయోగం** – సకామకర్మ చేస్తే ఇహాముత్ర ఫలభోగం కలుగుతుంది. కొన్ని కర్మలను, కర్మలను చేసే పద్ధతులను కూడా పేర్కొంటుంది. బాగా జ్వలిస్తున్న అగ్నిలో ఆహుతులు వేస్తే, వారిని ఆయా దేవతలు సూర్యమార్గం ద్వారా స్వర్గలోకానికి తీసుకువెళతారు.

**ఏహ్యేహీతి తమాహుతయః సువర్చసః**
**సూర్యస్య రశ్మిభిర్యజమానం వహంతి ।**

**ఏహి ఏహి ఇతి** – రండి, రండి అని ప్రియవచనాలు పలుకుతూ, ఆహ్వానిస్తారు దేవతలు. పైగా ఈ స్వర్గం మీరు చేసుకున్న సత్కర్మల ఫలితంగా లభించింది అని కీర్తిస్తారు. కాని మరీ వెంటనే కర్మలను విమర్శిస్తున్నది ఉపనిషత్తు.

**ప్లవా హ్యేతే అదృఢా యజ్ఞరూపాః**
**అష్టాదశోక్తమవరం యేషు కర్మ।**
**ఏతచ్ఛ్రేయో యేఽభినన్దన్తి మూఢాః**
**జరామృత్యుం తే పునరేవాపి యన్తి॥**

18 మంది నిర్వర్తించే ఈ యాగాలు నిలకడలేని తెప్పలు. ఇవి తక్కువరకం కర్మలు. వీటిని మేలైనవి అని ఎవరు ఆనందిస్తున్నారో వారు మూఢులు. వార్ధక్యం, మరణం అనుభవిస్తూ పునరపి జననం, పునరపి మరణం పొందుతారు.

ఇప్పటిదాకా కర్మలను పొగిడి, ఇప్పుడు వాటిని విమర్శిస్తోంది ఉపనిషత్తు. ఇది శ్రుతి పద్ధతి. తెలియనివారు ఉపనిషత్తు పరస్పర విరుద్ధమైన భావాలను చెప్తోందనుకుంటారు. కాని ఇది బలమైన వాదనని నిలబెట్టటానికి వాడే మంచి పద్ధతి. ముందే నీ వాదన తప్పు అని ఎదుటివారిని ఖండిస్తే వారు రెచ్చిపోయి, మన వాదనను చెవినబెట్టరు. అందుకని ముందు వారి వాదనని అవునని ఒప్పుకుంటూ నెమ్మదిగా అందులోని లోటుపాట్లని ఎత్తిచూపాలి. ఈ పద్ధతి మనకు ఉపనిషత్తు ఏనాడో ఇచ్చింది.

7-10 మంత్రాలవరకూ కర్మలను తీవ్రంగా ఖండిస్తోంది ఉపనిషత్తు. కర్మలు చేసే వారిని మూఢులని అంటోంది.

అన్ని కష్టాలు భరించి, శ్రద్ధాభక్తులతో పూజ చేసి, ఆశించిన ఫలితం పొందారనుకుందాం. అయినా ఫలం వచ్చినా దానికి మూడు దోషాలుంటాయి. అవి –

ఎ) **దుఃఖమిశ్రితత్వం** – చేయటానికి ఎంతో కష్టపడాలి. చేసి కర్మఫలాన్ని పొందాక దాన్ని నిలబెట్టుకోవటానికి కూడా ఎంతో కష్టపడాలి. ఎంత గొప్ప కర్మ ఫలం అయినా దానికొక కాలపరిమితి ఉంటుంది. కర్మ చేసే వ్యక్తి శాశ్వతం కాదు. అతను చేసే కర్మ శాశ్వతం కాదు. అలాంటప్పుడు అతను పొందే ఫలం కూడా శాశ్వతం కాదు. ఇదే వివరణ ఈ మంత్రంలో వస్తుంది.

బి) **అతృప్తికరత్వం** – ఎంత పొందినా ఇంకా కావాలనిపిస్తుంది. కారు కొంటే మనదానికన్నా పెద్దకారు ఇంకొకళ్ళు కొనుక్కుంటే మనకు అసంతృప్తి.

సి) **బంధకత్వం** – మనుష్యులకు, వస్తువులకు, కోరికలకు బానిసలయిపోయి, వాటిమీద బంధాలు పెంచుకుంటున్నాము. పిల్లలు దూరంగా ఉంటే, వారిమీద బంధం కొద్దీ బాధపడుతుంటాము.

ఇలాంటి పరిమితి చెందిన వారు చేసే కర్మలు ఎలా ఉన్నాయి?

**హ్యేతే అదృఢా ప్లవా** – దృఢం కాని తెప్పలులాగా ఉన్నాయి. ఆ తెప్పలను చేపలు పట్టటానికి వాడతారు. అవి దృఢంగా ఉండవు. చేపలు పట్టటం లాంటి చిన్న తెప్పలతో సముద్రం దాటగలమా? దాటలేము. ఈ పూజలు ఇలాంటి తెప్పలు. వాటితో సంసారసాగరాన్ని దాటలేము. కేవల కర్మతో తాత్కాలికంగా దుఃఖనివృత్తి కలుగుతుంది. అధోయోనిలో పడకుండా, నరకానికి పోకుండా చేస్తుంది అది. కాని ఈ ఫలం తాత్కాలికం. వీటిని 'అవరం కర్మ,' అంది ఉపనిషత్తు. అంటే తక్కువ స్థాయి కర్మలు. ఉపాసనతో సముచ్చయం చెందక, కేవలం కర్మ మాత్రమే ఉంది కాబట్టి అవరం కర్మ అయింది. ఇది స్వర్గలోకం వరకే తీసుకువెళతుంది. మోక్షాన్ని ఇవ్వదు. భూమిమీద కష్టాలతో పోలిస్తే స్వర్గలోకంలో కష్టం చాలా, చాలా తక్కువ ఉంటుంది.

**మూఢాః** – ఉపనిషత్తు వీరిని మూఢులంటోంది. మూఢాః అంటే వెర్రివాడని అర్థం. వీరు బొత్తిగా వెర్రివారు కాదు. తెలివైనవారు కూడా కొన్నింట్లో అజ్ఞానులే. వీరు శాస్త్రం చదివి, కర్మ చేస్తున్న పండితులు. కాని పురుషార్థాల విషయంలో మూఢులు.

**ఏతచ్ఛ్రేయో యేఽభినన్దని మూఢాః** – కాని వారు అలా అనుకోవటం లేదు. కర్మ చేయటమే శ్రేయమైన మార్గం అనుకుంటున్నారు. మోక్షాన్నిచ్చే మార్గం శ్రేయోమార్గం. కాని వారు యజ్ఞాలే మోక్షసాధనలు అనుకుంటున్నారు.

**జరామృత్యుం తే పునరేవాపి యన్తి** – వారు మళ్ళీ మళ్ళీ సంసారచక్రంలో పడతారు. వారు చేసిన పుణ్యంవల్ల స్వర్గానికి వెళతారు. అంటే మోక్షం వచ్చేస్తుందనుకుంటారు. అక్కడ వృద్ధాప్యం, మృత్యువు ఉండదు. యమధర్మరాజు అక్కడికి వెళ్ళడు. ఎందుకు? వెళ్ళాల్సిన అవసరం లేదు. 'క్షీణేపుణ్యే మర్త్యలోకం విశంతి,' అని కృష్ణభగవానుడు చెప్పాడు. ఎప్పుడు వారి పుణ్యం కరిగిపోతుందో, అప్పుడే వారు అక్కడినుంచి భూలోకంలోనో, ఇంకా కింద లోకాలలోనో పడతారు.

ఇలాంటి మూఢులు వారి గురించి మాత్రమే అలా అనుకుంటే కొంతమేరకు ఫర్వాలేదు. కాని వారు నాయకులు అయి తక్కిన వారిని ప్రభావితం చేస్తారు.

**అన్ధేనైవ నీయమానా యథాన్ధాః** – వారి అజ్ఞానంలో వారు కొట్టుమిట్టాడుతుంటే ఫర్వాలేదు. వారు ఆధ్యాత్మిక నాయకులై, మరికొంతమందిని వారి వాదనతో ప్రభావితం చేస్తారు.

ఇలా అవరం కర్మలు చేసేవారికి ఇంతకన్నా శ్రేష్ఠమైనది ఇంకొకటి ఉందని తెలియదు. అందువల్ల వారిని ప్రమూఢా అంటున్నది.

**ఇమం లోకం హీనతరం వా విశంతి**

కృష్ణపరమాత్మ వారు చేసుకున్న పుణ్యం తీరగానే భూలోకానికి తిరిగి వస్తారంటే ముండకం ఈ లోకంలోనో, ఇంకా హీనమైన లోకంలోనో పడతారు అంటుంది.

2) **ఉపాసనాయోగం** – ఉపాసన కూడా కర్మనే. కాకపోతే ఇది మానసకర్మ. అందువల్ల ఇది కూడా అపరావిద్యలోనే వస్తుంది. ఉపాసకుడు శుక్లగతిద్వారా ప్రయాణం చేసి బ్రహ్మలోకం చేరుతాడు. అక్కడ దాదాపు శాశ్వతంగా ఉంటాడు. పైగా అంతా సుఖమే సుఖం. ఇది ఉపాసన స్తుతి.

కాని దీనిలో పరిమితి ఏమిటి? అది కూడా శాశ్వతం కాదు. సాపేక్షిక అమరత్వాన్ని మాత్రమే ఇస్తుంది. అందువల్ల అపరావిద్యనుంచి పరావిద్యకు వైరాగ్యం అనే తలుపుద్వారా రావాలి.

**కర్మయోగం లేకుండా జ్ఞానయోగం అసంభవం**

**జ్ఞానయోగానికి రాకుండా కర్మయోగం అసంపూర్ణం**

3) **జ్ఞానయోగం**

**పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో**
**నిర్వేదమాయాన్నాస్త్యకృతః కృతేన।**
**తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్**
**సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్॥** – 12

ఈ మంత్రంలో కర్మయోగంనుంచి జ్ఞానయోగానికి, అపరావిద్యనుంచి పరావిద్యకి, ధర్మార్థకామాలనుంచి మోక్ష పురుషార్థానికి, ప్రేయోమార్గంనుంచి శ్రేయోమార్గానికి మారటం వస్తుంది.

అపరావిద్యకు పరిమితులు ఉన్నా, అపరావిద్య చాలా ముఖ్యం. అదే గమ్యం అనుకుంటే ఓటమి తప్పదు. దాన్నే మార్గంగా మలచుకుంటే జ్ఞానమనే గమ్యం చేరుకుంటారు.

**పరావిద్యకు రానిదే అపరావిద్య పూర్తికాదు**
**అపరావిద్య లేనిదే పరావిద్య సాధ్యం కాదు**

అపరావిద్యలోకి వెళ్ళి దాన్నించి ఎదగాలి. మనం పోల్ వాల్టర్ ఎగిరినట్టు ఎగరాలి. పోల్ వాల్టర్ కర్ర పట్టుకుని పరుగెత్తుకు వచ్చి, బాగా ఎత్తుకు ఎగిరి, కర్రను వదిలేసి అవతలకు దూకుతాడు. ఎలాగూ వదిలేసేదాన్ని పట్టుకోవటమెందుకూ అనకూడదు. అది పట్టుకోలేదో ఎగరలేడు. ఇంతదూరం నేను పట్టుకొని పరిగెత్తాను కదా, ఇప్పుడు ఎందుకు వదిలేయటమూ అనకూడదు. వదలందే దూకలేడు. అంటే దాన్ని పట్టుకోవాలి, సరియైన సమయంలో వదలాలి. అపరావిద్య కూడా అంతే–సాధన చతుష్టయ సంపత్తి వచ్చేదాకా దాన్ని పట్టుకోవాలి.

**పరీక్ష్య లోకాన్** – పరీక్ష ఎలా చేయాలి? బుద్ధిని ఉపయోగించి. మన పూర్వజన్మల కర్మఫలంగా ఈ శరీరం వస్తుంది. ప్రారబ్ధకర్మ ఉన్నంతవరకు అది ఉంటుంది. తరువాత? రాలిపోతుంది.

**కర్మచితాన్** – ఈ కట్టె శాశ్వతం కాదు. అది ఉండగా చేసిన కర్మలకు వచ్చిన ఫలాలు – కర్మ, కర్మఫలం; ఉపాసన, ఉపాసనాఫలం– ఈ నాలుగింటినీ పరీక్షించి చూస్తే వాటివల్ల వచ్చే ఫలాలకు మూడు దోషాలుంటాయని తెలుసుకుంటాం. అవి దుఃఖమిశ్రితత్వం, బంధకత్వం, అతృప్తికరత్వం. ప్రత్యక్షప్రమాణంవల్ల, శాస్త్రం చెప్పటంవల్ల పరీక్ష చేసాము.

**నిర్వేదమాయాత్** – అనుభవంనుంచి నేర్చుకోవాలి. కర్మఫలంలో మూడు దోషాలున్నాయని తెలుసుకుంటే, త్రివిధ ఫలాలనిచ్చే కర్మలను తగ్గించుకుని, ధర్మార్థకామాలు కాకుండా వేరే ఏదైనా పురుషార్థం ఉందా అన్న తపన పుట్టాలి.

చాలామంది ధర్మార్థకామ పరిమితులు తెలుసుకుంటారు గాని, వేరే ఏదైనా పురుషార్థం ఉందా అని చూడరు. తెలియని విషయాల జోలికి వెళ్ళే సాహసం చేయరు. చాలా కొద్దిమందిలోనే వివేకం వస్తుంది. నిత్యానిత్యవస్తువివేకం చేసే ముందు ముముక్షుత్వం ఏర్పడుతుంది.

**నాస్త్యకృతః కృతేన** – మనిషి ధర్మార్థకామాలతో కూడిన కర్మలు చేసీ చేసీ అవి సదోష పురుషార్థాలని తెలుసుకుంటాడు. దానివల్ల నిర్దోష మోక్ష పురుషార్థం రాదని గ్రహిస్తాడు. అకృతః అంటే మోక్షం. బ్రహ్మ, నిర్దోష పురుషార్థం. అంటే ధర్మార్థకామాలు పనికిరావనా అర్థం? కాదు. వాటివల్లే ఒక వ్యక్తిలో ఆధ్యాత్మికంగా ఎదగాలి అన్న తపన పుడుతుంది.

**తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్** – ఆ బ్రహ్మజ్ఞానంకోసం సరియైన గురువు దగ్గరికి వెళ్ళు అంటోంది. ఆ గురువు ఎలా ఉండాలి? శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడై ఉండాలి. బ్రహ్మనిష్ఠ అంటే బ్రహ్మలో రమించాలి. శ్రోత్రియ అంటే శ్రుతిని ప్రమాణంగా స్వీకరించి తను పొందిన బ్రహ్మవిద్యను చక్కగా బోధించగలిగే నేర్పు ఉండాలి. ఎందుకంటే ఇన్నాళ్ళూ మనం నేర్చుకున్న విద్య ఒక ఎత్తు, ఇప్పుడు నేర్చుకోబోయేది ఇంకో ఎత్తు.

**అభిగచ్ఛేత్** – అలాంటి గురువు దగ్గరకు మనమే వెళ్ళాలి. ఎందుకు?

**తద్విజ్ఞానార్థం** – బ్రహ్మవిద్య పొందటానికి. ఎలా?

**సమిత్పాణిః** – సమిధలు తీసుకుని వెళ్ళాలి. చెప్పే గురువుమీద శ్రద్ధ, భక్తి ఉండాలి. అది చూపించే చిహ్నం సమిధలు తీసుకువెళ్ళడం. సమిధ అంటే ఎండు పుల్లలు. వాటిని కాల్చగానే తేలికగా మండుతాయి. అలా శిష్యుడు నేను కర్మకాండ చేసి, సాధన చతుష్టయ సంపన్నుడనయ్యాను, జ్ఞానం పొందటానికి సంసిద్ధుడిగా ఉన్నాను అని చెప్పటం అన్నమాట.

**నాస్త్యకృతః కృతేన** – ఈ వాక్యం అనేక విషయాలను సూచిస్తోంది.

ఎ) కర్మకాండ మొత్తాన్ని విశ్లేషించి, దాన్ని అనిత్యం అంటోంది.
బి) చిన్న సూత్రంలో వైరాగ్యాన్ని సూచిస్తోంది.
సి) ముముక్షువు, ఎలా జిజ్ఞాసిగా మారాడో సూచిస్తోంది.
డి) కర్మవల్ల మోక్షం రాదని సూచిస్తోంది.

4) **సాధన చతుష్టయ సంపత్తి** – జ్ఞానయోగానికి వచ్చే శిష్యుడు సాధన చతుష్టయ సంపన్నుడై ఉండాలి. అవి 12, 13 మంత్రాల్లో వస్తాయి.

**న అస్తి అకృత్ః కృతేన** – కర్మలు చేస్తే నిర్దోష మోక్షపురుషార్థం రాదు. ఇది వివేకాన్ని సూచిస్తుంది.

**నిర్వేదమ్ ఆయాత్**– వైరాగ్యాన్ని సూచిస్తుంది.

**ప్రశాంత చిత్తాయ** – మనోనిగ్రహాన్ని సూచిస్తుంది.

**శమాన్వితాయ** – శమ అంటే ఇక్కడ ఇంద్రియనిగ్రహం.

మనోనిగ్రహం, ఇంద్రియ నిగ్రహం కలిసి శమదమాది షట్కసంపత్తిని సూచిస్తుంది. శమదమం కాకుండా తక్కిన నాలుగు ఉపరతి, తితిక్ష, శ్రద్ధా, సమాధానం.

**సమ్యక్ ఉపసన్నాయ** – తన దగ్గరకు చక్కగా వచ్చిన శిష్యునికి. ఇది ముముక్షుత్వాన్ని సూచిస్తుంది.

ఈ నాలుగింటినీ కలిపి సాధన చతుష్టయ సంపత్తి అంటారు. ఇవి పెంచుకుని అర్హత కలిగిన వ్యక్తి శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువు వద్దకు వెళితే అతను అక్షరం బ్రహ్మ గురించి బోధిస్తాడు. అక్షరం బ్రహ్మ నిర్వచనంలో స్వరూపలక్షణం, తటస్థలక్షణం చూశాము.

**స్వరూపలక్షణం – అద్రేశ్యం, అగ్రాహ్యమ్, అవర్ణం, అగోత్రమ్, మొ॥**
**తటస్థలక్షణం – ఏకం నిత్యం సారం సత్యం – కారణబ్రహ్మ**

ఇక్కడితో ఆగితే వేదాంతబోధ పూర్తి కాదు. ఆ బ్రహ్మవు నువ్వే అని చెబితేనే పూర్తి అవుతుంది. ఆ బ్రహ్మను నేనే అని అర్థమయ్యేలా చక్కగా బోధించాలి గురువు.

ఈ విధంగా ఒక సాధకుని ప్రయాణాన్ని అద్భుతంగా చిత్రీకరించింది ముండకోనిషత్తు మొదటి అధ్యాయంలో. రెండవ అధ్యాయంలో బోధ చేస్తుంది. అది చాలా ముఖ్యమైన అధ్యాయం.

# ఏకాదశ ఉపనిషత్తుల సారం

## ముండకోపనిషత్ - ముండకం 2

ముండకోపనిషత్తులోని మొదటి అధ్యాయంలో ఏ ఒక్కటి తెలుసుకుంటే, అన్నీ తెలిసినట్టు అవుతుందో, ఆ విద్య గురించి బోధించాడు గురువు అంగిరసుడు. ఈ విద్యను బ్రహ్మవిద్య లేదా కారణవిద్య అంటారు. బ్రహ్మవిద్యను పరావిద్య అనీ, బ్రహ్మవిద్య కాకుండా తక్కినదంతా అపరావిద్య అనీ అంటుంది శాస్త్రం. లౌకిక విజ్ఞానశాస్త్రం, కర్మకాండ, ఉపాసనాకాండ – అన్నీ అపరావిద్య కిందకే వస్తాయి. అంటే యజ్ఞయాగాదులు, ఉపాసనలు అన్నీ కూడా అపరావిద్యే.

ఇవన్నీ అపరావిద్య కిందికి వస్తే, వీటిని నేర్చుకోవటం ఎందుకు అనే శంక కలుగవచ్చు. విజ్ఞానశాస్త్రం, తక్కిన విద్యలూ, ఆధ్యాత్మిక జ్ఞానానికి ప్రత్యక్షంగా తోడ్పడవు కాని, అవి పరోక్షంగా సహాయపడతాయి. పరావిద్య జ్ఞానం పొందటానికి సాక్షాత్ సాధన అయితే, అపరావిద్య జ్ఞానయోగ్యతాప్రాప్తిని ఇవ్వటానికి సహకారీ సాధన అవుతుంది. అపరావిద్యను వేదపూర్వభాగం అందిస్తే, పరావిద్యను వేద అంతభాగం నేర్పిస్తుంది.

ఈ విధంగా వేదాలు విభజించబడ్డాయి. వేదపూర్వభాగం కర్మకాండ, ఉపాసనకాండల ద్వారా అపరావిద్యను బోధించి, మనను సాధన చతుష్టయ సంపన్నులను చేసి, జ్ఞానయోగ్యతను అందిస్తే, వేద అంతభాగం జ్ఞానకాండ ద్వారా పరావిద్యను బోధించి, మోక్షాన్ని ప్రసాదిస్తుంది. ఆ విధంగా మొదటి ముండకంలో, గురువు ఈ రెండు విద్యలను పరిచయం చేశారు. అపరావిద్యలో వేదపూర్వభాగంతో పాటు ఆరు అంశాలు కూడా వస్తాయి.

అవి – శిక్షా, కల్పం, వ్యాకరణం, నిరుక్తం, ఛందస్సు, జ్యోతిషం. పరావిద్య బ్రహ్మజ్ఞానాన్ని బోధిస్తుంది. నిర్గుణబ్రహ్మను ఒక్కొక్క ఉపనిషత్తు ఒక్కొక్క పేరుతో వ్యవహరిస్తుంది. ఇక్కడ అక్షరం బ్రహ్మ అంటుంది. ఏకనిత్యసారసత్యం కారణబ్రహ్మ అంటుంది.

బ్రహ్మను కారణబ్రహ్మగా మొదటి ముండకంలో పరిచయం చేసింది. కారణబ్రహ్మ అంటే నిర్గుణబ్రహ్మ + మాయ = ఈశ్వరుడు. ఆ ఈశ్వరుణ్ణుంచి ప్రపంచం నాలుగు దశల్లో ఉద్భవించింది అని అక్కడ చెప్పింది. వాటిని కారణావస్థ ఒకటి, కారణావస్థ రెండు, సూక్ష్మావస్థ, స్థూలావస్థ అని చూశాము.

ఇప్పుడు ఈ సృష్టి ప్రకరణాన్నే రెండవ ముండకంలో చాలా వివరంగా చెప్పుకువస్తుంది. ఇంచుమించు ప్రతి ఉపనిషత్తులోనూ సృష్టిప్రకరణం వస్తుంది కాని ఒకదానిలో చెప్పిన

పద్ధతిలో ఇంకొకదానిలో చెప్పదు. దాన్ని విగానం అంటారని చూశాం. అలా భిన్నంగా చెప్పటంవల్ల ఉపనిషత్తులు తమలో తాము విభేదించుకుంటున్నాయా అంటే లేదు. ఎలాగూ మిథ్యగా కొట్టివేసే సృష్టి గురించి ఎలా చెబితే ఏం అనే భావన కనిపిస్తుంది.

### ముండకం - 2 ఖండం - 1

రెండవ ముండకంలో కూడా రెండు ఖండాలు ఉన్నాయి. గురువు అంగిరసుడు ఈ సృష్టి ప్రకరణాన్ని వివరిస్తారు ప్రథమఖండంలో - బ్రహ్మను జగత్కారణంగా ముందు చెప్పారు. ఇక్కడ బ్రహ్మ సృష్టి,స్థితి,లయ కారణంగా చూస్తాము. అంటే బ్రహ్మ సృష్టిమాత్ర కారణం కాదు, స్థితి, లయ కారకుడు కూడా. ఇక్కడ బ్రహ్మయొక్క తటస్థలక్షణం చూస్తాము.

**తటస్థలక్షణం -**

అగ్నినుంచి నిప్పురవ్వలు వచ్చినట్టుగా కారణబ్రహ్మనుంచి కార్యజగత్తు వచ్చింది. అగ్నిలోని వేడి, కాంతి - నిప్పురవ్వలలో కూడా ఉన్నట్టుగా కారణబ్రహ్మయొక్క సత్, చిత్, ఆనందం అంశాలు కార్యంలోనూ ఉన్నాయి.

సత్ - ఉనికి. మనం ఉన్నామని మనకు ఇంకొకరు చెప్పనవసరం లేదు.

చిత్ - చైతన్యం. మనలో చైతన్యం లేనిదే మనం వ్యవహారం నడపలేము.

ఆనందం - పరమానందం. కాకపోతే అది మనకు తెలియటం లేదు.

మొదటి మంత్రంలో బ్రహ్మను జగత్కారణంగా పరిచయం చేయటంవల్ల, దాన్ని ప్రతిజ్ఞావాక్యం అంటారు. తక్కిన మంత్రాల్లో దాని గురించిన వివరణ వస్తుంది.

ముందు నిర్గుణబ్రహ్మ గురించి వివరిస్తుంది. దీన్ని స్వరూపలక్షణం అంటారు. బ్రహ్మ శుద్ధచైతన్యం, సర్వవ్యాపకం, నిరాకారం. జనన మరణాలు లేవు; మనస్సు, ప్రాణాలు లేవు; మాయాశక్తికన్నా శ్రేష్ఠం. శుద్ధచైతన్యం సృష్టి చేయదు. సృష్టి విషయం వస్తే -

నిర్గుణబ్రహ్మ + సగుణమాయాశక్తి = జగత్కారణ ఈశ్వరుడు.

**దశ 1 - సూక్ష్మప్రపంచం** - ఆ ఈశ్వరుణ్ణించే ముందు సూక్ష్మపంచభూతాలు ఏర్పడ్డాయి (వాటినుంచి పంచీకరణం జరిగి, స్థూలపంచభూతాలు ఏర్పడ్డాయి). సూక్ష్మశరీరంలో పంచప్రాణాలు, నాలుగు అంతఃకరణాలు, పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు - అన్నీ కలిపి 19 అంగాలు ఏర్పడ్డాయి.

**దశ 2 - స్థూలప్రపంచం** - పంచసూక్ష్మభూతాలనుంచి పంచీకరణం జరిగి వచ్చిన, స్థూలపంచభూతాలు, స్థూలప్రపంచాన్ని విశ్వరూప ఈశ్వరునిగా వర్ణిస్తోంది ఈ ఉపనిషత్తు. తత్త్వబోధలో విరాట్ అనే వస్తువు. విరాట్ శిరస్సు- ఊర్ధ్వలోకాలు, కళ్ళు- చంద్రుడు,

సూర్యుడు, దిక్కులు – చెవులు, వాక్కు – వేదాలు, వాయువు – ప్రాణం, జగత్తు – అంతఃకరణం, పాదాలు – భూమి.

**దశ 3 – జీవి పుట్టుక** – జీవి పుట్టుక ఐదు దశల్లో ఐదు కేంద్రాల్లో అవుతుంది. అవి స్వర్గం, మేఘం, పృథివీ, పురుషుడు, స్త్రీ.

**మరికొన్ని వివరాలు** – ఈశ్వరుణ్ణుంచే ఋగ్వేదం, సామవేదం, యజుర్వేదం వచ్చాయి. మనం అథర్వణవేదం కలుపుకోవాలి. ముండకోపనిషత్తు అథర్వణ వేదానికి చెందినది. అంతేకాదు, వైదిక యజ్ఞాలు, క్రతువులు, దీక్ష, దక్షిణ, కాలతత్త్వం, వైదికజీవి, లోకాలు సృష్టించబడ్డాయి. 14 లోకాలనూ పేర్కొనకుండా చంద్రలోకం అంటే స్వర్గలోకాన్ని, సూర్యలోకం అంటే బ్రహ్మలోకాన్ని మాత్రమే పేర్కొంది.

ఆ ఈశ్వరుణ్ణుంచే అనేక రకాల దేవతలు అంటే యక్ష, కిన్నెర, కింపురుషులు, పితృదేవతలు, వైదికమనుష్యులు, పశువులు, పక్షులు పుట్టాయి. అంతేకాదు ఆహారం, తపస్సు (ఆత్మ సంయమనం) శాస్త్రంమీద శ్రద్ధ, సత్యం, బ్రహ్మచర్యం, యమనియమాలు పుట్టాయి. ఆ ఈశ్వరుణ్ణుంచే ఐదు ఇంద్రియాలు, ఇంద్రియశక్తులు, ఇంద్రియవిషయవస్తువులు, గోళకాలు పుట్టాయి.

ఆ ఈశ్వరుణ్ణుంచే సముద్రాలు, పర్వతాలు, నదులు, చెట్లు చేమలు అన్నం వచ్చాయి. ఒక్కముక్కలో చెప్పాలంటే అన్నీ ఈశ్వరుణ్ణుంచే వచ్చాయి.

ఈ సృష్టి ప్రకరణంలో మనం గమనించాల్సిన ముఖ్య అంశం సృష్టితో పాటు వేదాలు కూడా వచ్చాయి. భగవంతుడు మనను సృష్టించి, మన జీవనం ఎలా ఉండాలో నిర్దేశించేటందుకు వైదిక జీవనవిధానాన్ని బోధించే వేదాలను కూడా ఇచ్చాడు. ఒక చిన్న కంటి మందు కొంటేనే, దానితోపాటు మందును ఎలా వాడాలో అనేక సూచనలిస్తూ చిన్న మాన్యువల్‌ని ఇస్తుంది, దాన్ని తయారు చేసిన కంపెనీ. అలాంటప్పుడు ఇంత అద్భుతమైన సృష్టిని ఎలా వినియోగించుకోవాలో చెప్పకపోతే, అఖండమైన తెలివితేటలున్న మనిషి తన తెలివితేటలను దుర్వినియోగం చేసే ప్రమాదం ఉంది. దానివల్ల విశ్వాన్ని నాశనం చేసే ప్రమాదమూ ఉంది. అందువల్ల ఈశ్వరుడు మనిషిని సృష్టించి, మనిషికి వేదమనే మాన్యువల్‌ని ఇచ్చాడు. ఈ విధంగా బ్రహ్మ కారణం, జగత్తు కార్యం. దీన్నించి మనం అర్థం చేసుకోవాల్సింది ఏమిటో ఉపనిషత్తే పదవ మంత్రంలో చెబుతుంది. ఇదొక మహావాక్య మంత్రం.

**పురుష ఏవేదం విశ్వం కర్మ తపో బ్రహ్మ పరామృతమ్।**
**ఏతద్యో వేద నిహితం గుహాయాం సోఽవిద్యాగ్రన్థిం వికిరతీహ సోమ్య॥** 2.1.10

కనబడే కార్యలక్షణాలనుంచి కనబడని కారణం లక్షణాలని తెలుసుకోవచ్చు.

బంగారం– ఆభరణాల ఉదాహరణ చూద్దాము.

1. **కారణం ఏకం** – బంగారం ఒకటే. దాన్నించి అనేక ఆభరణాలు వస్తాయి. గాజు, గొలుసు, ఉంగరం, వడ్డాణం. కారణం ఏకం, కార్యం అనేకం.

2. **కారణం నిత్యం** – బంగారంనుంచి గొలుసు ఏర్పడగానే, దానికొక పుట్టినరోజు ఉంటుంది. కాని బంగారం గొలుసు ఏర్పడకముందూ ఉంది, గొలుసులోనూ ఉంది, గొలుసుని కరిగించాక కూడా ఉంటుంది. అంటే కారణం నిత్యం, కార్యం అనిత్యం.

3. **కారణం సారం** – గొలుసు బరువెంత? దాని బరువు బంగారానిది. అంటే గొలుసు అంతటా ఉన్నది బంగారమే. దాన్నే సారం అంటారు. అందుకని నామరూపాలు మాత్రమే కార్యానికి ఉన్నాయి కాని, సారం లేదు. అంటే కారణం సారం, కార్యం అసారం.

4. **కారణం సత్యం** – గొలుసు ఉంది అంటే దాని ఉనికి దేనిది? బంగారానిది. బంగారం లేకపోతే గొలుసు లేదు. కాని గొలుసు లేకపోయినా బంగారం ఉంటుంది. విడిగా ఉనికి ఉన్నదాన్ని సత్యం అనీ, స్వతంత్రంగా ఉనికి లేనిదాన్ని మిథ్య అనీ అంటారు. ఇక్కడ అసత్యం అందాం. ఈ సూత్రం ప్రకారం బంగారం సత్యం, గొలుసు అసత్యం. అంటే కారణం సత్యం, కార్యం అసత్యం.

ఇప్పుడు పై వివరణను క్రోడీకరించి చూస్తే –

కారణం – ఏకం, నిత్యం, సారం, సత్యం

కార్యం – అనేకం, అనిత్యం, అసారం, అసత్యం.

ఈ నేపథ్యంతో ఈ మంత్రం చూద్దాము.

**పురుష ఏవేదం విశ్వమ్** – ఈ జగత్తు మొత్తం బ్రహ్మే! జగత్తు, బ్రహ్మకు భిన్నంగా లేదు.

**పరామృతమ్** – బ్రహ్మకు ఇంకో పేరు పరామృతం. పరం అంటే పారమార్థిక సత్యం, అమృతం అంటే శాశ్వతం.

**కర్మ తపః** – ఈ జగత్తు మొత్తం మన కర్మఫలం, ఉపాసనాఫలం. కార్యప్రపంచంలో అందం ఉంది, వినోదం ఉంది కాని శాశ్వతత్వం లేదు. అంటే కార్యప్రపంచం అనిత్యం.

**గుహాయాం నిహితం** – కార్యం అనిత్యం అని ఎలా తెలుసుకుంటారు? మనస్సులో ఉండి మనస్సును సాక్షీభూతంగా చూసేది ఒకటి ఉంది. అది సాక్షిచైతన్యం. అది సత్యం.

**యః వేద సః అవిద్యాగ్రంథిం వికిరతి ఇహ** – ఈ సత్యాన్ని ఎవరైతే తెలుసుకుంటారో అతనికి ఇక్కడే, ఇప్పుడే అజ్ఞానబంధం విడివడుతుంది.

ఈ మంత్రం ఒక మహావాక్యం. జీవాత్మ పరమాత్మల ఐక్యాన్ని చూపించే ఏ మంత్రమన్నా మహావాక్యం అవుతుంది.

| | |
|---|---|
| **పురుష ఏవేదం విశ్వమ్** | **– పరమాత్మ** |
| **నిహితం గుహాయామ్** | **– జీవాత్మ** |
| **సః అవిద్యాగ్రంథిం వికిరతి ఇహ** | **– ఫలం** |

ఈ జీవాత్మ పరమాత్మ ఐక్యాన్ని ఇంకా వివరంగా ద్వితీయ ఖండంలో చూస్తాము. రెండవ ముండకం పరావిద్యను బోధిస్తుంది కాబట్టి ఇది చాలా ముఖ్యమైన అధ్యాయం. అంతటా ఉన్న బ్రహ్మ, నాలో సాక్షిచైతన్యంగా ఉన్న బ్రహ్మ ఒకటే అంటుంది ఉపనిషత్తు. కారణరూపంలో ఉన్న బ్రహ్మే కార్యరూపంలో కూడా ఉన్నాడని చూపిస్తున్నది. ఎందుకు?

**ఏక విజ్ఞానేన సర్వవిజ్ఞానం భవతి**

కార్య జగత్తు కంటికి ఎదురుగా కనిపిస్తున్నది. ఈ కనిపిస్తున్న జగత్తునుంచి కనబడని, దీనికి కారణమైన బ్రహ్మను తెలుసుకోవాలి. ఎలా? ఆభరణాన్ని చేతిలో పట్టుకుని బంగారాన్ని తెలుసుకోవాలి అంటే ఉపనిషత్తు ముసిముసి నవ్వులు నవ్వుకుంటున్నది. కుండని చేతిలో పట్టుకుని, మట్టిని తెలుసుకోవాలంటే, మీది మట్టిబుర్ర అంటోంది. పేపర్లో ఎవరినైనా పట్టుకోవాలి అంటే అతని ఎత్తు, బరువు, రూపురేఖలు ఇచ్చి, పట్టుకుంటే లక్ష అని ప్రకటిస్తారు. అలా ఉపనిషత్తు నాలుగు లక్షణాలు ఇచ్చి కనుక్కోండి అంది. ఇక్కడ ప్రతిఫలం అలాంటి ఇలాంటి ప్రతిఫలం కాదు, సాక్షాత్తూ మోక్షమే! నిత్యఫలం.

ఈ సూత్రాన్ని జగత్తుకు, బ్రహ్మకు అన్వయిద్దాము.

| **జగత్తు** | **బ్రహ్మ** |
|---|---|
| అనేకం – అనేక నామరూపాల జగత్తు | ఏకం |
| అనిత్యం – ఆ నామరూపాలకు జననమరణాలు ఉన్నాయి | నిత్యం |
| అసారం – జగత్తు అంతటా బ్రహ్మే ఉన్నాడు | సారం |
| అసత్యం – జగత్తుకు విడిగా ఉనికి లేదు | సత్యం |

ఈ లక్షణాలను క్రోడీకరిస్తే –

**బ్రహ్మ – ఏకం, నిత్యం, సారం, సత్యం.**

ఈ ఏకనిత్యసారసత్యబ్రహ్మను ఎలా తెలుసుకోవాలి? ఉపనిషత్తే సహాయం చేస్తున్నది. వస్తువులను వివరించేటప్పుడు ఏమంటాము? ది బుక్ ఈజ్, ది టేబుల్ ఈజ్, ది పెన్

ఈజ్, ది ఫ్యాన్ ఈజ్ – ఈ వాక్యాలన్నింటిలోనూ సమానంగా ఉన్నది ఈజ్, ఈజ్, ఈజ్. ఈ ఈజ్‌నెస్సే ఎక్సిస్టెన్స్ అంటుంది ఉపనిషత్తు. ఈ వాక్యాలను తెలుగులో చూస్తే పుస్తకం ఉంది, బల్ల ఉంది, కలం ఉంది, పంకా ఉంది. ఈ వాక్యాలన్నింటిలోనూ సమానంగా ఉన్నది – ఉంది, ఉంది, ఉంది. దీన్నే ఉనికి అంటారు. సత్ అంటారు సంస్కృతంలో. ఈ సత్ మీకూ, నాకూ మధ్యలో కూడా ఉంది. మధ్యలో ఏం ఉంది అంటే ఖాళీగా **ఉంది** అంటారు. అందులో కూడా **ఉంది** ఉంది. అంతేకాదు, ఈ సత్ సర్వవ్యాపకం కూడా. కుండ ఉంది అంటారు. ఒకవేళ కుండ పగిలిపోతే, కుండలేదు అనిపిస్తుంది కాని, నిజానికి పగిలిపోయిన కుండ **ఉంది**, లేదా మట్టి **ఉంది**. దీన్నిబట్టి అర్థమయింది ఏమిటి? ఉనికిని మీరు నాశనం చేయలేరు. కుండ నాశనం అయినట్టు కనిపించినా, ఉనికి కుండనుంచి మట్టికి మారింది. మట్టి భూమిలో కలిస్తే, భూమి ఉంది అంటాము. అంటే ఉనికి ఒక నామరూపంనుంచి ఇంకొక నామరూపానికి మారుతుంది కాని ఉనికి నిత్యం. ఉనికి దాని ఉనికికి దేనిమీదా ఆధారపడదు. అందువల్ల అది సత్యం. **శుద్ధ సత్.** బ్రహ్మయొక్క లక్షణం.

శుద్ధ సత్ అంటే నామరూపాలు లేని సత్. శుద్ధ సత్తే అనేక నామరూపాలున్న జగత్తుగా భాసిల్లుతున్నది. మీకేదైనా సందేహం ఉంటే సైన్సుని అడగండి. సైన్సు పదార్థం శక్తి తప్ప, ఏమీ కాదు అంటుంది. అలా చూస్తే పదార్థంగా కనబడే ఈ జగత్తు సత్ తప్ప ఏమీ కాదు. సైన్స్ పదార్థం శక్తి, శక్తి పదార్థం అంటే, వేదాంతం ఈ రెండింటికీ భిన్నంగా ఉంది చైతన్యం అంటుంది. అందువల్ల బ్రహ్మ అంటే శుద్ధ సత్ లేదా శుద్ధ ఉనికి. సరే బ్రహ్మ అంటే శుద్ధ ఉనికి అని నాకు అర్థమైంది. ఇప్పుడా ఉనికిని చూడటం ఎలా? ఎక్కడ దొరుకుతుంది అంటే ఉపనిషత్తు మళ్ళీ ముసిముసి నవ్వులు నవ్వుతుంది. ఉనికిని పట్టుకోవటానికి ఎక్కడికి వెళ్ళాలి అంటే నవ్వదా మరి? ఇప్పుడే కదా చూశాము ఉనికి సర్వవ్యాపకం అనీ; అన్ని నామరూపాల్లోనూ ఉందనీ; ప్రతి వస్తువులోనూ ఉందనీను!

గాజుని చేతిలో పట్టుకుని బంగారాన్ని చూడాలంటే ఎంత హాస్యాస్పదంగా ఉంటుందో, అలాగే వస్తువులను చూస్తూ ఉనికి చూడాలంటేనూ అంత హాస్యాస్పదంగానూ ఉంటుంది. పుస్తకం ఉంది, బల్ల ఉంది, స్త్రీ ఉంది అంటున్నప్పుడల్లా ఉనికిని అనుభవిస్తూనే ఉన్నాము.

అయినా మనకు తృప్తిగా ఉండదు. నిజమే, నేను ఉనికిని అనుభవిస్తూనే ఉన్నాను. కాని దాన్ని ఏదో ఒక వస్తువుతో కలిపి అనుభవిస్తున్నాను. మనిషితో, చెట్టుతో, బల్లతో కలిపి అనుభవిస్తున్నాను. అందువల్ల నేను అనుభవిస్తున్నది శుద్ధ ఉనికి కాదు. శుద్ధ ఉనికిని, ఆబ్జెక్ట్ లేని ఉనికిని, స్వచ్ఛమైన ఉనికిని ఎలా అనుభవించాలి?

జగత్తు = శుద్ధ చైతన్యం + నామరూపాలు
శుద్ధచైతన్యం = జగత్తు − నామరూపాలు

వినటానికి బాగానే ఉంది, కాని ఈ నామరూపాలను ఎలా తీయాలి? ఇక్కడున్న మనుష్యులంతా బయటకు వెళ్ళండి అంటే మనుష్యులు వెళతారు కానీ కుర్చీలు ఉంటాయి. కుర్చీలు కూడా తీసేసినా, నేల ఉంటుంది కదా ఏం చేయాలి? బాహ్యప్రపంచాన్ని తీసివేయటం అసాధ్యం. అందువల్ల ఇంకొక తేలిక పద్ధతిని ప్రయత్నించండి అంటుంది ఉపనిషత్తు. ఏమిటది?

జగత్తును మీ కళ్ళముందునుంచి తీసివేసే బదులు, మీరు జగత్తును చూడటం మానేయండి. మీరు చూస్తేనే కదా, నామరూపాలు కనబడేది. చెవులు వినియోగిస్తేనే కదా శబ్దం వినబడేది! అందువల్ల కళ్ళను, చెవులను మూసుకోండి. అలా ఇంద్రియాలను వాడకపోతేనూ, మనస్సును ఉపయోగించకపోతేనూ, ఆబ్జెక్టు ఉండదు. కాని శుద్ధ సత్ లేదా శుద్ధ చిత్ తెలుసుకోవటం ఎలా?

ఇదెలాగుందంటే, ఎవరైనా నువ్వు నిద్రపోతున్నప్పుడు నీ మొహం చాలా అమాయకంగా ఉంటుంది అంటే, సహజంగానే మీకు మీరెలా ఉంటారో చూసుకోవాలని ఉంటుంది. అద్దం ముందు కళ్ళు మూసుకుని నిల్చుంటే కనిపిస్తారా? అసాధ్యం. అలాగే ఇంద్రియాలను వాడకపోతే, శుద్ధ ఉనికి తెలుస్తుందా? అసాధ్యం. కాని ఉపనిషత్తు శుద్ధ ఉనికి తెలియదు, తెలియనవసరం లేదు. ఎందుకంటే అది నువ్వే అంటుంది. శుద్ధ సత్ (ఉనికి) వెతకబడే వస్తువు కాదు, వెతుకుతున్న నువ్వే అంటుంది. అన్నింటినీ సాక్షీభూతంగా చూసే సాక్షిచైతన్యానివి నీవు. తత్ త్వమ్ అసి అంటుంది.

### శుద్ధ సత్తే శుద్ధ చిత్, శుద్ధ చిత్తే శుద్ధ సత్

బ్రహ్మ ఎవరు? సత్ చిత్ బ్రహ్మ. మొదటి ఖండంలో శుద్ధ సత్ గురించి వస్తే, రెండవ ఖండంలో శుద్ధ చిత్ గురించి వస్తుంది.

మొదటి ఖండంలో ముఖ్యమైన మంత్రాలు − 1, 2, 10.

### ముండకం − 2 ఖండం − 2

మొదటి ఖండంలో బ్రహ్మను అంతటా ఉనికిరూపంలో ఉన్న సత్‌గా పరిచయం చేస్తే, రెండవ ఖండంలో ఆ సత్తే చైతన్యం రూపంలో నీలోనే ఉంది అని నిరూపిస్తుంది ఉపనిషత్తు. చైతన్యం అంటే చిత్. (చైతన్యం గురించి అర్థం చేసుకోవాలంటే కాంతి ఉదాహరణ చూడవచ్చు.) ఏకం, నిత్యం, సారం, సత్యమైన కారణబ్రహ్మను పట్టుకోవాలి. ఎలా పట్టుకోవాలి?

కారణపరమాత్మ ప్రతికార్యంలోనూ అధిష్ఠానంగా ఉన్నాడు. అంటే మనలో కూడా జీవాత్మగా ఉన్నాడు. అందువల్ల జీవాత్మను తెలుసుకుంటే పరమాత్మను తెలుసుకోగలము.

బ్రహ్మ విరజం, నిష్కళం, శుద్ధం. ఈ శుద్ధమైన బ్రహ్మ మనలో జీవాత్మగా, సాక్షిచైతన్యంగా ఉంది. ఆ జీవాత్మ జ్యోతిషాం జ్యోతిః.

**జ్యోతిషామపి తజ్జ్యోతిః తమసః పరముచ్యతే** – గీత 13.18

జ్యోతికి సాంకేతిక అర్థం – జ్యోతి సమక్షంలో వస్తువులు తెలిసి, ఆ జ్యోతి లేకపోతే వస్తువులు తెలియకపోవటం. ఉదాహరణకు సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు. అందువల్ల జ్యోతి అంటే స్వయంప్రకాశక జ్యోతి.

సూర్యుడు ఒక స్వయంప్రకాశక జ్యోతి. సూర్యుడు అన్నింటినీ ప్రకాశింపజేస్తాడు; తనను తను ప్రకాశింపజేసుకుంటాడు. అంటే **సూర్యుడు ఒక జ్యోతి**, కాని అంత స్వయంప్రకాశక జ్యోతి కూడా గుడ్డివానికి తెలియదు. కన్ను అనే ఇంద్రియం పని చేస్తేనే బయట జ్యోతి తెలుస్తుంది. అలా చూస్తే **కన్ను ఒక జ్యోతి**. ఈ సూత్రం ప్రకారం ఇంద్రియాలు ఒక జ్యోతి.

ఇంద్రియాలు పని చేయాలంటే వాటి వెనుక మనస్సు ఉండాలి. ఒక ప్రసంగం వింటున్నా, మనస్సు ఎటో వెళ్ళిపోతే, ఆ ప్రసంగం అర్థంకాదు. అంటే ఇప్పుడు మనస్సు ఒక జ్యోతి. ఎన్ని జ్యోతులో చూడండి. సూర్యుడు ఒక జ్యోతి. సూర్యుణ్ణి చూసే కన్ను ఒక జ్యోతి. కన్నును నడిపించే మనస్సు ఒక జ్యోతి. మనస్సు కూడా జడమే. అది పంచభూతాలతో చేయబడింది. మనస్సనే జ్యోతిని ప్రకాశింపజేసేది ఆత్మజ్యోతి, చైతన్యజ్యోతి. ఇది దేనివల్ల ప్రకాశిస్తోంది? దీని వెనుక ఇంకొక జ్యోతి లేదు. అందువల్ల ఇది ఒక జ్యోతి అనకూడదు. ఇదే జ్యోతి. ఇది స్వయంప్రకాశక జ్యోతి. ఇది తనంతట తాను ప్రకాశిస్తూ, తక్కినవాటిని ప్రకాశింపజేస్తుంది. అందువల్ల ఆత్మజ్యోతి – జ్యోతిషాం జ్యోతిః అయింది. ఎవరు ఆత్మను అధిష్ఠానజ్యోతిగా తెలుసుకుంటారో, వారు ఆత్మనే కాదు బ్రహ్మను తెలుసుకున్నట్టు. ఇక్కడ తర్కం చూశారా? ఆత్మను తెలుసుకున్న వ్యక్తి ఆత్మను తెలుసుకున్నట్టు అనలేదు.

**జీవాత్మ విదుః పరమాత్మ విదుః** అని ఉంది. జీవాత్మను తెలుసుకున్నవాడు పరమాత్మను తెలుసుకున్నట్టు అంటున్నది. పరమాత్మే చైతన్యజ్యోతిలాగా జీవాత్మలో ఉన్నాడు.

ఇప్పుడు ఆత్మ విషయానికి వస్తే, ఇంతకుముందు ఆత్మను ఏమన్నాం? జ్యోతిషాం జ్యోతి అన్నాం. ఇప్పుడు దాన్ని ఎలా చూస్తాం అని అడిగితే చంద్రకాంతి ద్వారా సూర్యకాంతిని చూడటానికి ప్రయత్నించినట్టు ఉంటుంది. ఆత్మజ్యోతిలో జ్యోతి పదం ఉంది కాబట్టి, ఈ జ్యోతి ధ్యానంలో కూర్చుంటే ఒక కాంతిలా కనబడుతుందా అనుకుంటాం. కాని ముందే చూసినట్టుగా ఆత్మ స్వయంప్రకాశక జ్యోతి. దాన్ని ప్రకాశింపజేసే కాంతి లేదు. అది నిరూపించే అద్భుతమైన శ్లోకం చూస్తాము.

**న తత్ర సూర్యో భాతి న చన్ద్రతారకం**
**నేమా విద్యుతో భాన్తి కుతోఽ యమగ్నిః।**
**తమేవ భాన్తమనుభాతి సర్వం**
**తస్య భాసా సర్వమిదం విభాతి॥**

కఠలో కూడా అక్షరాలా ఇదే మంత్రం ఉంది. ఈ మంత్రంలో కొన్ని శక్తివంతమైన జ్యోతులను తీసుకుని, అవి వేరే వాటిని చూపిస్తాయి కాని ఆత్మను చూపలేవు అని చూపిస్తున్నది ఉపనిషత్తు.

ఆత్మను సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, వేలాది మెరుపులు కూడా ప్రకాశింప జేయలేవు. ఇంక అగ్ని గురించి చెప్పేదేముంది? ఈ ఐదూ బాహ్యమైన పంచజ్యోతులు. ఇవే ప్రకాశింప జేయలేనప్పుడు, మన పంచేంద్రియాలు ఏం చేయగలవు?

**న తత్ర చక్షుర్ గచ్ఛతి న వాక్ గచ్ఛతి నో మనః** – కేన 1.3

అంటే ఆత్మ ప్రమాణ అగోచరం. ప్రకృతి సూత్రం – ప్రకాశింపజేసేది వేరే దానిచేత ప్రకాశింపబడదు. **దృగేవ న తు దృశ్యతే.**

వేరే ఏదీ ప్రకాశింపజేయలేదు అంటే ఆత్మను ఎలా తెలుసుకోవటం? ఆత్మ ఆబ్జెక్టు కాదు, ఆత్మ సబ్జెక్ట్.

**ఎవర్ ది ఎక్స్‌పీరియన్సర్, నెవర్ ది ఎక్స్‌పీరియన్స్‌డ్**

అనుభవిస్తున్న నువ్వే అది ఎప్పటికీ, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ

అందువల్ల ఆత్మ ప్రమాణానికి అటువైపు ఉన్నది కాదు, ప్రమాణాల వెనుకనున్న నేను. అంటే జ్యోతిషాం జ్యోతిని నేనే.

ముండకోపనిషత్తులో ఈ ఖండం చాలా ముఖ్యమైన ఖండం. వేదాంతసారం ఇందులో అద్భుతంగా వస్తుంది. మనను ఒక్కొక్క గెంతూ గెంతించి, అద్భుతం చూపిస్తుంది. దానికి పరాకాష్ఠ మంత్రం.

**బ్రహ్మైవేదమమృతం పురస్తాత్**
**బ్రహ్మ పశ్చాత్ బ్రహ్మ దక్షిణతశ్చోత్తరేణ।**
**అధశ్చోర్ధ్వం చ ప్రసృతం**
**బ్రహ్మైవేదం విశ్వమిదం వరిష్ఠమ్ ॥**

ఈ మంత్రాన్ని అర్థం చేసుకునేముందు, ఉపనిషత్తు గెంతించిన గెంతులేమిటో చూద్దాము.

**1. మొదటి గెంతు – నేను=ఆత్మ**

ఆత్మ ఆబ్జెక్టు కాదు, తెలుసుకోబడే వస్తువు కాదు, తెలుసుకోవటానికి ప్రయత్నించే నువ్వే ఆత్మవు అన్నది. (మంత్రం 11)

**2. రెండవ గెంతు – నేను=బ్రహ్మ**

సరే నేను ఆత్మను అని ఒప్పుకున్నా కూడా, దానిముందు మంత్రంలో (మంత్రం 10) ఆత్మను తెలుసుకున్నవాడు బ్రహ్మను తెలుసుకున్నట్టు అంది.

ఎ = బి; బి = సి; అందువల్ల ఎ = సి సూత్రం ప్రకారం,

నేను = ఆత్మ; ఆత్మ = బ్రహ్మ; అందువల్ల నేను = బ్రహ్మ.

**3. మూడవ గెంతు – నేను=జగత్కారణం**

రెండవ గెంతు గెంతితే సరిగ్గా నిల్చోలేము అనుకుంటే ఇక్కడ ఇంకో పెద్ద గెంతు గెంతిస్తోంది. ముందు ఖండంలో (ముందు మంత్రంలో కాదు) బ్రహ్మ జగత్ కారణం అంది. బ్రహ్మనుంచి ఏవేమి వచ్చాయో వివరంగా చూశాము.

మళ్ళీ వరసగా చూసుకుంటూపోతే తేలేది ఏమిటి? నేను = జగత్కారణం.

నేను అన్నప్పుడల్లా ఆ నేను ఎవరన్నది మర్చిపోకూడదు. నేను మోకాలినొప్పితో బాధపడుతున్న శరీరం కాదు, పటుత్వం తగ్గే ఇంద్రియాలు కాదు, రాగద్వేషాలున్న మనస్సు అసలే కాదు. నేను అంటే ఆత్మ. ఆత్మనైన నేను = జగత్కారణం.

హే గురో! నాకిదంతా కొరుకుడు పడటం లేదు అంటే, మీరు స్వప్నప్రపంచంలో చేస్తున్నది అదే అంటుంది. స్వప్నంలో ఉండగా అది మీరు సృష్టించినదే అని మీకు తెలియదు. లేచాకే తెలుస్తుంది. అలాగే జాగ్రత్ ప్రపంచం స్వప్నం–2. దాన్నుంచి బ్రహ్మస్థాయికి లేస్తే ఇది కూడా మీరు సృష్టించిందే అని తెలుస్తుంది అంటుంది వేదాంతం.

ఇంకా మన గెంతులు పూర్తికాలేదు. మోకాళ్ళనొప్పితో నడవటమే కష్టమైన మనను ఏకంగా పెద్ద గెంతులే గెంతిస్తోంది ఉపనిషత్తు.

**4. నాలుగవ గెంతు – నేను= కార్యమంతటా భాసిల్లుతున్న జగత్కారణం.**

అన్ని కార్యాలూ, కారణానికి నామరూపాలు. అంటే కారణమే కార్యంగా భాసిల్లుతుంది. బంగారమే నామరూపాలున్న ఆభరణాలుగా భాసిల్లుతుంది. ఉన్నదంతా ఒకటే. అద్వితీయం.

కారణబ్రహ్మనైన నేనే ముందు ఉన్నాను, వెనకా ఉన్నాను, దక్షిణం వైపు, ఉత్తరం వైపు, పైన, కింద, సర్వత్రా ఉన్నాను. ఒక్కముక్కలో చెప్పాలంటే మొత్తం జగత్తులో నేనే శ్రేష్ఠమైన బ్రహ్మగా నెలకొని ఉన్నాను.

పై దశలన్నీ ఒకసారి కలిపి చూస్తే –

నేను = ఆత్మ; ఆత్మ = బ్రహ్మ; బ్రహ్మ = జగత్కారణం; జగత్కారణం = జగత్ అనే కార్యమంతటా భాసిల్లుతున్నాను.

అందువల్ల శరీరం, ఇంద్రియాలు, మనస్సు కాని నేను, ఆత్మనైన నేను, జగత్కారణ బ్రహ్మనైన నేను, జగత్ అనే కార్యమంతటా భాసిల్లుతున్నాను.

ముండకోపనిషత్తు పరిభాషలో చెప్పాలంటే –
ఏకం, నిత్యం, సారం, సత్యం కారణబ్రహ్మను నేను.
అనేకం, అనిత్యం, అసారం, అసత్యం కార్యప్రపంచమంతటా భాసిల్లుతున్నాను.

**ఆత్మజ్ఞానసాధన** – ఈ గెంతులు గెంతటం కష్టం కాబట్టి, ఉపనిషత్తే కొన్ని సాధనలను కూడా పేర్కొంటున్నది. ఈ ఖండంలో ధనుస్సు దృష్టాంతం ఇస్తున్నది. అది కూడా అద్భుతమైన మంత్రం (మంత్రం 3).

**ధనుర్గృహీత్వౌపనిషదం మహాస్త్రం**
**శరం హి ఉపాసానిశితం సన్ధయీత**
**ఆయమ్య తద్భావగతేన చేతసా**
**లక్ష్యం తదేవాక్షరం సోమ్య విద్ధి॥**

ధనుర్బాణ ఉదాహరణ గురించి కొన్ని విషయాలు చూద్దాము.

1. **లక్ష్యం** – గురి చూడాల్సిన లక్ష్యం ఒకటి ఉండాలి.
2. **బాణం** – వెళ్ళి ఆ లక్ష్యాన్ని ఛేదించి, లక్ష్యంతో ఒకటైపోవాలి. ముందు భేదం, తరువాత అభేదం.
3. **ధనుస్సు** – బాణం ప్రయాణం చేయాలంటే ఒక పరికరం కావాలి. బాణాన్ని ధనుస్సుకి సంధించాలి.
4. **బాణం తీరు** – నిటారుగా ఉండాలి. లేకపోతే దూరం ప్రయాణించదు. పదునుగా ఉండాలి. లేకపోతే లక్ష్యాన్ని సంధించాక అందులో నిలబడదు.
5. **విలుకాడు** – బాణాన్ని సంధించే వ్యక్తి.

ఇప్పుడు మన ఆధ్యాత్మిక సాధనపరంగా చూద్దాము.

1. **లక్ష్యం** - పరమాత్మ
2. **బాణం** - జీవాత్మ
3. **ధనుస్సు** - ఉపనిషత్తు
4. **అస్త్రం** - నిటారుగా ఉంచటానికి - కర్మయోగ సాధన.
   పదునుగా ఉంచటానికి - ఉపాసన యోగ సాధన.
5. **విలుకాడు** - సాధకుడు

సాధకుడు జీవాత్మ అనే చెప్పవచ్చు. అతను ప్రయాణించేవాడు. పరమాత్మ లేదా బ్రహ్మ అనే గమ్యం చేరేవరకు ప్రయాణం. కర్మకాండలో జీవాత్మ, పరమాత్మల భేదం ఉంటుంది. ఐక్యం ఉపనిషత్తులో వస్తుంది. కర్మయోగంద్వారా చిత్తశుద్ధి పొంది, ఉపాసనాయోగంద్వారా చిత్త ఏకాగ్రత పొంది ఉపనిషత్తులకు వచ్చి శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా లక్ష్యాన్ని ఛేదించాలి. వింటినారిని ఎంత లోపలికిలాగితే బాణం అంతదూరం వెళుతుంది. అలా మనసుని ఎంత లోపలికి లాగితే అంత శక్తివంతంగా లక్ష్యాన్ని ఛేదిస్తుంది. ప్రసంగానికి వెళ్ళినప్పుడు చెప్పులు బయట వదిలినట్టు, బాహ్యాముఖంగా ఉన్న ఆలోచనలను బయట వదిలి అంతర్ముఖం అవటానికి సిద్ధంగా ఉండాలి.

**అంతర్ముఖ సమారాధ్యా బహిర్ముఖ సుదుర్లభా** - లలితాసహస్రనామం

మనిషిని బాహ్యంగా లాగే ఐదు విషయాలనుంచి అంతర్ముఖం చేయాలి. అవి శరీరం,మనసు, కుటుంబం, ఉద్యోగం, ఆస్తిపాస్తులు. ధనుస్సు, బాణం ఎంత బాగున్నా, విల్లుని లోపలికి లాగకపోతే లాభం లేదు. బాణం అక్కడే ఉండిపోతుంది.

**పరాంచి ఖాని వ్యతృణత్ స్వయంభూః**
**తస్మాత్పరాజ్ పశ్యతి నాన్తరాత్మన్** - కఠ 2.1.1

ఇంద్రియాలను బాహ్యపరంగా ఏర్పాటు చేసాడు భగవంతుడు. అందుకని అవి బయటి విషయాలను మాత్రమే చూడగలుగుతున్నాయి.

ఉపనిషత్తుల బోధనుంచి ముండకోపనిషత్తు ప్రత్యేకించి ఓంకారాన్ని తీసుకుంది. ఓంకార మంత్రం ధనుస్సు అంటున్నది.

రెండు నియమాలు ముఖ్యంగా పాటించాలి.

1. బాణం నిటారుగా ఉండాలి. దానికి కర్మయోగం తోడ్పడుతుంది. అమానిత్వం, అదంభిత్వంలాంటి విలువలను కూడా సాధన చేయాలి.

2. బాణం పదునుగా ఉండాలి. దానికి ఉపాసనయోగం తోడ్పడుతుంది. ఉపాసనద్వారా బుద్ధి పదునెక్కుతుంది, ఏకాగ్రత అలవడుతుంది.

ఈ ధనుర్బాణం రూపకల్పన ఉపనిషత్తుల్లో చాలా ముఖ్యమైనది. అందువల్ల దాని గురించి వివరంగా చెప్పటం జరిగింది.

జ్ఞానయోగమనే విలువిద్య సరిగ్గా సాధన చేస్తే – 5 ఫలితాలు స్పష్టంగా పొందవచ్చు.

వాటిని వేదాంత గుళికలుగా (సారంగా) అందరూ జీర్ణించుకోవాలి. అవి

1. నేను సర్వవ్యాపకమైన చైతన్యాన్ని.
2. శాంతి, ఆనందం, భద్రతలు పొందే మార్గాన్ని నేనే.
3. కేవలం నా ఉనికివల్లే నా భౌతిక శరీరానికి జీవం ఏర్పడి, ఈ జగత్తులో వ్యవహారం నడపగలుగుతోంది.
4. ఈ జగత్తులో ఏం జరిగినా చైతన్యస్వరూపుడనైన నాకు అది అంటదు.
5. నా అసలు స్వరూపాన్ని నేను మర్చిపోయి నా జీవితాన్ని భారంగా చేసుకుంటున్నాను. జ్ఞానయోగమనే విలువిద్యను సరిగ్గా సాధన చేసి, జీవితాన్ని ఒక ఆటగా మలచుకుంటాను.

ఇందులో ముఖ్యమైన మంత్రాలు – 3, 11, 12.

# ఏకాదశ ఉపనిషత్తుల సారం

## ముండకోపనిషత్ - ముండకం 3

ముండకోపనిషత్తులోని మొదటి రెండు అధ్యాయాలనూ చూశాము. అధ్యాయాన్ని ముండకం అంటారని కూడా చూశాము. మొదటి ముండకంలో, ముండకోపనిత్తుకు ఆధారమైన ప్రశ్న వస్తుంది.

**కస్మిన్ను భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతీతి**

దానికి జవాబుగా అపరావిద్య, పరావిద్యలను ప్రవేశపెట్టి, పరావిద్య నేర్చుకుంటే సర్వం నేర్చుకున్నట్టవుతుందని చూపించారు. కర్మకాండను ప్రవేశపెట్టి, కర్మకాండయొక్క పరిమితిని సూచించి, కర్మకాండనుంచి జ్ఞానకాండకి ఎలా రావాలో కూడా వివరించాడు గురువు అంగిరసుడు.

రెండవ ముండకంలో జీవాత్మ-పరమాత్మల ఐక్యాన్ని వివరించాడు. అందువల్ల మూడు అధ్యాయాల్లోకీ రెండవ అధ్యాయం చాలా ముఖ్యం. ఈ అధ్యాయంలోని మొదటి ఖండంలో పరమాత్మని సద్రూపంగా వర్ణిస్తే, రెండవ ఖండంలో జీవాత్మని చిద్రూపంగా వివరించి, సత్తే చిత్, చిత్తే సత్ అని నిరూపించాడు. ఈ అధ్యాయంలో ఈ ఐక్యాన్ని చూపించే మంత్రాలు చాలా ఉన్నాయి. అందువల్ల ఈ అధ్యాయం మహావాక్యప్రధాన అధ్యాయం. దీనితో ఉపనిషత్తులోని శిఖరాగ్రానికి చేరుకున్నాము. అందువల్ల ఇంక కిందికి దిగిరావాలి.

శాస్త్రీయ సంగీతంలో ముఖ్యమైన రాగం, తానం, పల్లవి, తనియావర్తనం అయిపోయాక, ఒక్కోసారి లలితసంగీతం పాడతారు. నిజానికి ఆ పాటలకోసం ఎదురుచూసేవారు ఎక్కువమంది ఉంటారు. ఆ విధంగా వేదాంతమనే శాస్త్రీయసంగీతంలో రాగం, తానం, పల్లవి, రెండవ అధ్యాయంలో అయిపోయాయి. ఇప్పుడు లలితసంగీతంలా వేదాంత సాధనలు చూడబోతున్నాము.

ఈ సాధనలు రెండు రకాలు - **సాక్షాత్ సాధన, సహకారీ సాధనలు.** ఉదాహరణకు అనారోగ్యం వస్తే మందు వేసుకోవటం సాక్షాత్ సాధన. దానికి తగ్గ పథ్యం చేయటం సహకారీసాధన. పథ్యం కూడా ముఖ్యమే. ఇప్పుడు వేదాంతం విషయంలో జ్ఞానయోగం సాక్షాత్ సాధన. ఈ అధ్యాయంలో ఈ సాధనలను చూస్తాము.

## ముండకం - 3 ఖండం - 1

మూడవ ముండకంలోని ప్రథమ ఖండం చూద్దాము. అందులో పది మంత్రాలు ఉన్నాయి. ఈ మంత్రాల్లో సాక్షాత్ సాధన, సహకారీసాధనలు వస్తాయి. ఆత్మజ్ఞానం పొందటానికి ఇవి తోడ్పడతాయి. ఇంకా చెప్పాలంటే జ్ఞానయోగ్యతాప్రాప్తికి తోడ్పడతాయి. అవేమిటో ఒక్కొక్కటిగా చూద్దాము.

1) **సాక్షాత్ సాధన - సమ్యక్ జ్ఞానం** - శాస్త్రం నువ్వు అనంతం, నువ్వు సర్వవ్యాపకం అంటుంది. శాస్త్రం నువ్వు అనంతం, సర్వవ్యాపకం అన్నప్పుడు 'నువ్వు' ఎవరో సరిగ్గా అర్థం చేసుకోవాలి. ఎందుకంటే, నువ్వు అంటే శరీరం అవచ్చు, నువ్వు అంటే మనస్సు కూడా అవచ్చు. సందర్భాన్నిబట్టి ఆ నువ్వు ఎవరో మారుతూ ఉంటుంది. వేదాంతం నువ్వు అన్నప్పుడు, అది ఏ నువ్వో తెలియకపోతే, అయోమయంలో పడిపోతారు.

నువ్వు సర్వవ్యాపకం అని వేదాంతం అంటే అక్కడ నువ్వని శరీరంగా తీసుకున్నారనుకోండి, అదెలా సాధ్యం అనిపిస్తుంది. తమిళంలో ఆళ్ అంటే మనిషి. ఆళ్ అయిన నేను గట్టిగా హాల్ కూడా వ్యాపించటం లేదే, ఆల్ ఎలా అవుతాను అని ఆశ్చర్యపోతారు. ఇంక అక్కణ్ణుంచీ వేదాంతం ఇలా పరస్పరవిరుద్ధమైన భావాలను బోధిస్తున్నది అనే పొరపాటులో పడిపోతారు. అందువల్ల వేదాంతాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. నువ్వు అంటే ఏ నువ్వో తెలుసుకోవాలి.

వేదాంతపరిభాషలో 'నేను' పదంలో మూడు అంశాలు కలిసివుంటాయి. ఇదంతా తత్త్వబోధలో చూస్తాము. అది వేదాంతానికి ప్రాథమిక గ్రంథం. ఇక్కడ మనం ఆ మూడు అంశాలేమిటో టూకీగా చూద్దాము.

**మొదటి అంశం - చైతన్యం.** చైతన్యం ఐదు లక్షణాలను చూశాము. అందులో ఒక లక్షణం చైతన్యం సర్వవ్యాపకం. సర్వవ్యాపకమైన చైతన్యం మన మనశ్శరీరాలలో కూడా ఉంటుంది. మనశ్శరీరాలకు సాంకేతిక పదం - కార్యకరణసంఘాతం, బాడీమైండ్ కాంప్లెక్స్. ఈ చైతన్యాన్ని బింబచైతన్యం అనీ, చిత్ అనీ అంటారు. ఇంగ్లీషులో ఒరిజినల్ కాన్షియస్‌నెస్ అనీ, ఒ.సి. (OC) అనీ అంటారు.

**రెండవ అంశం - ప్రతిబింబమాధ్యమం.** మన మనశ్శరీరాలను కార్యకరణసంఘాతం అంటారని చూశాము. అవి జడమైనా, మనస్సుకు అద్దంలా ప్రతిబింబింపజేసే లక్షణం ఉంది. మనస్సు బింబచైతన్యాన్ని ప్రతిబింబింపజేస్తుంది కాబట్టి దాన్ని ప్రతిబింబమాధ్యమం అంటారు. దాన్ని ఇంగ్లీషులో రిఫ్లెక్టింగ్ మీడియం అనీ, ఆర్.ఎమ్. (RM) అనీ అంటారు. మనస్సు రెండవ అంశం.

**మూడవ అంశం – ప్రతిబింబ చైతన్యం.** బింబచైతన్యాన్ని ప్రతిబింబమాధ్యమం అయిన మనస్సు ప్రతిబింబింపజేస్తే, ఆ మనస్సులో ఒక ప్రతిబింబం ఏర్పడుతుంది, అద్దం ముందు మనం నిల్చుంటే, మన ప్రతిబింబం ఏర్పడినట్టుగా. మనస్సులోని ప్రతిబింబం చైతన్యానిది కాబట్టి దాన్ని ప్రతిబింబచైతన్యం అంటారు. ఇంగ్లీషులో రిఫ్లెక్టెడ్ కాన్షియస్‌నెస్ అనీ, ఆర్.సి. (RC) అనీ అంటారు. ఈ ప్రతిబింబచైతన్యాన్ని చిదాభాస అంటారు. చిత్‌యొక్క ఆభాస అన్నమాట.

ఆ విధంగా ఇప్పుడు మన శరీరంలో మూడు అంశాలు ఉన్నాయి. అవి చిత్, మనస్సు, చిదాభాస. వీటిలో ఏది సర్వవ్యాపకమో, శాశ్వతమో చూద్దాము.

మనస్సు, కార్యకరణసంఘాతంలోనిది. దానికి అన్ని విధానాలుగానూ పరిమితి ఉంది. అందువల్ల మనస్సుకు పరిమితి ఉంది. పరిమితి ఉన్న మనస్సులో ఏర్పడిన చిదాభాసకు కూడా సహజంగానే పరిమితి ఉంటుంది. చిన్న అద్దంలో చిన్న ప్రతిబింబం ఏర్పడితే, పెద్ద అద్దంలో పెద్ద ప్రతిబింబం ఏర్పడుతుంది. అందువల్ల ప్రతిబింబం, దాన్ని ప్రతిబింబింపజేసే మాధ్యమంమీద ఆధారపడివుంటుంది.

ప్రతిబింబమాధ్యమాలు ఎన్ని ఉంటే, ప్రతిబింబాలు కూడా అన్ని ఉంటాయి. ఎన్ని మనశ్శరీరాలు ఉంటే, అన్ని ప్రతిబింబాలు ఉంటాయి. అంతే కాదు, మనశ్శరీరాలకు పుట్టుక ఉంది కాబట్టి, వాటిలో ఏర్పడిన చిదాభాసకూ పుట్టుక ఉంటుంది; మనశ్శరీరాలు కదిలితే, చిదాభాస కూడా కదులుతుంది.

ఇప్పుడు ఈ మూడింటినీ – చిత్, చిదాభాస, మనస్సులను రెండు చేయవచ్చు. చిదాభాస మనస్సులను కలిపి అహంకారం అంటారు. నిజానికి చిదాభాసని అహంకారం అంటారు. కాని ఈ చిదాభాసకు విడిగా ఉనికి లేదు. ఇది మనస్సు చెప్పుచేతల్లో ఉంది. మనస్సు నియంత్రణలో, మనస్సు ప్రభావంలో ఉంది. అందువల్ల చిదాభాసను విడదీసి చూడలేము. అలాగే చిదాభాస లేకుండా మనస్సు చేతనం అవలేదు. అందువల్ల చిదాభాస సహిత మనస్సు అహంకారం అయింది.

ఈ రెండూ కాక, మూడవ అంశం ఒకటి చూశాము. దాన్ని చిత్ అంటారని చూశాము. దాన్ని వ్యష్టిలో సాక్షిచైతన్యం అంటారు. ఇప్పుడు నేను అంటే రెండు అంశాలు అయ్యాయి.

1. అహంకారం – చిదాభాస, మనస్సు
2. సాక్షిచైతన్యం – చిత్

నిజానికి వ్యష్టి రెండు అంశాల మేలుకలయిక అయినా, మనం నేను అని వ్యవహరించినప్పుడు ఈ రెండింటిలో ఏదో ఒకదాని గురించి చెబుతున్నట్టు అర్థం.

నేను లావుగా ఉన్నాను, నాకు ఇరవై ఏళ్ళు – స్థూలశరీర అభిమానైన నేను

నన్ను మా అబ్బాయి బొత్తిగా పట్టించుకోవటం లేదు – మనస్సు అభిమానైన నేను

నేను సత్ చిత్ ఆనంద ఆత్మను – సాక్షిచైతన్యమైన నేను

ఒక్కోసారి వేదాంతం వింటున్నప్పుడు కూడా, మధ్యలో అహంకారం నేను దూసుకు వచ్చేస్తుంది. వేదాంతబోధకు వెళ్ళినప్పుడు, చెప్పులు బయట వదిలి వెళ్ళినట్టుగా, మీ అహంకారం 'నేనును' బయట వదిలి వెళ్ళాలి. అప్పుడు మిగిలింది ఏమిటి? సాక్షిచైతన్యమైన నేను. నిజానికి అహంకారాన్ని వదలలేరు. మరి బయట వదలాలి అంటే అర్థం ఏమిటి? దాన్ని అట్టడుగుకు తోసేయాలి. శ్రవణం సమయంలో అహంకారం నేను అడుగుకు వెళ్ళిపోతుంది కాబట్టి, గురువు నువ్వు సర్వవ్యాపకం అంటే అది వింతగా అనిపించదు. ఎందుకంటే సాక్షిచైతన్యం సర్వవ్యాపకం.

తత్త్వమసి మహావాక్యం వింటున్నప్పుడు, ఏ నేను ముందుకు రావాలి? సాక్షిప్రధాన శిష్యుడు వినాలి. అహంకార ప్రధాన శిష్యుడు వినలేడు; విన్నా అర్థం చేసుకోలేడు; అర్థం చేసుకున్నా జీర్ణించుకోలేడు. నేనేమిటి, పరమాత్మతో సమానం ఏమిటి; అది మహాపరాధం అనుకుంటాడు. ఈ సాక్షిప్రధానశిష్యుడే వేదాంతాన్ని అందుకోగలడు.

ఈ విషయాన్ని మూడవ ముండకంలో ప్రథమ ఖండంలో మొదటి మంత్రంలోనే పక్షికల్పన ద్వారా చూస్తాము.

**ద్వా సుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే।**

**తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి అనశ్నన్ అన్యః అభిచాకశీతి ॥** – 3.1.1

ఈ మంత్రం తాత్పర్యం ఒకే చెట్టుమీద, ఒకే విధమైన రెండు పక్షులు ఉన్నాయి. రెండూ మెరిసిపోతున్నాయి. వాటిలో ఒకటి పిప్పలం పండును ఆస్వాదిస్తూ తింటున్నది. ఇంకొకటి తినకుండా చూస్తున్నది. ఈ సారాన్ని ఇంతవరకూ చూసిన అంశాలతో పోల్చి చూద్దాము.

| | | |
|---|---|---|
| పిప్పలం చెట్టు | – మనస్సు | |
| పిప్పలం పండును ఆస్వాదిస్తున్న పక్షి | – చిదాభాస | – తక్కువస్థాయి నేను |
| తినకుండా చూస్తున్నది | – చిత్ | – ఉన్నతస్థాయి నేను |

ఈ రెండింటిలో సాక్షిచైతన్యం ఏమీ చేయదు. అది అకర్తా, అభోక్తా. దానికి కర్మఫలం అంటదు అంటే పుణ్యపాపాలు అంటవు. అందువల్ల సుఖదుఃఖాలు లేవు. అందువల్ల నిత్యముక్త. ఇది ఉన్నతస్థితిలో ఉన్న నేను పరిస్థితి.

తక్కువస్థితిలో ఉన్న నేను ఎప్పుడూ ఏదో చేస్తూనే ఉంటాను. ఆలోచనలద్వారా మానస కర్మలు, వాక్కుద్వారా వాచిక కర్మలు, శరీరం ద్వారా కాయిక కర్మలు చేస్తూనే ఉంటాను. అందువల్ల అహంకారం దృష్ట్యా నేను కర్తా, భోక్త. అందువల్ల పుణ్యపాపాలు వస్తాయి; దానివల్ల సుఖదుఃఖాలు భరిస్తూ, పునరపి జననం, పునరపి మరణం వృత్తంలో పడి తిరుగుతుంటాను.

ఇదీ సాక్షి, అహంకారాల పరిస్థితి. పక్షికల్పనద్వారా ఈ భేదాన్ని సూచిస్తున్నది ఉపనిషత్తు. అజ్ఞానంవల్ల పొరపాటుపడి నేను అహంకారం అనుకుంటాను. జ్ఞానం పొందితే నేను సాక్షిచైతన్యాన్ని అని అర్థం చేసుకుంటాను.

**అహంకార సత్త్వే సంసార సత్త్వమ్।**
**అహంకార అభావే సంసార అభావః।**
**తస్మాత్ అహంకారః ఏవ సంసారస్య కారణమ్।**

అహంకారంతో మమేకం చెందితే అది సంసారానికి దారితీస్తుంది. జ్ఞానం పొంది, సాక్షి చైతన్యమైన నా ఉన్నతస్థాయికి ఎదిగితే, మోక్షం పొందుతాను. అందువల్ల మొట్టమొదటి సాధన – సాక్షాత్ సాధన. జ్ఞానం పొందటం – **అహంకారం, సాక్షిల వివేకం**. దీన్ని **సమ్యక్ జ్ఞానం అంది ఉపనిషత్తు.**

తరువాత చెప్పబడినవి సహకారీసాధనలు. మొదటిషట్కంలో ఈ సహకారీసాధనలు ఐదు చూస్తాము. అవి సత్యం, తపస్సు, బ్రహ్మచర్యం, సూక్ష్మబుద్ధి, ఆత్మజ్ఞానుల పూజ లేదా గురుపూజ.

**సత్యేన లభ్యస్తపసా హ్యేష ఆత్మా**
**సమ్యక్ జ్ఞానేన బ్రహ్మచర్యేణ నిత్యమ్।**
**అన్తఃశరీరే జ్యోతిర్మయో హి శుభ్రః**
**యం పశ్యన్తి యతయః క్షీణదోషాః॥** – 3.1.5

ఈ ఐదవ మంత్రంలో సాక్షాత్ సాధన అయిన సమ్యక్ జ్ఞానం గురించీ, సహకారీ సాధనలయిన సత్యం, తపస్సు, బ్రహ్మచర్యం గురించీ పేర్కొన్నది ఉపనిషత్తు.

2) **సహకారీ సాధనలు–**

1. **సత్యం** – ఈ సత్యం అనే విలువను అన్ని ఉపనిషత్తులూ మెచ్చుకుంటాయి. ముండకోపనిషత్తు కూడా దీన్ని వదలలేదు.

**సత్యమేవ జయతే**

ఈ వాక్యాన్ని మన రూపాయి నాణెంమీద, నోట్లమీద చూస్తాము. అది ముండకోపనిషత్తులోంచి గ్రహించబడింది. అంటే మన పూర్వీకులు వేద, వేదాంతాల్లో ఎంత నిష్ణాతులో గమనించండి. ఆధ్యాత్మికంగా చూస్తే జయం అంటే జ్ఞానం పొంది, మోక్షం పొందటం.

సత్యం పదానికి సందర్భాన్నిబట్టి రెండు అర్థాలు ఉన్నాయి. ధర్మశాస్త్రంలో అర్థం వేరు; బ్రహ్మవిద్యాబోధలో అర్థం వేరు. ఏమిటా భేదం? ధర్మశాస్త్రపరంగా సత్యం అంటే నిజం పలకటం. **వాచికతపస్సు** అంటారు దాన్ని. ఇది నైతికవిలువలను బోధిస్తుంది. మనసా వాచా కర్మణా సత్యాన్నే పాటించాలి. మనస్సులో ఒకటీ, బైటకి ఒకటీ చెప్పకూడదు. అందువల్ల ఇక్కడ సత్యం అంటే సత్యం పలకటం; ధార్మిక జీవనం గడపటం.

అదే బ్రహ్మవిద్యాబోధకు వస్తే, సత్యం అర్థం మారిపోతుంది. దానికి మనస్సుతో కాని, వాక్కుతో కాని సంబంధం లేదు. అది ఒక నైతికవిలువ కాదు. అదే అంతిమసత్యం. సత్యం అంటే చైతన్యతత్త్వం. సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ. అనంతసత్యం బ్రహ్మ. ఇప్పుడు మనం చూసిన పరిభాషలో చెప్పాలంటే సత్యం అంటే చిత్ లేదా బింబచైతన్యం. సాంకేతిక పరిభాషలో చెప్పాలంటే పారమార్థిక సత్యం.

సత్యాన్ని మూడు స్థాయిల్లో నిర్వచిస్తారు.

**ప్రాతిభాసిక సత్యం** – ఈ సత్యం స్వప్నప్రపంచం ఉన్నంతవరకూ ఉంటుంది. ప్రతిభాసికాలే అంటారు. అది ఉన్నంతవరకూ సత్యం. స్వప్నంనుంచి లేచాక మిథ్య.

**వ్యావహారిక సత్యం** – జాగ్రదవస్థలో ఉన్నంతవరకు జాగ్రత్ ప్రపంచం సత్యం. దాన్నించి మీ ఉన్నతస్థాయికి లేస్తే అది కూడా మిథ్యే. వ్యావహారిక సత్యంలో వ్యవహారం నడుపుతారు కాబట్టి, అందులో పాటించాల్సిన విలువల్లో ముఖ్యవిలువ – సత్యం. అందువల్ల సత్యాన్ని విలువగా వర్ణిస్తే, అది వ్యావహారిక సత్యం.

**పారమార్థిక సత్యం** – పారమార్థిక స్థాయికి ఎదిగితే, ఉన్నదొకటే సత్యం. అదే అంతిమ సత్యం. అదే అద్వైతం. అందువల్ల బ్రహ్మవిద్యాబోధ పరంగా చూస్తే సత్యం అంటే సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ.

వ్యావహారిక సత్యంలో సత్యం ఒక విలువ. పారమార్థిక సత్యంలో సత్యం అంతిమలక్ష్యం. ఉపనిషత్తు ఈ వ్యావహారిక సత్యాన్ని పాటిస్తేనే పారమార్థిక సత్యాన్ని పొందగలరు అంటున్నది. సత్యమేవ జయతే అంది. ఏం జయిస్తారో చెప్పలేదు. అప్పుడు ఆధ్యాత్మిక జయం తీసుకోవాలి;

లౌకిక జయం కాదు. సత్యపంథాలో నడిస్తే, సత్యబ్రహ్మను అర్థం చేసుకోగలుగుతారు. ఎందువల్లనంటే ధార్మిక జీవనం గడపకపోతే, ఆత్మజ్ఞానం పొందినా, అది డిగ్రీ పొందినట్టు అవుతుందే కాని, మీ జీవితాన్ని మార్చలేదు. అందువల్ల జయతే అంటే కోర్టులో గెలవటమో, టెస్ట్ మ్యాచ్‌లో గెలవటమో కాదు; ఆధ్యాత్మికంగా గెలవటం.

**సత్యమేవ (మోక్షం) జయతే**

అని కలుపుకోవాలి. సత్యం పలికితే, లౌకిక విజయాలు పొందుతారో లేదో అనేది మీ ప్రారబ్ధకర్మమీద ఆధారపడి ఉంటుంది. కాని సత్యం పలికితే మాత్రం మోక్షం పొందుతారు. ఆ విధంగా సహకారీసాధనల్లో మొదటిది – **సత్యం.**

2. **తపస్సు** – దీనికి అనేక అర్థాలున్నాయి. ప్రతి ఆధ్యాత్మిక నియమం ఒక తపస్సే.

**ఋతం తపః, సత్యం తపః, శ్రుతం తపః, శాంతం తపః, దమ తపః, శమ తపః, దానం తపః, యజ్ఞం తపః.**

శంకరాచార్యులవారు తపస్సు అంటే ఆర్జవం అంటారు. అంటే మనోవాక్కాయ కర్మలు ఒక్కత్రాటిమీద నడవటం. ఆధ్యాత్మికపరంగా చూస్తే, తపస్సు ఏదో ఆషామాషీ వ్యవహారం కాదు. మొత్తం జీవనవిధానంలోనే మార్పు రావాలి. అంటే ప్రతి చిన్న విషయాన్ని అదుపులో పెట్టుకోవాలి.

మాంసాహారాన్ని మానాలి. ఒక పక్క ఉపనిషత్తు వింటాను, మరొక పక్క మాంసభక్షణ చేస్తాను అంటే కుదరదు. ముందుగా ఆహారనియమాలు పాటించాలి. భాష వినసొంపుగా ఉండాలి. చెడుమాటలు మాట్లాడకూడదు. మంచి పుస్తకాలే చదవాలి. మంచివారితోనే స్నేహం చేయాలి. ఏ పని చేసినా, అది ఆధ్యాత్మిక ఎదుగుదలకు తోడ్పడేటట్టుగా ఉండాలే కాని, దానికి దూరం చేయకూడదు.

**మనశ్చ ఇంద్రియాణాం చ ఐకాగ్ర్యం పరమం తపః**

మనస్సు, ఇంద్రియాలు ఒక్కత్రాటిమీద నడవాలి. అన్నీ ఆత్మవిద్య వైపు ఏకీకృతమై ఉండాలి. సహకారీ సాధనల్లో రెండవ సాధన – **తపస్సు.**

3. **బ్రహ్మచర్యం** – బ్రహ్మచర్యానికి కూడా అనేక అర్థాలు ఉన్నాయి. ఆ అర్థం అతను ఉన్న ఆశ్రమాన్నిబట్టి మారుతుంది. గురుకులంలో ఉంటే బ్రహ్మచారిగా ఉంటాడు. ఆ ఆశ్రమ ధర్మంలో స్త్రీ వ్యామోహం ఉండకూడదు. గురుకులంలో బ్రహ్మచర్యం అంటే గురుశుశ్రూష చేయాలి. ఎందుకు అని అడగకూడదు. **యథోక్తకారీ శిష్యః** అంటే గురువు చెప్పింది చెప్పినట్టుగా చేసేవాడు.

అదే గృహస్థు విషయానికి వస్తే, బ్రహ్మచర్యం అర్థం మారుతుంది. అతనికి స్త్రీవ్యామోహం అనకుండా పరస్త్రీవ్యామోహం ఉండకూడదు అంటారు. పరాయిస్త్రీతో సంపర్కం పెట్టుకోకూడదు. దాన్ని మైథునం అంటారు. అందువల్ల బ్రహ్మచర్యం అంటే అక్రమసంబంధం మానసిక, వాచిక, శారీరక పరంగా కూడా ఉండకూడదు. సహకారీసాధనలో మూడవ సాధన – **బ్రహ్మచర్యం**.

4. **సూక్ష్మబుద్ధి** –

> **ఏషోఽ ణురాత్మా చేతసా వేదితవ్యః**
> **యస్మిన్ ప్రాణః పంచధా సంవివేశ ।**
> **ప్రాణైశ్చిత్తం సర్వమోతం ప్రజానాం**
> **యస్మిన్ విశుద్ధే విభవత్యేష ఆత్మా॥** – 3.1.9

సూక్ష్మబుద్ధి ఉన్నవ్యక్తి మాత్రమే ఈ సూక్ష్మమైన ఆత్మను తెలుసుకోగలడు. సగుణబ్రహ్మను అర్థం చేసుకోవటానికి విశాలదృక్పథం ఉంటే చాలు. విశ్వరూపదర్శనం చేయగలుగుతాడు. కాని నిర్గుణ ఈశ్వరజ్ఞానం విషయానికి వస్తే, ఈ ఉపనిషత్తులో నిర్గుణబ్రహ్మ నిర్వచనం ఈ విధంగా చూశాము.

> **యత్ తదద్రేశ్యమ్ అగ్రాహ్యమ్ అగోత్రమ్ అవర్ణమ్**
> **అచక్షుః శ్రోత్రం తదపాణిపాదమ్।**
> **నిత్యం విభుం సర్వగతం సుసూక్ష్మం**
> **తదవ్యయం యద్భూతయోనిం పరిపశ్యన్తి ధీరాః॥** – 1.1.6

నిర్గుణబ్రహ్మ ఇంద్రియాలకు అందదు; బ్రహ్మకు ఇంద్రియాలు లేవు అంటున్నది ఉపనిషత్తు. ఇంత సూక్ష్మమైన విషయాన్ని అర్థం చేసుకోవాలంటే మన మనస్సును బాగా పదును పెట్టాలి.

> **దూరాత్ సుదూరే తదిహాన్తికే చ** – 3.1.7

అంటున్నది. దూరమైన వస్తువుకన్నా ఇంకా దూరంగా ఉంది అంటూనే, చాలా దగ్గరదానికన్నా దగ్గర అంటున్నది. ఈ భిన్నవాక్యాలను జీర్ణించుకోవటమెలా? పైగా ఉపనిషత్తే తరువాత మంత్రంలో దీన్ని తేలికగా తెలుసుకోలేరు అంటున్నది.

> **న చక్షుషా గృహ్యతే నాపి వాచా**

ఆత్మను కళ్ళు చూడలేవు, వాక్కు వర్ణించలేదు.

**న చక్షుర్గచ్ఛతి న వాగ్గచ్ఛతి నో మనః** – కేన 1.3

కేనోపనిషత్తు కూడా కళ్ళు, వాక్కే కాదు, మనస్సు కూడా అర్థం చేసుకోలేదు అంటుంది. ఆత్మ కంటికి కనబడే వస్తువు కాదు, కాని ఉంది అంటే ఎలా అర్థం చేసుకోవాలి? జగత్తు మొత్తంలో ఉన్నవి రెండే – సబ్జెక్టు (కర్త), ఆబ్జెక్టు (కర్మ). అది ఆబ్జెక్టు కాదు అంటే అది సబ్జెక్టు అయిన నేనే అని అర్థం. కాని ఇది అర్థం కావాలంటే చాలా సూక్ష్మబుద్ధి ఉండాలి. దానికి అనేక సాధనలు చెబుతుంది ఉపనిషత్తు. ముండకోపనిషత్తులోనే చూసిన ధనుర్బాణదృష్టాంతం గుర్తు తెచ్చుకోవాలి.

బాణానికి రెండు లక్షణాలు ఉండాలని చూశాము. బాణం నిటారుగా ఉండాలి, పదునుగా ఉండాలి. ఆత్మజ్ఞానం పొందే వ్యక్తికి చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత ఉండాలని చూశాము. వేదాంతం అధ్యయనం చేయాలంటే చిత్త ఏకాగ్రత ఉంటే చాలదు; సూక్ష్మమైన బుద్ధి ఉండాలి.

**అగ్ర్యయా సూక్ష్మదర్శిభిః – కఠ** 1-3-12

క్షురకుని కత్తి ఉన్నంత పదునుగా బుద్ధి ఉండాలి అని కఠోపనిషత్తులో వస్తుంది. ఎందుకంటే వేదాంతంలో చాలా తర్కం కూడా ఉంటుంది. ఒకపక్క ఆత్మను **ఏషోఽణురాత్మా** అంటున్నది. అంటే అసలు అర్థం ఆత్మ అణువు అంత చిన్నది అనలేము. ఎందుకంటే ఆత్మ సర్వవ్యాపకం. అందువల్ల ఆత్మ చాలా సూక్ష్మమైనది. అణువుని పంచేంద్రియాలతో చూడలేనట్టుగా ఆత్మ కూడా ఇంద్రియ అగోచరం. అందువల్ల **చేతసా వేదితవ్యః.** అందువల్ల సూక్ష్మమైన ఆత్మను సూక్ష్మబుద్ధివల్లనే తెలుసుకోగలము. కంటికి కాటరాక్ట్ ఆపరేషన్ చేయాలంటే గొడ్డలి వాడలేరు కదా. చాలా సూక్ష్మమైన పరికరం వాడాలి. అలాగే స్థూలబుద్ధివల్ల ఆత్మను తెలుసుకోలేము. సూక్ష్మబుద్ధే కావాలి.

ఇక్కడొక విషయాన్ని గ్రహించాలి. ఆధ్యాత్మికజ్ఞానం అయిన ఆత్మజ్ఞానాన్ని కూడా బుద్ధిలోనే పొందాలి. ఆధ్యాత్మికజ్ఞానానికి బుద్ధి అవసరం లేదు అనుకుంటే అది పొరపాటే. లౌకికజ్ఞానం బుద్ధిలో కలుగుతుంది; ఆత్మజ్ఞానం ఆత్మలో కలుగుతుంది అనుకుంటే అది పెద్ద పొరపాటు మాత్రమే. ఆత్మలో ఏ జ్ఞానాన్ని పొందలేము. ఏ జ్ఞానం అయినా కూడా బుద్ధిలోనే కలగాలి. అందువల్ల ఆత్మజ్ఞానం కూడా బుద్ధికి చెందినదే!

మరయితే, ఆత్మజ్ఞానం అని ఎందుకు అంటారు? ఆత్మజ్ఞానం అంటే ఆత్మ**లో** కలిగే జ్ఞానం కాదు. ఆత్మ**గురించి** బుద్ధిలో కలిగే జ్ఞానం. అంటే ఈ జ్ఞానంలో విషయవస్తువు ఆత్మ. అందువల్ల ఆత్మజ్ఞానం అయింది. కాబట్టి ఏ జ్ఞానమైనా బుద్ధిలోనే కలగాలి. సూక్ష్మమైన ఆత్మ గురించి సూక్ష్మబుద్ధి ఉంటేనే నేర్చుకోగలరు.

ఇంకొకపక్క వేదాంతంలో, తర్కం చాలా ఉంటుంది. అందువల్లనే పూర్వం వేదాంతంతో పాటు తర్కశాస్త్రం, మీమాంసశాస్త్రం, వ్యాకరణశాస్త్రం కూడా నేర్చుకునేవారు. బుద్ధిని పదును పరచుకోవాటానికి ఇవి అధ్యయనం చేయలేకపోయినా, ఆధునిక తర్కశాస్త్రం లేదా విజ్ఞానశాస్త్రం నేర్చుకున్నా తార్కికబుద్ధి అలవడుతుంది. కాని లిటరేచర్ తార్కికబుద్ధిని ఎక్కువగా పెంపొందించదు. అది ఊహల్లో తేలిపోయేలా చేస్తుంది. ఊహాగానానికి తర్కం చుక్కెదురు. అందువల్ల తార్కికబుద్ధిని పెంపొందించుకునేదేదైనా అధ్యయనం చేయాలి. సహకారీసాధనలో నాలుగవ సాధన – **సూక్ష్మబుద్ధి.**

5. **ఆత్మజ్ఞానుల పూజ లేదా గురుపూజ –**

**తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్**
**సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్॥**

గురువును శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ గురువుగా ఈ ఉపనిషత్తే కీర్తిస్తుంది. గురువు, గురుపరంపరగా శాస్త్రాన్ని నేర్చుకున్నారు. అందువల్ల గురుపూజనం చేస్తే గురువునే కాదు, గురువుద్వారా శాస్త్రాన్ని, ఈ శాస్త్రాన్ని మనకు గురుపరంపరగా అందించిన గురువులందరినీ పూజించినంత పుణ్యం దక్కుతుంది. గురువులలో ఆదిగురువు సాక్షాత్తూ పరమాత్మ. భగవాన్ భుక్తి ముక్తి ప్రదాత; జ్ఞాని కూడా భుక్తి ముక్తి ప్రదాత. గురువెలా ఫలాలనిస్తాడు?

గురువు లేదా జ్ఞానికి ఈ శక్తి అతనికున్న సత్యకామత్వం, సత్యసంకల్పత్వంవల్ల వచ్చింది. జ్ఞాని సత్త్వగుణప్రధానంగా ఉంటాడు కాబట్టి, అతను ఏం కోరితే అది జరుగుతుంది. ఈశ్వరునికి అహంకారం లేదు. జ్ఞానికి అహంకారం మటుమాయమవుతుంది. అందువల్ల జ్ఞాని కూడా పూజార్హుడవుతాడు.

**ద్వేరూపే వాసుదేవస్య చలం చ అచలమేవ చ ।**
**చలం సన్న్యాసినాం రూపం అచలం ప్రతిమాదికమ్ ॥**

నారాయణుకి రెండు రూపాలు ఉన్నాయి. అవి కదిలే రూపం, కదలని రూపం. అంటే కదిలే సన్న్యాసి, కదలని విగ్రహం. అందువల్ల జ్ఞానిని పూజించాలి. సహకారీ సాధన ఐదు – **ఆత్మజ్ఞానుల పూజ లేదా గురుపూజ.**

### ముండకం – 3 ఖండం – 2

రెండవ ఖండంలో కూడా మరికొన్ని సాధనలు కొనసాగుతున్నాయి. ఈసారి వాటిని ప్రత్యేకశైలిలో అంటే రెండు వ్యతిరేక పదాలతో వివరించింది. ఇవికాక ఆత్మజ్ఞాన ఫలం కూడా వస్తుంది.

6. **తీవ్రముముక్షుత్వం** – తీవ్రముముక్షుత్వం లేకపోతే, ఎంత వేదాధ్యయనం చేసినా, ఎంత మేధాశక్తి ఉన్నా, ఎన్ని ఉపనిషత్తులు విన్నా లాభంలేదు. తీవ్రముముక్షుత్వం ఉన్న సాధకునికే పరమాత్మ తన స్వరూపం ప్రకటిస్తాడు. ఇదే మంత్రం కఠలో కూడా అక్షరాలా ఇలాగే వస్తుంది.

తీవ్రముముక్షుత్వం ఉండాలంటే ఆత్మజ్ఞానం పొందాలనే తపన అన్ని కోరికలనూ మించి ఉండాలి. కోరికలు లేకుండా ఉండాలంటే, ఒక కోరిక ఉండాలి. అదే మోక్షంకోసం కోరిక. మీ తపన ఎదుటివారికి పిచ్చిగా అనిపిస్తుంది. అయినా ఫర్వాలేదు. అదే అసలైన అర్హత. అర్థంకానివారికి మీ తపన వెర్రితనంగానే అనిపిస్తుంది. నిజానికి అది మీ ఒక్కరికే కాదు, ఎందరికో ఉంది.

ఆత్మవరణం అంటున్నది ఉపనిషత్తు. స్వయంవరంలో వరుడిని ఎన్నుకున్నట్టుగా పరమాత్మవరణం లేదా ఆత్మవరణం చేస్తే, ఆ సాధకుడికి పరమాత్మ తన పూర్ణస్వరూపం ప్రకటిస్తాడు. పరమాత్మ ఎవరిని ఎన్నుకుంటే వారికి లభ్యమవుతాడు అంటే పరమాత్మ పక్షపాతం చూపించినట్టు కాదా? పరమాత్మ ఎన్నుకోవటానికి ఒక నిబంధన ఉంది. ఎవరైతే పరమాత్మను ఎన్నుకుంటారో, వారినే పరమాత్మ ఎన్నుకుంటాడు. పరమాత్మను ఎన్నుకోవటం అంటే మోక్షాన్ని కోరటం. సహకారీసాధనలో ఆరు – **తీవ్రముముక్షుత్వం**.

ఇంకొక మూడు సాధనలు నాలుగవ మంత్రంలో వస్తాయి. కాకపోతే ఇక్కడ ఉపనిషత్తు రెండు వ్యతిరేక పదాలు వాడింది. ఈ మూడు లేకపోతే మోక్షం పొందరు అంది.

**నాయమాత్మా బలహీనేన లభ్యో**
**న చ ప్రమాదాత్ తపసో వాऽ ప్యలిఙ్గాత్।**
**ఏతైరుపాయైర్యతతే యస్తు విద్వాన్**
**తస్యైష ఆత్మా విశతే బ్రహ్మధామ॥** – 3.2.4

ఆ సాధనలు – బలం, అప్రమత్తత, అలింగం.

7. **బలం** – బలం అంటే ఆధ్యాత్మిక బలం; సాధన చతుష్టయ సంపత్తి పొందిన బలం; నేర్చుకోవాలనే అంకితభావం. ఆటంకాలను ఎదుర్కొనే పట్టుదల. పట్టుదల ఉంటే ఎన్ని ఆటంకాలు ఎదురైనా ముందుకు సాగుతారు.

**ప్రారభ్యతే న ఖలు విఘ్నభయేన నీచైః।**
**ప్రారభ్య విఘ్ననిహతా విరమంతి మధ్యాః।**
**విఘ్నైః ముహుర్ముహురపి ప్రతిహన్యమానాః।**
**ప్రారబ్ధముత్తమ జనా న పరిత్యజంతి॥**

అధముడు ప్రారంభించడు, మధ్యముడు ప్రారంభించి మధ్యలోనే వదిలేస్తాడు, ఉత్తముడు మొదలుపెట్టి, దాన్ని సాధించే దాకా నిద్రపోడు. అందువల్ల ఉత్తముడు ఎన్ని ఆటంకాలెదురైనా ముందుకు కొనసాగుతాడు కాబట్టి ఓటమి ఎరుగడు. బలం అంటే శారీరక బలం కాదు, మానసిక స్థైర్యం. సహకారీసాధనలో ఏడవ సాధన – **బలం**.

8. **అప్రమత్తత** – అప్రమత్తత అంటే జాగరూకత. దేన్నీ తేలికగా తీసుకోకూడదు. జీవితాన్ని, మన సంప్రదాయాన్ని, గురువును, శాస్త్రాన్ని– దేన్నీ తేలికగా తీసుకోకూడదు. గురువు ధనం తీసుకోకుండా విద్య బోధిస్తే ఆయనను చులకనగా చూడకూడదు. గోరఖ్‌పూర్ సంస్థ పుస్తకాలు అందరికీ అందుబాటులో ఉండాలని చాలా చవకగా అమ్ముతారు. ఈశావాస్యోపనిషత్తు 20 పైసలకు అమ్మేవారు. ఒక వ్యక్తి చవకగా వస్తోంది కదా అని ఒక రూపాయి ఇచ్చి, ఐదు పుస్తకాలు తీసుకున్నాడు. దానితో దాని విలువ అతనికి తెలియలేదు.

ఒకరోజు తను బల్ల దగ్గర కూర్చుని ఏదో రాసుకుంటున్నాడు. ఆ బల్ల కాలు ఒకటి ఊగటం మొదలుపెట్టింది. వెంటనే అతను మారు ఆలోచన లేకుండా ఈశావాస్యోపనిషత్తు పుస్తకాన్ని ఆ కాలుకింద పెట్టేసాడు. అలా చులకన చేసే పుస్తకమా అది? తేలికగా దొరికే వస్తువు విలువ తెలియదు. అందువల్లనే కొందరు గురువులు క్లాసులను రికార్డు చేయకూడదు; శిష్యుడు గురువు వద్దకు వచ్చి నేర్చుకోవాలి అంటారు. అలా కష్టపడి వస్తేనే శాస్త్రం విలువ తెలుస్తుంది అని వారి ఉద్దేశ్యం. కాని చాలామంది గురువులు పోనీలే అని రికార్డింగ్ చేయించి, ఆడియోలు పెట్టుకోవటానికి ఒప్పుకుంటున్నారు. ఎందుకంటే కొందరికి నిజంగా శ్రద్ధ ఉన్నా కూడా, గురువు దగ్గరికి వెళ్ళి నేర్చుకునే పరిస్థితి ఉండదు.

మన స్వామీజీ మూడేళ్ళ కోర్సు పూజ్యస్వామీజీ దగ్గర నేర్చుకునే రోజుల్లో, రికార్డు చేయటం పూజ్యస్వామీజీ ఒప్పుకునేవారు కారుట. ఒకరోజు క్లాసు పోయింది అంటే పోయినట్టే! అందువల్లనే 104 డిగ్రీల జ్వరంతో ఒళ్ళు సలాసలా కాలిపోతున్నా, క్లాసుకి విధిగా హాజరు అయ్యేవారు. అంత విలువనిచ్చేవారు శాస్త్రానికి. అందువల్లనే దేన్నీ నిర్లక్ష్యం చేయకూడదు. దానికి విలువనివ్వాలి.

బదరీనాథ్‌కి వెళ్ళే దోవలో కారు నడిపేటప్పుడు డ్రైవర్ చాలా అప్రమత్తతతో ఉండాలి. ఒక్క క్షణం ఏమారాడో, ఇక్కడి బదరీనాథ్ ఆలయం కాదు, సరాసరి వైకుంఠంలో ఉన్న బదరీనాథ్‌ను చేరుకుంటాడు. అంత అప్రమత్తతతో జీవితంలో మెలగాలి. అందువల్లనే సత్సంగ సాంగత్యం ఉండాలి. వారు అడుగడుగునా మీ జీవితలక్ష్యం ఐస్‌క్రీములు తినటం కాదు, మోక్షం పొందటమని గుర్తు చేస్తారు. అవి తినకూడదని కాదు, వాటిలోనే మునిగి పోకూడదు. సహకారీసాధనలో ఎనిమిదవ సాధన – **అప్రమత్తత**.

9. **అలింగం** – ఇక్కడ వైరాగ్యం. వైరాగ్యం రెండు రకాలుగా చూపవచ్చు. బాహ్యంగా సంసారాన్ని, ఆస్తిపాస్తులను వదులుకుని సన్న్యాసం స్వీకరించటం ఒక పద్ధతి. పూర్వం సన్న్యాసాశ్రమ ధర్మం ఉండేది. దాన్ని వివిదిషా సన్న్యాసం అంటారు. ఇప్పటి పరిస్థితులనుబట్టి బాహ్యంగా సన్న్యాసం స్వీకరించనవసరం లేదు. ఆంతర సన్న్యాసం పెంపొందించుకుంటే చాలు. దాన్ని విద్వత్ సన్న్యాసం అంటారు. ఆస్తి, కుటుంబం, హోదా– వీటన్నింటిమీద మమకారాన్ని, బంధాన్ని వదులుకోవాలి. బంధం ఉండి తీరాలంటే, ముగ్గురి మీదే పెంచుకోవాలి. అవి గురువు, శాస్త్రం, ఈశ్వరుడు. ఈ ముగ్గురిమీద బంధం పెంచుకుంటే, వారే మిమ్మల్ని బంధవిముక్తులను చేస్తారు.

**వేదాన్తవిజ్ఞానసునిశ్చితార్థాః సంన్యాసయోగాత్ యతయః శుద్ధసత్త్వాః।**
**తే బ్రహ్మలోకేషు పరాన్తకాలే పరామృతాః పరిముచ్యన్తి సర్వే॥** –3–2–6

ఈ మంత్రాన్ని సన్న్యాసి గృహస్థు దగ్గరకు వచ్చినప్పుడు, ఆయనను పూర్ణకుంభంతో స్వాగతిస్తూ పఠిస్తారు. సన్న్యాసి మళ్ళీ బంధం పెట్టుకోకూడదని గుర్తుచేసే మంత్రం ఇది.

10. **శిరోవ్రతం** – ఇంకా కొన్ని ఉన్నాయి కాని శిరోవ్రతాన్ని చూద్దాము. శిరోవ్రతాన్ని విధి విధానంగా చేసిన శిష్యునికి మాత్రమే, బ్రహ్మవిద్యను గురువు బోధించాలని ఋగ్వేదంలో గురువుకు సూచన ఇవ్వబడింది. ఈ వ్రతానికి అథర్వణ వేదానికి చెందిన శిష్యులు చేస్తారు. ముండకోపనిషత్తుకు ఈ పేరు రావటానికి కారణాల్లో ఒక కారణం ఈ శిరోవ్రతం. ముండకం అంటే శిరస్సు.

శిరోవ్రతాన్ని – శిరసి అగ్నిధారణ వ్రతమ్ అని నిర్వచిస్తారు శంకరాచార్యులవారు. శిరోవ్రతం అంటే మండుతున్న అగ్నిని కుండలో పెట్టుకుని, అగ్ని చుట్టూ తిరగాలి. అగ్ని అంటే కాంతి. తనకి జ్ఞానమనే కాంతి కావాలన్న కోరికని వెలిబుచ్చుతున్నట్టు అర్థం. ఇదికాక, క్రియావన్తః అని వస్తుంది ఈ మంత్రంలో. అంటే వీరు కర్మయోగులై మోక్షంకోసం కర్మలు చేసివుండాలి. ఈ వ్రతాన్ని సూచించటం బట్టి, క్రియావన్తః పదాన్నిబట్టి వేదాల్లోని కర్మకాండను చిన్నచూపు చూడకూడదని అర్థమవుతున్నది. పూజను, జపాన్ని, యజ్ఞయాగాదులను కించపరచకూడదు. కర్మయోగం పాటించి, చిత్తశుద్ధి పొంది, జ్ఞానం పొందినా కూడా, కర్మలను మానకూడదు.

ఎందుకంటే జ్ఞాని తక్కినవారికి ఆదర్శప్రాయంగా నిలవాలి. సన్న్యాసి క్రియలను మానగలడు కాని, గృహస్థు తన పిల్లలకు మార్గదర్శిగా నిలవాలి. వారు మతపరమైన జీవితాన్ని పాటిస్తేనే, ఆధ్యాత్మిక సిద్ధాంతం వారిని దీవిస్తుంది. ఇదీ మన భారతీయ సిద్ధాంతం ప్రత్యేకత! అందువల్లనే మనం అద్వైత వేదాంతం, అత్యంత ఉన్నతమైన సిద్ధాంతాన్ని బోధిస్తున్నా కూడా, భగవంతుని పటం పక్కన పెట్టుకుని, శాంతిపాఠం వల్లిస్తాము.

సగుణబ్రహ్మ కూడా శాశ్వతం కాదు, పరిమితి ఉన్న దేవుడు. నిర్గుణబ్రహ్మే అంతిమ సత్యం అని నేర్చుకోవటానికి సగుణబ్రహ్మ కృపాకటాక్షాలు కోరుతాము. అదీ మన ప్రత్యేకత. సహకారీసాధనల్లో పదవ సాధన – **శిరోవ్రతం**.

**ఆత్మజ్ఞానఫలం** – ఇలా సహకారీసాధనలు, సాక్షాత్ సాధన చేసి ఆత్మజ్ఞానం పొందితే కలిగే ఫలం ఏమిటి? రెండు ఫలాలని చెబుతున్నది శాస్త్రం. అవి జీవన్ముక్తి, విదేహముక్తి.

**జీవన్ముక్తి** – జీవన్ముక్తిని అనేక విధాలుగా నిర్వచించవచ్చు. ముండకోపనిషత్తు,

ఎ) **తరతి శోకం** అని నిర్వచిస్తున్నది. అన్ని దుఃఖాలనుంచి విముక్తి చెందుతాడు. నాకే ఎందుకు వచ్చింది అని వాపోతూ కూర్చోడు. దుఃఖం కలుగక తప్పదు. కాని దాన్ని కూడా నవ్వుతూ స్వీకరిస్తాడు.

బి) **సర్వకామనివృత్తి – గుహాగ్రంథిభ్యో విముక్తః** – అహంకారమమకారంతో హృదయమనే గుహలో వేసుకున్న ముడులు విడివడతాయి. మనకున్న మూడు ముళ్ళు – అజ్ఞానం, కోరిక, కర్మ. అజ్ఞానం తొలగిపోతే, దానివల్ల పుట్టిన కోరిక, కర్మ కూడా వాటికవే పోతాయి. ఇది జీవన్ముక్తి.

**విదేహముక్తి** – మరణించాక జ్ఞాని అన్నిరకాల పుణ్యపాపాలనుంచి విడివడతాడు. తత్త్వబోధలో నేర్చుకున్న కర్మసిద్ధాంతం ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి. ప్రతివ్యక్తికీ మూడు రకాల కర్మలు ఉంటాయి. సంచితకర్మ, ప్రారబ్ధకర్మ, ఆగామికర్మ. జ్ఞాని విషయంలో ఈ మూడూ ఏమౌతాయో చూద్దాం.

సంచితకర్మ – జ్ఞానాగ్ని సంచితకర్మను దగ్ధం చేస్తుంది.
ఆగామికర్మ – తనను ఆత్మగా అర్థం చేసుకుంటాడు కాబట్టి ఆగామికర్మలు పుట్టవు.
ప్రారబ్ధకర్మ – ప్రారబ్ధకర్మ పూర్తయిన క్షణమే, ఈ జీవితం ముగుస్తుంది.

ఆ విధంగా జ్ఞానికి మరణించినప్పుడు, కర్మశేషం ఉండదు. అతనికి పునరపి జననం, పునరపి మరణం ఉండదు. అందువల్ల అతని మరణాన్ని **పరాన్తకాలే** అంటున్నది ఉపనిషత్తు. అతని స్థూలశరీరాన్ని ఇక్కడ కాల్చేస్తారు. సూక్ష్మశరీరం సూక్ష్మప్రపంచంలో కలిసిపోతుంది. అంటే అతని మనస్సు, చిదాభాస సమష్టిలో కలిసిపోతుంది. చిత్ ఏమవుతుంది? చిత్ సర్వవ్యాపకం. శరీరమనే తొడుగు పోతే చిత్ సమష్టిలో ఒకటయిపోతుంది. దీన్ని నది–సముద్ర దృష్టాంతంలో అద్భుతంగా వర్ణించింది ఉపనిషత్తు.

**యథా నద్యః స్యన్దమానాః సముద్రే అస్తం గచ్ఛన్తి నామరూపే విహాయ।**
**తథా విద్వాన్ నామరూపాద్విముక్తః పరాత్పరం పురుషముపైతి దివ్యమ్॥** – 3.2.8

పొంగి ప్రవహించే నదులన్నీ ఏ విధంగా నామరూపాలు వదిలిపెట్టి సముద్రంలో కలిసిపోతాయో, ఆ విధంగా జ్ఞాని నామరూపాలనుంచి విడివడి, పరమాత్మలో ఐక్యం చెందుతాడు. నది సముద్రంలో కలిస్తే, అది నాశనమవదు; దాని నామరూపాలు, పరిమితి, వ్యక్తిత్వం పోతాయి. అందువల్లనే సముద్రస్నానం చేస్తే అన్ని పవిత్రనదులలో స్నానం చేసినంత పుణ్యం దక్కుతుంది అంటారు. అలా జ్ఞాని నామరూపాలనుంచి, కర్మనుంచి విముక్తి పొందుతాడు. ఈ మంత్రం విదేహముక్తి గురించిన వర్ణన.

ఈ విధంగా జ్ఞానఫలం జీవన్ముక్తి, విదేహముక్తి.

**ఉపసంహారం** – ఉపనిషత్తు మొత్తం గురుపరంపరకు నమస్కారం చేయటంతో ముగిస్తున్నది.

**నమః పరమఋషిభ్యో నమః పరమఋషిభ్యః** – 3-2-11

ఉపనిషత్తులో వచ్చిన ఋషులు కూడా ఈ విద్యను వారి స్వంతంగా చెప్పుకోరు. వారు కూడా మేము మా గురుపరంపరనుంచి పొందాము అంటున్నారు. అందువల్ల మనం ఋషులందరికీ నమస్కారం చేస్తాము.

మొదటి మంత్రాల్లోకి వెళితే గురుపరంపర వస్తుంది.

**ఓం బ్రహ్మా దేవానాం ప్రథమః సంబభూవ**
**విశ్వస్య కర్తా భువనస్య గోప్తా।**
**స బ్రహ్మవిద్యాం సర్వవిద్యాప్రతిష్ఠామ్**
**అథర్వాయ జ్యేష్ఠపుత్రాయ ప్రాహ॥**. – 1.1.1

**అథర్వణే యాం ప్రవదేత బ్రహ్మా**
**అథర్వా తాం పురోవాచాఙ్గిరే బ్రహ్మవిద్యామ్।**
**స భారద్వాజాయ సత్యవహాయ ప్రాహ**
**భారద్వాజోఽఙ్గిరసే పరావరామ్॥**– 1.1.2

ముఖ్యమైన మంత్రాలు – 6, 8, 9. మళ్ళీ శాంతిపాఠం పఠిద్దాము.

**శాంతిపాఠం**

**ఓం భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః।**
**స్థిరైరంగైస్తుష్టువాగ్ంసస్తనూభిః। వ్యశేమ దేవహితం యదాయుః।**
**స్వస్తి న ఇన్ద్రో వృద్ధశ్రవాః। స్వస్తి నః పూషా విశ్వవేదాః।**
**స్వస్తి నస్తార్క్ష్యో అరిష్టనేమిః। స్వస్తి నో బృహస్పతిర్దధాతు॥**
**ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

# ఏకాదశ ఉపనిషత్తుల సారం

## కేనోపనిషత్

ఇప్పుడు మనం కేనోపనిషత్తు సారాన్ని చూద్దాము. ముండకోపనిషత్తు తరువాత ఈ ఉపనిషత్తును నేర్చుకోవాలి. ఇందులో రెండు పదాలు ఉన్నాయి. కేన+ఉపనిషత్తు. సంధి జరిగి కేనోపనిషత్తు అయింది. ఇది చిన్న ఉపనిషత్తు. సామవేదానికి చెందినది.

కేనోపనిషత్తులో మొత్తం నాలుగు అధ్యాయాలు ఉన్నాయి. వాటిని ఇందులో ఖండాలు అంటారు. ముండకోపనిషత్తులో 65 మంత్రాలు ఉంటే, ఇందులో మొత్తం 35 మంత్రాలు ఉన్నాయి. అందువల్ల ఇది చిన్న ఉపనిషత్తే అయినా, వేదాంతసారాన్నంతా ఇందులోనే పొందుపరచుకుంది కాబట్టి చాలా ముఖ్యమైనది. దీన్ని చుర్రుమనిపించే చిన్న సీమమిరపకాయతో పోలుస్తారు.

**శాంతిపాఠం** – ఒక్కొక్క వేదానికి ఒక్కొక్క శాంతిపాఠం ఉంటుంది. ఆ వేదానికి చెందిన ఉపనిషత్తుల ముందు ఆ శాంతిపాఠాలను పఠిస్తాము. కేనోపనిషత్తు సామవేదానికి చెందినది కాబట్టి, దాని శాంతిపాఠం ఇది.

**ఓం ఆప్యాయన్తు మమాఙ్గాని వాక్ప్రాణశ్చక్షుః శ్రోత్రమథో బలమిన్ద్రియాణి చ సర్వాణి। సర్వం బ్రహ్మోపనిషదమ్। మాఽహం బ్రహ్మ నిరాకుర్యాం మా మా బ్రహ్మ నిరాకరోత్। అనిరాకరణమస్త్వనిరాకరణం మే అస్తు। తదాత్మని నిరతే య ఉపనిషత్సు ధర్మాస్తే మయి సన్తు। తే మయి సన్తు ॥**

వేదమంత్రాలన్నింటికీ స్వరాలుంటాయి కానీ కాలక్రమేణా వేదాలలోని కొన్ని భాగాలను పారాయణం చేయకపోవటంవల్ల, స్వరబద్ధంగా పారాయణం చేసే సాంప్రదాయం పోతున్నది. దాన్ని విచ్ఛిన్న సాంప్రదాయం అంటారు. అంటే సాంప్రదాయం మధ్యలో తెగిపోయింది. అందువల్ల ఈ మంత్రాలను మనం గద్యభాగాన్ని పఠించినట్టే పఠిస్తాము. మనకు తెలియదు కాని, అన్ని శాంతిపాఠాలకూ స్వరాలు ఉన్నాయి అనే విషయం మర్చిపోకూడదు.

ఈ శాంతిపాఠం సారాంశం చూద్దాము. శాంతిపాఠంలో రెండు పదాలలోనే వేదాంత సారమంతా వచ్చింది. **సర్వం బ్రహ్మ** అంటుంది. అంటే ఉన్నదంతా బ్రహ్మమే; బ్రహ్మ కానిది రెండోది లేదు.

**సర్వం బ్రహ్మమయం రే రే – సదాశివ బ్రహ్మేన్ద్ర**

అంతేకాదు **ఔపనిషదమ్ బ్రహ్మ** అంది. అంటే ఉపనిషత్తు ద్వారానే బ్రహ్మను తెలుసుకోగలం. వేరే ఏ మార్గమూ లేదని తేల్చి చెప్పేసింది. బృహదారణ్యకంలో **ఔపనిషదః పురుషః** అని వస్తుంది. ఇంత కష్టమైన బ్రహ్మజ్ఞానం పొందటానికి నా అంగాలన్నీ బాగుండాలి గాక! నేను బ్రహ్మను అర్థం చేసుకోలేకపోయినా, బ్రహ్మను నిరాకరించకుండు గాక. అలాగే బ్రహ్మ కూడా నన్ను నిరాకరించకుండు గాక అని ప్రార్థన చేస్తున్నాడు. అంతేకాదు ఉపనిషత్తు వివరించిన విలువలు, ఉపనిషత్తుమీద శ్రద్ధ ఉన్న నాలో ఉండుగాక!

**కేనోపనిషత్తు పేరు ఎలా వచ్చింది?** ఒక్కొక్క ఉపనిషత్తుకు ఆయా పేరు భిన్నకారణాలవల్ల వస్తుంది. కేనోపనిషత్తుకు ఆ పేరు 'కేన' పదంతో ఉపనిషత్తు మొదలయింది కాబట్టి వచ్చింది. కాని ఈ సూత్రం ముండకోపనిషత్తుకు వర్తించదు. అది ముండక పదంతో మొదలవలేదు. అక్కడ వేరే కారణం చూశాము. ఈ నేపథ్యంతో ఉపనిషత్తులోకి అడుగు పెడదాము.

## ఖండం 1

ఈ ఉపనిషత్తులో అధ్యాయాన్ని ఖండం అంటారని చూశాము. మొదటి ఖండంలో 9 మంత్రాలు ఉన్నాయి. ఇందులో రెండు అంశాలు చర్చించబడ్డాయి. అవి ఉపోద్ఘాతం, ఆత్మస్వరూపలక్షణం.

1) **ఉపోద్ఘాతం** – ఉపోద్ఘాతం గురుశిష్యులను ప్రవేశపెడుతుంది. చాలా ఉపనిషత్తులు శిష్యుడు గురువును సమీపించి ప్రశ్న వేయటంతో మొదలవుతాయి. వీటిని సాంకేతికంగా చెప్పాలంటే గురు ఉపసదనం, పరిప్రశ్న. బ్రహ్మవిద్య అధ్యయనంలో ఈ రెండూ చాలా ముఖ్యం. వీటివల్ల ఉపనిషత్తులు మనకు కొన్ని విషయాలను చెప్పకనే చెబుతున్నాయి.

1. శాస్త్రాన్ని గురువుద్వారానే నేర్చుకోవాలి, స్వంతంగా నేర్చుకోవటానికి ప్రయత్నించకూడదు.

2. శిష్యుడే గురువు దగ్గరకు వెళ్ళాలి కాని కారు పంపిస్తాను, మా యింటికి వచ్చి నేర్పించండి అని అనకూడదు. అంటే శిష్యుడు గురువుపట్ల వినయంగా ఉండాలి.

3. ఈ విద్య గురుపరంపరగా వస్తున్నది. స్వంతంగా నేర్చుకోవటానికి ప్రయత్నిస్తే, సరిగ్గా అర్థంకాదు. అర్థం కాకపోయినా ఫర్వాలేదు, తప్పుగా అర్థం చేసుకుంటే ప్రమాదం.

4. సంభాషణరూపంలో ఉంటే విషయం తేలికగా అర్థమవుతుంది. మనకు వచ్చే సందేహాలు, రాని సందేహాలు కూడా శాస్త్రం గురుశిష్యుల సంవాదంద్వారా తీరుస్తుంది.

5. కొన్ని ఉపనిషత్తుల్లో, దీనితో సహా, పదాల గారడి చూస్తాము.

ఉదా. శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనః. ఈ గారడీని విప్పగలిగేది గురువు మాత్రమే.

6. అన్నింటికన్నా ముఖ్యమైన విషయం, శిష్యుడు నోరు తెరిచి అడగాలి; నాకు ఆత్మవిద్యను బోధించండి అని. శిష్యుడు అడగందే, గురువు బలవంతంగా బోధించడు. ఆత్మస్వరూపం కిమ్? అని అర్థం వచ్చేలాగా అడగాలి.

కాకపోతే కేనోపనిషత్తులో ప్రత్యేకత ఏమిటంటే ఇక్కడ కూడా గురుశిష్యుల సంవాదరూపంలోనే బోధ సాగుతుంది కాని, గురుశిష్యుల పేర్లు రావు. ముండకోపనిషత్తులో గురువు అంగిరసుడు, శిష్యుడు శౌనకఋషి. అంటే, గురుశిష్యుల పేర్లు ముఖ్యం కాదు. బోధ ముఖ్యం అని అర్థం చేసుకోవాలి. 'ఎక్స్' అనే శిష్యుడు 'వై' అనే గురువు దగ్గరకు వెళ్ళాడు అనుకుందాము. మొట్టమొదటి మంత్రం శిష్యుని ప్రశ్నను పరిచయం చేస్తున్నది.

**ఓమ్, కేనేషితం పతతి ప్రేషితం మనః। కేన ప్రాణః ప్రథమః ప్రైతి యుక్తః ।**
**కేనేషితాం వాచమిమాం వదన్తి చక్షుశ్శ్రోత్రం క ఉ దేవో యునక్తి ॥** 1.1

ముండకోపనిషత్తులోలాగా ఇక్కడ కూడా శిష్యుడు సూటిగా, స్పష్టంగా అడిగాడు. 'కేన' శబ్దంతో అతని ప్రశ్న మొదలవుతున్నది కాబట్టి ఈ ఉపనిషత్తుకు కేనోపనిషత్తు పేరు వచ్చింది.

అతని ప్రశ్నను ఒక్కముక్కలో చెప్పాలంటే దేనివల్ల కోరబడి, ప్రేరేపించబడి, మనస్సు, ప్రాణం, వాక్కు, కన్నులు, చెవులు పనిచేస్తున్నాయి?

అతని ప్రశ్ననుబట్టే అతని తెలివితేటలను అంచనా వేయవచ్చు. అతనికి గురువు దగ్గరకు రాకముందే కొంత ప్రాథమిక జ్ఞానం ఉంది. అతను ఏమీ తెలియని అజ్ఞాని కాదు. అతనికి తెలిసిన అంశాలు ఏమిటి?

1. స్థూలశరీరం పంచభూతాలతో చేయబడిందని తెలుసు. శరీరాన్ని పాంచభౌతిక శరీరం అంటారు. పంచభూతాలు జడం కాబట్టి, వాటితో తయారుచేయబడిన స్థూలశరీరం కూడా జడం లేదా అచేతనం.

2. సూక్ష్మశరీరం కూడా సూక్ష్మపంచభూతాలతో చేయబడింది కాబట్టి అది కూడా జడమే. సూక్ష్మశరీరంలో 19 అంగాలు ఉన్నాయి. అవి పంచ జ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు, పంచప్రాణులు, నాలుగు అంతఃకరణాలు. వాటిలో ఈ శిష్యుడు వాటిని సూచించటానికి కేవలం ఐదు అంశాలను పేర్కొన్నాడు.

| | |
|---|---|
| చక్షుః శ్రోత్రం | – పంచజ్ఞానేంద్రియాలు |
| వాక్కు | – పంచకర్మేంద్రియాలు |
| ప్రాణం | – పంచప్రాణాలు |
| మనస్సు | – నాలుగు అంతఃకరణాలు. |

జడమైన సూక్ష్మభూతాలనుంచి వచ్చాయి కాబట్టి, ఇవి కూడా జడమే అని అతనికి తెలుస్తున్నది.

సైన్సుపరంగా మన శరీరం, మన అంగాలు కొన్ని రసాయనాల మేలుకలయికవల్ల ఏర్పడిందని బయోకెమిస్ట్రీలో నేర్చుకుంటాము. అందువల్ల వాటికి స్వతహాగా చైతన్యం లేదు. అవి పదార్థంలోకి వస్తాయి. బాహ్యప్రపంచాన్ని చూస్తే ఇది అర్థం అవుతుంది.

నమ్మకం లేకపోతే మన శరీరంలో ఉన్న రసాయనాలను (కెమికల్స్) అన్నీ తీసుకుని ఒక గిన్నెలో వేసి చూడండి. ఆ కలయికలో చైతన్యం ఉంటుందా? ఉండదు. అలా వాటిలో చైతన్యం ఉండేటట్టయితే, మన శాస్త్రజ్ఞులు ఎప్పుడో మనుష్యులను సృష్టించి ఉండి ఉండేవారు. ఎందుకు సృష్టించలేదు? టెస్ట్‌ట్యూబ్ బేబీలు లేరా అని వాదించకండి. స్వామీజీ కూడా చిన్నప్పుడు అలాగే అనుకునేవారుట.

సిల్వర్ నైట్రేట్, పొటాషియమ్ క్లోరైడ్, హైడ్రోక్లోరిక్ ఏసిడ్ ఒక టెస్ట్‌ట్యూబ్‌లో వేసి, కొంచెం వేడిచేస్తే, ఒక రాముడు వస్తాడేమో అని అనుకునేవారుట. కాని తరువాత అర్థమయింది. ఒక ప్రాణం ఉన్న వ్యక్తినుంచే ఇంకొక ప్రాణాన్ని ఈ భూమ్మీదకు తీసుకురాగలమని. అందువల్ల జడమైన పదార్థంనుంచి చైతన్యాన్ని తీసుకురాలేము. ఇది మూడవ అంశానికి దారితీస్తుంది.

3. తార్కికంగా చూస్తే శరీరం, ఇంద్రియాలు, మనస్సు జడమవాలి. కాని అనుభవం వేరే చెబుతున్నది. ఇవన్నీ చేతనంగా ఉన్నాయి. వాటిలో స్వతహాగా చైతన్యం లేకపోతే, ఎక్కడనుంచో చైతన్యం అరువు తెచ్చుకుంటున్నాయన్నమాట.

ఉదాహరణకు రెండు ఫ్యానులను చూస్తున్నారు. వాటిలో ఒకటి తిరుగుతున్నది, ఇంకొకటి తిరగటం లేదు. మీకు ఫ్యాను దానంతట అది తిరగలేదని తెలుసు. అందువల్ల కంటికి కనబడే ఫ్యాను వెనక, కంటికి కనబడని అంశం ఏదో ఉందన్నమాట అని అర్థం చేసుకుంటారు. ఆ కనబడని అంశం విద్యుచ్ఛక్తి అని, విజ్ఞానశాస్త్రం ద్వారా నేర్చుకుంటారు.

అలా ఇక్కడ కూడా జడమైన శరీరాన్ని చైతన్యం ఉన్న వస్తువేదో చైతన్నాన్ని అరువు ఇవ్వాలి. ఏమిటా వస్తువు అనటం లేదు శిష్యుడు. ఎవరా దేవుడు అంటున్నాడు. అంటే అది జడం కాదని తెలుసన్నమాట. ఇక్కడ ఒక విషయం గమనించాలి. సాధారణంగా ఒక వ్యక్తి జీవించి ఉన్నాడంటే, ప్రాణం వల్ల అంటాము. శరీరానికి శక్తినిచ్చేది ప్రాణం అనేమాట నిజమే కాని, ప్రాణానికి విడిగా ఉనికి లేదు. అది పంచభూతాల్లో ఒకటైన వాయుతత్త్వం.

ఈ శిష్యుని ప్రశ్న సారాంశం సూక్ష్మశరీరంలో ఉన్న 19 అంగాలు ఏ శక్తివల్ల పని చేస్తున్నాయి. ఒక్కముక్కలో చెప్పాలంటే, ఆత్మస్వరూపం ఏమిటి? ఇక్కడితో ఉపోద్ఘాతం అయింది.

2) **ఆత్మస్వరూపలక్షణం** – శిష్యుడు ఆత్మస్వరూపం ఏమిటని అడిగాడని చూశాము. దానికి గురువు జవాబు చెప్పుకొస్తాడు. ఈ ఉపనిషత్తులో పదాల గారడీలు చాలా ఉన్నాయి. అందువల్ల వాటిల్లోకి వెళ్ళేముందు ఆత్మస్వరూపాన్ని గురువు చెప్పినదాంట్లోంచి విడిగా చూద్దాము.

ఏ దేవతవల్ల ఈ అంగాలన్నీ పని చేస్తున్నాయని అడిగాడు కదా! అది చైతన్యం. దీన్నే చిత్ అనీ, సాక్షిచైతన్యం అనీ, ఆత్మ అనీ అంటారు. గురువు చైతన్యంయొక్క లక్షణాలు మూడు చెప్పాడు. అవేమిటో చూసేముందు చేయి, కాంతి ఉదాహరణ చూద్దాము.

1. ఇక్కడేముంది అని అడిగితే, చేయి ఉంది అని అంటాము. కాని నిజానికి చేయి ఎలా తెలుస్తున్నది? కాంతివల్లనే తెలుస్తున్నది. కాంతి వేరు, చేయి వేరు.

2. కాని కాంతి చేయి అంతటా వ్యాపించి ఉంది. అందువల్లనే చేతిని చూడగలుగుతున్నాము.

3. కాంతి వల్లనే చేతిని చూడగలుగుతున్నా, కాంతిని చూడలేకపోతున్నాము. అది అవ్యక్తం. (ఇక్కడ చూడలేకపోతున్నాము అంటే మనకు తెలియటం లేదు. అందువల్ల అవ్యక్తం.)

ఇప్పుడు గురువు చెప్పిన జవాబు చూద్దాము.

**శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనో యత్ వాచో హ వాచం**
**స ఉ ప్రాణస్య ప్రాణః చక్షుష శ్చక్షుః** – 1.2

ఈ మంత్రాన్ని సంక్షేప ఉత్తరం అనీ, సూత్రభూతమంత్రం అనీ అంటారు. టూకీగా జవాబు ఇచ్చాడు కాబట్టి సంక్షేప ఉత్తరం; ఒక సూత్రంలో వేదాంతసారం పొందుపరిచాడు కాబట్టి సూత్రభూతమంత్రం.

ఈ మంత్రం అర్థాన్ని అక్షరాలా చూస్తే చెవియొక్క చెవి, మనస్సుయొక్క మనస్సు, వాక్కుయొక్క వాక్కు, ప్రాణంయొక్క ప్రాణం, కన్నుయొక్క కన్ను అన్నాడు. ఎందుకు ఈ భాష? చెవియొక్క చెవి అంటే ఇంకో చెవి కాదు. మొదటి చెవి ఇంద్రియం. రెండవ చెవి ఆత్మ లేదా చైతన్యస్వరూపం. ఆత్మ చెవికి భిన్నంగా ఉంది అని చూపటానికి ఇలా చెప్పాడు. రామునియొక్క పుస్తకం అంటే రాముడు వేరు, పుస్తకం వేరు. అలా చెవి వేరు, ఆత్మ వేరు.

కాంతి చేయి ఉదాహరణను శ్రోత్రస్య శ్రోత్రం పదాలకు అన్వయించి చూద్దాము.

1. ఆత్మ వేరు, చెవి వేరు. దేహవ్యతిరిక్తః – దేహానికి భిన్నంగా ఉంది

2. ఆత్మ చెవి అంతటా వ్యాపించి ఉంది. దేహ వ్యాపకః; అవ్యక్తః చ ఆత్మ – ఆత్మ దేహం అంతటా ఉంది, కాని కంటికి కనబడటం లేదు

3. ఆత్మ ఉండటంవల్లనే చెవిని చెవి అనగలుగుతున్నాము. అంటే చెవితో వినగలుగు తున్నాము. చైతన్యః – అవ్యక్తం అయితే ఉందని ఎలా తెలుసు? చైతన్యం ఉండటంవల్లనే జడమైన చెవికి, వినికిడిశక్తి కలుగుతున్నది.

ఈ సూత్రం ప్రకారం కంటికి చూసే శక్తి, మనస్సుకు ఆలోచించే శక్తి – అలా అన్ని అంగాలకూ ఆయా శక్తులు ఏర్పడ్డాయి. అందువల్ల శిష్యుడు అడిగిన అంగాలన్నింటి పేర్లూ గురువు మళ్ళీ చెప్పి, కాకపోతే అదే వరుసక్రమంలో చెప్పలేదు; వాటికి చైతన్యం ఇస్తున్నది ఆత్మ అని ఆత్మలక్షణం చెప్పాడు గురువు. ఇది మొదటి నిర్వచనం.

ఈ అంగాలకి చైతన్యం ఇచ్చేది ఆత్మ. ఇప్పుడు ఆత్మ గురించి వినగానే ఆ ఆత్మను చూడాలనే కుతూహలం బయలుదేరుతుంది. ఈ నిర్వచనం రెండవ నిర్వచనానికి దారి తీస్తుంది. దాన్ని ప్రోగ్రెసివ్ డెఫినిషన్ అంటారు. అంటే రెండవ నిర్వచనం మొదటి నిర్వచనాన్ని సుస్పష్టం చేస్తుంది.

ముందు ఆత్మలక్షణం చూశాము. ఇప్పుడు ఆత్మను తెలుసుకునే ప్రమాణం చూడాలి. లక్షణప్రమాణాభ్యాం వస్తుసిద్ధిః – ఒక వస్తువు గురించి తెలుసుకోవాలంటే, దాని లక్షణమూ తెలియాలి, దాని ప్రమాణమూ తెలియాలి. ఆ గదిలోంచి కుర్చీ తెండి అంటే, తెచ్చే వ్యక్తికి కుర్చీ అంటే ఏమిటో తెలియాలి. కుర్చీని చూసే కన్ను పనిచేయాలి. కుర్చీ లక్షణం, కన్ను ప్రమాణం.

ఇప్పుడు ఆత్మను ఎలా తెలుసుకోవాలి? చైతన్యాన్ని శరీరంనుంచి వేరే చేసే ప్రయోగం ఏమైనా ఉందా? కెమిస్ట్రీ ప్రయోగంలో నేర్చుకుంటారు. ఒక కెమికల్‌ని ఒక రిటార్ట్‌లో పెట్టి వేడి చేస్తే, అది ఆవిరి అవుతుంది. ఆ ఆవిరిని బంధించి చల్లారాక చూస్తే, డిస్టిల్డ్ వేపర్ వస్తుంది. దాన్ని డిస్టిలేషన్ ప్రోసెస్ అంటారు. అలా ఒక వ్యక్తిని వేడి చేస్తే, అతనిలోంచి చైతన్యం ఆవిరిరూపంలో బయటకు వస్తుందా?

అలా వచ్చేటట్టయితే, ఎప్పుడో మన శాస్త్రజ్ఞులు ప్రయోగాలు చేసివుండేవారు. సైన్స్‌లో ఏ విభాగం కూడా న్యూరాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, సెల్యులార్ స్టడీ – చైతన్యం గురించి చెప్పలేకపోతున్నది. చైతన్యం ఏమిటి? కణమా, మెదడా, న్యూరానా? ఎవరికీ తెలియదు. ఎందుకు? ఆత్మను శరీరంనుంచి వేరు చేయలేరు కాబట్టి. పోనీ టెలిస్కోప్, మైక్రోస్కోప్

ఉన్నట్టుగా ఆత్మోస్కోప్ ఏమైనా ఉందా? ఆత్మ అని వినగానే బాహ్యవస్తువులను చూసే ప్రత్యక్షప్రమాణాలను వాడటానికి ప్రయత్నిస్తాము. కాని ఆత్మ ఇంద్రియ అగోచరం అంటుంది శాస్త్రం.

**అశబ్దమస్పర్శమరూపమవ్యయమ్** – కఠ 1.3.15

పోనీ తర్కానికి అందుతుందా? అనుమానప్రమాణం, అర్థాపత్తి ప్రమాణాలకు అందుతుందా?

**నైషా తర్కేణ మతిరాపనేయా** – కఠ

తర్కానికి కూడా అందదు. పోనీ ధ్యానంలో కూర్చుని ఆత్మను అనుభవం పొందుదామా, అదీ కుదరదు. నో మనః అంటున్నది.

**న తత్ర చక్షుర్గచ్ఛతి న వాగ్గచ్ఛతి నో మనః**

ప్రత్యక్ష, అనుమాన ప్రమాణాలకీ అందక, వాక్కుకీ అందక, ధ్యానానికీ అందకపోతే తెలుసుకోవటం ఎలా?

**న విద్మః న విజానీమో యథా ఏతదనుశిష్యాత్** – గురువు నాకు కూడా తెలియదు అనటమే కాదు, నాకే కాదు ఎవరికీ తెలియదు అంటున్నాడు. మరింకేం తెలుసుకుంటాం అని శిష్యుడు నిరాశగా వెళ్ళబోతుంటే, ఆగు, మా గురువులు మాకెలా చెప్పారో అలా చెబుతాను అంటున్నాడు. ఇప్పుడు గురువు అక్షరలక్షలు చేసే వాక్యం చెబుతాడు.

**అన్యదేవ తద్విదితాదథో అవిదితాదధి ।**

ఆత్మ తెలిసిన వస్తువు కాదు, అని ఆగి, ఆగు తెలియని వస్తువూ కాదు అంటాడు. అథ అంటే పైపెచ్చు. తెలియని వస్తువు ఇవాళ తెలియకపోవచ్చు కాని తరువాత తెలియవచ్చు కదా! అంటే తెలియని వస్తువు అంటే తెలుసుకోగలిగిన వస్తువుగా అర్థం చేసుకోవాలి.

ఆత్మ తెలిసిన ఆబ్జెక్టు కాదు, తెలియని ఆబ్జెక్టు కాదు అంటే అసలు ఆత్మ లేనట్టా? కాని ఆత్మ ఉందని గురువు చెప్పాడు కాబట్టి, ఆత్మ లేదని కొట్టిపారేయలేము. అయితే ఆత్మ ఏమిటి? ఇప్పుడు ఆ వాక్యాలను మళ్ళీ చూస్తే తెలుస్తుంది.

ఆత్మ తెలిసిన ఆబ్జెక్టు కాదు
ఆత్మ తెలియని ఆబ్జెక్టు కాదు.

అంటే రెండింటిలోనూ సమానంగా ఉన్న పదం ఏమిటి? **ఆబ్జెక్టు**. ఆత్మ ఆబ్జెక్టు కాదు. ఆత్మ ఆబ్జెక్టు కాదు అనేసరికి ఏమీ మిగలలేదు అనకూడదు. ఆత్మ ఆబ్జెక్టు కాదు,

అది ఉంది. ఉందని నిరూపించనవసరం లేనంతగా ఉంది. ఎందుకు? ఆత్మ తెలిసిన వస్తువు కాదు, తెలియని వస్తువూ కాదు అంటే ఆత్మ, తెలుసుకునే నేను. నేను తెలుసుకోబడే వస్తువును కాను. అనుభవించే నేను ఎన్నటికీ వస్తువుగా అనుభవించబడలేను. తత్త్వబోధలో ఈ సందర్భంలో కొన్ని ఉదాహరణలు చూశాము.

1. మీ వేలికొనతో మీరు అన్నింటినీ స్పృశించగలరు కాని, అదే వేలికొనను ఆ వేలుతోనే మీరు స్పృశించలేరు.

2. మీ కుడిచేత్తో మీరు శరీరం అంతటికీ సబ్బు రాసుకోగలరు కాని, ఆ చేతికి ఆ చేత్తో సబ్బు రాసుకోలేరు.

3. అన్నింటినీ చూసే కన్ను తనను తాను ఎన్నటికీ చూడలేదు.

కళ్ళు విప్పార్చి మీ ఎదురుగుండా ఉన్నవన్నీ చూడగలరు, కాని మీ విశాలనేత్రాలను మీరు చూసుకోలేరు. కళ్ళు తమను తాను చూసుకోలేవంటే, కళ్ళు ఉన్నట్టా, లేదా? వాటికి ప్రత్యేకించి ఏమీ నిదర్శనం అవసరం లేదు. మీరు అన్నింటినీ తేరిపార చూడగలుగుతున్నారంటేనే, మీ కళ్ళు సూదంటురాయిలా పని చేస్తున్నాయన్నమాట. అందువల్ల కళ్ళను చూసుకోలేకపోయినా, మీరు చూస్తున్న ప్రతివస్తువూ మీ కళ్ళకు నిదర్శనం.

ఇదే సూత్రం ఆత్మకు వర్తిస్తుంది. ఆత్మ వల్లనే మీరు అన్ని ఆబ్జెక్టులన్నీ చూడగలుగుతున్నారు కాని ఆత్మను చూడలేరు. ఆత్మవల్లనే తక్కిన అనుభవాలు పొందుతారు, కాని ఆత్మ అనుభవం ప్రత్యేకంగా పొందలేరు. ఆత్మను ఎలా తెలుసుకుంటారు? ఆబ్జెక్టుగా కాదు. అది చూసే వస్తువు కాదు, అనుభవించే వస్తువు అసలే కాదు. ఎందుకు? నేను ఆత్మను అనుభవించాను అంటే చాలు ఆత్మ ఆబ్జెక్టు అయి కూర్చుంటుంది. ఆత్మ తెలిసిన వస్తువూ కాదు, ఇప్పుడు తెలియని, అంటే తరువాత తెలుసుకోగలిగిన వస్తువూ కాదు. ఆత్మ అంటే వస్తువులను తెలుసుకుంటున్న నేనే. అంతకుముందు ఆత్మ అంటే చైతన్యం అని చూశాము. రెండవ నిర్వచనం ఆ చైతన్యాన్ని నేనే.

నిర్వచనం 1 – ఆత్మ చైతన్యం
2 – ఆ చైతన్యాన్ని నేనే.

**గమనిక** – ఆ చైతన్యాన్ని నేనే అంటే ఆ నేను ఎవరో అర్థం చేసుకోవాలి. నేను నిర్వచనం ఆబ్జెక్టుగా తెలుస్తున్నదేదీ సబ్జెక్టు అయిన నేను కాదు.

– నేను ఈ జగత్తు కాదు
– నేను అనుభవిస్తున్న శరీరం కాదు

– నేను ఈ జగత్తును అనుభవిస్తున్న ఇంద్రియాలు కాదు
– నేను రాగద్వేషాలకు లోనయ్యే మనస్సు కాదు
– నేను వాడే కళ్ళజోడును కూడా నేను కాదు.

కళ్ళజోడును బల్లమీద పెట్టి, ఈ బల్లమీద ఏమున్నాయి అని ఎవరినైనా అడిగితే, వారు బల్లమీద ఉన్న పుస్తకం, గడియారం, ఫోనులతో పాటు కళ్ళజోడు కూడా చెబుతారు. కాని, దాని తరువాత కళ్ళజోడుని కళ్ళకు పెట్టుకుని, ఇప్పుడేం ఉన్నాయని అడగండి! కళ్ళజోడు తప్ప తక్కినవన్నీ చెబుతారు. ఎందుకు? అది కంటికి సన్నిహితంగా ఉంది. దానితో ప్రపంచాన్ని చూస్తున్నారు కాని అది వారు కాదు. కాని అది ఎంత సన్నిహితంగా ఉందంటే, వారు దానితో మమేకం చెందుతున్నారు. అలా మీరు వాడే పరికరాలను కూడా మీరు అనుకుని పొరపాటు పడే అవకాశం ఉంది. ఇప్పుడు కళ్ళజోడు కాక, కాంటాక్ట్‌లెన్స్ పెట్టుకుంటున్నారు కొందరు. వారి దృష్టిలో అది వారికి భిన్నంగా లేదు.

అదే విధంగా మీరు ఏం చేస్తున్నారు అని ఎవరైనా అడిగితే, మీరు నేను రాస్తున్నాను అంటారు. నిజానికి మీరు కాదు రాస్తున్నది. కలం రాస్తున్నది. మీరు కేవలం ఆ కలం వెనుక ఉన్నారు, కాని మీరు దానితో ఎంతగా మమేకం చెందుతున్నారంటే, నేను రాస్తున్నాను అన్నప్పుడు నేనులో కలం కూడా ఉంది.

కనీసం కళ్ళజోడు, కలం మీరు కాదని తేలికగా ఒప్పుకుంటారు కాని అదే విధంగా ఉపనిషత్తు మీ శరీరం, మీ ఇంద్రియాలు, మీ మనస్సు కూడా మీరు కాదు అంటుంది. అవి మీరు వాడే పరికరాలు మాత్రమే అంటుంది. నేను శరీరం కాదు, ఇంద్రియాలు కాదు, మనస్సు కాదు అంటే మరి నేను ఎవరు అంటారు. నేను వాటికి భిన్నంగా ఉండి, వాటి అంతటా వ్యాపించి, వాటికి వాటి శక్తిని ఇచ్చే చైతన్యాన్ని. నా ద్వారా అవి ప్రపంచాన్ని చూస్తున్నాయి కాని నన్ను చూడలేవు.

మైక్రోస్కోప్ లెన్స్ ద్వారా మీరు కొన్ని వస్తువులు చూస్తారు. కాని అందులోకి చూసే మీ కన్నును మీరు చూడలేరు. లేదు, నేను కన్నును చూసుకోవాలని మైక్రోస్కోప్‌కి అటువైపు వెళితే, అందులోంచి చూసేదెవరు? మీరు ఆబ్జెక్టు అయిపోతారు కాని, చూసే సబ్జెక్టు ఉండదు. అందువల్ల మీకు జ్ఞానాన్ని పంచే పంచేంద్రియాలలో ఏ ఇంద్రియంద్వారా కూడా మీరు మీ గురించిన జ్ఞానం పొందలేరు. ఎందుకంటే మీరు ఆ ఇంద్రియం వెనక ఉండి, దానికి శక్తినిస్తున్నారు.

దీన్నిబట్టి ఆత్మజ్ఞానం పొందటం అంటే నేను ఆత్మను అని బుద్ధిపరంగా తెలుసుకోవటం మాత్రమే అనీ, ఆత్మ అనుభవం పొందలేము అనీ అర్థం చేసుకోవాలి. ఆత్మవల్లనే తక్కిన అనుభవాలు పొందుతాము కాని ఆత్మ అనుభవం ప్రత్యేకంగా పొందలేము అని గ్రహించాలి.

ఇప్పుడు ఇంకొక మెట్టు ఎక్కిస్తున్నది.

**తదేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం యదిదముపాసతే ।**

3. **నేను = ఆత్మ = బ్రహ్మ**

నువ్వే ఆ బ్రహ్మవని తెలుసుకో అంటున్నారు గురువు. నేను = ఆత్మ = బ్రహ్మ అని నేర్పిస్తున్నారు. బ్రహ్మ అంటే అనంతం.

**బృహత్తమత్వాత్ బ్రహ్మ**

బ్రహ్మ అంటే సత్ చిత్ ఆనందం. ఆత్మ అంటే సత్ చిత్ ఆనందం. సత్ చిత్ ఆనందబ్రహ్మ ఆత్మ ఎక్కడ ఉంది? దిక్కులు చూడకు.

తదేవ బ్రహ్మత్వం విద్ధి – నువ్వే ఆ బ్రహ్మవని తెలుసుకో!

అంతేకాదు, ఇంకొక పిడుగులాంటి వార్తను వేస్తున్నది.

**నేదం యదిదముపాసతే** – నువ్వు ఉపాసన చేసే దేవుడు బ్రహ్మ కాదు, ఉపాసన చేసే నువ్వే బ్రహ్మవు అంటున్నది ఉపనిషత్తు.

**గమనిక** – ఇక్కడ విషయం కొంచెం సూక్ష్మంగా ఉంటుంది. దేవుడు లేడనటం లేదు, దేవుడి శక్తిని శంకించటం లేదు. పూజని నిరాకరించటం లేదు. కర్మకాండలోనూ, ఉపాసనకాండలోనూ శాస్త్రం సగుణబ్రహ్మను వివరిస్తుంది. జ్ఞానకాండకి వచ్చేసరికి నిర్గుణబ్రహ్మజ్ఞానం పొందుతారు. నిర్గుణబ్రహ్మ అంటే ఆబ్జెక్టుగా తెలుసుకునేది కాదని ఇప్పుడే చూశాము. సగుణబ్రహ్మ కూడా ఆబ్జెక్టులోకి వస్తాడు కాబట్టి, ఆత్మ లేదా బ్రహ్మ కాదు అంటున్నది. ఇది అద్వైతస్థాయి.

- వాక్కుతో ఆత్మను ఎన్నటికీ వర్ణించలేము కాని ఆత్మవల్లనే వాగింద్రియం పనిచేయ గలుగుతున్నది
- మనస్సు తెలుసుకునే ఆబ్జెక్టు కాదు బ్రహ్మ. కాని బ్రహ్మ చూసే ఆబ్జెక్టు మనస్సు
- కంటితో ఆత్మను చూడలేము, కాని ఆత్మవల్లనే కన్నులు పని చేస్తున్నాయి
- చెవులతో ఆత్మను వినలేము, కాని ఆత్మవల్లనే వినగలుగుతున్నాము
- ప్రాణం (ఘ్రాణేంద్రియం) ద్వారా ఆత్మను తెలుసుకోలేము, కాని ఆత్మవల్లనే ఘ్రాణేంద్రియం పని చేయగలుగుతున్నది.

ఇక్కడితో వేదాంతబోధలోని శ్రవణం ముగిసింది.

## ఖండం 2

గురువు ఆత్మ గురించి వివరించాక ఆత్మ గురించి అర్థం అయిందా అని అడిగాడు. శిష్యుడు నాకు తెలుసు అంటే ఆత్మ తెలిసిన వస్తువుల పరిధిలోకి వస్తుంది. శిష్యుడు నాకు తెలియదు అంటే ఆత్మ తెలియని వస్తువుల పరిధిలోకి వస్తుంది. శిష్యుడు మౌనంగా ఉండిపోతే జవాబు చెప్పని పొగరు కనిపిస్తుంది. అలా శిష్యుణ్ణి ఇరకాటంలో పెట్టాడు గురువు. కాని శిష్యుడు గురువును మించిన శిష్యుడు అయ్యాడు.

**మన్యే విదితమ్ –** నాకు తెలుసు బ్రహ్మ అన్నాడు. శంకరుల వారు – సింహవత్ జగర్జ అన్నారు శిష్యుణ్ణి. సింహంలా గర్జించాడుట అతని జవాబుతో. అతని ఉద్దేశ్యం నాకు మీ బోధ బాగా అర్థమయింది.

నీకు తెలుసు అని చెపితే నీకేమీ తెలియదని అర్థం అని గురువు ముందే చెప్పాడు కదా. శిష్యుడు తను అలాంటి పొరపాటు చేయబోవటం లేదని ముందుగా చూపిస్తున్నాడు.

**అన్యదేవ తద్విదితాదథో అవిదితాదధి**

బ్రహ్మ తెలిసిన వస్తువు కాదు. తెలియని వస్తువు కాదు.

ఈ విషయం శిష్యుడు మర్చిపోలేదు. అందువల్ల శిష్యుడు 'నాకు బ్రహ్మ తెలుసు,' అనే పొరపాటు ఎన్నటికీ చేయనంటున్నాడు. ఎందుకు? నాకు బ్రహ్మ తెలుసు అని చెబితే బ్రహ్మ తెలిసిన వస్తువు కిందకి వస్తుంది. అయితే 'నాకు బ్రహ్మ తెలియదు,' అంటాడా? ఆ పొరపాటు కూడా చేయనంటున్నాడు.'నాకు బ్రహ్మ తెలియదు,' అని కూడా చెప్పనంటున్నాడు. ఎందుకు? నాకు బ్రహ్మ తెలియదు అంటే బ్రహ్మ తెలియని వస్తువు కిందకి వస్తుంది.

**నాహం మన్యే సువేదేతి నో న వేదేతి వేద చ (న వేద చ)**

బ్రహ్మ గురించి నాకు తెలుసు అనను. బ్రహ్మ గురించి నాకు తెలియదు అనను. బ్రహ్మ అసలు ప్రమేయం కాదు. బ్రహ్మ ప్రమాత. ఆ బ్రహ్మ నేనే. అహం బ్రహ్మ అస్మి.

అక్కడితో ఆగలేదు శిష్యుడు. అక్కడ ఉన్న శిష్యులనుద్దేశించి చెబుతున్నాడు. నేను చెప్పింది ఎవరికి అర్థమయితే, వారు కూడా ఈ బోధను బాగా గ్రహించారని అర్థం అన్నాడు.

**నో న వేదేతి వేద చ –** నో న వేద ఇతి వేద చ – బ్రహ్మను ఆబ్జెక్టుగా తెలుసుకోలేము. ఇది నా జవాబు.

**యో నస్తద్వేద – ఇతి తద్వేద –** ఈ నా జవాబును, ఎవరైతే అర్థం చేసుకుంటారో;
**నః –** అతను; **సః తద్వేద** – విద్యార్థి కూడా బోధను నాలాగా గ్రహించినట్టు అర్థం.

దీనితో గురుశిష్యుల సంవాదం ముగిసింది. కేనోపనిషత్తు అయిపోయినట్టే. ఇప్పుడు ఈ సంభాషణతో ఉపనిషత్తు మురిసిపోయింది. అందువల్ల తరువాత వచ్చే మంత్రాల్లో గురుశిష్యుల సంవాదం ద్వారా జరిగిన బోధ సారాంశం, ఉపనిషత్తు మళ్ళీ చెబుతున్నది.

ఈ (3,4,5) మంత్రాలను ఉపనిషత్తు చెబుతున్నది. బ్రహ్మజ్ఞానంయొక్క ప్రత్యేకతను ఇక్కడ నొక్కి వక్కాణిస్తున్నది. కేనోపనిషత్తు అవటానికి చాలా చిన్న ఉపనిషత్తే అయినా, ఘాటైన సీమమిరపకాయలాంటిది. ఇందులో ఎన్నో మహావాక్యాలు ఉన్నాయి. వాటిని మించి పదాలతో ఆటలాడిస్తుంది మనను. ముందు మంత్రంలో శిష్యుడు ఎంత ఆటలాడించాడో, ఇప్పుడు ఉపనిషత్తు కూడా అలాగే పదాలతో చమత్కారాలు చేస్తోంది.

అంతకుముందు శిష్యుడు ఏమన్నాడు?

**నాహం మన్యే సువేదేతి నో న వేదేతి వేద చ (న వేద చ)**

నాకు బ్రహ్మ తెలుసు అనను

నాకు బ్రహ్మ తెలియదు అనను

నాకు తెలుసు

నాకు తెలియదు

అతనెలా పదప్రయోగాలు చేశాడో ఉపనిషత్తు కూడా అలాగే అంటున్నది.

బ్రహ్మ ఎవరికి తెలియదో, వారికి తెలుసు.

బ్రహ్మ ఎవరికి తెలుసో, వారికి తెలియదు.

తెలిసినవారికి తెలియదు.

తెలియని వారికి తెలుసు.

బ్రహ్మజ్ఞానంయొక్క ప్రత్యేకతను చూపుతున్నది ఉపనిషత్తు. బ్రహ్మ గురించి తెలుసుకోకుండా తెలుసుకునే జ్ఞానం బ్రహ్మజ్ఞానం. మళ్ళీ చెబుతున్నాను చూడండి. బ్రహ్మజ్ఞానం ఒక ప్రత్యేక జ్ఞానం. ఎందుకంటే అందులో బ్రహ్మ గురించి తెలుసుకోకుండా తెలుసుకుంటారు! అదెలా సాధ్యం? ఎలాగంటే, బ్రహ్మగురించి తెలుసుకున్నాను అంటే బ్రహ్మ ఏమవుతాడు? ఆబ్జెక్టు అవుతాడు. అందువల్ల నేను బ్రహ్మ గురించి, బ్రహ్మను ఆబ్జెక్టు చేయకుండా తెలుసుకోవాలి. బ్రహ్మను ఆబ్జెక్టు చేయకపోతే నేనెలా తెలుసుకుంటాను? అంటే ప్రమేయంగా కాదు, ప్రమాతగా తెలుసుకుంటాను. అహం బ్రహ్మ అస్మి అని తెలుసుకుంటాను.

అందువల్ల ఉపనిషత్తు, బ్రహ్మను ఎవరైతే ఆబ్జెక్టుగా చూస్తారో వారు బ్రహ్మను తెలుసుకోలేరు. ఎవరైతే బ్రహ్మను ఆబ్జెక్టుగా చూడరో వారు మాత్రమే తెలుసుకోగలరు అంటున్నది.

బ్రహ్మ ప్రమేయంగా తెలుసు అంటే వారికి బ్రహ్మ అర్థం కానట్టు.

బ్రహ్మ ప్రమేయంగా తెలియదు అంటే వారికి బ్రహ్మ అర్థం అయినట్టు.
బ్రహ్మ సబ్జెక్టుగా తెలియని అజ్ఞాని బ్రహ్మను ఆబ్జెక్టుగా భావిస్తాడు.
పై వాక్యాన్నే ఒక సూత్రంగా చెబుతున్నది ఉపనిషత్తు.
బ్రహ్మ తెలిసినవారికి తెలియదు.
బ్రహ్మ తెలియని వారికి తెలుసు.

దీని సారాంశం ఏమిటి? అంతకుముందు ఎన్నోసార్లు చూసిందే

బ్రహ్మ తెలిసిన వస్తువు కాదు, తెలియని వస్తువు కాదు.
బ్రహ్మ ప్రమేయం కాదు, బ్రహ్మ ప్రమాత, బ్రహ్మ సాక్షిచైతన్యం; అది నువ్వే.
ఈ దశలేవీ మర్చిపోకూడదు. కేనోపనిషత్తు అధ్యయనం చేసి ముగించేలోపు
బ్రహ్మ ఆబ్జెక్టు కాదు, సబ్జెక్టు అనే విషయం జీర్ణించుకోవాలి.
అంతేకాదు ఇంకో విషయం కూడా గట్టిగా అర్థం చేసుకోవాలి
బ్రహ్మానుభవంకోసం ఎన్నడూ ప్రయత్నించవద్దు.
ఆత్మ సబ్జెక్టు కాబట్టి ఆత్మసాక్షాత్కారం కలుగదు.

బ్రహ్మ అన్నా, ఆత్మ అన్నా, సాక్షిచైతన్యం అన్నా ఒకటే అని మర్చిపోకూడదు. ఇంత స్పష్టంగా చెప్పినా కూడా, 90% వేదాంతవిద్యార్థులు బ్రహ్మ అనుభవం పొందటంకోసం నిదిధ్యాసనం చేస్తారు.

నిదిధ్యాసనం బ్రహ్మానుభవం పొందటానికి కాదు.
నిదిధ్యాసనం బ్రహ్మనిష్ఠలో నిలవటానికి.

**ప్రతిబోధవిదితం మతమమృతత్త్వం హి విన్దతే।**
**ఆత్మనా విన్దతే వీర్యం విద్యయా విన్దతేఽమృతమ్ ॥** 2-4

ఇది చాలా అద్భుతమైన మంత్రం. కేనోపనిషత్తు మొత్తానికి గొప్ప మంత్రం. నిజానికి మొత్తం అద్వైతజ్ఞానానికి మకుటాయమానమైన రత్నం ఇది. చాలా ముఖ్యమైంది. ఎందుకంటే బ్రహ్మజ్ఞానం ఎలా పొందాలో వివరిస్తుంది ఇది. వేరే ఎక్కడా దొరకదు ఈ అంశం. అంతకుముందు ఏమన్నాం?

బ్రహ్మ అనుభవంకోసం ఎన్నడూ ప్రయత్నించవద్దు. ఎందుకు? దీని అర్థం బ్రహ్మ అనుభవం పొందనవసరం లేదు అని కాదు; బ్రహ్మ అనుభవం సాధ్యం కాదు అని కూడా కాదు. మరి ఎందుకు?

బ్రహ్మానుభవం ఎప్పుడూ ఉంటుంది.

**ప్రతిబోధవిదితం మతమ్ –** ఎందుకు? బ్రహ్మ స్వయంప్రకాశకచైతన్యం. ఈ మంత్రం ఆ విషయాన్ని వివరిస్తున్నది.

మారే ఆలోచనలున్న మనస్సులో మారని చైతన్యం ఉంది. ఆ మారని చైతన్యంవల్లనే అన్ని అనుభవాలు, అన్ని రకాల జ్ఞానమూ పొందగలము. ఆ చైతన్యమే బ్రహ్మ.

**జ్ఞానం = వృత్తి + చైతన్యం**

వృత్తి ఒకటే ఉన్నా జ్ఞానం పొందలేము. చైతన్యం ఒకటే ఉన్నా జ్ఞానం పొందలేము. రెండింటి మేలుకలయికవల్లనే జ్ఞానం సాధ్యం. ఇప్పుడు ఈ వృత్తి గురించీ, చైతన్యం గురించీ వివరంగా చూద్దాము.

**చైతన్యం –** వృత్తి+చైతన్యం = జ్ఞానం అని చూశాము కదా! ఈ రెండింటివల్ల జ్ఞానం కలుగుతుందంటే మారుతున్న వృత్తిలాగా, చైతన్యం కూడా మారుతుందా? మారదు. చైతన్యం మార్పులేని, మారని అంశం.

జ్ఞానం = మారే వృత్తి+మారని చైతన్యం.
జ్ఞానం = అనుభవం = బోధ = ప్రతిబోధ

బోధ అంటే జ్ఞానం, అనుభవం. అది మారే వృత్తి, మారని చైతన్యాల మేలుకలయిక.

వృత్తి, చైతన్యం చాలా సన్నిహితంగా కలిసిపోవటంవల్ల, చైతన్యం మనస్సు లేదా వృత్తిలో ఒక అంతర్గత భాగం అని పొరబడతారు చాలా మంది. కాని వేదాంతం దాన్ని ఖండిస్తుంది.

చైతన్యం ప్రతివృత్తిలోనూ ఉంది, కాని అది వృత్తిలో ఒక భాగం కాదు; చైతన్యం వృత్తినుంచి ఉత్పత్తి చెందింది కాదు. చైతన్యం వృత్తియొక్క లక్షణం కూడా కాదు. చైతన్యం వృత్తికి భిన్నంగా ఉంది కాని, వృత్తితో కలిసిపోయింది.

బ్రహ్మజ్ఞానం పొందాలంటే మూడు దశల్లో పొందాలి.

1. మారే వృత్తినుంచి మారని చైతన్యం వైపుకు నా దృష్టిని మరల్చాలి. చెట్టును చూస్తే చెట్టు గురించిన వృత్తి ఏర్పడుతుంది. తరువాత బల్లను చూస్తే బల్ల గురించిన వృత్తి ఏర్పడుతుంది. చెట్టు వృత్తి ఏర్పడుతున్నదని నాకు తెలుస్తున్నది. బల్ల వృత్తి ఏర్పడుతున్నదని నాకు తెలుస్తున్నది. ఒక వస్తువును చూస్తే ఇంకో వస్తువు వెళ్ళిపోతున్నది. అలాగే మనస్సులో ఒక వృత్తి ఏర్పడితే ఇంకో వృత్తి వెళ్ళిపోతున్నది. కాని ఈ వృత్తుల గురించిన నా ఎరుక మారటం లేదు. నా ఎరుక అలాగే ఉంది. అందువల్ల వృత్తినుంచి ఎరుక వైపుకు అంటే చైతన్యం వైపుకు నా దృష్టిని మరల్చాలి.

2. చైతన్యం నేను అని అర్థం చేసుకోవాలి. చైతన్యం వైపు దృష్టిని మరల్చాలి అంటే, చైతన్యాన్ని ఆబ్జెక్టుగా చూడకూడదు. చైతన్యాన్ని, వృత్తిని విడదీశాక, నేను వృత్తిని చూసే చైతన్యాన్ని అని అర్థం చేసుకోవాలి.

ప్రతి ఒక్క వృత్తి ఆబ్జెక్టు. కాని చైతన్యం దాన్ని చూసే సబ్జెక్టు. అది నేనే.

నేను పడిలేచే ఆలోచనా తరంగాలతో కలిసి ఉన్న చైతన్యాన్ని. నేను ఆలోచనలను ప్రకాశింపచేయటమే కాదు, ఆలోచనల గురించి నాకు తెలుసు. అందువల్ల ఆలోచన ఆబ్జెక్టు; చైతన్యం సబ్జెక్టు అయిన నేను.

3. మారే జగత్తుకు, మారని చైతన్యానికి ఉన్న సంబంధం తెలుసుకోవాలి. ఆ సంబంధం కార్యకారణ సంబంధం. ఇది మహావాక్యశ్రవణం ద్వారా తెలుస్తుంది. ఇది పెద్ద గెంతు, కష్టమైన గెంతు.

**ప్రతిబోధవిదితమ్ –** ఈ పదం బ్రహ్మజ్ఞానం ఇస్తుంది. మారుతున్న ప్రతి అనుభవం వెనుకా ఒక మారనిదేదో ఉంది. ఏమిటది? అదే చైతన్యం. జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థల్లో జరిగే అన్ని అనుభవాలను, చూసే అన్ని వస్తువులను, అన్ని పరిస్థితులను సాక్షీభూతంగా చూస్తున్నది అది. ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని నా మనస్సును చూస్తున్నది. మనస్సు మేలుకుని ఉన్నా, సుషుప్తిలో లయమయినా కూడా అది చూస్తున్నది.

మూడు అవస్థల్లోనూ చూడటమే కాదు, అవస్థల్లో మనోబుద్ధి అహంకారాల స్థితిగతులు మారుతున్నా అది మారటం లేదు. అనుభవాలు మారుతున్నాయి. దృశ్యాలు మారుతున్నాయి. అది మాత్రం మారటం లేదు. ఆ విధంగా ప్రతి అనుభవంలోనూ మారని చైతన్యాన్ని, మారే ఆలోచనను అనుభవిస్తున్నాము. ఉపనిషత్తు మనను మారే అనుభవంనుంచి మారని చైతన్యంవైపు దృష్టి పెట్టమంటున్నది. ఆ చైతన్యాన్ని కొత్తగా అనుభవించనవసరం లేదు. అది ప్రతి అనుభవం వెనుకా ఉంది.

**ఇహ చేదవేదీదథ సత్యమస్తి, న చేదిహావేదీన్మహతీ వినష్టిః।**

**భూతేషు భూతేషు విచిత్య ధీరాః ప్రేత్యాస్మాల్లోకాదమృతా భవన్తి ॥ 2-5**

ఈ జ్ఞానాన్ని పొందే అవకాశం చాలా అరుదుగా కలుగుతుంది అంటున్నది ఉపనిషత్తు.

**జ్ఞానాత్ ఏవ తు కైవల్యమ్**

జ్ఞానమొక్కటే మార్గం! వేరే లేదు.

మనుష్యజన్మ, ఆత్మజ్ఞానం పొందితే సత్యమవుతుంది. జీవన్ముక్తి వస్తుంది. జీవన్ముక్తి అంటే జీవితంలో వచ్చే ఒడిదుడుకులకు చలించకుండా, జీవితమన్నాక అవి రాకుండా ఉండవు అని తేలికగా తీసుకోవటం.

మరణం తర్వాత జ్ఞాని జీవాత్మ పరమాత్మ అవుతుంది. అందువల్ల అమృతా భవంతి అంది ఉపనిషత్తు. దీన్నే విదేహముక్తి అంటారు. అతనికి ఇంక పునర్జన్మ ఉండదు.

ఇక్కడితో బోధ అయిపోయింది. ఇది సూక్ష్మబుద్ధి ఉన్నవారికి.

**న చేత్ ఇహ అవేదీత్ –** ఎవరైనా ఒకవేళ ఈ మనష్యజన్మను వినియోగించుకోకపోతే,

**మహతీ వినష్టిః –** అతని నష్టం అనంతం. ఎందుకు? అతను అనంతమైన బ్రహ్మను తెలుసుకోలేకపోతున్నాడు కాబట్టి, అతని నష్టం కూడా అనంతమే.

## ఖండం 3

మొదటి రెండు అధ్యాయాల్లో (ఖండములలో) బుద్ధి సూక్ష్మంగా ఉన్నవారికి అర్థమవుతుంది. బుద్ధి స్థూలంగా ఉన్నవారిని కూడా వదలదు ఉపనిషత్తు. వారికోసం అధ్యాయం 3, 4 చెప్పబడ్డాయి. సూక్ష్మబుద్ధి అంటే ఏమిటి? స్థూలబుద్ధి అంటే ఏమిటి? మొదటి రెండు అధ్యాయాలు అర్థమయితే చాలు, సూక్ష్మబుద్ధి ఉన్నట్టే. వాటిని జీర్ణించుకోవటం, జ్ఞాననిష్ఠలో ఉండటం తరువాత మాట. లేదు, ఆ బోధ నాకు అర్థం కాలేదు, తలమీంచి వెళ్ళిపోయింది అనుకుంటే ఈ అధ్యాయాలు తోడ్పడుతాయి. ఇవి కర్మ, ఉపాసన, విలువల ద్వారా అంటే అనేక సాధనల ద్వారా మనస్సును సిద్ధం చేస్తాయి. వేదాంతబోధలో నైతికవిలువలు కూడా కలిగి ఉండాలని వస్తుంది.

మూడవ అధ్యాయంలో (ఖండములో) 12 మంత్రాలు ఉన్నాయి. వాటిలో ఉపనిషత్తు ఒక కథను చెబుతున్నది. ఉపనిషత్తుల్లో ఇది చాలా ప్రాచుర్యం పొందిన కథ. ఈ కథ చెప్పటంలోని ఉద్దేశ్యం, దీనిద్వారా సందేశం ఇవ్వటం. ఉపనిషత్తు కాలక్షేపం కబుర్లు, కథలు చెప్పదు. అది చెప్పిందంటే దాని ద్వారా నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని అర్థం.

ఇక్కడ కూడా ఉపనిషత్తు కథ మాత్రం చెప్పి ఊరుకుంటుంది. దాన్నుంచి శంకరులవారు ఆరు సందేశాలను వెలికి తీశారు. ముందు ఆ కథ ఏమిటో చూద్దాము.

ఇది దేవతల గర్వభంగం గురించిన కథ. మన పురాణాల్లో ఇలాంటి గర్వభంగాల కథలు అనేకం వస్తూ ఉంటాయి. నారద గర్వభంగం; అర్జున గర్వభంగం, సత్యభామ గర్వభంగం– అలా ఎన్నో! వీటి సారాంశం గర్వం ఉండకూడదని. ఇక్కడ దేవతల గర్వభంగం. దేవతలకు, అసురులకు మధ్య తరచు యుద్ధాలు జరుగుతుంటాయి. ఎక్కువగా దేవతలే గెలుస్తుంటారు. వారికి సత్త్వగుణం ఎక్కువగా ఉండటంవల్ల వారికి ఈశ్వరకృప మెండుగా ఉంటుంది. అందువల్ల వారే గెలుస్తుంటారు. అలాంటి ఒక సందర్భం ఇది. ఇప్పుడు కూడా వారే గెలిచారు. కాని ఈసారి వారికి గర్వం వచ్చింది. నావల్లే విజయం సాధించాము. నేను ఇంతమంది రాక్షసులను చంపాను అని గొప్పలు చెప్పటం మొదలుపెట్టారు.

మామూలుగా దేవతలకు దైవీసంపత్తి ఉంటుంది. కాని ఎందుకో, తాత్కాలికంగా అజ్ఞానంవల్లో, మోహంవల్లో, గర్వం చోటుచేసుకుంది. వారికి గర్వభంగం చేయాలనుకున్నాడు ఈశ్వరుడు. భంగం అంటే నాశనం చేయటం. వారి గర్వాన్ని నాశనం చేయాలనుకున్నాడు.

ఈశ్వరుడు వారి ముందు ఒక ప్రకాశవంతమైన రూపంలో వెలిశాడు. ఉపనిషత్తు యక్షుడు అంది. మామూలుగా మనం వాడే యక్ష, కిన్నెర, కింపురుషులలోని యక్షుడు కాదు ఇక్కడ. యక్షుడు అంటే ఈశ్వర అవతారం.

నిజానికి దయానందసరస్వతి స్వామీజీ అంటారు, 'వేదంలో ఈశ్వర అవతారం గురించిన మొట్టమొదటి ప్రస్తావన ఇక్కడే వచ్చింది! ఈ యక్షుని అవతారాన్ని ఆధారంగా చేసుకునే, మన పురాణాల్లో అనేక అవతారాల గురించిన వర్ణన వచ్చింది. వాటికి మూలం ఇదే!'

భగవంతుడు వారికి మరీ దగ్గరగా కాకుండా, మరీ దూరంగా కాకుండా కనబడ్డాడు. వారు గర్వంలో మునిగి తేలుతుండగా, వారి దృష్టిని ఆకర్షించాడు. ఆ ఆకారం దేదీప్యమానంగా ఉంది, ఏదో దైవసంబంధమైనట్టుగా ఉంది, కాని అది ఏమిటో మాత్రం తెలియలేదు. అదేమిటో తెలుసుకోవాలనే కుతూహలం కలిగింది. మానవనైజం కూడా అంతే! మనకు తెలియని విషయం తెలుసుకోవాలనే కుతూహలం ఉంటుంది. అందులో దేవతలకు జ్ఞానం బాగానే ఉంటుంది. అలాంటి వారికి తెలియని విషయం ఏమిటయి ఉంటుంది?

దేవతల రాజు ఇంద్రుడు కూడా ఉన్నాడు వారితో. అతను దూతను పంపిద్దామనుకున్నాడు ఆ దివ్యయక్షుని గురించి తెలుసుకోవటానికి. దానికి అగ్నిని ఎంచుకున్నాడు. అగ్ని దేవతల దూత. అందువల్లనే మనం యజ్ఞం చేసి, అగ్నిలో ఆహుతులు వేస్తే, ఏ దేవత గురించి యజ్ఞం చేస్తున్నామో ఆ దేవతకు అందజేస్తాడు అగ్ని.

అగ్ని కూడా గర్వంగా వెళతాడు యక్షుని దగ్గరకు. 'ఎవరు నువ్వు?' అని అడుగుదాం అనుకున్నాడు. కాని అగ్ని నోరు విప్పేలోపే, యక్షుడే, 'ఎవరు నువ్వు?' అన్నాడు. పైపెచ్చు 'నీలో ఏ శక్తి ఉంది?' అన్నాడు. నువ్వు ఎవరు అన్న ప్రశ్నకే అగ్నికి అవమానంగా అనిపించినా దిగమింగుకున్నాడు. 'నేను ప్రపంచాన్ని దహించగలను,' అన్నాడు. ఈశ్వరుడు, 'అదంతా చేయనవసరం లేదు. నేనొక ఎండుగడ్డిపోచను నీ ముందు పెడతాను, దానిని దహించు,' అన్నాడు. అగ్ని ఎంత ఎగిసిపడినా, ఎంత ప్రయత్నించినా, దానిని దహించటం మాట దేవుడెరుగు, దాని మూలను కూడా కొంచెం కూడా లేకపోయాడు. అవమానంతో వెనక్కి వచ్చి, నీరసంగా, 'నాకు ఆ యక్షుడెవరో తెలియదు,' అన్నాడు.

ఇప్పుడు వాయువువంతు వచ్చింది. వాయువు కూడా అగ్ని చేయలేని పని నేనే చేయబోతున్నాననే గర్వంతో వెళ్ళాడు. మళ్ళీ అవే సంభాషణలు. 'నేను ప్రపంచంలో ఉన్న

దేనినైనా ఎత్తివేయగలను,' అన్నాడు. ఈశ్వరుడు 'అగ్ని ముందు పెట్టిన గడ్డిపోచ అలాగే ఉంది. దాన్ని కదిలించు,' అన్నాడు. పెనుతుఫాను గాలులు వీచేలా చేసినా, అణువంత కూడా, గడ్డిపోచను కదపలేకపోయాడు. అవమానభారంతో గోడకు కొట్టిన బంతిలా వెనుదిరిగి వచ్చాడు. అగ్ని, వాయువులు ఒకరి మొహాలు ఒకరు చూసుకుని, 'నీకూ ఆ గడ్డిపోచేనా,' అని సంజ్ఞలు చేసుకున్నట్లుగా ఊహించుకోవచ్చు.

ఇప్పుడు ఇంద్రుని వంతు వచ్చింది. ఇంద్రుడు దేవతలకు రాజు కదా! వారిద్దరూ చేయలేని పని తాను చేయగలనని భావించి, వారికన్నా ఎక్కువ గర్వంతో వెళ్ళాడు. అగ్ని, వాయువులిద్దరూ కనీసం యక్షుణ్ణి చూసి, సంభాషణ జరుపగలిగారు. ఇంద్రుడికి గర్వం ఇంకా ఎక్కువ ఉన్నా, సత్త్వగుణం కూడా ఎక్కువగా ఉండటంవల్ల పరిస్థితిని అర్థం చేసుకున్నాడు. తన గర్వాన్ని అణచటానికే వెంటనే యక్షుడు మాయమయిపోయాడని గ్రహించి వెంటనే వినయంగా ప్రార్థించాడు ఈశ్వరుణ్ణి. అతని వినయానికి మెచ్చిన ఈశ్వరుడు, ఈసారి ఉమాదేవిగా ప్రత్యక్షమయ్యాడు. బ్రహ్మజ్ఞానాన్ని ప్రత్యక్షప్రమాణంద్వారా గాని, అనుమానప్రమాణంద్వారా గానీ పొందలేము. దానికి శబ్దప్రమాణం ఒక్కటే మార్గం. గురుశాస్త్ర ఉపదేశం. గురువుగా శాస్త్రాన్ని బోధించటానికి ఉమాదేవి ప్రత్యక్షమయింది. శిష్యుడు ప్రశ్న వేయందే గురువు బోధించడు. శిష్యుడు వినయంగా నాకు బ్రహ్మవిద్య నేర్పు అని అడగాలి.

**శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్॥** – గీత 2.7

గురువును శరణు కోరందే, బ్రహ్మవిద్యను పొందలేము. సగుణబ్రహ్మ గురించి అయినా నిర్గుణబ్రహ్మ గురించి అయినా గురుశాస్త్ర ఉపదేశం లేనిదే పొందలేము. ఉమాదేవి గురు, శాస్త్రంగా ప్రత్యక్షమయింది. ఇంద్రుడు జ్ఞానంకోసం అడిగాడు. ఇక్కడిదాకా మూడవ అధ్యాయం.

నాలుగవ అధ్యాయంలో (ఖండములో) కూడా కథ కొనసాగుతుంది. యక్షుడు సగుణ ఈశ్వరుడని ఇంద్రుడు తెలుసుకున్నాడు.

**మాయాసహిత బ్రహ్మ = ఈశ్వరుడు**
**మాయారహిత ఈశ్వరుడు = బ్రహ్మ**

ఈ జ్ఞానం పొందిన ఇంద్రుడు వెనక్కి వచ్చి తక్కిన దేవతలకు కూడా నేర్పాడు. ఈ బ్రహ్మవిద్య పొందటంవల్ల ఇంద్రుడు పేరు ప్రఖ్యాతులు పొందాడు. ఇదీ కథ.
అధ్యాయం – 1, 2ల్లో చెప్పినది అధ్యాయం – 3లో కథ ద్వారా వస్తుంది. కథ ద్వారా 6 సందేశాలు వస్తాయి.

1. **బ్రహ్మ అస్తి –** యక్షుడు కనబడ్డాడు.

2. **బ్రహ్మణః దుర్విజ్ఞేయమ్–** వాయువు, అగ్ని తెలుసుకోలేకపోయారు. అంటే ఇంద్రియాల ద్వారా తెలుసుకోలేము.

3. **జ్ఞానయోగ్యతా అపేక్షతే** – గర్వం ఉండకూడదు. శ్రద్ధ, భక్తి, శరణాగతి కావాలి. ఇంద్రుడు శరణు వేడాడు.

4. **గురుః అపేక్షతే–** గురువుద్వారానే నేర్చుకోవాలి. ఉమాదేవి గురువుగా వచ్చింది.

(తక్కిన రెండూ 4వ అధ్యాయంలో వస్తాయి.)

5. **బ్రహ్మవిద్యాస్తుతిః** – బ్రహ్మవిద్య పొందిన ఈ ముగ్గురు దేవతలూ ఖ్యాతిని పొందారు.

6. **ఉపాసనావిధి అంగత్వమ్** – ఈ కథకు అనుగుణంగా కొన్ని ఉపాసనలు చెప్పబడ్డాయి.

## ఖండం 4

ఉమాదేవి చెబుతుంది, మీ విజయానికి కారణం బ్రహ్మే. అందువల్ల దాన్ని మీ విజయంగా భావించటానికి మీకు అధికారం లేదు. వేదాంతపరంగా చూసినా కూడా, ప్రతి ఇంద్రియం కూడా చైతన్యతత్త్వంవల్లనే పనిచేస్తుంది.

నాలుగవ మంత్రంలో ఈ లక్షణాలవల్ల రెండు విషయాలమీద ఉపాసన వస్తుంది. విద్యుత్ ఉపాసన, నిమేష ఉపాసన. తక్కిన మంత్రాల్లో మరికొన్ని వస్తాయి.

**ఎ) విద్యుత్ ఉపాసన –** విద్యుత్ అంటే మెరుపు. మెరుపులా ఒక్క క్షణం ఉపాసన చేసి, వచ్చేయమని కాదు అర్థం. విద్యుత్‌మీద ఉపాసన చేయాలని. విద్యుత్తుకు కూడా ఈ మూడు లక్షణాలూ ఉన్నాయి. క్షణికత్వం, మనోహరత్వం, ప్రకాశరూపత్వం. మన మతం గొప్పతనం చూడండి. చెట్టునీ, పక్షినీ, జంతువునీ, ఆఖరికి మెరుపునీ కూడా దేవునికి ప్రతీకగా చూసి వాటిని కొలుస్తాము.

**బి) నిమేష ఉపాసన –** నిమేష అంటే కళ్ళ రెప్పలు ఆర్పటం. దీనికి కూడా మెరుపుకున్న లక్షణాలు ఉన్నాయి. కనురెప్ప మూస్తే చీకటి, తెరిస్తే మెరుపు. అది కూడా క్షణికం. మనోహరం, ప్రకాశకరం.

**సి) వృత్తి ఉపాసన –** మామూలుగా ధ్యానం ఒక ఆలోచన. కాని ఇక్కడ ఆలోచనమీద ఉపాసన చేస్తాము. ఆలోచనలు చాలా క్షణికం. ఒక ఆలోచననుంచి ఇంకో ఆలోచనకు, ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా గెంతులు వేసుకుంటూ పోతుంది. ఈ పుస్తకం చదువుతూ కూడా హఠాత్తుగా అమెరికాలో ఉన్న మీ అమ్మాయిమీదకు పోవచ్చు ఆలోచన. అలా అని ఏ ఆలోచననూ మనం పట్టి ఉంచలేము. అది క్షణకాలంలో వచ్చి, మాయమైపోతుంది.

చైతన్యం, వృత్తిని ప్రకాశింపచేస్తుంది.
వృత్తి, చైతన్యాన్ని ప్రకటింపచేస్తుంది.
(వృత్తి, చైతన్యాన్ని ప్రకాశింపచేస్తుంది అనకూడదు)

ఆ విధంగా ప్రతివృత్తి, చైతన్యాన్ని చిదాభాసరూపంలో ప్రతిబింబింప చేస్తుంది. ఆలోచన, చైతన్యాన్ని చూపిస్తుంది అంటే అర్థం ప్రకటింపచేస్తుంది.

**డి) గుణవిశిష్ట ఉపాసన–** ఈశ్వరుణ్ణి అనంతకళ్యాణ గుణసంపన్నుడు అంటారు.

బ్రహ్మను అందరిలో ఉన్న విభూతిగా ఉపాసన చేయాలి. ఇది గుణవిశిష్ట ఉపాసన.

దేనిమీద ఉపాసన చేస్తే, ఆ ఫలం పొందుతారు. భగవంతుణ్ణి సర్వజ్ఞుడిగా కొలిస్తే, సర్వజ్ఞుడవుతారు; సర్వశక్తివంతునిగా కొలిస్తే, సర్వశక్తివంతులవుతారు; అలాగే త్రిపురసుందరిమీద ఉపాసన చేస్తే మీరు అందమైన వారవుతారు. అలాగే ఎవరైతే భగవంతుని మహిమమీద ఉపాసన చేస్తారో, వారిని అందరూ ఆరాధిస్తారు.

కొంతమంది ఉపాసనలు కూడా చేయలేరు. ఉపాసన చేయటానికి ఏకాగ్రత కావాలి. నిశ్చలంగా ఉండగలగాలి. కాని కొంతమంది క్షణం ఖాళీగా కూర్చోలేరు. అటువంటి వారికి కర్మయోగం సూచించబడింది. స్వార్థపూరితమైన పనులతో బిజీగా ఉండే బదులు, నిస్వార్థమైన పనులతో బిజీగా ఉండమంటుంది ఉపనిషత్తు.

**తస్యై తపో దమః కర్మేతి ప్రతిష్ఠా। వేదాస్సర్వాఙ్గాని సత్యమాయతనమ్ ॥ 4-8**

**విలువలు** – ఉపనిషత్తు అనే భవంతి కట్టాలంటే, దానికి బలమైన పునాది కావాలి. పునాది బలంగా లేకపోతే భవంతి కూలిపోతుంది. అందువల్లనే ఉపనిషత్తు వేద అంతభాగంలో ఉంది. వేదపూర్వభాగం దానికి కావాల్సిన పునాదిరాళ్ళను వేస్తుంది. ఇక్కడ చెప్పినవి.

**తస్యై తపో దమః కర్మేతి ప్రతిష్ఠా –** తపస్సు, దమము, కర్మ.

1. **తపస్సు** – నా ఇంద్రియాలమీద నేను విజయం సాధించటానికి నేను ఇష్టపూర్వకంగా దేన్నైనా వద్దనుకోవటం. ఇందులో ప్రతిపదమూ ముఖ్యమైనదే. ఇష్టపూర్వకంగా అనే పదం మరీ ముఖ్యం. ఉదాహరణకు ఉపవాసం ఉండటం. మీరు ఆకలికి ఆగలేని వారైతే అది కష్టమే, ఎవరో చెపితే దాన్ని చేయలేరు; మీ అంతట మీకు బుద్ధి పుట్టి ఇవాళ ఉపవాసం ఉండాలి అనుకుంటే విజయం సాధించగలరు. అలాగే నిద్ర అయినా, మౌనవ్రతం అయినా.

అసలు ఏదీ అతిగా చేయకూడదు. అతిగా నిద్రపోకూడదు. అతిగా తినకూడదు. అలాగే పూర్తిగా నిద్ర మానేయకూడదు. పూర్తిగా ఆహారం మానేయకూడదు.

**యుక్తాహార విహారస్య యుక్తచేష్టస్య కర్మసు** – గీత 6.17

2. **దమము** – ఇంద్రియ నిగ్రహం. ఇక్కడ కూడా బలవంతంగా ఇంద్రియాలను అదుపులో పెట్టకూడదు. అలాగని అవి ఆడించినట్టల్లా మీరు ఆడకూడదు. ఉదాహరణకు మీరు కాఫీగత ప్రాణులయితే, కొన్ని రోజులు కాఫీకి దూరంగా ఉండటం సాధన చేయాలి.

3. **కర్మ** – స్వధర్మ అనుష్ఠానం – ఉదాహరణకు సంధ్యావందనం చేయటం. వైదిక కర్మలు మీకు ఆస్తిని లేదా పేరు ప్రఖ్యాతులను తెచ్చి పెట్టకపోవచ్చు. సంధ్యావందనం చేస్తే ఆఫీసులో ఇంక్రిమెంటు రాకపోవచ్చు; కాని మీరు ఆధ్యాత్మికంగా ఎదుగుతారు. అది కనబడదు కాబట్టి పట్టించుకోరు. ఈ రోజు మీకు పని ఒత్తిడి ఎక్కువగా ఉంటే మీరు చేసే మొదటి పని, ఈ రోజు చేసే పూజ మానేస్తారు. అలా చేయకూడదు. అది నిత్యకర్మ. దాన్ని మానకూడదు.

ఇక్కడ ఉపనిషత్తు ఆత్మజ్ఞానాన్ని ఆవుతో పోలుస్తున్నది. ఆవుకు నాలుగు పాదాలు ఉంటాయి. పైన చెప్పిన మూడింటిని అంటే తపస్సు, దమము, కర్మలను మూడు పాదాలుగా తీసుకోవచ్చు.

ఆయతనం అంటే నివాసస్థానం. ఆవుకు ఎలా గొడ్లపాక ఉంటుందో, అలా ఉపనిషత్తు అనే ఆవుకు నివాసస్థానం సత్యం. సత్యం పలకని వ్యక్తి, బ్రహ్మవిద్య జ్ఞానం పొందలేడు ముందు; ఒకవేళ పొందినా కూడా అది నిలవదు. పాక లేనిదే ఆవు ఎలా నిలవదో, సత్యం లేకపోతే జ్ఞానం అలా నిలవదు.

ఇప్పటివరకూ జరిగిన జ్ఞానబోధను ఒకసారి విశ్లేషిస్తే మూడు రకాల అధికారులకు మూడు మార్గాలు సూచించింది ఉపనిషత్తు.

**ఉత్తమ అధికారికి – జ్ఞానయోగము**

**మధ్యమ అధికారికి – ఉపాసనాయోగము**

**మన్ద అధికారికి – కర్మయోగము**

బ్రహ్మలో ప్రతితిష్ఠతి అంటే బ్రహ్మ ఇక్కడ ఉన్నాడు. జ్ఞాని బ్రహ్మమీద ఉన్నాడు అని కాదు అర్థం. జ్ఞాని బ్రహ్మనిష్ఠలో ఉంటాడు అని అర్థం. తను బ్రహ్మకు భిన్నంగా లేడు అని తెలుసుకుంటాడు.

**శాంతిపాఠం**

**ఓం ఆప్యాయన్తు మమాఙ్గాని వాక్ప్రాణశ్చక్షుః శ్రోత్రమథో బలమిన్ద్రియాణి చ సర్వాణి। సర్వం బ్రహ్మోపనిషదమ్। మాఽహం బ్రహ్మ నిరాకుర్యాం మా మా బ్రహ్మ నిరాకరోత్। అనిరాకరణమస్త్వనిరాకరణం మే అస్తు। తదాత్మని నిరతే య ఉపనిషత్సు ధర్మాస్తే మయి సన్తు। తే మయి సన్తు ॥**

# ఏకాదశ ఉపనిషత్తుల సారం

## కఠోపనిషత్ అధ్యాయం 1

**వేదం –** కేనోపనిషత్తు తరువాత కఠోపనిషత్తును నేర్చుకోవాలి. ఆది శంకరాచార్యులవారు భాష్యం రాసిన పది ఉపనిషత్తుల్లో ఇది ఒకటి. దీన్ని కాఠకోపనిషత్తు అని కూడా అంటారు. ఈ ఉపనిషత్తు కృష్ణయజుర్వేదానికి చెందినది. నాలుగు వేదాలలో యజుర్వేదం ఒకటి. దానికి రెండు శాఖలు ఉన్నాయి. అవి కృష్ణయజుర్వేదం, శుక్లయజుర్వేదం.

**శాంతిపాఠం –** ఒక్కొక్క వేదానికి ఒక్కొక్క శాంతిపాఠం ఉంటుంది. ఆయా వేదాలకు చెందిన ఉపనిషత్తుల ముందు ఆ శాంతిపాఠాలను పఠిస్తాము. కఠోపనిషత్తు కృష్ణయజుర్వేదానికి చెందినది కాబట్టి, దీని శాంతిపాఠం –

**ఓమ్ సహ నావవతు। సహ నౌ భునక్తు। సహ వీర్యం కరవావహై।**
**తేజస్వి నావధీతమస్తు। మా విద్విషావహై॥**
**ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

ఇది చాలా ప్రసిద్ధి చెందినది. ఈ శాంతిపాఠంద్వారా శిష్యుడు పరమాత్మనుంచి నాలుగు వరాలను కోరుతున్నాడు. అన్నీ అద్భుతమైన వరాలు.

1. **జ్ఞానప్రాప్తి** – ఓ దేవా నాకు జ్ఞానం ప్రసాదించటంద్వారా నన్ను రక్షించు.

2. **జ్ఞాననిష్ఠ** – పొందిన జ్ఞానాన్ని నిష్ఠగా మలుచుకునేలా చేయి. జ్ఞానాన్ని జీర్ణించుకోగలిగితేనే, నా జీవితాన్ని మంచిమార్గంలోకి మార్చుకోగలుగుతాను. జీర్ణించుకోని జ్ఞానం మరొక కొత్త డిగ్రీని ఇస్తుందంతే. జీర్ణించుకున్న జ్ఞానమే నా జీవితాన్ని ప్రభావితం చేయగలదు. అందువల్ల నేను జ్ఞానం పొందేలా, పొందిన జ్ఞానాన్ని అణువణువునా జీర్ణించుకునేలా చేయి. నా బుద్ధికి అజీర్ణం చేయకుండా చేయి.

3. **ప్రయత్నం** – ఓ దేవా, ఈ జ్ఞానం పొందటానికి అవసరమైన ప్రయత్నం నేను చేయగలిగేలా చేయి. మోక్షం పొందాలనే ఆకాంక్ష నా నిర్ణయం అని ముందు నేను అర్థం చేసుకోవాలి. ఇది ఎవరి నిర్ణయమూ కాదు, ప్రభావమూ కాదు. నాకు మోక్షం వస్తుందా రాదా అనేది భగవంతుని నిర్ణయం కాదు, విధి రాసిన వింతరాత కాదు, నక్షత్రాల ప్రభావం కాదు, హస్తసాముద్రికంలో చెప్పబడలేదు. నాకై నేను నా భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలనే గట్టి పట్టుదలతో తీసుకున్న గట్టి నిర్ణయం. అందువల్ల నా నిర్ణయం బలహీనపడకుండా ఉండేలాగా చూడు. **సహ వీర్యం కరవావహై** – వీర్యం అంటే ప్రయత్నం.

4. **శ్రద్ధ** – ఈ అంశం చాలా ముఖ్యమైనది. ముఖ్యంగా గురువుమీద శ్రద్ధ అంటే ఇది షష్టీ తత్పురుష సమాసం కాదు, సప్తమీ తత్పురుష సమాసం. అంటే గురువుయొక్క శ్రద్ధ కాదు, గురువుయందు శ్రద్ధ. జీవితంలో అతి ముఖ్యమైనది, అత్యంత అరుదైనది. ఎవరి మీదనైనా శ్రద్ధ పెట్టుకోవటం. నిజానికి మన జీవితం మన తల్లిదండ్రులమీద శ్రద్ధ పెట్టుకోవటంతో మొదలవుతుంది.

ఈ శ్రద్ధ ఎంత ముఖ్యమో అంతగా మటుమాయమైపోతున్నది. కాని ఆధ్యాత్మిక రంగంలో సాధించాలంటే మటుకు శ్రద్ధ ఉండితీరాలి. ఈ శ్రద్ధ కూడా ముగ్గురిమీద ఉండి తీరాలి. అవి – భగవంతునిమీద శ్రద్ధ, శాస్త్రంమీద శ్రద్ధ, గురువుమీద శ్రద్ధ. శ్రద్ధ అంటే నమ్మకం. ఈ ముగ్గురిలోనూ గురువుమీద ఇంకా ఎక్కువ శ్రద్ధ ఉండాలి. ఎందుకంటే గురువు భగవంతుని గురించి శాస్త్రం ద్వారా బోధిస్తాడు. పూర్వం గురుకులంలో ఉండి విద్యను అభ్యసించేవారు. అక్కడ అతను ఎటువంటి సంఘటనలు ఎదురైనా తట్టుకుని నిలబడాలంటే గురువుమీద శ్రద్ధ, భక్తి, గౌరవం, ఆరాధన ఉండాలి. గురుశిష్యుల మధ్య అనుబంధం అన్యోన్యంగా సాగాలి.

**మా విద్విషావహై** – నేను నా గురువుమీద శ్రద్ధ పెంచుకోవాలి గాక! చిన్న చిరుగాలికే నా శ్రద్ధ సడలిపోకూడదు. గురువు ప్రవర్తనలో దోషాలు ఎన్నకూడదు. నేను, గురువు చేసిన బోధలో విపరీతార్థాలు వెతకకుండా ఉండేలా చేయి.

ఆ విధంగా శిష్యుడు జ్ఞానం, జ్ఞాననిష్ఠ, ప్రయత్నం, శ్రద్ధ అనే నాలుగు వరాలను ఈ శాంతిపాఠం ద్వారా కోరాడు.

**కఠోపనిషత్తు పేరు ఎలా వచ్చింది?** ఒక్కొక్క ఉపనిషత్తుకు ఆయా పేరు భిన్నకారణాలవల్ల వస్తుంది. ముండకోపనిషత్తు శిరోవ్రతాన్ని సూచిస్తుంది కాబట్టీ, ఉపనిషత్తులలో శిరస్సు వంటిది కాబట్టీ, దానికా పేరు వచ్చిందనీ; కేనోపనిషత్తు కేన పదంతో మొదలవుతుంది కాబట్టి దానికా పేరు వచ్చిందనీ చూశాము. ఇప్పుడు కఠోపనిషత్తుకు ఈ రెండు కారణాలు వర్తించవు.

కఠోపనిషత్తు కృష్ణయజుర్వేదానికి సంబంధించినదని చూశాము. దీన్ని కఠ శాఖ అని కూడా అంటారు. అంతేకాదు ఇది కఠ ఋషినుంచి వచ్చింది. అందువల్ల కాఠకోపనిషత్తు అనీ, కఠోపనిషత్తు అనీ అంటారు. కఠ ఋషి, వైశంపాయన ఋషి శిష్యుడు. వైశంపాయన ఋషి వ్యాసమహర్షి శిష్యుడు.

**ఉపనిషత్తు వివరాలు** – కఠోపనిషత్తులో రెండు అధ్యాయాలు ఉన్నాయి. ఒక్కొక్క అధ్యాయంలో మూడు ఖండాలు ఉన్నాయి. ఇక్కడ అధ్యాయాన్ని అధ్యాయమనే అంటారు

కాని ఖండాన్ని వల్లీ అంటారు. అంటే వెరసి రెండు అధ్యాయాలు, ఆరు వల్లులు ఉన్నాయి. అన్నీ కలిపి 119 మంత్రాలు ఉన్నాయి. అందువల్ల ఇది ముండకోపనిషత్తు, కేనోపనిషత్తులకన్నా పెద్ద ఉపనిషత్తే. కాకపోతే, మనం అధ్యాయాల పరంగా సారాంశం చూస్తున్నాము కాబట్టి రెండు అంశాల్లో చెరో అధ్యాయాన్నీ చూస్తాము. ఇప్పుడు మనం మొదటి అధ్యాయాన్ని చూద్దాము. ఇందులో మూడు వల్లులు ఉన్నాయని చూశాము కదా. ఇప్పుడు ప్రథమాధ్యాయంలోని, ప్రథమవల్లీని చూద్దాము.

## అధ్యాయం 1 – వల్లీ 1

ఈ వల్లీలో 29 మంత్రాలు ఉన్నాయి. మన వీలుకోసం ప్రథమ వల్లీని మూడు అంశాలుగా విభజించుకుందాము. అవి ఆఖ్యాయక, వరత్రయం, పరీక్ష. ఇప్పుడు ఒక్కొక్కదాన్నీ విపులంగా చూద్దాము.

1) **ఆఖ్యాయిక** – ఆఖ్యాయిక అంటే కథ. కఠోపనిషత్తు ఒక కథతో మొదలవుతుంది. ఈ కథ నిజంగా జరిగిందా లేక అల్లబడిందా అనేది మనకు సరిగ్గా తెలియదు. నిజానికి మనకు ఇక్కడ కావాల్సిన విషయం కథ ఎంతవరకూ నిజమన్న విషయం కాదు, కథలో చెప్పబడిన సత్యం. భగవద్గీతలో కృష్ణపరమాత్మ బోధను రెండవ అధ్యాయంనుంచీ మొదలు పెట్టినట్టుగా, ఇక్కడ కూడా యమధర్మరాజు బోధ రెండవ వల్లీనుంచీ మొదలవుతుంది. భగవద్గీతలో మొదటి అధ్యాయం గురుశిష్యులను పరిచయం చేస్తుంది. ఇక్కడా అలాగే జరుగుతుంది. వారి పేర్లు త్వరలో చూద్దాము.

పూర్వం ఒక వైదిక బ్రాహ్మణుడు ఉండేవాడు. అతని పేరు వాజశ్రవసుడు. అతని పేరే అతనెలా వైదిక సాంప్రదాయాన్ని పాటించేవాడో సూచిస్తుంది. వాజమ్ అంటే అన్నం. వాజశ్రవసుడు అనే పేరు అన్నదానం చేసినందుకు వచ్చింది. అతనికి నచికేతుడని ఒక పుత్రుడు ఉన్నాడు. వాజశ్రవసుడు ఒక యజ్ఞం చేసి, తన దగ్గరున్న సమస్తమూ దానంగా యిచ్చివేశాడు. ఆ యజ్ఞం పేరు విశ్వజిత్ యాగం. దీన్ని సకామయజ్ఞంగా చేశాడు. దీని ఫలం స్వర్గలోకప్రాప్తి.

ఆ యజ్ఞంలో తన దగ్గరున్న సర్వమూ దానంగా ఇవ్వాలి కాబట్టి చివరగా వాజశ్రవసుడు తన దగ్గర మిగిలి ఉన్న వట్టిపోయిన ఆవులను కూడా దానం చేస్తాడు.

**పీతోదకా జగ్ధతృణా దుగ్ధదోహా నిరింద్రియాః।**

**అనన్దా నామ తే లోకాస్తాన్స గచ్ఛతి తా దదత్ ॥** – 1.1.3

ఈ మంత్రం అర్థం నీళ్ళు తాగటానికీ, గడ్డి మేయటానికీ, పాలు ఇవ్వటానికీ, దూడని ఈనటానికీ శక్తిలేని ఆవులు అవి.

మరణించటానికి కూడా ఓపిక లేని ఈ ఆవులను దానం చేయటం అతని కుమారుడు నచికేతుడు చూశాడు. అతనే ఈ ఉపనిషత్తులోని ప్రధాన వ్యక్తి. అతను కుమారుడు అంటే 8, 9 ఏళ్ళ వయస్సుకన్నా ఎక్కువ ఉండదు అతనికి. అంత చిన్నవాడే అయినా, వైదిక కుటుంబంలో పుట్టాడు కాబట్టి, అతనికి వైదిక కర్మల గురించి తెలుసనీ, వాటిమీద శ్రద్ధ ఉందనీ మనకు అతని ఆలోచనాతీరువల్ల తెలుస్తుంది. వైదికశాస్త్రంమీద శ్రద్ధ ఉన్న వ్యక్తికి వేదాంతశాస్త్రంమీద శ్రద్ధ తేలికవుతుంది. జ్ఞానం కూడా సులువుగా అబ్బుతుంది.

ఇంత పరిపక్వత ఉన్న నచికేతుడు, తన తండ్రి ఈ వట్టిపోయిన ఆవులను ఇవ్వటం చూసి చాలా బాధపడతాడు. ఎందుకంటే, ఒక యజ్ఞం చేస్తే దక్షిణ సరిగా ఇవ్వాలి. ఎందుకంటే దక్షిణ, యజ్ఞంలో ఒక భాగం. సరియైన దక్షిణ ఇవ్వకపోతే, ఆ యజ్ఞం అసంపూర్ణం అవుతుంది. అప్పుడు అది హీనమైనది అవుతుంది. అంటే తండ్రి స్వర్గానికి వెళ్ళాలని చేసిన ఈ యజ్ఞంవల్ల స్వర్గానికి వెళ్ళకపోగా, దక్షిణలోని లోపంవల్ల ఆనందం లేని లోకాలకు వెళతాడని బాధపడతాడు.

నిష్కామకర్మకూ, కామ్యకర్మకూ మధ్య ఉన్న భేదం ఇదే. నిష్కామకర్మలో ఏమైనా లోపాలున్నా, అది ఫలాన్ని ఇస్తుంది కాని కామ్యకర్మల్లో ఆ కర్మను ఎలా చేయాలో అలా చేయాలి. ఏవీ లోపాలుండకూడదు. లోపంతో కామ్యకర్మ చేస్తే ఆశించిన ఫలం దక్కదు. ఇక్కడ దక్షిణ లోపం ఉంది. పైగా ఆ వట్టిపోయిన ఆవులను తీసుకున్న బ్రాహ్మణుడు వాటివల్ల లాభం పొందకపోగా ఇంకా ఎదురు అవస్థ పడాలి అని బాధపడతాడు.

నచికేతునిలో తండ్రిని కాపాడాలన్న తపన బయలుదేరుతుంది. తను కూడా తండ్రి ఆస్తే కదా! వట్టిపోయిన ఆవులకన్నా తనను దక్షిణగా ఇస్తే, కనీసం తను ఏదైనా సహాయం చేయగలడు ఆ బ్రాహ్మణునికి. అందువల్ల తండ్రి దగ్గరికి వెళ్ళి, మరి అయితే నన్ను ఎవరికి ఇస్తావు అని అడిగాడు. ఒకసారి కాదు, తండ్రి పట్టించుకోకపోతే, రెండోసారి, మూడోసారి రెట్టించాడు. అందుకు తండ్రి చిరాగ్గా మృత్యుదేవతకి ఇస్తానన్నాడు.

**మృత్యవే త్వా దదామి ఇతి** 1-1-4

చిరాకొస్తే గో టు హెల్ అన్నట్టుగా మృత్యుదేవతకు ఇస్తానన్నాడు. నిజంగా అనాలన్న ఉద్దేశ్యంతో అనలేదు. కాని ఇక్కడ తల్లిదండ్రులకు ఇదొక హెచ్చరిక. త్వరపడి పిల్లలను ఏదైనా అనేస్తే, వారు దాన్ని అత్యంత ఇబ్బందికరమైన సమయంలో మళ్ళీ గుర్తు చేస్తారు.

నచికేతుడు, తండ్రి ఈ మాట చిరాకులో కోపంతో అన్నా, అది నిలబెట్టుకోవాలి అనుకుంటాడు. అందువల్ల అన్నీ సర్దుకుని, తండ్రి దగ్గరకు వెళతాడు. తండ్రి నేను

ఉద్దేశ్యపూర్వకంగా అలా అనలేదు అంటాడు, కాని నచికేతుడు ఎదురు తండ్రికే నచ్చచెబుతాడు. విలువలకు కట్టుబడి ఉండాలి. వాక్యపరిపాలన చేయాలనీ, సత్యసంధుడుగా నిలవాలనీ చెబుతాడు. మాటంటే మాటే, అది కూడా యాగశాలలో ఇచ్చిన మాటకు ఇంకా ఎక్కువ విలువ ఉంటుంది. వాక్యపాలనను పూర్వీకులెలా పాటించారో, ఇప్పటివారెలా పాటిస్తున్నారో వివరించి, తండ్రికి నచ్చచెప్పి, యమధర్మరాజు దగ్గరకు వెళతాడు.

మళ్ళీ ఇక్కడ యమధర్మరాజు దగ్గరికి ఎలా వెళ్ళాడు, బొందితో వెళ్ళాడా – ఈ సందేహాలను పెట్టుకోకూడదు. కథను ఎంత మేరకు తీసుకోవాలో అంతమేరకే తీసుకోవాలి. ఒక భాష్యకారుడు నచికేతుడు సశరీరంగానే వెళ్ళాడని, అతని పితృభక్తివల్ల, శాస్త్రాలమీద ఉన్న శ్రద్ధవల్ల, సత్యపాలనవల్ల అతనికా మహిమ వచ్చిందంటాడు.

ఏది ఏమైనా నచికేతుడు వెళ్ళేసరికి యమధర్మరాజు ఉండడు. యజమాని ఇంట లేనప్పుడు పరపురుషుడు లోనికి వెళ్ళడు. తను పిల్లవాడే అయినా వెళ్ళలేదు. పైగా తను సేవకుని హోదాలో వచ్చాడు. అందువల్ల బయటే ఉండిపోతాడు. అలా యమధర్మరాజు ఇంటి ముందు మూడురోజులు అన్నపానాదులు లేకుండా ఆ బ్రాహ్మణుడు అతిథిగా ఉన్నాడు. యమధర్మరాజు కుటుంబసభ్యులు ఖంగారుపడి, యమధర్మరాజు తిరిగి రాగానే వెంటనే వెళ్ళి అతిథిసేవ చేయమనీ, లేకపోతే యజమానికి ప్రత్యవాయపాపం అంటుకుంటుందనీ హడావుడి చేస్తారు. (ఈ భాగం మంత్రంలోని పదాలనుబట్టి మనం అల్లుకున్నాం.)

యమధర్మరాజు, నచికేతుని దగ్గరికి వెళ్ళి, ఓ బ్రాహ్మణ అతిథీ! నమస్కరింపదగ్గ నువ్వు నా ఇంట్లో అన్నం తినకుండా మూడు రాత్రిళ్ళు గడిపావు కాబట్టి దానికి ప్రతిగా నువ్వు నానుంచి మూడు వరాలు కోరుకో అన్నాడు.

ఇక్కడివరకూ కథ. ఈ కథను ఇంకా సాగతీయకుండా ఇందులో ఉపనిషత్తు అందజేసిన ముఖ్యమైన విలువలను గ్రహించాలి.

1. **వేదంమీద శ్రద్ధ** – వాజశ్రవసునికి శాస్త్రంమీద శ్రద్ధ ఉండబట్టే ఈ విశ్వజిత్ యాగాన్ని చేశాడు. అతని పేరులోనే అతను ఎన్నో అన్నదానాలు చేసాడని అర్థం వస్తుంది. అన్నదానాలు చేశాడు అంటే యజ్ఞయాగాదులు అనేకం చేశాడని అర్థం.

2. **దానం** – నచికేతుని బాధ ద్వారా ప్రతియజ్ఞానికీ దక్షిణ ఇవ్వాలనీ, దక్షిణ అనేది యజ్ఞంలో ఒక ముఖ్యాంశం అనీ అర్థమవుతుంది. దక్షిణ పుచ్చుకునే వ్యక్తి, దక్షిణ కోరుకోకపోయినా, మనం దక్షిణ ఇచ్చితీరాలి. గురువు వద్ద విద్య నేర్చుకుంటే గురుదక్షిణ ఇచ్చితీరాలి.

3. **వాక్యపరిపాలన** – మాటంటే మాటే. సత్యవాక్యపరిపాలన చేయాలి. యమధర్మరాజుకి ఇస్తాను అని తండ్రి కోపంతో అన్నా, తనను ఇచ్చి తీరాలని నచ్చచెప్పాడు నచికేతుడు.

4. **అతిథి సేవ** – అక్కడ యమధర్మరాజుకి నిజంగా ప్రత్యవాయపాపం అంటదు కాని ఈ కథ ద్వారా ఇంటికి వచ్చిన అతిథి అభోజనంగా ఉండకూడదు. అతనికి సేవ చేయాలని తెలుస్తున్నది.

5. **అణకువ** – యమధర్మరాజు యమపురికి రాజు, దేవత, వచ్చినది ఒక చిన్న బాలుడు, బాలబ్రహ్మచారి, మనుష్యుడు. అయినా అతనికి కాళ్ళు కడిగి సేవ చేశాడు.

6. **ధర్మసూక్ష్మం** – యమధర్మరాజు ధర్మానికి ప్రతీక. ఈ బాలబ్రహ్మచారి మూడురోజులు ఆహారం లేకుండా ఉన్నాడు కాబట్టి, దానికి ప్రతిగా మూడు వరాలు కోరుకోమన్నాడు.

**త్రీన్వరాన్వృణీష్వ – 1.1.9**

2) **వరత్రయం** – యమధర్మరాజు మూడు వరాలు కోరుకోమన్నాడు.

**మొదటి వరం** – నచికేతుడు మొదటి వరంగా తండ్రి గురించి కోరుతాడు. నిజానికి తండ్రి గురించి ఐదు కోరికలు ఒకటే వాక్యంలో కోరి, ఇదంతా నా మొదటి వరం సుమా అన్నాడు. లేకపోతే ఒకటి కోరగానే యమధర్మరాజు మూడు కోరికలు అయిపోయాయి అనుకునే ప్రమాదం ఉంది. నచికేతుడు చాలా తెలివైనవాడు. ఇందులో తండ్రి గురించిన తపన కనబడుతుంది. అతను మోసగాడు కాదు. అవి తన తండ్రికి తనమీద ఉన్న బెంగ పోవాలి, కోపం పోవాలి, శాంతరూపం పొందాలి, తను వెనక్కి వెళ్ళినప్పుడు తనను గుర్తించాలి, తనతో ఎప్పటిలా ప్రేమతో మాట్లాడాలి. ఇదంతా నా మొదటి వరం అంటాడు. యమధర్మరాజు తనని వెనక్కి పంపిస్తాడని చెప్పకనే చెబుతున్నాడు. తథాస్తు అంటాడు యమధర్మరాజు.

**రెండవ వరం** – రెండవ వరంగా స్వర్గఫలాన్ని ఇచ్చే యజ్ఞాన్ని చెప్పమని కోరుతున్నాడు. అది కూడా తనకోసం కాదు, లోకశ్రేయస్సుకోసం. స్వర్గలోకంలో మనుష్యులను కబళించివేసే వృద్ధాప్యం, అనారోగ్యం, ఆకలిదప్పులు ఉండవు. ముఖ్యంగా యమధర్మరాజు ఉండడు. అందువల్ల ఆ లోకానికి వెళ్ళే యజ్ఞం గురించి చెప్పమన్నాడు. అలాగే యమధర్మరాజు ఒక యజ్ఞం ఎలా చేయాలో వివరించి చెబుతాడు. నచికేతుడు యమధర్మరాజు చెప్పింది చెప్పినట్టుగా తిరిగి అప్పచెబుతాడు. దానితో తృప్తి చెందిన యమధర్మరాజు అదనంగా ఇంకో వరం ఇస్తానని చెప్పి, రెండు వరాలు ఇస్తాడు. ముందు వరాలు దోషనివృత్తికోసం ఇచ్చినవి. ఇవి తృప్తి చెంది ఇచ్చినవి.ఆ వ్రతానికి నాచికేతయజ్ఞం అనే పేరు పెట్టాడు. ఇంకొక వరంగా ఉపాసన కూడా బోధిస్తాడు. ఆ ఉపాసనను విరాట్ ఉపాసన లేదా

విశ్వరూప ఉపాసన అంటారు. నాచికేతయజ్ఞం చేసిన వ్యక్తి స్వర్గలోకానికి వెళితే, ఉపాసనాసహిత నాచికేత యజ్ఞం చేసిన వ్యక్తి బ్రహ్మలోకానికి వెళతాడు.

**మూడవ వరం–** ఇప్పుడు నచికేతుడు మూడవ వరం అడుగుతాడు. ఆత్మజ్ఞానం కోరుతాడు. ఇది చాలా ముఖ్యమైన శ్లోకం.

**యేయం ప్రేతే విచికిత్సా మనుష్యే**
**ఽస్తీత్యేకే నాయమస్తీతి చైకే।**
**ఏతద్విద్యామనుశిష్టస్త్వయాఽహం**
**వరాణామేష వరస్తృతీయః॥** – 1.1.20

మరణానంతరం శరీరం కాక ఆత్మ ఉందని కొందరు, లేదని కొందరు అంటున్నారు. ఈ సందేహాన్ని నిన్ను అడిగి తీర్చుకోవాలనుకుంటున్నాను. ఇదే నేను కోరే మూడవ వరం అన్నాడు నచికేతుడు. దానికి జవాబు మూడవ భాగంలో చూస్తాము. కాని మూడవ భాగం చూసేముందు ఈ కోరికలనుబట్టి ఇక్కడ కూడా నచికేతుని ఉన్నతస్వభావం గురించి గ్రహించాలి.

మూడు వరాలు కోరమంటే మనమైతే ముందు మన గురించి కోరతాము. కాని నచికేతుడు వరాలు కోరుకున్న వరుసక్రమం చూడండి. ముందు తండ్రి గురించి అడిగాడు. అది కూడా తెలివిగా అనేక కోణాల్లోంచి, ఒక వరంగా తండ్రి గురించి కోరాడు. తరువాత సమాజశ్రేయస్సు కోరాడు. ఆ రెండూ తీరాకే, తనలో ఉన్న ఒక కోరికను తీర్చుకునే కోరిక కోరాడు. అది కూడా ఏదో తోచక అడిగినది కాదు, యమధర్మరాజుని పరీక్షించటానికి అడిగినది కాదు. మరెందుకు అడిగాడు? మూడవ అంశంలో తేటతెల్లమవుతుంది.

3) **పరీక్ష** – నాకు ఆత్మజ్ఞానం బోధించు అని ఒక బాలుడు అడిగితే, అడగగానే పెట్టేసే తాయిలం కాదు అది. నిజానికి లౌకికవిద్యలోనే ఎల్.కే.జీ.లో చేరాలన్నా, పీజీలో చేరాలన్నా, ఇంజనీరింగ్ కాలేజీలో చేరాలన్నా ఎంట్రన్స్ ఎగ్జామ్స్ ఉంటాయి. దానిద్వారా అతను అధికారి అవునా కాదా అని నిర్ణయిస్తారు. అటువంటప్పుడు ఇంత క్లిష్టమైన ఆత్మవిద్యను చిన్న బాలుడు కోరితే, అతని అధికారిత్వం పరీక్షించకుండా ఎలా బోధించేస్తాడు? ఇందులోనే కాదు, మరికొన్ని ఉపనిషత్తుల్లో కూడా ఇలా గురువు శిష్యుని అధికారిత్వాన్ని పరీక్షిస్తాడు. అధికారిత్వం సాధన చతుష్టయ సంపత్తి కలిగివుండటం. అవి వివేకం, వైరాగ్యం, ముముక్షుత్వం, శమాది షట్కసంపత్తి. వాటిని నచికేతుడు ఎలా ప్రదర్శించాడో చూద్దాము.

**ముముక్షుత్వం** – ముందుగా యమధర్మరాజు ఈ విద్య ఎంతో సూక్ష్మమైనది. తేలికగా అర్థం కాదు. దేవతలకు సహితం ఇది అర్థం కాదు. ఇంకేదైనా వరం కోరుకో అన్నాడు. కాని నచికేతుడు చెక్కు చెదరలేదు. దేవతలకు సైతం అర్థం కాదా, అయితే అదే నాకు నేర్పించు. పైగా నిన్ను మించిన గురువు ఎవరున్నారు అన్నాడు. దీన్ని మించిన వేరే వరం ఏదీ లేదు అన్నాడు. ఇది అతని **తీవ్రముముక్షుత్వాన్ని** సూచిస్తుంది.

**వైరాగ్యం** – యమధర్మరాజు ఎన్నో ప్రలోభాలు చూపాడు. వందేళ్ళ ఆయుష్షుగల పుత్రులనీ, మనుమలనీ కోరుకో. అనేక పశువులనూ, ఏనుగులనూ, బంగారాన్నీ, గుర్రాలను కోరుకో. విశాలమైన రాజ్యాన్ని కోరుకో. కోరినన్నేళ్ళు జీవించు. చక్రవర్తిని చేస్తాను. ఇంకేం కావాలన్నా ఇస్తాను. సారథులతో కూడిన రథాలను ఇస్తాను; సంగీతవిద్వాంసులను, అప్సరసలను ఇస్తాను అంటాడు. కాని నచికేతుడు ఒక్క క్షణం కూడా వాటి వైపు ప్రలోభ పడలేదు.

**తవైవ వాహాస్తవ నృత్యగీతే** 1-1-26

నీ గుర్రాలూ, ఆటపాటలూ నువ్వే ఉంచుకో అంటాడు. ఇది వైరాగ్యం. కాని చిన్నపిల్లవాడు కదా. వీటి విలువ తెలియక అంటున్నాడు అంటే తన వివేకాన్ని ప్రదర్శిస్తాడు. నిత్యానిత్యవస్తు వివేకం చేస్తున్నాడు.

ఎప్పుడో వచ్చేవాటిని వద్దనటం కాదు. యమధర్మరాజు రెండవ వరం తరువాత ఇచ్చిన అతి విలువైన నవరత్నాల ఆభరణాన్ని కూడా తిరస్కరించాడు.

**వివేకం – అపి సర్వం జీవితమల్పమేవ** (1-1-26) – ఈ జీవితం, లోకాలు, ధనం, యశస్సు, అన్నీ స్వల్పం. ఏదీ శాశ్వతం కాదు అంటున్నాడు. అంతేకాదు,

**న విత్తేన తర్పణీయో మనుష్యః** 1-1-27

ఎంత డబ్బు ఉన్నా మనుష్యులు తృప్తి చెందరని కూడా అంటాడు. పైగా నువ్వు అధికారంలో ఉన్నంతవరకూ నాకేం ధోకా లేదు అన్నాడు.

**శమాదిషట్క సంపత్తి** – దీన్ని ముందే చూశాము – యమధర్మరాజు దగ్గరికి నచికేతుడు వెళ్ళినప్పుడు, యమధర్మరాజు ఇంట్లో లేకపోతే మూడు రోజులు లోపలికి వెళ్ళకుండా, అన్నపానాదులు తీసుకోకుండా ఉన్నాడు. ఇది శమదమాదులను సూచిస్తుంది.

ఆ విధంగా నచికేతుడు యమధర్మరాజు పెట్టిన పరీక్షలో ఉన్నతశ్రేణిలో గెలుపొంది. నాకు ఆత్మవిద్య గురించే బోధించు; నచికేతుడు వేరే వరాన్ని కోరడు అని తేల్చి చెప్పేశాడు. ఇక్కడితో ప్రథమ వల్లీ అయింది.

## అధ్యాయం 1 – వల్లీ 2

రెండవ వల్లీలో 25 మంత్రాలు ఉన్నాయి. దీన్ని కూడా మూడు అంశాలుగా విభజించవచ్చు. అవి గురుశిష్యశాస్త్రమహిమ, ఆత్మస్వరూపం, జ్ఞానసాధనలు. ఒక్కొక్కటి చూద్దాము.

1) **గురుశిష్యశాస్త్రమహిమ** – నిజానికి గురువు గురించీ, శిష్యుని గురించీ, శాస్త్రం గురించీ అనేక మహిమలు చెప్పవచ్చు. కాని యమధర్మరాజు ఒక్కొక్కదానికీ ఒక్కొక్క మహిమను వివరించాడు.

**శిష్యమహిమ** – మనుష్యులకు నాలుగు పురుషార్థాలను నిర్దేశించింది శాస్త్రం. అవి ధర్మార్థకామమోక్షాలు. ఈ ఉపనిషత్తులో రెండు ప్రత్యేక పదాలను చూస్తాము. ధర్మార్థకామాలను ప్రేయోమార్గం అనీ, మోక్షాన్ని శ్రేయోమార్గం అనీ పేర్కొంది. ప్రేయోమార్గం అంటే మనకు ప్రియమైనది; శ్రేయోమార్గం అంటే మనకు శ్రేయస్కరమైనది.

శ్రేయస్సు ప్రేయస్సు మనిషి ముందు స్వయంవరంలోలా నిలుచుంటాయి. ధీరుడు శ్రేయస్సును ఎన్నుకుంటాడు. ఉపనిషత్తులలో ధీరుడు అంటే బలవంతుడు కాదు. సాత్త్వికుడు, తెలివైనవాడు, వివేకం ఉన్నవాడు. ఎక్కువగా మనుష్యులు ప్రేయోమార్గాన్ని ఎన్నుకుంటారు. కాని నచికేతుడు చక్కగా ఆలోచించి సంపదలను, అందమైన స్త్రీలను వద్దనుకున్నాడని, ఎన్ని ప్రలోభాలు పెట్టినా లొంగలేదు అని యమధర్మరాజు నచికేతుణ్ణి మెచ్చుకున్నాడు. అంటే అతనిలో సాధన చతుష్టయ సంపత్తి ఉందని మనం గ్రహించినది, ఇక్కడ స్వయంగా కాబోయే గురువే చెబుతున్నాడు.

**విద్య మహిమ** – అరుదైనవాటిలో అరుదైనది వేదాంత శ్రవణం. ఎందుకు? మనుష్యుల్లో 80% మనుష్యులు అర్థకామాల వెంటే పరుగులు తీస్తే, 20% మాత్రమే మోక్షం గురించి ప్రాకులాడుతారు. అక్కడనుంచీ అనేక దశలు దాటుకుంటూ రావాలి వారు.

మొదటి దశ – **మోక్ష ఇచ్ఛ** – మోక్షం పొందాలని కోరిక ఉంటుంది కాని మార్గం తెలియదు. భక్తి, కర్మ, కుండలినీ ధ్యానం అంటూ వెతుకుతారు. వారిలో కొద్దిమంది మాత్రం రెండవ దశకి వస్తారు. అది **జ్ఞాన ఇచ్ఛ** – జ్ఞానంవల్లనే మోక్షం వస్తుందని తెలుసు కాని మళ్ళీ మార్గం తెలియదు. మూడవ దశకి అందరూ రారు. అది శాస్త్ర విచార ఇచ్ఛ. శాస్త్రం అధ్యయనం చేస్తే మోక్షం కలుగుతుంది. అక్కడా సమస్యే. నాలుగవ దశకు రావాలి. **గురు ఉపదేశ శ్రవణ ఇచ్ఛ**. సమర్థవంతమైన గురువు బోధ వినటానికి సిద్ధపడాలి. ఈ దశకు 2% చేరుకుంటారంతే. ఈ విషయాన్ని వర్ణించే మంత్రం చాలా ముఖ్యమైన మంత్రం.

**ఆశ్చర్యో వక్తా కుశలోఽస్య లబ్ధాఽ శ్చర్యో జ్ఞాతా కుశలానుశిష్టః॥** 1-2-7

ఆత్మను గురించి బోధించే వ్యక్తి అరుదు, వినే వ్యక్తీ అరుదు. అటువంటి అరుదైన ఉపదేశాలను పొంది, దాన్ని అర్థం చేసుకున్న వ్యక్తి కూడా అరుదే.

**గురు మహిమ** – ముందు విద్యాస్తుతి చేశాక గురుస్తుతి చేస్తున్నాడు. కళ్ళకు కనబడనిదాన్ని కళ్ళకు కట్టినట్టు వర్ణించాలి. దానికి ఆచార్యులు విశిష్టంగా ఉండాలి.

**అనన్యప్రోక్తే గతిరత్ర నాస్తి** 1-1-8

ముండకోపనిషత్తులో గురువును శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ గురువుగా కీర్తిస్తే ఇక్కడ యమధర్మరాజు అనన్యగురువు అంటున్నాడు. అనన్యగురువు అంటే అద్వైత ఆత్మను బోధించే ఉత్తమ ఆచార్యుడు. అటువంటి గురువు బోధిస్తే, మళ్ళీ పునర్జన్మ ఉండదు. అంటే సంసారవృత్తంలో పడి తిరగడు అని అర్థం.

ఆత్మ అణువుకన్నా సూక్ష్మమైనది. తర్కానికి అందనిది. దీన్ని అనేక విధాలుగా అర్థం చేసుకుంటారు. ఇంతవరకూ నేర్చుకునే పద్ధతి ఆబ్జెక్టు గురించి నేర్చుకుంటాము. కాని శాస్త్రం ఆత్మ బాహ్యవస్తువు కాదు, నువ్వే అది అంటుంది. అది గురువే బోధించగలడు. ఆ విధంగా శిష్యుడు, విద్య, గురువుల గురించి చూస్తాము.

2) **ఆత్మస్వరూపం** – నచికేతుడు మళ్ళీ ఆత్మజ్ఞానం బోధించమని అడుగుతాడు. అతనికే ఆత్మ గురించి కొంత తెలుసు. ఆ పదాలు వేసిన ఈ మంత్రం చాలా ముఖ్యమైన మంత్రం.

**అన్యత్ర ధర్మాదన్యత్రాధర్మాత్ అన్యత్రాస్మాత్కృతాకృతాత్।**
**అన్యత్ర భూతాచ్చ భవ్యాచ్చ యత్తత్పశ్యసి తద్వద॥** – 1.2.14

ధర్మ, అధర్మాలకు విలక్షణంగా, కార్యకారణాలకు విలక్షణంగా, కాలానికి అతీతంగా ఉన్నదేదో దాని గురించి నాకు చెప్పు అంటున్నాడు. ఇక్కడనుంచీ యమధర్మరాజు బోధ మొదలవుతుంది. ముందు ఓంకార ఉపాసనను వివరిస్తాడు. దాని తర్వాత ఆత్మస్వరూపాన్ని వివరిస్తాడు. ఈ భాగం 18 నుంచి 25 వరకూ ఉన్న మంత్రాలు చాలా ముఖ్యమైనవి. కృష్ణపరమాత్మ వీటిల్లోంచి కొన్ని మంత్రాలను తీసుకున్నాడని గీతలో చూస్తాము. కొన్ని అయితే ఇంచుమించుగా అలాగే ఉంటాయి. మొదటి మంత్రం –

**న జాయతే మ్రియతే వా విపశ్చిత్ నాయం కుతశ్చిన్న బభూవ కశ్చిత్।**
**అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో న హన్యతే హన్యమానే శరీరే॥** – 1.2.18

1. **విపశ్చిత్** – సర్వప్రకాశక చైతన్యం, చిద్రూపస్య ఆత్మ అని పేర్లు వేరైనా చైతన్యం ఒకటే. ఈ చైతన్యమైన ఆత్మకు ఐదు అంశాలు ఉన్నాయి. అవి –

1. చైతన్యం శరీరంలో ఒక భాగం కాని, లక్షణం కాని, దాన్నుంచి ఉత్పత్తి అయిన వస్తువు కాని కాదు.

2. చైతన్యం స్వతంత్ర వస్తువు. అది శరీరం అంతటా వ్యాపించి, దాన్ని ప్రకాశింపజేస్తుంది.

3. చైతన్యం శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు.

4. చైతన్యం, శరీరం నాశనమయితే నాశనమవదు. శరీర పతనానంతరం కూడా చైతన్యం ఉంటుంది.

5. చైతన్యం, శరీరం లేక పోయినా ఉంటుంది కాని కనబడదు. దాన్ని ప్రతిబింబింప చేసే మాధ్యమం లేదు కాబట్టి అది కనిపించదు. అంతమాత్రాన చైతన్యం లేనట్టు కాదు.

ఆత్మకు శరీర లక్షణాలుంటే దానికి విడిగా ఉనికి ఉండదు. చైతన్యం విశేషం కాదు, సర్వనామం. కాకపోతే కంటికి కనబడదు. లక్షణాలు లేని శుద్ధచైతన్యం.

2. **న జాయతే మ్రియతే వా** – నిర్వికార చైతన్యం. శరీరానికి షడ్వికారాలు ఉన్నాయి. అస్తి జాయతే, వర్ధతే, విపరిణమతే, అపక్షీయతే, వినశ్యతి – ఆత్మకు చావుపుట్టుకలు లేవు. షడ్వికారాలు లేవు.

3. **అకర్తా, అభోక్తా** – ఆత్మ కర్త కాదు, భోక్త కాదు. అంటే కర్మ చేయదు, కర్మఫలం అనుభవించదు. కర్త అవాలంటే కర్మ చేయాలి. కర్మ చేయాలంటే మార్పు చెందాలి. ఆత్మ నిర్వికారం అని ఇంతకుముందే చూశాము. మార్పు లేకపోతే కర్మ లేదు; కర్మ లేకపోతే కర్త కాలేదు. కర్త కాకపోతే భోక్త కూడా కాదు. అలా ఆత్మ నిత్య, ముక్తస్వరూపం అవుతుంది.

4. **సర్వ అధిష్ఠానం** – ఆత్మ అధిష్ఠానం అంటే అన్ని వస్తువులకూ ఆధారం ఏదో అది. పూలదండలో ఉన్న దారం, పూలను కలిపి ఉంచుతుంది. పువ్వులు రాలినా దారం ఉంటుంది. అలా ఆత్మ చైతన్యం. అనేక శరీరాల్లో అంతర్లీనంగా ఉంటుంది. ప్రాణుల హృద్గుహలో కొలువై ఉంది.

5. **నిరుపాధిక సోపాధిక చైతన్యం** – శరీరంలో రెండు చైతన్యాలు ఉన్నాయి. బింబచైతన్యం, ప్రతిబింబచైతన్యం. బింబచైతన్యాన్ని ప్రతిబింబింపచేసేది మనస్సు. దాన్ని ప్రతిబింబమాధ్యమం అంటారు. మనశ్శరీరాలతోపాటు ప్రతిబింబచైతన్యం ప్రయాణం చేస్తుంది. బింబచైతన్యం సర్వవ్యాపకం కాబట్టి అది కదలదు. బింబచైతన్యం నిరుపాధిక చైతన్యం, ప్రతిబింబచైతన్యం సోపాధిక చైతన్యం. నేను ఎవరు? ప్రతిబింబచైతన్యంనుంచి బింబచైతన్యానికి దృష్టి మరల్చాలి. అదే మోక్షం.

6. **అనంతం** – శరీరం లేని ఆత్మ శరీరంలో ఉంది. ఆత్మ శరీరంలో ఉంది అంటే దాని అర్థం శరీరంలో కూడా ఉంది అని. శాశ్వతమైన, సర్వవ్యాపకమైన ఆత్మ ప్రతి అశాశ్వతమైన భౌతికవస్తువులో ఉంది. అదిసర్వత్రా నెలకొని ఉంది.

7. **దేశకాల అతీతం** – ఆత్మ జగత్ సృష్టి, స్థితి, లయకారణం. ఇక్కడ లయ కారణంగా చూస్తాము. ప్రళయంలో మొత్తం ప్రపంచం అవ్యక్తంలోకి వెళ్ళిపోతుంది. దీనిద్వారా కాలం కూడా సృష్టిలో ఒక భాగమని యమధర్మరాజు చూపిస్తున్నాడు.

3) **జ్ఞానసాధనలు** – ఆత్మ లక్షణాలు వివరిస్తూ నేను తప్ప ఎవరూ ఆత్మను అర్థం చేసుకోలేరు అంటాడు యమధర్మరాజు. అంటే దీనికి కొంత ప్రత్యేక సాధన కావాలి. ఆత్మస్వరూప వర్ణనలో కొంచెం పక్కకి జరిగి సాధనలు వర్ణిస్తున్నాడు.

**తీవ్రముముక్షుత్వం** – ఆత్మజ్ఞానం పొందాలంటే తీవ్రముముక్షుత్వం ఉండాలి. ఇది సాధన చతుష్టయ సంపత్తిలోని తక్కిన అంశాలను కూడా సూచిస్తుంది.

**విలువలు** – చెడు ప్రవర్తననుంచి వైదొలగనివాడు, ఇంద్రియనిగ్రహం లేనివాడు, ఏకాగ్రత లేనివాడు, ఉద్రిక్తత ఆపుకోలేనివాడు, కేవలం వేదవిజ్ఞానంవల్ల ఈ ఆత్మను పొందలేడు. అంటే నైతిక జీవనవిధానం ఉండాలి. అప్పుడే జ్ఞానంద్వారా మోక్షాన్ని పొందగలడు.

## అధ్యాయం 1 – వల్లీ 3

ఈ వల్లీలో 17 మంత్రాలు ఉన్నాయి. దీన్ని కూడా మూడు అంశాలుగా విభజించవచ్చు. అవి రథకల్పన, ఆత్మస్వరూపం, జ్ఞానసాధన.

1) **రథకల్పన** – జీవాత్మకు రెండు గమ్యాలు ఉన్నాయి. అవి శ్రేయస్సు, ప్రేయస్సు. వాటికి రెండు మార్గాలు ఉన్నాయి. అవి జ్ఞానం, కర్మ. జీవాత్మ ప్రయాణాన్ని రథకల్పనతో వివరించింది ఉపనిషత్తు. దృష్టాంతం రథం – ద్రాష్టాంతం – ప్రయాణీకుడు.

| **రథంలో భాగాలు** | **పోలిక** | **చేసే పని** |
|---|---|---|
| 1. రథం | శరీరం | ప్రయాణం చేస్తుంది |
| 2. అశ్వాలు | పంచేంద్రియాలు | ఉదా: చెవులు ప్రసంగం వినాలంటే, ఇంద్రియాలు అక్కడికి తీసుకువెళతాయి |
| 3. పగ్గాలు | మనస్సు | ఇంద్రియాలను అదుపులో పెడుతుంది |
| 4. రథసారథి | బుద్ధి | మనస్సును అదుపులో పెడుతుంది. |
| 5. యజమాని | జీవాత్మ | మనశ్శరీరాలతో కూడిన చిదాభాస |
| 6. మార్గం | విషయవస్తువులు | శబ్దస్పర్శరూపరసగంధాలు |

జీవాత్మ అంటే మనశ్శరీరాలతో కూడిన చిదాభాస. చిదాభాసను ప్రతిబింబచైతన్యం అని కూడా అంటారు. మనస్సు ఆలోచిస్తే ఆత్మ ఆలోచిస్తున్నట్టు, ఇంద్రియాలు కదిలితే ఆత్మ కదులుతున్నట్టు అనిపిస్తుంది కాని, ఇది ప్రతిబింబచైతన్యం మాత్రమే. బింబచైతన్యం

సాక్షీభూతంగా చూస్తుంది అన్నది గ్రహించాలి అని చెప్పటానికే ఈ రథకల్పన వాడింది ఉపనిషత్తు. పైగా ఈ విషయం ఋషులు చెప్పారు అంటున్నది.

ఇక్కడ అన్వయవ్యతిరేక పద్ధతిలో విషయాన్ని వివరిస్తున్నది. రథసారథికి మార్గం తెలిసినట్టుగా, జీవాత్మ బుద్ధికి శాస్త్రజ్ఞానం ఉండాలి. పగ్గాలు అతని చేతిలో ఉన్నట్టుగా మనస్సుని అతను అదుపులో పెట్టుకోవాలి. అప్పుడు గుర్రాలు వాటంతట అవే అతని మాట వింటాయి. అలాగే శాస్త్రం తెలిసి, తన మనస్సును అదుపులో పెట్టుకున్న వ్యక్తికి ఇంద్రియాలు దాసోహం అంటాయి. కాని ముందు ఈ విషయం చెప్పక, ప్రతికూలంగా చెబుతుంది. వివేకం లేని వ్యక్తికి మనస్సు అదుపు తప్పుతుంది. మనస్సు అదుపు తప్పిన వ్యక్తికి ఇంద్రియ నిగ్రహం ఉండదు అంది. దాని తర్వాత పైన చూసినట్టుగా సానుకూలంగా చెప్పింది.

> **యస్తు విజ్ఞానవాన్భవతి యుక్తేన మనసా సదా।**
> **తస్యేన్ద్రియాణి వశ్యాని సదశ్వా ఇవ సారథేః॥** 1. 3. 6

ఏ మనిషికి బుద్ధి ఉన్న సారథి ఉన్నాడో, మనస్సు అదుపులో ఉంటుందో, అటువంటి వ్యక్తి సంసారసాగరంయొక్క ఆవలి తీరానికి చేరతాడు. అంటే బ్రహ్మజ్ఞానం పొందుతాడు. కాని ఇంత స్పష్టంగా ఇక్కడ చెప్పదు. బ్రహ్మను పొందుతాడు, విష్ణుపదం పొందుతాడు అంటాడు.

ఇక్కడితో రథకల్పన అయిపోయింది. దీనిద్వారా 5 శిక్షణలు బోధిస్తున్నది.

1. మంచి శరీరం – ఆరోగ్యం
2. అదుపులో ఉన్న ఇంద్రియాలు – దమం
3. అదుపులో ఉన్న మనస్సు – శమం
4. జ్ఞానం పొందిన బుద్ధి – వివేకం
5. కలిసికట్టుదనం – ఆర్జవం

ఇవే కాక శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలని కూడా గ్రహించాలి.

2) **ఆత్మస్వరూపం** – ఆత్మస్వరూపాన్ని ముందు వల్లీలో వివరించినా కూడా, అది ఉపనిషత్తుల సారం కాబట్టి మళ్ళీ బోధిస్తున్నాడు యమధర్మరాజు. ఈసారి పంచకోశవివేకంద్వారా వివరిస్తున్నాడు.

1. **పంచకోశాతీతం** – ఈ పంచకోశవివేకంద్వారా ఆధ్యాత్మిక ప్రయాణం చేసి చేరుకునే ఆ బ్రహ్మ ఏమిటో వర్ణిస్తాడు. ముందుగా తెలుసుకోవాల్సింది, ఈ ప్రయాణం బాహ్యంగా చేసే ప్రయాణం కాదు. అంతర్ముఖప్రయాణం. బాహ్యప్రయాణానికి కర్మ కావాల్సివస్తే,

అంతర్ముఖప్రయాణానికి జ్ఞానం కావాలి. ఈ ప్రయాణం ఆత్మ, అనాత్మల వివేకం చూపిస్తుంది. అంటే ఆత్మస్వరూపం అర్థం చేసుకుని అనాత్మ భావనను పోగొట్టుకోవాలి.

**ఇంద్రియాలకన్నా విషయవస్తువులు శక్తివంతమైనవి.**
**విషయవస్తువులకన్నా మనస్సు శక్తివంతమైనది.**
**మనస్సుకన్నా బుద్ధి శక్తివంతమైనది.**
**బుద్ధికన్నా ఆత్మ (సమష్టి బుద్ధి) శక్తివంతమైనది.**

వీటిని కోశాలపరంగా చూస్తే, ఇంద్రియాలు–అన్నమయకోశం, విషయవస్తువులు–ప్రాణమయకోశం, మనస్సు–మనోమయకోశం, వ్యష్టిబుద్ధి–విజ్ఞానమయకోశం, సమష్టిబుద్ధి–హిరణ్యగర్భ లేదా ఆనందమయకోశం.

సమష్టిబుద్ధికన్నా అవ్యక్తం శక్తివంతమైనది. అవ్యక్తం అంటే సమష్టి కారణప్రపంచం.

అవ్యక్తంకన్నా చైతన్యం శక్తివంతమైనది. చైతన్యంకన్నా శక్తివంతమైనది ఏదీ లేదు. అదే పరమవస్తువు, అదే అంతిమగమ్యం. దీన్ని శాఖాచంద్రన్యాయం ద్వారా చేయవచ్చు. ఈ పద్ధతిని చాలా చిన్న ఆకారంలో కనబడే నెలవంకని చూడటానికి ప్రయోగిస్తారు. ముందు ఒక చెట్టును చూపించి, దాని తరువాత దాని చిటారుకొమ్మలను చూడమని, ఆ చిటారుకొమ్మల మధ్య నెలవంక ఆకారంలో ఉన్న చంద్రుణ్ణి చూపిస్తారు. అంటే స్థూలవస్తువునుంచి సూక్ష్మవస్తువుకు, ఇక్కడ ప్రత్యేకించి అంతర్ముఖంగా ప్రయాణిస్తామన్నమాట. ఒక కోశంనుంచి ఇంకో కోశానికి వస్తూ, ఆత్మచైతన్యం దగ్గరికి వచ్చాక ఇంక ప్రయాణం లేదు. ఆత్మకన్నా సూక్ష్మమైనది లేదు.

**సా కాష్ఠా సా పరాగతిః** – లోపల, బయటా – అంతటా ఉన్నది ఆత్మే. బ్రహ్మ సూక్ష్మాతి సూక్ష్మం, సర్వవ్యాపకం. ఈ బ్రహ్మజ్ఞానంతో మన ప్రయాణం ముగుస్తుంది. ఇక్కడ ఒక విషయాన్ని గమనించాలి. వ్యష్టిబుద్ధినుంచి సమష్టిబుద్ధికి ఎందుకు ప్రయాణించింది ఉపనిషత్తు. అలా చేయకపోతే పంచకోశాలకతీతమైనది ఆత్మ అని ఆగితే, ఎన్ని శరీరాలు ఉంటే అన్ని ఆత్మలు ఉన్నాయని పొరపాటు పడే అవకాశం ఉంది. సాంఖ్యుల వాదన అదే!

2. **ఆత్మ సుసూక్ష్మం** – ఆత్మజ్ఞానం పొందటానికి సూక్ష్మమైన బుద్ధి ఉండాలి అంటే దాని అర్థం ఆత్మ సూక్ష్మమైనదానికన్నా సూక్ష్మం. ఈ ఆత్మ అన్ని జీవులలోనూ దాగివుంది. ప్రకటితం కాదు.

**దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా**
**సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః॥** – 1.3.12

సూక్ష్మాతి సూక్ష్మమైన ఆత్మను సూక్ష్మబుద్ధి ఉన్నవారు మాత్రమే అర్థం చేసుకోగలరు. నేను పంచకోశాలను అనే అజ్ఞానాన్ని తొలగించుకుని, నేను పంచకోశాతీత ఆత్మను అని అర్థం చేసుకోవటమే ఆత్మజ్ఞానం. అంటే ప్రయాణం బాహ్యంగా లేదు, దృక్పథంలో మార్పు రావాలి.

3. **ఇంద్రియ అగోచరం** – ఆత్మ ఇంద్రియ అగోచరం అని చూపించే, ఉపనిషత్తుల్లోకి అక్షరలక్షల విలువనిచ్చే మంత్రం ఇది.

**అశబ్దమస్పర్శమరూపమవ్యయం**
**తథాఽరసం నిత్యమగన్ధవచ్చ యత్।**
**అనాద్యనన్తం మహతః పరం ధ్రువం**
**నిచాయ్య తన్మృత్యుముఖాత్ప్రముచ్యతే॥** – 1.3.15

ఆత్మ నిర్వచనం చెప్పాలంటే, ఈ మంత్రం లేకుండా చెప్పలేరు. ఇది ఒక మహావాక్య మంత్రం కూడా. బ్రహ్మ శబ్దస్పర్శరూపరసగంధాలకు అతీతం. బాహ్యప్రపంచాన్ని ఈ ఐదు లక్షణాలతో చూస్తాము. కాని బ్రహ్మకు ఇవి లేవు. అంటే ఇంద్రియ అగోచరం.

అంతేకాదు అనాది, అనంతం, అవ్యయం. అనాది అంటే పుట్టుక లేదు; అనంతం అంటే మరణం లేదు అని మామూలుగా అర్థం. కాని ఇక్కడ కారణం కాదు, కార్యం కాదు అని తీసుకోవాలి. అవ్యయం అంటే నాశనం లేదు. అందువల్ల ధ్రువం–దేశకాల అతీతం–నిత్యం–ఎప్పుడూ ఉంటుంది. అటువంటి బ్రహ్మను తెలుసుకుంటే మృత్యుముఖాత్ ప్రముచ్యతే – కాలతత్వంనుంచి విముక్తి పొందుతాడు.

పంచభూతాలలో భూమికి ఐదు లక్షణాలు ఉంటే వీటిల్లో అత్యంత సూక్ష్మమైన ఆకాశానికి శబ్దం లక్షణం మాత్రమే ఉంది. అది కూడా అవ్యక్తరూపంలో. ఆకాశంకన్నా సూక్ష్మమైన ఆత్మకు ఆ లక్షణం కూడా లేదు; అందువల్ల నిర్గుణబ్రహ్మ. ఆ నిర్గుణబ్రహ్మవు నువ్వే అంటాడు గురువు.

**ఎవర్ ది ఎక్స్‌పీరియన్సర్, నెవర్ ది ఎక్స్‌పీరియన్స్‌డ్**
అనుభవిస్తున్న నువ్వే అది ఎప్పటికీ, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ

ఈ జ్ఞానం పొందితే కలిగే ఫలం – నేను అశాశ్వతుణ్ణి అన్న భావననుంచి విముక్తి. దీన్నే జీవన్ముక్తి అంటారు.

3) **జ్ఞానసాధన** – ఇంత సూక్ష్మమైన జ్ఞానం పొందటానికి సహజంగానే సూక్ష్మబుద్ధి కావాలి. దాన్ని యమధర్మరాజు క్షురకుని కత్తికన్నా చాలా పదునుగా ఉండాలి అంటాడు.

**క్షురస్య ధారా నిశితా దురత్యయా**

ఏ ఉపనిషత్తు నేర్చుకోవాలన్నా బుద్ధి పదునుగా ఉండాలని చెప్పటానికి వాడే మంత్రం. అందువల్ల అక్షరలక్షలు విలువచేసే మంత్రం. ధ్యానంలో మనస్సుని శూన్యం చేస్తే ఆత్మసాక్షాత్కారం కలుగుతుందని, కొందరు అపోహ పడతారు కాని అది పొరపాటు. సూక్ష్మబుద్ధిని ఉపయోగిస్తే కాని అర్థంకాని ఆత్మ, మనస్సును శూన్యం చేస్తే ఎలా అర్థమవుతుంది? బుద్ధితోనే పొరపాటుగా అర్థం చేసుకుంటాము కాబట్టి ఆ అజ్ఞానాన్ని తొలగించటం కూడా బుద్ధికి చెందిన పనే. అందువల్ల సూక్ష్మబుద్ధి ఉండాలి.

**గురు ఆవశ్యకత** – యమధర్మరాజు నీ సమస్యకు మేలుకో, జ్ఞానయోగసాధన చేయి. అర్హుడైన గురువు దగ్గరకు వెళ్ళి బ్రహ్మవిద్య కోరు అంటున్నాడు.

**ఉత్తిష్ఠత జాగ్రత ప్రాప్య వరాన్నిబోధత।** 1-3-14

ముండకోపనిషత్తులో కూడా కర్మలవల్ల మోక్షం పొందలేమనే వైరాగ్యం వచ్చాక, శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడైన గురువు దగ్గరకు వెళతాడు అని వస్తుంది. కర్మయోగానికీ, జ్ఞానయోగానికీ మధ్య భేదం తెలుస్తుంది ఈ మంత్రంలో. బ్రహ్మవిద్యను శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారానే పొందాలి అంటే శ్రవణం గురువు దగ్గరే చేయాలి.

ఫలశ్రుతితో, ఉపనిషత్తు ఈ బ్రహ్మవిద్యాఫలం చెబుతున్నది. గురుశిష్యులిద్దరికీ బ్రహ్మలోక ప్రాప్తి. అంటే జీవన్ముక్తి పొందుతారు. ఒకవేళ ఈ అధ్యాయం అర్థం తెలియకపోయినా కేవలం పారాయణం చేస్తేనే అనంతమైన ఫలం కలుగుతుంది. ఈ ఉపనిషత్తును ప్రాజ్ఞుల సభలోనో, శ్రాద్ధకర్మల సమయంలోనో, వేదానికి విలువనిచ్చేవారు గట్టిగా చదివితేనో, ఆ పారాయణం అనంతమైన ఫలాన్ని కలుగజేస్తుంది.

కేవలం చదివితేనే మోక్షం కలిగితే, కష్టపడి నేర్చుకోవటం ఎందుకు? మోక్షం ప్రత్యక్షంగా కలగదు. దానిమీద శ్రద్ధ ఏర్పడి నేర్చుకోవాలనిపించి, గురువు సన్నిధిలో ఆత్మవిద్య శ్రవణం చేసి, శ్రవణం చేసిన ఆత్మవిద్యను మనన, నిదిధ్యాసనల ద్వారా ఆత్మనిష్ఠగా మలుచుకుంటే మోక్షం పొందుతారు.

# ఏకాదశ ఉపనిషత్తుల సారం

## కఠోపనిషత్ - అధ్యాయం 2

ఇంతకుముందు కఠోపనిషత్తులో మొదటి అధ్యాయం చూశాము. ఇప్పుడు రెండవ అధ్యాయం చూద్దాము. రెండవ అధ్యాయంలో కూడా మూడు ఖండాలు అంటే 3 వల్లీలు ఉన్నాయి.

### అధ్యాయం 2 - వల్లీ 1

నచికేతుడు మొదటి అధ్యాయంలో, మూడవ వరంగా, యమధర్మరాజుని ఆత్మ గురించి బోధించమని అడిగాడు. కొంతమంది మరణం తరువాత ఏదో ఉంది అంటారు; కొంతమంది లేదంటారు.

**అస్తీత్యేకే నాయమస్తీతి చైకే** - 1.1.20

మళ్ళీ తనే కొన్ని లక్షణాలు చెప్పి, ధర్మాధర్మవిలక్షణం, కార్యకారణవ్యతిరిక్తం, కాలాతీతమైన ఆత్మ గురించి వివరంగా చెప్పు అన్నాడు.

**అన్యత్ర ధర్మాదన్యత్రాధర్మాత్**
**అన్యత్రాస్మాత్కృతాకృతాత్।**
**అన్యత్ర భూతాచ్చ భవ్యాచ్చ**
**యత్తత్పశ్యసి తద్వద।।** - 1.2.14

మొదటి అధ్యాయంలో పది ఆత్మలక్షణాలు చెప్పాడు. అయినా తృప్తి తీరక, ఈ అధ్యాయంలో కూడా మరికొన్ని లక్షణాలు చెప్పబోతున్నాడు. పైగా ఎక్కడికక్కడ,

**ఏతద్వై తత్** - అదే నువ్వు అడిగినది,

అని చెప్పుకుంటూ వచ్చాడు. ఈ అధ్యాయంలో, మొదటి వల్లీలో మూడు అంశాలను చూస్తాము. అవి ఆత్మస్వరూపం, ఆత్మజ్ఞానసాధన, ఆత్మజ్ఞానఫలం. ఇప్పుడు వాటిని వివరంగా చూద్దాము.

1) **ఆత్మస్వరూపం** - ఈ వల్లీ, రెండవ వల్లీ కూడా చాలా ముఖ్యమైనవి. వీటిలో ఆత్మస్వరూపాన్ని భిన్నప్రక్రియల ద్వారా చూస్తాము. అందువల్ల వీటిల్లో చాలా మంత్రాలు ముఖ్యమైనవే.

1. **చైతన్యస్వరూపం** – ఆత్మ చైతన్యస్వరూపమనీ, దానికి ఐదు లక్షణాలు ఉన్నాయనీ అంతకుముందు కూడా చూశాము. ఈ చైతన్యస్వరూపంవల్లనే తక్కిన అన్ని అనుభవాలూ తెలుస్తున్నాయి. చైతన్యం లేకపోతే దేహేంద్రియ మనోబుద్ధులు కూడా ఈ జగత్తులాగా జడం అని కాస్త ఆలోచిస్తే అర్థమవుతుంది. వాటికే చైతన్యం ఉంటే ఒక శిల్పం కూడా చైతన్యం కలిగి ఉండాలి కదా! కాని మనమేం చేస్తున్నాం? శరీరానికున్న పరిమితులన్నీ తీసుకెళ్ళి పరిమితులు లేని ఆత్మకు ఆపాదిస్తున్నాము. అంటే ఆత్మను శరీరం చేస్తున్నాము. శాస్త్రం ఈ చైతన్యం నీ అసలు స్వరూపం అంటే నువ్వు ఆ బ్రహ్మవు, తత్ త్వం అసి అని చెబుతున్నది. అది అర్థం చేసుకోవటానికి దృక్ దృశ్యవివేకప్రక్రియ చేయిస్తున్నది మన చేత.

ఆత్మ అంటే ఏమిటి? స్థూలసూక్ష్మకారణశరీరాలకు భిన్నమైనది, పంచకోశాలకు అతీతమైనది, అవస్థాత్రయసాక్షి, సచ్చిదానందస్వరూపంగా ఏది ఉందో, అది ఆత్మ అని తత్త్వబోధలో వస్తుంది. అంటే ప్రతివ్యక్తిలో ఒక చైతన్యం ఉంటుంది. దాన్ని చిత్ అనీ, ఆత్మ అనీ, బింబచైతన్యం అనీ అంటారు. శరీరాన్ని అనాత్మ అంటారు. శరీరం అంటే మనస్సు కూడా వస్తుంది. బాడీమైండ్ సెన్స్ కాంప్లెక్స్ లేదా కార్యకరణసంఘాతం. ఆత్మ ఈ శరీరానికి భిన్నంగా ఉంటుంది. దీన్నిబట్టి ప్రతివ్యక్తీ కూడా ఆత్మ, అనాత్మల మేలుకలయిక అని అర్థమవుతున్నది. దీనికి చేయి–కాంతి ఉదాహరణ చూద్దాము. దీన్ని మూడు దశల్లో అర్థం చేసుకోవాలి. చేయి చూపించి ఇక్కడేముంది అని అడిగితే –

1. చేయి ఉంది
2. చేయి + కాంతి ఉంది
3. అన్నింటినీ ప్రకాశింపచేసే కాంతి ఉంది.

అని దశలవారీగా నేర్చుకుంటాము. ముందు చేతిని మాత్రమే చూస్తే, మూడవదశలో చేతిని ప్రకాశింపజేసే కాంతిని చూస్తాము. ఈ విడదీయటం భౌతికంగా చేయము. చేతిని కోసుకోము. అది బుద్ధిలో కలిగే మార్పు.

ఇప్పుడు ఈ దృష్టాంతాన్ని ఆత్మ, అనాత్మలకు అన్వయించి చూద్దాము. నేను ఎవరు అని అడిగితే –

1. నేను శరీరాన్ని
2. నేను శరీరం + చైతన్యాన్ని
3. నేను సర్వవ్యాపకమైన చైతన్యాన్ని.

అని దశలవారీగా నేర్చుకుంటాము. ముందు నేను శరీరాన్ని మాత్రమే అనుకుంటాము. తరువాత నేను ఆత్మ, అనాత్మల మేలుకలయికను అని తెలుసుకుంటాము. రెండింటినీ విడదీశాక,

నేను ఆత్మనా, అనాత్మనా? నేను ఆత్మను అని అర్థం చేసుకోవాలి. ఇలా అనాత్మనుంచి ఆత్మ వైపుకు దృష్టి మరల్చటానికి దృక్‌దృశ్యవివేకప్రక్రియ వాడాడు యమధర్మరాజు.

**దృక్‌దృశ్య వివేకప్రక్రియ** – దృక్ అంటే చూసే నేను; దృశ్యం అంటే నాచేత చూడబడే ఆబ్జెక్టు (ప్రమేయం). వివేకం అంటే దృశ్యంనుంచి దృక్ వైపుకు దృష్టి మరల్చటం. ఈ ప్రక్రియలో సూత్రం ఏమిటి? చూసే నేను, చూడబడే వస్తువుకు భిన్నంగా ఉన్నాను. ఈ సూత్రాన్ని అన్వయించి చూద్దాము.

జగత్తు వేరు, నేను వేరు. ఇందులో ఏమాత్రం సందేహం లేదు. ఉదాహరణకు నా ముందున్న ఈ పుస్తకం వేరు, నేను వేరు.

శరీరం తీసుకుంటే, శరీరం నేను కాదు, జగత్తును చూడటానికి శరీరం ఒక మాధ్యమం. కళ్ళజోడు కూడా మాధ్యమమే. కాని అది దగ్గరగా ఉండటంవల్ల మనం దాన్ని వేరే వస్తువుగా భావించము. శరీరానికి వచ్చే మార్పులు తెలుస్తున్నాయి కాబట్టి నేను శరీరం కాదు.

అలాగే మనస్సులో వచ్చే ఆలోచనలు నాకు తెలుస్తున్నాయి. ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును సాక్షీభూతంగా చూస్తున్నది ఆత్మచైతన్యం. నాకు తెలుసు, నాకు తెలుసని; నాకు తెలుసు, నాకు తెలియదని. అందువల్ల నేను మనస్సును కూడా కాదు. ఈ చైతన్యాన్ని ఎలా చూడాలి అనకూడదు.

**దృగేవ న తు దృశ్యతే.** చైతన్యం చూసేదే కాని చూడబడేది కాదు. కళ్ళు అన్నింటినీ చూస్తాయి కాని వాటిని అవి చూసుకోలేవు. కళ్ళు ఉన్నాయని ఏమిటి నమ్మకం అని అడిగితే, అది ఎంత అర్థంలేని ప్రశ్నో, అలా చైతన్యం ఉందని ఏమిటి నమ్మకం అనేది కూడా అర్థంలేని ప్రశ్న. చైతన్యంవల్లనే మనస్సు, ఇంద్రియాలు పని చేస్తున్నాయి.

2. **అవస్థాత్రయ సాక్షి చైతన్యం** – ఇప్పుడు ఆత్మస్వరూపాన్ని అవస్థాత్రయవిచారణ ద్వారా చూపిస్తున్నాడు గురువు. జాగ్రదవస్థలో మనస్సు ద్వారా బాహ్యప్రపంచాన్ని అనుభవిస్తాము. స్వప్నావస్థలో మనస్సు సృష్టించిన అంతర్గత ప్రపంచాన్ని అనుభవిస్తాము. రెండింటిలోనూ మనస్సు చూస్తుంది. మొదటి అవస్థలో బాహ్యప్రపంచాన్నీ, రెండవ అవస్థలో తను సృష్టించిన అంతః ప్రపంచాన్నీ చూస్తుంది. జాగ్రదవస్థలో దేశకాలాలు వేరు, స్వప్నావస్థలో దేశకాలాలు వేరు. స్వప్నావస్థలో జాగ్రత్కాలం పోతుంది. సుషుప్తిలో జాగ్రత్కాలం, స్వప్నకాలం రెండూ పోతాయి. కాని అన్ని అవస్థల్లోనూ సమానంగా ఉన్నది చైతన్యం. నేను ఈ అవస్థాత్రయ సాక్షిచైతన్యాన్ని. ఎందుకంటే ఈ మూడు అవస్థలూ నాకు తెలుస్తున్నాయి.

3. **సర్వాత్మ భావన** – ఆత్మ చైతన్యమైనా, సర్వవ్యాపకమైనా వస్తువుద్వారానే ప్రకటితమవుతుంది. చైతన్యాన్ని బింబచైతన్యం అని కూడా అంటారు. చైతన్యాన్ని ప్రతిబింపంచేసే దాన్ని ప్రతిబింబ మాధ్యమనీ, ప్రతిబింబింపబడిన చైతన్యాన్ని ప్రతిబింబచైతన్యమనీ అంటారు. దీన్ని చిదాభాస అనికూడా అంటారు. ఎన్ని ప్రతిబింబమాధ్యమాలు ఉంటే అన్ని ప్రతిబింబచైతన్యాలు ఉన్నాయి. అలా వ్యష్టిపరంగా మూడు ప్రతిబింబచైతన్యాలు, సమష్టిపరంగా మూడు ప్రతిబింబచైతన్యాలు ఉన్నాయి. వాటిని ఒక పట్టికలో చూద్దాము.

**బింబ చైతన్యం – ప్రతిబింబ చైతన్యాలు**

| **వ్యష్టిశరీరం** | **ప్రతిబింబచైతన్యం** | **సంఖ్య** | **సమష్టిప్రపంచం** | **ప్రతిబింబ చైతన్యం** | **సంఖ్య** |
|---|---|---|---|---|---|
| స్థూలశరీరం | విశ్వ | 1 | స్థూలప్రపంచం | విరాట్ | 4 |
| సూక్ష్మశరీరం | తైజస | 2 | సూక్ష్మప్రపంచం | హిరణ్యగర్భ | 5 |
| కారణశరీరం | ప్రాజ్ఞ | 3 | కారణప్రపంచం | ఈశ్వర/అంతర్యామి | 6 |

**యదేవేహ తదముత్ర యదముత్ర తదన్విహ।**
**మృత్యోః స మృత్యుమాప్నోతి య ఇహ నానేవ పశ్యతి॥** – 2.1.10

వ్యష్టి ఉపాధిలో ఏ చైతన్యం ఉందో, సమష్టి ఉపాధిలో అదే చైతన్యం ఉంది. చూడటానికి ఒకదాంట్లో పేలవంగా, ఒకదాంట్లో ప్రకాశవంతంగా ఉంటుంది. దానికి కారణం ప్రతిబింబించే మాధ్యమంలో తేడా. వ్యష్టిలో రాగద్వేషాలు, కామక్రోధలోభమోహమద మాత్సర్యాలు ఉంటే, సమష్టిలో ఉత్కృష్టగుణాలు ఉంటాయి. జీవాత్మగా నేను అల్పజ్ఞుణ్ణి, పరిమితి ఉన్న జీవిని; పరమాత్మ సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు. కాని ఈ ప్రతిబింబాలు తీసివేస్తే (బుద్ధిలో) రెండింటిలోనూ సమానంగా ఉన్నది బింబచైతన్యం. జీవాత్మ, పరమాత్మ పదాలు ఒకే ఆత్మకు విశేషణాలు. జీవ, పరమ పదాలు తీసేస్తే ఉన్నదొకటే ఆత్మ. అది నిర్గుణబ్రహ్మ.

**అన్యత్ర ధర్మాదన్యత్రాధర్మాత్**
**అన్యత్రాస్మాత్కృతాకృతాత్**

ధర్మాధర్మాలకు, కార్యకారణాలకు విలక్షణంగా, కాలానికి అతీతంగా ఉన్న ఆత్మ ఇదే. దీని ద్వారా జీవాత్మ, పరమాత్మ ఐక్యం వచ్చింది కాబట్టి ఈ మంత్రం ఒక మహావాక్య మంత్రం.

ఆత్మచైతన్యమే ఇటు వ్యష్టిలోనూ, అటు సమష్టిలోనూ ఉండటంవల్ల, చైతన్యం సర్వాత్మకం. దీన్ని **సర్వాత్మ భావన** అంటారు.

4. **దేశకాల అతీతం** – నిజానికి చైతన్యం ఒకచోట పరిమితమవదు. కాని పరిమితమైనట్టుగా అనిపిస్తుంది. ఆలోచనలకి సాక్షిచైతన్యంగా ఉంది. ఈ చైతన్యం ఎక్కడ ఉంది? స్థూలశరీరంలో హృదయం ఉంది. హృదయంలో మనస్సు ఉంది. మనస్సులో చైతన్యం ఉంది. శరీరం ఆలయం అయితే, హృదయం గర్భగృహం. అందులో చైతన్యం అంగుష్ఠం అంత **ఉన్నట్టుగా ఉంది** అన్నది మర్చిపోకూడదు. హృదయం మన పిడికిలి అంత ఆకారంలో ఉండబట్టే, అందులో పట్టేది అంగుష్ఠం. చైతన్యం హృదయంలో ఉంది అంటే సర్వవ్యాపకమైన చైతన్యం హృదయంలో కూడా ఉంది. ఉన్నదొకటే చైతన్యం, అందులోనే అన్నీ ఉన్నాయి. కాబట్టి జీవాత్మే పరమాత్మ. ఉన్నదొకటే పరమాత్మ. దేశానికి అతీతం.

ఈశానో భూత భవ్యస్యః – పరమాత్మ భూతకాలంలోనూ, భవిష్యత్తులోనూ ఉన్నాడు అంటే మధ్యకాలమైన వర్తమానం కూడా కలుపుకోవాలి. ఇప్పుడు కాలానికి అతీతం. ఆ విధంగా ఆత్మ దేశకాలాతీతం.

5. **జ్యోతిషాం జ్యోతిః** – చైతన్యాన్ని అధూమకః అగ్నితో పోల్చాడు యమధర్మరాజు ఇక్కడ. అధూమకం అంటే పొగలేని అగ్ని. అంతటినీ ప్రకాశింపజేసే శక్తి గలది. ఉపాధిని పొగతో పోలిస్తే పొగలేని అగ్ని అంటే నిరాకార శుద్ధచైతన్యం. అది స్వయంప్రకాశజ్యోతి. శాస్త్రంలో జ్యోతి అంటే దాని సమక్షంలో వస్తువులన్నీ కనబడతాయి అని నిర్వచనం వస్తుంది.

ఆ నిర్వచనం ప్రకారం ప్రతి ఇంద్రియమూ ఒక జ్యోతే. ఇంద్రియాలు, మనస్సు తోడయితేనే పనిచేస్తాయి కాబట్టి మనస్సు ఒక జ్యోతి. ఆలోచనలు ఉన్న ఆలోచనలు లేని మనస్సును సాక్షిగా చూస్తుంది కాబట్టి, ఆత్మ **జ్యోతిషాం జ్యోతిః**.

2) **ఆత్మజ్ఞాన సాధన – అంతర్ముఖత్వం** – ఇక్కడ ఒక ముఖ్యమైన జ్ఞానసాధనను వివరిస్తున్నాడు యమధర్మరాజు. నిజానికి ఇది చాలా ముఖ్యమైన మంత్రం.

**పరాంచి ఖాని వ్యతృణత్స్వయంభూః**
**తస్మాత్పరాఙ్ పశ్యతి నాన్తరాత్మన్।**
**కశ్చిద్ధీరః ప్రత్యగాత్మానమైక్షత్**
**ఆవృత్తచక్షురమృతత్వమిచ్ఛన్ ॥** – 2.1.1

ఆత్మజ్ఞానం పొందాలంటే అంతర్ముఖుడయి ఉండాలి. మన ఇంద్రియాలు, మనస్సు ఎంతసేపూ బాహ్యంగా పరుగులు తీస్తాయి. వాటిని నిందించి లాభంలేదు. భగవంతుడే ఇంద్రియాలను బహిర్ముఖంగా ఏర్పరచాడు. అందువల్ల అవి బాహ్యప్రపంచాన్నే చూస్తున్నాయి. బాహ్యంగా పరుగులు తీస్తే, అనాత్మవైపు ఆకర్షితులవుతాయి. శరీరం; మనస్సులతో మమేకం

చెందుతాము. ఆత్మ గురించి తెలుసుకోవాలంటే అంతర్ముఖులమవ్వాలి. అంతర్ముఖులవటం కష్టమే కాని, ఉపాసనలద్వారా సాధించాలి.

3) **ఆత్మజ్ఞానఫలం** – జ్ఞానఫలాన్ని మూడు పదాలతో నిర్వచించాడు యమధర్మరాజు. అవి కామనివృత్తి, శోకనివృత్తి, భయనివృత్తి.

1. **కామనివృత్తి** – ఆత్మజ్ఞానం పొందితే నేను పరిపూర్ణుణ్ణి అనే జ్ఞానం కలుగుతుంది. అందువల్ల కోరికలు మటుమాయమవుతాయి. దయానందస్వామీజీ అంటారు, ప్రతివ్యక్తీ ఇప్పుడున్నదానికన్నా భిన్నంగా, ఉన్నతంగా ఉండాలనే తపనతో కృషి చేస్తుంటాడు. బ్రహ్మచారి భార్య కావాలని కోరుకుంటాడు; దాని అర్థం, బ్రహ్మచారిగా తన జీవితం బాగాలేదు అనుకుంటాడు. అలాగే పిల్లలు కావాలని కోరుకున్నా, పిల్లలులేని జీవితం బాగా లేదనుకుంటాడు. అంటే ఉన్నది బాగాలేదు, మరేదో పొందాలి అనుకుంటాము. కాని ఆత్మజ్ఞానం పొందితే ఆనందం**కోసం** కర్మ చేయరు, ఆనందం**తో** చేస్తారు. దీన్ని కామనివృత్తి అంటారు.

2. **శోకనివృత్తి** – **ఆత్మానం మత్వా ధీరో న శోచతి** (2-1-4)– ఆత్మజ్ఞానం పొందిన వ్యక్తి శోకింపడు.

3. **భయనివృత్తి** – **న తతో విజుగుప్సతే** (2-1-5)– జీవాత్మ పరమాత్మ ఐక్యం తెలిసిన వ్యక్తి భద్రత కోరదు.

**నేహ నానాఽస్తి కించన** (2-1-11)

ఎప్పుడైతే ఆత్మజ్ఞానం పొందుతాడో, అప్పుడే అద్వైతాన్ని అనుభవిస్తాడు. ఇక్కడ కొంచెం కూడా బహుళత్వం లేదని అర్థం చేసుకుంటాడు. ఎప్పుడైతే బహుళత్వం లేదో, అప్పుడే భయం పోతుంది. రెండోది ఉంటేనే కదా భయం ఉండేది.

ముఖ్యమైన మంత్రాలు – 1, 2, 10, 11.

## అధ్యాయం 2 – వల్లీ 2

ఇందులో కూడా ఆ మూడు అంశాలనే మళ్ళీ చూస్తాము. అవి ఆత్మస్వరూపం, ఆత్మజ్ఞానసాధన, ఆత్మజ్ఞానఫలం. ఇందులో 15 మంత్రాలు ఉన్నాయి.

1) **ఆత్మస్వరూపం** – ఈ వల్లీలో ఆత్మస్వరూపాన్ని వర్ణించటానికి మూడు ఉదాహరణలను తీసుకున్నాడు యమధర్మరాజు. అవి అగ్నిదృష్టాంతం, వాయుదృష్టాంతం, సూర్యదృష్టాంతం.

**ఏకస్తథా సర్వభూతాంతరాత్మా**
**రూపం రూపం ప్రతిరూపో బహిశ్చ॥** 2-2-9

1. **సర్వగతం** - మూడు ఉదాహరణలలోనూ ఇంచుమించుగా ఈ రెండు పాదాలూ వస్తాయి. ఒకే అగ్ని ప్రపంచంలోని అనేక రకాల వస్తువుల్లో ఆయా రూపాల్లో ఎలా విరాజిల్లుతుందో, అలాగే సమస్త జీవుల్లోనూ ఉన్న ఆత్మ ఒకటే అయినప్పటికీ అనేక ప్రాణుల్లో అనేక రూపాల్లో విరాజిల్లుతున్నది. అలాగే ఆ రూపాలకు బయట కూడా ఉంది. ఇనుపగరిటను కాలిస్తే ఎర్రగా కనబడుతుంది. రూపంలేని అగ్నికి రూపాన్ని ఆపాదిస్తున్నాము. అలా రూపంలేని చైతన్యానికి రూపాన్ని ఆపాదిస్తున్నాము కాని చైతన్యం **సర్వగతం**.

అలాగే వాయువు కూడా. వాయుతత్త్వం ఒకటే అయినా అది వివిధ శరీరాల్లోకి ప్రవేశించినప్పుడు ప్రాణమయకోశంగా ఉంటుంది. అదే విధంగా ఆత్మ **సర్వగతం**.

సూర్యదృష్టాంతానికి వచ్చేసరికి సూర్యకాంతికి, చైతన్యానికి అనేక పోలికలు ఉన్నాయి. అగ్నికీ, వాయువుకీ చెప్పిన **సర్వగతం** లక్షణంతో మొదలుపెడదాము. ఇప్పుడు తక్కినవి చూద్దాము.

2. **ఏకం** -

**సూర్యో యథా సర్వలోకస్య చక్షుః**
**న లిప్యతే చాక్షుషైర్బాహ్యదోషైః।**
**ఏకస్తథా సర్వభూతాన్తరాత్మా**
**న లిప్యతే లోకదుఃఖేన బాహ్యః॥** - 2.2.11

సూర్యుడు ఒకడే, చైతన్యం ఒకటే. అందువల్ల **ఏకం**.

3. **నిరాకారం** - సూర్యకాంతికి రూపం లేదు. రూపం ఉన్నవాటిమీద పడి, ఆయా రూపాలను ప్రకాశింపజేస్తుంది కాని దానికంటూ రూపం లేదు. చైతన్యం కూడా **నిరాకారం**.

4. **నిర్వికారం** - రెండింటికీ వికారాలు లేవు. వస్తువులు మారితే కాంతి మారదు. మన శరీరం ముడతలు పడినా, చైతన్యం మారదు.

5. **అకర్తా, అభోక్తా** - సూర్యకాంతి సమక్షంలో అనేక పనులు అవుతాయి కాని సూర్యకాంతి ఏ పనీ చేయదు. అలాగే చైతన్యం కూడా అకర్తా. అకర్తా అయితే అభోక్తా.

6. **అఖండం** - రెండింటినీ భాగాలు చేయలేము. సూర్యకాంతిలో కొంత భాగాన్ని కోసి మన ఇంటికీ తీసుకువెళ్ళలేము. చైతన్యానికి అవయవాలు లేవు.

7. **సర్వప్రకాశం** – అన్నింటినీ, రెండూ ప్రకాశింపజేస్తాయి.

8. **అసంగం** – సూర్యకాంతి ప్రసరింపజేస్తున్న ప్రదేశం అశుద్ధంగా ఉన్నా, సూర్యకాంతి అశుద్ధం అవదు. అలాగే మనశ్శరీరాలు అశుద్ధంగా ఉన్నా, వాటితో ఉన్న చైతన్యానికి ఏమీ అంటదు. అందువల్ల **అసంగం**.

ఈ ఉదాహరణనే కృష్ణపరమాత్మ అరువు తీసుకున్నాడు. ఆమాటకొస్తే కఠోపనిషత్తునుంచి కృష్ణపరమాత్మ భారీగా అనేక మంత్రాలను అలాగే తీసుకోవటమో, వాటి అర్థాన్ని తీసుకోవటమో చేశాడు.

**యథా ప్రకాశయత్యేకః కృత్స్నం లోకమిమం రవిః** – గీత 13.34

2) **ఆత్మజ్ఞానసాధన – వేదాంతవిచారణ** –ఇక్కడ చెప్పబడిన సాధన వేదాంతవిచారణ. దీన్ని యమధర్మరాజు అనుష్ఠానం అంటున్నాడు.

**అనుష్ఠాయ న శోచతి విముక్తశ్చ విముచ్యతే** – 2.2.1

అనుష్ఠానం అంటే నిత్యకర్మలను ఎలాగైతే రోజూ చేస్తారో, అలా వేదాంతవిచారణ కూడా రోజూ చేయాలి. మీరు అన్నపానాదులు ఎలా రోజూ తీసుకుంటారో, అలా వేదాంతం అర్థమైనా కూడా రోజూ నేర్చుకుంటూ ఉండాలి. అందువల్లనే చాలామంది ఆచార్యులు బోధ చేయటానికి ఇష్టపడతారు. స్వామీజీ కూడా మీకు అర్థమయితే, అది నాకు వచ్చే ఆగంతుకఫలం కాని నాకు ఇది నిదిధ్యాసనం అంటారు. బోధద్వారా స్వామీజీ ఎప్పుడూ శాస్త్రంలోనే రమిస్తారు.

ఆత్మ విచారణను నాలుగు దశల్లో చేస్తారని ఒకసారి గుర్తు తెచ్చుకుందాము.

1. నేను ఆత్మ + అనాత్మల మేలుకలయికను
2. నేను శరీరంలో ఉన్న ఆత్మను
3. నేను శరీరంలోనే కాదు, శరీరం బయటకూడా ఉన్నాను
4. నేను శరీరంలోనే లేను, నిజానికి అన్ని శరీరాలూ ఆత్మనైన నాలోనే ఉన్నాయి.

ఈ జ్ఞానాన్ని నిదిధ్యాసనం ద్వారా అణువణువునా నిలబెట్టుకోవాలి. దీన్ని జ్ఞాననిష్ఠ అంటారు.

3) **ఆత్మజ్ఞానఫలం** – జీవన్ముక్తి, విదేహముక్తి.

విముక్తః – జీవన్ముక్తి
విముచ్యతే – విదేహముక్తి.

జీవించి ఉండగా జీవన్ముక్తిని అనుభవిస్తాడు. అంటే శోకనివృత్తి, దుఃఖనివృత్తి, భయనివృత్తి కలుగుతుంది. మరణించాక విదేహముక్తి కలుగుతుంది. పునర్జన్మ ఉండదు.

**అవాంతర అంశం** – జ్ఞానికి పునర్జన్మ ఉండదు అంటే అజ్ఞాని మాటేమిటి? ఇది ముందు వల్లీలో చూస్తాము.

**మనసైవేదమాప్తవ్యం నేహ నానాఽస్తి కించన।**
**మృత్యోః స మృత్యుం గచ్ఛతి య ఇహ నానేవ పశ్యతి॥** – 2.1.11

ఈ వల్లీలో 7వ మంత్రంలో వస్తుంది.

**యోనిమన్యే ప్రపద్యన్తే శరీరత్వాయ దేహినః।**
**స్థాణుమన్యేఽనుసంయన్తి యథాకర్మ యథాశ్రుతమ్॥** – 2.2.7

ఎవరైతే ఈ ఆత్మజ్ఞానం పొందకుండా, ఈ లోకంలో లేని భిన్నత్వాన్ని ఉన్నట్టుగా చూస్తారో, వారు జననమరణవృత్తంలో పడి తిరుగుతారు. ఒక జీవిలో ఐదు అంశాలు ఉంటాయి. అవి స్థూలశరీరం, సూక్ష్మశరీరం, కారణశరీరం, ప్రతిబింబచైతన్యం, బింబచైతన్యం. ఆ జీవి మరణించినప్పుడు, ఇక్కడ అజ్ఞాని జీవి గురించి చూస్తున్నాము. అతని స్థూలశరీరం ఇక్కడే కాలి బూడిద అవుతుంది. బింబచైతన్యం సర్వవ్యాపకం కాబట్టి అది అంతటా ఉంటుంది. ఇంక మిగిలింది మూడు. సూక్ష్మశరీరం, కారణశరీరం, ప్రతిబింబచైతన్యం. ఈ మూడింటినీ కలిపి జీవాత్మ అంటారు. అజ్ఞాని విషయంలో ఈ మూడూ అతని కర్మఫలానికి తగ్గట్టుగా ప్రయాణం చేసి, లోకాలకు వెళ్ళి పునరపి జననం, పునరపి మరణం పొందుతూ ఉంటాయి.

జ్ఞానికి సూక్ష్మశరీరం సూక్ష్మప్రపంచంలోనూ, కారణశరీరం కారణప్రపంచంలోనూ ప్రతిబింబచైతన్యంతోపాటు లయమయిపోతాయి.

**అస్తీత్యేకే నాయమస్తీతి చైకే** 1-1-20

అని నచికేతుడు అడిగినదానికి జవాబు ఇది. అజ్ఞాని జీవాత్మ మరణించాక లోకాలకు ప్రయాణిస్తే, జ్ఞాని పరంగా ఆత్మకు మరణం లేదు. అది నిత్యం, సత్యం.

## అధ్యాయం 2 – వల్లీ 3

ఇందులో 18 మంత్రాలు ఉన్నాయి. ఇందులో కూడా ముందు చూసిన మూడు అంశాలనూ చూస్తాము. అవి ఆత్మస్వరూపం, ఆత్మజ్ఞానసాధన, ఆత్మజ్ఞానఫలం.

1) **ఆత్మస్వరూపం** – ఈ వల్లీలో కూడా ఆత్మస్వరూపం గురించి కొన్ని లక్షణాలు చూస్తాము.

1. **జగత్కారణం** – ఇది చూపించటానికి అశ్వత్థ వృక్షకల్పన తీసుకున్నాడు యమధర్మరాజు. కృష్ణపరమాత్మ కూడా ఈ వృక్షకల్పనను తన బోధలో చొప్పించాడు. రెండింటిలోనూ శంకరాచార్యులవారు సంసారానికి, వృక్షానికీ మధ్య అనేక పోలికలను వివరించారు. వాటిలో కొన్ని – మహత్వం, ఆద్యంతరహితం, అనిర్వచనీయత్వం, మూలత్వం, శాఖావత్వం.

ఇక్కడ జగత్తుపరంగా చూద్దాం. చెట్టుకు మూడు దశలు ఉంటాయి. అవి విత్తనం, మొక్క, వృక్షం. అలాగే ఈ జగత్తు అనే వృక్షానికి మూడు దశలు – కారణప్రపంచం, సూక్ష్మప్రపంచం, స్థూలప్రపంచం. ఇంకొక అంశం మూలతత్వం. కనబడని వేరు కనబడే చెట్టుకింద ఉంది. అదే చెట్టుకి మూలం లేదా ఆధారం. అలాగే కనబడే జగత్తునుంచి కనబడని బ్రహ్మను తెలుసుకోవచ్చు. కార్యంనుంచి కారణం తెలుసుకోవటం. బ్రహ్మను జగత్కారణంగా తెలుసుకోవటాన్ని తటస్థలక్షణం అంటారు. తటస్థలక్షణం చెప్పినప్పుడు సగుణ ఈశ్వరుడు అని అర్థం చేసుకోవాలి.

2. **నియంత** – ఈ మొత్తం జగత్తు బ్రహ్మనుంచి అభివ్యక్తమవటమే కాదు, ఈశ్వరుడు వజ్రాయుధం ఎత్తి పట్టుకున్నాడన్న గొప్ప భయంచేతనే జగత్తులో పనులన్నీ జరుగుతున్నాయి.

**భయాదస్యాగ్నిస్తపతి భయాత్తపతి సూర్యః।**

**భయాదిన్ద్రశ్చ వాయుశ్చ మృత్యుర్ధావతి పంచమః॥** – 2.3.3

ఈ మంత్రంలో దేవతలు కూడా ఎలా భయపడుతున్నారో వస్తుంది. ఇంచుమించు ఇదే మంత్రం తైత్తిరీయోపనిషత్తులో కూడా వస్తుంది. ఈశ్వరుని భయంవల్లనే అగ్ని మండుతున్నది, సూర్యుడు ప్రకాశిస్తున్నాడు, ఇంద్రుడు, వాయువు కూడా తమతమ పనులను నిర్వహిస్తున్నారు. పంచమదేవత అయిన యమధర్మరాజు కూడా ఆ భయంవల్లనే తన నిర్వహణలో పరుగులు పెడుతున్నానని తనే స్వయంగా చెప్పుకుంటున్నాడు. ఇక్కడ ఈశ్వరుణ్ణి జగత్తుయొక్క నిమిత్త కారణంగా చూస్తాము.

3. **పంచకోశాతీతం** – పంచకోశాతీత లక్షణాన్ని ఇంతకుముందు కూడా చూశాము. మళ్ళీ చెబుతున్నాడు యమధర్మరాజు.

ఇంద్రియాలకన్నా మనస్సు శ్రేష్ఠమైనది; మనస్సుకన్నా బుద్ధి శ్రేష్ఠమైనది; బుద్ధికన్నా సమష్టిబుద్ధి శ్రేష్ఠమైనది; సమష్టిబుద్ధికన్నా అవ్యక్తం శ్రేష్ఠమైనది; అవ్యక్తంకన్నా ఆత్మ లేదా చైతన్యం శ్రేష్ఠమైనది. ఆత్మకన్నా పరమమైనది లేదు. **సా కాష్ఠా సా పరా**

2) **ఆత్మజ్ఞానసాధన** – ఆత్మజ్ఞానం పొందటం అంత తేలికైన విషయం కాదు. ఎందుకంటే చైతన్యరూపాన్ని ఎవరూ చూడలేరు. పైగా అది నువ్వే అంటుంది శాస్త్రం. అందువల్ల

ఆత్మజ్ఞానం పొందాలంటే, సమ్యక్ దర్శనం ఉన్న బుద్ధి కావాలి. చాలా ఏకాగ్రత కావాలి. స్థూలబుద్ధినుంచి సూక్ష్మబుద్ధికి రావాలి. ముంజగడ్డినుంచి ఈనెలను వేరు చేసినట్టుగా, ఆత్మను స్వంతశరీరంనుంచి వివేకంతో వేరు చేయాలి.

1. **అష్టాంగయోగం** – సగుణ ఈశ్వర ఉపాసన చేస్తే ఏకాగ్రత అలవడుతుంది. శరీరం, పంచేంద్రియాలు, మనస్సు, ప్రాణాలను అదుపులో పెట్టుకోవటానికి అష్టాంగయోగం ఉపయోగపడుతుంది.

2. **నిదిధ్యాసనం** – శ్రవణ, మననాలు చేశాక, ఆత్మజ్ఞానంలో నిలబడటానికి నిదిధ్యాసనం చేయాలి. ఇక్కడ రెండు రకాలుగా చూస్తాము. బ్రహ్మ అభ్యాస నిదిధ్యాసనం ఒకటి. దానిలో మళ్ళీమళ్ళీ వినటం, మళ్ళీ రాయటం, ఎవరికైనా బోధించటం వస్తుంది. రెండవది సమాధి అభ్యాసరూప నిదిధ్యాసనం. ఇందులో సర్వ అధిష్ఠానం అయిన బ్రహ్మను నేనే అని పదేపదే ధ్యానించటం. లేదా ఆత్మ లక్షణాలైన ఆత్మ నిత్యం, ఆత్మ సత్యంవంటి వాక్యాలు. నేను నిత్యం, నేను సత్యం అని పదేపదే ధ్యానించటం.

3. **ఉపాసన** – మొదట్లో యమధర్మరాజు నచికేతయజ్ఞం బోధించినప్పుడు దానికి విరాట్ ఉపాసనను జోడించి చెప్పాడు. ఈ వల్లీలో బ్రహ్మజ్ఞానం పొందలేని పాఠకునికి ప్రత్యామ్నాయ మార్గం చెబుతున్నాడు. ఈ అజ్ఞానీ సాధకుడు చేసేది సగుణ ఈశ్వర ఉపాసన కాబట్టి, అతనికి ఊర్ధ్వలోకాలకు ప్రయాణం ఉంటుంది. ఉపాసకుని ప్రాణం మరణం తరువాత సుషుమ్నానాడినుంచి బ్రహ్మరంధ్రం ద్వారా శుక్లగతిలో బ్రహ్మలోకం వెళుతుంది. ఉపాసకుడు అక్కడ బ్రహ్మ దగ్గర జ్ఞానం పొంది **క్రమముక్తి** పొందుతాడు.

**అధ్యారోప అపవాద ప్రక్రియ –**

**అస్తీత్యేవోపలబ్ధవ్యః తత్త్వభావేన చోభయోః।**
**అస్తీత్యేవోపలబ్ధస్య తత్త్వభావః ప్రసీదతి॥** – 2.3.13

బ్రహ్మ అస్తినుంచి బ్రహ్మ అస్మికి రావాలి. బ్రహ్మ అస్తి అంటే పరోక్షజ్ఞానం. బ్రహ్మ అస్మి అంటే అపరోక్షజ్ఞానం. దీనికి అధ్యారోప అపవాద ప్రక్రియ వాడుతుంది శాస్త్రం.

ముందు కుండ–మట్టి ఉదాహరణ చూద్దాము.

1. కుండ ఉంది – కుండ కార్యం.
2. కుండ మట్టినుంచి ఉత్పత్తి చెందింది – మట్టి కారణం.

   ఇది అధ్యారోపం.

3. కుండకు మట్టి లేకుండా విడిగా ఉనికి లేదు – కుండ మిథ్య.
4. కుండ లేకపోతే, మట్టికి కారణత్వ హోదా లేదు – కారణత్వ హోదా ఉండదు.
   (మట్టి లేదు అనకూడదు)
   ఇది అపవాదం.

రెండూ కలిపితే మట్టి కార్యకారణ విలక్షణం.

ఇప్పుడు జగత్తు–బ్రహ్మ పరంగా చూద్దాము.

1. జగత్తు ఉంది – జగత్తు కార్యం
2. జగత్తు బ్రహ్మనుంచి వచ్చింది – బ్రహ్మ కారణం
   ఇది అధ్యారోపం
3. జగత్తుకు, బ్రహ్మ లేకుండా విడిగా ఉనికి లేదు – జగత్తు మిథ్య
4. జగత్తు లేకపోతే, బ్రహ్మకు కారణత్వ హోదా లేదు – కారణత్వ హోదా ఉండదు.
   (బ్రహ్మ లేదు అనకూడదు)
   ఇది అపవాదం

రెండూ కలిపితే బ్రహ్మ కార్యకారణ విలక్షణం.

దీని తరువాత ఆ బ్రహ్మను నేనే అని చూపిస్తుంది శాస్త్రం.

3) **ఆత్మజ్ఞానఫలం** – జ్ఞానఫలం సాధకునిబట్టి మారుతుంది.

ఉపాసకుడు కాని వ్యక్తి, వివిధ నాడుల ద్వారా వివిధ లోకాలకు వెళతాడు.

ఉపాసకుడు శుక్లగతిద్వారా బ్రహ్మలోకానికి వెళ్ళి అక్కడ బ్రహ్మ దగ్గర జ్ఞానం పొంది, క్రమముక్తి పొందుతాడు.

జ్ఞాని జీవించి ఉండగా జీవన్ముక్తి, మరణించాక విదేహముక్తి పొందుతాడు. జీవన్ముక్తితో, కోరికలు నశిస్తాయని, శోకం ఉండదని, మనస్సుయొక్క అన్ని ముడులూ ఇక్కడే విడిపోతాయని వివరిస్తాడు.

ఈ సందర్భంలో మనుష్యజన్మను స్తుతిస్తున్నాడు యమధర్మరాజు. మనుష్యజన్మలో ఆత్మజ్ఞానం పొందగలడని ముందు చెప్పి, వేరే లోకాల్లో పొందినా, అంత ఫలవంతంగా ఉండదని వివరిస్తున్నాడు.

**యథాదర్శే తథాత్మని యథా స్వప్నే తథా పితృలోకే।**
**యథాప్సు పరీవ దదృశే తథా గంధర్వలోకే ఛాయాతపయోరివ బ్రహ్మలోకే॥** – 2.3.5

ఇక్కడ పృథ్విలో అద్దంలో స్పష్టంగా కనబడ్డట్టు, పితృలోకంలో కలలోలాగా, గంధర్వలోకంలో నీటిలో లాగా అస్పష్టంగా, బ్రహ్మలోకంలో నీడ ఎండలాగా స్పష్టంగానూ ఆత్మజ్ఞానం కలుగుతుంది. బ్రహ్మలోకంలో స్పష్టంగా కలుగుతుంది నిజమే కాని, బ్రహ్మలోకానికి వెళ్ళటమే బ్రహ్మప్రళయం. అందువల్ల ఇంత దుర్లభమైన మనుష్యజన్మ పొందినందుకు, ఈ జన్మలోనే ఆత్మజ్ఞానం పొంది, నేను విధించే జననమరణాల వృత్తంనుంచి తప్పించుకోమని యమధర్మరాజే సూచిస్తున్నాడు. ఈ ఫలాన్ని అమృతత్త్వప్రాప్తిగా వర్ణించాడు. ఈ జ్ఞానం యమధర్మరాజునుంచి పొందిన నచికేతుడు జీవన్ముక్తి పొందాడనీ, ఎవరైనా ఈ జ్ఞానాన్ని ఇలా పొందితే, ఇలాగే సంసారంనుంచి విముక్తి పొందుతాడనీ ఉపనిషత్తు కూడా హామీ ఇస్తున్నది. దీన్నిబట్టి శ్రద్ధ ఉంటే ఎవరైనా ఆత్మజ్ఞానం పొందవచ్చని అర్థమవుతున్నది.

**శాంతిపాఠం**

**ఓం సహ నావవతు। సహ నౌ భునక్తు। సహ వీర్యం కరవావహై।**
**తేజస్వి నావధీతమస్తు మా విద్విషావహై॥**
**ఓం శాంతిః శాంతిః శాంతి॥**

# ఏకాదశ ఉపనిషత్తుల సారం

## కైవల్యోపనిషత్

ఇప్పుడు కైవల్యోపనిషత్తు సారం చూద్దాము. నిజానికి ఈ ఉపనిషత్తు శంకరాచార్యులవారు భాష్యం రాసిన పది ఉపనిషత్తులలోకి రాదు. అందువల్ల కొంతమంది కైవల్యోపనిషత్తుని ముఖ్యమైనది కాదు అనుకుంటారు. వారి ఉద్దేశ్యం శంకరాచార్యులవారు భాష్యం రాసిన పది ఉపనిషత్తులే ముఖ్యమనీ, తక్కినవి అవసరం లేదనీ అనుకుంటారు.

కాని ఈ భావన ఒక అపోహ మాత్రమే తప్ప నిజం కాదు. ఉపనిషత్తులలో ఇవి ముఖ్యం అనీ, ఇవి ముఖ్యం కాదనీ భేదం చూపించలేము. ఎందువల్లనంటే అన్ని ఉపనిషత్తుల సారమూ ఒకటే. దాన్ని గతిసామాన్య ధర్మం అంటారు. ఉపనిషత్తుల సారం –

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః**

బ్రహ్మ మాత్రమే సత్యం, జగత్తు మిథ్య, జీవుడు బ్రహ్మ తప్ప వేరు ఏమీ కాదు. జీవ ఈశ్వర ఐక్యాన్ని సూచించే మంత్రాలని మహావాక్యమంత్రాలు అంటారు. అవి అన్ని ఉపనిషత్తుల్లోనూ ఉన్నాయి.

అందువల్ల ఇది దశోపనిషత్తులలో లేకపోయినా, దీన్ని కూడా చూద్దాము. దానికి అనేక కారణాలు చెప్పవచ్చు. ఒకటి ఇది మన స్వామీజీకి గురువైన స్వామీ చిన్మయానందజీకి చాలా ఇష్టం. అందువల్ల ఆయన దీనిని బోధించి, ఈ ఉపనిషత్తు జనబాహుళ్యంలో ప్రసిద్ధికెక్కేలా చేశారు. ఈ ఉపనిషత్తులో కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి.

1. పది ఉపనిషత్తుల్లోనూ లేని ఒక ప్రత్యేక అంశం ఉంది. అది నిదిధ్యాసనం. ఇక్కడ నిదిధ్యాసనం గురించి ఎక్కువ వివరంగా రాకపోయినా, కృష్ణపరమాత్మ బోధించిన ఆరవ అధ్యాయం అయిన ఆత్మసంయమయోగంలో ఈ నిదిధ్యాసనాన్ని ఆదర్శంగా తీసుకుని, చాలా వివరంగా చెప్పుకొచ్చాడని గమనించవచ్చు. స్వామీ చిన్మయానందజీకి ఈ ఉపనిషత్తు నచ్చుటానికి ఇది కారణం అవచ్చు కూడా.

2. చాలా చిన్న ఉపనిషత్తు అయనా వేదాంతసారమంతా వచ్చిన ఒక పరిపూర్ణ ఉపనిషత్తు ఇది. ప్రతి ఉపనిషత్తులో తలుచుకునే అతి ముఖ్యమైన మంత్రం ఇందులోనిదే.

**మయ్యేవ సకలం జాతం। మయి సర్వం ప్రతిష్ఠితమ్।**
**మయి సర్వం లయం యాతి। తద్బ్రహ్మాద్వయమస్మ్యహమ్॥** – 19

3. జ్ఞానంవల్లనే మోక్షం పొందగలమని కూడా ఈ ఉపనిషత్తే ఢంకా బజాయించి మరీ చెబుతుంది.

**నాన్యః పంథా విముక్తయే ॥** – 9, **యాతి నాన్యేన హేతునా ॥** – 10

4. ఇందులో అనేక మహావాక్యమంత్రాలు ఉన్నాయి. ఉదాహరణకు

**సూక్ష్మాత్సూక్ష్మతరం నిత్యం । తత్త్వమేవ త్వమేవ తత్ ॥** – 16

తత్ త్వమ్ అసి తక్కిన ఉపనిషత్తులో నేర్చుకుంటాము. ఇక్కడ రెండోవైపునుంచి కూడా వస్తుంది.

**తత్ ఏవ త్వమ్** – ఆ (బ్రహ్మ) నువ్వే
**త్వమ్ ఏవ తత్** – నువ్వే ఆ బ్రహ్మవు.

**వేదం** – కైవల్యోపనిషత్తు అథర్వణ వేదానికి చెందినది. కొంతమంది ఈ ఉపనిషత్తు యజుర్వేదానికి చెందుతుందని అనకపోలేదు, కాని ఎక్కువమంది అథర్వణ వేదానికి చెందిందనే అంటారు. అందువల్ల మనం కూడా దీన్ని అథర్వణ వేద ఉపనిషత్తుగానే పరిగణిస్తాము.

**శాంతిపాఠం** – అథర్వణ వేదానికి చెందిన ఉపనిషత్తులన్నింటికీ ఒకటే శాంతిపాఠం ఉంటుంది. మనం నేర్చుకునే ఉపనిషత్తుల్లో ముండకోపనిషత్తు, మాండూక్యోపనిషత్తు, ప్రశ్నోపనిషత్తు, ఇప్పుడు చూస్తున్న ఈ కైవల్యోపనిషత్తు కూడా అథర్వణ వేదానికి చెందినవే. వీటన్నిటికీ సమానంగా ఉన్న శాంతిపాఠం – భద్రం కర్ణేభిః.

ఈ శాంతిపాఠం సారాంశం – శిష్యుడు జ్ఞానయోగ్యతాప్రాప్తిని, ప్రతిబంధనివృత్తిని కోరుతున్నాడు.

**జ్ఞానయోగ్యతాప్రాప్తి** – బ్రహ్మవిద్య జ్ఞానం పొందటానికి అనేక దేవతలను ప్రార్థించాలి. ఆ ప్రార్థన చేయటానికి ఆరోగ్యకరమైన అంగాలనివ్వు. చెవులు మంచి విషయాలే విననీ. కళ్ళు మంగళరూపాన్ని చూడనీ. చెవి వినేదానికన్నా, కన్ను చూసేదానికన్నా ఎక్కువగా బుద్ధిని ఉపయోగించి అర్థం చేసుకునేలా చేయి. మనస్సులో రాగద్వేషాలు లేకుండా చేయి.

**ప్రతిబంధ నివృత్తి** – ప్రతిబంధకాలు కలుగకుండా చేయి.

**అధిదైవికం** – ప్రకృతి వైపరీత్యాలనుంచి ఆటంకాలు లేకుండా చేయి.

**అధిభౌతికం** – నా చుట్టూ ఉండే పరిసరాలు, జీవులనుంచి ఆటంకాలు రాకుండా చేయి.

**అధ్యాత్మికం** – నానుంచి వచ్చే ఆటంకాలు ఏర్పడకుండా చేయి.

ఇవేవీ నేను ఆత్మజ్ఞానం పొందేందుకు అడ్డం లేకుండా చేయి. ఈ శాంతిపాఠం పఠించటం ద్వారా మనం ఉపనిషత్తు బోధ నిరాటంకంగా సాగటానికి స్టే ఆర్డర్ తెచ్చుకుంటాము. ఈ ప్రార్థనద్వారా మనం ప్రపంచాన్ని నిర్దేశించటం లేదు. మనకు ఆటంకం రాకుండా తాత్కాలికంగా, ఆ కాసేపు ఈ ప్రతిబంధకాలు లేకుండా చేయమని కోరతాము.

**కైవల్యోపనిషత్తు పేరు ఎలా వచ్చింది?** – కైవల్యం అంటే మోక్షం. ఈ ఉపనిషత్తును అధ్యయనం చేస్తే మోక్షం వస్తుంది. ఈ ఉపనిషత్తుని అధ్యయనం చేస్తే మోక్షం వస్తుంది కాబట్టి దీన్ని మోక్షోపనిషత్తు అని కూడా అంటారు.

కాని కైవల్యోపనిషత్తు పేరు ఎందుకు వచ్చిందంటే ఈ ఉపనిషత్తులోనే కైవల్యం పదం వస్తుంది.

**కైవల్యం పదమశ్నుతే కైవల్యం పదమశ్నుత ఇతి**

ఈ మాటలతో ఈ ఉపనిషత్తు ముగుస్తుంది. కాబట్టి దీనికి ఆ పేరు వచ్చింది.

ఇంకొక కారణం కూడా ఉంది. కైవల్యం పదం కేవల ధాతువునుంచి వచ్చింది. కేవలం అంటే అద్వితీయం అని అర్థం. అంటే రెండవది లేనిది. కేవలం రామః ఆగతవాన్ అంటే రాముడొక్కడే వచ్చాడు, వేరే ఎవరూ లేరని అర్థం. అందువల్ల కేవలం అంటే ఉన్నదొక్కటే. ఉన్నదొకటే అంటే వేరేవి ఏవీ లేవని అర్థం. రెండోది లేదు, దానికి సరియైనది ఇంకొకటి లేదు అని అర్థం. అలా రెండోది లేని, దానికి ధీటైనది లేనిది ఒక్కటే ఉంటుంది. అది పూర్ణవస్తువు. పూర్ణవస్తువుకు భిన్నంగా మరొకటి లేదు, పూర్ణవస్తువుకు బాహ్యంగా మరొకటి లేదు. అందువల్ల కేవల పదాన్ని పొడిగిస్తే అద్వితీయం లేదా పూర్ణం అని అర్థం. కేవలం పదంయొక్క నామవాచకం పూర్ణత్వం. పూర్ణత్వం అంటే నాకు శారీరకంగా, భావపరంగా, బుద్ధిపరంగా – ఏ స్థాయిలోనూ ఏ విధమైన కొరతా లేదని అర్థం. నేను ఉన్న స్థితికి భిన్నంగా ఉండాలనే పోరాటం ఉండదు. అంటే మోక్షం పొందినట్టు అర్థం.

మోక్షానికి ఇవ్వగలిగిన అత్యద్భుతమైన నిర్వచనం ఇదే. **నేను ఉన్న పరిస్థితికి భిన్నంగా ఉండాలనే పోరాటం లేకపోవటమే మోక్షం.**

**ఆత్మన్యేవాత్మనా తుష్టః** – గీత

ఇంకొక అర్థం కైవల్యోపనిషత్ కేవల ఆత్మ గురించి బోధిస్తుంది కాబట్టి ఆ పేరు వచ్చింది. కేవలం అంటే సంస్కృతంలో అద్వైతం అని అర్థం. అద్వైతం అంటే ఏకాత్మవాదన. జీవాత్మ, పరమాత్మల ఐక్యాన్ని బోధిస్తుంది. అంతేకాదు, అనాత్మ నామరూపాలు మాత్రమేననీ, ఆత్మకు

భిన్నంగా దానికి ఉనికి లేదనీ చూపిస్తుంది. అందువల్ల జీవాత్మ, పరమాత్మల ఐక్యం చూపించాక, అనాత్మను కూడా అందులో లయం చేస్తుంది.

ఆ విధంగా ఈ ఉపనిషత్తు కేవల ఆత్మ గురించి, కైవల్యం (మోక్షం) గురించీ చెబుతుంది కాబట్టి, కైవల్యం పదంతో ముగుస్తుంది కాబట్టి దీన్ని కైవల్యోపనిషత్తు అంటారు.

**ఉపనిషత్తు వివరాలు** – ఇది చిన్న ఉపనిషత్తు. ఇందులో 25 మంత్రాలు మాత్రమే ఉన్నాయి. కొందరు 24, 25 మంత్రాలు రెండవ అధ్యాయంలో వస్తాయని అంటారు కాని, ఎక్కువగా కైవల్యోపనిషత్తులో ఒక్క అధ్యాయమే ఉందని అంటారు.

ఈ ఉపనిషత్తును ప్రధానంగా 5 అంశాలుగా విభజించవచ్చు. అవి ఉపోద్ఘాతం, ఆత్మజ్ఞానసాధన, ధ్యానం, వేదాంతవిచారణ, ఉపసంహారం. వాటిని వివరంగా చూద్దాము.

### 1) ఉపోద్ఘాతం – మంత్రం 1

ఉపనిషత్తు గురుశిష్యుల సంవాదరూపంలో బోధ చేస్తుందని చూస్తున్నాము. ఇక్కడ శిష్యుడు అశ్వలాయన ఋషి, గురువు వేరే ఎవరో కాదు – సాక్షాత్తూ చతుర్ముఖబ్రహ్మ. మొదటి మంత్రం ఈ గురుశిష్యులను పరిచయం చేస్తుంది. చతుర్ముఖబ్రహ్మయొక్క నాలుగు ముఖాలు నాలుగు వేదాలకు ప్రతీక. అందువల్ల సాక్షాత్తూ పరమాత్మ కాబట్టి శ్రేష్ఠమైన గురువు. అశ్వలాయన ఋషి కూడా అర్హత ఉన్న శిష్యుడు. ఒక సాధకుని ప్రయాణం ఈ విధంగా సాగాలి. కర్మయోగం చేసి చిత్తశుద్ధి పొంది, ఉపాసనయోగం చేసి చిత్త ఏకాగ్రత పొంది, జ్ఞానయోగానికి వచ్చి శ్రవణ మనన నిదిధ్యాసనలు చేసి జ్ఞానం పొందితే మోక్షం పొందుతాడు.

ఈ శిష్యుడు మొదటి రెండు దశలూ దాటేశాడు. ఇప్పుడు బ్రహ్మజ్ఞానం పొందాలని తెలుసుకున్నాడు. అందువల్ల ఈ విధంగా ప్రశ్నించాడు బ్రహ్మను.

**అధీహి భగవన్ బ్రహ్మవిద్యాం వరిష్ఠాం ।**
**సదా సద్భిః సేవ్యమానాం నిగూఢామ్ ।**
**యయాఽచిరాత్ సర్వపాపం వ్యపోహ్య ।**
**పరాత్పరం పురుషం యాతి విద్వాన్ ॥** – 1

అతను మొదటి దశలు దాటేశాడనీ, తన లక్ష్యం ఏమిటో స్పష్టంగా తెలుసనీ మనకెలా తెలుసు? అతని ప్రశ్న ద్వారా నాలుగు అంశాలు చెప్పకనే చెబుతున్నాడు.

1. తనకు మోక్షం కావాలని తెలుసు
2. మోక్షం ఆత్మజ్ఞానంవల్లనే కలుగుతుందని తెలుసు

3. జ్ఞానం శాస్త్రవిచారణవల్లనే కలుగుతుందని తెలుసు
4. శాస్త్రవిచారణ ఆచార్యుని ద్వారానే చేయాలని తెలుసు.

అంటే మోక్షం, మోక్షార్థం జ్ఞానం, జ్ఞానార్థం శాస్త్రం, శాస్త్రార్థం శ్రవణం, మననం, నిదిధ్యాసనం– ఇవీ దశలు. అందువల్ల అశ్వలాయన ఋషి బ్రహ్మవిద్య అడిగాడు ప్రత్యక్షంగా. సంసారమనే భవరోగానికి కారణం తెలుసు. పరిష్కారం ఎక్కడ వెతుక్కోవాలో కూడా తెలుసు. ఇంతటి అర్హత ఉన్న శిష్యుణ్ణి చూసి బ్రహ్మ మురిసిపోయి ఉంటాడు. ఎందుకంటే వెంటనే బోధ మొదలుపెడతాడు. సాధరణంగా శిష్యుని అర్హతను పరీక్ష చేయందే గురువు బోధించదు. ఉదాహరణకు కఠోపనిషత్తులో యమధర్మరాజు, నచికేతుడు సాధన చతుష్టయ సంపన్నుడని నిర్ధారించుకున్నాకే బోధ మొదలుపెడతాడు.

2) **ఆత్మజ్ఞానసాధన, ఆత్మజ్ఞానఫలం – మంత్రాలు 2–4**

బ్రహ్మదేవుడు రెండు సాధనల గురించి చెబుతాడు. అవి సాక్షాత్ సాధన, సహకారీ సాధన. ఉదాహరణకు ఏదైనా అనారోగ్యం చేస్తే దానికి డాక్టరు రెండు మార్గాలు చెబుతాడు. ఒకటి ఔషధం, రెండు పథ్యం. ఔషధం అంటే మందు. అది సాక్షాత్ సాధన. దానికి పథ్యం కూడా తోడవాలి. అది సహకారీ సాధన. ఇవి తినమనీ, ఇవి తినవద్దనీ వివరిస్తారు డాక్టరు.

అదే విధంగా సంసారరోగనివృత్తికి కూడా రెండు సాధనలూ అవసరమే. సాక్షాత్ సాధన– శ్రవణ, మనన, నిదిధ్యాసనలు అయితే, సహకారీ సాధన – సన్న్యాసం.

1. **సాక్షాత్ సాధన** – వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనలు సాక్షాత్ సాధనలు.

**శ్రవణం** – ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా, కొన్ని సంవత్సరాలపాటు ఒక సమర్థవంతమైన గురువువద్ద వేదాంతవిద్యను అధ్యయనం చేయటం. దీన్ని అజ్ఞాననివృత్తి అంటారు.

**మననం** – పొందిన జ్ఞానాన్ని నిశ్చయజ్ఞానంగా మలుచుకోవటం. ఇంక సందేహాలు ఉండకూడదు. దీన్ని సంశయనివృత్తి అంటారు.

**నిదిధ్యాసనం** – ఎన్నో జన్మలుగా మనలో కూరుకుపోయిన తప్పుడు భావాలను పారద్రోలటం. ఆనందం, శాంతి, భద్రతలు బాహ్యప్రపంచంలో లేవు; నాలోనే ఉన్నాయని తెలుసుకోవటం. అవి పరిస్థితులవల్ల రావు. పరిస్థితులు బాగుండకపోయినా వస్తాయని తెలుసుకోవటం.

ఇలా మనలో కూరుకుపోయిన భావాలను విపరీతభావనలనీ, విపర్యయభావనలనీ అంటారు. వీటిని పారద్రోలితే జ్ఞాననిష్ఠలో నిలబడతారు. దీన్ని విపర్యయనివృత్తి అంటారు.

కాకపోతే ఈ మూడింటినీ బ్రహ్మదేవుడు కొత్త భాషలో పరిచయం చేశాడు.

**శద్ధా భక్తి ధ్యానయోగాదవైహి ॥** – 2

**శ్రద్ధ–శ్రవణం; భక్తి–మననం; ధ్యానయోగం–నిదిధ్యాసనం.** ఇవి సాక్షాత్ సాధనలు. ఇది ఒక **ప్రత్యేకత.**

2. **సహకారీ సాధన – సన్న్యాసం** – శాస్త్రాల్లో చెప్పిన విలువలన్నీ దీనిక్రిందకు వస్తాయి. బ్రహ్మ వాటిల్లో ఒకటి ఎన్నుకున్నాడు. అది చాలా ముఖ్యమైనది.

**న కర్మణా న ప్రజయా ధనేన । త్యాగేనైకే అమృతత్వమానశుః ॥**

త్యాగం అంటే సన్న్యాసం. సన్న్యాసం అంటే బాహ్యంగా సన్న్యాసం స్వీకరించటం కాదు. సన్న్యాసం అంటే ఆంతర్గత సన్న్యాసం.

**తన్‌మన్‌ధన్ సబ్ కుచ్ తేరా**

నా శరీరం, నా మనస్సు, నా ఆస్తిపాస్తులు, నాకున్నవన్నీ నీవే అని మనసారా అనగలగటం. ఇవన్నీ మీకు వ్యవహారం నడపటానికి భగవంతుడు తాత్కాలికంగా ఇచ్చాడనీ, వాటికి మీరు ధర్మకర్త మాత్రమేననీ, ఎప్పుడు కావాలంటే అప్పుడు వెనక్కి తీసుకోగలడనీ వివేకం పెంచుకుంటే వైరాగ్యం దానంతట అదే వస్తుంది. మీ పేర ఆస్తిపాస్తులు ఉండవచ్చు, అవసరమైతే మీ పేర ఉన్నాయని నిరూపించుకోవాల్సి రావచ్చు కాని మనస్సులో మీకు తెలియాలి, అవన్నీ తాత్కాలికమేనని. ఇది వివేకంవల్ల కలుగవచ్చు లేదా భక్తివల్ల కలుగవచ్చు.

**అనన్యాశ్చింతయంతో మామ్** – గీత 9.22

శంకరాచార్యులవారు పదేపదే చెబుతారు – సన్న్యాససహితజ్ఞానం మాత్రమే మోక్షాన్ని ఇస్తుందని. సన్న్యాసం అంటే ఆంతరసన్న్యాసం అని చూశాం. బాహ్యంగా సన్న్యాసం స్వీకరించినవారు గృహస్థు దగ్గరికి వచ్చినప్పుడు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతూ ఒక మంత్రం పఠిస్తారు. అది ఈ ఉపనిషత్తులో వస్తుంది. అది ఒక ప్రత్యేకత ఈ ఉపనిషత్తుకు.

**న కర్మణా న ప్రజయా ధనేన । త్యాగేనైకే అమృతత్వమానశుః ॥**

ఈ మంత్రం ద్వారా సన్న్యాసి బంధాలు పెంచుకోకూడదని పరోక్షంగా గుర్తు చేస్తున్నారు. సన్న్యాసికి కారు, ఆశ్రమం, ట్రస్ట్, ఏవైనా ఉండవచ్చు. తనకు తెలియకుండానే ఆ బంధాల్లో కూరుకుపోవచ్చు. కాని గృహస్థు సన్న్యాసి ధర్మాన్ని పరోక్షంగా గుర్తు చేస్తున్నాడు.

ఆ విధంగా బ్రహ్మజ్ఞానం పొందాలంటే జ్ఞానం, వైరాగ్యం రెండు సాధనలూ పాటించాలి.

**జ్ఞానవైరాగ్య సిద్ధ్యర్థం భిక్షాం దేహి చ పార్వతి –**

అన్నపూర్ణాదేవిని, జ్ఞానవైరాగ్యాలు ప్రసాదించమని భిక్షగా కోరతాము.

3) **ధ్యానం – మంత్రాలు 5-11**

ఈ మంత్రాలు గీతలో ఆరవ అధ్యాయానికి మూలం. ఇక్కడ మూడు అంశాలు చెప్పాడు బ్రహ్మ. అవి ధ్యానసాధనలు, సగుణధ్యానం, నిర్గుణధ్యానం.

1. **ధ్యానసాధనలు** – దేశం, కాలం, ఆసనం, శరీరస్థితి.

**దేశం** – శుభ్రంగా, నిర్జనంగా ఉండి, ఆధ్యాత్మికతను ప్రేరేపించే ప్రదేశం.

**కాలం** – (ఇక్కడ చెప్పలేదు) మనస్సు సాత్త్వికంగా ఉండాలి. అంటే పరుగులు పెట్టని, నిద్రపోని మనస్సు ఉండాలి. అలా ఉండకపోతే, ఒక సమయాన్ని ఎన్నుకుని సాత్త్వికంగా ఉండేలా శిక్షణ ఇచ్చుకోవాలి. రాజసిక మనస్సు విపరీతంగా చురుకుగా ఉంటే, తామసిక మనస్సు విపరీతంగా నిద్రావస్థలో ఉంటుంది. అందువల్ల సాధారణంగా తెల్లవారుజాము అనుకూలమైన సమయం.

**ఆసనం** – మరీ ఎత్తుగా ఉండకూడదు, మరీ కిందకు ఉండకూడదు; మరీ గట్టిగా ఉండకూడదు, మరీ మెత్తగా ఉండకూడదు. మరీ గట్టిగా ఉంటే నొప్పి కలుగుతుంది; మరీ మెత్తగా ఉంటే శరీరం ముందుకు వంగుతుంది. ఇలా భగవద్గీతలో కృష్ణపరమాత్మ చెప్పాడు.

**శరీరస్థితి** – ఇందులో మళ్ళీ ఐదు అంశాలు ధ్యానం చేయటానికి అనుకూలంగా ఉండాలి. అవి, స్థూలశరీరం, ఇంద్రియాలు, శ్వాస, మనస్సు, బుద్ధి. శరీరం నిటారుగా ఉండాలి. శ్వాస మామూలుగా ఉండాలి. ముక్కు చివర చూడాలి అంటే అర్థం కన్నులు అరమోద్పుగా ఉండాలి. మనస్సు బాహ్యంగా పరుగులు తీయకూడదు, బుద్ధి సహకరించాలి. మనస్సు, బుద్ధి సహకరించటానికి బ్రహ్మదేవుడు రెండు మార్గాలను సూచిస్తున్నాడు. ఈ మార్గాలను గీతలో చూడము. ధ్యానం విషయంలో ఈ రెండు మార్గాల సూచన **ఒక ప్రత్యేకత**.

**మనస్సు పరంగా** – అత్యాశ్రమస్థ – సన్న్యాసిలాగా ధ్యానం చేయాలి. గృహస్థుగా చేస్తే, అనేక బెంగలు ఉంటాయి. మనం ఏ పాత్రలో ఉన్నా బెంగలు ఉంటాయి. అందువల్ల ధ్యానం చేసే కాసేపయినా నేను తండ్రి కాదు, నేను భర్త కాదు, నేను ఉద్యోగిని కాదు – ఇలా అనుకోవాలి. ఒక్కముక్కలో చెప్పాలంటే ఆ 20 నిముషాలు సర్వసంగపరిత్యాగం చేయాలి. అంతగా వదులుకోలేకపోతే, ఆ కాసేపన్నా దేవునిమీద భారం వేయాలి. మీరు

అప్పుడు పట్టించుకోకపోతే మీ కుటుంబం ఏమవుతారని బాధపడతారే కానీ నిజానికి కాసేపన్నా హాయిగా ఉన్నామని వారనుకున్నా ఆశ్చర్యపోనవసరం లేదు.

**బుద్ధిపరంగా** – బుద్ధిని పదునుగా చేసుకోవటానికి ఆ సమయంలో గురువును తలచుకోమంటున్నాడు బ్రహ్మదేవుడు.

**భక్త్యా స్వగురుం ప్రణమ్య** –5

మీ గురువు ఎవరైతే వారిని భక్తిగా తలుచుకుంటే, మీకు తెలియకుండానే గురువు బోధ కూడా గుర్తుకువస్తుంది. ఎందుకంటే గురువుతో మీ బంధం దేనిపరంగా ఉంది? జ్ఞానపరంగానే కదా! దానివల్ల ధ్యానంలో గుర్తు తెచ్చుకోవాల్సిన బోధ సహజంగా గుర్తుకు వస్తుంది.

ఇంతవరకూ ధ్యానసాధనలు చూశాము. ఇప్పుడు మూడు స్థాయిల్లో ధ్యానం ఎలా చేయాలో నేర్పిస్తున్నాడు బ్రహ్మదేవుడు. భగవంతుణ్ణి మూడు స్థాయిల్లో కొలవాలని నేర్చుకుంటాము. అవి ఏకరూప ఈశ్వరుడు, అనేకరూప ఈశ్వరుడు, అరూప ఈశ్వరుడు.

ఈ మూడు స్థాయిల్లో ధ్యానాన్ని ఒకేసారి చెప్పినా, ధ్యానం చేసేటప్పుడు మాత్రం మూడింటిమీదా ఒకేసారి చేయకూడదు. ఒక్కొక్కసారి, ఒక్కొక్క రూపంమీద ధ్యానం చేయాలి. కాకపోతే ఈ మూడు రూపాలు ఒక వరుసక్రమంలో విడివిడిగా రావు. వాటిని మనం సరిగ్గా నేర్చుకోవాలి.

2. **సగుణధ్యానం** –

**ఏకరూపధ్యానం** – దీన్ని ఇష్టదేవతా ధ్యానం అనీ, సగుణ ఈశ్వరధ్యానం అనీ అంటారు. బ్రహ్మ సూచించిన ఇష్టదేవత శివుడు.

**ఉమాసహాయం పరమేశ్వరం ప్రభుమ్।**
**త్రిలోచనం నీలకంఠం ప్రశాంతమ్॥**

ఉమాదేవితో కూడిన, అత్యంత గొప్ప దేవుడైన, మూడు కన్నులున్న, కంఠం నీలంగా ఉన్న, ధ్యానముద్రలో ప్రశాంతంగా ఉండే శివుణ్ణి ధ్యానం చేయాలి. శివుడు అంటే శివునిమీదనే ధ్యానం చేయాలనే నియమం లేదు. మీ ఇష్టదైవం ఎవరైతే వారికి సంబంధించిన ధ్యానశ్లోకాలు ఉంటాయి. వాటిని తీసుకుని, ఆ మూర్తిని మనస్సులో నిలుపుకుని ధ్యానం చేయాలి. ఇది ద్వైతభక్తి. దీన్నుంచి రెండవ స్థాయికి ఎదగాలి. అది విశిష్టాద్వైతభక్తి.

**అనేకరూప ధ్యానం** – దీన్ని విశిష్టాద్వైతభక్తి అనీ, విశ్వరూప ఈశ్వరధ్యానం అనీ అంటారు.

**ఆది మధ్యాంత విహీనమ్**

ఈశ్వరునికి ఆది, మధ్య, అంతాలు లేవు. ఈ వర్ణన విశ్వరూప ఈశ్వరునికి, అరూప ఈశ్వరునికి కూడా వర్తిస్తుంది. ఆదిమధ్యాంతరహిత పదాన్ని అర్జునుడు కృష్ణపరమాత్మ విశ్వరూపాన్ని వర్ణించటానికి వాడాడు, కాబట్టి మనం కూడా ఇది విశ్వరూప ఈశ్వరధ్యానానికి తీసుకుందాము.

**విభుం** – అనేకంగా విరాజిల్లేవాడు. సర్వం శివమయం జగత్తు అని చెప్పవచ్చు. ఈ స్థాయినుంచి అరూప ఈశ్వరుని అర్థం చేసుకునే స్థాయికి రావాలి.

3. **నిర్గుణధ్యానం –**
**అరూప ఈశ్వరధ్యానం** – నిజానికి దీన్ని నిదిధ్యాసనం అంటారు. ఇది నిశ్చయజ్ఞానం పొందాక చేస్తారు.

**అచింత్యమవ్యక్తమనంతరూపం। శివం ప్రశాంతమమృతం బ్రహ్మయోనిమ్ ।** – 6

ముందే చూసినట్టుగా మూడు రూపాలను స్పష్టంగా విభజించలేదు. మనం ఆయా స్థాయిలను సూచించటానికి ఏరుకుంటున్నాము. అరూప ఈశ్వరుడు మనో అగోచరం, ఇంద్రియ అగోచరం, సత్‌చిత్ ఆనందరూపం, అరూపం, అద్భుతం. ఈ వర్ణన వచ్చేలాగా కఠలో అద్భుతమైన మంత్రం ఉంది.

**అశబ్దమస్పర్శమరూపమవ్యయం తథారసం నిత్యమగన్ధవచ్చ యత్ ।**
**అనాద్యనన్తం మహతః పరం ధ్రువం నిచాయ్య తం మృత్యుముఖాత్ప్రముచ్యతే ॥** – కఠ 15

ఈ కైవల్యమంత్రంలో క్రియాపదం లేదు. అందువల్ల మనం సాధకః ధ్యాయేత్ అని కలుపుకోవాలి. ఒక్కొక్క స్థాయి దాటుకుంటూ వచ్చి నిర్గుణబ్రహ్మజ్ఞానం పొందాలి. లేకపోతే సంసారం తప్పదు. నిర్గుణబ్రహ్మజ్ఞానం పొందితే అహం బ్రహ్మ అస్మి జ్ఞానం పొందుతారు.

ఈ సందర్భంలో ఈ నిర్గుణ బ్రహ్మజ్ఞానం పొందటానికి జ్ఞానమార్గం తప్ప వేరే మార్గం లేదని బ్రహ్మదేవుడు నొక్కి వక్కాణిస్తున్నాడు. ఇది ఒక **ప్రత్యేకత.**

**నాన్యః పంథా విముక్తయే** – 9

**విముక్తయే అన్యః పంథాః నాస్తి** – విముక్తి పొందటానికి వేరే మార్గం లేదు. పంథా అంటే మార్గం. రకరకాల మార్గాలు చెబుతారు కొంతమంది. భక్తిమార్గం, కర్మమార్గం, కుండలినీ మార్గం, ధ్యానమార్గం. ఇవేవీ మోక్షాన్ని ఇవ్వవు. ఇవేవీ మోక్షాన్ని ఇవ్వవు అంటే వీటిని కించపరచటం లేదు. ఇవి సాక్షాత్ సాధనలు కాదు, సహకారీ సాధనలు మాత్రమే. జ్ఞానమార్గం ఒక్కటే సాక్షాత్ సాధన. జ్ఞానమార్గమొక్కటే మోక్షానికి దారి. కాని అది కష్టంగా ఉంది అంటే

అది తేలిక అని ఎవరు అన్నారు? అది కష్టమే కాని తేలిక చేసుకోండి అన్నాదు కృష్ణపరమాత్మ. ముందు సహకారీసాధనలు పాటించాలి.

### 4) వేదాంతవిచారణ – మంత్రాలు 11–23

వేదాంతవిచారణ, మంత్రం 11 నుంచీ మొదలవుతుంది. వేదాంతవిచారణ లేదా మహావాక్యవిచారణ సాధనలు మూడు అని చూశాము. అవి శ్రవణ, మనన, నిదిధ్యాసనలు. మామూలుగా వేదాంత విచారణ ఇదే వరుసక్రమంలో జరుగుతుంది. కాని ఈ ఉపనిషత్తులో ముందు నిదిధ్యాసనం చూశాము. ఇది ఒక ప్రత్యేకత. ఇప్పుదు శ్రవణ, మననాలు చూస్తాము.

ఈ శాస్త్రవిచారణ ఒక్కోసారి ఏదైనా దృష్టాంతం ద్వారా జరుగుతుంది. ఇక్కడ అరణి మథనం దృష్టాంతం చూస్తాము. రెండు చెక్కలు ఉంటాయి. కింద చెక్కని అధో అరణి అంటారు. దాన్ని అశ్వత్థవృక్షంనుంచి తయారుచేస్తారు. ఈ చెక్క మధ్యలో ఒక చిన్న గుంట ఉంటుంది. దాన్ని కదలకుండా ఉంచి, దానిలో ఇంకో పొడవైన చెక్కను కవ్వంలా ఉంచి చిలుకుతారు. దాన్ని ఉత్తర అరణి అంటారు. దాన్ని శమీవృక్షంనుంచి తయారుచేస్తారు. వాటి మధ్య ఘర్షణవల్ల అగ్ని పుదుతుంది. ఆ అగ్నిని హోమకుండంలో వేస్తారు.

ఇక్కడ శిష్యుని మనస్సు కింద చెక్కలా గట్టిగా, కదలకుండా ఉండాలి. అంటే రాగద్వేషాలకు లోనుకాకుండా, స్థిరంగా, ఏకాగ్రతతో ఉండాలి. ఓంకార విచారణ. ఉత్తర అరణిని అంటే ఉపనిషత్ మంత్రాలు అని తీసుకోవచ్చు. మథనం గురువు చేస్తాడు. అలా గురువు చిలికినప్పుదు శ్రవణం దశలో జ్ఞానమనే నిప్పురవ్వలు రేగుతాయి. తక్కిన రెండు దశలూ దాటితే పాశాలన్నింటినీ జ్ఞానాగ్నిలో దహించివేస్తాదు.

### బ్రహ్మజ్ఞానం – మంత్రాలు 12–22

వేదాంతంలో సృష్టిని తరచు స్వప్నప్రపంచంతో పోలుస్తారు. స్వప్నప్రపంచానికీ, జాగ్రత్ ప్రపంచానికీ మధ్య అనేక పోలికలు ఉన్నాయి. జాగ్రత్‌పురుషుడనైన నేను నిద్రలో ఒక స్వప్న ప్రపంచాన్ని సృష్టిస్తాను. నా నిద్రాశక్తికి రెండు శక్తులు ఉన్నాయి. అవి విక్షేపశక్తి, ఆవరణశక్తి. నా మనోవాసనల ద్వారా స్వప్నాన్ని సృష్టించే శక్తిని విక్షేపశక్తి అంటారు. స్వప్నప్రపంచాన్ని సృష్టించాక, నేనే అందులోకి అదుగు పెడతాను. ఎప్పుదైతే అందులోకి అదుగుపెడతానో, అప్పుదే నేను స్వప్నంలో ఒక జీవిని అవుతాను. మార్పుని ఆవరణశక్తి అంటారు. విక్షేపశక్తివల్ల నేను సృష్టికర్తను అయితే, ఆవరణశక్తివల్ల నేను సృష్టికర్తను అని మర్చిపోయి, నేను బాధాతప్త స్వప్నజీవిని అనుకుంటాను. నేను స్వప్నావస్థలో ఉన్నంతవరకూ, నాకు నా కల, ఒక కల అని తెలియదు. ఈ సమస్యకు ఒకటే పరిష్కారం. స్వప్నప్రపంచంనుంచి లేవటమే.

ఇప్పుడు ఇదే సూత్రాలను జాగ్రత్ప్రపంచానికి అన్వయించమంటుంది వేదాంతం. జాగ్రత్ప్రపంచం స్వప్నం 2 అంటుంది.

1. నేను బ్రహ్మను. నేను నా మాయాశక్తివల్ల జాగ్రత్ప్రపంచాన్ని సృష్టించాను. మాయాశక్తికి కూడా రెండు శక్తులు ఉన్నాయి. మాయాశక్తియొక్క విక్షేపశక్తివల్ల ఈ జాగ్రత్ ప్రపంచాన్ని సృష్టించాను. కాని ఎప్పుడైతే ఈ జాగ్రత్ప్రపంచంలోకి అడుగు పెడతానో, అప్పుడే నేను జాగ్రత్ప్రపంచంలో ఒక జీవిని అవుతాను. ఈ మార్పుని ఆవరణశక్తి అంటారు. విక్షేపశక్తివల్ల నేను జాగ్రత్ప్రపంచ సృష్టికర్తను అయితే, ఆవరణశక్తివల్ల నేను సృష్టికర్తను అని మర్చిపోయి, ఈ జగత్తులో నేను ఒక బాధాతప్తజీవిని అనుకుంటాను. నేను జాగ్రదవస్థలో ఉన్నంతవరకూ నాకు నేను అనుభవిస్తున్న సంసారం మిథ్య అని తెలియదు. ఈ సమస్యకు ఒక్కటే పరిష్కారం. జాగ్రదవస్థనుంచి లేవటమే. అంటే నా ఉన్నతస్థాయికి లేవటం లేదా నా స్వస్వరూపాన్ని తెలుసుకోవటం.

స్వప్నాన్ని ప్రాతిభాసిక సత్యం అంటారు. జాగ్రద్ ప్రపంచాన్ని వ్యావహారిక సత్యం అంటారు; నా ఉన్నతస్థాయిని పారమార్థిక సత్యం అంటారు. కాకపోతే స్వప్నం విషయంలో దాన్నుంచి నిద్ర లేస్తే చాలు, సత్యం తెలుస్తుంది. కాని జాగ్రదవస్థలో నిజానికి మేలుకునే ఉంటాము. వేదాంతం స్వప్నం అంటుంది. ఎందుకంటే మనకు నిజం తెలియదు కాబట్టి. ఈ స్వప్నం-2 నుంచి లేవాలంటే జ్ఞానం పొందాలి. జీవాత్మ అయిన నేను మూడు అవస్థల్లో తిరుగుతూ, వాటిల్లో పడి కొట్టుమిట్టాడుతున్నాను. అవి జాగ్రదవస్థ, స్వప్నావస్థ, సుషుప్తి అవస్థ. ఈ జీవాత్మ ఎవరో కాదు – మహానిద్రమాయలో పడ్డ పరమాత్మే అని గుర్తుంచుకోవాలి.

**పురత్రయే క్రీడతి యశ్చ జీవః** – నేను మూడు అవస్థల్లో తిరుగుతాను.

**యస్మిన్ పురత్రయం చ లయం యాతి** – నాలో మూడు అవస్థలు లయమవుతాయి. నేను జీవాత్మ అనే అజ్ఞానంలో ఉంటే, నేను మూడు అవస్థల్లో తిరుగుతాను. నేను పరమాత్మను అని తెలుసుకుంటే నాలో మూడు అవస్థలు లయమవుతాయి. కాకపోతే ఆ నేను ఎవరో మర్చిపోకూడదు. నేను అవస్థాత్రయ సాక్షిచైతన్యాన్ని. నేను శరీరం కాదు, ఇంద్రియాలు కాదు, మనస్సు కాదు. జీవాత్మలో జీవ-ఉపాధి, పరమాత్మలో పరమ-ఉపాధి తీసేస్తే నేను ఆత్మను; శుద్ధచైతన్యాన్ని. ఆ విధంగా జీవాత్మ అయిన నేనూ, పరమాత్మ ఒకటే. ఇది భాగత్యాగలక్షణం. ఇది అర్థం చేసుకోవాలంటే వేదాంతంయొక్క ఐదు సూత్రాలను జీర్ణించుకోవాలి.

1. నేను సర్వవ్యాపకమైన చైతన్యాన్ని
2. శాంతి, ఆనందం, భద్రతలు పొందే మార్గాన్ని నేనే

3. కేవలం నా ఉనికివల్లే నా భౌతిక శరీరానికి జీవం ఏర్పడి, ఈ జగత్తులో వ్యవహారం నడుపగలుగుతున్నది
4. ఈ జగత్తులో ఏం జరిగినా అది నాకు అంటదు
5. నా అసలు స్వరూపాన్ని నేను మర్చిపోయి నా జీవితాన్ని భారంగా చేసుకుంటున్నాను. జ్ఞానయోగమనే విలువిద్యను సరిగ్గా సాధన చేసి, జీవితాన్ని ఒక ఆటగా మలుచుకుంటాను.

**మహావాక్యాలు – మంత్రాలు 16–23**

ఆత్మజ్ఞానం పొందాలంటే, మహావాక్యమంత్రాలు లేకుండా పొందలేము. జీవాత్మ పరమాత్మ ఐక్యబోధక వాక్యాలను మహావాక్యాలు అంటారు. 16–23 వరకూ అన్నీ మహావాక్యమంత్రాలు. కైవల్యోపనిషత్తు చిన్నదైనా, ఈ మహావాక్యమంత్రాలు ఎన్నో ఉండటంవల్ల దీనికింత ప్రాముఖ్యత వచ్చింది. జీవాత్మ కార్యం, పరమాత్మ కారణం. కార్యం జీవాత్మ, కారణం పరమాత్మతో ఎలా సమానం?

ఇదే పద్ధతి కఠోపనిషత్తులో కూడా చూశాము. మహావాక్యాల సందేశం ఇలా ఉంటుంది.

| జీవాత్మ–వ్యష్టి | పరమాత్మ–సమష్టి |
|---|---|
| 1. స్థూలశరీరం | స్థూలప్రపంచం |
| 2. సూక్ష్మశరీరం | సూక్ష్మప్రపంచం |
| 3. కారణశరీరం | కారణప్రపంచం |
| 4. చిదాభాస | చిదాభాస |
| 5. చిత్ | చిత్ |

ఇటు స్థూల, సూక్ష్మ, కారణశరీరాలు, అటు స్థూల, సూక్ష్మ, కారణప్రపంచాలు ప్రతిబింబమాధ్యమాలు. వాటిల్లో ఏర్పడిన ప్రతిబింబాలు చిదాభాస. బింబచైతన్యం చిత్. వ్యష్టిలో ప్రతిబింబమాధ్యమాలు చిన్నవి కాబట్టి చిదాభాస కూడా చిన్నది. సమష్టిలో ప్రతిబింబ మాధ్యమాలు పెద్దవి కాబట్టి వాటి చిదాభాస పెద్దది. ఇప్పుడు ఐదు అంశాల్లో నాలుగు అంశాలు సమానంగా లేవు. అయినా జీవాత్మ, పరమాత్మ ఐక్యం ఎలా సంభవం అంటే రెండింటిలోనూ సమానంగా ఉన్న బింబచైతన్యంవల్ల. నాలుగు అంశాలు భిన్నంగా ఉన్నా కూడా, ఆ నాలుగు అంశాలు వ్యావహారికస్థాయికి చెందినవి. అందువల్ల అవి మిథ్య. ఎగ్జిబిషన్‌లలో అద్దాలగది ఉంటుంది. అందులో అద్దాలు ప్రత్యేకంగా ఉంటాయి. వాటివల్ల మీరు ఒకదాంట్లో మరుగుజ్జుగా, ఇంకో దానిలో చాలా పెద్దగా, మరోదానిలో బక్కపీచుగా, ఇంకోదానిలో రుబ్బురోలులా కనిపిస్తారు. కాని అన్నింటిలో ఉన్నది మీరే.

అలాగే వ్యష్టిపరంగా చూస్తే మీరు అల్పజ్ఞులు, పరిమితి ఉన్న జీవులు అయితే, సమష్టి పరంగా పరమాత్మ సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడుగా ఉంటారు. కాని వాటిని చూడకుండా, సమానంగా ఉన్న చైతన్యాన్ని చూడాలి. చిన్న అలలోనూ నీరే ఉంది; పెద్ద సముద్రంలోనూ నీరే ఉంది. అది అర్థం చేసుకుంటే ఇది అర్థం అవుతుంది.

**అహం జీవాత్మా పరమాత్మా చ అస్మి**

ఈ మహావాక్యాన్ని ప్రతి ఉపనిషత్తులోనూ చూస్తాము. ఇక్కడ **ఇంకొక ప్రత్యేకత** ఉంది.

**తత్త్వమేవ త్వమేవ తత్** – 16

**తత్ ఏవ త్వమ్** – ఆ (బ్రహ్మ) నువ్వే. గురువు సాక్షాత్తూ బ్రహ్మ. అన్నింటినీ ఆబ్జెక్టుగా చూసే సబ్జెక్టు అయిన నువ్వే బ్రహ్మవు అంటున్నాడు. అంతేకాదు,

**త్వమేవ తత్** – నువ్వే ఆ బ్రహ్మవు అని మళ్ళీ తిరగేసి చెబుతున్నాడు. అన్ని వాక్యాలను తిరగేసి చెప్పలేము. ఇలా తిరగేసి చెప్పటంలో అంతరార్థం జీవాత్మ = పరమాత్మ అని నొక్కి వక్కాణించటం.

ఈ ఉపనిషత్తులో చాలా ముఖ్యమైన ప్రత్యేకత గురువు శిష్యునికి మహావాక్య ఉపదేశం చేస్తే, 18–22 వరకూ శిష్యుడు తను అందుకున్న బోధను మహావాక్యరూపంలో చెబుతాడు. గురువు బోధను ఉపదేశరూపమహావాక్యం అంటే, శిష్యుడు వల్లించినదాన్ని అనుభవరూప మహావాక్యం అంటారు.

**మయ్యేవ సకలం జాతం** – 19

ఇది ఒక అద్భుతమైన మంత్రం. వేరే ఏ ఉపనిషత్తులోనూ ఇటువంటి మంత్రాన్ని చూడము. అంతేకాదు, వేరే ఏ ఉపనిషత్తును కూడా ఈ మంత్రాన్ని ఉటంకించందే బోధించలేము.

నేను కలలో ఉండగా అందులో ఒక జీవిని అనుకుంటాను. కాని కలనుంచి లేచాక నేను ఆ కలకు సృష్టి, స్థితి, లయకారకుణ్ణి అని తెలుసుకుంటాను. కాని కలలో ఉండగా చెప్పలేను. అలాగే ఈ జాగ్రత్‌ప్రపంచంలో ఉన్నంతసేపు అది నిజమనుకుంటాను. దాన్నుంచి శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా లేచాక, అది స్వప్నం 2 అని తెలుసుకుంటాను. నేను మహాజాగ్రత్ పురుషుణ్ణి అయితేనే ఈ జాగ్రత్‌ప్రపంచం నానుంచి పుట్టి, నావల్ల స్థితిపొంది, నాలో లయమయ్యే మహాస్వప్నం అని తెలుసుకుంటాను. ఈ జాగ్రత్‌ప్రపంచమనే మహాస్వప్నానికి నేనే సృష్టిస్థితిలయ కారకుడని చెప్పగలుగుతాను. నేను సృష్టికర్తను అని అహంకారపరంగా చెబితే అది తప్పు కాని సాక్షిపరంగా చెబితే అది గర్వం కాదు, అది జ్ఞానం. జీవాత్మగా చూస్తే నేను కార్యం, పరమాత్మగా చూస్తే నేను కారణం. నేను కారణబ్రహ్మను.

కారణబ్రహ్మను అయిన నేను ఎక్కడ ఉంటాను? ఉపాదానకారణంగా, జగత్తు అంతటా ఉంటాను. సగుణబ్రహ్మను, నిర్గుణబ్రహ్మను కూడా నేనే. నిర్గుణబ్రహ్మగా నాకు పుణ్యపాపాలు లేవు; నాకు శరీరం లేదు, మనస్సు లేదు, బుద్ధి లేదు. అంటే కార్యకరణసంఘాతమే లేదు. ఎప్పుడు పుట్టాను? నాకు జన్మే లేదు. పుట్టుక లేకపోతే మరణం ఎక్కణ్ణుంచి వస్తుంది? పునర్జన్మ ఎలా వస్తుంది?

**న భూమిరాపో న చ వహ్నిరస్తి। న చాఽనిలో మేఽస్తి న చాంబరం చ ॥** – పారమార్థిక స్థాయికి ఎదిగితే, ఉన్నదొకటే అద్వైతం. పంచభూతాలు కూడా లేవు. భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం లేవు. సృష్టి గురించి చెప్పినప్పుడు ఆకాశం వైపునుంచి చూశాము. పంచభూతాలు బ్రహ్మనుంచి వచ్చాయని చూశాము. ఇప్పుడు పారమార్థిక స్థాయికి ఎదిగితే, వ్యావహారికస్థాయి స్వప్నంగా తేలిపోతుంది. అన్నీ తిరస్కరిస్తూ బ్రహ్మను కూడా తిరస్కరించకూడదు. బ్రహ్మ జగత్తుకు అధిష్ఠానం. సత్యం లేకుండా మిథ్యకు విడిగా ఉనికి లేదు. ఆ బ్రహ్మను నేనే అని మర్చిపోకూడదు.

**అధ్యారోప అపవాదన్యాయం**

బ్రహ్మస్వరూపాన్ని అధ్యారోప అపవాదన్యాయం ద్వారా గురువు వివరించాడు.

**అధ్యారోపాపవాదాభ్యాం నిష్ప్రపంచం ప్రపంచ్యతే।**
**శిష్యాణాం సుఖబోధార్థం తత్త్వజ్ఞైః కల్పితక్రమః ॥**

క్రమః అంటే బోధనాపద్ధతి.

ఇదే పద్ధతిని జగత్తు, బ్రహ్మకు అన్వయించాలి.

1. ముందు జగత్తుని చూపిస్తాము. జగత్తు కార్యం అయింది.
2. జగత్తనే కార్యానికి బ్రహ్మ కారణం.

ఇది అధ్యారోపం.

3. బ్రహ్మలేకుండా జగత్తుకి విడిగా ఉనికి లేదు. బ్రహ్మ సత్యం, జగత్ మిథ్య. అందుకని జగత్తును కొట్టివేస్తాము.
4. జగత్తనే కార్యం లేకపోతే బ్రహ్మకు కారణత్వం లేదు.

ఇది అపవాదం.

అప్పుడు బ్రహ్మ కార్యకారణవిలక్షణం బ్రహ్మ అవుతాడు. ఈ విషయాన్నే వివేకచూడామణిలో చక్కగా వర్ణిస్తారు శంకరులవారు.

**ఏకమేవ సత్ అనేకకారణం కారణాంతరనిరాస కారణం ।**
**కార్యకారణవిలక్షణం స్వయం బ్రహ్మ తత్త్వమసి భావయాత్మని ॥**

బ్రహ్మను కార్యకారణ విలక్షణం అని చెప్పాక, 'ఆ బ్రహ్మవి నువ్వే', అంటుంది ఉపనిషత్తు. **ఐతదాత్మ్యమిదగ్ం సర్వం తత్సత్యగ్ం స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో.** ఆ కార్యకారణవిలక్షణ బ్రహ్మ ఎక్కడుంది? సాక్షి చైతన్యమైన నువ్వే అది.

చతుర్ముఖ బ్రహ్మ తన మహావాక్య ఉపదేశాన్ని ఇక్కడితో ముగిస్తున్నాడు. శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా ఈ బోధను జీర్ణించుకోవాలి. శ్రవణ, మననాలద్వారా నేను జీవిని కాను, నేను బ్రహ్మను అనే నిశ్చయజ్ఞానాన్ని పొందుతాను. నిదిధ్యాసనంలో పాతవాసనలు పోగొట్టుకుని మనస్సును కొత్త జ్ఞానంలో నిలబెట్టాలి. కొత్త జ్ఞానం + కొత్త దృక్పథం = జ్ఞాననిష్ఠ.

**ఏవం విదిత్వా** – ఈ ఆత్మజ్ఞానాన్ని శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా పొందాక; ఏమిటా జ్ఞానం ? కార్యకారణవిలక్షణ బ్రహ్మ అహమస్మి జ్ఞానం. నా స్వరూపం ఏమిటి?

**గుహాశయం** – మనస్సులో ఉన్నాను; ఆలోచనగా కాదు; ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును చూస్తున్నాను.

**నిష్కలం** – ఆకాశంలాగా నాకు భాగాలు లేవు, విభజనలు లేవు. అందువల్ల నేను నిర్గుణం, సర్వవ్యాపకం.

**అద్వితీయం** – ఉన్నది ఒకటే చైతన్యం. అందువల్ల నాకు భిన్నంగా ఇంకోటి లేదు.సాక్షి చైతన్యమైన నేనే అది.

అధ్యారోపంలో జగత్తు ఆ బ్రహ్మనుంచి వచ్చిందని వస్తుంది.

**ఏతస్మాజ్జాయతే** – 15

అపవాదంలో జగత్తును మిథ్యగా కొట్టివేస్తాము.

**న భూమిరాపో న చ వహ్నిరస్తి । న చాఽనిలో మేఽస్తి న చాంబరం చ ॥** – 23

అంతేకాదు **న పుణ్యపాపే మమ నాస్తి నాశో । న జన్మ దేహేంద్రియబుద్ధిరస్తి**

ఈ జ్ఞానం పొందితే కలిగే ఫలం – బ్రహ్మతో ఐక్యం అవుతాడు. అంటే బుద్ధిలో మార్పు కలుగుతుంది. మోక్షం పొందుతాడు అంటే జ్ఞానంవల్ల దృక్పథంలో మార్పు వస్తుందని అర్థం. దీనితో జ్ఞానఫలం కూడా అయిపోయింది. కైవల్యం గురించిన బోధ అయిపోయింది.

**5) ఉపసంహారం – మంత్రాలు 24, 25**

ఎవరికైనా ఈ జ్ఞానం అర్థం కాకపోతే, వారు అదనంగా శిక్షణ తీసుకోవాలి. అది కర్మ, ఉపాసన. అనేక కర్మలు, ఉపాసనలు ఉన్నాయి. వాటిలో ఒకటి **శాస్త్రపారాయణం.** కైవల్యోపనిషత్తు పారాయణం చేస్తే జ్ఞానయోగ్యతాప్రాప్తి వస్తుంది. కైవల్యోపనిషత్తు అర్థం చేసుకుంటే జ్ఞానం వస్తుంది.

లౌకికంగా కూడా చూడండి, ఎవరికైనా కంటి ఆపరేషను చేయాలంటే, డాక్టరు అతనికి జలుబు, దగ్గు లేకుండా, జ్వరం లేకుండా, బి.పి., షుగర్ నార్మల్ ఉండేలా చూసి అప్పుడు చేస్తాడు. అలాగే జ్ఞానాన్ని తేలికగా పొందలేకపోతే జ్ఞానయోగ్యతాప్రాప్తిని పెంపొందించుకుని రావాలి.

నిజానికి ఏ దేవునిమీద పారాయణం చేసినా ఫర్వాలేదు. కాని ఇక్కడ బ్రహ్మ శ్రీరుద్రమంత్రం గురించి ప్రత్యేకంగా చెప్పాడు.

**యశ్శతరుద్రీయమధీతే** – 25

శతరుద్రం అంటే రుద్రపారాయణం. అది చేస్తే ఈ కింది పాపాలు తొలిగిపోతాయి అంటున్నాడు బ్రహ్మ. అగ్నికి సంబంధించిన కర్మలు చేయని పాపం, సురాపానం చేసిన పాపం, బ్రహ్మహత్యాదోషం, విహితకర్మలు మానితే వచ్చే పాపం, నిషిద్ధకర్మలు చేస్తే వచ్చే పాపం. రుద్రపారాయణం చేసిన వ్యక్తి ఈశ్వరుని కృప పొందుతాడు. అంతేకాదు, రోజూ రుద్రపారాయణం చేస్తే మోక్షం పొందుతాడు.

**కైవల్యం పదమశ్నుతే – కైవల్యం పదమశ్నుత ఇతి**

అంటే ముందు చూసినట్టుగా ఇది సహకారీ సాధనగా పనిచేసి, సాక్షాత్ సాధనకు వెళ్ళి, జ్ఞానం పొంది మోక్షం పొందటానికి తోడ్పడుతుంది. అంటే జీవించి ఉండగా జీవన్ముక్తి, మరణించాక విదేహముక్తి పొందుతాడు.

**శాంతిపాఠం**

**ఓం భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః । భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః ।**
**స్థిరైరంగైస్తుష్టువాగ్ంసస్తనూభిః । వ్యశేమ దేవహితం యదాయుః ।**
**స్వస్తి న ఇన్ద్రో వృద్ధశ్రవాః । స్వస్తి నః పూషా విశ్వవేదాః ।**
**స్వస్తి నస్తార్క్ష్యో అరిష్టనేమిః । స్వస్తి నో బృహస్పతిర్దధాతు ॥**
**ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

# ఏకాదశ ఉపనిషత్తుల సారం

## తైత్తిరీయోపనిషత్- వల్లీ 1

ఇప్పుడు మనం శంకరాచార్యులవారు భాష్యం రాసిన పది ఉపనిషత్తులలో ఇంకొక ఉపనిషత్తు చూద్దాము. దాని పేరు తైత్తిరీయోపనిషత్తు.

**ఉపనిషత్తు వివరాలు** – తైత్తిరీయోపనిషత్తులో మొత్తం మూడు అధ్యాయాలు ఉన్నాయి. వాటిని ఇందులో వల్లీలు అంటారు. ఆ వల్లీల పేర్లు – శీక్షావల్లీ, బ్రహ్మానందవల్లీ, భృగువల్లీ. ఈ ఉపనిషత్తు అటు కర్మకాండలోనూ, యజ్ఞయాగాదులలోనూ, ఇటు జ్ఞానకాండలోనూ ప్రసిద్ధి చెందింది. కర్మకాండలో ఎందుకంటే ఇప్పటికీ తైత్తిరీయోపనిషత్తును పారాయణం చేస్తారు. అంతేకాదు ఆలయాల్లో భగవంతునికి అభిషేకం చేసేటప్పుడు, ఈ ఉపనిషత్తును పఠిస్తారు. దీనికి స్వరాలు అందుబాటులో ఉన్నాయి. జ్ఞానకాండలో కూడా ఇది దాని లోతైన వేదాంతబోధకోసం ప్రసిద్ధి చెందింది. శంకరాచార్యులవారు పది ఉపనిషత్తులకు భాష్యం రాశారని చూశాము. వాటిలో తైత్తిరీయోపనిషత్తు భాష్యం, బృహదారణ్యకోపనిషత్తు భాష్యం చాలా ప్రత్యేకంగా ఉంటాయి. ఈ ఉపనిషత్తు గద్యరూపంలో ఉంటుంది. గద్యంలో వచ్చే పేరాలను అనువాకాలు అంటారు.

**శాంతిపాఠం** – ఒక్కొక్క వేదానికి ఒక్కొక్క శాంతిపాఠం ఉంటుంది. ఆ వేదానికి చెందిన ఉపనిషత్తుల ముందు ఆ శాంతిపాఠాన్ని పఠిస్తాము. తైత్తిరీయోపనిషత్తు కృష్ణయజుర్వేదానికి చెందినది. మనము నాలుగు వేదాలు ఉన్నాయని చూశాము. అవి ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణవేదం. యజుర్వేదం ఒక్కదానికే ప్రత్యేకించి రెండు శాఖలు ఉన్నాయి. వాటిని కృష్ణయజుర్వేదం అనీ, శుక్లయజుర్వేదం అనీ అంటారు. తైత్తిరీయోపనిషత్తు, కఠోపనిషత్తు కృష్ణయజుర్వేదానికి చెందితే, ఈశావాస్యోపనిషత్తు, బృహదారణ్యకోపనిషత్తు శుక్లయజుర్వేదానికి చెందినవి.

ఈ వేదానికి శాంతిపాఠం –

**సహ నావవతు సహ నౌ భునక్తు సహ వీర్యం కరవావహై।**
**తేజస్వి నావధీతమస్తు మా విద్విషావహై॥**
**ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

కాకపోతే ఈ ఉపనిషత్తు ప్రత్యేకత ఒక్కొక్క వల్లీకీ మొదట్లో వేరే శాంతిపాఠాలు ఉంటాయి.

శీక్షావల్లీలో **ఓం శం నో మిత్రః శం వరుణః। శం నో భవత్వర్యమా। శం న ఇంద్రో బృహస్పతిః। శం నో విష్ణురురుక్రమః। నమో బ్రహ్మణే। నమస్తే వాయో। త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి। త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మ వదిష్యామి। ఋతం వదిష్యామి। సత్యం వదిష్యామి। తన్మామవతు। తద్వక్తారమవతు। అవతు మామ్। అవతు వక్తారమ్। ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః॥** చూస్తాము. ఈ శాంతిపాఠం మొదటి అనువాకంలోను, 12వ అనువాకంలోను వస్తుంది చిన్నచిన్న మార్పులతో. మొదటి శాంతిపాఠం విఘ్నాలు లేకుండా చేయమని కోరితే, చివర్లో వచ్చిన శాంతిపాఠం విఘ్నాలు లేకుండా చేసినందుకు, ఉపనిషత్తు బోధ నిర్విఘ్నంగా సాగినందుకు కృతజ్ఞతలు తెలుపుతుంది. మొదటిదాన్ని పూర్వశాంతిపాఠం అంటే, చివరిదాన్ని ఉత్తరశాంతిపాఠం అంటారు.

ఈ శాంతిపాఠంలో శిష్యుడు రెండు అంశాలను కోరుతున్నాడు. అవి సర్వకరణయోగ్యత, సర్వప్రతిబంధనివృత్తి.

**సర్వకరణయోగ్యత** – జ్ఞానం పొందాలంటే అన్ని అంగాలు బాగుండాలి. శరీరం, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి ఆరోగ్యకరంగా, పదునుగా ఉండాలి. ఈ అంగాల్లో కొన్ని చురుకుగా పనిచేయాలి, కొన్ని కుదురుగా ఉండాలి. కళ్ళు, చెవులు చురుకుగా ఉండాలి. కాళ్ళు, చేతులు కుదురుగా ఉండాలి. ప్రతి ఒక్క అంగానికీ ఒక అధిష్ఠానదేవత ఉంటుంది. ఉదాహరణకు కన్నుకు సూర్యుడు, మనస్సుకు చంద్రుడు అధిష్ఠానదేవతలు. ఈ దేవతలకు ఆ యా అంగాలను స్థిరంగా ఉంచమని ప్రార్థన చేస్తున్నాడు.

**సర్వప్రతిబంధ నివృత్తి** – జ్ఞానబోధలో ఉన్నంతసేపూ ఏ విధమైన ఆటంకాలూ కలుగకూడదని చేస్తున్నాడు. అవి అధ్యాత్మికం, అధిభౌతికం, అధిదైవికం. దానికోసం ప్రాణానికి అధిష్ఠానదేవత మిత్రదేవతను, వరుణదేవతను, కళ్ళకు అధిష్ఠానదేవత సూర్యునికి, చేతులకు అధిష్ఠాన దేవత ఇంద్రునికి, బుద్ధికి అధిష్ఠానదేవత బృహస్పతికి, పాదాలకు అధిష్ఠానదేవత విష్ణుమూర్తికి చేయటమే కాక, అధిష్ఠానదేవతలందరికీ అధిష్ఠానదేవత అయిన హిరణ్యగర్భకు కూడా ప్రార్థన చేస్తున్నాడు. హిరణ్యగర్భ సమష్టి సూక్ష్మప్రపంచ అధిష్ఠానదేవత.

ఆ హిరణ్యగర్భుడే వాయురూపంలో ప్రత్యక్షదైవంగా ఉన్నాడు. నేను జ్ఞానం పొంది, దాన్ని ఆచరణలో పెట్టేలా చేయి. మా గురువు కూడా ఆరోగ్యకరంగా ఉండుగాక. నన్ను, నా గురువును రక్షించు అని ప్రార్థన అర్థం.

ముందే చూసినట్టుగా 12వ అనువాకంలో తన ఆరోగ్యం కాపాడి, ప్రతిబంధనివృత్తి చేసిన హిరణ్యగర్భకు, తక్కిన దేవతలకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాడు.

**తైత్తిరీయోపనిషత్తుకు ఆ పేరు ఎలా వచ్చింది?**

దీనికి రెండు కారణాలు చెప్పవచ్చు. అవి –

1. తిత్తిరి పేరు ఉన్న ఒక ఋషి ఉన్నాడు. యజుర్వేదపరంపరలోని ఋషులలో ఆయన ఒకరు. ఆ ఋషినుంచి ఈ ఉపనిషత్తు వచ్చింది కాబట్టి దీన్ని తైత్తిరీయోపనిషత్తు అంటారు. ఇది తేలికైన, ప్రత్యక్ష కారణం ఈ పేరు రావటానికి.

2. ఇంకొక కారణానికి ఒక కథ చెబుతారు. ఆ కథను అక్షరాలా తీసుకోకుండా, అందులో ఉన్న సారాన్ని తీసుకోవాలి.

వైశంపాయనుడు అనే గురువుకు అనేక శిష్యులు ఉన్నారు. వారిలో యాజ్ఞవల్క్యుడు తక్కిన శిష్యులకన్నా విద్యలో బాగా ఆరితేరినవాడు. ఆ విద్యాగర్వంతో యాజ్ఞవల్క్యుడు ఒకసారి తోటి శిష్యులను కించపరుస్తూ ఏదో అన్నాడు. గురువు అతని గర్వం అణచటానికి, 'నానుంచి నేర్చుకున్న విద్యవల్ల నీకు ఈ గర్వం వచ్చింది కాబట్టి, ఈ విద్యను వదులుకో,' అన్నాడు. అలాగే శిష్యుడు దాన్ని వమనం చేశాడు. ఆ వమనం చేసినదాన్ని తిత్తిరి పేరిట ఉన్న పక్షులు స్వీకరించాయి. తిత్తిరి పక్షులు స్వీకరించాయి కాబట్టి తైత్తిరీయ ఉపనిషత్తు అంటారు. ఇలా వమనం చేయబడింది కనుక ఈ యజుర్వేదం కృష్ణయజుర్వేదం అయింది. తరువాత, యాజ్ఞవల్క్యుడు మళ్ళీ సూర్యభగవానునినుంచి నేర్చుకుంటాడు. దాన్ని శుక్లయజుర్వేదం అంటారు.

ఇందులో ఉన్న మూడు వల్లీలకు మూడు పేర్లు ఉన్నాయి. ఆయా వల్లీల్లో మొదలయ్యే మొదటిపదంవల్ల వచ్చింది.

1. శీక్షాం వ్యాఖ్యాస్యామః – అందువల్ల మొదటి వల్లీ – శీక్షావల్లీ
2. బ్రహ్మవిదాప్నోతి పరమ్ – అందువల్ల రెండవ వల్లీ – బ్రహ్మానందవల్లీ
3. భృగుర్వై వారుణిః – అందువల్ల మూడవ వల్లీ – భృగువల్లీ

ఈ నేపథ్యంతో శీక్షావల్లీని చూద్దాము.

## శీక్షావల్లీ

ఈ శీక్షావల్లీలో 12 అనువాకాలు ఉన్నాయి. ఈ ఉపనిషత్తు గద్యంలో ఉంది. గద్యంలో ఉండే పేరాగ్రాఫ్‌లను చిన్నవైనా, పెద్దవైనా అనువాకాలు అంటారు.

తైత్తిరీయోపనిషత్తులోని శీక్షావల్లీలో బ్రహ్మవిద్య గురించి రాదు. అది చాలా అద్భుతంగా రెండవ అధ్యాయంలో వస్తుంది. మరయితే దేని గురించి వస్తుంది? **శీక్షావల్లీ** జ్ఞానయోగ్యత

పెంపొందించు కోవటానికి తోడ్పడుతుంది. మనస్సును సంస్కరించుకోవటానికి, చిత్తశుద్ధిని పెంపొందించు కోవటానికి తోడ్పడుతుంది. 1, 12 అనువాకాలు శాంతిపాఠం అని చూశాము.

2-11 అనువాకాల్లో రెండు అంశాలు ఉన్నాయి. అవి కర్మయోగ సాధన, ఉపాసనయోగ సాధన. కర్మయోగం చిత్తశుద్ధిని కలుగజేస్తే, ఉపాసనయోగం చిత్తనిశ్చలత్వాన్ని, చిత్తఏకాగ్రతను ఇస్తుంది.

**కర్మయోగ సాధన** – ఈ కర్మయోగ సాధనను ప్రధానంగా 5 అంశాలుగా విభజించవచ్చు. వాటిని మనం పరిశీలించటానికి వీలుగా, వాటి వరుసక్రమాన్ని మార్చుకుంటున్నాము.

1) **పంచమహాయజ్ఞాలు – అనువాకం 9**

కర్మయోగి పంచమహాయజ్ఞాలను చేయాలి. అవి –

**దైవయజ్ఞం** – భగవంతునికి చేసే నిత్యపూజలు. **అగ్నిహోత్రం చ** పదాలు దీన్ని సూచిస్తుంది.

**పితృయజ్ఞం** – పితృదేవతలకు వారు జీవించి ఉండగా వారికి సేవ చేయటం, మరణించిన పితృదేవతలకు శ్రాద్ధకర్మలు పెట్టటం, తర్పణాలు వదలటం.

**ప్రజా చ ప్రజనశ్చ ప్రజాతిశ్చ** పదాలు దీన్ని సూచిస్తాయి.

**ఋషియజ్ఞం** – ఋషులు తాము విని మనకు అందించిన శాస్త్రాన్ని మనం అధ్యయనం చేసి, ముందు తరాలకు కూడా అందేలా చేయాలి.

**స్వాధ్యాయ ప్రవచనే చ** దీన్ని సూచిస్తుంది. ఈ అనువాకంలో ఈ పదాలను ప్రతి ఒక్కదానితోనూ కలిపి చెబుతుంది. దీని అర్థం ఇది చాలా ముఖ్యమైనదని.

**మనుష్యయజ్ఞం** – తోటి మనుష్యులకు సేవ చేయటం.

**అతిథయశ్చ మానుషమ్ చ** పదాలు సూచిస్తాయి.

**భూతయజ్ఞం** – మూగజీవాలైన పశుపక్ష్యాదులను రక్షించటం; చెట్లుచేమలను కాపాడటం. ఇందులో దీన్ని పేర్కొనలేదు, కాని మనం ఉపలక్షణం కింద కలుపుకోవచ్చు.

అందరూ ఐదు యజ్ఞాలూ చేసితీరాలి. వీటిని సాత్త్వికకర్మలనీ, ఉత్తమకర్మలనీ, నిష్కామకర్మలనీ, నిత్యనైమిత్తిక కర్మలనీ అంటారు.

ఈ సందర్భంలో ఉపనిషత్తు ఒక పరిశోధన జరిపి, తద్వారా ఒక సాధనను కీర్తిస్తున్నది. ఇంతవరకూ చూసిన యజ్ఞాలలో బ్రహ్మయజ్ఞం అత్యంత శ్రేష్ఠమైనదని చెబుతున్నది. దాన్ని

స్వాధ్యాయ ప్రవచనే చ పదంలో చూశాము. అంటే శాస్త్రాన్ని అధ్యయనం చేయటం, అధ్యాపనం చేయటం. అలా శాస్త్రం ఒక్కో సందర్భంలో ఒక్కో విలువకు పెద్దపీట వేస్తుంది. ఒక విలువను మెచ్చుకోవటానికి, తక్కిన వాటిని కించపరచినట్టుగా కనిపిస్తుంది కాని, నిజానికి శాస్త్రం ఉద్దేశ్యం అదికాదు. దాన్ని **న హి నిందా న్యాయం** అంటారు. ముండకంలో సత్యాన్ని, ఈ ఉపనిషత్తులోనే భృగువల్లీలో తపస్సును మెచ్చుకుంది.

ఇక్కడ ఉపనిషత్తు ఈ సాధనల గురించి ముగ్గురు ఋషుల అభిప్రాయాలను పేర్కొని, చివర్లో తన నిర్ణయాన్ని ప్రకటిస్తుంది. రాథీతర ఋషి సత్యాన్ని ప్రధానంగా అనుష్ఠించాలి అన్నాడు. ఆ ఋషి సత్యాన్నే పలుకుతాడు కాబట్టి అతనికి సత్యవచః అనే బిరుదు వచ్చింది. పౌరుశిష్టి అనే ఋషి తపస్సునే ప్రధానంగా చేయాలని బోధించాడు. ఆయన తపస్సును అనుష్ఠానం చేశాడు కాబట్టి, ఆ ఋషిని తపోనిత్యః అనికూడా అంటారు. మౌద్గల్యఋషి స్వాధ్యాయ ప్రవచనం ఉత్తమసాధన అన్నాడు.

**తద్ధి తపః తద్ధి తపః** – తత్ హి తపః – తత్ అంటే మూడవది. అంటే స్వాధ్యాయ ప్రవచనం. మూడవదైన ఈ స్వాధ్యాయ ప్రవచనమే ఉత్తమమైన సాధన లేదా శ్రేష్ఠమైన తపస్సు అని రెండుసార్లు చెప్పటం ద్వారా దీన్ని నొక్కివక్కాణిస్తున్నది.

2) **ఆవహంతీ హోమం – అనువాకం 4** – దీన్ని కర్మయోగంలో హోమసాధనగా తీసుకోవచ్చు. ఇందులో పదేపదే వచ్చే స్వాహా పదం ఇది హోమసాధన అని సూచిస్తున్నది. ఈ రోజుల్లో కూడా ఈ ఆవహంతీ హోమం చేస్తారు. దీని ద్వారా సాధకుడు నాలుగు అంశాలను కోరుతున్నాడు. అవి ధనప్రాప్తి, చిత్తశుద్ధిప్రాప్తి, జ్ఞానప్రాప్తి, శిష్యప్రాప్తి.

**ధనప్రాప్తి** – ధర్మశాస్త్రాన్ని ఆపోశన పట్టాక, ధనం సంపాదించాలని కోరుతున్నాడు సాధకుడు. ఆవహంతీ చిన్వానా – ధనం సంపాదించి, దాన్ని విస్తరింపజేయాలి అంటున్నాడు. ఈ హోమం ద్వారా సాధకుడు అనేక వస్త్రాలను, గోవులను, ఉన్నిదుస్తులను, అన్నపానీయాలను తీసుకుని లక్ష్మీదేవి వెంటనే రావాలనీ, అవి పదికాలాలు నిలవాలనీ కోరుతున్నాడు. దీన్నిబట్టి శాస్త్రం ఎన్నడూ ధనసంపాదనను కించపరచదనీ, అలా కించపరిస్తే సాక్షాత్తూ లక్ష్మీదేవినే విమర్శించినట్టు అవుతుందనీ అర్థమవుతుంది. ధనం ధర్మార్థం అంటుంది శాస్త్రం.

**చిత్తశుద్ధిప్రాప్తి**– సాధకుడు చిత్తశుద్ధి కలగాలని కోరుకుంటున్నాడు. ధనం సంపాదించి, పంచమహాయజ్ఞాలు చేసి ధర్మబద్ధంగా నడిస్తే, చిత్తశుద్ధి పొందుతాడు.

**జ్ఞానప్రాప్తి** – చిత్తశుద్ధి పొందాక జ్ఞానం పొందాలని కోరుకుంటున్నాడు. చిత్తశుద్ధి జ్ఞానాన్ని ఇవ్వదు. దానికి సమర్థుడైన గురువు దొరకాలి. అందువల్ల జ్ఞానప్రాప్తిని కోరుతున్నాడు.

నేను నీలో ప్రవేశించుగాక, నువ్వు నాలో ప్రవేశించుగాక. అంటే జీవ ఈశ్వర ఐక్యం కోరుతున్నాడు.

**శిష్యప్రాప్తి** – తను ఇంకా శిష్యుడే. జ్ఞానం పొందలేదు. కాని తను జ్ఞానం పొందాక, తను పొందిన జ్ఞానాన్ని నలుగురికీ పంచితేనే తన జన్మ ధన్యమైనట్టు అర్థం. అందుకని ముందు ముందు తను గురువయ్యాక శిష్యులు అధికసంఖ్యలో రావాలని కోరుకుంటున్నాడు.

**విమాయంతు బ్రహ్మచారిణః స్వాహా** – వివిధ విషయాలమీద ఆసక్తి ఉన్నవారు
**ప్రమాయంతు బ్రహ్మచారిణః స్వాహా** – ప్రజ్ఞావంతులు
**దమాయంతు బ్రహ్మచారిణః స్వాహా** – ఇంద్రియ నిగ్రహం ఉన్నవారు
**శమాయంతు బ్రహ్మచారిణః స్వాహా** – మనోనిగ్రహం ఉన్నవారు

శిష్యులుగా రావాలని కోరుతున్నాడు. అంతేకాదు, తను బాగా కీర్తి పొందాలని కూడా కోరుతున్నాడు. అందులో మళ్ళీ స్వార్థం లేదు. అతని కీర్తి దిక్‌దిగంతాలకు వ్యాపిస్తేనే, అతనికి అన్ని మూలలనుంచీ విద్యార్థులు వస్తారు.

**సర్వతః** – అన్ని దిక్కులనుంచి.
**బ్రహ్మచారిణః మామ్ ఆయంతు** – శిష్యులు నా దగ్గరకు వచ్చుగాక.

ఆ విద్యార్థి ఏ ఆశ్రమానికి చెందినవాడైనా, ఏ వర్ణానికి చెందినవాడైనా ఫర్వాలేదు అనుకున్నాడు శిష్యుడు. అందువల్ల ఎవరు కావాలో ఆ విషయం ప్రత్యేకించి చెప్పటం లేదు. నేర్చుకోవాలనే తపన ఉంటే చాలు, ఎవరైనా ఫర్వాలేదు.

**ధాతః** – ఓ భగవంతుడా! ఈశ్వరుణ్ణి ఇక్కడ ధాతః అంటున్నాడు. ఎందుకంటే భగవంతుడు కర్మఫలదాత. ఏ జీవికి ఎప్పుడు, ఎక్కడ, ఎటువంటి కర్మఫలాన్ని ప్రసాదించాలో అలా ఆ జీవికి అప్పుడు, అక్కడ, అతనికి తగ్గ కర్మఫలాన్ని ప్రసాదిస్తాడు. ఇక్కడ ఈశ్వరుడు అంటే ఓంకారరూప పరమేశ్వరుడు అని మర్చిపోకూడదు.

ఈ సాధకుడు చాలా సుదీర్ఘ ప్రయాణమే చేయాల్సివుంది. అతను డబ్బు సంపాదించాలి; కర్మయోగం పాటించి చిత్తశుద్ధి పొందాలి; చిత్తశుద్ధి పొంది జ్ఞానయోగ్యత పొందాక, తనకు శాస్త్రాన్ని బోధించే శ్రోత్రియబ్రహ్మనిష్ఠుడైన గురువు దొరకాలి; ఆ గురువు దగ్గర తను శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలి. ఇంత సుదీర్ఘమైన ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులు, ఆటంకాలు ఎదురయ్యే ప్రమాదం ఉంది. అందువల్ల తన అంతిమలక్ష్యం చేరుకోగలనో లేదో అనే భయం తొంగి చూస్తోంది. అందువల్ల భగవంతుణ్ణి ఒక వసతిగృహంతో పోలుస్తున్నాడు. దీర్ఘ ప్రయాణం చేసేవారు త్రోవలో వసతిగృహాల్లో సేదదీరినట్టుగా, అతను

భగవంతుడనే వసతిగృహంలో సేదదీరుతానంటున్నాడు. ఈ జీవనయానంలో మనస్సు అదుపు తప్పినా, బుద్ధి బలహీనమైనా, నిలదొక్కుకునే శక్తిని పొందుతాడు భగవంతుణ్ణుంచి. అప్పుడు మనస్సుపరంగా, బుద్ధిపరంగా మళ్ళీ శక్తిని పుంజుకుని, రెట్టించిన ఉత్సాహంతో ముందుకు సాగగలుగుతాడు.

**ప్రతివేశః అసి** – నువ్వు వసతిగృహంలాగా ఉన్నావు. దీన్ని మనకు సూచనగా తీసుకోవచ్చు. మనం కూడా ఈ జ్ఞానమార్గానికి వచ్చి, జ్ఞానం పొందటానికి చేసే ప్రయత్నంలో ఉత్సాహం సన్నగిల్లినా, బుద్ధి మందగించినా, మనం భక్తిలో మునిగితే, అది మనను ముందుకు తోస్తుంది. ఏ విషయంలోనైనా విజయం సాధించాలంటే పురుషప్రయత్నం ఉండాలి నిజమే, కాని అదొక్కటే చాలదు, దైవకృప కూడా దానికి తోడవ్వాలి.

పురుషప్రయత్నం ఎంత ఉత్సాహంతో చేసినా, త్రోవలో ఎదురయ్యే ఆటంకాలవల్లనో, మనలో పేరుకుపోయిన రాగద్వేషాలవల్లనో, మన ప్రమేయం లేకుండానే ప్రతికూల ఆలోచనలు దూసుకువచ్చేస్తాయి. చిన్న అవకాశం దొరికితే చాలు కోపం, ఈర్ష్య, ఆందోళన మేమున్నామంటూ వచ్చేస్తాయి. ఎప్పుడైతే అవి ముందుకు వస్తాయో అప్పుడే అవి మన విచక్షణాశక్తిని, మన బుద్ధిబలాన్ని కప్పివేస్తాయి. మనను నిరాశానిస్పృహలలో ముంచెత్తివేస్తాయి.

### 3) జ్ఞానయోగసాధన – జపసాధన – అనువాకం 4

జపం అంటే ఆవృత్తి. ఏదైనా ఒక మంత్రాన్ని తీసుకుని దాన్ని పదేపదే పఠించటం. ఇక్కడ ప్రతీకగా ఓంకారం తీసుకోబడింది. ఓంకారరూప ఈశ్వరధ్యానం చేస్తాడు సాధకుడు. ఈ ప్రార్థనవల్ల కలిగే ఫలం జ్ఞానయోగ్యతాప్రాప్తి. ఈ ప్రార్థన చేయటానికి శరీరం, వాక్కు, మనస్సు, బుద్ధి ఆరోగ్యకరంగా ఉండాలి.

**శరీరం** – శరీరం ఆరోగ్యకరంగా లేకపోతే, విద్యను అభ్యసించటానికి ఒక గంట కూడా కుదురుగా కూర్చోలేరు.

**వాక్కు** – ఉపనిషత్తుల్లోని బోధ గురుశిష్యుల సంవాదరూపంలో ఉంటుంది. శిష్యుడు ప్రశ్న అర్థమయ్యేలాగా స్పష్టంగా వేయాలి; గురువు కూడా అంత స్పష్టంగానూ బోధ చేయాలి. అందువల్ల ఇద్దరికీ వాక్కుయొక్క శక్తి బాగుండాలి.

**మనస్సు** – భావోద్రేకాలతో నిండిన మనస్సు ప్రశాంతంగా ఉండదు. అలా ప్రశాంతంగా లేని మనస్సు బోధను సరిగ్గా స్వీకరించలేదు.

**బుద్ధి** – బుద్ధి చాలా పదునుగా ఉండాలి. క్షురకుని కత్తి అంచులాగా పదునుగా ఉండాలి. పొందిన జ్ఞానాన్ని అర్థం చేసుకోవాలి. దాన్ని గ్రహణ, ధారణశక్తి అంటారు. అర్థం చేసుకున్న

జ్ఞానాన్ని బుద్ధిలో నిలుపుకోవాలి. దాన్ని ధారణశక్తి అంటారు. గ్రహణధారణ శక్తిని కలిపి మేధాశక్తి అంటారు. అది కోరుతున్నాడు శిష్యుడు

**ఓంకార విచారణద్వారా బ్రహ్మ ప్రాప్తుం శక్యతే**

ఓంకార విచారణద్వారా బ్రహ్మను తెలుసుకోగలం కాబట్టి, ఓంకారాన్ని, బ్రహ్మను రక్షించే కోశంగా వర్ణిస్తున్నాడు.

మాండూక్యోపనిషత్తులో ఈ ఓంకార విచారణ బాగా వస్తుంది. ఓంకారంలోని నాలుగు మంత్రాలను, ఆత్మయొక్క నాలుగు పాదాలను తీసుకుని, ఓంకారంద్వారా తురీయబ్రహ్మను ఎలా అర్థం చేసుకోవచ్చో చాలా వివరంగా వస్తుంది.

**శ్రుతం మే గోపాయ** – ఓ ఓంకారరూప పరమేశ్వరా! నేను వేదాంత శ్రవణంద్వారా విన్నదంతా నా మనస్సులో నిక్షిప్తమై ఉండేలా చేయి. శ్రుతం అంటే వేదాంత శ్రవణం; గోపాయ అంటే నా మనస్సులో నిక్షిప్తమై ఉండేలా చేయి. గురుకులంలో విద్యనభ్యసిస్తే, ఆ బోధ ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా జరుగుతుంది. కాని ఇప్పుడు లౌకిక విజయాలలో కూరుకుపోయి, మధ్యమధ్యలో వేదాంత శ్రవణం చేస్తే అది మర్చిపోయే ప్రమాదముంది. ముందు క్లాసులో విన్నది తర్వాత వచ్చే క్లాసులో మర్చిపోవచ్చు. అందువల్ల నేను నేర్చుకున్న విద్యను మర్చిపోకుండా ఉండేలా చేయమని ప్రార్థన చేస్తున్నాడు శిష్యుడు.

**4) జ్ఞానసాధన – జపసాధన – అనువాకం 10**

తీవ్రముముక్షుత్వం ఉన్న సాధకునికి ఇక్కడ ఉపనిషత్తు జ్ఞానప్రాప్తికి తోడ్పడే మంత్రాన్ని ఇస్తున్నది. నాలుగవ అనువాకంలో జ్ఞానయోగ్యతాప్రాప్తికి మంత్రాన్ని ఇస్తే, ఇక్కడ జ్ఞానప్రాప్తికి మంత్రాన్ని ఇస్తున్నది. ఇది కూడా త్రిశంకుడనే ఋషి చేసిన ప్రార్థన ద్వారా చెబుతున్నది.

కేవలం ఈ జపం చేస్తే జ్ఞానం పొందదు. కాని జ్ఞానప్రాప్తికి కావాల్సిన అంశాలను తేలికగా పొందుతాడు. అంటే భగవంతుడే అన్ని ఏర్పాట్లు చూసుకుంటాడు. శాస్త్రశ్రవణం చేయటానికి అనుకూల పరిస్థితులను ఏర్పరుస్తాడు; అనువైన సమయాన్ని చూస్తాడు. శ్రవణప్రాప్తి పొందటానికి గురుప్రాప్తి కలిగేలా చేస్తాడు; సాధన చతుష్టయ సంపత్తి అవసరమైతే, దాన్ని పొందటానికి అనుకూల వాతావరణాన్ని ఏర్పాటుచేస్తాడు. ఈ ముముక్షువుకు లౌకికంగా ఎన్ని ఆస్తులు ఉన్నా, ఆత్మజ్ఞానం ముందు ఇవన్నీ దిగదుడుపే అని తెలుసు. ఎందుకంటే ఆత్మజ్ఞానంవల్లనే శాంతి, భద్రత, ఆనందాలను పొందగలడని తెలుసు. ఈ మంత్రాన్ని త్రిశంకు ఋషి తను జ్ఞానం పొందాక చెప్పాడు. ఈ మంత్రాన్ని మనం జ్ఞానం పొందకముందే పఠిస్తే, జ్ఞానం పొందాక బ్రహ్మతో ఐక్యాన్ని త్రిశంకు ఋషి చెప్పినంత తేలికగా ముందుముందు మనం కూడా చెప్పగలుగుతాము.

త్రిశంకుని ప్రార్థన చూద్దాము.

**అహం వృక్షస్య రేరివా। కీర్తిః పృష్ఠం గిరేరివ। ఊర్ధ్వపవిత్రో వాజినీవ స్వమృతమస్మి। ద్రవిణగ్ం సవర్చసమ్। సుమేధా అమృతోఽక్షితః। ఇతి త్రిశంకోర్వేదానువచనమ్॥**

**అహం రేరివా** – నేను ప్రేరకుడను, నేను శక్తిప్రదాతను

**వృక్షస్య** – ఇక్కడ వృక్షం అంటే సంసారవృక్షం. నేను చైతన్యప్రదాతను, నేను విశ్వాధారాన్ని.

**కీర్తిః** – కీర్తి అంటే పేరు ప్రతిష్ఠలు. త్రిశంకు ఆ భగవంతుడు నేనే అని జ్ఞానయోగం ద్వారా అర్థం చేసుకున్నాడు కాబట్టి, జగత్తులో ఉన్న కీర్తి అంతా నాకే చెందుతుంది అంటున్నాడు.

**గిరేః పృష్టమ్ ఇవ** – నా ఖ్యాతి పర్వతశిఖరమంత ఎత్తైనది.

**ఊర్ధ్వపవిత్రః (అహమస్మి)** – పవిత్రమైన వారిలో పవిత్రమైనవాడిని నేను. జ్ఞానంవల్ల అత్యంతశుద్ధి పొందాను.

**స్వమృతమస్మి** – నేను అమృతాన్ని అంటే నేను శాశ్వతం.

**వాజినీ ఇవ** – వాజినీ ఇవ – సూర్యుని వంటివాడిని. సూర్యుడు అన్నప్రదాత కాబట్టి, సూర్యభగవానుణ్ణి వాజినీ అంటారు. నేను కూడా సూర్యునిలాగా నిత్యప్రకాశకుణ్ణి అంటున్నాడు త్రిశంకు ఋషి.

**ద్రవిణగ్ం** – ద్రవిణం అంటే ఐశ్వర్యం. అతను పొందిన సంపద ఏమిటి?

**సవర్చసమ్** – కాంతివంతమైన ఆత్మజ్ఞానం. జ్ఞానాన్ని కాంతితో ఎందుకు పోలుస్తారంటే, అది అజ్ఞానమనే చీకటిని పారద్రోలుతుంది కాబట్టి.

**సుమేధా** – నేను సర్వజ్ఞుడైన బ్రహ్మను. నేను అన్ని మనస్సుల ద్వారా అన్నీ తెలుసుకుంటాను.

**అమృతోఽక్షితః** – అమృతం అంటే శాశ్వతం; అక్షితః అంటే నాశనం లేనిది. నేను శాశ్వతమైన జ్ఞానంలో మునిగాను. ఈ మంత్రం సారాంశం నేన బ్రహ్మను, అహం బ్రహ్మ అస్మి.

**ఇతి త్రిశంకోర్వేదాను వచనమ్** – దీన్ని త్రిశంకు ఋషి తను జ్ఞానం పొందాక చెప్పాడు.

5) **సదాచారం – అనువాకం 9** – కర్మయోగంలో ఒక భాగం విలువలను పెంపొందించుకోవటం. దైవీసంపత్తి పేరిట కృష్ణపరమాత్మ భగవద్గీత 16వ అధ్యాయంలో వాటిని పేర్కొన్నాడు. వాటిని సద్గుణాలు అంటారు. ఇక్కడ శీక్షావల్లీలో వాటిలో కొన్నింటిని చూస్తాము.

**ఋతం** – ఋతం అంటే యథాశాస్త్రం జ్ఞానమ్. అంటే శాస్త్రంనుంచి పొందిన జ్ఞానం. శాస్త్రాన్ని అధ్యయనం చేస్తే మన అంతిమలక్ష్యం ఏమిటో తెలుస్తుంది. ఎంతసేపూ అర్థకామాల వెంట పరుగులు తీస్తున్నాము మనం. శాస్త్రం మనిషికి అంతిమలక్ష్యం మోక్షం అని బోధిస్తుంది.

**సత్యం** – సత్యం అంటే శాస్త్రంనుంచి పొందిన జ్ఞానాన్ని ఆచరణలో పెట్టటం. ఋతం పదానికీ, సత్యం పదానికీ మధ్య చిన్న భేదం ఉంది. ఋతం అంటే శాస్త్రంలో చెప్పినదాన్ని నేర్చుకోవటం; సత్యం అంటే ఆ నేర్చుకున్నదాన్ని ఆచరణలో పెట్టటం. యథాజ్ఞానమ్ అనుష్ఠానం. ఆచరణలో పెట్టని పుస్తకజ్ఞానం ఎంత ఉన్నా లాభం లేదు.

**తపః** – తపః అంటే తపస్సు, నిగ్రహం. ప్రయత్నపూర్వకంగా మన కరణాలను అదుపులో పెట్టుకోవటం. అవి జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, మనస్సు, బుద్ధి. అవి మన అధీనంలో ఉండాలి కాని వాటి అధీనంలో మనం ఉండకూడదు. అలాగని వాటిని బలవంతంగా అణగద్రొక్కకూడదు; అలా అణగద్రొక్కితే అది బాధకు దారితీస్తుంది. ఆ బాధను తీర్చుకోవటానికి అడ్డదార్లు తొక్కే ప్రమాదం ఉంది.

**దమం** – దమం అంటే ఇంద్రియనిగ్రహం. మనం నిత్యానిత్యవస్తువివేకం చేస్తే, దానంతట అదే వైరాగ్యం వస్తుంది. అప్పుడు ఇంద్రియాలను తేలికగా అదుపులో పెట్టగలుగుతాము. ఎవరో చెప్పారని చేస్తే, అది అణగద్రొక్కటం అవుతుంది. మనలో కామక్రోధాలను రేపే విషయవస్తువుల జోలికి పోకూడదు.

**శమం** – శమం అంటే మనోనిగ్రహం. మన ఆలోచనలే మన భవిష్యత్తును నిర్ణయిస్తాయని గమనించము. మన ఆలోచనలు ఎవరికీ కనిపించవు కాబట్టి ఎటువంటి ఆలోచనలు వచ్చినా పట్టించుకోము. కాని మన ప్రమేయం లేకుండా, మనస్సులో తీవ్రంగా ఉన్న ఆలోచనలు వద్దనుకున్నా బయటకు మాటల రూపంలో దూసుకు వచ్చేస్తాయి. అందువల్ల మనస్సును అదుపులో పెట్టుకోవాలి.

**ఋతం చ స్వాధ్యాయప్రవచనే చ ।**
**సత్యం చ స్వాధ్యాయప్రవచనే చ ।**
**తపశ్చ స్వాధ్యాయప్రవచనే చ ।**
**దమశ్చ స్వాధ్యాయప్రవచనే చ ।**
**శమశ్చ స్వాధ్యాయప్రవచనే చ ।**

**దానం – అనువాకం 11**

దానం ఎలా చేయాలో, ఎలా చేయకూడదో అద్భుతంగా వస్తుంది శీక్షావల్లీలో.

**శ్రద్ధయా దేయమ్ । అశ్రద్ధయాఽదేయమ్ । శ్రియా దేయమ్ । హ్రియా దేయమ్ । భియా దేయమ్ । సంవిదా దేయమ్**

**శ్రద్ధయా దేయమ్** – ఏది దానం చేసినా శ్రద్ధగా చేయాలి.

**అశ్రద్ధయా అదేయమ్** – శ్రద్ధ లేకుండా దానం చేయకూడదు. దీన్ని అశ్రద్ధయా దేయమ్ అనికూడా చెప్పవచ్చు. అంటే శ్రద్ధ లేకపోయినా దానం విధిగా చేయమని అర్థం వస్తుంది. అంటే ఇక్కడ శ్రద్ధకన్నా, దానానికి పెద్దపీట వేసింది శాస్త్రం.

**శ్రియా దేయమ్** – సమృద్ధిగా ఇవ్వాలి. కనీసం మీకు ఉన్నదానికి తగినంత ఇవ్వాలి.

**హ్రియా దేయమ్** – వినయంగా లేదా అణకువతో ఇవ్వాలి. నా చేయి పైన ఉందని మురిసిపోకూడదు.

**భియా దేయమ్** – భయంతో దానం చేయాలి. ప్రత్యవాయ పాపం అంటుకుంటుందనే భయంతో ఇస్తారు కొంతమంది. మీరు దానం చేస్తేనే మీరు మనుష్యులు అంటున్నది శాస్త్రం.

**సంవిదా దేయమ్** – దేశకాల పాత్రతలనెరిగి దానం చేయాలి. అపాత్రదానం చేయకూడదు. సరియైన వ్యక్తికి, సరియైన కాలంలో, సరియైన ప్రదేశంలో దానం చేయాలి.

ఇంతగా దానం చేయమని చెప్పినా ఉపనిషత్తు ఒక హెచ్చరిక కూడా చేస్తున్నది.

**కుశలాన్న ప్రమదితవ్యమ్** – దానం చేయమన్నారు కదా అని అతిగా చేయకూడదు. అంటే మీ ఆరోగ్యాన్నీ, మీ కుటుంబాన్నీ నిర్లక్ష్యం చేసేటంతగా చేయకూడదు. బయట ప్రపంచంలో జేజేలు కొట్టించుకునే ఆర్భాటంలో పడిపోతే, ఇంట్లో పిల్లలు బాధపడతారు. వారు కాసింత ప్రేమకోసం అల్లాడిపోతారు. అది దోషం కిందికే వస్తుంది.

**భావన** – తోటివారిమీద మీ భావన లేదా దృక్పథం ఎలా ఉండాలో కూడా బోధిస్తున్నది శాస్త్రం.

**మాతృదేవో భవ। పితృదేవో భవ। ఆచార్యదేవో భవ। అతిథి దేవో భవ।**

తల్లిని దైవంగా ఆరాధించు; తండ్రిని దైవంగా కొలువు; ఆచార్యుణ్ణి భగవంతునిగా ఆరాధించు; అతిథిని ఈశ్వరునిగా ఆరాధించు.

పంచభూతాలను కూడా గౌరవంగా చూడు అంటుంది శాస్త్రం.

ఈ ఈ విధంగా కర్మయోగంలో ఐదు అంశాలు చూశాము. అవి – పంచమహాయజ్ఞాలు, ఆవహంతీ హోమం, జ్ఞానయోగసాధన జపం, జ్ఞానసాధన జపం, సదాచారం.

**ఉపాసనయోగ సాధన**

ఉపాసన అంటే మానసపూజ. ఈ శీక్షావల్లీలో ఐదు వైదిక ఉపాసనలు చెప్పబడ్డాయి. ఈ ఉపాసనలు పూర్వకాలపు వైదిక విద్యార్థులు నేర్చుకునేందుకు అనువుగా ఉన్నాయి.

ఇప్పుడు పరిస్థితి మారింది. ఇప్పుడా ఉపాసనలను మనం చేయలేము. అందువల్ల వాటిని పరిజ్ఞానంకోసం నేర్చుకుంటాము కాని, ఆచరించటానికి కాదు. ఇప్పుడా ఉపాసనలను చూద్దాము.

1. **సంహితోపాసన – అనువాకం 3** – ఈ ఉపాసనలో అక్షరాలను కలిపే విధానంలో నాలుగు అంశాలను తీసుకుంటాము. అవి పూర్వరూపం, ఉత్తరరూపం, సంధి, సంధానం. సంహిత అంటే సంధి. సంధి అంటే రెండు పదాలను కలపటం. దీనికి ఒక ఉదాహరణ చూద్దాము. గుణసంధి అందరికీ తెలిసిందే. అ+ఇ=ఏ అని వస్తుంది.

దేవ + ఇంద్ర = దేవేంద్ర

వ (వ లోని అ పూర్వరూపం); ఇ ఉత్తరరూపం; + సంధి; కొత్తగా వచ్చిన వే (వే లోని ఏ) సంధానం. ఈ నాలుగూ నాలుగు ఆలంబనలు. ఈ నాలుగు ఆలంబనలమీద ఐదు రకాల ఉపాస్యవస్తువులను ఊహించుకుని ఉపాసన చేయాలి.

దీనికొక లౌకిక ఉదాహరణ చూద్దాము. ఒక సంస్థ 20 మందిని, ఐదు రంగాలనుంచి గౌరవిద్దామనుకుంది; రంగానికి నలుగురు అన్నమాట. నాలుగు కుర్చీలు వేసి, క్రీడారంగంనుంచి నలుగురు, సంగీతరంగంనుంచి నలుగురు, అలా నలుగురేసి చొప్పున గౌరవించింది.

ఇప్పుడు సంహితోపాసన నాలుగు కుర్చీలు నాలుగు ఆలంబనలు; ఐదు రంగాలు ఐదు ఉపాసనలు. దేనిమీద ఉపాసన చేస్తారో వాటిని ఉపాస్య వస్తువులు అంటారు. ఆలంబనలు మారవు (కుర్చీలు మారనట్టుగా). 4×5=20 ఉపాస్యవస్తువులు వస్తాయి. ఉపనిషత్తు ఎన్నుకున్న ఐదు అధికరణలు లోకానికి, జ్యోతులకు, విద్యలకు, సంతతికి, శరీరానికి సంబంధించినవి. వీటిని అధిలోక, అధిజ్యౌతిష, అధివిద్య, అధిప్రజ, అధ్యాత్మిక ఉపాసనలు అంది. ఈ ఐదింటినీ కలిపి సంహితోపాసన అంటారు.

**సంహితోపాసన**

| **ఉపాసన** | **పూర్వరూపం** | **ఉత్తర రూపం** | **సంధి** | **సంధానం** |
|---|---|---|---|---|
| అధిలోక | భూమి | స్వర్గం | అంతరిక్షం | వాయువు |
| అధిజ్యౌతిష | అగ్ని | సూర్యుడు | నీరు | విద్యుల్లత |
| అధివిద్య | ఆచార్యుడు | విద్యార్థి | విద్య | ప్రవచనం |
| అధిప్రజ | తల్లి | తండ్రి | సంతతి | కలయిక |
| అధ్యాత్మ | క్రింది దవడ | పై దవడ | వాక్కు | నాలుక |

2. **వ్యాహృతి ఉపాసన – అనువాకం 5** – ఇది కూడా ఇంచుమించు సంహితోపాసన లాగానే ఉంటుంది. అందులో ఆలంబనల కింద అక్షరాలను తీసుకుంటే, ఇక్కడ వ్యాహృతి మంత్రాలను తీసుకుంటాము. నాలుగు వ్యాహృతి మంత్రాలు ఉన్నాయి. అవి – భూః, భువః, సువః, మహః. అక్కడ నాలుగు ఆలంబనలమీద, ఐదు అంశాలమీద ఉపాసన చేస్తే, ఇక్కడ నాలుగు అంశాలను ఆవాహన చేస్తాము. 4×4=16. వీటి ఉపాస్యవిషయాలను అధిలోక, అధిదైవ, అధివేద, అధిప్రాణ వ్యాహృతి ఉపాసనలు అంటారు.

**వ్యాహృతి ఉపాసన**

| **వ్యాహృతులు** | **భూః** | **భువః** | **సువః** | **మహః** |
|---|---|---|---|---|
| అధిలోక ఉపాసన | భూమి | అంతరిక్షం | స్వర్గం | సూర్యుడు |
| అధిదేవ ఉపాసన | అగ్ని | వాయువు | ఆదిత్యుడు | చంద్రుడు |
| అధివేద ఉపాసన | ఋగ్వేదం | సామవేదం | యజుర్వేదం | ఓంకారం |
| అధిప్రాణ ఉపాసన | ప్రాణం | అపానం | వ్యానం | అన్నం |

3. **హిరణ్యగర్భ ఉపాసన – అనువాకం 6** – హిరణ్యం పదాన్ని అక్షరాలా తీసుకుంటే బంగారం అని అర్థం వస్తుంది. కాని ఇక్కడ జ్ఞానంగా తీసుకోవాలి. జ్ఞానం కూడా బంగారంలా మెరుస్తుంది. హిరణ్యగర్భ సమష్టి మనస్సుకు అధిష్ఠానదేవత కాబట్టి, ఈ ఉపాసనకు ఆలంబనగా వ్యష్టి మనస్సును తీసుకోవాలి. అందువల్ల దీన్ని అహంగ్రహ ఉపాసన అంటారు. ఇందులో జీవ–ఈశ్వర ఐక్యాన్ని ఊహించుకుంటారు. శంకరాచార్యులవారు వ్యాహృతి ఉపాసనను విడిగా చేయకూడదనీ, దాన్ని హిరణ్యగర్భ ఉపాసనలో కలిపి చేయాలనీ అంటారు. అందువల్ల వీటిని అంగ–అంగీ ఉపాసనలు అంటారు. అలా రెండూ కలిపి చేస్తే కలిగే ఫలం హిరణ్యగర్భ ఫలం. అతను లోకాధిపతి, మనసస్పతి, వాక్పతి, చక్షుష్పతి, శ్రోత్రపతి, విజ్ఞానపతి అవుతాడు.

4. **పాంక్తబ్రహ్మ ఉపాసన – అనువాకం 7** – దీన్ని విరాట్ ఉపాసన అని కూడా అంటారు. ఈ ఉపాసనలో సమష్టి ప్రపంచాన్ని, వ్యష్టిశరీరాన్ని కూడా వ్యష్టిమీద ఆవాహన చేస్తాము. నెమ్మదిగా ఉపనిషత్తు మనను మహావాక్యం అయిన అహం బ్రహ్మ అస్మిని స్వీకరించటానికి సిద్ధం చేస్తున్నది. ఉపాసనలో జీవ–ఈశ్వర ఐక్యాన్ని ఊహించుకుని ఉపాసన చేస్తే, జ్ఞానంలో జీవ–ఈశ్వర ఐక్యాన్ని అర్థం చేసుకుని అందులో రమిస్తాము.

ఇప్పుడు ఈ ఉపాసనలో సమష్టిని, వ్యష్టిలో ఊహించుకుంటున్నాము. నిజానికి సమష్టికి, వ్యష్టికి చాలా పోలికలు ఉన్నాయి. ఒక ఆటమ్‌లో ఎలక్ట్రాన్లు న్యూక్లియస్ చుట్టూ తిరుగుతాయి. అదే సమష్టికి వచ్చేసరికి గ్రహాలు భూమి చుట్టూ తిరుగుతాయి. ఈ ఉపాసన ద్వారా సమష్టికి, వ్యష్టికి ఉన్న పోలికలను బాగా అర్థం చేసుకుంటాము.

పాంక్తం అంటే ఐదు వస్తువుల సముదాయం. ఇప్పుడు జగత్తును మూడు తెగల కింద విభజిస్తాము. దాన్ని పాంక్తత్రయం అనవచ్చు. ఆ విధంగా జగత్తు మొత్తం 3×5=15 అంశాలుగా విభజించబడింది. అదే సూత్రం ప్రకారం వ్యష్టిని కూడా పాంక్తత్రయంగా విభజిస్తాము. సమష్టి పాంక్తత్రయాన్ని, వ్యష్టి పాంక్తత్రయంమీద ఆవాహన చేయాలి.

సమష్టి పాంక్తత్రయం – ఐదు లోకాలు, ఐదు దేవతలు, ఐదు భూతాలు (పంచభూతాలు) అయితే వ్యష్టి పాంక్తత్రయం – పంచప్రాణాలు, పంచేంద్రియాలు, ఐదు అంగాలు. ఆ అంగాలు చర్మం, మాంసం, కండరాలు, ఎముకలు, మూలుగు (బోన్‌మారో).

**పాంక్తబ్రహ్మ ఉపాసన**

| **వరుసక్రమం** | **ఉపాసన పేరు** | **ఐదు అంశాలు** |
|---|---|---|
| ఎ) | లోకపాంక్తమ్ | భూలోక, భువర్లోక, సువర్లోకాలు, దిక్కులు, అవాంతర దిక్కులు |
| బి) | దేవతాపాంక్తమ్ | అగ్ని, వాయువు, ఆదిత్యుడు, చంద్రుడు, నక్షత్రాలు |
| సి) | భూతపాంక్తమ్ | జలం, ఓషధులు, వనస్పతులు, ఆకాశం, ఆత్మ. |
| | ఇవి సమష్టి పాంక్తబ్రహ్మ ఉపాసనలు. | |
| డి) | వాయుపాంక్తమ్ | ప్రాణ, వ్యాన, అపాన, ఉదాన, సమాన ప్రాణాలు |
| ఇ) | ఇంద్రియపాంక్తమ్ | కన్ను, చెవి, మనస్సు, వాక్కు, చర్మం |
| ఎఫ్) | ధాతుపాంక్తమ్ | చర్మం, మాంసం, కండరాలు, ఎముకలు, మూలుగు. |
| | ఇవి వ్యష్టి పాంక్తబ్రహ్మ ఉపాసనలు. | |

ఈ పాంక్తబ్రహ్మ ఉపాసనను నిష్కామ ఉపాసనగా చేస్తే బ్రహ్మలోకప్రాప్తి కలుగుతుంది.

5. **ఓంకార ఉపాసన – అనువాకం 8** – దీన్ని ఈశ్వర ఉపాసన అని కూడా అంటారు. విరాట్, హిరణ్యగర్భ, ఈశ్వరపదాలను తత్త్వబోధలో చూస్తాము.

| | |
|---|---|
| విరాట్ | – సమష్టి స్థూలప్రపంచ అధిష్ఠానదేవత |
| హిరణ్యగర్భ | – సమష్టి సూక్ష్మప్రపంచ అధిష్ఠానదేవత |
| ఈశ్వర | – సమష్టి కారణప్రపంచ అధిష్ఠానదేవత |

ఈ తైత్తిరీయోపనిషత్తులో ఓంకారం విశిష్టత గురించి వస్తుంది. ఓంకారాన్ని ప్రతీకగా తీసుకుని, ఈశ్వరునిమీద ఎందుకు ఉపాసన చేయాలో చూపించటానికి ఓంకారం మహిమను కీర్తిస్తున్నది.

**ఓమితీదగ్ం సర్వమ్** – ఓం పదం అనేది ఈ సర్వం. ఓంకారం అన్ని అక్షరాలకూ, అన్ని పదాలకూ, అన్ని పదార్థాలకూ ప్రతీక. ఆ పదార్థాలన్నింటికీ కారణం ఆ పరమాత్మ. అందువల్ల

ఓం అంటే బ్రహ్మ. ఉపాసనకాండలో ఓంకారం విరాట్, హిరణ్యగర్భ, ఈశ్వరులకు అద్భుతమైన ప్రతీక.

**ఓమిత్యేతదనుకృతిః** – అనుకృతి అంటే అంగీకారం. ఇప్పటి ఓకేతో సమానం. యజ్ఞాల్లో ఇది బాగా వాడతారు. అథర్వణ వేదపండితుడు ఓం అంటూ ఇతర ఋత్విక్కులకు అనుమతి ఇస్తాడు. ఋగ్వేదపండితులు ఓం శోం అని మంత్రాలను పఠిస్తారు.

**ఓమిత్యగ్నిహోత్రమనుజానాతి** – అగ్నిహోత్రం చేసేటప్పుడు కూడా వాడతారు.

**ఓమితి బ్రాహ్మణః ప్రవక్ష్యన్ ఆహ** – ఇక్కడ బ్రాహ్మణః అంటే వేదవిద్యార్థి. అతని ప్రాథమిక శిక్షణ వేదపారాయణం నేర్చుకోవటం. అతను వేదాధ్యయనం చేసేముందు ఓం గురుభ్యోనమః అని పలుకుతాడు.

ఈ విధంగా ఇంత శ్రేష్ఠమైన ఓంకారంమీద ఈశ్వర ఉపాసన చేయాలి.

ఇక్కడ దయానందస్వామీజీ ఒక హెచ్చరిక ఇస్తున్నారు. గృహస్థు కేవలం ఓంకారజపం చేస్తే, అతనికి తీవ్రవైరాగ్యం ఏర్పడవచ్చు. గృహస్థుకు వైరాగ్యం పెరగకూడదు. అతను నెరవేర్చాల్సిన బాధ్యతలు ఉంటాయి. వేదాంతం నేర్చుకునేముందు అవసరమైనంత వైరాగ్యం ఉండాలి కాని, గృహస్థు ధర్మాన్నుంచి పారిపోయేటంత ఉండకూడదు. ఈ ఉపాసన నిష్కామ ఉపాసనగా చేస్తే బ్రహ్మప్రాప్తి పొందుతాడు.

ఏ ఉపాసననైనా రెండు రకాలుగా చేయవచ్చు. సకామ ఉపాసన, నిష్కామ ఉపాసన. సకామ ఉపాసన చేస్తే ఇహలోక, పరలోక ఫలాలు పొందుతారు; నిష్కామ ఉపాసన చేస్తే చిత్తవైశాల్యత, చిత్త ఏకాగ్రత, చిత్తశుద్ధి, చిత్తనిశ్చలత కలుగుతాయి.

**సంహితోపాసన** – వివరాలు చూద్దాం

ఎ) **అధిలోక ఉపాసన** – నాలుగు లోకాలైన పృథివిని, స్వర్గలోకాన్ని, అంతరిక్షలోకాన్ని, వాయువును వరుసగా పూర్వరూపంమీద, ఉత్తరరూపంమీద, సంధిమీద, సంధానంమీద ఉపాసన చేయాలి.

బి) **అధిజ్యోతిష ఉపాసన** – నాలుగు జ్యోతులైన అగ్ని, ఆదిత్యుడు, నీరు, మెరుపులను వరుసగా పూర్వరూపం, ఉత్తరరూపం, సంధి, సంధానంమీద ఉపాసన చేయాలి.

సి) **అధివిద్యా ఉపాసన** – విద్యారంగానికి చెందిన ఆచార్యుణ్ణి పూర్వరూపంమీద, శిష్యుణ్ణి ఉత్తరరూపంమీద, విద్యను సంధిమీద, ప్రవచనాన్ని సంధానంమీద ఆవాహన చేయాలి.

డి) **అధిప్రజ ఉపాసన** – గృహస్థాశ్రమానికి చెందిన నలుగురిలో తల్లిని పూర్వరూపంమీద, తండ్రిని ఉత్తరరూపంమీద, ప్రజ అంటే సంతతిని సంధిమీద, సంయోగాన్ని సంధానంమీద ఆవాహన చేయాలి.

ఇ) **అధ్యాత్మ ఉపాసన** – వ్యష్టిలోని అంగాలమీద ఉపాసన చేయాలి. కింది దవడను పూర్వరూపంమీద, పై దవడను ఉత్తరరూపంమీద, వాక్కును సంధిమీద, నాలుకను సంధానంమీద ఆవాహన చేయాలి.

ఈ విధంగా సమష్టితో మొదలుపెట్టి వ్యష్టికి వస్తాము. ఇందులో ఐదు ఉపాసనలు చెప్పబడినా కూడా అన్నింటినీ కలిపి ఒక్కటిగా తీసుకోవచ్చు. ఎందుకంటే ఈ ఐదు ఉపాసనలకూ నాలుగు ఆలంబనలు ఒక్కటే కాబట్టి.

ఈ ఉపాసనలో ఆలంబనలు సాక్షాత్తూ వేదమంత్రాల అక్షరాలు; ఉపాస్యవస్తువులు కూడా సామాన్యమైనవి కావు. అందువల్ల ఫలం కూడా శ్రేష్ఠమే. సకామ ఉపాసన చేస్తే సంతతి, ఐశ్వర్యం మెండుగా కలుగుతాయి; బ్రహ్మవర్చస్సు పొందుతారు; అన్నం సమృద్ధిగా దొరుకుతుంది. మరణం తర్వాత ఊర్ధ్వలోకాల్లో అతను చేసే ఉపాసననుబట్టి శ్రద్ధనుబట్టి ఒకదానికి వెళతాడు.

**వ్యాహృతి ఉపాసన** వివరాలు చూద్దాం – నాలుగు వ్యాహృతులమీద నాలుగు ఉపాసనలను చేస్తాము. ఈ వ్యాహృతుల్లో మహావ్యాహృతి శ్రేష్ఠం.

ఎ) **అధిలోక వ్యాహృతి ఉపాసన** – నాలుగు లోకాలను ఉపాస్యవిషయాలుగా తీసుకుంటాము. భూలోకాన్ని భూః మీద; భువర్లోకాన్ని భువః మీద, సువర్లోకాన్ని సువః మీద; సూర్యభగవానుణ్ణి మహః వ్యాహృతిమీద ఆవాహన చేయాలి. సూర్యుని తేజస్సువల్లనే లోకాలన్నీ ప్రకాశింపజేయబడుతున్నాయి.

బి) **అధిదైవ వ్యాహృతి ఉపాసన** – నలుగురు దేవతలను ఉపాస్య విషయాలుగా తీసుకుంటాము. అగ్నిదేవతను భూః మీద; వాయుదేవతను భువః మీద; ఆదిత్య దేవతను సువః మీద; చంద్రదేవతను మహః మీద ఆవాహన చేయాలి. చంద్రదేవత శ్రేష్ఠం, ఎందుకంటే చంద్రదేవతవల్లనే తక్కిన దేవతలందరూ ప్రకాశిస్తున్నారు.

సి) **అధివేదా వ్యాహృతి ఉపాసన** – నాలుగు వేదాలను ఉపాస్యవిషయాలుగా తీసుకుంటాము. ఋగ్ మంత్రాలను భూః మీద; సామవేద మంత్రాలను భువః మీద; యజుర్వేద మంత్రాలను సువః మీద, ఓంకారాన్ని మహః మీద ఆవాహన చేయాలి.

ఓంకారం శ్రేష్ఠం, ఎందుకంటే ఓంకారం అన్ని వేదాల సారం; వేదాలన్నీ ఓంకారంవల్లనే ప్రకాశిస్తున్నాయి.

డి) **అధిప్రాణ వ్యాహృతి ఉపాసన** – పంచప్రాణుల్లో మూడు ప్రాణశక్తులను ఉపాస్యవిషయాలుగా తీసుకుంటాము ఇక్కడ. ప్రాణశక్తిని భూః మీద; అపానశక్తిని భువః మీద; వ్యానశక్తిని సువః మీద; అన్నాన్ని మహః మీద ఆవాహనచేయాలి. అన్నం శ్రేష్ఠం, ఎందుకంటే అన్నంవల్లనే అన్ని ప్రాణాలు శక్తిని పొందుతున్నాయి.

ఈ నాలుగు ఉపాసనలూ కలిపి ఒకటే వ్యాహృతి ఉపాసన కింద చేస్తాము. దీని ఫలశ్రుతి సకామంగా చేస్తే హిరణ్యగర్భ ఫలం పొందుతారు. వ్యాహృతి ఉపాసన చేస్తే హిరణ్యగర్భ ప్రాప్తిని పొందుతారు అని ఉపనిషత్తు చెబుతున్నది. అంటే ఈ ఉపాసనను తరువాత చెప్పబోయే హిరణ్యగర్భ ఉపాసనతో కలిపి చేయాలని శంకరాచార్యులవారు వివరిస్తున్నారు.

# ఏకాదశ ఉపనిషత్తుల సారం

## తైత్తిరీయోపనిషత్ – వల్లీ 2

తైత్తిరీయోపనిషత్తులో మూడు అధ్యాయాలు ఉన్నాయి. అధ్యాయాన్ని వల్లీ అంటారు ఇందులో. ఈ ఉపనిషత్తులో ప్రతివల్లీకి అది ఆరంభమయ్యే మొదటి పదంతో ఆ పేరు పెట్టటం జరిగింది.

వల్లీ 1 – శీక్షాం వ్యాఖ్యాస్యామః – శీక్షావల్లీ
వల్లీ 2 – బ్రహ్మవిదాప్నోతి పరమ్ –బ్రహ్మవల్లీ
వల్లీ 3 – భృగుర్వై వారుణిః – భృగువల్లీ

ఇప్పుడు మనం బ్రహ్మవల్లీని చూద్దాము. తైత్తిరీయోపనిషత్తులో ఈ అధ్యాయంలో ఆత్మబోధ మాత్రమే ఉంటుంది. అందువల్ల ఈ వల్లీ చాలా ముఖ్యమైనది. దీనికి శంకరాచార్యులవారు చాలా విస్తారంగా భాష్యం రాశారు. ఆ భాష్యం చాలా అద్భుతంగా ఉంటుంది. శంకరుల వారి భాష్యానికి అనేక ఉపభాష్యాలు కూడా వచ్చాయి. శీక్షావల్లీలో సాధనచతుష్టయసంపత్తిని పొందటానికి అవసరమైన సాధనలు మాత్రమే వచ్చాయి. అందులో జ్ఞానయోగం లేదు. మూడవ అధ్యాయంలో కొంత జ్ఞానయోగంతో పాటు సాధనలు కూడా ఉన్నాయి. బ్రహ్మవల్లీ వేదాంతసారాన్ని చాలా చక్కగా వివరిస్తుంది.

**శాంతిపాఠం**

శీక్షావల్లీలో ఒక శాంతిపాఠం చూశాము. అది శంనో మిత్రః ...... ఇప్పుడు బ్రహ్మవల్లీలో ఇంకొక శాంతిపాఠం చూస్తాము. నిజానికి ఈ శాంతిపాఠమే కృష్ణయజుర్వేదానికి చెందిన ఉపనిషత్తులన్నింటికీ వస్తుంది. ఈ శాంతిపాఠాన్ని మనం కఠోపనిషత్తు సారాంశం చూసినప్పుడు చూశాము.

### బ్రహ్మవల్లీ

**ఓం సహ నావవతు । సహ నౌ భునక్తు । సహ వీర్యం కరవావహై। తేజస్వి నావధీతమస్తు మా విద్విషావహై । ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

ఈ శాంతిపాఠంలో శిష్యుడు భగవంతునినుంచి ఐదు అంశాలను కోరుతున్నాడు. ఆ ఐదు అంశాలూ ప్రతి ఒక్క వేదాంతశిష్యునికీ ఎంతో అవసరం. ఈ ఐదు అంశాలను ఒక వరుసక్రమంలో ఏర్పికూర్చటంకోసం మంత్రంలోని వరుసను మార్చటమైనది.

ఎ) **ప్రయత్నం – సహ వీర్యం కరవావహై** – పూర్తి బాధ్యత దేవునిమీదే పెట్టలేము. మన ప్రయత్నం మనం చేస్తే, దేవుడు సహాయపడతాడు. ఈ ప్రార్థనలో, 'నా ప్రయత్నం అవసరమనీ, నేను ప్రయత్నం చేయటానికి అవసరమైన ఆత్మస్థైర్యాన్ని నాకు ప్రసాదించమనీ కోరుతున్నాను.' జ్ఞానం పొందాలనే లక్ష్యం ఏర్పరచుకున్నాక దానికి తగ్గ ప్రయత్నం చేయాలి.

బి) **మేధాశక్తి – తేజస్వి నా వధీతమస్తు** – వేదాంతశాస్త్రాన్ని నేర్చుకోవాలంటే, శిష్యుడు కొన్ని సంవత్సరాలపాటు నేర్చుకోవాలి. ఈ బోధను తరగతి పాఠం అంటున్నాము, ప్రసంగం అనటం లేదు. ప్రసంగం అంటే ఒకదానితో ఇంకొకదానికి సంబంధం ఉండదు. కాని బోధ అంటే దాన్ని ఒక క్రమపద్ధతిలో నేర్చుకోవాలి. తైత్తిరీయోపనిషత్తు నేర్చుకునేముందు ముండకోపనిషత్తు, కేనోపనిషత్తు, కఠోపనిషత్తు, కైవల్యోపనిషత్తు నేర్చుకుని ఉండి ఉండాలి.

మనం ఈ ఉపనిషత్తుల సారాంశం కూడా ఇదే వరుసక్రమంలో చూస్తూ వస్తున్నాము. ఇవన్నీ గుర్తుంచుకోవాలంటే శిష్యునికి మేధాశక్తి ఉండాలి. మేధాశక్తి అంటే గ్రహణశక్తి, ధారణశక్తి రెండూ ఉండాలి. విన్నది అర్థం చేసుకోగలగాలి; అర్థం చేసుకున్నది బుద్ధిలో నిలబెట్టుకోగలగాలి. అందువల్ల మేధాశక్తిని కోరుతున్నాడు శిష్యుడు.

సి) **ద్వేషరాహిత్యం – మా విద్విషావహై** – గురుశిష్యుల మధ్య సత్సంబంధం నెలకొనాలంటే, వారి మధ్య అభిమానం, శ్రద్ధాభక్తులు ఉండాలి. గురువు చెప్పిన విషయాలను శిష్యుడు మొదట్లో స్వీకరించలేకపోయినా, గురువును కించపరచకూడదు. గురువుమీద శ్రద్ధ, భక్తి పెంచుకోవాలి. అప్పుడే ఇద్దరిలో సత్సంబంధం నెలకొంటుంది.

డి) **జ్ఞానం – సహ నా వవతు** – పైన చెప్పిన మూడూ – ప్రయత్నం, మేధాశక్తి, ద్వేషరాహిత్యం ఉంటే జ్ఞానం కలుగుతుంది. ఈ మూడూ జ్ఞానానికి దారితీయాలి! అంటే ఓ దేవా! నాకు జ్ఞానాన్ని ప్రసాదించు అంటున్నాడు శిష్యుడు.

ఇ) **జ్ఞానఫలం – సహ నౌ భునక్తు** – ఈ జ్ఞానం పొందితే సమబుద్ధి కలుగుతుంది. అప్పుడు ప్రారబ్ధకర్మ వేసే కొరడాదెబ్బలు తట్టుకుని నిలబడగలుగుతాడు. జ్ఞానఫలాన్ని అనుభవించనీయకుండా రాగద్వేషాలు అడ్డుపడతాయి. అందువల్ల, ఓ దేవా! నేను జ్ఞానఫలం కూడా అనుభవించేలా చేయమని ప్రార్థిస్తున్నాడు శిష్యుడు.

**ఓం శాంతిః శాంతిః శాంతిః** – అధ్యాత్మిక, అధిభౌతిక, అధిదైవిక విఘ్నాలనుంచి విముక్తి కలుగజేయాలి అంటున్నాడు శిష్యుడు.

ఈ ప్రార్థనలో ఆటంకాల అడ్డు తొలగించుకుని, రెండవ వల్లీ అయిన బ్రహ్మావల్లీలోకి అడుగు పెడదాము.

**వల్లీ వివరాలు** – శీక్షావల్లీలో మాదిరిగానే ఇందులో మంత్రాలు పద్యరూపంలో ఉండవు; గద్యరూపంలో ఉంటాయి. గద్యరూపంలో పేరాలుగా ఉంటాయి. వీటిని అనువాకాలు అంటారు. ఈ అనువాకాల్లో కొన్ని చిన్నవిగా ఉంటే, కొన్ని పెద్దవిగా ఉన్నాయి. ఇందులో మొత్తం 9 అనువాకాలు ఉన్నాయి. 9 అనువాకాలను 5 ప్రధాన అంశాలుగా విభజించవచ్చు. అవి – బ్రహ్మలక్షణం, బ్రహ్మజ్ఞానప్రకారః, బ్రహ్మజ్ఞానఫలం, బ్రహ్మజ్ఞానసాధనాని, అనుప్రశ్నాః. వీటిని మనం వీలుకోసం ఇలా విభజించుకున్నాము. ఉపనిషత్తులో ఉన్న వరుసక్రమంలో చూడటం లేదు.

1) **బ్రహ్మలక్షణం: అనువాకం 1**

మొదటి అనువాకంలోని మొట్టమొదటి వాక్యం, మొత్తం బోధయొక్క సారాంశాన్ని చెప్పింది. దాన్ని సూత్రభూతవాక్యం అనవచ్చు.

**బ్రహ్మవిదాప్నోతి పరమ్**

బ్రహ్మను తెలుసుకున్న జ్ఞాని పరమపురుషార్థమైన మోక్షాన్ని పొందుతాడు. ఈ వాక్యంనుంచి మూడు ప్రశ్నలు ఉదయిస్తాయి. ఆ బ్రహ్మ ఎవరు? ఆ బ్రహ్మను ఎలా తెలుసుకోవాలి? మోక్షప్రాప్తి అంటే ఏమిటి?

ఇప్పుడు మనం మొదటి అంశం అయిన బ్రహ్మలక్షణంలో మొదటి ప్రశ్నకు జవాబుని చూస్తాము. ఆ ప్రశ్న – ఆ బ్రహ్మ ఎవరు?

**సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ**

ఆ బ్రహ్మ ఎవరు అనే మొదటి ప్రశ్నకు ఉపనిషత్తు ఒక్క వాక్యంలో జవాబు చెప్పింది. సత్యం, జ్ఞానం, అనంతం బ్రహ్మ అంది. దీన్ని లక్షణవాక్యం అంటారు. లక్షణం అంటే నిర్వచనం. ఈ వాక్యం అక్షరలక్షలు విలువ చేసే వాక్యం. దీన్ని ఉటంకించకుండా తక్కిన ఉపనిషత్తులను బోధించలేరు.

## సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ – విశ్లేషణ

**బ్రహ్మ** – ముందుగా బ్రహ్మ పదం అర్థం చూద్దాము. బ్రహ్మ అంటే చాలా పెద్దది. ఇది బృహ్ ధాతువునుంచి వచ్చింది. బృహత్తమత్వాత్ బ్రహ్మ. ఇక్కడ బ్రహ్మ పదం విశేషణం కాదు, నామవాచకం. అంటే బ్రహ్మను విశేషణంతో కొలవలేనంత పెద్దది అని అర్థం చేసుకోవాలి.

**అనంతమ్** – సత్యం, జ్ఞానం, అనంతం పదాలు బ్రహ్మకు నిర్వచనాలు. ముందు అనంతం పదం అర్థం చూద్దాము. అనంతం అంటే న + అంతమ్. అంతము లేనిది.

**దేశపరిచ్ఛేదమ్** – ఒక వస్తువు ఒకచోట ఉంది అంటే, అది ఇంకొకచోట లేదని అర్థం. కాని బ్రహ్మ సర్వవ్యాపకం. **సర్వగతః.**

**కాలపరిచ్ఛేదమ్** – ఒక వస్తువుయొక్క జీవితం కొంతకాలం మాత్రమే ఉంటుంది. కాని బ్రహ్మకు చావుపుట్టుకలు లేవు.

**న జాయతే మ్రియతే వా కదాచిత్** – గీత 2-20

**వస్తుపరిచ్ఛేదం** – ఒక వస్తువుకు దాని లక్షణాలే ఉంటాయి. ఒక వస్తువును గడియారం అంటే అది మనిషి కాదు, కుర్చీ కాదు; అలా ఎన్నైనా చెప్పవచ్చు. కాని బ్రహ్మ కాకుండా, రెండవ వస్తువు లేదు. బ్రహ్మను అద్వయం అంటారు. అందువల్ల వస్తుపరిచ్ఛేదం లేదు.

**ఏకమేవాద్వితీయమ్** – ఛాందోగ్యమ్

ఈ మూడూ కలిపితే అనంతం అర్థం ఇలా వస్తుంది.

**అనంతమ్ = దేశకాలవస్తుపరిచ్ఛేదరహితం బ్రహ్మ**

**సత్యమ్** – సత్యం వాచ్యార్థం తీసుకుంటే, ఉనికి ఉన్న ఏ వస్తువైనా. ఉదా: గడియారం, పుస్తకం, కుర్చీ, మొత్తం జాగ్రత్ప్రపంచం. ఈ అర్థాన్ని బ్రహ్మకు అన్వయిస్తే, ఉనికి ఉన్న ప్రతివస్తువూ బ్రహ్మ అవాలి. కాని ఉనికి ఉన్న వస్తువుకు దేశకాలవస్తుపరిమితులు ఉంటాయి. ఇప్పుడే బ్రహ్మ అంటే అనంతం బ్రహ్మ అనీ, అనంతం అంటే దేశకాలవస్తుపరిచ్ఛేద రహితం బ్రహ్మ అనీ చూశాము. అందువల్ల ఇక్కడ సత్యం పదానికి లక్ష్యార్థాన్ని తీసుకోవాలి.

ఏ వస్తువును తీసుకున్నా దానికి మూడు భాగాలుంటాయి – నామం, రూపం, ఉనికి (సత్తా).

ఉనికి ఉన్న పుస్తకం – పుస్తకం నామం, పుస్తకం రూపం, ఉనికి
ఉనికి ఉన్న బల్ల – బల్ల నామం, బల్ల రూపం, ఉనికి.

పుస్తకం, బల్లల నామరూపాలు వేరు, కాని రెండింటిలోనూ సమానంగా ఉన్నది ఉనికి. అన్నింటిలోనూ సమానంగా ఉనికిని తీసుకోవాలి. అంటే **అనంత సత్తా.**

సత్యం = అనంత సత్తా

బ్రహ్మ విషయంలో చూసినట్టే సత్యం పదం కూడా విశేషణం కాదు, నామవాచకం.

అనంతం సత్యం బ్రహ్మ = దేశకాలవస్తుపరిచ్ఛేదరహిత సత్తా.

**జ్ఞానం** – జ్ఞానం అంటే ఎరుక. మనం అనేక వస్తువుల గురించిన ఎరుకను పొందుతాము. పుస్తకం ఎరుక, బల్ల ఎరుక. కాని ఇప్పుడు కూడా ఎరుకయొక్క వాచ్యార్థం తీసుకుంటే అదే సమస్య వస్తుంది. ఈ వస్తువుల ఎరుకకు దేశకాలవస్తుపరిమితులు ఉన్నాయి. పుస్తకం ఎరుక ఉంటే, మనిషి ఎరుక లేదు. కాని బ్రహ్మ అంటే అనంతం అనీ, అనంతం = దేశకాల వస్తుపరిచ్ఛేదరహితబ్రహ్మ అనీ చూశాము. అందువల్ల ఇక్కడ జ్ఞానం పదానికి లక్ష్యార్థం తీసుకోవాలి.

ఏ జ్ఞానాన్ని తీసుకున్నా దానికి కూడా మూడు అంశాలు ఉన్నాయి. అవి – నామం, రూపం, ఎరుక (చిత్).

ఎరుక ఉన్న పుస్తకం – పుస్తకం నామం, పుస్తకం రూపం, ఎరుక
ఎరుక ఉన్న బల్ల – బల్ల నామం, బల్ల రూపం, ఎరుక

పుస్తకం, బల్లల నామరూపాలు వేరు. కాని రెండింటిలోనూ సమానంగా ఉన్నది ఎరుక. దాన్నే చిత్ లేదా చైతన్యం అంటారు. అన్నింటిలోనూ సమానంగా ఉన్న చిత్‌ను తీసుకోవాలి. అంటే అనంత చిత్.

చిత్ అనగానే చైతన్యానికి తక్కిన ఉపనిషత్తులలో చూసిన 5 లక్షణాలను గుర్తు తెచ్చుకోవాలి. అవి చాలా ముఖ్యం కాబట్టి వాటిని మళ్ళీ చూద్దాము.

- చైతన్యం, ఒక వస్తువులో ఒక భాగం కానీ, లక్షణం కానీ, దాన్నుంచి ఉత్పత్తి చెందినది కానీ కాదు.
- చైతన్యం, స్వతంత్రం. అది వస్తువు అంతటా వ్యాపించి, దాన్ని ప్రకాశింపజేస్తుంది.
- చైతన్యం, వస్తువుయొక్క సరిహద్దులకే పరిమితమవలేదు.
- చైతన్యం, వస్తువు నాశనమయితే నాశనమవదు. వస్తువు పతనానంతరం కూడా చైతన్యం ఉంటుంది.
- చైతన్యం, వస్తువు లేకపోయినా ఉంటుంది కాని తెలియదు. దాన్ని ప్రతిబింబంచే మాధ్యమం లేదు కాబట్టి అది తెలియదు. అంతమాత్రాన చైతన్యం లేనట్టు కాదు.

**జ్ఞానం = అనంత చిత్**

బ్రహ్మ విషయంలో చూసినట్టుగా జ్ఞానం పదం కూడా విశేషణం కాదు, నామవాచకం.

**అనంతం సత్యం జ్ఞానం బ్రహ్మ = దేశకాలవస్తుపరిచ్ఛేదరహిత శుద్ధసత్, శుద్ధచిత్**

టూకీగా చెప్పాలంటే –

**అనంతమ్ – దేశకాలవస్తుపరిచ్ఛేదరహితం**
**సత్యమ్ – నామరూపరహిత సత్, శుద్ధసత్**
**జ్ఞానమ్ – నామరూపరహిత చిత్, శుద్ధచిత్**
**బ్రహ్మ – దేశకాలవస్తుపరిచ్ఛేదరహిత, శుద్ధసత్, శుద్ధచిత్**

సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ = సత్ చిత్ ఆనందం బ్రహ్మ.

ఈ నిర్వచనంనుంచి ఒక ఉపసిద్ధాంతం వస్తుంది. నిజానికి దాన్ని ఈ వల్లీలో తరువాత చూస్తాము. అది **ఆనందమ్.**

**ఆనందమ్** – అనంతం అంటే దేశకాలవస్తుపరిచ్ఛేదరహితం అని చూశాము. ఎక్కడ పరిమితి ఉంటుందో అక్కడ దుఃఖం వెన్నంటే ఉంటుంది. పరిమితిభావనే దుఃఖానికి దారి తీస్తుంది అంటుంది వేదాంతం. ఏదో కొరత పట్టిపీడిస్తుంది. నాకు కావాలి, నాకు కావాలి– తంబూర శ్రుతిలాగా వెంటాడుతూనే ఉంటుంది. ఇల్లు కావాలి, ఆపేక్ష కావాలి – ఇలా కోరికలు అనంతం. ఆర్థికంగా బాగా నిలదొక్కుకుంటే, కాసింత ప్రేమకోసం అల్లాడిపోతారు. ఓదార్పునిచ్చే భుజంకోసం విలవిలలాడతారు. ఇదంతా అపూర్ణత్వభావన.

అపూర్ణత్వం దుఃఖానికి దారి తీస్తే, పూర్ణత్వం ఆనందాన్ని కలుగజేస్తుంది. అనంతం అంటే దేశకాలవస్తు పరిచ్ఛేదరహితం అంటే పూర్ణత్వం. ఎక్కడ పూర్ణత్వం ఉంటే అక్కడ ఆనందం అని చూశాము. అందువల్ల,

అనంతం = ఆనందం.

ఈ పదాన్ని కూడా బ్రహ్మ నిర్వచనంలో కలుపుకుంటే, **బ్రహ్మలక్షణం** ఇలా వస్తుంది –

**సత్యం జ్ఞానమ్ ఆనందం బ్రహ్మ**

### సృష్టి ప్రకరణం – అనువాకం 1

ఈ సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ నిర్వచనానికి వ్యాఖ్యానం సృష్టిప్రకరణం ద్వారా వస్తుంది. ఈ నిర్వచనాన్ని తటస్థలక్షణం అంటారు. ఇది కూడా అక్షరలక్షలు విలువ చేసే నిర్వచనం. దీన్ని ఉటంకించందే తక్కిన ఉపనిషత్తులను వివరించలేరు గురువులు.

**తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః । ఆకాశాద్వాయుః । వాయోరగ్నిః । అగ్నేరాపః। అద్భ్యః పృథివీ । పృథివ్యా ఓషధయః । ఓషధీభ్యోఽన్నమ్ । అన్నాత్పురుషః స వా ఏష పురుషోఽన్నరసమయః॥**

**తస్మాత్** – ఆ బ్రహ్మనుంచి. ఏ బ్రహ్మనైతే సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ అన్నామో, ఆ బ్రహ్మనుంచి.

**ఏతస్మాత్ ఆత్మనః** – ఆ బ్రహ్మ సాక్షిచైతన్యానికి (ఆత్మకు) భిన్నం కాదు. ఆ బ్రహ్మనుంచి ఆకాశం పుట్టింది, ఆకాశంనుంచి వాయువు, వాయువునుంచి అగ్ని, అగ్నినుంచి జలం, జలంనుంచి భూమి, భూమినుంచి వృక్షసముదాయం, వృక్షసముదాయంనుంచి అన్నం, అన్నంనుంచి పురుషుడు పుట్టాడు. పురుషుడు అంటే ఇక్కడ అన్నరసంనుంచి పుట్టిన స్థూలశరీరం. ఈ విధంగా పంచభూతాల సృష్టి, పాంచభౌతిక శరీరాల సృష్టి చూశాము. ఇంకా ఎన్నో సృష్టించబడ్డాయి కాని, ఇక్కడ అవసరమైనంత మేరకే చెప్పబడింది.

ఈ సృష్టి ప్రక్రియనుంచి మనం మళ్ళీ సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ నిర్వచనంలోకి వెళ్ళవచ్చు.

**బ్రహ్మ సత్యం** – కారణం కార్యమంతటా ఉంటుంది. బంగారం ఆభరణం అంతటా ఉంటుంది. అందువల్ల కార్యజగత్తు ఉనికి నామరూపాలయితే, కారణం బ్రహ్మ శుద్ధసత్.

**బ్రహ్మ జ్ఞానం** – ఒక వస్తువుయొక్క ఉనికి గురించి చెపితే, ఆ వస్తువు జ్ఞానం ఉన్నట్టు అర్థం. జగత్తుయొక్క ఉనికి ఉందని చెబితే, దాని జ్ఞానం లేదా ఎరుక గురించి చెప్పినట్టే అర్థం. అందువల్ల కార్యజగత్తు నామరూపాల జ్ఞానం అయితే, కారణబ్రహ్మ శుద్ధచిత్.

**బ్రహ్మ అనంతం** – జగత్తు అంటే నామరూపాలు మాత్రమే. వాటికి దేశకాలవస్తుపరిమితులు ఉన్నాయి. నిజానికి సృష్టి కొత్తగా జరగలేదు; అవ్యక్తంనుంచి వ్యక్తంలోకి వచ్చింది అంతే అంటుంది శాస్త్రం.

జగత్ = బ్రహ్మ + నామరూపాలు
బ్రహ్మ = జగత్ – నామరూపాలు

కార్యం జగత్తుయొక్క నామరూపాలకు దేశకాలవస్తుపరిమితులు ఉన్నాయి కాని కారణం బ్రహ్మ దేశకాలవస్తుపరిచ్ఛేదరహితం.

ఈ విధంగా సృష్టిప్రక్రియ ద్వారా మళ్ళీ – సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ అని నిరూపించటం జరిగింది.

2) **బ్రహ్మజ్ఞాన ప్రకారః** – ఆ బ్రహ్మను ఎలా తెలుసుకోవాలి అనే రెండవ ప్రశ్నకు జవాబు ఈ భాగంలో చూస్తాము.

**పంచకోశ వివేకము – అనువాకాలు 1–5**

బ్రహ్మ నిర్వచనంవల్ల బ్రహ్మ సర్వవ్యాపకం అని తెలుస్తున్నది. సర్వవ్యాపకం అంటే నాలో కూడా చైతన్యరూపంలో ఉన్నాడు.

నేను = అనాత్మ + ఆత్మ

నాలో కనబడే శరీరం, కనబడని సాక్షిచైతన్యం ఉన్నాయి. దీనికి ఉదాహరణ ఫ్యాను. ఫ్యానులో కనబడే ఫ్యాను, కనబడని విద్యుచ్ఛక్తి ఉన్నాయి. కనబడని విద్యుచ్ఛక్తివల్లనే కనబడే ఫ్యాను తిరుగుతున్నదని నాకు బాగానే తెలుస్తున్నది. అలాగే జడమైన ఈ పాంచభౌతిక శరీరం, చైతన్యవంతంగా ఉంది అంటే కనబడని బ్రహ్మవల్లనే అంటుంది శాస్త్రం.

ఆ కనబడని బ్రహ్మను ఎలా తెలుసుకోవాలి? ఆ కనబడని బ్రహ్మను ఎన్నడూ ఆబ్జెక్టుగా తెలుసుకోలేము అంటుంది శాస్త్రం. ఎందుకు? ఆ బ్రహ్మ ఆబ్జెక్టు కాదు, సబ్జెక్టు అయిన నువ్వే కాబట్టి.

**ఎవ్వర్ ది ఎక్స్‌పీరియన్సర్ నెవ్వర్ ది ఎక్స్‌పీరియన్సడ్**
**అనుభవించే నువ్వే అది ఎప్పటికీ అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ**

బ్రహ్మ నువ్వే అని వివరించటానికి ఉపనిషత్తు ఆత్మ అనే పదం వేస్తుంది.

నేను = ఆత్మ = బ్రహ్మ.

ఇదీ మన ప్రయాణం. బ్రహ్మ బాహ్యంగా వెతికే వస్తువు కాదు, వెతుకుతున్న నువ్వే బ్రహ్మవు.

ఇన్నాళ్ళూ నువ్వు శరీరానివి అనుకుంటూ వచ్చావు. కాని వేదాంతం నువ్వు శరీరం కాదు, నువ్వు ఆత్మవు, ఈ శరీరం నీకు వ్యవహారం నడపటానికి ఇవ్వబడింది అంటుంది. ఇది అర్థం చేసుకోవటం కష్టంగా ఉంది మహాప్రభో అంటే, ఎవరన్నారు తేలికని అంటుంది శాస్త్రం. కష్టం కాని, అసాధ్యం కాదు. మనస్సును సంసిద్ధం చేసుకుంటే చాలా తేలిక. అది తేలికగా అర్థమవటానికి ఉపనిషత్తే అనేక ప్రక్రియలను నేర్పిస్తుంది.

ఇక్కడ పంచకోశవివేకం ప్రక్రియ ద్వారా 'నేనెవరు?' అనే ప్రశ్నకు జవాబుని తెలియబరుస్తుంది. దీనికి ఒకటే సూత్రం.

'నేనెవరు?' ఈ ప్రశ్నకు జవాబుగా ఉపనిషత్తు నీకు ఆబ్జెక్టుగా తెలుస్తున్నదేదీ నువ్వు కాదు అంటుంది. ఆబ్జెక్టు వేరు, సబ్జెక్టు అయిన నేను వేరు. ఒక్కముక్కలో చెప్పాలంటే నాకు అనుభవంలోకి వస్తున్నదేదీ నేను కాదు. ఈ గడియారం నేను కాదు, పువ్వు నేను కాదు – ఇవి నాకు భిన్నంగా, నాకు తెలుస్తున్నాయి. ఆ సూత్రం ప్రకారం నేను సూర్యుడు కాదు, నేను

చంద్రుడు కాదు, నేను నక్షత్రాలు కాదు, నేను కార్పెట్ కాదు, నేను పుస్తకం కాదు, నేను కలం కాదు. ఇలా జగత్తులో కనబడే వస్తువులను నేను కాదు, నేను కాదు అని కొట్టేస్తూ రావాలి.

ఇప్పుడు ఇదే సూత్రాన్ని మీ శరీరానికి అన్వయించండి అంటుంది శాస్త్రం. దాన్ని పంచకోశవివేకప్రక్రియ అంటారు.

ఇందులో అత్యంత స్థూలమైన శరీరంనుంచి సూక్ష్మాతిసూక్ష్మమైన సాక్షిచైతన్యానికి ప్రయాణం చేయాలి. ఆ సాక్షిచైతన్యమైన నేను ఆ బ్రహ్మను అని తెలుసుకోవాలి.

**సాక్షిచైతన్యరూప అహం బ్రహ్మ అస్మి.**

ఐదు మెట్లు ఉన్న స్టేజీమీదకు వెళ్ళాలంటే, ఒక్కొక్క మెట్టూ ఎక్కుతూ రావాలి. అలాగే పంచకోశాలను ఒక్కొక్కటీ దాటుకుంటూ అంతర్లీనంగా ప్రయాణం చేయాలి. పంచకోశాలు– అన్నమయకోశం, ప్రాణమయకోశం, మనోమయకోశం, విజ్ఞానమయకోశం, ఆనందమయకోశం. వీటికి అతీతంగా ఉంది ఆత్మ. అది మన సాధ్యం. ఒక్కొక్క కోశాన్ని ఆత్మగా భావిస్తూ వచ్చి, దాన్ని అనాత్మగా త్రోసిపుచ్చుకుంటూ వస్తాము. అదెలాగో చూద్దాము.

1. **అన్నమయమే ఆత్మ** – ముందు అన్నమయకోశాన్ని ఆత్మగా భావిస్తాము. అందువల్ల అన్నమయ ఆత్మ అంటున్నాము. అన్నమయ ఆత్మలో ఐదు అంశాలు ఉన్నాయి. అవి – శిరస్సు, కుడిరెక్క, ఎడమరెక్క, ఆత్మ, ప్రతిష్ఠ. మయ అంటే ఉత్పత్తి. స్థూలశరీరం అన్నంనుంచి ఉత్పత్తి చెందింది కాబట్టి దాన్ని అన్నమయం అంటారు. అన్ని జీవరాశులకూ అన్నం స్థితికారణం కూడా అవుతున్నది. అంతంలో కూడా అన్నీ ఈ అన్నంలోనే లయమవుతున్నాయి. అందువల్ల అన్నమయమే ఆత్మ అనుకుంటాము. ఇది మొదటి మెట్టు.

2. **ప్రాణమయమే ఆత్మ** – ఇప్పుడు రెండవ మెట్టు ఎక్కాలి. ఇక్కడ అన్నమయం ఆత్మ కాదు, ఆత్మ అన్నమయానికి భిన్నంగా ఉంది అంటున్నది ఉపనిషత్తు.

**అన్యోఽన్తర ఆత్మా ప్రాణమయః** – అనువాకమ్ 2

దానికి ఐదు కారణాలు చెబుతుంది.

**అనాత్మ నిశ్చయం** – ఆత్మ అన్నమయానికి భిన్నంగా ఉంది. అందువల్ల అన్నమయం లోపల ఉన్న ప్రాణమయం ఆత్మ. ప్రాణమయం దానికన్నా సూక్ష్మంగా ఉంది. ఎప్పుడైతే ప్రాణమయాన్ని ఆత్మ అన్నామో, అన్నమయం ఆత్మ కాదని చెప్పకనే చెప్పినట్టవుతుంది. అన్నమయాన్ని అన్నయమకోశం అంటాము. అనాత్మ, కోశం పర్యాయపదాలు.

**కార్యత్వ నిశ్చయం** – అనాత్మ ఆత్మనుంచి పుట్టింది. అన్నమయం అనాత్మ అయితే, అది కూడా కార్యం అవుతుంది.

**నామరూపత్వ నిశ్చయం** – ఏ కార్యమైనా కూడా కేవలం నామరూపాలు మాత్రమే కాని, అసలు పదార్థం కాదు. అన్నమయకోశం కార్యం కాబట్టి నామరూపం మాత్రమే అవుతుంది.

**మిథ్యాత్వ నిశ్చయం** – ఒక కార్యం నామరూపాలు మాత్రమే అంటే, దానికి విడిగా ఉనికి లేదని అర్థం. విడిగా ఉనికి లేకపోతే, అది ఉన్నా లేనట్టే. అందువల్ల నామరూపాత్మక అన్నమయకోశం మిథ్య.

**ప్రవిలాపన నిశ్చయం** – విడిగా ఉనికి లేనిది ఉన్నా లేనట్టే. అన్నమయం అనే పదార్థం లేదనే జ్ఞానంతో ప్రాణమయంలో లయం చేస్తాము. దాన్ని ప్రవిలాపనం అంటారు.

ఇప్పుడు ప్రాణమయమే ఆత్మ అన్నాము. అన్నమయంలో ప్రాణమయం ఉంది. అన్నమయం పురుషాకారంలో ఉంది కాబట్టి, ప్రాణమయం కూడా పురుషాకారంలో ఉంది. అందువల్ల అన్నమయానికి చూసిన ఐదు భాగాలను ప్రాణమయానికి కూడా చూస్తాము. ప్రాణమయానికి శిరస్సు, దక్షిణ పక్షం, ఉత్తర పక్షం, ఆత్మ, ప్రతిష్ఠా వరుసగా ప్రాణం, వ్యానం, అపానం, సమానం, పృథివి. సమిష్టి ప్రాణమే అన్ని ప్రాణుల ప్రాణమయంయొక్క సృష్టి, స్థితి, లయ కారణం. అన్నమయాన్ని శరీరం అనీ, ప్రాణమయాన్ని శరీర ఆత్మ (శరీరంలో ఉన్న ఆత్మ) అనీ అంటారు. అలా ప్రాణమయమే ఆత్మ అనే రెండవ దశలో ఉన్నాము.

3. **మనోమయమే ఆత్మ** – ఇప్పుడు మళ్ళీ **అన్యోఽన్తర ఆత్మా మనోమయః** అంటున్నది. అంటే ఆత్మ ప్రాణమయానికి భిన్నంగా ఉంది. అప్పుడు తక్కిన అంశాలన్నీ వరుసగా వస్తాయి. అనాత్మ నిశ్చయం, కార్యత్వ నిశ్చయం, నామరూపత్వ నిశ్చయం, ప్రవిలాపన నిశ్చయం.

మనోమయానికి వచ్చేసరికి శిరస్సు, దక్షిణ పక్షం, ఉత్తర పక్షం, ఆత్మ, ప్రతిష్ఠా వరుసగా యజుర్మంత్రాలు, ఋగ్వేదమంత్రాలు, సామవేదమంత్రాలు, వేదవాక్యాలు, అథర్వణ వేదమమంత్రాలు. మనోమయమే ఆత్మ అనే మూడవ దశలో ఉన్నాము.

4. **విజ్ఞానమయమే ఆత్మ**

**అన్యోఽన్తర ఆత్మా విజ్ఞానమయః** – అనువాకమ్ 4

ఆత్మ మనోమయానికి భిన్నంగా ఉంది. అంటే పై కారణాల దృష్ట్యా మనోమయం ఆత్మ కాదు, కోశం అవుతుంది. విజ్ఞానమయానికి శిరస్సు, దక్షిణపక్షం, ఉత్తరపక్షం, ఆత్మా, ప్రతిష్ఠా వరుసగా శ్రద్ధ, ఋతం, సత్యం, యోగం, హిరణ్యగర్భ. విజ్ఞానమయమే ఆత్మ అనే నాలుగవ దశలో ఉన్నాము.

5. **ఆనందమయమే ఆత్మ**

**అన్యోఽ_ంతర ఆత్మాఽ_నందమయః** – అనువాకమ్ 5

ఆత్మ విజ్ఞానమయానికి భిన్నంగా ఉంది. అంటే పై కారణాల దృష్ట్యా విజ్ఞానమయం ఆత్మ కాదు, కోశం అయింది.

ఆనందమయానికి శిరస్సు, దక్షిణపక్షం, ఉత్తరపక్షం, ఆత్మ, ప్రతిష్ఠా వరుసగా ప్రియం, మోదం, ప్రమోదం, ఆనందం, బ్రహ్మ. ఇంతవరకూ చూసిన అన్ని కోశాలకు ఐదు భాగాలు చూస్తే, ఇక్కడ మూడు భాగాలే చూస్తాము. ఇప్పుడు ఉపనిషత్తు ఈ ఆనందమయం కూడా అంటే అనుభవంలోకి వచ్చే ఆనందం కూడా అసలు ఆత్మ కాదు అంటుంది. మరయితే ఏది అసలు ఆత్మ?

**ఆనంద ఆత్మా** – ఆనందమే ఆత్మ. ఇక్కడ గమనిస్తే 'మయ' శబ్దం లేదు. మయట్ అంటే ఉత్పత్తి చెందింది కాబట్టి మార్పులు ఉన్నదని చూశాము. ఆనందమయంలో ప్రియ, మోద, ప్రమోదాలనే తారతమ్యాలు ఉన్నాయి. ఆ ఆనందం అనుభవంలోకి వస్తుంది. ఆనందమే ఆత్మ అంటే తారతమ్యాలు లేని, రాకపోకలు లేని, అనుభవంలోకి రాని ఆనందం. నేను ఈ ఆనందాన్ని.

ఆనంద ఆత్మా అంటే ఆనందమయం అనాత్మ లేదా కోశం అవుతుంది. ఆనందమయం ఆత్మ కాదు అంటే పై కారణాల దృష్ట్యా ఆనందమయం ఆత్మ కాదు, కోశం అవుతుంది. ఆనందమయ ఆనందానికి తారతమ్యాలు ఉంటే, ఆత్మానందం అసలు అనుభవంలోకే రాదు. అది అనుభవంలోకి వచ్చే ఆబ్జెక్టు కాదు, సబ్జెక్టుని అయిన నేనే ఆనంద ఆత్మను అని బుద్ధిలో అర్థం చేసుకోవాలి.

**బ్రహ్మ పుచ్ఛం ప్రతిష్ఠా** – ఈ ఆత్మానందానికి ఆధారం బ్రహ్మ. ఈ వాక్యాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. అసలు అర్థం ఆత్మానందమే బ్రహ్మానందం. అంటే రెండూ ఒకటే అని అర్థం. ఈ మాట ఉపనిషత్తు ముందే చెప్పింది.

**బ్రహ్మను సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ అంది**
**తస్మాద్వా ఏతస్మాదాత్మనః ఆకాశస్సంభూతః అంది.**

ఆ బ్రహ్మ సాక్షిచైతన్యానికి అంటే ఆత్మకు భిన్నం కాదు. ఆ భిన్నం కాని ఆత్మనుంచి పంచభూతాలు వచ్చాయని చెప్పింది.

ఈ విధంగా పంచకోశవివేకం చేసి ఆనంద ఆత్మకు వచ్చాము. అంటే బ్రహ్మజ్ఞానాన్ని పంచకోశవివేకం ద్వారా పొందాలని ఉపనిషత్తు చెబుతున్నది ఇక్కడ.

3) **బ్రహ్మజ్ఞానఫలం** – బ్రహ్మజ్ఞానాన్ని పొందితే మూడు ఫలాలు కలుగుతాయి అంటున్నది ఉపనిషత్తు. అవి ఆనందప్రాప్తి, భయనివృత్తి, మనస్తాపనివృత్తి.

1. **ఆనందప్రాప్తి – అనువాకం 8**

ఈ భాగాన్ని ఆనందమీమాంస అంటారు. మీమాంస అంటే విచారణ; ఆనందమీమాంస అంటే ఆనందం గురించిన విచారణ. ఈ వల్లీ బ్రహ్మపదంతో మొదలవుతుంది కాబట్టి దీన్ని బ్రహ్మవల్లీ అంటారని ఇంతకుముందు చూశాము. ఆనందమీమాంస అద్భుతంగా సాగుతుంది కాబట్టి ఆనందవల్లీ అని కూడా అంటారు. రెండూ ముఖ్యమే కాబట్టి దీనికి బ్రహ్మానందవల్లీ (బ్రహ్మ + ఆనందం) అనికూడా పేరు వచ్చింది.

ఈ ఆనందమీమాంసలో ఉపనిషత్తు రెండు రకాల ఆనందం గురించి వివరిస్తుంది. అవి– బింబానందం–ప్రతిబింబానందం. దీనికి ఉదాహరణగా మీ మొహాన్ని అద్దంలో చూసుకున్నారనుకోండి, మీ అసలు మొహాన్ని బింబమొహం అంటే, అద్దంలో కనిపించేదాన్ని ప్రతిబింబ మొహం అంటారు. మీ అసలు మొహాన్ని మీరు ప్రత్యక్షంగా ఎన్నటికీ చూడలేరు. అచ్చంగా మీ మొహమే అది, కాని దాన్ని చూసుకోలేరు. అద్దంలో మాత్రమే చూడగలరు. అంటే ప్రతిబింబ మొహాన్నే చూడగలరు. అదే విధంగా బింబానందాన్ని అనుభవించలేరు.

## బింబానందానికి, ప్రతిబింబానందానికి మధ్య భేదాలు

ఆత్మానందం బింబానందం అయితే కోశానందాన్ని ప్రతిబింబానందం అంటారు. మనస్సు ప్రశాంతంగా ఉన్నప్పుడు అన్నమయకోశంలో ఆ ఆనందంయొక్క ప్రతిబింబం ఏర్పడుతుంది కాబట్టి అది ప్రతిబింబానందం.

| **బింబానందం** | **ప్రతిబింబానందం** |
|---|---|
| ఆనందస్వరూపం | అనుభవంలోకి వచ్చే ఆనందం |
| సబ్జెక్టు | ఆబ్జెక్టు |
| తారతమ్యాలు లేవు | తారతమ్యాలు ఉన్నాయి |
| రాకపోకలు లేవు | రాకపోకలు ఉన్నాయి |
| నిత్యం | అనిత్యం |

**ప్రతిబింబానందం (కోశానందం)** – కోశానందాన్ని రెండు భిన్నపద్ధతుల ద్వారా పొందవచ్చు. కోశానందాన్ని అనుభవించాలంటే మనస్సు ప్రశాంతంగా ఉండాలి. ఆ ప్రశాంతతను రెండు మార్గాల ద్వారా పొందవచ్చు.

ఎ) ఒక పద్ధతి మనస్సు కోరే కోరికలను తీర్చటమే. చిన్న పిల్లవాడు చాక్లెట్లు కావాలని ఏడ్చి రాగాలు పెడుతున్నాడనుకోండి. అతనికి అతను కోరే చాక్లెట్లు కొని యిస్తే, మీట నొక్కినట్లు ఏడుపు ఆపేస్తాడు.

బి) రెండవ పద్ధతి వైరాగ్యం పెంపొందించటం. చాక్లెట్లు తింటే పళ్ళు పుచ్చిపోతాయని వివరించి చెప్పి, అతనికి చాక్లెట్లమీద వైరాగ్యం పెంపొందించటం.

ఈ రెండింటిలో ఏది తేలిక మార్గం. చాక్లెట్ల విషయం చిన్నదే. కాని అలా అన్ని కోరికలూ తీర్చుకోలేరు కదా! బెంజ్ కారుమీద కోరిక పుడితే అది లక్షల్లో వ్యవహారం. అంత తేలికగా తీరదు. అందువల్ల ఆ వస్తువు అశాశ్వతం అని, నిత్యానిత్యవివేకం చేయించి, వైరాగ్యం పెంపొందించటం మేలైన పద్ధతి. ఈ రెండింటిలో ఏ పద్ధతి పాటించినా మనస్సు ప్రశాంతంగా అయి, కోశానందం అనుభవంలోకి వస్తుంది.

కోశానందంలో తారతమ్యాలు ఉన్నాయని చూశాము. తారతమ్యాలను కొలవటానికి ఉపనిషత్తు ఒక కొలత తీసుకుంది.

మనుష్య ఆనందంతో మొదలుపెడుతుంది. అది ఒక ఊహాజనిత కొలత. ఒక యువకుడికి శారీరక, మానసిక ఆరోగ్యం ఉంది. శాస్త్ర అధ్యయనం చేశాడు, ధార్మికజీవనం గడుపుతాడు, చురుకైన వ్యక్తి, దృఢచిత్తం ఉంది, బలశాలి, మొత్తం పృథివి, ఈ పృథివిలో ఉన్న సంపదంతా అతనికే చెందుతుంది. ఇటువంటి పరిపూర్ణమైన కోశానందాన్ని ఒక మానుష ఆనందం లేదా మనుష్య ఆనందం అంటున్నది.

1 మనుష్య ఆనందం – 1 కొలత

ఈ మనుష్య ఆనందంనుంచి పదిస్థాయిల పైకి తీసుకుపోతుంది ఉపనిషత్తు. ప్రతి ఒక్క స్థాయిలోనూ ముందున్న స్థాయికన్నా వందరెట్లు ఎక్కువ ఆనందం ఉంటుంది. ప్రతి స్థాయిలోనూ రెండురకాల కోశానందాన్ని చూస్తాము. అవి విషయప్రాప్తివల్ల కలిగే ఆనందం, వైరాగ్య ప్రాప్తివల్ల కలిగే ఆనందం. ఉదాహరణకు మనుష్య ఆనందం తరువాత స్థాయి –

**తే యే శతం మానుషా ఆనందాః స ఏకో మనుష్యగంధర్వాణామానందః।**

1 మనుష్యగంధర్వ ఆనందం = 100 రెట్లు మనుష్య ఆనందం

**శ్రోత్రియస్య చాకామహతస్య – చ అకామహతస్య.** ఈ భూమ్మీద ఉండే వైరాగ్యం పొందిన మనిషి మనుష్యగంధర్వ ఆనందాన్ని పొందగలడు. అలా ప్రతిదశలోనూ వస్తుంది. ఆ దశల పేర్లు వరుసగా చూస్తే, దేవగంధర్వ ఆనందం, పితృదేవత ఆనందం, అజానత

దేవత ఆనందం, కర్మదేవత ఆనందం, దేవత ఆనందం, ఇంద్ర ఆనందం, బృహస్పతి ఆనందం, ప్రజాపతి ఆనందం, హిరణ్యగర్భ ఆనందం.

1 హిరణ్యగర్భ ఆనందం = 100 రెట్లు ప్రజాపతి ఆనందం. హిరణ్యగర్భ ఆనందం– మనుష్య ఆనందానికి $10^{20}$ (ఒకటి తరువాత ఇరవై సున్నాలు) రెట్లు ఆనందాన్ని హిరణ్యగర్భ పొందుతాడు. కాని ప్రజాపతి స్థాయివరకూ వైరాగ్యం ఉంటే ఈ ఆనందాన్ని మనిషి భూలోకంలోనే పొందవచ్చు. ఇక్కడితో కోశానందం గురించిన మీమాంస ముగిసింది.

**ఆత్మానందం** – ఆత్మానందాన్ని అనుభవించటం ఎలా? అర్థం లేని ప్రశ్న! నా బింబమొహాన్ని చూడటం ఎలా అంటే ఎంత అర్థం లేని ప్రశ్నో, ఇదీ అంతే! బింబానందాన్ని అనుభవించలేము. నేను ఆనందస్వరూపాన్ని, నేను సత్యం జ్ఞానం అనంతం ఆనందం బ్రహ్మను అనే జ్ఞానం పొందటమే దీనికి మార్గం.

**వైరాగ్యేణ ప్రతిబింబానందః జ్ఞానేన బింబానందః**

**ఆత్మానందం – స యశ్చాయం పురుషే। యశ్చాసావాదిత్యే। స ఏకః।**

ఈ మూడు వాక్యాలను కలిపితే ఒక మహావాక్యం అవుతుంది. దీని అర్థం మనిషిలో అంటే వ్యష్టిలో ఉన్న ఆనందం, హిరణ్యగర్భలో అంటే సమష్టిలో ఉండే ఆనందం రెండూ ఒకటే. స్వరూప ఆనందం పొందుతారు అంటే మనం ఆనందస్వరూపులం అని అర్థం చేసుకుంటే, ఆనందంకోసం అర్రులు చాస్తూ బాహ్యంగా పరుగులు తీయటం ఆపుతాము. స్వరూప ఆనందం అంటే ఆనందంలో నిలబడి ఉండటం.

2. **భయనివృత్తి – అనువాకం 9**

జ్ఞాని ఈ సృష్టిలో దేన్నీ చూసి భయపడడు. అతను ఆనందం లేదా పూర్ణత్వం తన స్వరూపలక్షణం అని అర్థం చేసుకుంటాడు.

3. **మనస్తాప నివృత్తి – అనువాకం 9**

మనిషిని రెండు బాధలే పట్టిపీడిస్తాయి.

**కిమహగ్ం సాధు నాకరవమ్** – నేను ఎందుకు ఈ మంచి పనులను చేయలేదు? అంటే ఒమిషన్స్ గురించి పశ్చాత్తాపం.

**కిమహం పాపమకరవమితి** – నేనెందుకిలా పాపపు పనులను చేశాను? అంటే కమిషన్స్ గురించి పశ్చాత్తాపం.

జ్ఞానికి ఈ రెండూ ఉండవు. జ్ఞానికి తను ఆత్మ అనీ, ఆత్మ అకర్తా, అభోక్తా అని తెలుసు. ఈ ఒమిషన్స్, కమిషన్స్ పంచకోశాలకు చెందినవి. ఈ ఒమిషన్స్, కమిషన్స్ గిల్ట్ అండ్ హర్ట్ అంటారు పూజ్యస్వామీజీ. తను పంచకోశాతీత ఆత్మ.

4) **బ్రహ్మజ్ఞాన సాధనాని** – ఉపనిషత్తు నాలుగు ఉపాసనలను నిర్దేశించింది.

ఎ) వృష్టి అన్నమయం – సమష్టి అన్న ఐక్య ఉపాసన
బి) వృష్టిప్రాణం – సమష్టి ప్రాణ ఐక్య ఉపాసన
సి) వృష్టిమనస్సు – సమష్టి మనస్సు ఐక్య ఉపాసన
డి) వృష్టిబుద్ధి – సమష్టి బుద్ధి ఐక్య ఉపాసన

ఇలా ఒక్కొక్క దశలో వృష్టి–సమష్టి ఐక్య ఉపాసన చేయటం ద్వారా క్రమేపీ జగదధిష్ఠానం బ్రహ్మను అర్థం చేసుకుంటారు.

5) **అనుప్రశ్నాః– అనువాకాలు 6, 7**

శిష్యుడు బోధ మధ్యలో రెండు ప్రశ్నలు వేశాడు. పరోక్షంగా మూడవ ప్రశ్న కూడా వేసినట్టు కలుపుకోవాలి. ఆ ప్రశ్నలు –

ఎ) బ్రహ్మ ఉందా, లేదా? (పరోక్షప్రశ్న)
బి) మరణానంతరం అజ్ఞాని బ్రహ్మలో ఐక్యమవుతాడా, లేదా?
సి) మరణానంతరం జ్ఞాని బ్రహ్మలో ఐక్యమవుతాడా, లేదా?

**బ్రహ్మ ఉందా, లేదా? – జవాబు**

గురువు ఈ పరోక్షప్రశ్నకు ఏడు జవాబులు ఇస్తాడు.

1. **నిమిత్తకారణం – బ్రహ్మ అస్తి జగతః నిమిత్తకారణత్వాత్** – జగత్తుయొక్క నిమిత్త కారణంగా బ్రహ్మ ఉంది. ఒక వస్తువు ఉందంటే, దాన్ని సృష్టించిన వ్యక్తి మన కంటికి ఎదురుగా లేకపోయినా, ఆ వస్తువును చూసి మనం ఊహించుకోగలము. అలా జగత్తుకు నిమిత్తకారణంగా బ్రహ్మ ఉంది.

2. **జీవాత్మ – బ్రహ్మ అస్తి జీవాత్మరూపేణ వర్తమానత్వాత్** – ఈ జగత్తును సృష్టించాక, భగవంతుడు ఆ జీవుడిలో ప్రవేశించాడు. జీవునిలో ప్రవేశించాడు అనే వాక్యాన్ని అనుప్రవేశవాక్యం అంటారు. పరమాత్మ ప్రవేశించాడు అంటే పరమాత్మ అందుబాటులో ఉన్నాడని అర్థం. మీరు స్వప్నప్రపంచం సృష్టించాక, ఆ స్వప్నప్రపంచంలోకి మీరే వెళ్ళినట్టుగా, భగవంతుడే ఈ జీవుని సృష్టించి, జీవునిలో అనుప్రవేశం చేశాడు. అందువల్ల జీవాత్మ ఉందంటేనే, అది పరమాత్మ ఉనికికి నిదర్శనం.

3. **ఉపాదానకారణం – బ్రహ్మ అస్తి జగతః ఉపాదానకారణత్వాత్** – ఏదైనా సృష్టించాలంటే దానికొక ముడిసరుకు కావాలి. కాని జగత్తును సృష్టించేముందు బ్రహ్మ ఒక్కటే ఉంది. అందువల్ల బ్రహ్మే ఉపాదానకారణం కూడా. పరమాత్మ జగత్తుగా అయ్యాడు. అందువల్ల పరమాత్మ ఉపాదానకారణంగా ఉన్నాడు. (బ్రహ్మ అని వాడినప్పుడు నపుంసకలింగం, పరమాత్మ అని వాడినప్పుడు పుంలింగం వాడుతున్నాము.)

4. **సుకృతం – బ్రహ్మ అస్తి సుకృత ప్రసిద్ధే** – జాగ్రత్‌పురుషుడే వేరే పరికరం అవసరం లేకుండా మారతాడు. అదే విధంగా ఈశ్వరుడే జాగ్రత్‌ప్రపంచంగా, జాగ్రత్‌పురుషునిగా వేరే పరికరం లేకుండా మారాడు. సృష్టికర్త, ముడిసరుకు, పరికరం – మూడూ ఒక్క ఈశ్వరుడే. అందువల్ల బ్రహ్మను సుకృతమ్ అంది. సు అంటే స్వయమ్; కృతమ్ అంటే కర్తా. ఆయనకు బాహ్యంగా వేరే దేని సహాయమూ అవసరం లేదు.

5. **ఆనంద ప్రదాతా – బ్రహ్మ అస్తి ఆనందరూపేణ** – ఉపనిషత్తు అనంతమే ఆనందం కాని చిన్న విషయాల్లో ఆనందం దొరకదు అంటున్నది. **న అల్పే సుఖమ్ అస్తి** బ్రహ్మే అనంతం, ఆనందం. అందువల్ల బ్రహ్మే అజ్ఞానికి అయినా సరే, జ్ఞానికి అయినా సరే ఆనందానికి కారణం. జగత్తులోని ఏ వ్యక్తికీ, ఏ వస్తువూ, ఏ పరిస్థితీ కూడా ఆనందాన్ని ఇవ్వలేవు. అందువల్ల ఉపనిషత్తు ఒకటే చెబుతున్నది – మన మొహంలో విరిసిన ప్రతి ఒక్క చిరునవ్వూ, అది ఎప్పుడైనా రానీ, బ్రహ్మ ఉనికికి నిదర్శనం.

6. **చైతన్య ప్రదాతా – బ్రహ్మ అస్తి జడశరీరే చేష్టా దర్శనత్వాత్** – ఈ భౌతిక శరీరం జడమైన పంచభూతాలనుంచి చేయబడింది. అప్పుడు శరీరం కూడా జడమే అవాలి. కాని మీ అనుభవం, దానికి భిన్నంగా ఉంది. మీ శరీరం చైతన్యవంతంగా ఉంది అంటే శరీరం చైతన్యాన్ని ఎక్కడనుంచో అరువు తెచ్చుకుందన్నమాట. అలా అచేతన శరీరానికి చైతన్యం ఇవ్వటంద్వారా బ్రహ్మ ఉనికి తెలుస్తున్నది.

7. **భయ–అభయ ప్రదాతా – బ్రహ్మ అస్తి భయ–అభయ హేతుత్వాత్** – ఉపనిషత్తు బ్రహ్మ అభయహేతువు ఇటు భయహేతువు కూడా అంటున్నది. జ్ఞాని బ్రహ్మను అభయప్రదాతగా చూస్తాడు. అతనికేమీ లేకపోవచ్చు జీవితంలో; కాని ఆనందంగా ఉంటాడు. నా అనేవారు లేకపోవచ్చు, ఎల్.ఐ.సీ. పాలసీలు లేకపోవచ్చు, ఐశ్వర్యం లేకపోవచ్చు, అయినా జ్ఞాని ఎంతో నిశ్చింతగా ఉంటాడు.

అదే అజ్ఞాని విషయం చూస్తే, అతను భగవంతుణ్ణి చూసి భయపడతాడు. భగవంతుడు సృష్టి, స్థితి కారకుడే కాదు; లయకారకుడు కూడా. తాడుని చూసి పాము అనుకుని భయపడినట్టుగా, బ్రహ్మను ద్వైతబ్రహ్మగా పొరపాటు పడతాడు అజ్ఞాని.

**భీషాస్మాద్వాతః పవతే। భీషోదేతి సూర్యః భీషాస్మాదగ్నిశ్చేంద్రశ్చ। మృత్యుర్ధావతి పంచమ ఇతి॥**

అజ్ఞాని మాత్రమే కాదు, దేవతలతో సహా అందరూ భయపడుతున్నారని కవితా ధోరణిలో చెబుతున్నది ఉపనిషత్తు. ఎత్తి పట్టుకున్న వజ్రాయుధంతో భగవంతుడు తిరుగుతున్నాడు కాబట్టి, భయంతో అగ్ని మండుతున్నది, సూర్యుడు ఉదయిస్తున్నాడు; ఇంద్రుడు, వాయువు వారి పనులు చేస్తున్నారు; ఐదవ దేవతనైన నేను కూడా భయంతో నా పని చేస్తున్నాను అని మృత్యుదేవత అయిన యమధర్మరాజే స్వయంగా చెబుతాడు కఠోపనిషత్తులో.

ఈ విధంగా బ్రహ్మ అస్తి అని ఏడు కారణాల ద్వారా చూపిస్తాడు గురువు. అవి నిమిత్తకారణం, జీవాత్మ, ఉపాదానకారణం, సుకృతం, ఆనందప్రదాతా, చైతన్యప్రదాతా, భయ–అభయ ప్రదాతా. ఇది పరోక్షంగా అడిగిన ప్రశ్నకు ప్రత్యక్ష జవాబు. ఇవి తార్కికంగా ఇవ్వబడ్డాయి. వీటిని శ్రుతిసమ్మత తర్కం అంటారు. కాని ప్రత్యక్షంగా అడిగిన ప్రశ్నలకు గురువు పరోక్షంగా జవాబు చెప్పాడు. ఆ ప్రశ్నలు మళ్ళీ ఒకసారి చూద్దాము.

**మరణానంతరం అజ్ఞాని బ్రహ్మలో ఐక్యమవుతాడా, లేదా?**
**మరణానంతరం జ్ఞాని బ్రహ్మలో ఐక్యమవుతాడా, లేదా?**

అసలు ప్రశ్నలే తప్పు. బోధ అంతా విన్నాక ఈ ప్రశ్నలు రాకూడదు. దూరాన్ని కిలోమీటర్లలో కొలవాల్సింది పోయి కిలోగ్రాముల్లో కొలిచినట్టు అవుతుంది.

ఎవరైనా బ్రహ్మలో ఐక్యం అయ్యే ప్రసక్తే లేదు. బ్రహ్మలో ఐక్యం అవాలి అనే ఆలోచనే బ్రహ్మను ఆబ్జెక్టుగా భావించటంవల్ల వస్తుంది. ఉపనిషత్తేమో బ్రహ్మ ఆబ్జెక్టు కాదు, సబ్జెక్టు అయిన నువ్వే బ్రహ్మవు అంటుంది. అందువల్ల జ్ఞాని అయినా, అజ్ఞాని అయినా కూడా అతను బ్రహ్మే. అందువల్ల బ్రహ్మలో ఐక్యం అయ్యే ప్రసక్తి లేదు.

కాని ఈ ప్రశ్నలకు జవాబు ఇచ్చి తీరాలంటే, ఈ విధంగా చెప్పవచ్చు. మరణానంతరం అజ్ఞాని బ్రహ్మలో ఐక్యమవుతాడా, లేదా అంటే అతను లయమవడు. అతని అజ్ఞానం బ్రహ్మకూ, తనకూ మధ్య దూరాన్ని ఏర్పరచింది. అతను ఆ అజ్ఞానంతో మరణిస్తాడు కాబట్టి, అతను బ్రహ్మలో ఐక్యమవడు అని భావించాలి. ఇకపోతే జ్ఞాని దృష్టిలో బ్రహ్మకూ, జ్ఞానికి మధ్య దూరం లేదు కాబట్టి, అతను బ్రహ్మలో 'ఐక్యమయినట్టు'గా భావించాలి. ఇవీ పరోక్ష జవాబులు.

# ఏకాదశ ఉపనిషత్తుల సారం

## తైత్తిరీయోపనిషత్ – వల్లీ 3

తైత్తిరీయోపనిషత్తులో మూడు అధ్యాయాలు ఉన్నాయి. అధ్యాయాన్ని వల్లీ అంటారని చూశాము. ఈ ఉపనిషత్తులో ప్రతివల్లీ ఆరంభమయ్యే మొదటి పదంతో ఆ వల్లికి పేరు పెట్టటం జరిగింది.

వల్లీ 1 – శీక్షాం వ్యాఖ్యాస్యామః – శీక్షావల్లీ
వల్లీ 2 – బ్రహ్మవిదాప్నోతి పరమ్ – బ్రహ్మవల్లీ
వల్లీ 3 – భృగుర్వై వారుణిః – భృగువల్లీ

ఇప్పుడు మనం భృగువల్లీని చూద్దాము. ఇది కూడా మొదటి వల్లీలాగా సాధన ప్రధానంగా ఉంటుంది. అంటే జ్ఞానం పొందటానికి కావాల్సిన అర్హతను పెంపొందించటానికి తోడ్పడుతుంది. ఎందుకంటే జ్ఞానం పొందటానికి పట్టే సమయం, శ్రమ; అధికారిత్వానికి పొందే సమయం, శ్రమతో పోలిస్తే చాలా తక్కువ.

నిజానికి మీరు గమనిస్తే, ఈ సూత్రం ఏ రంగం తీసుకున్నా వర్తిస్తుంది. భోజనం చేయటం పది, పదిహేను నిముషాల్లో అయిపోతుంది. కాని అంత తక్కువ సమయంలో తినటానికి చేసే వంట చాలాసేపు పడుతుంది. అలాగే పెళ్ళి. పెళ్ళి కొన్ని గంటల్లో అయిపోతుంది. కాని పెళ్ళికొడుకు దొరకటానికి కొన్ని సంవత్సరాలు పడుతుంది. కళ్యాణ మంటపం కూడా కొన్ని నెలల ముందే బుక్ చేసుకోవాలి. ఇంక పెళ్ళి ఏర్పాట్ల సంగతి చెప్పనే అవసరం లేదు. ఎన్ని నెలలుగా చేస్తున్నా, ఇంకా ఏవో పనులు ఉంటూనే ఉంటాయి. దీనంతటి సారాంశం, సాధ్యం పొందటానికి చేసే సాధన చాలా శ్రమతో కూడినది అని.

**సాధనే యత్నః కర్తవ్యః న తు సాధ్యే** – శంకరాచార్య

సాధన కష్టపడి చేస్తే, సాధ్యం దానంతట అదే అందుతుంది. ఇంగ్లీషులో ఒక సామెత ఉంది,

Take care of today, tomorrow will be automatically taken care of.

ఇవాళ్టి గురించి జాగ్రత్త పడితే, రేపటి గురించిన జాగ్రత్త సహజంగా ఏర్పడుతుంది. దాని బదులు రేపటి గురించి ఆందోళన చెందితే, ఇవాళ గడిచిపోతుంది; రేపటి గురించిన జాగ్రత్త కూడా తీసుకోలేకపోతారు.

అందువల్ల సాధనకు అంత ప్రాముఖ్యత ఉండటంవల్ల, ఈ ఉపనిషత్తులో మొదటి వల్లీ, మూడవ వల్లీలలో సాధనలు ఎక్కువగా చూస్తాము.

## భృగువల్లీ

**శాంతిపాఠం**

మామూలుగా ఉపనిషత్తులకు ఒకటే శాంతిపాఠం ఉంటుంది. అవి ఏ వేదానికి చెందితే, ఆ వేదానికి చెందిన శాంతిపాఠం ఉంటుంది. కాని ఈ ఉపనిషత్తు ప్రత్యేకత అడుగడుగునా కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఇందులో ఒక్కొక్క వల్లీకి ఒక్కొక్క శాంతిపాఠం ఉంది. శీక్షావల్లీకి శం నో మిత్రః ..... బ్రహ్మవల్లీకి, భృగువల్లీకి కూడా శాంతిపాఠాలు ఉన్నాయి కాని రెండింటిలోనూ ఒకటే.

**ఓం సహ నావవతు । సహ నౌ భునక్తు । సహ వీర్యం కరవావహై । తేజస్వి నావధీతమస్తు మా విద్విషావహై । ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

ఈ శాంతిపాఠంలో శిష్యుడు భగవంతునినుంచి ఐదు అంశాలను కోరుతున్నాడు.

ఎ) **ప్రయత్నం – సహ వీర్యం కరవావహై** – నేను ప్రయత్నం చేయటానికి అవసరమైన ఆత్మస్థైర్యాన్ని నాకు ప్రసాదించమని కోరుతున్నాడు శిష్యుడు.

బి) **మేధాశక్తి – తేజస్వి నావధీతమస్తు** – వేదాంతశాస్త్రాన్ని కొన్ని సంవత్సరాలు నేర్చుకోవాలి. దానికి మేధాశక్తిని ప్రసాదించమని కోరుతున్నాడు శిష్యుడు.

సి) **ద్వేషరాహిత్యం – మా విద్విషావహై** – గురువుమీద భక్తిశ్రద్ధలు పెంపొందించుకునేలా చేయమని ప్రార్థిస్తున్నాడు శిష్యుడు.

డి) **జ్ఞానం – సహ నావవతు** – పై లక్షణాలు ఉంటే జ్ఞానం కలుగుతుంది. నాకు జ్ఞానాన్ని ప్రసాదించు అని కోరుతున్నాడు శిష్యుడు.

ఇ) **జ్ఞానఫలం – సహ నౌ భునక్తు** – ఓ దేవా! నేను జ్ఞానఫలం కూడా అనుభవించేలా చేయి అని ప్రార్థిస్తున్నాడు శిష్యుడు.

**ఓం శాంతిః శాంతిః శాంతిః** – అధ్యాత్మిక, అధిభౌతిక, అధిదైవిక విఘ్నాలనుంచి విముక్తి కలుగజేయి అంటున్నాడు శిష్యుడు.

ఈ ప్రార్థనలో ఆటంకాల అడ్డు తొలగించుకుని, మూడవ వల్లీ అయిన భృగువల్లీలోకి అడుగు పెడదాము.

**వల్లీ వివరాలు** – ముందు వల్లీలలో చూసినట్టుగా ఇందులో కూడా మంత్రాలు పద్యరూపంలో ఉండవు; గద్యరూపంలో ఉంటాయి. గద్యరూపంలో పేరాలుగా ఉంటాయి. వీటిని అనువాకాలు అంటారు. ఇందులో మొత్తం 10 అనువాకాలు ఉన్నాయి. ఈ వల్లీని ప్రధానంగా 4 అంశాలుగా విభజించవచ్చు. అవి కూడా బ్రహ్మవల్లీలో చూసిన అంశాలే. అక్కడలాగే ఇక్కడ కూడా అనువాకాల వరుసక్రమంలో వెళ్ళకుండా, ఈ అంశాలకు తగ్గట్టుగా మనం మార్చుకుంటున్నాము. ఆ నాలుగు అంశాలు – బ్రహ్మలక్షణం, బ్రహ్మజ్ఞానప్రకారః, బ్రహ్మజ్ఞానఫలం, బ్రహ్మజ్ఞానసాధనాని. ఒక్కొక్కటీ వివరంగా చూద్దాము.

1) **బ్రహ్మలక్షణం – అనువాకం 1**

రెండవ అధ్యాయంలో కూడా బ్రహ్మలక్షణం చూశాము. లక్షణం అంటే నిర్వచనం.

**సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ** – బ్రహ్మవల్లీ
**దేశకాలవస్తుపరిచ్ఛేదరహిత శుద్ధసత్, శుద్ధచిత్**

ఈ నిర్వచనాన్ని **స్వరూపలక్షణం** అంటారు. బ్రహ్మస్వరూపం పరంగా నిర్వచనం ఇవ్వటం జరిగింది. ఇది చాలా ముఖ్యమైన నిర్వచనం. ఇక్కడ వచ్చిన నిర్వచనాన్ని **తటస్థలక్షణం** అంటారు. ఇది కూడా చాలా ముఖ్యమైనదే. అన్ని ఉపనిషత్తుల బోధలలోనూ సృష్టిప్రకరణం గురించి వచ్చినచోట, ఈ నిర్వచనాన్ని ఉటంకించకుండా బోధించలేదు గురువు. బ్రహ్మసూత్రాల్లో కూడా బ్రహ్మను జగత్కారణంగా అభివర్ణిస్తారు వ్యాసాచార్యులవారు రెండవ సూత్రంలో. దానికి ఆధారం ఇప్పుడు మనం చూడబోయే నిర్వచనమే.

**జన్మాద్యస్య యతః – బ్రహ్మసూత్రాలు**

తటస్థలక్షణం అంటే జగత్తుతో బ్రహ్మకున్న సంబంధాన్నిబట్టి నిర్వచించటం. స్వరూప లక్షణంలో బ్రహ్మస్వరూపం గురించి వస్తే, తటస్థలక్షణంలో ఇంకొకదానిద్వారా బ్రహ్మ వర్ణన వస్తుంది. బ్రహ్మను **జగత్కారణ బ్రహ్మ** అంటాయి ఉపనిషత్తులు. ఆ మంత్రం చూద్దాము.

**యతోవా ఇమాని భూతాని జాయంతే। యేన జాతాని జీవంతి।**
**యత్ప్రయంత్యభిసంవిశంతి। తద్విజిజ్ఞాసస్వ। తద్బ్రహ్మేతి।** అనువాకమ్ 1

ఇంత ముఖ్యమైన ఈ నిర్వచనంయొక్క అర్థం బ్రహ్మ జగత్తుయొక్క సృష్టి, స్థితి, లయ కారణం.

**యతో వా ఇమాని భూతాని జాయంతే** – ఇక్కడ బ్రహ్మ అని ప్రత్యక్షంగా చెప్పడు గురువైన వరుణుడు. యతః అంటే దానినుంచే. దేనినుంచి మొత్తం సృష్టి జరిగిందో,

**యేన జాతాని జీవంతి** – దేనిలోనే అన్నీ స్థితి పొందుతున్నాయో,

**యత్ప్రయంత్యభిసంవిశంతి** – దేనిలో ఇవన్నీ లయమవుతున్నాయో,

**తద్విజిజ్ఞాసస్వ** – దానిని నువ్వు తెలుసుకో.

**తద్బ్రహ్మేతి** – అది బ్రహ్మ.

ఏదైతే జగత్తుయొక్క సృష్టి, స్థితి, లయ కారణమో అది బ్రహ్మ. జగత్తు కార్యం, బ్రహ్మ కారణం. జగత్తు అంటే పదార్థం. బ్రహ్మచైతన్యం. పదార్థానికీ, చైతన్యానికీ మధ్య ఉన్న సంబంధం కార్యకారణ సంబంధం. ఏది కార్యమో, ఏది కారణమో సరిగ్గా అర్థం చేసుకోవాలి. పదార్థం కార్యం, చైతన్యం కారణం. కాని విజ్ఞానశాస్త్రం పదార్థం కారణం, దాన్నుంచి చైతన్యం వచ్చింది అంటుంది. విజ్ఞానశాస్త్రం పదార్థప్రధానంగా ఉంటే, వేదాంతశాస్త్రం చైతన్యప్రధానంగా ఉంటుంది. పదార్థం అంటే జగత్తు, చైతన్యం అంటే బ్రహ్మ అని మర్చిపోకూడదు. అందువల్ల బ్రహ్మ నిర్వచనం ఇదీ –

**జగత్కారణం బ్రహ్మ – జగత్తుయొక్క సృష్టి, స్థితి, లయ కారణం బ్రహ్మ**

ఈ నిర్వచనం ఎందుకు ముఖ్యమైనదంటే, దీనినుంచి కొన్ని ఉపసిద్ధాంతాలను చూస్తాము.

ఎ) ఒక్క వేదాంత శాస్త్రమే ఈ జడప్రపంచం చైతన్యంనుంచి వచ్చిందని బోధిస్తుంది. అందువల్ల దీన్ని చేతన వాదన అంటారు. దీని ద్వారానే వ్యాసాచార్యులవారు తక్కినవారి వాదనలను ఖండిస్తారు బ్రహ్మసూత్రాల్లో. తక్కిన దర్శనాలు, విజ్ఞానశాస్త్రం చైతన్యం దాకా రావు. అవి అన్నీ శక్తి, పదార్థం గురించే మాట్లాడతాయి. కాని మన జడశరీరం పని చేస్తోంది అంటే, దేనివల్ల? ఈ చైతన్యంవల్లనే. చైతన్యం గురించి అర్థం చేసుకోలేకపోతే, జీవితం గురించి అర్థం చేసుకోలేరు. జీవితం గురించి అర్థం చేసుకోలేకపోతే, మరణం గురించీ అర్థం చేసుకోలేరు. అందువల్లనే దీన్ని **జీవన్మరణ సమస్య** అంటారు.

బి) ఈ కార్య–కారణ సంబంధాన్ని మీకున్న ఐదు ప్రమాణాల ద్వారా అధ్యయనం చేయలేరు. దానికి వేరే ప్రమాణం కావాలి అంటుంది శాస్త్రం. ఆ ప్రమాణమే శాస్త్రప్రమాణం. బ్రహ్మజ్ఞానం అపౌరుషేయవిషయం. అందువల్ల అపౌరుషేయశాస్త్రమే దానికి ప్రమాణం. అది మానవ మేధస్సుకు, మానవప్రమాణాలకు అందదు.

సి) బ్రహ్మస్వరూపం గురించి నేర్చుకున్నప్పుడు మనం చూసిన మొట్టమొదటి లక్షణం – చైతన్యం, శరీరంలో ఒక భాగం కాని, దాని లక్షణం కాని, దానినుంచి ఉత్పత్తి చెందటం కాని కాదు. శరీరానికి సన్నిహితంగా ఉన్నా కూడా, స్వతంత్ర వస్తువు. ఫ్యానుతో అత్యంత సన్నిహితంగా విద్యుచ్ఛక్తి ఉన్నా కూడా దానికి భిన్నంగా ఉన్నట్టే, శరీరంలో ఉన్న శరీరీ (చైతన్యం) దానికి భిన్నంగా ఉంది.

డి) ఈ సూత్రం ప్రకారం రెండు భిన్నవస్తువులు ఉన్నాయి – చైతన్యం, పదార్థం. ఇక్కడ ఈ వల్లీలో ఈ పదార్థం చైతన్యంనుంచి పుట్టిందని వస్తుంది. చైతన్యం కారణం, పదార్థం కార్యం. ఇంకో విధంగా చెప్పాలంటే బ్రహ్మ కారణం, జగత్తు కార్యం.

ఇ) ఎప్పుడైతే జగత్తు కార్యం అవుతుందో, అప్పుడే ఒక ఉపసిద్ధాంతం గుర్తుంచుకోవాలి. ఏ కార్యాన్ని తీసుకున్నా, దానికి విడిగా ఉనికి లేదు. అది దాని కారణంయొక్క వ్యక్తరూపం మాత్రమే. కుండ తీసుకుంటే అది మట్టియొక్క నామరూపాలు మాత్రమే. అందువల్ల కుండ అనే నామం పదార్థానికి కాదు, ఒక రూపానిది మాత్రమే. అలాగే గాజు అనే నామం పదార్థానికి కాదు, బంగారంయొక్క రూపానిది మాత్రమే. మరి పదార్థం పేరు ఏమిటి పై రెండింటిలో? మొదటిది మట్టి, రెండవది బంగారం.

జగత్తు కూడా ఈ సూత్రం ప్రకారం పదార్థం కాదు, బ్రహ్మయొక్క వ్యక్తనామరూపాలు మాత్రమే.

బ్రహ్మ = జగత్ + నామరూపాలు

దీన్నిబట్టి కుండ, గాజు, జగత్తు ఎప్పుడైతే కార్యం అయ్యాయో, అవి ఒక గుణం మాత్రమే. కార్యం, కారణంయొక్క గుణం మాత్రమే అవుతుంది. గుణాన్ని విశేషణం అంటారు. ప్రతి ఒక్క కార్యం కూడా విశేషణం అయితే, కారణం ఏమిటి? కారణం పదార్థం; కార్యం దాని లక్షణం.

**బంగారం పదార్థం, ఆభరణాలు విశేషణం**
**మట్టి పదార్థం, కుండ, కూడా విశేషణం**

పదార్థం ఏకం, విశేషణాలు అనేకం. కార్యం విశేషణం అయితే కారణం విశేష్యం అవుతుంది.

జగత్తుకు, బ్రహ్మకు మధ్య సంబంధం ఏమిటో ఇప్పుడు చెప్పండి.

**కార్యకారణ సంబంధం లేదా విశేషణ విశేష్య సంబంధం**

ఉన్నదొకటే బ్రహ్మ; జగత్తంతా బ్రహ్మయొక్క విశేషణం అంటే అది విశిష్టాద్వైతం అవుతుంది. అది విశేషణ విశేష్య సంబంధం అంటుంది. ఇక్కడే ఆగిపోకుండా అద్వైతం ఇంకో అడుగు ముందుకు వేయిస్తుంది. ఇంతవరకూ ఏమన్నాం – చైతన్యం పదార్థం, జగత్తు దానికి విశేషణం అన్నాం. కాని నిజానికి చైతన్యంయొక్క స్వరూపలక్షణం చూసినప్పుడు ఏమన్నాము– చైతన్యం **దేశకాలవస్తుపరిచ్ఛేదరహితం బ్రహ్మ** అన్నాము. చైతన్యం నిర్గుణం; దానికి గుణాలు లేవు, విశేషణాలు లేవు.

**సాక్షీ చేతా కేవలో నిర్గుణశ్చ**

అందువల్ల జగత్తు నిజంగా బ్రహ్మయొక్క విశేషణం అవలేదు. అది విశేషణం **అన్నట్టుగా** ఉంటుంది. నిజంగా సంబంధం లేదు, ఉన్నట్టుగా ఉంది అంటే దాన్ని మిథ్యా సంబంధం అంటారు.

**వివర్త కార్యకారణ సంబంధః । మిథ్యా విశేషణ విశేష్య సంబంధః అధ్యాస అధిష్ఠాన సంబంధః।**

అందువల్ల ఈ తటస్థ లక్షణ నిర్వచనం ద్వారా మనం పొందిన ఉపసిద్ధాంతం ఏమిటి?

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా**

ఉన్నదొకటే బ్రహ్మ; జగత్తంతా దాని విశేషణంగా ఉన్నట్టుగా అనిపిస్తుంది. ఇదీ బ్రహ్మలక్షణం.

2) **బ్రహ్మజ్ఞాన ప్రకారః - అనువాకం 1-6** - బ్రహ్మ సత్యం జగన్మిథ్యా నిర్వచనం తెలుసుకున్నాక, ఆ బ్రహ్మజ్ఞానం పొందటమెలా అనే ప్రశ్న ఉదయిస్తుంది. రెండవ అధ్యాయంలో బ్రహ్మజ్ఞానాన్ని పంచకోశవివేకం ద్వారా ఎలా పొందవచ్చో చూశాము. ఇక్కడ కూడా అదే పంచకోశవివేకం చూస్తాము. కాకపోతే ఇక్కడ గురుశిష్యులసంవాదరూపంలో చూస్తాము. ఈ సంవాదం భార్గవీ వారుణి విద్యగా ప్రసిద్ధి పొందింది.

ఇందులో భృగువు తన తండ్రిని బ్రహ్మవిద్య బోధించమని కోరాడు.

**భృగుర్వై వారుణిః వరుణం పితరముపససార । అధీహి భగవో బ్రహ్మేతి ।**

ఈ మంత్రంతో ఈ వల్లీ మొదలవుతుంది కాబట్టి, దీనికి భృగువల్లీ అనే పేరు వచ్చిందని చూశాము. భృగువు తన తండ్రి అయిన వరుణుని దగ్గరకు వెళ్ళి, బ్రహ్మవిద్యను బోధించమని కోరాడు. దానికి వరుణుడు శాస్త్రంనుంచి రెండు సూచనలను ఇచ్చాడు.

1. బ్రహ్మ ఉపలబ్ధి ద్వారాణి - **అన్నం ప్రాణం చక్షుశ్శ్రోత్రం మనో వాచమితి**
2. బ్రహ్మలక్షణమ్ - **యతో వా ఇమాని భూతాని జాయంతే। యేన జాతాని జీవంతి। యత్ప్రయంత్యభిసంవిశంతి**

**బ్రహ్మ ఉపలబ్ధి ద్వారాణి** అంటే బ్రహ్మ దొరికే స్థానం.
అన్నం అంటే - అన్నమయకోశం
ప్రాణం, వాచం - ప్రాణమయకోశం (పంచప్రాణాలు + పంచకర్మేంద్రియాలు)
చక్షుః, శ్రోత్రం, మనః - మనోమయకోశం (పంచజ్ఞానేంద్రియాలు + మనస్సు)

అంటే వరుణుడు పంచకోశాలలో మూడింటి గురించే చెప్పాడు కాని తక్కిన రెండు కోశాలు అయిన విజ్ఞానమయకోశం, ఆనందమయకోశం మనం కలుపుకోవాలి. దాన్ని ఉపలక్షణం అంటారు. బ్రహ్మను పంచకోశవివేకం చేయాలని చెప్పాడు. బ్రహ్మలక్షణం సృష్టి, స్థితి, లయకారణం అని చెప్పాడు.

**స తపోఽ తప్యత** – దానిమీద నువ్వు తపస్సు చేయి అన్నాడు. ఇక్కడ తపస్సు అంటే విచారణ చేయమని అర్థం.

భృగువు విచారణ చేసే ముందు ఈ అంశాల గురించి మనం ఒక విచారణ చేద్దాము.

ఎ) బ్రహ్మవిచారణ స్వంతంగా చేయకూడదు; శాస్త్రంద్వారా చేయాలి

బి) శాస్త్రాన్ని స్వంతంగా అధ్యయనం చేయకూడదు; గురువుద్వారా చేయాలి

సి) గురువు శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడైన గురువై ఉండాలి; ఆయన స్వంతంగా శాస్త్రం జోలికి పోకుండా బోధించకూడదు.

**స తపస్తప్త్వా** – భృగువు పంచకోశవివేకం చేస్తూ వస్తాడు. ముందు అన్నమయకోశంతో మొదలుపెట్టాడు.

1. **అన్నమే బ్రహ్మ** – స్థూలశరీరం అన్నంనుంచి పుట్టింది. అన్నమే స్థితి, లయకారణం కూడా కాబట్టి అన్నమే బ్రహ్మ అని నిశ్చయించుకున్నాడు భృగువు. తన విచారణకు మురిసి పోయాదు కూడా. కాని, మళ్ళీ లోతుగా ఆలోచిస్తే, తన విచారణలో చిన్న లోపం కనబడింది. ఉపనిషత్తు అదేంటో చెప్పలేదు కాని మనం ఊహించవచ్చు. శ్రుతి, యుక్తి ప్రమాణాలు దీన్ని ఖండిస్తున్నాయి.

**శ్రుతి ప్రమాణం** – అన్నం ఓషధులనుంచి పుట్టింది.

**పృథివ్యా ఓషధయః ఓషధీభ్యోఽ న్నమ్**

**యుక్తి ప్రమాణం** – అన్నమయంగా మారటానికి అన్నం మారుతుంది. ఏది మారుతుందో, అది కార్యం అవుతుంది.

**యత్ యత్ సవికారం । తత్ తత్ కార్యమ్**

కాని బ్రహ్మ మూలకారణం అవాలి, మార్పులు ఉండకూడదు.

అందువల్ల భృగువు, వరుణుని దగ్గరకు వెళ్ళి, మూలకారణం తెలియలేదు అన్నాడు.

**తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ**

తపస్సుతో బ్రహ్మను తెలుసుకో అన్నాడు. ఎందుకంటే ఎలా విచారణ చేయాలో ముందే చెప్పేశాడు. ఇంక రెండవ కోశానికి వెళ్ళాడు భృగువు.

2. **ప్రాణమే బ్రహ్మ** – సమష్టి ప్రాణమే వ్యష్టి ప్రాణమయ కోశాలన్నింటికీ సృష్టి, స్థితి, లయకారణం అనుకున్నాడు కాని లోతుగా ఆలోచిస్తే శ్రుతి, యుక్తి ప్రమాణాలు కాదంటున్నాయి.

శ్రుతి ప్రమాణం – ప్రాణం బ్రహ్మనుంచి పుట్టింది.

**ఏతస్మాజ్జాయతే ప్రాణః –** ముండకమ్

యుక్తి ప్రమాణం – **ప్రాణః కార్యం సవికారత్వాత్ అన్నవత్**

ప్రాణం కూడా వికారాలు చెందుతుంది కాబట్టి ప్రాణం బ్రహ్మ కాదు.

3. **మనసే బ్రహ్మ** – సమష్టి మనస్సే వ్యష్టి మనోమయ కోశాలన్నింటికీ సృష్టి, స్థితి, లయ కారణం అనుకున్నాడు. కాని లోతుగా ఆలోచిస్తే శ్రుతి, యుక్తి ప్రమాణాలు కాదంటున్నాయి.

శ్రుతి ప్రమాణం – మనస్సు కూడా బ్రహ్మనుంచి పుట్టింది.

**ఏతస్మాజ్జాయతే ప్రాణః మనః సర్వేంద్రియాణి చ** – ముండకమ్

యుక్తి ప్రమాణం – మనస్సు కూడా అనేక వికారాలు చెందుతుంది. కాబట్టి మనస్సు బ్రహ్మ కాదు.

4. **విజ్ఞానమే బ్రహ్మ** – సమష్టి విజ్ఞానమే విజ్ఞానమయ కోశాలన్నింటికీ సృష్టి, స్థితి, లయ కారణం అనుకున్నాడు. కాని లోతుగా ఆలోచిస్తే శ్రుతి, యుక్తి ప్రమాణాలు కాదంటున్నాయి.

శ్రుతి ప్రమాణం – **మహతోఽ వ్యక్తముత్తమమ్** – కఠ

మహతః అంటే సమష్టి విజ్ఞానం. సమష్టి విజ్ఞానంకన్నా సమష్టి కారణశరీరం ఇంకా శ్రేష్ఠం, ఇంకా సూక్ష్మం అంటున్నది కఠ.

యుక్తిప్రమాణం – ఇది కూడా వికారాలకు లోనవుతుంది.

5. **ఆనందమే బ్రహ్మ** – ఇక్కడ భృగువు ఐదవ కోశం అయిన ఆనందమయకోశంలోకి అడుగు పెట్టలేదు. దాన్ని దాటి ముందుకు వచ్చేశాడు. ఆనందమే బ్రహ్మ అన్నాడు. బ్రహ్మవల్లీలో ఆనంద ఆత్మ అని వచ్చింది. ఇక్కడ ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్ అని వచ్చింది.

ఆనందం = ఆత్మ; ఆనందం = బ్రహ్మ; అందువల్ల ఆత్మ = బ్రహ్మ.

ఆనందం జగత్ కారణబ్రహ్మ. ఆ విధంగా తండ్రి ఇచ్చిన సమస్యా పూరణానికి భృగువుకు సమాధానం దొరికింది. తండ్రి ఒక ×ని ఇచ్చాడు. దేన్నుంచైతే ఈ జీవులన్నీ పుదుతున్నాయో, పుట్టాక దేనిచేత జీవిస్తున్నాయో, దేనితో లయమవుతున్నాయో అది బ్రహ్మ. దానిని తెలుసుకో అన్నాడు. భృగువు ఆ ×ని తీసి ఆనందం పదం వేశాడు. అవే మాటలు వేశాడు.

**ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్। ఆనందాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయంతే। ఆనందేన జాతాని జీవంతి। ఆనందం ప్రయంత్యభిసంవిశంతీతి।**

ఆనందమే జగత్‌యొక్క సృష్టి, స్థితి, లయకారణం.

బ్రహ్మ నిర్వచనం సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ చూసినప్పుడు అనంతం = ఆనందం అని చూశాము. ఆ అనంతమైన ఆనందాన్ని తీసుకోవాలి ఇక్కడ. ఇక్కడికి వచ్చేదాక అతని విచారణ తప్పని శ్రుతి, యుక్తి ప్రమాణాలద్వారా తెలుసుకుని, తండ్రి దగ్గరికి అడుగడుక్కీ వెళ్ళాడు. కాని ఆనందమే బ్రహ్మ. తన విచారణ సత్యమే అని శ్రుతి, యుక్తి ప్రమాణాలద్వారా కూడా నిర్ధారించుకున్నాడు.

శ్రుతి ప్రమాణం – శ్రుతి ఆనందం మూలకారణం అని చెబుతున్నది

**తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః**

ఆకాశం కూడా ఆత్మనుంచి పుట్టింది కాని ఆత్మ దేన్నుంచీ పుట్టలేదని అర్థమవుతున్నది.

యుక్తి ప్రమాణం – ఆత్మకు వికారాలు లేవు.

**న జాయతే మ్రియతే వా కదాచిత్** – గీత

ఆత్మకు చావు పుట్టుకలు లేవు.

అందువల్ల ఆత్మ మూలకారణం. బ్రహ్మ = ఆత్మ అని చూశాము. ఆత్మ అంటే నేను. అందువల్ల ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్ అంటే,

**అహం బ్రహ్మాస్మి వ్యజానాత్**

అని అర్థం. నేను అంటే సాక్షిచైతన్యం. భృగువు ప్రయాణం ముగిసింది. అందువల్ల మళ్ళీ గురువు వద్దకు వెళ్ళలేదు.

**3) బ్రహ్మజ్ఞానఫలం – అనువాకం 10 (చివరి భాగంలో)**

బ్రహ్మజ్ఞానఫలం జీవన్ముక్తి; మనం విదేహముక్తిని కూడా కలుపుకోవాలి. జీవన్ముక్తిని నాలుగు రూపాల్లో వర్ణించింది ఉపనిషత్తు. అవి – పంచకోశ అభిమాన త్యాగం, సర్వ అభిమాన సహితత్వం, స్వతంత్రత్వం, ఆనందం.

1. **పంచకోశ అభిమాన త్యాగం** – మళ్ళీ ఒకసారి బ్రహ్మజ్ఞానాన్ని బోధించి, తద్వారా పంచకోశ అభిమాన త్యాగాన్ని ఫలంగా చెప్పింది ఉపనిషత్తు.

**స యశ్చాయం పురుషే యశ్చాసావాదిత్యే । స ఏకః॥**

జీవాత్మలో ఉన్న ఆనంద ఆత్మా, ఆదిత్యునిలో ఉన్న ఆనంద ఆత్మా రెండూ ఒకటే అని చెప్పటం ద్వారా మహావాక్యాన్ని గుర్తు చేసింది. ఈ పంచకోశాలు అనాత్మ అని అర్థం చేసుకుంటే, తన స్వస్వరూపంలో నిలబడతాడు.

**అదృశ్యే అనిలయనే అభయం ప్రతిష్ఠాం విందతే ।**

తన స్వరూపం పూర్ణం, ఆనంద స్వరూపం, అభయ స్వరూపం. ఈ విషయం ఉపసంక్రమ్య పదం ద్వారా సూచించబడింది.

జ్ఞాని అభిమానత్యాగాన్ని చేస్తాడు. **ఉపసంక్రమ్య** అని వస్తుంది. ఒక్కొక్క కోశంమీద అభిమానంనుంచి విడివడి, ఆనంద ఆత్మలో నిలబడతాడు. నేను నిర్వికార ఆత్మను, సవికార అనాత్మను కాను అని జ్ఞాని అర్థం చేసుకుంటాడు.

2. **సర్వ అభిమాన సహితత్వం** – ఈ జ్ఞాని ఎవరితోనూ సంగత్వం పెంచుకోకుండా, యథేచ్ఛగా తిరుగుతాడు.

3. **స్వతంత్రత్వం** – జ్ఞానికి ప్రత్యేకించి ఈ పాత్ర ధరించాలనే నియమం లేదు. ఎప్పుడే పాత్రను ధరించాల్సివస్తే, అప్పుడా రూపాన్ని ధరిస్తాడు. సమాజం భక్తి కార్యక్రమాలను నిర్వహించమని కోరితే, భక్తునిగా మారి పూజలు చేస్తాడు. ముముక్షువులతో మాట్లాడాల్సి వస్తే, గురువుగా మారి వారికి బ్రహ్మవిద్యను బోధిస్తాడు. పిల్లల్లో పిల్లవాడిగా మారిపోతాడు. ఇలా ఒక పాత్రలోంచి ఇంకో పాత్రలోకి చాలా తేలికగా మారగలడు. ఎందుకంటే ఆ పాత్రలన్నీ మిథ్యా పాత్రలనీ, తను వాటికి భిన్నంగా ఉన్నాడనీ తెలుసు ఆ జ్ఞానికి.

4. **ఆనందం** –

**ఏతత్సామ గాయన్నాస్తే । హా౩వు । హా౩వు । హా౩వు ।**
**అహమన్నమహమన్నమహమన్నమ్ । అహమన్నాదో౽ హమన్నాదో౩౽ హమన్నాదః॥**

పైన చెప్పినట్టుగా సామగానం చేస్తూ తిరుగుతాడు. సామ అంటే గానం, బ్రహ్మ అని రెండు అర్థాలు వస్తాయి. ఇక్కడ సామ అంటే బ్రహ్మ అని అర్థం అంటున్నారు శంకరాచార్యుల వారు. సంస్కృతంలో హా అంటే అహో అని అర్థం. అహో అంటే ఆశ్చర్యం. నేనే భోగ్యవస్తువును, నేనే భోక్తను, నేనే కారణాన్ని అంటున్నాడు ఆశ్చర్యంగా.

4) బ్రహ్మజ్ఞాన సాధనాని – **అనువాకాలు 7–10 (కొంతభాగం)**

ఈ అనువాకాల్లో కొన్ని వ్రతాలను, కొన్ని ఉపాసనలను చూస్తాము.

**వ్రతాలు** – సంస్కర్మలను గురించి చెప్పటానికి ఇక్కడ ఉపనిషత్తు అన్నాన్ని ఉదాహరణగా తీసుకుని, అన్నంమీద వ్రతాలను చెప్పింది. ఎందుకంటే వేదాంత సాధన అన్నమయకోశంతో మొదలవుతుంది కాబట్టి.

**వ్రతం 1 – అన్నం న నిన్ద్యాత్** – మీకు వడ్డించబడిన అన్నాన్ని నిందించకుండా, సణక్కుండా తినాలి. అన్నం పరబ్రహ్మ స్వరూపం.

**వ్రతం 2 – అన్నం న పరిచక్షీత** – మీకు పెట్టిన ఆహారాన్ని పారవేయకూడదు. ఆహారాన్ని వృథా చేయటం అంటే, అన్నాన్ని అగౌరవపరచినట్టు అవుతుంది. అన్నం లేకుండా ఎందరో అలమటించి పోతున్నారు. అందువల్ల అన్నాన్ని పారవేయకూడదు.

**వ్రతం 3 – అన్నం బహు కుర్వీత** – ఆహారాన్ని సమృద్ధిగా పండించాలి. అంటే అన్నానికి కరువు ఏర్పడకూడదు. దేశం సుభిక్షంగా ఉండాలి. మీ దగ్గర అధికంగా ఉన్న ఆహారాన్ని అన్నార్తులకు పంచండి. ఎందుకంటే ఆకలి మనిషి తీర్చాల్సిన ప్రథమ అవసరం. ఆకలి తీరితేనే ఉన్నతమైన లక్ష్యాల గురించి ఆలోచించగలుగుతాడు.

**వ్రతం 4 – న కంచన వసతౌ ప్రత్యాచక్షీత** – ఇంటికి వచ్చిన అతిథిని వసతి ఇవ్వకుండా తిరస్కరించకూడదు. అంటే ఎవరైనా ఇంట్లో ఆశ్రయం కోరివస్తే, అతనిని పొమ్మనకూడదు. పూర్వకాలం అనుకోని అతిథి వస్తే అది దైవకృపగానూ, వచ్చిన వ్యక్తిని దైవసమానంగానూ భావించేవారు. శీక్షావల్లీలో అతిథి దేవోభవ అని చూశాము. అతిథికి ఆహారాన్ని కూడా ఏర్పరచాలి. అతిథి ఉన్నప్పుడు అతనికి నీరు ఇవ్వకుండా మీరు తాగితే అది మత్తుపానీయం తాగటంతో సమానం; వారికి ఆహారం పెట్టకుండా, మీరు మాత్రం భుజిస్తే అది మాంసభక్షణతో సమానం.

**ఉపాసనలు** – ఇక్కడ నాలుగు ఉపాసనలు వస్తాయి. నిజానికి వ్రతాలు, ఉపాసనలు కలిసివస్తాయి. మనం మన వీలుకోసం వాటిని విడదీస్తున్నాము. నాలుగు ఉపాసనలు – విరాట్ ఉపాసన, అధ్యాత్మిక ఉపాసన, అధిదైవ ఉపాసన, ఆకాశ ఉపాసన.

**ఉపాసన 1 – విరాట్ ఉపాసన** – ఈ ఉపాసనలో జగత్తును భగవంతుని శరీరంగా చూడటం నేర్చుకుంటాము. అలా జగత్తును భగవంతుని శరీరంగా చూడటంవల్ల జగత్తును సమష్టిగా చూడగలుగుతాము. ఒక వేదాంతం ఒక్కటే ఈశ్వరుడు జగత్తుకు దూరంగా లేదు, నిజానికి జగత్తు ఈశ్వరునియొక్క ప్రకటిత నామరూపం అని బోధిస్తుంది.

సృష్టి గురించి ఎంత లోతుగా పరిశీలిస్తే అంత దగ్గరగా మనుష్యులు, జంతువులు, వృక్షసంపద, ప్రకృతి, సూర్యుడు, అన్నీ ఒకదానితో ఇంకొకటి ఎంత దగ్గరగా పెనవేసుకుని ఉన్నాయో అర్థమవుతుంది. దీన్ని **బటర్‌ఫ్లై ఎఫెక్ట్** అంటారు. ఒక సీతాకోకచిలుక తన రెక్కలను అల్లల్లాడించటంవల్ల కలిగిన చిరుకంపనం ఎక్కడో దూరంగా ఉన్న నక్షత్రమండలాన్ని ప్రభావితం చేయగలదు. అందుకే అంటారు, 'ఒక నక్షత్రానికి ఇబ్బంది కలుగకుండా, ఒక పువ్వును కోయలేరు.'

అలా ఈ జగత్తులో అన్నీ ఒకదానికొకటి ఆశ్రితాలై ఉన్నాయి. ఈ పరస్పరసంబంధాన్ని మూడు జతల వస్తువులను తీసుకుని, రెండు రకాల సంబంధాలతో వివరించుకు వస్తున్నది ఉపనిషత్తు.

రెండు సంబంధాలు – అన్న–అన్నాద సంబంధం; ప్రతిష్ఠా–ప్రతిష్ఠిత సంబంధం
మూడు జంటలు – ప్రాణం–శరీరం; అగ్ని–జలం; పృథివీ–ఆకాశం.

**అన్న–అన్నాద సంబంధం** – అన్నం అంటే తినబడేది; అన్నాదం అంటే తినేది. అంటే వాడబడేది, వాడేది. మనం జీవించి ఉండగా, మనం చెట్లనుంచి ఆహారం తింటాము. అప్పుడు జగత్తు అన్నం, మనం అన్నాదం అయ్యాము. కాని మనం మరణించాక ఈ సంబంధం తారుమారు అవుతుంది. జగత్తుకు మన శరీరం అన్నం అవుతుంది. అంటే మనం అన్నం, జగత్తు అన్నాదం అవుతుంది.

**ప్రతిష్ఠా–ప్రతిష్ఠిత సంబంధం** – ప్రతిష్ఠ అంటే ఆధారం; ప్రతిష్ఠితం అంటే ఆధారపడేది లేదా ఆధేయం. ఇవికూడా తారుమారు అవుతూ ఉంటాయి. మనం పిల్లలుగా ఉన్నప్పుడు తల్లిదండ్రులమీద ఆధారపడతాము. వారు ప్రతిష్ఠ, మనం ప్రతిష్ఠితం. వారు వయస్సు మీదపడేసరికి, మనమీద ఆధారపడతారు. అప్పుడు మనం ప్రతిష్ఠ, మన తల్లిదండ్రులు ప్రతిష్ఠితం అవుతారు.

ఇలా జంటలను చూడటం ద్వారా, జగత్తులో ఆశ్రయ–ఆశ్రితాలు అన్నీ అర్థమవుతాయి. ప్రకృతిలో ఎంత సమతుల్యత ఉందో అర్థమవుతుంది. ఉపనిషత్తు చెప్పిన మూడు జంటలు ప్రాణం–శరీరం; అగ్ని–జలం; పృథివీ–ఆకాశం.

ఈ విధమైన ఉపాసనలవల్ల ఈ క్రింది విషయాలు తేటతెల్లమవుతాయి.

- ఈశ్వరుడు జగత్తుగా ప్రకటితమవుతున్నాడు
- మనం అనుభవిస్తున్న ప్రతిదీ మిథ్యే
- బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా
- ప్రమాతృ, ప్రమేయ విలక్షణ తురీయబ్రహ్మ అహమస్మి.

విరాట్ ఉపాసన ఫలం – ఈ ఉపాసనను నిష్కామంగా చేస్తే చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత, చిత్తవిశాలత ఏర్పడుతాయి.

**అన్నవానన్నాదో భవతి। మహాన్ భవతి। ప్రజయా పశుభిర్బ్రహ్మవర్చసేన। మహాన్ కీర్త్యా।**

సకామంగా చేస్తే అతనికి సమృద్ధిగా అన్నం దొరుకుతుంది. మహాత్ముడు అవుతాడు. మంచిపిల్లలు పుడతారు, పశుసంపద ఉంటుంది, బ్రహ్మవర్చస్సు పొందుతాడు, గొప్ప కీర్తిమంతుడు అవుతాడు.

**ఉపాసన 2 – అధ్యాత్మిక బ్రహ్మ ఉపాసన** – ఇందులో బ్రహ్మను మన శరీర అంగాలమీద ఆవాహన చేస్తాము. మన శరీర అంగాలు సజావుగా పనిచేస్తున్నన్నాళ్ళూ మనం వాటి గురించి పట్టించుకోము. అవి మొరాయించినప్పుడే వాటి విలువ తెలుస్తుంది.

**క్షేమ ఇతి వాచి। యోగక్షేమ ఇతి ప్రాణాపానయోః కర్మేతి హస్తయోః**
**గతిరితి పాదయోః విముక్తిరితి పాయౌ। ఇతి మానుషీ స్సమాజ్ఞాః।**

ఈ ఉపాసనను ఐదు కర్మేంద్రియాలమీద, ప్రాణశక్తిమీద చేస్తాము. కర్మేంద్రియాలు – వాక్కు, పాణి, పాదం, పాయువు, ఉపస్థం. వాటి వెనుక ప్రాణశక్తి ఉండాలి కాబట్టి ప్రాణంమీద కూడా ఉపాసన చేయాలి.

ఇవి నిష్కామంగా చేస్తే చిత్తశుద్ధి, చిత్తఏకాగ్రత, చిత్తవిశాలత ఏర్పడుతాయి. సకామంగా చేస్తే దానికి తగ్గ ఫలం వస్తుంది. ఇవన్నీ వివరంగా పట్టికలో చూడవచ్చు.

**ఉపాసన 3 – అధిదైవిక బ్రహ్మ ఉపాసన** – దీనిలో ప్రకృతిలో ఉన్న శక్తులమీద ఉపాసన చేస్తాము. ఈ శక్తులు లేకపోతే మానవ మనుగడే సాగదు.

**అథ దైవీః। తృప్తిరితి వృష్టౌ। బలమితి విద్యుతి। యశ ఇతి పశుషు। జ్యోతిరితి నక్షత్రేషు। సర్వమిత్యాకాశే।**

ఆ శక్తులు – వృష్టి, మెరుపు, పశువు, నక్షత్రాలు. ఈ నాలుగూ వ్యవసాయానికి దోహదం చేస్తాయి. నక్షత్రాలు ఉంటే అవి ఎండాకాలాన్ని సూచిస్తాయి. ఎండాకాలంలో సూర్యుడు తన ప్రకాశంతో, మేఘాలు వాననీటితో నిండటానికి దోహదం చేస్తాడు. వానతో పాటు మెరుపులు వస్తాయి. పంట పండించటానికి పశుసంపద కావాలి. ఈ విధంగా మన జీవితం ఈ శక్తులతో పెనవేసుకుని ఉంటుంది. సకామంగా చేస్తే దానికి తగ్గఫలం వస్తుంది.

**ఉపాసన 4 – ఆకాశ ఉపాసన** – ఆకాశంలోని ఒక్కొక్క మహిమను తీసుకుని, దానిమీద

ఉపాసన చేస్తాము. అలా చేయటంవల్ల కంటికి కనబడని, ప్రమేయం కాని ఆకాశాన్ని ప్రమేయంగా ఉపాసన చేయటం నేర్చుకుంటాము.

**సర్వమిత్యాకాశే। తత్ ప్రతిష్ఠేత్యుపాసీత। ప్రతిష్ఠావాన్ భవతి**

ఇలా చెప్పబడిన లక్షణాలు ప్రతిష్ఠ (ఆధారం), మహత్తు, మనస్సు (బుద్ధి), నమస్కార రూపంలో, నిర్గుణబ్రహ్మగా ఉపాసన చేయాలి. ఎందుకంటే ఆకాశానికి, బ్రహ్మకూ చాలా సమాన లక్షణాలు ఉన్నాయి. అందువల్ల ఆకాశ ఉపాసన నేర్చుకుంటే మన బుద్ధి పదునుగా, సూక్ష్మంగా తయారై, సూక్ష్మాతి సూక్ష్మమైన ఆత్మను అర్థం చేసుకోవటానికి సిద్ధంగా ఉంటుంది. ఆకాశంలో ఉపాసనకు తీసుకున్న లక్షణాలను, వాటి ఫలాలను ఒక పట్టికలో చూడవచ్చు.

ఈ కర్మ, ఉపాసనలు ప్రత్యక్షంగా జ్ఞానాన్ని ఇవ్వవు కాని సాధన చతుష్టయ సంపత్తిని పెంపొందిస్తాయి. ఈ సంపత్తిని పొందితే అధికారి అయి, పంచకోశవివేకంద్వారా జ్ఞానం పొంది, జ్ఞానఫలం కూడా పొందవచ్చు.

### శాంతిపాఠం

**ఓం సహ నావవతు। సహ నౌ భునక్తు। సహ వీర్యం కరవావహై।**
**తేజస్వి నావధీతమస్తు మా విద్విషావహైః। ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

ఉపనిషత్తు ఆరంభించే ముందు విఘ్నాలు లేకుండా ఉపనిషత్తును అధ్యయనం చేయాలని ప్రార్థిస్తే, ఇప్పుడు చివర్లో నిరాటంకంగా ఉపనిషత్తును అధ్యయనం చేసి బ్రహ్మవిద్యను పొందినందుకు కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాము.

# ఏకాదశ ఉపనిషత్తుల సారం

## మాండూక్యోపనిషత్ - ప్రకరణం 1

మాండూక్యోపనిషత్తు శంకరాచార్యులవారు భాష్యం రాసిన అన్ని ఉపనిషత్తుల్లోకన్నా అత్యంత చిన్నది. ఇందులో 12 మంత్రాలు మాత్రమే ఉన్నాయి. ఇది అథర్వణ వేదానికి చెందినది. అథర్వణ వేదానికి చెందిన ఇంకొక ఉపనిషత్తు ముండకోపనిషత్తు.

కొంతమంది ఈ రెండింటి పేర్ల మధ్య భేదాన్ని గ్రహించక, మాండూక్యోపనిషత్తును మండూక ఉపనిషత్తు అంటారు. మండూక ఉపనిషత్తు అంటూ ఏమీ లేదు. ముండక ఉపనిషత్తు ఉంది, మాండూక్య ఉపనిషత్తు ఉంది.

దీనికా పేరు ఎలా వచ్చింది? మామూలుగా మండూకము అంటే కప్ప అని అర్థం. కప్పగెంతులు గెంతినట్టు, ఇది వేదాంతజ్ఞానంలో మనను గెంతులు గెంతిస్తుంది అని కారణం చెబుతారు. కాని అసలు కారణం దీనిని మండూక ఋషి దర్శించారు. మాండూక్యం పదం మండ్ ధాతువునుంచి వచ్చింది. మండ్ అంటే మండయతి అంటే ఆనందంలో రమింపచేయటం. మండూకః అంటే ఎప్పుడూ ఆనందంలో ఉండే వ్యక్తి అని అర్థం. ఇది ఋషికి సరిగ్గా సరిపోతుంది. ఎందుకంటే ఋషి, తను పొందిన జ్ఞానంవల్ల ఎప్పుడూ ఆనందంలోనే రమిస్తాడు.

**ఆత్మన్యేవాత్మనా తుష్టః** - గీత 2.55

**ఉపనిషత్తు వివరణ** - ఇందులో 12 మంత్రాలే ఉంటాయి. ఈ ఉపనిషత్తును సూత్రభూత ఉపనిషత్తు అంటారు. ఎందుకంటే వేదాంతబోధను కేవలం 12 మంత్రాల్లో బోధించటం కష్టం. తక్కిన ఉపనిషత్తుల్లో చాలా వివరంగా బోధించిన విద్య, ఇక్కడ సారరూపంలో చెప్పబడింది. అందువల్ల వేదాంతం అంత మాండూక్యోపనిషత్తులో టూకీగా వచ్చేసింది.

అందువల్ల మొట్టమొదటే ఈ ఉపనిషత్తును నేర్చుకోకూడదు. కనీసం 4, 5 ఉపనిషత్తులు నేర్చుకున్నాక, ఈ ఉపనిషత్తుకు వస్తేనే బాగా అర్థం అవుతుంది. స్వామీజీ అదే వరుసక్రమంలో బోధిస్తారు.

ఇది చిన్న ఉపనిషత్తే అయినా, ఇది ఒక సంపూర్ణ ఉపనిషత్తు. అందువల్ల చాలా ముఖ్యమైన ఉపనిషత్తు.

ముక్తికోపనిషత్తు అని ఇంకొక ఉపనిషత్తు ఉంది. అది ఈ పది ఉపనిషత్తుల్లోకి రాకపోయినా, పేరు పొందిన 108 ఉపనిషత్తుల్లోకి వస్తుంది. ఆ ఉపనిషత్తు శ్రీరాముడు, ఆంజనేయుల

మధ్య సంవాదరూపంలో వస్తుంది. అందులో అంతకుముందు ఎలా వేలకొద్దీ ఉపనిషత్తులు ఉండేవో, ఎలా 108 మాత్రమే ప్రసిద్ధి పొందాయో అనే విషయాలు వస్తాయి. అంతేకాదు, ఏ వేదానికి ఎన్ని ఉపనిషత్తులు ఉన్నాయో కూడా వివరంగా వస్తుంది. ఇంతకీ, ఆ ఉపనిషత్తులో మాండూక్యోపనిషత్ ఒక్కటి అధ్యయనం చేసినా చాలు, మోక్షం పొందవచ్చు అని వస్తుంది.

**మాండూక్యమ్ ఏకమ్ ఏవ అలమ్। ముముక్షూనాం విముక్తయే।**

కాని మాండూక్యం సరిగ్గా అర్థం కాకపోతే, 10 ఉపనిషత్తులు అధ్యయనం చేయాలి; అవి అధ్యయనం చేసినా అర్థం కాకపోతే, 32 ఉపనిషత్తులు అధ్యయనం చేయాలి. అప్పుడూ అర్థం కాకపోతే, 108 ఉపనిషత్తులు అధ్యయనం చేయాలి. దానికి కొసమెరుపుగా మనం ఇంకొక మాట కలుపుకోవచ్చు. 108 అధ్యయనం చేసినా అర్థం కాకపోతే, వచ్చే జన్మలో అదృష్టాన్ని పరీక్షించుకోవాలి.

మాండూక్యోపనిషత్ చాలా చిన్న ఉపనిషత్ అని చూశాము. కాని దానికి గౌడపాదాచార్యులవారు భాష్యం పద్యరూపంలో రాశారు. వాటిని కారికలు అంటారు. అందువల్ల కూడా ఈ ఉపనిషత్‌కు బాగా పేరు వచ్చింది.

అద్వైత గురుపరంపరలో గౌడపాదాచార్యులవారికి ఒక ముఖ్యమైన స్థానమే ఉంది. శుకమహర్షి తర్వాత వచ్చిన గురువు గౌడపాదాచార్యులవారు. శుకమహర్షి ఋషుల్లోకి వస్తే, గౌడపాదాచార్యులవారు మనుష్యుల్లోకి వస్తారు. అంటే ఇక్కడనుంచి గురుపరంపర–ఋషిపరంపరనుంచి మనుష్యపరంపరలోకి వస్తుంది. వీరు చారిత్రాత్మక పురుషులు. అంతేకాదు, అంతకుముందు గురువులంతా గృహస్థులు అయితే, ఇక్కడనుంచి గురువులు అంతా సన్న్యాసులు.

ఆ విధంగా గురుపరంపరను ఇంకో దారికి మళ్ళించిన గౌడపాదాచార్యులవారు చాలా ముఖ్యమైన ఆచార్యులు. ఆయన భాష్యం చదువుతున్నామంటే మనం శంకరాచార్యులవారి కాలం నాటికన్నా ఇంకా కొన్ని సంవత్సరాల ముందుకు వెళుతున్నాము. శంకరాచార్యుల వారే 1200 సంవత్సరాల ముందు కాలానికి చెందినవారు. ఆయన గురువుకు గురువు ఈయన. ఆ విధంగా గౌడపాదాచార్యులవారి కారికలు ఎంతో పురాతనమైనవి, ముఖ్యమైనవి.

గౌడపాదాచార్యులవారు గౌడదేశానికి చెందిన ఆచార్యులు కావటంవల్ల గౌడపాదాచార్యులు అనే పేరు వచ్చింది. ఇప్పటి ఉత్తర బెంగాల్ ఆనాటి గౌడదేశం. ఆయన అసలు పేరు తెలియకపోవటంవల్ల ఆ పేరు స్థిరపడిపోయింది. పాదం అంటేనే గౌరవసూచకం

సంస్కృతంలో. గురుపాదం అంటే గౌరవనీయమైన గురువు. అందువల్ల గౌడపాదాచార్యులు అంటే గౌడదేశానికి చెందిన గౌరవనీయమైన గురువు అని అర్థం.

గౌడపాదాచార్యుల భాష్యంలో నాలుగు అధ్యాయాలు ఉన్నాయి. ఇందులో అధ్యాయాన్ని ప్రకరణం అంటారు. వాటి పేర్లు – ఆగమ ప్రకరణం, వైతథ్య ప్రకరణం, అద్వైత ప్రకరణం, అలాతశాంతి ప్రకరణం.

మొదటి అధ్యాయాన్ని ఆగమ ప్రకరణం అంటారు. ఇందులో ఉపనిషత్ మంత్రాలు 12 + గౌడపాదాచార్యులవారి కారికలు 29 ఉన్నాయి, వెరసి 41 ఉన్నాయి. ఉపనిషత్ అథర్వణ వేదానికి చెందినది, అందువల్ల మాండూక్యోపనిషత్ అపౌరుషేయం, సాక్షాత్తూ ఆ భగవంతునినుంచే వచ్చింది. కారికల భాగాన్ని గౌడపాదాచార్యులవారు రచించారు. ఆయన శంకరాచార్యులవారి గురువులకు గురువు. గౌడపాదాచార్యులవారు రచించారు కాబట్టి వీటిని గౌడపాదకారికలు అంటారు. ఈ ఉపనిషత్తు ఈ కారికలవల్ల ప్రాముఖ్యతను సంతరించుకుంది.

కారిక అంటే భాష్యం లేదా విచారణ. ఇది మామూలు భాష్యంలా ఉపనిషత్తులోని ప్రతిపదానికి విశ్లేషణ కాదు. దానిలోని సారాంశాన్ని గౌడపాదాచార్యులవారు లోతుగా విశ్లేషించారు. ఇది పద్యరూపంలో ఉంది. మొదటి అధ్యాయంలో ఉపనిషత్తుకు ప్రాముఖ్యతను ఇవ్వాలి కాబట్టి, కారికలు ద్వితీయస్థానంలోకి వెళ్ళిపోయాయి. ఉపనిషత్తుకు ప్రాముఖ్యతను ఇవ్వాలి కాబట్టి, వేదాలను ఆగమశాస్త్రం అని కూడా అంటారు కాబట్టి, ఈ అధ్యాయానికి ఆగమప్రకరణం అని పేరు వచ్చింది. ఉపనిషన్మంత్రాలు ఈ అధ్యాయంతో అయిపోతాయి కాబట్టి, రెండవ అధ్యాయంనుంచి కారికలు మాత్రమే ఉంటాయి.

మొదటి అధ్యాయంలో రెండూ ఉంటే, ఏది ఎక్కువ ముఖ్యమైనది అనే సందేహం రావచ్చు. కాని ఆ సందేహం అనవసరం. ఉపనిషత్తే ముఖ్యమైనది. ఎందుకంటే కారికలు ఉపనిషత్తుమీద వచ్చిన భాష్యం మాత్రమే.

## ఉపనిషత్తు విహంగ వీక్షణం

| | | |
|---|---|---|
| అధ్యాయం 1 | – ఆగమ ప్రకరణం | – ఉపనిషత్తు మంత్రాలు 12 + కారికలు 29 |
| అధ్యాయం 2 | – వైతథ్య ప్రకరణం | – కారికలు 38 |
| అధ్యాయం 3 | – అద్వైత ప్రకరణం | – కారికలు 48 |
| అధ్యాయం 4 | – అలాతశాంతి ప్రకరణం | – కారికలు 100 |

ఉపనిషత్తు మంత్రాలు 12 + కారికలు 215 = 227.

## ఆగమ ప్రకరణం

## విహంగవీక్షణం

ఈ ఆగమ ప్రకరణంలో ఉపనిషత్తులోని మొత్తం 12 మంత్రాలు, 29 కారికలు ఉంటాయి. రెండూ కలిపి 41 అవుతాయి. సంస్కృతంలో ఆగమః అంటే ఉపనిషత్తు. వేదాలు అపౌరుషేయాలు; సాక్షాత్తూ భగవంతుణ్ణుంచే వచ్చాయి. ఉపనిషత్తు అంటే వేదాంతభాగం అని చూశాము. అందువల్ల మొదటి అధ్యాయానికి **ఆగమప్రకరణం** అనే పేరు వచ్చింది.

ఆగమ ప్రకరణంలో ఉపనిషన్మంత్రాలు, కారికలు కలిపి వస్తాయి, కాని మనం వీలుకోసం వాటి విహంగవీక్షణ విడివిడిగా చేద్దాము.

### ఉపనిషన్మంత్రాల విహంగవీక్షణ

| | |
|---|---|
| 1. ఉపోద్ఘాతం – ఓంకార విచారణ | – మంత్రం 1 |
| ఆత్మ విచారణ | – మంత్రం 2 |
| 2. చతుష్పాద ఆత్మ విచారణ | – మంత్రాలు 3-7 |
| 3. చతుర్మాత్ర ఓంకార విచారణ | – మంత్రాలు 8-12 |

### కారికల విహంగవీక్షణం

| | |
|---|---|
| 1. మూడు పాదాల వివరణ | – కారికలు 1-9, మంత్రం 6 తరువాత |
| 2. నాలుగు పాదాల సాధర్మ్యము–వైధర్మ్యము | – కారికలు 10-18,మంత్రం 7 తరువాత |
| 3. ఓంకార– ఆత్మ ఐక్య ఉపాసన | – కారికలు19-24,మంత్రం 11 తరువాత |
| 4. నిదిధ్యాసనం, ఫలం | – కారికలు 25-29,మంత్రం 12 తరువాత |

ఉపనిషత్తుయొక్క మంత్రాలు గద్యరూపంలో ఉంటే, కారికలు పద్యరూపంలో ఉంటాయి. మొదటి అధ్యాయంలో ఉపనిషన్మంత్రాలు కొన్ని అయ్యాక, కొన్ని కారికలు వస్తాయి. అలా రెండూ మార్చి మార్చి వస్తాయి.

### శాంతిపాఠం

మొదటి అధ్యాయంలో ఉపనిషత్తు ఉంది కాబట్టి, దానికొక శాంతిపాఠం ఉండాలి. ఈ ఉపనిషత్తు అథర్వణ వేదానికి చెందినది కాబట్టి దీని శాంతిపాఠం భద్రంకర్ణేభిః. అథర్వణ వేదానికి చెందిన ఉపనిషత్తులన్నింటికీ ఒకే శాంతిపాఠం ఉంటుంది. అందువల్ల ముండకోపనిషత్తుకు, ప్రశ్నోపనిషత్తుకు కూడా ఇదే శాంతిపాఠం.

**ఓం భద్రం కర్ణేభిఃశృణుయామ దేవాః భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః।**
**స్థిరైరంగైస్తుష్టువాగ్ం సస్తనూభిర్వ్యశేమ దేవహితం యదాయుః।**
**స్వస్తి న ఇన్ద్రో వృద్ధశ్రవాః। స్వస్తి నః పూషా విశ్వవేదాః।**
**స్వస్తి నస్తార్క్ష్యో అరిష్టనేమిః। స్వస్తి నో బృహస్పతిర్దధాతు।।**
**ఓం శాంతిః శాంతిః శాంతిః।।**

ఈ శాంతిపాఠం ద్వారా శిష్యుడు నాలుగు విషయాలను కోరుతున్నాడు.

1. **ఆయుష్షు** – ఓ దేవా, నాకు దీర్ఘాయుష్షును మాండూక్యోపనిషత్తు, కారికలతో సహా నేర్చుకునేటంతవరకూ అయినా ఇవ్వు.

**వ్యశేమ దేవహితం యదాయుః** – అకాలమృత్యువు బారిన పడకుండా కాపాడు.

2. **ఆరోగ్యం** – మంచి ఆరోగ్యం కూడా ఉండేలా చేయి. దీర్ఘాయుష్షు ఉండి, ఆరోగ్యం సరిగా లేకపోతే, అది పెద్ద అవస్థ. ఆసుపత్రుల చుట్టూ తిరగటమే సరిపోతుంది.

ఆరోగ్యంలోకి నాలుగు అంశాలు వస్తాయి. శరీరం, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి.

**భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః** – భద్రం అంటే సర్వమంగళస్వరూపం. అది బ్రహ్మ. ఓ దేవా! నా చెవులు బ్రహ్మ గురించి శ్రద్ధగా వినేలా చేయి. చెవులు పనిచేయకపోతే ఒకదానికొకటి వినబడుతుంది.

**భద్రం పశ్యేమ అక్షభిః యజత్రాః** – యజత్రా అన్నా కూడా దేవతే. కంటితో మంచి విషయాలు చూసేలాగా చేయి. అంటే కళ్ళు, చెవులు సహకరించాలి. కన్నుకన్నా బుద్ధి సూక్ష్మంగా, పదునుగా ఉండాలి.

**స్థిరైః అంగైః తుష్టువాగ్ం సస్తనూభిః** – సూక్తుల ద్వారా నిన్ను ప్రార్థన చేయటానికి మంచి అంగాలను సమకూర్చు.

ఆ విధంగా శారీరక ఆరోగ్యం, ఇంద్రియ ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం, బుద్ధిబలం అన్నీ బాగుండాలి వేదాంతశ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయటానికి. ఏదైనా పని సాధించాలంటే మూడు అంశాలు తోడ్పడతాయి. అవి ప్రయత్నం, కాలం, దైవం; అంటే వరుసగా అంకితభావం ఉండటం, కొంచెం సమయాన్ని వెచ్చించటం, ఈశ్వర అనుగ్రహం కలగటం. ఇప్పుడు ఈశ్వరానుగ్రహాన్ని కోరుతున్నాడు.

3. **ఈశ్వరానుగ్రహం** – అనేక దేవతలను కొలుస్తున్నాడు.

**స్వస్తి నః ఇంద్రో వృద్ధశ్రవాః** – పేరున్న దేవత అయిన ఇంద్రుడు మాకు మేలు చేయుగాక. నః అంటే మాకు.

**స్వస్తి నః పూషా విశ్వవేదాః** – సూర్యదేవత మేలు చేయుగాక.

**స్వస్తి నః తార్క్ష్యః అరిష్టనేమిః** – తార్క్ష్య అంటే గరుత్మంతుడు. అరిష్టనేమి అంటే ఆయనను ఎవరూ ఆపలేరు. అటువంటి గరుత్మంతుడు మాకు మేలు చేయుగాక.

**స్వస్తి నః బృహస్పతిః దధాతు** – బృహస్పతి మాకు మేలు చేయుగాక.

4. **నిర్విఘ్నత్వం** – ఈ మాండూక్యోపనిషత్తు, కారికలతో పాటు నేర్చుకునేటంతవరకూ ఆటంకాలు లేకుండుగాక.

**ఓం శాంతిః శాంతిః శాంతిః** – అధ్యాత్మిక, అధిభౌతిక, అధిదైవిక ఆటంకాలు లేకుండుగాక.

ఈ ప్రార్థన ఎటువంటి ఆటంకాలనైనా తొలగించటానికి చేయవచ్చు కాని, ఇక్కడ ఉపనిషత్తు నేర్చుకునేముందు చేసే శాంతిపాఠం కాబట్టి, ప్రత్యేకించి ఉపనిషత్తు అధ్యయనం నిర్విఘ్నంగా కొనసాగాలని చేస్తున్నాడు. మనం కూడా ఆ ప్రార్థన చేసుకుని, ఉపనిషత్తులోకి అడుగుపెడదాము.

ఈ అధ్యాయంలో రెండూ ఉన్నాయి కాబట్టి, ఈ అధ్యాయం సారాంశాన్ని విడివిడిగా చూద్దాము. అంటే ముందు ఉపనిషత్తు మంత్రాల సారాంశాన్ని చూశాక, కారికల సారాంశాన్ని చూద్దాము. ఉపనిషత్తు రెండు విశ్లేషణలు చేస్తున్నది. ఆత్మవిచారణ, ఓంకార విచారణ. మాండూక్యం అర్థం చేసుకోవాలంటే అంతకుముందు నేర్చుకున్న బోధ గుర్తు తెచ్చుకోవాలని చూశాము. ఆత్మవిచారణ అనగానే ఆత్మ లేదా చైతన్యం గురించి మనం నేర్చుకున్న 5 లక్షణాలను గుర్తుకు తెచ్చుకోవాలి. అది,

**దశ 1 – నేను చైతన్యాన్ని**

మాండూక్యోపనిషత్తు మీకు చైతన్యం గురించిన ఈ లక్షణాలు తెలుసనీ, మీరే ఆ చైతన్యం అని అర్థం చేసుకున్నారనీ భావిస్తుంది. అంటే వేదాంతబోధలో మొదటి దశ – **నేను చైతన్యాన్ని** – వదిలివేసింది. మనం తక్కిన ఉపనిషత్తులనుంచి తెచ్చుకోవాలి.

**దశ 2 – నాకు జగత్తుకు ఉన్న సంబంధం**

జగత్తులోకి నా మనశ్శరీరాలు కూడా వస్తాయని మర్చిపోకూడదు. జగత్తుకు, నాకు మధ్య ఉన్న సంబంధాన్ని మాండూక్యోపనిషత్తు అద్భుతంగా విశ్లేషించబోతున్నది. కాని ఆ విశ్లేషణలోకి అడుగుపెట్టేముందు మనం వేదాంతశాస్త్రానికి పునాది అయిన కొన్ని ప్రాథమిక సూత్రాలను జీర్ణించుకోవాలి.

దేనికైనా ఉనికి ఉందని నిరూపించాలంటే, అది కొన్ని నియమాలకు లోబడి ఉండాలని వేదాంతం చెబుతున్నది.

1. **ప్రమేయత్వమ్** – ప్రమేయం అంటే ఆబ్జెక్టు. ఒక వస్తువు గురించిన జ్ఞానం పొందాలంటే అది ప్రమేయం అయివుండాలి. అది ప్రమేయం కాకపోతే, దాని ఉనికి గురించి మాట్లాడలేము. అది ప్రమేయం అయివుండాలంటే,

ఎ) ఐదు ప్రమాణాల్లో ఏదైనా ఒక ప్రమాణానికి ప్రమేయం అయివుండాలి. ఐదు ప్రమాణాలు – ప్రత్యక్ష ప్రమాణం, అనుమాన ప్రమాణం, అర్థాపత్తి ప్రమాణం, అనుపలబ్ధి ప్రమాణం, ఉపమానప్రమాణం.

బి) ఆ వస్తువు ఇప్పుడు ప్రమేయం కాకపోయినా, అది కనీసం గతంలోనైనా ప్రమేయం అయివుండాలి; లేదా భవిష్యత్తులోనైనా ఏదో ఒక ప్రమాణానికి ప్రమేయం అయ్యే ఆస్కారం ఉండాలి.

సి) ఆ వస్తువు నాకు ప్రమేయం కాకపోయినా, వేరే ఎవరికైనా ప్రమేయంగా తెలిసివుండాలి.

ఇప్పుడు ఈ మూడు షరతులనూ కలిపితే, ఒక వస్తువు ఏదో ఒక ప్రమాణానికి ప్రమేయంగా అందాలి; ఏదో ఒక సమయంలో ప్రమేయం అవాలి; ఎవరో ఒక వ్యక్తికి ప్రమేయం అయివుండాలి.

సరే వాదనకోసం ఒక వస్తువు ఉందిగాని, దానికి ప్రమేయత్వ హోదా లేదు అనుకుందాము. అంటే పైన చెప్పిన ఏ షరతులకూ అది లోబడి లేదనుకుందాము. అలాంటప్పుడు, దాని ఉనికి గురించి మనం ఎప్పుడు మాట్లాడగలము? అలా ఉనికి ఉన్నట్టే తెలియని వస్తువును ఏమంటాము? అది లేనే లేదంటాము. లేదు, దానికి ఉనికి ఉందని ఒకవేళ మీరనేటట్టయితే, అది కేవలం ఊహాగానమే అవుతుంది కాని, దానికి ఉనికి లేనట్టే అవుతుంది. ఎవరికీ, ఎప్పుడూ, ఏ ప్రమాణంద్వారా తెలియనిది ఎలా ఉంటుంది? అందువల్ల అది **అసత్** అవుతుంది.

**ప్రమేయత్వం ఉంటేనే ఒక వస్తువు సత్ కిందికి వస్తుంది**

2. **ప్రమేయానికి పరతంత్ర సత్తా** – ఒక వస్తువు ప్రమేయం హోదా పొందాలంటే, దాన్ని చూసే ప్రమాత ఒకరు ఉండాలి. ప్రమాతా అంటే ప్రమేయాన్ని చూసే సబ్జెక్టు, అంటే నేను. ప్రమాత అనే నేను, ప్రమేయం అనబడే వస్తువును చూస్తేనే దాని ఉనికి తెలుస్తుంది. దాన్ని చూడకపోతే దాని గురించి ఎలా మాట్లాడతాను? ప్రమాత లేకపోతే ప్రమేయం ఉన్నా కూడా దాని గురించి మాట్లాడలేము.

**ప్రమాత ఉంటేనే ప్రమేయానికి ఉనికి**

3. **ప్రమాతకు పరతంత్ర సత్తా** – ప్రమేయం పరంగా నేను దాన్ని చూసే ప్రమాతను. కాని నేను ఎవరు? నేను ప్రమాతను కూడా కాదు. నేను సాక్షిచైతన్యాన్ని. సాక్షిచైతన్యమైన నేను, ఏదైనా చూడాలనుకుంటే ప్రమాతను అయి, ఒక ప్రమాణం ద్వారా, ఒక ప్రమేయాన్ని చూస్తాను. ఈ విషయం జాగ్రదవస్థను గమనిస్తే బాగా అర్థమవుతుంది. జాగ్రదవస్థలో సాక్షిచైతన్యమైన నేను, అనేక ప్రమాణాలద్వారా అనేక ప్రమేయాల గురించి తెలుసుకుంటాను. అంటే అప్పుడు ప్రమాత వేషాన్ని వేసుకుంటాను.

స్వప్నప్రపంచంలో కూడా ఇదే పద్ధతి. నేను స్వప్నశరీరం ధరించి, స్వప్నప్రమాతగా, స్వప్నప్రమాణాలతో, స్వప్నవిషయవస్తువులను చూస్తాను. సుషుప్తిలో నేను ప్రమాణాలను వాడను కాబట్టి, అప్పుడు ప్రమాతను కూడా కాను.

అందువల్ల ప్రమాత అంటే తెలుసుకునే నేను. కాని ఆ తెలుసుకునే నేనుకి, సాక్షినైన నేను తెలుసుకోవాలనుకుంటేనే ఉనికి ఉంటుంది. లేకపోతే లేదు. అంటే ప్రమాత ఉనికి సాక్షిమీద ఆధారపడివుంది.

**ప్రమాతకు స్వతంత్ర సత్తా లేదు**

ఇంతవరకూ చూసిన మూడు అంశాలనూ క్రోడీకరించి చూస్తే – ప్రమేయానికీ, ప్రమాతకూ కూడా పరతంత్ర సత్తా మాత్రమే ఉంది. ప్రమేయం దాని ఉనికికి ప్రమాతమీద ఆధారపడితే, ప్రమాత సాక్షి లేదా ఆత్మమీద ఆధారపడుతుంది. ఈ రెండు వాక్యాలనూ కలిపితే, ప్రమేయం, ప్రమాత రెండూ సాక్షినైన నామీదనే వాటి ఉనికికి ఆధారపడతాయి. కాకపోతే వాటి మధ్య చిన్న భేదం ఉంది. ప్రమాత ప్రత్యక్షంగా నామీద ఆధారపడితే, ప్రమేయం పరోక్షంగా నామీద ఆధారపడింది.

నేను ఒక వ్యక్తికి 2 లక్షలు అప్పిచ్చాను; అప్పుతీసుకున్నతను అందులోంచి ఇంకొక వ్యక్తికి ఒక లక్ష అప్పిచ్చాడు అనుకుందాము. ఇద్దరూ నామీదే ఆధారపడినట్టే అర్థం. రెండవవ్యక్తి మొదటివ్యక్తిమీద ఆధారపడ్డాడు నిజమే, కాని ఆ మొదటివ్యక్తికి ఆ డబ్బు ఎక్కడిది? నానుంచే వచ్చింది కదా! ఆ విధంగా ఇద్దరూ నామీదే ఆధారపడ్డారు. ఆ విధంగా తెలుసుకునే వ్యక్తి, తెలుసుకోబడే వస్తువు కూడా నామీదే, సాక్షిచైతన్యమైన నామీదే ఆధారపడ్డారు.

**ప్రమాత, ప్రమేయాలది పరతంత్ర సత్తా.**

4. **మిథ్యా నామరూపమ్** – ఇక్కడకు, మనం వేరే ఉపనిషత్తుల్లో నేర్చుకున్న కొన్ని కాన్సెప్టులను తెచ్చుకోవాలి. **దేనికైతే పరతంత్ర సత్తా ఉంటుందో అది మిథ్య**

మిథ్య అంటే దానికి విడిగా ఉనికి లేదు. ఈ సూత్రం ప్రకారం ప్రమాత, ప్రమేయం రెండూ మిథ్య అని చెప్పవచ్చు. రెండింటికీ విడిగా ఉనికి లేదు కాబట్టి.

తరువాత ఏదైతే మిథ్యో, అది కేవలం నామం, రూపం మాత్రమే అని చెప్పవచ్చు.

**నామరూపాత్మకమ్** – అవి సత్యవస్తువుమీద ఆధారపడతాయి. సత్యవస్తువును నేను, ఆత్మను, సాక్షిచైతన్యాన్ని.

దీన్నే తిరగేసి చెప్పాలంటే సత్య ఆత్మనైన నేనే ప్రమాతగా, ప్రమేయంగా మిథ్యా నామరూపాలతో ప్రకటితమవుతున్నాను. నేను ప్రమాత, ప్రమేయాల వేషాలను ధరిస్తున్నాను.

5. **ఆత్మయొక్క వేషాలు** – ఇంకొక మెట్టు పైకి ఎక్కుదాము. కనిపిస్తున్న వీటిని మూడు తెగల కింద విభజించవచ్చు.

ఎ) స్థూలనామరూపం – జాగ్రదవస్థలో
బి) సూక్ష్మనామరూపం – స్వప్నావస్థలో
సి) కారణనామరూపం – సుషుప్తి అవస్థలో

జాగ్రదవస్థలో సాక్షినైన నేను స్థూల, మిథ్యా నామరూపాలలో, జాగ్రత్ ప్రమాత, జాగ్రత్ ప్రమేయంగా వేషాలు వేసుకుంటాను. అప్పుడు నా వేషం పేరు స్థూల ఆత్మా.

స్వప్నావస్థలో సూక్ష్మమిథ్యా నామరూపాలతో, స్వప్నప్రమాత, స్వప్నప్రమేయంగా వేషాలు వేసుకుంటాను. అప్పుడు నా వేషం పేరు సూక్ష్మ ఆత్మా.

సుషుప్తి అవస్థలో కారణమిథ్యా నామరూపాలతో, సుషుప్తి ప్రమాత, సుషుప్తి ప్రమేయంగా వేషాలు వేసుకుంటాను కాని అవి అవ్యక్తదశలో ఉంటాయి. అప్పుడు నా వేషం పేరు కారణ ఆత్మా. వీటిని మళ్ళీ చూద్దాము.

| | | | | |
|---|---|---|---|---|
| స్థూల ఆత్మా | = | జాగ్రత్ ప్రమాత | + | జాగ్రత్ ప్రమేయం |
| సూక్ష్మ ఆత్మా | = | స్వప్నప్రమాత | + | స్వప్న ప్రమేయం |
| సుషుప్తి ఆత్మా | = | సుప్తప్రమాత | + | సుషుప్తి ప్రమేయం |

అంటే ఆత్మనైన నేను వేసుకునే మూడు వేషాలు ఇవి. నేను, నా పరంగా చూస్తే, నేను **తురీయ ఆత్మా**. పైన చెప్పినవేవీ కాదు. అవి నా వేషాలు మాత్రమే.

**ప్రమాతృప్రమేయ విలక్షణ ఆత్మా అహమస్మి**

ఏదైనా వేషం వేస్తున్నప్పుడు ఆ వేషానికి తగ్గ ఆత్మను నేను. ఏ వేషమూ వేయనప్పుడు నేను తురీయ ఆత్మను. ఆ విధంగా నాకు నాలుగు అంశాలు లేదా లక్షణాలు ఉన్నాయి.

వాటినే పాదాలు అంటున్నది ఉపనిషత్. ఆ నాలుగు అంశాలు – స్థూల ఆత్మా, సూక్ష్మ ఆత్మా, కారణ ఆత్మా, తురీయ ఆత్మా. అందువల్లనే ఆత్మను చతుష్పాత్ ఆత్మా అంది ఉపనిషత్.

**స్థూల ఆత్మా సూక్ష్మ ఆత్మా కారణ ఆత్మా తురీయ ఆత్మా రూపేణ అహం చతుష్పాత్ ఆత్మా భవామి**

నాలుగు పాదాలు ఉంటే వీటిలో ఏది సత్యం అని సందేహం రావచ్చు. మొదటి మూడూ మిథ్య. ఎందుకంటే అవి మిథ్యా నామరూపాలతో ఉన్నాయి. నాలుగవ పాదం ఒక్కటే శుద్ధచైతన్యం. అదే సత్యం. అంటే ఆత్మనైన నాకు ఒక సత్యపాదం, మూడు మిథ్యా పాదాలు ఉన్నాయి. అన్నీ కలిసి చతుష్పాద ఆత్మను అయ్యాను. **సోఽయమాత్మా చతుష్పాత్.**

3–7 మంత్రాల్లో వీటి గురించి వివరంగా చెప్పుకొస్తుంది ఉపనిషత్. మూడవ మంత్రం స్థూల ఆత్మ గురించి, నాలుగవ మంత్రం సూక్ష్మ ఆత్మ గురించి, ఐదు, ఆరు మంత్రాలు కారణ ఆత్మ గురించి చెబితే, ఏడవ మంత్రం తురీయ ఆత్మ గురించి బోధిస్తుంది. ఏడవ మంత్రం ఉపనిషత్తు మంత్రాలలోనే తలమానికమైన మంత్రం. ఈ ఆత్మల గురించి మూడు అవస్థలద్వారా విచారణ చేస్తుంది కాబట్టి, ఈ చతుష్పాద ఆత్మ విచారణను అవస్థాత్రయ విచారణ అని కూడా అంటారు.

**అవస్థాత్రయ విచార రూప చతుష్పాద ఆత్మా విచారః**

ఈ స్థూల, సూక్ష్మ, కారణ ఆత్మలలో మళ్ళీ రెండు భాగాలు ఉన్నాయి. అవి ప్రమాత, ప్రమేయం. కాకపోతే సుషుప్తి అవస్థ అవ్యక్త అవస్థ కాబట్టి అందులో ఈ ప్రమాత, ప్రమేయం భేదం ప్రస్ఫుటంగా వ్యక్తమవదు.

ఈ మూడూ నేను వేసుకున్న వేషాలు. నేను ప్రమాతను కాను, ప్రమేయాన్ని కాను.

**ప్రమాతృ ప్రమేయ విలక్షణ కేవల చైతన్య రూపః తురీయ ఆత్మా అహమస్మి**

ఇదే మనం నేర్చుకునే వరుసక్రమం. ఇప్పుడు ఈ ఆత్మవిచారణలోకి అడుగు పెడదాము.

**మంత్రం 1**

**ఓమిత్యేతదక్షరమిదగ్ం సర్వం తస్యోపవ్యాఖ్యానం భూతం భవద్భవిష్యదితి**
**సర్వమోంకార ఏవ । యచ్చాన్యత్త్రికాలాతీతం తదప్యోంకార ఏవ ॥**

1) **ఉపోద్ఘాతం – ఓంకార విచారణ – మంత్రం 1**

మొదటి మంత్రం ఓంకార విచారణను ప్రవేశపెడుతుంది.

**ఇదగ్ం సర్వమ్** – ఈ సృష్టి మొత్తం. పారాయణంలో గ్ శబ్దం కొన్ని అక్షరాల ముందు వస్తుంది. ఆ అక్షరాలు శ,ష,స,హ,ర. ఇక్కడ అర్థం చేసుకునేటప్పుడు ఇదగ్ం బదులు ఇదం అని తీసుకోవాలి. ఇదం సర్వం అంటే ఈ సృష్టిమొత్తం,

**ఓమిత్యేతదక్షరమ్** – ఓంకారం పవిత్రమంత్రం. అక్షరం అంటే ఏకాక్షరం. ఓంకారం గురించి అన్ని ఉపనిషత్తుల్లోనూ వస్తుంది.

**యశ్ఛందసామృషభో విశ్వరూపః** – తైత్తిరీయమ్

ఛాందోగ్యోపనిషత్తులో బ్రహ్మదేవుడు వేదాలను చిలికి చివరగా ఓంకారాన్ని తీశాడు అని వస్తుంది.

మూడు (భూ, భువ, సువః) లోకాల సారం – మూడు దేవతలు
మూడు (అగ్ని, వాయువు, ఆదిత్యుడు) దేవతల సారం – మూడు వేదాలు
మూడు (ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం) వేదాల సారం – గాయత్రీ మంత్రం మూడు పాదాలు
గాయత్రీ మంత్రం మూడు పాదాల సారం – మూడు వ్యాహృతులు
మూడు (భూ, భువ, సువః) వ్యాహృతుల సారం – మూడు మాత్రలు
మూడు (అ, ఉ, మ) మాత్రల సారం – ఓంకారం.

యజ్ఞాలు చేసేటప్పుడు, నిత్యకర్మల్లో, బ్రహ్మచారి అధ్యయనం చేసేటప్పుడు – అన్నింటిలోనూ ఓంకారం వస్తుంది.

**ఓమితి బ్రహ్మ। ఓమితీదగ్ం సర్వమ్। ఓమిత్యేతదనుకృతిః।**
**హ స్మ వా అప్యో(శ్రావయేత్యా(శ్రావయన్తి। ఓమితి సామాని గాయన్తి।**
**ఓగ్ం శోమితి శస్త్రాణి శగ్ంసన్తి।** – తైత్తిరీయమ్

యజ్ఞాలు చేసేటప్పుడు, మొదలుపెట్టటానికి, అనుమతి ఇవ్వటానికి, అలా అనేక సందర్భాలలో ఓం పలుకుతారు.

ఇక్కడ ఈ మాండూక్యోపనిషత్ ఓంకారాన్ని కీర్తిస్తున్నది. ఈ ఓంకారమే మొత్తం సృష్టి. ఓంకారమే సృష్టి కాబట్టి, సృష్టి గురించి తెలుసుకోవాలంటే, ఓంకారం గురించి తెలుసుకుంటే చాలు. ఎటువంటి సృష్టి?

**భూతం భవద్భవిష్యదితి** – భూత, వర్తమాన, భవిష్యత్తు అనే మూడు కాలాల్లోనూ ఉన్న సృష్టి.

**సర్వమోంకార ఏవ** – ఈ మూడు కాలాలూ ఓంకారమే. అంతేకాదు,

**యచ్చాన్యత్త్రికాలాతీతం తదప్యోంకార ఏవ** – ఈ భూత, వర్తమాన, భవిష్యత్తు కాలాల్లోకి రానిది ఏదైనా ఉంటే, అది కూడా ఓంకారమే. అంటే ఓంకారం కాలంలో ఉన్నదానికీ, కాలాతీతమైనదానికీ ప్రతీక. అంటే వ్యావహారిక ప్రపంచానికే కాదు పారమార్థిక సత్యానికి కూడా ప్రతీక. కాలాతీతంగా ఉన్నదేమిటి? చైతన్యం, మాయ, అవిద్య, బ్రహ్మ. ఇవన్నీ కూడా ఓంకారమే.

ఒక్కముక్కలో చెప్పాలంటే ఓం = సర్వం.

అందువల్ల ఓంకార విచారణ చేస్తే అన్నింటి గురించిన విచారణ చేసినట్టు అర్థం. అందువల్ల,

ఓంకార విచారణ = సృష్టి విచారణ

**తస్యోపవ్యాఖ్యానమ్** – అందువల్ల మనం ఓంకార విచారణ చేయబోతున్నాము. తస్య అంటే ఓంకారంయొక్క; ఉపవ్యాఖ్యానం అంటే విచారణ.

**ఓంకారస్య విచారః ఆరభ్యతే**

పురాణగాథలో వినాయకుణ్ణీ, సుబ్రహ్మణ్యస్వామినీ ప్రపంచం అంతా తిరిగి రమ్మంటే, వెంటనే తన నెమలి వాహనంమీద దూసుకువెళ్ళిపోయాడు సుబ్రహ్మణ్యస్వామి. వినాయకుడు తన తల్లిదండ్రుల చుట్టూ ప్రదక్షిణం చేశాడు. వారు జగత్తుకే మాతాపితలు కదా. వారికి ప్రదక్షిణ చేస్తే, జగత్తుకు ప్రదక్షిణం చేసినట్టు.

అదే విధంగా, మనకు కూడా సూక్ష్మమైన మార్గాన్ని సూచిస్తున్నది ఉపనిషత్తు. ఓంకార విచారణ ద్వారా జగత్తు విచారణ చూడబోతున్నాము. ఈ అంశాన్ని ఉపోద్ఘాతంగా మొదటి మంత్రంలో పరిచయం చేసింది ఉపనిషత్తు. కాని ఓంకార విచారణను 8–12 మంత్రాల్లోనే చూస్తాము. అంతవరకూ ఆగుదాము.

## మంత్రం 2

**సర్వగ్ం హ్యేతద్బ్రహ్మాయమాత్మా బ్రహ్మ సోఽయమాత్మా చతుష్పాత్॥**

**1) ఉపోద్ఘాతం – ఆత్మవిచారణ – మంత్రం 2**

ఈ మంత్రంలో ఈ ఉపనిషత్తులోని రెండవ అంశమైన ఆత్మవిచారణయొక్క ఉపోద్ఘాతాన్ని చూస్తాము.

**ఏతత్ సర్వగ్ం బ్రహ్మ** – ఏతత్ సర్వం అంటే ఈ జగత్తు మొత్తం. కాలం గురించి వచ్చిన మాటలు మొదటి మంత్రంలోంచి ఇక్కడకు తెచ్చుకోవాలి.

**భూతం భవద్భవిష్యదితి** – భూత, వర్తమాన, భవిష్యత్తు అనే మూడు కాలాల్లోనూ ఉన్న సృష్టి మొత్తం బ్రహ్మ.

**యచ్చాన్యత్త్రికాలాతీతమ్** – ఈ భూత, వర్తమాన, భవిష్యత్తు కాలాల్లోకి రానిది ఏదైనా ఉంటే, అది కూడా బ్రహ్మే. అంటే కాల అంతర్గత, కాల బహిర్గత సర్వమూ బ్రహ్మే.

ముందు మంత్రంలో వచ్చిన ఈక్వేషన్ ఓం = సర్వం.

ఈ మంత్రంలో వచ్చిన ఈక్వేషన్ సర్వం = బ్రహ్మ.

అక్కడేమో ఓంకార విచారణ చేస్తే సర్వవిచారణ చేసినట్టు అని అర్థం వచ్చింది. ఇక్కడేమో బ్రహ్మవిచారణ చేస్తే సర్వవిచారణ చేసినట్టు అని అర్థం. ఎటువంటి బ్రహ్మ?

**అయమాత్మా బ్రహ్మ** – అయమ్ ఆత్మా బ్రహ్మ. బ్రహ్మ అంటే వేరే ఏమిటో కాదు, ఈ ఆత్మే. ఆత్మ అంటే నేను. అయం పదం 'నేను'ను సూచిస్తుంది. ఈ నేను దగ్గరగా, ఎప్పుడూ అందుబాటులో ఉంటాను. అది ఎన్నడూ పరోక్ష విషయం కాదు.

అయం = అపరోక్షతయా ఉపలభ్యమానః

అంటే ఎప్పుడూ అందుబాటులో ఉంటాను. ఈ మంత్రంలోనే మనకు రెండు ఈక్వేషన్లు వచ్చాయి.

సర్వం = బ్రహ్మ; బ్రహ్మ = ఆత్మ

అందువల్ల సర్వం = ఆత్మ.

ఎ = బి; బి = సి అయితే ఎ = సి అవాలి.

**తదభిన్నం తదభిన్నాదభిన్నమ్ ఇతి న్యాయః**

అందువల్ల ఆత్మవిచారణ = సర్వవిచారణ.

మొదటి మంత్రంలో ఓంకార విచారణ గురించి వస్తే, ఇక్కడ ఆత్మవిచారణ గురించి వచ్చింది. చూడటానికి రెండు భిన్నవిచారణలుగా ఉన్నా కూడా, ఈ రెండింటి గమ్యం ఒకటే. ఓంకార విచారణద్వారా సర్వవిచారణ చేస్తాము; ఆత్మవిచారణద్వారా కూడా సర్వవిచారణ చేస్తాము. అంటే ఒకటే జ్ఞానం పొందటానికి రెండు మార్గాలు ఉపయోగిస్తాము అంతే.

**కస్మిన్ విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి?**
**ఓంకారజ్ఞః సర్వజ్ఞః భవతి**
**ఆత్మజ్ఞః సర్వజ్ఞః భవతి**

ఇక్కడ ఇంకొక విషయం గమనించాలి మనం. అయమాత్మా బ్రహ్మ ఒక మహావాక్యం. జీవాత్మ, పరమాత్మల ఐక్యాన్ని బోధించే ఏ వాక్యమైనా మహావాక్యమే. అలాంటి మహావాక్యాలు అనేకం ఉన్నాయి అన్ని ఉపనిషత్తుల్లోనూ. కాని మహావాక్యం అంటే ఏమిటో తెలియటానికి నాలుగు వేదాల్లోంచి నాలుగు మహావాక్యాలను ఉదాహరణగా తీసుకున్నారు. అవి –

| **వేదం** | **ఉపనిషత్తు** | **మహావాక్యం** |
|---|---|---|
| సామవేదం | ఛాందోగ్యోపనిషత్ | తత్త్వమసి |
| ఋగ్వేదం | ఐతరేయోపనిషత్ | ప్రజ్ఞానం బ్రహ్మ |
| యజుర్వేదం | బృహదారణ్యకోపనిషత్ | అహం బ్రహ్మాస్మి |
| అథర్వణవేదం | మాండూక్యోపనిషత్ | అయమాత్మా బ్రహ్మ |

ఈ మాండూక్యోపనిషత్‌లో మహావాక్యం ఉండటంవల్ల కూడా ఇది ముఖ్యమైన ఉపనిషత్తు.

ఈ మొదటి రెండు మంత్రాల్లోనూ, రెండు విచారణలనూ పరిచయం చేశాక, ఉపనిషత్తు వాటిని వివరించదలుచుకుంది కాని అది వివరించేటప్పుడు వరుస క్రమాన్ని మారుస్తున్నది. ముందు ఓంకార విచారణను పరిచయం చేశాక ఆత్మవిచారణను పరిచయం చేసింది. కాని ఇప్పుడేమో ముందు ఆత్మవిచారణను చేయబోతున్నది.

**సోऽయమాత్మా చతుష్పాత్** – రెండవ మంత్రంలోని ఈ వాక్యంతోనే ఆత్మవిచారణ మొదలవుతుంది. ఈ ఆత్మవిచారణ ఏడవ మంత్రంవరకూ కొనసాగుతుంది. ఈ ఆత్మ చతుష్పాద ఆత్మా అంటున్నది ఉపనిషత్తు. అంటే నాలుగు పాదాలు ఉన్న ఆత్మ అని అర్థం. పాదం అర్థం అక్షరాలా చూస్తే, కాలిపాదం. కాని ఇక్కడ లక్షణం లేదా అంశంగా లేదా విభాగంగా తీసుకోవాలి.

2) **చతుష్పాద ఆత్మ విచారణ: మంత్రాలు 3–7**

ఐదు మంత్రాలు ఆత్మయొక్క నాలుగు పాదాల గురించి వివరిస్తాయి. ఆత్మ అంటే ఎవరో కాదు, నేను.

ఎ) **మంత్రం 3** – ఈ మంత్రం స్థూల ఆత్మను వివరిస్తుంది. ఈ ఆత్మ జాగ్రదవస్థలో, జాగ్రత్ ప్రపంచంలో వ్యవహారం నడుపుతుంది. అందువల్ల అది బహిష్ప్రజ్ఞః. ఈ జంట పేరు విశ్వ–విరాట్.

బి) **మంత్రం 4** – ఈ మంత్రం సూక్ష్మ ఆత్మను వివరిస్తుంది. ఈ ఆత్మ స్వప్నావస్థలో, స్వప్నప్రపంచాన్ని చూస్తుంది. అందువల్ల అది అంతఃప్రజ్ఞ. ఈ జంట పేరు తైజస– హిరణ్యగర్భ.

సి) **మంత్రాలు 5, 6** – ఈ మంత్రాలు కారణ ఆత్మను వివరిస్తాయి. ఈ ఆత్మ సుషుప్తి అవస్థలో, కారణశరీరంలో లయమవుతుంది. ఏమీ కార్యక్రమాలు ఉండవు కాబట్టి ప్రజ్ఞానఘనః. ఈ జంట పేరు ప్రాజ్ఞ–ఈశ్వర.

ఈ విధంగా ఈ మూడు పాదాలు గుణాలున్న ఆత్మను వివరిస్తాయి.

డి) **మంత్రం 7** – అసలు ఆత్మయొక్క నిర్వచనంలోకి అడుగుపెడుతుంది ఉపనిషత్ ఈ మంత్రంలో. అందువల్ల ఇది చాలా ముఖ్యమైన మంత్రం. అసలు నేను ఎవరు? నా స్వరూపం ఏమిటి? అది మూడు భాగాలుగా వివరిస్తుంది.

**ప్రమాతృత్రయ విలక్షణమ్** –

**నాంతః ప్రజ్ఞం న బహిష్ప్రజ్ఞం నోభయతః ప్రజ్ఞం న ప్రజ్ఞానఘనం న ప్రజ్ఞం నాప్రజ్ఞమ్।**

తురీయమైన నేను బహిష్ప్రజ్ఞ కాదు, అంతఃప్రజ్ఞ కాదు, ఘనఃప్రజ్ఞ కాదు అంటే ఈ విశ్వ, తైజస, ప్రాజ్ఞులను కాదు. అవి నేను వేసుకున్న వేషాలు. ఆ విధంగా ప్రమాతృత్రయ విలక్షణమ్.

**ప్రమేయత్రయ విలక్షణమ్** –

**అదృష్టమవ్యవహార్యమగ్రాహ్యమలక్షణమచింత్యమవ్యపదేశ్యమ్**

పంచజ్ఞానేంద్రియాలకు, పంచకర్మేంద్రియాలకు, అనుమాన ప్రమాణానికి, మనోవృత్తికి, వాక్కుకి అందదు. అంటే సర్వప్రమాణ అగోచరమ్. ఆ విధంగా ప్రమేయత్రయ విలక్షణమ్.

**ప్రమాతృ ప్రమేయత్రయ అధిష్ఠానమ్** –

**ఏకాత్మ ప్రత్యయసారం ప్రపంచోపశమం శాంతం శివమద్వైతం చతుర్థం మన్యంతే స ఆత్మా స విజ్ఞేయః॥**

ఒకే ఆత్మ ప్రత్యయ ప్రమాణంగా కలది. ప్రపంచం మిథ్య, తురీయం సత్యం. ఈ అద్వైతతురీయాన్ని నాలుగవ అవస్థ అని అజ్ఞానులు పొరపాటు పడతారు. తురీయం నాలుగవ పాదం, మూడు అవస్థల్లోనూ అధిష్ఠానంగా ఉంటుంది. అది శాంతం, శివం. అదే ఆత్మ, దాన్ని తెలుసుకో.

నేను తురీయాన్ని అని తెలుసుకోవటమెలా? నాకు జాగ్రదవస్థలో ఉన్న విశ్వ తెలుసు; స్వప్నావస్థలో ఉన్న తైజస తెలుసు, సుషుప్తి అవస్థలో ఉన్న ప్రాజ్ఞ తెలుసు; ఈ తురీయం, తురీయ అవస్థలో దొరుకుతుందా? నిర్వికల్ప సమాధిలో దొరుకుతుందా? అలాంటి నాలుగవ అవస్థ లేనేలేదు; నిర్వికల్ప సమాధిలోనూ దొరకదు. దానికి ఒకటే మాట వేసింది ఉపనిషత్–

ఏకాత్మప్రత్యయసారమ్. నిర్గుణచైతన్యం సగుణచైతన్యం అంతటా ఉంటుంది. తురీయం విశ్వ, తైజస, ప్రాజ్ఞ – మూడింటిలోనూ ఉంది. తురీయాన్ని తెలుసుకోవటంకోసం నాలుగవ అవస్థకోసం వెతకకూడదు. జాగ్రదవస్థలో ఉంటూ, విశ్వద్వారా తురీయానికి వెళ్ళాలి. అదెలా?

సగుణ నేను – (మైనస్) గుణం = నిర్గుణ నేను
తండ్రి నేను – (మైనస్) తండ్రి హోదా = శుద్ధ నేను

అలా నేను తర్వాత ఏ పదం వేసినా అది ఒక గుణం అవుతుంది.

తురీయాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఇప్పుడు మనం సాంకేతిక రంగంలోకి అడుగు పెడుతున్నాము. ఈ అనువృత్తి ద్వారా తురీయాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఈ నేను ఎరుకలో ఏమిటి సమానంగా ఉంది? నేను చైతన్యాన్ని. నేను జడమైతే నాకు, నేను అనే ఎరుక ఉండదు. నా జీవితంలో వచ్చే అన్ని దశల్లోనూ నేను నిరంతరంగా కొనసాగుతున్నాను. ఈ నేనుకు కొన్ని గుణాలు కలుపుతూ వస్తాను. నేను అప్పుడు విచారంగా ఉన్నాను; ఇప్పుడు ఆనందంగా ఉన్నాను; నేను అప్పుడు కృంగిపోయాను; ఇప్పుడు తిప్పుకున్నాను అంటాను. అంటే ఒకప్పుడు ఉన్న భావోద్రేకం ఇప్పుడు లేదు. నాకు ఈ భావోద్రేకాలన్నీ తెలుస్తున్నాయి. నేను చైతన్యతత్త్వాన్ని, నేను దుఃఖంలోనూ ఉన్నాను, ఆనందంలోనూ ఉన్నాను. ఈ భావోద్రేకాలు మారుతూ ఉంటాయి కాబట్టి, అవి నా స్వరూపం కాదు.

ఇప్పుడు ఈ నిరంతరం నేను సంతోషంగా ఉండే నేనా, దుఃఖంతో ఉండే నేనా? సంతోషంగా ఉండే నేను నా స్వరూపం అయితే, నేను ఎప్పుడూ సంతోషంగా ఉండాలి; కాని దుఃఖంతో ఉండే నేను నా స్వరూపం అయితే నేను ఎప్పుడూ దుఃఖంతో ఉండాలి. అలాగే బాలుడు అయిన నేను నా స్వరూపం అయితే నేను ఎప్పుడూ బాలునిగానే ఉండాలి. అంటే 'నేను' పదం తర్వాత కలిపినవేవీ నేను కాదు. అవి నాకు ఆపాదించబడ్డ గుణాలు. అవేవీ నేను కాను.

నేను ఆనందంగా ఉన్నాను = ఆనందం గుణం + చైతన్యమైన నేను
నేను బాలునిగా ఉన్నాను = బాలుని గుణం + చైతన్యమైన నేను

ఈ ఆనందం, బాలుడు అనే గుణాలకు రాకపోకలు ఉన్నాయి. అంటే అవి వచ్చిపోతాయి. ఈ వాక్యాల్లో సమానంగా ఉన్న లక్షణం, చైతన్యమైన నేను. ఆనందం ఉన్నా, లేకపోయినా చైతన్యమైన నేను ఉన్నాను. నేను బాల్యదశలో ఉన్నా, దాటిపోయినా కూడా నేను చైతన్యంగా ఉన్నాను. అంటే తురీయాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? నేను తర్వాత కలిపిన గుణాన్ని వదిలివేయాలి. ముందు వాక్యాన్ని మళ్ళీ చూద్దాము.

నేను బాలునిగా ఉన్నాను = అనువృత్తి అయిన నేను + వ్యావృత్తి అయిన బాలుడు

వ్యావృత్తి తీసేస్తే మిగిలేది ఏమిటి? అనువృత్తి అయిన నేను.

నేను బాలునిగా ఉన్నాను – బాలుడు = నేను ఉన్నాను
నేను ఆనందంగా ఉన్నాను – ఆనందం = నేను ఉన్నాను

ఈ వాక్యాలన్నింటిలోనూ సమానంగా ఉన్నది నేను. ఆ నేను శుద్ధచైతన్యం. ఉపనిషత్ దీన్నే ఏకాత్మ ప్రత్యయసారం అంటున్నది. ఈ సూత్రాన్ని బంగారం, ఆభరణాలకు అన్వయిస్తే తేలిగ్గా అర్థం చేసుకోగలము.

బంగారం గాజు – గాజు = బంగారం
బంగారం గొలుసు – గొలుసు = బంగారం
బంగారం ఉంగరం – ఉంగరం = బంగారం

ఈ మూడు పదాల్లోనూ సమానంగా ఉన్న పదం బంగారం. గాజు, గొలుసు, ఉంగరం వచ్చి, పోతాయి. అవి నామరూపాలు మాత్రమే. నామరూపాలు ఆగమాపాయి, బంగారం అనాగమాపాయి. ఇప్పుడు ఇదే సూత్రాన్ని తురీయానికి అన్వయిద్దాము.

విశ్వ, తైజస, ప్రాజ్ఞలను తీసుకుని వాటిని విశ్లేషించాలి.

విశ్వ నేను – బహిష్ప్రజ్ఞః; తురీయం నేను – న బహిష్ప్రజ్ఞః
తైజస నేను – అంతః ప్రజ్ఞః; తురీయం నేను – న అంతః ప్రజ్ఞః
ప్రాజ్ఞ నేను – ప్రజ్ఞానఘనః; తురీయం నేను – న ఘనప్రజ్ఞః

మరి ఇవేవీ కాకపోతే నేనెవరు? శాంతం శివమద్వైతమ్.

చిదానందరూపః శివోఽహం శివోఽహమ్.

**ప్రపంచోపశమమ్** – ప్రపంచం అంటే మూడు పాదాల్లోనూ చెప్పబడిన మూడు ప్రపంచాలు. అవి స్థూలప్రపంచం, సూక్ష్మప్రపంచం, కారణప్రపంచం. తురీయం ఈ మూడు ప్రపంచాలనుంచి విముక్తి పొందింది అంటున్నది ఉపనిషత్తు. ఉపశమం అంటే రహితం. అంటే చైతన్యంలో ప్రపంచం లేదు. ఈ **ప్రపంచోపశమమ్** పదం చాలా ముఖ్యమైనది. గౌడపాదాచార్యులవారు మొత్తం రెండవ అధ్యాయాన్ని ఈ పదవిశ్లేషణకు కేటాయించారు. దాన్ని వైతథ్యప్రకరణం అంటారు. వైతథ్యం అంటే మిథ్య. జగత్తు ఎలా మిథ్యో, అక్కడ లోతుగా విశ్లేషిస్తారు.

ఉపనిషత్తు ప్రపంచాన్ని తోసిపుచ్చుతున్నది అంటే ప్రపంచం సత్‌లోకీ రాదు, అసత్‌లోకీ రాదు అని అర్థం. అంటే ఒక కాలంలో ఉండి, ఇంకొక కాలంలో ఉండదు. స్వప్నంనుంచి లేస్తే స్వప్నప్రపంచం ఉండదు. స్వప్నంలోకి జారుకుంటే జాగ్రత్ ప్రపంచమూ ఉండదు. అంతేకాదు, అద్వైతం స్థాయికి ఎదిగితే, అప్పుడు కూడా అది అసత్ అవుతుంది. అందువల్ల ప్రపంచోపశమం అంటే మూడు పాదాలూ మిథ్య, మూడు ప్రపంచాలూ మిథ్య. ఇది మనను తరువాత వచ్చే పదానికి తీసుకువెళుతుంది.

**అద్వైతమ్** – ఆత్మకు నాలుగు పాదాలు ఉన్నాయని చెప్పి, మొదటి మూడు పాదాలను త్రోసిపుచ్చాలి అంటే మిగిలేది ఏమిటి? నాలుగవ పాదం మాత్రమే. అదే తురీయం. **ఏకమేవాద్వితీయమ్.** తురీయం అంటే రెండవది లేని చైతన్యతత్త్వం. చైతన్యం మాత్రమే సత్యం, పదార్థం మిథ్య. అందువల్ల పదార్థం ఉన్నా లేనట్టే. అందువల్ల రెండు వస్తువులు ఉన్నాయనకూడదు. చైతన్యం, పదార్థం ఉన్నాయనకూడదు. ఉన్నదొకటే చైతన్యం; రెండవది లేని అద్వైతం. ఈ పదం కూడా ఈ మంత్రంలో చాలా ముఖ్యమైనది. గౌడపాదాచార్యుల వారు ఈ పదాన్ని విశ్లేషిస్తూ, ఇదే పేరుతో (అద్వైతప్రకరణమ్) మూడవ అధ్యాయంలో 48 కారికల్లో వివరిస్తారు.

**చతుర్థం మన్యంతే** – ఈ అద్వైతాన్ని నాలుగవ అంశం అని భావిస్తారు కొందరు. ఒకపక్క తురీయం అద్వైతం అంటూ, ఇంకొకపక్క అది నాలుగవది అని ఎలా అంటారు? అందువల్ల ఉపనిషత్తు తురీయం గురించి తెలియనివారు నాలుగవ అంశం అని భావిస్తారు అంటున్నది. వారు విశ్వ, తైజస, ప్రాజ్ఞులు కూడా తురీయం అంత సత్యం అనుకుంటారు. అందువల్ల వారికి తురీయం నాలుగవ అంశం. కాని జ్ఞానులకు తురీయం ఒక్కటే ఉంది, అది అద్వైతం, తక్కిన మూడూ మిథ్య.

టూకీగా చెప్పాలంటే, తురీయం జ్ఞానులకు అద్వైతం, అజ్ఞానులకు నాలుగవ అంశం.

**శాంతమ్** – తురీయం దృష్ట్యా ప్రపంచం మిథ్య కాబట్టి, ప్రపంచం తురీయాన్ని బాధపెట్టలేదు. అందువల్ల తురీయం శాంతం. కలలో వాన కురిస్తే, జాగ్రత్ పురుషుడు తడవడు; కలలో రేగిన అగ్నిజ్వాలలు జాగ్రత్ పురుషుణ్ణి కాల్చలేవు; కలలో ఎవరైనా కత్తితో పొడిచినా, జాగ్రత్ పురుషునికి దెబ్బ తగలదు. ఎందుకు? ఏదైతే మిథ్యో, అది సత్యాన్ని చలింపజేయలేదు. అలాగే, తురీయపరంగా జాగ్రత్ ప్రపంచం మిథ్య కాబట్టి, అది తురీయాన్ని చలింపజేయలేదు. అంటే మిథ్య. సత్యాన్ని బాధించలేదు. అందువల్ల తురీయం ఎప్పటికీ శాంతమ్.

**శివమ్** – శివం అంటే మంగళరూపం లేదా ఆనందస్వరూపం. శాంతం అంటే దుఃఖరహితం; శివం అంటే ఆనందస్వరూపం.

**స ఆత్మా** – ఈ తురీయమే అసలు ఆత్మా. నేను అంటే జాగ్రత్ పురుషుడైన విశ్వ కాదు; స్వప్నపురుషుడైన తైజస కాదు; సుప్తపురుషుడైన ప్రాజ్ఞ కాదు. నేను అంటే గుణాలులేని తురీయాన్ని.

**స విజ్ఞేయః** – ఇది తెలుసుకోగాక! జీవితంలో తెలుసుకుని తీరాల్సింది ఏదైనా ఉందంటే, అది ఇదొక్కటే. నేను ప్రపంచంలో ఏమయినా దానివల్ల బాధింపబడని తురీయాన్ని.

**ప్రమాతృప్రమేయ విలక్షణ తురీయ ఆత్మా అహమస్మి**

(ఇదంతా **పట్టిక 4 – చతుర్థం మన్యంతే స ఆత్మా స విజ్ఞేయః అనే వాక్యంలో** ఈ అధ్యాయం చివర్లో చూడవచ్చు.)

3) **చతుర్మాత్ర ఓంకార విచారణ – మంత్రాలు 8-12**

మాండూక్యోపనిషత్తు ఉపోద్ఘాతంలో ఈ ఉపనిషత్తు రెండు రకాల విచారణలను చేస్తున్నదని చూశాము. అవి –

1. చతుర్మాత్ర ఓంకార విచారణ – అకార,ఉకార,మకార, అమాత్రల విచారణ
2. చతుష్పాద ఆత్మ విచారణ – విశ్వ, తైజస, ప్రాజ్ఞ, తురీయాల విచారణ

ఈ రెండింటినీ మొదటి రెండు మంత్రాల్లోనూ ప్రవేశపెట్టాక, ముందు రెండవ అంశాన్ని చర్చించింది ఉపనిషత్తు. ముందు చతుష్పాద ఆత్మ విచారణను చేసింది. దాని సారాంశం–

**అవస్థాత్రయ విలక్షణ తురీయ ఆత్మా అహమస్మి**

దీన్ని గౌడపాదాచార్యులవారు మరింత లోతుగా విశ్లేషించి, ఈ నాలుగు పాదాల వివరణ చేసి, వాటి సాధర్మ్యం-వైధర్మ్యం చూపించి, తురీయాన్ని వివరించారు. దాని సారాంశం –

**అజ్ఞానం, పొరపాటుల విలక్షణమైన తురీయాన్ని నేను**

ఆత్మకు నాలుగు పాదాలు ఉన్నట్టుగా, ఓంకారానికి నాలుగు మాత్రలు ఉన్నాయి. అవి అకారమాత్ర, ఉకారమాత్ర, మకారమాత్ర, అమాత్ర. అమాత్ర అంటే ఓంకారం పలికాక వచ్చే నిశ్శబ్దం.

**మంత్రం 8** – ఓంకారాన్ని పూర్తిగా ఆత్మతో పోల్చి, ఒక్కొక్క మాత్రను ఒక్కొక్క పాదంతో పోల్చింది. (ఇక్కడ నాలుగవ మాత్ర – నాలుగవ పాదం జంట రాలేదు)

అ = విశ్వ/విరాట్; ఉ = తైజస/హిరణ్యగర్భ, మ = ప్రాజ్ఞ/ఈశ్వర; అమాత్ర = తురీయ ఆత్మ

**మంత్రాలు 9–11** – ఒక్కొక్క జంటయొక్క ఐక్య ఉపాసన, పోలిక, ఫలం చెబుతూ వచ్చింది.

| | | | |
|---|---|---|---|
| అకార – విశ్వ/విరాట్ | – | ఆప్తి | – ఆప్నోతి సర్వాన్ కామాన్ |
| ఐక్య ఉపాసన | | ఆది | – ఆదిశ్చ భవతి |
| ఉకార – తైజస/ హిరణ్యగర్భ | – | ఉత్కర్షః | – ఉత్కర్షతి |
| ఐక్య ఉపాసన | | ఉభయత్వమ్ | – సమానశ్చ భవతి |
| మకార – ప్రాజ్ఞ/ఈశ్వర | – | మితిః | – మినోతి ఇదం సర్వమ్ |
| ఐక్య ఉపాసన | | అపీతిః | – అపీతిశ్చ భవతి |

ఈ ఫలాలు సకామ ఉపాసనకు. నిష్కామ ఉపాసన చేస్తే నిదిధ్యాసనానికి మనస్సు సిద్ధం అవుతుంది. ఉపనిషత్ ముఖ్యోద్దేశం ఉపాసన కాని, ఈ ఫలాలు కాని కాదు; ఓంకార విచారణకు రమ్మంటుంది. అది మంత్రం 12లో చూస్తాము.

**మంత్రం 12**

> **అమాత్రశ్చతుర్థో౽ వ్యవహార్యః ప్రపంచోపశమశ్శివో౽ ద్వైత ఏవమోంకార**
> **ఆత్మైవ సంవిశత్యాత్మనా౽ ౽ త్మానం య ఏవం వేద ॥**

చతుష్పాద ఆత్మవిచారణలో (మంత్రాలు 3–7) ప్రపంచత్రయాన్ని నిషేధించటంద్వారా, ప్రపంచత్రయ అధిష్ఠానం తురీయం అని తెలుసుకున్నాము. అలాగే, ఇప్పుడు మాత్రత్రయాన్ని నిషేధించటంవల్ల అమాత్రను చేరుకున్నాము. అమాత్ర అంటే ఓంకారం పలికాక, వచ్చే నిశ్శబ్దం. ఈ నిశ్శబ్దాన్ని అమాత్ర అని ఎందుకంటారంటే, దీనికి సరిహద్దులు లేవు. అకార, ఉకార, మకారానికి సరిహద్దులు ఉన్నాయి. అమాత్రకు ఈ మంత్రంలో వచ్చిన నిర్వచనం, ఇంచుమించు తురీయానికి ఏడవ మంత్రంలో వచ్చిన నిర్వచనంతో సరిపోలుతుంది.

> **అదృష్టమవ్యవహార్యమగ్రాహ్యమలక్షణమచింత్యమవ్యపదేశ్యమేకాత్మప్రత్యయసారం**
> **ప్రప్రంచోపశమం శాంతం శివమద్వైతం చతుర్థం మన్యంతే స ఆత్మా స విజ్ఞేయః॥**
>
> – మంత్రం 7

అంటే ఓంకారంయొక్క సత్యమైన అమాత్ర, జగత్తుయొక్క సత్యమైన తురీయమే.

**అమాత్రశ్చతుర్థః** – తురీయం ఎలాగైతే చతుష్పాద ఆత్మయొక్క నాలుగవ పాదమో, అలా అమాత్ర చతుర్మాత్ర ఓంకారంయొక్క నాలుగవ మాత్ర.

**అవ్యవహార్యః** – అవ్యవహార్యః అంటే వ్యవహారాలకు అతీతం. తురీయం గురించి ఎలా మాట్లాడలేమో, అలాగే నిశ్శబ్దం గురించి కూడా మాట్లాడలేము. నిశ్శబ్దం గురించి మాట్లాడటం అనేదే పరస్పరవిరోధంగా ఉంది. ఒక వ్యక్తి నోరువిప్పి మాట్లాడితే, అతను ఏ భాష మాట్లాడుతున్నాడో చెప్పవచ్చు. ఒక గదిలో నలుగురు కూర్చుని నాలుగు దక్షిణ భారతీయ భాషలు మాట్లాడుతుంటే, ఇదిగో ఇతను మాట్లాడుతున్నది తెలుగు, ఇతను మాట్లాడుతున్నది తమిళం అని చెప్పవచ్చు. కాని వారు మాటలు ఆపేసి నిశ్శబ్దంగా కూర్చుంటే, ఇది తమిళ నిశ్శబ్దం, ఇది తెలుగు నిశ్శబ్దం అని భేదాలు చూపించగలరా? అందువల్ల నిశ్శబ్దం అవ్యవహార్యం.

**ప్రపంచోపశమమ్** – ప్రపంచరహితం. తురీయంలో పదార్థప్రపంచాన్ని నిషేధిస్తే, అమాత్రలో పదప్రపంచాన్ని నిషేధిస్తాము. పదార్థప్రపంచం అంటే వస్తువులతో కూడిన ప్రపంచం లేదా రూపప్రపంచం; పదప్రపంచం అంటే పేర్లతో కూడిన ప్రపంచం లేదా నామప్రపంచం. రూపప్రపంచం లేకపోతే, నామప్రపంచానికి చోటేది? పదార్థాలు లేకపోతే, వాటిని చూపించే పదాలు అవసరం లేదు. నిఘంటువు అవసరమే లేదు.

**శివః** – అందువల్ల మంగళకరం. ఏదైనా మాట్లాడితేనే, సమస్య వస్తుంది. అందువల్లనే ఇంగ్లీషులో స్పీచ్ ఈజ్ సిల్వర్, సైలెన్స్ ఈజ్ గోల్డెన్ అంటారు. వాక్కు వెండి, నిశ్శబ్దం బంగారం. అందువల్ల నిశ్శబ్దం ఎప్పటికీ ఆనందస్వరూపం.

**అద్వైతః** – రెండవది లేనిది.

ఈ పదాలన్నీ ఇలాగే తురీయ నిర్వచనంలో చూశాము.

**ఏవమోంకార ఆత్మైవ** – ఈ విధంగా ఓంకారం, ఆత్మ నూటికి నూరుపాళ్ళు ఒకటే. ఓంకారంయొక్క నాలుగు మాత్రలు, ఆత్మయొక్క నాలుగు పాదాలకు అతికినట్లుగా సరిపోతాయి.

**చతుర్మాత్రా ఓంకార చతుష్పాత్ ఆత్మైవ**

**సంవిశత్యాత్మనాఽఽత్మానం య ఏవం వేద** – ఎవరైతే ఈ విధంగా తెలుసుకుంటాడో, అతను తన స్వరూపంలో ప్రవేశిస్తాడు.

ఎవరైతే తను విశ్వ కాదు, తైజస కాదు, ప్రాజ్ఞ కాదు, తను తురీయం అని అర్థం చేసుకుంటాడో, అతను తురీయంలో ఐక్యమవుతాడు.

**తురీయజ్ఞానేన తురీయః భవతి**

తన స్వరూపం గురించి ఏడు, పన్నెందు మంత్రాల్లో చూసిన నిర్వచనాలు అర్థం చేసుకుంటే, తన స్వరూపంలో నిలుస్తాడు.

ఇక్కడ ఒక విషయాన్ని గమనించాలి. అమాత్ర అంటే నిశ్శబ్దం అన్నాము. నిశ్శబ్దం అంటే శబ్దం లేకపోవటం అనే మామూలు అర్థం కాదు. శబ్దం లేకపోతే, దానికి ఉనికి కూడా ఉండదు. అప్పుడు సత్యం అంటే అసత్ అయిపోతుంది. అందువల్ల ఈ నిశ్శబ్దాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. నిశ్శబ్దం అంటే శబ్దం లేదని తెలియజెప్పే చైతన్యం. ఓంకారం అంటే శబ్దం లేకపోవటం కాదు, చైతన్యస్వరూపం. ఆ చైతన్యంవల్లనే శబ్దం లేదని చెప్పగలుగుతున్నాము. ఈ నిశ్శబ్దచైతన్యమే నాలుగవ మాత్ర.

అమాత్రయొక్క ఇంకొక ప్రత్యేకత – అది శబ్దంలోనూ ఉంటుంది. కేవల నిశ్శబ్దం అ, ఉ, మ లలో ఉండదు. ఎందుకంటే శబ్దం ఉన్నచోట నిశ్శబ్దం ఉండలేదు. కాని దీని ప్రత్యేకత, ఈ నిశ్శబ్దం అ, ఉ, మ లలో కూడా ఉంటుంది. అందువల్ల అమాత్ర అంటే చైతన్యతత్త్వంగా అర్థం చేసుకోవాలి. ఆ చైతన్య అమాత్ర వేరే ఏదో కాదు, ఏడవ మంత్రంలో నేర్చుకున్న తురీయమే. తురీయం అంటే చైతన్యరూపనిశ్శబ్దం. ఇది అర్థం చేసుకోవాలి. ఈ ఫలశ్రుతిలో ఉపనిషత్తు చతుర్మాత్ర ఓంకార విచారణను కూడా ముగిస్తున్నది.

ఇంతవరకూ ఉపనిషత్తు సారాంశం టూకీగా చూస్తే –

| | |
|---|---|
| 3–7 చతుష్పాద ఆత్మవిచారణ | – అధిష్ఠాన తురీయజ్ఞానం |
| 8–12 చతుర్మాత్ర ఓంకార విచారణ | – అధిష్ఠాన అమాత్ర జ్ఞానం |
| అధిష్ఠాన తురీయం | = అధిష్ఠాన అమాత్ర |

రెండు విచారణలు చేసినట్టు ఉన్నా, రెండూ చేరేది ఒక లక్ష్యానికే. అది తురీయచైతన్యానికి. ఆ తురీయం నేను అనే జ్ఞానానికి.

**(ఇదంతా పట్టిక 9 – మంత్రాలు 9–12, కారికలు 19–24 ఓంకార ఆత్మ ఐక్య ఉపాసనలో** ఈ అధ్యాయం చివర్లో చూడవచ్చు)

**శబ్దం → నిశ్శబ్దం → చైతన్యం → తురీయం → అహమస్మి**

అమాత్రకూ, తురీయానికీ ఉపనిషత్తు సమానంగా వాడిన పదాలు – **చతుర్థః, అవ్యవహార్యః ప్రపంచోపశమమ్, శివమ్, అద్వైతమ్**. ఇవన్నీ చెప్పి ఓంకార ఆత్మైవ అంది. ఓంకారమే ఆత్మ అంది. ఈ విధంగా ఎవరు తెలుసుకుంటారో, అతను తన స్వస్వరూపంలో ప్రవేశిస్తాడు అంది.

ఈ విచారణ ఎలా చేయాలి? బంగారం-ఆభరణాల ఉదాహరణ తీసుకుందాం. గాజు, గొలుసు, ఉంగరాలను ఓంకారం మాత్రలతోనూ, ఆత్మ పాదాలతోనూ పోల్చుదాము.

| | | |
|---|---|---|
| గాజు | = అ | - విరాట్ |
| గొలుసు | = ఉ | - హిరణ్యగర్భ |
| ఉంగరం | = మ | - ఈశ్వర |
| బంగారం | = అమాత్ర | - తురీయం |

ముందు గాజు తీసుకుందాము. గాజుని చూస్తే, లోతుగా విశ్లేషిస్తే, ఆశ్చర్యకరమైన విషయం తెలుస్తుంది. నిజానికి గాజు అనే పదార్థమే లేదు. బంగారం మాత్రమే ఉంది. కంటికి ఎదురుగా గాజే ఉంది, కాని మీ బుద్ధి మాత్రం అది గాజు కాదు, బంగారం అని చెబుతున్నది. అందువల్ల మీరు గాజు అనే పదార్థాన్ని నిషేధించారు. గాజు అనే పదార్థం లేకపోతే, ఆ పదార్థాన్ని సూచించే పదం దేన్ని సూచిస్తుంది? దానికి ఉనికి లేదు. పదార్థ నిషేధం పదనిషేధానికి దారితీస్తుంది. ఆ నియమం ప్రకారం విరాట్‌ని నిషేధిస్తే, పదార్థం లేకపోతే, దాన్ని సూచించే అకారానికి ఉనికి లేదు.

తర్వాత గొలుసు. గొలుసు అనే పదార్థమూ లేదు, దాన్ని సూచించే పదమూ లేదు. ఇక్కడ హిరణ్యగర్భ అనే పదార్థం లేదు, దాన్ని సూచించే ఉ పదం లేదు. అదే సూత్రం ప్రకారం ఉంగరం అనే పదార్థం, పదం ఎలా లేవో, అలా ఈశ్వర అనే పదార్థం, దాన్ని సూచించే మ పదం లేవు. మనం ఇంత వివరంగా చెప్పినదాన్ని శంకరాచార్యులవారు ఒక్కవాక్యంలో చెప్పారు. **అభిదాన అభిదేయ నిషేధేన తదదిష్ఠాన ప్రాప్తిః ఏవ లక్ష్యమ్**

ఇంతవరకూ ఉపనిషత్ భాగాన్ని చూశాము. ఇప్పుడు కారికల భాగాన్ని చూద్దాము.

## కారికల విహంగ వీక్షణ

1. మూడు పాదాల వివరణ -కారికలు 1-9, మంత్రం 6 తరువాత
2. నాలుగు పాదాల సాధర్మ్యం,వైధర్మ్యం - కారికలు 10-18, మంత్రం 7 తరువాత
3. ఓంకారం- ఆత్మ ఐక్య ఉపాసన - కారికలు 19-24, మంత్రం 11 తరువాత
4. నిదిధ్యాసనం, ఫలం - కారికలు 25-29, మంత్రం 12 తరువాత

వీటిని వివరంగా చూద్దాము.

**1) మూడు పాదాల వివరణ: కారికలు 1–9, మంత్రం 6 తరువాత**

ఈ మూడు పాదాల గురించి ఉపనిషత్ విడివిడిగా చెబితే, గౌడపాదాచార్యులవారు వాటిని కలిపి వాటి స్థానం, అవి అనుభవించే అంశాలు, అవి తృప్తి చెందే విషయాల గురించి వరుసగా చెప్పారు.

స్థానత్రయం – కుడికన్నులో, మనస్సులో, హృదయంలో ఉన్నారు.
భోగత్రయం – స్థూలప్రపంచం, స్వప్నప్రపంచం, ఆనంద అనుభవం
తృప్తిత్రయం – స్థూలవస్తువులు, సూక్ష్మవస్తువులు, ఆనందం

**2) నాలుగు పాదాల సాధర్మ్యం, వైధర్మ్యం: కారికలు 10–18, మంత్రం 7 తరువాత**

అజ్ఞానం, పొరపాటు అనే రెండు పదాలను తీసుకుని, గౌడపాదాచార్యులవారు ఈ నాలుగు పాదాల మధ్యనున్న పోలికలను, భేదాలను అనేక కోణాల్లోంచి చెప్పుకొచ్చారు. అజ్ఞానం అంటే నేను తురీయం అనే జ్ఞానం లేకపోవటం. అజ్ఞానం ఉంటే, దానివల్ల పొరపాటు ఏర్పడుతుంది. పొరపాటు నేను పరిమితి ఉన్న జీవిని అనుకోవటం. తాడు గురించిన అజ్ఞానం, పాము ఉంది అనే పొరపాటుకు దారితీస్తుంది. పొరపాటు ఉండాలంటే అజ్ఞానం ఉండితీరాలి. ఏ పాదాలకు ఏం ఉన్నాయో ఈ పట్టికలో చూద్దాము.

| | విశ్వ | తైజస | ప్రాజ్ఞ | తురీయం |
|---|---|---|---|---|
| అజ్ఞానం | ✓ | ✓ | ✓ | × |
| పొరపాటు | ✓ | ✓ | × | × |

గౌడపాదాచార్యులవారు అనేక కోణాల్లో ఈ విషయాన్నే నాలుగు జంట పదాలతో వివరించారు. అవి

అజ్ఞానం – అగ్రహణం, కారణం, బీజం, నిద్ర
పొరపాటు – అన్యథాగ్రహణం, కార్యం, అంకురం, స్వప్నం

(ఇదంతా **పట్టిక 9 – మంత్రాలు 9–12, కారికలు 19–24 ఓంకార ఆత్మ ఐక్య ఉపాసనలో** ఈ అధ్యాయం చివర్లో చూడవచ్చు)

**3) ఓంకార – ఆత్మ ఐక్య ఉపాసన: కారికలు 19–24, మంత్రం 11 తరువాత**

ఉపనిషత్ 9–11 మంత్రాల్లో మూడు పాదాలనూ, వాటికి తగ్గ మూడు మాత్రలతో ఐక్య ఉపాసన ఎలా చేయాలో వివరించింది. ఆ ఐక్య ఉపాసన చెప్పినప్పుడు రెండేసి సమాన ధర్మాలను చెప్పింది. ఉపాసన నియమం ప్రకారం ఏ గుణంమీద ధ్యానం చేస్తే ఆ గుణం

పొందుతాడు సాధకుడు. తదనుగుణమైన ఫలం చెబుతూ వచ్చింది ఉపనిషత్. గౌడపాదాచార్యులవారు కూడా అవే గుణాలను, అవే పదాలతో లేదా ఆ అర్థం వచ్చే పదాలతో కారికలు 19-24లో చెప్పారు. ఆయన పరలోక ఫలాలను అదనంగా చెప్పారు. ఏ సగుణ ఈశ్వరునిమీద ధ్యానం చేస్తే ఆ సగుణ ఈశ్వరునితో ఐక్యం అవుతారు. అవి టూకీగా ఈ విధంగా చూద్దాము.

| | | |
|---|---|---|
| అ - విశ్వ/విరాట్ | ఆప్తి | ఆప్తి |
| | ఆది | ఆది |
| ఉ-తైజస/హిరణ్యగర్భ | ఉత్కర్షః | ఉత్కర్షః |
| | ఉభయత్వమ్ | ఉభయత్వమ్ |
| మ-ప్రాజ్ఞ/ఈశ్వర | మితిః | మానం |
| | అపీతిః | లయ |

**4) నిదిధ్యాసనం - ఫలం: కారికలు 25-29, మంత్రం 12 తరువాత**

ఆత్మకూ, ఓంకారానికీ మధ్య ఉన్న పోలికలను మళ్ళీ గుర్తుచేస్తూ దీనిమీద నిదిధ్యాసనం ఎలా చేయాలో చెప్పారు గౌడపాదాచార్యులవారు.

ఇక్కడ ఓంకారాన్ని ప్రణవం అంటున్నారు గౌడపాదాచార్యులవారు. ణవః అంటే పేరు. ప్ర అంటే ఆదర్శవంతమైన! సరియైన, అనువైన, చక్కటి అని అర్థం. అందువల్ల ప్రణవం అంటే ఆదర్శవంతమైన పేరు. ఎందుకు ప్రణవం బ్రహ్మకు ఆదర్శవంతమైన పేరు? బ్రహ్మకు వేరే ఏ పదం వాడినా కూడా అది సగుణబ్రహ్మనో లేదా నిర్గుణబ్రహ్మనో మాత్రమే సూచిస్తుంది. ఓం ఒక్కటే సగుణబ్రహ్మకు, నిర్గుణబ్రహ్మకు కూడా సరిపోతుంది. అదెలా? ఓంకారశబ్దం సగుణబ్రహ్మను సూచిస్తే, రెండు ఓంకార శబ్దాల మధ్య వచ్చే నిశ్శబ్దం నిర్గుణబ్రహ్మను సూచిస్తుంది.

ఇంకొక ప్రత్యేకత కూడా ఉంది. సగుణబ్రహ్మకు మూడు పాదాలు ఉన్నాయి - విరాట్, హిరణ్యగర్భ, ఈశ్వర. అలాగే ఓం శబ్దానికి మూడు మాత్రలు ఉన్నాయి - అ,ఉ,మ. ఆ విధంగా ఓం అన్ని విధాలా బ్రహ్మకు సరిపోతుంది. అందువల్ల ఓంకార విచారణద్వారా బ్రహ్మవిచారణ చేయవచ్చు.

గౌడపాదాచార్యులవారు ఈ ఓంకారధ్యానం సాధన చేయాలంటున్నారు. ఓంకారం సగుణబ్రహ్మ + నిర్గుణబ్రహ్మ అని చూశాము. గౌడపాదాచార్యులవారు సగుణబ్రహ్మను అపరం బ్రహ్మ అనీ, నిర్గుణబ్రహ్మను పరబ్రహ్మ అనీ అన్నారు.

ముందు ఓంకార ధ్యానం చేసేటప్పుడు శబ్దంమీద దృష్టి పెట్టాలి. తర్వాత నెమ్మదిగా రెండు శబ్దాల మధ్య వచ్చే నిశ్శబ్దాన్ని గమనించాలి. నిశ్శబ్దాన్ని గమనించటానికి ఆ రెండు శబ్దాల మధ్య ఉన్న నిశ్శబ్దాన్ని పెంచుతూ పోవాలి. ఆ నిశ్శబ్దం గురించి ఉపనిషత్తులో నేర్చుకున్న అంశాన్ని గుర్తు తెచ్చుకోవాలి. ఓంకారం అంటే శబ్దం మాత్రమే కాదనీ, దాని తర్వాత వచ్చే నిశ్శబ్దం కూడా అనీ, ఆ నిశ్శబ్దాన్ని అమాత్ర అంటారనీ నేర్చుకున్నాము.

నిశ్శబ్దం అంటే శూన్యం కాదు; నిశ్శబ్దం అంటే ఏమీ లేకపోవటం, దాన్ని చూసే చైతన్యం తప్ప. నిశ్శబ్దాన్ని సాక్షిగా చూసేది ఒకటి ఉంది. అదే సాక్షిచైతన్యం, తురీయం. ఆ తురీయం ఆబ్జెక్టు కాదు. అది నేనే. నేను అసంగం, నిర్గుణం, ఆనందం.

**ఓంకారశబ్దం → నిశ్శబ్దం → సాక్షి → తురీయం → నేను → శాంతం శివమద్వైతమ్**

ఓంకార ధ్యానం అంటే స్వరూపధ్యానం. స్వరూపధ్యానం జ్ఞాననిష్ఠను కలుగజేస్తుంది. జ్ఞాననిష్ఠ మోక్షాన్ని ఇస్తుంది. దాన్నే జీవన్ముక్తి అంటారు.

దీనితో ఉపనిషత్ మంత్రాలు, వాటిమీద గౌడపాదాచార్యులవారు టూకీగా చేసిన విశ్లేషణ అయిపోయింది.

ఈ ఆగమప్రకరణంలోని ముఖ్యాంశాలను, సారాంశంలో చూసిన అంశాలను అనేక పట్టికలలో ముఖ్యాంశాల పేరిట చూడవచ్చు.

# అధ్యాయము 1 - ఆగమ ప్రకరణం - ముఖ్యాంశాలు

**మంత్రం 1 - ఓంకార విచారణ ఉపోద్ఘాతం**
**మంత్రం 2 - ఆత్మవిచారణ ఉపోద్ఘాతం**

**సత్య ఆత్మయైన నా వేషాలు పట్టిక 1 - మంత్రాలు 3-6**

| మంత్రం | ఆత్మపేరు | అవస్థ | లక్షణం | ప్రమాతా | ప్రమేయం | పాదం |
|---|---|---|---|---|---|---|
| 3 | స్థూల ఆత్మా | జాగ్రదవస్థ | బహిః ప్రజ్ఞ | విశ్వ | విరాట్ | ప్రథమపాదం |
| 4 | సూక్ష్మ ఆత్మా | స్వప్నావస్థ | అంతః ప్రజ్ఞ | తైజస | హిరణ్యగర్భ | ద్వితీయపాదం |
| 5, 6 | కారణ ఆత్మా | సుషుప్తి అవస్థ | ప్రజ్ఞానఘనః | ప్రాజ్ఞ | అంతర్యామి | తృతీయపాదం |

**పట్టిక 2 - కారికలు 1-4**

| కారిక | దృక్కోణం | అర్థం |
|---|---|---|
| 1 | పాదత్రయం | మూడు పాదాలు |
| 2 | స్థానత్రయం | ప్రమాత ఉండే స్థానాలు |
| 3 | భోగత్రయం | ప్రమాత యొక్క అనుభవాలు |
| 4 | తృప్తిత్రయం | ప్రమాతను తృప్తిపరిచే విషయాలు |

**పట్టిక 3 – కారికలు 1-4 విశ్లేషణ**

| కారిక | దృక్కోణం | విశ్వ | తైజస | ప్రాజ్ఞ | విశ్లేషణ |
|---|---|---|---|---|---|
| 1 | పాదత్రయం | బహిః ప్రజ్ఞ | అంతః ప్రజ్ఞ | ఘనప్రజ్ఞ | ఏక ఏవ త్రిధా స్మృతః |
| 2 | స్థానత్రయం | దక్షణాక్షిముఖే | మనసి అంతః | ఆకాశే చ హృది | త్రిధా దేహే వ్యవస్థితః |
| 3 | భోగత్రయం | స్థూలభుక్ | ప్రవివిక్తభుక్ | ఆనందభుక్ | త్రిధాభోగం నిబోధత |
| 4 | తృప్తిత్రయం | స్థూల వస్తువులు | సూక్ష్మవస్తువులు | ఆనందం | త్రిధా తృప్తిం నిబోధత |

**చతుర్థం మన్యంతే స ఆత్మా స విజ్ఞేయః**

**పట్టిక 4 మంత్రాలు 3-7**

| మంత్రం | పాదం | పాదం పేరు | అవస్థ | లక్షణం | ప్రమాతా | ప్రమేయం | ఉదాహరణ | విశ్లేషణ |
|---|---|---|---|---|---|---|---|---|
| 3 | మొదటిపాదం | స్థూల ఆత్మ | జాగ్రదావస్థ | బహిః ప్రజ్ఞ | విశ్వ | విరాట్ | గాజు+బంగారం | విశ్వ+తురీయం |
| 4 | రెండవపాదం | సూక్ష్మ ఆత్మ | స్వప్నావస్థ | అంతః ప్రజ్ఞ | తైజస | హిరణ్యగర్భ | గొలుసు+బంగారం | తైజస+తురీయం |
| 5, 6 | మూడవపాదం | కారణ ఆత్మ | సుషుప్తి అవస్థ | ప్రజ్ఞానఘనః | ప్రాజ్ఞ | అంతర్యామి | ఉంగరం+బంగారం | ప్రాజ్ఞ+తురీయం |
| 7 | నాలుగవ పాదం | తురీయ ఆత్మ | విడిగా నాలుగవ అవస్థ లేదు | అవస్థాత్రయ అధిష్ఠానం | ప్రమాతృత్రయ విలక్షణం | ప్రమేయత్రయ విలక్షణం | బంగారం అధిష్ఠానం + విలక్షణం | తురీయం అధిష్ఠానం + విలక్షణం |

**తురీయం = ఆత్మ**

**పట్టిక 9**

**మంత్రాలు 9–12, కారికలు19–24 : ఓంకార ఆత్మ ఐక్య ఉపాసన – ఫలము**

| మంత్రం | జంట | పోలిక | కారిక | పోలిక | మంత్రంలో ఫలము | కారిక | కారికల్లో ఫలము |
|---|---|---|---|---|---|---|---|
| 9 | అ – విశ్వ/విరాట్ | ఆప్తి<br>ఆది | 19 | ఆప్తి<br>ఆది | ఆప్నోతి సర్వాన్ కామాన్<br>ఆదిశ్చ భవతి | 23 | నయతే విశ్వమ్ –<br>విరాట్‌తో ఐక్యం |
| 10 | ఉ – తైజస/హిరణ్యగర్భ | ఉత్కర్షః<br>ఉభయత్వమ్ | 20 | ఉత్కర్షః<br>ఉభయత్వమ్ | ఉత్కర్షతి<br>సమానశ్చ భవతి | 23 | తైజసమ్ –<br>హిరణ్యగర్భతో ఐక్యం |
| 11 | మ – ప్రాజ్ఞ/ఈశ్వర | అపీతిః<br>మితిః | 21 | లయ మానం<br>(కొలమానం) | అపీతిశ్చ భవతి<br>మినోతి ఇదగ్ం సర్వమ్ | 23<br>23 | ప్రాజ్ఞమ్ – ఈశ్వరునితో ఐక్యం<br>గతిః న విద్యతే –<br>ప్రయాణం లేదు |
| – | – | – | 22 | – | – | | వంద్యః – పూజ్యనీయుడు<br>మహామునిః – గొప్ప ముని |
| 12 | అమాత్ర – తురీయం | అవ్యవహార్యః<br>ప్రపంచోపశమమ్ | 29 | అనంతమాత్రశ్చ<br>ద్వైతస్యోపశమః | సంవిశతి ఆత్మ<br>ఆత్మానమ్ | 24 | న కించిదపి చింతయేత్<br>స్వస్వరూపంలో నిలుస్తాడు |

# ఏకాదశ ఉపనిషత్తుల సారం

## మాండూక్యోపనిషత్ - ప్రకరణం 2

## వైతథ్యప్రకరణం

మొదటి అధ్యాయమైన ఆగమప్రకరణం చూశాము. మాండూక్యోపనిషత్తులో ఉన్న మంత్రాలన్నీ మొదటి అధ్యాయంలోనే ఉన్నాయి కాబట్టి దానికి ఆగమప్రకరణం అని పేరు వచ్చింది. ఉపనిషత్తు వేదంలో ఒక భాగం, వేదాన్ని ఆగమం అని కూడా అంటారు. ఆ ప్రకరణంలో గౌడపాదాచార్యులవారి కారికలు కూడా ఉన్నాయి. నిజానికి మంత్రాలు 12 ఉంటే, కారికలు 29 ఉన్నాయి.

ఇప్పుడు మనం రెండవ అధ్యాయంలోకి అడుగుపెట్టబోతున్నాము. దాని పేరు వైతథ్య ప్రకరణం. ఈ వైతథ్యప్రకరణంలో 38 కారికలున్నాయి. ఉపనిషత్తు మంత్రాలన్నీ మొదటి అధ్యాయంలోనే అయిపోయాయి కాబట్టి, ఇకముందు వచ్చేవన్నీ కారికలే.

**మంత్రం 7**

**నాంతః ప్రజ్ఞం న బహిష్ప్రజ్ఞం నోభయతః ప్రజ్ఞం న ప్రజ్ఞానఘనం న ప్రజ్ఞం నాప్రజ్ఞమ్।**
**అదృష్టమవ్యవహార్యమగ్రాహ్యమలక్షణమచింత్యమవ్యపదేశ్యమేకాత్మప్రత్యయసారం**
**ప్రపంచోపశమం శాంతం శివమద్వైతం చతుర్థం మన్యంతే స ఆత్మా స విజ్ఞేయః॥**

ఆ ఒక్క పదం **ప్రపంచోపశమమ్.** అది ఒక సంయుక్త పదం. దీన్ని విడదీస్తే ప్రపంచ+ఉపశమమ్ అని వస్తుంది. ఈ అధ్యాయం దీనిమీద విశ్లేషణ. అలాగే ఈ మంత్రంలో **అద్వైతమ్** పదం తీసుకుని, దాన్ని మూడవ అధ్యాయంలో చాలా వివరంగా విశ్లేషించారు గౌడపాదాచార్యులవారు.

ప్రపంచోపశమమ్ అంటే ఏమిటి? ఏడవ మంత్రం వివరణ చూసినప్పుడు చూసిన వివరణను మళ్ళీ ఇక్కడ ఒకసారి గుర్తు తెచ్చుకుందాము. తురీయాన్ని వివరించటానికి వాడిన పదాల్లో ఇదొక పదం. ప్రపంచోపశమంలో ప్రపంచం అంటే జగత్తు. జగత్తు అంటే ఒక్క జాగ్రత్ ప్రపంచాన్నే కాదు, మూడు ప్రపంచాలనీ తీసుకోవాలి. మొదటిపాదంలో చూసిన జాగ్రత్ ప్రపంచం; రెండవపాదంలో చూసిన సూక్ష్మప్రపంచం; మూడవపాదంలో చూసిన కారణప్రపంచం మూడూ వస్తాయి. వాటితో పాటు వాటికి సంబంధించిన స్థూలశరీరం, సూక్ష్మశరీరం, కారణశరీరాలను కూడా తీసుకోవాలి. ఒక్కముక్కలో చెప్పాలంటే ప్రపంచం అంటే పాదత్రయంలో వచ్చిన ప్రపంచత్రయం, శరీరత్రయం.

ఉపశమం అంటే దాన్నించి స్వేచ్ఛ. అంటే ప్రపంచరహితం. తురీయంలో ప్రపంచోపశమం అంటే తురీయంలో ఈ మూడు ప్రపంచాలు లేవని అర్థం. ప్రపంచత్రయరహితం. ఈ పాదత్రయంలో రెండేసి జంటలను చూశాము. అవి విశ్వ-విరాట్ జంట; తైజస-హిరణ్యగర్భ జంట; ప్రాజ్ఞ-ఈశ్వరుల జంట. తురీయంలో ఈ జంటలేమీ లేవు. ఈ విధంగా, ఈ ఒక్క ప్రపంచోపశమం పదంతో ఉపనిషత్తు మొత్తం ప్రపంచాన్నే నిషేధిస్తున్నది.

నిషేధం పదం ఎందుకంత ముఖ్యం? వేదాంతబోధలో ఇదొక ముఖ్యభాగం. ఇదొక సాంకేతికపదం.

**నిషేధం ప్రాముఖ్యత**

ఒక వస్తువును నిషేధించాలంటే, ఉనికి ఉన్న వస్తువును నిషేధిస్తారా, ఉనికి లేని వస్తువును నిషేధిస్తారా అంటుంది వేదాంతం. నిజానికి వేదాంతం ఈ రెండింటినీ నిషేధించలేరు అంటుంది. ఎందుకు?

ఉనికి ఉన్న వస్తువును నిషేధించలేము; దానికి ఉనికి ఉంది కాబట్టి. అలాగని ఉనికి లేని వస్తువునూ నిషేధించనవసరం లేదు; ఎందుకంటే దానికి ఉనికే లేదు కాబట్టి. అందువల్ల నిషేధించాల్సిన వస్తువు ఉనికి ఉన్న వస్తువూ కాదు, ఉనికి లేని వస్తువూ కాదు. ఉనికి ఉన్న వస్తువును సత్ అనీ, ఉనికి లేని వస్తువును అసత్ అనీ అంటాము. నిషేధవస్తువు ఈ రెండూ కాదు – **సత్ అసత్ విలక్షణమ్**.

**సత్యేన న బాధ్యేత అసత్యేన న ప్రలీయేత**

అందువల్ల ప్రపంచం నిషేధించబడుతున్నది అంటే అది సత్‌లోకీ రాదు, అసత్‌లోకీ రాదు. ఈ రెండింటికీ చెందకపోతే, మరి ప్రపంచం ఏమిటి? వేదాంతం అది మిథ్యా జగత్తు అంటున్నది. మిథ్య అంటే అసలు ఉనికి లేదని కాదు అర్థం. మిథ్య అంటే ఉనికి ఉనట్టుగా ఉన్నది. ఉదాహరణకు ఎండమావి. ఎండమావిని దూరంనుంచి చూస్తే, నీరు ఉన్నట్టుగా అనిపిస్తుంది; కాని దగ్గరికి వెళ్ళిచూస్తే నిజంగా నీరు ఉండదు.

గౌడపాదాచార్యులవారు స్వయంగా ఇచ్చిన ఉదాహరణ రజ్జు-సర్పభ్రాంతి. పాము ఉన్నట్టుగా ఉంది, కాని దగ్గరికి వెళ్ళి చూస్తే నిజంగా లేదని తెలుస్తుంది. అలాగని ఉనికి లేదని అందామా అంటే అది మిమ్మల్ని భయపెట్టింది, చెమటలు పట్టేలా చేసింది. పోనీ ఉందని అందామా అంటే అసలు అక్కడ పాము అనేదే లేదు. అందువల్ల ఈ రజ్జు-సర్ప భ్రాంతిలోని పాము సత్ అసత్ విలక్షణమ్.

గౌడపాదాచార్యులవారు ఇచ్చిన ఇంకొక ఉదాహరణ స్వప్నవృత్తాంతం. ఒక స్వాప్నికునికి తను స్వప్నంలో ఉన్నంతవరకూ తన స్వప్నం, స్వప్నం అని తెలియదు. అందులో పులి వెంటాడితే, నిజమనుకుని భయపడి పరుగులు తీస్తాడు. లేచాక కానీ అది నిజంకాదని తెలియదు. అంటే స్వప్నం కూడా **సత్ అసత్ విలక్షణమ్.**

ప్రపంచోపశమం పదం ప్రపంచమిథ్యత్వాన్ని సూచిస్తుంది. ఉపనిషత్తు జగన్మిథ్యా అని ఇంత స్పష్టంగా చెప్పదు కాని, దాని గూఢార్థం అదే. వేదాంతసారం –

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా**

ఈ రెండు పదాలూ అద్వైతమ్, ప్రపంచోపశమమ్ – ఈ సారాన్ని సూచిస్తాయి. అద్వైతమ్ అంటే బ్రహ్మసత్యం; ప్రపంచోపశమమ్ అంటే జగన్మిథ్యా. గౌడపాదాచార్యులవారు ఈ గూఢార్థాన్ని స్పష్టంగా వివరించదలుచుకున్నారు. అందువల్లనే ఈ అధ్యాయానికి వైతథ్య ప్రకరణం అనే పేరు వచ్చింది.

వైతథ్యం అంటే మిథ్యాత్వం. వితథం అంటే మిథ్య, అసత్యం; ప్రకరణం అంటే అధ్యాయం. అందువల్ల వైతథ్యప్రకరణం అంటే మిథ్యాత్వాన్ని వెల్లడించే అధ్యాయం. దేని మిథ్యాత్వాన్నో ఈ పేరు సూచించదు కాని, మనం ఊహించవచ్చు. బ్రహ్మ మిథ్య కాదని తెలుసు. ఇంక ఉన్నది జగత్తు ఒకటే. జగత్తుయొక్క మిథ్యాత్వాన్ని వెల్లడిస్తుంది. జగత్తు అంటే మూడు శరీరాలు + మూడు ప్రపంచాలు అని మర్చిపోకూడదు. అయితే దీని సారాంశం ఏమిటి? అది మూడవ అధ్యాయం చివర్లో చూస్తాము; కాని ఇక్కడ దాన్ని టూకీగా చూద్దాము. మొత్తం జగత్తు మిథ్య కాబట్టి, అది తురీయానికి చెందదు. మిథ్యావస్తువు ఉన్నా లేనట్టే లెక్క. మీకు దాహం వేస్తే, ఎండమావులలోని నీరు మీ దాహాన్ని తీర్చలేదు; రజ్జు–సర్పభ్రాంతిలో కనపడిన పామునుంచి విషాన్ని మందుగా తీయలేరు; స్వప్నంలో సంపాదించిన లక్షలను ఇల్లు కొనటానికి జాగ్రత్ ప్రపంచంలో వాడలేరు.

సూత్రం ఇదీ! ఏదైతే మిథ్యో దాన్ని సత్యంగా పరిగణించలేరు. అది ఉన్నా లేనట్టే. అందువల్ల ఈ సూత్రం ప్రకారం జగత్ మిథ్య కాబట్టి, అది ఉన్నా లేనట్టే. జగత్తు లేదంటే, ఇంక ఉన్నదేమిటి? తురీయం ఒకటే. తురీయంలేకుండా, రెండవదిలేదు. అందువల్ల అది అద్వైతం. అద్వైతం అంటే రెండవది లేని ఏకవస్తువు. ప్రపంచం అనుభవంలోకి వస్తుంది. నిజమే కాని ఆ అనుభవాన్ని లెక్కలోకి తీసుకోకూడదు. ఎందుకంటే అది మిథ్య.

ప్రపంచమిథ్యాత్వం ఉపసిద్ధాంతం, తురీయం అద్వైతం. తురీయం అద్వైతం అయితే, అసలు తురీయం పదానికే అర్థం లేదు. సంస్కృతంలో తురీయం అంటే నాలుగవది అని అర్థం. అద్వైతం అంటే రెండవది లేనిది. రెండవదేలేనిది, నాలుగవది ఎలా అవుతుంది?

ఈ పదాలు పరస్పర విరుద్ధంగా లేవా? కాని ఉపనిషత్తుకు ఈ విషయం తెలియదను కుంటున్నారా? అది ఇలాంటి ప్రశ్న అడుగుతారని తెలిసే, జాగ్రత్తగా ముందే ఒక పదం వేసింది.

**చతుర్థం మన్యంతే స ఆత్మా స విజ్ఞేయః॥**

మన్యంతే అంటే అని భావిస్తున్నారు. ఎవరు? అజ్ఞానులు భావిస్తున్నారు, జ్ఞానులు కాదు. జ్ఞానులకు స్పష్టంగా తెలుసు – మొదటి మూడు పాదాలు మిథ్య అనీ, తురీయం మాత్రమే సత్యమనీ, ఉన్నదొకటే అద్వైతమనీను. అందువల్ల ప్రపంచోపశమం సహజంగా అద్వైతానికి దారితీస్తుంది. ఈ రెండింటి గురించీ వివరించే రెండు అధ్యాయాలనూ జంట అధ్యాయాలుగా భావించవచ్చు.

రెండవ అధ్యాయం జగన్మిథ్యా అనేది నిరూపించాలి. శ్రుతే ఏడవ మంత్రంలో **ప్రపంచోపశమమ్** పదంద్వారా జగత్ మిథ్య అని చెప్పింది. కాని గౌడపాదాచార్యులవారు దాన్ని ఇంకా వివరంగా మరి కొన్ని శ్రుతివాక్యాలద్వారా చూపించటమే కాక, దానికి తోడుగా యుక్తిప్రమాణాన్ని కూడా చొప్పించారు.

యుక్తిప్రమాణాన్ని చూసేముందు అసలు ఈ యుక్తిప్రమాణం అంటే ఏమిటో కొంచెం తెలుసుకోవాలి.

**అనుమాన ప్రమాణం** – తర్కం వాడేముందు, కొంత సమాచారాన్ని ప్రత్యక్షప్రమాణంద్వారా సేకరించి పెట్టుకోవాలి. అలా సేకరించుకున్న జ్ఞానాన్ని వ్యాప్తిజ్ఞానం అంటారు. తర్కశాస్త్రంలో వ్యాప్తి అంటే రెండు వస్తువులు కలిసివుండటం. దీనికి శాస్త్రం చెప్పే ఉదాహరణ పొగ, అగ్ని. ఎక్కడ పొగ ఉంటే అక్కడ అగ్ని ఉంటుందని పూర్వకాలపు వంటిల్లు చూసినా, యజ్ఞయాగాదులను చూసినా అర్థమవుతుంది.

**యత్ర యత్ర ధూమః తత్ర తత్ర అగ్నిః**

ఎక్కడ పొగ ఉంటే అక్కడ అగ్ని ఉంటుంది. ఇప్పుడు ఈ సూత్రాన్ని ఉపయోగించి, తర్కంద్వారా ఎలా ఒక నిర్ణయానికి వస్తామో చూద్దాము. కొంచెం దూరంలో ఒక కొండను చూశారు. కొండనుంచి పొగ వస్తున్నది. ఈ వ్యాప్తి వాక్యంద్వారా, కొండ దగ్గర అగ్ని ఉందని చెబుతారు. దానికి మీకు ప్రత్యక్షప్రమాణం మీ వంటిల్లే. అలా మీరు చెప్పిన వాక్యాన్ని అనుమానవాక్యం అంటారు. అది

**పర్వతః అగ్నిమాన్ ధూమవత్వాత్ యథా మహానసే**

పర్వతం దగ్గర అగ్ని ఉంది. ఎందుకంటే పొగ వస్తోంది కాబట్టి. పొగ ఉంటే అగ్ని ఉంటుందనే దృష్టాంతం మీకు తెలుసు కాబట్టి. మహానసే అంటే వంటింట్లో ఉన్నట్టుగా.

ఈ నేపథ్యంతో ఈ అధ్యాయంలో అడుగుపెడదాము. వైతథ్యప్రకరణంలో ముఖ్యంగా ఐదు అంశాలు ఉన్నాయి.

1. స్వప్నప్రపంచ మిథ్యాత్వమ్ – కారికలు 1-3
2. జాగ్రత్ప్రపంచ మిథ్యాత్వమ్ – కారికలు 4-18
3. కల్పనా ప్రకారాః – కారికలు 19-29
4. ఉపసంహారః – కారికలు 30-34
5. సాధనాని, ఫలమ్ – కారికలు 35-38

మనం అనుభవించే ప్రపంచాన్ని గౌడపాదాచార్యులవారు జాగ్రత్ ప్రపంచం అంటున్నారు. ఎందుకంటే ఈ ప్రపంచాన్ని జాగ్రదవస్థలోనే అనుభవిస్తాము. ఎప్పుడైతే నిద్రలోకి జారుకుంటామో, అప్పుడే ఈ జాగ్రత్ ప్రపంచం కూడా మాయమైపోతుంది.

గౌడపాదాచార్యులవారు జాగ్రత్ ప్రపంచం మిథ్య అని ఇందాక మనం చూసిన అనుమానవాక్యంద్వారా నిరూపించదలుచుకున్నారు. ఆ వాక్యాన్ని మళ్ళీ చూద్దాము.

**పర్వతః అగ్నిమాన్ ధూమవత్వాత్ మహానసే**

అక్కడ పర్వతః స్థానంలో జాగ్రత్ ప్రపంచం తీసుకున్నారు. అగ్ని బదులు మిథ్య అని నిర్ణయం తీసుకుంటారు. దానికి కారణం తరువాత చెబుతారు. దృష్టాంతం స్వప్నప్రపంచం. ఇవన్నీ కలిపితే అనుమానవాక్యం ఇలా వస్తుంది.

జాగ్రత్ ప్రపంచః మిథ్యా ... స్వప్న ప్రపంచవత్

ఈ ఖాళీని తరువాత పూరిద్దాము. ఈ తర్కం గౌడపాదాచార్యులవారి పద్ధతి. కాని ఈ అనుమానవాక్యంలో స్వప్నప్రపంచంలాగా జాగ్రత్ ప్రపంచం కూడా మిథ్య అన్నారు. అది ఎప్పుడు స్వీకరిస్తారు? స్వప్నప్రపంచం మిథ్య అని నమ్మితేనే! కొంతమంది స్వప్నప్రపంచం కూడా సత్యం అంటారు. అందువల్ల గౌడపాదాచార్యులవారు జాగ్రత్ ప్రపంచంయొక్క మిథ్యాత్వ నిశ్చయాన్ని తాత్కాలికంగా పక్కనపెట్టి, ముందు స్వప్నప్రపంచ మిథ్యాత్వ నిశ్చయం చేయదలుచుకున్నారు. అది మిథ్య అని నిరూపించాక, దానిలాగా జాగ్రత్ ప్రపంచం కూడా ఫలానా కారణాలవల్ల మిథ్య అని నిరూపించటం తేలిక.

1) **స్వప్నప్రపంచ మిథ్యాత్వమ్ – కారికలు 1-3**

గౌడపాదాచార్యులవారు శ్రుతి, యుక్తి, అనుభవప్రమాణాలద్వారా స్వప్నప్రపంచం మిథ్య అని నిరూపిస్తారు.

1. **యుక్తిప్రమాణం** – జాగ్రత్ అవస్థలో ప్రస్తుతం మనం సత్యం అనుకుంటున్న వస్తువులకు ఉనికి ఉండాలంటే, అది ఉండటానికి కొంత ప్రదేశం ఉండాలి. అలాగే ఒక సంఘటన జరగాలంటే, దానికి కూడా కావాల్సినంత సమయం కావాలి. ఉదాహరణకు అద్దంలో ఏనుగుని చూశారనుకోండి. ఆ అద్దంలో నిజంగా ఏనుగు ఉండగలదా? మనం ఒక కాలేస్తేనే అద్దం విరిగిపోతుంది. అలాంటిది అంత పెద్ద ఏనుగు అద్దంలో ఎలా దూరగలదు? ఏనుగుకు అక్కడ ఉచితదేశం లేదు కాబట్టి, అద్దంలో ఏనుగు మిథ్య.

**యత్ర యత్ర ఉచితదేశకాల అభావః తత్ర తత్ర మిథ్యాత్వమ్**

ఇదీ వ్యాప్తివాక్యం. ఎక్కడ ఉచితదేశం కానీ, కాలం కానీ లేదో, అది మిథ్య. ఈ వ్యాప్తి వాక్యాన్ని ఆధారంగా చేసుకుని గౌడపాదాచార్యులవారు స్వప్నప్రపంచం మిథ్య అని నిరూపిస్తున్నారు. స్వప్నప్రపంచంలోని వస్తువులకు ఉచితదేశం కానీ, కాలం కానీ లేదు. అందువల్ల స్వప్నం మిథ్య. ఈ అంశంతో మొదలవుతున్నది వైతథ్యప్రకరణం. దీనికి అనుమాన వాక్యం –

**స్వప్నప్రపంచం మిథ్యా ఉచితదేశకాల అభావాత్ దర్పణస్థ హస్తివత్**

అద్దంలో ఉన్న ఏనుగులాగా, మన స్వప్నప్రపంచం కూడా మిథ్య. దానికి కూడా ఉచిత దేశకాలాలు లేవు. ఉదాహరణకు ఒక ఏనుగు గుంపు పెద్ద అడవిలో వెళుతున్నట్టుగా చూస్తారు. ఇన్ని పెద్ద వస్తువులు మీ చిన్ని మనస్సులో దూరగలవా? అలాగే స్వప్నంలో అమెరికా వెళ్ళి, ఎమ్మెస్ చదివి, పెళ్ళి చేసుకుని, పిల్లల్ని కన్నట్టుగా కలగంటారు. ఇవన్నీ జరగాలంటే కొన్ని సంవత్సరాలు పడుతుంది. కాని 90 సెకన్ల కాలంలో చూస్తారు వీటిని. అంటే ఉచితకాలం లేదు.

2. **అనుభవప్రమాణం** – నిద్రనుంచి లేచాక, లేచిన వ్యక్తి, ఎక్కడ ఉన్నట్టు కలగన్నాడో అక్కడ లేవడు. మీరు కలలో కాశీలో ఉన్నారు, ఉలిక్కిపడి లేచారు. కాని మీరు లేచాక ఎక్కడ ఉన్నారు? మీ మంచంమీదే ఉన్నారు.

3. **శ్రుతిప్రమాణం** – ఇప్పుడు శ్రుతిప్రమాణంద్వారా స్వప్నప్రపంచం మిథ్య అని చూడబోతున్నాము.

**న తత్ర రథా న రథయోగాః న పంథానో భవంతి అథ రథాన్ రథయోగాన్ పథః సృజతే** – బృహదారణ్యకమ్ 4.3

అక్కడ (స్వప్నప్రపంచంలో) నిజంగా రథాలు లేవు, రథాన్ని లాగే గుర్రాలు లేవు, మార్గాలు లేవు, ఇంకా కొనసాగుతుంది. స్వప్నంలో ఆనందాలు, మోదాలు, ప్రమోదాలు లేవు. పుష్కరిణిలు, సరస్సులు, నదులు లేవు. ఆనందిస్తున్నట్టు, నవ్వుతున్నట్టు, భయాలను చూస్తున్నట్టు అనిపిస్తుంది కాని అవి నిజం కావు.

ఇక్కడ ఉపనిషత్తు ఒక గొప్ప సూత్రాన్ని చెబుతున్నది. అది **అనుభవంలోకి వచ్చినంత మాత్రాన అది నిజం కాదు.**

ఈ సత్యాన్ని అంత తేలికగా స్వీకరించలేము. కాని మాండూక్యంలో గౌడపాదాచార్యులవారు అడుగడుగునా ఈ సత్యాన్ని బోధిస్తూనే ఉన్నారు. దీన్నే మనం జీర్ణించుకోలేకపోతే, గౌడపాదాచార్యువారు మనకు మింగుడు పడని, మెదడు వేడెక్కే ఇంకొక వాక్యం చెబుతారు.

**అనుభవంలోకి వచ్చిందా అది నిజం కాదు**

అక్కడితో కూడా ఆగరు. చివరిగా ఒక పిడుగులాంటి వార్త చెబుతారు.

**అనుభవిస్తున్న నువ్వు మాత్రమే సత్యం**

కాకపోతే ఈ చివరి సూత్రానికి అంత వెంటనే రాము. ముందే చెప్పినట్టుగా ఇది దశల వారీగా సాగే బోధ. ఇక్కడ శ్రుతి చెప్పిన అంశం, మీకు స్వప్నంలో అనుభవంలోకి వచ్చినంత మాత్రాన అది నిజం కాదు.

ఇక్కడితో స్వప్నప్రపంచం మిథ్యాత్వమ్ అయిపోయింది.

### 2) జాగ్రత్ ప్రపంచ మిథ్యాత్వమ్ – కారికలు 4-18

ఈ కారికల్లో గౌడపాదాచార్యులవారు మనం నమ్మలేని సత్యాన్ని వెల్లడి చేయబోతున్నారు. గౌడపాదాచార్యులవారు స్వప్నప్రపంచం ఎంత మిథ్యో, ఈ జాగ్రత్ ప్రపంచం కూడా అంతే మిథ్య అని నిరూపించబోతున్నారు. కాని అంశాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. స్వప్నంలో ఉన్నంతవరకూ, ఒక స్వాప్నికునికి తన స్వప్నం స్వప్నం అని తెలియదు. అతనికి అది మహాసత్యం. అతను స్వప్నంనుంచి లేస్తేనే, స్వప్నం మిథ్యగా తేలిపోతుంది. ఇప్పుడు అదే సూత్రాన్ని జాగ్రత్ ప్రపంచానికి అన్వయిద్దాము. జాగ్రత్ అవస్థలో ఉన్నంతవరకూ, జాగ్రత్ పురుషునికి జాగ్రత్ ప్రపంచం మహాసత్యం. కాని అతను జాగ్రత్ ప్రపంచంనుంచి బుద్ధిపరంగా లేస్తే, జాగ్రత్ ప్రపంచం స్వప్నం 2 గా తెలుసుకుంటాడు. అప్పుడు అది కూడా మిథ్యగా తేలిపోతుంది.

స్వప్నప్రపంచం, స్వప్నశరీరపరంగా సత్యం; జాగ్రత్ ప్రపంచం జాగ్రత్ శరీరపరంగా సత్యం; కాని తురీయపరంగా చూస్తే రెండూ మిథ్యే. ఇక్కడ తురీయపరంగా అన్నప్పుడు తురీయ శరీరపరంగా అనకూడదు; తురీయ చైతన్యం పరంగా అనాలి. కాని రెండింటికీ ఒకటే యుక్తి పనికి రాదు. అంటే స్వప్నప్రపంచానికి ఉచితదేశ, ఉచితకాల నియమం వర్తించదు కాబట్టి అది మిథ్య అన్నాము. కానీ ఈ సూత్రం జాగ్రత్ ప్రపంచానికి వర్తించదు. అందువల్ల ఇక్కడ గౌడపాదాచార్యులవారు వేరే రెండు కారణాలు చూపిస్తున్నారు.

జాగ్రత్ ప్రపంచం మిథ్యే అంటున్నారు. పైగా అది ప్రసిద్ధి చెందిన కారణం అంటున్నారు. కాని అదేమిటో చెప్పరు. శంకరాచార్యులవారు తన భాష్యంలో ఒక కారణం చెబుతున్నారు; గౌడపాదాచార్యులవారు ఇంకొక కారణం చెబుతారు. ముందు శంకరాచార్యులవారు చెప్పిన కారణం చూద్దాం.

**యత్ యత్ దృశ్యం తత్ తత్ మిథ్యా**

అని ఒక వ్యాప్తివాక్యం అనే బాంబు వేశారు! ఏదైతే చూస్తామో, అనుభవిస్తామో, అది మిథ్య అనేస్తున్నారు. దానికి కారణం ఇక్కడ చెప్పరు, కాని మనం ఉపోద్ఘాతంలో చూసింది ఇక్కడ గుర్తుకు తెచ్చుకోవాలి

ఒక వస్తువును ప్రమేయం (ఆబ్జెక్టు) అనాలి అంటే దానికి మూడు నియమాలు ఉండాలి అని చూశాము. అది ఏదో ఒక ప్రమాణానికి అందాలి; ఎవరో ఒకరు చూసివుండాలి; ఎప్పుడో అప్పుడు చూసివుండాలి. ఈ మూడు నియమాలను కలిపితే, ప్రమాత (సబ్జెక్టు) చూస్తేనే ప్రమేయానికి ఉనికి ఉంది. జాగ్రత్‌ప్రపంచాన్ని జాగ్రత్ పురుషుడు చూస్తేనే దానికి ఉనికి ఉంది. అతను పడుకుంటే, ఆ ప్రపంచం కూడా పడుకుంటుంది.

ఒక వస్తువు ఎవరికీ అనుభవంలోకి రాకపోతే, దాని ఉనికి గురించి ఎన్నడూ మాట్లాడలేము. అంటే దాని ఉనికి తెలుసుకోబడటంమీద ఆధారపడివుంది; దాన్ని తెలుసుకోబడటం అనేది తెలుసుకునే ప్రమాతమీద ఆధారపడివుంటుంది. అందువల్ల ప్రమాత చూస్తేనే ప్రమేయానికి ఉనికి ఉంది.

ఇప్పుడొక ఉదాహరణ చూద్దాము. మీరు స్వప్నంలో, ఎవరో ఊబిలో ఇరుక్కుపోవటం చూశారు. మీరు అతన్ని పైకి తీసుకురావటానికి మీ శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. అతను ఇంచుమించుగా పైకి వచ్చేశాడు కూడా. కాని సరిగ్గా అప్పుడే మీకు మెలకువ వచ్చేసింది. లేచాక అతను కాని, అతను పడిపోయిన ఊబి కాని మీకు కనబడదు. ఇప్పుడు చెప్పండి, 'అయ్యో, అతను పైకి వచ్చాడో, లేదో,' అని ఖంగారు పడతారా మీరు? లేకపోతే,

మళ్ళీ పడుకుని మళ్ళీ కలలోకి వెళ్ళి అతన్ని పూర్తిగా పైకి లేపుతాను అంటారా? లేదే! మీకు స్పష్టంగా తెలుసు, అటువంటి వ్యక్తికి నిజంగా ఉనికి లేదని. అతనికి ఉనికి మీరు స్వప్నంలో చూసినంతసేపే ఉంది. మీరు లేస్తే, అతను లేడు. అంటే ఆబ్జెక్టుకు ఉనికి సబ్జెక్టు చూస్తేనే ఉంది.

టూకీగా చెప్పాలంటే, ఆబ్జెక్టుకు స్వతంత్ర సత్తా లేదు కాని సబ్జెక్టుకు స్వతంత్ర సత్తా ఉంది. వేదాంతసూత్రం – దేనికైతే స్వతంత్ర సత్తా లేదో అది మిథ్య. దేనికైతే స్వతంత్ర సత్తా ఉందో, అది సత్యం. దానికి గొప్ప ఉదాహరణ – కుండ–మట్టి. కుండకు మట్టి లేకుండా విడిగా ఉనికి లేదు; కాని మట్టి కుండ ఉన్నా, లేకపోయినా ఉంటుంది. కుండ పుట్టక ముందూ, కుండలోనూ, కుండ పగిలిపోయాకా ఉంటుంది. అందువల్ల స్వతంత్ర సత్తా ఉన్నది సత్యం; పరతంత్ర సత్తా ఉన్నది మిథ్య.

స్వప్నప్రపంచం మిథ్య; జాగ్రత్ ప్రపంచం దృశ్యం; అందువల్ల రెండూ మిథ్య. రెండూ వాటి ఉనికికి చైతన్యంమీద ఆధారపడి ఉన్నాయి. ఒక వస్తువు దృశ్యం అవాలి అంటే, దాన్ని చూసే దృక్ ఉండాలి. **దృక్ సత్యం । దృశ్యం మిథ్యా**

దీనికి అనుమానవాక్యం,

**జాగ్రత్ ప్రపంచః మిథ్యా దృశ్యత్వాత్ స్వప్నప్రపంచవత్**

జాగ్రత్ ప్రపంచం మిథ్య; అది దృశ్యం కాబట్టి, స్వప్నప్రపంచం లాగా.

**ప్రత్యక్ష కారణం** – కారిక 6లో గౌడపాదాచార్యులవారు జాగ్రత్ ప్రపంచం అనిత్యం కాబట్టి, అది మిథ్య అంటున్నారు.

**యత్ అనిత్యం తత్ మిథ్యా యత్ నిత్యం తత్ సత్యమ్**

ఏ వస్తువుకైనా ఉనికి కాసేపే ఉంటుంది. ప్రతివస్తువుకూ తయారుచేసిన రోజు, దాని కాలం చెల్లిపోయే రోజు ఉంటుంది. కుండ పుట్టకముందు దానికి ఉనికి లేదు; కుండ పగిలిపోయాకా దానికి ఉనికి లేదు. అంటే దాని ఉనికి అనిత్యం, శాశ్వతం కాదు. అంటే ఉనికి దాని స్వస్వరూపం కాదు.

ఎప్పుడైతే దాని ఉనికి మూడునాళ్ళ ముచ్చటో, అప్పుడే దాని ఉనికి ఆగంతుక స్వరూపమే కాని స్వస్వరూపం కాదని అర్థమవుతుంది. అగ్నికి వేడి దాని స్వస్వరూపం. కాని నీటికి వేడి స్వస్వరూపం కాదు. అంటే అది ఆగంతుక లక్షణం. కాసేపయ్యాక వేడి తగ్గిపోతుంది. అందువల్ల ఆగంతుక లక్షణం అనిత్యం, స్వస్వరూపం నిత్యం.

గౌడపాదాచార్యులవారు ముందూ, తరువాత మాత్రమే కాదు, కుండగా ఉండగా కూడా దానికి ఉనికి లేదని నిరూపిస్తారు. **కుండ ఉంది** అనే వాక్యంలో ఆ **ఉంది** (ఉనికి) పదం నిజానికి మట్టికి చెందుతుంది. కుండను పట్టుకున్నా, మట్టిని పట్టుకున్నట్టే; కుండ బరువు మట్టి బరువే; కుండ వాసన మట్టి వాసనే. అందువల్ల విశ్లేషణ చేస్తే తెలిసేది, కుండ ఉంది అన్నా కూడా, దాని అర్థం మట్టి మాత్రమే ఉంది అని. అలా అరువు తెచ్చుకున్న ఉనికి ఉన్నా లేనట్టే కాబట్టి కుండ మిథ్య అవుతుంది.

**మట్టి సత్యం, కుండ మిథ్య**

ఇదే సూత్రాన్ని జగత్తుకు అన్వయిస్తే జగత్తు ఒక కాలంలో వచ్చి, ఒక కాలంలో పోయి, మధ్యలో అరువు తెచ్చుకున్న ఉనికితో ఉంది. అటువంటి జగత్తు ఉన్నా లేనట్టే. అందువల్ల జగత్తు మిథ్య అవుతుంది.

**బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా దీనికి వ్యాప్తి వాక్యం – యత్ అనిత్యమ్ తత్ మిథ్యా**

ఏది అనిత్యమో అది మిథ్య. **జాగ్రత్ ప్రపంచః మిథ్యా అనిత్యత్వాత్ స్వప్నప్రపంచవత్**
మొదట్లో పెట్టిన ఖాళీని ఇక్కడ అనిత్యత్వాత్‌గా పూరించాము.

ఈ సందర్భంలో జాగ్రత్ ప్రపంచం సత్యం అనే వారి వాదనలను నాలుగు కారణాలద్వారా ఖండించారు గౌడపాదాచార్యులవారు. అవి – ప్రయోజనం ఉంది, బాహ్యంగా ఉంది, నాకు భిన్నంగా ఉంది, స్పష్టంగా ఉంది.

**నాలుగు నిర్వచనాల ఖండన**

నాలుగు నిర్వచనాలు – ప్రయోజనం ఉంది, బాహ్యంగా ఉంది, నాకు భిన్నంగా ఉంది, స్పష్టంగా ఉంది.

| **నిర్వచనం** | | **ఖండన** |
|---|---|---|
| ఎ) **ప్రయోజనం ఉంది** | – | స్వప్నవస్తువులను జాగ్రత్‌లో వాడలేము నిజమే, కాని జాగ్రత్ వస్తువులను కూడా స్వప్నంలో వాడలేము. |
| బి) **బాహ్యంగా ఉంది** | – | స్వప్నప్రపంచం నా మనస్సునుంచి వచ్చింది నిజమే, కాని తురీయానికి లేస్తే జాగ్రత్ ప్రపంచం కూడా నానుంచే వచ్చింది. |
| సి) **నాకు భిన్నంగా ఉంది** | – | స్వప్నప్రపంచం నేను చూస్తేనే ఉంది నిజమే, కాని స్వప్నంలో కూడా కొన్ని వస్తువులు నేను చూడకపోయినా ఉంటాయి. నేను తురీయానికి లేస్తే జాగ్రత్ ప్రపంచం కూడా నాకు భిన్నంగా ఉండదు. |

డి) **స్పష్టంగా ఉంది** – స్వప్నప్రపంచంనుంచి లేస్తే స్పష్టంగా లేనట్టు అనిపిస్తుంది నిజమే, కాని అందులో ఉండగా స్పష్టంగా ఉన్నట్టే ఉంటుంది. తురీయానికి లేస్తే రెండూ మిథ్యే.

ఇక్కడ నాలుగు దశల్లో చూడాలి.

1. స్వప్నం, స్వప్నావస్థలో ఉండగా సత్యం
2. స్వప్నంనుంచి జాగ్రదవస్థకు లేస్తే స్వప్నం మిథ్య
3. జాగ్రత్ ప్రపంచం జాగ్రదవస్థలో సత్యం
4. జాగ్రదవస్థనుంచి తురీయానికి లేస్తే, జాగ్రత్ ప్రపంచం మిథ్య

జాగ్రదవస్థనుంచి తురీయానికి లేస్తే జాగ్రత్ ప్రపంచం మిథ్య. చూసేవారు ముగ్గరు– స్వప్నపురుషుడు, జాగ్రత్ పురుషుడు, జ్ఞాని.

అయితే రెండూ సత్యం అవాలి; లేదా రెండూ మిథ్య అవాలి. అలా అవాలంటే పోలిక రెండూ ఆ అవస్థల్లో ఉండగా చూడాలి లేదా ఆ అవస్థలనుంచి లేచాక చూడాలి. అసలు పోలికలే తప్పు. స్వప్నప్రపంచంనుంచి లేచాక పొందే అనుభవాన్ని, జాగ్రత్ ప్రపంచంలో ఉండగా పోలుస్తున్నారు.

అందువల్ల ప్రయోజనం ఉంది, బాహ్యంగా ఉంది, నాకు భిన్నంగా ఉంది, స్పష్టంగా ఉంది అనే కారణాలు చెల్లవు.

స్వప్నప్రపంచం, జాగ్రత్ ప్రపంచం రెండూ మిథ్య అయితే, మరి ఏమిటి సత్యం? మిథ్యా వస్తువుకు సత్య అధిష్ఠానం లేకుండా ఉనికి లేదు. చూడబడుతున్నవన్నీ మిథ్య అయితే, ఆత్యంతిక సత్యం దానికి భిన్నంగా ఉండాలి కదా? ఆత్యంతిక సత్యం ప్రమేయం కాదు, ప్రమేయం సత్యం కాదు కాబట్టి, అప్రమేయం సత్యం అవాలి. ఉనికి ఉండి, ప్రమేయం కానిది ఏమిటి? అదే తురీయ ఆత్మ. దీనికి గౌడపాదాచార్యులవారు రజ్జు–సర్ప భ్రాంతి ఉదాహరణను పేర్కొన్నారు. అక్కడ తాడును చూసి పాముగా పొరపాటు పడుతున్నాము. అంటే అజ్ఞానంనుంచి పొరపాటు వచ్చింది. అజ్ఞానం లేకపోతే పొరపాటుకు ఆస్కారం లేదు. తాడు లేకపోతేనూ, అజ్ఞానం కలుగదు. అందువల్ల తాడు అధిష్ఠానం; పాము అధ్యాస. అలాగే అధిష్ఠానం తురీయంమీద జగత్తు అధ్యాస. పాముమీద టార్చ్‌లైటు వేస్తే అధిష్ఠానజ్ఞానం కలుగుతుంది. అలాగే శాస్త్రజ్ఞానం అనే టార్చ్‌లైటు వేస్తే, అధిష్ఠానజ్ఞానం కలుగుతుంది.

**తురీయం సత్యం పాదత్రయం మిథ్యా**

3) **కల్పనా ప్రకారాః – కారికలు 19–29**

కల్పనా ప్రకారాః అంటే అనేక పొరపాట్లు. **దృక్ ఆత్మా అజ్ఞానేన దృశ్య అజ్ఞాన ఉత్పత్తిః**

చూస్తున్న నేనే ఆత్మను (తురీయాన్ని) అని తెలియక, బాహ్యవస్తువు సత్యం అనుకుని పొరపాటు పడుతున్నాను.

ఎప్పుడైతే సత్య అధిష్ఠానం తెలియదో, అప్పుడే మిథ్యా వస్తువును పొరపాటుగా సత్యం స్థాయికి పెంచుతారు అంటున్నారు గౌడపాదాచార్యులవారు. తాడు తెలియకపోతే, పాము సత్యం అయి కూర్చుంటుంది; జాగ్రత్ పురుషుడు తెలియకపోతే, స్వప్నం నిజమై కూర్చుంటుంది; తురీయం తెలియకపోతే, దృశ్యప్రపంచం సత్యమై కూర్చుంటుంది. ఇలా సత్యం కాని సత్యంగా మారటమే సంసారం.

సత్యంకోసం బాహ్యవస్తువుల్లో వెతికితే అది ఎన్నటికీ దొరకదు. ఎందుకంటే వెతికే నేనే సత్యం; వెతకబడుతున్న వస్తువు కాదు సత్యం. ఈ విషయం మామూలు మనుష్యులే కాదు, దార్శనికులు కూడా మర్చిపోతున్నారు. అందువల్ల అనేక పొరపాట్లు జరుగుతున్నాయి. సత్యాన్వేషణలో విజయం సాధించలేకపోతున్నారు. వారి అన్వేషణే సత్యదూరంగా సాగుతున్నది.

**అనంతైశ్చ భావైరేతైర్వికల్పితః** – అనేక విషయవస్తువులను ఆత్యంతిక సత్యంగా భావిస్తారు. నిజమేమిటంటే, అసలు ఏ ఆబ్జెక్ట్ కూడా సత్యం కాదు; సబ్జెక్ట్ మాత్రమే సత్యం. ఎందుకు విషయవస్తువులను సత్యంగా పొరపాటు పడుతున్నారు?

**మాయైషా** – అజ్ఞానంవల్ల. తమిళంలో ఈ అజ్ఞానాన్ని వర్ణించే ఒక అద్భుతమైన కవిత ఉంది. దాని సారాంశం – సత్యం సాక్షిచైతన్యమైన నేను, అది తెలియక, సుదూరంగా ఉన్న అంతరిక్షంలో టెలిస్కోప్‌తోనో, అంతర్గతంగానో వెతుకుతాను. సత్యం నాకు దూరంగానూ లేదు, నా లోపలా లేదు; వెతుకుతున్న నేనే సత్యాన్ని.

భగవంతునికోసం అంతటా వెతుకుతాము – బయటా, లోపలా. కాని మనమే చైతన్యపరంగా భగవంతులమని తెలుసుకోలేము. ఇది మాయయొక్క శక్తి.

ఏష మాయ – ఈ మాయ మనిషిని బహిర్ముఖంగా చేస్తున్నది.

**తస్య దేవస్య** – ఈ మాయ తురీయ ఆత్మయొక్క శక్తి.

**యయా సంమోహితస్స్వయమ్** – యయా అంటే ఆ మాయవల్ల; సంమోహితం అంటే మోహంలో పడిపోతున్నాము. స్వయం అంటే మనం. అంటే మనం మాయవల్ల మోహంలో

పడిపోతున్నాము. సత్యం ఒకటే కాని అది తెలియక, అనేక పొరపాట్లు పడుతున్నాము. ఈ కారికలో ఒక పొరపాటును పేర్కొంటున్నారు గౌడపాదాచార్యులవారు.

**ప్రాణాదిభిః** – భగవంతుణ్ణి ఆబ్జెక్టుగా అంటే ప్రమేయంగా చూసే పొరపాటు మొట్టమొదటిది. భగవంతుణ్ణి ప్రమేయంగా చూడటం పొరపాటు అనే ఈ వాక్యాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. నువ్వు కొలిచే దేవుడు, బ్రహ్మ అంటారు చాలామంది దార్శనికులు.

**తదేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం యదిదముపాసతే** – కేన

నువ్వు కొలిచే దేవుడు బ్రహ్మ కాదు, దేవుణ్ణి కొలిచే నువ్వే బ్రహ్మవు అంటుంది కేనోపనిషత్తు.

మాండూక్యోపనిషత్తులోనే ఒక సూత్రం చూశాము –

**యత్ యత్ దృశ్యం తత్ తత్ మిథ్యా**

మనం కొలిచే దేవుడు మిథ్య; మనం చూసే ప్రపంచం మిథ్య. పరమాత్మ సత్యం అని ఒక్క సందర్భంలోనే చెప్పగలము అంటుంది శాస్త్రం. ఎప్పుడు? జీవాత్మ, పరమాత్మ ఐక్యం అర్థమైనప్పుడే. **అహం బ్రహ్మ అస్మి** అనే జ్ఞానం పొందినప్పుడే అది సత్యం. ప్రాణః అంటే ప్రమేయంగా కనబడే ఈశ్వరుడు. దీన్నే సాంకేతికంగా చూస్తే **తటస్థ ఈశ్వరః** అంటాము. న్యాయదార్శనికులు కూడా పరమాత్మను ఆబ్జెక్టుగా చూస్తారు కాని అద్వైతంలో అది సత్యం కాదు.

మామూలు మనుష్యులే కాదు, దార్శనికులు కూడా పొరపాటు పడుతున్నారు.

| | | | |
|---|---|---|---|
| చార్వాక | 1 – విషయా ఇతి తద్విదః | – | విషయవస్తువులే పరమం |
| | 2 – స్థూల ఇతి చ తద్విదః | – | శరీరమే సత్యం |
| పూర్వమీమాంస | 1 – యజ్ఞా ఇతి చ తద్విదః | – | వేదపూర్వభాగం అర్థం తెలుసుకోవాలి |
| | 2 – ధర్మాధర్మేచ తద్విదః | – | పుణ్యపాపాలు సత్యం<br>కృతి మహోదధౌ పతనకారణం<br>ఫలమశాశ్వతం గతి నిరోధకం |
| సాంఖ్య | 1 – భోక్తా ఇతి చ భోక్తృవిదః | – | ఆత్మ కర్త కాదు కాని భోక్త |
| | 2 – పంచవింశక ఇత్యేకే | – | 25 తత్త్వాలే సత్యం |
| జైనులు | – సూక్ష్మ ఇతి సూక్ష్మవిదః | – | ఆత్మ సూక్ష్మం, అనేక ఆత్మలు ఉన్నాయి |
| బౌద్ధులు | 1 – అమూర్త ఇతి చ తద్విదః | – | శూన్యం సత్యం |
| | 2 – బుద్ధిరితి తద్విదః | – | క్షణిక విజ్ఞానవాదం సత్యం |
| యోగదర్శనం | 1 – షడ్వింశ ఇతి చాపరే | – | 26 తత్త్వాలు |

**4) ఉపసంహారః - కారికలు 30-34**

ఎలా ద్వైతంనుంచి అద్వైతానికి క్రమంగా రావాలో, ఈ కారికల్లో అద్భుతంగా వివరించబడింది. వారు దృశ్యం సత్యం అనుకోవటంవల్ల దృక్ సత్యం కాదనుకుంటున్నారు. ఈ ద్వైతభావనలో ఉన్నన్నాళ్ళూ సంసారం తప్పదు. అందువల్ల నెమ్మదిగా ద్వైతంనుంచి అద్వైతానికి రావాలి. నేను కొలిచే నామరూపాలు మిథ్య అని అర్థం చేసుకోవాలి. అలా ఉపాసన చేసేవారిని కృపణులు అని అంటారు గౌడపాదాచార్యులవారు. వారు సత్యాన్ని ప్రమేయంగా చూస్తున్నారు. ప్రమేయానికి స్వతంత్రంగా ఉనికి ఉందనీ, ప్రమాతనైన నేను దానికి భిన్నంగా ఉన్నాననీ అంటారు. కాని ప్రమేయానికి ఉనికి, దాన్ని ప్రమాత చూస్తేనే ఉంటుంది.

ఒక స్వాప్నికుడు తన స్వప్నంలో ఉన్నంతసేపూ తన స్వప్నం స్వప్నం అని ఎలా తెలుసుకోలేడో, అలాగే జాగ్రత్ పురుషుడు ఈ జాగ్రత్ ప్రపంచం మిథ్య అని తెలుసుకోలేడు. ద్వైతం ఉన్నచోట మోక్షం కుదరదు. ఎందుకంటే ద్వైతం ఉన్నచోట సంసారం తప్పదు. జ్ఞాని మాత్రమే ద్వైతదర్శనం చేస్తున్నా కూడా అది మిథ్య అని అర్థం చేసుకోగలడు. ద్వైతాన్ని అనుభవించటంవల్ల సంసారం ఏర్పడదు; ద్వైతాన్ని సత్యంగా తీసుకోవటంవల్ల సమస్య వస్తుంది.

అద్వైతానికి రాకముందు ఒక సాధకుడు ద్వైతంలో ఉండవచ్చు, అందులో ఏమీ సమస్య లేదు. అతని బుద్ధి త్రిపుటి గురించి ఆలోచిస్తుంది - జీవ, జగత్, ఈశ్వరుడు. కాని అద్వైతానికి వచ్చాక ఈ మూడు రెండవ్వాలి - ఆత్మ-అనాత్మ భేదం చూడాలి; తర్వాత రెండు ఒకటవ్వాలి. ఉన్నదొకటే అద్వైతం అనే సత్యాన్ని జీర్ణించుకోవాలి. అద్వైతాన్ని జీర్ణించుకున్నంత మాత్రాన, ద్వైతం పోదు. సూర్యోదయం అవటం లేదని తెలిశాక కూడా సూర్యోదయ అనుభవం పోదు. కాని ఎలాగైతే సూర్యోదయం నిజం కాదని తెలుసుకుంటామో, అలా ద్వైతం నిజం కాదని అర్థం చేసుకుంటాడు జ్ఞాని. ద్వైతం మిథ్య అని నిరూపించటానికి మూడు ఉదాహరణలు ఇవ్వబడ్డాయి ఈ కారికలో. అవి స్వప్నం, ఇంద్రజాలం, గంధర్వనగరం.

**స్వప్నమాయే యథా దృష్టే** -స్వప్నః చ మాయా చ - ద్వైతాన్ని స్వప్నంలాగా చూస్తారు. స్వప్నప్రపంచం అనుభవంలోకి వస్తుంది కాని అది సత్యం కాదు. అలాగే జాగ్రత్ ప్రపంచం కూడా అనుభవంలోకి వస్తుంది కానీ అదీ సత్యం కాదు. మాయే - మిథ్యకు ఇంకొక ఉదాహరణ మాయాజాలం. ఇక్కడ మాయ అంటే వేదాంతంలో నేర్చుకునే మాయ కాదు; మాయ అంటే ఇంద్రజాలం.

ఇంద్రజాలంలో ఇంద్రజాలికుడు ఒక అమ్మాయిని రెండు భాగాలుగా కోస్తాడు. రక్తం కూడా కారుతుంది. కాళ్ళు ఒకవైపు, మొండెం ఒకవైపు జరిపి, అతను వాటి రెండింటి

మధ్యనుంచి నడుస్తాడు. కళ్ళు ఇదంతా చూస్తూనే ఉన్నా, మీ బుద్ధి ఇది నిజంగా జరగలేదు. ఇది ఒక మాయాజాలం అని హెచ్చరిస్తుంది. అందువల్ల మీరు ఖంగారు పడకుండా, నిశ్చింతగా వెనక్కి వాలి మరీ కూర్చుని చూస్తారు. అదే విధంగా మీ ఎదురుగా ద్వైతప్రపంచమే కనిపిస్తున్నా కూడా మీరు చలించకుండా, ఇదంతా మాయయొక్క మిథ్య అని అర్థం చేసుకుంటారు.

**గంధర్వనగరమ్** – ఆకాశంలో కనిపించే నగరం. ఇంకో విధంగా చెప్పాలంటే, ఆకాశంలో ఉన్న మేఘాలను చూసేటప్పుడు, మీ మనస్సుకు మంచి కల్పనాశక్తి ఉంటే, ఆ మేఘాలను అనేక రూపాలుగా ఊహించుకోవచ్చు – మనుష్యులు, జంతువులు, బజారు అలా ఎన్నో! అలాంటి గంధర్వనగరమే ఈ జాగ్రత్ ప్రపంచం కూడా. విజ్ఞానశాస్త్రం ప్రకారం, జగత్తు అంటే కదులుతున్న ప్రోటాన్లు, ఎలక్ట్రాన్లు, న్యూట్రాన్ల సముదాయమే. అంటే జగత్తు అంటే కదులుతున్న శక్తి. అద్వైతశాస్త్రం ప్రకారం జగత్తు అంటే కదులుతున్నట్టుగా ఉన్న చైతన్యం.

ఆ విధంగా జ్ఞానులు జగత్తును స్వప్నంలాగా, ఇంద్రజాలంలాగా, గంధర్వనగరంలాగా మిథ్య అని అర్థం చేసుకుంటారు.

### కారిక 2.32

**న నిరోధో న చోత్పత్తిర్న బద్ధో న చ సాధకః ।**
**న ముముక్షుర్న వై ముక్త ఇత్యేషా పరమార్థతా ॥**

ఇది చాలా ముఖ్యమైన కారిక. శంకరాచార్యులవారు దీనిని తరచు ఉటంకిస్తుంటారు. ఒక్కముక్కలో చెప్పాలంటే, ఈ కారిక సారాంశం, **తురీయ దృష్ట్యా జగన్మిథ్యా.**

స్వప్నదృష్టాంతాన్ని మాండూక్యంలో ఉన్నంతవరకూ మర్చిపోకూడదు. స్వాప్నికునికి స్వప్నంలో ఉన్నంతవరకూ అతనికి స్వప్నం, స్వప్నం అని తెలియదు. స్వప్నంలో స్వప్నశరీరానికి ఆకలి వేస్తుంది, స్వప్నంలో ఆహారం తీసుకుంటాడు. అలాగే స్వప్నంలో దెబ్బ తగిలితే, అదికూడా నిజమే. స్వప్నంలోనే డాక్టరు దగ్గరికి వెళ్ళాలి. స్వప్నం డబ్బులు ఇవ్వాలి, స్వప్నం మందులు వేసుకోవాలి, స్వప్నంలో తగ్గుతుంది. ఇదంతా నిజంగా జరుగుతున్నట్టు గట్టిగా అనిపిస్తుంది.

కాని అతను మాత్ర వేసుకోబోతుండగా నిద్ర లేచాడు అనుకోండి. అప్పుడేమవుతుంది? స్వప్నశరీరమే మిథ్యగా తేలిపోతుంది. స్వప్నశరీరమే మిథ్య అయితే, ఆ శరీరానికి తగిలిన దెబ్బ మాత్రం సత్యమవుతుందా? దెబ్బ లేకపోతే దాన్ని నయం చేసే అవసరం ఏముంది? కాని అది మిథ్య అని ఎప్పుడు తెలుస్తుంది? అతను స్వప్నంనుంచి నిద్ర లేచాకే.

ఇదే సూత్రం జాగ్రత్ ప్రపంచానికి కూడా వర్తిస్తుంది అంటున్నారు గౌడపాదాచార్యులవారు. జాగ్రత్ ప్రపంచంలో ఉన్నంతవరకూ జాగ్రత్ పురుషునికి జాగ్రత్ ప్రపంచం మహాసత్యం. అతను తురీయానికి లేస్తే, జాగ్రత్ ప్రపంచం కూడా స్వప్నం-2గా, మిథ్యగా తేలిపోతుంది.

**ఇత్యేషా పరమార్థతా** - పారమార్థిక దృష్ట్యా అంటే తురీయం దృష్ట్యా ఇది నిశ్చయము.

**న ఉత్పత్తిః** - ఉత్పత్తి అంటే జగత్తుయొక్క సృష్టి. ఎలాగైతే స్వప్నంనుంచి లేస్తే స్వప్నప్రపంచం సృష్టి లేదో, అలాగే తురీయానికి లేస్తే, జాగ్రత్ ప్రపంచం సృష్టి కూడా లేదు.

**న నిరోధః** - అదే విధంగా తురీయ దృష్ట్యా ప్రళయమూ లేదు. నిరోధః అంటే ప్రళయం. తురీయ దృష్ట్యా సృష్టీ లేదు, ప్రళయమూ లేదు. గుర్తుంచుకోండి, మనశ్శరీరాల దృష్ట్యా సృష్టి ఉంది, లయ ఉంది కాని తురీయ దృష్ట్యా సృష్టి లేదు, లయ లేదు. సృష్టీ లేక, లయమూ లేకపోతే స్థితి ఎక్కడనుంచి వస్తుంది. **స్థితి అపి న.** స్థితి కూడా లేదు. స్థితి లేదు అంటే జీవులు ఉండీ లేనట్టే అర్థం.

**న బద్ధః** - జీవులే లేకపోతే, వారు బద్ధజీవులు ఎలా అవుతారు?

**న ముముక్షుః** - బద్ధజీవే లేకపోతే, జీవుడు మోక్షం కోరే ప్రసక్తి ఎక్కడ ఉంది? అందువల్ల ముముక్షుత్వం లేదు అంటే సాధన లేదు.

**న చ సాధకః** - సాధన లేకపోతే సాధకుడూ లేడు. సాధకుడే సాధన చేయాలి. ఒక సాధకుడే కర్మయోగం చేసి చిత్తశుద్ధి పొంది; ఉపాసనాయోగం చేసి చిత్త ఏకాగ్రత పొంది; జ్ఞానయోగానికి వచ్చి జ్ఞానం పొంది, తద్వారా మోక్షం పొందాలి. ఇవన్నీ సాధకుడు దశలవారీగా చేయాల్సిన ప్రయాణం. సాధనే అవసరం లేకపోతే సాధకుడు ఎందుకు?

**న వై ముక్తః** - బద్ధజీవే లేకపోతే, ముక్తపురుషుడు ఎలా అవుతాడు?

ఇలా అయితే మాండూక్యం నేర్చుకోవటం కొనసాగించాలా, లేదా? ఇవన్నీ ఎవరిపరంగా చెబుతున్నాము? శాస్త్రానికి వచ్చి, జ్ఞానం పొంది, తురీయదృష్ట్యా అర్థం చేసుకునే వ్యక్తి పరంగా. జాగ్రదవస్థలో ఉండగా సృష్టి, స్థితి, లయ ఉంది; సాధకుడు సంసారమనే బంధంలో పడి కొట్టుమిట్టాడుతున్నాడు; తీవ్రముముక్షుత్వం చూపి, కర్మ, ఉపాసన, జ్ఞానమార్గాలద్వారా మోక్షం పొందాలి. అలా జ్ఞానం పొందాక, ఉన్నదొకటే అద్వైతం; తను నిత్య, ముక్త, శుద్ధ తురీయ ఆత్మ అని తెలుసుకున్నాక చెప్పేమాట ఇది. అంటే **తురీయదృష్ట్యా సృష్టి లేదు, లయ లేదు, జీవుడు లేడు, బంధం లేదు, మోక్షం లేదు, సాధన అవసరం లేదు; సాధకుడే లేడు.** అహంకారదృష్ట్యా, దేహ అభిమానదృష్ట్యా చూస్తే ఇవన్నీ ఉన్నాయి. తురీయదృష్ట్యా చూడటం నేర్చుకునేటంతవరకూ శాస్త్రం నేర్చుకోకతప్పదు.

ఇక్కడ గౌడపాదాచార్యులవారు ఇంకొక ప్రత్యేకమైన, అరుదైన ఆలోచనను మన మనస్సులోకి చొప్పిస్తున్నారు. ద్వైతప్రపంచం మిథ్య అనేది శాస్త్రానికి వచ్చిన అందరికీ తెలిసినదే. కాని గౌడపాదాచార్యులవారు అద్వైతం కూడా కొంతమేరకు మిథ్య అంటున్నారు. ద్వైతం పూర్తిగా మిథ్య అయి, అద్వైతం పాక్షికంగా మిథ్య అయితే, ఈ రెండింటిలో ఏది గొప్పది? నిస్సందేహంగా పాక్షికంగా మిథ్య అయిన అద్వైతమే గొప్పది. ఎందుకు? పాక్షికంగా మిథ్య అయితే, పాక్షికంగా సత్యం అని కదా అర్థం. సత్యం అయినదే ఎప్పటికన్నా గొప్పది.

ద్వైతం మిథ్య అని ఇంతవరకూ గౌడపాదాచార్యులవారే నిరూపించుకుంటూ వచ్చారు. ద్వైతప్రపంచం అంటే – విశ్వ–జాగ్రత్ ప్రపంచం; తైజస–స్వప్నప్రపంచం; ప్రాజ్ఞ–కారణప్రపంచం అని చూశాము. ఇప్పుడు అద్వైతం పాక్షికంగా మిథ్య అని ఎలా అంటున్నారు? దాంట్లో ఒక సూక్ష్మమైన, సాంకేతిక పదం ఉంది. అదేమిటో చూద్దాము.

**మిథ్య నిర్వచనం** – దేన్నైతే త్రోసిపుచ్చగలమో అది మిథ్య; దేన్నైతే త్రోసిపుచ్చలేమో అది సత్యం. ద్వైతాన్ని త్రోసిపుచ్చగలము కాబట్టి అది మిథ్య; అద్వైతాన్ని అంటే తురీయాన్ని త్రోసిపుచ్చలేము కాబట్టి అది సత్యం. ఇంతవరకూ బాగానే ఉంది.

ఇక్కడ గౌడపాదాచార్యులవారు ఒక అడుగు ముందుకు వేస్తున్నారు. మాండూక్యానికి వచ్చారు అంటేనే, మిగతా ఉపనిషత్తులకన్నా ఒక మెట్టు పైనుంచే అర్థం చేసుకోవటానికి సంసిద్ధులై ఉండాలి. గౌడపాదాచార్యులవారు, ఎప్పుడైతే ద్వైతప్రపంచాన్ని మిథ్యగా కొట్టివేస్తున్నామో, అప్పుడే అద్వైతానికి, అద్వైతపు హోదా ఉండదు అంటున్నారు. ఇప్పుడు తాడు–పాము ఉదాహరణే తీసుకోండి. తాడుమీద పామును ఆరోపించాము. తాడు అధిష్ఠానం, పాము అధ్యాస. పాము అనే అధ్యాస పోతే, తాడుకు అధిష్ఠాన హోదా కూడా పోతుంది. అధిష్ఠాన హోదా, అధ్యాస ఉన్నంతవరకే ఉంటుంది. పాము మాయమయ్యాక, తాడు ఉంటుంది; తాడు కూడా ఉండదు అనకూడదు. కాని తాడుకు అధిష్ఠాన హోదా మాత్రం ఉండదు. ఆ పదమూ ఇంక వాడలేము.

ఇప్పుడు ఇదే సూత్రాన్ని అద్వైతం–ద్వైతం పదాలకు అన్వయించి చూద్దాము. తురీయం అద్వైతం, జగత్తు ద్వైతం. ద్వైతాన్ని మిథ్యగా కొట్టివేస్తే, ఇంక అద్వైతం హోదా ఉండదు. జాగ్రత్తగా గమనించండి, అద్వైతం ఉంటుంది, తురీయం ఉంటుంది కాని తురీయానికి అద్వైతం హోదా ఉండదు. ఆ మాటకొస్తే అద్వైతానికి వచ్చాక ఏ పదాన్నీ వాడలేము. సత్యం పదం వాడాలంటే, దానికి భిన్నంగా మిథ్యా వస్తువు ఉండాలి; సబ్జెక్టు అనాలంటే దానికి భిన్నంగా ఆబ్జెక్టు ఉండాలి; తురీయం అనాలి అంటే దానికి భిన్నంగా ద్వైతప్రపంచం ఉండాలి; నిర్గుణబ్రహ్మ అనాలి అంటే సగుణ ఈశ్వరుడు ఉండాలి; చైతన్యం అనాలి అంటే దానికి భిన్నంగా జడం ఉండాలి; నిత్యం అనాలి అంటే దానికి భిన్నంగా అనిత్యవస్తువు

ఉండాలి. జగత్తు మిథ్య, జడం, అనిత్యం, ద్వైతం అని నిరూపించటానికి తురీయం సత్యం, చైతన్యం, నిత్యం, అద్వైతం అని వివరిస్తాము. కాని జగత్తును ఈ పదాలతో కొట్టివేశాక, చివరికి తురీయం, అద్వైతం పదాలను కూడా వాడలేము. అంటే సత్యం, చైతన్యం హోదాలు కూడా ఉండవు.

అందువల్ల ద్వైతప్రపంచాన్ని ఖండించేటంతవరకే ఈ పదాలకు ఉనికి. ఒకసారి తురీయం స్థాయికి ఎదిగాక, ఈ పదాలేవీ వాడలేము. మరి ఏం వాడాలి? మౌనవ్యాఖ్యానమే! ఈ భావననే ఈ కారికలో చూస్తాము.

### కారిక 2.34

**నాత్మభావేన నానేదం న స్వేనాపి కథంచన ।**
**న పృథఙ్ నాపృథక్కించిదితి తత్త్వవిదో విదుః ॥**

**అయం** – ఈ ఆత్మ, **కల్పితః** – కల్పించబడింది. దేనిగా?

**అసద్భిః భావైః ఏవ**– భావః అంటే ద్వైతప్రపంచరూపంలో; అసద్భిః అంటే మిథ్య. ఆ విధంగా ఆత్మ మిథ్య అయిన ద్వైతప్రపంచంగా కల్పించబడింది.

**అద్వయేన చ (కల్పితః)** – ఆత్మకు ఉన్న ఈ అధిష్ఠాన హోదా కూడా మిథ్య. ఇక్కడ చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. ఆత్మను మిథ్య అనటం లేదు; సాక్షిగా చూసే ఆత్మ (తురీయం) సత్యం కాని సాక్షి హోదా మిథ్య. దృశ్యంగా చూడబడే జగత్తే లేకపోతే దేన్ని సాక్షిగా చూస్తుంది? సాక్షిచైతన్యం హోదా కూడా మిథ్యే. మిథ్యమీద ఆధారపడి ఏర్పడిన హోదా కూడా మిథ్యే. ఆ విధంగా పదాలన్నీ కొట్టివేస్తే మిగిలింది ఏమిటి? అమాత్ర అంటే పేరు లేనిది.

దానికి పేరు లేదు అనగానే, తక్కినవారు అదుగో మీరు పేరు వాడారు అంటారు. పేరు లేదు అని చెప్పేది కూడా తక్కినవారికోసమే. అన్నీ ఖండించాక, మిగిలేది మౌనవ్యాఖ్యానమే.

ద్వైతప్రపంచాన్ని మిథ్యగా ఎలా కొట్టివేయవచ్చో, పూర్తిగా కొత్తకోణంలోంచి చూపిస్తున్నారు గౌడపాదాచార్యులవారు. ముందే చెప్పినట్టుగా ఆయన మార్గమే భిన్నం. జగత్తు అనే పదార్థం కూడా అనిర్వచనీయం, మిథ్య అంటున్నారు గౌడపాదాచార్యులవారు. ఎందుకు? ఒక వస్తువుయొక్క ఉనికి గురించి మాట్లాడాలీ అంటే మూడు మార్గాలే ఉన్నాయి.

- పదార్థమూ, చైతన్యమూ ఒకటై ఉండాలి.
- పదార్థం, చైతన్యానికి భిన్నంగా ఉండాలి.
- పదార్థం, చైతన్యంలో ఒక భాగమై ఉండాలి.

కాని ఈ మూడు కారణాలూ చెల్లవని చూశాము.

జగత్తుకు తురీయానికి మధ్య –

| | | |
|---|---|---|
| పోలిక లేదు | – | జగత్తు జడం, తురీయం సత్యం |
| భాగం కాదు | – | తురీయం నిరవయం |
| భిన్నంగా లేదు | – | తురీయం అద్వైతం |

అంటే అసలు పదార్థం లేదని అందామా? అలాగూ అనలేము. ఎందుకంటే అది మన అనుభవంలోకి వస్తున్నది. మన అనుభవంలోకి వచ్చిన, మనం ఒక తెగకింద జమ కట్టలేనిది ఏదైనా మిథ్యే. బుద్ధి దీన్ని అంత తేలికగా స్వీకరించలేదు. ఎందుకంటే, మనం దేన్నైనా స్వీకరించేది ఒక తెగ కింద జమ కట్టడం ద్వారానే. ఏ సబ్జెక్టు తీసుకోండి, అందులో కొన్ని తెగలు ఉంటాయి. మాథ్స్ తీసుకుంటే ఆల్జీబ్రా, ట్రిగ్నామెట్రీ, జామెట్రీ అలా భాగాలు ఉంటాయి. కాని తురీయంలో జగత్తును భాగాలుగా చేయలేము.

కారిక 32లో పారమార్థిక దృష్ట్యా అసలు సృష్టే జరగలేదన్నారు గౌడపాదాచార్యులవారు. ఇప్పుడు ఈ కారికలో జగత్తును అసలు ఉనికి లేదు అనలేము, కాని అది మిథ్య అంటున్నారు. అంటే జగత్తు అనుభవంలోకి వస్తున్నది, కాని తార్కికంగా నిరూపించటానికి ప్రయత్నిస్తే మాత్రం కుదరటం లేదు. జగత్తు, బ్రహ్మ ఒకటే అందామా అంటే జగత్తు జడం–బ్రహ్మ చైతన్యం; జగత్తు సగుణం–బ్రహ్మ నిర్గుణం; జగత్తు సవికారం–బ్రహ్మ నిర్వికారం.

పోనీ జగత్తు, బ్రహ్మకు భిన్నంగా ఉంది అందామా అంటే, ద్వైతం వచ్చేస్తుంది. ఎక్కడ ద్వైతం ఉంటే అక్కడ దేశ, కాల, వస్తు పరిచ్ఛేదం వస్తుంది. ఒకటి ఇంకొకదానికి పరిమితులను విధిస్తుంది. బ్రహ్మ అనంతం. అనంతం బ్రహ్మను ఎలా పరిమితి చేస్తారు? అంతేకాదు, బ్రహ్మ అద్వైతం, ఉన్నదొకటే బ్రహ్మ. ఉన్నదొకటే బ్రహ్మ అయితే భిన్నంగా వేరే ఏదీ ఉండటానికి వీలులేదు.

అదీకాదు, ఇదీకాదు, జగత్తు బ్రహ్మలో ఒక భాగం అందామా అంటే బ్రహ్మకు భాగాలు లేవు. ఆకాశానికే భాగాలు లేకపోతే బ్రహ్మకు ఎలా భాగాలు ఉంటాయి? అందువల్ల జగత్తుయొక్క ఉనికిని తార్కికంగా నిరూపించలేము.

**నాత్మభావేన నానేదం న స్వేనాపి కథంచన** – ఈ నానాత్వం, ఆత్మ ఒకటి కాదు; అలాగని ఆత్మకు భిన్నంగానూ లేదు. అందువల్ల జగత్తుయొక్క స్వరూపం ఆత్మకు సమానంగానూ లేదు, భిన్నంగానూ లేదు. అందువల్ల అది అనిర్వచనీయం.

ముందే చెప్పినట్టుగా గౌడపాదాచార్యులవారి పద్ధతే వేరు. ఇంతవరకూ జగత్తునూ, బ్రహ్మను పోల్చిచూశాము. ఇప్పుడు గౌడపాదాచార్యులవారు ఇంకొక అడుగు ముందుకు

వేయిస్తున్నారు మనచేత. జగత్తు, బ్రహ్మ విషయం మాట దేవుడెరుగు, జగత్తులోనే ఒక వస్తువుకూ, ఇంకొక వస్తువుకూ మధ్య సంబంధాన్ని కూడా తార్కికంగా నిరూపించలేము అంటున్నారు. మనకు తెలిసి జగత్తులో అనేక వస్తువులు ఉన్నాయి, ఒక వస్తువు ఇంకొక వస్తువుకు పూర్తిగా భిన్నంగా ఉంటుంది.

**పుస్తకం బల్ల**మీద ఉంది

ఈ వాక్యంలో పుస్తకం వేరు, బల్ల వేరు. అందువల్ల వాటికి పేర్లు కూడా భిన్నంగా ఉన్నాయి. అలా అనేక వస్తువులకు, అనేక పేర్లు పెట్టుకుని, వాటితో వ్యవహారం నడుపుకు వస్తున్నాము. అంతకన్నా వాటి విషయాల్లో లోతుగా వెళ్ళలేదు. గౌడపాదాచార్యులవారు, ఒక ఆశ్చర్యకరమైన సూత్రాన్ని చెబుతున్నారు. కొంచెం లోతుగా వెళితే, ఒక వస్తువుకూ, ఇంకొక వస్తువుకూ మధ్య భేదాన్ని అసలు నిరూపించలేము అంటున్నారు. మనం వాటి మధ్య భేదం ఉందనుకుంటున్నాము కాని నిజంగా లేదు అంటున్నారు గౌడపాదాచార్యులవారు. గుర్తుంచుకోండి, మనం ఇప్పుడు బ్రహ్మ గురించి మాట్లాడటం లేదు. జగత్తులోని రెండు వస్తువుల గురించి మాట్లాడుతున్నాము.

**న పృథక్ నాపృథక్కించిత్** – జగత్తులోని ఒక వస్తువు ఇంకొక వస్తువును పోలివుందా, భిన్నంగా ఉందా అని కొంచెం కూడా నిరూపించలేము అంటున్నారు గౌడపాదాచార్యులవారు. అదెలా?

కొంచెం లోతుగా ఈ విషయాన్ని విశ్లేషిద్దాము. భేదాన్ని ఎలా నిరూపిస్తాము? ఒకవేళ మీరు పసుపురంగు, ఎరుపురంగుకు భిన్నంగా ఉంది అన్నారు అనుకోండి. మీ కళ్ళు మూడు విషయాలను చూడగలుగుతున్నాయి. మీ కళ్ళు పసుపురంగును చూపిస్తున్నాయి, ఎరుపురంగును చూపిస్తున్నాయి, ఈ రెండింటి మధ్య భేదాన్ని కూడా చూపిస్తున్నాయి.

ఇప్పుడు చెప్పండి – పసుపురంగుకు, ఎరుపురంగుకూ మధ్య ఉన్న భేదం ఏ రంగు? పసుపురంగా, ఎరుపురంగా? ఏదీ కాదు. ఆ భేదం ఈ రెండింటిలో ఏదీకాదు. భేదం ఏ రంగూ కాకపోతే, భేదాన్ని చూడలేరు మీరు. అంటే భేదానికి ప్రత్యక్షప్రమాణం లేదు.

సరే, ఇప్పుడు రూపం తీసుకుందాము. ఒక వృత్తాన్నీ, ఒక చతురస్రాన్నీ తీసుకుందాము. ఈ రెండు రూపాలూ మీకు బాగానే కనిపిస్తున్నాయి సరే! వీటి మధ్యనున్న భేదం ఏ రూపం? వృత్తమా, చతురస్రమా? ఏదీ కాదు! భేదం ఏ రూపమూ కాకపోతే, భేదాన్ని చూడలేరు మీరు. కళ్ళు రంగు, రూపాలను మాత్రమే చూడగలవు. కాని భేదం రంగూ కాదు, రూపమూ కాదు.

అయితే భేదం శబ్దస్పర్శరూపరసగంధాలలో దేనికీ అందదు. భేదం ఈ ఐదింటికీ అందకపోతే అది ప్రత్యక్షప్రమాణానికి అందదని అర్థం. పంచజ్ఞానేంద్రియాలు ప్రత్యక్షప్రమాణం. పంచజ్ఞానేంద్రియాలకు అందనిది ప్రత్యక్షవిషయంలోకి రాదు.

ప్రత్యక్షప్రమాణానికి అందకపోతే, అనుమానప్రమాణంలోకి వస్తుందా? అనుమాన ప్రమాణం వాడాలంటే దానికి ప్రత్యక్షప్రమాణం తోడవ్వాలి. కొండమీద పొగను చూసి అక్కడ అగ్ని ఉందని ఊహించాలంటే, ఎక్కడ పొగ ఉంటే అక్కడ అగ్ని ఉంటుందనే జ్ఞానం ఉండాలి. అది ప్రత్యక్ష ప్రమాణంవల్లనే సాధ్యం. పూర్వకాలపు వంటింట్లో పొగనూ, అగ్నినీ కలిపి చూడటంవల్ల కలిగిన జ్ఞానం అది. అసలు పొగనే ఎప్పుడూ చూడకపోయివుంటే, పొగ ఉన్నచోట అగ్ని ఉంటుందని చెప్పలేరు. అంటే అనుమాన ప్రమాణాన్ని, ప్రత్యక్షప్రమాణానికి జత చేయకుండా వాడలేరు. అంటే అనుమాన ప్రమాణమే కాదు, తర్కంమీద ఆధారపడిన తక్కిన ప్రమాణాలు కూడా వాడలేరు. అవి అర్థాపత్తిప్రమాణం, అనుపలబ్ధిప్రమాణం, ఉపమానప్రమాణం. అంటే లౌకిక విద్యకు వాడే ఐదు ప్రమాణాల్లో దేన్నీ వాడలేరు.

ఈ ప్రమాణాలు పనిచేయని చోట శాస్త్రప్రమాణం పనిచేస్తుంది, శాస్త్రం ఆత్మజ్ఞానాన్ని కలుగజేస్తుందని చూశాము. అయితే శాస్త్రం ఈ భేదం గురించి చెబుతుందా?

**నేహ నానాస్తి కించన** – కఠ

ఇక్కడ కొంచెం కూడా భేదం లేదు అంటున్నది శాస్త్రం. ఆ విధంగా భేదాన్ని నిరూపించటానికి ఏ ప్రమాణమూ లేదు. మరయితే, ద్వైతం ఏమిటి? అది కేవలం అపోహ మాత్రమే. ఏ ప్రమాణానికీ అందనిది అపోహ తప్ప ఏమీకాదు. ఏ ప్రమాణానికీ అందనిదాన్ని మిథ్య అంటారు. అందువల్ల భేదం ఉందని మీరు అనుకుంటున్నా కూడా మీరు భేదం గురించి మాట్లాడలేరు అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

**ఇతి తత్త్వవిదో విదుః** – ఈ విధంగా ద్వైతం మిథ్య అని జ్ఞానులు అర్థం చేసుకుంటారు. మిథ్య అంటే ఉన్నట్టుగా కనిపిస్తుంది కాని, తర్కానికి అందదు.

5) **సాధనాని, ఫలమ్ – కారికలు 35-38**

నాలుగు సాధనలు, జ్ఞానఫలం చెప్పబడ్డాయి వీటిలో.

ఎ) **సాధన చతుష్టయ సంపత్తి** – అధికారి రాగం, భయం, క్రోధంనుంచి విడివడాలి. దీన్ని **వీతరాగభయక్రోధః** పదాలు సూచిస్తాయి. ఇది శమాదిషట్కసంపత్తిని సూచిస్తుంది. **మునిభిః** అంటే వివేకం కలిగి ఉండాలి. ఈ పదాలు సాధన చతుష్టయ సంపత్తిని సూచిస్తాయి.

బి) **వేదాంతశ్రవణమననాలు** – వేదాంతాన్ని ఒక క్రమపద్ధతిలో నేర్చుకోవాలి. వేదసారం జ్ఞానం మాత్రమే, కర్మ, ఉపాసన కాదు అని తెలుసుకోవాలి. ఇందులో మననం కూడా కలుపుకోవాలి. వీటిని **వేదపారగైః** పదం సూచిస్తుంది.

సి) **నిదిధ్యాసనం** – నిదిధ్యాసనం మధ్యమ అధికారికి అవసరం. అతను తను పొందిన జ్ఞానాన్ని జ్ఞాననిష్ఠగా మలుచుకోవటానికి అది తోడ్పడుతుంది. తను నేర్చుకున్న వేదాంత బోధనుంచి, తురీయం నిర్వచనాన్ని నెమరువేసుకోవాలి. దీన్ని **అద్వైతే యోజయేత్ స్మృతమ్** పదం సూచిస్తుంది.

డి) **సన్న్యాస ఆశ్రమం (కావాలనుకుంటే)** – ఒక సాధకుడు కావాలంటే సన్న్యాసం స్వీకరించవచ్చు లేదా గృహస్థాశ్రమంలోనే ఉంటూ, ఆంతర సన్న్యాసం స్వీకరించవచ్చు. దీన్ని **యతిః భవేత్** పదాలు సూచిస్తాయి.

## కారిక 2.38

**తత్త్వమాధ్యాత్మికం దృష్ట్వా తత్త్వం దృష్ట్వా తు బాహ్యతః ।**
**తత్త్వీభూతస్తదారామస్తత్త్వాదప్రచ్యుతో భవేత్ ॥**

**జ్ఞానఫలం** – ఈ కారికలో జ్ఞానఫలాన్ని చూస్తాము. జ్ఞానం పొంది, నిదిధ్యాసనం చేస్తే జ్ఞాననిష్ఠలో నిలబడతాడు జ్ఞాని. అంటే అతనికి తురీయదర్శనం కలుగుతుంది. తురీయదర్శనం కలుగుతుంది అంటే అక్షరాలా తురీయం అనే దాని దర్శనం కలగటం కాదు; తురీయజ్ఞానం కలుగుతుంది. తురీయాన్ని ఎక్కడ చూస్తాడు? లోపల, బయట కూడా.

**తత్త్వమాధ్యాత్మికం దృష్ట్వా తు** – జ్ఞాని తురీయాన్ని తనలోనే చూస్తాడు. ఆధ్యాత్మికం అంటే తనలోనే చూస్తాడు. మనస్సును సాక్షీభూతంగా చూసే సాక్షిచైతన్యమే తురీయం అని అర్థం చేసుకుంటాడు. చైతన్యం మనస్సుతో కలిస్తే అది విశ్వ, తైజస లేదా ప్రాజ్ఞ అవుతుంది. మనస్సుకు భిన్నంగా ఉంటే తురీయం అవుతుంది.

**తత్త్వం దృష్ట్వా బాహ్యతః** – అదే తురీయాన్ని బాహ్యంగా కూడా చూస్తాడు. ఈ వాక్యం చాలా ముఖ్యం. ఎందుకంటే తురీయం లేదా బ్రహ్మ ఆంతరంగా ఉంది కాబట్టి తురీయాన్ని ఎప్పుడూ చూడాలంటే, ఎప్పుడూ ధ్యానంలో కూర్చోవాలి అనే అపోహ ఉంది చాలామందిలో. గౌడపాదాచార్యులవారు బ్రహ్మ ఆంతరంగా ఉందని చెప్పి, ఆంతరంగా మాత్రమే కాదు, బాహ్యంగా కూడా ఉంది అంటున్నారు. బ్రహ్మ లోపలే ఉంది అంటే సర్వవ్యాపకమైన బ్రహ్మకు పరిమితిని విధించినట్టు అవుతుంది. జ్ఞాని బ్రహ్మను బాహ్యంగా ఎలా చూస్తాడు? జ్ఞాని బ్రహ్మను బాహ్యంగా సత్ రూపంలో చూస్తాడు.

**చిత్ రూపేణ అంతః సత్ రూపేణ బహిః సర్వదా పశ్యతి**

చిత్ (చైతన్యం) రూపంలో అంతరంగంలోనూ, సత్ (ఉనికి) రూపంలో బాహ్యంగానూ ఎప్పుడూ చూస్తాడు. ఉనికి ఎక్కడ ఉంది? ఎక్కడ లేదు అనగలగాలి. బల్ల ఉంది, కుర్చీ ఉంది, స్త్రీ ఉంది అనే ఈ వాక్యాలన్నింటిలోనూ ఉనికి రూపంలో బ్రహ్మ ఉంది.

ఇక్కడ ప్రతిపదాన్నీ జాగ్రత్తగా వాడాలి. జ్ఞాని తత్త్వాన్ని లోపలా, బయటా చూస్తాడు అంటే **చూస్తాడు** పదాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. తత్త్వం ఆబ్జెక్టు అంటే ప్రమేయం కాదు. అందువల్ల ఆ అయోమయం కలుగకుండా, గౌడపాదాచార్యులవారు జాగ్రత్తగా ఇంకొక పదం వేశారు.

**తత్త్వీభూతః** – ఈ సత్ చిత్ ఆత్మ బాహ్యవస్తువు కాదు, చూసే అతనే (జ్ఞాని) తురీయం అవుతాడు. మళ్ళీ **అవుతాడు** పదాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. అవుతాడు అంటే తను ఎవరో కాదు, తురీయ ఆత్మే అని అర్థం చేసుకుంటాడు.

| | |
|---|---|
| నేను శరీరాన్ని, నాకు ఆత్మ ఉంది | – జ్ఞానం పొందకముందు వాక్యం |
| నేను ఆత్మను, నాకు శరీరం ఉంది | – జ్ఞానం పొందాక వాడే వాక్యం |

పై వాక్యంనుంచి కింద వాక్యానికి రావటమే తత్త్వీభూతః. తానే తత్త్వం అని అర్థం చేసుకున్న వ్యక్తి.

**తదారామః** – తనలోనే రమిస్తాడు. ఈ ఆత్మజ్ఞానం పొందితేనే, గొప్ప ఆనందాన్ని పొందుతాడు. తన స్వస్వరూపం ఆనందస్వరూపం అని తెలుసుకోవటమే అతనికి గొప్ప ఆనందాన్నిస్తుంది. అతనికి వేరే ఏ ఆనందమూ అవసరం లేదు. నాకు వేదాంతం అధ్యయనం చేసీ చేసీ విసుగుపుడుతున్నది, నాకు ఏదైనా ఆనందం కావాలి అని అన్నాడంటే, అతనికి వేదాంతం సరిగ్గా అర్థం కానట్టు అర్థం.

తదారామః అంటే బ్రహ్మే అతనికి ఆనందహేతువు. అంతమాత్రాన అతను బాహ్య ఆనందాన్ని పట్టించుకోడని కాదు అర్థం. బాహ్యంగా కలిగే ఆనందం అతనికి బోనస్. జ్ఞానిని యు.పి.యస్‌తో పోల్చవచ్చు. యు.పి.యస్. అంటే అన్ ఇంటరప్టెడ్ పవర్ సప్లై. బాహ్యంగా కరెంట్ ఉన్నా లేకపోయినా కూడా, యు.పి.యస్. ఉంటే మీరు నిశ్చింతగా ఉన్నట్టుగా జ్ఞానిబాహ్యంగా ఆనందం దొరికినా, దొరకకపోయినా ఆనందంగా ఉంటాడు. అతనిది అన్‌ఇంటరప్టెడ్ ప్లెజర్ సప్లై. అతనే ఆనంద స్వరూపుడు.

**ఆత్మన్యేవాత్మనా తుష్టః** – గీత

**తత్త్వాదప్రచ్యుతో భవేత్** – ఇంక అప్పటినుంచి, తత్త్వంనుంచి జారిపోని వ్యక్తిగా ఉంటాడు.

జ్ఞాని నిదిధ్యాసనం తర్వాత జ్ఞాననిష్ఠలో నెలకొనివుంటాడు. తన ప్రజ్ఞను స్థితప్రజ్ఞగా మలుచుకుంటాడు. అప్రచ్యుతః. వ్యవహారం నడుపుతున్నా కూడా జ్ఞానంనుంచి జారిపోడు. సైకిల్ తొక్కటంలో ఆరితేరినవ్యక్తి, ఎంత రద్దీ ఉన్న వీధిలో నడుపుతున్నా, ఎలా బ్యాలెన్స్ తప్పకుండా నడుపుతాడో, అలాగే జ్ఞాని ఎంత వ్యవహారం నడుపుతున్నా కూడా జ్ఞాననిష్ఠలో నిలబడతాడు.

**నైవ కించిత్ కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్ ।**
**పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్నశ్నన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్ ॥**

అటువంటి వ్యక్తిని జీవన్ముక్తుడు అంటారు. బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా జ్ఞానం పొందిన వ్యక్తికి కలిగే ఫలం జీవన్ముక్తి. ఈ కారికలో ఫలం చూశాము.

**ఫలమ్ – చిత్ రూపేణ అంతః సత్ రూపేణ బహిః సర్వదా పశ్యతి**

**తత్త్వాదప్రచ్యుతో భవేత్** – జ్ఞాని జ్ఞాననిష్ఠలో నెలకొని ఉంటాడు.

ఇక్కడితో జగత్‌యొక్క మిథ్యాత్వాన్ని నిరూపించే వైతథ్యప్రకరణం ముగిసింది.

## 2 వైతథ్య ప్రకరణం – ముఖ్యాంశాలు

ఉపనిషత్తులోని ఏడవ మంత్రంలోని ప్రపంచోపశమమ్ పదానికి గౌడపాదాచార్యులవారి వ్యాఖ్యానము.

ప్రపంచోపశమమ్ = ప్రపంచమిథ్యాత్వం = ప్రపంచ వైతథ్యం.

ప్రపంచం అంటే మాండూక్యంలో మూడు పాదాలు – పాదత్రయ వైతథ్య ప్రకరణము.

**ఈ ప్రకరణములో ఐదు అంశాలు ఉన్నాయి**

1. స్వప్న ప్రపంచ మిథ్యాత్వమ్ – కారికలు 1-3
2. జాగ్రత్ ప్రపంచ మిథ్యాత్వమ్ – కారికలు 4-18
3. కల్పనా ప్రకారాః – కారికలు 19-29
4. ఉపసంహారః – కారికలు 30-34
5. సాధనాని, ఫలమ్ – కారికలు 35-38

1. **స్వప్న ప్రపంచ మిథ్యాత్వమ్ – కారికలు: 1-3**
యుక్తి, అనుభవ శ్రుతి ప్రమాణాలద్వారా స్వప్నం మిథ్య అని నిరూపించారు.

ఎ) **యుక్తి ప్రమాణం** – ఉచితదేశకాల అభావం
స్వప్నప్రపంచః మిథ్యా ఉచితదేశకాల అభావాత్ దర్పణస్థ హస్తివత్

బి) **అనుభవ ప్రమాణం** – కలలో ఉన్న ఊరిలో నిద్రలేవము. మన గదిలో లేస్తాము.

సి) **శ్రుతి ప్రమాణం** –
**న తత్ర రథా న రథయోగాః న పంథానో భవంతి అథ రథాన్**
**రథయోగాన్ పథః చ సృజతే** – బృహదారణ్యకమ్ 4.3

అక్కడ (స్వప్నప్రపంచంలో) నిజంగా రథాలు లేవు. రథాన్నిలాగే గుర్రాలు లేవు, మార్గాలు లేవు కాని వీటన్నింటినీ స్వాప్నికుడు సృష్టిస్తున్నాడు.

2. **జాగ్రత్ ప్రపంచ మిథ్యాత్వమ్ – కారికలు: 4-18**
రెండు కారణాలు – పరోక్ష కారణం, ప్రత్యక్ష కారణం.

ఎ) **పరోక్ష కారణం – ప్రసిద్ధేనైవ హేతునా** 2.5
మనం చూస్తున్నాము కాబట్టి జాగ్రత్ ప్రపంచం మిథ్య
అనుమానవాక్యం – జాగ్రత్ ప్రపంచః మిథ్యా దృశ్యత్వాత్ స్వప్న ప్రపంచవత్
వ్యాప్తివాక్యం – యత్ యత్ దృశ్యం తత్ తత్ మిథ్యా
ప్రమాత, ప్రమాణం చూస్తేనే ప్రమేయానికి ఉనికి ఉంది.

బి) **ప్రత్యక్ష కారణం – వితథైస్సదృశాస్సంతోఽవితథా ఇవ లక్షితాః ॥ 2.6**
జాగ్రత్ ప్రపంచం అనిత్యం కాబట్టి మిథ్య
అనుమానవాక్యం – జాగ్రత్ ప్రపంచః మిథ్యా అనిత్యత్వాత్ స్వప్న ప్రపంచవత్
వ్యాప్తివాక్యం – **యత్ అనిత్యమ్ తత్ మిథ్యా । యత్ నిత్యం తత్ సత్యమ్**
అనిత్య వస్తువుకు స్వతంత్ర సత్తా ఉండదు; అది ఆగంతుకం అవుతుంది. అందువల్ల అది మిథ్య. ఏదైతే స్వస్వరూపమో అది నిత్యం.

**నాలుగు నిర్వచనాల ఖండన**

నాలుగు నిర్వచనాలు – ప్రయోజనం ఉంది, బాహ్యంగా ఉంది, నాకు భిన్నంగా ఉంది, స్పష్టంగా ఉంది.

ఎ) **ప్రయోజనం ఉంది** – స్వప్నవస్తువులను జాగ్రత్‌లో వాడలేము నిజమే, కాని జాగ్రత్ వస్తువులను కూడా స్వప్నంలో వాడలేము.

బి) **బాహ్యంగా ఉంది** – స్వప్నప్రపంచం నా మనస్సునుంచి వచ్చింది నిజమే, కాని తురీయానికి లేస్తే జాగ్రత్ ప్రపంచం కూడా నానుంచే వచ్చింది.

సి) **నాకు భిన్నంగా ఉంది** – స్వప్నప్రపంచం నేను చూస్తేనే ఉంది నిజమే, కాని స్వప్నంలో కూడా కొన్ని వస్తువులు నేను చూడకపోయినా ఉంటాయి. నేను తురీయానికి లేస్తే జాగ్రత్ ప్రపంచం కూడా నాకు భిన్నంగా ఉండదు.

డి) **స్పష్టంగా ఉంది** – స్వప్నప్రపంచంనుంచి లేస్తే స్పష్టంగా లేనట్టు అనిపిస్తుంది నిజమే, కాని అందులో ఉండగా స్పష్టంగా ఉన్నట్టే ఉంటుంది. తురీయానికి లేస్తే రెండూ మిథ్యే.

ఇక్కడ నాలుగు దశల్లో చూడాలి.

1. స్వప్నం, స్వప్నావస్థలో ఉండగా సత్యం
2. స్వప్నంనుంచి జాగ్రదవస్థకు లేస్తే స్వప్నం మిథ్య
3. జాగ్రత్ ప్రపంచం జాగ్రదస్థలో ఉండగా సత్యం
4. జాగ్రదవస్థనుంచి తురీయానికి లేస్తే, జాగ్రత్ ప్రపంచం మిథ్య.

జాగ్రదవస్థనుంచి తురీయానికి లేస్తే జాగ్రత్ ప్రపంచం మిథ్య. చూసేవారు ముగ్గురు– స్వప్నపురుషుడు, జాగ్రత్ పురుషుడు, జ్ఞాని.

అయితే రెండూ సత్యం అవాలి; లేదా రెండూ మిథ్య అవాలి. అలా అవాలంటే పోలిక రెండూ ఆ అవస్థల్లో ఉండగా చూడాలి లేదా ఆ అవస్థలనుంచి లేచాక చూడాలి. అసలు పోలికలే తప్పు. స్వప్నప్రపంచంనుంచి లేచాక పొందే అనుభవాన్ని, జాగ్రత్ ప్రపంచంలో ఉండగా పోలుస్తున్నారు.

రెండూ మిథ్య అయితే ఏది సత్యం?
తురీయం లేదా బ్రహ్మ సత్యం, జగత్ మిథ్యా.

ప్రపంచాన్ని నాలుగు విధాలుగా వర్ణిస్తుంది మాండూక్యం

ఎ) విశ్వ–విరాట్ జంట + తైజస–హిరణ్యగర్భ జంట + ప్రాజ్ఞ–ఈశ్వర జంట = 6
బి) స్థూలశరీరం–స్థూలప్రపంచం + సూక్ష్మశరీరం–సూక్ష్మప్రపంచం + కారణశరీరం–కారణప్రపంచం = 6

సి) ఆత్మయొక్క ప్రథమపాదము + ద్వితీయపాదము + తృతీయపాదము – పాదత్రయము=3

డి) మొదటి రెండు పాదాలు కార్యం + మూడవ పాదం కారణం = 3

కార్యకారణాత్మక ప్రపంచ మిథ్యాత్వ నిశ్చయమ్

3. **కల్పనా ప్రకారాః – కారికలు: 19–29**

కల్పనా ప్రకారాః అంటే అనేక పొరపాట్లు.

**దృక్ ఆత్మా అజ్ఞానేన దృశ్య అజ్ఞాన ఉత్పత్తిః**

చూస్తున్న నేనే ఆత్మను (తురీయాన్ని) అని తెలియక బాహ్యవస్తువు సత్యం అనుకుని పొరపాటు పడుతున్నారు.

మామూలు మనుష్యులే కాదు, దార్శనికులు కూడా పొరపాటు పడుతున్నారు.

| | | | |
|---|---|---|---|
| చార్వాక | 1 – విషయా ఇతి తద్విదః | – | విషయవస్తువులే పరమం |
| | 2 – స్థూల ఇతి చ తద్విదః | – | శరీరమే సత్యం |
| పూర్వమీమాంస | 1 – యజ్ఞా ఇతి చ తద్విదః | – | వేదపూర్వభాగం అర్థం తెలుసుకోవాలి |
| | 2 – ధర్మాధర్మే చ తద్విదః | – | పుణ్యాపాపాలు సత్యం<br>కృతి మహోదధౌ పతనకారణం<br>ఫలమశాశ్వతం గతి నిరోధకం |
| సాంఖ్య | 1 – భోక్తా ఇతి చ భోక్తృవిదః | – | ఆత్మ కర్త కాదు కాని భోక్త |
| | 2 – పంచవింశక ఇత్యేకే | – | 25 తత్త్వాలే సత్యం |
| జైనులు | – సూక్ష్మ ఇతి సూక్ష్మవిదః | – | ఆత్మ సూక్ష్మం, అనేక ఆత్మలు ఉన్నాయి |
| బౌద్ధులు | 1 – అమూర్త ఇతి చ తద్విదః | – | శూన్యం సత్యం |
| | 2 – బుద్ధిరితి తద్విదః | – | క్షణిక విజ్ఞానవాదం సత్యం |
| యోగదర్శనం | 1 – షడ్వింశ ఇతి చాపరే | – | 26 తత్త్వాలు |

4. **ఉపసంహారః – కారికలు: 30–34**

అద్వైతానికి ఎదిగితే ద్వైతం మిథ్య

ఉదా. స్వప్నం, మాయ, గంధర్వనగరం.

**తురీయదృష్ట్యా సృష్టి లేదు, లయ లేదు, జీవుడు లేదు, బంధం లేదు, మోక్షం లేదు, సాధన అవసరం లేదు; సాధకుడే లేదు.**

అద్వైతం స్థాయికి ఎదిగితే అద్వైతం పదం కూడా లేదు – మౌనవ్యాఖ్యానం.

జగత్తుకు తురీయానికి మధ్య –

పోలిక లేదు – జగత్తు జడం, తురీయం సత్యం

భాగం కాదు – తురీయం నిరవయం

భిన్నంగా లేదు – తురీయం అద్వైతం

ప్రపంచోపశమోఽధ్యాయః

5. **సాధనాని, ఫలమ్ – కారికలు: 35–38**

ఎ) సాధన చతుష్టయ సంపత్తి – వీతరాగభయక్రోధః, మునిభిః

బి) వేదాంత శ్రవణమననాలు – వేదపారగైః

సి) నిదిధ్యాసనం – అద్వైతే యోజయేత్ స్మృతిమ్

డి) సన్న్యాసం (కావాలనుకుంటే) – యతిః

ఫలం – చిత్‌రూపేణ అంతః సత్‌రూపేణ బహిః సర్వదా పశ్యతి

తత్త్వాదప్రచ్యుతో భవేత్ – జ్ఞాని జ్ఞాననిష్ఠలో నెలకొని ఉంటాడు.

# ఏకాదశ ఉపనిషత్తుల సారం

## మాండూక్యోపనిషత్ - ప్రకరణం 3

## అద్వైతప్రకరణం

ఈ అధ్యాయం పేరు అద్వైతప్రకరణం. ఇందులో 48 కారికలు ఉన్నాయి. మాండూక్య ప్రకరణాలన్నింటిలోకి ఇది చాలా ముఖ్యమైన ప్రకరణం. ఆ మాటకొస్తే మొత్తం వేదాంత గ్రంథాల్లోనే ఇది అపురూపమైన మాణిక్యం. అద్వైతజ్ఞానం గురించి స్పష్టమైన అవగాహన ఏర్పడాలంటే, ఈ ప్రకరణాన్ని స్పష్టంగా అర్థం చేసుకుంటే చాలు.

ఈ ప్రకరణాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవాలంటే, ఉపనిషత్తులోని మంత్రాలు, ముఖ్యంగా 1-7 బాగా గుర్తుండాలి. అలాగే మొదటి అధ్యాయంలోని కారికలు 10-18 బాగా గుర్తుండాలి. ఎందుకంటే ఈ అధ్యాయంలోని బోధ వీటిని ఆధారంగా చేసుకుని సాగుతుంది. పునాది బలంగా లేకపోతే భవంతి ఎలా గట్టిగా నిలబడదో, అలాగే ఈ మొదటి అధ్యాయంలోని ఈ మంత్రాలు, ఈ కారికలనే పునాది బలంగా లేకపోతే, అద్వైతవేదాంతం అనే భవంతి గట్టిగా నిలబడదు మీ మనస్సులో.

**ప్రపంచోపశమం శాంతం శివమద్వైతమ్ - మంత్రం 7**

మంత్రం ఏడులోని ప్రపంచోపశమమ్ పదంయొక్క వివరణే రెండవ అధ్యాయం అని చూశాము. దాన్ని వైతథ్య ప్రకరణమ్ అంటారనీ, అది జగత్తుయొక్క మిథ్యాత్వనిశ్చయం చేసిందనీ కూడా చూశాము. జగత్తు అంటే మాండూక్యంలో ఉన్నంతవరకూ ఆత్మయొక్క మూడు పాదాలూ అనే విషయం మర్చిపోకూడదు.

ఈ అధ్యాయం అద్వైతమ్ అనే పదంయొక్క వివరణ. అందువల్లనే ఈ అధ్యాయాన్ని అద్వైతప్రకరణమ్ అంటారు. ఇందులో గౌడపాదాచార్యులవారు తురీయవర్ణన లోతుగా చేయబోతున్నారు.

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా**

ఇది వేదాంతసారం. గౌడపాదాచార్యులవారు జగన్మిథ్యాత్వదర్శనాన్ని రెండవ అధ్యాయంలో చేయిస్తే, బ్రహ్మయొక్క సత్యత్వదర్శనాన్ని ఇప్పుడు ఈ మూడవ అధ్యాయంలో చేయబోతున్నారు.

**పాదత్రయ మిథ్యాత్వమ్ - వైతథ్య ప్రకరణం**
**చతుర్థపాద సత్యత్వమ్ - అద్వైత ప్రకరణం**

అద్వైతం పదం బ్రహ్మకు పర్యాయపదం. బ్రహ్మ లేదా ఆత్మ చైతన్యస్వరూపం అని చూశాము. బ్రహ్మకు అద్వైతం పదం వాడటంవల్ల ఉపనిషత్తు ఏం సూచించబోతున్నది? అద్వైతం అంటే ద్వితీయం లేనిది; అంటే రెండవది లేనిది. దీని అర్థం బ్రహ్మ రెండుగా విభజించబడలేదు. ఉన్నదొకటే బ్రహ్మ అంటే బ్రహ్మ నానాత్వంగా మారలేదు; అంటే బ్రహ్మ జగత్తుగా విభజించబడలేదు; అంటే బ్రహ్మనుంచి జగత్తు పుట్టలేదు.

బ్రహ్మ అంటే అద్వైతం. అద్వైతం రెండుగా విభజించబడలేదు.

కాబట్టి బ్రహ్మనుంచి జగత్తు రాలేదు.
కాబట్టి బ్రహ్మనుంచి సృష్టి జరగలేదు.
అందువల్ల అజాతివాదం సత్యం.

ఇవీ ఈ అధ్యాయంలో మనం చూడబోయే దశలు. అజాతివాదం అంటే జాతికి చెందినది కాదు; సృష్టి నిజంగా జరగలేదు అని నిరూపించే వాదన. ఈ అజాతివాదనను అంత తేలికగా జీర్ణించుకోలేరు. కాని ఇది వేదాంతశాస్త్రంలోని అత్యున్నత శిఖరం. ఈ శిఖరానికి చేరుకునేదాకా, అద్వైతాన్ని నేర్చుకుంటూనే ఉండాలి. మాండూక్యోపనిషత్తులో అనేక రకాలుగా అజాతివాదం సత్యం అని నిరూపించుకుంటూ వస్తారు గౌడపాదాచార్యుల వారు. అంటే బ్రహ్మనుంచి సృష్టి జరగలేదు అంటారు.

కాని ఓం ప్రథమంగానే మీకు సందేహం రావచ్చు. రెండవ అధ్యాయంలో జగత్ మిథ్య అన్నారు; ఇప్పుడేమో అసలు సృష్టే జరగలేదు అంటున్నారు. ఈ రెండింటిలో ఏది సత్యం? దానికి జవాబు రెండూ సత్యమే. ముందు అధ్యాయంలో జగత్ మిథ్య అంటే మిథ్యా జగత్ సృష్టి. జరిగింది అని అర్థం. ఇప్పుడు సృష్టి జరగలేదు అంటున్నాము. సగం గ్లాసు ఖాళీగా ఉంది అన్నా, సగం గ్లాసు వరకే నీళ్ళు ఉన్నాయి అన్నా అర్థం ఒకటే కదా! అలాగే మిథ్యా సృష్టి జరిగింది అంటే నిజం సృష్టి జరగలేదు అని అర్థం.

మిథ్యా జాతివాదం = అజాతివాదం

మిథ్యా జాతివాదం అంటే మిథ్యా జగత్తును స్వీకరించటం; అజాతివాదం అంటే జగత్తు పుట్టలేదు అనటం.

గౌడపాదాచార్యులవారే నేను అజాతివాదాన్ని బోధించబోతున్నాను అని ఉపోద్ఘాతం ఇస్తారు కారిక 2లో.

**అతో వక్ష్యామ్యకార్పణ్యమజాతి సమతాం గతమ్।**
**యథా న జాయతే కించిజ్జాయమానం సమంతతః॥**

నేను ఎటువంటి దుఃఖం లేని, దురదృష్టకరం కాని, కాలానికి లొంగని, వికారాలు లేని తురీయం గురించి బోధిస్తాను అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

**అకార్పణ్యమ్** – అకార్పణ్యమ్ అంటే సంసారరహితతురీయం.

**అజాతి** – అజాతి అంటే కార్యకారణవిలక్షణం. జాతి అంటే పుట్టుక లేదా సృష్టి. అజాతి అంటే సృష్టిలేనిది అని అర్థం. అందువల్లనే మాండూక్య కారికలను అజాతివాదః అని కూడా అంటారు. అజాతివాదం అంటే కార్యకారణవిలక్షణ బ్రహ్మ గురించి బోధ.

**యథా న జాయతే కించిత్** – తురీయం కారణం కాదు. దానినుంచి ఏదీ పుట్టలేదు అని నేను బోధించబోతున్నాను అంటున్నారు గౌడపాదాచార్యులవారు. తురీయం కారణం కాదు అంటే తురీయం కార్యకారణవిలక్షణం అని అర్థం చేసుకోవాలి.

**జాయమానం సమంతతః** – సృష్టి జరిగినట్టుగా కనిపిస్తున్నా కూడా, అది ఎలా మన భ్రమో, ఎలా నిజంగా సృష్టి జరగలేదో నేను నిరూపిస్తాను అని కూడా అంటున్నారు. స్వప్నప్రపంచం, స్వప్నంనుంచి లేస్తే ఎలా మిథ్యగా తేలిపోతుందో, అదే విధంగా ఈ జాగ్రత్ ప్రపంచం పంచభూతాలనుంచి వచ్చిందని, అవి కూడా సృష్టించబడ్డాయని నేర్చుకున్నా కూడా, జాగ్రత్ ప్రపంచం కూడా మిథ్యే అని నిరూపించబోతున్నారు. అందువల్ల తురీయం కార్యకారణ విలక్షణం.

ఈ నేపథ్యంతో ఈ అద్వైతప్రకరణంలోకి అడుగుపెడదాము. ఈ అధ్యాయాన్ని ప్రధానంగా 5 అంశాలుగా విభజించవచ్చు. అవి –

1. సృష్టి నిషేధవాదన – కారికలు 3-16, 22-30
2. సృష్టి గురించి శ్రుతి తాత్పర్యం – కారికలు 17-22
3. అమనీభావః / మనోనాశః – కారికలు 31-39
4. మనోనిగ్రహః / నిదిధ్యాసనం – కారికలు 40-47
5. ఉపసంహారం – కారిక 48

1) **సృష్టి నిషేధవాదన – కారికలు 3-16, 22-30** ఇప్పుడు మొదటి అంశం చూద్దాము. దాన్ని మళ్ళీ నాలుగుగా విభజించవచ్చు.

ఈ కారికల్లో గౌడపాదాచార్యులవారు సృష్టి నిజంగా జరగలేదని నిరూపించబోతున్నారు. దాన్ని సృష్టినిషేధ వాదన అంటారు. ఆ విషయాన్ని గొప్పగా ఆరంభించబోతున్నారు. అందులో తురీయం కార్య-కారణ విలక్షణం అని నిరూపించబోతున్నారు. కార్యం-కారణం అంశాల్లో,

గౌడపాదాచార్యుల వారు రెండవ అంశం అయిన కారణంమీద ఎక్కువగా దృష్టి పెట్టబోతున్నారు. అంటే తురీయం కారణవిలక్షణం అని చూపించబోతున్నారు.

కారణవిలక్షణం అంటే ఏమిటి? అంటే తురీయం సృష్టికారణం కాదు; తురీయంనుంచి ఏదీ పుట్టలేదు. విశ్లేషణ తేలికగా చేయటంకోసం సృష్టిని రెండుగా విభజించారు – జీవసృష్టి, జగత్‌సృష్టి. ఇంకో విధంగా చెప్పాలంటే చేతనసృష్టి, అచేతనసృష్టి. ఇటు జీవుడు కాని, అటు జగత్ కాని తురీయంనుంచి పుట్టలేదు అని నిరూపించబోతున్నారు గౌడపాదాచార్యులవారు. తురీయంనుంచి జీవ, జగత్తుల సృష్టి జరగలేదు అని నాలుగు దశల్లో నిరూపించ దలుచుకున్నారు. అవి –

| | |
|---|---|
| ఎ) యుక్త్యా జీవసృష్టి నిషేధః | – కారికలు 3-9 |
| బి) యుక్త్యా జగత్‌సృష్టి నిషేధః | – కారికలు 10, 27-30 |
| సి) శ్రుత్యా జీవసృష్టి నిషేధః | – కారికలు 11-14 |
| డి) శ్రుత్యా జగత్‌సృష్టి నిషేధః | – కారికలు 15,16,23 -26 |

ముందు ఘటాకాశం, మహాకాశం గురించి చూద్దాం

1. **ఉత్పత్తిః** – సృష్టి. మహాకాశంనుంచి ఘటాకాశం పుట్టిందని అనుకుంటాము. కాని నిజానికి ఘటాకాశం ఎన్నడూ పుట్టదు. కుండ మాత్రమే పుడుతుంది. అందులో ఆకాశం ముందే ఉంటుంది. ఘటంలో ఉంది కాబట్టి దానికొక కొత్త నామధేయాన్ని ఇస్తాము. ఘటాకాశం అంటాము. కుండకు చెందిన పుట్టుకను పొరపాటుగా ఆకాశానికి మారుస్తాము. దీన్ని ఉత్పత్తి అంటారు.

2. **నాశః** – నాశనం. కుండ పగిలిపోతే, ఘటాకాశం పోయింది అంటాము. నిజానికి ఆకాశం ఎక్కడికీ పోదు. ఆ నాశనం కుండది మాత్రమే.

3. **దోషః** – దోషం. ఆకాశంలో ఉండే అనేక వస్తువులకు మలినం అంటుతుంది. వాయువు కాలుష్యం చెందుతుంది, నీరు కాలుష్యం చెందుతుంది, భూమి కాలుష్యం చెందుతుంది కాని ఆకాశానికి కాలుష్యం అంటదు.

4. **విశేషః** – రూపం. ప్రతిజీవాత్మకు ఒక రూపం ఉంటుంది. ఆ రూపంవల్ల ఒక ప్రత్యేకత ఉంటుంది. పెద్దకుండ, చిన్నకుండ అంటాము. గదిని వృత్తాకార గది అని, నలుచదరపు గది అనీ అంటాము. ఆ విధంగా వస్తువునుబట్టి, ఆకాశానికి రూపాన్ని ఇస్తాము కాని నిజానికి ఆకాశానికి విశేషరూపం లేదు.

5. **సంబంధః** – సంబంధం. తమాషా ఏమిటంటే భాగాలు లేని ఆకాశాన్ని భాగాలుగా విభజించి, ఆ భాగాల మధ్య సంబంధాన్ని కూడా నిర్వచిస్తాము. ఆకాశాన్ని మహాకాశంగానూ, ఘటాకాశంగానూ విభజించి, మహాకాశం కారణం అనీ, ఘటాకాశం కార్యం అనీ, వీటి మధ్య కారణ–కార్య సంబంధం ఉందనీ నిర్వచిస్తాము.

కాని నిజానికి అలాంటి సంబంధం ఉండే ఆస్కారమే లేదు. కుండ పుట్టకముందు ఆకాశం ఉంది. అలాగే ఇల్లు పుట్టకముందూ ఆకాశం ఉంది. మనం ఇంట్లో ఆకాశం ఉంది అంటాము కాని, నిజానికి ఆకాశంలోనే ఇల్లు ఉందనే విషయాన్ని విస్మరించాము.

ఈ విధంగా ఘటాకాశం–మహాకాశం గురించి ఐదు పొరపాట్లు చేస్తున్నాము. అవి – ఉత్పత్తిః, నాశః, దోషః, విశేషః, సంబంధః. ఇప్పుడు ఇవే సూత్రాలను జీవాత్మకు, పరమాత్మకు అన్వయించి చూద్దాము.

1. **ఉత్పత్తిః** – సృష్టి. జీవాత్మ ఎన్నడూ పుట్టలేదు. జీవాత్మ అంటే జీవ+ఆత్మ. కార్యకరణ సంఘాతంలో ఉన్న ఆత్మను జీవాత్మ అంటారు. ఆత్మ అంటే చైతన్యం. కార్యకరణసంఘాతాన్ని శరీరం అంటే, ఆత్మను శరీరీ అంటారు. శరీరం పుడుతుంది కాని, శరీరీ ఎన్నడూ పుట్టదు. అందువల్ల జీవాత్మ పుట్టిందనటం పెద్ద పొరపాటు.

2. **నాశః** – నాశనం. జీవాత్మ మరణిస్తుందనేది ఇంకొక పెద్ద పొరపాటు. జీవాత్మకు ఎన్నడూ మరణం లేదు.

**న జాయతే మ్రియతే వా కదాచిత్ నాయం భూత్వా భవితా వా న భూయః ।**
**అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో న హన్యతే హన్యమానే శరీరే ॥** – గీత 2.20

ఆత్మ ఎన్నడూ పుట్టదు, మరణించదు. ఆత్మను కప్పిన శరీరం మరణించినా, ఆత్మ ఎన్నడూ మరణించదు.

3. **దోషః** – మలినం. ఆత్మకు ఎన్నడూ మలినాలు అంటవు. ఆత్మ అయిన నేను నిత్య శుద్ధముక్తబుద్ధచైతన్యస్వరూపాన్ని. దోషాలు శరీరానికి, మనస్సుకు చెందుతాయి కాని వాటిల్లో ఉన్న చైతన్యమైన నాకు ఏ విధమైన దోషాలు అంటవు.

**న మే ద్వేషరాగౌ న మే లోభమోహౌ మదో నైవ మే నైవ మాత్సర్యభావః।**
**న ధర్మో న చార్థో న కామో న మోక్షః చిదానంద రూపః శివోఽహం శివోఽహమ్॥**

4. **విశేషః** – రూపం. ఆత్మనైన నాకు ప్రత్యేకించి రూపంగాని, గుణాలు కాని లేవు. నేను పుడితేనే కదా నాకొక వివరణ వచ్చేది. ఏదైనా చెప్పాలంటే శరీరం గురించి చెప్పాలి కాని, ఆత్మనైన నాకు ఏ గుణాలూ అంటవు.

**నాంతఃప్రజ్ఞం న బహిః ప్రజ్ఞమ్ నోభయతః ప్రజ్ఞమ్।**
**న ప్రజ్ఞానఘనం న ప్రజ్ఞమ్ నాఽప్రజ్ఞమ్।।** – మాండూక్యమ్ 7

5. **సంబంధః** – సంబంధం. ఇది అన్నింటిలోకి పెద్ద పొరపాటు. సర్వవ్యాపకమైన చైతన్యాన్ని రెండుగా విభజిస్తాము. నేను జీవాత్మను, నేను పరమాత్మనుంచి పుట్టాను అనుకుంటాము. నిజానికి నేను చైతన్యాన్ని. చైతన్యమైన నాకు చావు పుట్టుకలు లేవు. నిజానికి చైతన్యపరంగా నేనూ పరమాత్మా ఒకటే. ఒకే చైతన్యానికి అది ఉన్న చోటునిబట్టి రెండు నామధేయాలు ఇచ్చాము. శరీరం లోపల ఉన్న చైతన్యాన్ని జీవాత్మ అంటున్నాము; బయట ఉన్న చైతన్యాన్ని పరమాత్మ అంటున్నాము. పేర్లు రెండు ఉన్నా, రెండింటిలోనూ ఉన్న ఆత్మ ఒకటే. ఒకచోట ఒక గీత గీసి, ఈ గీతకు ఇటువైపు కర్ణాటక అనీ, ఇటువైపు ఉన్నది తమిళనాడు అనీ అంటున్నాము కానీ ఉన్నదొకటే సర్వవ్యాపకమైన ఆకాశం.

నిజానికి జీవాత్మ, పరమాత్మ మధ్య సంబంధం లేదు. కాని సంబంధం గురించి మాట్లాడి తీరాలి అని ఒకవేళ మీరు అనేటట్లయితే, ఐక్యసంబంధం గురించి చెప్పవచ్చు. జీవాత్మ, పరమాత్మ ఐక్యం అంటే ఇంక కార్యకారణసంబంధానికి ఆస్కారమేది? అందువల్ల జీవాత్మ, పరమాత్మనుంచి పుట్టలేదు.

బి) **యుక్త్యా జగత్సృష్టి నిషేధః – కారికలు 10,27-30**

ఈ కారికలో తర్కంద్వారా జగత్ సృష్టి జరగలేదని నిరూపించబోతున్నారు గౌడపాదాచార్యులవారు. కార్యకారణసంఘాతం అయిన వ్యష్టి మనశ్శరీరాలు, జగత్ పరమాత్మ నుంచి సృష్టించబడ్డాయి. నిజమే, కాని అవి మాయచేత సృష్టించబడ్డాయి. మాయకే స్వతంత్రంగా ఉనికి లేదు. స్వప్నంలో ఉన్నంతవరకూ స్వప్నం నిజంగానే అనిపించినట్టుగా, ఈ జాగ్రత్ ప్రపంచంలో ఉన్నంతవరకూ మాయాశక్తి సృష్టించిన ఈ ప్రపంచం నిజమే అనిపిస్తుంది. కాని దానికి విడిగా ఉనికి లేదు. కాబట్టి అది కూడా స్వప్నం 2 కిందికి వస్తుంది.

స్వప్నంలో ఉన్నంతవరకూ ఒక స్వాప్నికునికి తన స్వప్నం ఒక స్వప్నం అని తెలియదు. దాన్నుంచి లేచాకే అతనికి తెలుస్తుంది. దీనివల్ల మనం గ్రహించాల్సిన అంశం, మనకు అనుభవంలోకి వచ్చినంత మాత్రాన అది నిజమై తీరాలని లేదు. అలాగే జాగ్రత్ ప్రపంచాన్ని అనుభవిస్తాము, అందులో వ్యవహారం నడుపుతాము, అది ప్రయోజనకరంగా ఉంటుంది కాని తురీయానికి లేస్తే, అది సత్యం కాదు. నిజానికి వైతథ్యప్రకరణమ్ ఈ స్వప్నదృష్టాంతంతోనే మొదలయింది.

**ఆధిక్యే సర్వసామ్యే వా** – సర్వసామ్యం అంటే సమానం; ఆధిక్యే అంటే ఇంకొకదానికన్నా గొప్పవి. అంటే పశుపక్ష్యాదుల దేహాలతో పోలిస్తే దేవతల దేహాలు గొప్పవి. అయినా ఈ శరీరాలన్నీ మిథ్యే.

**న ఉపపత్తిర్హి విద్యతే** – అవి సత్యం అని నిరూపించటానికి తర్కం లేదు. మామూలుగా మనం, 'నేను చూస్తున్నాను కాబట్టి అది సత్యం,' అంటాము కాని గౌడపాదాచార్యులవారు 'మీరు స్వప్నప్రపంచాన్ని కూడా చూస్తున్నారు కాని అది నిజమా?' అంటున్నారు. నిజానికి ఈ విషయం వివరంగా ముందే చూశాము – ప్రయోజనం ఉంది, బాహ్యంగా ఉంది, నాకు భిన్నంగా ఉంది, స్పష్టంగా ఉంది – ఇవేవీ జాగ్రత్‌ప్రపంచం సత్యం అని నిరూపించలేవు. అందువల్ల జాగ్రత్‌ప్రపంచం మిథ్యా, స్వప్నప్రపంచంలాగా – దీనితో రెండవ అంశం కూడా అయిపోయింది. ఆకాశదృష్టాంతంద్వారా జీవసృష్టిని నిషేధిస్తే, స్వప్నదృష్టాంతంద్వారా జగత్‌సృష్టిని నిషేధించారు.

**ఆకాశదృష్టాంతేన జీవసృష్టి నిషేధః**

**స్వప్నదృష్టాంతేన జగత్‌సృష్టి నిషేధః**

సి) **శ్రుత్యా జీవసృష్టి నిషేధః** – కారికలు 11–14

### కారిక 3.11

**రసాదయో హి యే కోశా వ్యాఖ్యాతాస్తైత్తిరీయకే।**

**తేషామాత్మా పరో జీవః ఖం యథా సంప్రకాశితః ॥**

ఒక ఉదాహరణగా బృహదారణ్యకోపనిషత్తునుంచి మధుబ్రాహ్మణాన్ని తీసుకున్నారు గౌడపాదాచార్యులవారు. ఈ ఖండంలో ఉపనిషత్తు వ్యష్టిపరంగా కొన్ని అంగాలను, సమష్టి పరంగా కొన్ని అంగాలను జతలుగా తీసుకుంది. వ్యష్టిపరంగా అధ్యాత్మికం అంటే సమష్టి పరంగా అధిభూతం. ఉదాహరణ – ఆ జంటలు పృథివీ–శరీరం; జలం–రేతస్సు; అగ్ని–వాక్కు.

వ్యష్టిలో ఉన్న బ్రహ్మను జీవాత్మ అంటే, సమష్టిలో ఉన్న బ్రహ్మను పరమాత్మ అంటారు. పదాలు వేరు కాని వస్తువు ఒకటే. ఒక చిన్న అలలోను, పెద్ద సముద్రంలోను అధిష్ఠానంగా ఉన్న నీరు ఒకటే. ఈ జంటలద్వారా ఈ విషయాన్ని నిరూపిస్తుంది బృహదారణ్యకం. తేజోమయపురుషః అంటే సమష్టి ఉన్న బ్రహ్మ; శరీరః అంటే శరీరంలో ఉన్న బ్రహ్మ. అయమేవ సః అంటే రెండూ ఒకటే. దాన్ని ఇక్కడ గౌడపాదాచార్యులవారు ఉటంకిస్తున్నారు.

అయమేవ సః యోఽ యమాత్మ ఇదమ్ అమృతమ్ ఇదం బ్రహ్మ ఇదగ్ం సర్వమ్.

**ద్వయోర్ద్వయోః** – ఆ రెండింటి యందు అంటే అధిదైవ–అధ్యాత్మాలు రెండింటియందు. ఉదాహరణకు అధిదైవం ఆదిత్యుడు అయితే చక్షువు అధ్యాత్మికం. ఆదిత్యుడు చక్షువుకు అధిష్ఠానదేవత.

**పరం బ్రహ్మ ప్రకాశితమ్** – ఒక అధిష్ఠానబ్రహ్మను ఉపనిషత్తు వివరించింది.

**మధు జ్ఞానే** – మధుబ్రాహ్మణమ్‌లో. జ్ఞానే అంటే ఇక్కడ బ్రాహ్మణమ్. గౌడపాదాచార్యులవారు ఈ మధుబ్రాహ్మణమ్ (2.5)లోని ఒక జంటను ఉదాహరణ కింద తీసుకున్నారు. అది పృథివీ – శరీరం జంట.

**పృథివ్యామ్** – సమష్టిలోని పృథివీలో ఉన్న బ్రహ్మ;

**ఉదరే చైవ** – వ్యష్టిలోని పృథివిలో ఉన్న బ్రహ్మ ఒకటే. వ్యష్టిలోని పృథివి అంటే శరీరం. శరీరం కూడా మట్టితో చేయబడింది. ఉదరం అంటే నిజానికి కడుపు. ఇక్కడ దాన్ని శరీరానికి ఉపలక్షణంగా తీసుకోవాలి. ఇప్పుడు ఈ వాక్యం మొత్తం అర్థం చూస్తే పృథివిలో ఉన్న బ్రహ్మ, శరీరంలో ఉన్న బ్రహ్మ ఒకటే.

**యథాऽऽకాశః ప్రకాశితః** – ఎలాగైతే శరీరంలో ఉన్న ఆకాశం, శరీరం బయట ఉన్న ఆకాశం ఒకటేనో, అలాగే శరీరంలో ఉన్న బ్రహ్మ, పృథివిలో ఉన్న బ్రహ్మ ఒకటే. శరీరంలో ఉన్న బ్రహ్మను జీవాత్మ అనీ, పృథివిలో ఉన్న బ్రహ్మను పరమాత్మ అనీ అన్నా రెండింటిలోనూ అధిష్ఠానంగా ఉన్నది ఒకటే బ్రహ్మ.

మళ్ళీ ఆ దశలన్నీ మనం చెప్పుకోవాలి. అందువల్ల జీవాత్మ = పరమాత్మ. పరమాత్మకు పుట్టుక లేదు కాబట్టి జీవాత్మకు కూడా పుట్టుక లేదు; జీవాత్మ కార్యం కాదు కాబట్టి పరమాత్మ కారణం కాదు; పరమాత్మ కారణం కాదు కాబట్టి పరమాత్మ కార్యకారణ విలక్షణమ్; అద్వైతమ్.

**డి) శ్రుత్యా జగత్ సృష్టి నిషేధః – కారికలు 15, 16, 23-26**

జగత్ నిజంగా సృష్టింపబడలేదని శ్రుతివాక్యాలద్వారా నిషేధించటం. శ్రుతిలో బ్రహ్మ కారణం కాదు, జగత్తు కార్యం కాదు అని నిరూపించే వాక్యాలు అనేకం ఉన్నాయి.

**న జాయతే మ్రియతే వా విపశ్చిత్**

**నాయం కుతశ్చిన్న బభూవ కశ్చిత్** – కఠ 1.2.18

చైతన్యం దేన్నుంచీ పుట్టలేదు. అది దేనికీ కారణం కాదు. ఇంచుమించు ఇవే పదాలతో గీతలో కూడా చూస్తాము కాని అది స్మృతిలోకి వస్తుంది కాబట్టి ఇక్కడ చెప్పటం లేదు.

**నేహ నానాస్తి కించన** – కఠ 2.1.11

నానాత్వం కొంచెం కూడా లేదు అంటే ఈ ద్వైతప్రపంచం లేదు. స్వప్నంలో ద్వైతప్రపంచాన్ని చూస్తారు కాని అది సత్యం కాదు. అది మీ వాసనామయ ప్రపంచం మాత్రమే. అలాగే ఈ జాగ్రత్ ప్రపంచం కూడా స్వప్నం-2 మాత్రమే. నిజంగా సృష్టి జరగలేదు.

**కారిక 3-24**

**నేహ నానేతి చామ్నాయాదింద్రో మయాభిరిత్యపి।**
**అజాయమానో బహుధా మాయయా జాయతే తు సః॥**

ఈ కారికలో ఈ క్రింది పదాల ద్వారా మూడు ఉపనిషత్తుల వాక్యాలను ఉటంకిస్తున్నారు గౌడపాదాచార్యులవారు. అవి -

1. **నేహ నానేతి** - కఠ 2.1.11
2. **ఇంద్రో మాయాభిరిత్యపి** - బృహదారణ్యకమ్ 2.5.19
3. **అజాయమానో బహుధా విజాయతే** - పురుషసూక్తమ్ 21

ఈ మంత్రాల సారం - నిజంగా సృష్టి జరగలేదు.

**అజాయమానో బహుధా విజాయతే** - పుట్టుకలేని బ్రహ్మ అనేక వస్తువులను సృష్టించాడు అంటుంది పురుషసూక్తం.

**బహుధా విజాయతే** - బ్రహ్మ పదం ఇక్కడ రాలేదు, మనం కలుపుకుంటాము. బహుధా అంటే నానాత్వం; విజాయతే అంటే సృష్టించాడు; అజాయమానః అంటే సృష్టించకుండానే. అంటే బ్రహ్మ సృష్టించకుండానే నానాత్వం ఉన్న ఈ జగత్తును సృష్టించాడు. దీని అర్థం సృష్టించాడు కాని నిజంగా కాదు అని. అదెలా సాధ్యం? జాగ్రత్ పురుషుడు స్వప్నంలో పిల్లవాడికి తండ్రి అయితే, అతను నిజంగా తండ్రి అయినట్టు ఎలా కాదో, అలా బ్రహ్మ జాగ్రత్ ప్రపంచాన్ని సృష్టించినా, నిజంగా సృష్టించినట్టు కాదు. వీటన్నిటి సారాంశం బ్రహ్మ నిజం సృష్టి చేయలేదు; నిజం జగత్తు రాలేదు. మరికొన్ని శ్రుతివాక్యాలను ఉటంకిస్తారు గౌడపాదాచార్యులవారు.

4. సంభూతేః అపవాదాచ్చ -

**అంధంతమః ప్రవిశంతి యేఽ సంభూతిముపాసతే** - ఈశావాస్యమ్

ఎవరైతే ప్రకృతి ఉపాసన చేస్తారో వారు చీకటిలోకాలకు వెళతారు; ఎవరైతే హిరణ్యగర్భ ఉపాసన చేస్తారో వారు ఇంకా చీకటిలోకాలకు వెళతారు అంటున్నది ఈశావాస్యోపనిషత్తు.

5. కో న్వేనం జనయేదితి - బృహదారణ్యకమ్

జీవాత్మ పుడితే, జీవాత్మ అనే కార్యానికి కారణం ఏమిటి? దీని అర్థం కారణం లేదు అని.

6. **స ఏష నేతి నేతీతి** - నేతి నేతి పద్ధతి ద్వారా బృహదారణ్యకోపనిషత్ మూర్తామూర్త ప్రపంచాన్ని ఇది ఆత్మ కాదు, ఇది ఆత్మ కాదు అని నిషేధిస్తున్నది.

**యుక్త్యా జగత్ సృష్టి నిషేధః - కారికలు 27-30**

తన అజాతివాదనను సమర్థిస్తూ, గౌడపాదాచార్యులవారు ఆరు శ్రుతివాక్యాలను ఉటంకించారు. ఇప్పుడు మళ్ళీ 27-30 కారికల్లో తర్కం ద్వారా నిరూపించబోతున్నారు.

ఒకవేళ జగత్తు నిజం కార్యమయితే అప్పుడు బ్రహ్మ నిజం కారణమవాలి. బ్రహ్మ నిజం కారణమయితే బ్రహ్మ మార్పులకు లోనవ్వాలి అంటున్నారు గౌడపాదాచార్యులవారు. ఎందుకంటే కారణంనుంచి కార్యం వచ్చినప్పుడు, కారణం మార్పులకు లోనవుతుంది. కారణం సవికారం అయితే, జగత్తు అనే కార్యానికి బ్రహ్మ కారణం అయితే ఈ నియయం ప్రకారం బ్రహ్మ కూడా సవికారం అవాలి. సవికారం అయితే షడ్వికారాలకు లోనవ్వాలి. ఒక వికారం జాయతే - అంటే పుట్టటం. అంటే బ్రహ్మ పుట్టాలి. తక్కిన కారణాలు ఇంకొక కారణంనుంచి పుడతాయి. ఆ సూత్రం ప్రకారం బ్రహ్మ కారణమైతే, బ్రహ్మ కూడా కార్యమవాలి.

**బ్రహ్మ కార్యం కారణత్వాత్ మాతృవత్**

ఎక్కడనుంచి ఎక్కడికొచ్చామో చూశారా? బ్రహ్మ కారణమయితే, బ్రహ్మకు జన్మ ఉండాలి. మనమేమో ఈ జననమరణాల వృత్తం ఒక్క మానవజాతికే ఉందనుకుంటున్నాము కాని ఈ బృహస్పతి బ్రహ్మను కూడా మహాసంసారిని చేస్తున్నాడు. బ్రహ్మ ఈ చావు, పుట్టుకల వృత్తానికి అతీతంగా ఉండాలంటే, బ్రహ్మ కారణం కాలేదు అని అర్థం చేసుకోవాలి. లేదు, బ్రహ్మకు కారణం హోదా ఇచ్చి తీరాలంటే, ఇవ్వండి, కానీ మిథ్యాకారణం అని పక్కన కలపండి. ఈ విధంగా బ్రహ్మ కారణం అనేది తార్కికంగా చెల్లదు అని నిరూపించారు గౌడపాదాచార్యులవారు.

ఈ కార్యకారణ విలక్షణ బ్రహ్మనే అద్వైతం అనీ, తురీయం అనీ ఉపనిషత్తు ఏడవ మంత్రంలో అంది. అందులో తురీయాన్ని **చతుర్థం మన్యన్తే** అంది.

**2) సృష్టి గురించి శ్రుతి తాత్పర్యం - కారికలు 17-22**

అద్వైతం = కార్యకారణవిలక్షణమ్

ఉపనిషత్తుల్లో వచ్చిన బ్రహ్మలక్షణాలు నేర్చుకుంటుంటే ఒక సమస్య ఎదురవుతుంది. కొన్ని లక్షణాలు పరస్పర విరుద్ధంగా ఉంటాయి. వాటిలో ముఖ్యమైన విరుద్ధ లక్షణాలు - బ్రహ్మ నిర్వికారం, బ్రహ్మ జగత్కారణం. ఈ రెండు లక్షణాలకూ పొత్తు కుదరదు.

నిర్వికారం అంటే వికారాలు లేనిది, దేశకాలాతీతమైనది. అంతవరకూ బాగానే ఉంది. కాని వెంటనే ఉపనిషత్తు బ్రహ్మ జగత్ కారణం, అందులోనూ ఉపాదానకారణం అంటుంది. ఉపాదాన కారణం అనగానే, దాని నియమం గుర్తుకు రాకతప్పదు. ఉపాదానకారణం

కార్యంగా అవటానికి మార్పు చెందుతుంది. విత్తనం చెట్టుగా మారుతుంది; పాలు పెరుగుగా మారతాయి; బంగారం ఆభరణాలుగా మారుతుంది. బంగారం విషయంలో ఆ మార్పు రసాయనకంగా కాదు కాని ఆకారంలో మార్పు చెందుతుంది. అంటే కారణానికి ఏదో ఒక విధంగా మార్పు తప్పదు. అందువల్ల జగత్ కారణం అంటే సవికారం.

ఉపనిషత్తు బ్రహ్మ నిర్వికారం, బ్రహ్మ జగత్కారణం అంటుంది. కారణం పదాన్ని తీసి సవికారం వేస్తే బ్రహ్మ నిర్వికారం, బ్రహ్మ సవికారం కూడా అన్నట్టు అవుతుంది. ఇంత స్పష్టంగా ఉపనిషత్తు చెప్పకపోయినా దాని అర్థం అదే. బ్రహ్మ నిర్వికారం అయితే సవికారం అవలేదు; సవికారం అయితే నిర్వికారం అవలేదు. ఒకే వస్తువులో రెండు భిన్నలక్షణాలు ఇమడలేవు.

రాముడు సన్నగా ఉన్నాడు, లక్ష్మణుడు లావుగా ఉన్నాడు అనగలం కాని రాముడు సన్నగా, లావుగా ఉన్నాడు అనలేము. అలాగే ఒక వస్తువు బరువుగా, తేలికగా ఉంది అనలేము. అలాంటప్పుడు బ్రహ్మ నిర్వికారం, సవికారం అని ఎలా చెప్పగలము?

అలాగని ఏదో ఒక లక్షణాన్ని కూడా తీసుకోలేము. ఎందుకు? రెండు లక్షణాలూ ఒకే వేదంనుంచి వచ్చాయి. మనకు నచ్చిన లక్షణాన్నే మనం ఎన్నుకుంటే, నాకు నచ్చిన లక్షణాన్ని నేను ఎన్నుకుంటాను అంటాడు పూర్వపక్షి. అలా ఎవరికి తోచిన లక్షణం వారు ఎన్నుకుని, తక్కిన లక్షణాలను త్రోసిపుచ్చితే బ్రహ్మకు ఏ లక్షణమూ లేకుండా పోతుంది. అందువల్ల రెండు లక్షణాలనూ తీసుకోక తప్పదు.

దీనికి ఒకటే మార్గం ఉంది అంటున్నారు గౌడపాదాచార్యుల వారు. రెండు భిన్నలక్షణాలు ఒక వస్తువులో ఉండి తీరాలంటే, దానికి ఒకే మార్గం ఉంది. ఒకటి సత్యలక్షణం, ఇంకొకటి మిథ్యాలక్షణం అయివుండాలి; ఒకటి ఉన్నతస్థాయికి చెందిన సత్యం, ఇంకొకటి తక్కువస్థాయికి చెందిన సత్యం అయివుండాలి. నేను స్వప్నంలో ఊరంతా తిరిగివస్తాను, కాని మంచంమీద చలనం లేకుండా పడుకుని ఉన్నాను. అది సాధ్యమే! ఎందుకంటే స్వప్నప్రపంచం ప్రాతిభాసిక సత్యానికి చెందితే, జాగ్రత్ పురుషుడు వ్యావహారిక సత్యానికి చెందిన వాడవుతాడు. దాన్ని సత్తాభేదం లేదా స్థాయీభేదం అంటారు. అందువల్లనే పడుకునే ముందు కడుపునిండా తిని, హాయిగా సొమ్మసిల్లి పడుకుంటే, స్వప్నంలో ఆకలికి అలమటించి పోతాడు.

ఈ భిన్నలక్షణాలను స్వీకరించాలంటే ఒకటి సత్యం, ఇంకొకటి మిథ్య అవాలి. నిర్వికారమో, సవికారమో మిథ్య అవాలి. మిథ్యా పదాన్ని వాడటం ఇష్టం లేకపోతే వ్యావహారిక సత్యం అనవచ్చు. ఈ రెండింటిలో ఒకటి పారమార్థిక సత్యం అయితే, ఇంకొకటి వ్యావహారిక సత్యం అవుతుంది. ఇదొక్కటే మార్గం.

కాని ఇంకా సమస్య అలాగే ఉంది. ఈ రెండింటిలో ఏది సత్యం, ఏది మిథ్య? గౌడపాదాచార్యుల వారు నిర్వికారాన్ని సత్యంగానూ, సవికారాన్ని మిథ్యగానూ తీసుకోవాలి అంటున్నారు. బ్రహ్మ సవికారత్వం మిథ్య అయితే, సహజంగానే సవికారత్వాన్ని సూచించే కారణహోదా కూడా మిథ్యే అవాలి. అంటే బ్రహ్మ నిజంగా సృష్టి కారణం కాదు.

బ్రహ్మ నిజంగా సృష్టికారణం కాదు అంటే, బ్రహ్మ మిథ్యా కారణం అవుతాడు. మనం ఒక్కొక్కమెట్టు ఎక్కుతూ వెళుతున్నాము.

1. బ్రహ్మ నిజంగా కారణం కాదు సృష్టికి.

2. బ్రహ్మ నిజంగా కారణం కాకపోతే, బ్రహ్మనుంచి వచ్చిన ఈ జగత్తు కూడా నిజంగా కార్యం కాదు. మిథ్యాకారణం, మిథ్యా జగత్తునే సృష్టించగలదు. మిథ్యా స్వప్నతండ్రి మిథ్యా స్వప్నపుత్రునికే జన్మను ఇవ్వగలదు. అందువల్ల జగత్తు మిథ్య, బ్రహ్మ మిథ్యాకారణం కాబట్టి, దాన్నించి పుట్టిన జగత్తు కూడా మిథ్యే అవాలి. దీనికి ఏమిటి ఆధారం? ఉపనిషత్తే!

**పరస్పరవిరుద్ధ వాక్యాలు**

**పూర్వపక్షి వాదన–** జీవాత్మ–పరమాత్మల ఐక్యబోధక వాక్యాలను తీసుకుని, తద్ద్వారా పరమాత్మ కార్యకారణ విలక్షణం అని బోధిస్తున్నారు బాగానే ఉంది కానీ, అవే ఉపనిషత్తుల్లో అనేక వాక్యాలు జీవాత్మ–పరమాత్మల భేదాన్ని సూచిస్తాయి. అంతేకాదు జీవాత్మ పరమాత్మనుంచి పుట్టింది అనే వాక్యాలు వస్తాయి. వాటికేమిటి మీ జవాబు?

**ద్వా సుపర్ణా సయూజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే** – ముండకమ్

రెండు పక్షులు ఒకే వృక్షంమీద ఉన్నాయి. ఒక పక్షి పిప్పలం పండ్లను తిని రకరకాల రుచులను ఆస్వాదిస్తోంది. ఇంకొకటి తినకుండా సాక్షిగా చూస్తోంది. ఇక్కడ ద్వైతం స్పష్టంగా తెలుస్తున్నది.

**యథా సుదీప్తాత్పావకాత్ విస్ఫులింగాః సహస్రశః ప్రభవన్తే సరూపాః** – ముండకం

ఎలాగైతే జ్వలిస్తున్న అగ్నినుంచి నిప్పురవ్వలు పుడతాయో, అలాగే పరమాత్మనుంచి జీవాత్మలు పుడతాయి. ఇక్కడ పరమాత్మ కారణమనీ, జీవాత్మ కార్యమనీ ఉపనిషత్తే స్పష్టంగా చెప్పింది. ఉపనిషత్తే తనను తాను ఖండించుకుంటోంది. అది బోధించేది భేదాన్నా? ఐక్యాన్నా?

**గౌడపాదాచార్యులవారి జవాబు** – దీనికి జవాబు శాస్త్రంలోనే దొరుకుతుంది. శాస్త్రం మననేమీ అయోమయంలో పడవేయటం లేదు. కాకపోతే మనమే శాస్త్రాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. ఆత్మజ్ఞానం పొందాలంటే శాస్త్రంయొక్క శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలి. ఉపనిషత్తులు

ద్వైతం గురించి చెబుతాయి నిజమే కాని, సందర్భం వచ్చినప్పుడల్లా ద్వైతాన్ని తీవ్రంగా విమర్శిస్తాయి. ఒకచోట కాదు, అనేకచోట్ల.

1. **మృత్యోస్స మృత్యుమాప్నోతి య ఇహ నానేవ పశ్యతి** – కఠ 2.1.10

ఎవరైతే నానాత్వాన్ని చూస్తారో వారు మృత్యువునుంచి మృత్యువుకు వెళతారు. అంటే సంసారం తప్పదు.

2. **యదా హ్యేవైష ఏతస్మిన్నుదరమంతరం కురుతే**
   **అథ తస్య భయం భవతి** – తైత్తరీయం

భగవంతునికీ, మీకూ మధ్య కాస్త భేదాన్ని చూసినా కూడా, భయం తప్పదు అంటే పూర్తి భద్రతా భావన కలగదు.

3. **అన్యాం దేవతాం ఉపాస్తే సః న వేద** – బృహదారణ్యకం

జీవాత్మకు, పరమాత్మకు మధ్య భేదాన్ని ఎవరైతే చూస్తారో, అతను పశువుతో సమానం అంటున్నది ఉపనిషత్తు. అంటే అతనికి విచక్షణాశక్తి లేదని విమర్శిస్తుంది.

4. **ఉపాసనాశ్రితో ధర్మో జాతే బ్రహ్మణి వర్తతే**
   **ప్రాగుత్పత్తేరజం సర్వం తేనాసౌ కృపణః స్మృతః ।** – మాండూక్యమ్

ఈ ఉపనిషత్తులోనే ఎవరైతే ద్వైతభావన చూస్తారో వారు కృపణులు అన్నారు గౌడపాదాచార్యులవారు. వీటన్నిటి సారం, ఉపనిషత్తులే ద్వైతాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నాయి. ఉపనిషత్తులే ద్వైతాన్ని విమర్శించేటప్పుడు ద్వైతాన్ని ఎందుకు నిర్దేశించాలి శాస్త్రం?

**ద్వైతం లేనిదే, అద్వైతం అసంభవం**
**అద్వైతానికి రానిదే, ద్వైతం అసంపూర్ణం**

అందువల్ల ద్వైతంలోనే ఆగిపోకుండా, అద్వైతానికి రావాలి. ద్వైతంలో ఉన్నవారిని మూఢా అనీ, ప్రమూఢా అనీ విమర్శిస్తే, అద్వైతానికి వచ్చినవారిని ధీరా అంటుంది శాస్త్రం. దేన్ని కీర్తిస్తున్నదో అదే సారం కావాలి కానీ, దేన్ని నిందిస్తున్నదో అది సారం అవలేదు కదా! అద్వైతజ్ఞానం పొందిన జ్ఞాని జీవితం ఎలా ఉంటుందో వివరిస్తుంది.

**హా3వు హా3వు హా3వు । అహమన్నమహమన్నమహన్నమ్ ।**
**అహమన్నాదో3హమన్నాదో 3హమన్నాదః॥** – తైత్తిరీయమ్

జ్ఞాని ఎలా ఆనందంగా సామగానం చేస్తాడో చెబుతున్నది ఇక్కడ.

**పూర్వపక్షి వాదన** – సృష్టి జరగలేదని చెప్పే మంత్రాలనే మీరు ఉటంకిస్తున్నారు కాని శ్రుతిలోనే సృష్టి జరిగిందని చెప్పే మంత్రాలు ఎన్నో ఉన్నాయి. వాటినెందుకు మీరు చూడటం లేదు. ఇలా మీకు కావాల్సిందే తీసుకోవటం న్యాయంగా లేదు.

**ఓం తదేతత్సత్యం యథా సుదీప్తాత్పావకాత్**
**విస్ఫులింగాః సహస్రశః ప్రభవంతే సరూపాః**
**తథాఽక్షరాద్వివిధాః సోమ్యభావాః**
**ప్రజాయన్తే తత్ర చైవాపియన్తి** – ముండకమ్ 2.1.1

అగ్నిజ్వాలలనుంచి నిప్పురవ్వలు పుట్టినట్టుగా, బ్రహ్మనుంచి జీవులు పుట్టారు.

**తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః ।**
**ఆకాశాద్వాయుః। వాయోరగ్నిః । అగ్నేరాపః। అద్భ్యః పృథివీ । పృథివ్యా ఓషధయః।**
**ఓషధీభ్యోఽన్నమ్ । అన్నాత్పురుషః ॥** – తైత్తిరీయమ్

ఆ ఆత్మనుంచే ఆకాశం, ఆకాశంనుంచి వాయువు, వాయువునుంచి అగ్ని, అగ్నినుంచి నీరు, నీటినుంచి భూమి, భూమినుంచి వృక్షాలు, వృక్షాలనుంచి అన్నం, అన్నంనుంచి మనుష్యులు పుట్టారు. ఇంత స్పష్టంగా సృష్టి గురించి వస్తే, అసలు సృష్టే జరగలేదని అంత ధైర్యంగా ఎలా ఖండించగలరు?

**జవాబు** – దీనికి కూడా ముందు చెప్పిన జవాబే వర్తిస్తుంది. దీన్ని అధ్యారోప అపవాదం అంటారని చూశాము. ఈ పద్ధతిలో ముందు తాత్కాలికంగా సృష్టిని ప్రవేశపెట్టి, తర్వాత ఆత్మ కార్యకారణ విలక్షణం అని నిరూపిస్తాము. ఉపనిషత్తుల ప్రధానబోధ సృష్టిప్రకరణం కాదు. అద్వైతమే దాని ముఖ్యాంశం. అద్వైతం అర్థమయ్యాక, సృష్టిని కూడా నిషేధిస్తుంది ఉపనిషత్తు.

**సృష్టిః యా చోదితా అన్యథా**– సృష్టి గురించి ఉపనిషత్తుల్లో రకరకాలుగా చెప్పబడిందని నేనూ ఒప్పుకుంటాను అంటున్నారు గౌడపాదాచార్యులవారు. ఉదాహరణకు తైత్తిరీయోపనిషత్తులో పంచభూతాల సృష్టి గురించి వస్తే, ఛాందోగ్యోపనిషత్తులో మూడు భూతాల సృష్టి మాత్రమే వస్తుంది. ఐతరేయోపనిషత్‌లో అయితే అసలు భూతాల సృష్టి గురించే రాదు. అక్కడ లోకసృష్టి గురించి మాత్రమే వస్తుంది. ఆ విధంగా భిన్నరీతుల్లో చెబుతాయి. అంతేకాదు, సృష్టి ఎలా జరిగిందో చూపటానికి అనేక ఉదాహరణలు కూడా ఇస్తాయి ఉపనిషత్తులు.

ఛాందోగ్యోపనిషత్‌లో మూడు ఉదాహరణలు వస్తాయి. అవి మట్టి–కుండ, బంగారం–

ఆభరణాలు, ఇనుము–గోళ్ళ కత్తెర. ఒక మట్టిముద్దనుంచి అనేక కుండలు వస్తాయి; ఒక బంగారం ముద్దనుంచి అనేక ఆభరణాలు వస్తాయి; ఒక ఇనుపముక్కనుంచి అనేక గోళ్ళ కత్తెరలు వస్తాయి. ముండకోపనిషత్‌లో అగ్నినుంచి నిప్పురవ్వలు వస్తాయని చూశాము. ఈ ఉదాహరణను బృహదారణ్యకంలో కూడా చూస్తాము.

**మృల్లోహ విస్ఫులింగాద్యైః** – మృత్ అంటే మట్టి. లోహ అంటే ఇనుము. విస్ఫులింగా అంటే అగ్నినుంచి వచ్చిన నిప్పురవ్వలు. బంగారం ఉదాహరణ కూడా కలుపుకోవచ్చు.

గౌడపాదాచార్యులవారి ధైర్యం చూడండి! ఇటువంటి వాక్యాలు ఉపనిషత్తుల్లో ఉన్నా, అవి సత్యం కాదు అంటారు. ఈ శ్రుతివాక్యాలను సత్యంగా తీసుకోనవసరం లేదు. వాటిని అధ్యారోపం కింద తీసుకోవాలి. ఎందుకంటే తర్వాత అపవాదంలో వాటిని కొట్టివేస్తాము. అలా ఎలా చెప్పగలరు? దానికి కూడా శ్రుతిప్రమాణం ఉంది అంటున్నారు గౌడపాదాచార్యుల వారు. ఇల్లు కట్టాక ఇంటి కప్పును కొట్టివేయరు కాని దాన్ని నిలబెట్టటానికి వాడిన దుంగలను తీసివేస్తారు. అదే విధంగా ముందు ద్వైతాన్ని ప్రవేశపెట్టి, తర్వాత దాన్ని కొట్టివేస్తారు. దుంగలు పెట్టాలి, సమయం వచ్చినప్పుడు తీయాలి. అలాగే సృష్టిని ప్రవేశపెట్టాలి, సమయం వచ్చినప్పుడు కొట్టివేయాలి. సృష్టిప్రకరణంద్వారానే అద్వైతానికి రాగలము.

**ఉపాయః** – ఉపాయః అంటే పద్ధతి. సృష్టి ప్రకరణం ఒక పద్ధతి. దాన్ని సాంకేతిక పరిభాషలో అధ్యారోప అపవాదన్యాయం అంటారు.

**సః** – సృష్టి ప్రకరణం గురించి చెప్పేది.

**అవతారాయ** – అద్వైతాన్ని బోధించటానికి. అవతారాయ అంటే రామావతారమో, కృష్ణావతారమో కాదు. అవతారం అంటే బోధ శిష్యుని బుద్ధిలో దిగటం. దానికి వాడిన పద్ధతి ఈ సృష్టిప్రకరణం. అధ్యారోప అపవాదన్యాయం అంటున్నాము కదా, అదేమిటో చూద్దాము.

## అధ్యారోప అపవాద న్యాయం

కుండ అనే వస్తువు ఉంది. కుండ దృష్టిని తీసి మట్టి దృష్టిని ప్రవేశపెట్టాలి. దాన్ని నాలుగు దశల్లో చేస్తాము.

1. కుండ ఉత్పత్తి చెందింది. అది కార్యం – కార్యాన్ని పరిచయం చేస్తాము.
2. ప్రతి కార్యానికీ ఒక కారణం ఉంటుంది. కుండకు కారణం మట్టి – కారణాన్ని పరిచయం చేస్తాము. **ఇది అధ్యారోపం**
3. మట్టి లేకుండా కుండకు విడిగా ఉనికి లేదు – కార్యాన్ని నిషేధిస్తాము.

4. కుండ అనే కార్యాన్ని నిషేధిస్తే మట్టికి కారణత్వ హోదా లేదు – కారణత్వాన్ని నిషేధిస్తాము (కారణం లేదు అనకూడదు). చివరికి మిగిలింది కార్యకారణ విలక్షణ మట్టి మాత్రమే. **ఇది అపవాదం.**

ఆ విధంగా కుండ దృష్టినుంచి మట్టి దృష్టికి వచ్చాము. కుండకు – మట్టికి కార్యకారణ సంబంధం వాడలేము ఎందుకంటే, మట్టి లేకుండా, కుండకు విడిగా ఉనికి లేదు, ఉన్నదొక్కటే మట్టి అన్నాము. సంబంధం ఉండాలంటే రెండు వస్తువులు ఉండాలి. ఈ అధ్యారోప అపవాదం కార్యకారణవిలక్షణ మట్టిని చేరుకునేలా చేస్తుంది.

ఇప్పుడు కుండ బదులు జగత్తు, మట్టి బదులు బ్రహ్మ వాడి ఈ అధ్యారోప అపవాద న్యాయాన్ని చూద్దాము. 'నేను జగత్తును చూస్తున్నాను కాని, దాన్ని సృష్టించిన బ్రహ్మను ఎలా చూస్తాను? బ్రహ్మ దర్శనం కావటానికి నేను ఎన్ని సంవత్సరాలు తపస్సు చేయాలి?' అని ఎవరైనా అడిగితే, వేదాంత గురువు తనలో తను నవ్వుకుని ఈ అధ్యారోప అపవాద న్యాయం బోధిస్తాడు.

1. జగత్తు ఉత్పత్తి చెందింది. అది కార్యం – కార్యాన్ని పరిచయం చేస్తాము.

2. ప్రతి కార్యానికీ ఒక కారణం ఉంటుంది. జగత్తుకు కారణం బ్రహ్మ – కారణాన్ని పరిచయం చేస్తాము. **ఇది అధ్యారోపం**

3. బ్రహ్మ లేకుండా జగత్తుకు విడిగా ఉనికి లేదు – కార్యాన్ని నిషేధిస్తాము.

4. జగత్తు అనే కార్యాన్ని నిషేధిస్తే బ్రహ్మకు కారణత్వ హోదా లేదు – కారణత్వాన్ని నిషేధిస్తాము (కారణం లేదు అనకూడదు). చివరికి మిగిలింది కార్యకారణ విలక్షణ బ్రహ్మ. **ఇది అపవాదం.**

ఆ విధంగా జగత్తు దృష్టినుంచి బ్రహ్మ దృష్టికి వస్తాము. జగత్తుకు బ్రహ్మకు కూడా కార్య–కారణ సంబంధం వాడలేము ఎందుకంటే ఉన్నదొక్కటే బ్రహ్మ. కాని ఈ ఉన్నదొకటే బ్రహ్మను చేరుకోవటానికి సృష్టినుంచే రావాలి. అందువల్ల సృష్టి గురించి చెబుతున్నాయి ఉపనిషత్తులు. ఇలా సృష్టిని ప్రవేశపెట్టి, మళ్ళీ దాన్ని నిషేధించే పద్ధతిని అర్థం చేసుకోవటానికి ఆచార్యులు ఒక ఉదాహరణ చెబుతుంటారు.

కేరళలో ఒక తండ్రికి 17 ఏనుగులు ఉన్నాయి. ఆయనకు ముగ్గురు కొడుకులు ఉన్నారు. ఆ తండ్రి మరణిస్తూ తన ఏనుగులను తన ముగ్గురు కొడుకులూ ఎలా పంచుకోవాలో వీలునామా రాశాడు. అందులో ఈ విధంగా ఉంది. పెద్ద కొడుకుకి ఏనుగుల్లో సగం (1/2) వాటా, రెండవ కొడుకుకి మూడవ వంతు వాటా (1/3), మూడవ కొడుకుకి తొమ్మిదవ వంతు వాటా (1/9) రావాలి. కాని ఏనుగులను కోయకూడదు. ఈ నిబంధనలను పాటిస్తూ

ఆ 17 ఏనుగులను ఎలా పంచాలో అర్థం కాక ఊరిపెద్దలు తలలు బద్దలు కొట్టుకుంటున్నారు.

ఆ ఊరి రాజుకి ఈ విషయం తెలిసింది. ఆయన తన ఏనుగుమీద అక్కడికి వచ్చి, ఆ సమస్యను తను పరిష్కరిస్తానన్నాడు. రాజు తన ఏనుగును వారికి దానం చేస్తానన్నాడు, తన ఏనుగుమీద కూర్చుని ఉండే. అలా ఎలా దానం చేయగలడు? వివరాలు చూద్దాము.

చనిపోయిన తండ్రికి 17 ఏనుగులు ఉన్నాయి కదా! రాజు ఇచ్చే ఏనుగును కలుపుకుంటే 17+1=18 అవుతాయి.

| | | |
|---|---|---|
| పెద్ద కొడుకుకి | 1/2 వాటా | - 18 ÷ 2 = 9 |
| రెండవ కొడుకుకి | 1/3 వాటా | - 18 ÷ 3 = 6 |
| మూడవ కొడుకుకి | 1/9 వాటా | - 18 ÷ 9 = 2 |
| మొత్తం ఏనుగులు | | =17 |

తండ్రి ఏనుగులను కొడుకులకు, తండ్రి కోరుకున్నట్టుగా, ఏనుగులకు హాని జరగకుండా పంచాడు రాజు. అది ఎలా చేశాడు? తన ఏనుగును ప్రవేశపెట్టాడు, సమస్య పరిష్కరించాడు, తన ఏనుగు మీదే తాను వెళ్ళిపోయాడు. వేదాంతం చేసేది కూడా అదే. సృష్టిని ప్రవేశపెడుతుంది, సమస్యను పరిష్కరిస్తుంది, సృష్టిని తాను వెనక్కి తీసేసుకుంటుంది.

**న నిరోధో న చోత్పత్తిర్న బద్ధో న చ సాధకః ।**
**న ముముక్షుర్న వై ముక్త ఇత్యేషా పరమార్థతా ॥** - 2.32

అద్వైతానికి ఎదిగితే ప్రళయం లేదు, ఉత్పత్తి లేదు, బద్ధజీవి లేదు, సాధకుడు లేదు, మోక్షాన్ని కోరేవాడు లేదు, ముక్తపురుషుడూ లేదు.

అంతకుముందూ, ఇప్పుడూ, తర్వాత కూడా ఉండేది బ్రహ్మే. మధ్యలో ఏమైనా ఉంటే అది అయోమయం తప్ప ఏమీ కాదు. కొంచెం కూడా భేదం లేదు.

**సజాతీయ విజాతీయ స్వగత భేదాః న సంతి**

కారికలు 17-22లో - గౌడపాదాచార్యులవారు ప్రసంగవశాత్తూ తను చేస్తున్న బోధనుంచి కొంచెం పక్కకి వెళ్ళి ద్వైతవాదుల ఖండన చేస్తారు. ఈ కారికల్లో గౌడపాదాచార్యులవారు మూడు అంశాలను నిరూపించారు.

1. మోక్షం అంటే ద్వైతంనుంచి ద్వైతానికి ప్రయాణం కాదు.
2. మోక్షం అంటే ద్వైతంనుంచి అద్వైతానికి ప్రయాణం.
3. ద్వైతంనుంచి అద్వైతానికి ప్రయాణం శారీరకంగా కాదు, మానసికంగా.

### 3) **అమనీభావః / మనోనాశః – కారికలు 31-39**

ఇప్పుడు గౌడపాదాచార్యులవారు సంసారకారణాన్ని, దాని పరిష్కారాన్ని చర్చించ బోతున్నారు.

### **దశ 1 – ద్వైత దర్శనం – సంసార కారణం**

అద్వైతం సత్యం, ద్వైతం మిథ్య అనే విషయం తెలియక, ద్వైతాన్ని సత్యంగా తీసుకోవటమే సంసారం.

**ద్వితీయాద్వై భయం భవతి** – బృహదారణ్యకమ్

రెండవది ఉంటే భయం వేస్తుంది. ద్వైతం ఉంటే సంసారం ఉంటుంది. ఎందుకంటే రాగద్వేషాలు వస్తాయి. ప్రవృత్తి-నివృత్తులు వస్తాయి; జనన-మరణ వృత్తం ఉంటుంది; దేశకాల పరిమితులు వస్తాయి. వీటన్నిటికీ మూలకారణం ద్వైతదర్శనం. ఈ ద్వైతదర్శనం స్వప్నంలో కూడా అవుతుంది. అందువల్ల స్వప్నం కూడా భయపెడుతుంది. కాని సుషుప్తిలోకి జారుకునేసరికి, ద్వైతదర్శనం కూడా మాయమవుతుంది. అక్కడ ఉన్నది అద్వైతమే. అక్కడ సంసారం లేదు.

**అహరహర్ బ్రహ్మ గమయతి**

ప్రతిరాత్రీ ఆనందాన్ని అనుభవిస్తాము సుషుప్తిలో. అంటే ద్వైతం ఉంటే సంసారం ఉంటున్నది; ద్వైతం లేకపోతే సంసారం లేదు కాబట్టి, **ద్వైతమే సంసార కారణం** అని తెలుస్తున్నది.

### **దశ 2 – మనసే కారణం**

ఇప్పుడు ద్వైతదర్శనం ఎప్పుడవుతున్నదనే అంశాన్ని లోతుగా విశ్లేషిస్తే, అది మనస్సు పని చేస్తున్నప్పుడే అవుతున్నదని అర్థం అవుతుంది. జాగ్రదవస్థలో మనస్సు పూర్తిగా విచ్చుకున్న పువ్వులాగా ఉంటుంది. అన్ని ఇంద్రియాల సహాయంతో జాగ్రత్ ప్రపంచంలో వ్యవహారం నడుపుతుంది. స్వప్నావస్థలో మనస్సు సగం విచ్చుకున్న పువ్వులా ఉంటుంది. అంటే ఇంద్రియాలు పనిచేయవు కాని మనస్సునందు చిత్తం పనిచేస్తుంది. ఆ చిత్తంలో నిక్షిప్తమై ఉన్న వాసనలద్వారా స్వప్నప్రపంచాన్ని సృష్టిస్తుంది. కాని సుషుప్తికి వచ్చేసరికి మనస్సు పూర్తి మొగ్గలా ముడుచుకుంటుంది. అంటే మనస్సు కూడా పడుకుంటుంది. మనస్సునందు చిత్తం, బుద్ధి అహంకారం – ఏదీ పనిచేయవు.

దీన్నిబట్టి మనకు అర్థమైనది ఏమిటి? సుషుప్తిలో మనస్సు కూడా పడుకున్నప్పుడు ద్వైతప్రపంచమూ లేదు, దానివల్ల ఏర్పడిన సంసారమూ లేదు. కాని మనస్సు పనిచేస్తున్న జాగ్రత్, స్వప్నావస్థల్లో ద్వైతమూ ఉంది, సంసారమూ ఉంది. దీనివల్ల మనం ఏర్పరచే ఉపసిద్ధాంతం – మనస్సు మేలుకుని ఉంటే సమస్య ఉంది, మనస్సు పడుకుని ఉంటే సమస్య లేదు. అందువల్ల **మనస్సే సంసారానికి కారణం.**

**మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః –** అమృతబిందు ఉపనిషత్ 2

అందువల్ల పాపం జగత్తును నిందించి లాభం లేదు. మీరు గాఢనిద్రలో ఉండగా, మీ పక్కన కొండచిలువ ఉన్నాకూడా మీకు భయమేయదు.

ఎక్కడ మనస్సు ఉంటే అక్కడ ద్వైతం, సంసారం ఉంది. ఎక్కడ మనస్సు లేదో అక్కడ ద్వైతమూ లేదు, సంసారమూ లేదు. **మనోనాశే సతి ద్వైతం నైవ ఉపలభ్యతే.**

అందువల్ల మోక్షం పొందాలనుకుంటే, మీ మనస్సును నియంత్రించుకోవాలి. మీరు జగత్తును నియంత్రించనవసరం లేదు; మీ పిల్లలను నియంత్రించనవసరం లేదు; మీ క్రింద ఉన్న ఉద్యోగులను నియంత్రించనవసరం లేదు. మీ పనివారిని నియంత్రించనవసరం లేదు. ఇవన్నీ సాధ్యమయ్యే పనులు కూడా కాదు. మోక్షం అంటే మనోజయం. మనోనాశనం వేరు, మనోజయం వేరు. మనోజయం అంటే మనస్సు మిథ్య అని అర్థం చేసుకోవటం.

అందువల్ల మనోనాశనం పదానికి రెండు అర్థాలు చెప్పవచ్చు.

1. **ద్వైతమిథ్యాత్వ నిశ్చయః –** మనస్సును (బుద్ధిని) ఉపయోగించి, జ్ఞానంద్వారా ఎదురుగా కనబడే జగత్తు మిథ్య, బ్రహ్మ మాత్రమే సత్యం అని అర్థం చేసుకోవటం.

2. **మనోమిథ్యాత్వనిశ్చయః –** అనాత్మ ప్రపంచంలోకి జగత్తు, శరీరం, మనస్సు కూడా వస్తాయి కాబట్టి మనస్సు కూడా మిథ్య అని అర్థం చేసుకోవటం.

కుండ మిథ్య అని తెలిశాక కూడా కుండను వాడినట్టుగా, మనస్సు మిథ్య అని తెలిశాక కూడా మనస్సును వాడుతాడు జ్ఞాని. కాని చాలామంది మనోనాశనం అంటే, జ్ఞాని మనస్సును నాశనం చేస్తాడు అనుకుంటారు. ఇది సరిగ్గా అర్థం చేసుకోకపోతే, అపోహలకు దారితీస్తుంది.

నిజానికి మనస్సును అక్షరాలా నాశనం చేయకూడదు; చేయలేము; చేయనవసరం లేదు కూడా.

ఎ) **మనస్సును నాశనం చేయకూడదు –** ఒకవేళ మనస్సును అక్షరాలా నాశనం చేస్తే, మోక్షం పొందిన వారంతా మనస్సు లేకుండా ఉంటారు. మనస్సు లేకపోతే ఆ బండరాయికీ,

జ్ఞానికీ మధ్య ఏమీ భేదం ఉండదు. ఇంత కష్టపడి సాధనలు చేసినది ఇలా బండరాయిగా మారటానికా? అందువల్ల మనస్సు ఉండాలి. ఆ మనస్సులోనే జాలి, దయ, ప్రేమానురాగాలు చూపాలి.

బి) **మనస్సును నాశనం చేయలేము** – మనస్సును అక్షరాలా నాశనం చేయలేము. మరణంతో కూడా మనోనాశనం అవదు. అది మనకు అనాదిగా వస్తున్నది. ఒక వ్యక్తి మరణించినప్పుడు, అతని సూక్ష్మశరీరం, కారణశరీరాలు ప్రయాణం చేస్తాయి. సూక్ష్మశరీరంలో ముఖ్యంగా ప్రయాణం చేసేది మనస్సు. ప్రళయంలో కూడా నాశనమవదు. మరణం నాశనం చేయలేని మనస్సును, ప్రళయం కూడా నాశనం చేయలేని మనస్సును మీరెలా నాశనం చేయగలరు?

సి) **మనస్సును నాశనం చేయనవసరం లేదు** – మనస్సును నిజానికి నాశనం చేయనవసరం లేదు కూడా. మనస్సు అనాత్మ, మిథ్య అని నేర్చుకున్నప్పుడు, మిథ్యా మనస్సును పనిగట్టుకుని నాశనం చేయటం ఎందుకు?

అందువల్ల మనోనాశనం అంటే మనస్సుయొక్క మిథ్యాత్వాన్ని అర్థం చేసుకోవాలి. ఆత్మజ్ఞానం పొందటంద్వారా మనోనాశనం చేయవచ్చుని, మనోనాశనంద్వారా మోక్షం పొందవచ్చునీ చూపించారు. ఆత్మజ్ఞానానికి గౌడపాదాచార్యులవారు ఇక్కడ రెండు ప్రత్యేక పదాలు వాడారు. అవి, **ఆత్మసత్యానుబోధః, అస్పర్శయోగః.**

ఎ) **ఆత్మ సత్యానుబోధన** – మనస్సును నాశనం చేయాలంటే, మనస్సు జోలికి వెళ్ళనవసరం లేదు. దానికి అధిష్ఠానం అయిన ఆత్మవైపు తిరిగితే చాలు. స్వప్నప్రపంచాన్ని నాశనం చేయాలంటే, స్వప్నంలో కనబడే ఒక్కొక్క వస్తువునూ సుత్తితో కొడుతూ రానవసరం లేదు. స్వప్నంనుంచి లేస్తే చాలు. స్వప్నంయొక్క అధిష్ఠానం జాగ్రత్ పురుషుడు. మీరు జాగ్రత్ పురుషునిగా లేస్తే, స్వప్నం దానంతట అదే మాయమయిపోతుంది. స్వప్నప్రపంచాన్ని ఏమీ చేయనవసరం లేదు – స్వప్నప్రపంచానికి అధిష్ఠానం అయిన జాగ్రత్ పురుషుని స్థాయికి లేస్తే చాలు.

ఆత్మ సత్య అనుబోధన అంటే అదే అర్థం. మనస్సును పనిగట్టుకుని నాశనం చేయనవసరం లేదు. మనస్సుకి అధిష్ఠానం అయిన ఆత్మ గురించి తెలుసుకుంటే చాలు. ఎటువంటి ఆత్మ? సత్య ఆత్మ. ఎలాగైతే జాగ్రత్ పురుషుడు, మిథ్యా స్వప్నప్రపంచానికి సత్య అధిష్ఠానమో అలాగే ఆత్మ మిథ్యా మనస్సుకు సత్య అధిష్ఠానం. జాగ్రత్ పురుషుని స్థాయికి లేస్తే, స్వప్నప్రపంచం ఎలా మిథ్యగా తేలిపోతుందో, అలా ఆత్మస్థాయికి లేస్తే అలా మనస్సు మిథ్యగా తేలిపోతుంది.

ఆత్మ గురించి ఎలా తెలుసుకుంటాము? అనుబోధేన అంటున్నారు గౌడపాదాచార్యుల వారు. అనుభోద అంటే శాస్త్ర ఉపదేశాన్ని గురువుద్వారా పొందటం. జ్ఞానం దానంతట అది ఏర్పడదు. కళ్ళు మూసుకుంటే జ్ఞానం రాదు; ఆలోచనలను లేకుండా మనస్సును శూన్యం చేస్తే జ్ఞానం రాదు. అంతకుముందు ఆలోచనలు ఉన్న అజ్ఞాని అయితే, ఇప్పుడు ఆలోచనలు లేని అజ్ఞాని అవుతారు. అంతే భేదం. అందువల్ల ధ్యానంలో జ్ఞానం వస్తుందని పొరపాటు పడకూడదు.

మీ కళ్ళు ఎంత సూదంటురాయిలా ఉన్నా, వాటిని మీరు స్వయంగా చూసుకోలేరు. వాటిని అద్దంలోనే చూసుకోవాలి. అలాగే జ్ఞానాన్ని గురుశాస్త్ర ఉపదేశంద్వారానే పొందాలి. అప్పుడు అజ్ఞానంలో ఉన్న మనస్సు జ్ఞానం పొందుతుంది. జ్ఞానం పొందిన మనస్సు ఏం చేస్తుంది?

**న సంకల్పయతే** – నిజమైన ద్వైతాన్ని చూడదు. జ్ఞాని ద్వైతాన్ని చూస్తాడు కాని అదే నిజమనే భ్రమలో ఉండడు.

జ్ఞానియొక్క మనస్సు ద్వైతాన్నే చూస్తుంది కాని ద్వైతంతో మమేకం చెందదు; అది మిథ్య అని అర్థం చేసుకుంటుంది. మిథ్యాజగత్తు ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే. మిథ్యాద్వైతం అన్నా ద్వైతం లేదు అన్నా ఒకటే అర్థం. మనః న సంకల్పయతే అంటే మనస్సు ద్వైతాన్ని చూడదు.

**అమనస్తాం తదా యాతి** – జ్ఞానికి అలా ద్వైతాన్ని చూడని మనస్సు ఉన్నా లేనట్టే అర్థం. ఎందుకంటే అది అతనికి సంసారాన్ని కలుగజేయదు. అజ్ఞాని మనస్సు ద్వైతాన్ని చూసి, దానివల్ల సంసారంలో పడవేస్తే, జ్ఞాని మనస్సు ద్వైతాన్ని చూడదు కాబట్టి, సంసారంలో పడవేయదు. జ్ఞానం పొందిన మనస్సు తేలికగా ఉంటుంది.

**గ్రాహ్యాభావే తదగ్రహమ్** – చూడబడే దృశ్యాన్ని మిథ్యగా కొట్టివేస్తున్నాము కాబట్టి, చూసే మనస్సుకు దృక్ హోదా ఉండదు.

మనస్సు చూస్తోంది కాని చూడటం లేదు. మనస్సు చూస్తోంది కాని చూడటం లేదు అంటే చూస్తున్నదాన్ని సత్యంగా భావించటం లేదు. ప్రమేయాన్ని కొట్టివేస్తే, ప్రమాత హోదా కూడా ఉండదు. అందువల్ల మనస్సును ప్రమాత అనలేము. అప్పుడది సంసారాన్ని కలుగజేయలేదు. నిజానికి ప్రతిజ్ఞాని కూడా సమస్యలను సృష్టించే, అజ్ఞానమైన మనస్సును నాశనం చేస్తాడు. అందువల్ల మనోనాశనం అంటే అజ్ఞానమైన మనస్సును నాశనం చేసి, జ్ఞానంతో నిండిన మనస్సును పెంపొందించుకోవటం. ద్వైతమిథ్యాత్వనిశ్చయం, అజ్ఞాననాశనం కలిసి అమనీభావం అని వస్తుంది.

ఆత్మ నిర్వచనం మళ్ళీ 3.36లో వస్తుంది.

**అజమనిద్రమస్వప్నమనామకమరూపకమ్।**

**సకృద్విభాతం సర్వజ్ఞం నోపచారః కథంచన॥**

తురీయం పాదత్రయ విలక్షణం, తురీయం స్థూలశరీరం కాదు, సూక్ష్మశరీరం కాదు, కారణశరీరం కాదు. ఆ అర్థాన్నే చూస్తాము ఈ మంత్రంలో.

**అజమ్** – అజమ్ అంటే పుట్టుకలేనిది. పుట్టుక ఉన్నది స్థూలశరీరానికి. అందువల్ల అజమ్ అంటే తురీయం, స్థూలశరీరం కాదు. స్థూలశరీరాన్ని విశ్వ అంటారు కాబట్టి తురీయం, విశ్వకాదు.

**అస్వప్నమ్** – స్వప్నాన్ని చూసేది సూక్ష్మశరీరానికి చెందిన మనస్సు. అస్వప్నమ్ అంటే తురీయం, సూక్ష్మశరీరం కాదు. సూక్ష్మశరీరాన్ని తైజస అంటారు కాబట్టి తురీయం, తైజస కాదు.

**అనిద్రమ్** – నిద్ర అంటే సుషుప్తి. సుషుప్తి కారణశరీరానికి చెందినది. అనిద్రమ్ అంటే తురీయం, కారణశరీరం కాదు. కారణశరీరాన్ని ప్రాజ్ఞ అంటారు కాబట్టి తురీయం, ప్రాజ్ఞ కాదు. ఏడవమంత్రంలో ఈ మూడింటిని వరుసగా న బహిఃప్రజ్ఞం నాంతఃప్రజ్ఞం న ప్రజ్ఞానఘనమ్ అని చూశాము.

**అవస్థాత్రయ విలక్షణమ్ అహమస్మి**

**శరీరత్రయ విలక్షణమ్ అహమస్మి**

**పాదత్రయ విలక్షణమ్ అహమస్మి**

అవస్థాత్రయం, శరీరత్రయం, పాదత్రయం – మిథ్యానామరూపాలు, నేను సత్య అధిష్ఠానమైన తురీయాన్ని.

**అనామకమ్** – స్థూలశరీరం, సూక్ష్మశరీరం, కారణశరీరం అనేవి నామాలు మాత్రమే. అనామకం అంటే నామరహితం.

ఆత్మయొక్క నాలుగు పాదాలను, ఓంకారంయొక్క నాలుగు మాత్రలతో పోల్చిచూశాము అంతకుముందు.

విశ్వ – అకారం

తైజస – ఉకారం

ప్రాజ్ఞ – మకారం

తురీయం – అమాత్ర

అమాత్ర అంటే నిశ్శబ్దం. నిశ్శబ్దాన్ని వివరించలేము కాబట్టి అనామకం. తురీయం ఆ విధంగా అనామకం.

**సర్వజ్ఞమ్** – సర్వజ్ఞమ్ పదాన్ని సర్వం+జ్ఞమ్‌గా విడదీయవచ్చు. సర్వం అంటే మొత్తం జడప్రపంచం; జ్ఞమ్ అంటే మొత్తం చేతనప్రపంచం.

**న ఉపచారః కథంచన** – అటువంటి చైతన్యంలో కొంచెం కూడా వ్యవహారాలు జరగవు. వ్యవహారం నడపాలి అంటే ద్వైతం ఉండాలి. అందువల్ల తురీయం సర్వవ్యవహార అతీతం.

బి) **అస్పర్శయోగం** – అస్పర్శః అంటే అసంగ ఆత్మ, తురీయ ఆత్మ. స్పర్శః అంటే సంగః; అస్పర్శః అంటే అసంగః. అసంగః అంటే బంధకత్వం లేనిది. బంధకత్వం లేనిది తురీయం కాబట్టి, అస్పర్శః తురీయాన్ని సూచిస్తుంది; యోగః అంటే జ్ఞానం. కాబట్టి అస్పర్శయోగః అంటే తురీయజ్ఞానం.

జాగ్రదవస్థలో విశ్వ, జాగ్రత్ శరీరంతో జాగ్రత్ ప్రపంచంతో సంబంధం పెట్టుకుంటాడు; స్వప్నావస్థలో తైజస, స్వప్నశరీరంతో స్వప్నప్రపంచంతో సంబంధం పెట్టుకుంటాడు. సుషుప్తి అవస్థలో ప్రాజ్ఞకు ప్రత్యక్షంగా ద్వైతం ఉండదు కాని, అది అవ్యక్తావస్థలో ఉంటుంది. ఒక్క తురీయంలోనే ద్వైతప్రపంచం ఉండదు; ద్వైతసంబంధాలు ఉండవు. ఉన్నదొకటే తురీయం కాబట్టి అది అసంగం.

**న మృత్యుర్న శంకా న మే జాతిభేదః।**
**చిదానందరూపః శివోఽహం శివోఽహమ్॥**

నాకు తండ్రి లేదు, తల్లి లేదు, పుత్రుడు లేదు, పుత్రిక లేదు, గురువు లేదు, శిష్యుడు లేడు. మరి అయితే నేను ఎవరు? చిదానందరూపః శివోఽహం శివోఽహమ్. ఈ జ్ఞానం పొందటాన్నే అస్పర్శయోగం అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

**అస్పర్శయోగో వై నామ** – ఈ జ్ఞానం అస్పర్శయోగంగా ప్రసిద్ధి చెందింది. నామ అంటే ప్రసిద్ధి చెందింది. ఈ జ్ఞానం పొందిన వ్యక్తి నేను సంబంధాలకు అతీతుణ్ణి అని అర్థం చేసుకుంటాడు. కాని ఇది అంత గొప్ప జ్ఞానమైనా కూడా, దీన్ని అందరూ అంత తేలికగా అర్థం చేసుకోలేరు. అందువల్ల ద్వైతం, సంగత్వం సంసారంలోకి వస్తాయి. అద్వైతం, అసంగత్వం మోక్షంలోకి వస్తాయి.

ఈ విషయం తెలియని సగటు మానవుడు ద్వైతం, సంగత్వం ఉంటే భద్రత అనీ, అద్వైతం, అసంగత్వం ఉంటే అభద్రత అనీ భ్రమపడటమే కాక, ఆ భ్రమలోనే జీవిస్తాడు. అందువల్ల చాలామంది అద్వైతానికి రారు. ఒకవేళ వచ్చినా కూడా, అద్వైతం నేర్చుకుంటారు కాని, బంధకత్వాన్ని వదులుకోవటానికి ఇష్టపడరు. అదే అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

**అభయే భయదర్శినః** – భయం లేని దీనిలో వారు భయాన్ని దర్శిస్తూ భయపడుతున్నారు. అందువల్ల వేదాంతం వర్ణించే మోక్షానికి మొగ్గు చూపించరు. వారి ఉద్దేశ్యంలో మోక్షం అంటే స్వర్గలోకానికి వెళ్ళటం. ఎందుకంటే అక్కడ తనతో పాటు తన ఆత్మీయులు ఉంటారు. అటువంటివారు ఇక్కడ, భూలోకంలో కూడా, ఒక్కక్షణం కూడా ఒంటరిగా ఉండలేరు. ఒకవేళ అలా ఉండాల్సివస్తే ఏ టీవీనో మ్రోగిస్తారు.

ఇలా అద్వైతం గురించి భయపడేటట్టయితే, వారికి మార్గం ఏమిటి? వారు బాగుందనుకున్న ద్వైతంలోనే కొనసాగి, ఎదురుదెబ్బలు తిన్నాక, వారే వస్తారు. కాకపోతే ఆ రావటం ఈ జన్మలోనే రావచ్చు లేదా కొన్ని జన్మలు పట్టవచ్చు. కాని ఎప్పుడైనా సరే, ఏ జన్మలోనైనా సరే అద్వైతానికి రాకతప్పదు. అదొక్కటే మోక్షమార్గం.

4) **మనోనిగ్రహః / నిదిధ్యాసనం – కారికలు 40-47**

ఆత్మజ్ఞానం పొందితే రెండు ఫలాలు కలుగుతాయి. అవి ముఖ్యఫలం, అవాంతరఫలం.

**ముఖ్యఫలం** – ముఖ్యఫలం ఆత్మజ్ఞానమే. నేను తురీయచైతన్యం, నేను సత్యం, నేను అసంగం, నేను శరీరత్రయవిలక్షణం. సత్యతురీయమైన నన్ను మిథ్యాశరీరాలు, వాటి సమస్యలు బాధించవు. అందువల్ల మిథ్యాశరీరాలకు ఏమైనా, సత్యతురీయమైన నన్ను అవి బాధించలేవు. ఇంకో విధంగా చెప్పాలంటే నేను నిత్యవిదేహాన్ని. విదేహః అంటే దేహత్రయరహితః.

**అవాంతరఫలం** –ఆత్మజ్ఞానం కూడా తక్కిన జ్ఞానాల్లాగా బుద్ధిలో కలుగుతుంది. ఈ జ్ఞానం ఎంత శక్తివంతమైనది అంటే, బుద్ధిలో కలిగిన జ్ఞానంద్వారా మనస్సులో రేగే భావోద్రేకాలను అదుపులో పెట్టగలదు. అంటే మనస్సులో శాంతి, అభయం, సమత్వం వంటి మంచి గుణాలను నెలకొనేలా చేస్తుంది. ఆ విధంగా ఆత్మజ్ఞానం మనస్సును దృఢపరుస్తుంది; మనస్సును సంస్కరిస్తుంది; మనస్సును శాంతిపరుస్తుంది. ఇది అవాంతర ఫలం.

దీన్ని అవాంతరఫలం అని ఎందుకు అంటున్నామంటే, వేదాంతం ప్రధాన ఉద్దేశ్యం మీ మనస్సును ఎలా దృఢపరచాలో నేర్పించటం కాదు, మీరు అసలు మనసే కాదు అని నేర్పించటం. ఈ రెండింటి మధ్యనున్న భేదాన్ని గమనించారా? మీ మనస్సును దృఢపరచుకోవటంకన్నా, మీరు మనస్సే కాదు అని అర్థం చేసుకోగలిగితే మనస్సు మాట వినదు అని మీరు బాధపడనవసరం లేదు. అలాగని మనస్సును దృఢపరచుకోవటాన్ని పూర్తిగా నిర్లక్ష్యమూ చేయదు వేదాంతం. దీన్నే జీవన్ముక్తి అంటుంది. దీన్ని అవాంతరఫలంగా పేర్కొంటుంది.

తమాషా ఏమిటంటే వేదాంతం దీన్ని అవాంతరఫలం అన్నాకూడా, చాలామంది

ఈ ఫలానికే మొగ్గు చూపుతారు. వారు కోరుకునేది మానసిక ప్రశాంతత, రాగద్వేషాలను పారద్రోలి దయ, ప్రేమ, శాంతి పెంపొందించుకోవాలనుకుంటారు. అందువల్ల వీటి గురించి కూడా వస్తుంది శాస్త్రంలో.

కాని ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, వేదాంతం నేర్చుకున్న విద్యార్థులందరికీ జీవన్ముక్తి ఫలం సమానంగా ఉండదు. ఈ జీవన్ముక్తిలో స్థాయీభేదాలు ఉన్నాయి. దానికి కారణం అధికారీ భేదం. సాధన చతుష్టయసంపత్తి ఈ అధికారిత్వాన్ని ఇస్తుంది. శిష్యులను మూడు తెగలుగా విభజించవచ్చు. వారు ఉత్తమ అధికారి, మధ్యమ అధికారి, మంద అధికారి.

**ఉత్తమ అధికారి** – ఉత్తమ అధికారికి వేదాంతశ్రవణంలోనే ఇటు జ్ఞానమూ, అటు జ్ఞానఫలమూ కలుగుతాయి. అతనికి నిదిధ్యాసనం అవసరం లేదు.

**మంద అధికారి** – మంద అధికారిలో సాధన చతుష్టయ సంపత్తి చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల అతను వేదాంతబోధనే సరిగ్గా అర్థం చేసుకోలేడు. జ్ఞానమే కలగనప్పుడు, జ్ఞానఫలం ఎక్కడ కలుగుతుంది? ఇతను కర్మయోగం, ఉపాసనయోగం చేయాలి. దానిలో భాగంగా వేదాంతశ్రవణం ఇంకా ఎక్కువ చేయాలి. అతను నిదిధ్యాసనం చేయలేడు. శ్రవణ, మననాలు విజయవంతంగా చేసినవారికి నిదిధ్యాసనం ఉపయోగ పడుతుంది.

**మధ్యమ అధికారి** – మధ్యమ అధికారికి కొంతమేరకు సాధన చతుష్టయ సంపత్తి ఉంటుంది. అందువల్ల అతను జ్ఞానం పొందుతాడు కాని కావల్సినంత అర్హత లేకపోవటంవల్ల జ్ఞానఫలమైన జీవన్ముక్తిని అనుభవించలేడు. శ్రవణ, మననాలు బాగానే చేసివుంటాడు. ఈ మధ్యమ అధికారికే నిదిధ్యాసనం అవసరం.

జీవన్ముక్తి అంటే భావోద్రేకాలను అదుపులో పెట్టుకోగలగటం. కొన్నింటిని గౌడపాదాచార్యులవారే పేర్కొంటారు.

ఎ) అభయమ్ – అభద్రతాభావననుంచి విముక్తి.

బి) దుఃఖక్షయః – దుఃఖంనుంచి విముక్తి. ఆ దుఃఖాన్ని పారద్రోలుతుంది జ్ఞానఫలం.

సి) అక్షయాశాంతిః – వినాశం లేని శాంతి కలుగుతుంది జ్ఞానఫలంగా.

జ్ఞానం, జ్ఞానఫలం రెండూ కూడా సాధన చతుష్టయ సంపత్తిమీద ఆధారపడతాయి. దానికి మనోనిగ్రహం పదం వేశారు గౌడపాదాచార్యులవారు. మనోనిగ్రహం అంటే శమం, శమం శమాది షట్కసంపత్తిలో ఒకటి, అది సాధన చతుష్టయ సంపత్తిలో ఒకటి. అందువల్ల మనోనిగ్రహం అంటే సాధన చతుష్టయ సంపత్తిని పొందాలి అని అర్థం. దానికి నిదిధ్యాసనం తోడ్పడుతుంది. ఇది మధ్యమ అధికారికి అవసరం అని చూశాము.

**నిదిధ్యాసనం నిర్వచనం** – జ్ఞాననిష్ఠలో నిలబడటం. పొందిన జ్ఞానాన్ని పదేపదే తలచుకుంటూ ఉండాలి; వీలున్నంత లోతుగా జీర్ణించుకోవాలి; వీలున్నంత ఎక్కువసేపు జ్ఞానంలో నిలబడాలి. జ్ఞానంలో నిలబడాలి అంటే వేదాంతజ్ఞానంలో నిలబడాలి; కర్మకాండ, ఉపాసన కాండల్లో నేర్చుకున్న అంశాలలో కాదు. జీవ–ఈశ్వర ఐక్యబోధక వాక్యంలో రమించాలి. ఆ జ్ఞానాన్ని ఉపనిషత్తులు, ప్రకరణగ్రంథాలు కూడా ఇస్తాయి. ఇలా జ్ఞానంలో నిలబడటాన్ని నిదిధ్యాసనం అంటారు. నిదిధ్యాసనం అనేక విధాలుగా చేయవచ్చు. అవి–

ఎ) **శ్రవణం** – పదేపదే శ్రవణం చేయవచ్చు. శ్రవణం చేసేటప్పుడు ఏకాగ్రచిత్తంతో వింటారు. మనస్సు శాస్త్రంమీద ఏకాగ్రత చూపుతుంది.

బి) **పఠనం** – గురువు చేసిన బోధనుంచి మీరు రాసుకున్న నోట్సును లేదా ఇటువంటి పుస్తకాలను పదేపదే పఠించవచ్చు.

సి) **రాత** – మీరు విన్నదాన్ని వివరంగా రాసుకుంటే కూడా మనస్సు బోధమీదే నిలబడుతుంది.

డి) **చర్చ** – తోటి సత్సంగసభ్యులతో మీరు నేర్చుకున్న అంశాలను చర్చించవచ్చు.

ఇ) **బోధ** – మీరు నేర్చుకున్న విద్యను మీరు మరో నలుగురికి నేర్పించవచ్చు.

**తత్ చింతనం తత్ కథనం అన్యోన్యమ్ తత్ ప్రబోధనం।**
**ఏతదేక పరత్వం చ బ్రహ్మాభ్యాసం విదుర్బుధాః॥**

నిదిధ్యాసనాన్ని బ్రహ్మాభ్యాసం అంటున్నది శాస్త్రం.

ఇవన్నీ కాక శాస్త్రం ఇంకొక నిదిధ్యాసన పద్ధతిని కూడా సూచిస్తుంది. దాన్ని సమాధి అభ్యాసరూప నిదిధ్యాసనం అంటారు. ఇంగ్లీషులో వేదాంతిక్ మెడిటేషన్ అంటారు. అష్టాంగయోగంలో చెప్పబడిన ఎనిమిది అంశాల్లో యమనియమాలను వదిలేసి, తక్కిన ఆరూ పాటించాలి. అవి ఆసనం, ప్రాణాయామం, ప్రత్యాహారం, ధారణ, ధ్యానం, సమాధి. నిదిధ్యాసనానికి, ధ్యానానికీ మధ్య సూక్ష్మభేదం ఉంది. ధ్యానంలో నిటారుగా కూర్చోవాలి. సుఖాసీనులై ఉండాలి. నిదిధ్యాసనం ఎలాగైనా చేయవచ్చు. ఎక్కడైనా చేయవచ్చు; సముద్రపుటొడ్డున నడుస్తూ కూడా చేయవచ్చు. ధ్యానం శరీర ప్రధానంగా ఉంటే, నిదిధ్యాసనం మనస్సు ప్రధానంగా ఉంటుంది.

నిదిధ్యాసనం వేదాంత శ్రవణ, మననాలు చేసి నిశ్చయజ్ఞానం పొందాక చేసే ధ్యానం. నిదిధ్యాసనంలో ఆలోచనలు ఉండాలి. మనస్సు శూన్యం చేయకూడదు. మనస్సు ఉండాలి. ఆలోచన ప్రవాహం ఉండాలి. వేదాంతబోధ గురించి ఆలోచన.

**ధ్యాన ప్రతిబంధకాలు, పరిహారం**

ఈ సమాధి అభ్యాసరూప నిదిధ్యాసనం చేసే సాధకుడు కొన్ని ఆటంకాలను ఎదుర్కొంటాడు. భగవద్గీతలో కూడా ధ్యానమార్గాలు, ధ్యానప్రతిబంధాకాల గురించి చూస్తాము. భగవద్గీతలో ధ్యానదశలను వివరంగా చూస్తే, ధ్యానప్రతిబంధకాలను మాండూక్యంలో చూస్తాము. ఈ రెండూ కలిపితే నిదిధ్యాసనంమీద పూర్తి అవగాహన ఏర్పడుతుంది కాబట్టి, ధ్యానదశలను కూడా వివరించటం జరిగింది.

మనను ధ్యానం చేయనివ్వకుండా అడ్డుపడే ఆటంకాలు నాలుగున్నాయి. అవి లయ, విక్షేపం, కషాయం, రసాస్వాదం.

1. **లయ** – లయ అంటే మనస్సు నిద్రాస్థితిలోకి వెళ్ళటం. ఇలా ధ్యానంలో కూర్చుంటామో లేదో అలా నిద్ర ముంచుకు వచ్చేస్తుంది అంటారు చాలామంది. అలా నిద్ర వచ్చినందుకు సిగ్గు పడతారు కూడా! కాని నిజానికి అది వారి ఒక్కరి సమస్యే కాదు, అందరిదీ. అందువల్లనే సామూహిక ధ్యానంలో లైట్లు ఆర్పేసి ధ్యానం చేయిస్తారు. మొదటి ఆటంకం తమః ప్రధానం.

2. **విక్షేపం** – ఇక్కడ మనస్సు నిద్రాస్థితిలో ఉండటం కాదు, మనస్సు ఇంకో విపరీత పరిస్థితిలో ఉంటుంది. అంటే చాలా చంచలంగా ఉండి, ప్రపంచమంతా తిరిగివస్తుంది. ఒక్కముక్కలో చెప్పాలంటే ఏ వేదాంతంకోసం ధ్యానంలో కూర్చున్నామో, ఆ విషయం తప్ప, అన్నింటి గురించీ ఆలోచిస్తుంది. రెండవ ఆటంకం రజోగుణప్రధానం.

3. **కషాయం** – మనస్సు ఒక విధంగా స్తబ్ధంగా అయిపోవటం. మనస్సు నిద్రాస్థితికీ జారుకోదు, చంచలంగానూ ఉండదు. అసలు ఏపనీ చేయదు. దాన్ని స్తబ్ధీభావం అంటారు విద్యారణ్యులవారు దృక్–దృశ్యవివేకంలో. ఏదైనా నమ్మలేని వార్తను వింటే మనస్సు పని చేయదు అంటే ఎలా స్పందించాలో తెలియక అలా స్తబ్ధంగా ఉండిపోతుంది.

ఇలాంటి సందర్భాలు ఎన్నో ఉంటాయి. అంటే తీవ్రమైన పరిస్థితుల్లో మనస్సు పనిచెయ్యదు. ఏ విధమైన ప్రతి స్పందనా చూపదు. విపరీతమైన ప్రమాదాల్లో, శరీరానికి నొప్పి తెలియదు. ఎందుకంటే మనస్సు పని చెయ్యటం ఆగిపోతుంది. ఇది శారీరకస్థాయిలోనే కాదు, భావోద్రేకస్థాయిలో కూడా జరుగుతుంది. విపరీత పరిస్థితుల్లో మనస్సు స్తబ్ధంగా అయిపోతుంది. శంకరులవారు దాన్ని **రాగద్వేషవీర్యం** అని నిర్వచిస్తారు.

అందువల్ల తీవ్ర రాగద్వేషాలు అవ్యక్తస్థితిలో ఉంటే దాన్ని కషాయం అంటారు. ధ్యానంలో మనస్సు ఆ స్థితిలోకి వెళ్ళే ప్రమాదం ఉంది.

4. **రసాస్వాదం** – ఒక్కోసారి ధ్యానం ఒక విధమైన విశ్రాంతిని ఇస్తుంది; ఒక ఆహ్లాదభావన కలుగుతుంది. ఎందుకంటే మనస్సు, బుద్ధి, శరీరం విశ్రాంతి పొందుతాయి. కాబట్టి ఆనందం, హాయి, సుఖం కలుగుతాయి. వాటిని రసం అంటారు. ఈ ఆనందం ఆత్మానందం లేదా బ్రహ్మానందం కాదు. ఎందుకంటే ఈ ఆనందం శాశ్వతానందం కాదు. కేవలం ధ్యానంలోనే కలుగుతుంది. ధ్యానంనుంచి బయటకు రాగానే ఆ ఆనందం మటుమాయమవుతుంది.

ఈ రసాస్వాదం మంచిదే అయినా కూడా దీనితో మురిసిపోకూడదు. ఎందుకంటే ఆ ఆనందంతో మురిసిపోతే, వేదాంతాన్ని జీర్ణించుకోవటానికి అది ప్రతిబంధకం అవుతుంది.

వేదాంతధ్యానం లేదా నిదిధ్యాసనం ఈ ఆనందాన్ని అనుభవించేటందుకు చేసేది కాదు, పూర్ణత్వాన్ని అనుభవించేటందుకు. అది కూడా సర్వకాలసర్వావస్థల్లోనూ అనుభవించేటందుకు. ధ్యానంలోనే ఆనందం పొందితే, అది నిత్యానందం కాదు. జ్ఞాని ఆనందం నిత్యానందం.

**పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్** –గీత 5.8

ఏం చూస్తున్నా, ఏం వింటున్నా, ఏం ముట్టుకున్నా, ఏది వాసన చూసినా జ్ఞాని ఆనందిస్తాడు. అందువల్ల ధ్యానంలో కలిగే రసాస్వాదం కూడా ఆటంకమే. ఆ విధంగా ధ్యానంలో కలిగే నాలుగు ఆటంకాలు – **లయ, విక్షేపం, కషాయం, రసాస్వాదన.** వీటిని తొలగించుకునేందుకు మార్గాలను చూద్దాము.

**ధ్యానప్రతిబంధకాల పరిహారాలు.**

1. **లయ పరిష్కారం** – నిద్రాస్థితిని రెండు రకాలుగా ఎదుర్కోవచ్చు. నిద్ర కలిగే కారణాన్ని తొలగించటంద్వారా, అభ్యాసంద్వారా.

ధ్యానంలో నిద్ర ఎందుకు వస్తుంది? శాస్త్రమే ప్రతి ఒక్క విషయమూ కూలంకషంగా చర్చిస్తుంది. మనం దాన్ని చదివి అర్థం చేసుకుంటే చాలు. అవి – బహు అశనం, అజీర్ణం. అంటే అతిగా తినటం, అజీర్ణం చెయ్యటం. అతిగా తిని ధ్యానంలో కూర్చుంటే, రక్తప్రసరణ అంతా దానికే వెళ్ళిపోతుంది. అజీర్ణం చేస్తే కడుపు మందంగా ఉంటుంది; కడుపు మందంగా ఉంటే బుద్ధి మందంగా ఉంటుంది.

నిద్రాశేషం ఇంకో కారణం. శరీరానికి కొంత శాతం నిద్ర అవసరం. మీరు అతి ఉత్సాహంతో అర్ధరాత్రి రెండు గంటలకు లేచి ఆరింటిదాకా ధ్యానం చేస్తే, మీ మనస్సుకు, శరీరానికి కావాల్సిన విశ్రాంతిని భంగ పరిచిన వారవుతారు. అప్పుడవి, 'ఆగు, మాకూ సమయం వస్తుంది, నువ్వు గీతాబోధలో కూర్చున్నప్పుడు నీ పని పడతాము,' అంటాయి. అందుకని వాటికి తగిన విశ్రాంతిని ఇవ్వాలి. నిద్రాశేషం, అతిగా తినటం, అజీర్ణం – ఇవి కారణాలు.

మామూలుగా మనం ఎప్పుడు నిశ్శబ్దంగా కూర్చుంటాం? పనులన్నీ మానేసి, ఇంద్రియాలను ఉపయోగించకుండా, నిశ్శబ్దంగా ఉండేది ఎప్పుడు? నిద్రపోయే ముందు. కళ్ళు మూసుకుని, పనులు మానుకు కూర్చుంటే, పాపం మనస్సు 'ఓహో నిద్ర పోవాలి కాబోలు, ఇప్పుడు కూర్చునే నిద్రపోతాడు కాబోలు,' అనుకుంటుంది. అందువల్ల మనస్సుకు శిక్షణ ఇచ్చుకోవాలి. 'ఓ మనసా, నేను నిద్ర పోబోవటం లేదు, ధ్యానం చెయ్యబోతున్నాను,' అని చెప్పుకోవాలి. అభ్యాసం ద్వారా మనస్సు నేర్చుకుంటుంది. ఈ విధంగా నిద్ర సమస్యను పారద్రోలవచ్చు.

2. **విక్షేపపరిష్కారం –** చంచలమైన మనస్సును ఎలా అదుపులో పెట్టాలి? అభ్యాసం, వైరాగ్యాల ద్వారా దాన్ని అదుపులో పెట్టాలి. కృష్ణపరమాత్మ కూడా వీటి గురించి వివరంగా చెబుతాడు.

వైరాగ్యాన్ని పెంచుకోవటమెలా? మీరు పెంచుకునే రాగమే మీ దుఃఖహేతువు అని మీరు పదేపదే మనస్సుకు చెప్పుకోవాలని అంటున్నారు గౌడపాదాచార్యులవారు. రాగం శోకానికి దారితీస్తుంది. అందువల్ల రాగం లేకుండా చేసుకోవటమే వైరాగ్యం.

వైరాగ్యంలో జగత్తు దుఃఖహేతువు అని అర్థం చేసుకుంటే, అభ్యాసంలో జగత్తు అనాత్మ అని పదేపదే తలచుకోవాలి. అనాత్మ మిథ్య. మిథ్యావస్తువు మీకు ఆనందాన్ని ఇవ్వలేదు అని గ్రహించాలి. జగత్తు నామరూపాలు మాత్రమే. అది ఎండమావి వంటిది. వైరాగ్యం, అభ్యాసం విక్షేపపరిహారాలు.

3. **కషాయపరిష్కారం –** అనేక కారణాలవల్ల మనస్సులో అనేక భావాలను అణగద్రొక్కి ఉంచుతాము. అవి కోపం, బాధ, దుఃఖం, అపరాధభావన, ఈర్ష్య, ఏదైనా కావచ్చు. అవి మనస్సు విప్పి చెప్పుకోలేనివి. అవి మనస్సును స్తబ్ధంగా చెయ్యవచ్చు. అందువల్ల ధ్యానంలో కూర్చుంటే, వీటివల్ల మనస్సు స్తబ్ధంగా అవవచ్చు. కాని ఏ కారణంవల్ల మనస్సు అలా అయిందో తెలియదు, దానికి ఒకటే మార్గం! నిశ్శబ్దంగా కూర్చుంటే, అణగద్రొక్కబడిన భావోద్రేకం నెమ్మదిగా పైకి వస్తుంది.

సాధారణంగా గృహస్థాశ్రమంలో ప్రస్తుత సమస్యలే ఎన్నో ఉండటంవల్ల గతంలోని సమస్యల గురించి ఆలోచించే తీరిక ఉండదు. అందువల్ల ప్రశాంతంగా ఏ ఆశ్రమానికో వెళ్ళి కూర్చుంటే, గతంలోని కొన్ని సంఘటనలు పైకి వచ్చే అవకాశం ఉంది. అప్పుడు వాటిని పారద్రోలకూడదు. ఏడవాలనిపిస్తే మనస్ఫూర్తిగా ఏడవండి. అందువల్లనే చాలామంది భగవంతుని ముందు భోరున ఏడుస్తారు, లేదా ఎవరైనా స్వామీజీ దగ్గరకు వెళ్ళినప్పుడు ఏడుస్తారు. అది కూడా మామూలుగా కాదు, వెక్కివెక్కి ఏడుస్తారు.

అందువల్ల కషాయ విజాతీయ అంటారు గౌడపాదుల వారు. ఏవైనా అణగద్రొక్కబడిన భావాలు ఉంటే, వాటిని బయటకు రానివ్వండి. ఎవరిమీదైనా అరవాలని ఉంటే, ఏ సముద్రపుటొడ్డుకో వెళ్ళి గొంతు చించుకుని అరవండి, ఏడవాలని ఉంటే మనస్ఫూర్తిగా ఏడవండి. ఏం చెయ్యాలనిపిస్తే అది చెయ్యండి. దాన్ని అణగ ద్రొక్కకండి. మొదట్లో కొన్ని రోజులు ధ్యానంలో ఏడుపు, కోపం, ఈర్ష్యల ప్రదర్శనలు ఉండవచ్చు. అవి చెయ్యండి.

4. **రసాస్వాదపరిష్కారం** – రసాస్వాదాన్ని వివేకంతో పరిష్కరించుకోవాలి. 'ధ్యానంలో నేను అనుభవించే ఈ ఆనందం తాత్కాలిక ఆనందం, దీనికి నేను బానిసను కాకూడదు; పైగా నా స్వరూపం పూర్ణత్వం, నేను ధ్యానంలోనే కాదు, ఎప్పుడూ పూర్ణుడను; నేను అసంగుడిని. ధ్యానంలోనే కాదు, ఎప్పుడూ అసంగుడినే.' ఇలా వివేకంతో బుద్ధికి నచ్చచెప్పుకోవాలి.

5) **ఉపసంహారం – కారిక 48**

ఈ కారికతో ఈ అధ్యాయాన్ని ముగించబోతున్నారు గౌడపాదాచార్యులవారు. అందువల్ల ముగించే ముందు ఏడవ మంత్రంలోని బోధను ఒకసారి గుర్తు తెస్తున్నారు. ఈ అధ్యాయానికి పేరు అద్వైతప్రకరణం అని వచ్చింది ఆ మంత్రంలోని పదంనుంచే. అద్వైతం అంటే కార్యకారణ విలక్షణం. బ్రహ్మ కార్యమూ కాదు, కారణమూ కాదు, బ్రహ్మ కారణం కాదు అని చూపించాలంటే, బ్రహ్మనుంచి ఏమీ పుట్టలేదని నిరూపించాలి. అది ఈ కారికలో మళ్ళీ చూపిస్తున్నారు.

**కశ్చిత్ జీవః న జాయతే** – ఏ జీవుడు కూడా పుట్టలేదు, జగత్తు కూడా పుట్టలేదని మనం కలుపుకోవాలి. జీవుడు, జగత్తు పుట్టలేదని శ్రుతి, యుక్తి ప్రమాణాలద్వారా ఖండించిన కారికలను ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి. 3–30 కారికల్లో ఖండించినదాన్ని సగం పాదంలో మళ్ళీ గుర్తు చేస్తున్నారు గౌడపాదాచార్యులవారు.

**న కశ్చిజ్జాయతే జీవః (జగతః)** – కార్యం అసలు లేదు. ఎందుకు కార్యం లేదు?

**అస్య సంభవః న విద్యతే** – జీవుడు ఎందుకు పుట్టలేదంటే, జీవుడనే కార్యం రావటానికి అక్కడ కారణం లేదు. సంభవః అంటే కారణం. బ్రహ్మ కారణం కాదు. ఎందుకంటే బ్రహ్మ కార్యకారణవిలక్షణం.

**ఏతత్తదుత్తమం సత్యం** – ఉన్నదొకటే ఉత్తమమైన సత్యం, అదే పారమార్థిక సత్యం. అది స్వప్నప్రపంచమైన ప్రాతిభాసిక సత్యంకన్నా, జాగ్రత్ ప్రపంచమైన వ్యావహారిక సత్యంకన్నా ఉన్నతమైనది. అందువల్ల ఉత్తమం సత్యం.

**యత్ర** – ఈ పారమార్థిక సత్యంనుంచి,

**కించిన్న జాయతే** – ఏ కార్యమూ రాలేదు. అంటే కార్యపాదాలయిన ఒకటి, రెండూ లేవు. కారణ పాదమయిన మూడు కూడా లేదు.

తక్కిన మూడు పాదాలూ మిథ్య. తురీయం మాత్రమే సత్యం. తురీయం అంటే ఏమిటి? దిక్కులు చూడకండి. మీరే ఆ తురీయం!

## అధ్యాయం 3 అద్వైత ప్రకరణం – ముఖ్యాంశాలు

### అద్వైతానికి తొమ్మిది మెట్లు

1. **ఉపోద్ఘాతం – కారికలు: 1, 2**

**ప్రపంచోపశమమ్** పద వివరణ – అధ్యాయం 2

ప్రపంచం అంటే కార్యకారణాత్మక ప్రపంచం – అది మిథ్య

**అద్వైతమ్** పదవివరణ – అధ్యాయం 3

అద్వైతం అంటే కార్యకారణవిలక్షణతురీయం – అది సత్యం

కార్యం, కారణం కూడా ద్వైతం – ఇందులో ఉండే వ్యక్తి కృపణుడు

కర్మ, ఉపాసనలు కూడా ద్వైతం – అందువల్ల సంసారము.

తురీయం కార్యకారణవిలక్షణమైనా ఇక్కడ కారణం కాదు అని చూపించారు.

దీన్ని అజాతివాదః అంటారు. అకార్పణ్యం వక్ష్యామి అంటారు గౌడపాదాచార్యులవారు.

2. **యుక్త్యా జీవసృష్టి నిషేధః – కారికలు: 3-9**

ఉదా. ఆకాశదృష్టాంతం

ఉత్పత్తి, నాశనం, దోషం, విశేషం, సంబంధం – ఈ లక్షణాలు కుండకు చెందుతాయి తప్ప కుండలోని ఆకాశానికి (ఘటాకాశానికి) చెందవు. అలాగే ఈ లక్షణాలు మనశ్శరీరాలకు చెందుతాయి తప్ప తురీయానికి కాదు.

**ఆకాశదృష్టాంతేన జీవసృష్టి నిషేధః**

3. **యుక్త్యా జగత్సృష్టి నిషేధః – కారిక: 10, 27-30**

ఉదా. స్వప్నదృష్టాంతం.

స్వప్నంలో ఉన్నంతవరకూ ఒక స్వాప్నికునికి తన స్వప్నం ఒక స్వప్నం అని తెలియదు. అలాగే జాగ్రత్ ప్రపంచాన్ని అనుభవిస్తాము, అందులో వ్యవహారం నడుపుతాము, అది ప్రయోజనకరంగా ఉంటుంది కాని తురీయానికి లేస్తే, అది సత్యం కాదు.

జాగ్రత్ప్రపంచం సత్యం అని నిరూపించలేవు.

**స్వప్నదృష్టాంతేన జగత్ సృష్టి నిషేధః**

యుక్తిపరంగా – బ్రహ్మ కార్యం కారణత్వాత్ మాతృవత్

బ్రహ్మ నిజంగా కారణం అయితే, బ్రహ్మ కార్యం కూడా అవాలి; బ్రహ్మ మహాసంసారి అవాలి.

4. **శ్రుత్యా జీవసృష్టి నిషేధః – కారికలు: 11-14**

శ్రుతిలోని మహావాక్యాలు – తత్త్వమసి, అహం బ్రహ్మ అస్మి, అయమాత్మా బ్రహ్మ, ప్రజ్ఞానం బ్రహ్మ.

జీవాత్మ = పరమాత్మ; పరమాత్మకు పుట్టుక లేదు కాబట్టి జీవాత్మకు కూడా పుట్టుక లేదు.

**శ్రుతి ప్రమాణాలు**

ఎ) ఆనంద ఆత్మా బ్రహ్మపుచ్ఛం ప్రతిష్ఠా – తైత్తిరీయమ్

బి) అయమేవ సః యోఽయమాత్మా, ఇదమ్ అమృతమ్, ఇదం బ్రహ్మ, ఇదగ్ం సర్వమ్॥ – బృహదారణ్యకమ్

సి) తత్ర కో మోహః కశ్శోక ఏకత్వమనుపశ్యతః – ఈశావాస్యమ్

శ్రుతి ఐక్యవాక్యాలనే స్తుతిస్తుంది, ద్వైతాన్ని విమర్శిస్తుంది.

**మృత్యోస్స మృత్యుమాప్నోతి య ఇహ నానేవ పశ్యతి** – కఠ 2.1.10
ద్వైతంతో మొదలుపెట్టి అద్వైతానికి రావాలి.

5. **శ్రుత్యా జగత్సృష్టి నిషేధః – కారికలు: 15, 16, 23-26**

బ్రహ్మ కారణం కాదని చెప్పటానికి అనేక శ్రుతివాక్యాలు.

శ్రుతిలో సృష్టిప్రక్రియ ఉన్నది అధ్యారోప అపవాదన్యాయంకోసం. శ్రుతి ప్రత్యక్షంగా ద్వైతమో, అద్వైతమో చెప్పదు.

**అధ్యారోప అపవాదన్యాయం**

1. జగత్తు ఉత్పత్తి చెందింది. అది కార్యం – కార్యాన్ని పరిచయం చేస్తాము.

2. ప్రతి కార్యానికీ ఒక కారణం ఉంటుంది. జగత్తుకు కారణం బ్రహ్మ – కారణాన్ని పరిచయం చేస్తాము. **ఇది అధ్యారోపం**

3. బ్రహ్మ లేకుండా జగత్తుకు విడిగా ఉనికి లేదు – కార్యాన్ని నిషేధిస్తాము.

4. జగత్తు అనే కార్యాన్ని నిషేధిస్తే బ్రహ్మకు కారణత్వ హోదా లేదు – కారణత్వాన్ని నిషేధిస్తాము (కారణం లేదు అనకూడదు).

చివరికి మిగిలింది కార్యకారణ విలక్షణ బ్రహ్మ. **ఇది అపవాదం.**

శ్రుత్యర్థాపత్తి ప్రమాణంద్వారా శ్రుతిసారం అద్వైతం అని అర్థం చేసుకోవాలి.

మిథ్యాసృష్టి అస్తి = సత్యసృష్టిః నాస్తి

ఎ) నేహ నానాస్తి కించన మృత్యోస్స మృత్యుం గచ్ఛతి – కఠ

బి) ఇంద్రో మాయాభిః పురురూప ఈయతే యుక్తా హి
అస్య హరయః శతా దశ ఇతి। – బృహదారణ్యకమ్

సి) అజాయమానో బహుధా విజాయతే। – పురుషసూక్తమ్

డి) అంధంతమః ప్రవిశంతి యేఽసంభూతిముపాసతే । – ఈశావాస్యమ్

ఇ) జాత ఏవ న జాయతే కో న్వేనం జనయేత్పునః। – బృహదారణ్యకమ్

ఎఫ్) స ఏష నేతి నేత్యాత్మాఽగృహ్యో న హి గృహ్యతేఽశీర్యో న హి శీర్యతేఽసంగో
న హి సజ్యతేఽసితో న వ్యథతే న రిష్యతి – బృహదారణ్యకమ్

ఈ వాక్యాల ద్వారా సృష్టి నిజంగా జరగలేదు అని తెలుస్తుంది.

అంటే జగత్ కార్యం కాదు; కార్యం లేకపోతే కారణం హోదా ఉండదు. అందువల్ల తురీయం కార్యకారణ విలక్షణం.

**6. సృష్టి గురించి శ్రుతి తాత్పర్యం 17-22**

ద్వైతభావనలో ఉంటే రెండు సమస్యలు.

ఎ) **మనస్సు పరంగా** – యత్ర యత్ర ద్వైతః తత్రతత్రః భయం, రాగః, ద్వేషః సంతి॥

బి) **బుద్ధిపరంగా** – కథం భావః మర్త్యతామ్ ఏష్యతి?

అనంతం బ్రహ్మ నిర్వికార బ్రహ్మ. కాని కారణం అయితే సవికారం అవాలి. అది ఎలా కుదురుతుంది?

అజాతస్య భావస్య జాతిమ్ – పుట్టుక లేని బ్రహ్మ పుట్టాడు అన్నట్టు ఉంది. దీని ద్వారా మూడు విషయాలు గ్రహించాలి.

1. మోక్షం అంటే ద్వైతంనుంచి ద్వైతానికి ప్రయాణం కాదు.
2. మోక్షం అంటే ద్వైతంనుంచి అద్వైతానికి ప్రయాణం.
3. ద్వైతంనుంచి అద్వైతానికి ప్రయాణం శారీరకంగా కాదు, మానసికంగా.

7. **అమనీభావః / మనోనాశః – 31-39**

ఎ) **దశ 1 – ద్వైతదర్శనం** – యత్ర యత్ర ద్వైతదర్శనం, తత్ర తత్ర సంసారః

బి) **దశ 2 – మనసే కారణం** – యత్ర యత్ర మనః తత్ర తత్ర ద్వైతదర్శనమ్

మనః ఏవ మనుష్యాణం కారణం బంధమోక్షయోః

పరిష్కారం – అమనీభావః = మనోనాశః

మనోనాశే సతి ద్వైతం నైవ ఉపలభ్యతే

**రెండు పద్ధతులు – సత్య అద్వైత జ్ఞానేన –**

1. **ద్వైతమిథ్యాత్వ నిశ్చయః –** మనస్సును (బుద్ధిని) ఉపయోగించి, జ్ఞానం ద్వారా ఎదురుగా కనబడే జగత్తు మిథ్య, బ్రహ్మ మాత్రమే సత్యం అని అర్థం చేసుకోవటం.

2. **మనోమిథ్యాత్వనిశ్చయః –** అనాత్మ ప్రపంచంలోకి జగత్తు, శరీరం, మనస్సు కూడా వస్తాయి కాబట్టి మనస్సు కూడా మిథ్య అని అర్థం చేసుకోవటం.

ఆత్మజ్ఞానానికి పేర్లు – ఆత్మసత్యానుబోధః, అస్పర్శయోగః

ఆత్మజ్ఞానం – మూడు శరీరాలు కాదు, నామరూపాలు కాదు, ఇంద్రియాలు కాదు, మనస్సు కాదు, వ్యవహారం లేదు,

**తురీయం – సుప్రశాంతః, సకృజ్జ్యోతిః, సమాధిః, అచలః, అభయః.**

8. **మనోనిగ్రహః / నిదిధ్యాసనం – 40-47**

ఆత్మజ్ఞానం పొందితే ఫలం అమనీభావః అంటే జీవన్ముక్తి

అభయే భయదర్శినః

కాని భయపడుతున్నారు. ఎందుకు? అధికారభేదంవల్ల.

జీవన్ముక్తి ఫలం పొందాలంటే సాధన చతుష్టయ సంపత్తి ఉండాలి.

ఉత్తమ అధికారి జ్ఞానమూ, జ్ఞానఫలమూ పొందుతాడు.
మంద అధికారి జ్ఞానం పొందలేదు, అందువల్ల జ్ఞానఫలమూ పొందలేదు.
మధ్యమ అధికారి జ్ఞానం పొందుతాడు, జ్ఞానఫలం పొందలేదు.

అది పొందటానికి మనోనిగ్రహం ఉండాలి (సాధన చతుష్టయ సంపత్తి ఉండాలి).

మనోనిగ్రహం పొందాలంటే నిదిధ్యాసన చెయ్యాలి.

ఒక రకం నిదిధ్యాసనం – సమాధి అభ్యాసరూప నిదిధ్యాసనం

దానికి కలిగే నాలుగు ఆటంకాలు – నాలుగు పరిహారాలు.

| **ధ్యాన ప్రతిబంధకాలు –** | **పరిహారాలు** |
| --- | --- |
| ఎ) లయ (నిద్ర) | – నిద్రవచ్చే పరిస్థితులను పారద్రోలటం |
| బి) విక్షేపం (చంచల మనస్సు) | – వైరాగ్యం – సర్వమూ దుఃఖమే<br>అభ్యాసం – ఉన్నదంతా బ్రహ్మే |
| సి) కషాయం (స్తబ్ధీభావన) | – సాక్షిగా చూడటం |
| డి) రసాస్వాదం (ఆనంద అనుభవం) | – దాన్ని ప్రతిబింబ ఆనందంగా తెలుసుకోవటం. |

ఆత్మాకారవృత్తివ్యతిరిక్త వృత్తిరహితం అవాలి.

అప్పుడు బ్రహ్మనిష్ఠలో నిలబడతాడు.

9. **ఉపసంహారం – కారిక 48**

తురీయం → అద్వైతం → కార్యకారణ విలక్షణం

జీవుడు, జగత్తు తురీయంనుంచి పుట్టలేదు.

**ఏతత్తదుత్తమం సత్యం యత్ర కించిత్ న జాయతే**

చతుర్థపాద (తురీయం) ఏవ పారమార్థిక సత్యః

ఆ సత్యతురీయం ఏది? దిక్కులు చూడకండి. అది మీరే.

# ఏకాదశ ఉపనిషత్తుల సారం

## మాండూక్యోపనిషత్ - ప్రకరణం 4

## అలాతశాంతి ప్రకరణం

మాండూక్య కారికలతో కూడిన అధ్యాయాల్లో, నాలుగవ అధ్యాయం చాలా పెద్దది. ఇందులో 100 కారికలు ఉన్నాయి.

ఇంతవరకూ చూసిన అధ్యాయాల్లో కాని, తక్కిన ఉపనిషత్తుల్లో కాని, పదేపదే చెబుతూ వచ్చిన విషయం ఒకటే -

**జ్ఞానాత్ ఏవ తు కైవల్యమ్।।**

జ్ఞానంవల్లనే మోక్షం కలుగుతుంది. సహజంగానే అందరికీ జ్ఞానం పొంది, మోక్షం పొందాలని ఉంటుంది. కాని ఆత్మజ్ఞానం ఎలా పొందాలనే విషయంలోనే భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కొంతమంది ఆత్మజ్ఞానం అంటే క్షణంలో మెరుపులా మెరిసే అసాధారణ అనుభవం అనుకుంటారు. ఆ అనుభవం వారికి మోక్షాన్నిస్తుందని భావిస్తారు. అందువల్ల అటువంటి అసాధారణ అనుభవంకోసం ఎదురుచూపులు చూస్తారు.

అంతేకాదు, ఈ అసాధారణ అనుభవం కూడా ఏదో ఒక పద్ధతిలో పొందవచ్చు అనుకుంటారు. అంటే వారికి పద్ధతి ముఖ్యం కాదు, అనుభవమే ముఖ్యం. ఎప్పుడైతే ఇలా అసాధారణ అనుభవం పొందాలని నిర్ణయించుకుంటారో, అప్పుడే ఏదో ఒక విధంగా ఆ అనుభవం పొందటానికి ప్రయత్నిస్తారు. ఇటువంటి పంథాలో సాగేవారికి, శాస్త్ర అధ్యయనం పెద్దగా ప్రాధాన్యత వహించదు. వారు అసలు శాస్త్ర అధ్యయనం చేయనవసరం లేదనో, లేదా అది అధ్యయనం చేయాలా, వద్దా అనేది పూర్తిగా మీ ఇష్టం అనో అంటారు. ఇది ఒక బలమైన, శక్తివంతమైన వాదన.

అతీంద్రియ అనుభవం మోక్షాన్నిస్తుందంటారు కాబట్టి, వీరు ఇంకొక అడుగు ముందుకు వేస్తారు. **జ్ఞానం** అనే పదాన్ని కూడా వారు ఇష్టపడరు. **జ్ఞానం** పదం, ఇంత గొప్ప విషయానికి ఒక సాదాసీదా పదం అనేస్తారు వారు. అందువల్ల వారు ఆత్మజ్ఞానం పదాన్ని వాడకుండా, అతీంద్రియ శక్తి అనో, జ్ఞానోదయం అనో అంటారు.

ఈ వాదనలను మనం ససేమిరా అంగీకరించము. ఆత్మజ్ఞానం మెరుపులా మెరిసే జ్ఞానోదయం కాదనీ, అతీంద్రియశక్తి అసలే కాదనీ, అది సిద్ధులవల్ల పొందేది కాదని పదేపదే చెబుతాము. ఆత్మజ్ఞానం అంటే బుద్ధిలో జరిగే మార్పు. బుద్ధిలో మార్పు కలగాలంటే,

ఒక క్రమపద్ధతిలో, శాస్త్రవిచారణద్వారా జరగాలి. అందువల్ల దీనికి **ఆత్మజ్ఞానం** పదమే సరియైన పదం. అతీంద్రియశక్తి, జ్ఞానోదయం పదాలు సరిపోవు.

ఆత్మజ్ఞానం బుద్ధిలో జరిగే మార్పు అనగానే, వారు ఎదురు ప్రశ్నిస్తారు. మనస్సు చేరుకోలేదు, వాక్కు చేరుకోలేదని మీరే అంటారు కదా, అలాంటప్పుడు బుద్ధి ఎలా అర్థం చేసుకుంటుంది అంటారు వారు. దానికి మన జవాబు – మనస్సు అర్థం చేసుకోలేదు అంటే మనస్సు స్వంతంగా అర్థం చేసుకోలేదు; కాని శాస్త్ర అధ్యయనం చేసిన బుద్ధి, అది కూడా గురువు సహాయంతో మాత్రమే శాస్త్రాన్ని అధ్యయనం చేసిన బుద్ధి అర్థం చేసుకోగలదు.

**శాస్త్ర ఆచా ర్యైః సంస్కృతమ్ అంతఃకరణమ్ ఆత్మజ్ఞానకారణమ్**

శాస్త్రాన్ని, గురువు ద్వారా నేర్చుకున్న బుద్ధి మాత్రమే ఆత్మజ్ఞానాన్ని పొందగలదని శంకరాచార్యులవారు భగవద్గీత భాష్యంలో రాస్తారు. అలాగని అది శంకరాచార్యులవారి స్వంతభావన కాదు. దానికి శాస్త్రప్రమాణమే ఉంది,

**దృశ్యతే తు అగ్రయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః** – కఠ

సూక్ష్మమైన మనస్సు ద్వారానే ఆత్మజ్ఞానం పొందగలము. మనస్సును ఎలా సూక్ష్మం చేసుకోగలము? గురువుద్వారా శాస్త్రాన్ని అధ్యయనం చేస్తే చేసుకోగలము. శాస్త్ర అధ్యయనం చేస్తే నా స్వస్వరూపమేమిటో అర్థమవుతుంది. ఈ నా స్వస్వరూపజ్ఞానమే నాకు సంసారంనుంచి మోక్షం కలిగిస్తుంది.

ఎప్పుడైతే ఈ జ్ఞానం బుద్ధికి సంబంధించిన జ్ఞానం అన్నామో, అప్పుడే అది చాలా తర్కం, విచారణలతో కూడివుంటుంది. ఎక్కడైతే తర్కం, విచారణ ఉంటాయో, అక్కడే అనేక సందేహాలకు ఆస్కారం ఉంటుంది. అనుభవంతో కూడిన జ్ఞానం విషయంలో బుద్ధికి చోటులేదు, శాస్త్రానికి చోటులేదు, ఎలాగో జరిగిపోతుంది. కాని, అలా ఎలాగో జరిగిపోవటాన్ని శాస్త్రం ఒప్పుకోదు. మనకి చక్కని రాజమార్గం ఉంది. అది శాస్త్ర శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయటం; అది కూడా గురువు ద్వారా.

**అథాతో బ్రహ్మజిజ్ఞాసా** – బ్రహ్మసూత్రాలు 1

బ్రహ్మజ్ఞానం పొందటానికి శ్రవణ, మనన, నిదిధ్యాసనలనే చక్కటి పద్ధతి ఉంది. దాని ద్వారా సంశయరహిత జ్ఞానాన్ని పొందుతాము. ఈ పద్ధతిలో బుద్ధిని ఉపయోగించాలి, శాస్త్రాన్ని అధ్యయనం చేయాలి; తర్కాన్ని వాడాలి. తర్కం వాడితే సందేహాలు రావచ్చని చూశాము. వేదాంతం సందేహాలను స్వీకరిస్తుంది. ఆత్మజ్ఞానం పొందే సమయంలో అనేక సందేహాలు కలుగుతాయి. వాటన్నింటినీ తీర్చుకుంటూ వస్తుంది శాస్త్రం.

జ్ఞానంవల్ల మాత్రమే మోక్షం వస్తుంది అంటే కర్మ, భక్తి, ధ్యానంవల్ల మోక్షం రాదని అర్థం. వెంటనే మీ బుద్ధి ప్రశ్నిస్తుంది. కేవలం భక్తివల్లనే మోక్షం పొందిన మీరాబాయి సంగతి ఏమిటి అంటారు మీరు.

అలాగే, గురువు ద్వారానే జ్ఞానం పొందాలి అంటే రమణమహర్షి ఎలా పొందారు అంటారు మీరు. ఇలా సందేహాలతో కూడిన జ్ఞానం పదికాలాలు నిలువదు. సందేహాత్మక జ్ఞానం అజ్ఞానంతో సమానం. ఎందుకంటే, ఏ కాస్త అవకాశం వచ్చినా, ఈ జ్ఞానం వీగిపోతుంది. బలంగా నిలబడదు. మీ బుద్ధే మిమ్మల్ని నిలదీయవచ్చు లేదా ఇతరుల వాదన మిమ్మల్ని కుదిపివేయవచ్చు. అందువల్ల బుద్ధిని బలవంతంగా అణగద్రొక్కితే జ్ఞానం పొందలేరు.

భగవంతునిమీద భక్తి వెనుక భగవంతుని గురించిన సరియైన జ్ఞానం లేకపోతే, వీగిపోతుంది. ఎంతో ప్రగాఢమైన భక్తి ఉన్నవారు కూడా, వారికి జీవితంలో ఏదైనా గట్టి ఎదురుదెబ్బ తగిలితే, కృశించిపోతారు. వారికే కాదు, వారి చుట్టూ ఉన్నవారిలో ఎవరైనా మంచివారికి తీరని అన్యాయం జరిగినా, దాన్ని తట్టుకోలేరు. భగవంతునిమీద భక్తిని ద్వేషంగా మార్చుకుంటారు. 'ఉన్నాడా, భగవంతుడు అసలు ఉన్నాడా? ఉంటే ఈ అన్యాయాన్ని ఎలా సహిస్తూ ఊరుకున్నాడు?' అని నిలదీస్తారు. భగవంతుని గురించిన సరియైన జ్ఞానం లేకపోతే ఇలా జరిగే ప్రమాదం ఉంది.

అలాగే ఆత్మజ్ఞానం కూడ మూఢజ్ఞానం కాదు. అది గుడ్డిగా నమ్మేది కాదు. అహం బ్రహ్మ అస్మి అనే జ్ఞానం అనేక ప్రక్రియల ద్వారా, ఒక క్రమపద్ధతిలో, అనేక ఉదాహరణలతో పొందే జ్ఞానం. అది లోతైన, స్పష్టమైన జ్ఞానం. ఆ లోతైన జ్ఞానం ఏర్పడితే ఎటునుంచి ఎవరేం ప్రశ్నించినా, ఈ జ్ఞానం వీగిపోదు. అలా చెక్కుచెదరకుండా, జ్ఞానం నిలబడటానికి తోడ్పడే పద్ధతిని **మననం** అంటారు.

మననం అంటే మీరు పొందిన జ్ఞానంతో, తక్కిన దార్శనికుల వాదనలను ఎదుర్కొని నిలబడటం. వారు మీరు వేదాంతంలో నేర్చుకున్న అనేక అంశాలకు భిన్నాభిప్రాయాలను వెలిబుచ్చుతారు. మీ జ్ఞానం నిస్సంశయజ్ఞానం అయితే, ఆ వాదనల తాకిడికి వీగిపోకుండా, స్థిరంగా నిలచివుంటుంది. ఈ పద్ధతిని **స్థూణ నిఖనన న్యాయం** అంటారు.

మీరు బట్టలు ఆరేయాలంటే రెండు గోడలకు మేకులు కొట్టి, వాటికి తాడు కడతారు. అవునా? కాని ఆ తాడు కట్టేముందు ఆ మేకులు గట్టిగా ఉన్నాయో లేదో పరీక్షించి

చూసుకుంటారు. గట్టిగా లేకపోతే, ఆ బట్టల బరువుకు తాడు కూడా పడిపోతుంది. అందువల్ల మేకులు గట్టిగా లేకపోతే, మళ్ళీ ఇంకో రెండు సుత్తిదెబ్బలు వేస్తారు. ఎంతవరకూ వేస్తారంటే, ఆ మేకులు గట్టిగా ఉన్నాయని తేలేవరకూ.

అదే విధంగా, మీరు పొందిన జ్ఞానం కూడా గట్టిగా, సత్యంలాగా మీ బుద్ధిలో నెలకొని ఉందా, లేకపోతే కేవలం నమ్మకం మాత్రమేనా అనేది పరీక్షించుకోవాలి. ఇంకా ఎక్కడన్నా సందేహం ఉంటే, మరికొన్ని వాదోపవాదాలద్వారా దాన్ని గట్టిపరచుకోవాలి. అంటే మీ వాదాన్ని తక్కిన వాదనలతో కుదిపిచూసి, వాటికి లొంగని స్థిరజ్ఞానం మీది అని దృఢపరచుకోవాలి.

ఈ అధ్యాయం ముఖ్యంగా మనన ప్రధాన అధ్యాయం. అసలు బోధను మొదటి మూడు అధ్యాయాల్లోనూ చూశాము. అంటే అవి శ్రవణ ప్రధాన అధ్యాయాలు. నిదిధ్యాసనాన్ని కొంతమేరకు మూడవ అధ్యాయంలో చూశాము. శ్రవణంలో మీరు నేర్చుకున్న వేదాంత సారం ఇదీ –

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః**

బ్రహ్మ మాత్రమే సత్యం, బ్రహ్మ దృష్ట్యా తక్కినవన్నీ మిథ్య. మిథ్యా జగత్తు సత్‌బ్రహ్మను ఏమీ చేయలేదు. అదృష్టవశాత్తూ, నేను ఆ సత్‌బ్రహ్మను. అందువల్ల వేదాంతసారం –

**అహం సత్యం జగన్మిథ్యా**

ప్రపంచంలో ఏం జరిగినా ప్రపంచం నన్ను ఏమీ చేయలేదు. అలాంటప్పుడు నన్ను సంసారం బాధించే అవకాశం ఎక్కడ? సంసారమే లేకపోతే, దానికి పరిష్కారం వెతుక్కునే ఆస్కారం ఎక్కడ? అందువల్ల ఈ ఆత్మజ్ఞానానికి గౌడపాదాచార్యులవారు ప్రత్యేకమైన పేరును ఇచ్చారు. **అస్పర్శయోగః.** ఇది ఒక కొత్త అంటరానితనం. ఈ అంటరానితనంలో బ్రహ్మనైన నేను జగత్తులో ఏం జరిగినా చలించను. చావు–పుట్టుకలు, పుణ్య–పాపాలు నన్ను ప్రభావితం చేయలేవు.

**అసంగోఽహమ్ అసంగోఽహమ్ అసంగోఽహం పునః పునః** – బ్రహ్మజ్ఞానావళీమాలా

ఆ విధంగా అస్పర్శయోగం అంటే అసంగత్వజ్ఞానం. నేను పారమార్థిక స్థాయికి చెందిన తురీయాన్ని; జగత్తు, నా మనశ్శరీరాలు వ్యావహారిక స్థాయికి చెందినవి; అందువల్ల జగత్తులో ఏం జరిగినా, పారమార్థిక స్థాయికి చెందిన నన్నేమీ చేయలేవు.

**న పుణ్యం న పాపం న సౌఖ్యం న దుఃఖమ్** – నిర్వాణషట్కమ్

ఈ జ్ఞానంలో నిలబడితే, తక్కిన దార్శనికుల వాదనలవల్ల మీరు చలించిపోరు.

ఈ అధ్యాయాన్ని ప్రధానంగా ఏడు అంశాలుగా విభజించవచ్చు. అవి,

1. పరమత ఖండనలు - కారికలు 3-28
2. వేదాంతసారం - కారికలు 29-46, 57-74
3. అలాత దృష్టాంతం - కారికలు 47-56
4. సంసార కారణం, నివృత్తి - కారికలు 75-86
5. మాండూక్యోపనిషత్ సారం - కారికలు 87-89
6. సాధనలు - కారిక 90
7. ఉపసంహారం - కారికలు 91-100

## 1) పరమత ఖండనలు - కారికలు 3-28

తక్కిన దార్శనికుల సిద్ధాంతాలను తీసుకుని వారి వాదనలను మన సిద్ధాంతంతో పోల్చిచూసి, వేదాంతాన్ని నిలబెట్టటం.

వారి సిద్ధాంతాలు మన నమ్మకాన్ని చెదరగొడతాయా? వారి వాదనల్లో ముఖ్యంగా సృష్టిప్రకరణం గురించిన వాదనలు చూడటం జరిగింది. ఆ వాదనలలో బలం లేదనీ, **అజాతివాదము సత్యము** అనీ పదేపదే నిరూపించుకొచ్చారు గౌడపాదాచార్యులవారు. వేదాంతం ప్రకారం నిజం సృష్టి జరగలేదు. అంతకుముందూ, ఇప్పుడూ, ఇకముందు కూడా ఉండేది బ్రహ్మ మాత్రమే.

**బ్రహ్మను సరిగ్గా అర్థం చేసుకోకపోతే అది జగత్తు**
**జగత్తును సరిగ్గా అర్థం చేసుకుంటే అది బ్రహ్మ**

తాడును సరిగ్గా అర్థం చేసుకోకపోతే అది పాము; పామును సరిగ్గా అర్థం చేసుకుంటే అది తాడు.

ఇక్కడ సృష్టిప్రక్రియ గురించి గౌడపాదాచార్యులవారు తీసుకున్న వాదనలు ఐదు. అవి -

1. అసత్కార్య వాదము - కారికలు 3-5
2. సత్కార్య వాదము - కారికలు 3-5
3. సాంఖ్యమత ఖండన - కారికలు 11-13
4. ద్వైతవాద ఖండన - కారికలు 14-23
5. బౌద్ధమత ఖండన - కారికలు 24-28

ఈ దర్శనాలన్నింటిలోనూ, వారందరూ సమానంగా అడిగే ప్రశ్న ఒకటే. సృష్టి జరిగే ముందు, అది ముందే ఉందా? ఇంకో విధంగా చెప్పాలంటే జగత్తు సృష్టికి ముందు అవ్యక్తంలో ఉందా లేదా? మరో విధంగా చెప్పాలంటే ఉనికి ఉన్న జగత్తు పుట్టిందా, ఉనికి లేని జగత్తు పుట్టిందా? వీరి వాదనలను ఒకటొకటిగా చూద్దాము.

1. **అసత్కార్య వాదము** – ఉనికి లేని జగత్తు పుట్టింది అంటారు అసత్కార్య వాదులు. ఎందుకంటే ఉనికి ఉంటే అది మళ్ళీ కొత్తగా పుట్టనవసరం లేదు.

**ఖండన** – ఉనికి లేని వస్తువు కొత్తగా పుట్టలేదు. అసత్కార్యవాదనను రెండు విధాలుగా ఖండించవచ్చు.

ఎ) **సైన్స్‌పరంగా పుట్టదు** – సైన్స్‌పరంగా పదార్థం కొత్తగా పుట్టదు, నాశనమవదు. ఈ సూత్రం ప్రకారం ఉనికి లేని వస్తువు పుట్టలేదు.

బి) **వ్యాకరణపరంగా కుదరదు** – వ్యాకరణం ప్రకారం ఒక వాక్యంలో కర్త (సబ్జెక్ట్) + క్రియ (వర్బ్) ఉండాలి.

ఉదా. **కుండ** **పుట్టింది**
కర్త క్రియ

**ఉనికి లేని కుండ పుట్టింది.**

ఈ వాక్యాన్ని చెప్పలేము. ఎందుకంటే ఇక్కడ కర్త లేదు.

అంతేకాదు, శూన్యంనుంచి వస్తువులు పుడితే ఎంత బాగుంటుంది? కాని అది జరిగే పనికాదు.

అందువల్ల అసత్కార్య వాదన చెల్లదు.

2. **సత్కార్య వాదము** – ఉనికి ఉన్న వస్తువు పుట్టింది అంటారు సత్కార్యవాదులు.

**ఖండన** – ఉనికి ఉంటే కొత్తగా పుట్టనవసరం లేదు.

దీనికి సత్కార్యవాదులు 'సరే అయితే మా వాదనను కొంచెంగా మారుస్తాము,' అంటారు. 'అవ్యక్తంలో ఉన్న జగత్తు వ్యక్తమయింది అంతే. దాన్నే సృష్టి అంటున్నాము,' అంటారు.

దానికి కూడా వేదాంతం ఒప్పుకోదు. అవ్యక్తంలో ఉన్నది వ్యక్తమయింది అంటే అది మార్పు చెందుతుంది, వికారాలకు లోనవుతుంది అని అర్థం. అంటే మీరు సవికారం గురించి మాట్లాడుతున్నారు, మేము నిర్వికారబ్రహ్మ గురించి బోధిస్తున్నాము. నిర్వికార బ్రహ్మ, వికారాలకు లోనవదు.

**కారికలు 3-5**

ఒకరు ఉనికి ఉన్న కుండ పుట్టనవసరం లేదు అంటే ఇంకొకరు ఉనికి లేని కుండ పుట్టలేదు అంటున్నారు. మరయితే ఏం పుట్టింది? ఏదీ పుట్టలేదు. వారికి తెలియకుండానే వారు అజాతివాదాన్నే సమర్థిస్తున్నారు అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

కుండ పుట్టిందనుకోవటమే పెద్ద అయోమయం. ఎందుకంటే అసలు కుండ అనే పదార్థమే లేదు. మనం ఈ విషయాన్ని లోతుగా విశ్లేషిస్తే ఉన్నది ఒకటే పదార్థం. అది మట్టి అని తెలుస్తుంది. కుండ పుట్టకముందూ మట్టి ఉంది, కుండగానూ మట్టి ఉంది, కుండ పగిలిపోయాక కూడా మట్టి ఉంది. మరి కుండ ఏమిటి? కుండ, మట్టికి ఇవ్వబడిన నామరూపం మాత్రమే. మట్టి లేకుండా కుండకి విడిగా ఉనికి లేదు. కుండ మిథ్య, మట్టి సత్యం. ఈ సూత్రం ప్రకారం జగత్తు మిథ్య, బ్రహ్మ సత్యం. ఈ విధంగా జగత్తూ పుట్టలేదు, జీవాత్మా పుట్టలేదు. ఇదంతా మాయ చేసే గారడీ మాత్రమే అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

అందువల్ల అద్వైతం అవివాదం అంటున్నారు.

3. **సాంఖ్యమత ఖండన - కారికలు 11-13**

**సాంఖ్యమత సిద్ధాంతము** - సాంఖ్యమతఖండన చూసేముందు వారి సిద్ధాంతమేమిటో అర్థం చేసుకోవాలి. వీరిది సత్కార్యవాదన.

1. **కారణం = కార్యం** - కుండ సృష్టి జరిగింది అంటే కుండ కొత్తగా పుట్టలేదు అంటారు వారు. కుండ, కుండగా రూపుదాల్చకముందు అవ్యక్తంగా దాని కారణంలో ఉంది అంటారు. కుండ పుట్టకముందు మట్టిలో అవ్యక్తంగా ఉంది, చెట్టు పుట్టకముందు దాని విత్తనంలో అవ్యక్తంగా ఉంది.

అంటే ఒక కారణంనుంచి కార్యం రాకముందు, అది కారణావస్థలో ఉంది. అది పుట్టాక, కార్యావస్థలోకి వస్తుంది. అంటే సృష్టి అంటే అవస్థాభేదం మాత్రమే అంటారు వారు. కారణమే మారి కార్యంగా అవుతుంది. కారణంలో అవ్యక్తంగా ఉన్న కొన్ని లక్షణాలు కార్యంలో వ్యక్తరూపం దాలుస్తాయి. విత్తనంలో చెట్టులో ఉండే అనేక భాగాలు తెలియవు. అది కార్యావస్థ దాల్చాక తెలుస్తాయి.

మట్టి అవ్యక్తంగా ఉంటే కారణం, కుండగా వ్యక్తమయితే కార్యం. అంటే వీటిలో అవస్థాభేదం ఉంది తప్పితే, వస్తుభేదం లేదు. ఉదాహరణకు మంచు, నీరు, ఆవిరి తీసుకోండి. ఈ మూడింటిలోనూ ఉన్నది ఒకటే నీరు. వస్తువు భేదం లేదు, అవస్థాభేదం ఉంది.

ఆ విధంగా వారి మొదటి సిద్ధాంతం కారణం = కార్యం. వేదాంతం కూడా ఈ సిద్ధాంతాన్ని స్వీకరిస్తుంది కాని కొంతమేరకు మాత్రమే. కారణం = కార్యం, కుండ–మట్టికి, సరిపోతుంది కాని, బ్రహ్మ–జగత్తులకు సరిపోదు.

2. **కారణం = ప్రకృతి = నిత్యం** – జగత్తుయొక్క సృష్టి జరిగిందని చెబితే, దానికొక కారణాన్ని చూపించాలి. సాంఖ్యదార్శనికులు జగత్తుయొక్క సృష్టి ప్రకృతినుంచి జరిగిందని అంటారు. సాంఖ్యులు ప్రకృతిని ప్రధానం అంటారు. అంతేకాదు ప్రకృతి నిత్యం అని కూడా అంటారు.

కారణం = ప్రకృతి = నిత్యం

3. **కార్యం = ప్రపంచం = అనిత్యం** – జగత్తు ప్రకృతినుంచి పుట్టింది కాబట్టి ప్రకృతి కారణం, జగత్తు కార్యం అవుతాయి. కార్యం పుడుతుంది కాబట్టి దానికొక ఆరంభం ఉంటుంది, ఒక అంతం ఉంటుంది. పుట్టిన ప్రతిదీ గిట్టక తప్పదు. అందువల్ల అది అనిత్యం అవుతుంది.

కార్యం = ప్రపంచం = అనిత్యం

సాంఖ్యదర్శనంలో ఇంకా చాలా సిద్ధాంతాలు ఉన్నాయి కాని, ఈ సందర్భంలో ఈ మూడు సిద్ధాంతాలు చాలు మనకు.

**సాంఖ్యమత ఖండన** – ఈ సిద్ధాంతాలను ఆధారంగా చేసుకుని గౌడపాదాచార్యులవారు వాటిలో నాలుగు దోషాలను ఎత్తి చూపించబోతున్నారు. కారిక 11లో మొదటి దోషం, 12లో రెండవ దోషం, 13లో మూడవ, నాలుగవ దోషాలను చూపించబోతున్నారు.

ఇప్పుడు మనం విడిగా మొదటి రెండు దోషాలనే చూద్దాము. ఎందుకంటే విషయమే జటిలమైనదంటే, 11, 12 కారికల్లో గౌడపాదాచార్యులవారు వాడిన భాష కూడా చాలా క్లిష్టంగా ఉంటుంది. ఆ దోషాలను చూసేముందు, వారి మూడు సిద్ధాంతాలను ఒకచోట చూద్దాము.

సిద్ధాంతం 1 – కారణం = కార్యం
సిద్ధాంతం 2 – కారణం = ప్రకృతి = నిత్యం
సిద్ధాంతం 3 – కార్యం = ప్రపంచం = అనిత్యం

**దోషం 1 – కార్య నిత్యత్వ దోషం**

1, 2 సిద్ధాంతాలను కలిపి చూద్దాము. కారణం = కార్యం అయితే, కారణం = నిత్యం అయితే, కార్యం = నిత్యం అవాలి. కాని వారేం అంటున్నారు? కార్యం = అనిత్యం అంటున్నారు. దీని ప్రకారం కార్యనిత్యత్వ దోషం ఏర్పడుతుంది.

**దోషం 2 – కారణ అనిత్యత్వ దోషం**

ఇప్పుడు 1, 3 సిద్ధాంతాలను కలిపి చూద్దాము.

కారణం = కార్యం అయితే, కార్యం = అనిత్యం అయితే, కారణం = అనిత్యం అవాలి. కాని వారేం అంటున్నారు? కారణం = నిత్యం అంటున్నారు. దీని ప్రకారం కారణ అనిత్యత్వదోషం ఏర్పడుతుంది.

ఆ విధంగా 1, 2 కలిపితే, మూడవ సిద్ధాంతం చెల్లదు; 1, 3 కలిపితే రెండవ సిద్ధాంతం చెల్లదు.

3. **యుక్తి విరోధ దోషం**

ప్రకృతి = మూలకారణం = అప్రత్యక్షం

సాంఖ్యదార్శనికులు ప్రకృతిని ప్రధానం అంటారు. దాన్ని మూలకారణం అంటారు కాని ప్రకృతి ప్రత్యక్ష ప్రమాణ అగోచరం అంటారు. ప్రత్యక్ష ప్రమాణానికి అందకపోతే, ఎలా చెప్పగలరు? అనుమాన ప్రమాణం ద్వారా తెలుసుకున్నాము అంటారు. కాని అనుమాన ప్రమాణానికి వ్యాప్తివాక్యం ఉండాలి.

యత్ర యత్ర ధూమః తత్ర తత్ర అగ్నిః

ఎక్కడ పొగ ఉంటే అక్కడ అగ్ని ఉంటుంది. మన పూర్వకాలపు వంటింటిని గమనిస్తే పొగ, అగ్ని కలిపి ఉండటం చూస్తాము. అంటే ప్రత్యక్ష ప్రమాణం నుంచి ఈ వ్యాప్తివాక్యం వస్తుంది. సాంఖ్యులు ప్రకృతి కారణం, ప్రకృతి నిత్యం అంటారు.

**దోషం** – ప్రకృతి = నిత్యం అని నిరూపించటానికి వ్యాప్తివాక్యం కుదరదు. మన అనుభవంలో మన చూసే వ్యాప్తివాక్యం ఏది కారణమో అది అనిత్యం.

**యత్ యత్ కారణం తత్ తత్ అనిత్యత్వమ్**

ఏది కారణమో అది అనిత్యం అవుతుంది.

జగత్తులో ఏ కారణాన్ని తీసుకున్నా, అది ఇంకొక కారణంనుంచి వచ్చిన కార్యమే అవుతుంది. విత్తనం చెట్టుకి కారణం; కాని విత్తనం ఇంకొక చెట్టు నుంచి వచ్చిన కార్యం. ఈ సూత్రం ప్రకారం ప్రకృతి = నిత్యం అనే సిద్ధాంతం చెల్లదు. దీనికి అనుమానవాక్యం –

**ప్రకృతిః అనిత్యా కారణత్వాత్ బీజవత్**

ప్రకృతి అనిత్యం, అది కారణం కాబట్టి విత్తనం లాగా. ఈ అనుమాన వాక్యానికి వ్యాప్తి వాక్యం – యత్ యత్ కారణం తత్ తత్ సాది.

ఏది కారణమైతే దానికొక సాది అంటే ఆరంభం ఉంటుంది.

4. **అనవస్థా దోషం** – ఈ మూడవ దోషాన్ని పారద్రోలటానికి వారికి ఒకటే మార్గం ఉంది. ప్రకృతి మూలకారణం కాని అది అనాది కాదు, అదికూడా ఒక కార్యమే అనాలి. మన తల్లిదండ్రులు మన పుట్టుకకు కారణం, వారి పుట్టుక విషయంలో కార్యం అయినట్టుగా ప్రకృతి, జగత్తుకు కారణం, కాని అదికూడా కార్యం అనాలి.

వారు ప్రకృతి అనాది అనే అంటారు. సాది అని ఒప్పుకోరు. సాది అన్నారనుకుందాము, అప్పుడు కూడా ఒక దోషం ఉంది. నిజం కాకపోయినా, అలా ఒప్పుకుని చేసే వాదనను అభ్యుపేద్య వాదన అంటారు. అలా ఒకవేళ వారు ప్రకృతి సాది అని ఒప్పుకున్నా కూడా, అందులో ఒక దోషం ఉంది ఏమిటది?

సరే, ప్రకృతి అనాది కాదు, అది కూడా కార్యమే అంటే, దాని కారణం ఏమిటి అంటాము మనం. పిల్లలు అడుగుతూ ఉంటారు, 'భగవంతుణ్ణి ఎవరు సృష్టించారు?' ఆ విధంగా ప్రకృతిని ఎవరు సృష్టించారు అంటే వారు మూలప్రకృతి అంటున్న ఈ ప్రకృతికి ఇంకొక మూల, మూలప్రకృతి కారణం అవాలి. అప్పుడు కూడా సమస్య తీరదు. మూల, మూలప్రకృతికి కారణం ఏమిటి అంటాము? మూల, మూల, మూలప్రకృతి అనాలి. కాని ఈ ప్రశ్నల పరంపరకు అంతు ఉండదు. ఎందుకంటే ప్రతి కారణానికి దాని కారణం ఇంకొకటి ఉందని మన అనుభవం చెబుతున్నది. ఈ కార్య–కారణ గొలుసు నిరంతరంగా సాగుతుంది. దీన్ని అనవస్థాదోషం అంటారు. ఇంగ్లీషులో ఇన్ఫినిట్ రిగ్రెస్ అంటారు.

దోషం 4 – అనవస్థా దోషం.

అందువల్ల కారణాన్ని నిరూపించలేకపోతే, కార్యం లేదు. ఆ విధంగా సాంఖ్యులు సృష్టి జరిగిందని నిరూపించలేరు.

**అజాతివాదము సత్యము**

### 4. ద్వైతవాద ఖండన – కారికలు 14-23

గౌడపాదాచార్యులవారు కారికలు 14-23లో ద్వైతవాదులను ఖండిస్తున్నారు. వీరు సాంఖ్యులకు భిన్నంగా ఉంటారు.

సాంఖ్యులు ప్రధానంగా తార్కికులు. వారు వేదాన్ని నమ్ముతారు కాని వారికి వేదం ముఖ్యం కాదు. వేదమా, తర్కమా అంటే వారు తర్కానికే పెద్దపీట వేస్తారు. కాని వైదికులు వేదానికి పెద్దపీట వేస్తారు. వారికి వేదమా, తర్కమా అంటే వేదమే ముఖ్యం. వేదాన్ని ఆధారంగా చేసుకుని వచ్చిన వీరి వాదనను ద్వైతం అంటారు. ఈ ద్వైతంలోనే మళ్ళీ చిన్నచిన్న భేదాలు ఉన్నాయి. కాని వీరంతా మూకుమ్మడిగా సృష్టి నిజంగా జరిగింది అంటారు.

గౌడపాదాచార్యులవారు వీరిని కూడా ఖండించి, నిజంగా సృష్టి జరగలేదనీ, అజాతి వాదమే సత్యమనీ నిరూపించదలుచుకున్నారు. అంతకుముందు, ఇప్పుడు, ఇకముందూ కూడా ఉండేది బ్రహ్మే. సృష్టి అనేది ఒక పొరపాటు మాత్రమే. అది అజ్ఞానంనుంచి రూపుదిద్దుకున్న పొరపాటు. ఇప్పుడు ద్వైతవాద ఖండనను చూస్తాము. వీరిది కర్మ సిద్ధాంతం.

**కర్మ సిద్ధాంతంలో వాదనలు**

వీరు సృష్టి జరిగిందని నిరూపించటానికి కర్మ సిద్ధాంతాన్ని తీసుకుంటారు. కాని అది తర్కానికి నిలవదు అంటారు గౌడపాదాచార్యులవారు.

మనం కూడా కర్మ సిద్ధాంతం గురించి మాట్లాడతాము కాని దాన్నే అంతిమ సత్యంగా తీసుకోము. ప్రశ్నలు వేసే మన బుద్ధిని తాత్కాలికంగా తృప్తి పరచటానికి ఈ కర్మ సిద్ధాంతాన్ని వాడతాము. కాని బుద్ధి పరిపక్వత చెంది, మాండూక్య కారికలను జీర్ణించుకునే దశకు చేరుకున్నాక, కర్మ సిద్ధాంతాన్ని కొట్టివేసి, **అజాతివాదము సత్యము** అంటాము.

కాని ఈ ద్వైతవాదులు కర్మ సిద్ధాంతం అంతిమసత్యం అంటారు. అది తాత్కాలికంగా పనిచేస్తుంది కాని అంతిమసత్యం కాలేదు. దానిలో అనేక దోషాలు ఉన్నాయి. గౌడపాదాచార్యులవారు ఆరు వాదనలు తీసుకున్నారు.

ఒక సిద్ధాంతాన్ని ఖండించటానికి ఇది ఒక మార్గం. వారి సిద్ధాంతంలో అనేక వాదాలను తీసుకుని, ఒక్కొక్క వాదాన్నీ ఖండించుకుంటూ వస్తాము. అప్పుడు వారి వాదన ముక్కలు ముక్కలుగా విడిపోతుంది. దీన్ని వికల్ప పద్ధతి అంటారు.

కర్మ, శరీరాల పరంగా గౌడపాదాచార్యులవారు ఆరు వాదనలు చేశారు. అవేమిటో చూద్దాము.

1. **కర్మ మూలకారణం** – జీవరాశుల పుట్టుకకు వారు చేసుకున్న కర్మ మూలకారణం అనుకుందాము.

**ఖండన** – పూర్వజన్మలో చేసుకున్న పుణ్య, పాపాలవల్ల ఈ జన్మలో ఈ శరీరం వచ్చింది అంటున్నారు, బాగానే ఉంది. కాని ఈ పుణ్య, పాపాలు ఎక్కడనుంచి వచ్చాయి? భగవంతుడు పుణ్య, పాపాలను ఇవ్వడు. పుణ్యపాపాలు కర్మనుంచి వస్తాయి. కర్మ కర్తనుంచి వస్తుంది. కర్తకు కర్మ చేయాలంటే, శరీరం ఉండాలి.

శరీరం లేకుండా కర్మ చేయటం కుదరదు కాబట్టి కర్మ మూలకారణం కాదు.

2. **శరీరం మూలకారణం** – సరే, అయితే శరీరం లేకుండా కర్మ చేయటం కుదరదు కాబట్టి శరీరం మూలకారణం అనుకుందాము. ఉదాహరణకు ఎవరో చేసే వ్యాపారానికి, ఇంకెవరో పెట్టుబడి పెడతారు. అదే విధంగా భగవంతుడు ఈ జీవులు కర్మలు చేయటానికి, వారికి శరీరం ఇచ్చాడనుకుందాము. ఈ శరీరంతో జీవులు కర్మ చేస్తారు. అందువల్ల శరీరం మూలకారణం.

**ఖండన** – భగవంతుడు శరీరాలను ఇచ్చాడు అనుకుంటే, ఏ శరీరం ఇవ్వాలో ఎలా నిర్ణయిస్తాడు? ఒక జీవికి ఎటువంటి శరీరం రావాలనేది అతను చేసుకున్న కర్మమీద ఆధారపడి ఉంటుంది. మొట్టమొదటి శరీరం ఇవ్వటానికి దేన్ని ఆధారంగా చేసుకుని ఇస్తాడు? జంతు శరీరం ఇవ్వాలా, మనుష్యశరీరం ఇవ్వాలా? మనుష్యశరీరం ఇద్దామనుకుంటే స్త్రీశరీరం ఇవ్వాలా, పురుషశరీరం ఇవ్వాలా? పురుషశరీరం ఇవ్వాలనుకుంటే ఆరోగ్యశరీరం ఇవ్వాలా, అనారోగ్యశరీరం ఇవ్వాలా? ఇవన్నీ అంతుపట్టని సమస్యలు.

భగవంతుడు ఏదో ఒక శరీరం ఇస్తాడులే, తనకు తోచినట్టుగా అంటే అది కూడా కుదరదు. అలా చేస్తే భగవంతుడు ఆలోచించకుండా చేసినట్లో, లేదా పక్షపాతం చూపించినట్లో అవుతుంది.

కర్మవల్ల శరీరం వస్తుంది, భగవంతుడు స్వంతంగా శరీరాన్ని ఇవ్వడు, కాబట్టి శరీరం మూలకారణం కాదు.

3. **కర్మ, శరీరాలు అన్యోన్య ఆశ్రితాలు** – ఏదో ఒకటి మూలకారణం అంటే కదా సమస్య; కర్మ, శరీరాల మధ్య కార్య–కారణ సంబంధం ఉందనుకుందాము.

**ఖండన** – కర్మ, శరీరాల్లో ఒకటి కారణం, ఒకటి కార్యం అయితే, కారణం కార్యానికి ముందు రావాలి; కార్యం తర్వాత రావాలి. అంటే కాలం దృష్ట్యా ఒకటి ముందు, ఇంకొకటి తర్వాత రావాలి.

కాని వారి వాదన ప్రకారం కర్మ, శరీరాలు అన్యోన్య ఆశ్రితాలు అంటే కార్యమే మళ్ళీ కారణం అవాలి కాని కార్యంనుంచి కారణం రాలేదు. ఉదాహరణకు తండ్రీ, కొడుకులు. తండ్రినుంచి కొడుకు వస్తాడు కాని కొడుకునుంచి తండ్రి రాలేదు.

కార్యంనుంచి కారణం రాలేదు కాబట్టి కర్మ, శరీరాలు అన్యోన్య ఆశ్రితాలు కాదు.

4. **కర్మ, శరీరాలు ఏకకాలంలో పుట్టాయి** – ద్వైతవాదులు ఈ వాదనను చేయకపోయినా, వాదనకోసం గౌడపాదాచార్యులవారు ఈ వాదనను చేస్తున్నారు. కర్మ, శరీరాలు ఏకకాలంలో పుట్టాయి అంటే సృష్టి మొదట్లో జీవునికి శరీరం, కొంత కర్మ కూడా ఉందనుకుందాము.

**ఖండన** – కర్మ, శరీరాలు ఏకకాలంలో పుడితే, వాటి మధ్య కార్యకారణ సంబంధం కుదరదు. ఉదాహరణకు కవలపిల్లలు. కార్యకారణ సంబంధంలో కారణం ముందు రావాలి, కార్యం తరువాత రావాలని చూశాము. రెండూ ఒకేసారి పుడితే, వాటిలో ఏది కారణమవుతుంది, ఏది కార్యమవుంది? ఈ రెండింటికీ మరొక కారణం ఉండాలి. కాని అలా మరొక కారణం కుదరదు. దీన్ని యుగపత్ సంభవం అంటున్నారు గౌడపాదాచార్యులవారు. యుగపత్ సంభవం అంటే ఒకేసారి పుట్టటం.

కర్మ, శరీరాలు ఏకకాలంలో పుడితే కార్యకారణ సంబంధం కుదరదు కాబట్టి కర్మ, శరీరాలు ఏకకాలంలో పుట్టలేవు.

5. **కారణ–కార్య ప్రవాహం / కర్మ–శరీరం ప్రవాహం** – మూలకారణం, కారణ–కార్య ప్రవాహరూపంలో ఉంటుంది. కర్మ ఒకటి శరీరం ఒకటిని పుట్టిస్తుంది. శరీరం ఒకటి మళ్ళీ కర్మ ఒకటిని పుట్టించదు (అలా పుట్టిస్తే కదా సమస్య) కాని, కర్మ రెండుని పుట్టిస్తుంది. కర్మ రెండు శరీరం రెండుని పుట్టిస్తుంది. శరీరం రెండు, కర్మ మూడుని పుట్టిస్తుంది.

కర్మ 1 → శరీరం 1 → కర్మ 2 → శరీరం 2 → కర్మ 3

దీన్ని జన్మల పరంగా చూద్దాము. పూర్వజన్మ కర్మ ఈ జన్మలో శరీరాన్ని ఇచ్చింది. పూర్వజన్మ కర్మ – కర్మ 1, ఈ జన్మ శరీరం – శరీరం 1 అవుతాయి. ఈ జన్మ శరీరం, పూర్వజన్మ కర్మను ఇవ్వదు కాని, ఈ జన్మ కర్మను ఇస్తుంది. అందువల్ల ఈ జన్మ శరీరం అంటే శరీరం 1, ఈ జన్మ కర్మను ఇస్తుంది. అది కర్మ 2 అవుతుంది. ఈ జన్మ కర్మ (కర్మ 2), వచ్చే జన్మలో శరీరాన్ని ఇస్తుంది. అది శరీరం 2 అవుతుంది. వచ్చే జన్మలో శరీరం 2తో చేసే కర్మ – కర్మ 3 అవుతుంది. ఆ విధంగా కారణం–కార్యం ప్రవాహాన్ని కర్మ శరీరం ప్రవాహంగా వాడవచ్చు అనుకుందాము.

**ఖండన** – ఈ కారణ-కార్య ప్రవాహం వినటానికి బాగానే ఉంది, కాని దీన్నుంచి కూడా మా ప్రాథమిక ప్రశ్నకు జవాబు రాలేదు అంటారు గౌడపాదాచార్యులవారు. కారణ-కార్య ప్రవాహంలో కర్మ-శరీరాలను ప్రవాహంగా వాడారు కాని, ఈ రెండింటిలో ఏది మూలకారణం? విత్తు ముందా, చెట్టు ముందా? కోడి ముందా, గుడ్డు ముందా? ఈ రెండింటి ప్రవాహం గురించి మాట్లాడగలరేమో కాని మూలకారణం విషయంలో వాడలేరు.

కర్మ మూలకారణం అనలేరు; ఎందుకంటే శరీరం లేనిదే కర్మ చేయలేరు. పోనీ శరీరం మూలకారణం అందామా అంటే, కర్మ లేనిదే శరీరం రాదు. అందువల్ల కర్మ-శరీరాల ప్రవాహం మూలకారణం కాదు.

6. **కారణ-కార్య ప్రవాహం అనాది** – కారణ-కార్యాలు ఒక ప్రవాహం అంటే ఏది ముందు పుట్టింది అని సమస్య వస్తున్నది కాబట్టి కారణ-కార్య ప్రవాహం అనాది అనుకుందామంటే అది కూడా చెల్లదు. ఈ శరీరం ముందు జన్మకర్మనుంచి పుట్టింది. ప్రతి కర్మ ముందు జన్మశరీరంనుంచి పుట్టిందే!

**గౌడపాదాచార్యులవారి అజాతివాదము** తిరుగులేనిది. ఆయన మకుటం లేని మహారాజు. ఆయన చేసిన ఘాటైన వాదనలను చూద్దాము. అనాది పదం విశేషణం. ఈ విశేషణం ముందు మూడు నామవాచకాలు ఉన్నాయి. అవి కర్మ, శరీరం, ప్రవాహం. ఈ మూడింటిలో ఈ విశేషణాన్ని ఏ నామవాచకానికి వాడతారు?

ఎ) **కర్మ అనాది కాలేదు** – కర్మ అనాది కాలేదు ఎందుకంటే కర్మ చేయటానికి ఒక శరీరం కావాలి.

బి) **శరీరం అనాది కాలేదు** – శరీరం అనాది కాలేదు ఎందుకంటే శరీరం కర్మవల్ల పుడుతుంది. శరీరానికి ఒక పుట్టినతేదీ ఉంటుంది. భగవంతుని అవతారానికి కూడా ఒక పుట్టినతేదీ ఉంది. కృష్ణాష్టమి అంటాము, శ్రీరామనవమి అంటాము.

సి) **ప్రవాహం అనాది కాలేదు** – ప్రవాహం అనాది అనలేము ఎందుకంటే లోతుగా ఆలోచిస్తే, అసలు ప్రవాహం అనే పదమే లేదు. గురు-శిష్య పరంపర అంటాము కాని లోతుగా చూస్తే అటువంటి పరంపర పదమే లేదు. అందులోని ఒక్కొక్క గురువునూ, ఒక్కొక్క శిష్యుణ్ణీ విడిగా తీస్తే పరంపర పదానికి ఉనికి ఉండదు.

ఉదాహరణకు ఫ్రూట్‌సలాడ్ పదం తీసుకోండి. ఎవరో ఫ్రూట్‌సలాడ్‌కి మూలపదార్థం ఏమిటో చూడాలనుకున్నాడు. అందులో ఉన్న ఒక్కొక్క పండునూ విడిగా తీయటం మొదలు

పెట్టాడు. ఇది మామిడిపండు, ఇది ఆరెంజ్, ఇది అరటిపండు, ఇది ద్రాక్ష అంటూ అందులో ఉన్న పండ్లను విడదీస్తే, అక్కడ మిగిలింది ఏమిటి? ఏమీలేదు! ఫ్రూట్‌సలాడ్ పదానికి ఉనికే లేదు.

అయినా వాదనకోసం కర్మ శరీర ప్రవాహం అనాదిగా ఉంది అనుకుందాము. ఇప్పుడు ఈ అనాదికి అంతం ఉందా, లేదా? ఎలా చెప్పినా వారు సమస్యలో పడతారు.

ఎ) **అనిర్మోక్ష ప్రసంగం** – ఒకవేళ ఈ ప్రవాహం అనాది అయి, దానికి అంతం కూడా లేదు అంటే మోక్షం ఎన్నటికీ పొందలేరు. దాన్ని అనిర్మోక్షప్రసంగం అంటారు. మోక్షం పొందలేమంటే, మాండూక్య కారికలు నేర్చుకోవటం ఎందుకు?

బి) **మోక్ష అనిత్యత్వం** – ఒకవేళ వారు ఈ ప్రవాహం అనాది కాని, దానికి అంతం ఉంది అంటే, అది కూడా సమస్యే. ఒక కాలంలో వచ్చిన మోక్షం, ఇంకొక కాలంలో పోతుంది. అలా మోక్షానికి కూడా అంతం ఉంటే, మోక్షం నిత్యం అవదు. స్వర్గలోకప్రాప్తిని కూడా వద్దనుకుని మోక్షానికి వచ్చేదే మోక్షం నిత్యమని ఆశించటంవల్ల. కాని దీని ప్రకారం **మోక్ష అనిత్యత్వం** అవుతుంది. ఈ ఆరు వాదనలవల్ల కర్మ సిద్ధాంతంద్వారా సృష్టి జరిగిందని తార్కికంగా నిరూపించలేరు.

### అజాతివాదము సత్యము

మరి ఏమిటి ఉంది? అంతకుముందు, ఇప్పుడు, తరువాత కూడా ఉండేది బ్రహ్మే. మరి అద్వైతంలో కూడా సృష్టి గురించి చెబుతారు కదా అంటే, దాన్ని అధ్యారోప అపవాద ప్రక్రియ అంటారు. అధ్యారోపంలో సృష్టి ఉందని చూపించి, శిష్యుడు పరిపక్వత చెందాక, అపవాదంలో సృష్టి జరగలేదని, **అజాతివాదము సత్యము** అని చూపిస్తారు. వేదాంతబోధ అసలు బోధ ఇదీ.

5 ఎ) **బౌద్ధమత ఖండన – కారికలు 24-28**

01. సౌత్రాంతిక మతము – బాహ్యార్థ ప్రత్యక్ష వాదినః
02. వైభాషిక మతము – బాహ్యార్థ అనుమాన వాదినః
03. యోగాచార మతము – బాహ్యార్థ అభావ వాదినః
04. మాధ్యమిక మతము – సర్వార్థ అభావ వాదినః

**సౌత్రాంతిక మతము**

- బాహ్యప్రపంచం ఉంది
- అది చూసే నాకు భిన్నంగా ఉంది
- అది సత్యం
- దాన్ని ప్రత్యక్షప్రమాణంద్వారా తెలుసుకోవచ్చు

**వైభాషిక మతము**

- బాహ్యప్రపంచం ఉంది
- అది చూసే నాకు భిన్నంగా ఉంది
- అది సత్యం
- దాన్ని అనుమాన ప్రమాణంద్వారా తెలుసుకోవచ్చు

సౌత్రాంతిక, వైభాషిక మతాలను కలిపి హీనయానమతము అంటారు.

**యోగాచార మతము**

- చూసే నాకు భిన్నంగా బాహ్యప్రపంచం లేదు
- చూసే నేను ఉన్నాను
- నేను సత్యం
- నేను క్షణిక విజ్ఞానప్రవాహాన్ని

**మాధ్యమిక మతము**

- బాహ్యప్రపంచం లేదు
- చూసే నేను కూడా లేను
- అంతా శూన్యమే

**హీనయాన వాదన**

01. మనకు ఒక విషయం గురించిన జ్ఞానం కలిగితే, దానికి సంబంధించిన వస్తువు బాహ్యంగా ఉండాలి.

02. మనకు ఒక విషయం గురించిన భావోద్రేకం కలిగితే, దానికి సంబంధించిన వస్తువు బాహ్యంగా ఉండాలి.

**హీనయాన మతఖండన**

యోగాచారమతం చేసిన ఖండనద్వారా గౌడపాదాచార్యులవారు ఖండన చేశారు.

1. నిజమే, తార్కికంగా చూస్తే ప్రతి ఒక్క జ్ఞానానికి, దానికి సంబంధించిన బాహ్యవస్తువు ఉండాలి.

2. కాని, స్వరూపలక్షణం చూస్తే, బాహ్యవస్తువు అంటూ లేదు. దానికి ఉదాహరణ–

**స్వప్నదృష్టాంతం**

స్వప్నంలో జ్ఞానము ఉంది, దానికి సంబంధించిన వస్తువు బాహ్యంగా ఉంది. కాని స్వప్నంనుంచి లేస్తే జ్ఞానమూ లేదు, వస్తువూ లేదు. దాన్ని జ్ఞాన అధ్యాస, అర్థ అధ్యాస అంటారు.

అలాగే ఉన్నతస్థాయికి లేస్తే పదార్థమూ లేదు, పదమూ లేదు. ఆ విధంగా బాహ్యప్రపంచం మిథ్య.

ముందు మనం యోగాచారమతంతో చేతులు కలిపి, వారి ద్వారా బౌద్ధమతంలోని మొదటి రెండింటినీ ఖండిస్తాము. వాటిని హీనయానమతం అంటారని చూశాము. యోగాచార్యుల ద్వారా తక్కిన మతాలను ఖండించాక, చివరికి యోగాచారమతాన్ని కూడా ఖండిస్తారు గౌడపాదాచార్యులవారు.

5 బి) **యోగాచారమత ఖండన**

యోగాచార మతానికీ, అద్వైతానికీ మధ్యనున్న పోలికలేమిటో, భేదాలేమిటో మళ్ళీ ఒకసారి గుర్తు తెచ్చుకుందాము.

**పోలికలు**

ఎ) జగత్ మిథ్య, చూసే నాకు అది భిన్నంగా లేదు

బి) నేను చైతన్యం

సి) నేను సత్యం

**భేదాలు**

| | | |
|---|---|---|
| అద్వైతం | – | చైతన్యం ఏకం, నిత్యం |
| యోగాచార మతం | – | చైతన్యం క్షణక్షణమూ మారే తాత్కాలిక ప్రవాహం |
| | – | క్షణికవిజ్ఞాన ప్రవాహః |

యోగాచారమతం వారు మీరు క్షణికవిజ్ఞానం మాత్రమే కాదు, మీరు క్షణికవిజ్ఞాన ప్రవాహం అంటారు. వారు చైతన్యాన్ని విజ్ఞానం అంటారు. మొదటి క్షణం చైతన్యం వస్తుంది, క్షణం ఉంటుంది, పోతుంది. దాని తర్వాత రెండవ క్షణం రెండవ విజ్ఞానం వస్తుంది. అలా ఒక ప్రవాహంలా క్షణక్షణమూ వస్తుంది. అలా ఆత్మ క్షణక్షణమూ ప్రవహించే ప్రవాహం కాబట్టి, అది నిత్యంగా ఉన్నట్టు ఉంటుంది. నిజానికి నిత్య ఆత్మ అంటూ లేదు. క్షణిక విజ్ఞానంయొక్క నిత్యప్రవాహం ఆత్మ అంటారు వారు. ఆత్మ నిత్యం అనుకోవటం భ్రమ, పొరపాటు మాత్రమే.

చైతన్యాన్ని వారు విజ్ఞానం అంటారు. అందువల్ల వారిది క్షణిక విజ్ఞానవాదం అంటారు. ఆత్మఖ్యాతి వాదం అనికూడా అంటారు.

**గౌడపాదాచార్యులవారి జవాబు** – వీరి వాదనను గౌడపాదాచార్యులవారు మూడు పదాలతో ఖండిస్తారు. అవి –

**చిత్తం న జాయతే** – చిత్తం అంటే చైతన్యం అని చూస్తున్నాము. నిజానికి చిత్తం అంటే నాలుగు అంతఃకరణాలలో ఒకటి కాని, ఇక్కడ చిత్తం అంటే చైతన్యం. వీరి భాషలో విజ్ఞానం – చైతన్యం అసలు పుట్టనే లేదు అంటారు. అంటే చైతన్యం శాశ్వతం. క్షణక్షణమూ మారే చైతన్యం గురించి చెప్పలేరు. అనిత్య చైతన్యం అనేది లేనేలేదు అంటారు గౌడపాదాచార్యులవారు.

అలా ఎందుకు అంటున్నారో గౌడపాదాచార్యులవారు కారణం చెప్పరు కాని, శంకరాచార్యులవారు ఇటువంటి పరిస్థితుల్లో మనను ఆదుకుంటారు. శంకరాచార్యులవారు మాండూక్యభాష్యంలో, బ్రహ్మసూత్ర భాష్యంలో, ఇలా సందర్భం వచ్చినప్పుడల్లా ఈ క్షణిక విజ్ఞానవాదనను ఖండిస్తూ వస్తారు. వాటిల్లోంచి ఒక వాదనను ఇక్కడ చూద్దాము.

ఇక్కడ శంకరాచార్యులవారు, యోగాచార మతస్థులను ఇలా అడుగుతున్నారు, 'ఓ యోగాచారా! మీరు క్షణికవిజ్ఞాన వాదన చేస్తున్నారు కదా! ఆ క్షణిక విజ్ఞానమే ఆత్మ అంటున్నారు కదా! ఈ ప్రవాహం గురించి ఎవరు మాట్లాడుతున్నారో చెప్పండి.'

మూడు రైళ్ళు వచ్చిపోతున్నాయి అని చెప్పాలంటే, ఏ రైలులోనూ లేకుండా, ప్లాట్‌ఫార్మ్ మీద నిలబడ్డ వ్యక్తి మాత్రమే చెప్పగలడు. అంటే ఆ వ్యక్తికి రాకపోకలు ఉండకూడదు. అతను కదలకుండా, నిశ్చలంగా ఉంటేనే, కదిలే రైళ్ళ గురించి చెప్పగలడు.

దీనికి సూత్రం – ఒకదాని రాకపోకల గురించి మాట్లాడాలంటే, చూసే వ్యక్తికి రాకపోకలు ఉండకూడదు. యోగాచారులు చెప్పే క్షణికవిజ్ఞానం క్షణికవృత్తి మాత్రమే. చైతన్యం నిత్యచైతన్యం. అందువల్ల అతని వాదన చెల్లదంటాము.

అయితే వారు చైతన్యాన్ని క్షణికవిజ్ఞానం అని ఎందుకు అంటున్నారు? యోగాచారులు కదిలే ఆలోచనా ప్రవాహాన్ని చైతన్యంగా పొరపాటు పడుతున్నారు. ఆలోచనలు క్షణికం. అవి ఒక్కక్షణంలో వస్తాయి, పోతాయి. అందువల్ల వారు క్షణికవిజ్ఞానం అనేది క్షణికవృత్తి గురించి మాత్రమే. చైతన్యం నిత్యచైతన్యం.

యోగాచారమతానికీ, అద్వైతానికీ మధ్య ఉన్న భేదం ఇది. వారు విజ్ఞానం (చైతన్యం) అనిత్యం, అది అంతిమసత్యం అంటారు. అద్వైతం విజ్ఞానం నిత్యం, అది అంతిమసత్యం అంటుంది.

ఇక్కడితో గౌడపాదాచార్యులవారు చేస్తున్న పరమత ఖండనలు అయిపోయాయి. అవి – అసత్కార్యవాదన, సత్కార్యవాదన, సాంఖ్యదర్శనం, ద్వైతదర్శనం, హీనయానమతం, యోగాచారమతం.

2) **వేదాంతసారం – కారికలు 29-46, 57-74**

2 ఎ) **వేదాంతసారం – కారికలు 29-46**

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః**

మాండూక్యసారం – **కార్యకారణ విలక్షణ తురీయ చైతన్యం అహమస్మి**
అజాతివాదము – అజం అంటే దేశకాల అతీతము; బ్రహ్మ నిత్యనిర్వికారము.
బ్రహ్మ నిర్వికారం అయితే కారణం అవటానికి కుదరదు. అందువల్ల జగత్తు పుట్టలేదు.
జగత్తు – జాగ్రత్ ప్రపంచం + స్వప్నప్రపంచం – రెండూ మిథ్య

**స్వప్నప్రపంచ మిథ్యాత్వం**

ఎ) స్వప్నప్రపంచః మిథ్యా ఉచిత దేశకాల అభావాత్ దర్పణస్థ హస్తివతు – యుక్తిప్రమాణం
బి) స్వప్నంనుంచి లేస్తే స్వప్నం జరుగుతున్న చోట లేవము – అనుభవప్రమాణం
సి) స్వప్నంలో చూసిన రథాలు, గుర్రాలు, మార్గాలు మనస్సు సృష్టించినవే – శ్రుతిప్రమాణం
డి) స్వప్నంనుంచి లేస్తే, స్వప్నంలో స్నేహితునితో మాట్లాడివుంటే, అది నిజం కాదని తెలుస్తుంది.
ఇ) స్వప్నంనుంచి లేస్తే, స్వప్నంలో కానుక పొందితే, ఆ కానుక మాయమవుతుంది.
ఎఫ్) స్వప్నంనుంచి లేస్తే, స్వప్నంలో ఉన్న శరీరం వేరు, మంచంమీద పడుకున్న శరీరం వేరు అని తెలుస్తుంది.

**బాహ్యప్రపంచ మిథ్యాత్వం**

మిథ్య అంటే అసలు ఉనికి లేదు అని కాదు అర్థం. అది వ్యావహారిక సత్యం అవుతుంది.
ఎ) జాగ్రత్ ప్రపంచంవల్ల ప్రయోజనం ఉంది, అది నాకు భిన్నంగా ఉంది, నేను చూడకపోయినా ఉంది, స్పష్టత ఉంది. కాని అది సాపేక్షిక సత్యం మాత్రమే.
బి) జాగ్రత్ ప్రపంచః మిథ్యా దృశ్యత్వాత్ స్వప్నప్రపంచవత్
సి) జాగ్రత్ ప్రపంచః మిథ్యా అనిత్యత్వాత్ స్వప్నప్రపంచవత్
డి) జాగ్రత్ ప్రపంచానికీ, స్వప్నప్రపంచానికీ మధ్య కారణ-కార్య సంబంధం ఉంది. స్వప్నప్రపంచం మిథ్య కాబట్టి జాగ్రద్ ప్రపంచం కూడా మిథ్య.
ఇ) కారణ జాగ్రత్ ప్రపంచం మిథ్య, కాబట్టి దాన్నుంచి వచ్చిన కార్య, స్వప్నప్రపంచం కూడా మిథ్య.

ఎఫ్) జాగ్రత్ ప్రపంచం స్వాప్నికునికి మిథ్య; స్వప్నప్రపంచం జాగ్రత్ పురుషునికి మిథ్య; అందువల్ల రెండూ ఆపేక్షిక సత్యాలే.

**మిథ్య నిర్వచనం –**

జగత్ మిథ్య అంటే సృష్టి నిజంగా జరగలేదు. కార్యం లేకపోతే బ్రహ్మ కారణం కాదు. చూసే కుండ నిజానికి మట్టికుండ కాదు. అది కుండగా ఉన్న మట్టి. కనబడే జగత్తు నిజానికి జగత్తు కాదు. అది జగత్తుగా ప్రకటితమవుతున్న బ్రహ్మ.

సృష్టి జరిగిందీ అంటే మూలకారణం చూపించాలి. అది చూపించలేకపోతున్నారు.

**అందువల్ల అజాతివాదము సత్యము.**

స్వప్నంలో ఉన్నంతసేపూ అది సత్యమే అనిపించినా, జాగ్రత్ ప్రపంచానికి లేస్తే అది మిథ్య అని తెలుస్తుంది. అలాగే జాగ్రత్ ప్రపంచంలో ఉన్నంతసేపూ అది సత్యం అనిపించినా, పారమార్థిక స్థాయికి లేస్తే జాగ్రత్ ప్రపంచం స్వప్నం–2 అనీ, అది కూడా మిథ్య అనీ తెలుస్తుంది.

కాని ఇప్పుడు జాగ్రత్ ప్రపంచం మిథ్య అని అంగీకరించలేకపోతున్నారు. ఎందుకు? మీరు జాగ్రత్ పురుషునిగా ఉండి, జగత్తును మిథ్యగా కొట్టివేయటానికి ప్రయత్నిస్తున్నారు. అలా ఎన్నడూ చేయకూడదు. అది అర్థంలేని పని. ఈ విషయం చాలా స్పష్టంగా అర్థం చేసుకోవాలి. విశ్వ దృష్ట్యా జాగ్రత్ ప్రపంచం మహాసత్యం. తురీయం దృష్ట్యా జాగ్రత్ ప్రపంచం కూడా స్వప్నప్రపంచంలాగా మిథ్య.

కాని జాగ్రత్ ప్రపంచానికీ, స్వప్నప్రపంచానికీ మధ్య ఒక భేదం ఉంది. స్వప్నప్రపంచం నుంచి జాగ్రదవస్థకు లేస్తే స్వప్నప్రపంచం మాయమవుతుంది. అందువల్ల అది ఎంత సత్యంగా అనిపించినా, అది మిథ్య అని అర్థం చేసుకోవటం తేలిక. కాని జాగ్రత్ ప్రపంచం నుంచి తురీయానికి లేచినా, ఈ ప్రపంచం మిథ్య అని తెలిసినా, ఈ ప్రపంచం మీ కంటి ముందునుంచి మాయమవదు. ద్వైతం అలాగే ఉంటుంది. కాకపోతే, దాన్ని చూసే మీ దృక్పథం మారుతుంది. స్వప్నప్రపంచం స్వప్నం అని తెలిసి, దాన్ని చూస్తే ఎలా ఉంటుంది? అలా ఉంటుంది జాగ్రత్ ప్రపంచం మిథ్య అని తెలిసి, దాన్ని అనుభవించటం. జ్ఞాని ఈ జాగ్రత్ ప్రపంచాన్ని కూడా స్వప్నంలా చూస్తాడు. అతనికి ఈ ప్రపంచం స్వప్నం–2 అవుతుంది. ఎందుకంటే అనుభవంలోకి వచ్చినదేదీ నిజం కాదని అతనికి తెలుసు.

**జాగ్రత్ ప్రపంచః మిథ్యా దృశ్యత్వాత్ స్వప్నప్రపంచవత్**

**కారిక 4.40**

**నాస్త్యసద్ధేతుకమసత్సదసద్ధేతుకం తథా ।**
**సచ్చ సద్ధేతుకం నాస్తి సద్ధేతుకమసత్కుతః ॥**

ఈ కారికల్లో గౌడపాదాచార్యులవారు నిరూపించదలుచుకున్న విషయం - **అహం సత్యం, జగత్ మిథ్యా.** ఈ జ్ఞానం పొందితే మిథ్యా జగత్తులో ఏం జరిగినా, సత్య అధిష్ఠానమైన నన్ను బాధించదు. దీన్నే జీవన్ముక్తి అంటారు.

గౌడపాదాచార్యులవారిది అజాతివాదము. జాగ్రత్, స్వప్నప్రపంచాలు రెండూ మిథ్య. ఇంకో విధంగా చెప్పాలంటే, జగత్తు ఆత్యంతిక సత్యం కాదు, ఆపేక్షిక సత్యం మాత్రమే. జగత్తు ఆపేక్షిక సత్యం అంటే నిజం జగత్తు బ్రహ్మనుంచి రాలేదని అర్థం.

**మిథ్యాజగత్తు పుట్టింది అన్నా, నిజం జగత్తు పుట్టలేదు అన్నా ఒకటే**

మిథ్యాజగత్తు పుట్టింది అంటే అది మిథ్యా సృష్టివాదము అవుతుంది. నిజం జగత్తు పుట్టలేదు అంటే అది అజాతివాదము అవుతుంది. పేరేదైనా అర్థం ఒకటే.

సృష్టి నిజంగా జరిగినట్టు ఉన్నా, నిజంగా సృష్టి లేదు. ఇది మాయయొక్క మాయ. చైతన్యతత్త్వానికి పుట్టుక లేదు. శాంతం శివమద్వైతమ్ - మంత్రం 7

**ఈ విధంగా గౌడపాదాచార్యులవారు వేదాంతసారాన్ని స్వప్నదృష్టాంతంతోనూ, ఇంద్రజాల దృష్టాంతంతోను వివరించి చెప్పారు. వేదాంతసారం - అద్వైతం సత్యం, జగన్మిథ్యా.**

2 బి) **వేదాంతసారం - ఇంకొకసారి - కారికలు 57-74**

మిథ్యా జగత్తు పుట్టింది - మిథ్యా సృష్టివాదము; జగత్తు నిజంగా పుట్టలేదు - అజాతివాదము.

**దృక్-దృశ్య వివేకం - కారికలు 63-67**

గౌడపాదాచార్యులవారు వేదాంతసారాన్ని కారికలు 57-74 వరకూ మళ్ళీ వివరిస్తున్నారు. మాండూక్యంలో మనం నేర్చుకుంటున్న సారం -

**అవస్థాత్రయ తురీయమ్ ఆత్మా అహమస్మి**

ఈ భావాన్ని గౌడపాదాచార్యులవారు అనేక కోణాల్లోంచి వివరించుకు వస్తున్నారు. ఇప్పుడు 63-67 కారికలలో వాడుతున్న ప్రక్రియను దృక్దృశ్య వివేకం అంటారు. ఆ కారికలను చూసేముందు ఆ ప్రక్రియను విడిగా చూద్దాము.

దీన్ని ముందు దృక్ - దృశ్య వివేకం అనే ప్రకరణ గ్రంథపరంగా చూద్దాము. జగత్తునుంచీ చూద్దాము. జగత్తును కన్ను చూస్తుంది.

జగత్తు దృశ్యం 1, కన్ను దృక్ 1

కన్ను ఎలా పనిచేస్తుందో మనస్సుకు తెలుస్తుంది.

కన్ను దృశ్యం 2, మనస్సు దృక్ 2

మనస్సులో రేగే ఆలోచనలను సాక్షి చూస్తుంది.

మనస్సు దృశ్యం 3, సాక్షీ దృక్ 3

సాక్షిని చూసేది ఎవరు? దృగేవ న తు దృశ్యతే.

ఇప్పుడు ఈ దృక్-దృశ్యాల జంటలను తీసుకుంటే జగత్తు ఎప్పటికీ దృశ్యమే, అది దేన్నీ చూడదు. కన్నుకు, మనస్సుకు రెండు హోదాలు ఉన్నాయి. సాక్షి విషయం చూస్తే అది ఎప్పటికీ దృక్కే, దృశ్యం ఎన్నటికీ కాదు.

దీన్నే గౌడపాదాచార్యులవారు ఇక్కడ చెబుతున్నారు, కాకపోతే ఇందులో కన్ను భాగం చూడము. అందువల్ల మూడే అంశాలు వచ్చాయి. అవి జగత్తు, మనస్సు, చైతన్యం.

సూత్రం 1 - చైతన్యం - ఎప్పటికీ దృక్, ఎన్నటికీ దృశ్యం కాదు
మనస్సు - జగత్తు పరంగా దృక్, చైతన్యం పరంగా దృశ్యం
జగత్తు - దృశ్యం మాత్రమే, ఎన్నటికీ దృక్ కాదు.

సూత్రం 2 - దృక్ చూస్తేనే దృశ్యానికి ఉనికి ఉంది
కాబట్టి దృక్ సత్యం,దృశ్యం మిథ్య

**యత్ దృశ్యం తత్ మిథ్యా ఘటవత్**

ఇప్పుడు ఈ రెండు సూత్రాలను తీసుకుని, గౌడపాదాచార్యులవారు దశలవారీగా చైతన్యం సత్యం; జగత్తు, మనస్సు మిథ్య అని నిరూపించబోతున్నారు. అదెలాగో చూద్దాము.

దశ 1 - మనస్సు-జగత్తు జంటను చూద్దాము.

సూత్రం 1 ప్రకారం మనస్సు దృక్, జగత్తు దృశ్యం
సూత్రం 2 ప్రకారం మనస్సు సత్యం, జగత్తు మిథ్య

జగత్తుకి విడిగా ఉనికి లేదు, మనస్సు చూస్తేనే దానికి ఉనికి ఉంది. ఎక్కడో ఏదో అద్భుతం జరిగింది, కాని ఆ విషయం మీకు తెలియకపోతే, ఆ అద్భుతాన్ని మీరు అనుభవించలేరు. అలాగే ఏదో బాధాకరమైన సంఘటన జరిగింది. అది మీకు తెలియకపోతే

మీరు దాని గురించి దుఃఖించలేరు. అంటే ఏ విషయమైనా సరే, మీ మనస్సుకు చేరితేనే, మీ మనస్సు ఆనందాన్నో, దుఃఖాన్నో అనుభవించగలదు. దీనివల్ల తెలిసిన విషయం ఏమిటి? దృశ్యం విలువ దృక్ చూస్తేనే ఉంటుంది; కాని దృక్ విలువ దృశ్యం లేకపోయినా ఉంటుంది. ఈ సూత్రం ప్రకారం మనస్సు సత్యం, జగత్తు మిథ్య.

**ప్రపంచః మిథ్యా చిత్త దృశ్యత్వాత్ స్వప్నవత్**

ఓ మనస్సా, మిడిసిపడకే అంటున్నారు గౌడపాదాచార్యులవారు. జగత్తుపరంగా మనస్సు సత్యమే. కాని తర్వాత దశకు రమ్మంటున్నారు.

దశ 2 – చైతన్యం–మనస్సు జంటను చూద్దాము.

సూత్రం 1 ప్రకారం – చైతన్యం దృక్, మనస్సు దృశ్యం

సూత్రం 2 ప్రకారం – చైతన్యం సత్యం, మనస్సు మిథ్య

జగత్తు మిథ్య, మనస్సు మిథ్య అంటే అదే ఊపులో చైతన్యం కూడా మిథ్య అనేయకూడదు. ముందే చూశాము, చైతన్యం దృక్ మాత్రమే, ఎన్నటికీ దృశ్యం కాదు.

**దృగేవ న తు దృశ్యతే.** అందువల్ల చైతన్యం సత్యం, మనస్సు మిథ్య.

**చిత్తం మిథ్యా సాక్షి దృశ్యత్వాత్ స్వప్నవత్**

దశ 3 – దశ 1 పరంగా – జగత్తు మిథ్య

దశ 2 పరంగా – మనస్సు మిథ్య

అందువల్ల చైతన్యం సత్యం – జగత్తు, మనస్సు మిథ్య

**సాక్షీః సత్యః అదృశ్యత్వాత్ వ్యతిరేకేన స్వప్నవత్**

స్వప్నప్రపంచానికి భిన్నంగా సాక్షి సత్యం. ఎందుకంటే సాక్షి దృశ్యం కాదు, దృక్ మాత్రమే.

జగత్తు మిథ్య అని నిరూపించటానికి గౌడపాదాచార్యులవారు రెండు ఉదాహరణలను ఇస్తున్నారు. సిద్ధపురుషులు ఎలాగైతే అనేక వస్తువులను తన సిద్ధులద్వారా సృష్టించగలడో, ఇంద్రజాలికుడు ఎలా లేని వస్తువులను సృష్టించగలడో, అలా భగవంతుని సృష్టి అయిన జగత్తూ మిథ్యే. ఇంద్రజాలికుని సృష్టి ప్రాతిభాసికం అయితే సిద్ధపురుషుని సృష్టి వ్యావహారికం. ఇంద్రజాలికుడు మాయావి అయితే, సిద్ధపురుషుడు మహాయోగి. వీరిలో ఎవరు సృష్టించినా రెండూ మిథ్యే. వీరిని మించిన మాయావి, మహాయోగి భగవంతుడు. అందువల్ల భగవంతుని సృష్టి అయిన జగత్తూ మిథ్యే. అది వచ్చిపోతున్నట్టుగా భ్రమింపజేస్తుంది.

జీవాత్మ అసలు పుట్టలేదు అని ఎందుకు అంటున్నాము? జీవాత్మ కార్యం అవాలంటే, పరమాత్మ కారణం అవాలి. కాని వేదాంతం పరమాత్మ కార్య–కారణ విలక్షణం అంటుంది.

కారణం నాస్తి తస్మాత్ కార్యమపి నాస్తి

మరయితే ఏం ఉంది? ఉన్నదొకటే సత్యం. అది పారమార్థిక సత్యం. మాండూక్య పరిభాషలో తురీయం. ఆ తురీయం ఎక్కడ ఉంది? దిక్కులు చూడకండి. ఇదంతా మంత్రం 7వ వివరణే.

కార్యకారణవిలక్షణ తురీయచైతన్యమ్ అహమస్మి

జీవుడు పుట్టలేదు, జగత్తు పుట్టలేదు అంటే ఈ పుట్టిన జీవులు, జగత్తుల మాటేమిటి? ఈ ప్రశ్న ఎన్నిసార్లు అడిగినా జవాబు ఒకటే. స్వప్నప్రపంచం నిజంగా పుట్టినట్టుగా ఉంటుంది. అలాగే ఈ జగత్తు వ్యావహారిక దృష్ట్యా పుట్టింది. 'స్వప్నప్రపంచం సత్యమా, మిథ్యా?' స్వాప్నికుని దృష్ట్యా అది సత్యమే. అలాగే జాగ్రత్ పురుషుని దృష్ట్యా జాగ్రత్ ప్రపంచం మహాసత్యం. అందువల్ల జాగ్రత్ ప్రపంచం సత్యమా, మిథ్యా అంటే పారమార్థిక దృష్ట్యా జాగ్రత్ ప్రపంచం మిథ్య.

**వ్యావహారిక దృష్ట్యా జగత్తు మహాసత్యం**
**పారమార్థిక దృష్ట్యా జగత్తు మిథ్య, తురీయం సత్యం.**

3) **అలాత దృష్టాంతం – కారికలు 47-56**

ఈ కారికల్లో కూడా వేదాంతసారం చూస్తాము కాని కోణం మారుతుంది. అంతకు ముందు స్వప్నదృష్టాంతం, ఇంద్రజాల దృష్టాంతంనుంచి చెబితే, ఇప్పుడు ఇంకొక దృష్టాంతాన్ని తీసుకున్నారు గౌడపాదాచార్యులవారు. దాన్ని అలాతం అంటారు. అలాతం అంటే కొరివి, కాగడా, దివిటీ అనవచ్చు. ఇక్కడ మనం కొరివి పదం వాడదాము. కొరివి అంటే ఒక పొడుగు కర్రకు ఒక చివర ఒక బట్టను లావుగా చుట్టి, దాన్ని నూనెలో ముంచి వెలిగిస్తారు. దాన్నుంచి వచ్చే కాంతి చాలా ప్రకాశవంతంగా ఉంటుంది. ఇప్పుడంటే టార్చ్‌లైట్లు వచ్చాయి కాని అప్పుడు ఇవే ఉండేవి.

అలాతదృష్టాంతం వాడుతున్నారు కాబట్టి ఈ అధ్యాయానికి అలాతశాంతి ప్రకరణం అని పేరు వచ్చింది. ఈ అలాతాన్ని తిప్పితే కొన్ని ఆకారాలు ఏర్పడతాయి. వాటిని **స్పందనం** అంటారు. అలాతాన్ని తిప్పితే వచ్చే ఆకారాలని ఆభాస అంటారు. అలాతాన్ని ఇప్పటి దీపావళి టపాకాయల్లోని కాకరపువ్వుతో పోల్చవచ్చు.

అలాతాన్ని నిలువుగా తిప్పితే, నిలువుగా ఆకారాలు ఏర్పడతాయి; గుండ్రంగా తిప్పితే, వృత్తాకారంలో ఆకారాలు ఏర్పడతాయి. వాటితో ఎన్ని రకాలైన ఆకారాలనైనా ఏర్పరచవచ్చు.

ఈ ఆకారాలను ద్వైతప్రపంచంలో ఉన్న అనేక వస్తువులతో పోల్చవచ్చు. అలాతాన్ని బ్రహ్మతోనూ, ఆకారాలను ద్వైతప్రపంచంతోనూ పోలుస్తారు గౌడపాదాచార్యులవారు ఈ కారికల్లో. ఈసారి వేదాంతసారాన్ని అలాత దృష్టాంతంతో వివరించబోతున్నారు.

మనం అలాతానికి, బ్రహ్మకూ మధ్యనున్న పోలికలు చూద్దాము.

1. **ఏకం** – ఈ అలాతం చివర ప్రకాశిస్తుంది అని చూశాము. అది ఒకవైపు, ఒక చివర మాత్రమే ఉంటుంది. అది ఏకం, అద్వైతం. దాన్నుంచి వచ్చే ఆకారాలను ఆభాస అన్నాము. ఈ ఆభాస అనేకం, ద్వైతం. అలాగే బ్రహ్మ ఏకం, ద్వైతప్రపంచం అనేకం.

2. **స్వయంప్రకాశకం** – అలాతం స్వయంప్రకాశకం. అది వెలుగుతున్నదో లేదో గమనించటానికి ఇంకొక టార్చ్‌లైటు అవసరం లేదు. దాని కాంతే చాలు. అదే విధంగా బ్రహ్మ స్వయంజ్యోతి. బ్రహ్మవల్ల తక్కినవాటిని చూస్తాము కాని, బ్రహ్మను వేరేదానితో చూడము. దృగేవ నతు దృశ్యతే.

3. **కారణం** – మండుతున్న అలాతాన్ని తిప్పితే, అనేక ఆకారాలు ఏర్పడుతున్నాయి. అందువల్ల ఆకారాలు కార్యం, వాటికి అలాతం కారణం. అదే విధంగా జగత్తు కార్యం, బ్రహ్మ దానికి కారణం.

4. **స్వతంత్రం** – ఈ అలాతం చీకటిగదిలో స్వతంత్రంగా ప్రకాశించగలదు. కాని ఆకారాలకు విడిగా ఉనికి లేదు. నేను ఈ చీకటిగదినుంచి ఈ అలాతాన్ని తీసుకువెళతాను, ఈ ఆకారాలు వాటంతట అవి ఏర్పడనీ అని అనలేరు. అలాతం లేనిదే ఆకారాలు ఏర్పడలేవు. అదే విధంగా జగత్తు ఉన్నా లేకపోయినా బ్రహ్మ ఉంటుంది.

**ఏకమేవాద్వితీయమ్**

కాని బ్రహ్మ అనే కారణం లేకపోతే, జగత్తు అనే కార్యం లేదు.

| **అలాతం** | **ఆభాస** | **బ్రహ్మ** | **జగత్తు** |
|---|---|---|---|
| ఏకం | అనేకం | ఏకం | అనేకం |
| స్వయంప్రకాశకం | పరతఃప్రకాశకం | స్వయంప్రకాశకం | పరతఃప్రకాశకం |
| కారణం | కార్యం | కారణం | కార్యం |
| స్వతంత్రం | పరతంత్రం | స్వతంత్రం | పరతంత్రం |

ఇదే సాంకేతిక పరిభాషలో చెప్పాలంటే –

**బ్రహ్మ సత్యం, ద్వైతప్రపంచం మిథ్యా**

ఇక్కడ రెండు విషయాలను గమనించాలి మనం.

1. ఉదాహరణను ఎంతవరకూ తీసుకోవాలో అంతవరకే తీసుకోవాలి. అలాతం విషయంలో, దాన్ని కదిపితే అనేక ఆకారాలు ఏర్పడతాయి అన్నాము. అలాగే బ్రహ్మనుంచి అనేక ఆకారాలు వస్తాయి అన్నాము. అక్కడ అలాతం, బ్రహ్మ-ఏకం; ఆకారాలు, జగత్తు - అనేకం అన్నాం.

కాని బ్రహ్మ విషయం వచ్చేసరికి అలాతాన్ని కదిపినట్టు బ్రహ్మను కదపలేము. ఇక్కడ బ్రహ్మ కదలిక అంటే ఆలోచనల లేదా మాయ కదలిక. వ్యష్టిపరంగా చూస్తే ఆలోచనల కదలిక, చైతన్యంయొక్క కదలికగా కనిపిస్తుంది. జాగ్రత్, స్వప్నావస్థల్లో ఆలోచనలు ఉండటంవల్ల చైతన్యం కదులుతున్నట్టుగా కనిపిస్తుంది. కాని సుషుప్తికి వచ్చేసరికి మనస్సు పడుకుంటుంది కాబట్టి, ఆలోచనలు ఉండవు. ఆలోచనలు ఉండకపోతే, కదలిక తెలియదు. కదలిక తెలియకపోతే చైతన్యస్పందనం తెలియదు. అందువల్ల బాహ్యప్రపంచం (ఆకారాలు) తెలియదు. అందువల్ల చైతన్యానికి భిన్నంగా ప్రపంచం లేదు.

**చైతన్యం సత్యం, జగన్మిథ్యా**

నేనెవరు? నేను చైతన్యాన్ని. ఈ విషయం మర్చిపోకూడదు. వేదాంతం అంతా విని నేను మిథ్యాజగత్తును అనకూడదు.

**అవస్థాత్రయ తురీయ చైతన్యమ్ అహమస్మి**

ఈ సారం తంబూరా శ్రుతిలాగా మీ మనస్సులో నిరంతరం మెదులుతూనే ఉండాలి.

మొదటి అంశం - చైతన్యం అలాతం కదిలినట్టుగా నిజంగా కదలదు.

2. మొదట్లో అలాతం కారణం, ఆభాస కార్యం అన్నాము నిజమే. ఆభాస అంటే అలాతంనుంచి ఏర్పడిన ఆకారాలు. అందువల్ల అలాతానికీ-ఆభాసకీ కారణ-కార్య సంబంధం ఉంది అనికూడా అన్నాము. కాని తరువాత అలాతం కూడా కారణ -కార్య విలక్షణం అంటాము. ఎందుకంటే సంబంధం ఉండాలంటే రెండు వస్తువులు ఉండాలి. కాని అలాతాన్ని, ఆభాసను రెండు భిన్నవస్తువులుగా చూడలేము. అలాతం లేనిదే ఆభాసానికి విడిగా ఉనికి లేదు. చీకటిగదిలోంచి అలాతాన్ని తెచ్చేస్తే, ఆకారాలు వాటంతట అవి ఏర్పడవని చూశాము. అంటే అవి రెండు భిన్నవస్తువులు కావు, ఒకటే పదార్థానికి ఉన్న రెండు భిన్ననామాలు.

**నామ ద్వయం, వస్తు ఏకమ్**

రెండు పేర్లు ఉన్నాయి కాని ఉన్నదొకటే వస్తువు అని ఇప్పటిదాకా అనేక ఉదాహరణలతో చూశాము. బంగారం-ఆభరణాల దృష్ట్యా చూశాము; మట్టి-కుండ పరంగా చూశాము.

ఇప్పుడు అలాతం-ఆభాస పరంగా చూస్తాము. అంతే తేడా. అలాతం కదిలి ఆకారాలు ఏర్పడితే, కదిలినప్పుడు దాన్ని స్పందనం అంటుంది; అలాతం కదలకుండా ఆగిపోయినప్పుడు, ఆకారాలు కూడా ఆగిపోతాయి. అలా అలాతం ఆగితే దాన్ని శాంతి అంటారు. అందువల్ల ఈ ప్రకరణానికి అలాతశాంతి ప్రకరణం అని పేరు వచ్చింది.

అలాగే మొదట్లో బ్రహ్మ కారణమనీ, జగత్తు కార్యమనీ చెబుతుంది శాస్త్రం. శిష్యుని బుద్ధి సూక్ష్మమయ్యాక, కారణ-కార్య సంబంధం అంటూ లేదనీ, బ్రహ్మ, జగత్తు ఒకటే చైతన్యానికి ఉన్న రెండు పేర్లనీ చెబుతుంది. అలాతంతో చైతన్యాన్ని పోలిస్తే కదలికలేని అలాతం బ్రహ్మ, కదులుతున్నప్పుడు ఏర్పడిన ఆకారాలు జగత్తు. జగత్తు, బ్రహ్మ ఒకే చైతన్యానికి రెండు పేర్లయినప్పుడు, వాటిమధ్య కారణ-కార్య సంబంధానికి చోటేది? అందువల్ల బ్రహ్మ కారణకార్య విలక్షణం; ఆ బ్రహ్మను నేనే.

**కారిక 4.49**

**అలాతే స్పందమానే వై నాభాసా అన్యతోభువః ।**
**న తతోఽన్యత్ర నిస్స్పందాన్నాలాతం ప్రవిశంతి తే ॥**

అలాతంనుంచి వచ్చిన ఈ ఆకారాలను విశ్లేషిస్తే, వచ్చే జవాబులు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. అలాతం కదిలితే ఆకారాలు వస్తున్నాయి, శాంతిస్తే ఆకారాలు మాయమవుతున్నాయి. అలాతం కదులుతున్నప్పుడు -

1. ఆకారాలు అలాతం లోపలినుంచి రావు
2. ఆకారాలు అలాతం బయటనుంచి రావు

అలాతం శాంతించినప్పుడు -

3. ఆకారాలు అలాతం బయటకు పోవు
4. ఆకారాలు అలాతం లోపలకు పోవు

ఈ నాలుగు వాక్యాలలోని ఆకారాలు, అలాతం పదాల బదులు జగత్తు, చైతన్యపరంగా చూస్తే ఇలా వస్తాయి.

చైతన్యం కదులుతున్నప్పుడు (మాయద్వారా సృష్టి జరిగినప్పుడు) -

1. ద్వైతప్రపంచం చైతన్యం లోపలినుంచి రాదు
2. ద్వైతప్రపంచం చైతన్యం బయటనుంచి రాదు

చైతన్యం శాంతించినప్పుడు (ప్రళయకాలంలో) -

3. ద్వైతప్రపంచం చైతన్యం బయటకు పోదు
4. ద్వైతప్రపంచం చైతన్యం లోపలకి పోదు

అంటే జగత్తుయొక్క సృష్టి గురించి తార్కికంగా మాట్లాడలేము. జగత్తుయొక్క రాకపోకలు తర్కానికి అందవు. దానికి క్రియాపదాన్ని వాడలేము. ఒక వస్తువు ఉంటే కదా, దానికి క్రియాపదం వాడేది. అటు ఆకారాలు కాని, ఇటు జగత్తు కాని లేకపోతే, వాటి రాకపోకలనే క్రియాపదాన్ని ఎలా వాడతారు?

ఈ అలాతశాంతి దృష్టాంతం ప్రకారం, ఏ విధంగా ఏ వస్తువు కూడా దేనినుంచీ పుట్టదు. పదార్థం పుట్టలేదు కాని జగత్తును ఆరోపిస్తున్నాము అంటే అభాస చేస్తున్నాము.

అలాతంనుంచి ఆభాస వచ్చినట్టుగా ఉంది అన్నప్పుడు అలాతానికీ – ఆభాసకూ కారణ–కార్య సంబంధం ఉంది అన్నాము. కాని తరువాత ఉన్నదొకటే అలాతం అని నిరూపించినప్పుడు అలాతం కార్య–కారణ విలక్షణం అంటాము.

### నామద్వయం, వస్తు ఏకమ్

స్థూలబుద్ధి ఉన్న శిష్యునికి అర్థం అవటంకోసం, బ్రహ్మ కారణమనీ, జగత్తు కార్యమనీ ముందు చెబుతుంది శాస్త్రం. తరువాత, శిష్యుని బుద్ధి సూక్ష్మమయ్యాక, కారణ–కార్య సంబంధం అంటూ లేదనీ, బ్రహ్మ, జగత్తు ఒకటే చైతన్యానికి ఉన్న రెండు పేర్లనీ చెబుతుంది. అందువల్ల బ్రహ్మ కారణ కార్య విలక్షణం. ఆ బ్రహ్మను నేనే. అహం అస్పర్శః. ఇవీ ఈ కారికల సారాంశం.

ఈ నాలుగు దశలను టూకీగా చూస్తే,

1. ఆకారాలకు విడిగా ఉనికి లేదు కాబట్టి, ఆకారాలను ఖండిస్తాము
2. ఆకారాలను ఖండిస్తే, ద్వైతం లేదు
3. ద్వైతం లేకపోతే, కార్యకారణ సంబంధం లేదు
4. కార్యకారణ సంబంధం లేకపోతే, మిగిలేది అద్వైత అలాతం.

ఈ సూత్రాన్ని జగత్తుకూ, బ్రహ్మకూ అన్వయించి చూద్దాము.

1. జగత్తుకు విడిగా ఉనికి లేదు కాబట్టి, జగత్తును ఖండిస్తాము
2. జగత్తును ఖండిస్తే, ద్వైతం లేదు
3. ద్వైతం లేకపోతే, కార్యకారణ సంబంధం లేదు
4. కార్యకారణ సంబంధం లేకపోతే, మిగిలేది అద్వైతతురీయం, చైతన్యం.

### కార్యకారణ విలక్షణ తురీయ చైతన్యమ్

ఆ తురీయం ఎక్కడ ఉంది అని అడిగితే దిక్కులు చూడకూడదు. ఆ తురీయాన్ని నేనే అని చెప్పగలగాలి. కార్యకారణ విలక్షణ తురీయ చైతన్యమ్ అహమస్మి

ఈ వాక్యాన్ని ఆత్మస్థైర్యంతో చెప్పగలిగితే, మాండూక్య కారికలు మీకు బాగా అర్థమయ్యాయన్నమాట. అలాతశాంతిదృష్టాంతం ఏడవ మంత్రాన్ని విశ్లేషించే అద్భుతమైన దృష్టాంతం. ఇది అర్థం చేసుకుంటే, ప్రతిక్షణమూ ఆనందంగా గడుపుతారు.

**4) సంసార కారణం, నివృత్తి – కారికలు 75–86**

కార్యకారణ విలక్షణ తురీయ చైతన్యమ్ అహమస్మి

ఈ సత్యానికి ఎదగనంతవరకూ, ఎవరైనా సరే సంసారంనుంచి తప్పించుకోలేరు. ఈ జ్ఞానం మోక్షం పొందే అనేక మార్గాలలో ఒకటి కాదు. ఈ జ్ఞానం ఒక్కటే మోక్షం పొందే మార్గం. ఇది అర్థం చేసుకోవటం చాలా కష్టంగా ఉంది, నేను దీన్ని వదిలేసి వేరే మార్గంలో ప్రయత్నించవచ్చా అని ఎవరైనా అడిగితే, వేరే మార్గం లేదని ఖచ్చితంగా చెబుతారు గౌడపాదాచార్యులవారు. అది కష్టమయితే, తేలికగా అర్థం చేసుకోవటానికి తనను తాను సంసిద్ధం చేసుకోవాలి అంతే.

మీరెందుకు ఇంత ఉన్మాదులుగా ప్రవర్తిస్తున్నారు? మీరు మాండూక్యం బోధించాలని కంకణం కట్టుకుని, దానికి సాధకులను ఆకర్షించటానికా? గౌడపాదాచార్యులవారు ఇది ఉన్మాదం కాదని, దీన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలనీ అంటున్నారు.

చీకటిని వెలుతురు మాత్రమే పారద్రోలుతుందని అంటే, అందులో ఉన్మాదం ఏం ఉంది? గుడ్డి నమ్మకం ఏం ఉంది? చీకటిని అనేక మార్గాల ద్వారా పారద్రోలగలమా? లేదే! ఒకటే మార్గం ఉంది. అది సత్యం. ఒక చీకటిగదిలో మీరు కూర్చుని విష్ణుసహస్రనామం చదివారనుకోండి, చీకటి పోతుందా? మీ భక్తివల్ల పుణ్యం వస్తుంది. ఆ గది ఊడ్చి, ముగ్గులు పెట్టారు. చీకటి పోయిందా? మీరు చేసిన కర్మవల్ల మీకు పుణ్యం వస్తుంది. మీరు శీర్షాసనం వేశారు. చీకటి పోయిందా? ఆ యోగాసనంవల్ల మీ రక్తప్రసరణ మెరుగుపడుతుంది. అందువల్ల చీకటిని పారద్రోలటానికి అనేక మార్గాలున్నాయనుకోవటం ఎంత అర్థంలేని పనో, అలాగే మోక్షానికి అనేక మార్గాలున్నాయి అనుకోవటం కూడా అంతే అర్థంలేని పని.

మీరెందుకు అంత ఉన్మాదంగా మాట్లాడుతున్నారు? కర్మ, ఉపాసన, భక్తి, యోగం – ఇలా అనేక మార్గాలను చెప్పవచ్చు కదా అని ఎవరైనా అంటే, అవేవీ కుదరవు అంటున్నారు గౌడపాదాచార్యులవారు. అవన్నీ చిత్తశుద్ధికి అనేక మార్గాలు కాని, మోక్షానికి జ్ఞానమొక్కటే మార్గం. గుడిలోకి అనేక ద్వారాలద్వారా వెళ్ళవచ్చేమో కాని, గర్భగుడిలోకి ఒక్క మార్గం ద్వారానే వెళ్ళాలి.

ఈ విషయాన్నే ఒకసారి టూకీగా చూద్దాము. అవి –

**అవిద్య → పరిచ్ఛేదం → కామం → కర్త → కర్మ → ఫలం → పునరపి జననం, పునరపి మరణం = సంసారం.**

మొదటిదశ, ఆఖరిదశ చూస్తే అవిద్య = సంసారం.

అందువల్ల మిథ్యా ప్రపంచంతో మమేకం చెందటం మన సమస్యకు కారణం. మనం మమేకం చెందేది ముందుగా మనశ్శరీరాలతో. వాటివల్ల అహంకారమమకారాలు పెరుగుతాయి. నేను, నావారు అనుకుంటాము. నావారులో నా కుటుంబం, నా స్నేహితులు, నా బంధువులు, నా వస్తువులు, నా ఊరు, నా నీటిసమస్య కూడా వస్తుంది. వీటిలో ఎంతగా కూరుకుపోతామంటే, ఇవి ఇంత సత్యంగా కంటికి ఎదురుగా కనిపించి, నన్ను చలింపజేస్తుంటే, జగత్తు మిథ్య అని ఎలా స్వీకరించగలను అనుకుంటాము. దానికి గౌడపాదాచార్యులవారు ఒక అద్భుతమైన పదాన్ని వేశారు. **అభినివేశః.** అభినివేశః అంటే మొండి పట్టుదల.

ఈ వృత్తంనుంచి బయటపడాలంటే వేదాంతం ఒక్కటే మార్గం. వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలి. వేదాంతం 'నువ్వు కర్తవా?' అని ప్రశ్నిస్తుంది. కర్మఫలం వృత్తం కర్తతో పెనవేసుకుని ఉంటుంది. కర్తగా ఉన్నంతవరకూ ఈ మూడు శరీరాల అభిమానం ఉంటుంది. 'నేనెవరు?' అని ప్రశ్నించుకుంటే మాండూక్యం నేర్చుకుంటే విశ్వ, తైజస, ప్రాజ్ఞులు నేను వేసుకునే మూడు వేషాలనీ, నేను తురీయాన్ని అనీ అర్థమవుతుంది.

పిల్లలు ఒక కాయిన్ గేమ్ ఆడతారు. ఒక పిల్లవాని నుదుటికి ఒక కాయిన్‌ను గట్టిగా కాసేపు నొక్కిపట్టి ఉంచి, అతనికి తెలియకుండా ఆ కాయిన్‌ను తీసేస్తారు తక్కినవారు. కాని అతనికి తన నుదుటి మీద కాయిన్ ఉందనే అనుకుంటాడు. తక్కినవారు, నీకు మూడు అవకాశాలు ఇస్తాము, నీ తల వెనక కొట్టుకుని, అక్కడ లేనేలేని నాణేన్ని కింద పడేయమంటారు. అతను మూడుసార్లు కొట్టుకున్నా అది పడదు. తక్కినవారు నవ్వులు చిందిస్తూ ఉంటారు, అయినా అతనికి అనుమానం రాదు. వారు ఉదారంగా ఇంకో మూడుసార్లు కొట్టుకోమని అవకాశం ఇస్తారు. ఎన్నిసార్లు కొట్టుకుని మాత్రం ఏమిటి లాభం? అక్కడ ఉంటే కదా, అది కింద పడటానికి! చివరికి అద్దం తెచ్చి చూపిస్తారు వారు. అలాగే లేనేలేని సంసారంనుంచి బయటపడటానికి విశ్వప్రయత్నం చేస్తున్నాము. అక్కడ ఉంటే కదా పోవటానికి అంటుంది శాస్త్రం. శాస్త్రం అనే దర్పణంలో చూస్తేగాని ఆ విషయం తెలియదు. ఇది నమ్మలేము. కాని సత్యం!

ఈ విధంగా అజ్ఞానం కారణం. అది దేహ అభిమానమనే పొరపాటుకి దారి తీస్తుంది. దానివల్ల కర్తగా మారి కర్మలు చేస్తాము. ఆ కర్మఫలం అనుభవించక తప్పదు.

**అజ్ఞానం → దేహ అభిమానం → కర్తా → కర్మ → కర్మఫలం**

ఈ కర్మఫలాలు మూడు రకాలు. అవి ఉత్తమ, మధ్యమ, అధమ ఫలాలు. అవి వరుసగా ఊర్ధ్వలోకాలకు, మనుష్యలోకానికి, అధోలోకాలకు తీసుకువెళతాయి. అలా పునరపి జననం, పునరపి మరణం తప్పదు. జ్ఞానికి ఈ కర్మఫలాలు అంటవు. అంటే జ్ఞాని కొత్తగా మోక్షం పొందదు. ముక్తి నా స్వస్వరూపం అని తెలుసుకుంటాడు. స్వప్నంలో సమస్య నిజం సమస్య కాదు, దాన్నుంచి లేస్తే చాలు. స్వప్నంనుంచి లేస్తే సమస్య పరిష్కారం అవదు. స్వప్నంనుంచి లేస్తే అసలు పరిష్కారం కోరే సమస్యే లేదని అర్థమవుతుంది. అంటే అక్కడ సమస్యను పరిష్కరించలేదు, సమస్యను పారద్రోలాము. పరిష్కారం కోరే సమస్య లేదని అర్థం చేసుకున్నాము.

అలాగే మాండూక్య కారికలను అర్థం చేసుకున్నకొద్దీ తురీయస్వరూపం గురించి స్పష్టమైన జ్ఞానం కలుగుతుంది. తురీయం అకర్త. విశ్వ, తైజసలు కర్త. ఎప్పుడైతే మీరు అకర్త అయిన తురీయం అని అర్థం చేసుకుంటారో, అప్పుడే మీకు సంచిత, ఆగామి, ప్రారబ్ధకర్మలు అంటవు. ఆ కర్మలను మీరు కష్టపడి క్షయం చేసుకోనవసరం లేదు. మీకు అసలు కర్మలు లేవు. కర్తే మిథ్య అయినప్పుడు కర్త చేసే కర్మలు ఎలా సత్యమవుతాయి?

ఎలాగైతే స్వప్నంనుంచి మీ ఉన్నతస్థాయికైన జాగ్రత్ పురుషునికి లేస్తే మీ స్వప్నశరీరం-స్వప్నప్రపంచం మిథ్యగా తేలిపోతాయో, అలాగే మీ ఉన్నతస్థాయి అయిన తురీయానికి లేస్తే, ఈ జాగ్రత్ శరీరం-జాగ్రత్ ప్రపంచం మిథ్యగా తేలిపోతాయి.

**స ఆత్మా స విజ్ఞేయః**

అంటే ఆత్మజ్ఞానం పొందటంవల్లనే మోక్షం అని ముందే చూశాము. ఈ జ్ఞానం గొప్పదనం ఏమిటంటే, మీ జీవితంలో ఏ ఒడిదుడుకులు ఎదురైనా అది మారదు. 2+2=4 ఇది సర్వజనీన జ్ఞానం. ఇది మీ ఆరోగ్యం ఎలా ఉన్నా మారదు. అలాగే అహం బ్రహ్మ అస్మి జ్ఞానం మీరు శనిదశలో ఉన్నాకూడా మారదు. శనిదశను మీరు తప్పించుకోలేకపోవచ్చు, కాని జ్ఞానజన్యశాంతి కొనసాగుతుంది. ఈ మోక్షం బ్రహ్మతో సమానం. అది అజం, అద్వయం.

కాని వచ్చిన చిక్కేమిటంటే, జ్ఞానం పొందాక కూడా, జ్ఞాని తన ప్రారబ్ధకర్మను క్షయం చేసుకోవటానికి ఈ జాగ్రత్ ప్రపంచంతో వ్యవహారం నడపక తప్పదు. ప్రారబ్ధక్షయం

సుఖదుఃఖాల అనుభవం ద్వారానే కలుగుతుంది. అలా జగత్తుతో వ్యవహారం నడిపేటప్పుడు జ్ఞాని ఏమాత్రం అజాగ్రత్త చూపినా సంసారం దూసుకు వచ్చేస్తుంది. అలా రాకుండా, స్వస్వరూపంలో నిలబడాలంటే, జ్ఞాననిష్ఠలో నిలబడాలి. జ్ఞానం పొందీ, క్లిష్టపరిస్థితిలో అది గుర్తుకు రాకపోతే అజ్ఞానికీ, జ్ఞానం పొంది మర్చిపోయిన వ్యక్తికీ ఏమీ భేదం ఉండదు. అందువల్ల జ్ఞాననిష్ఠలో నిలబడాలంటే రెండు అంశాలు గుర్తుంచుకోవాలి.

1. నేను తురీయాన్ని అనే జ్ఞానం పొందాలి.
2. నేను విశ్వ, తైజస, ప్రాజ్ఞ అనుకునే అధ్యాస పోవాలి.

ఈ జ్ఞాననిష్ఠలో నిలబడితే, నాలుగు ఫలాలు కలుగుతాయి అంటున్నారు గౌడపాదాచార్యుల వారు. అవేమిటో చూద్దాము.

ఎ) **సర్వజ్ఞత్వ ప్రాప్తి**

**కస్మిన్ను భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి॥** – ముండకమ్

ఏ ఒక్క విజ్ఞానం పొందితే అన్ని జ్ఞానాలూ పొందినట్టు అవుతుందని ప్రశ్న. దానికి జవాబు ఆత్మజ్ఞానం. ఆత్మజ్ఞానం పొందితే సర్వజ్ఞుడవుతాడు. ఎందుకంటే జగత్తులో ఉన్నదేది తీసుకున్నా అది ఆత్మ+భిన్ననామరూపం మాత్రమే. అందువల్ల ఆత్మజ్ఞానం పొందితే సర్వజ్ఞానం పొందినట్టు అవుతుంది.

బి) **బ్రాహ్మణత్వ ప్రాప్తి** – బ్రాహ్మణత్వం పొందుతాడు అంటే బ్రహ్మజ్ఞానం పొందుతాడు. అంటే అసలైన బ్రాహ్మణుడు అవుతాడు.

సి) **బ్రహ్మప్రాప్తి** – ఎవరు బ్రహ్మజ్ఞానం పొందుతారో, అతను బ్రహ్మ అవుతాడు. తను చైతన్యపరంగా బ్రహ్మ అని అర్థం చేసుకుంటాడు.

డి) **పూర్ణత్వ ప్రాప్తి** – పూర్ణత్వభావన వస్తుంది. ఇంకో విధంగా చెప్పాలంటే, సంసారనివృత్తి కలిగి, మోక్షప్రాప్తి కలుగుతుంది.

ఈ ఫలాలు శాంతం శివం అద్వైతం తురీయం అహమస్మి అనే జ్ఞానం కలగటంవల్ల కలిగే ప్రత్యక్షఫలాలు.

ఇవికాక అవాంతర ఫలం జీవన్ముక్తి. జీవన్ముక్తి అంటే వినయం, శమం, దమం, విలువలు సహజంగా పెరుగుతాయి.

సంసార కారణం, సంసార నివృత్తి టూకీగా చూద్దాము.

**అజ్ఞాన సహిత అధ్యాసః ఏవ సంసారస్య కారణమ్**

అజ్ఞానంతో కూడిన పొరపాటు మాత్రమే సంసారానికి కారణం.

**అజ్ఞానం** – నేను తురీయాన్ని అనే విషయం తెలియని అజ్ఞానం.

**పొరపాటు** – నేను విశ్వ, తైజస, ప్రాజ్ఞ అని అనుకోవటమే అధ్యాస.

జ్ఞానం అంటే నేను తురీయాన్ని అనే జ్ఞానం ఎంత దృఢంగా పొందాలో, నేను విశ్వ తైజస ప్రాజ్ఞ కాదనే జ్ఞానం కూడా అంత దృఢంగానూ పొందాలి.

5) **మాండూక్యోపనిషత్తు సారం – కారికలు 87–89**

ఇక్కడ్నుంచీ మళ్ళీ ఇంకొక అంశంలోకి అడుగుపెడుతున్నారు గౌడపాదాచార్యులవారు. గౌడపాదాచార్యులవారు తను రచించిన ఈ 215 కారికలు తన స్వంత సిద్ధాంతాన్ని లేదా ఒక కొత్త సిద్ధాంతాన్ని తెలియజేయటం లేదనీ, మాండూక్యోపనిషత్తునే వివరిస్తున్నారనీ, మనం గుర్తుంచుకోవాలని భావిస్తున్నారు.

ఈ వివరణలో పడిపోయి, కారికలకు ఆధారమైన ఉపనిషత్తును మర్చిపోతే, ఆయన బోధ ఆయన స్వంతం అని మనం పొరపాటు పడే ఆస్కారం ఉంది. గౌడపాదాచార్యులవారు దీన్ని తన స్వంతంగా చాటి చెప్పుకోవాలనుకోవటం లేదు. అందువల్ల మనం మాండూక్యోపనిషత్తుని మర్చిపోకుండా, దాని సారాన్ని మనకి కారికలు 87–89లో గుర్తు చేయబోతున్నారు. మాండూక్యోపనిషత్తు సారం ఏమిటి?

**ప్రమాతృ ప్రమేయ ప్రమాణ విలక్షణ తురీయ ఆత్మా అహమస్మి**

ప్రమాత–ప్రమేయాల జంటలను మూడు అవస్థల్లోనూ చూశాము. అవి జాగ్రదవస్థ–జాగ్రత్ ప్రపంచం; స్వప్నావస్థ–స్వప్నప్రపంచం; సుషుప్తి అవస్థ–కారణ ప్రపంచం. ఈ మూడు జంటలూ మార్పుకు లోనవుతాయి. కాని నేను –

**అవస్థాత్రయ సాక్షిచైతన్యం అహమస్మి**

ఈ అవస్థాత్రయ వివేకాన్ని ఈ కారికలో చూడబోతున్నాము. ముందు వాటి సారం చూద్దాము. కాకపోతే, ఇక్కడ ఆ అవస్థలకు సాంకేతిక పదజాలాన్ని వాడుతున్నారు గౌడపాదాచార్యులవారు. ముందు అవేమిటో చూద్దాము.

| **సాంకేతిక పదం** | **అవస్థ** | **అనుభవం** |
|---|---|---|
| లౌకికమ్ | జాగ్రదవస్థ | అనుభవం, వస్తువు రెండూ ఉన్నాయి |
| శుద్ధం లౌకికమ్ | స్వప్నావస్థ | అనుభవం ఉంది, వస్తువు నిజంగా లేదు |
| లోకోత్తరమ్ | సుషుప్తి అవస్థ | అనుభవం లేదు, వస్తువు లేదు |

ఈ మూడు అవస్థల్లోనూ సబ్జెక్ట్–ఆబ్జెక్ట్ జంటను జ్ఞానం–జ్ఞేయం జంట అంటారు. జ్ఞానం–జ్ఞేయం రెండూ సవికారం. ఉదాహరణకు కుండ గురించిన జ్ఞానాన్ని ఘటజ్ఞానం అంటారు. కుండను జ్ఞేయం అంటారు. ఘటాన్ని చూస్తే ఘటజ్ఞానం కలుగుతుంది. కాని దాని తర్వాత గోడను చూస్తే, గోడజ్ఞానం కలుగుతుంది. అందువల్ల ఈ జ్ఞానం–జ్ఞేయం జంట మారుతూ ఉంటుంది.

ఈ మూడు అవస్థలకూ భిన్నంగా, మార్పులేని తత్త్వం ఒకటుంది. దాన్ని చైతన్యం అంటారు. ఆలోచనలు వస్తాయి, పోతాయి. కాని ఈ రాకపోకలు లేనిది చైతన్యం. ఆ చైతన్యాన్ని విజ్ఞేయం అంటారు.

**జ్ఞానం జ్ఞేయం చ విజ్ఞేయమ్** – జ్ఞానం మారుతున్న అనుభవాలను సూచిస్తే, జ్ఞేయం మారుతున్న బాహ్యవస్తువులను సూచిస్తుంది. విజ్ఞేయం మార్పులేని, సాక్షిచైతన్యం. దాన్నే మాండూక్య పరిభాషలో తురీయం అంటారు.

అన్ని ఉపనిషత్తులూ, మాండూక్యంతో సహా, జ్ఞానులు ఈ జ్ఞానం, జ్ఞేయం, విజ్ఞేయాల గురించి మాట్లాడుతారు అంటాయి.

**బుద్ధైః** – బుద్ధైః అంటే జ్ఞానులు. సంస్కృతంలో బుద్ధః పదాన్ని విశేషణంగా వాడతారు. బుద్ధః అంటే జ్ఞానం పొందిన వ్యక్తి, జ్ఞాని. అందువల్ల జ్ఞానుల ముందు దీన్ని విశేషణంగా వాడవచ్చు. బుద్ధాః శంకరాచార్యః, బుద్ధాః వ్యాసాచార్యః అనవచ్చు. ఇక్కడ జ్ఞానులు అని తీసుకోవాలి.

**సదా ప్రకీర్తితమ్** – ఈ జ్ఞానులు ఎప్పుడూ మాట్లాడుతూ ఉంటారు. ఈ మూడింటి గురించి ఎప్పుడూ మాట్లాడుతుంటారు.

ఈ జ్ఞానం–జ్ఞేయం పదాలను మూడు జంటలుగా మూడు అవస్థల్లోనూ చూడవచ్చు అంటున్నారు గౌడపాదాచార్యులవారు. కాకపోతే సుషుప్తిలో ఉన్న జ్ఞానం–జ్ఞేయం జంటను సుషుప్తిలో ఉండగా తెలుసుకోలేము. అది అవ్యక్తంలో ఉంటుంది. లేచాక తెలుస్తుంది. ఈ విధంగా మూడు జ్ఞానాలను, మూడు జ్ఞేయాలను, మూడు పాదాలుగా తెలుసుకోవాలి. వాటిని ప్రథమపాదం, ద్వితీయపాదం, తృతీయపాదం అనీ, జ్ఞానం–జ్ఞేయాలను ప్రమాత–ప్రమేయాలుగానూ నేర్చుకున్నాము. నాలుగవ పాదాన్ని అక్కడ తురీయంగా నేర్చుకుంటే, ఇక్కడ విజ్ఞేయం అంటున్నారు గౌడపాదాచార్యులవారు. తురీయం ప్రమాతృ ప్రమేయ విలక్షణం. అలాగే విజ్ఞేయం జ్ఞానం జ్ఞేయ విలక్షణం. ఈ విజ్ఞేయం గురించి నేర్చుకుంటే చైతన్యస్వరూపుడు అవుతాడు.

టూకీగా చూస్తే –

మూడు అనుభవాలు – (త్రివిధం జ్ఞానమ్), మూడు వస్తువులు (త్రివిధం జ్ఞేయమ్) మిథ్య. విజ్ఞేయాన్ని (తురీయాన్ని) తెలుసుకున్న జ్ఞాని సర్వాత్మక బ్రహ్మస్వరూపం పొందుతాడు.

6) **సాధనలు – కారిక 90**

**హేయజ్ఞేయాప్యపాక్యాని విజ్ఞేయాన్యగ్రయాణతః**

**తేషామన్యత్ర విజ్ఞేయాదుపలంభస్త్రిషు స్మృతః** – 90

ఈ కారికలో ఆత్మజ్ఞానం పొందటానికి కావాల్సిన సాధనలను టూకీగా ఇస్తున్నారు గౌడపాదాచార్యులవారు. నాలుగు సాధనలు – హేయమ్, జ్ఞేయమ్, ఆప్యమ్, పాక్యమ్.

1. **హేయమ్** – హేయం అంటే అక్షరాలా చూస్తే వదులుకోవటం. ఇక్కడ జగత్తుమీద ఆధారపడటం వదులుకోవాలి అని అర్థం. అంటే అనిత్యవస్తువుమీద వైరాగ్యం పెంచుకోవాలి.

2. **జ్ఞేయమ్** – ఇందులో దేన్ని పట్టుకోవాలో తెలుసుకుంటారు. శాశ్వతమైనదాన్ని పట్టుకోవాలి. అంటే తురీయజ్ఞానం పొందాలి.

హేయం జగన్మిథ్యా అంటే జ్ఞేయం బ్రహ్మ సత్యం అని నేర్పిస్తుంది.

3. **ఆప్యమ్** – ఇది తెలుసుకోవటానికి పొందాల్సిన అర్హతలు. అవి సాధన చతుష్టయ సంపత్తి పెంపొందించుకుని, శ్రవణం, మననం, నిదిధ్యాసనం చేయాలి.

4. **పాక్యమ్** – నాశనం చేయలేని వాటిని వండాలి. రాగద్వేషాలను నాశనం చేయలేము. వాటిని అదుపులో పెట్టుకోవాలి. వేయించిన గింజలాగా ఉండాలి. తురీయం సత్యం అని తెలుసుకున్నాక (జ్ఞేయాన్ని తెలుసుకున్నాక) హేయం, ఆప్యం, పాక్యాలను వదిలివేయాలి.

7) **ఉపసంహారం – కారికలు 91-100**

నేను కోరే శాంతి భద్రత పూర్ణత్వాలు నా స్వరూపం. నేను అనాదిగా శాంతం, శివం, అద్వైతం. నేను సాక్షి + అహంకారాల మేలుకలయికను. ప్రమాతగా –

**జ్ఞాన అయోగ్యత → జ్ఞానయోగ్యత → జ్ఞాని → జ్ఞాననిష్ఠ**
దశల్లో ప్రయాణిస్తాను. జ్ఞాననిష్ఠలో నిలబడ్డాక నేను ప్రమాతను కాను, ప్రయాణం లేదు, అశుద్ధం లేదు, సంసారం లేదు. నేను నిత్యముక్తశుద్ధతురీయాన్ని.

## కారిక 4.100

**దుర్దర్శమతిగంభీరమజం సామ్యం విశారదమ్ ।**

**బుద్ధ్వా పదమనానాత్వం నమస్కుర్మో యథాబలమ్ ॥**

గౌడపాదాచార్యులవారు ఈ నాలుగవ అధ్యాయాన్ని మంగళాచరణంతో మొదలుపెట్టారు, ఇప్పుడు కూడా మంగళాచరణంతో ముగిస్తున్నారు. మొదట్లో మొదటి రెండు కారికల్లో బ్రహ్మవిద్యను నేర్పించిన ఆదిగురువైన నారాయణునికి, సాక్షాత్ బ్రహ్మవిద్యకు నమస్కారం చేశారు. ఆత్మజ్ఞానాన్ని స్తుతిస్తూ ఆత్మకు ఆరుగుణాలను పేర్కొన్నారు అక్కడ. అవి – అస్పర్శయోగః, సర్వాసత్త్వసుఖః, హితః, అవివాదః, అవిరుద్ధః, దేశితః.

**నమామ్యహమ్** – అటువంటి ఆత్మజ్ఞానానికి నేను నమస్కారం చేస్తున్నాను అన్నారు.

ఇక్కడ కూడా ఆత్మయొక్క మరొక ఆరు లక్షణాలను పేర్కొని అటువంటి ఆత్మకు నమస్కరిస్తున్నాను అంటున్నారు.

### శాంతిపాఠం

**ఓం భద్రం కర్ణేభిఃశృణుయామ దేవాః భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః।**
**స్థిరైరంగైస్తుష్టువాగ్ం సస్తనూభిర్వ్యశేమ దేవహితం యదాయుః।**
**స్వస్తి న ఇన్ద్రో వృద్ధశ్రవాః। స్వస్తి నః పూషా విశ్వవేదాః।**
**స్వస్తి నస్తార్క్ష్యో అరిష్టనేమిః। స్వస్తి నో బృహస్పతిర్దధాతు।।**
**ఓం శాంతిః శాంతిః శాంతిః।।**

# ఏకాదశ ఉపనిషత్తుల సారం

## ఈశావాస్యోపనిషత్

ఈశావాస్యోపనిషత్ చాలా చిన్న ఉపనిషత్తు. ఈ ఉపనిషత్తు శుక్లయజుర్వేదానికి చెందినది. తైత్తిరీయోపనిషత్‌లాగా ఈశావాస్యోపనిషత్‌కు కూడా స్వరం అందుబాటులో ఉంది. అందువల్ల దీనికి కూడా క్రమ, జట పాఠాలు ఉంటాయి.

ఈశావాస్యోపనిషత్ శుక్లయజుర్వేదంయొక్క మంత్రభాగంలో వస్తుంది. అందువల్ల దీన్ని మంత్రోపనిషత్ అని కూడా అంటారు. మంత్రభాగాన్ని సంహితభాగం అంటారు కాబట్టి దీన్ని సంహితోపనిషత్ అని కూడా అంటారు. ఈ వేదానికి చెందిన ఇంకొక ఉపనిషత్తు బృహదారణ్యకోపనిషత్. దాన్ని బ్రాహ్మణోపనిషత్ అంటారు. సాధారణంగా ఒక వేదంలో వచ్చిన బ్రాహ్మణోపనిషత్, అదే వేదంలో ఉన్న మంత్రోపనిషత్‌యొక్క వ్యాఖ్యానం అవుతుంది. ఆ విధంగా బృహదారణ్యకోపనిషత్, ఈశావాస్యోపనిషత్‌యొక్క వ్యాఖ్యానం.

ఈశావాస్యోపనిషత్‌లో 18 మంత్రాలు ఉంటే, బృహదారణ్యకోపనిషత్‌లో 400 పైచిలుకు మంత్రాలు ఉన్నాయి. దీన్నిబట్టి ఈశావాస్యోపనిషత్ ఎంత లోతైనదో, ఎంత గంభీరమైనదో అర్థమవుతుంది. శంకరాచార్యులవారు పది ముఖ్యమైన ఉపనిషత్తులని ఏరి, వాటికి భాష్యం రాశారు. అందులో ఈ ఉపనిషత్తు ఒకటి. ఆ పది పేర్లని తేలికగా గుర్తుంచుకోవటానికి ఒక శ్లోకం రూపంలో చెబుతారు.

**ఈశ కేన కఠ ప్రశ్న ముండ మాండూక్య తిత్తిరిః।**
**ఐతరేయం చ ఛాందోగ్యం బృహదారణ్యకం తథా॥**

చెప్పటానికి ఈశావాస్యం పేరు ముందు చెప్పినా, దాన్ని ముందు బోధిస్తే అర్థం చేసుకోవటం కష్టం. చాలామంది ఈ ఉపనిషత్తుకు భాష్యం రాసినా కూడా, కొంతమంది ఆచార్యులు దీనిని బోధించటానికి ఇష్టపడరు. ఎందుకంటే దీనిని అర్థం చేసుకోవటం చాలా కష్టం. మన స్వామీజీ కూడా కనీసం నాలుగైదు ఉపనిషత్తులు నేర్చుకున్నాక దీనికి వస్తే, అద్వైత వేదాంతం అప్పటికి జీర్ణించుకుంటారు కాబట్టి, అప్పుడు తేలికగా అర్థమవుతుంది అంటారు. ముందు నేర్చుకోవాల్సిన వరుసక్రమం – ముండకోపనిషత్, కేనోపనిషత్, కఠోపనిషత్, కైవల్యోపనిషత్ (ఈ పదిలో లేకపోయినా కూడా), తైత్తిరీయోపనిషత్, ఆ తర్వాత ఈశావాస్యోపనిషత్. స్వామీజీ బోధ కూడా ఈ వరుసక్రమంలో ఉంటుంది.

ఈ ఉపనిషత్తు ఇంత కష్టమైనదని పదేపదే ఎందుకు చెబుతున్నాము? ఈ ఉపనిషత్తుకు ఉన్న శాంతిపాఠంలోనే వేదాంతసారం వస్తుంది. అది ముందు నేర్చుకుంటే ఒక్క ముక్క కూడా అర్థం కాకపోగా, తల తిరుగుతుంది.

అంతేకాదు, ఈ ఉపనిషత్తులో వచ్చిన చాలా పదాలకు నిఘంటువులోని అర్థం సరిపోదు. ఉదాహరణకు త్యక్తేన అంటే అసలు అర్థం విడిచిపెట్టబడిన అని వస్తుంది. కాని ఇక్కడ త్యాగేన అని తీసుకోవాలి. అంటే త్యాగం చేయబడిన అని అర్థం తీసుకోవాలి. అలాగే అవిద్య అంటే మామూలుగా అజ్ఞానం. ఇక్కడ కర్మ.

**అవిద్యయా మృత్యుం తీర్త్వా**

దీని వాచ్యార్థం అజ్ఞానంవల్ల మృత్యువును జయించవచ్చు. అజ్ఞానంవల్లనే మృత్యువును జయించగలిగితే, ఇంత కష్టపడి ఇన్ని ఉపనిషత్తులను నేర్చుకోవటం ఎందుకు? ఆత్మజ్ఞానానికి రావటం ఎందుకు?

ఉపనిషత్తు అవిద్య, విద్య పదాలు వేసింది. అలాగే సంభూతి, అసంభూతి పదాలు వేసింది. అవేమిటి? వాటి అర్థం ఏమిటి?

అలాగే ఆత్మ లక్షణాలను వివరించేటప్పుడు కొన్ని పరస్పర వ్యతిరేక లక్షణాలను వర్ణించింది.

**తదేజతి తన్నైజతి** – అది వెళుతుంది, అది వెళ్ళదు
**తద్ధావతోऽన్యానత్యేతి తిష్ఠత్** – అన్నింటికన్నా వేగంగా వెళుతుంది, అసలు కదలదు
**తద్దూరే తద్వంతికే** – చాలా దూరంగా ఉంది, చాలా దగ్గరగా ఉంది

అంతేకాదు, ఆ మంత్రాల అర్థం కూడా స్పష్టంగా, ప్రత్యక్ష అర్థంతో ఉండదు.

**అంధంతమః ప్రవిశంతి యేऽవిద్యాముపాసతే** – కర్మ చేసినవారు చీకటి లోకాలకు వెళతారు.

ఇలా ఈ ఉపనిషత్తులో అడుగడుక్కీ ఎన్నో అర్థంకాని పదాలు, చిక్కుముడులు, మెదడుకు మేతలు ఉన్నాయి. శంకరాచార్యులవారి భాష్యం లేకపోతే, స్వామీజీ బోధ లేకపోతే ఈ ఉపనిషత్తును ఇలా అధ్యయనం చేయగలిగి ఉండేవారం కాదు. ఈ అర్థంకానివన్నీ చాలా తేలికగా అర్థమయ్యేలా చేశారు వీరిద్దరూ.

ఈశావాస్యోపనిషత్‌కు ఈ పేరు ఎందుకు వచ్చింది?

**ఈశావాస్యమిదగ్ం సర్వమ్** – ఈశావాస్యోపనిషత్

ఈశ మొదటిపదం కాబట్టి దీన్ని ఈశోపనిషత్ అని కూడా అంటారు. అన్ని ఉపనిషత్తులకూ ఈ సూత్రం వర్తించదు. ఒక్కొక్కదానికీ ఒక్కొక్క కారణంవల్ల ఆయా పేర్లు వచ్చాయి. ఉదాహరణకు ఐతరేయోపనిషత్‌కు ఐతరేయఋషి దాన్ని దర్శించటంవల్ల వచ్చింది.

## శాంతిపాఠం

ప్రతి ఒక్క ఉపనిషత్తుకూ ఒక శాంతిపాఠం ఉంటుంది. అది ఏ వేదానికి చెందినదైతే ఆ వేదానికి చెందిన శాంతిపాఠం ఉంటుంది. బృహదారణ్యకోపనిషత్, ఈశావాస్యోపనిషత్ శుక్లయజుర్వేదానికి చెందినవి కాబట్టి వీటికి శాంతిపాఠం పూర్ణమదః.

మామూలుగా శాంతిపాఠం పఠించేది ఆత్మవిద్య ఎటువంటి ఆటంకాలు కలుగకుండా సాఫీగా సాగేలా చేయమని కోరటానికి, అలా సాగటానికి అవసరమైన శారీరక ఆరోగ్యం, మేధాశక్తిని ఇవ్వమని కోరటానికి. కాని ముందే చూసినట్టుగా ఈశావాస్యం ప్రత్యేకత శాంతిపాఠంనుంచే కనిపిస్తుంది.

**ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే।**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే।**
**ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

ఈ శాంతిపాఠం అర్థం అక్షరాలా తీసుకుంటే ఇలా వస్తుంది. అది పూర్ణం, ఇది పూర్ణం; పూర్ణంలోంచి పూర్ణం పుట్టింది, పూర్ణంలోంచి పూర్ణం తీసేస్తే పూర్ణమే మిగులుతుంది. దీన్ని ఇంగ్లీషులో చెబితే,

That is whole, this is whole; from whole, whole has come; When you remove whole from whole, whole alone remains.

పూజ్యస్వామీజీ హాస్యంగా అంటారు. ఇది వింటే 'hole alone remains in the student's mind.'

కాని దీని లోతులు కొలిస్తే వేదాంతసారం అంతా మూడే వాక్యాల్లో వచ్చేసింది. అదెలాగో చూద్దాము.

1. **పూర్ణమదః పూర్ణమిదమ్** – పూర్ణం అంటే అనంతం, అపరిమితం, అపరిచ్ఛిన్నం, సర్వవ్యాపకం. ఏదైతే అంతటా వ్యాపించి ఉంటుందో, అది అపరిమితం, అనంతం. అదః అంటే అది. ఈ సందర్భంలో అది అంటే ఈశ్వరుడు లేదా తత్ పదార్థం. పూర్ణమదః అంటే ఈశ్వరుడు పూర్ణం.

**పూర్ణమిదమ్** – ఇదం అంటే ఇది. ఈ సందర్భంలో ఇది అంటే జీవుడు లేదా త్వం పదార్థం.

**తత్ త్వమ్ అసి**

ఇదొక మహావాక్యం. ఛాందోగ్యోపనిషత్‌లో వస్తుంది. ఈ పూర్ణమదః పూర్ణమిదం తత్ త్వమ్ అసిని ఎలా చూపిస్తుంది? దీనికి లక్ష్యార్థం తీసుకోవాలి. రెండు పూర్ణాలు ఉండవు. కాని ఇక్కడ ఈశ్వరుడు పూర్ణం, జీవుడు పూర్ణం అంటే ఒక్క విధంగానే అది సాధ్యం. **ఈశ్వరుడు = జీవుడు** అవాలి. ఆ విధంగా ఈ వాక్యం జీవ–ఈశ్వర ఐక్యాన్ని సూచిస్తున్నది.

2. **పూర్ణాత్ పూర్ణముదచ్యతే** – ముందుభాగంలో లక్ష్యార్థం చూశాము. ఇప్పుడు వాచ్యార్థం చూస్తాము.

**పూర్ణాత్** – తత్ పదార్థ ఈశ్వరుణ్ణుంచి
**పూర్ణమ్** – త్వం పదార్థ జీవుడు
**ఉదచ్యతే** – పుట్టాడు

ఇప్పుడు సోపాధిక దృష్ట్యా ఈశ్వరుణ్ణుంచి జీవుడు పుట్టాడని చెబుతాము. ఇప్పుడు శరీరం దృష్ట్యా ఈశ్వరుడు కారణం, జీవుడు కార్యం అయ్యారు.

**పూర్ణాత్ పూర్ణముదచ్యతే** అంటే జీవ–ఈశ్వరుల మధ్య కార్యకారణ సంబంధం ఉంది.

3. **పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే**

పూర్ణస్య – ఈశ్వరుణ్ణుంచి; పూర్ణమ్ – జీవుణ్ణి; ఆదాయ – విడదీస్తే, పూర్ణమ్ ఏవ–ఈశ్వరుడే; అవశిష్యతే – మిగిలివుంటాడు.

ఇక్కడ మళ్ళీ వాచ్యార్థం కుదరదు.

సోపాధిక దృష్ట్యా జీవుడు = శరీరి + శరీరం
జీవుడు – శరీరి = శరీరం అవాలి. కాని ఉపనిషత్తు
జీవుడు – శరీరి = శరీరి అంటున్నది.

అదెలా సాధ్యం? అంటే శరీరి లేకపోతే శరీరానికి విడిగా ఉనికిలేదు. బంగారం లేకపోతే ఆభరణానికి విడిగా ఉనికి లేదు; నీరు లేకపోతే అలకు విడిగా ఉనికి లేదు; మట్టి లేకపోతే కుండకు విడిగా ఉనికి లేదు. అదే విధంగా శరీరి లేకపోతే శరీరానికి విడిగా ఉనికి లేదు; ఈశ్వరుడు లేకపోతే జగత్తుకు విడిగా ఉనికి లేదు. విడిగా ఉనికి లేకపోతే జగత్తు మిథ్య అవుతుంది. ఈ విధంగా ఈ వాక్యం బ్రహ్మసత్యం జగన్మిథ్యా అని చెబుతున్నది.

ఇప్పుడు ఈ శాంతిమంత్రాన్ని మళ్ళీ టూకీగా ఒకసారి చూస్తే –

| | |
|---|---|
| **పూర్ణమదః పూర్ణమిదమ్** | – జీవ ఈశ్వర ఐక్యమ్ |
| **పూర్ణాత్ పూర్ణముదచ్యతే** | – కార్యకారణ సంబంధం |
| **పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే** | – బ్రహ్మసత్యం జగన్మిథ్యా |

ఈ విధంగా వేదాంతసారం అంతా సూత్రభూత శాంతిపాఠంగా వచ్చింది. ఇప్పుడు ఉపనిషత్తు మంత్రాల వివరాలలోకి వెళదాము. అవి –

1. జ్ఞానయోగం నిర్వచనం – మంత్రం 1
2. కర్మయోగం నిర్వచనం – మంత్రం 2
3. జ్ఞానయోగ విచారణ – మంత్రాలు 3-8
4. కర్మయోగ విచారణ – మంత్రాలు 9-18

మొదటి రెండూ సంక్షేపమంత్రాలు అయితే, తక్కినవి విస్తారమంత్రాలు. ఈ విభజన మంత్రాలు వచ్చిన వరుసక్రమాన్నిబట్టి చూశాము.

ఇప్పుడు ఇదే ఈశావాస్యోపనిషత్‌ను ఇంకొక కొత్త కోణంలోంచి చూద్దాము. ఇది ఒక సాధకుని ప్రయాణం సాగాల్సిన తీరులో విభజించి చెప్పబడింది. ఆ విభజన చూద్దాము. అలా చూస్తే ఈ ఉపనిషత్తును 5 భాగాలుగా విభజించవచ్చు. అవి –

1. కర్మయోగం
2. కర్మయోగఫలం
3. చరమప్రార్థన
4. జ్ఞానయోగం
5. జ్ఞానయోగఫలం

ముందే చూసినట్టుగా ఇది ఉపనిషత్తులోని మంత్రాల వరుసక్రమంలో లేదు. మన వీలుకోసం మార్చుకున్న పద్ధతి.

1) **కర్మయోగం** – కర్మయోగం నిర్వచనాన్ని ఉపనిషత్తు రెండవ మంత్రంలో చూస్తాము.

**కుర్వన్నేవేహ కర్మాణి జిజీవిషేచ్ఛతగ్ం సమాః ।**
**ఏవం త్వయి నాన్యథేతో ఽస్తి న కర్మ లిప్యతే నరే ॥** -2

వంద సంవత్సరాలు జీవించాలని కోరుకో. శాస్త్రం విధించిన కర్మలు చేస్తూనే జీవించాలి. కర్మయోగమార్గం తప్ప వేరే మార్గం లేదని ఈ మంత్రం అర్థం.

| | | |
|---|---|---|
| కర్మయోగం | = సరియైన కర్మ | + సరియైన దృక్పథం |
| సరియైన కర్మ | = సాత్త్వ్విక కర్మలు | + పంచమహాయజ్ఞాలు |
| సరియైన దృక్పథం | = ఈశ్వరార్పణబుద్ధి | + ఈశ్వరప్రసాదబుద్ధి |

సాత్త్వికకర్మలు అంటే పరోపకారకర్మలు. పంచమహాయజ్ఞాలు అంటే దైవయజ్ఞం, ఋషియజ్ఞం, పితృయజ్ఞం, మనుష్యయజ్ఞం, భూతయజ్ఞం. ఈశ్వరార్పణబుద్ధి అంటే ఏ కర్మ చేసినా ఈశ్వరునికి అర్పిస్తున్నాననే అంకితభావంతో చేయటం. ఈశ్వరప్రసాదబుద్ధి అంటే చేసిన కర్మకు ఏం ఫలం వచ్చినా ఈశ్వరప్రసాదంగా స్వీకరించటం. ఇవన్నీ కలిపి కర్మయోగం అంటారు.

ఈశావాస్యోపనిషత్ ఈ కర్మయోగానికి అదనంగా మరికొంత బలాన్ని చేకూర్చదలుచుకుంది. అందువల్ల కర్మకు రెండు రకాల సముచ్చయాలను జోడించింది. కేవలకర్మ చేస్తే వచ్చే ఫలంకన్నా కర్మను ఉపాసనతో కలిపి చేస్తే దాని ఫలం అధికంగా ఉంటుంది. నిజానికి శాస్త్రం మన నిత్యపూజలోనే ఈ కర్మ, ఉపాసనల సముచ్చయాన్ని జోడించింది. మనం నిత్యం పారాయణం చేసే విష్ణుసహస్రనామానికీ, లలితా సహస్రనామానికీ ముందు ధ్యానశ్లోకాలు ఉన్నాయి. ఈ శ్లోకాలను కూడా మనం సహస్రనామాలతో కలిపి గడగడా చదివేస్తాము. కాని ఆ ధ్యానశ్లోకాలను మనస్సులో చదువుకుని, ఆ మూర్తి వర్ణన ప్రకారం మన మనస్సులో ఆ మూర్తిని నిలబెట్టుకుని అప్పుడు సహస్రనామాలను చదవాలి. అప్పుడు అది కర్మ, ఉపాసనల సముచ్చయం అవుతుంది. సముచ్చయం అంటే కలిపి చేయటం.

**ఇక్కడ చెప్పిన సముచ్చయాలు**

1. కర్మ, ఉపాసన సముచ్చయం
2. ఉపాసనా ద్వయ సముచ్చయం

ఉపాసనా ద్వయ సముచ్చయంలో హిరణ్యగర్భ ఉపాసనను, ప్రకృతి ఉపాసనతో కలిపి చేయాలి. అందులో కూడా కర్మ ఉంటుంది. గృహస్థుకు కర్మ చేయకుండా కుదరదు.

హిరణ్యగర్భ అంటే సమష్టిబుద్ధి. ప్రకృతి అంటే శక్తి. ప్రకృతిమీద ఉపాసనను వేరే ఎక్కడా చూడము. ఇది శక్తి ఉపాసన.

ఇది కర్మయోగం గురించి.

2) **కర్మయోగఫలం**

కర్మయోగఫలం ఏమిటో ముందు ఉపనిషత్తులో వచ్చినది చూద్దాము. కాకపోతే ఈ ఉపనిషత్తు ఏదీ ప్రత్యక్షంగా చెప్పదనీ, నిఘంటువు అర్థం రాదనీ చూశాము. అందువల్ల ముందు వీటికి ఉపనిషత్తు వాడిన పదాలను చూద్దాము.

| | |
|---|---|
| కర్మ | – అవిద్య |
| ఉపాసన | – విద్య |
| హిరణ్యగర్భ ఉపాసన | – సంభూతి, సంభవం, వినాశం |
| ప్రకృతి ఉపాసన | – అసంభూతి, అసంభవం |

ఈ ఉపనిషత్తు చేసే వివరణ కూడా సూటిగా ఉండదనీ, దాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలనీ కూడా చూశాము. మనము ఆ శ్రమ పడకుండా శంకరాచార్యులవారు, మన స్వామీజీ మనకు వాటిని విడమర్చి చెప్పారు. ఇక్కడ సముచ్చయ ఫలాన్ని మెచ్చుకోవటానికి ఉపనిషత్తు న హి నిందా న్యాయాన్ని వాడింది. నహి నిందా న్యాయం అంటే ఒకదాన్ని తిట్టటం, దాన్ని తిట్టటంకోసం కాదు, ఇంకొకదాన్ని స్తుతించటంకోసం. ఇక్కడ కేవలకర్మను, కేవల ఉపాసనను నిందించింది, సముచ్చయం చేయటంకోసం.

రెండు సముచ్చయాలు మంత్రాలు 9–14ల్లో వస్తాయి. వాటి సారం చూద్దాము.

| మంత్రం | కర్మ ఉపాసనల సముచ్చయం | మంత్రం | ఉపాసనాద్వయ సముచ్చయం |
|---|---|---|---|
| 9 | కేవలకర్మ చేసినవారు చీకటిలోకాలకు వెళతారు | 12 | కేవల ప్రకృతి ఉపాసన చేసినవారు చీకటిలోకాలకు వెళతారు |
| | కేవల ఉపాసన చేసినవారు ఇంకా ఎక్కువ చీకటిలోకాలకు వెళతారు | | కేవల హిరణ్యగర్భ ఉపాసన చేసినవారు ఇంకా ఎక్కువ చీకటిలోకాలకు వెళతారు |
| 10 | కేవలకర్మ చేసినవారు స్వర్గలోకానికి వెళతారు | 13 | కేవల హిరణ్యగర్భ ఉపాసన చేసినవారు అణిమాది సిద్ధులు పొందుతారు |
| | కేవల ఉపాసన చేసినవారు బ్రహ్మలోకానికి వెళతారు | | కేవల ప్రకృతి ఉపాసన చేసినవారు ప్రకృతిలో లయమవుతారు |
| 11 | కర్మ, ఉపాసనల సముచ్చయం చేస్తే ప్రాకృతపురుషుడు సంస్కృత పురుషుడై, ఆపేక్షిక అమృతత్వాన్ని పొందుతాడు | 14 | ఉపాసనాద్వయ సముచ్చయం చేస్తే అణిమాది ఐశ్వర్యం పొంది, ప్రకృతిలో లయమవుతాడు |

ఇవీ మనం ఉపనిషత్ మంత్రాలనుంచి చూసిన ఫలాలు. ఇప్పుడు వీటిని లోతుగా విశ్లేషిస్తే వీటిని రెండు ఫలాలుగా చెప్పవచ్చు.

1. **జ్ఞానయోగ్యత ద్వారా జీవన్ముక్తి ప్రాప్తి** – కర్మ చేస్తే చిత్తశుద్ధి పొంది, ఉపాసన చేస్తే చిత్త ఏకాగ్రత పొందుతారు. ఈ రెండూ కలిపి చేస్తారు కాబట్టి వీటి ద్వారా జ్ఞానయోగ్యతా ప్రాప్తి పొంది, అదృష్టం బాగుంటే, ఈ జన్మలోనే జ్ఞానమార్గానికి వచ్చి, శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా జ్ఞానం పొంది, జీవన్ముక్తి పొందుతారు. ఉపాసనలకు వచ్చే ఫలాల్లో ప్రకృతిలయం చాలా ఉన్నతఫలం, కాని దానికన్నా శాశ్వతఫలం మోక్షం పొందటం. దానికి ఈ సముచ్చయం తోడవుతుంది. అలా మోక్షం పొందటానికి ఈ కర్మయోగం సహకారీ సాధన అవుతుంది, సాక్షాత్ సాధన కాదు.

2. **బ్రహ్మలోకంలో క్రమముక్తి** – ఈ ఉపాసకుడు కేవల కర్మఠుడుకన్నా ఒక మెట్టు ఎక్కువ ఉంటాడు, జ్ఞానికన్నా ఒక మెట్టు తక్కువ ఉంటాడు. ఏ కారణంవల్లనో అతను జ్ఞానయోగానికి రాలేకపోతాడు. దానికి కారణం సరియైన గురువు దొరకకపోవచ్చు, అతనికే తన అర్హతమీద నమ్మకం లేకపోవచ్చు. ఏదేమైనా అతను జీవితాంతం కర్మ ఉపాసనల సముచ్చయం చేస్తూ ఉంటాడు కాబట్టి అతను మరణించాక శుక్లగతి ద్వారా బ్రహ్మలోకానికి వెళతాడు. అక్కడ అతను సాక్షాత్తూ బ్రహ్మదేవుని దగ్గర జ్ఞానం పొందితే అక్కడ మోక్షం పొందుతాడు. అంటే సగుణబ్రహ్మ ద్వారా నిర్గుణబ్రహ్మజ్ఞానం పొందితే, మోక్షం పొందుతాడు. దాన్ని క్రమముక్తి అంటారు.

టూకీగా చెప్పాలంటే ఉపాసనతో కూడిన కర్మయోగం చేసి ఈ జన్మలోనే జ్ఞానయోగానికి వస్తే జీవన్ముక్తి, విదేహముక్తి పొందుతారు, అలా కాకుండా బ్రహ్మలోకానికి వెళితే అక్కడ క్రమముక్తి పొందుతారు.

3) **చరమ ప్రార్థన** – దీన్నే గతి ప్రార్థన అని చూశాము. కర్మ, ఉపాసనల సముచ్చయం చేసి, జ్ఞానమార్గానికి రాని ఉపాసకుడు తన చరమదశలో (మరణకాలంలో) చేసే అంతిమ ప్రార్థన ఇది. ఇతను జ్ఞాని కాదు. జ్ఞానికి ప్రయాణం లేదు. జ్ఞాని విదేహముక్తి పొందుతాడు.

ఈ ఉపాసకుడు చేసే నాలుగు మంత్రాలతో కూడిన ఈ ప్రార్థన మొత్తం వైదిక ప్రార్థనల్లోనే శ్రేష్ఠమైనవి. ఇవి మరణకాలంలోనే చేయాలనే నియమం లేదు, ఎప్పుడైనా చేయవచ్చు. ఆ మాటకొస్తే మరణం ఎప్పుడు సంభవిస్తుందో కూడా మనకు తెలియదు. యమధర్మరాజుకు ముందు చెప్పకుండా వచ్చే అధికారం ఉంది.

ముందు ఈ మంత్రాల (15–18) సారం చూద్దాము.

15 – బ్రహ్మలోకానికి, ఆదిత్యమండలంలోంచి వెళ్ళే ముఖద్వారం బంగారు రంగుతో మెరిసిపోతున్న బంగారు పాత్రతో కప్పబడివుంది. ఓ సూర్యభగవాన్, నా ధర్మాన్ని సత్యంగా పాటించిన నేను, బ్రహ్మను చూడటంకోసం ఆ ద్వారాన్ని నువ్వు నాకు తెరువు.

16 – ఓ సూర్యభగవాన్, నువ్వు నీ కిరణాల తీవ్రమైన వేడిని, కాంతిని నాకోసం తగ్గించుకో. నేను అహంగ్రహ ఉపాసన చేశాను. అందువల్ల నువ్వు, నేను ఒకటే. నేను నీ కళ్యాణతమరూపాన్ని చూశాను.

17 – నేను అనేక యజ్ఞాలు, అనేక ఉపాసనలు చేశాను. నా ఈ స్థూలశరీరం అగ్నికి ఆహుతి అయ్యాక, సూక్ష్మశరీరం సమష్టి సూక్ష్మప్రపంచంలో ఐక్యమగుగాక. ఓ మనసా, నేను చేసిన ఉపాసనలు గుర్తు తెచ్చుకో. ఓ అగ్నీ, నేను నీ సాక్షిగా చేసిన కర్మలను గుర్తు తెచ్చుకో.

18 – ఓ అగ్నిదేవతా! నన్ను ప్రకాశవంతమైన శుక్లగతిద్వారా తీసుకువెళ్ళు. తిరిగిరాని మార్గంలో తీసుకువెళ్ళు. నువ్వే నా సమస్త కర్మలకు సాక్షివి. నేను చేసిన కుటిలమైన పాపాలను కడిగివేయి. దానికోసం నీకు పదేపదే నమస్కారం, మాటలతో చేస్తున్నాను.

ఇప్పుడు ఈ ప్రార్థనల సారం లోతుగా విశ్లేషిస్తే అతని ప్రార్థనని మూడు అంశాలుగా చూడవచ్చు.

1. **పాపనివృత్తి – జుహురాణమేనః** – నేను అనేక కుటిలమైన పాపాలు చేశాను. నేను జ్ఞానయోగానికి రాలేకపోయాను. వచ్చే జన్మలోనైనా జ్ఞానయోగానికి వచ్చేలా చేయి.

2. **ప్రతిబంధనివృత్తి – వాయురనిలమమృతమ్** – నాకు జననమరణాల వృత్తం వద్దు. నేను మరణించాక నా వ్యష్టిప్రాణం, సమష్టి వాయువులో కలవాలి. అది అన్ని అంగాలకు ఉపలక్షణంగా తీసుకోవాలి. సూక్ష్మశరీరం, సూక్ష్మప్రపంచంలో కలవాలి. అమృతత్వం రావాలి అంటే క్రమముక్తి పొందాలని అతని ప్రార్థన అర్థం.

3. **శుక్లగతి ప్రాప్తి – హిరణ్మయేన పాత్రేణ** – బ్రహ్మలోకానికి వెళ్ళే మార్గం బంగారు రంగుతో మెరిసిపోతున్న పాత్రతో కప్పబడివుంది. ఈ ప్రార్థన తనను శుక్లగతిద్వారా తీసుకువెళ్ళమని సూచిస్తున్నది. అదికూడా సాధకుడు బ్రతిమాలటం లేదు. తను చేసిన ఉపాసనకు ఫలంగా రావాలని అధికారపూర్వకంగా కోరుకుంటున్నాడు.

4) **జ్ఞానయోగం** – ఈ జ్ఞానయోగం భాగం మొత్తం వేదాంత మంత్రాల్లోనే చాలా ముఖ్యమైన భాగం. అందులోనూ మొదటిమంత్రం ఇంకా చాలా ముఖ్యమైనది.

**ఓం ఈశావాస్యమిదగ్ం సర్వం యత్కించ జగత్యాం జగత్ ।**
**తేన త్యక్తేన భుంజీథా మా గృధః కస్యస్విద్ధనమ్ ॥** – 1

ఈ జగత్తంతా, ఒక్క చిన్నముక్క కూడా వదలకుండా, అంతా ఈశ్వరునిచేత కప్పబడివుంది. ఈ జ్ఞానం పొంది, కోరికలను త్యజించి, నిన్ను నువ్వు రక్షించుకోవాలి. ఎవరి సొమ్మునూ ఆశించకూడదు.

మంత్రాలు 3–8 వరకు ఆత్మస్వరూపాన్ని వర్ణిస్తాయి. అవి చాలా ముఖ్యమైన మంత్రాలు కాబట్టి, ముందు ఆ మంత్రాల సారాన్ని చూద్దాము.

3 – ఆత్మజ్ఞానం పొందనివారు ఆత్మహంతకులతో సమానం. వారు మరణించాక కారుచీకటి లోకాలకు వెళతారు. అజ్ఞానుల నిందద్వారా జ్ఞానస్తుతి చేస్తున్నది.

4 – ఇంద్రియాలు, మనస్సు, ఆత్మల మధ్య ఒక ఊహాజనితమైన పరుగు పందెమును వివరిస్తున్నది ఉపనిషత్తు. ఆత్మను మనస్సే అందుకోలేకపోతే ఇంక ఇంద్రియాల గురించి చెప్పేదేమున్నది. అంటే ఆత్మ మనో–ఇంద్రియ అగోచరం. ఆత్మ హిరణ్యగర్భకు అధిష్ఠానదేవత. నిరుపాధిక దృష్ట్యా ఆత్మ ఏకం, అచలం.

5 – ఆత్మ వెళుతుంది, వెళ్ళదు. ఇది ఉపాధి భేదాన్ని సూచిస్తుంది. ఆత్మ చాలా దూరంగా ఉంది, చాలా దగ్గరగా ఉంది. ఇది దృష్టిభేదాన్ని సూచిస్తుంది. అది అన్నింటిలోనూ సర్వాంతర్యామిగా ఉంది, అంతటా సర్వవ్యాపకంగానూ ఉంది.

6 – ఆత్మను మూడు దశల్లో తెలుసుకుంటాము. నాలో ఆత్మ ఉంది, అన్ని శరీరాల్లో ఆత్మ ఉంది, ఆత్మలోనే అన్ని శరీరాలూ ఉన్నాయి. రెండు, మూడు దశలను ఇందులో చూస్తాము. ఎవరైతే అటువంటి ఆత్మజ్ఞానం పొందుతారో, వారు అభద్రతాభావనను పొందరు.

7 – మూడవదశను మళ్ళీ చూస్తాము. ఎవరైతే ఆత్మలోనే అన్నీ ఉన్నాయనే ఏకత్వాన్ని చూస్తారో, వారికి మోహం ఉండదు, శోకం ఉండదు.

8 – ఇందులో మరికొన్ని ఆత్మలక్షణాలను చూస్తాము. ఆత్మ సర్వవ్యాపకం, స్వయంజ్యోతి ప్రకాశకమ్, శరీరత్రయవిలక్షణం, పాపరహితం, సర్వజ్ఞం, సర్వేశ్వరం, సర్వాతీతం, సర్వ అధిష్ఠానం.

ఈ మంత్రాల్లో వచ్చిన ఆత్మలక్షణాలను క్రోడీకరిస్తే వాటిని తొమ్మిది లక్షణాలుగా చెప్పవచ్చు. అవి –

1. **చైతన్య స్వరూపత్వమ్** – ఆత్మనైన నేను చైతన్యస్వరూపాన్ని. **కవి** పదం సూచిస్తుంది దీన్ని. కవి అంటే సర్వజ్ఞుడు అని అర్థం ఇక్కడ.

2. **శరీరత్రయ విలక్షణత్వమ్ –**

**అకాయమవ్రణమస్నావిరగ్ంం శుద్ధమ్**

అకాయమ్ అంటే సూక్ష్మశరీరరహితం; అవ్రణమ్, అస్నావిరగ్మ్ అంటే స్థూలశరీరరహితం; శుద్ధమ్ అంటే కారణశరీరరహితం. అన్నీ కలిపి శరీరత్రయవిలక్షణమ్.

3. **సర్వప్రేరకత్వమ్** – విద్యుచ్ఛక్తి ఫ్యాన్లు, లైట్లకు శక్తిని ఇచ్చినట్టుగా ఆత్మ దేవతలందరకూ వారి విధులను నిర్దేశించి, ఆ విధులను సక్రమంగా నిర్వర్తించేలా చేస్తుంది. ఆత్మ చేస్తుంది అంటే మళ్ళీ కర్తా అని అర్థం వస్తుంది. సన్నిధి మాత్రంచేతనే ఆయా పనులు అవుతాయి.

**యాథా తథ్యతోఽర్థాన్ వ్యదధాత్**

4. **సర్వగతత్వమ్ – పర్యగాత్** పదం సూచిస్తుంది. ఆత్మ సర్వవ్యాపకం.

5. **ఏకత్వమ్ – తన్నైజతి** – ఆత్మ ఎక్కడికీ వెళ్ళదు. ఆత్మ సర్వవ్యాపకం కాబట్టి ఎక్కడికీ వెళ్ళదు. దీన్నించి వచ్చే ఇంకొక లక్షణం, ఆత్మ సర్వవ్యాపకం కాబట్టి ఏకం. ఉన్నదొకటే ఆత్మ. ఏకమేవాద్వితీయమ్. ఇక్కడ **ఏకత్వమనుపశ్యతః** అని వచ్చింది.

6. **శుద్ధత్వమ్** – ఆత్మ అన్ని భూతాలలో ఉన్నా కూడా ఆత్మకు మలినాలు అంటవు.

**సర్వభూతేషు చ ఆత్మానామ్**

అన్ని శరీరాల్లో శరీరిగా ఉన్నా కూడా, శరీరానికున్న మలినాలు అంటవు; మనస్సుకున్న రాగద్వేషాలు అంటవు. ఉదాహరణకు కాంతి ఒక పుస్తకంమీద ప్రసరించినా కూడా, ఆ పుస్తకానికున్న దుమ్ము కాంతికి అంటదు.

7. **రూపద్వయత్వమ్** – ఆత్మ లక్షణాలను సోపాధిక, నిరుపాధిక లక్షణాలుగా సమాంతర రేఖలుగా వర్ణించుకు వస్తున్నది ఉపనిషత్. ఆ భిన్నలక్షణాలను అర్థం చేసుకోవాలంటే ఈ రూపద్వయం లక్షణాన్ని అర్థం చేసుకోవాలి.

**తద్ధావతోఽన్యానత్యేతి తిష్ఠత్** – అన్నింటికన్నా వేగంగా వెళుతుంది, కదలదు
**తదేజతి తన్నైజతి** – అది వెళుతుంది, అది వెళ్ళదు

8. **సత్యత్వమ్** – ఈ సత్యత్వాన్ని మంత్రం 7 సూచిస్తుంది. ఇది చాలా అద్భుతమైన మంత్రం. శంకరాచార్యులవారు దీన్ని తరచు ఉటంకిస్తూంటారు.

**యస్మిన్ సర్వాణి భూతాన్యాత్మైవాభూద్విజానతః** – 7

ఇది ఆత్మజ్ఞానంలో మూడవదశను సూచిస్తుందని చూశాము. ఆ మూడవదశ ఆత్మలోనే అన్ని భూతాలు (ప్రాణులు) ఉన్నాయి. ఆత్మలోనే అన్ని భూతాలు ఉన్నాయంటే జ్ఞాని ఈ మొత్తం జగత్తును ఈశ్వరునిగా చూస్తాడు. మొదటి మంత్రంలోనే ఆ విషయం వచ్చింది.

**ఈశావాస్యమిదగ్ం సర్వమ్** – 1

అంటే అతని దృక్పథంలో మార్పు రావాలి. ముందు చూసిన మూడుదశలనే జగత్తు పరంగా చూద్దాము.

1. ముందు జగత్తును మాత్రమే చూస్తాడు.
2. తర్వాత జగత్తు అంతటా ఈశ్వరుడు ఉన్నాడు అంటాడు. అంటే జగత్తు + ఈశ్వరుడు అంటాడు.
3. దాని తర్వాత ఈశ్వరుడు మాత్రమే ఉన్నాడు అంటాడు.

జగత్తును మాత్రమే చూసే స్థాయినుంచి జగత్తుతో పాటు ఈశ్వరుణ్ణి చూసే స్థాయికి ఎదిగి, ఈశ్వరుడు లేకుండా జగత్తుకు విడిగా ఉనికి లేదు కాబట్టి ఈశ్వరుడు మాత్రమే ఉన్నాడు, జగత్తు మిథ్యా అనే జ్ఞానానికి వస్తాడు. దీన్ని పారడైమ్ షిఫ్ట్ అంటారు. ఇది తేలిగ్గా అర్థం కావటానికి అల-నీరు దృష్టాంతం చూద్దాము.

1. ముందు ఒక అలను అలగా చూస్తాము.
2. తర్వాత అల అంతటా నీరు ఉందని తెలుసుకుంటాము. అంటే అల + నీరు అంటాము.
3. దాని తర్వాత నీరు మాత్రమే ఉంది అంటాము.

అంటే అలను మాత్రమే చూసే స్థాయినుంచి నీరు మాత్రమే సత్యం అనే స్థాయికి ఎదుగుతాము.

కర్మయోగంలో కూడా ఇలాగే మూడు దశల్లో సాధకుడు తన దృక్పథాన్ని మార్చుకుంటాడు.

1. ముందు కర్మ మాత్రమే చేస్తాడు.
2. తర్వాత కర్మను భగవంతుడుమీద భక్తితో చేస్తాడు అంటే కర్మ + భగవంతుడు అంటాడు.
3. దాని తర్వాత భగవంతుణ్ణి మాత్రమే చూస్తాడు, కర్మను చూడడు. ఏం చేసినా, ఏం చూసినా, ఏం విన్నా, ఏం మాట్లాడినా భగవంతుణ్ణే చూస్తాడు.

కర్మయోగం స్థాయినుంచి జ్ఞానయోగం స్థాయికి వస్తే ఏం చేసినా, ఏం చూసినా, ఏం విన్నా అదంతా ఆత్మే అంటాడు. ఆత్మకు భిన్నంగా వేరే ఏదీ లేదంటాడు.

ఆ విధంగా అజ్ఞానికి ఉన్నదంతా జగత్తు మాత్రమే.

జ్ఞానికి ఉన్నదంతా బ్రహ్మ మాత్రమే. అతనికి ద్వైతదర్శనం భ్రాంతి.

శంకరాచార్యులవారు ఇంత గట్టిగా బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా అని చెబుతున్నారంటే దానికి ఇలాంటి మంత్రాలే ఆధారం.

9. **మిథ్యాజగదధిష్ఠానత్వమ్** – తాడు–పాము ఉదాహరణ తీసుకుంటే, తాడుమీద పామును ఆరోపిస్తున్నాడు అజ్ఞాని. పాముని అధ్యాస అనీ, తాడుని అధిష్ఠానం అనీ అంటారు. తాడుని చూసి పాము అనుకుంటాడు అతను. అక్కడ నిజంగా పాము లేదు. అలాగే జగత్తును చూసి అది సత్యం అనుకుంటాడు. కాని బ్రహ్మ లేకుండా విడిగా జగత్తుకు ఉనికి లేదని తరువాత తెలుసుకుంటాడు. అంటే బ్రహ్మ మిథ్యాజగత్తుకు అధిష్ఠానంగా అర్థం చేసుకుంటాడు.

మళ్ళీ ఒకసారి టూకీగా ఈ ఆత్మలక్షణాలను చూస్తే, అవి – చైతన్యస్వరూపత్వమ్, శరీరత్రయ విలక్షణత్వమ్, సర్వప్రేరణత్వమ్, సర్వగతత్వమ్, ఏకత్వమ్, శుద్ధత్వమ్, రూపద్వయత్వమ్, సత్యత్వమ్, మిథ్యాజగదధిష్ఠానత్వమ్.

ఈ ఆత్మ లక్షణాలు నేర్చుకుంటే ఆత్మజ్ఞానం పూర్తి కాదు. నేను = ఆత్మ = బ్రహ్మ అని అర్థం చేసుకోవాలి. బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా వాక్యాన్ని నేను (ఆత్మపరంగా) సత్యం, తక్కినదంతా మిథ్య అని అర్థం చేసుకోవాలి. దీనితో జ్ఞానయోగం అయిపోయింది.

5) **జ్ఞానయోగఫలం** – జ్ఞానయోగానికి వచ్చి ఆత్మజ్ఞానం పొందితే కలిగే ఫలం, ఆత్మజ్ఞానం కలుగుతుంది.

**అహం సత్యం జగన్మిథ్యా**

ఇది సాక్షాత్ ఫలం. ఈ జ్ఞానంవల్ల సంసారనివృత్తి కలుగుతుంది. సంసారనివృత్తిని జీవన్ముక్తి అంటారు. అంటే ఇక్కడ, ఇప్పుడే మోక్షం కలుగుతుంది. జీవన్ముక్తి ఫలాన్ని అనేక విధాలుగా నిర్వచిస్తారు. ఇక్కడ మూడు ఫలాలను ఇచ్చింది ఉపనిషత్తు. వాటిని చూద్దాము.

1. **శోకనివృత్తి** – శోకం అంటే రోజంతా ఏడుస్తూ కూర్చోనవసరం లేదు. కాని ఏదో అసంతృప్తి, కొరత, లోటు వెన్నాడుతూనే ఉంటుంది చాలామందిని. ఎన్ని ఉన్నా, ఏదో తక్కువైందనే బాధ.

స్వామీజీ దీనికి పూరీ ఉదాహరణ చెబుతారు. ఒక మూకుడులో ఉన్న నూనెలో పూరీ వేస్తే, ఆ పూరీ పొంగేదాకా అది మూకుడులో అసహనంగా తిరుగుతూనే ఉంటుంది. ఎప్పుడైతే పూర్తిగా పొంగుతుందో, అప్పుడే కుదురుగా ఒకచోట ఉంటుంది. మన మనస్సు కూడా అంతే. ఏదో తక్కువైందనే భావనతో అన్నింటివెంటా పరుగులు తీస్తూ ఉంటుంది.

ఎప్పుడైతే పూర్ణత్వం పొందుతుందో, అప్పుడే వెంపర్లాట పోతుంది. పూర్ణమిదం అని నేర్చుకుంటే, ఇంక దేని గురించిన కోరిక ఉంటుంది?

2. **మోహనివృత్తి** – మోహం అంటే తప్పుడు ఆలోచన. రాగం, శోకం బుద్ధిని కప్పివేస్తుంది. అందువల్ల సత్యాన్ని సరిగ్గా తెలుసుకోలేము. అందువల్ల పూర్ణత్వం, ఎప్పుడో భవిష్యత్తులో దొరికే వస్తువు అనుకుంటాము.

వేదాంతం అలా అనుకుంటే అది తప్పు అంటుంది. ఇప్పుడు నువ్వు భోరున ఏడుస్తున్నా కూడా నువ్వు ఆనందస్వరూపుడివి, పూర్ణుడివి అంటుంది. అంటే పూర్ణత్వం ఎప్పుడో భవిష్యత్తులో వచ్చేది కాదు, అది సిద్ధవస్తువు. నువ్వు ఎప్పుడో పూర్ణుణ్ణి అవుతాననుకుంటే ఎప్పటికీ కాలేవు. అయితే ఇప్పుడు పూర్ణుడివి లేదా ఎప్పటికీ కాదు అంటుంది.

3. **జుగుప్సా నివృత్తి** – జుగుప్స అంటే ద్వేషం, నింద, అభద్రతా భావన అని అర్థాలు చెప్పవచ్చు. ఇవన్నీ భయంనుంచి పుట్టినవే.

**ద్వితీయాద్వై భయం భవతి** – బృహదారణ్యకమ్

రెండవది ఉంటే కదా, దాన్ని చూసి భయపడేది. అద్వైతంలో ఉన్నదొకటే ఆత్మ లేదా బ్రహ్మ. అందువల్ల భయనివృత్తి కలుగుతుంది.

| | |
|---|---|
| ఈశావాస్యమిదగ్ం సర్వమ్ | – భద్రతనిచ్చే ఆత్మే అంతటా ఉంది |
| తేన త్యక్తేన | – అభద్రతకు లోనుచేసే అనాత్మను మిథ్యగా కొట్టివేయి |
| భుంజీథాః | – ఆత్మ ఒక్కటే భద్రతను ఇస్తుంది |
| మా గృధః | – ఆ భద్రతకోసం బాహ్యంగా వెతకకు |

మొట్టమొదటి మంత్రమే ఆ హామీ ఇచ్చాక –

**తత్ర కో మోహః కశ్శోకః** – మోహం ఎక్కడిది? శోకం ఎక్కడిది?

ఇందులో ముఖ్యమైన మంత్రాలు – 1, 2, 6, 7, 8, 15–18.

**శాంతిపాఠం**

**ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే।**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే।**
**ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

# ఏకాదశ ఉపనిషత్తుల సారం

## ఐతరేయోపనిషత్

ఐతరేయోపనిషత్ కూడా శంకరాచార్యులవారు భాష్యం రాసిన పది ఉపనిషత్తులలో ఒకటి. ఈ పదిలో ఋగ్వేదానికి చెందిన ఏకైక ఉపనిషత్తు ఇది.

ఐతరేయోపనిషత్‌కు ఈ పేరెలా వచ్చింది? ఇది ఐతరేయ అనే ఋషినుంచి వచ్చింది కాబట్టి ఐతరేయోపనిషత్ అనే పేరు వచ్చింది. ఈ ఋషికి మహీదాసః అని ఇంకొక పేరు ఉంది. అందువల్ల ఐతరేయ మహీదాస ఋషి అంటారు కొందరు.

**ఐతరాయాః పుత్రః ఐతరేయః**

ఐతరా అనే పేరు గల స్త్రీకి పుత్రుడు కాబట్టి ఆయనకు ఐతరేయ అనే పేరు వచ్చింది. ఈ మహీదాస తన తండ్రి తనను అంతగా ప్రేమించటం లేదని క్రుంగిపోతుండేవాడు. తండ్రి నిజంగా పట్టించుకునేవాడు కాదో, ఈ పుత్రుని ఊహాగానమో మనకు నిజానిజాలు తెలియవు. ఏది ఏమైతేనేం, అతను బాధపడుతుండేవాడు. తల్లి దగ్గరకు వెళ్ళి తన బాధను పంచుకున్నాడు. తల్లి అతని బాధ తీర్చటంకోసం, వారి కులదేవతకు ప్రార్థన చేసింది. వారి కులదేవత భూదేవి. అతని పేరు మహీదాస అని అందువల్లనే వచ్చింది. మహీ అంటే పృథివీ, దాస అంటే భక్తుడు. అంటే భూదేవియొక్క భక్తుడు.

తల్లి ఐతర, తన పుత్రుడు ఐతరేయునితో కలిసి భూదేవికి పూజ చేస్తే, భూదేవి వారి ముందు ప్రత్యక్షమయ్యి, ఐతరేయునికి జ్ఞానాన్ని ప్రసాదించింది. ఈ జ్ఞానంవల్ల ఐతరేయుడు ఋషి అయ్యాడు, ఐతరేయ బ్రాహ్మణమ్ అందుకున్నాడు. అది ఋగ్వేదంలో పెద్ద భాగం. ఈ ఐతరేయ బ్రాహ్మణమ్‌లో 40 అధ్యాయాలు ఉన్నాయి. దీని చివర్లో ఐతరేయ ఆరణ్యకమ్ వస్తుంది. అందులో ఒక భాగమే ఐతరేయ ఉపనిషత్.

ఈ ఐతరేయోపనిషత్‌లో మూడు అధ్యాయాలు ఉన్నాయి. మొదటి అధ్యాయంలో మూడు ఖండాలు ఉన్నాయి కాని తక్కిన రెండింట్లోనూ ఒక్కొక్క ఖండమే ఉంది. వెరసి 3 అధ్యాయాలూ, 5 ఖండాలూ ఉన్నాయి. ఇది కొంచెం చిన్న ఉపనిషత్తు. ఇందులో 33 మంత్రాలు ఉన్నాయి.

దీని శాంతిపాఠం తక్కిన తొమ్మిది ఉపనిషత్తులకన్నా భిన్నమైనది. ఎందుకంటే ఐతరేయోపనిషత్ మాత్రమే ఋగ్వేదానికి చెందినది.

## శాంతిపాఠం

**ఓం వాఙ్మే మనసి ప్రతిష్ఠితా, మనో మే వాచి ప్రతిష్ఠితమ్ ।**
**ఆవిరావీర్మ ఏధి। వేదస్య మ ఆణీస్థః ।**
**శ్రుతం మే మా ప్రహాసీరనేనాధీతేనాహోరాత్రాన్సందధామి॥**
**ఋతం వదిష్యామి । సత్యం వదిష్యామి। తన్మామవతు।**
**తద్వక్తారమవతు। అవతు మామవతువక్తారమవతు వక్తారమ్॥**
**ఓం శాన్తిః శాన్తిః శాన్తిః**

చాలా అద్భుతమైన ప్రార్థన. ఈ శాంతిపాఠంలో శిష్యుడు నాలుగు అంశాలను కోరుతున్నాడు. అవి జ్ఞానయోగ్యతాప్రాప్తి, జ్ఞానప్రాప్తి, జ్ఞాననిష్ఠాప్రాప్తి, ప్రతిబంధనివృత్తి. జ్ఞానం పొందే అర్హత ఉండాలి; అర్హత ఉండగానే సరిపోదు, జ్ఞానం పొందాలి; జ్ఞానం పొందితే చాలదు, అది నన్ను మార్చేదిగా ఉండాలి; కనబడని ప్రతిబంధకాలనుంచి నేను విముక్తి పొందితేనే, ఈ మూడూ సాధ్యం. కనబడే ప్రతిబంధకాలను ఎలాగోలా తప్పించుకోవచ్చు, కాని అదృష్టప్రతిబంధకాన్ని ఈశ్వరానుగ్రహంవల్లనే తప్పించుకోగలను. ఈ నేపథ్యంతో ఈ శాంతిపాఠాన్ని చూద్దాము.

1. **జ్ఞానయోగ్యతాప్రాప్తి – వాఙ్మే మనసి ప్రతిష్ఠితా మనో మే వాచి ప్రతిష్ఠితమ్** – నా వాక్కు, నా మనస్సు ఒకదానితో ఒకటి అనుసంధానం చెంది ఉండుగాక. నేను ఏం మాట్లాడినా మనస్ఫూర్తిగా మాట్లాడాలి. మనస్సు వాక్కులో లయమవాలి. దీని అర్థం, అన్ని అంగాలూ ఏకత్రాటిమీద నడవాలి. పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, నాలుగు అంతఃకరణాలు ఒక్క త్రాటిమీద నడవాలి.

2. **జ్ఞానప్రాప్తి – ఆవిరావీర్మ ఏధి** – పరమాత్మను ఆవిః అని సంబోధిస్తున్నాడు శిష్యుడు. ఆవిః అంటే ప్రకాశస్వరూపం. స్వయంప్రకాశరూప పరమాత్మ అని అర్థం. ఆవీర్మ ఏధి – నువ్వు నా ముందు ప్రత్యక్షమవు అంటే ఇక్కడ అర్థం నిన్ను నేను అర్థం చేసుకునేలా చేయి. ప్రస్తుతం నేను అజ్ఞానంతో కప్పబడి ఉన్నాను. నువ్వు అజ్ఞానమనే పొరను తొలగించటంలో నాకు తోడ్పడు.

తెర తీయగ రాదా అని త్యాగరాజ కీర్తన ఉంది. అదే అర్థం ఇక్కడ. ఇది జ్ఞానప్రాప్తిని సూచిస్తుంది.

3. **జ్ఞాననిష్ఠాప్రాప్తి – వేదస్య మ ఆణీస్థః** – శిష్యుడు రెండు ముఖ్యమైన అంగాలను సంబోధిస్తున్నాడు. అవి వాక్కు, మనస్సు. నాకు ఆత్మజ్ఞానాన్ని తీసుకురండి. ఎందుకు

ఈ రెండూ తీసుకురావాలి? జ్ఞానం పొందేది గురుశిష్య సంవాదం ద్వారా. ఈ సంవాదానికి అవసరమైన అంగాలు – జ్ఞానాన్ని పొందే మనస్సు, గురువును ప్రశ్నలు వేసే వాక్కు. శిష్యుడు వేసే ప్రశ్నలు సూటిగా, స్పష్టంగా ఉండాలి; మనస్సు జ్ఞానాన్ని అర్థం చేసుకునేలా ఉండాలి. నిజానికి జీవితంలో అనేక సమస్యలు ఈ రెండు శక్తులూ సరిగ్గా పనిచేయక పోవటంవల్లనే వస్తున్నాయి. ఇప్పుడు ఈ శక్తులను పెంపొందించుకోవటానికి కోర్సులను ప్రవేశపెడుతున్నారు కాని సరిగ్గా ఎలా వినాలో నేర్పించే ఆ కోర్సుల్లో సరిగ్గా వినరు. అది పక్కన పెడితే, వాక్కు, మనస్సులను జ్ఞానం తీసుకురమ్మని కోరుతున్నాడు.

**శ్రుతం మే మా ప్రహాసీః** – ఇక్కడ మనస్సుతో అంటున్నాడు, ఓ మనస్సా, నువ్వు శ్రవణంలో విన్నది మర్చిపోకుండా, తాజాగా నిలచివుండేలా చేయి. ఈ ప్రార్థన జ్ఞాననిష్ఠాప్రాప్తికి చేస్తున్నాడు. ఈ జ్ఞానం క్లాసుకు మాత్రమే పరిమితి కాకుండా, జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను ఎదుర్కొనేందుకు తోడ్పడాలి.

**అనేనాధీతేనాహోరాత్రాన్సందధామి** – నా జీవితాన్ని ఈ అద్భుతమైన బోధలో రమించేలా గడపాలని ఉంది. నేను నిదిధ్యాసనం చేయగలగాలి. దానికి తోడ్పడు ఓ మనసా అంటున్నాడు. ఈ భాగం జ్ఞాననిష్ఠాప్రాప్తిని సూచిస్తుంది.

**ఋతం వదిష్యామి, సత్యం వదిష్యామి** – శిష్యుడు, పరమాత్మను ఋతం, సత్యంగా కీర్తిస్తున్నాడు. తైత్తిరీయంలో ఋతం అంటే శాస్త్రీయజ్ఞానం అనీ, సత్యం అంటే ఋజువర్తన అనీ చూశాము. ఇక్కడ ఇంకొక ఆచార్యుడు ఇంకొక అర్థాన్ని ఇస్తున్నాడు. ఋతం అంటే పారమార్థిక సత్యం అనీ, సత్యం అంటే వ్యావహారిక సత్యం అనీ వివరించాడు. ఓ దేవా, నువ్వు అపరబ్రహ్మవు, పరబ్రహ్మవు కూడా.

4. **ప్రతిబంధ నివృత్తి** – నాకు జ్ఞానం వచ్చేదాకా, నీకొక పనిని అప్పజెపుతున్నాను. నాకు జ్ఞానం వచ్చేదాకా నన్నూ, నా గురువునూ కాపాడాలి.

**తన్మామవతు తద్వక్తారమవతు** – నన్ను కాపాడు, నా గురువును కాపాడు.

**అవతు మామవతు వక్తారమవతు వక్తారమ్** – మళ్ళీ నన్నూ, నా గురువునూ రక్షించమని కోరటం ద్వారా, దీని ప్రాముఖ్యతను తెలియజేస్తున్నాడు. ఈ ప్రార్థన ప్రతిబంధనివృత్తిని సూచిస్తున్నది.

**ఓం శాంతిః శాంతిః శాంతిః** – అధ్యాత్మిక, అధిభౌతిక, అధిదైవిక ప్రతిబంధకాలను తొలగించు అని కోరుతున్నాడు.

## అధ్యాయం 1 – అధ్యారోప, అపవాద ప్రకరణం

ఇందులో 23 మంత్రాలు, మూడు ఖండాల్లో ఉన్నాయి. మొదటి అధ్యాయంయొక్క తాత్పర్యం ఆత్మజ్ఞానం – అధ్యారోప అపవాదం ద్వారా.

**అధ్యారోప, అపవాద ప్రక్రియ**

**అధ్యారోపం** – అంటే సృష్టి. ఉపనిషత్తు ముందు పరమాత్మనుంచి సృష్టి గురించి చెబుతుంది.

**ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్। నాన్యత్కించన మిషత్।** – 1.1.1

దీని అర్థం పరమాత్మ కారణం, జగత్తు కార్యం.

ఈ సృష్టి గురించి చెప్పటంవల్ల ఏం తెలుసుకుంటాము? ఉదాహరణకు బంగారం కారణం, గాజు కార్యం అని నేర్చుకుంటే, దానిద్వారా మనం గ్రహించే సత్యం ఏమిటి?

1. గాజు అనే కార్యం ఒక పదార్థం కానేకాదు, ఉన్నది ఒకటే పదార్థం. అది బంగారం మాత్రమే. బంగారం మాత్రమే గాజు పుట్టకముందూ, గాజులోనూ, గాజు కరిగిపోయాకా ఉంటుంది. మరయితే గాజు పదం ఏమిటి? గాజు అనే పదం పదార్థాన్ని సూచించదు, అది నామం, రూపం మాత్రమే. దాని రూపాన్నిబట్టి నామం మారుతుంది. అందువల్ల నామం, రూపానికి మాత్రమే చెందుతుంది కాని పదార్థానికి కాదు. గాజు అనే కార్యం ఒక రూపానికి నామం.

దీనివల్ల మనం గ్రహించాల్సిన సిద్ధాంతం ఇది. ఈ జగత్తులో ఉన్న అన్ని కార్యాలు, భిన్నరూపాలకు ఇవ్వబడిన నామాలు మాత్రమే.

**యత్ కార్యం, తత్ నామరూపాత్మకమ్**

ఏది కార్యమైనా కూడా, అది ఒక రూపానికి ఒక నామం మాత్రమే. రూపం అంటే ఏమిటి? రూపం ఒక పదార్థం కాదు, అది ఒక పదార్థానికి ఒక గుణం మాత్రమే. దీన్ని ఇంకొంచెం పొడిగిస్తే –

ఏ కార్యమైనా ఒక రూపం మాత్రమే

ఏ రూపమైనా ఒక గుణం మాత్రమే

అందువల్ల ఏ కార్యమైనా ఒక గుణం మాత్రమే.

ఎ = బి, బి = సి; అందువల్ల ఎ = సి సూత్రం ఉపయోగించాలి ఇక్కడ. అందువల్ల ఎన్ని కార్యాలు ఉంటే, అన్ని గుణాలు ఉన్నాయి. ఈ గుణాలు పదార్థానికి గుణాలు. ఆభరణాలన్నీ ఒక్క పదార్థానికే గుణాలు, ఆ పదార్థం బంగారం. బంగారం కారణం. అందువల్ల,

కార్యాలన్నీ కారణంయొక్క గుణాలు మాత్రమే
కుండలన్నీ మట్టియొక్క గుణాలు మాత్రమే
ఆభరణాలన్నీ బంగారంయొక్క గుణాలు మాత్రమే

జగత్తు కార్యం, బ్రహ్మ కారణం అయినప్పుడు సూత్రం ఏమిటి?

జగత్తు బ్రహ్మయొక్క గుణాలు మాత్రమే.

ఉన్నదొక్కటే పదార్థం, జగత్తు అంతా దానికి విశేషణం. దీన్ని విశిష్టాద్వైతం అంటారు. విశిష్టాద్వైతం ముఖ్యమైన దశ కాని అంతిమదశ కాదు.

జగత్తు పరమాత్మయొక్క విశేషణం అంటే ఒక సమస్య ఏర్పడుతుంది. అంతకు ముందు, భగవంతుడు ఈ లోపభూయిష్టమైన జగత్తును ఎందుకు సృష్టించాడు అని అడుగుతుండేవారు. నీటి సమస్య ఉంది, దోమలు స్వైరవిహారం చేస్తాయి.

కాని ఇప్పుడు జగత్తు బ్రహ్మయొక్క విశేషణం అంటే, ప్రశ్న మారుతుంది. భగవంతుడు ఈ దోషభూయిష్ఠమైన గుణాలను ఎందుకు భరించాలి?

అందువల్ల తర్వాత దశకు వెళ్ళాలి, అది అపవాదం.

**అపవాదం** – అపవాదం అంటే త్రోసిపుచ్చటం. నిజానికి పరమాత్మకు ఈ జగత్తు అనే విశేషణం లేదు అంటుంది. భగవంతుడు విశిష్ట కాదు, భగవంతుడు నిర్విశేష అద్వైతం. పరమాత్మకు మంచి గుణాలూ లేవు, చెడు గుణాలూ లేవు. భగవంతుడు ధర్మాధర్మ, పుణ్యపాపవిలక్షణం.

ఇలా నిషేధించటంలోని ప్రత్యేకత ఏమిటి? ఇలా జగత్తులోని గుణాలను నిషేధించటంలోని అర్థం ఇది – జగత్తు అనుభవించటానికి అందుబాటులో ఉంది కాని, జగత్తు సత్యం కాదు. కనుక అనుభవంలోకి వచ్చే ఈ జగత్తు ఉన్నా లేనట్టే. ఈ జగత్తును సత్యమైనదిగా స్వీకరించనవసరం లేదు. అది తక్కువస్థాయి సత్యానికి చెందినది. ఈ విశేషణాత్మక జగత్తును నిషేధించటం ద్వారా అది మిథ్య అవుతుంది.

దీనికి ఉదాహరణ స్వప్నప్రపంచం. స్వప్నం అనుభవంలోకి వస్తుంది కాని, ఆ అనుభవాన్ని ఇక్కడ వాడుకోలేము.

మళ్ళీ అధ్యారోప అపవాదాన్ని టూకీగా చూస్తే –
దశ 1 – జగత్తు భగవానునియొక్క గుణం
దశ 2 – జగత్తు భగవంతునియొక్క మిథ్యాగుణం అవుతుంది.

అప్పుడు నిర్విశేష భగవంతుడు మాత్రమే మిగులుతాడు.

ఈ పద్ధతిని ఈ ఉపనిషత్తులోని మొదటి అధ్యాయంలో చూస్తాము. ఇక్కడ అధ్యారోపాన్ని చాలా వివరంగా చెప్పుకొచ్చి, అపవాదాన్ని చాలా త్వరగా ముగించింది. నిజం కూడా అంతే. దేన్నైనా కట్టటం చాలా కష్టం, పడగొట్టటం చాలా తేలిక.

### అధ్యాయం 1 – ఖండం 1

ఇది అధ్యారోపభాగము. ఇందులో లోకసృష్టి, దేవతాసృష్టి చూస్తాము. నిజానికి పద్నాలుగు లోకాలు ఉన్నాయి కాని ఈ ఉపనిషత్తు వాటిని నాలుగు లోకాలుగా విభజించింది.

**అమ్భో మరీచీర్మరమాపః** అంది. అంభః, మరీచీః, మరమ్, ఆపః ఈ లోకాల పేర్లు.

| | | |
|---|---|---|
| అంభః | – స్వర్గలోకానికి పైన ఉన్న లోకాలు | 5 |
| మరీచీః | – భువర్లోకం | 1 |
| మరః | – భూలోకం | 1 |
| ఆపః | – అధోలోకాలు | 7 |

తర్వాత సృష్టి మూడేసి అంశాల చొప్పున జరిగింది. అవి గోళకాలు, ఇంద్రియాలు, అధిష్ఠానదేవతలు. ఆ విధంగా మొదటి ఖండంలో లోకాల సృష్టి, లోకపాలకుల సృష్టి జరిగింది.

### అధ్యాయం 1 – ఖండం 2

ఈ ఖండంలో ఆకలిదప్పులు, ఈ లోకపాలకులకు స్థూలశరీరాల సృష్టి జరిగింది. లోకపాలకులు ఆవు, గుర్రం శరీరాలు వద్దని మనుష్యశరీరం ఎన్నుకున్నారు. తర్వాత పరమాత్మ వారిని శాసించిన రీతిలో శరీరంలోని ఆయా భాగాలలో చేరుకున్నారు. ఉదాహరణకు అగ్నిదేవత వాక్కుతో కలిసి నోటిలో ప్రవేశించాడు. ఆ వివరాలను ఈ క్రింది పట్టికలో చూడవచ్చు.

| **అధిష్ఠాన దేవత** | **ఇంద్రియం** | **గోళకం** |
|---|---|---|
| అగ్ని | వాక్కు | ముఖం |
| వాయువు | ప్రాణం | నాసిక |
| ఆదిత్యుడు | చక్షువు | అక్షిణీ |
| దిశలు | శ్రోత్రం | చెవులు |
| ఓషధివనస్పతులు | రోమాలు | త్వక్ |
| చంద్రుడు | మనస్సు | హృదయం |

| | | |
|---|---|---|
| మృత్యువు | అపానం | నాభి |
| నీరు | రేతస్సు | శిశ్నం |

ఆకలిదప్పులను అందరు దేవతలతో కలవమన్నాడు.

**అధ్యాయం 1 - ఖండం 3**

అన్నసృష్టి జరిగింది. శరీరం, ఆకలిదప్పులు వచ్చాక, అన్నసృష్టి జరగాలి. అన్నం తనను అందరూ తింటారని పరుగు తీసింది. అన్నం వెంట అన్నీ పరిగెత్తాయి కాని అపానం మాత్రమే అన్నాన్ని పట్టుకోగలిగింది. అన్నాన్ని పట్టుకోవటంవల్ల అపానవాయువుకు అన్న ఆయుః (అన్నాయుః) అనే బిరుదు వచ్చింది. మనకు ఆయుష్షును పెంచే అన్నాన్ని అపానం ఇవ్వటంవల్ల అపానవాయువు మనకు దీర్ఘాయుష్షును ఇస్తుంది. అన్నం అంటే తినే అన్నమే కాదు, శబ్దస్పర్శరూపరసగంధాలతో కూడిన బాహ్యప్రపంచం.

ఈ ఖండంలో 12, 13, 14 మంత్రాలు చాలా ముఖ్యమైన మంత్రాలు. ముఖ్యమైన బోధ వీటిలో వస్తుంది.

ఈ ప్రపంచాన్ని, శరీరాన్ని సృష్టించాక, పరమాత్మే స్వయంగా జీవాత్మగా శరీరంలోకి ప్రవేశించాడు.

**స ఏతమేవ సీమానం విదార్యైతయా ద్వారా ప్రాపద్యత ।** - 1.3.12

నడినెత్తిమీద ఉన్న బ్రహ్మరంధ్రాన్ని చీల్చుకుని, ఆ ద్వారం ద్వారా ప్రవేశించాడు. దీన్ని అనుప్రవేశశ్రుతి అంటారు. అంటే శరీరంలో ఉన్న జీవాత్మ వేరే ఎవరో కాదు. సాక్షాత్తూ పరమాత్మే. నా స్వప్నప్రపంచంలో అంతేకదా! నేనే స్వప్నప్రపంచాన్ని సృష్టించి, దాన్ని అనుభవించటానికి నేనే స్వాప్నికునిగా అందులోకి ప్రవేశిస్తాను. జాగ్రద్ పురుషుడు ఎలాగైతే స్వప్నపురుషుడు అవుతాడో, అలాగే పరమాత్మే జాగ్రద్ పురుషునిగా వచ్చాడు. అదే అనుప్రవేశం. అనుప్రవేశం చేసినప్పుడు **కోஉహమితి** అనుకున్నాడుట పరమాత్మ. ఎప్పటికన్నా ఈ జీవి నేను శరీరం కాను, ఇంద్రియాలు కాను, మనసు కాను, అయితే నేనెవరు అని జీవాత్మ అడగకపోతాడా అనుకున్నాడుట పరమాత్మ.

తరువాత జీవాత్మ, పరమాత్మ ఐక్యం గురించి చెప్పింది ఉపనిషత్తు. అనుప్రవేశశ్రుతి వస్తే ఇది సహజంగానే వస్తుంది.

**స ఏతమేవ పురుషం బ్రహ్మ తతమమపశ్యదిదమదర్శమితీ 3 ॥** - 1.3.13

ఈ జీవాత్మకు తనే పరమాత్మను అని తెలియదు. అందువల్ల సంసారంలో పడిపోయాడు. కాని తరువాత ఏదో పుణ్యంవల్ల ఆత్మజ్ఞానం పొందాడు. తన శరీరంలో ఉన్న జీవాత్మే సర్వవ్యాపకమైన బ్రహ్మ అని తెలుసుకున్నాడు. ఆ విధంగా ఐక్యం వచ్చింది.

**కిమిహాన్యం వావదిషదితి** – నేనే బ్రహ్మను అని తెలుసుకున్నాక, ఈ జ్ఞాని బ్రహ్మకు భిన్నంగా ఏదైనా ఉందా అని విచారణ చేశాడు. బ్రహ్మకు భిన్నంగా కొంచెం కూడా ఏదీ లేదని తెలుసుకున్నాడు. ఎలా తెలుసుకున్నాడు? కారణానికి భిన్నంగా కార్యం లేదని అర్థం చేసుకున్నాడు. జగత్తు కేవలం నామరూపాత్మకమైన జగత్తు అవుతుంది. అంతకుముందూ, ఇప్పుడూ, తర్వాత కూడా ఉన్నదంతా బ్రహ్మే. విశేషణ, విశేష్యరూప ప్రపంచం లేదు.

ఇది **అపవాద ప్రక్రియ** అవుతుంది. జగత్తు లేదు అని అంటే, జగత్‌యొక్క అనుభవాన్ని ఖండించటం లేదు, కాని దాన్ని సత్యంగా తీసుకోకూడదు. జాగ్రదవస్థలో జాగ్రత్ ప్రపంచాన్ని చూస్తాము; స్వప్నావస్థలో స్వప్నప్రపంచాన్ని చూస్తాము; ఇలా అనుభవంలోకి వచ్చే ఈ లోకాల మాటేమిటి? నమ్మలేని నిజాన్ని ఉపనిషత్తు చెబుతుంది.

**త్రయః స్వప్నా** – సుషుప్తి, స్వప్నావస్థ, జాగ్రదవస్థ – మూడూ స్వప్నాలే. మరి ఏది సత్యం? వాటిని చూసే నేను సత్యం, తక్కినవన్నీ స్వప్నం.

అపవాదంలో జగత్‌ను మిథ్యగా కొట్టివేస్తాము. ఇప్పుడు ఉపనిషత్ బోధ ఏమిటి? బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా, నేను బ్రహ్మను కాబట్టి నేను సత్యం, జగత్తు మిథ్య.

## అధ్యాయం 2 – ఖండం 1 సంసార ప్రకరణం

ఇందులో ఒకటే ఖండం ఉంది. ఇందులో ఆరు మంత్రాలు ఉన్నాయి. ఇది అజ్ఞానీ జీవాత్మ ప్రయాణాన్ని వివరిస్తుంది. నేను పరమాత్మను అని తెలుసుకోని జీవాత్మ పరిస్థితి ఏమిటి? మొదట్లో జీవితం బాగానే ఉన్నా, రానురాను దుఃఖభూయిష్ఠమవుతుంది. పునరపి జననం, పునరపి మరణం వృత్తంలో పడి తిరుగుతుంటాడు. తక్కిన అంశాలలాగానే, దీన్ని కూడా ఈ ఉపనిషత్తు తనదైన శైలిలో చెబుతుంది.

ఇక్కడ జీవాత్మ నిరంతర ప్రయాణాన్ని మూడు దశలుగా వివరిస్తున్నది ఉపనిషత్తు.

**త్రయః అవసథాః** – అవసథకూ, జన్మకూ మధ్య భేదం ఉంది. అవసథ అంటే స్థానం. అలా ఒక శిశువు మూడు అవసథల్లో ఉండి, మూడు జన్మలు పొందుతుంది అంటున్నది ఉపనిషత్తు.

**అవసథ 1** – ఒక వైదికజీవి గురించిన పుట్టుక పంచాగ్ని విద్యలో వస్తుంది. అందులో ఐదు దశలు వస్తాయి. అవి స్వర్గం, మేఘం, పృథివీ, పురుషుడు, నారి. ఐతరేయోపనిషత్‌లో పై మూడు దశలూ వదిలేసి పురుషునిలో ఉన్న దశను అవసథ 1 అంటున్నది. పురుష రేతస్సులో ఉంటుంది జీవి. అతను తన రేతస్సును స్త్రీయోనిలో వదులుతాడు. అది మొదటి జన్మ అవుతుంది అంటే తండ్రి పుత్రునికి జన్మ ఇచ్చినట్టు అవుతుంది.

**అవసథ 2** – మొదటి జన్మ, రెండవ అవసథ అవుతుంది. అంటే స్త్రీ గర్భం అవసథ 2 అవుతుంది. తల్లి శిశువును ఈ భూమ్మీదకు తీసుకువస్తుంది. అది రెండవ జన్మ అవుతుంది.

**అవసథ 3** – తల్లి గర్భంనుంచి భూమ్మీదకు వచ్చిన శిశువు జీవితం అవసథ 3. అంటే తన శరీరంలోనే జీవిస్తుంది. ఈ శరీరం వదలి ఇంకో శరీరంలో మళ్ళీ పునర్జన్మ ఎత్తుతాడు. అది మూడవ జన్మ అవుతుంది. కాని దాన్ని తండ్రిపరంగా చెబుతున్నది ఉపనిషత్తు. దాన్ని మనం పుత్రునికి అన్వయించుకోవాలి.

ఈ మూడు జన్మలతో ముగింపుకు వస్తుందని కాదు అర్థం. జీవి పునరపి జననం, పునరపి మరణం పొందుతూనే ఉంటాడు. ఉపనిషత్తు ఈ సంసారవృత్తాన్ని వర్ణించిన కారణం, ఈ వృత్తంమీద వైరాగ్యం పుట్టించి, దీన్నించి బయటపడేయాలని. వైరాగ్యం పుడితే, ఈ వృత్తంనుంచి బయటపడే మార్గం వెతుక్కుంటాము.

నిజంగా ఇలా వృత్తంనుంచి బయటపడగలమా అనే సందేహం వద్దు అని చెప్పటానికి ఉపనిషత్తు ఒక ఋషి ఉదాహరణను ఇస్తున్నది. వామదేవఋషి తను తల్లిగర్భంలో ఉండగానే తన జ్ఞానాన్ని ప్రకటించాడు.

**గర్భ ఏవైతచ్ఛయానో వామదేవ ఏవమువాచ** – 2.5

నేను అనేక జన్మల శరీరశృంఖలాలను ఛేదించుకుని బయటపడ్డానని తల్లి గర్భంలో ఉండగానే ప్రకటించాడు.

ఈ అధ్యాయంలో ఒక ప్రత్యేకతను చూస్తాము.

**అపక్రామత(స్తు) గర్భిణ్యః** – ఈ అధ్యాయం మొదట్లో ఈ మాటలు వస్తాయి. ఇది మంత్రం కాదు. సభలో ఎవరైనా గర్భిణీ స్త్రీలు ఉంటే బయటకు వెళ్ళమని వారికి ఇచ్చిన సూచన. శిశువు జన్మ గురించి మాట్లాడుతుంది కాబట్టి అలా చెప్పింది. దీన్నిబట్టి ఆత్మజ్ఞానవిచారణ స్త్రీలు కూడా చేసేవారని తెలుస్తున్నది.

## అధ్యాయం 3 – ఖండం 1 మహావాక్యప్రకరణం

ఇందులో కూడా ఒకటే ఖండం ఉంది. నాలుగే మంత్రాలు ఉన్నాయి. ఇది మొదటి అధ్యాయంయొక్క సారాంశం. అందువల్ల ఇందులో కూడా జీవాత్మ, పరమాత్మ ఐక్యాన్ని చూస్తాము.

**కోఽ యమాత్మేతి? కతరః స ఆత్మా** – నేను ఎవరు? ఈ రెండింటిలో ఏది ఆత్మ? బ్రహ్మరంధ్రం ద్వారా పరమాత్మ ప్రవేశించాడు. అరికాలినుంచి హిరణ్యగర్భ ప్రవేశించాడు. ఏది అసలు ఆత్మ? చిద్రూప పరమాత్మనా, చిదాభాసరూప హిరణ్యగర్భనా?

కోఽ హమితి – నేను శరీరం కాను, నేను ఇంద్రియాలను కాను, నేను మనస్సు కాను. అవి నేను కాకపోతే నేనెవరిని అని మనిషి ఎప్పుడో ఒకప్పుడు ప్రశ్నించుకోకపోతాడా అని పరమాత్మ అనుకుంటాడని రెండవ అధ్యాయంలో చూశాము. సరిగ్గా అలాగే చర్చ జరుగుతుంది మూడవ అధ్యాయంలో. సూక్ష్మశరీరంలో ఉన్న ఏ అంగం కూడా ఆత్మ కాదు. ఎందుకు? అవి ప్రమాణాలు కాబట్టి, మార్పు చెందుతాయి కాబట్టి. శరీరం, ఇంద్రియాలు, మనస్సు, ఇవేవీ నేను కాకపోతే, నేను ఎవరు? వీటిని సాక్షిగా చూస్తున్నది ఒకటి ఉంది. అదే సాక్షిచైతన్యం. ఇక్కడ ప్రజ్ఞానం అన్నది ఉపనిషత్తు. చైతన్యాన్ని ఎలా తెలుసుకోవాలి?

చైతన్యం + వృత్తి = అనుభవం
చైతన్యం = అనుభవం – వృత్తి

అనుభవంలోంచి వృత్తిని తీసేస్తే మిగిలేది చైతన్యం మాత్రమే.

మారే అనుభవాలు – మారే వృత్తులు = మారని చైతన్యం.

మారే చైతన్యం అనకూడదు. ఇక్కడితో త్వం పదార్థ విచారణ ముగిసింది.

**ప్రజ్ఞానం బ్రహ్మ** – ప్రతివృత్తి వెనకనున్నది ఈ చైతన్యం. అదే బ్రహ్మ. ఆత్మ = బ్రహ్మ అని ముందే చూశాము. **ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్.** ఈ బ్రహ్మ ఎక్కడ ఉందో ఒక పెద్ద పట్టికనే ఇచ్చింది ఉపనిషత్. సీమటపాకాయ టపాటపా మ్రోగినట్టు, గడగడా ఒక పెద్ద పట్టిక వస్తుంది. ఈ బ్రహ్మే చతుర్ముఖ బ్రహ్మ, ఇంద్రుడు, ప్రజాపతి, దేవతలు, పంచభూతాలు, జీవరాశులు, మనుష్యులు, జంతువులు, వృక్షాలు, క్రిమికీటకాలు, పక్షులు అన్నింటిలోనూ ఉంది. ఇది తత్ పదార్థ విచారణ.

**సర్వం తత్ప్రజ్ఞానేత్రమ్** – ఉన్నదంతా ప్రజ్ఞానేత్రం. మొత్తం జగత్తుకు ఉనికిని ఇస్తున్నది ప్రజ్ఞానం. అంటే ప్రజ్ఞానం లేకుండా జగత్తుకు విడిగా ఉనికి లేదు. బ్రహ్మ చైతన్యం సత్యం, జగన్మిథ్యా.

**ప్రజ్ఞానే ప్రతిష్ఠితమ్** – జడమైన జగత్తుకు, ప్రజ్ఞానం సత్తా ప్రదాత. కారణం కార్యం అంతటా ఉంటుంది.

ఇటువంటి ప్రజ్ఞానాలు ఎన్ని? ఒకటే. నేను ప్రజ్ఞానం, నేను చైతన్యాన్ని, నేను సజాతీయ, విజాతీయ, స్వగత భేదరహితం బ్రహ్మను. **అహం బ్రహ్మ అస్మి.** అసి పదార్థం అర్థం కూడా వచ్చింది.

**ఫలశ్రుతి** – నేను ప్రజ్ఞానం బ్రహ్మను అని జ్ఞానం పొందితే రాగద్వేషాలు, భయం, దుఃఖం ఉండే అవకాశమే లేదు. అటువంటి జ్ఞాని జీవించి ఉండగా జీవన్ముక్తి పొందుతాడు. మరణించాక విదేహముక్తి పొందుతాడు.

ఇందులో ముఖ్యమైన మంత్రాలు –

1.1.1 – అధ్యారోపం

1.3.12, 13 – అనుప్రవేశం, ఐక్యం, అపవాదం

2.5 – వామదేవ ఋషి

3.3 – మహావాక్యం

**శాంతిపాఠం**

**ఓం వాఙ్మే మనసి ప్రతిష్ఠితా, మనో మే వాచి ప్రతిష్ఠితమ్ । ఆవిరావీర్మ ఏధి।**
**వేదస్య మ ఆణీస్థః । శ్రుతం మే మా ప్రహాసీరనేనాధీతేనాహోరాత్రాన్సందధామి॥**
**ఋతం వదిష్యామి । సత్యం వదిష్యామి। తన్మామవతు।**
**తద్వక్తారమవతు। అవతు మామవతువక్తారమవతు వక్తారమ్॥**
**ఓం శాన్తిః శాన్తిః శాన్తిః**

# ఏకాదశ ఉపనిషత్తుల సారం

## ప్రశ్నోపనిషత్

శంకరాచార్యులవారు భాష్యం రాసిన పది ఉపనిషత్తుల్లో ప్రశ్నోపనిషత్ ఒకటి. ఈ ఉపనిషత్ అథర్వణ వేదానికి చెందినది. ముండకోపనిషత్, మాండూక్యోపనిషత్ కూడా ఈ వేదానికి చెందినవే.

ముండకోపనిషత్‌ను సంహితోపనిషత్ అనీ, ప్రశ్నోపనిషత్‌ను బ్రాహ్మణోపనిషత్ అనీ అంటారు. సంహితోపనిషత్ వేదపూర్వభాగంలో వస్తే, బ్రాహ్మణోపనిషత్ వేద అంతభాగంలో వస్తుంది. సాధారణంగా బ్రాహ్మణోపనిషత్‌ను, సంహితోపనిషత్‌మీద వ్యాఖ్యానంగా పరిగణిస్తారు. ఆ విధంగా ప్రశ్నోపనిషత్‌ను ముండకోపనిషత్‌కు వ్యాఖ్యానం అని చెప్పవచ్చు.

ప్రశ్నోపనిషత్‌కు ఆ పేరెలా వచ్చింది? ఈ ఉపనిషత్ కూడా గురుశిష్యుల సంవాదరూపంలో ఉంటుంది. గురువు పిప్పలాద ఋషి. ఆయనను ఆరుగురు శిష్యులు ప్రశ్నలు వేయటంవల్ల ప్రశ్నోపనిషత్ అనే పేరు వచ్చింది. ప్రశ్నలు అంటే జవాబులు కూడా ఉంటాయని అర్థం చేసుకోవాలి. ఒక్కొక్క శిష్యునితో గురువుయొక్క సంవాదం ఒక్కొక్క అధ్యాయంగా వచ్చింది. అందువల్ల ఇందులో ఆరు అధ్యాయాలు ఉన్నాయి. అన్ని అధ్యాయాల్లోనూ గురువు ఒక్కరే, శిష్యులే మారతారు. శిష్యుల పేర్లు ఆయా అధ్యాయాలలోకి వెళ్ళినప్పుడు చూద్దాము. ఈ ఆరు అధ్యాయాలలో మొత్తం 67 మంత్రాలు ఉన్నాయి. అందువల్ల కొంచెం పెద్ద ఉపనిషత్తే అని చెప్పవచ్చు.

**శాంతిపాఠం**

ఒక్కొక్క వేదానికి ఒక్కొక్క శాంతిపాఠం ఉంటుంది. అథర్వణ వేదానికి ఉన్న శాంతిపాఠం.

**ఓం భద్రం కర్ణేభిశ్శృణుయామ దేవాః। భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః।**
**స్థిరైరంగైస్తుష్టువాగ్ంసస్తనూభిః। వ్యశేమ దేవహితం యదాయుః।**
**స్వస్తి న ఇన్ద్రో వృద్ధశ్రవాః। స్వస్తి నః పూషా విశ్వవేదాః।**
**స్వస్తి నస్తార్క్ష్యో అరిష్టనేమిః। స్వస్తి నో బృహస్పతిర్దధాతు॥**
**ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః ॥**

ఈ శాంతిపాఠం సారాంశం మాత్రం చూద్దాము. దీని ద్వారా శిష్యుడు రెండు వరాలు కోరతాడు. రెండూ వేదాంత అధ్యయానికి తోడ్పడే వరాలు.

1. **జ్ఞానయోగ్యతా ప్రాప్తి** – వేదాంత అధ్యయనం చేయాలంటే శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలి. అంటే ఇవి చాలా దీర్ఘకాలం చేయాలి. దానికోసం దీర్ఘాయుష్షు కావాలి. అందులోనూ వేదాంతానికి రావటమే చాలా ఆలస్యంగా రావటం జరుగుతుంది.

**వ్యశేమ దేవహితం యదాయుః**

ఆయురారోగ్యాభివృద్ధిరస్తు అని దీవిస్తారు కదా! అలా దీర్ఘాయుష్షుతోపాటు మంచి ఆరోగ్యం కూడా ఉండాలని కోరుతున్నాడు శిష్యుడు. ఆరోగ్యంలో ఒక్క శారీరక ఆరోగ్యం మాత్రమే కాదు, అన్ని అంగాలు విద్యను అందుకునేటట్లుగా ఉండాలి. చెవులతో మంచి విషయాలు వినాలి. కనులతో మంచి దృశ్యాలు చూడాలి.

2. **ప్రతిబంధ నివృత్తి** – ఆత్మజ్ఞానం పొందేటప్పుడు ఆటంకాలు లేకుండుగాక అంటున్నాడు.

**స్వస్తిన ఇంద్రో వృద్ధశ్రవాః ...**

ఇంద్రుడు, సూర్యుడు, గరుత్మంతుడు, బృహస్పతి మాకు శుభం కలిగించాలి.

ఇప్పుడు ఉపనిషత్తులోకి అడుగు పెడదాము. ఆరు అధ్యాయాల్లో మొదటి నాలుగు ఆత్మానాత్మ వివేకం చేస్తాయి. అనాత్మ అంటే శరీరత్రయం, ఆత్మ అంటే శరీరత్రయవిలక్షణంగా ఉన్న చైతన్యం. కాకపోతే ఇంత స్పష్టంగా ఈ ఆత్మానాత్మవివేకాన్ని వివరించలేదు. పరోక్షంగా వీటి భావం శరీరత్రయవిలక్షణ ఆత్మ వివేకం.

ఆరు అధ్యాయాల వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

| | | |
|---|---|---|
| అధ్యాయం | 1 | – స్థూలశరీర ప్రధానం |
| | 2, 3 | – సూక్ష్మశరీర ప్రధానం |
| | 4 | – కారణశరీర + ఆత్మ ప్రధానం |
| | 5 | – ఓంకార ఉపాసన – క్రమముక్తికోసం |
| | 6 | – బ్రహ్మ ప్రతిపాదనం – షోడశ కల పురుషః |

### అధ్యాయం 1 – స్థూల శరీర ప్రధానం – మంత్రాలు 16

ఈ అధ్యాయంలో శిష్యుని పేరు కబంధీ కాత్యాయనః. ఈ శిష్యుడు పిప్పలాద ఋషిని సృష్టిప్రకరణం గురించి అడిగాడు.

**ఇమాః ప్రజాః ప్రజాయన్త ఇతి** – ఈ ప్రాణికోటి ఎక్కడనుంచి పుట్టింది?

దీనికి జవాబుగా సృష్టిప్రకరణం వస్తుంది. అది చివరికి స్థూలశరీర సృష్టికి దారితీస్తుంది.

ఇందులో మిథునాత్మక సృష్టి గురించి వస్తుంది. ఇది చాలా ప్రత్యేకమైన పద్ధతి. మామూలుగా సృష్టిలో రెండు భిన్నవస్తువులు ఉన్నాయని చూస్తాము. వాటిని ద్వంద్వాలు అంటారు. లాభనష్టాలు, సుఖదుఃఖాలు, రాత్రీపగలు. కాని ఈ ఉపనిషత్ ఈ ద్వంద్వాలను రెండు భిన్నవస్తువులుగా చూడవద్దు అంటుంది. అవి చూడటానికి విభిన్నంగా, వ్యతిరేకంగా ఉన్నట్టు అనిపించినా, అవి రెండూ కలిస్తేనే ఆ వస్తువు పరిపూర్ణం అవుతుంది. పుట్టుక చావు కలిస్తేనే జన్మ; రాత్రీ పగలు కలిస్తేనే రోజు. రెండూ విరుద్ధస్వభావాలైనా ఒకటి లేనిదే ఇంకొకటి లేదు. అర్ధనారీశ్వరతత్త్వం అన్నమాట.

ఇలాంటి మిథున జంటలను కొన్ని ఇచ్చాడు పిప్పలాద గురువు.

1. **ప్రాణ-రయి మిథునం** – ప్రాణం భోక్తృప్రపంచాన్ని సూచిస్తే, రయి భోగ్యప్రపంచాన్ని సూచిస్తుంది. అంటే సబ్జెక్ట్-ఆబ్జెక్ల మధ్య సంబంధాన్ని సూచిస్తున్నది. ఆబ్జెక్టు లేకుండా సబ్జెక్ట్ మాత్రం ఉండి లాభం లేదు, సబ్జెక్ట్ లేకుండా ఆబ్జెక్ట్ ఉంటే అనుభవించేవారు ఉండరు.

2. **సూర్య-చంద్ర మిథునం** – సూర్యుడు భోక్తకు పోషణకారుడు. చంద్రుడు భోగ్యప్రపంచానికి, ముఖ్యంగా మనం తినే ఆహారానికి పోషణకారుడు. సూర్యుడు మనకు శక్తినిస్తే, చంద్రుడు ఆహారానికి శక్తినిస్తాడు.

3. **ఉత్తరాయణ-దక్షిణాయన మిథునం** – సూర్య, చంద్రుల గురించి వస్తే, కాలతత్త్వం గుర్తుకు రాకతప్పదు. సూర్యునివల్ల పగలు, రాత్రి ఏర్పడితే, చంద్రునివల్ల అమావాస్య, పౌర్ణమి తిథులు ఏర్పడతాయి.

ఈ సందర్భంలో పిప్పలాద ఋషి శుక్లగతి-కృష్ణగతుల మిథునం గురించి కూడా చెప్పటం జరిగింది.

కాలసృష్టిలో సంవత్సరపరంగా చూస్తే దక్షిణాయన-ఉత్తరాయణ మిథునం; మాసపరంగా చూస్తే కృష్ణపక్ష-శుక్లపక్ష మిథునం; రోజుపరంగా చూస్తే రాత్రి-పగలు మిథునం వస్తాయి.

4. **అన్న మిథునం** – ఇక్కడ అన్నంలో మిథునసృష్టి స్పష్టంగా ఇవ్వలేదు కాని మనం కలుపుకోవచ్చు. అన్నంనుంచి మనుష్యబీజం వస్తుంది. దాన్ని పురుషునిలో శుక్రమని, స్త్రీలో శోణితమనీ అంటారు. అంటే శోణిత-శుక్ర మిథునం.

**అన్నం వై ప్రజాపతిస్తతో హ వై తద్రేతస్తస్మాదిమాః ప్రజాః ప్రజాయన్త ఇతి** – 1.14

స్త్రీ, పురుషులు తిన్న ఈ అన్నంనుంచి మనుష్యసృష్టి జరుగుతుంది. ఆ విధంగా సృష్టి గురించి మొదలుపెట్టి, స్థూలశరీరసృష్టివరకూ వచ్చాడు పిప్పలాద ఋషి. అందువల్లనే దీన్ని స్థూలశరీరప్రధాన అధ్యాయం అన్నాము.

**కుతో హ వా ఇమాః ప్రజాః ప్రజాయన్తే –** ఈ ప్రాణికోటి ఎక్కడనుంచి పుట్టింది?

**తస్మాదిమాః ప్రజాః ప్రజాయన్త ఇతి –** ప్రజాపతినుంచి ప్రజాసృష్టి వస్తుంది.

అనేక దశల తరువాత చివరికి ప్రజాసృష్టి వస్తుంది.

ఇక్కడ ఒక విషయాన్ని గమనించాలి మనం. పిప్పలాద ఋషి మిథునసృష్టి గురించి చెప్పినప్పుడు, భగవంతుడు సృష్టించాడు అనలేదు, భగవంతుడు మిథునం అయ్యాడు అన్నాడు అడుగడుగునా.

**సంవత్సరో వై ప్రజాపతిః, మాసో వై ప్రజాపతిః, అహోరాత్రో వై ప్రజాపతిః, అన్నం వై ప్రజాపతిః**

ప్రజాపతి అంటే హిరణ్యగర్భ అంటే భగవంతుడు. భగవంతుడే సబ్జెక్ట్–ఆబ్జెక్ట్ జంట అయ్యాడు. దీన్ని ఒక పట్టికరూపంలో చూద్దాము.

**అధ్యాయం 1 టూకీగా – సృష్టి ప్రకరణం**

| **సృష్టి** | **1** | **2** |
|---|---|---|
| 1. మిథునసృష్టి | రయి | ప్రాణ |
| | మూర్తప్రపంచం | అమూర్తప్రపంచం |
| 2. లోకసృష్టి | చంద్రుడు | ఆదిత్యుడు |
| 3. కాలసృష్టి | | |
| సంవత్సరం | దక్షిణాయనం | ఉత్తరాయణం |
| నెల | కృష్ణపక్షం | శుక్లపక్షం |
| రోజు | రాత్రి | పగలు |
| 4. అన్నసృష్టి – రేతస్సు | శోణితం | శుక్రం |
| 5. మనుష్యసృష్టి | స్త్రీ | పురుషుడు |

| **మార్గాలు** | **సూక్ష్మ సూచనలు** |
|---|---|
| కేవల కర్మ చేస్తే కృష్ణగతిద్వారా స్వర్గలోకప్రాప్తి | – పునర్జన్మ |
| తపస్సు, బ్రహ్మచర్యం | – నిబంధనలు |
| ఉపాసన చేస్తే శుక్లగతిద్వారా బ్రహ్మలోకప్రాప్తి, అది కూడా ఆపేక్షిక అమృతత్వం | – కేవలకర్మ చేసిన వారికి ప్రవేశం లేదు |
| వక్రబుద్ధి, అసత్యం, వంచన తగదు | – నిబంధనలు |

## అధ్యాయం 2 – సూక్ష్మశరీర ప్రధానం – మంత్రాలు 13

ఇందులో భార్గవో వైదర్భిః పిప్పలాద ఋషిని అడిగి ప్రాణతత్త్వం గురించి తెలుసుకోవాలని అనుకున్నాడు. ఆ అర్థం వచ్చేలాగా మూడు ఉపప్రశ్నలు అడిగాడు. అవి –

1. **కత్యేవ దేవాః ప్రజాం విధారయన్తే**? – ఏ దేవతలు ఒక వ్యక్తికి స్థితికారకులు?
2. **కతర ఏతత్ప్రకాశయన్తే**? – వారిలో ఎవరు గొప్పలు చెప్పుకుంటున్నారు?
3. **కః పునరేషాం వరిష్ఠః**? – వారిలో ఎవరు శ్రేష్ఠులు?

రెండవ మంత్రంలో మొదటి రెండు ప్రశ్నలకూ జవాబులు వచ్చాయి.

**1. కత్యేవ దేవాః ప్రజాం విధారయన్తే – ఏ దేవతలు ఒక వ్యక్తికి స్థితికారకులు?**

24 దేవతలు భరిస్తున్నాయి. పంచభూతాలు, పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, నాలుగు అంతఃకరణాలు. పంచప్రాణాలు కూడా కలుపుకోవాలి.

**2. కతర ఏతత్ప్రకాశయన్తే – వారిలో ఎవరు గొప్పలు చెప్పుకుంటున్నారు?**

19 దేవతలూ వాటి పనిని స్తుతి చేసుకుంటున్నాయి. (పంచభూతాలు, పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, నాలుగు అంతఃకరణాలు.)

**3. కః పునరేషాం వరిష్ఠః – వారిలో ఎవరు శ్రేష్ఠులు?**

ఈ ప్రశ్నకు జవాబుగా గురువు ఒక కథను చెబుతున్నాడు. ఈ ప్రశ్న అర్థం ధారణకర్త ఎవరు? అంటే ఏ దేవత ఉంటే, ప్రాణం ఉన్నట్టు? దీనికి జవాబు – ప్రాణతత్త్వం అని మనకు తెలుసు.

ప్రాణం శ్రేష్ఠం కాబట్టే ఎవరైనా మరణిస్తే అతనిలో ప్రాణం పోయింది అంటాము. ఎవరైనా మనని ఒకటే సతాయిస్తూంటే, నా ప్రాణం తీయకు అంటాము. ప్రాణశ్రేష్ఠత్వం చూడబోతున్నాము, కథ ద్వారా.

భార్గవో వైదర్భిఃకి వచ్చిన సందేహమే, మనిషిలో ఉన్న ఈ అంగాలకు కూడా ఒకసారి వచ్చాయిట. మాలో ఎవరు గొప్ప? అంటే అహంకార సమస్య. తమాషా చూశారా! ఈ అహంకార సమస్య కొత్తగా వచ్చింది కాదు, ఉపనిషత్తుల కాలంనుంచే ఉందన్నమాట. పంచప్రాణాలు తప్ప తక్కిన దేవతలు మేమే గొప్పవారము అంటున్నాయి.

**వయమేతద్బాణమవష్టభ్య విధారయామః** – 2.2

మేమే శరీరాన్ని భరిస్తున్నాము, మేమే ఈ శరీరాన్ని కలిపి ఉంచుతున్నాము అంటున్నాయి. మేము అంటే పంచభూతాలు, పంచకర్మేంద్రియాలు, నాలుగు అంతఃకరణాలు, పంచజ్ఞానేంద్రియాలు.

**తాన్వరిష్ఠః ప్రాణ ఉవాచ। మా మోహమాపద్యథా** – 2.3

ప్రాణం అహం దెబ్బతిన్నది. తక్కిన దేవతలను మందలిస్తుంది. నేనే గొప్ప అనే మోహంలో మీరు పడకండి. నన్ను నేనే ఐదుగా విభజించుకుని, ఈ శరీరాన్ని నిలబెదుతున్నాను అంటుంది.

**తేఽ శ్రద్ధధానా బభూవుః** – ఈ దేవతలు నమ్మలేదు. ప్రాణం లేనిపోని గొప్పలు చెప్పుకుంటున్నది అనుకున్నాయి. ఇలా మాటలతో లాభంలేదు, వాటికి గుణపాఠం చెప్పాలనుకుంది ప్రాణదేవత.

ప్రాణం పైకి వెళ్ళినట్టుగా చేసింది. నిజంగా వెళ్ళలేదు. వెళ్ళటానికి లేస్తేనే, తక్కినవన్నీ నీరసించిపోతున్నాయి. దానికి ఉపనిషత్తు ఒక ఉదాహరణ కూడా ఇస్తున్నది. ఎలా తేనెటీగల రాజు వెళితే, తక్కినవన్నీ వెళతాయో, అతను ఒకచోట ఉంటే, తక్కినవన్నీ అక్కడ ఎలా ఉంటాయో, అలా వాక్కు (పంచకర్మేంద్రియాలు), మనస్సు (నాలుగు అంతఃకరణాలు), కళ్ళు, చెవులు (పంచజ్ఞానేంద్రియాలు) ప్రాణం వెంట వెళుతున్నాయి, వస్తున్నాయి. పంచభూతాలను ఇక్కడ చెప్పకపోయినా వాటిని కూడా కలుపుకోవాలి.

**తే ప్రీతాః ప్రాణం స్తున్వన్తి** – దీనివల్ల తక్కిన దేవతలకు గర్వభంగం అయి, అవి ప్రాణాన్ని స్తుతించసాగాయి. ఇక్కడ ప్రాణం అంటే సమష్టిప్రాణంగా తీసుకోవాలి. అన్నింటిలోనూ ఉన్న ప్రాణశక్తి. ఛాందోగ్యం, బృహదారణ్యక ఉపనిషత్తుల్లో కూడా ఈ కథ వస్తుంది. ఈ విధంగా ప్రాణాన్ని స్తుతించటంద్వారా అహింస విలువయొక్క విలువ కూడా తెలుస్తుంది. ప్రాణం విలువ ప్రాణానిదే. అది ఒక సూక్ష్మక్రిమిలోని ప్రాణం అయినా కూడా.

తక్కిన దేవతలు ప్రాణస్తుతిని చేస్తాయి. సమష్టి ప్రాణమే అగ్నిశక్తిగా మండుతున్నది, సూర్యునిలా ప్రకాశిస్తున్నది, వానలా కురుస్తున్నది, ఇంద్రుడు, వాయువు, పృథివి, చంద్రుడులా విరాజిల్లుతున్నది. మూర్త, అమూర్త ప్రపంచంగా, దేవతల అన్నంగా భాసిల్లుతున్నది. నువ్వు వర్షం రూపంలో అన్నాన్ని తీసుకుని వస్తావు అని స్తుతిస్తాయి. 3వ ప్రశ్న మళ్ళీ చూస్తే –

3. **కః పునరేషాం వరిష్ఠః** – జవాబు – ప్రాణం.

ఈ విధంగా ఈ అధ్యాయంలో ప్రాణం శ్రేష్ఠత్వం నిరూపించబడి, ప్రాణస్తుతి కూడా జరుగుతుంది. ఈ దేవతలన్నీ, ప్రాణంతో సహా సూక్ష్మశరీరంలోని అంగాలు కాబట్టి, ఈ రెండవ అధ్యాయం సూక్ష్మశరీర ప్రధానం అని చూశాము.

### అధ్యాయం 3 – సూక్ష్మశరీరప్రధానం – మంత్రాలు 12

ఈ అధ్యాయంలో కౌసల్య ఆశ్వలాయనః, పిప్పలాద ఋషిని ప్రశ్నిస్తాడు. ఇతను కూడా ప్రాణం గురించే అడిగినా, వాటిని ఆరు ప్రశ్నలుగా తీసుకోవచ్చు.

1. **కుత ఏష ప్రాణో జాయతే** – ఈ ప్రాణం ఎక్కడినుంచి వచ్చింది?
2. **కథమ్ అస్మిన్ శరీరే ఆయాతి?** వ్యష్టిశరీరంలోకి ప్రాణం ఎలా వచ్చింది?
3. **ఆత్మానం వా ప్రవిభజ్య కథం ప్రాతిష్ఠతే?** – తనను తాను విభజించుకుని ఎలా ఆధారమైంది?
4. **కేన ఉత్క్రమతే** – ఎలా బయటకు వెళుతుంది?
5. **కథం బాహ్యమభిధత్తే** – ఎలా బాహ్యప్రపంచానికి ఆధారమయింది?
6. **కథమ్ అధ్యాత్మమ్ అభిధత్తే** – ఎలా వ్యష్టికి ఆధారమయింది?

ఈ ప్రశ్నలకి జవాబులు చెప్పుకొస్తాడు గురువు.

ఆత్మనుంచి ఈ ప్రాణం పుట్టింది. ఈ ప్రాణం పూర్వజన్మ కర్మఫలాలవల్ల వస్తుంది.

**ఉత్క్రామంతం స్థితం వాపి భుంజానం వా గుణాన్వితమ్ ।**
**విమూఢా నానుపశ్యంతి పశ్యంతి జ్ఞానచక్షుషః ॥** – గీత 15.10

జీవితంలో జరిగే ప్రతి అనుభవం కూడా ఆత్మ అనుభవమే. ఆత్మ అంటే భగవంతుడు కాబట్టి జీవితంలో జరిగే ప్రతి అనుభవమూ, భగవంతుణ్ణి దర్శనం చేయిస్తుంది. నాస్తికుడు, 'భగవంతుడు లేడు,' అని చెప్పినా కూడా, భగవంతుడు లేడు అని చెప్పటానికి ఉన్న శక్తి ఎక్కడనుంచి వస్తున్నదనుకున్నారు? సాక్షాత్తూ భగవంతుణ్ణుంచే. భగవంతుడు లేడు అనగలగటానికి కూడా భగవంతుని కృప ఉండాలి.

**ప్రాణస్య ప్రాణః శ్రోత్రస్య శ్రోత్రం** – కేన

ప్రాణానికి ప్రాణశక్తినిచ్చేది, చెవికి చెవిశక్తిని ఇచ్చేది ఆత్మ.

**ఆత్మన ఏష ప్రాణో జాయతే । యథైషా పురుషే ఛాయా**

ఆత్మనుంచి ప్రాణం పుట్టింది అని చెప్పే సందర్భంలో ఒక అద్భుతమైన మాట వేసింది ఉపనిషత్తు. పురుషునివల్ల ఏర్పడిన నీడలా, ఆత్మనుంచి ప్రాణం పుట్టింది అంటున్నది.

ఒక వ్యక్తి నిలుచున్నచోట అతని నీడ ఏర్పడుతుంది. ఛాయా అంటే నీడ. శంకరాచార్యులవారు ఈ వాక్యానికి భాష్యం చెబుతూ, ఛాయకు స్వతంత్రంగా ఉనికి లేదనీ, విడిగా ఉనికి లేనిది మిథ్య అనీ, అదే విధంగా ప్రాణం ఆత్మనుంచి నీడలా వచ్చింది అంటే ప్రాణం కూడా మిథ్య అనీ అంటారు.

1. **కుత ఏష ప్రాణో జాయతే** – ఈ ప్రాణం ఎక్కడినుంచి వచ్చింది?

**ఆత్మనః ఏష ప్రాణో జాయతే యథైష పురుషే ఛాయా** – ఆత్మనుంచి ఛాయలాగా పుట్టింది.

2. **కథమ్ అస్మిన్ శరీరే ఆయాతి** – వ్యష్టిశరీరంలోకి ప్రాణం ఎలా వచ్చింది?

**మనోకృతేన** – పూర్వజన్మ కర్మఫలాలవల్ల వస్తుంది.

ఇప్పుడు మూడవ ప్రశ్నకు జవాబు మొదలవుతుంది.

3. **ఆత్మానం వా ప్రవిభజ్య కథం ప్రాతిష్ఠతే?** – తనను తాను విభజించుకుని ఎలా ఆధారమైంది?

**యథా సమ్రాడేవాధికృతాన్ వినియుంక్తే** – సామ్రాట్‌లాగా ఒక్కొక్క ప్రాణానికి ఒక్కొక్క అధికారం ఇచ్చింది. ఐదవమంత్రంలో వచ్చిన ఆ విభజనను, అవి ఉండే స్థానాలను ఈ క్రింది పట్టికలో చూడవచ్చు.

| **వ్యష్టి ప్రాణం** | **స్థానం** | **అధికారం** |
|---|---|---|
| అపానం | పాయు, ఉపస్థ | విసర్జన క్రియ, జీవోత్పత్తి |
| ప్రాణం | చక్షు శ్రోత్రే ముఖనాసికాభ్యాం | శ్వాసక్రియ |
| సమానం | మధ్యే తు (జీర్ణకోశం) | జీర్ణక్రియ |
| వ్యానం | ప్రతిశాఖానాడీ సహస్రాణి | రక్తప్రసరణ క్రియ |
| ఉదానం | ఊర్ధ్వః | తిరోగమన క్రియ, లోకం నయతి |

మూడవప్రశ్నకు జవాబులో ఉదానం చేసే క్రియను కూడా చూశాము. ఉదానం పని ద్వారా మనకు ప్రశ్న 4కు జవాబు వచ్చేసింది.

4. **కేన ఉత్క్రమతే** – ఎలా బయటకు వెళుతుంది?

**ఏకయోర్ధ్వ ఉదానః** – సుషుమ్న నాడిద్వారా ఉదానం తీసుకుని వెళుతుంది.

ప్రాణం, జీవికి ప్రాణశక్తిని ఆయా క్రియల ద్వారా ఇస్తుంది. ఎన్నాళ్ళు? ఆ జీవికి ప్రారబ్ధకర్మ ఉన్నంతవరకూ. ప్రారబ్ధకర్మ క్షయమయిన వెంటనే, ఉదానం తన పనిని మొదలు పెడుతుంది.

జీవి సూక్ష్మశరీరాన్ని స్థూలశరీరంనుంచి పైకి లేపి, ఇంకొక శరీరానికి తీసుకువెళుతుంది ఉదానం.

**పుణ్యేన పుణ్యం లోకం నయతి**
**పాపేన పాపముభాభ్యామేవ మనుష్యలోకమ్** – 3.7

జీవిని ఊర్ధ్వలోకాలకో, అధోలోకాలకో, మనుష్యలోకానికో అతను చేసుకున్న పుణ్యపాపాలనుబట్టి తీసుకువెళుతుంది.

**యథా సంకల్పితం లోకం నయతి** – 3.10

మరణించిన జీవియొక్క సూక్ష్మశరీరం ఏ లోకానికి వెళుతుందనేది, అతని చివరి సంకల్పాన్ని బట్టి ఉంటుంది.

**యం యం వాపి స్మరన్భావం త్యజత్యంతే కలేవరమ్ ।**
**తం తమేవైతి కౌంతేయ సదా తద్భావభావితః ॥** – గీత 8.6

గీతలో అధ్యాయం 8 ఈ భాగాన్ని ఆధారం చేసుకుని వచ్చినదే. తరువాత వచ్చే జన్మకు సంబంధించిన ప్రారబ్ధకర్మ, ఈ జన్మలో మరణిస్తున్నప్పుడే వచ్చి సిద్ధంగా ఉంటుంది. ఈ జన్మను ఈ జన్మలోని ప్రారబ్ధకర్మ నిశ్చయిస్తే, మరుజన్మను మరుజన్మలోని ప్రారబ్ధకర్మ నిశ్చయిస్తుంది. అది కూడా ఈ జన్మ ముగిశాక కాదు, అంత్యకాలంలో. ఆ ప్రారబ్ధకర్మే ఆలోచనాతీరును కూడా నిర్దేశిస్తుంది.

ఆలోచనాతీరు ఉన్నతంగా ఉండాలంటే, ఈ జన్మలో చాలా పుణ్యం చేసివుండాలి. ఆ పుణ్యం చేయకపోతే సంచితకర్మ ప్రబలంగా ఉంటుంది. ఒకవేళ పుణ్యం చేసుకుంటే, ఆగామికర్మలు సంచితకర్మను వెనక్కు త్రోసి, వచ్చే జన్మ మంచిది వచ్చేలాగా చేస్తుంది. దీని అర్థం చివరి సంకల్పం ఏదైతే ఉందో, అది తరువాత వచ్చే జన్మను నిర్ణయిస్తుంది.

ఎవరైతే హిరణ్యగర్భ ఉపాసన చేస్తారో వారు బ్రహ్మలోకానికి వెళ్ళి, అక్కడ జ్ఞానం పొంది, క్రమముక్తి పొందుతారు అని ఉపనిషత్తు చెబుతున్నది. ఉదానప్రాణం అగ్నితత్త్వం. అందువల్ల ఉదానం వెళ్ళిపోతే, దానితోపాటు అగ్నితత్త్వం కూడా వెళ్ళిపోతుంది. అందువల్ల శరీరం చల్లగా అయిపోతుంది.

5. **కథం బాహ్యమభిధత్తే** – ఎలా బాహ్యప్రపంచానికి ఆధారమయింది?

6. **కథమ్ అధ్యాత్మమ్ అభిధత్తే** – ఎలా వ్యష్టికి ఆధారమయింది?

| **బాహ్యం / అధిదైవం** | **వ్యష్టి / అధ్యాత్మం** |
|---|---|
| ఆదిత్యదేవత | ప్రాణం |
| పృథివి | అపానం |
| అంతరిక్షం | సమానం |
| వాయువు | వ్యానం |
| అగ్ని / తేజః | ఉదానం |

**ఫలం:**– ప్రాణ ఉపాసన చేసినవారికి –
ఇహలోక ఫలం – సంతతికి అపమృత్యువు రాదు.
పరలోక ఫలం – బ్రహ్మలోకప్రాప్తి, క్రమముక్తి.

**ఉత్పత్తిమాయతిం స్థానం విభుత్వం చైవ పంచధా**
**అధ్యాత్మం చైవ ప్రాణస్య విజ్ఞాయామృతమశ్నుతే విజ్ఞాయామృతమశ్నుత ఇతి** – 3.12

ఈ ఆఖరిమంత్రంలో ఆరు ప్రశ్నలకు సమాధానాలు సారం రూపంలో వచ్చేశాయి, అది కూడా ఒక్కొక్క పదంలో వచ్చేశాయి. అంతేకాదు దాని ఫలం కూడా వచ్చింది.

1. **ఉత్పత్తిమ్ – ప్రాణం ఎలా పుట్టింది?**
   జవాబు: ఆత్మనుంచి నీడ పుట్టినట్టుగా పుట్టింది.
2. **ఆయతిమ్ – శరీరంలోకి ఎలా వచ్చింది?**
   జవాబు: మనోకృతేన – మన పూర్వజన్మ కర్మలవల్ల వచ్చింది.
3. **స్థానమ్ – శరీరంలో ఎక్కడ ఉంది?**
   జవాబు: ప్రాణం – కన్ను, చెవి, ముక్కు, నోరు
   అపానం – పాయు, ఉపస్థ
   వ్యానం – నాడులద్వారా అంతటా
   సమానం – మధ్యలో, జీర్ణకోశంలో
   ఉదానం – ఊర్ధ్వభాగంలో
4. **విభుత్వమ్ – ఎలా విభజించుకుంది?**
   జవాబు: సమ్రాట్‌లాగా విభజించుకుంది.
5. **పఞ్చధా – బాహ్యప్రపంచానికి ఎలా శక్తినిస్తోంది?**
   జవాబు: ఆదిత్య, పృథివి, అంతరిక్షం, వాయువు, తేజోరూపంలో ఇస్తోంది.
6. **వ్యష్టికి ఎలా శక్తినిస్తోంది?**
   జవాబు: ప్రాణం, అపానం, సమానం, వ్యానం, ఉదానాలరూపంలో ఇస్తోంది.

**ఫలం – విజ్ఞాయామృతమశ్నుతే** – ఇది తెలుసుకుని ఉపాసన చేసినవాడు అమరత్వాన్ని పొందుతాడు.

ఈ అధ్యాయంలో ప్రశ్నలు ప్రాణానికి చెందినవి కాబట్టి, ప్రాణం సూక్ష్మశరీరానికి చెందినది కాబట్టి, మూడవ అధ్యాయాన్ని కూడా సూక్ష్మశరీరప్రధానం అని చెప్పవచ్చు.

### అధ్యాయం 4 – కారణశరీర + ఆత్మ ప్రధానం – మంత్రాలు 11

ఈ అధ్యాయంలో సౌర్యాయణీ గార్గ్యః, పిప్పలాద ఋషిని ప్రశ్నిస్తాడు. ఇతను నిద్ర గురించి అనేక ప్రశ్నలు అడుగుతాడు. ఆ ప్రశ్నలు ఇవి.

1. **ఏతస్మిన్ పురుషే కాని స్వపన్తి?** – ఒక వ్యక్తిలో ఏవి నిద్రిస్తాయి?
2. **కాన్యస్మిన్ జాగ్రతి?** – ఏవి (కరణాలు) మేలుకుని ఉంటాయి?
3. **కతర ఏష దేవః స్వప్నాన్ పశ్యతి?** – ఏ దేవత కలలను చూస్తుంది?
4. **కస్యైతత్సుఖం భవతి?** – ఈ సుఖం ఎవరికి చెందుతుంది?
5. **కస్మిన్ను సర్వే సంప్రతిష్ఠితా భవన్తి?** – ఎందులో అన్నీ లయమవుతాయి?

నిజానికి ప్రశ్నలు నిద్రకు సంబంధించినవే అయినా, పిప్పలాద ఋషి మూడు అవస్థల గురించి బోధిస్తారు. జాగ్రదవస్థలో అన్ని అంగాలు పూర్తిగా పనిచేస్తాయి. అన్ని అంగాలు అంటే – జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, పంచప్రాణాలు, నాలుగు అంతఃకరణాలు. పూర్తిగా విచ్చుకున్న పువ్వుతో దాన్ని పోల్చవచ్చు.

స్వప్నావస్థలో కొన్ని కరణాలు నిద్రిస్తాయి.

**యథా గార్గ్య మరీచయోఽర్కస్యాస్తం గచ్ఛతః సర్వా ఏతస్మింస్తేజోమండల ఏకీభవన్తి** – 4.2

ఎలాగైతే సూర్యుడు అస్తమిస్తున్నప్పుడు అన్ని కిరణాలు సూర్యమండలంలో ఐక్యం అవుతున్నాయో, అదేవిధంగా జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు నిద్రపోతున్నప్పుడు, పని చేయవు. కళ్ళు చూడవు, చెవులు పనిచేయవు, దోమలు శరీరంమీద స్వైరవిహారం చేస్తున్నా తెలియదు, మనస్సు ఆలోచనలు చేయదు, బుద్ధి నిశ్చయం చేయదు. నాలుగు అంతఃకరణాలలో చిత్తం మాత్రం పనిచేస్తుంది. దాన్ని వాసనామయ అంతఃకరణం అంటారు.

**తత్ సర్వం పరే దేవే మనస్యేకీ భవతి**

అన్నీ మనస్సులో ఏకమవుతాయి.

**అత్రైష దేవః స్వప్నే మహిమానమనుభవతి** – 4.5

చిత్తం ద్వారా స్వప్నప్రపంచం సృష్టించబడుతుంది. అందువల్ల స్వప్నావస్థలో పంచేంద్రియాలు పడుకుంటాయి. చిత్తం మాత్రం మేలుకుంటుంది.

జాగ్రదవస్థను వి.సి.ఆర్.తోనూ, స్వప్నావస్థను వి.సి.పి.తోనూ పోల్చవచ్చు. జాగ్రదవస్థలో మన మనస్సులో ఏదైతే నిక్షిప్తమై ఉంటుందో, అదే స్వప్నావస్థలో వస్తుంది. ఉదాహరణకు క్రికెట్‌మ్యాచ్‌లోని ముఖ్యాంశాలను ఏక్షన్ రీప్లేలో మళ్ళీ చూపించినట్టుగా, మన మనస్సుకు హత్తుకుపోయినవి మళ్ళీ వస్తాయి.

**దృష్టం చ అదృష్టం చ** – చూసినవి, చూడనివి. అతను జాగ్రదవస్థలో చూసినవి, చూడనివి కూడా స్వప్నంలో చూస్తాడు అంటుంది ఉపనిషత్తు. అలాగే **శ్రుతం చ–అశ్రుతం చ** –

విన్నవీ, విననివీ వింటాడు. అసలు ఎన్నడూ చూడనివీ, విననివీ స్వప్నంలో ఎలా చూస్తాడు అని అనుమానం రావచ్చు. ఎందుకంటే వి.సి.ఆర్.లో రికార్డు చేసినవే వి.సి.పి.లో వస్తాయని ఇప్పుడే చూశాము.

ఈ చిక్కుముడిని శంకరాచార్యుల వారు తన భాష్యంలో విప్పుతారు. అశ్రుతం చ అంటే పూర్వజన్మ శ్రుతం చ గా మార్చుకోవాలి. విననివి అంటే ఈ జన్మలో వినకపోయినా, పూర్వజన్మలో వినివుంటారు. పూర్వజన్మ అంటే సరిగ్గా దీనిముందు జన్మ మాత్రమే అవసరం లేదు, కొన్ని జన్మల ముందువి కూడా కావచ్చు. అనాది కాల ప్రవృత్త జన్మ. ఒక్కముక్కలో చెప్పాలంటే, స్వప్నంలో అంతకుముందు చూసినవే చూడగలరు.

కొంతమందికి జరగబోయే సంఘటనలు కలలోకి వస్తాయి. సాయంకాలం మా మావయ్య వస్తున్నట్టు నేను ముందురోజు కలలోనే చూశాను అంటారు ఎవరో. నిజంగానే ఆయన వస్తాడు. అలాంటప్పుడు స్వప్నాన్ని వి.సి.పి.తో ఎలా పోల్చగలరు? దానికి మన జవాబు, జరగబోయే సంఘటనను గురించి మీరు కలగన్నారంటే అది స్వప్నం కాదు. ఎందుకంటే స్వప్నం నిర్వచనమే, మనస్సులో ఏదైతే నిక్షిప్తమై ఉందో అది కలలో వస్తుంది. అందువల్ల ఒకవేళ జరగబోయేది మీరు కలగన్నారంటే, యోగి ప్రత్యక్షం అంటారు దాన్ని యోగశాస్త్రంలో. అంటే మీకు ఏదో ప్రత్యేకశక్తి ఉన్నట్టు అర్థం. అది జాగ్రదవస్థలో రాదు, స్వప్నావస్థలోనూ రాదు. అది నాలుగవ అవస్థ అయిన ఉభయత ప్రజ్ఞావస్థలో వస్తుంది. అందువల్ల స్వప్నావస్థ నిర్వచనం మీ చిత్తంలో నిలువవున్న అనుభవాలనుంచి వచ్చేది.

దాని తర్వాత మనస్సు కూడా నిద్రపోతుంది. **అత్రైష దేవః స్వప్నాన్న పశ్యతి**

మనస్సు స్వప్నాన్ని కూడా చూడదు. దాన్ని సుషుప్తి అవస్థ అంటారు. ఇక్కడ మనస్సు ముడుచుకున్న మొగ్గలా ఉంటుంది.

**స యథా సోమ్య వయాంసి వాసోవృక్షం సమ్ప్రతిష్ఠన్తే ఏవం హ వై తత్సర్వం పర ఆత్మని సమ్ప్రతిష్ఠతే।।** – 4.7

ఎలాగైతే పక్షులు తాము నివసిస్తున్న వృక్షాన్ని సాయంకాలం చేరుకుంటాయో, అదే విధంగా సుషుప్తిలో అన్ని కరణాలు కారణ అవస్థలో లయమవుతాయి. మనశ్శరీరాలు మాత్రమే పడుకోవు, అవి పనిచేయకపోవటంవల్ల మనశ్శరీరాలు వ్యవహారం నడిపే జాగ్రత్ ప్రపంచం కూడా కనబడదు.

**పృథివీ చ పృథివీమాత్రా చ** అంటూ ఒక పెద్ద పట్టికనే ఇస్తుంది ఉపనిషత్తు. వాటిని టూకీగా చూస్తే –

స్థూలపంచభూతాలూ, వాటి తన్మాత్రలూ (సూక్ష్మపంచభూతాలు)
పంచజ్ఞానేంద్రియాలూ, వాటి విషయాలూ
పంచకర్మేంద్రియాలూ, వాటి విషయాలూ
నాలుగు అంతఃకరణాలూ, వాటి విషయాలూ
పంచప్రాణాలూ, వాటి విషయాలూ

అన్నీ పడుకుంటాయి. త్రిపుటి పరంగా చూస్తే భోక్త, భోగకరణం, భోగ్యవిషయం – మూడూ లయమవుతాయి. అంటే ద్వైతం అవ్యక్తంలో కారణశరీరంలో ఉంటుంది. సుషుప్తి అవస్థను కారణశరీరంలో అనుభవిస్తాము.

ఈ మూడు అవస్థలూ వాటి అధిష్ఠానంలో లయమవుతాయి. మూడు అవస్థలు – జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలు. వాటి అధిష్ఠానం, పర అక్షరం ఆత్మ. ఈ ఉపనిషత్తు అక్షరం పదం వాడటానికి కారణం, మనకు ముండకోపనిషత్తులో వాడిన అక్షరం బ్రహ్మ పదాన్ని గుర్తు చేయటానికి. ఎందుకు? ప్రశ్నోపనిషత్తు, ముండకోపనిషత్తుకు వ్యాఖ్యానం కాబట్టి. అక్షరం అంటే నాశనం లేని ఆత్మ చైతన్యం.

ఆత్మను ఇక్కడ **అచ్ఛాయమశరీరమలోహితమ్** అంది. అఛ్ఛాయమ్ అంటే కారణశరీరం లేనిది, అశరీరం అంటే సూక్ష్మశరీరం లేనిది, అలోహితం అంటే స్థూలశరీరం లేనిది.

**స్థూలసూక్ష్మకారణ శరీరవిలక్షమ్ ఆత్మా**

ఇది శుద్ధచైతన్యం. శరీరత్రయానికి విలక్షణంగానూ, అధిష్ఠానంగానూ ఉంటుంది. చైతన్యం ఐదు లక్షణాలు ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి. అవి –

1. చైతన్యం శరీరంలో ఒక భాగం కాని, లక్షణం కాని, దాన్నించి ఉత్పత్తి చెందింది కాని కాదు.
2. చైతన్యం స్వతంత్రం. అది శరీరం అంతటా వ్యాపించి, దాన్ని ప్రకాశింపచేస్తుంది.
3. చైతన్యం శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు.
4. చైతన్యం శరీరం నాశనమయితే నాశనమవదు. శరీరం పతనం చెందాక కూడా చైతన్యం ఉంటుంది.
5. చైతన్యం శరీరం లేకపోయినా ఉంటుంది కాని కనబడదు. దాన్ని ప్రతిబింబింపజేసే శరీరం లేదు కాబట్టి అది కనిపించదు. అంతమాత్రాన చైతన్యం లేనట్టు కాదు.

ఎవరైతే ఆత్మజ్ఞానం పొందుతారో వారు సర్వజ్ఞులు అవుతారు. వేదాంతానికి రాకముందు నేను శరీరాన్ని, నాలో ఆత్మ ఉంది అనుకుంటారు. వేదాంతం నేర్చుకున్నాక నేను ఆత్మను,

నాకు వ్యవహారం నడపటానికి శరీరం ఉందని అర్థం చేసుకుంటారు. శరీరం వచ్చి పోతుంది కాని నేను ఆత్మగా సర్వవ్యాపకం. ఈ విధంగా ఆత్మ, అనాత్మల వివేకం చూపబడింది. ఈ అధ్యాయంలో సుషుప్తి గురించిన వివరణలో భాగంగా కారణశరీరం, ఆత్మల గురించి చెప్పటం జరిగింది. ఈ జవాబులను సౌర్యాయణీ గార్గ్యః ప్రశ్నలతో కలుపుకుంటే ఈ విధంగా వస్తాయి.

సౌర్యాయణీ గార్గ్యః అవస్థాత్రయం గురించి 5 ప్రశ్నలు అడిగాడు.

1. **ఏతస్మిన్ పురుషే కాని స్వపన్తి?** ఒక వ్యక్తిలో ఏవి నిద్రిస్తాయి?
   **తత్ సర్వం పరేదేవే మనస్యేకీభవతి।** – దశ ఇంద్రియాలు (పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు) మనస్సులో నిద్రిస్తాయి.
2. **కాన్యస్మిన్ జాగ్రతి?** – ఏవి (కరణాలు) మేలుకుని ఉంటాయి?
   **ప్రాణాగ్నయ ఏవ ఏతస్మిన్ పురే జాగ్రతి। మనో హ వావ యజమానః॥** – పంచప్రాణాలు, మనస్సు మాత్రమే మేలుకొని ఉంటాయి.
3. **కతర ఏష దేవః స్వప్నాన్ పశ్యతి?** – ఏ దేవత కలలను చూస్తుంది?
   **అత్రైష దేవః స్వప్నే మహిమానమనుభవతి** – మహిమానమైన మనస్సు చూస్తుంది.
4. **కస్యైతత్సుఖం భవతి?** – ఈ సుఖం ఎవరికి చెందుతుంది?
   **ఏతస్మిన్ శరీరే ఏతత్సుఖం భవతి** – కారణశరీరం లేదా ప్రాజ్ఞ సుఖాన్ని అనుభవిస్తుంది.
5. **కస్మిన్ను సర్వే సంప్రతిష్ఠితా భవన్తి?** – ఎందులో అన్నీ లయమవుతాయి?
   **సర్వం పరే ఆత్మని సంప్రతిష్ఠతే** – అన్నీ పర అక్షర ఆత్మలో లయమవుతాయి. అన్నీ అంటే భోక్తా, భోగకరణం, భోగ్యవిషయం.

**ఫలం** – ఇవి తెలుసుకున్నవాడు సర్వజ్ఞుడు అవుతాడు. సమస్తమూ తానే అవుతాడు.

### అధ్యాయం 5 – ఓంకార ఉపాసన – క్రమముక్తికోసం – మంత్రాలు 7

ఈ అధ్యాయంలో శైబ్యః సత్యకామః పిప్పలాద ఋషిని ప్రశ్నిస్తాడు. ఇది చాలా చిన్న అధ్యాయం. ఇందులో ఏడు మంత్రాలే ఉన్నాయి. ఇతను ఓంకారధ్యానం గురించి అడిగాడు. ఓంకార ధ్యానం అంటే ఓంకారంమీద ధ్యానం కాదు. ఓంకారాన్ని ప్రతీకగా తీసుకుని భగవంతునిమీద చేసే ధ్యానం.

**మనుష్యేషు ప్రాయణాన్తమోంకారమభిధ్యాయీత కతమం। వావ స తేన లోకం జయతీతి॥** – మనుష్యుల్లో ఎవరైనా మరణం వరకు ఓంకారధ్యానం చేస్తే ఏ లోకానికి వెళతారు?

ఓంకార ఉపాసన చేసిన వ్యక్తి క్రమముక్తి పొందుతాడు. ఓంకార ఉపాసన చేస్తే బ్రహ్మలోకానికి వెళ్ళి, అక్కడ బ్రహ్మ ద్వారా ఆత్మజ్ఞానం పొంది, అక్కడ మోక్షం పొందుతాడు. దాన్ని క్రమముక్తి అంటారు. ఓంకార ఉపాసన ద్వారా క్రమముక్తి పొందుతాడు. దీన్ని దశల వారీగా చెబుతాడు గురువు. అంటే ఓంకారంయొక్క ఒక మాత్రమీద ఉపాసన చేస్తే ఏ దేవతలు ఏ లోకానికి తీసుకుని వెళతారో వస్తుంది. దాన్ని ఈ క్రింద పట్టికలో చూడవచ్చు. ఇలా నిజంగా ఒక్కొక్క మాత్రగా ఉపాసన చేయకూడదు అంటారు. అలా చేస్తే అది అంగవైకల్య ఉపాసన కిందికి వస్తుంది.

| **మాత్ర** | **సూచించే అధిష్ఠానదేవత** | | **మాత్రసంఖ్య** | **వేదం** | **లోకం** | **ఇంకోపేరు** |
|---|---|---|---|---|---|---|
| | **వ్యష్టి** | **సమష్టి** | | | | |
| అ | విశ్వ | విరాట్ | ఏకమాత్ర | ఋగ్వేద | భూలోకం | మనుష్యలోకం |
| అ, ఉ | తైజస | హిరణ్యగర్భుడు | ద్విమాత్ర | యజుర్వేద | భువర్లోకం | సోమలోకం |
| అ,ఉ,మ | ప్రాజ్ఞ | ఈశ్వరుడు | త్రిమాత్ర | సామవేద | సువర్లోకం | బ్రహ్మలోకం |

**మనుష్యేషు ప్రాయణాన్తమోంకారమభిధ్యాయీత కతమం। వావ స తేన లోకం జయతీతి॥** – మనుష్యుల్లో ఎవరైనా మరణం వరకు ఓంకారధ్యానం చేస్తే ఏ లోకానికి వెళతారు? భూలోక, భువర్లోక, సువర్లోకాలకు, వారు చేసిన ఉపాసనలనుబట్టి వెళతారు.

## అధ్యాయం 6 –బ్రహ్మ పతిపాదనం –షోడశ కల పురుషః –మంత్రాలు 8

ఇందులో సుకేశా భారద్వాజః, పిప్పలాద ఋషిని ప్రశ్నిస్తాడు. అతను షోడశకల పురుషుని గురించి అడుగుతాడు.

**క్వాసౌ పురుషః**? – ఆ పురుషుడు ఎక్కడ ఉన్నాడు?

పరోక్షంగా అడిగిన ప్రశ్న –

**షోడశకలం పురుషం వేత్థ**? – పదహారు అంగాలుగల పురుషుడు తెలుసా?
**క్వాసౌ పురుషః** – ఆ పురుషుడు ఎక్కడ ఉన్నాడు?
**ఇహైవాన్తః శరీరే**– అంతః కరణంలో ఉన్నాడు.

పరోక్షంగా అడిగిన ప్రశ్న –
**షోడశకలం పురుషం వేత్థ**? – పదహారు అంగాలుగల పురుషుడు తెలుసా?

షోడశకలం అంటే సృష్టి మొత్తం వస్తుంది. సృష్టిని 16 తత్త్వాలుగా విభజిస్తారు. ఆ పదహారు కలలు ఇవి –

1. ప్రాణం, 2. శ్రద్ధా, 3. ఆకాశం, 4. వాయువు, 5. అగ్ని, 6. నీరు, 7. భూమి, 8. ఇంద్రియాలు, 9. మనస్సు, 10. అన్నం, 11. వీర్యం, 12. తపస్సు, 13. మంత్రాలు, 14. కర్మ, 15. లోకాలు, 16. లోకాలలో పేర్లు.

ఇంకో విధంగా చూస్తే సృష్టిని 16 తత్త్వాలుగా చూపిస్తున్నది. అందువల్ల షోడశకల పురుషుడు అంటే మొత్తం సృష్టిని తన శరీరంగా కల భగవంతుడు అని అర్థం.

దీనికి జవాబుగా పిప్పలాద ఋషి పరంబ్రహ్మను అధ్యారోప అపవాద పద్ధతి ద్వారా వివరిస్తాడు.

**అధ్యారోప అపవాదం**

దీన్ని నాలుగు దశల్లో చూస్తాము.

దశ 1 – జగత్తు కార్యం

దశ 2 – బ్రహ్మ ఈ జగత్తుకు కారణం

ఇది అధ్యారోపం

దశ 3 – కార్యానికి, కారణం లేకుండా విడిగా ఉనికి లేదు.
అందువల్ల జగత్తు మిథ్యా నామరూపం మాత్రమే

దశ 4 – కార్యం జగత్తు లేకపోతే కారణానికి కారణత్వ హోదా లేదు.
(కారణం లేదు అనకూడదు)

ఇది అపవాదం.

**కార్య–కారణ విలక్షణం బ్రహ్మ**

జగత్తు గుణం మాత్రమే. జగత్తును మిథ్యగా కొట్టివేస్తే నిర్గుణబ్రహ్మ అవుతుంది. నిర్గుణబ్రహ్మను ఇక్కడ అకలః అని చూస్తాము. ప్రపంచానికి విడిగా ఉనికి లేకపోతే, అది మిథ్య అవుతుంది. మిథ్యా జగత్తు ఉన్నా లేనట్టే అర్థం.

**షోడశకళా పురుషుడే నిష్కళం బ్రహ్మ!**
**విశ్వమే విష్ణువు!!**

విష్ణుసహస్రనామంలో వచ్చే మొట్టమొదటి నామమే **విశ్వం విష్ణుః**. విశ్వమంతటా అధిష్ఠానంగా ఉన్నది విష్ణువే. వేదాంతంలో నిర్గుణబ్రహ్మ అంటారు.

ఆ విధంగా నిర్గుణబ్రహ్మ మాత్రమే ఉంది. గుణాత్మకమైన జగత్తు వచ్చిపోతుంది. బ్రహ్మ మిథ్యా జగదధిష్ఠానం. ఎవరైతే ఈ బ్రహ్మతత్త్వాన్ని అర్థం చేసుకుంటారో, షోడశకల అకలం బ్రహ్మ గురించి అర్థం చేసుకుంటారో, అతను జీవన్ముక్తి పొందుతాడు.

అధ్యారోప అపవాద పద్ధతి ద్వారా ఈ **షోడశకల–అకలం బ్రహ్మ**ను వివరించాడు గురువు.

ఓంకార ధ్యానం చేస్తే క్రమముక్తి పొందుతాడు, జ్ఞానం పొందితే జీవన్ముక్తి పొందుతాడు.

ఇక్కడితో ఆరుగురు శిష్యుల ప్రశ్నలూ, జవాబులూ ముగిశాయి.

**పరం పారం తారయసీతి** – ఆరుగురు ఇప్పుడు గురువు దగ్గరకు కలసివచ్చి, ఆయనకు నమస్కారం చేసి, మీరు మమ్మల్ని సంసారంనుంచి కాపాడారు అన్నారు.

**నమః పరమ ఋషిభ్యో నమః పరమఋషిభ్యః** – 6.8

వారి గురువైన పిప్పలాద ఋషికే కాకుండా మొత్తం ఋషి పరంపరకే నమస్కారాలు పెట్టారు. దీనితో ఆరవ అధ్యాయం కూడా అయిపోయింది.

**ముఖ్యమైన మంత్రాలు**

అధ్యాయం 3 – 3, 7, 10
అధ్యాయం 4 – 10, 11
అధ్యాయం 6 – 5, 6, 7, 8

**శాంతిపాఠం**

**ఓం భద్రం కర్ణేభిశ్శృణుయామ దేవాః। భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః।**
**స్థిరైరంగైస్తుష్టువాగ్ంసస్తనూభిః। వ్యశేమ దేవహితం యదాయుః।**
**స్వస్తి న ఇన్ద్రో వృద్ధశ్రవాః। స్వస్తి నః పూషా విశ్వవేదాః।**
**స్వస్తి నస్తార్క్ష్యో అరిష్టనేమిః। స్వస్తి నో బృహస్పతిర్దధాతు॥**

**ఓం శాంతిః శాంతిః శాంతిః ॥**

# ఏకాదశ ఉపనిషత్తుల సారం

## ఛాందోగ్యోపనిషత్ - అధ్యాయం 1

శంకరాచార్యులవారు నాలుగు వేదాలనుంచి దశోపనిషత్తులకు భాష్యం రాశారు. మనం ఈ పది ఉపనిషత్తులనూ నేర్చుకుంటాము. ఇవి కాక కైవల్యోపనిషత్తును కూడా అధ్యయనం చేస్తాము. ఈ పది ఉపనిషత్తులలోనూ చాలా పెద్దవి ఛాందోగ్యోపనిషత్తు, బృహదారణ్యకోపనిషత్తు.

**వేదం** - ఛాందోగ్యోపనిషత్తు సామవేదానికి చెందినది. కేనోపనిషత్తు కూడా ఈ వేదానికి చెందినదేనని చూశాము.

**ఆ పేరెలా వచ్చింది?** - ఛాందోగ్యోపనిషత్తుకు ఛందస్ అనే ధాతువుకు ఉన్న ఒక అర్థంనుంచి వచ్చింది. ఛందస్‌కు అనేక అర్థాలు ఉన్నాయి. వాటిలో ఒకటి వైదిక ఛందస్సు. గాయత్రీ ఛందస్సు, అనుష్టుప్ ఛందస్సు, త్రిష్టుప్ ఛందస్సు అంటూ అనేక ఛందస్సులను చూశాము. వీటికి ఒక ప్రత్యేక పద్ధతి, ప్రతిపాదంలోను అక్షరాల సంఖ్య నిర్దిష్టంగా ఉంటుంది. మరొక అర్థం ఛందస్ అంటే వేదాలు అని వస్తుంది.

2. ఇంకొక అర్థం సామవేదాన్ని ప్రత్యేకించి ఛందస్ లేదా ఛందః అంటారు. ఛందః పదం ఛాంద్ లేదా ఛాంద్ అనే ధాతువు నుంచి వచ్చింది.

ఛందయతీ ఇతి ఛందః

3. ఈ ధాతువుకు రెండు అర్థాలు ఉన్నాయి. అవి ఆనందాన్ని కలుగజేస్తుంది. అందువల్లనే చందమామ, చంద్రుడు అంటాము.

ఇంకొక అర్థం - రక్షించేది.

ఆచ్ఛాదయతి ఇతి ఛందః

వేదాలు మనను సంసారంనుంచి రక్షిస్తాయి కాబట్టి వేదాలను ఛందస్సు అంటారు. సంసారం కలిగించే దుఃఖంనుంచి రక్షణ కవచంలా కాపాడుతుంది. దుఃఖాత్ ఆచ్ఛాదయతి. కాపాడటమే కాదు, ఆనందం కలుగజేస్తుంది కూడా. బ్రహ్మానంద పర్యంతం దధాతి. వేదం అంటే రక్షించి, ఆనందం కలుగజేసేది కాబట్టి ఛందః అనీ, ప్రత్యేకించి సామవేదాన్ని కూడా ఛందః అనీ అంటారు. ఎందుకంటే సామవేదాన్ని గానం చేస్తారు. తక్కిన వేదాలకు గానం పదం వాడరు. ఋక్ గానం, యజుర్ గానం, అథర్వణ గానం అనరు, కాని సామవేదాన్ని

మాత్రమే సామగానం అంటారు. నిజానికి మన సంగీతం ఈ సామవేదంనుంచే ఉద్భవించింది కూడా. సామగానం విన్న వ్యక్తికి ఆనందం కలుగుతుంది.

ఛందయతి ఆహ్లాదయతి ఇతి ఛందః

అందువల్లనే కృష్ణపరమాత్మ తన విభూతులను పేర్కొంటున్నప్పుడు, వేదానాం సామవేదోఽస్మి - వేదాలలో నేను సామవేదాన్ని అన్నాడు.

ఇంతవరకూ చూసిన అర్థాల్లో చివరి అర్థం తీసుకుందాము. సామవేదః ఛందోగః అంటే సామవేదాన్ని పాడే వ్యక్తి.

ఛందః సామవేదం గాయతి ఇతి ఛందోగః

అందువల్ల సామవేదాన్ని అధ్యయనం చేసేవారిని ఛందోగః అంటారు. సామవేదానికి చెందిన ఉపనిషత్తును ఛాందోగ్యం అంటారు.

**అధ్యాయాలు, మంత్రాలు** - ఛాందోగ్యోపనిషత్తులోనే అన్నింటికన్నా ఎక్కువ మంత్రాలున్నాయి. ఇదే అన్నింటికన్నా పెద్దది. ఇందులో 627 మంత్రాలున్నాయి. 627 మంత్రాలు, 8 అధ్యాయాలలో విస్తరించి ఉన్నాయి. సామగానం చేసినట్లే, ఈ ఉపనిషత్తును కూడా ఒకప్పుడు స్వరాలతో గానం చేసేవారుట. ఇప్పటికీ స్వరాలున్నవి ఈశావాస్యోపనిషత్తు, తైత్తిరీయోపనిషత్తు. సామవేదానికి చెందిన కేనోపనిషత్తుకు లేవు కాని ఛాందోగ్యోపనిషత్తుకి స్వరం అందుబాటులో ఉంది. ఛాందోగ్యోపనిషత్తులో 8 అధ్యాయాలు ఉన్నాయి. వాటిలో 1-5 ఉపాసనా ప్రధానంగా ఉంటే, 6-8 జ్ఞానప్రధానంగా ఉంటాయి. వాటిలో కూడా 1, 2 కర్మాంగ ఉపాసనలు అయితే, 3-5 స్వతంత్ర ఉపాసనలు.

**ప్రత్యేకత** - ఈ ఉపనిషత్తు ప్రత్యేకతలు అనేకం ఉన్నాయి. ఇప్పుడే రెండు చూశాము.

1. అన్నింటికన్నా పెద్ద ఉపనిషత్తు. 627 మంత్రాలు ఉన్నాయి.
2. ఒకప్పుడు స్వరాలతో గానం చేసేవారు.
3. శంకరులవారు 10 ఉపనిషత్తులకు భాష్యం రాయటానికి ఒక కారణం వ్యాసాచార్యులవారు వీటినే ఎక్కువగా తన బ్రహ్మసూత్రాలలో వ్యాఖ్యానించారు. వాటిలో కూడా ఎక్కువగా ఛాందోగ్యోపనిషత్తునుంచి ఉన్నాయి.
4. ప్రసిద్ధి పొందిన తత్త్వమసి మహావాక్యం ఇందులోనే వస్తుంది.
5. శంకరులవారు తన భాష్యాలలో అనేకచోట్ల ఛాందోగ్య మంత్రాలు తరచు పేర్కొంటారు.

**శాంతిపాఠం** – ఛాందోగ్యోపనిషత్తు సామవేదానికి చెందినది కాబట్టి, దాని శాంతిపాఠమే ఇక్కడా పఠిస్తాము. అది,

**ఓం ఆప్యాయన్తు మమాంగాని వాక్ప్రాణశ్చక్షుః శ్రోత్రమథో బలమింద్రియాణి చ సర్వాణి। సర్వం బ్రహ్మౌపనిషదం మాఽహం బ్రహ్మ నిరాకుర్యాం। మా మా బ్రహ్మ నిరాకరోదనిరాకరణమస్త్వనిరాకరణం మేఽస్తు। తదాత్మని నిరతే య ఉపనిషత్సు ధర్మాస్తే మయి సన్తు తే మయి సన్తు॥**

**ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

ఇదే శాంతిపాఠాన్ని కేనోపనిషత్తులో కూడా చూశాము.

ఈ శాంతిపాఠంలో శిష్యుడు నాలుగు అంశాలను కోరుతున్నాడు. అవి శరీరయోగ్యత, ఈశ్వరానుగ్రహం, ప్రయత్నం, ఉపనిషత్తులో పేర్కొన్న ధర్మాలు.

ఎ) **శరీరయోగ్యత** –

ఓం ఆప్యాయంతు మమాంగాని వాక్ ప్రాణః చక్షుః శ్రోత్రమథో
బలమింద్రియాణి చ సర్వాణి

నా అంగాలన్నీ బలంగా ఉండాలి. దానికోసం ఇక్కడ కొన్ని పేర్కొన్నాడు శిష్యుడు. అవి వాక్కు, ప్రాణం, కళ్ళు, చెవులు, తక్కిన ఇంద్రియాలు. ఇవన్నీ బాగుంటేనే వేదాంతం నేర్చుకోగలుగుతాడు.

బి) **ఈశ్వర అనుగ్రహం** –

సర్వం బ్రహ్మౌపనిషదమ్

**సర్వం బ్రహ్మ** – వేదాంతసారం అంతా శాంతిపాఠంలోనే వచ్చేసింది. రెండే పదాలున్న చిన్న వాక్యంలో. అనంత శాస్త్రమైన ప్రస్థానత్రయంలో ఉన్న సారం రెండే రెండు పదాల్లో వచ్చింది. ఏమిటది? 'సర్వం బ్రహ్మ.' ఉన్నదంతా బ్రహ్మమే, బ్రహ్మ కానిది రెండోది లేదు.

మరి ఆ బ్రహ్మను తెలుసుకోవటమెలా? మన ఇంద్రియాలు భిన్నత్వం చూడటానికే ఏర్పడ్డాయి.

**ఔపనిషదమ్ (బ్రహ్మ)** – నామరూపాలకతీతమైన బ్రహ్మను తెలుసుకోవాలంటే ఉపనిషత్తులకే రావాలి. ఉపనిషత్తులద్వారానే తెలుసుకోగలము కాబట్టి బ్రహ్మను ఔపనిషదం బ్రహ్మ అంటారు. బృహదారణ్యకోపనిషత్తులో కూడా ఔపనిషదమ్ అనే వస్తుంది. కాకపోతే అక్కడ ఔపనిషదః పురుషః అంటాడు యాజ్ఞవల్క్యుడు. బ్రహ్మ అన్నా, పురుషః అన్నా అర్థం ఒకటే. ఉపనిషత్తు

ద్వారానే తెలుసుకోగలిగిన సర్వం బ్రహ్మను తెలుసుకోగోరుతున్నాడు శిష్యుడు. దానికి ఈశ్వరకృప కోరుతున్నాడు.

**మాఽహం బ్రహ్మ నిరాకుర్యామ్** – ఓ దేవా! నేను బ్రహ్మను నిరాకరించకుందుగాక! ప్రపంచంలో ఏం ఉంది అని అడిగితే, నాకు తెలిసినదే ఉంది అనటం, తెలివితో కూడిన అహంకారం అంటుంది శాస్త్రం. స్వర్గం, నరకం నాకు కనబడవు కాబట్టి, అవి లేవని కొట్టిపారేయకూడదు. వాటి ఉనికిని నాకు తెలియజేసే సరియైన ప్రమాణం నా దగ్గర లేదు అనుకోవాలి. నాకు తెలిసినది తక్కువ అన్న అణకువ లేకపోతే వేదాంతం నేర్చుకోలేము. అందువల్ల నా చిన్ని బుర్రకు అందనంత మాత్రాన బ్రహ్మ లేదని నేను అనకూడదు.

**మా మా బ్రహ్మ నిరాకరోత్** – నేను బ్రహ్మను నిరాకరించకుండా ఉంటే చాలదు, బ్రహ్మ కూడా నన్ను నిరాకరించకుందుగాక. మొదటి **మా** నేను నిరాకరించకుందుగాక అని సూచిస్తే, రెండో **మా** నన్ను అనే సర్వనామాన్ని సూచిస్తుంది. బ్రహ్మ నన్ను నిరాకరించకుందుగాక అందువల్ల అవి రెండు భిన్న పదాలు.

**అనిరాకరణమస్తు అనిరాకరణం మేఽస్తు** – శ్రద్ధ, భక్తి చాలా ముఖ్యం కాబట్టి, అదే భావాన్ని మళ్ళీ చెబుతున్నాడు శిష్యుడు. నేను పరమాత్మను నిరాకరించకుందుగాక; పరమాత్మ నన్ను నిరాకరించకుందుగాక.

3. **ప్రయత్నం** –

**తదాత్మని నిరతేఽయ ఉపనిషత్సు దర్మాః**

శిష్యుని మూడవ ప్రార్థన తన అధికారిత్వం గురించి. నేను ఉపనిషత్తులను నేర్చుకోవటానికి సిద్ధంగా ఉండవచ్చు. గురువు బోధించటానికి కూడా సిద్ధంగా ఉండవచ్చు. కాని ఆ బోధను అర్థం చేసుకునే సూక్ష్మమైన బుద్ధి నాకు ఉందా? నా చిన్ని బుర్ర **నేను జగదధిష్ఠానం బ్రహ్మ** అనే సత్యాన్ని స్వీకరించే స్థాయిలో ఉందా? శిష్యునికి తన పరిమితులు తెలుసు. దానికి తగ్గ ప్రయత్నం చేయాలనీ తెలుసు. ఆ భారం కూడా భగవంతునిమీదే వేశాడు. నాకు అవసరమైన అధికారిత్వం కూడా నువ్వే ఇయ్యి అంటున్నాడు.

తదాత్మని నిరతే – నిరతః అంటే శ్రద్ధ ఉన్న నాకు, నేను కృషి చేస్తాను. నువ్వు కృప చూపించు.

4. **ఉపనిషత్సు ధర్మాః** –

తే మయి సంతు తే మయి సంతు

ఉపనిషత్తు పేర్కొన్న లక్షణాలు నేను పెంపొందించుకునేలా చేయి. అవి కృష్ణపరమాత్మ పేర్కొన్న 20 లక్షణాలే!

**అమానిత్వమదంభిత్వమ్ అహింసా క్షాంతిరార్జవమ్** – గీత 13.8

మళ్ళీ వీటినే 16వ అధ్యాయంలో దైవీసంపత్తిగా పేర్కొన్నాడు. వాటిని నేను గుర్తుంచుకుని, ఆచరణలో పెట్టటానికి ప్రయత్నించేలా చేయి.

ఓం శాంతిః శాంతిః శాంతిః – మూడు ప్రతిబంధకాలనుంచి నన్ను రక్షించు.

శాంతిః – ఆధ్యాత్మిక ప్రతిబంధకం – నానుంచి వచ్చే ఆటంకాలు
శాంతిః – అధిభౌతిక ప్రతిబంధకం – నా చుట్టుపక్కల వారినుంచి వచ్చే ఆటంకాలు
శాంతిః – అధిదైవిక ప్రతిబంధకం – దేవతలనుంచి వచ్చే ఆటంకాలు.

ఈ మూడు ప్రతిబంధకాలు లేకుండా ఉండుగాక.

**ఉపాసన ఉపోద్ఘాతం**

మొదటి ఐదు అధ్యాయాలు ఉపాసన గురించి చెబుతాయి. ఉపాసనలోని ఉపాస్యవస్తువు, ఆలంబన, ఉపాసన విధానాలు, ఫలం.

1. **ఉపాస్యవస్తువు** – ఉపాస్యవస్తువులు రెండు. జీవోపాసన, ఈశ్వరోపాసన.

**జీవోపాసన** – కొంతమంది మనుష్యులను ఉత్కృష్టజీవులుగా భావించి వారిని ధ్యానిస్తారు. ఉదాహరణకు ఒక రాజు తన సభలోకి వేంచేస్తుండగా, వంది మాగధులు ఆయనను ఉచ్చకంఠంతో కీర్తిస్తారు.

దేవదేవోత్తమ సార్వభౌమ అఖిలాండకోటి బ్రహ్మాండనాయక విజయీభవ దిగ్విజయీభవ అంటూ కీర్తిస్తారు.

ఇక్కడ జీవోపాసన అంటే దేవతలమీద ఉపాసన. ఇంద్రుడు, వరుణుడు. వీరిని ఇంగ్లీషులో డెమీగాడ్స్ (demi gods) అంటారు.

**ఈశ్వరోపాసన** – ఈశ్వరుడు ఈ దేవతలకు అధిష్ఠానదేవుడు. ఈశ్వరునిమీద ధ్యానం చేస్తారు.

జీవోపాసన చేసినా, ఈశ్వరోపాసన చేసినా రెండింటిలో ఉపాస్యవస్తువుకు గుణాలు ఉంటాయి. ఈశ్వర ఉపాసన అంటే సగుణ ఈశ్వర ఉపాసన. ఇంకొక అంశం – ఈ రెండు ఉపాస్యవస్తువులూ నాకు భిన్నంగా ఉన్నాయి. అంటే ద్వైతంలోకి వస్తుంది ఉపాసన.

2. **ఆలంబన** – ఉపాసనను రెండు ఆలంబనలమీద చేస్తారు. అవి ప్రతీక, ప్రతిమా.

**ప్రతీక** – గోపూజ, గజపూజ, కన్యాపూజ, బ్రహ్మచారి పూజ. వీటిని వారు చేసే పూజలకు ప్రతీకగా తీసుకుంటారు. అంతేకాదు, సాలగ్రామం విష్ణుమూర్తికి, శివలింగం శివునికి ప్రతీకలు.

**ప్రతిమా** – ఏదైనా దేవుణ్ణి తీసుకుని ఉపాసన చేస్తారు. రాముడు, కృష్ణుడు, దేవి.

ఛాందోగ్యంలో ప్రతీక ఉపాసనలే ఎక్కువగా ఉన్నాయి. అవి కూడా వేదమంత్రాలే ఎక్కువగా ఉన్నాయి. ఎందుకు? బ్రహ్మచారి వేదాలను కంఠతా పడతాడు కాబట్టి, అతను నిరంతరం వేదమంత్రాలతో పెనవేసుకుని ఉంటాడు. ఇక్కడ ఛాందోగ్యోపనిషత్తు సామవేదానికి చెందినది కాబట్టి సామమంత్రాలను ఆలంబనగా తీసుకుని, అప్పటి కాలమానపరిస్థితుల దృష్ట్యా చెప్పింది ఉపనిషత్తు. సామమంత్రంలోని అవయవాలను భక్తి అంటారు.

కొన్ని ఉపాసనలకు 5 అవయవాలను ప్రతీకలుగా తీసుకుంది. వాటిని పంచవిధ సామ ఉపాసన అంటారు. కొన్ని ఉపాసనలకు 7 అవయవాలను ప్రతీకలుగా తీసుకుంది. వాటిని సప్తవిధ సామ ఉపాసన అంటారు. ఈ రెండు రకాల ఉపాసనలూ రెండవ అధ్యాయంలో ఎక్కువగా వస్తాయి.

మొదటి అధ్యాయంలో ఒక అవయవాన్ని తీసుకుంది. దాన్ని ఉద్గీథభక్తి అంటారు.

ఇంకొక ఆలంబనను స్తోభ అంటారు. ఇవి కొన్ని శబ్దచిహ్నాలు. ఉదా – హ, హై అనే అక్షరాలు.

3. **ఉపాసనా విధానాలు** – ఉపాసనలు రెండు రకాలు. అవి – కర్మాంగ ఉపాసన, స్వతంత్ర ఉపాసన.

**కర్మాంగ ఉపాసన** – కర్మాంగ ఉపాసనలో కర్మ లేదా యజ్ఞాలు అంగి, ఉపాసన అంగం అవుతాయి. అంటే ఉపాసనకర్మలో ఒక భాగంగా వస్తుంది. స్వతంత్రంగా చేయలేము దీనిని. ఉదాహరణకు విష్ణుసహస్రనామం ముందు వచ్చే ధ్యానశ్లోకం. దాన్ని కూడా మనం గడగడా చదివేస్తాము. అలా చదవకుండా, అందులో వర్ణించిన విష్ణురూపాన్ని మనస్సులో ధ్యానించుకుని ముందుకు సాగాలి.

**స్వతంత్ర ఉపాసన** – ఇది స్వతంత్రంగా చేసే ఉపాసన. దీనికి ఏకాగ్రత అంత తేలికగా కుదరదు. అందువల్ల గృహస్థుకు ఇవి ఎక్కువగా చెప్పబడలేదు. వానప్రస్థంలో చేయాలి ఈ ఉపాసన. ఇప్పుడా జీవనం లేదు కాబట్టి కర్మాంగ ఉపాసనలు ముందు చేసి, తరువాత స్వతంత్ర ఉపాసనకు రావాలి.

4. **ఫలం** – ఉపాసనకు రెండు ఫలాలు ఉంటాయి.

**సకామ ఉపాసన** – ఉపాసనలను ఏదైనా కోరిక కోరి చేస్తే, దాన్ని సకామ ఉపాసన అంటారు. సకామ ఉపాసనలో లౌకికఫలాలు, ఆరోగ్యం, పశుసంపద కలుగుతాయి.

**నిష్కామ ఉపాసన** – ఈ ఉపాసనను ఏ కోరికా కోరకుండా చేస్తారు. నిష్కామంగా చేస్తే చిత్తసంస్కారం, చిత్తశుద్ధి, చిత్తఏకాగ్రత, చిత్తవైశాల్యం పెరుగుతాయి.

ఈ నేపథ్యంతో మొదటి అధ్యాయాన్ని చూద్దాము. ఇందులో 13 ఖండాలు ఉన్నాయి. 104 మంత్రాలు ఉన్నాయి.

## ఖండం 1.1

మొదటి అధ్యాయంలో ఉద్గీథ అనే అవయవాన్ని తీసుకుంది ఉపనిషత్తు. ఇది చాలా ముఖ్యమైనది. పదం ఓంకారం. ఓంకారాన్ని ఉద్గీథ అంటారు. ఉద్గీథ అంటే సామవేదంలో ఓంకారం. అందువల్ల ఉద్గీథ ఉపాసన అంటే ఓంకార ఉపాసన. కాని వేరే వేదాల్లో ఓంకార ఉపాసన వచ్చినప్పుడు దాన్ని ఉద్గీథ ఉపాసన అనకూడదు. ఒక్క సామవేదంలోనే అనాలి. ఈ అధ్యాయంలో ఎక్కువగా ఉద్గీథ ఉపాసనలే వస్తాయి.

### ఖండం 1.1 – 1 గుణవిశిష్ట ఓంకార ఉపాసన

ఇక్కడ ఓంకారం అంటే ఉద్గీథ అని మర్చిపోకూడదు. ఉద్గీథ అనే పేరు ఎలా వచ్చిందంటే, సామవేదంలో ఓం అని పాడినప్పుడు గొంతు బాగా పైకి లేస్తుంది. ఉద్ గాయతి అంటే ఉద్గీథ. ఉద్గీత అనకూడదు. ఇది ప్రతీక ఉపాసన. ప్రతీక ఉపాసనలో ప్రతీకకే ప్రాముఖ్యం ఇస్తాము. అలాగే ఇక్కడ అనేక విధాలుగా ఓంకారానికే ప్రాధాన్యతనిస్తాము. మొదటి ఖండంలో గుణవిశిష్ట ఓంకార ఉపాసన చూస్తాము. ఇక్కడ మూడు గుణాలు చూస్తాము. అవి రసం, ఆప్తి, సమృద్ధి.

**రసం** – ఓంకారం అన్నింటి సారంగా వర్ణిస్తుంది ఉపనిషత్తు. ఇది 8 దశల్లో చేస్తుంది. చివరిదశలో ఉద్గీథ సామవేదం రసం అని వస్తుంది. రసానాం రసః.

**ఆప్తి** – ఆప్తి అంటే కోరికలు. వేదంలో వచ్చే ఉపాసనల్లో బాగా కల్పనాశక్తి నిండివుంటుంది. మన ఋషులకు జ్ఞానానికి కావాల్సిన పదునైన బుద్ధీ ఉంది, అటు కల్పనాశక్తీ ఉంది. ఇక్కడ ఓంకార ఉపాసన కోరికలను తీరుస్తుంది అంటున్నది ఉపనిషత్తు. అదెలా?

**ఋగ్ సామ మిథున సంసర్గ స్థానం ...**

ఓంకారం కళ్యాణమండపం అంటున్నది ఉపనిషత్తు. కళ్యాణమండపంలో మిథునసంసర్గం జరిగినట్టుగా, ఓంకారం ఋగ్‌సామ మిథునసంసర్గస్థానం అయింది. ఓంకారం ఋగ్వేదంనుంచి స్వీకరించబడింది; సామవేదంలో గానం చేయబడింది. ఈ రెండింటికీ చెందిన ఓంకారాన్ని కోరికలు తీరటానికి చేసే అనేక పెద్ద యాగాల్లో గానం చేస్తారు.

**సమృద్ధి** – ఇంకొక గొప్ప కల్పనాశక్తి. ఓంకారానికి ఉన్న అనేక అర్థాల్లో ఒక అర్థం అనుకృతి. అనుకృతి అంటే అంగీకారం చెప్పటం. దేనికైనా ఎవరు అంగీకారం చెబుతారు? అన్నీ సమృద్ధిగా ఉన్నవాడు చెబుతాడు. ఏదైనా దానం చేస్తావా? ఏదైనా సహాయం చేస్తావా? ఏదైనా అర్థం కానిది చెబుతావా? ఏదైతే సమృద్ధిగా ఉందో, అది ఉన్న వ్యక్తి లేదనకుండా దానం చేయగలడు. అందువల్ల సమృద్ధిగుణం ఉన్న ఓంకారంమీద ఉపాసన చేస్తే అన్నీ సమృద్ధిగా ఉంటాయి.

ఓంకారం ఒక విశిష్టమైన మంత్రం. కర్మకాండలో, ఉపాసనకాండలో, జ్ఞానకాండలో కూడా ఉపయోగిస్తారు. అందువల్ల ఇక్కడ ఉపనిషత్తు ఈ గుణవిశిష్ట ఓంకార ఉపాసన చేసేముందు, దాని గుణాలను – రసం, ఆప్తి, సమృద్ధి – తెలుసుకుని ఉపాసన చేయమంటున్నది. ఉపాసన ఫలవంతం కావాలంటే మూడు నియమాలు పాటించాలి. దాని గురించిన జ్ఞానం, శ్రద్ధ, కర్మ ఉపాసన సముచ్చయం. అర్థం తెలియకుండా చేసినా ఫలం ఉంటుంది కాని తెలిసి చేస్తే ఫలం అధికంగా ఉంటుంది.

## ఖండం 1.2-2. ప్రాణప్రతీక రూపేణ ఉద్గీథ ఉపాసన

(ఉపాసనలను వరుస సంఖ్యలో చూద్దాము)

ఈ ఉపాసనలో ఉద్గీథ అనే ప్రతీకమీద ప్రాణశక్తిని ఆవాహన చేసి, ఉద్గీథను ఉపాసన చేస్తాము. చూడటానికి ప్రాణ ఉపాసనలా కనిపించినా, ప్రత్యక్షంగా ప్రాణాన్ని ఉపాసన చేయము. ప్రాణంమీదే ఎందుకు ఉపాసన చేయాలి? ప్రాణానికి రెండు గుణాలు ఉన్నాయి. అవి శుద్ధత్వం, సర్వంభరత్వం.

**శుద్ధత్వం** – ఒక వ్యక్తిలోని అంగాలలో ప్రాణం తప్ప, తక్కిన అంగాలన్నీ అశుద్ధమే. జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, మనస్సు, బుద్ధి, కర్మ – అన్నీ మంచి, చెడు రెండూ చేస్తాయి. దాన్నిబట్టి అతన్ని మంచివాడుగానో, చెడ్డ వ్యక్తిగానో ముద్రిస్తాము. కాని అతనిలోని ప్రాణశక్తిలో ఈ స్థాయీభేదాలు ఉండవు. ప్రాణశక్తి శుద్ధంగా ఉంటుంది. శుద్ధప్రాణంవల్ల అతను కూడా శుద్ధం అవుతాడు.

**సర్వంభరత్వం** – ప్రాణమే అన్ని అంగాలనూ భరిస్తుంది. దాన్ని సర్వంభరత్వం అంటారు. దీన్ని నిరూపించటానికి ఒక ఆఖ్యాయికను ఇస్తోంది ఉపనిషత్తు. ఆఖ్యాయిక అంటే కథ.

ఇది దేవాసురుల మధ్య జరిగిన యుద్ధం గురించిన కథ. ఈ దేవాసురులు వేరే ఎక్కడో లేరు, మనలోనే ఉన్నారు. ఒకసారి ఒక వ్యక్తిలోని దేవతలు ఉద్గీథ ఉపాసన చేయాలనుకున్నారు. ఎందుకంటే, దానివల్ల అన్ని అంగాలు శుద్ధంగా ఉంటాయి, చెడు వైపుకి పోవు అని ఆశించారు. ప్రతి అంగానికీ అధిష్ఠాన దేవతలు ఉంటారు. వాటిపైన అసురులు దండెత్తారు. దానివల్ల వాక్కు, ముక్కు, కళ్ళు, చెవులు, మనస్సు, అన్నీ అశుద్ధం అయ్యాయి. అన్నింటిలోకి అశుద్ధమైనది మనస్సు. మన మనస్సుని ఎవరూ చదవలేకపోవటం ఒక వరం, మనస్సును తెరవాలని చూడటం, కాలుష్యంతో నిండిన పెట్టెను తెరవటం లాంటిది అంటారు చిన్మయానందస్వామి. దేవుడు, ఆ విషయం తెలిసే దానికొక మూతను పెట్టాడు.

ఇప్పుడు మన కథలోకి వస్తే, ఈ అంగాలు ముందు వాటి అధిష్ఠానదేవతలకు, ఉద్గీథ ఉపాసన చేసి ఓడిపోయాయి. అప్పుడు, ఇవన్నీ ముఖ్యప్రాణంమీద ఉద్గీథ ఉపాసన చేశాయి. అంటే పంచప్రాణాలమీద చేశాయి. ఉపాసన చేస్తుంటే అసురులు వచ్చి ప్రాణంమీద దండెత్తారు. ప్రాణాన్ని నాశనం చేసే బదులు, వారే నాశనమయ్యారు. ప్రాణం శుద్ధంగానే కొనసాగింది. దీన్ని ఒక ఉదాహరణతో చెబుతున్నది ఉపనిషత్తు. ఒక రాయిని నాశనం చేయటానికి మట్టిగడ్డను విసిరితే, మట్టిగడ్డే విరుగుతుంది, కాని రాయి చెక్కు చెదరదు. అలాగే అసురులు ప్రాణాన్ని ఏమీ చేయలేకపోయారు.

**ఉపాసన ఫలం** – ఉపాసన ఫలానికి ఒక నియమం ఉంది.

**యథా యథా ఉపాస్తే, తదేవ భవతి**

ఏ గుణంమీద ఉపాసన చేస్తే, దానికి తగ్గ ఫలం వస్తుంది. ప్రాణదృష్ట్యా ఉద్గీథ ఉపాసన చేసిన వ్యక్తిపై అసురులు దండెత్తరు.

## **ఖండం 1.3** – ఈ ఖండంలో 6 ఉపాసనలు వస్తాయి.

3. **గుణత్రయ విశిష్ట ప్రాణదృష్ట్యా ఉద్గీథ ఉపాసన –** ఇందులో కూడా ఉద్గీథమీద ప్రాణ ఉపాసనే వస్తుంది. కాకపోతే ఇక్కడ మూడు భిన్నగుణాలు వర్ణించబడ్డాయి. అవి అంగిరస, బృహస్పతి, ఆయాస్య.

**అంగిరసః** – అంగిరస ఋషి ప్రాణ ఉపాసన చేశాడు కాబట్టి అంగిరస గుణం. అంగాలన్నింటికీ రసం కాబట్టి అంగిరసం.

**బృహస్పతిః** – బృహస్పతిని వాక్పతి, వాచస్పతి అని కూడా అంటారు. ప్రాణశక్తివల్లనే వాక్కు శక్తివంతంగా ఉంటుంది.

**ఆయాస్యః** – ఆయాస్యః ఋషి ప్రాణ ఉపాసన చేయటంవల్ల ఆయాస్య గుణం; ప్రాణం నోరునుంచి, ముక్కునుంచి పోతుంది.

**ఫలం** – కోరికలు తీరుతాయి. బకఃదాల్భ్యః అనే ఋషికి కోరికలు తీరినట్టుగా మనకు కూడా తీరుతాయి అంటున్నది ఉపనిషత్తు.

4. **సూర్య ఉపాసన** – సూర్యునికీ ఉద్గీథకీ మధ్య కొన్ని సమాన అంశాలు ఉన్నాయి కాబట్టి ఈ ఉపాసన చేయాలి అంటున్నది ఉపనిషత్తు.

**ఉదయం** – సూర్యుడు ఆకాశంలో ఉదయించినట్టుగా, సామగానంలో ఉద్గీథను హెచ్చుస్థాయిలో గానం చేయటం జరుగుతుంది.

**సమృద్ధి** – సూర్యుడు సమృద్ధిని కలుగజేస్తాడు. అలాగే సామగానం కూడా సమృద్ధిని కలుగజేస్తుంది.

**భయనాశనం** – సూర్యుడు భయాన్ని కలుగజేసే చీకటిని పారద్రోలుతాడు. ఉద్గీథ మనస్సులో అజ్ఞానమనే చీకటిని, జ్ఞానంద్వారా పారద్రోలటానికి తోడ్పడుతుంది.

**ఫలం** – అజ్ఞానం తొలగి, వేదాంతం అర్థమవుతుంది.

5. **సూర్యప్రాణ ఉభయ ఉపాసన** – అధిదైవం+అధ్యాత్మం రెండూ కలిసిన ఉపాసన. వాటి రెండింటి లక్షణాలూ ఒకటే.

**ఉష్ణం** – ప్రాణశక్తివల్ల వ్యష్టికి ఉండాల్సిన వేడి ఉంటే, సూర్యశక్తివల్ల జీవరాశులకు శక్తి అందుతుంది.

**స్వరం** – ప్రాణం, సూర్యుడు – రెండూ కొంతకాలమయ్యాక నిష్క్రమిస్తాయి. కాకపోతే సూర్యుడు మర్నాడు మళ్ళీ ఉదయిస్తాడు. కాని పోయిన ప్రాణం తిరిగిరాదు.

**ఫలం** – ఉపనిషత్తు చెప్పలేదు కాని, ప్రాణశక్తిమీద ఉపాసన చేస్తే ఆయుఃప్రమాణం పెరుగుతుంది.

6. **వ్యాన ఉపాసన** – పంచప్రాణాలలో ఒకటైన వ్యానాన్ని ఉద్గీథమీద ప్రతిష్ఠించి, ఉద్గీథ ఉపాసన చేయాలి. ఇక్కడ వ్యానాన్ని ప్రాణ, అపానలకు సంధిగా వర్ణిస్తున్నది ఉపనిషత్తు. యోగశాస్త్రంలో ప్రాణాయామం చేసేటప్పుడు గాలి వదలటం రేచకం, గాలిని లోపలికి పీల్చటం పూరకం, పీల్చిన గాలిని ఉంచటం కుంభకం. కుంభకం వ్యానశక్తి. ఇది మన కార్యకలాపాలకు కారణం. మాట్లాడటానికి, కర్మ చేయటానికి కూడా వ్యానశక్తి కావాలి.

**ఫలం** – వీర్యవత్త్వం. బలం బాగుంటుంది. శ్వాసపీల్చటంలో సమస్య ఉండదు.

7. **ఉద్గీథ అక్షర ఉపాసన** – ఉద్గీథ పదంలో మూడు అక్షరాలు ఉన్నాయి. అవి ఉత్+గీః+థమ్. మూడు అక్షరాలను మూడు ప్రతీకలుగా భావించి, వాటిమీద దేవతలను ఆవాహన చేయాలి. ఇలా నాలుగు ఉపాసనలు. ఇలాగే నాలుగు వ్యాహృతులమీద నాలుగు జతల ఉపాసనలు చూస్తాము తైత్తిరీయోపనిషత్తులో. పద్ధతి ఒకటే కాని, ప్రతీకలు, వాటిమీద ఆవాహన చేసే దేవతలు మారతారు.

| **ఉత్** | **గీః** | **థమ్** |
|---|---|---|
| ప్రాణం | వాక్కు | అన్నం |
| సువర్లోకం | భువర్లోకం | భూలోకం |
| ఆదిత్యుడు | వాయువు | అగ్ని |
| సామవేదం | యజుర్వేదం | ఋగ్వేదం |

**ఫలం** – స్వర్గలోకఫలం లేదా పైన చెప్పిన దేవతల దీవెనలు కలుగుతాయి.

8. **కామ పూర్తి ఉపాసన** – ఇది ఉద్గీథ ఉపాసన కాదు. కొంచెం వేరేగా ఉంటుంది. యజ్ఞాలు చేసేటప్పుడు అనేక ఫలాలకోసం అనేకమంది దేవతలను ఆవాహన చేస్తూ, సామగానం చేస్తారు. దాన్ని ఎనిమిది అంశాలతో చేయాలి.

**ఫలం** – ఏ కోరికతో చేస్తున్నారో తలుచుకుని చేస్తే ఆ కోరిక తీరుతుంది. నిష్కామంగా చేస్తే చిత్తశుద్ధి, చిత్తఏకాగ్రత కలుగుతాయి.

## ఖండం 1.4-9. అమృత అభయగుణవిశిష్ట ఓంకార ఉపాసన

ఈ ఖండంలో ఒకటే ఉపాసన. అది ఓంకార ఉపాసన. దీనికి ప్రత్యేకమైన పేరు ఉంది. అది స్వరం. ఈ ఉపాసన గురించి ఒక కథ చెబుతున్నది ఉపనిషత్తు.

ఒకసారి దేవతలు మృత్యువంటే భయపడ్డారుట. ఆ భయాన్ని తొలగించుకోవటానికి మూడు వేదాలను రక్షణ కోరారు. కాని అది పూర్తిగా రక్షణ ఇవ్వలేవు. ఎక్కువ లోతులేని నీటిలో ఉన్న చేప తను సురక్షింతంగా ఉన్నానుకుంటుంది కాని జాలరి కంటపడి, అతని వలలో చిక్కుతుంది. నీరు వేదాలు, చేపలు దేవతలు, జాలరి మృత్యువు. ఉపనిషత్తు ఈ ఉదాహరణ ఇవ్వటంలో అర్థం కర్మకాండవల్ల శాశ్వతత్త్వం పొందలేరు అని నిరూపించటానికి. అప్పుడు దేవతలు ఈ కర్మకాండని వదిలి, ఓంకార ఉపాసన అనే సముద్రానికి వచ్చారు. అమృత అభయగుణ విశిష్ట ఓంకార ఉపాసన చేశారు.

**ఫలం** – ఎవరైతే ఓంకార ఉపాసన చేస్తారో వారు అమృతం, అభయం పొందుతారు. ఈ ఉపాసనను స్వరం అంటారని చూశాము. ఎందుకంటే వేదపారాయణం చేసేటప్పుడు అందరూ గట్టిగా ఓంకారం చేస్తారు.

### **ఖండం 1.5** – ఇందులో మూడు ఉపాసనలు చూస్తాము

10. **ఆదిత్య దృష్ట్యా ఉద్గీథ ఉపాసన** – ఆదిత్య ఉపాసనను అంతకుముందు కూడా చూశాము. అక్కడ ఆదిత్యను ఒక పూర్తి దేవతగా చూశాము. ఇక్కడ అనేక కిరణాలున్న ఆదిత్యను ఉపాసన చేస్తాము. ఇది అధిదైవ ఉపాసన.

**ఫలం** – కౌశీతకీ ఋషి తన పుత్రునికి సలహా ఇవ్వటం ద్వారా చూస్తాము. తను ఆదిత్య ఉపాసన చేయటంవల్ల ఒక్కడే పుత్రుడు కలిగాడనీ, అతనిని ఆదిత్య బహురశ్మి దృష్ట్యా ఉద్గీథ ఉపాసన చేయమనీ, అప్పుడు అతనికి అనేకమంది పుత్రులు కలుగుతారనీ సలహా ఇస్తాడు.

11. **పంచవృత్తి రూప ప్రాణ దృష్ట్యా ఉద్గీథ ఉపాసన** – ఇది అధ్యాత్మ ఉపాసన. ఆదిత్య ఉపాసనలాగే ముందు ఖండంలో ప్రాణాన్ని ఒక్కటిగా ఉపాసన చేస్తే, ఇక్కడ పంచప్రాణాలుగా ఉపాసన చేస్తాము.

ఫలం – దీనికి కూడా బహుపుత్రలాభం.

12. **ఉద్గీథ ప్రణవ ఐక్య ఉపాసన** – ఉద్గీథ అంటే సామవేదంలో గానం చేసే ఓంకారం. ప్రణవ అంటే తక్కిన వేదాలలో ధ్యానం చేసే ఓంకారం. ఈ ఉపాసనను యజ్ఞంలో ఒక భాగంగా చేస్తారు కాబట్టి ఈ ఉపాసనలు చాలామటుకు కర్మాంగ ఉపాసనలు.

**ఫలం** – సామవేద ఋత్విక్కు, ఋగ్వేద ఋత్విక్కు కలిసి చేస్తారు కాబట్టి ఒకరు తప్పు చేసినా రెండోవారు సరిగ్గా చేస్తే ఆ లోపం తెలియదు.

## ఖండం 1.6-13. విశేషగుణ సంపన్న పరమేశ్వర ఉపాసన

ఇది కర్మాంగ ఉపాసన. ఈ ఉపాసనలో ఒక అంగీ ఉపాసనతో పాటు 8 అంగ ఉపాసనలు కలిపి చేయాలి. అంగ ఉపాసన దానంతట అది ఫలం ఇవ్వదు. అంగీ ఉపాసనతో దీన్ని జత చేస్తే ఫలం ఎక్కువగా ఉంటుంది.

అంగ ఉపాసనలో ఒకదానితో ఒకటి సంబంధం ఉన్న 5 జంటలు తీసుకోబడ్డాయి. ఒకటి ఆశ్రయం, ఇంకోటి ఆశ్రయి. ఆ ఐదు జతలు వరుసగా – పృథివీ–అగ్ని; అంతరిక్షం–వాయువు; ద్యౌ (స్వర్గం)–సూర్యుడు; నక్షత్రాలు–చంద్రుడు; శుక్లభా (సూర్యునిలో కాంతివంతమైన ప్రదేశం)–కృష్ణభా (సూర్యునిలో నల్లని చుక్క).

ఈ ఐదు జతల దేవతలను, రెండు జతల ఆలంబనాలమీద ఉపాసన చేయాలి.

**ఆలంబనం జత 1** – ఋగ్వేదం–సామవేదం. అవి కూడా ఆశ్రయం–ఆశ్రయి. ఋగ్వేదంలోంచి మంత్రాలను తీసుకుని సామవేదంలో గానం చేస్తారు.

**ఆలంబనం జత 2** – సామ అంటే సా+అమ్. ఈ రెండూ కలవకపోతే సామ లేదు. ఈ రెండింటిమీద ముందు చెప్పిన ఐదు జతల దేవతలనూ ఆవాహన చేయాలి. ఇదంతా ఒక పట్టికలో చూద్దాము.

| | **అంగ ఉపాసన 1** | | **అంగ ఉపాసన 2** | |
|---|---|---|---|---|
| | **ఋగ్వేదం** | **సామవేదం** | **సా +** | **అమ** |
| 1. | పృథివీ | అగ్ని | పృథివీ | అగ్ని |
| 2. | అంతరిక్షం | వాయువు | అంతరిక్షం | వాయువు |
| 3. | ద్యౌః | ఆదిత్యుడు | ద్యౌః | ఆదిత్యుడు |
| 4. | నక్షత్రాలు | చంద్రుడు | నక్షత్రాలు | చంద్రుడు |
| 5. | శుక్లభా | కృష్ణభా | శుక్లభా | కృష్ణభా |

ఇదంతా అంగ ఉపాసన.

ఇప్పుడు అంగీ ఉపాసన. ఇది శాస్త్రంలో చాలా ముఖ్యమైన ఉపాసన. ఇది పరమేశ్వర ఉపాసన. పరమేశ్వరుడంటే నిర్గుణబ్రహ్మ కాదు, సగుణబ్రహ్మ. నిర్గుణబ్రహ్మ ఆబ్జెక్టు కాదు కాబట్టి దానిమీద ధ్యానం చేయలేము. ఇక్కడ సగుణబ్రహ్మకు కొన్ని గుణాలను వర్ణిస్తున్నారు.

**హిరణ్మయం** – పరమేశ్వరుని శరీరం అంతటా బంగారురంగులో ఉంటుంది. కేశాలు, మీసం, గడ్డం, అంతా కూడా బంగారు వర్ణం.

**కప్యాసం పుండరీకమేవమక్షిణీ** – కళ్ళు కలువరేకుల్లాగా కాంతివంతంగా ఉన్నాయి. కలువపువ్వును కోతి వెనకభాగంతో పోల్చటం జరిగింది. ఈశ్వరుని కళ్ళను కోతి పృష్ఠభాగంతో పోల్చటం హీనోపమానం (హీనమైన పోలిక అన్నారు కొందరు భాష్యకారులు.) శంకరులవారు, మరికొందరు పోలిక ప్రత్యక్షంగా దేవునితో కాదు కాబట్టి హీనోపమానం కాదు అన్నారు.

**ఉత్‌నామత్వం** – అన్ని పాపాలకు అతీతుడు.

**ఋగ్‌సామగేష్ణత్వం** – ఋగ్వేదం, సామవేదాలు మాత్రమే కాదు, పృథివీ, అంతరిక్షం అన్నీ పరమేశ్వరునిలో భాగాలు. అందువల్ల విశ్వరూపత్వం, సర్వాత్మత్వం అర్థాలు వస్తాయి.

**ఉద్గీథత్వం** – ఇక్కడ ఉద్గీథ అంటే పరమేశ్వరుడే. ఆయనను హెచ్చుస్థాయిలో కొలుస్తున్నామని అర్థం.

**ఊర్ధ్వలోక కామ ఈశత్వం** – స్వర్గలోకాలలోని కోరికలకు అధిపతి.

ఇంతవరకూ చూసిన విశిష్టగుణ సంపన్న పరమేశ్వర ఉపాసన అంగీ ఉపాసన. దీన్ని రెండు జతల ఆలంబనాలమీద ఐదేసి జతల దేవతలను కొలిచి, అంగ ఉపాసనతో కలిపి చేయాలి. దీన్ని అధిదైవ ఉపాసన అని అంటారు.

## ఖండం 1.7-14. విశిష్ట గుణసంపన్న పరమేశ్వర ఉపాసన

ఇది కూడా ముందు ఖండంలోని ఉపాసనలాంటిదే. కాకపోతే పరమేశ్వరుణ్ణి కొలవటానికి తీసుకున్న స్థానాలు మారతాయి. అక్కడ ఆదిత్యమండలం తీసుకుంటే, ఇక్కడ దక్షిణ అక్షి (కుడికన్ను) తీసుకుంటాము. కన్ను తీసుకుంటాము కాబట్టి దీన్ని అధ్యాత్మ ఉపాసన అంటారు.

అంగ ఉపాసన విషయంలో ఆలంబనాల్లో మార్పులేదు. అంటే ఋగ్సామ జంట ఒకటి; సా+అమ జంట ఇంకొకటి. వాటిమీద కొలిచే దేవతలు మారతారు. వాటిని కూడా ఒక పట్టికలో చూద్దాము.

| | **ఋగ్** | **సామ** | **సా** | **+ అమ** |
|---|---|---|---|---|
| 1. | వాక్కు | ప్రాణం | వాక్కు | ప్రాణం |
| 2. | చక్షువు | ఆత్మ (జాగ్రత్ పురుషుడు) | చక్షువు | ఆత్మ (జాగ్రత్ పురుషుడు) |
| 3. | శ్రోత్రం | మనస్సు | శ్రోత్రం | మనస్సు |
| 4. | శుక్లభా | కృష్ణభా | శుక్లభా | కృష్ణభా |

శుక్లభా అంటే కంటిలోని తెల్లభాగం. కృష్ణభా అంటే కంటిలోని నల్లగుడ్డు. రెండూ కలిపితేనే కన్ను ప్రత్యక్ష ప్రమాణం అవుతుంది. పరమేశ్వరుని గుణాలు కూడా ముందు చూసిన గుణాలన్నీ వచ్చి ఇంకొక గుణం అదనంగా వస్తుంది. అది,

**ఐశ్వర్యవత్వం** – ఐశ్వర్యానికి అధిపతి. ఇది కూడా ప్రత్యక్షంగా చెప్పదు.

ముందు ఖండంలో చెప్పిన అధిదైవ ఉపాసన, ఇక్కడ చెప్పిన అధ్యాత్మ ఉపాసన కలిపి చేయాలని శంకరులవారు విశ్లేషిస్తారు. అందువల్లనే ఫలం రెండింటికీ కలిపి వస్తుంది.

**ఫలం** – సకామంగా ఏ గుణంమీద ఉపాసన చేస్తే ఆయా గుణాలకు తగ్గ ఫలం వస్తుంది. ఉదాహరణకు కామ ఈశత్వం గుణంమీద చేస్తే ఇహలోక, పరలోక కోరికలు తీరుతాయి. స్వర్గలోకప్రాప్తి కలుగుతుంది.

**నిష్కామ ఉపాసన** – ఈ ఉపాసనను నిష్కామంగా చేస్తే చిత్తశుద్ధి, చిత్తసంస్కారం, చిత్త ఏకాగ్రత, చిత్తవైశాల్యం కలుగుతాయి.

## ఖండాలు 1.8,1.9-15. పరోవరీయత్వ గుణవిశిష్ట పరమేశ్వర ఉపాసన

ఇందులో కూడా ఒక్కటే ఉపాసనను చూస్తాము. ఇది కూడా పరమేశ్వర ఉపాసనే. కాకపోతే ఇక్కడ ఒక్కటే గుణాన్ని కీర్తిస్తాము. అది పరోవరీయత్వం. దేవదేవోత్తమ పదంలాంటిది ఇది. పర అంటే శ్రేష్ఠం, వరీయాన్ అంటే శ్రేష్ఠమైన వాటికన్నా శ్రేష్ఠమైనది. ఈ ఉపాసనకు ఆలంబన ఉద్గీథ. ఈ గుణాన్ని ఉపనిషత్తు ఒక కథద్వారా చెబుతున్నది.

ముగ్గురు విద్యార్థులు ఒకచోట కలుసుకుంటారు. వారి పేర్లు శిలకుడు, దల్భ్యుడు, ప్రవాహణుడు. వారు ఉద్గీథయొక్క ఆశ్రయవిచారణ చేద్దామనుకుంటారు. మొదట దాల్భ్యుడు కొంతవరకు చెబితే, శిలకుడు మరికొంత చెబుతాడు. అప్పుడు క్షత్రియుడైన ప్రవాహణుడు జవాబు చెబుతాడు. భూలోకానికి ఆధారం ఆకాశం అని చెబుతాడు. ఇక్కడ ఆకాశం అంటే పరమేశ్వరుడు. జగత్కారణ బ్రహ్మ. పరమేశ్వరుడంటే నిర్గుణబ్రహ్మ కాదు, మాయావిశిష్ట బ్రహ్మ. ఉద్గీథకు ఆధారం ఏమిటనే ప్రశ్నతో ఈ చర్చ మొదలవుతుంది. దశలవారీగా జవాబులు వచ్చి పరమేశ్వరుడు అంతిమ ఆధారం అని వస్తుంది కాబట్టి పరోవరీయత్వ గుణం వస్తుంది ఇక్కడ. ఉద్గీథ ఆలంబనమీద చేసే పరమేశ్వర ఉపాసన ఇది.

**ఫలం** - పరోవరీయత్వంమీద ఉపాసన కాబట్టి, మనం కూడా శ్రేష్ఠమైన వారిలో శ్రేష్ఠమైన వారమవుతాము, ఇహలోకం, పరలోకంలో కూడా.

## ఖండాలు 1.10, 1.11-16. త్రివిధ సామ ఉపాసన

ఈ రెండు ఖండాలను కలిపి ఒక కథ వస్తుంది. ముందు ఆ కథను చూద్దాము. ఉషస్తి అనే ఋషి ఉన్న కురుదేశం అనే ఊర్లో తుఫాను వచ్చి అంతా కొట్టుకుపోయింది. ఇభ్య అనే ఊరిలో భిక్షాటనకు బయలుదేరాడు. అక్కడ ఒక మావటివాడు కుల్మాషా తింటున్నాడు. కుల్మాషా అంటే అలచందలు, తక్కువరకమైన చిక్కుడుగింజలు. ఈ ఋషి అతన్ని భిక్ష అడిగితే అతను, తాను తక్కువ జాతికి చెందినవాడిననీ, పైగా తాను తింటున్నదే ఉందనీ, దాన్ని తాను ఎంగిలి చేశాననీ చెప్పాడు. ఆకలికి ఎటువంటి నియమాలూ లేవని ఉషస్తి చెబితే తను తింటున్నది ఇచ్చాడు.

కుల్మాషాతో పాటు తాను తాగుతున్న నీళ్ళు కూడా ఇచ్చాడు ఆ మావటి. కాని నీళ్ళు తనకు అవసరం లేదని నీటిని తిరస్కరించాడు. ఉషస్తి ఆ కుల్మాషాను తను కొంత తిని, భార్యకు కొంత తీసుకువెళ్ళాడు. కాని ఆమెకు వేరే ఆహారం దొరకటంవల్ల, ఆమె ఆ కుల్మాషాను దాచింది. మర్నాడు పొద్దున్న లేచాక, ఉషస్తి తన భార్యతో తనకు ఏదైనా ఆహారం పెడితే, అక్కడ ఊర్లో జరుగుతున్న పెద్ద యజ్ఞానికి వెళ్ళి సంభావన తెస్తానన్నాడు. కుల్మాషా తప్ప

ఏమీ లేదంది భార్య. అసలే ఎంగిలి భోజనం, ఆపై ముందురోజు వదిలేసిన అన్నం. ఎంగిలిని ఉచ్ఛిష్టం అనీ, ముందురోజు భోజనాన్ని పర్యుషితం అనీ అంటారు. రెండో దోషం చేశాడు. పర్యుషితం తిని వెళ్ళాడు.

ఈ కథలోని గూఢార్థం అసాధారణ పరిస్థితుల్లో నియమాన్ని ఉల్లంఘించినా తప్పులేదు కాని కావాలని నియమాన్ని ఉల్లంఘించకూడదు. ఉషస్తి అనుకున్నట్టుగానే యజ్ఞానికి వెళ్ళాడు. అక్కడ మూడు వేదాలకు చెందిన ముగ్గురు ఋత్విక్కులు ఉన్నారు.

ప్రస్తావ భక్తిమీద పాడే ప్రస్తోత
ఉద్గీథ భక్తిమీద పాడే ఉద్గాత
ప్రతిహార భక్తిమీద పాడే ప్రతిహర్త

16. **త్రివిధ సామ ఉపాసన** – ఇక్కడ చెప్పబోయే ఉపాసన సామమంత్ర అవయవాల మీద. సామమంత్రాలను ఒక పద్ధతి ప్రకారం 5 అవయవాలుగానూ, ఇంకో పద్ధతి ప్రకారం 7 అవయవాలుగానూ విభజించటం జరిగింది. వీటి గురించి మరింత వివరంగా రెండవ అధ్యాయంలో వస్తుంది. సామమంత్ర అవయవాలను లేదా భాగాలను భక్తి అంటారు.

భక్తి పదానికి సందర్భాన్నిబట్టి అర్థం మారుతూ వస్తుంది. భగవద్గీతలో భక్తి అంటే దాని వాచ్యార్థం భక్తి అనే వస్తుంది. తర్కశాస్త్రంలో, మీమాంస శాస్త్రంలో శక్తి, భక్తి అనే పదాలు వాడతారు. శక్తి అంటే ఒక పదంయొక్క వాచ్యార్థం, భక్తి అంటే లక్ష్యార్థం. కాని ఇక్కడ ఈ రెండూ కాకుండా మూడో అర్థం తీసుకోవాలి. సామమంత్ర అవయవాన్ని భక్తి అంటున్నారు. సామ అవయవాలు 5 ఉంటే పంచవిధ సామ ఉపాసన అనీ, 7 ఉంటే సప్తవిధ సామ ఉపాసన అనీ అంటారు. ప్రస్తుతం 3 భక్తి పేర్లు తలుచుకుంటే చాలు. అవి ప్రస్తావ ఉద్గీథ, ప్రతిహార. ఈ మూడూ, మూడు ఉపాసనలకు ఆలంబనాలు. అవి వేటికి ఆలంబనలో ఇప్పుడు చూస్తాము.

ఉషస్తి యజ్ఞం చేస్తున్న ముగ్గురు ఋత్విక్కులను మీరు పాడే భక్తియొక్క దేవత పేరు తెలుసా అని విడివిడిగా అడిగి, తెలియకపోతే తల బద్దలవుతుంది అని అన్నాడు. వారు తమకు తెలియదని వినమ్రంగా ఆగిపోయారు. వీరి పరిస్థితి చూసి యజమాని పరుగెత్తుకుని వచ్చి విషయాన్ని విచారించాడు. వచ్చిన వ్యక్తి ఉషస్తి అని గ్రహించి, మురిసిపోయి, ఆయనకోసమే ప్రయత్నం చేశాననీ, ఎక్కడున్నాడో తెలియదనీ చెప్పి, ఇప్పుడు యజ్ఞాన్ని కొనసాగించండి అన్నాడు. ఉషస్తి వారి స్థానాలు తాను మార్చుననీ, వారి విధులను వారిని నిర్వర్తించనీయమనీ, వారికిచ్చినంత దక్షిణ తనకూ ఇవ్వమనీ కోరాడు. అలాగే అన్నాడు యజమాని.

10, 11 ఖండాలు కలిపి ఒక్కటిగా పరిగణించాలి. ఈ రెండింటి సారాంశం, మూడు భక్తులకు(పదాలకు) ముగ్గురు దేవతలు ఉన్నారు. ఆయా దేవతలను, ఆయా ఆలంబనలమీద ఆవాహన చేసి ఉపాసన చేయాలన్నది ఈ ఖండాల సారాంశం. ఇది ప్రత్యక్షంగా చెప్పలేదు.

| **దేవత** | **ఆలంబనం** |
|---|---|
| ప్రాణం | ప్రస్తావ |
| ఆదిత్య | ఉద్గీథ |
| అన్నదేవత | ప్రతిహార |

ఇక్కడ ప్రాణం = పరమేశ్వరుడు అంటే మాయావిశిష్ట చైతన్యం.

**ఫలం** – ఇది కూడా ప్రత్యక్షంగా చెప్పలేదు. శంకరులవారి భాష్యంలో వస్తుంది. ప్రాణ ఉపాసన చేసిన వ్యక్తికి ప్రాణప్రాప్తి, ఆదిత్య ఉపాసన చేసిన వ్యక్తికి ఆదిత్యప్రాప్తి, అన్న ఉపాసన చేసిన వ్యక్తికి మరణానంతరం విరాట్‌ప్రాప్తి కలుగుతుంది. ఇహలోక ఫలం కర్మ సమృద్ధి.

## ఖండం 1.12-17. శౌవ ఉద్గీథ

ఇది ఒక ప్రత్యేకమైన మంత్రం. శ్వా అంటే శునకం లేదా కుక్క. శౌవ ఉద్గీథ అంటే కుక్క చెప్పిన సామమంత్రం. ఇంతవరకు ఉద్గీథ అంటే సామ అవయవ భూత ఓంకారం అని చూశాము. కాని ఇక్కడ ఉద్గీథ అంటే సామ మంత్రం అని తీసుకోవాలి. కుక్క అంటే ఋషులు అని తీసుకోవాలి అంటారు శంకరులవారు.

ఈ సామమంత్రంలో అన్నసమృద్ధికోసం చేసే ప్రార్థన వస్తుంది. ఈ మంత్రంలో బకుదు అనే శిష్యుడు ఉన్నాడు. అతను సామవేద అధ్యయనానికి వెళుతుంటే దోవలో తెల్లకుక్క కనబడింది. అప్పుడు కొన్ని కుక్కపిల్లలు (ఋషులు) వచ్చి ఇలా కోరాయి. 'ఓ దేవా! మాకు అన్నం సమృద్ధిగా దొరకటానికి ఒక సామమంత్రం పాడు. మాకు చాలా ఆకలిగా ఉంది.' తెల్లకుక్క 'ఇది అనువైన సమయం కాదు, రేపొద్దున ఇక్కడికే రండి, అప్పుడు పాడతాను,' అంది. ఈ విషయం విన్న బకుదు తాను కూడా మర్నాడు పొద్దున్న అక్కడికి వెళ్ళాడు. గురుశిష్యులైన కుక్కలు వృత్తాకారంలో తిరుగుతూ సామమంత్రాన్ని గానం చేస్తున్నాయి. దానికి వృత్తంలో తిరగాలి.

**ఓమ్ అదామ** – మాకు అన్నం సమృద్ధిగా ఉండాలి.

**ఓం పిబామ** – మాకు నీళ్ళు సమృద్ధిగా దొరకాలి.

**వరుణః ప్రజాపతిః సవితా** – ముగ్గురు దేవతలను ప్రార్థిస్తున్నారు. వరుణుడు, ప్రజాపతి, సూర్యుడు.

**అన్నమిహ ఆహారః** – మీరంతా అన్నాన్ని తీసుకురండిగాక.

**అన్నపతే అన్నమిహ** – సామవేద పద్ధతిలో అన్నం సమృద్ధిగా దొరకటానికి చేసే రోజువారీ ప్రార్థన ఇది.

**ఫలం** – అన్న సమృద్ధి.

## ఖండం 1.13–18. స్తోభ ఉపాసన

ఇది ఇంకొక ఉపాసన. కాకపోతే ఇక్కడ ఆలంబనం మారుతుంది. ఇది కూడా సామమంత్రంలో ఇంకో అవయవం. దీన్ని స్తోభ అంటారు. ఇది సామవేదంలోనే కనబడే సాంకేతిక పదం. కొన్ని శబ్దచిహ్నాలు. వాటికి ప్రత్యేకంగా అర్థమంటూ ఏదీ ఉండదు, ఉదాహరణకు తైత్తిరీయంలో హా, వై కఠలో వా అనే అక్షరాలు. అక్షరాలను చిన్నచూపు చూడకుండా, ఈ ఉపాసనకు వాటిని అలంబనలుగా తీసుకోవాలి. దేవతలను స్తోభలమీద ఆవాహన చేస్తాము.

| **దేవత** | **అలంబన (స్తోభ)** |
|---|---|
| పృథివీదేవత | హా ఉకారము |
| వాయువు | హా ఇకారము |
| చంద్రుడు | అథకారము |
| ఆత్మ | ఇహకారము |
| అగ్ని | ఈకారము |
| ఆదిత్యుడు | ఊకారము |
| ఆహ్వానము | ఏకారము |
| విశ్వేదేవతలు | ఔహోయికారము |
| ప్రజాపతి | హింకారము |
| ప్రాణము | స్వరము |
| అన్నం | యా |
| విరాట్ | వాక్ |
| అనిరుక్తరం | హుంకారము |

అనిరుక్తం మాయాసహిత ఈశ్వరుణ్ణి సూచిస్తుంది.

ఫలం: 1. సూనృత్ వాక్ – అతని మాట శుద్ధంగా ఉంటుంది.

2. అన్నవానన్నాదో భవతి – అన్నం సమృద్ధిగా దొరుకుతుంది.

# ఏకాదశ ఉపనిషత్తుల సారం

## ఛాందోగ్యోపనిషత్ - అధ్యాయం 2

ఛాందోగ్యోపనిషత్తు సామవేదానికి చెందినది. అందులో 8 అధ్యాయాలు ఉన్నాయి. వాటిలో మొదటి 5 అధ్యాయాలు ఉపాసనా ప్రధానంగా ఉంటే, తక్కిన 3 అధ్యాయాలు జ్ఞానప్రధానంగా ఉంటాయి. ఉపాసనలను సకామ ఉపాసనగా చేయవచ్చు, నిష్కామ ఉపాసనగా చేయవచ్చు. సకామ ఉపాసనగా చేస్తే ధర్మ, అర్థ, కామాలు పొందవచ్చు. నిష్కామంగా చేస్తే చిత్త ఏకాగ్రత, చిత్తవైశాల్యం ఏర్పడి, జ్ఞానయోగ్యతాప్రాప్తి కలుగుతుంది. ఉపాసన సగుణబ్రహ్మమీద చేస్తే, జ్ఞానం నిర్గుణబ్రహ్మజ్ఞానం కలిగిస్తుంది.

ఉపాసనలో రెండు రకాలు ఉన్నాయి. అవి కర్మాంగ ఉపాసన, స్వతంత్ర ఉపాసన. కర్మాంగ ఉపాసనలు కర్మలో ఒక భాగంగా వస్తాయి. వాటికి స్వంతంగా ఫలం ఉండదు కాని, కర్మఫలాన్ని పెంచుతాయి. స్వతంత్ర ఉపాసనలో ఉపాసన మాత్రం చేస్తారు. దాని ఫలం అధికంగా ఉంటుంది. మొదటి రెండు అధ్యాయాలు కర్మాంగ ఉపాసనలు బోధిస్తే, తక్కిన మూడు అధ్యాయాలు స్వతంత్ర ఉపాసనను బోధిస్తాయి. ఈ నేపథ్యంతో రెండవ అధ్యాయంలోకి అడుగుపెడదాము. ఇందులో 24 ఖండాలు, 82 మంత్రాలు ఉన్నాయి.

నిజానికి ఛాందోగ్యోపనిషత్తులో ఒక్కొక్క అధ్యాయమే తక్కిన ఉపనిషత్తులకన్నా పెద్దది. ఉదాహరణకు ముండకోపనిషత్తులో 65 మంత్రాలు ఉంటే, ఈ ఉపనిషత్తులో ఈ ఒక్క అధ్యాయంలోనే 82 మంత్రాలు ఉన్నాయి. ఈ అధ్యాయాన్ని ఐదు అంశాలుగా విభజించవచ్చు. అవి సామ ఉపాసన, పంచభక్తి ఉపాసనలు, సప్తభక్తి ఉపాసనలు, ఓంకార ఉపాసన, లోకప్రాప్తి సాధనం.

### ఖండం 2.1 - 1 సామ ఉపాసన

1. **సామ్న సాధురూపేణ ఉపాసన** – అంతకుముందు అధ్యాయంలో ఒక అవయవం మీద ఉపాసనలు చూశాము. ఇప్పుడు సమస్త సామ అవయవాలమీద ఉపాసనలు చూస్తాము. అవయవ, అవయవి ఉపాసనల్లో ఏది శ్రేష్ఠమైనది? ఏదో ఒకదానిమీద చేసేకన్నా, మొత్తం అవయవాలమీద చేసే ఉపాసనే శ్రేష్ఠం కదా! అందువల్లనే ఈ ఉపాసనను సాధు ఉపాసన అంటారు. మొత్తం మంత్రాలను తీసుకుంటే అది సామ అవుతుంది. సామ అంటే మంచిది. సామకు అనేక అర్థాలున్నాయని శంకరులవారు వివరిస్తున్నారు.

1. **సమత్వాత్ సామ** – సమత్వం ఉన్నది. అందమైనది. ఒక లయ ఉన్నది. అందువల్లనే అది సామగానం అయింది. ఇద్దరి మధ్య సంధి కుదిర్చేటప్పుడు సామదానభేద దండోపాయాలు అంటారు. మొదటిస్థాయి సామదే. సమానం చేస్తుంది. ఏది మంచిదయితే అది సామ. ఏది చెడు అయితే అది అసామ.

2. **స్యామ్నైనముపాగాత్** – ఒక వ్యక్తి ఉన్నతమైన ఉద్దేశ్యంతో వచ్చినప్పుడు అని అర్థం. ఇక్కడ సామ్నా క్రియావిశేషణంగా, చెడు తలంపుతో వచ్చినప్పుడు సాధునైన పాగాత్ అంటారు (క్రియావిశేషణం అంటే క్రియను గురించి తెలిపేది).

3. **సామ నో బతేతి** – ఎవరికైనా మంచి జరిగితే మాకు సామ కలిగింది అంటారు. ఇక్కడ సామ విశేషణంగా వచ్చింది (విశేషణం అంటే నామవాచకం గురించి తెలిపేది). దీనివల్ల సామ అంటే మంచిది అని అర్థం. అందువల్ల సామవేదాన్ని సాధురూపంలో ఉపాసన చేయవచ్చు. దాన్ని సామ్న సాధురూపేణ ఉపాసన అంటారు.

**ఫలం** – అన్ని మంచి లక్షణాలూ మనకు వస్తాయి. మనస్సు సమభావంతో ఆలోచిస్తుంది.

## ఖండాలు 2.2-2.7 2 పంచభక్తి ఉపాసనలు

2. **పంచవిధ సామ ఉపాసన** – సామవేదంలో ఒక్కొక్క అవయవాన్ని భక్తి అంటారు. ఐదు అవయవాలమీద ఉపాసనను పంచవిధ సామ ఉపాసన అంటారు. ఏడు అవయవాలమీద ఉపాసనను సప్తవిధ సామ ఉపాసన అంటారు.

తైత్తిరీయోపనిషత్తులో నాలుగు ఆలంబనలు తీసుకుంటారు. అవి పూర్వరూపం, ఉత్తర రూపం, సంధి, సంధానం. వీటిమీద అధిలోకం, అధిజ్యోతిషం, అధివిద్య, అధిప్రజ, అధ్యాత్మం అనే ఐదు రకాల ఉపాసనలు చేస్తాము. ఇక్కడ కూడా అదే పద్ధతి.

ఇక్కడ తీసుకున్న ఆలంబనలు ఐదు. అవి వరుసగా – హింకారము, ప్రస్తావము, ఉద్గీథము, ప్రతిహారము, నిధనము. ఆలంబనలు మారవు. వాటి మీదే ఒకదాని తరువాత మరొక దేవతల సమూహాలను ఆవాహనం చేస్తాము. అలా వరుసగా ఆరు ఉపాసనలు వస్తాయి.

1. **అధిలోక ఉపాసన** – లోకాలమీద ఉపాసన. ఇది ఆరోహణక్రమంలో, అవరోహణ క్రమంలో కూడా చేయాలి. పృథివీ, అగ్ని, అంతరిక్షం, ఆదిత్యుడు, స్వర్గలోకం. ఈ ఐదింటిమీద ఇదే వరుసలో ఉపాసన చేస్తే, అది ఆరోహణ క్రమం. చివరినుంచి వస్తే అది అవరోహణ క్రమం.

**ఫలం – విద్వాన్ (భవతి)** – ఈ ఉపాసన చేస్తే ఆయా లోకాల్లో సుఖాలను అనుభవిస్తారు.

2. **వృష్టి ఉపాసన** – వర్షం కురిసేముందునుంచి ముగిసే స్థాయివరకూ వస్తుంది. వర్షం కురిసే ముందు వీచే గాలి, మేఘాలు, వర్షం కురవటం, ఉరుములతో కూడిన మెరుపులు, వర్షం ఆగిపోవటం. ఈ దశలను వరుసగా ఐదు ఆలంబనలమీద ఉపాసన చేయాలి.

**ఫలం – అప్పుమాన్భవతి** – ఈ సాధకుడు ఎక్కడ ఉంటే అక్కడ అతని కోసమన్నా సమృద్ధిగా వర్షం కురుస్తుంది.

3. **అప్పు ఉపాసన** (అధి+అప్స్+ ) – అనేక రకాల నీటిమీద ఉపాసన. వర్షపునీరు ఉన్న మేఘాలు, కురుస్తున్న వర్షం, కురిశాక తూర్పువైపు ప్రవహించే నదులు, పడమరవైపు ప్రవహించే నదులు, సముద్రం.

**ఫలం** – జలగండం ఉండదు. నీరు కూడా సమృద్ధిగా దొరుకుతుంది.

4. **ఋతు ఉపాసన** – మామూలుగా ఆరు ఋతువులు ఉన్నాయి. కాని ఒక్కొక్కచోట వాటిని ఐదు ఋతువులుగానే పేర్కొంటారు. అవి వసంతఋతువు, గ్రీష్మఋతువు, వర్ష ఋతువు, శరదృతువు, హేమంత ఋతువు. వదిలేసినది శిశిర ఋతువు. హేమంత, శిశిర ఋతువులను కలిపి వింటర్ అంటారు.

**ఫలం – ఋతుమాన్భవతి** – ఈ సాధకునికి ఆయా ఋతువులలో దొరికే వస్తువులు సమృద్ధిగా దొరుకుతాయి.

5. **పశు ఉపాసన** – మచ్చిక చేసుకున్న జంతువులు మేక, గొర్రె, ఆవు, గుర్రం, మనిషి. మనిషిని శ్రేష్ఠమైన జంతువు అంటారు కదా; అందుకు! శాస్త్రం ఈ పట్టికలో కుక్కని చేర్చలేదు. కుక్క అంటే అంత మంచి అభిప్రాయం లేదు. భోజనం చేస్తుండగా కుక్క వస్తే తినకూడదని వస్తుంది శాస్త్రంలో. ఇప్పటి పరిస్థితి వేరు.

**ఫలం – పశుమాన్భవతి** – పశుసంపద సమృద్ధిగా ఉంటుంది.

6. **ప్రాణ విషయ ఉపాసన** – ప్రాణ ఉపాసన అంటే కేవలం పంచప్రాణాలే కాదు. అన్ని అంగాలనూ తీసుకోవాలి. ప్రాణ వాక్ చక్షు శ్రోత్ర మనః అని వస్తుంది.

| | |
|---|---|
| ప్రాణ | – పంచప్రాణాలు. |
| వాక్ | – పంచ కర్మేంద్రియాలు |
| చక్షుశ్రోత్రం | – పంచ జ్ఞానేంద్రియాలు |
| మనః | – నాలుగు అంతఃకరణలు |

అన్నింటికి ప్రాణశక్తే ఆధారం కాబట్టి, ఈ ఉపాసనను ప్రాణవిషయ ఉపాసన అంటారు.

**ఫలం – పరోవరీయం** – ఇహలోకంలో అన్నింటిలోనూ శ్రేష్ఠంగా ఉంటాడు. పరలోకంలో అన్నింటికన్నా శ్రేష్ఠమైన లోకంలో ఉంటాడు.

(ఇదంతా ఈ అధ్యాయం చివర్లో ఒక పట్టికలో చూడవచ్చు.)

ఇక్కడితో ఒక పంచవిధ సామ ఉపాసన అయింది. దీని తరువాత సప్తవిధ సామ ఉపాసన, మళ్ళీ కొన్ని పంచవిధ సామ ఉపాసనలు వస్తాయి. ఈ విధమైన ఉపాసనలు చెప్పటంలో ఉపనిషత్తు లక్ష్యం ఏమిటి? ఈ ఉపాసనలవల్ల చిత్తశుద్ధి, చిత్తనైశ్చల్యం, చిత్తవైశాల్యం ఎలాగూ వస్తాయి. అవి కాక ఇంకో ఉద్దేశం కూడా ఉంది. వీటిని ఉపాసన చేసినా, చేయకపోయినా, ప్రకృతిలో ఉన్న అనేక శక్తుల గురించి ఇలా వివరంగా తెలుసుకోవటంవల్ల ప్రకృతి గురించిన అవగాహన బాగా పెరుగుతుంది. ఉదాహరణకు వానలో ఇన్ని దశలు ఉన్నాయని కాని, నీటిలో ఇన్ని రకాలు ఉన్నాయని కాని మనం మామూలుగా పట్టించుకోము.

ఇంకొక కారణం, సాధకుడు సామవేదం నేర్చుకుంటాడు. అతని మనస్సు ఎప్పుడూ వాటిమీదే ఉంటుంది కాబట్టి, ఆ అవయవాలనే తీసుకుంది ఉపనిషత్తు. అతనికి వాటిని గుర్తు పెట్టుకోవటం తేలిక. అంతేకాదు, మరొక కారణం అతనికి సామమంత్రాలమీద గౌరవం ఉంటుంది కాబట్టి, అతనికి గౌరవం ఉన్న ఆ మంత్రాలమీద ఋతువులను కాని, వర్షాన్ని కాని, నీటిని కాని ఆవాహన చేయటంవల్ల వాటి మీద గౌరవం పెరగటమే కాక, దేన్నీ అగౌరవంగా చూడకూడదని నేర్చుకుంటాడు. నిజానికి ఇవి విరాట్ ఉపాసన కిందకు వస్తాయి. విశ్వరూపదర్శనానికి ఇదొక పద్ధతి.

## ఖండాలు 2.11-2.21 – 2 పంచభక్తి ఉపాసనలు (మరికొన్ని)

2. **పంచవిధ సామ ఉపాసన + వ్రతం** – ఖండాలు 8-10 వదిలేసి ఖండాలు 11-21కి వచ్చాము. ఎందుకంటే ఈ ఖండాల్లో మళ్ళీ పంచవిధ సామ ఉపాసనలు వస్తాయి. వీటికీ, 2-7 ఖండాల్లో చూసిన ఉపాసనలకూ మధ్య రెండు భేదాలు ఉన్నాయి.

ఎ) ఆ ఉపాసనలకు పేర్లు లేవు. ఇప్పుడు పేర్లు ఉన్నాయి.

బి) ఒక్కొక్క ఉపాసనతో ఒక్కొక్క వ్రతం జత చేయబడింది. భృగువల్లీలో ఉపాసనలతో పాటు వ్రతాలు జత చేయబడినట్టుగా.

ఈ ఉపాసనలకు కూడా ఆలంబనలు లేదా భక్తులు అవే. హింకారము, ప్రస్తావము, ఉద్గీథ, ప్రతిహారము, నిధనము. ఇక్కడ పదకొండు ఉపాసనలను చూస్తాము. వీటికి దేనికి

దానికి ఫలం ప్రత్యేకంగా ఇవ్వటమే కాక, అన్నింటిలోనూ సమానంగా వచ్చే కొన్ని ఫలాలను ఇచ్చింది ఉపనిషత్తు. ముందు సమానంగా వచ్చే ఫలాలనుచూద్దాము.

**సర్వమాయురేతి జ్యోగ్జీవతి మహాన్ప్రజయా పశుభిర్భవతి మహాన్కీర్త్యా**

ఈ మాటలు ఈ ఖండాలన్నింటిలోనూ వస్తాయి.

సర్వామాయురేతి – ఆయుష్షు పెరుగుతుంది
జ్యోగ్జీవతి – ప్రకాశవంతమైన జీవనం గడుపుతాడు
మహాన్ – మహానుభావుడవుతాడు
ప్రజయా – సంతతి కలుగుతుంది
పశుభిర్భవతి – పశుసంపద కలుగుతుంది
మహాన్కీర్త్యా – కీర్తిమంతుడవుతాడు.

1. **గాయత్ర సామ ఉపాసన** – ఈ పేరుకీ, ఉపాసనకీ సంబంధ లేదు. విషయం ప్రాణం. ప్రాణం అంటే సూక్ష్మశరీరంలోని 19 అంగాలు వస్తాయి. మనస్సు, వాక్కు, చక్షువు, శ్రోత్రం,ప్రాణం.

**ఫలం – ప్రాణీ భవతి**. అన్ని అంగాలు ఏ అనారోగ్యం లేకుండా చక్కగా పనిచేస్తాయి.

**వ్రతం – మహామనాస్స్యాత్** – ఉదారగుణం కలవాడై ఉండాలి.

2. **రథన్తర సామ ఉపాసన** – ఇక్కడ విషయం అగ్ని. అగ్నిమథనం, పొగరావటం, మంటలు రేగటం, ఆహుతులు వేస్తున్నప్పటి జ్వాల, సద్దుమణుగుతున్న జ్వాల.

**ఫలం – బ్రహ్మవర్చస్వ్యన్నాదో భవతి** – బ్రహ్మవర్చస్సు పొందుతాడు. అన్నం సమృద్ధిగా పొందుతాడు.

**వ్రతం** –న **ప్రత్యఙ్ఙగ్నిమాచామేత్** – అగ్ని ఎదురుగా కూర్చుని ఆచమనం చేయగూడదు. న నిష్ఠీవేత్ – అగ్ని ఎదురుగా ఉమ్మకూడదు.

3. **వామదేవ్య సామ ఉపాసన** – విషయం మైథునం. స్త్రీపురుష సంయోగం. దీన్నిబట్టి వైదిక కాలంలో ప్రతిదీ దైవకార్యంగా చూసేవారని తెలుస్తోంది. ఇద్దరికీ అంగీకారం ఉండాలి; ఇద్దరూ ఆనందంగా ఉండాలి; భర్త భార్యని సమీపించాలి; భార్య సహకరించాలి; సంయోగం ముగించటం.

**ఫలం – మిథునీ భవతి** – భార్యాభర్తలు అన్యోన్యంగా ఉంటారు. మంచి పిల్లలు పుడతారు.

**వ్రతం – న కాంచన పరిహరేత్** – భార్యను తిరస్కరించకూడదు.

4. **బృహత్ సామ ఉపాసన** – విషయం ఆదిత్యుడు. ఉదయిస్తున్న సూర్యుడు, ఉదయించిన సూర్యుడు, మిట్టమధ్యాహ్నం; మధ్యాహ్నం; అస్తమిస్తున్న సూర్యుడు.

**ఫలం – తేజస్వ్యన్నాదో భవతి** – తేజస్సు కలవాడు అవుతాడు.

**వ్రతం – తపన్తం న నిందేత్** – సూర్యుడు ప్రతాపం చూపిస్తున్నాడు; ఎండ దంచేస్తున్నాడు అని తిట్టకూడదు.

5. **వైరూప సామ ఉపాసన** – విషయం వర్షం. చెదురుమదురుగా ఏర్పడిన మేఘాలు; వర్షం కురవటానికి సిద్ధంగా ఉన్న మేఘాలు; కురుస్తున్న వాన; మెరుపులు, ఉరుములు; వర్షం ఆగిపోవటం.

**ఫలం – పశూనవరుంధే** – పశుసంపద బాగా ఉంటుంది. అదికూడా,

**విరూపాగ్ంశ్చ సరూపాగ్ంశ్చ** – వివిధ రూపాలున్న, మంచి రూపాలున్న పశువులు. ఈ ఫలం వింతగా ఉంది.

**వ్రతం – వర్షంతం న నిందేత్** – వానను నిందించకూడదు.

6. **వైరాజ సామ ఉపాసన** – విషయం ఋతువులు. వసంత ఋతువు, గ్రీష్మ ఋతువు, వర్ష ఋతువు, శరదృతువు, హేమంత ఋతువు. హేమంత ఋతువులో శిశిర ఋతువును కూడా కలుపుకోవాలి.

**ఫలం – విరాజతి** – ఏ కాలానికి తగ్గ వస్తువులు ఆ కాలంలో అతనికి సమృద్ధిగా దొరుకుతాయి.

**వ్రతం – ఋతూన్న నిందేత్** – ఋతువులను నిందించకూడదు. సంతోషంగా ఆస్వాదించాలి.

7. **శక్వర్యః సామ ఉపాసన** – విషయం లోకాలు. అవి పృథివీ, అంతరిక్షం, స్వర్గలోకం, దిక్కులు (తక్కిన లోకాలు), సముద్రం. మొదటి మూడింటినీ మామూలుగా భూలోక, భువర్లోక, సువర్లోకాలు అంటారు.

**ఫలం – లోకీ భవతి** – ఆయా లోకాలకు చెందిన సుఖాలను అనుభవిస్తాడు.

**వ్రతం – లోకాన్న నిందేత్** – లోకాలను నిందించకూడదు.

8. **రేవతీ సామ ఉపాసన** – విషయం పశువులు. అవి మేక, గొర్రె, ఆవు, గుర్రం, మనిషి. అన్నీ మచ్చిక చేసుకున్న జంతువులు.

**ఫలం – పశుభిర్భవతి** – పశుసంపదను సమృద్ధిగా పొందుతాడు.

**వ్రతం – పశూన్న నిందేత్** – పశువులను నిందించకూడదు.

9. **యజ్ఞాయజ్ఞీయ సామ ఉపాసన** – విషయం శరీర అవయవాలు. శరీరంమీద వెంట్రుకలు, చర్మం, మాంసం, ఎముకలు, మూలుగు (మజ్జ). ఈ ఉపాసననుబట్టి శరీరాన్ని కించపరచకూడదని తెలుస్తున్నది.

**ఫలం – అంగీ భవతి** – శరీరంలోని అంగాలన్నీ ఆరోగ్యకరంగా ఉంటాయి.

**వ్రతం – మజ్జ్ఞో నాశ్నీయాత్** – మాంసం తినకూడదు. ముందు సంవత్సరకాలం అని చెప్పి తరువాత జీవితాంతం అంటుంది ఉపనిషత్తు.

10. **రాజన సామ ఉపాసన** – విషయం దేవతలు. వారు అగ్ని, వాయువు, ఆదిత్యుడు, నక్షత్రాలు, చంద్రుడు.

**ఫలం – సార్ష్టితాగ్ం** – సాయుజ్యం గచ్ఛతి – ఆయా లోకాల దేవతలతో ఐక్యం చెందుతాడు.

**వ్రతం – బ్రాహ్మణాన్న నిందేత్** – బ్రాహ్మణుడిని నిందించకూడదు.

ముందు ఉపాసనలలో ఏ విషయానికి తగ్గట్టుగా ఆ వ్రతం వచ్చింది. కాని ఇక్కడ దేవతలను నిందించకూడదు అనలేదు. ఎందుకంటే బ్రాహ్మణుడు దేవతలతో సమానం. బ్రాహ్మణుడు అంటే గుణబ్రాహ్మణుడని అర్థంతీసుకోవాలి.

11. **సర్వ సామ ఉపాసన** – చివరిది, అత్యంత ఉన్నతమైనది. ఇక్కడ పేరు చెప్పలేదు కాని విషయాన్నిబట్టి ఇలా చెప్పవచ్చు. ఇక్కడ ప్రత్యేకత ఏమిటంటే ఒక్కొక్క ఆలంబనంమీద మూడేసి వస్తువులను ఆవాహన చేయాలి.

| | |
|---|---|
| హింకారముమీద మూడు వేదాలు | – సామవేదం, ఋగ్వేదం, యజుర్వేదం |
| ప్రస్తావముమీద మూడు లోకాలు | – భూలోకం, భువర్లోకం, సువర్లోకం |
| ఉద్గీథమీద మూడు దేవతలు | – అగ్ని, వాయువు, ఆదిత్యుడు |
| ప్రతిహారముమీద | – నక్షత్రాలు, పక్షులు, సూర్యరశ్మి |
| నిధనముమీద | – సర్పాలు, గంధర్వులు, పితృదేవతలు. |

ఒక్కముక్కలో చెప్పాలంటే అన్ని రకాల అంగాలనూ ఉపాసన చేయాలి.

**ఫలం – సర్వగ్ం హ భవతి** – అన్నీ తానే అవుతాడు. ఇది అన్నింటికన్నా ఉన్నతమైన ఉపాసన కాబట్టి అన్నివైపుల నుంచి గౌరవాన్ని పొందుతాడు. అంటే అతను హిరణ్యగర్భ అవుతాడు.

**వ్రతం – సర్వమస్మీత్యుపాసీత** – ప్రతిదానిలో తనను తాను ఊహించుకోవాలి. అహం బ్రహ్మ అస్మి అనే భావన రావాలి. జ్ఞానం కాదు, భావన రావాలి.

ఇక్కడితో 11 పంచవిధ సామ ఉపాసనలు, 11 వ్రతాలు అయ్యాయి.
(ఇదంతా ఈ అధ్యాయం చివర్లో ఒక పట్టికలో చూడవచ్చు.)

## ఖండాలు 2.8–2.10 3 సప్తభక్తి ఉపాసనలు

3 **సప్తవిధ సామ ఉపాసనలు** – 8–10 ఖండాలవరకూ సప్తవిధ సామ ఉపాసన వస్తుంది. పంచభక్తులు మళ్ళీ ఒకసారి చూద్దాము. అవి, హింకారము, ప్రస్తావము, ఉద్గీథము, ప్రతిహరము, నిధానము.

ఈ ఐదూ ఉండగా, ఇంకో రెండు కలుస్తాయి సప్తవిధ ఉపాసనలో. అవి ఆది, ఉపద్రవము. కాకపోతే ఈ రెండూ చివర్లో కలవవు.

**ఆది** – ప్రస్తావము, ఉద్గీథముల మధ్యలోనూ; ఉపద్రవము – ప్రతిహారము, నిధానము మధ్యలోనూ కలుస్తాయి. ఇప్పుడు అన్నీ కలిపి వరుసక్రమం చూస్తే – హింకారము, ప్రస్తావము, **ఆది**, ఉద్గీథము, ప్రతిహారము, **ఉపద్రవము**, నిధనము.

1. **వాక్ విషయ సప్తవిధ సామ ఉపాసన** – ఒక్క హింకారానికి తప్ప తక్కిన ఆలంబనలకు వాటి మొదటి అక్షరాలు వచ్చాయి. అవి వరుసగా, ప్ర, ఆ, ఉత్, ప్రతి, ఉప, ని. హింకారానికి హోమ్ దేవతను ఆవాహన చేయాలి.

**ఫలం** – ఈ ఉపాసన చేసినవారి వాక్కు మంగళకరంగా ఉంటుంది. దాని సూనృతవాక్ అంటారు. వారికి ఏ పనైనా తేలిగ్గా అయిపోతుంది.

2. **ఆదిత్య విషయ సప్తవిధ సామ ఉపాసన** – ఇందులో సూర్యభగవానుని స్తుతి, ఉపాసన వస్తుంది. రెండు అంశాలను స్తుతిస్తున్నది.

ఎ) అందరికీ సమంగా కాంతిని పంచుతాడు, బి) సూర్యుడిని ఎవరు చూస్తే వారికి సూర్యుడు తమనే చూస్తున్నాడు అనిపిస్తుంది.

సప్తవిధ సామ ఉపాసనలో సూర్యభగవానుని సప్తదశలు – ఒక్కరోజులో ఆవాహన చేస్తూ, ఏ జీవికి ఏ దశ ఇష్టమో కూడా చెబుతున్నది.

దశలు – సూర్యోదయం ముందు; సూర్యోదయం అవగానే; సూర్యకిరణాలు పృథివిని తాకినప్పుడు; మిట్టమధ్యాహ్నం, మధ్యాహ్నం, సాయంకాలం, అస్తమయం అవగానే.

పంచవిధ సామ ఉపాసనలో కూడా సూర్యునిమీద ఐదు దశల్లో ఉపాసన చూస్తాము. ఇక్కడ కొత్తగా కలిసినది 3. సూర్యకిరణాలు పృథివిని తాకినప్పుడు; 6. సాయంకాలం. ఈ ఏడు దశలను ఇష్టపడే జీవులు వరుసగా పశువు, మనిషి, పక్షులు, దేవతలు, గర్భస్థశిశువు, జంతువులు, పితృదేవతలు.

**ఫలం** – చెప్పలేదు కాని ఉపాసన సూత్రం ప్రకారం, సూర్యభగవానుని ప్రార్థించటంవల్ల సూర్య అనుగ్రహం సమృద్ధిగా ఉంటుంది.

3. **ఆత్మ సమ్మిత ఉపాసన** – సమ్మితం అంటే సమానంగా కొలవటం. ఆత్మ అంటే తనకి తాను. ఆత్మ సమ్మితం అంటే ఏడు భక్తులు తమలో తాము సమానంగా విభజించుకున్నాయని అర్థం. ఏడు భక్తుల పదాల సంఖ్య కూడితే 22 వస్తాయి. వాటిని మూడేసి అక్షరాల చొప్పున విభజించితే ఒకటి మిగులుతుంది. ఆ ఒక్కటి మూడు అక్షరాలున్న ఒక పదం కింద లెక్క. ఇలా వస్తుంది.

హింకార ప్రసావ ఆది ప్రతిహార ఉద్గీథ ఉపద్రవ నిధనమ్

హింకార ప్రస్తావ ఆదిప్ర తిహార ఉద్గీథ ఉపద్ర నిధనమ్ వ

ఆదికి ప్ర కలిపాము, ఉపద్రవలోని వ చివరికి తెచ్చాము. వ కూడా ఒక భక్తి. అలా 8 భక్తుల మీద ఆత్మ సమ్మిత ఉపాసన. దీన్ని త్ర్యక్షర త్వేన ఉపాసన అని కూడా అంటారు. త్ర్యక్షరం అంటే మూడు అక్షరాలు.

**ఫలం** – మృత్యు తరణం లేదా అమృతత్త్వం. ఈ ఫలాన్ని పరంపరయా అని తీసుకోవాలి. జ్ఞానయోగ్యతను, తద్వారా జ్ఞానప్రాప్తిని, తద్వారా అమృతత్త్వాన్ని ప్రసాదిస్తుంది.

ఇక్కడ ఉపనిషత్తు ఒక ఆసక్తికరమైన తర్కం ఉపయోగిస్తున్నది. సూర్యభగవానుని 21 సంఖ్యతో సూచిస్తారు.

12 నెలలు + 5 ఋతువులు + 3 లోకాలు = 20.

సూర్యభగవానుడు వీటికి పైన ఉన్నాడు కాబట్టి 21 సంఖ్య. ఆయన కాలతత్త్వానికి అంటే మృత్యుదేవతకు ప్రతీక.

ఆత్మసమ్మిత ఉపాసనలోని అక్షరాల సంఖ్య 22. అంటే సూర్యునికన్నా ఎక్కువ. అందువల్ల ఈ ఉపాసకుడు మృత్యువును అధిగమిస్తాడు. ఇదీ వేదశాస్త్రం వాడే తర్కం. అందువల్ల దీన్ని అతిమృత్యు ఉపాసన అనికూడా అంటారు. పరమార్థానందస్వామీజీ దీనికి ఇంకో తర్కం జోడించారు. ఇక్కడ అక్షరాలను సమం అన్నారు. శాస్త్రంలో ఎప్పుడూ బ్రహ్మను సమం అంటారు. అందువల్ల సమం ఉపాసన చేస్తే సమం బ్రహ్మను పొందుతాడు అంటే అమృతత్త్వాన్ని పొందుతాడు.

ఇక్కడితో సప్తవిధ సామ ఉపాసన ముగిసింది.

(ఇదంతా ఈ అధ్యాయం చివర్లో ఒక పట్టికలో చూడవచ్చు.)

## ఖండం 2.22 – కొన్ని చెదురుమదురు భావాలు.

ఇంతవరకు చూసిన ఉపాసనలు కాక, ఈ ఖండంలో కొన్ని చెదురుమదురు భావాలు చూస్తాము.

**మంత్రం 1 – గాన విశేష విజ్ఞానం.** సామవేదంలో రకరకాల స్థాయీ బేధాలున్నాయని ఉపనిషత్తు చెబుతున్నది. సంగీతం గానం చేసేవారు రకరకాల హావభావాలు ప్రదర్శిస్తారు. కొంతమంది చెయ్యి తిప్పితే, కొంతమంది మొహం చిట్లిస్తారు. మరికొంతమందిలో ఉచ్చారణ శుద్ధి ఉంటుంది. కొంతమంది పదాలను విరచటంలో ప్రత్యేకత చూపుతారు. ఇక్కడ ఉపనిషత్తు రకరకాల గానాలను, వాటిని ఇష్టపడేవారినీ ఇస్తున్నది.

| గానం పేరు | అర్థం | ఇష్టపడేవారు |
|---|---|---|
| వినర్దిసామ్న | రౌద ఎక్కువ | పశువులు |
| ఉద్గీథ | హెచ్చుస్థాయి | అగ్నిదేవత |
| అనిరుక్త | అస్పష్టం | ప్రజాపతి |
| నిరుక్త | స్పష్ట ఉచ్చారణ | సోమ |
| మృదు శ్లక్ష్ణం | మృదువుగా, ఉన్నతంగా | వాయుదేవత |
| శ్లక్ష్ణం బలవత్ | అందంగా, బలంగా | ఇంద్రుడు |
| క్రౌంచం | కీచు గొంతు | బృహస్పతి |
| అపధ్వాన్తం | పగిలిన కంచుధ్వని, లోగొంతు | వరుణుడు |

**వారుణం త్వేవ వర్జయేత్** – పగిలిన కంచుధ్వని, లోగొంతుతో పాడకూడదు.

**మంత్రం 2 – లోకాస్సమస్తాః సుఖినో భవన్తు –** ఇంకో చెదురుమదురు ఆలోచన. మనం ప్రార్థన చేసేటప్పుడు లోకాసమస్తా సుఖినోభవన్తు అంటాము. ఎవరికే కోరికలు ఉంటే అవి తీరి సుఖంగా ఉండుగాక అని దాని అర్థం. ఇందులో ఆ కోరికలేమిటో చెపుతున్నది ఉపనిషత్తు.

| వ్యక్తులు | ఇష్టాలు |
|---|---|
| దేవతలు | అమృతం |
| పితృదేవతలు | స్వధా |
| మనుష్యులు | ఆశ |
| పశువులు | ఆహారం, నీరు |
| యజమాని | స్వర్గలోకం |
| ఆత్మన (నాకు) | అన్నం |

ఒకమ్మాయి పెళ్ళి కుదిరితే ఒక్కొక్కరు ఏ అంశం చూస్తారో తమాషాగా ఈ పద్యంలో వస్తుంది.

| | | |
|---|---|---|
| కన్యా రూపం వరయత్ | – | పెళ్ళికూతురు అందం చూస్తుంది. |
| మాతా విత్తం, పితా శ్రుతం | – | తల్లి ఐశ్వర్యం చూస్తే, తండ్రి కీర్తి చూస్తాడు. |
| బాంధవాః కులమిచ్ఛంతి | – | బంధువులు కుటుంబ వివరాలు చూస్తారు. |
| మృష్టాన్నం ఇతరే జనాః | – | తక్కిన వాళ్ళు విందు భోజనం చూస్తారు. |

అలా ఇక్కడ ఈ మంత్రంలో మనం అన్నం సమృద్ధిగా దొరకాలని కోరుకుంటాము.

**అక్షరాలకు అధిష్ఠాన దేవతలు**

**మంత్రాలు 3, 4, 5** – అక్షరాలను మూడుగా విభజిస్తారు. ఒక్కొక్కదాన్నీ ఒక్కొక్క దేవత రక్షిస్తుంది.

| | | | |
|---|---|---|---|
| స్వరాః | అచ్చులు | – | ఇంద్రుడు |
| స్పర్శాః | హల్లులు | – | మృత్యుదేవత |
| ఊష్మాణః | శ, ష, స | – | ప్రజాపతి |

పాట పాడేముందు ఈ ముగ్గురు దేవతలను కొలిచి పాడతారు. గాయకుడిని ఎవరైనా మీరు అచ్చులు సరిగా పలకలేదంటే, ఇంద్రుడు అతనికి జవాబిస్తాడు. శ, ష, సలు సరిగా పలకలేదంటే ప్రజాపతి, హల్లులు సరిగా పలకలేదంటే మృత్యుదేవత వారి పని పడతారు. దీనివెనుక ఉన్న ఉద్దేశం పాడేముందు ప్రార్థన చేస్తే పొరపాట్లు దొర్లవని.

ఈ అక్షరాలను ఎలా పలకాలో చెబుతున్నది ఉపనిషత్తు.

| | | |
|---|---|---|
| స్వరాః | – ఘోషవన్తో బలవంతో వక్తవ్యాః | – బలంగా |
| ఊష్మాణః | – అగ్రస్తా అనిరస్తా వివృతా | – దేనికది స్పష్టంగా |
| స్పర్శాః | – లేశేనానభినిహితా | – మృదువుగా |

సరిగా, అన్నీ స్పష్టంగా పలకాలి.

## ఖండం 2.23 – 4 ఓంకార ఉపాసన

ఇది చాలా ముఖ్యమైన ఖండం. ఇక్కడ ఓంకార ఉపాసన గురించి చెబుతున్నది ఉపనిషత్తు. దీనిని బ్రహ్మ ఉపాసన అనికూడా అంటారు.

4 **ఓంకారపాసన –** ఇది చాలా ముఖ్యమైన ఖండం. ఓంకార ఉపాసన గురించి చెబుతున్నది ఉపనిషత్తు. శంకరాచార్యులు తన భాష్యంలో దీన్ని చాలా వివరంగా చర్చిస్తారు.

ఇంతకుముందు అధ్యాయంలో ఓంకారాన్ని ఉద్గీథ రూపంలో చూశాము. ఓంకారానికీ, ఉద్గీథకూ మధ్య ఉన్న తేడా ఏమిటి?

1. ఉద్గీథ అంటే ఓంకారం కానీ, ఓంకారం ఉద్గీథ కాదు. సామవేదంలో తప్ప, తక్కిన వేదాల్లో ఓంకారాన్ని ఓంకారమనే అంటారు. కాని ఒక్క సామవేదంలోనే దీన్ని ఉద్గీథ అంటారు. దాన్ని హెచ్చుస్థాయిలో సామగానం చేస్తారు కాబట్టి ఆ పేరు వచ్చింది.

2. ఉద్గీథ సామమంత్రంలో ఒక భాగం. ఇంతవరకూ చూసిన పంచభక్తుల్లో, సప్తభక్తుల్లో ఉద్గీథ ఒక భక్తి అని చూశాము. అందుకని ఇది స్వతంత్రం కాదు.

3. ఉద్గీథ సామ అవయవం కాబట్టి ఇది స్వతంత్రంగా చేసే ఉపాసన కాదు. దీన్ని కర్మ అంగ ఉపాసన అంటారు. కర్మతో కలిపి చేయాలి.

**ఓంకారం** – ఓంకారం ఉద్గీథ కాదు, సామమంత్రంలో భాగం కాదు, కర్మలో భాగం కాదు, దీన్ని స్వతంత్రంగా ఉపాసన చేయవచ్చు. ఇది అంగ ఉపాసన కాదు, అంగీ ఉపాసన. అన్ని ఉపాసనలకన్నా శ్రేష్ఠమైనది. ఓంకారం గురించి అన్ని ఉపనిషత్తుల్లోనూ వస్తుంది.

**ఏతదాలమ్బనం శ్రేష్ఠమేతదాలమ్బనం పరమ్।**
**ఏతదాలమ్బనం జ్ఞాత్వా బ్రహ్మలోకే మహీయతే॥** – కఠ 1.2.17

**ప్రణవో ధనుః** – ముండకమ్ 2.2.4
**ఓమితి బ్రహ్మ ఓమితీదగ్ం సర్వమ్** – శీక్షావల్లీ
**ఓమిత్యేతదక్షరమిదం సర్వమ్** – మాండూక్యమ్ 1.1

ఇక్కడ ఓంకారంమీద ఏ దేవతను ఆవాహనం చేస్తున్నారు? మామూలు దేవత కాదు, పరబ్రహ్మ. అందువల్ల ఓంకారం బ్రహ్మప్రతీకం. పరబ్రహ్మ నిర్గుణం కాబట్టి, నిర్గుణం బ్రహ్మ మీద ఉపాసన చేయలేము కాబట్టి, సగుణ ఓంకారం మీద ఆవాహన చేస్తాము. అందుకని ఇది బ్రహ్మ ఉపాసనతో సమానం. ఈ ఉపాసనను ఓంకార ఉపాసన అనీ, ప్రతీక ఉపాసన అనీ, బ్రహ్మ ఉపాసన అనీ అనవచ్చు.

**ఫలం** – క్రమముక్తి. ఓంకార ఉపాసనవల్ల ఇక్కడే, ఇప్పుడే జీవన్ముక్తి కలగదు. సాధకుడు ఉపాసనా ఫలంగా బ్రహ్మలోకం వెళ్ళి, అక్కడ బ్రహ్మ విచారణ చేసి, ఆత్మజ్ఞానం పొంది, ముక్తిని పొందుతాడు. దీన్ని క్రమముక్తి అంటారు. అందుకని దీన్ని **క్రమముక్తి సాధన భూత ఓంకార ప్రతీక బ్రహ్మ ఉపాసన** అంటారు.

**మంత్రం 1** – ఇది ఉపోద్ఘాత మంత్రం. మూడు ఆశ్రమాలకూ మూడు భిన్నధర్మాలున్నాయి.

| **సంఖ్య** | **ఆశ్రమం** | **ధర్మం** |
|---|---|---|
| 1. | గృహస్థం | యజ్ఞం, అధ్యయనం, దానం |
| 2. | వానప్రస్థం | తపస్సు |
| 3. | బ్రహ్మచర్యం | గురుకులవాసం |

**యజ్ఞం** – ఒక దేవతను పూజిస్తూ ఆహుతులను అగ్నిలో సమర్పించటం. ఈ రోజుల్లో యజ్ఞాలు లేవు కాబట్టి నిత్యపూజలు.

**అధ్యయనం** – శాస్త్రం పఠించటం. ఇప్పుడు దీనికి బదులు పూజలు చేయటం.

**దానం** – ధర్మం చేయటం. దానం వేరు, దక్షిణ వేరు. దక్షిణ అంటే యజ్ఞశాలలో, యజ్ఞంలో ఒక భాగంగా ఇచ్చేది. దీన్ని అంతర్వేది అంటారు. దానం అంటే యజ్ఞశాల బయట ధర్మం చేసేది. దీన్ని బహిర్వేది అంటారు. ఈ మూడూ గృహస్థు చేయాలి.

**తపస్సు** – తపస్సుకు అనేక అర్థాలున్నాయి. **కష్ట సహిష్ణుత్వం తపః** – అనేక శారీరక, మానసిక నిగ్రహాలను తపస్సు అంటారు. ఇంద్రియాలు కోరిన వాటిని ఇష్టపూర్వకంగా ఇవ్వకుండా ఉండగలిగే ఆత్మ సంయమనం. బలవంతంగా చేసేది కాదు. ఇష్టంగా చేసేది. ఉపవాసం, మౌనం కూడా తపస్సులోకి వస్తాయి.

కర్మకూ, తపస్సుకూ మధ్య తేడా ఏమిటంటే, కర్మకు బాహ్యవస్తువులు కావాలి. తపస్సు అంతర్గతంగా, మనసుతో చేసేది. అందుకే వానప్రస్థాశ్రమానికి ఈ ధర్మం.

**తపః శ్రద్ధే యే హ్యుపవసన్త్యరణ్యే** – ముండకమ్ 1.2.11

**గురుకుల వాసం** – ఆచార్యుని దగ్గరే ఉంటూ, అతనికి శుశ్రూష చేస్తూ విద్యనభ్యసించాలి. ఇది బ్రహ్మచారి ధర్మం.

ఉపనిషత్తు గృహస్థుని ప్రథమం గానూ, వానప్రస్థాన్ని ద్వితీయం గానూ, బ్రహ్మచర్యాన్ని తృతీయం గానూ పేర్కొంది. శంకరాచార్యులవారు ఇక్కడ విశ్లేషణ ఇస్తున్నారు. ఇది అసలైన వరుస క్రమం కాదు. ఇక్కడ ప్రథమ అంటే మొదటిది అని కాకుండా, ఒకటి అని తీసుకోవాలి.

బ్రహ్మచర్యం – రెండురకాల బ్రహ్మచర్యం ఉంటుంది.

ఉపకుర్వాణ బ్రహ్మచర్యం – వేదాంతవిద్య నేర్చుకోవటానికి తోడ్పడే బ్రహ్మచర్యం. గృహస్థాశ్రమంలోకి అడుగుపెట్టే ముందు దశ.

నైష్ఠిక బ్రహ్మచర్యం – జీవితాంతం బ్రహ్మచారిగానే ఉండిపోవటం. ఉదాహరణకు భీష్ముడు, హనుమంతుడు.

దీని ఉద్దేశం ఇది. ఒక వ్యక్తి ఉపకుర్వాణ బ్రహ్మచారిగా చేరి వేదాంత విద్యనభ్యసించి, అది పూర్తి అయ్యాక సమావర్తనం కర్మ చేస్తాడు. అప్పుడు అతను మూడు ఆశ్రమాల్లో – గృహస్థు, వానప్రస్థం, సన్న్యాసి – ఏదైనా తీసుకోవచ్చు. ఇవి కాక నాలుగవ మార్గం కూడా ఉంది. అది గురువుతో గురుకులంలోనే ఉండిపోవచ్చు. అలాంటప్పుడు నైష్ఠిక బ్రహ్మచర్య వ్రతం చేయాలి. మరణపర్యంతం నిష్ఠగా ఉంటానని దీక్ష తీసుకోవటం అది. గురువుకు నిస్వార్థ సేవ చేయాలి.

**ఫలం – సర్వ ఏతే పుణ్యలోకా భవన్తి** – మూడు ఆశ్రమాలకు చెందిన వారు వారి ధర్మాలను నిర్వర్తించటంవల్ల పుణ్యలోకాలకు వెళతారు.

**బ్రహ్మసగ్ంస్థో౽మృతత్వమేతి** – శంకరులవారు ఈ వాక్యాన్ని తరచు వాడుతుంటారు. ఇది తక్కిన మూడు ధర్మాలనుంచి భిన్నంగా ఉంది. అవి పుణ్యలోకాలకు మాత్రమే తీసుకువెళ్తాయి. కాని బ్రహ్మనిష్ఠలో ఉన్న జ్ఞాని అమృతత్త్వం పొందుతాడు.

జ్ఞాని ఏ ఆశ్రమానికి చెందినవాడు? ఉపనిషత్తు దీనికి జవాబు చెప్పలేదు. అందుకని శంకరులవారు తన భాష్యంలో దీనిమీద రెండు వాదనలు చేస్తారు. వేద పూర్వభాగంమీద మీమాంస చేసే పూర్వపక్షి ఏ ఆశ్రమంకన్నా చెందవచ్చు అంటాడు. కాని శంకరాచార్యులు పారిశేషన్యాయ దృష్ట్యా సన్న్యాసాశ్రమానికి చెందినవాడు అని నిర్ధారిస్తారు. మూడు ఆశ్రమాలకూ మూడు ధర్మాలు చెప్పి వదిలింది కాబట్టి మిగిలింది సన్న్యాసాశ్రమం కాబట్టి దాన్ని పారిశేషన్యాయం అంటారు. ఆ విధంగా జ్ఞాని సన్న్యాసాశ్రమానికి చెందినవాడు అంటారు శంకరులవారు.

ఇంకో అర్థం కూడా చెప్తారు శంకరులవారు. ఈ అధ్యాయం మొత్తం ఓంకార ఉపాసన ప్రకరణం. అలాంటప్పుడు – హఠాత్తుగా బ్రహ్మజ్ఞానం మధ్యలో చోటు చేసుకోలేదు కాబట్టి ఇక్కడ బ్రహ్మ అంటే ఓంకారం అని అర్థం తీసుకోవాలి. బ్రహ్మకున్న అనేక అర్థాల్లో ఓంకారం అర్థం ఒకటి.

> **భూరితి వా ఋచః । భువ ఇతి సామాని। సువరితి యజూగ్ంషి।**
> **మహ ఇతి బ్రహ్మ। బ్రహ్మణా వావ సర్వే వేదా మహీయన్తే।।** – శీక్షావల్లీ

మహ ఇతి బ్రహ్మలో బ్రహ్మ అంటే ఓంకారం. అందుకని ఓంకార ఉపాసన నిష్ఠలో ఉన్న ఉపాసకుడు అమృతత్త్వం పొందుతాడు. ఇక్కడ అమృతత్త్వం అంటే క్రమముక్తి అని తీసుకోవాలని అంతకుముందు కూడా చూశాము.

**మంత్రాలు 2, 3** – ఓంకార స్తుతి, ఓంకారాన్ని అన్నిటిసారంగా కీర్తించింది ఉపనిషత్తు. దాన్ని ఒక సంఘటన ద్వారా చూపించింది. ఒకసారి బ్రహ్మదేవునికి మూడు లోకాల సారం ఏమిటో తెలుసుకోవాలనిపించింది. దానికోసం తపస్సు చేశాడు.

మూడు లోకాలు – భూలోక, భువర్లోక, సువర్లోకాల సారం – మూడు వేదాలు
మూడు వేదాలు – ఋగ్వేద, సామవేద, యజుర్వేదాల సారం – మూడు వ్యాహృతులు
మూడు వ్యాహృతులు – భూః భువః సువఃల సారం – మూడు మాత్రలు
మూడు మాత్రలు – అకార, ఉకార, మకారాలను కలిపితే – ఓంకారం

ఇప్పుడు వెనక్కి వెళితే ఓంకారంలో అకార, ఉకార, మకార మాత్రలు మూడు వ్యాహృతుల సారం. భూః భువః సువః అనే మూడు వ్యాహృతులు మూడు వేదాల సారం. ఋగ్వేద, సామవేద, యజుర్వేదాలనే మూడు వేదాలు భూలోక, భువర్లోక, సువర్లోకాల సారం. అందువల్ల ఓంకారం సారానికి, సారానికి, సారానికి సారం. అలా ఓంకారం సారం కాబట్టి అన్ని లోకాల్లోనూ అంతటా వ్యాపించింది. **ఓమితి బ్రహ్మ ఓమితీదగ్ం సర్వమ్ ।**

## ఖండం 2.24 – 5 లోకప్రాప్తి సాధనలు

5 **లోకప్రాప్తి సాధనలు – మంత్రం 1** – కొన్ని కర్మలు చెప్పబడ్డాయి. ఆ కర్మలతో పాటు సామగానం చేయాలి. అందుకని ఆ కర్మలను గురించిన జ్ఞానం ఉంటే వాటి ఫలితం ఎక్కువగా ఉంటుందని గురువు చెబుతున్నాడు.

**మంత్రాలు 2–16 – మూడు కర్మలు – ప్రాతస్సవనం, మాధ్యన్దినం; తృతీయ సవనం** – ప్రొద్దున్న, మధ్యాహ్నం, సాయంత్రం చేసే కర్మలు. ఆరు అంశాలు – సమయం, అగ్ని, అధిష్ఠానదేవత, ఆహుతి దేవతలు, ప్రార్థన, ఫలం.

| **సమయం** | **అగ్ని** | **అధిష్ఠాన దేవత** | **ఆహుతి దేవత** | **ప్రార్థన** | **ఫలం** |
|---|---|---|---|---|---|
| ఉదయం | గార్హపత్యాగ్ని | వసువు | అగ్ని | పృథివీలోకద్వారం | భూలోక ప్రాప్తి |
| మధ్యాహ్నం | దక్షిణాగ్ని | రుద్రుడు | వాయువు | అంతరిక్షలోకద్వారం | భువర్లోక ప్రాప్తి |
| సాయంత్రం | ఆహవనీయ | ఆదిత్యుడు, విశ్వేదేవతలు | ఆదిత్యుడు, విశ్వేదేవతలు | స్వర్గలోకద్వారం | సువర్లోక ప్రాప్తి |

ప్రార్థన – లోకద్వారం తెరచి ఉంచమని చేసే ప్రార్థన

**య ఏవం వేద య ఏవం వేద** – ఇక్కడితో ఈ కర్మ, ఈ ఖండం, ఈ అధ్యాయం ముగిశాయని అర్థం.

## పంచ విధ సామ ఉపాసనలు ఖండాలు 2.2-2.7

| ఖండం | హింకారము | ప్రస్తావము | ఉద్గీథ | ప్రతిహారము | నిధనము | ఉపాసన అంశం | ఫలం |
|---|---|---|---|---|---|---|---|
| 2. | పృథివీ | అగ్ని | అంతరిక్షం | ఆదిత్యుడు | స్వర్గలోకం | లోకాలు - ఊర్ధ్వేషు | అన్నిలోకాల సుఖాలు |
| 2. | స్వర్గలోకం | ఆదిత్యుడు | అంతరిక్షం | అగ్ని | పృథివీ | లోకాలు - ఆవృత్తేషు | అన్నిలోకాల సుఖాలు |
| 3. | గాలి | మేఘము | వర్షము | మెరుపులు | వర్షం ఆగటం | వర్షము | సమృద్ధిగా వర్షాలు |
| 4 | మేఘము | వర్షము | తూర్పు వైపు | పడమర వైపు | సముద్రం | జలములు | సమృద్ధిగా నీరు |
| 5. | వసంతం | గ్రీష్మం | వర్షఋతువు | శరదృతువు | హేమంతం | ఋతువులు | సమృద్ధిగా అన్ని ఋతువులు |
| 6. | మేక | గొర్రె | గోవు | గుర్రం | మనిషి | పశువులు | సమృద్ధిగా పశువులు |
| 7. | ప్రాణం | వాక్కు | కన్ను | చెవి | మనసు | ప్రాణవిషయం | సమృద్ధిగా అన్ని శక్తులు |

## పంచవిధ సామ ఉపాసన - ఖండాలు 11-21

| ఖండం | ఉపాసన పేరు | విషయం | హింకార | ప్రస్తావ | ఉద్గీథ | ప్రతిహార | నిధనమ్ | ఫలం | వ్రతం |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 11 | గాయత్ర సామ ఉపాసన | ప్రాణం | మనస్సు | వాక్కు | చక్షు | శ్రోత్రం | ప్రాణం | ప్రాణీభవతి | మహానాస్స్యాత్ |
| 12 | రథంతర సామ ఉపాసన | అగ్ని | అగ్నిమథనం | పొగ | మంటలు | జ్వాల | సద్దుమణగటం | బ్రహ్మవర్చస్సు | ప్రత్యఙ్జగ్నిమాచామేత్ |
| 13 | వామదేవ్య సామ ఉపాసన | మైథునం | స్త్రీపురుషుల అంగీకారం | ఆనందం | భర్త సమీపించటం | భార్య సహకరించటం | మిథునం | మిథునీభవతి | న కాంచన పరిహరేత్ |
| 14 | బృహత్ సామ ఉపాసన | ఆదిత్యుడు | ఉదయిస్తున్న సూర్యుడు | ఉదయించిన సూర్యుడు | మిట్టమధ్యాహ్నం | మధ్యాహ్నం | అస్తమిస్తున్న సూర్యుడు | తేజస్వ్యన్నాదో భవతి | తపంతం న నిందేత్ |
| 15 | వైరూప సామ ఉపాసన | వర్షం | చెదురుమదురు మేఘాలు | వర్షం కురిసే మేఘాలు | కురుస్తున్న వాన | మెరుపులు, ఉరుములు | వర్షం ఆగిపోవటం | పశు చ`వరుంధే | వర్షంతం న నిందేత్ |
| 16 | వైరాజ సామ ఉపాసన | ఋతువులు | వసంత ఋతువు | గ్రీష్మ ఋతువు | వర్ష ఋతువు | శరదృతువు | హేమంత ఋతువు | విరాజతి | ఋతూన్న నిందేత్ |

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 17 | శక్వరీ సామ ఉపాసన | లోకాలు | పృథివీ | అంతరిక్షం | స్వర్గలోకం | దిక్కులు | సముద్రం | లోకీభవతి | లోకన్న నిందేత్ |
| 18 | రేవతీ సామ ఉపాసన | పశువులు | మేక | గొర్రె | ఆవు | గుర్రం | మనిషి | పశుభిర్భవతి | పశూన్న నిందేత్ |
| 19 | యజ్ఞాయజ్ఞీయ సామ ఉపాసన | శరీర అవయవాలు | వెంట్రుకలు | చర్మం | మాంసం | ఎముకలు | మూలుగు | అంగీభవతి | మజజో నశ్నీయాత్ |
| 20 | రాజనసామ ఉపాసన | దేవతలు | అగ్ని | వాయువు | ఆదిత్యుడు | నక్షత్రాలు | చంద్రుడు | సార్ష్టితాగ్ం | బ్రాహ్మణాన్న నిందేత్ |
| 21 | సర్వసామ ఉపాసన | మూడు విషయాలు | మూడు వేదాలు | మూడు లోకాలు | మూడు దేవతలు | నక్షత్రాలు, పక్షులు, సూర్యరశ్మి | సర్పాలు, గంధర్వులు, పితృదేవతలు | సర్వగ్ం హ భవతి | సర్వమస్మీత్యోపాసీత |

## ఆదిత్య సామోపాసన – నవమ ఖండం

| మంత్రం | దశ | భక్తి | జీవి | వివరణ |
|---|---|---|---|---|
| 2. | సూర్యోదయం ముందు | హింకారము | పశువు | మచ్చిక చేయబడ్డ పశువులు హింకారం చేస్తాయి. |
| 3. | సూర్యోదయం అవగానే | ప్రస్తావము | మనిషి | ప్రస్తావము అంటే మెప్పు. మనిషికి మెప్పు ఇష్టం. |
| 4. | సూర్యకిరణాలు పృథివిని తాకినపుడు | ఆది | పక్షులు | ఆది అంటే ఎత్తటం. పక్షులు తమను తాము ఎత్తుకుని ఆకాశంలో ఎగురుతాయి. |
| 5. | మిట్టమధ్యాహ్నం | ఉద్గీథము | దేవతలు | ఉద్గీథము అంటే పై స్థాయి. సూర్యుడు, దేవతలు కూడా పై స్థాయిలోనే ఉన్నారు. |
| 6. | మధ్యాహ్నం | ప్రతిహారము | గర్భస్థ శిశువు | ప్రతిహారము అంటే పట్టుకోవటం. గర్భంలో శిశువును క్రింద పడకుండా పట్టుకున్నట్టు |
| 7. | సాయంకాలం | ఉపద్రవము | జంతువులు | అరణ్యంలో ఉన్న జంతువులు అవి ఉపద్రవం తేవు.<br>ఉపద్రవతి – మనిషి నుంచి పారిపోతాయి. |
| 8. | అస్తమయం అవగానే | నిధనము | పితృ దేవతలు | నిధనము అంటే ముగింపు. మరణించిన పితృ దేవతలు. |

# ఏకాదశ ఉపనిషత్తుల సారం

## ఛాందోగ్యోపనిషత్ – అధ్యాయం 3

ఛాందోగ్యోపనిషత్తులోని మూడవ అధ్యాయంలో కూడా ఉపాసనలు చూస్తాము. ఇంతకుముందు అధ్యాయాల్లో కర్మాంగ ఉపాసనలు చూస్తే, ఇక్కడ స్వతంత్ర ఉపాసనలు చూస్తాము. అవి ఎనిమిది. ఆదిత్య ఉపాసన, గాయత్రీ ఉపాసన, ద్వారపాలకుల ఉపాసన, జ్యోతి ఉపాసన, బ్రహ్మ ఉపాసన, విరాట్ ఉపాసన, పురుషస్య యజ్ఞకల్పనం, ప్రతీక ఉపాసనలు.

### ఖండాలు 3.1–3.11 1 ఆదిత్య ఉపాసన

1. **ఆదిత్య ఉపాసన** – ఆదిత్యుని దేవమధువుతో పోల్చింది ఉపనిషత్తు. తేనె రుచి, నాణ్యతలో స్థాయీ భేదాలున్నట్టు సూర్యునిలో బయటకు కనబడే రంగునుండి అత్యంత లోపలిభాగంవరకు, ఐదు స్థాయిలను తీసుకుంది. తేనెతో ఎందుకు పోల్చిందంటే, తేనె రుచిని ఒక్కొక్కరు ఒక్కొక్కలా ఎలా ఆస్వాదిస్తారో, అలా కర్మఫలాన్ని ఒక్కొక్కరు ఒక్కొక్కలా అనుభవిస్తారు. సూర్యునిలో ఉన్న అనేక స్థాయిలతో ఈ కర్మఫలాలను పోల్చింది శాస్త్రం. అన్ని రకాల పువ్వులనుంచి తేనె వచ్చినట్టుగా, అన్ని రకాల కర్మలనుంచి కర్మఫలం వస్తుంది. అది అన్నింటికి ఒకటే. కీర్తి, దేహకాంతి, ఇంద్రియసామర్థ్యం, శక్తి పెరిగి, అన్నం సమృద్ధిగా దొరుకుతుంది. మధువు కణాల లోపలికి వెళ్ళినకొద్దీ రుచిలో స్థాయీ భేదాలున్నట్టుగా, కర్మఫలంలో కూడా సూర్యుని లోపల పొరకి వెళ్ళినకొద్దీ ఫలం అధికంగా ఉంటుంది.

సూర్యుణ్ణి అత్యంతబాహ్యంగా కనబడే రూపంనుంచి లోపలివరకూ ఐదుగా విభజించింది ఉపనిషత్తు. రోహితం (ఎరుపు), తెల్లరంగు, నల్లరంగు, మరింత నల్లరంగు, అత్యంత మధ్యభాగం. కర్మఫలం వరుసగా లోపలికి ప్రసరించిన కొద్దీ అధికంగా ఉంటుంది. అలాగే మధునాడిలో సూర్యకిరణాలు ప్రసరించే ఐదు దిక్కులు తీసుకుంది. అవి వరుసగా తూర్పు, దక్షిణం, పడమర, ఉత్తరం, ఊర్ధ్వభాగం.

ఐదు రకాల కర్మలు ఋగ్ కర్మ, యజుర్ కర్మ, సామవేదకర్మ, అథర్వణవేదకర్మ, ఓంకారం. అథర్వణ వేదకర్మను పారిప్లవః అంటారు. అథర్వణవేదంలో యజ్ఞాలు ఉండవు. కాని పూర్వం పెద్ద యజ్ఞాలు చేసేటప్పుడు మధ్యలో మంచి విలువలను బోధించే కథలు, ఇతిహాసాలు చెప్పేవారు ఋషులు. ఐదవకర్మను ఓంకారం అని ఎందుకన్నారంటే అది రహస్య ఉపాసన అయింది. కర్మ, ఉపాసనలు చేసిన వ్యక్తులు స్వర్గలోకాలకు వెళ్ళి కర్మఫలాలను అనుభవిస్తారు.

ఈ ఐదు రకాల కర్మఫలాలను అనుభవించే ఐదు రకాల భోక్తలను వర్ణిస్తున్నది ఉపనిషత్తు. వారు వరుసగా వసువు, రుద్రదేవత, ఆదిత్యదేవత, మరుతదేవత, సాధ్యదేవతలు.

ఈ ఐదుగురికీ కర్మఫలాలను పంచే నాయకులు, అంటే వీరిని స్వర్గలోకాలకు తీసుకువెళ్ళే నాయకులు వరుసగా అగ్ని, ఇంద్రుడు, వరుణుడు, సోమదేవత, హిరణ్యగర్భ. వారు ఆయా లోకాలకు తీసుకువెళ్తారు.

మొదటి నాలుగు లోకాల్లో సూర్యోదయం, అస్తమయం నాలుగు దిశలకూ మారుతూ ఉంటుంది. ఐదోలోకంలో సూర్యుడు ఉదయించడు, అస్తమించడు. కర్మఫల కాలపరిమితి ఒక్కొక్క లోకానికీ రెండేసి రెట్లు పెరుగుతూ వస్తుంది. మొదటిలోకంలో భూలోకం ఉన్నంత వరకూ, రెండవలోకంలో దానికి రెండు రెట్లు. అలా ఐదోలోకంలో దానిముందు లోకానికి రెండు రెట్లు.

## పంచ ఆత్మక మధువిద్యా ఉపాసన

| ఖండం | భోక్త | నేత | లోకం | సూర్యగతి | ఫలం కాలపరిమితి |
|---|---|---|---|---|---|
| 6 | వసుదేవతలు | అగ్ని | అగ్నిలోకం | తూర్పున ఉదయిస్తాడు<br>పడమర అస్తమిస్తాడు | భూలోకం ఉన్నంతవరకు |
| 7 | రుద్రదేవతలు | ఇంద్రుడు | ఇంద్రలోకం | దక్షిణాన ఉదయిస్తాడు<br>ఉత్తరాన అస్తమిస్తాడు | భూలోకానికి రెట్టింపుకాలం |
| 8 | ఆదిత్యదేవతలు<br>రెండవలోకానికి రెండురెట్లు | | వరుణుడు | వరుణలోకం<br><br>తూర్పున అస్తమిస్తాడు | పడమర ఉదయిస్తాడు ⁻ |
| 9 | మరుతదేవత | సోమదేవత | సోమలోకం | ఉత్తరాన ఉదయిస్తాడు<br>దక్షిణాన అస్తమిస్తాడు | మూడవలోకానికి రెండురెట్లు |
| 10 | సాధ్యదేవత | బ్రహ్మ<br>ఓంకారం/<br>హిరణ్యగర్భ | బ్రహ్మలోకం | సూర్యుడు ఉదయించడు<br>అస్తమించడు | నాలుగవలోకానికి రెండురెట్లు |

ఇది పంచ ఆత్మక మధువిద్యా ఉపాసన. ఐదవ భోక్త బ్రహ్మలోకానికి వెళతాడు. అక్కడ నుంచి క్రమముక్తి పొందుతాడు. బ్రహ్మలోకంలో సూర్యోదయం, సూర్యాస్తమయం ఉండవు.

### ఖండం 3.11 సమష్టి సూర్య ఉపాసన

**సమష్టి సూర్య ఉపాసన** – 1-10 ఖండాలలో మధువిద్యా పోలికతో సూర్య ఉపాసన వచ్చింది. దానికి ముగింపుగా ఇప్పుడు సమష్టి సూర్య ఉపాసన చూస్తాము. ఇందులో

సూర్యుడిని అనేకంగా చూడము, ఏకంగా చూస్తాము. అది కూడా మనకి భిన్నంగా చూడము. అభేద ఉపాసన చేస్తాము. దీన్ని అహంగ్రహ ఉపాసన అంటారు. అహం అంటే నేను, గ్రహ అంటే గ్రహణం (చూడటం), నేనుగా చూడటం.

**సూర్యదేవతా రూపః అహమ్ అస్మి**

ఉపాసనలో అభేదభావన ఊహించుకుంటాము. జ్ఞానంలో అభేదభావన ఎందుకు కలగాలో అర్థం చేసుకుంటాము. అలా అర్థం చేసుకున్నాక చేసే ధ్యానాన్ని నిదిధ్యాసనం అంటారు. ఇప్పుడు చేసేది అహంగ్రహ ఉపాసన. ఉపాసన మోక్షాన్ని ప్రత్యక్షంగా ఇవ్వదు. క్రమముక్తి మాత్రమే ఇస్తుంది. కాని జ్ఞానం ఇక్కడే, ఇప్పుడే మోక్షం ఇస్తుంది. దాన్ని జీవన్ముక్తి అంటారు. మరణించాక విదేహముక్తి ఇస్తుంది.

ఇప్పుడు ఈ ఖండానికి వస్తే ఇది క్రమముక్తి ఫలక అభేద ఉపాసనను సూచిస్తున్నది. ఇంత ప్రత్యక్షంగా ఉపనిషత్తు చెప్పదు. అందువల్లనే ఛాందోగ్యోపనిషత్తుని శంకరభాష్యం లేనిదే / దాన్ని వివరించే గురువులు పరమార్థానంద స్వామీజీ బోధ లేనిదే అర్థం చేసుకోవటం కష్టం. ఇది చాలా సూక్ష్మమైన ఉపనిషత్తు. అక్కడక్కడా అసంపూర్ణంగా ఉన్నట్టు అనిపిస్తుంది.

ఇక్కడ ఉపాసన గురించి చెప్పకుండా ఫలం గురించి చెబుతున్నది. ఫలం ఏమిటి? క్రమముక్తి. క్రమముక్తి అంటే ఉపాసనద్వారా బ్రహ్మలోకానికి వెళ్ళి, బ్రహ్మద్వారా అహం బ్రహ్మ అస్మి జ్ఞానం పొంది, అక్కడ మోక్షం పొందటం. భూమితో లయం చెంది సూర్యుడిని విడిగా చూస్తే ఉదయాస్తమయాలు ఉన్నాయి. సూర్యునితో లయం చెందితే అవి లేవు. దీని అర్థం ముక్తిలో దేశకాలాలు ఉండవు. మోక్షం దేశకాల అతీతం. ఈ ఉపాసన చేస్తే తరతరాలుగా అందరూ క్రమముక్తి పొందుతారు. ఈ సందర్భంలో శ్రద్ధలేని వానికి శాస్త్రాన్ని బోధించకూడదు అని వస్తుంది.

**ఇమామద్భిః పరిగృహీతాం ధనస్య పూర్ణాం దద్యాత్** – 3.11.6

శ్రద్ధలేని వ్యక్తి, చుట్టూ సముద్రం ఉండి, ధనంతో కూడిన మొత్తం జగత్తును దానం చేసినా కూడా, అతనికి ఛాందోగ్యోపనిషత్తు బోధించకూడదు.

## ఖండం 3.12 2 గాయత్రీ ఉపాసన

2. **బ్రహ్మరూపేణ గాయత్రీ ఉపాసన** – ఇక్కడ బ్రహ్మ అంటే సచ్చిదానంద బ్రహ్మ. బ్రహ్మ ఎన్నటికీ ఉపాస్యవస్తువు కాదు. అందుకని ప్రత్యక్షంగా బ్రహ్మ ఉపాసన లేదు. ఉపాసన చేయాలంటే ఉపాస్యవస్తువు ఉపాసకునికి భిన్నంగా ఉండాలి. సగుణబ్రహ్మలో ద్వైతభావన ఉంది కాని, నిర్గుణబ్రహ్మ అవ్యవహారి. నిర్గుణబ్రహ్మను చూడలేము, బ్రహ్మానందం

అనుభవంలోకి వచ్చేది కాదని చెప్పినా, నేను అన్నీ చూడాలి, అనుభవించాలి అని కోరే మధ్యమ అధికారీ శిష్యునికి, ఉపనిషత్తు ఒక మార్గాన్ని చూపిస్తున్నది. ఒక సగుణప్రతీకమీద నిర్గుణబ్రహ్మను ఆవాహన చేయిస్తుంది. దీన్ని అధ్యారోపం అంటారు.

తమాషా ఏమిటంటే నిజానికి నిర్గుణబ్రహ్మమీద సగుణబ్రహ్మను ఆరోపిస్తాము. అసలు అధ్యారోపం అంటే అది. కాని ఇక్కడ ఉపాసన సౌలభ్యంకోసం దీనికి వ్యతిరేకంగా అంటే సగుణప్రతీకమీద నిర్గుణబ్రహ్మ ఆవాహన చేస్తాము. ఇక్కడ ఈ పన్నెండవ ఖండంలో గాయత్రిని ప్రతీకగా తీసుకుంది ఉపనిషత్తు.

గాయత్రీ అంటే గాయత్రీ మంత్రం కాదు, గాయత్రీ ఛందస్సు. అసలు గాయత్రీ మంత్రం పేరు సావిత్రి. సవితా (సూర్య) దేవతను కొలిచే మంత్రం అది. గాయత్రీ ఛందస్సులో ఉంది కాబట్టి దానికి ఆ పేరు వచ్చింది. గాయత్రీ ఛందస్సులో మామూలుగా 8 అక్షరాల చొప్పున 3 పాదాలుంటాయి.

తత్సవితుర్వరేణ్యం
భర్గో దేవస్య ధీమహి
ధియో యో నః ప్రచోదయాత్॥

జపం చేయటానికి వీలుగా ఓం భూః భువః సువః అక్షరాలు కలుపబడ్డాయి. అలా 8×3=24 అక్షరాలు ఉంటాయి కాని, ఇక్కడ గాయత్రిని 6×4=24 గా తీసుకుంది. అంటే 6 అక్షరాల చొప్పున 4 పాదాలుగా తీసుకుంది. ఎందుకు? బ్రహ్మను చతుష్పాదబ్రహ్మ అంటారు. అంతటా బ్రహ్మ ఉన్నాడు కాబట్టి, గాయత్రి అంతటా ఉన్నట్టు తీసుకుంటాం.

**గాయత్రీ వా ఇదగ్ం సర్వమ్**

గాయత్రీ పరిమితమైనదే అయినా, సర్వవ్యాపకమైన బ్రహ్మను ఆవాహన చేస్తాము కాబట్టి, గాయత్రి కూడా సర్వాత్మకం. అందుకే దీన్ని **సర్వాత్మక రూపేణ గాయత్రీ ఉపాసన** అంటారు. గాయత్రిని మొత్తం జగత్తుకి ఆధారంగా చూపించటానికి ఉపనిషత్తు ఒక కల్పన చేసింది. గాయత్రి ఛందస్సులోని ఒక్కొక్క పాదం ఒక్కొక్క రూపంలో ఆధారం అయింది.

1. వాగ్ రూపేణ – మాటలు సమస్త సంబంధాలకు ఆధారం
2. పృథివీరూపేణ – పృథివి సమస్త జీవకోటికి ఆధారం
3. శరీరరూపేణ – శరీరం సమస్త అంగాలకు ఆధారం
4. హృదయరూపేణ – హృదయం నాలుగు అంతఃకరణాలకు, పంచప్రాణాలకు ఆధారం.

సగుణబ్రహ్మ, నిర్గుణబ్రహ్మ – ఈ రెండింటిలో ఏది ఎక్కువ అంటే సగుణబ్రహ్మ అనుకుంటాం. కాని వేదాంతం సగుణబ్రహ్మ అనిత్యం అనీ, మిథ్య అనీ, దుఃఖహేతువు అనీ; నిర్గుణబ్రహ్మ నిత్యం అనీ, శాశ్వతం అనీ, ఆనందహేతువు అనీ చెబుతున్నది. నిర్గుణబ్రహ్మ పరిమాణం కూడా ఎక్కువే. నిజానికి ఇలా భాగాలు లేవు. బ్రహ్మ నిరవయవం. మరయితే, ఎందుకు భాగాలుగా వాడటం? జగత్ మిథ్య, బ్రహ్మ సత్యం అని నిరూపించటానికి. మిథ్య సత్యంలో ఒక భాగం కాలేదు. కలలో ఉన్న డబ్బులను ఇలలో ఉన్న డబ్బులతో కలపలేము. అలాంటి నిత్య, నిరవయవ, సర్వాత్మక బ్రహ్మను గాయత్రీమీద ఆవాహన చేయాలి.

నిర్గుణబ్రహ్మ ప్రతిబింబ చైతన్యాలను ప్రపంచపరంగా మూడుగా విభజించింది శాస్త్రం. వీటిని మూడు అవస్థల్లో అనుభవిస్తాము.

| | | |
|---|---|---|
| స్థూలప్రపంచం | – విరాట్ | – జాగ్రదవస్థ |
| సూక్ష్మప్రపంచం | – హిరణ్యగర్భ | – స్వప్నావస్థ |
| కారణప్రపంచం | – ఈశ్వరుడు | – సుషుప్తి అవస్థ |

మూడు పేర్లతో వ్యవహరిస్తున్న ఈ బ్రహ్మ చైతన్యాన్ని మూడు రకాల ఆకాశంతో పోల్చింది శాస్త్రం. బహిరాకాశంలో ఉంది కాబట్టి, దాన్ని విరాట్‌తో పోల్చవచ్చు. స్వప్నప్రపంచం మీలోనే ఉంది. అంటే శరీర ఆకాశం స్వప్నప్రపంచానికి ఆధారం. హిరణ్యగర్భ స్వప్నప్రపంచానికి ఆధారం, శరీర ఆకాశం స్వప్నప్రపంచానికి ఆధారం కాబట్టి శరీర ఆకాశాన్ని హిరణ్యగర్భతో సుషుప్తిలో, మన ఇంద్రియాలు, మనస్సుతో సహా హృదయంలో లయం చెందుతాయి. కారణప్రపంచం హృదయాకాశంలో ఉంది. హృదయాకాశం కారణప్రపంచానికి ఆధారం. ఈశ్వరుడు కారణప్రపంచానికి ఆధారం. అందువల్ల హృదయాకాశాన్ని ఈశ్వరునితో పోల్చవచ్చు.

| | |
|---|---|
| బహిరాకాశం | – విరాట్ |
| శరీరాకాశం | – హిరణ్యగర్భ |
| హృదయాకాశం | – ఈశ్వరుడు |

ఈ మూడింటిలో దేనిమీద ఉపాసన చేయాలి? ఈశ్వరుడు మాత్రమే శుద్ధం అంటున్నారు శంకరాచార్యులు. మిగతా రెండూ దుఃఖమిశ్రితం. జాగ్రత్ ప్రపంచంలో, స్వప్నప్రపంచంలో సుఖం, దుఃఖం రెండూ ఉన్నాయి. కాని సుషుప్తిలో శుద్ధ ఆనందం ఉంది. కాబట్టి ఈశ్వరధ్యానం హృదయాకాశంలో చేయాలి. అందువల్ల దీన్ని దహరాకాశ ఉపాసన అని కూడా అంటారు. హృదయంలో ఈశ్వరుడు ఉన్నాడంటే హృదయంలో మాత్రమే కాదు, హృదయంలో దొరుకుతాడని అర్థం చేసుకోవాలి. ఆయన సర్వవ్యాపకం, నిత్యం, నాశరహితం.

**ఫలం** – ఈ గాయత్రీ బ్రహ్మ ఉపాసన హృదయంలో చేస్తే ఇహలోక ఫలంగా నిత్యమైన ఐశ్వర్యం వస్తుంది. అంటే ఐశ్వర్యం వస్తుంది కానీ వెళ్ళదు. పరలోక ఫలం క్రమముక్తి. బ్రహ్మలోకానికి వెళ్ళి అక్కడనుంచి మోక్షం పొందుతాడు.

## ఖండం 3.13 – 3 ద్వారపాలకుల ఉపాసన

3. **పంచ ద్వారక ఉపాసన** – ఇంకో అందమైన ఉపాసన. కాల్పనిక ఉపాసన. ముందు ఖండంలో హృదయాకాశం = బ్రహ్మ అని చూశాము. బ్రహ్మ అంటే మాయాసహిత బ్రహ్మ లేదా కారణరూపబ్రహ్మ. మాయాసహితబ్రహ్మను ఈశ్వరుడు అంటారు. హృదయం ఈశ్వరస్థానం అవుతుంది.

**ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి** – గీత 18.61

అందువల్ల హృదయాన్ని స్వర్గలోకం అంటారు. స్వర్గలోకం అంటే బ్రహ్మలోకం. శాస్త్రం ప్రకారం మనం రోజూ ఈశ్వరలోకానికి వెళుతున్నాము. అందువల్ల ముక్తి పొందుతున్నాము సుషుప్తిలో.

**ఫలం** – ఈ ఉపాసన ఫలం కూడా ఈశ్వరప్రాప్తి లేదా బ్రహ్మలోకప్రాప్తి. ముందు ఉపాసనకీ, దీనికీ సంబంధం తీసుకురావటానికి మళ్ళీ అది చెప్పటం జరిగింది.

ప్రతి లోకానికీ ద్వారం కావాలి. బ్రహ్మలోకానికి కూడా పంచద్వారాలు ఉన్నాయి. ఎక్కడ ద్వారం ఉంటే అక్కడ ద్వారపాలకులు ఉంటారు. ఇక్కడ బ్రహ్మలోకానికి ఒక్కొక్క ద్వారానికి ముగ్గురు దేవతలు ఉన్నారు. ఉపనిషత్తు ద్వారానికి **సుషి** అనే పదాన్ని వాడుతున్నది. ఇక్కడ స్వర్గం హృదయం అని మర్చిపోకూడదు. ఈ ద్వారపాలకులని ఉపాసిస్తే, ప్రతిబంధకాలు కల్పించకుండా ఉంటారు.

ఈశ్వరప్రాప్తి విషయే ప్రతిబంధాన్ న కుర్వన్తి

పంచద్వారపాలక ఉపాసన.

| **మంత్రం** | **ద్వారం** | **ద్వారపాలకులు** | **ఉపాసన విధానం** | **ఫలం** |
|---|---|---|---|---|
| 1 | తూర్పు | ప్రాణం,చక్షువు, ఆదిత్యుడు | తేజస్సు, అన్నాద్యం | తేజస్వీభవతి అన్నాదోభవతి |
| 2. | దక్షిణం | వ్యానం,శ్రోత్రం, చంద్రుడు | శ్రీ, యశస్సు | శ్రీమాన్ భవతి యశస్వీభవతి |

| | | | | |
|---|---|---|---|---|
| 3. | పడమర | అపానం,వాక్కు, అగ్ని | బ్రహ్మవర్చస్సు, అన్నాద్యం | బ్రహ్మవర్చసీ భవతి అన్నాదో భవతి |
| 4. | ఉత్తరం | సమానం, మనసు, మేఘం | కీర్తి, వృష్టి | కీర్తిమాన్ భవతి వృష్టిమాన్ భవతి |
| 5. | ఊర్ధ్వం | ఉదానం,వాయువు, ఆకాశం | ఓజస్సు,మహత్తు | ఓజస్వీ భవతి మహస్వాన్ భవతి |

**ఫలం** – అదనంగా ఇంకొకటి చెబుతున్నది ఉపనిషత్తు. అతని కులంలో పుత్రులు వీరులుగా పుడతారు. వీరులు అంటే వీరత్వం ఒకటే కాదు, మంచి విలువలతో ఉంటారని అర్థం. శంకరాచార్యులవారు ఈ పంచద్వారపాలక ఉపాసన స్వతంత్ర ఉపాసన కాదనీ, గాయత్రీ బ్రహ్మ ఉపాసనలో ఒక భాగంగా చేయాలని చెబుతున్నారు.

## ఖండం 3.13 – 4 జ్యోతి ఉపాసన

4. **జ్యోతి రూపేణ ఉపాసన** – ఇది ఖండం 13లోని ఇంకొక ఉపాసన. ఇది స్వతంత్ర ఉపాసన. ఇది కూడా బ్రహ్మ ఉపాసనే. జ్యోతిరూపేణ ఉపాసన. జ్యోతి అంటే ప్రకాశం; చైతన్యజ్యోతి, సర్వగతచైతన్యం, సర్వగతజ్యోతి ఉపాసనకు ఆంతరజ్యోతి ఆలంబన.

### ఆంతరజ్యోతి రూపేణ సర్వగత బ్రహ్మజ్యోతి ఉపాసన

ముందు ఉపనిషత్తు బ్రహ్మజ్యోతి వర్ణన చేస్తున్నది. బ్రహ్మజ్యోతి అన్ని లోకాలకు అతీతంగా ఉంది. సగుణ సృష్టికి అతీతంగా నిర్గుణ చైతన్యరూపంలో బ్రహ్మ ఉంది. ఈ సర్వగతజ్యోతి శరీరంలో ఉంది. దాన్ని ఆంతరజ్యోతి అంటారు. దాన్ని గుర్తించటానికి ఉపనిషత్తు రెండు పరీక్షలు చెబుతున్నది.

1. **సంస్పర్శేనోష్ణిమానం విజానాతి** – ఉష్ణరూపేన అనుభూయతే– ముట్టుకుంటే శరీరంలోని వేడి తెలుస్తుంది.

2. **శృతిః** – చెవులు మూసుకుంటే, లోపల హెూరు వినిపిస్తుంది. ఆ శబ్దాన్ని ఓంకారం అంటారు కొందరు. అనాహత రూపమంటారు కొందరు. ఆ శబ్దం ఎలా ఉంటుందో చెప్పటానికి మూడు ఉదాహరణలనిస్తున్నది ఉపనిషత్తు.

ఎ) **నినదమివ** – పరుగెడుతున్న రథం చప్పుడులాగా ఉంటుంది. ఇప్పటి కాలమాన పరిస్థితుల దృష్ట్యా రైలు పరుగెడుతున్న చప్పుడుతో పోల్చవచ్చు.

బి) **నదథురివ** – ఎద్దు అరిచే అరుపు.

సి) **ఆగ్నేరివ జ్వలత** – మండుతున్న అగ్ని చేసే శబ్దం.

**దృష్టం చ శ్రుతం చ** – అందువల్ల ఎవరైనా ఈశ్వరుని చూశావా అంటే స్పర్శద్వారా తెలుసుకున్నాను. శబ్దంద్వారా తెలుసుకున్నాను అని చెప్పవచ్చు.

అందువల్ల ఈ ఉపాసనను **ఆంతరజ్యోతిః దృష్టశ్రుత రూపేణ బ్రహ్మణ ఉపాసన** అనవచ్చు.

## ఖండం 3.14 – 5 బ్రహ్మ ఉపాసన

5. **శాండిల్య విద్య** – ఇది కూడా బ్రహ్మ ఉపాసన. బ్రహ్మ ఉపాసన అన్నప్పుడల్లా సాధారణంగా సగుణబ్రహ్మ ఉపాసన లేదా మాయాసహిత బ్రహ్మ ఉపాసన లేదా ఈశ్వర ఉపాసన అని అర్థం చేసుకోవాలి. దీన్ని శాండిల్య విద్య అని కూడా అంటారు. శాండిల్య అనే ఋషి కనుగొన్నది కాబట్టి శాండిల్య విద్య అంటారు. విద్య అంటే ఇక్కడ ఉపాసన. ఇది అత్యంత ముఖ్యమైన ఉపాసన.

ఇక్కడ ఈశ్వర ఉపాసన ప్రతీకమీద కాదు; సర్వగుణ విశిష్ఠ ఈశ్వరునిమీద ఉపాసన. ఈ ఉపాసన విశిష్టాద్వైతులకు చాలా అనుకూలంగా ఉంటుంది. వారు నిర్గుణబ్రహ్మను అంగీకరించరు. నిర్గుణబ్రహ్మ అంటే, వారి ఉద్దేశ్యంలో దుష్టగుణం లేని బ్రహ్మ.

నిర్గుణం = దుర్గుణం లేనిది

దానికి ప్రమాణంగా విశిష్టాద్వైతులు శాండిల్య విద్యను చూపిస్తారు.

**సర్వం ఖల్విదం బ్రహ్మ । తజ్జలాన్ । ఇతి శాంత ఉపాసీత।।**

**సర్వం ఖల్విదం బ్రహ్మ – అంతా బ్రహ్మే.** ఏమిటి కారణం? ఉపనిషత్తే కారణం ఇస్తున్నది. బ్రహ్మే జగత్తురూపంలో ఉన్నాడు. ఎలాగైతే అలకు సముద్రం సృష్టి, స్థితి, లయ కారణమో అలా జగత్తుకి సృష్టి, స్థితి, లయ కారణం బ్రహ్మే.

ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. మనం జగత్తు మిథ్య అన్న విషయం పట్టించుకోవటం లేదు. జగత్తు మిథ్య అని చెప్తే అది జ్ఞానం అయిపోతుంది. ఇక్కడ మనం జ్ఞానం గురించి పట్టించుకోవడం లేదు. మనకి కావాల్సింది విరాట్ ఉపాసన. అందుకని ఉపనిషత్తు ఉన్నదంతా బ్రహ్మే అంటున్నది.

**భూః పాదౌ యస్య నాభిర్వియదసురనిలశ్చంద్రసూర్యౌ చ నేత్రే।**
**కర్ణావాశాశ్శిరో ద్యౌర్ముఖమపి దహనో యస్య వాస్తేయమబ్ధిః॥**

**తజ్జలాన్** – ఈ కారణంవల్ల బ్రహ్మకు ఒక అద్భుతమైన పేరు ఇచ్చింది. అది తజ్జలాన్.

**తస్మాత్ జాయతే ఇతి తజ్జం.** బ్రహ్మనుంచే అన్నీ పుట్టాయి. తజ్జం. జ్జం అంటే పుట్టాయి.
**తస్మిన్ లీయతే ఇది తల్లం.** అన్నీ అందులో లయమవుతాయి. తల్లం అంటే లయం.
**తేన అనితి** – అనితి అంటే స్థితి కారణం. దాన్ని తద్య అంటారు. తిష్టతి అని అర్థం. బ్రహ్మే స్థితి కారణం.

**తజ్జం, తల్లం, తదన్ = తజ్జం చ, తల్లం చ, తదన్ చ = తజ్జలాన్**

**తత్ (జ+ల+అన్) = జ=సృష్టి, ల=లయ, అన్=స్థితి, తజ్జలాన్.**
అందువల్ల ప్రపంచం తజ్జలాన్.

ఇతి శాన్తః ఉపాసీత = తజ్జలాన్ = మొత్తం జగత్తుయొక్క సృష్టి, స్థితి, లయకారణం మీ మనసులోకి రావాలి. శాన్తః – జగత్కారణం బ్రహ్మ గురించి ఉపాసన చేయాలంటే తాత్కాలికంగా మీ చిన్న కుటుంబ సమస్యలు, రాగద్వేషాలు మర్చిపోవాలి.

ఉపాసన ఉద్దేశ్యమే అది. వ్యష్టిగా మర్చిపోయి, సమష్టి సృష్టి గురించి ఉపాసన చేయాలి. శాంతః అంటే రాగద్వేషాలను వదిలేయాలి కాసేపైనా.

**ఉపాసన ఉద్దేశ్యం** – ఇది చాలా ముఖ్యం. ఇందులో ప్రతిపదమూ ముఖ్యమే. ఒక వ్యక్తి ఎలా అనుకుంటే, అలా అవుతాడు. అతని నమ్మకం ఎలా ఉంటే, అతని భవిష్యత్తు అలా ఉంటుంది.

మరణానంతరం బ్రహ్మలోకం వెళతాడు. దీన్ని క్రమముక్తి అంటారు. సర్వగుణ విశిష్ట ఈశ్వరునిమీద ఉపాసన కాబట్టి కొన్ని గుణాలను పేర్కొంటున్నది ఉపనిషత్తు.

**మనోమయః** – వ్యష్టి మనస్సులన్నీ సమష్టి మనస్సుకి చెందినవి.

**ప్రాణశరీరః** – అన్ని స్థూలశరీరాలూ ఈశ్వరుని స్థూలప్రపంచం. అన్ని సూక్ష్మశరీరాలూ ఈశ్వరుని సూక్ష్మప్రపంచం.

**భారూపః** – చైతన్యస్వరూపం. సగుణబ్రహ్మలో చైతన్యం+రూపం ఉంది.

**సత్య సంకల్పః** – సంకల్పాలు ఎప్పుడూ సత్యమైనవి.

**ఆకాశాత్మ** – ఆకాశమే శరీరంగా ఉన్న బ్రహ్మ ఒక అర్థం. ఇంకొక అర్థం ఆకాశంలాగా రూపం లేనిది.

**సర్వకర్మా** – అన్ని కర్మలూ ఆయనకే చెందుతాయి.

**సర్వకామః** – అన్ని కోరికలూ ఆయనకే చెందుతాయి.

**సర్వగంధః** – అన్ని వాసనలూ ఆయనకే చెందుతాయి.

**సర్వరసః** – అన్ని రుచులూ ఆయనకే చెందుతాయి.

**సర్వమిదమభ్యాత్తః** – అభ్యత్తః అంటే సర్వవ్యాపకం. ఒక్కముక్కలో చెప్పాలంటే ఈశ్వరుడు సర్వవ్యాపకం.

**అవాక్యనాదరః** – ఇక్కడ నిశ్శబ్దంగా నిర్గుణస్వరూపం కూడా సూచించబడింది.

అవాకీ అంటే వాగింద్రియం లేనివాడు. అంటే సర్వేంద్రియాలు లేనివాడు అని అర్థం తీసుకోవాలి.

అనాదర అంటే శాంతస్వరూపుడని అర్థం. ఎన్నో ఈశ్వర ఉపాసనలు ఈ ఖండంలో ఉన్నాయి.

**ఏషమ ఆత్మాఽ౽న్తర్హృదయే** – ఈ ఈశ్వరుడే నా స్వరూపం. ఎక్కడ ఉన్నాడు. నా హృదయంలో ఒక చిన్న స్థలాన్ని ఆక్రమించుకున్నాడు. ఎంత సూక్ష్మంగా ఉన్నాడు?

**వ్రీహి, యవ, సర్షప, శ్యావహకా, శ్యామాకతండుల** – అనేక సూక్ష్మమైన ధ్యానాలకన్నా ఈశ్వరుడు చాలా సూక్ష్మం. కాని నిజానికి,

**జ్యాయాన్ప ృథివ్యా జ్యాయానంతరిక్షాజ్జ్యాయానివో లోకేభ్యః** – ఆయన పృథికన్నా పెద్ద, భువర్లోకంకన్నా పెద్ద, సువర్లోకంకన్నా పెద్ద; అసలు 14 లోకాలకన్నా పరిమాణంలో పెద్ద.

**అణోరణీయాన్మహతో మహీయాన్** – కఠ 1.2.20

కొన్ని వర్ణనలు సగుణబ్రహ్మకు, కొన్ని నిర్గుణబ్రహ్మకు వర్తిస్తాయి. ఈశ్వరుని వర్ణనలో సగుణ, నిర్గుణ రూపాల కలగలిపిన వర్ణన చూశాము కదా, ఇప్పుడు ఉపాసనలో సగుణ కలపాలా వద్దా? సగుణ గుణాలను కలపాలి అంటున్నారు శంకరులవారు. ఎందుకంటే ఇది జ్ఞానకాండ కాదు, బ్రహ్మస్వరూపం తెలుసుకోవటం లేదు. బ్రహ్మ ఉపాసన చేస్తున్నాము. అందుకని సర్వగుణ విశిష్ట ఈశ్వర ఉపాసన చేయాలి. సర్వగుణాలు వర్ణించేది సగుణ బ్రహ్మకే.

ఫలం పరంగా చూసినా కూడా ఇది సగుణబ్రహ్మ ఉపాసనే; ఫలంలో మరణానంతరం క్రమముక్తి వస్తుంది అంటున్నది ఉపనిషత్తు. క్రమముక్తి వచ్చేది సగుణ ఉపాసకునికే. అతను బ్రహ్మలోకానికి వెళ్ళి, అక్కడ క్రమముక్తి పొందుతాడు. కాకపోతే ఈ ఫలం ఈ ఉపాసనమీద ఏమాత్రం సంశయం లేకుండా శ్రద్ధ ఉన్నవానికే వస్తుంది.

## ఖండం 3.15 – 6 విరాట్ ఉపాసన

6. **కోశరూపేణ విరాట్ ఉపాసన** – ఇందులో రెండు భాగాలు ఉన్నాయి. ప్రధాన ఉపాసన, జపం. ఉపాసన అంగీ, జపం అంగం.

ఈ ఉపాసన విరాట్ ఉపాసన. ఎటువంటి విరాట్? కోశరూపంలో ఉన్న విరాట్. కోశం అంటే నిధి ఉన్న భాండాగారం. దీని ఫలం ప్రత్యేకంగా ఉంది. పుత్రమరణ అభావ – పుత్రుని మృత్యుదోషం ఉండదు. అంతులేని సంపద ఉన్న ఒక కుండని ఊహించుకోండి. ఆ కుండకు అడుగుభాగం భూమి, లోపలి స్థలం భువర్లోకం, కుండ మూతిభాగం సువర్లోకం. ఈ కుండ పది దిక్కులకూ వ్యాపించి ఉంది. అంతేకాదు, అంతులేని నిధులతో నిండి ఉంది. ఈ కుండని విరాట్ అనుకుంటే విరాట్ అనే కుండలో జగత్తులోని నిధులన్నీ నిండివున్నాయి. ఈ విరాట్ కుండ జీవికి ఇవ్వబడింది. ఎందుకు? కర్మఫలాన్ని అనుభవించటానికి. అటువంటి విరాట్ ఉపాసన చేయాలి.

జగత్తుని వర్ణించటానికి నాలుగు దిక్కులు తీసుకుని వాటికి పేర్లు పెట్టింది ఉపనిషత్తు. ఇలా అన్ని దిక్కులకూ అధిపతి అయిన విరాట్ ఉపాసన చేయటంవల్ల ఏదైనా పోయినా మనం బాధపడకూడదు. ఆయన ఇచ్చిన నిధులతో ఆడుకున్నాము, ఆయనే తిరిగి తీసుకున్నాడు అనుకుంటాము.

**ఫలం** – పుత్రశోకం ఉండదు.

**జపం** – పుత్రునికి దీర్ఘాయుష్షు కోరుతూ జపం చేయాలి. ఎవరిని కోరుతూ? కోశరూప విరాట్ శోకాన్ని ఇవ్వకూడదని శరణు వేడుతూ చేయాలి. ఒక్క విరాట్‌నే కాదు. ఆయనతో కలిపి ఐదుగురినుంచి కోరుతున్నాము.

**ఉపాసన ఉద్దేశ్యం:** ఇది చాలా ముఖ్యం. ఇందులో ప్రతిపదమూ ముఖ్యమే. ఒక వ్యక్తి ఎలా అనుకుంటే, అలా అవుతాడు. అతని నమ్మకం ఎలా ఉంటే, అతని భవిష్యత్తు అలా ఉంటుంది.

## ఖండాలు 3.16, 3.17 – 7 పురుషస్య యజ్ఞకల్పన

7. **పురుష యజ్ఞకల్పన** – పురుష అంటే ఆత్మ కాదు, శరీరం. శరీరాన్ని కార్యకరణసంఘాతం అంటారు. దీనికి ఫలం దీర్ఘాయుష్షు. ఇందులో మొత్తం జీవితాన్ని ఒక యజ్ఞంలాగా ఎలా చూడాలో చెబుతున్నది. జీవితాన్ని మూడు భాగాలుగా విభజించింది ఉపనిషత్తు. వైదికజీవనం గడిపే వ్యక్తి మూడు సంధ్యల్లో మూడు ప్రార్థనలు చేయాలి. ఆయా సంధ్యల్లో చేసే ప్రార్థనను సవనం అంటారు. అంటే ప్రాతః సవనం, మాధ్యందిన సవనం, సాయం సవనం అంటారు.

ఉపనిషత్తు జీవితాన్ని మూడు సవనాలతో పోల్చి, వాటిని ఒక్కొక్క ఛందస్సుతో పోల్చింది. ఆ ఛందస్సుకు ఉన్న అక్షరాల సంఖ్య సంవత్సరాల సంఖ్య అవుతుంది. ఒక్కొక్క ఛందస్సుకు ఒక్కొక్క అధిష్ఠానదేవత ఉంటుంది. ఈ మూడు ఛందస్సులు సంధ్యాసవనంలో వస్తాయి.

**పురుషస్య యజ్ఞకల్పన**

| జీవితకాలం | సం॥ | సవనం | చంధస్సు | సంఖ్యలు | దేవత |
|---|---|---|---|---|---|
| 1-24 | 24 | ప్రాతఃసవనం | గాయత్రీ | 24 | వసువు |
| 25-68 | 44 | మాధ్యందినం | త్రిష్టుప్ | 44 | రుద్రుడు |
| 69-116 | 48 | సాయం | జగతీ | 48 | ఆదిత్యుడు |

ఇటువంటి కల్పన చేయటంవల్ల జీవితంమీద ఒక పవిత్రభావన ఏర్పడుతుంది.

ఒక్కొక్క ఛందస్సుకు ఆయా దేవతలు ఎందుకు అన్నది ఉపనిషత్తు చెప్పలేదు కాని శంకరాచార్యులు వివరణ ఇచ్చారు. జీవితానికి షడ్వికారాలు ఉన్నాయి. అవి అస్తి, జాయతే, వర్ధతే, విపరిణమతే, అపక్షీయతే, వినశ్యతి.

1-24 సంవత్సరాల్లో అస్తి, జాయతే, వర్ధతే - ఈ సంవత్సరాల్లో ఉత్సాహంతో ఉరకలు వేస్తుంటాము. వసువు అలా ఉరకలు వేయిస్తుంటాడు.

**వాసయతి ఇతి వసుః**

25-68 సంవత్సరాల్లో విపరిణమతే - అపక్షీయతే - ఈ సంవత్సరాల్లో మార్పులు ఏర్పడి,ఆరోగ్యం క్రమంగా క్షీణిస్తూ వస్తుంది. నడుము నొప్పి, కీళ్ళనొప్పులు, మధుమేహం, రక్తపోటులాంటి వ్యాధులు నెమ్మదిగా చోటు చేసుకుంటాయి. రుద్రుడు ఏడిపిస్తాడు.

**రోదయతి ఇతి రుద్రః**

69-116 సంవత్సరాల్లో వినశ్యతి. మృత్యువుని సమీపిస్తాము. అన్నీ సర్దుకుని ప్రయాణం అయినట్టుగా, అంతిమ ప్రయాణానికి సిద్ధం కావాలి. ఆదిత్యుడు తన సమీపానికి పిలుస్తాడు.

**ఆదత్తే స్వసమీపం ఇతి ఆదిత్యః**

శాస్త్రం ప్రకారం మనిషి పరిపూర్ణ ఆయుర్దాయం 116 సంవత్సరాలు. అందుకని ఈ 116 సంవత్సరాల జీవితయజ్ఞం నిర్విఘ్నంగా కొనసాగాలంటే ఆయా దేవతలకు ప్రార్థన చేయాలి.

**మా విలోప్సీయేత్** - ఏ వయస్సులో ఆరోగ్య సమస్య వస్తే ఆ వయస్సులోని అధిష్ఠానదేవతకు ప్రార్థన చేసి, నా యజ్ఞానికి ఆటంకం రానీయకు అని కోరాలి.

**అనుసంతనుత** - తర్వాత దశకి తీసుకువెళ్ళు అని వసువుకు, రుద్రునికి పూజ చేయాలి, ఆయా దశల్లో చివరిదశలో ఆదిత్యకు నన్ను ఈ యజ్ఞాన్ని సక్రమంగా నిర్వర్తించేలా చేయమని ప్రార్థించాలి. ఆరోగ్యం అన్నది భోగంకోసం కాదు, యజ్ఞంకోసం. మరిన్ని వివరాలు తరువాతి ఖండంలో చూస్తాము. అందుకని దీర్ఘాయుష్య ప్రాప్తికోసం ప్రార్థన చేయాలి.

**మంత్రం 6 – ఫలశ్రుతి** – ఐతరేయ మహిదాస ఋషి ఉదాహరణ ద్వారా వస్తుంది. తనకెప్పుడు ఆరోగ్య సమస్య వచ్చినా ఈ ఋషి ఆయా దేవతలకు ప్రార్థన చేశాడట. అఘద అంటే మందు. ఈ ప్రార్థనే గొప్ప మందు.

**స కిం మ ఏతదుపతపసి** – అనారోగ్యానికి సవాలు విసిరాడట, నన్నేం చేయగలరు మీరు అని.

**షోడశం వర్షశతం –** షోడశ అంటే 16, శతం అంటే 100; షోడశం వర్షశతం అంటే 1600 అనకూడదు. 116 సంవత్సరాలు జీవించాడు అతను.

116 సంఖ్య అంత ముఖ్యమైనది కాబట్టే మనవాళ్ళు డబ్బు కానుకగా ఇవ్వాలంటే, 116, 1116 అలా ఇస్తారు. ఈ ఉపాసన మహిదాసుని 116 సంవత్సరాలు జీవింపచేస్తే, అలా ఈ ఉపాసన ఎవరు చేసినా కూడా దీర్ఘాయుష్షు కలుగుతుంది.

ఎందుకు ఉపనిషత్తు జీవితాన్ని యజ్ఞంతో పోల్చిందో చెప్పటానికి ఐదు లక్షణాలను పేర్కొన్నది.

1. **అస్య దీక్షాః** – ఒక యజ్ఞం చేయాలంటే కొన్ని కఠిన నియమాలు పాటించాల్సి ఉంటుంది. ఆకలి, దాహం అనుకోకూడదు. ఆరోగ్యం గురించి బాధపడకూడదు. కష్టాన్ని ఓర్చుకోగలగాలి. జీవితంలో బాధామయ రోజులు, దీక్షా కాలంతో సమానం.

2. **యదశ్నాతి యత్పిబతి యద్రమతే** – యజ్ఞంలో మొదటి రోజులు కష్టంగా ఉంటాయి కాని, తరువాత అన్నపానీయాల నియమ విషయాలలో కొంచెం సడలింపు ఉంటుంది. అలాగే మన జీవితంలో కొన్ని రోజులు ఆడుతూ, పాడుతూ సాగుతాయి. బాగా తిని, తాగి, ఆనందంతో కేరింతలు కొడతాము. అలాంటి రోజులని యజ్ఞంలో చెప్పే ఉపసత్ వ్రతం రోజులు అనుకోవాలి. ఎంత అందమైన కల్పనో చూడండి.

3. **స్తుత శాస్త్రం** – యజ్ఞం చేసేటప్పుడు దేవతలను స్తుతిస్తాము. అది రెండు రకాల ప్రార్థన. సామవేదాన్ని గానం చేస్తారు. దాన్ని స్తుతి అంటారు. ఋగ్వేదాన్ని పఠిస్తారు. దాన్ని శాస్త్రం అంటారు. వేదపఠనం నలుగురితో కలిసి చేస్తారు. అందువల్ల సందడిగా ఉంటుంది. జీవితంలో కూడా కొన్ని సందర్భాలలో స్నేహితులు, బంధువులతో కలిసి ఆనందంగా వేడుకలు జరుపుకుంటారు. ఆ రోజులను స్తుతశాస్త్రంతో పోల్చవచ్చు.

4. **దక్షిణా** – ఏ యజ్ఞం చేసినా బ్రాహ్మణులకు దక్షిణ ఇవ్వకుండా యజ్ఞం పూర్తికాదు, పుణ్యం రాదు. అలాగే జీవితంలో కూడా విలువలను పాటించకపోతే జీవితం పూర్తికాదు,

పుణ్యం రాదు. ఇక్కడ ఉపనిషత్తు పేర్కొన్న విలువలు తపస్సు, దానం, ఆర్జవం, అహింస, సత్యవచనం. వీటిని దక్షిణతో పోల్చింది.

5. **మరణమేవాస్యావభృథః**– యజ్ఞం అంతా చేసి ముగిశాక, ముఖ్య బ్రాహ్మణుడు యాగశాలని దగ్ధం చేసి, వెనక్కి తిరిగి చూడకుండా అక్కడ్నుంచి వెళ్ళి– సమీపంలో ఉన్న నదిలోనో, సెలయేరులోనో స్నానం చేయాలి. ఆ స్నానాన్ని అవభృథః అంటారు.

ఒక వ్యక్తి జీవిత కాలమంతా ఒక యజ్ఞంలాగా గడిపాక, అతను మరణించినప్పుడు అతనికి అంతిమస్నానం చేయిస్తారు. అందుకని మరణమే అవభృథస్నానం. దీర్ఘాయుష్షు కలుగుతుంది. జీవితంమీద పూజ్యభావం ఏర్పడి, విలువలకి ప్రాముఖ్యత ఇస్తారు.

**మంత్రం 6:** ఈ జ్ఞానాన్ని ఎవరు పొందారు? గురువు ఘోర అంగిరసనుంచి దేవకీపుత్రుడైన శ్రీకృష్ణభగవానుడు పొందాడు. కృష్ణుడు నేర్చుకోవటమేమిటి? అప్పుడు ఘోర అంగీరసుడు ఉన్నాడా లాంటి ప్రశ్నల్లోకి వెళ్ళకూడదు. ఇది ప్రమాణం అని తెలుసుకుని, నేర్చుకోవటం ముఖ్యం.

జీవితమంతా ఒక యజ్ఞంలాగా జీవించాక, మరణకాలంలో ఏం చేయాలి?

**అక్షితమస్యచ్యుతమసి ప్రాణసగ్ంశితమసి –**
**అక్షితమసి** – ఓ దేవా నీవు క్షరరహితుడవు.
**అచ్యుతమసి** – ఓ దేవా నీవు నాశనరహితుడవు.
**ప్రాణసంశితం** – ఓ దేవా నీవు సూక్ష్మప్రాణరూపంలో ఉన్నావు.

దేవుని ప్రాణతత్త్వంగా కొలుస్తున్నాము. జీవితమంతా ఒక యజ్ఞంలాగా గడిపినప్పుడు, మన అంతిమలక్ష్యం భగవానుడే అవాలి కదా!

ఈ భాగాన్ని చూపించే రెండు ఋగ్ మంత్రాలను చెపుతున్నది ఉపనిషత్తు.

**మంత్రం 7:** ఇక్కడ ఋగ్ మంత్రంలోని మొదటి పాదమే ఉంది. తక్కిన రెండు పాదాలూ మనం కలుపుకోవాలి.

**ఆదిత్ప్రత్నస్య రేతసః**
**జ్యోతిః పశ్యన్తి వాసరం**
**పరోయదిధ్యతే దివి**

**రేతసః** అంటే జగత్కారణం బ్రహ్మ లేదా ఈశ్వరుడు. **దివి** అంటే మామూలుగా స్వర్గం. ఇక్కడ స్వర్గానికి అతీతంగా ఉన్నాడు. **పశ్యన్తి** అంటే తెలివైనవాళ్ళు నిరంతరం చూస్తారు.

ఎవరిని? నిర్గుణ బ్రహ్మ అనే అనుకోనవసరం లేదు. సగుణ బ్రహ్మకూడా తీసుకోవచ్చు. తెలివైన వారు అంటే జీవితాన్ని ఒక యజ్ఞంలాగా భావించేవాళ్ళు.

ఇంకో ఋగ్ మంత్రం. దీని సారాంశం కూడా ఇదే.

**జ్యోతిరుత్తమం** – చైతన్యం ఉత్తమమైన జ్యోతిస్వరూపం.

**దేవం దేవత్రా** – దేవతలలోనూ

**స్వః** – నాలోనూఉంది.

**స యశ్చాయం పురుషే యశ్చాసావాదిత్యే స ఏకః।** – తైత్తిరీయం

**సూర్యమగన్మ** – ఆ జ్యోతి స్వరూపాన్ని నిరంతరం చూడటంవల్ల (దాని గురించి ఉపాసన చేయటంవల్ల) నేను బ్రహ్మను అవుగాక. అవుగాక అంటే అహం బ్రహ్మాస్మి అని తెలుసుకోవాలి గాక.

ఈ మంత్రాలకూ జీవితాన్ని యజ్ఞంలాగా చేయటానికీ ఏమిటి సంబంధం?

నిరంతరం దేవుని తలచుకోవటం అంటే జీవితాన్ని యజ్ఞంలాగా చేయటం.

**సంపదో నైవ సంపదః విపదో నైవ విపదః।**

**విపద్ విస్మరణం విష్ణోః సంపద్ సంస్మరణం హరేః॥**

సంపద అంటే ఐశ్వర్యం. విపత్తు అంటే పేదరికం. కాని శాస్త్రం ప్రకారం అది కాదు అర్థం. విష్ణుమూర్తిని మర్చిపోవటం విపత్తు. విష్ణుమూర్తిని నిరంతరం తలచుకోవటం సంపద.

అందుకని సూర్యభగవానుని నేను గుర్తుంచుకుని, నా జీవితాన్ని యజ్ఞంలా మలచుకునేలా చేయి. అలా జీవితాన్ని యజ్ఞంలా మలుచుకోవాలి.

## ఖండాలు 3.18, 3.19 – 8 ప్రతీక ఉపాసనలు

8 **ప్రతీక ఉపాసనలు–** ఈ ఖండాల్లో రెండు ప్రతీక ఉపాసనలు చెబుతున్నది ఉపనిషత్తు. అధ్యాత్మ బ్రహ్మ ప్రతీక ఉపాసన, అధిదైవ బ్రహ్మ ప్రతీక ఉపాసన

ఈ రెండింటిలో ప్రతీక మారుతుంది కాని బ్రహ్మ ఒక్కటే.

మనో బ్రహ్మేత్యుపాసీతేతి –

### ఖండం 18 ఆధ్యాత్మ బ్రహ్మ ప్రతీక ఉపాసన

మళ్ళీ బ్రహ్మ ఉపాసనే. ఇది ప్రతీక బ్రహ్మ ఉపాసన. ఇంతకు ముందు చూసినట్టుగా మన ఆలయాల్లో చేసేది ప్రతీక ఉపాసన. బ్రహ్మ కనబడదు. ప్రతీక కనిపిస్తుంది. అందుకని కనపడే ప్రతీకమీద బ్రహ్మను ఆవాహన చేసి, దాని తర్వాతనుంచి ప్రతీకకి పూజ చేస్తాము ఆలయాల్లో. పూజ, అభిషేకం, అలంకారం అన్నీ రాతి విగ్రహానికి చేస్తాము.

ప్రతీక ఉపాసనలు రెండు చెపుతున్నది ఉపనిషత్తు.

**ఆధ్యాత్మ బ్రహ్మ ప్రతీక ఉపాసన**

**ఆధిదైవ బ్రహ్మ ప్రతీక ఉపాసన**

ఈ రెండింటిలో ప్రతీక మారుతుంది కాని బ్రహ్మ ఒకటే.

**మంత్రం 1:** ఈ మంత్రం ఈ రెండు ఉపాసనలను పరిచయం చేస్తున్నది.

**మనో బ్రహ్మేత్యుపాసీతేతి** – ఇది ఆధ్యాత్మ ఉపాసన. మనసుమీద బ్రహ్మను ఆవాహన చేస్తాము. దానివల్ల మనసుని గౌరవించటం నేర్చుకుంటాము. మనసు రాగద్వేషాలతో నిండి ఉండవచ్చు గాక, దానిమీద బ్రహ్మను ఆవాహన చేయటంవల్ల నికృష్ట వస్తువు కాస్తా ఉత్కృష్టబ్రహ్మ అవుతుంది. రాయి జడం, అది నన్ను దీవించలేదు అని తెలిసి కూడా దానికి ఎందుకు మొక్కుతాము? ఆ రాయిలో భగవంతుడిని ఆవాహన చేశాము కాబట్టి.
**ఆకాశో బ్రహ్మేతి ఉపాసీత** – ఇది ఆధి దైవ ఉపాసన. ఇక్కడ ఆకాశం అని అన్నా, ఖండం – 19లో ఆకాశంలో ఉన్న సూర్యుడిని బ్రహ్మగా ఉపాసన చేయమని చెబుతోంది.

**మంత్రం 2:** ఆధ్యాత్మ. ఆధిదైవ ఉపాసనల గురించిన వివరణ వస్తుంది ఈ మంత్రంలో. బ్రహ్మను చతుష్పాద బ్రహ్మ అంటారు తరచు. ఈ ఉపనిషత్తులోనే గాయత్రీ బ్రహ్మ ఉపాసన చూసినప్పుడు ఈ పదం వచ్చింది. మాండూక్య ఉపనిషత్తులో కూడా వస్తుంది.

| ఉపాసన | పాదాలు |
|---|---|
| **ఆధ్యాత్మ ఉపాసన** | వాక్కు, ప్రాణం, శ్రోత్రం, చక్షువు |
| **ఆధిదైవ ఉపాసన** | అగ్ని, వాయు, దిశ, ఆదిత్య |

ఆధ్యాత్మ ఉపాసన వ్యష్టిపరంగా కాబట్టి, వ్యష్టిలోని నాలుగు ముఖ్య అంగాలను తీసుకుంది. ఆధిదైవ సమష్టిపరంగా కాబట్టి, సమష్టిలోని నాలుగు ముఖ్యదేవతలను తీసుకుంది. అంతేకాదు వ్యష్టిపరంగా ఉన్న అంగాలకు సమష్టిపరంగా ఉన్న దేవతలు అధిష్ఠానదేవతలని తత్త్వబోధలో చూశాము. అంటే వాక్కుకి అగ్ని; ప్రాణానికి వాయువు; శ్రోత్రానికి దిశలు; చక్షువుకి ఆదిత్య అధిష్ఠానదేవతలు.

**మంత్రాలు 3-6:** ఇదే భావాన్ని విపులంగా చెపుతాయి. ఉపాసన ఫలం కూడా వస్తుంది. ఒకే బ్రహ్మను రెండు స్థాయిల్లో చూపిస్తున్నది ఉపనిషత్తు. వ్యష్టిపరంగా నాలుగు పాదాలు, సమష్టిపరంగా నాలుగుపాదాలు చూశాము. సమష్టి దేవతల దీవెనలవల్ల వ్యష్టి పనిచేస్తుంది.

**భాతి చ తపతి చ** – అగ్నివల్ల వాక్కు ప్రకాశిస్తుంది అంటే పనిచేస్తుంది. వాయువువల్ల ప్రాణం, ఆదిత్యవల్ల చక్షువు, దిశవల్ల శ్రోత్రం ప్రకాశిస్తున్నాయి. పనిచేస్తున్నాయి. తైత్తిరీయ

ఉపనిషత్తులో పాంక్త బ్రహ్మ ఉపాసనలో ఇదే విషయం చూశాము. అంటే వ్యష్టి సమష్టివల్ల ఎలా పనిచేస్తున్నదో చూశాము.

**ఫలం – కీర్త్యా యశసా బ్రహ్మవర్చసేన** – బాగా పేరు పొందుతాడు. కీర్తి, యశస్సు రెండూ ఒకటే అర్థం అయినా దానికి చిన్న వ్యత్యాసం ఉంది. కీర్తి అంటే మనం లేనప్పుడు పొగడటం. యశస్సు అంటే మన ఎదురుగా పొగడటం. ఎదురుగా ఉండగా పొగడ్త అందరం పొందుతాము కాని మనం ఎదురుగా లేనప్పుడు కూడా పొగడ్త పొందటం గొప్ప విషయం. బ్రహ్మవర్చస్సు అంటే తేజస్సు.

## ఖండం 19 అధిదైవ బ్రహ్మ ప్రతీక ఉపాసన

**అధిదైవ బ్రహ్మ ఉపాసన**

**మంత్రం 1:** ముందు ఖండంలో కూడా అధ్యాత్మ ఉపాసనతో కలిపి అధిదైవ బ్రహ్మ ఉపాసన గురించి చెప్పింది ఉపనిషత్తు. ఇప్పుడు అధిదైవ బ్రహ్మ ఉపాసన గురించి చూస్తాము. ప్రతీక ఉపాసన గురించి చెప్పటానికి శంకరులవారు, తక్కిన ఆచార్యులు కూడా 18, 19 ఖండాల గురించి తరచు చెబుతుంటారు. ఇది ప్రతీక బ్రహ్మ ఉపాసన పేరుతో ప్రఖ్యాతి చెందింది.

**ఆదిత్య ప్రతీకే బ్రహ్మ ఉపాసన** – ఈ ఉపాసన పేరు ఆదిత్య ప్రతీకే బ్రహ్మ ఉపాసన. ఇది స్వతంత్ర ఆది దైవ ఉపాసన.

సూర్యోదయాన్ని ఒక అద్భుతరూపంలో ఊహిస్తోంది ఉపనిషత్తు. బ్రహ్మాండం నుంచి బయటకి వచ్చే మొట్టమొదటి అంశం సూర్యుడు.

బ్రహ్మాండంనుంచి సూర్యుడు బయటకు రావటాన్ని అండంనుంచి ఒక పక్షి బయటకి రావటంతో పోలుస్తుంది. అది నాలుగు దశల్లో జరుగుతుంది.

**అసదేవేదమగ్ర ఆసీత్** – అవ్యక్తం దశ; **సదాసీత్** – వ్యక్తమవబోతున్న దశ; **తత్సమభవత్** – చిన్న అంకురం స్థాయిలో బయటకి రావటం. **అణ్డ కపాలే** – పూర్తిస్థాయిలో బయటకు రావటం.

**మంత్రం 2:** బ్రహ్మాండ ఉత్పత్తి జరిగేటప్పుడు కూడా అండంతో బ్రహ్మాండాన్ని పోల్చి, మరికొన్ని వివరాలు ఇస్తున్నది ఉపనిషత్తు.

| అండం | బ్రహ్మాండం |
|---|---|
| చిప్ప | ద్యులోకం – సూర్యకిరణాలవల్ల స్వర్ణమయంగా ఉంది. |
| క్రిందభాగం | పృథివి |

| | |
|---|---|
| పక్షి ధమనలు | నదులు, సముద్రాలు |
| బాహ్యరూపం | స్థూలప్రపంచం. |
| అంతరఃరూపం | సూక్ష్మప్రపంచం – మంచు బిందువులు, మేఘాలు |
| పగిలినపెంకులు | పర్వతాలు |

ఒక్కముక్కలో చెప్పాలంటే అండంలోంచి పక్షి వస్తే, బ్రహ్మాండం పగిలితే సూర్యుడు బయటకి వస్తాడు. ఇక్కడ సూర్యస్తుతి జరుగుతున్నది. సూర్యుడు ప్రథమపుత్రుడుగా కీర్తించబడుతున్నాడు.

**మంత్రం 3 – ఘోషా ఉలూలవ** – ప్రథమ పుత్రుడు పుడితే చాలా సందడి, కోలాహలం ఉన్నట్టే, సూర్యుడు బయటకి రాగానే, ఊర్లో, జీవితంలో సందడి మొదలవుతుంది. కోరికలన్నీ పుట్టుకువస్తాయి.

**మంత్రం 4 – ఫలం: ఆ చ గచ్ఛేయురుప చ నిమ్రేదేరన్। ఆగచ్ఛేయుః** అంటే మంచి శబ్దాలే వింటారు.

**భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః** – శాంతిపాఠం.

కొంతమంది ఎంతసేపూ చెడుమాటలే మాట్లాడుతారు. ఎంతసేపూ ఎదుటివారిని కించపరుస్తారు. కాని ఈ ఉపాసనలు చేసినవారి చెవిన అలాంటి మాటలు పడవు. సాధుఘోష వింటారు. నిమ్రేదేరన్ అంటే ఆనందం. ఆనందంగా ఉంటారు.

ఉప చ నిమ్రేదేరన్ని మ్రేదరన్ అని మళ్ళీ చెప్పటంవల్ల ఈ ఖండం ముగిసింది, ఈ మూడవ అధ్యాయం కూడా ముగిసింది అని అర్థం.

# ఏకాదశ ఉపనిషత్తుల సారం

## ఛాందోగ్యోపనిషత్ - అధ్యాయం 4

ఛాందోగ్యోపనిషత్తు అధ్యాయం 4 కూడా ఉపాసనలనే బోధిస్తుంది. వీటిని స్వతంత్ర ఉపాసనలు అంటారు. ఇందులో మూడు ఉపాసనలను, ఒక యజ్ఞవిధిని చూస్తాము. ఆ ఉపాసనల పేర్లు సంవర్గవిద్య, చతుష్పాద గుణవిశిష్ట బ్రహ్మవిద్య, అక్షిపురుషవిద్య. ఈ అధ్యాయంలో విద్య అంటే ఉపాసన. ఈ అధ్యాయంలో 17 ఖండాలు, 78 మంత్రాలు ఉన్నాయి. ఈ నేపథ్యంతో ఈ అధ్యాయాన్ని చూద్దాము.

### ఖండాలు 4.1-4.3 - 1 సంవర్గ విద్య

### ఖండం 4.1

1. **సంవర్గ విద్య** - ఈ ఉపాసనను సంవర్గవిద్య, సంవర్గ ఉపాసన, హిరణ్యగర్భ ఉపాసన, సూత్రాత్మ ఉపాసన అనికూడా అంటారు. సంవర్గ అంటే అన్నింటినీ తనలో లయం చేసుకునేది. అధిదైవపరంగా అధ్యాత్మపరంగా హిరణ్యగర్భ అన్నింటినీ తనలో లయం చేసుకునేటట్లు చేసే ఉపాసన ఇది. ఉపాసన గురించి చెప్పే ముందు, ఒక కథ చెబుతున్నది ఉపనిషత్తు. దాని ఉద్దేశ్యం గురుశిష్యులను పరిచయం చేసి, కొన్ని అర్హతలను ఎత్తి చూపటం.

జానశ్రుతి అనే రాజుని ముందు పరిచయం చేస్తుంది. ఆ రాజు ఒకరోజు తన రాజసౌధంలోనే పైభాగంలో విశ్రాంతి తీసుకుంటుండగా, కొన్ని హంసలు ఎగురుతూ మాట్లాడుకుంటున్నాయి. ఒక హంస ఇంకొక హంసతో జానశ్రుతికి మరీ దగ్గరగా ఎగరకు, అతని తేజస్సనే కాంతికి నువ్వు మాడగలవు జాగ్రత్త అంటుంది. ఇంకో హంస అడ్డుపడి, ఎందుకు అంత తక్కువ వ్యక్తిని కీర్తిస్తావు? ఏం అతను రైక్వుడంతటి గొప్పవాడా అంటుంది. ఆ రైక్వుడు ఎవరని ఆశ్చర్యపోయాడు రాజు.

ఈ రైక్వుడు హిరణ్యగర్భ ఉపాసకుడు. అతను హిరణ్యగర్భమీద అభేద ఉపాసన లేదా అహంగ్రహ ఉపాసన చేయటంవల్ల హిరణ్యగర్భతో సమానమవుతాడు. హిరణ్యగర్భ అంటే సమష్టి సూక్ష్మప్రపంచానికి అధిష్ఠానదైవం. హిరణ్యగర్భ ఉపాసన చేసిన వ్యక్తి ప్రపంచంలో అన్నింటినీ గెలుస్తాడు అని అర్థం. కాని ఉపనిషత్తు దీన్ని జూదంలోని పాచికలతో పోల్చి వివరిస్తున్నది.

జూదంలో వాడే పాచికలు పొడుగ్గా ఉండి, నాలుగు వైపులు కలిగి ఉంటాయి. నాలుగువైపులా ఒకటినుంచి నాలుగువరకూ నాలుగు అంకెలు ఉంటాయి. వాటికి జూదంలో పేర్లు ఉన్నాయి. ఒకవైపుని అయ అంటారు.

1 – కల్యయ (కలి+అయ); 2 – ద్వాపర్య (దాపర+అయ); 3 – త్రేతాయ (త్రేత+అయ); 4 – కృతాయ (కృత+అయ).

ఇందులో ప్రత్యేకత ఏమిటంటే పాచికలు విసిరినప్పుడు ఒక వ్యక్తికి 4 (కృతాయ) పడితే దాన్ని 4గా మాత్రమే తీసుకోరు. తక్కినమూడూ కలిపి దశ అంగాలు అంటారు. (4+3+2+1=10).

అలాగే త్రేతాయకి 3+2+1=6; ద్వాపరకి 2+1=3 కలికి 1. త్రేత వస్తే కృత రాదు. ఇదీ లెక్క. ఇక్కడ కృతాయ ఒక్కటే తీసుకుంది. కృతాయ వస్తే ఎలా తక్కిన అన్ని సంఖ్యలూ కూడా అందులో ఇమిడిపోతాయో, అలాగే హిరణ్యగర్భ ఉపాసన చేస్తే తక్కిన అన్ని యజ్ఞాలూ చేసినంత ఫలం. ఉదాహరణకు పుత్రకామేష్టి యజ్ఞం చేస్తే దాని ఫలం మాత్రమే వస్తుంది. దీనికి అలా కాదు.

కృత=10=హిరణ్యగర్భ (ఇది ఎలాగో తర్వాత వచ్చే మంత్రాల్లో చూస్తాము) రైక్వుడు హిరణ్యగర్భ ఉపాసన చేయటంవల్ల అంత గొప్పవాడయ్యాడు. ఒక మానవుడు చేసిన పుణ్యం కూడా అతనికే వెళుతుంది, అతను సమష్టి ప్రపంచం కాబట్టి. అలాంటప్పుడు జానశ్రుతి తేజస్సు గొప్పదని ఎలా చెప్పగలవు అని ఆ హంస ఉద్దేశ్యం.

మామూలుగా అయితే ఎవరైనా అలాంటి సందర్భంలో ఈర్ష్యతో రగిలిపోవటమో, కోపంతో మండిపడటమో చేస్తారు. కాని జానశ్రుతి దానికి భిన్నంగా ఆలోచించాడు. అటువంటి గొప్పవ్యక్తి ఉంటే, నేను అతన్నుంచి నేర్చుకోవాలి అనుకున్నాడు.

**మంత్రాలు 5, 6:** జానశ్రుతికి ఆ రైక్వుడు ఎవరోచూడాలని వెంటనే అనిపించింది. అతనినుంచి విద్య నేర్చుకోవాలి అనుకున్నాడు అతని రక్షక భటుడి దగ్గరకు వచ్చి, రైక్వుడు ఎవరో తెలుసా అని అడిగాడు. హంసలు చెప్పిన మాటలు మళ్ళీ అతను చెప్పి, రైక్వుని గురించి అడిగాడు.

**మంత్రాలు 7, 8:** రక్షక భటుడు తనకు తెలియదని, వెళ్ళి కనుక్కుంటాననీ, వెళ్ళాడు కాని తెలుసుకోలేకపోయాడు. రాజు దగ్గరకి వచ్చి అదే మాట చెపితే, వెళ్ళి బ్రాహ్మణులు ఎక్కడ ఉంటారో అక్కడ వెతకమని చెప్పాడు రాజు. పరోక్షంగా బ్రాహ్మణులు రాజప్రాకారాల్లో ఉండరని, మామూలు జీవనం గడుపుతారనీ చెపుతున్నాడు. శాస్త్రం ప్రకారం బ్రాహ్మణుడు అర్థకామాల వెంట పరుగులు తీయకూడదు. అప్పుడు మళ్ళీ వెతికితే, బండికింద కనపడతాడు.

**సామానం కషమాణం** – అతను ఉన్న ప్రదేశం మురికిగా ఉందని కాదు, హెచ్చులకు పోకుండా సాధారణంగా ఉందని అర్థం. మీరేనా రైక్వుడు అని అడిగితే అవునని చెప్పాడు. అంత గొప్ప ఉపాసకుడు, ఒక బండికింద ఉండకూడదు. అతన్ని గౌరవించాలి.

## ఖండాలు 4.2,4.3

**మంత్రాలు 1–5:** జానశ్రుతి రైక్వుని దగ్గరకి వెళ్ళాడు, హిరణ్యగర్భ ఉపాసన నేర్చుకోవటానికి. బోలెడు గురుదక్షిణ తీసుకువెళ్ళాడు. రాజు, దైవం, గురువుల దగ్గరికి వెళ్ళేటప్పుడు ఖాళీ చేతులతో వెళ్ళకూడదంటారు. ఇక్కడ రాజే గురువు దగ్గరకి గురుదక్షిణ తీసుకువెళ్ళాడు. ఆరువందల గోవులను, హారాన్ని, రథాన్ని తీసుకువెళ్ళాడు. కాని వాటికి లొంగక రైక్వుడు అతన్ని వెనక్కి పంపాడు. అప్పుడు రాజు మళ్ళీరెండోసారి ఇంకొంచెం ఎక్కువ గురుదక్షిణతో పాటు, తన కుమార్తెని కూడా తీసుకువెళ్ళి, కుమార్తెనిచ్చి వివాహం చేస్తానన్నాడు. రైక్వుడు సంన్యాసి కాదు. బ్రహ్మచారి. అతను ఉన్న ప్రదేశాన్ని కూడా దానం చేసి దాన్ని **రైక్వపర్ణ గ్రామం** అని పిలుస్తానన్నాడు. అప్పుడు రైక్వుడు అతనికి ఉపదేశం చేయటానికి ఒప్పుకున్నాడు. ఇంతే కథ.

కథద్వారా మనం గ్రహించవలసినవి కొన్ని అంశాలు ఉన్నాయి. ముందుగా కథకి అత్యంత ప్రాధాన్యత ఇవ్వకూడదు. ఇస్తే హంసలు మాట్లాడుకోవటం ఏమిటి? అది రాజు అర్థం చేసుకోవటం ఏమిటి ఇలాంటి అర్థం లేని అనుమానాలు వస్తాయి. అలాగని పూర్తిగా కొట్టి పారేయనూకూడదు. కథనుంచి నేర్చుకోవాల్సిన కొన్ని మంచి అంశాలను గ్రహించాలి. అవి –

1. శిష్యునికి ఉండాల్సిన అణకువ, శ్రద్ధ గురించి ముందే చూశాము.
2. రాజే స్వయంగా గురువు దగ్గరకి వెళ్ళాడు. కాని గురువుని తన దగ్గరకు పిలిపించలేదు.
3. గురుదక్షిణ తీసుకువెళ్ళాడు.

**తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్** – ముండక 1.2.12

సమిధలు తీసుకుని గురువు వద్దకి వెళ్ళాలి.

రైక్వుడు ముందు ఉపదేశం చేయటానికి ఒప్పుకోకుండా, రాజకుమార్తెను, మరింత గురుదక్షిణను ఇచ్చాక, ఒప్పుకున్నాడు. కాబట్టి రైక్వుడు సంపదలకు ఆశపడ్డాడు అనకూడదు. ఇది శాస్త్రాన్ని తప్పుగా అర్థం చేసుకోవటమే అవుతుంది. అలా తప్పుగా అర్థం చేసుకుంటే, శాస్త్రంమీద శ్రద్ధ ఏర్పడదు. శాస్త్రం చెప్పే అద్భుతబోధని పొందలేము. అందుకని ఎప్పుడూ సానుకూలంగా తీసుకోవాలి. దీనివల్ల కూడా రెండు అంశాలు తెలుస్తాయి.

4. ఏ ఉపనిషత్తు చూసినా, శిష్యుడు అడిగిన వెంటనే గురువు బోధ చేయడు. అతనిలో ఎంతమాత్రం శ్రద్ధ ఉందో, అతను ఎంత మేరకు అధికారో తెలుసుకుని కానీ చెప్పడు. కఠలో నచికేతుడు అడిగితే యమధర్మరాజు అతనికి పరీక్ష పెట్టి, అందులో గెలిచాకే బోధ చేస్తాడు.

5. జానశ్రుతి శ్రద్ధ తెలుస్తున్నది. అతను తన రాజ్యం మొత్తం ఇవ్వటానికి కూడా సిద్ధపడ్డట్టు తెలుస్తున్నది. రెండోసారి కూడా ఒప్పుకోకపోతే, అదే చేసి ఉండేవాడు. అర్థకామాలు కాదు ముఖ్యం. సంస్కృతి ముఖ్యం అని తెలుస్తున్నది. విద్యమీద శ్రద్ధ ముఖ్యం అనీ, దానికోసం అహంకారాన్ని తగ్గించుకోవాలనీ తెలుస్తున్నది.

**తస్మై హోవాచ –** గురువు చెప్పటానికి ఒప్పుకుని, అతనికి ఉపదేశం చేశాడు.

ఈ విధంగా గురుశిష్యులను పరిచయం చూశాక, సంవర్గ విద్య బోధ చూస్తాము.

### సంవర్జనాత్ సంవర్గః

సమష్టిపరంగా, వ్యష్టిపరంగా హిరణ్యగర్భలో అన్నీ ఎలా లయమవుతాయో చూపించే ఉపాసన ఇది. హిరణ్యగర్భని సమష్టిలో వాయురూపంలో కొలుస్తాము. వాయువు అన్నింటినీ లయం చేస్తాడు అని చెప్పటానికి నాలుగు దేవతలను తీసుకుంది ఉపనిషత్తు. అవి – అగ్ని, సూర్యుడు, చంద్రుడు, జలము. అగ్ని వాయువు వీస్తే చల్లారుతుంది; సూర్యచంద్రులు వాయువువల్లనే అస్తమిస్తున్నారు. అస్తమిస్తున్నారు అంటే వాయువులో లయమవుతున్నట్టు అర్థం. నీరు వాయువువల్లనే ఇంకిపోతున్నది. **వాయుర్వావ సంవర్గః** – ఇది అధిదైవ ఉపాసన.

అధ్యాత్మస్థాయిలో **ప్రాణో వావ సంవర్గః** ప్రాణశక్తిలో అన్నీ లయమవుతాయి. అధ్యాత్మ స్థాయిలో 4 శక్తులు – వాక్కు, చక్షువు, మనస్సు, శ్రోత్రం. ఈ నాలుగు సూక్ష్మశరీరంలోని 19 అంగాలకు ప్రతీకలు. సమష్టి సూక్ష్మప్రపంచానికి అధిష్ఠానదేవత వాయువు అయితే, వ్యష్టి సూక్ష్మశరీరానికి అధిష్ఠానదేవత ప్రాణం. ప్రాణశక్తి లేకపోతే ఇవేవీ పనిచేయవు. అంతేకాదు, సుషుప్తిలో ఇవేవీ పని చేయవు. ప్రాణశక్తి మాత్రమే మేలుకుని ఉంటుంది.

లయం చేసేదాన్ని అత్తా అనీ, లయమయ్యేదాన్ని అన్నం అనీ అంటారు. అధిదైవపరంగా అత్తా, అన్నం కలిపి 5, అధ్యాత్మపరంగా అత్తా, అన్నం కలిపి 5, మొత్తం 10 అంశాలు ఉన్నాయి హిరణ్యగర్భకు.

వాయువు, అగ్ని, సూర్యుడు, చంద్రుడు, జలం – అధిదైవం
ప్రాణం, వాక్కు, చక్షువు, మనస్సు, శ్రోత్రం – అధ్యాత్మం

సంవర్గవిద్య రెండుగా వాయురూపంలో, ప్రాణరూపంలో వచ్చింది.

హిరణ్యగర్భ గుణస్తుతి కొనసాగించటానికి ఉపనిషత్తు ఇంకో సంఘటన చెపుతున్నది. ఎందుకు? ఉపాసనలో కూడా గుణవిశిష్ట ఉపాసన చేయాలి.

ఇద్దరు బ్రహ్మచారులు కలిసి భోజనం చేస్తున్నారు. వారు శౌనకుడు అనే బ్రాహ్మణుడు, కాక్షసేని అనే క్షత్రియుడు. వారు తింటుండగా భిక్షాందేహి అని మూడో బ్రహ్మచారి వచ్చాడు. అతన్ని ఒక మామూలు వ్యక్తిగా వారు భావించి, అతన్ని పరీక్షించటానికి భిక్ష వేయటానికి నిరాకరించారు. కొత్తగా వచ్చిన బ్రహ్మచారి ఎదురు వీరిని పరీక్షించదలచుకున్నాడు. అతను నాలుగు గుణాలు వర్ణించి ఇవి ఎవరివి అన్నాడు.

**మంత్రం 6: దేవః కః?** ఈ దేవుడు ఎవరు? నాలుగు లక్షణాలు చెప్పాడు. అవి – 1. గ్రసితా 2. గోపా 3. భువనస్య 4. దుర్విఘ్నేయ – గ్రసితా అంటే అన్నింటినీ లయం చేసే వ్యక్తి, గోపా అంటే సంరక్షుడు; భువనస్య అంటే అనేక రూపాలున్నవాడు; దుర్విఘ్నేయ– తేలిగ్గా గుర్తించబడనివాడు – అక్కడితో ఆగకుండా ఇంకో తమాషా వాక్యం అన్నాడు. వారు అతనికి భిక్ష వేయకపోవటంవల్ల ఈ నాలుగు లక్షణాలున్న దేవతను నిరాకరిస్తున్నారన్నారు.

ఈ నాలుగు గుణాలూ హిరణ్యగర్భకి ఉన్నాయి.

**గ్రసితా** – సంవర్గరూపేణ సర్వం గ్రసతి – సర్వాన్ని తినేస్తుంది.
**గోపా** – సమష్టి ప్రాణరూపేణ సర్వస్య రక్షితా – సమష్టి సూక్ష్మప్రపంచం వ్యష్టి సూక్ష్మప్రపంచాన్ని రక్షిస్తుంది.
**భువనస్య** – సూక్ష్మశరీరం, స్థూలశరీరం ఏ ఆకారంలో ఉంటే ఆ రూపం ధరిస్తుంది.

**స వా ఏష పురుషవిధ ఏవ। తస్య పురుషవిధతామ్। అన్వయం**

**పురుష విధః – బ్రహ్మానందవల్లీ**

ఇంకోవిధంగా చూస్తే అనేక శక్తుల రూపంలో పనిచేస్తుంది.

**నాభిపశ్యన్తి** – దుర్విఘ్నేయం – వ్యష్టి గురించే ఆలోచిస్తే, సమష్టిని అర్థం చేసుకోలేము. మన రాష్ట్రానికే మన దృష్టి పరిమితమైతే, దేశాన్ని అర్థం చేసుకోలేము.

ఈ వివరణవల్ల నాలుగు గుణాలున్న వ్యక్తి హిరణ్యగర్భ.

1. హిరణ్యగర్భే అందరిలోనూ ఉన్నాడు. ఆ వ్యక్తిలోనూ ఉన్నాడు.
2. వచ్చిన వ్యక్తి హిరణ్యగర్భమీద అహంగ్రహ ఉపాసన చేస్తున్నాడు.

హిరణ్యగర్భ ఉపాసన చేస్తే అతనే హిరణ్యగర్భ అవుతాడని చూశాము. కాబట్టి హిరణ్యగర్భకు భిక్ష నిరాకరించినట్టు అవుతుంది.

అందువల్ల నన్ను మామూలు వ్యక్తిగా భావించకండి అని చెప్పి అతను వెళ్ళిపోతుంటే, అతని గొప్పతనం గ్రహించిన వీళ్ళిద్దరూ అతని వెంట పరిగెట్టారు. అతని ప్రశ్నకు హిరణ్యగర్భ అని జవాబు అని చెప్పి, వారు ఇంకో 7 గుణాలు చెప్పారు.

**మంత్రం 7:** శౌనకుడు, కాక్షసేనుడు చెప్పిన 7 గుణాలు ఇవి–

1. ఆత్మా – వ్యష్టికి అధిష్ఠానం సమష్టి
2. జనితా – సృష్టికర్త
3. అనసూరి – సమష్టి బుద్ధి
4. మహిమానం – సర్వ విభూతిమాన్
5. బభస – భక్షణశాలి, నిరంతరం తినేవాడు (సంవర్గ)
6. హిరణ్యదంష్ట్ర – బంగారు దంతాలు ఉన్నవాడు.
7. అనద్యమాన – ఎవరిచేత తినబడనివాడు.

**మంత్రం 8:** ఉపనిషత్తు ఇంకో గుణాన్ని వివరిస్తున్నది. పూర్తిగా కల్పనతో కూడినది ఇది.

కొంచెం వెనక్కి వెళితే, హిరణ్యగర్భలో పది దేవతలు ఉన్నారని చూశాము.

అధిదైవ– వాయువు, అగ్ని, సూర్యుడు, చంద్రుడు, జలము
అధ్యాత్మ – ప్రాణం, వాక్కు, చక్షువు, మనసు, శ్రోతం

వాయువు, ప్రాణాలను అతృరూపదేవతలనీ, తక్కిన 8 దేవతలని అన్నరూపదేవతలనీ అంటారని చూశాం. హిరణ్యగర్భ అతృ, అన్నరూపదేవత.

ఇప్పుడు ఇంకా వెనక్కి వెళితే

కృతం = 10 = హిరణ్యగర్భ అని చూశాము.

**కృతాయవిజితాయాధరేయాః** – పాచికలు వేసినప్పుడు కృతాయ (4) పడితే దాన్ని 10 సంఖ్యగా తీసుకుంటారని చూశాము. అలాగే హిరణ్యగర్భలో కూడా అతృరూప దేవతలు 2 + అన్నరూపదేవతలు 8 కలిపితే 10 వస్తుంది. కృతం తక్కిన అన్ని సంఖ్యలను తనలో లయం చేసుకున్నట్టుగా, హిరణ్యగర్భయొక్క అతృరూపదేవతలు తమలో అన్నరూప దేవతలను లయం చేసుకుంటాయి. అందువల్ల హిరణ్యగర్భని కృతంతో పోల్చవచ్చు.

ఇప్పుడు అన్నరూపానికి ఇంకో పోలిక చెప్పాలి. ఉపనిషత్తు విరాట్ ఛందస్సుని తీసుకుంది పోలికగా. విరాట్ ఛందస్సుకి 10 అక్షరాలు ఉన్నాయి.

**అన్నాద్వై ప్రజాః ప్రజాయన్తే** – బ్రహ్మానందవల్లీ

సమష్టి అన్నం విరాట్. అన్నమయం విశ్వ. ఆ విధంగా హిరణ్యగర్భ 10 దేవతలు దశాక్షర అన్నరూప విరాట్ అన్నమాట. హిరణ్యగర్భ అన్న రూపం నిరూపించబడింది. మొత్తం హిరణ్యగర్భ ఉపాసన చేస్తే అది సంవర్గ విద్య అవుతుంది అని ఉపనిషత్తు చెపుతున్నది.

ఫలం – అత్తృ అన్న ఉపాసన చేసిన ఉపాసకునికి అన్నవాన్ అన్నాదో భవతి. అన్నం సమృద్ధిగా దొరుకుతుంది. ఇష్టంగా తినగలుగుతాడు. పరలోక ఫలం – హిరణ్యగర్భ ప్రాప్తి.

ఈ ఖండం ప్రాశస్త్యం – సంవర్గవిద్య గురించి చెప్పినందుకు ఈ ఖండం బాగా పేరు పొందింది.

## ఖండాలు 4.4–4.9 – 2 చతుష్పాద గుణవిశిష్ట బ్రహ్మ ఉపాసన

## ఖండం 4.4

2. **చతుష్పాద గుణవిశిష్ట బ్రహ్మ ఉపాసన** – ఈ ఉపాసనలో 4 పాదాలకు నాలుగేసి భాగాలున్నాయి. అందువల్ల దీనిని **చతుష్కల విశిష్ట చతుష్పాద బ్రహ్మ ఉపాసన** అనికూడా అనవచ్చు. ఇది కూడా గురుశిష్యుల సంవాదరూపంలో వస్తుంది. శిష్యుడు సత్యకామ జాబాల, గురువు హరిద్రుముడు. మళ్ళీ ఒక చిన్న కథ వస్తుంది. ఈ ఖండాలను **సత్యకామ జాబాలోపాఖ్యానం** అంటారు.

**చతుష్పాదగుణ విశిష్టబ్రహ్మ ఉపాసన** – ముందు ఖండంతో రైక్వా జానశ్రుతుల సంవాదరూపంలో సంవర్గవిద్య గురించి వచ్చింది. ఇప్పుడు ఖండాలు 4–9 ఇంకో ఉపాసన వస్తుంది. చతుష్పాద గుణవిశిష్ట బ్రహ్మ ఉపాసన దీని పేరు. ఒక్కొక్క పాదానికి 4 భాగాలున్నాయి. **చతుష్కల విశిష్ట చతుష్పాద బ్రహ్మ ఉపాసన** అని కూడా అనవచ్చు. ఇది కూడా గురుశిష్యుల సంవాద రూపంలో నడుస్తుంది. శిష్యుడు బాగా ప్రసిద్ధి చెందిన సత్యకామ జాబాల. గురువు హరిద్రుముడు. మళ్ళీ ఒక చిన్న కథ వస్తుంది. ఈ ఖండాలను **సత్యకామ జాబాలోపాఖ్యానం** అంటారు.

సత్యకామ జాబాల చిన్న పిల్లవాడు. అతను వేదాలను నేర్చు కోవాలనుకున్నాడు. తండ్రి చనిపోయాడు. తల్లి పేరు జబల. 'నేను గురువు వద్దకు వెళ్తాను. నా గోత్రమేమిటి' అని అడిగాడు. తల్లి తనకు తెలియదనీ, తనకు సపర్యలతోనే కాలం గడిచిపోయేదనీ, భర్త చిన్న వయసులోనే చనిపోయాడనీ చెప్పింది. అదే విషయం పోయి గురువుకు చెప్తే, గురువు అతను సత్యం చెప్పినందుకు అతన్ని మెచ్చుకుని అతనికి విద్య నేర్పుతానన్నాడు.

**మంత్రం 5: నైతదబ్రాహ్మణో వివక్తుమర్హతి** – సత్యం పలికాడు కాబట్టి అతను ఉన్నతమైన కుటుంబానికి చెందినవాడై ఉండాలని అంటే బ్రాహ్మణుడై ఉండాలని అన్నాడు. బ్రాహ్మణుడంటే గుణబ్రాహ్మణునిగా తీసుకోవాలి.

సత్యకాముని తల్లి తనకు గోత్రం తెలియదన్నందుకు కొంతమంది ఆవిడ మంచిది కాదని, సత్యకాముని పుట్టుక మంచిది కాదనీ వక్రభాష్యం చేస్తారు. కాని శంకరాచార్యులు ఇందులో వ్యతిరేకార్థం తీయకూడదనీ, భర్తకు సేవచేయటంలో అంకితమైపోయిందనీ అంటారు. శంకరాచార్యులు రాసిన భాష్యానికి ఆనందగిరి వివరణ రాశారు. దాన్ని టీకా అని, రాసిన ఆనందగిరిని టీకాకారులనీ అంటారు.

**పరిచార చిత్తవశాత్, లజ్జావశాత్ తానపృష్టవతీ** అన్నారు ఆనందగిరి. సేవ చేయటంలో లీనమైపోవటంవల్ల, సిగ్గువల్ల, గోత్రం భర్తని ఆడగలేదు తప్ప ఆమె శీలవతి కాదనకూడదు అంటారు ఆయన.

కథలో గ్రహించాల్సిన విషయాలు సత్యకామ సత్యం చెప్పిన విధానం, ఆ తర్వాత అతను చూపిన శ్రద్ధ, తపస్సు, గురుభక్తి. గురువు అతని సత్యవాక్కుకి మెచ్చి ఉపనయనం చేసి, నీకు విద్య నేర్పుతాను కాని ముందు వెళ్ళి ఈ ఆవులను మేపుకు రమ్మని పంపుతాడు. దాంట్లో గురువు మాటమీద శ్రద్ధ కనపడుతుంది. అతను మొక్కుబడిగా తీసుకువెళ్ళకుండా ఆ ఆవులు వెయ్యి అయ్యేదాకా తిరిగిరానన్న కఠిన నిర్ణయం తీసుకుని వెళ్ళాడు. దానివల్ల అతని తపస్సు తెలుస్తుంది.

## ఖండం 4.5

అలా ఎన్నాళ్ళో ఆవులు మేత మేసేటట్టు చూసేవాడు. సాయంకాలం అయ్యేసరికి ఒకచోట కట్టి, తన నిత్యకర్మ చేసుకునే వాడు. అలా ఒక సాయంకాలం చేస్తుండగా ఒక ఎద్దు వచ్చి, 'ఇప్పుడు మేము వెయ్యి అయ్యాము. మమ్మల్ని ఇంటికి తీసుకువెళ్ళవచ్చు,' అని చెప్పింది. ఎద్దు ఎలా మాట్లాడగలదు? శంకరాచార్యులు మాట్లాడింది ఎద్దు కాదనీ, అతని శ్రద్ధ, తపస్సు, బ్రహ్మచర్యంవల్ల దేవతలు అతన్ని మెచ్చి ఎద్దు ద్వారా మాట్లాడారని చెబుతారు. ఇక్కడ మాట్లాడింది వాయుదేవత

దీని ఉద్దేశ్యం గురుభక్తి ఉంటే, ఆచార్యుడు ఎదురుగా ఉన్నా లేకపోయినా కూడా, దేవుడు ఏదో రూపంలో దీవిస్తాడు అని. వాయుదేవత నీ సేవకి మెచ్చి నీకు చతుష్పాదబ్రహ్మ ఉపాసనలో ప్రథమపాదం నేర్పుతానని అంది. పాదం అంటే నాలుగో వంతు. ప్రథమపాదంలో 4 భాగాలు ఉన్నాయి. అందుకని చతుష్పాదపాదం అంటారు. సత్యకామ తాను సిద్ధమే

అన్నాడు. వాయువు నాలుగు దిక్కుల గురించీ అంటే తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ దిశలు చెప్పి దానికి పేరు ప్రకాశవాన్ నామం అంది. ఆ ఉపాసన చేసిన వ్యక్తి ఇక్కడ పేరు పొందుతాడు. పరలోకంలో ప్రకాశించే లోకాలకు అంటే స్వర్గలోకాలకు వెళ్తాడు.

## ఖండం 4.6

రెండో పాదం అగ్ని చెప్తుందంది వాయువు. ఉపనిషత్తు అతని దినచర్యని మళ్ళీ చెప్తుంది. సత్యకామ ఆవులను గురుకులం వైపుగా తోలుకు వచ్చి, అవి మేతమేశాక, సాయంకాలం వాటిని కట్టేసి, తను సంధ్యావందనం, సమిధ దానం చేసి అగ్నికి ఎదురుగా కూర్చుంటే అగ్ని దేవత వచ్చి రెండోపాదం గురించి చెప్పింది. అవి భూలోక, భువర్లోక, సువర్లోకాలు, సముద్రం. దానికి పేరు అనంతవాన్. ఫలం కూడా అనంతంగా ఉంటుంది.

## ఖండం 4.7

మూడోపాదం హంస చెబుతుందంది అగ్ని. హంస అంటే సూర్యదేవతగా తీసుకోవాలంటారు శంకరులవారు. హంతీ గచ్ఛతి ఇతి హంసః సూర్యదేవత ఎలా వచ్చింది? ఉపనిషత్తు చెప్పలేదు. బహుశా ఇంకో ఆవు రూపంలో అయి ఉండవచ్చు. సూర్యుడు చెప్పిన నాలుగు కలలు – అగ్ని, సూర్యుడు, చంద్రుడు, విద్యుత్తు. అన్నీ జ్యోతులు కాబట్టి దీని పేరు జ్యోతిష్మాన్. ఈ ఉపాసకుడు పేరు ప్రఖ్యాతులు పొంది జీవితంలో వెలుగు వెలుగుతాడు.

## ఖండం 4.8

నాలుగోపాదం మద్గుః చెబుతుందంటుంది హంస. మద్గుః అంటే అసలు అర్థం జలపక్షి. కాని తక్కిన మూడు పాదాలు దేవతలు చెప్పాయి కాబట్టి ఈ మద్గుఃని కూడా దేవతగా తీసుకోవాలంటారు శంకరులవారు. ఏ దేవత? ప్రాణదేవత! ఏ విధంగా? శంకరుల వారు మద్గుః అంటే నీరని ఒకచోట అర్థం వస్తుందనీ, ఇంకోచోట ప్రాణం అంటే మద్గుః అని అర్థం వస్తుందనీ, అందువల్ల మద్గుః = ఆపః = ప్రాణ అని తీసుకోవాలంటారు. ఏరూపంలో వచ్చి చెప్పిందన్నది మనం ఊహించుకోవాలి.

ఇక్కడ గమనించాల్సిన విషయం ఒకటుంది. ఇంతవరకూ చెప్పిన కలలు, బాహ్యప్రపంచానికి చెందినవి. ఇందులో నాలుగు ఆధ్యాత్మానికి చెందినవి. అవి – ప్రాణం, చక్షువు, శ్రోత్రం, మనసు. వీటికి పేరు ఆయతనవాన్. ఆయతనం అంటే ఆధారం. అంటే మన జీవితం ఈ నాలుగు కలలవల్ల నడుస్తున్నది. ముందే చూసినట్టుగా ఇవి పంచ జ్ఞానేంద్రియాలను, పంచ కర్మేంద్రియాలను, పంచ ప్రాణాలను, నాలుగు అంతఃకరణలను సూచిస్తాయి. వీటివల్లే జీవితం నడుస్తుంది. కాని ఇవేవీ నావి కావు. నేను నడపటం లేదు.

**ఈశ్వర వ్యతిరిక్తం నాస్తి** – ఈ చతుష్పాద బ్రహ్మ ఉపాసన ఉద్దేశం ఈశ్వరునికి భిన్నంగా ఏమీ లేదు. అధిదైవమూ ఈశ్వరుడే, అధ్యాత్మమూ ఈశ్వరుడే. అధ్యాత్మం చెప్పకపోతే ఈశ్వరుడు బయటే ఉన్నాడు అనుకుంటాము. గీతలో విరాట్ ఉపాసనకి ఆధారం ఈ ఉపాసనే. తైత్తిరీయంలో పాంక్త ఉపాసన ఉద్దేశ్యం కూడా ఇదే. సమష్టిపరంగా, వ్యష్టిపరంగా ఐదేసి చెప్తుంది అందులో. ఇక్కడ నాలుగేసి చూస్తామంతే.

సత్యకామ జాబాల ఎన్నాళ్ళో ఈ ఉపాసన చేసి, గురుకులానికి ఆవులను తోలుకుని వెళ్ళాడు.

## ఖండం 4.9

కొన్నాళ్ళు ఈ ఉపాసన చేశాక, జాబాల గురుకులానికి వెళ్ళాడు. ఆచార్యుడు హారిద్రుముడు అతని ముఖంలో బ్రహ్మవర్చస్సు చూశాడు.

**బ్రహ్మవిదివ వై భాసి** – బ్రహ్మవిద్య నేర్చుకున్నట్టు, నీ ముఖం ప్రకాశవంతంగా ఉంది. బ్రహ్మ విద్య అంటే నిర్గుణ బ్రహ్మజ్ఞానం కాదు. సగుణ బ్రహ్మ ఉపాసన అని మర్చిపోకూడదు. గురువుకెలా తెలిసింది?శిష్యుని రూపంలో ప్రశాంతత, ప్రసన్నత గోచరిస్తున్నాయి. 'ఎవరు నేర్పారు నీకు?' అని అడిగాడు.

**అన్యే మనుష్యేభ్య** – మనుష్యులు కాని వారు నేర్పారు. కాని వాళ్ళు అలా వచ్చి, ఇలా చెప్పి, అలా మాయమయ్యారు. నేను సరిగ్గా నేర్చుకోలేదు. గురుశుశ్రూష చేసి నేర్చుకోలేదు కాబట్టి ఓ గురువా! నేను మళ్ళీ మీ ద్వారా నేర్చుకోవాలి అన్నాడు.

**ఆచార్యాద్ధైవ విద్యా విదితా సాధిష్ఠం ప్రాపతి** –

చాలా అందమైన వాక్యం. చాలా ముఖ్యమైనది కూడా. ఏ జ్ఞానమైనా గురుముఖతా నేర్చుకుంటేనే, అది కూడా శ్రద్ధగా నేర్చుకుంటేనే అది రాణిస్తుంది. లౌకిక జ్ఞానం విషయంలో కొంత సడలింపు ఉండవచ్చేమో కాని, ఆధ్యాత్మిక విషయంలో గురువు ఉండితీరాలి. స్వంతంగా చదివి నేర్చుకుంటే, వచ్చేది కేవలం పరిజ్ఞానమే. ఛాందోగ్యభాష్యం కూడా ఇంగ్లీషులోకి అనువదించబడింది. అది చదవవచ్చు కాని శాస్త్రం దీవెన కావాలంటే మాత్రం గురువు ద్వారానే పొందాలి. అందుకని గురువుని మళ్ళీ చెప్పమన్నాడు.

**న కించన వీయాయ** – గురువు హారిద్రుముడు ఒక్కటి కూడా వదలకుండా చతుష్కల విశిష్ట చతుష్పాద బ్రహ్మ ఉపాసన బోధ మళ్ళీ చేశాడు. దీన్ని **సత్యకామ జాబాల ఉపాఖ్యానం** అని కూడా అంటారు.

**యస్య దేవే పరాభక్తిః యథా దేవే తథా గురౌ।**
**తస్యైతే కథితా హ్యర్థాః ప్రకాశంతే మహాత్మనః॥** - శ్వేతాశ్వతర ఉపనిషత్తు 6.23

దేవునిమీద ఉన్న శ్రద్ధ గురువుమీద ఉంటే తేలిగ్గా అర్థమవుతుంది. అంతేకాదు, గురువు చెప్పని అంశం కూడా తడుతుందని ఎవరో వ్యాఖ్యానం చేశారు. అందువల్ల మంచి గురువు ఉండి, ఆ గురువుమీద శ్రద్ధ ఉంటే పూర్ణఫలం కలుగుతుంది.

## ఖండాలు 4.10–4.15 ఉపకోసల విద్య

## ఖండం 4.10

ఖండాలు 10–15లో ఉపకోసలవిద్య గురించి చెబుతుంది ఉపనిషత్తు. ఉపకోసల అనే విద్యార్థి నేర్చుకున్న ఉపాసన కాబట్టి దీన్ని ఉపకోసలవిద్య అంటారు. గురువు జాబాల. ముందు ఖండంలో శిష్యునిగా చూసినతనే. అప్పటి శిష్యుడే, ఇప్పటి గురువయ్యాడు. అలాగే కొనసాగుతుంది గురుశిష్యపరంపర.

**నారాయణం పద్మభువం వసిష్ఠం। శక్తిం చ తత్పుత్ర పరాశరం చ**

**మంత్రాలు 1, 2** - ఇది కూడా కథ రూపంలో వస్తుంది. - ముందు కథ.

ఉపకోసల సత్యకామ జాబాలుని ఆశ్రమానికి వస్తాడు. ఆశ్రమం అంటే సంన్యాసులే ఉండాలని లేదు. పూర్వం గృహస్థులు కూడా ఆశ్రమాలలో ఉండేవారు. జాబాలునికి భార్య కూడా ఉంది. ఉపకోసలుడు 12 సంవత్సరాలు సత్యకామ దగ్గర విద్యనభ్యసించాడు. 12 సంవత్సరాలు విద్యనభ్యసించాక బ్రహ్మచర్యవ్రతం ముగిసిందనటానికి సూచనగా సమావర్తయం అని చేస్తారు. ఇప్పటి స్నాతకోత్సవం (కాన్వొకేషన్)లాంటిది అది. దాని తర్వాత బ్రహ్మచారి గృహస్థుగానో, సంన్యాసిగానో మారవచ్చు.

గురువు తక్కిన బ్రహ్మచారులందరికీ సమావర్తయం చేశాడు కాని ఉపకోసలునికి చేయలేదు. అతను గురువు పిలుస్తాడని ఆశగా ఎదురుచూశాడు. గురుపత్ని కూడా అతనిమీద జాలిపడి గురువుతో అతని తరుపున మాట్లాడింది. అతను నిష్ఠగా మూడు అగ్నులకు పూజ చేశాడని చెప్పింది. కాని గురువు ఆ మాటలను పట్టించుకోకుండా బయట ఊరుకు వెళ్ళిపోయాడు.

**మంత్రం - 3: సహ వ్యాధినాऽనశితుం దధ్రే -**

మనసు కలత చెందిన ఉపకోసలుడు సత్యాగ్రహం చేశాడు. గురుపత్ని ఎందుకు తినడం లేదు అని అడిగింది.

**కామా నానాత్యయాఽ_వ్యాధిభిః ప్రతిపూర్ణోఽ_స్మి** – తనకు అనేక కోరికలున్నాయని చెప్పాడు. వాటిని ఇంకా ఉన్నతమైన విషయాలు నేర్చుకోవాలన్న ఉన్నతమైన కోరికలున్నట్టుగా అర్థం చేసుకోవాలి. మనసు కలత చెందింది.

**మంత్రాలు 4, 5:** అతని చేత సేవలు పొందిన మూడు అగ్నులు అతని మీద జాలిపడి, అతనికి ఈ క్రింది భాగాన్ని బోధ చేశాయి. సత్యకామ శిష్యునికి బోధ చేయకుండా వెళ్ళిపోయాడంటే అందులో దురాలోచన ఏమీ లేదు. తనకు గురువుమీద శ్రద్ధ ఉన్నందువల్ల తనకెలా దేవతలు చతుష్పాదబహ్మ ఉపాసన నేర్పాయో అతనికీ అతని భక్తివల్ల అలాగే జరుగుతుందన్న నమ్మకంతో వెళ్ళాడు అనుకోవాలి. అతని నమ్మకం వమ్ము కాలేదు. అతను ఆశించినట్టే మూడు అగ్నులు ఉపకోసలునికి విద్య నేర్పించాయి. అవి ఏమి నేర్పించాయో తెలుసుకునే ముందు ఒకసారి ఆ మూడు అగ్నుల గురించీ గుర్తు చేసుకుందాము.

1. గార్హపత్య అగ్ని – గృహపతికి సంబంధించింది కాబట్టి దాన్ని గార్హపత్య అగ్ని అంటారు. వివాహం తరువాత గృహస్థు ఈ అగ్నిని వెలిగిస్తాడు. అది ఇంక నిత్యాగ్నిగా వెలుగుతూనే ఉండాలి. రెండు సందర్భాలలోనే ఆ అగ్నిని ఆర్పుతారు. గృహస్థు సంన్యాసం స్వీకరించినప్పుడు లేదా అతను మరణించినప్పుడు. అతను మరణించినప్పుడు ఆ అగ్నితోనే అతని దహన సంస్కారం చేస్తారు. సంన్యాసి మరణించినప్పుడు కాల్చరు. ఎందుకంటే అతను కర్మలు చేయడు కాబట్టి, గార్హపత్యాగ్ని ఉండదు. కాల్చటంద్వారా గృహస్థుని సంస్కరిస్తారు. సంన్యాసి జ్ఞానాగ్నితో సంస్కరించబడుతాడు కాబట్టి అతనికి అవసరం లేదు.

2. ఆహవనీయాగ్ని – దీన్ని నిత్యకర్మలకు వాడతారు. గార్హపత్య అగ్నిలోంచి తీసుకుని, కర్మ అయిపోయాక మళ్ళీ అందులో కలుపుతారు.

3. దక్షిణాగ్ని – దక్షిణం వైపు ఉంటుంది కాబట్టి దక్షిణాగ్ని అంటారు. అందులో పచనం కాని అన్నం వేస్తారు. అందుకని అన్వాహార్యపచనాగ్ని అని కూడా అంటారు. ఈ మూడు అగ్నులూ తమలో తాము చర్చించుకుని, ఇతను మామూలు బ్రహ్మచారి కాదనీ, ఇతనికి నేర్పించాలనీ నిశ్చయించుకుంటాయి. తప్త అంటే నేర్చుకోవాలనే తపన ఉంది అనీ, కలత చెందాడు అనీ వస్తుంది అర్థం.

మూడు అగ్నులూ కలసి ఉపకోసలునికి రెండు ఉపాసనలు నేర్పాయి.

1. హిరణ్యగర్భ ఉపాసన – సమష్టి సూక్ష్మశరీరంతో కూడిన చైతన్యం.
2. ఈశ్వర ఉపాసన – సమష్టి కారణశరీరంతో కూడిన చైతన్యం లేదా మాయాసహితచైతన్యం.

ఇంకో విధంగా చెప్పాలంటే కార్యబ్రహ్మ (హిరణ్యగర్భ), కారణబ్రహ్మ (ఈశ్వరుడు).

**మంత్రం 4: హిరణ్యగర్భ ఉపాసన** – ఈ మంత్రంలో ప్రాణోబ్రహ్మ అన్న పదం వాడింది ఉపనిషత్తు. వ్యష్టి శరీరంలో చూస్తే ప్రాణం. సమష్టిపరంగా చూస్తే సమష్టి ప్రాణం వాయువు, హిరణ్యగర్భ. ఇదంతా తత్త్వబోధలో వస్తుంది. వ్యష్టి ప్రాణానికి ఆధారం సమష్టి ప్రాణం. దీని వల్ల చిత్త విశాల్యం ఏర్పడుతుంది. నేను సమష్టిలో ఒక భాగాన్ని అని తెలుస్తుంది.

కార్యం బ్రహ్మ ఎందుకు? హిరణ్యగర్భ ఈశ్వరుని నుంచి పుట్టాడు,అతను జ్యేష్ఠపుత్రుడు.

**బ్రహ్మా దేవానాం ప్రథమః సంబభూవ** – ముండకం

**ఈశ్వర ఉపాసన – కం బ్రహ్మ ఖం బ్రహ్మ** – శంకరులవారు తరచు ఈ మంత్రాన్ని చెపుతూ ఉంటారు. కారణబ్రహ్మను చెప్పటానికి కం బ్రహ్మ ఖం బ్రహ్మ అంది ఉపనిషత్తు. రెండు విశేషణాలు ఎందుకు వాడింది. దానికి ఒక కారణం ఉంది అంటున్నారు శంకరులవారు. కం అంటే సుఖం. ఖం అంటే ఆకాశం.

**ఖం వాయుర్జ్యోతిరాపః పృథివీ విశ్వస్య ధారిణీ** – ముండకం

కం అంటే సుఖం అని చూశాము కదా – సుఖాన్ని విషయసుఖంగా వర్ణిస్తారు. మంచి కాఫీ తాగినా, చక్కటి సంగీతం విన్నా అది విషయసుఖంలోకి వస్తుంది. కాని విషయసుఖం పరిచ్ఛిన్నం. శాశ్వతం కాదు. అందుకని కేవలం కం బ్రహ్మ వాడితే బ్రహ్మానందం కూడా పరిచ్ఛిన్నం,శాశ్వతం కాదు అనుకునే ప్రమాదముంది. ఖం బ్రహ్మ కలపటంవల్ల ఆకాశం లాగా ఆ ఆనందం అపరిచ్ఛిన్నం అని తెలుస్తుంది.

ఖం అంటే ఆకాశం అని చూశాము కదా! కేవలం ఖం బ్రహ్మ వాడితే ఏమవుతుంది? ఆకాశం అంటే పంచభూతాల్లో ఒకటైనది. పంచభూతాలు జడం. అందువల్ల ఆకాశం జడం. అందువల్ల బ్రహ్మకూడా జడం అనుకునే ప్రమాదం ఉంది. కం బ్రహ్మ కలపటంవల్ల చేతనత్వం కలపటమవుతుంది. ఆనందం చేతనం ఖంతో కలిసి అపరిచ్ఛిన్న సుఖం.

కం బ్రహ్మ ఖం బ్రహ్మ అనటంవల్ల అపరిచ్ఛిన్న బ్రహ్మానందం అని తెలుస్తున్నది. ఆకాశం అంటే భూతాకాశం కాదు. చిదాకాశం.

**మంత్రం 5:** ఉపకోసలునికి ఈ నిర్వచనం స్పష్టంగా అర్థమవలేదు. కం అంటే తెలుసు. ఖం అంటే తెలుసు అతనికి. కం అంటే పరిచ్ఛిన్నం. ఖం అంటే జడ ఆకాశం. అందుకని పరిచ్ఛిన్నం బ్రహ్మ ఎలా అయింది, జడాకాశం బ్రహ్మ ఎలా అయింది అని అడిగాడు.

**యద్వావ కం తదేవ ఖం యదేవ ఖం తదేవ కం** – పరిచ్ఛిన్న ఆనందం ఆకాశం పదంతో కలిసి అపరిచ్ఛిన్నం అయింది. జడమైన ఆకాశం చైతన్యమైన ఆనందంతో కలిసి చిదాకాశమైందని అగ్నులు చెప్తాయి.

**ప్రాణం చ హాస్మై తదాకాశం చోచుః**

ఉపనిషత్తు ఈ విద్యని ఇలా ముగిస్తున్నది. ప్రాణో బ్రహ్మ, కం బ్రహ్మ ఖం బ్రహ్మ ఉపాసన ఇది.

## ఖండం 4.11

**అంగ ఉపాసనలు –**

**మంత్రం 1:** ఇక్కడనుంచీ ఒక్కొక్క అగ్ని తన గురించి ఒక్కొక్క ఉపాసన చెప్పింది. ఇంతకు ముందు చెప్పినది **హిరణ్యగర్భ సముచ్చిత ఈశ్వర ఉపాసన.** దీనినే **కార్యబ్రహ్మ సముచ్చిత కారణబ్రహ్మ ఉపాసన** అని కూడా అంటారు. దీన్ని అంగీ ఉపాసన అంటారు. ఇప్పుడు రాబోయేవి అంగ ఉపాసనలు. వాటిని అంగీ ఉపాసనతో కలిపి చేయాలి.

**గార్హపత్య అగ్ని విద్య** – నాకు నాలుగు అంగాలు ఉన్నాయి. అవి పృథివీ, అగ్ని, అన్నం, ఆదిత్యుడు. వాటిని సూర్యదేవతమీద ఉపాసన చేయాలి. **ఏష ఆదిత్యేపురుషః.**

**మంత్రం 2:** ఇప్పుడు చెప్పేమూడు అంగ ఉపాసనలకూ ఫలం ఒకటే.

**పాపకృత్యాం** – పాపాల నుంచి విడివడతాడు. **లోకీ భవతి –** ఊర్ధ్వలోకాలకు వెళతాడు.

**సర్వమాయురేతి** – అతనికే కాదు, అతని తరువాత తరం వారికి కూడా దీర్ఘాయుష్షు ఉంటుంది.

**జ్యోగ్జీవతి** – ప్రకాశవంతమైన జీవితం గడుపుతాడు. ఎవరూ అతనిని విమర్శించరు, అందరూ పొగుడుతారు. ఎంతవరకు ఆయుష్షు ఉన్నంతవరకు?

**ఉప వయం తం భుఞ్జామః** – ఎప్పటికీ అంటే ఇహలోకంలో, పరలోకంలో కూడా మేము రక్షిస్తాము. మామూలుగా భుఞ్జామ అంటే తినటం కాని ఇక్కడ భుం అంటే రక్షించటం. మేము రక్షిస్తాము అని అర్థం. ఒక్కముక్కలో చెప్పాలంటే, **యోగక్షేమం వహామ్యహం.**

## ఖండం 4.12

**దక్షిణాగ్ని విద్య** – దక్షిణాగ్ని చెప్పింది. దీన్నే అన్వాహార్యపచనాగ్ని అని కూడా అంటారని చూశాము. దానికి నాలుగు అంగాలు – జలములు, దిక్కులు, నక్షత్రాలు, చంద్రుడు – **ఏష చన్ద్రమసి పురుషః** చంద్రునిమీద ఉపాసన. ఫలం ఇందాకటిదే.

## ఖండం 4.13

**ఆహవనీయాగ్ని విద్య** – ఆవహనీయాగ్ని చెప్పింది – దానికి నాలుగు అంగాలు – ప్రాణం, ఆకాశం, స్వర్గం, మెరుపు. ఇవన్నీ అగ్ని దేవతలు కాబట్టి ఉపాసన కూడా ప్రకాశరూపమైన మెరుపుమీద చేయాలి. **ఏష విద్యుతి పురుషః** ఫలం ఇందాకటిదే.

## ఖండం 4.14

**అస్మద్విద్యాఽఽ త్మవిద్యా –** మూడు అగ్నులు ఉపకోసలునితో చెప్పాయి ఇలా – మేము మా ప్రత్యేక ఉపాసనతో పాటు నీకు ఆత్మవిద్య కూడా బోధించాము. ఉపాసనాకాండలో ఉన్నంతవరకూ ఒక విషయం మర్చిపోకూడదు. ఇక్కడ ఆత్మవిద్య అంటే నిర్గుణ ఆత్మజ్ఞానం కాదు. ఆత్మవిద్య అంటే సగుణ బ్రహ్మ ఉపాసన. మాయాసహిత సగుణ కారణ బ్రహ్మ ఉపాసన.

**ప్రాణో బ్రహ్మ; కం బ్రహ్మ ఖం బ్రహ్మ** – అంగీ ఉపాసనలు.

ఆదిత్యపురుష ఉపాసన, చంద్ర పురుష ఉపాసన, విద్యుత్ పురుష ఉపాసనలు – అంగ ఉపాసన.

మేము ఈ ఐదు ఉపాసనలూ చెప్పాము కాని, ఫలం చెప్పలేదు. అంటే బ్రహ్మ ఉపాసన చేసిన వ్యక్తి ఏ గతిద్వారా ఏ లోకానికి వెళతాడో చెప్పలేదు. అది నీ గురువు చెబుతాడు అంటాయి.

**మంత్రం 2:** అనుకున్నట్టుగానే గురువు వెనక్కివచ్చాడు. ఉపకోసలుని మొహం బ్రహ్మవర్చస్సుతో వెలిగిపోవటం చూశాడు. తన కథ గుర్తుకు వచ్చి ఉంటుంది.

**బ్రహ్మవిద ఇవ సోమ్య తే ముఖం భాతి** – నీ ముఖం తేజోవంతంగా ఉంది. నీకు ఎవరు బోధ చేశారు? అని అడిగాడు.

**కోను మానుశిష్యాద్భో** – నాకెవరు చెబుతారు అన్నాడు శిష్యుడు. అబద్ధం చెప్పినట్టుగా కనపడినా, వెంటనే ఆ విషయాన్ని కప్పిపుచ్చటానికి, అగ్నులవైపు చూస్తూ మీ ముందు ఒకలా, మీరు లేనప్పుడు మరోలా ఉన్నాయి అన్నాడు.

**ఈదృశా అన్యాదృశా** – అంటే పరోక్షంగా మీరు లేనప్పుడు అవి నాకు విద్య నేర్పించాయని చెప్పినట్టయింది. ఏం చెప్పాయని గురువు అడిగితే, ఆ విద్యనంతా చెప్పి, గతి గురించి చెప్పలేదు, మీరు చెప్పండని కోరాడు.

సత్యకామ జాబాల, ఈశ్వర ఉపాసన గురించి ఆ అగ్నులు చెప్పినదానితో తాను తృప్తి చెందలేదనీ, దాన్ని తాను మరింత మెరుగ్గా చెబుతాననీ చెప్పాడు.

**గుణ విశిష్ట ఈశ్వర ఉపాసనను** చెబుతానన్నాడు. దాని గొప్పతనం ఏమిటి?

**లోకాన్వావ కిల సోమ్య తే ఽవోచన్నహం తు తే తద్వక్ష్యామి** – ఊర్ధ్వలోకాలకు వెళతావు. తను పాపనాశక ఈశ్వర ఉపాసన చెబుతానన్నాడు.

**యథా పుష్కరపలాశ ఆపో న శ్లిష్యన్త** – తామరాకుమీద నీటిబొట్టు తామరాకుని తడపనట్టుగా– ఈ ఉపాసన చేస్తే పాపఫలం అంటుకోదు. గురువు గుణవిశిష్ట బ్రహ్మ ఉపాసన, దాని ఫలం తర్వాతి ఖండంలో చెప్పాడు.

## ఖండం 4.15

**గుణ విశిష్ట కారణ బ్రహ్మ లేదా ఈశ్వర ఉపాసన.** ఇది చాలా ప్రఖ్యాతి చెందిన ఉపాసన. ఇది ఉపకోసలవిద్యగా కూడా పేరు పొందింది. కారణం బ్రహ్మ అయిన ఈశ్వరుడిని కన్ను వెనుకనున్న చైతన్యంగా ఉపాసన చేయాలి.

కన్ను మీద ఉపాసన కాబట్టి దీన్ని **అక్షి పురుష ఉపాసన** అని కూడా అంటారు. దీన్ని వివరంగా బ్రహ్మసూత్రాల్లో విశ్లేషిస్తారు.

కన్నుమీదే ఎందుకు? గురువే కారణం చెబుతున్నాడు. కంటిమీద నీరు పోస్తే, అది కంటిమీంచి జారిపోతుంది. కన్నుకి తడి అంటదు. అంటే కన్ను అసంగ స్వరూపం. ఇక్కడ నీరు బదులు సర్పి అంటున్నాడు గురువు. సర్పి అంటే కరిగిన వెన్న. కేవలం ఒక స్థానం అయిన అక్షే (కన్నే) అసంగం అయితే స్థానీ అయిన అసంగపురుషుని గురించి వేరే చెప్పాలా? దాన్ని కౌముతిక న్యాయం అంటారు.

**కౌముతిక న్యాయం – కిం ఉత**నుంచి వచ్చింది. ఆ గుడి ప్రాకారమే పవిత్రంగా ఉంటుంది అంటే ఇంక గర్భగుడిలో ఉన్న దేవుని గురించి చెప్పేదేముంది?

ఫలం – కంటిని నీరు అంటనట్టుగా, పాపపుణ్యాలు అంటవు. ఒక కష్టం వచ్చినట్టుగా కూడా ఎవరికీ తెలియదు. ఇలా వచ్చి అలా వెళ్ళిపోతుంది.

ఈశ్వరుని 5 గుణాలు – **అమృతం, అభయం, సంయద్వామ, వామనీ, భామనీ** – అమృతం– నిత్యత్వం; అభయం–భయం లేకపోవటం; సంయద్వామ–మంగళకరమైనవి ఉన్న దేవుడు; వామనీ–మంగళకరమైనవి ఇచ్చే దేవుడు; భామనీ–చైతన్యప్రదాత.

ఫలం – ఐదు గుణాల్లో ఏ గుణంమీద ఉపాసన చేస్తే ఆ ఫలం వస్తుంది. ఉదాహరణకు నేను సంయద్వామ ఉపాసన చేస్తే నాలో మంగళకరమైనవి ఉంటాయి.

**అగ్నిర్జ్యోతిరహః శుక్లః షణ్మాసా ఉత్తరాయణమ్।**
**తత్ర ప్రయాతా గచ్ఛంతి బ్రహ్మ బ్రహ్మవిదో జనాః॥** – గీత 8.24

ఇందులో శుక్లగతి లోని మరికొన్ని దేవతల గురించి వస్తుంది. శాస్త్రం ప్రకారం మరణకర్మ చేసి తీరాలి. దాన్ని అంత్యేష్టి కర్మ అంటారు. ఒక వ్యక్తి తాను జీవించి ఉన్నంతవరకూ అన్ని కర్మలూ అతనే చేస్తాడు. కాని అంత్యేష్టి అతనికి వేరే ఎవరో చేయాలి.

అంత్యేష్టి కర్మ చేస్తే ఆ సంస్కారం జీవాత్మను శుద్ధి చేస్తుంది. సంస్కరించబడ్డ జీవాత్మ ఉన్నత లోకాలకు వెళుతుంది.

ఇక్కడ ఈ ఉపాసనను స్తుతించటానికి, ఉపనిషత్తు ఒక ఆసక్తికరమైన విషయం చెపుతున్నది. ఈ ఉపాసన ఎంత గొప్పదంటే, ఈ ఉపాసకుడు మరణించాక అతనికి అంత్యేష్టి సంస్కారం చేయకపోయినా ఫర్వాలేదు అంటుంది. శంకరాచార్యులు, ఇలాంటి వాక్యాలను తీసుకుని, అన్ని సందర్భాలలో వాడకూడదు అంటారు. ఉదాహరణకు నిత్యపూజలో ఏదైనా లేకపోతే దానిబదులు అక్షతాన్ సమర్పయామి అని వస్తుంది కదా. అందుకని ఆ వస్తువులు కొనగలిగినా కొనకుండా వాటిబదులు అక్షతలు వేయకూడదు. ఉపనిషత్తు అలా ఎందుకు చెప్పింది? అంత్యేష్టిని నిందించటానికి కాదు,ఉపాసనను స్తుతించటానికి.

**ఉపాసన స్తుత్యర్థం, న తు అంత్యేష్టి నింద్యార్థం**

శుక్లగతిలో తీసుకువెళ్ళే దేవతలు

అర్చి దేవత (జ్యోతి)

ఆర్చి దేవతనుంచి అహర్దేవత (పగలు)

అహర్దేవతనుంచి శుక్లపక్షదేవత

శుక్లపక్షదేవతనుంచి ఉత్తరాయణదేవత

ఉత్తరాయణదేవతనుంచి సంవత్సరదేవత

సంవత్సరదేవతనుంచి ఆదిత్యదేవత

ఆదిత్యదేవతనుంచి చంద్రదేవత

చంద్రదేవతనుంచి విద్యుద్దేవత

విద్యుద్దేవతనుంచి తత్పురుష అమానవ పురుషః (మనిషికన్నా ఉన్నతమైన దేవత) బ్రహ్మలోకానికి తీసుకువెళుతుంది.

**ఏతాన్బ్రహ్మ గమయత్యేష దేవపథో బ్రహ్మపథః** – శుక్లగతికి ఇందులో రెండు పేర్లు వస్తున్నాయి. దేవపథం, బ్రహ్మపథం. తైత్తిరీయంలో ఇంద్రయోని అని వస్తుంది.

**ఇమం మానవమావర్తం నావర్తన్తే** – అక్కడ క్రమముక్తి పొందుతాడు. జనన మరణాల వృత్తంలో పడడు. అమృతం, అభయం బ్రహ్మ అవుతాడు. దీనితో ఉపకోసల విద్య అయిపోయింది. ఇందులో 6 ఉపాసనలు వస్తాయి. 4 అంగ ఉపాసనలు, 2 అంగీ ఉపాసనలు వస్తాయి.

**ఉపకోసలవిద్య అంగీ ఉపాసనల పేర్లు –**

**1. ప్రాణో బ్రహ్మ – హిరణ్యగర్భ ఉపాసన.**

**2. కం బ్రహ్మ ఖం బ్రహ్మ – ఈశ్వర ఉపాసన.**

## ఖండం 4.16

16, 17 ఖండాల్లో ఏదైనా యజ్ఞం చేసేటప్పుడు ఏమైనా దోషాలు కలిగితే ఎలా ప్రాయశ్చిత్తం చేయాలో వస్తుంది.

### యజ్ఞ సాద్గుణ్యసంపాదనార్థం ప్రాయశ్చిత్తమ్

**మంత్రం 1:** ప్రాయశ్చిత్తం చెప్పేముందు యజ్ఞాన్ని వాయువుతో పోల్చింది ఉపనిషత్తు. ఎందుకు?

**పునాతి, చలతి** – పునాతి అంటే శుద్ధి చేస్తుంది. వాయువు శుద్ధి చేస్తుంది. యజ్ఞం యజమానిని శుద్ధి చేస్తుంది. వాయువు ఒకచోటి నుంచి ఇంకోచోటికి కదులుతుంది. యజ్ఞం యజమానిని ఒక లోకం నుంచి ఇంకోలోకానికి తీసుకువెళుతుంది.

**మనశ్చ వాక్చ వర్తనీ** – ఇక్కడ కూడా ఋషుల రూపకల్పన చూస్తాము. యజ్ఞాన్ని రెండు చక్రాలున్న రథంతో పోల్చారు. రెండు చక్రాలు మనసు, వాక్కు. అదెలాగో అర్థం చేసుకునేముందు యజ్ఞం గురించి కొంచెం తెలుసుకోవాలి. ఏ యజ్ఞానికన్నా నాలుగు వేదాలకు చెందిన ఋత్విక్కులు ఉంటారు. వాళ్ళకు వేరే పేర్లు ఉంటాయి.

1. హోతా – ఋగ్వేద బ్రాహ్మణుడు – ఋగ్వేద మంత్రాలు పఠించాలి.
2. అధ్వర్యు – యజుర్వేద బ్రాహ్మణుడు – ఆహుతులు సమర్పించాలి.
3. ఉద్గాత – సామవేద బ్రాహ్మణుడు – దేవతలను ఆహ్వానిస్తూ సామగానం చేయాలి.
4. బ్రహ్మ – అథర్వణవేద బ్రాహ్మణుడు – పై ముగ్గురిపనీ జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. వేదాలన్నీ తెలిసి ఉండాలి.

మొదటి ముగ్గురి – హోతా, అధ్వర్యు, ఉద్గాతల – పని వాక్కు ప్రధానం. వారు పఠించటం మానకూడదు. చివరి బ్రాహ్మణుడు అయిన బ్రహ్మ పని మనసు ప్రధానం. అతను మాట్లాడితే, తక్కినవాళ్ళని సరిగా గమనించలేడు. అందుకని అతను నిశ్శబ్దంగా ఉండాలి. అప్రమత్తంగాఉండాలి. ఒక్కమాటలో చెప్పాలంటే మొదటి ముగ్గురు మంత్రం ఆపకూడదు. ఆఖరి బ్రాహ్మణుడు నోరు విప్పకూడదు. వాక్కు ప్రధానం ఒకరిది. మనసు ప్రధానం ఇంకొకరిది. ఇదీ పరిస్థితి. ఈ ఖండంలో బ్రహ్మ పొరపాటు చేస్తే ప్రాయశ్చిత్తం ఏమిటో వస్తుంది. అది చూద్దాము.

**మంత్రం 2:** మనసు ప్రధానంగా పనిచేయాల్సిన బ్రహ్మ మాట్లాడితే – **వ్యవవదతి** – యజ్ఞం పరిపూర్ణం కాదు.

**మంత్రం 3:** ఎందుకు పరిపూర్ణం కాదు? ఇందాక చూశాం యజ్ఞాన్ని రెండు చక్రాలున్న రథంతో పోల్చారనీ, ఆ రెండు చక్రాలూ వాక్కు, మనసనీను. మనసనే ఒక చక్రం సరిగ్గా పనిచేయకపోతే, రథం గమ్యాన్ని చేరగలదా?

**స ఇష్ట్వా పాపీయాన్ భవతి** – గమ్యాన్ని చేరకపోయినా కొంత నయం. కాని చెడు చేస్తే కష్టం. యజ్ఞంచేసే యజమానికి పాపం కలుగుతుంది.

**మంత్రం 4: అథ బ్రహ్మా వ్యవవదతి** – బ్రహ్మ మాట్లాడకుండా ఉంటే, రెండు చక్రాలూ సవ్యంగా ఉంటాయి.

**మంత్రం 5: యజ్ఞః ప్రతితిష్ఠతి** – రెండు చక్రాలూ సవ్యంగా ఉండటంవల్ల, రథం ముందుకు సాగినట్టుగా యజ్ఞం సవ్యంగా సాగిపోతుంది.

**స ఇష్ట్వా శ్రేయాన్భవతి** – యజమానికి అతను చేసిన యజ్ఞం మంచి ఫలితాన్నిస్తుంది.

## ఖండం 4.17

ఇప్పుడు వాక్కులో లోపం వస్తే ఎలా ప్రాయశ్చిత్తం చేయాలో చెబుతున్నది. మూడు వేదాలకు చెందిన ముగ్గురు బ్రాహ్మణులు ఉంటారు కాబట్టి, మూడు రకాల పొరపాట్లు దొర్లవచ్చు. వాటికి ప్రాయశ్చిత్తాలుకూడా మూడు రకాలు. అవి 3 వ్యాహృతి హోమాలు.

ఆ వ్యాహృతి హోమాలు ఏమిటో చెప్పేముందు ఉపనిషత్తు వాటిని స్తుతిస్తున్నది. అవి ఎంత శక్తివంతమైనవో చెపుతున్నది. వ్యాహృతికి రెండు అర్థాలున్నాయి.

**బ్రహ్మణా వ్యాహృతా ఉచ్చరితా ఇతి వ్యాహృతిః**

బ్రహ్మదేవుడు మొట్టమొదట ఉచ్చరించిన పదాలు వ్యాహృతులు.

**వ్యాహరతి సర్వాన్ దోషాన్ ఇతి వ్యాహృతిః**

అన్ని దోషాలను పోగొడుతుంది.

ఈ వ్యాహృతులు ఎలా వచ్చాయో చెబుతున్నది ఉపనిషత్తు.

బ్రహ్మదేవుడు ఒకసారి మూడు లోకాల సారం ఏమిటో తెలుసుకోవాలనుకుని తపస్సు చేశాడు. ఆ లోకాలు– భూలోక, భువర్లోక, సువర్లోకాలు. వాటి సారంగా మూడు దేవతలు వచ్చాయి. అగ్ని,వాయువు, ఆదిత్య. వాటి సారంగా మూడు వేదాలు వచ్చాయి. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, వాటి సారంగా మూడు వ్యాహృతులు వచ్చాయి. భూః, భువః సువః. మూడు వ్యాహృతుల సారంగా మూడు మంత్రాలు వచ్చాయి. అ, ఉ, మ అవి కలిపి

ఓంకారం అయింది. అందుకే గాయత్రీ మంత్రం చదివేముందు ఓం భూః భువః సువః అని చదువుతారు.

**మూడు వ్యాహృతులు**

| మంత్రం | విషయం | వివరాలు | సారం |
|---|---|---|---|
| 1. | మూడు లోకాలు | భూలోకం, భువర్లోకం, సువర్లోకం | మూడు దేవతలు |
| 2. | మూడు దేవతలు | అగ్ని, వాయువు, ఆదిత్య | మూడు వేదాలు |
| 3. | మూడు వేదాలు | ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం | మూడు వ్యాహృతులు |
| 4. | మూడు వ్యాహృతులు | భూః భువః సువః | మూడు మాత్రలు |
| | మూడు మాత్రలు | అ, ఉ, మ | ఓం కారం |

ఇక్కడ మనకు వ్యాహృతులు కావాలి కాబట్టి ఉపనిషత్తు ఇక్కడితో ఆపింది. అ, ఉ, మలు తైత్తిరీయ ఉపనిషత్తులో వస్తాయి. ఇప్పుడు ఒక్కొక్క మంత్రంలో ఒక్కొక్క ప్రాయశ్చిత్తం వస్తుంది.

ఇక్కడ యజ్ఞం కాబట్టి భూః భువః సువః వ్యాహృతులను ఆయా అగ్నుల ముందు పఠించాలి. సాధారణంగా యజ్ఞాల్లో ఈ మూడు ప్రాయశ్చిత్తాలూ చేస్తారు. ఒకవేళ పొరపాట్లు జరిగినా సమస్య ఉండదు. సంధ్యావందనంలో కూడా ప్రాయశ్చిత్త మంత్రం వస్తుంది.

**మంత్రం 7:** తప్పులు వచ్చాయని యజ్ఞాన్ని పూర్తిగా మానివేయలేరు కదా! మామూలు వస్తువులు అశుద్ధం అయితే,వాటిని వేరే వాటితో శుద్ధం చేస్తాము. అలాంటివి కొన్ని ఉదాహరణలు ఇస్తున్నది ఉపనిషత్తు.

**లవణేన సువర్ణగ్ం సన్దధ్యాత్** – లవణం అంటే మామూలుగా ఉప్పు. ఇక్కడ ప్రత్యేకమైన ఉప్పు. బంగారాన్ని లవణంతో శుద్ధి చేస్తాము.

**సువర్ణేన రజతగ్ం** – బంగారంతో వెండిని; **రజతేన త్రపు** – వెండితో తగరాన్ని; త్రపుణా **సీసగ్ం** – తగరంతో సీసాన్ని; **సీసేన లోహం** – సీసంతో ఇనుమును; **లోహేన దారు** – ఇనుముతో కట్టెను; **దారు చర్మణా** – కట్టెతో చర్మాన్ని బాగు చేస్తారు.

**మంత్రం 8:** ఇక్కడ ఉద్దేశం వస్తువులు పాడయితే వాటిని పారేయకుండా బాగు చేసి వాడుకుంటున్నాం.

**ఏవమేషాం లోకానాం** – వ్యాహృతి వాడితే మూడు వేదాలను, మూడు దేవతలను, మూడు లోకాలను తలచుకున్నంత పుణ్యం. వేదాలను త్రయీ విద్యా అంది ఉపనిషత్తు.

**భేషజకృతో హ వా ఏష యజ్ఞః** – ప్రాయశ్చిత్తం చేసిన యజ్ఞం బాగుపడుతుంది. పూర్ణఫలం ఇస్తుంది.

**యత్రైవం విద్బ్రహ్మా భవతి** – బ్రహ్మకు బాగా తెలిస్తే, యజ్ఞానికి ప్రాయశ్చిత్తం చేయాల్సిన అవసరం లేకుండా బాగా జరుగుతుంది.

**మంత్రం 9:** బ్రహ్మస్తుతి. మిగతా ఋత్విక్కులు ఎలా ఉన్నా, బ్రహ్మ నిశ్శబ్దంగా, అప్రమత్తంగా ఉంటే యజ్ఞం పరిపూర్ణమవుతుంది.

**ఉదక్ప్రవణ** – ఉత్తరం వైపు ప్రయాణం చేస్తాడు యజమాని. వాయువు ప్రయాణించినట్టుగా, యజమాని ఉత్తరంవైపు ప్రయాణిస్తాడు. అంటే ఊర్ధ్వలోకాలకు వెళతాడు.

**బ్రహ్మాణమనుగాథా** – బ్రహ్మను మెచ్చుకుంటూ పాట ఇది.

**యతో యత ఆవర్తతే తత్తద్గచ్ఛతి** – ఎక్కడెక్కడ సమస్య ఉంటే, అక్కడికి బ్రహ్మ పరిగెత్తుకు వెళ్ళి సహాయం చేస్తాడు. బ్రహ్మను స్తుతిస్తూ ఒక ఉదాహరణ. తనమీద ఉన్న సైనికుడిని అశ్వం రక్షించినట్టుగా, బ్రహ్మ తన మౌనం ద్వారా యజమానిని రక్షిస్తాడు. **మానవో బ్రహ్మ** అంటే మౌనంగా ఉన్న బ్రహ్మ అని అర్థం.

ఇదంతా ఉపాసనాకాండ అయినప్పుడు ఉన్నట్టుండి యజ్ఞం తీరుతెన్నులు, దాని ప్రాయశ్చిత్తం గురించి ఎందుకు చెప్పింది ఉపనిషత్తు? దానికి శంకరుల వారు ఇలా జవాబు చెప్తున్నారు. ఎలాగైతే యజ్ఞంలో బ్రహ్మ మౌనంగా ఉండాలో అలాగే ఉపాసకుడు కూడా మౌనంగా ఉండాలి. గలగలా మాట్లాడకూడదు.

అందువల్ల మౌనంగా ఉండాలన్న విషయం ఎత్తి చూపటానికి యజ్ఞం గురించి చెప్పింది.

**మంత్రం 10: నానేవం విదం నానేవం విదమ్** – ఇక్కడితో ఖండం – 17, అధ్యాయం – 4 ముగిశాయి. ఇందులో మూడు కథలు చూశాము.

# ఏకాదశ ఉపనిషత్తుల సారం

## ఛాందోగ్యోపనిషత్ - అధ్యాయం 5

ఛాందోగ్యోపనిషత్తు అధ్యాయం 5 కూడా ఉపాసనలనే బోధిస్తుంది. వీటిని స్వతంత్ర ఉపాసనలు అంటారు. దీనిలో మూడు ఉపాసనలను చూస్తాము. అవి ప్రాణోపాసన, పంచాగ్నివిద్య, వైశ్వానరోపాసన. ఉపాసనను విద్య అని కూడా అంటారని చూశాము. ఛాందోగ్యోపనిషత్తులో 1-5 అధ్యాయాలు ఉపాసనలను బోధిస్తే, బృహదారణ్యకోపనిషత్తు 5, 6 అధ్యాయాలు ఉపాసనలను బోధిస్తాయి. అంతేకాదు, ఈ అధ్యాయంలో వచ్చిన మొదటి రెండు ఉపాసనలు అయిన ప్రాణ ఉపాసన, పంచాగ్నివిద్య బృహదారణ్యకోపనిషత్తులో అధ్యాయం 6 లాగా వస్తాయి, చిన్నచిన్న భేదాలతో. ఈ అధ్యాయంలో 24 ఖండాలు, 88 మంత్రాలు ఉన్నాయి.

### ఖండాలు 5.1, 5.2 - 1 ప్రాణ ఉపాసన

**గుణ విశిష్టప్రాణ ఉపాసన** - బృహదారణ్యకోపనిషత్తులో ఈ ఉపాసనను ప్రాణరూపేణ హిరణ్యగర్భ ఉపాసన అంటే, ఇక్కడ ఇదే ఉపాసనను గుణవిశిష్ట ప్రాణ ఉపాసన అంటారు. బృహదారణ్యకోపనిషత్తులో 19 అంగాలకు ప్రతీకగా ఐదు అంగాలను తీసుకుంది. అవి వాక్కు, కన్ను, చెవులు, మనస్సు, ఉపస్థ. ఇక్కడ నాలుగే చూస్తాము. ఉపస్థను చూడము.

రెండు గుణాలు ఉన్న ప్రాణానికి ఇప్పుడు ఆరు గుణాలు అయ్యాయి. అవి వరుసగా జ్యేష్ఠత్వం, శ్రేష్ఠత్వం, వసిష్ఠత్వం, ప్రతిష్ఠత్వం, సంపదత్వం, ఆయతనత్వం. అంతేకాదు, ఇంద్రియాలు మా పేర్లు కూడా నీకు ధారపోస్తున్నాము, మమ్మల్ని కూడా ప్రాణాలుగానే వ్యవహరిస్తారు అన్నాయి.

**ఫలం** - ఈ ఉపాసన చేసిన వ్యక్తికి వస్త్రానికి లోటు ఉండదు. కాని ఇందులో ఒక షరతు ఉంది, మీమాంస శాస్త్రం ప్రకారం. ఇది ప్రాణవిద్య అంగకర్మ కాబట్టి దీనిని ప్రాణోపాసనతో జోడించి చేస్తేనే ఫలం.

**ప్రాణ ఉపాసన స్తుతి - మంత్రం 3:** ఈ ఖండంలో ప్రాణ ఉపాసనస్తుతి గురు, శిష్యుల సంవాదరూపంలో వస్తుంది. జాబాల అనే గురువు, గోశ్రుతి అనే శిష్యునికి బోధించాడు. గోశ్రుతి వ్యాఘ్రపదుని పుత్రుడు. అందుకే గోశ్రుతిని వైయాఘ్రపదుడు అనికూడా అంటారు.

**శుష్కాయ స్థాణవే బ్రూయాత్** - ఈ ప్రాణస్తుతిని ఎండిన మోడుకోసం చెపితే, అది మళ్ళీ చిగురించి, కొత్తకొమ్మలు పుట్టుకొస్తాయి. వినటానికి వింతగా ఉన్నా, అది నిజమేనని మన

విజ్ఞానశాస్త్రం కూడా నిరూపిస్తున్నది. ఒక శాస్త్రజ్ఞుడు ఎండిపోతున్న చెట్టుతో తీయగా మాట్లాడితే, అది నెమ్మదిగా చిగురించి, మళ్ళీ జీవం పోసుకుందని ఒక వ్యాసంలో రాశాడు. తనని సమీపిస్తున్న వ్యక్తి ప్రేమగా వస్తున్నాడా, హాని చేయటానికి వస్తున్నాడా అనే విషయం కనిపెట్టగలవట చెట్లు.

**మంత్రాలు 4, 5:** ప్రాణవిద్య అంగకర్మ – దీన్ని అధికృత అధికారిత్వం అంటారు. బియ్యే చదివితేనే ఏమ్మేకి వెళ్ళగలిగినట్లుగా, ప్రాణోపాసన చేస్తేనే ప్రాణవిద్య అంగకర్మగా చేయాలి.

ఈ మంత్రాల్లో కర్మకాండ అనుభవం ఎలా ఉంటుందో కొంచెం రుచి చూస్తాము. వేదాంతంలో తరచు కర్మకాండ అనే పదం వింటుంటాము. ఇక్కడ చెప్పిన ఒక్క అంగకర్మ గురించి వింటేనే కర్మకాండ ఎంత కష్టమో తెలుస్తుంది. దీని పేరు మంథకర్మ.

ఉపాసకుడు, అమావాస్య రోజు దీక్ష పూని, పూర్ణిమరాత్రి పెరుగు, తేనెలలో ధాన్యముల పిండిని పిష్ఠముగా చేసి, జ్యేష్ఠుడు, శ్రేష్ఠుడు అయిన ప్రాణదేవతకు అర్పితమగు గాక అని అగ్నిలో అర్పించాలి. మిగిలిన నేతిబొట్లను పిష్ఠముపైవేయాలి. దీన్ని ఆహుతీశేషం అంటారు. ప్రాణదేవత 6 గుణాలను చెబుతూ అర్పించాలి.

**జ్యేష్ఠాయ శ్రేష్ఠాయ స్వాహా**
**వసిష్ఠాయ స్వాహా ప్రతిష్ఠాయై స్వాహా**
**సంపదే స్వాహా**
**ఆయతనాయ స్వాహా**

అలా ఒక్కొక్కసారి మిగిలిన నేతిబొట్లను పిష్ఠముపై వేయాలి.

ఈ ఆహుతీ శేషాన్ని వాడాలి. దానికి కూడా మంత్రం ఉంది.

**మంత్రం 6, 7:** ఈ మంథశేషం ఎలా తీసుకోవాలో వస్తుంది. అగ్నికి వెనక్కి జరిగి, మంథశేషాన్ని దోసిలిలో ఉంచుకుని ఇలా జపించాలి.

నువ్వు **అమః** అనే పేరు గలదానవు. జ్యేష్ఠత్వాన్ని, శ్రేష్ఠత్వాన్ని, ప్రకాశత్వాన్ని, ఆధిపత్యాన్ని ఉన్నదానవు. వీటిని నాకు కలుగజేయి.

**సర్వమసాని** – నేను ఈ సర్వం అగుదును గాక.

ఇది తినటం కూడా ఎలా పడితే అలా తినకూడదు. అగ్నికి వెనకకి జరగాలి. గబగబా తినకూడదు. నిల్చుని తినకూడదు. దానికి కూడా మంత్రం జపిస్తూ, నాలుగు పాదాలుగా జపించి, నాలుగు ముద్దలుగా తినాలి.

**తత్సవితుర్వృణీమహే**
**వయం దేవస్య భోజనమ్**
**శ్రేష్ఠగ్ం సర్వధాతమ్**
**తురం భగస్య ధీమహి**

అంతా పూర్తి చేసాక ఏం చేయాలి? పడుకోవాలి.

**పశ్చాదగ్నేః** – అగ్నికి దూరంగా పడమర దిక్కున పడుకోవాలి. తలని ఉత్తరం దిక్కున పెట్టుకోవాలి.

**స్థణ్డిలే** – యాగభూమిలో, చర్మంమీద పడుకోవాలి.

**స యది స్త్రియం పశ్యేత్సమృద్ధం కర్మేతి విద్యాత్** – అతని యజ్ఞం ఫలితాన్ని ఇస్తుందా లేదా అన్నది అతనికొచ్చే కలనిబట్టి తెలుస్తుంది. అతను కలలో స్త్రీని చూస్తే అది విజయవంతమైనట్టు లెక్క. ఆనందగిరి ఆ స్త్రీ ఉత్తమస్త్రీ అని రాస్తారు.

**మంత్రం 8: యదా కర్మసు కామ్యేషు స్త్రియగ్ం స్వప్నేషు పశ్యతి** – దీని గురించి ఋగ్మంత్రం ఉంది. కామ్యకర్మ చేసిన రాత్రి స్త్రీని కలలో చూస్తే అతని కర్మ సుసంపన్నమైనదని అర్థం. ఈ కల వాసనాజన్యం కాదు. అలాగైతే అది అతని బలహీనతకు చిహ్నం. ఇక్కడ అతను యజ్ఞం చేశాడు, ప్రాణోపాసన చేశాడు. స్త్రీని గురించి ఆలోచన లేదు. అందువల్ల ఇది వాసనాజన్యం కాదు. కర్మఫలం. అందుకని **తత్ర జానీయాత్తస్మిన్స్వప్న నిదర్శనే.**

కొన్ని విషయాలు గమనించాలి ఇందులో. ఈ యజ్ఞం చేయటానికి కూడా ప్రత్యేక సమయం ఉంది. అమావాస్య రోజు దీక్ష తీసుకుని, పౌర్ణమి రోజు చేయాలి. అతని మనసు, వాక్కు అతని ఆధీనంలో ఉండాలి. అందుకని స్వప్నం అతని బలహీనతవల్ల కాదు, కర్మఫలం అని వచ్చింది.

**ఫలం** – అతను ప్రాణానికి ఉన్న గుణాలమీద ఉపాసన చేస్తాడు కాబట్టి ఆ గుణాలు అతనికీ వస్తాయి. శ్రేష్ఠత్వం, జ్యేష్ఠత్వం, వసిష్ఠత్వం వగైరా. మంథకర్మ స్వతంత్రకర్మ కాదు. దీన్ని ఉపాసనతో కలిపి చేయాలి.

## ఖండాలు 5.3–5.10 – 2 పంచాగ్ని విద్య

2. **పంచాగ్ని విద్య** – ఇక్కడ కూడా ఐదు ప్రశ్నలు చూస్తాము. అవి వరుస క్రమం కొంచెం భిన్నంగా ఉంటుంది. ఇక్కడ వరుసక్రమం ప్రకారం చూద్దాము.

1. ఈలోకంనుంచి జీవులు పైకి ఎక్కడికి వెళతారో తెలుసా?
2. ఎలా తిరిగి వస్తారో తెలుసా?
3. శుక్లగతి, కృష్ణగతి ఎక్కడ విడిపోతాయో తెలుసా?
4. ఎందుకు స్వర్గలోకం నిండిపోవటం లేదో తెలుసా?
5. ఐదవ ఆహుతి తరువాత జలశరీరం పురుషశరీరం ఎలా పొందుతుందో తెలుసా?

ఈ ఐదవ ప్రశ్ననే బృహదారణ్యకంలో 4వ ప్రశ్నగా ఈ విధంగా చూస్తాము – 5. ఏ దశలను దాటుకుని జీవుడు మనుష్యలోకానికి తిరిగి వస్తాడు?

## పంచాగ్ని విద్య ఖండాలు 4–9

| ఖండం | దశ | శరీరం | తర్వాతి దశ | అగ్ని |
|---|---|---|---|---|
| 4 | 1 | జలీయ శరీరం | సోమశరీరం | స్వర్గదేవత |
| 5 | 2 | సోమ శరీరం | వృష్టిశరీరం | మేఘదేవత |
| 6 | 3 | వృష్టి శరీరం | అన్నశరీరం | పృథివీ దేవత |
| 7 | 4 | అన్న శరీరం | రేతశరీరం | పురుషుడు (పురుష బీజం) |
| 8 | 5 | రేతశ్శరీరం | మనుష్యశరీరం | స్త్రీ |

బృహదారణ్యకంలో శ్వేతకేతుకు కోపం ఇంకా తగ్గకపోవటంతో రానన్నాడు. కాని ఇక్కడ అతను కూడా గౌతమునితో కలిసి తిరిగి రాజు దగ్గరికి వెళతాడు.

**ముఖ్య హెచ్చరిక** – ఈ ప్రశ్న సారాంశం మరణం తర్వాత జీవి ప్రయాణం, పునర్జన్మ గురించి.దానికి జవాబు చూసేముందు ఒక విషయం గ్రహించాలి. ఉపనిషత్తు ఉద్దేశం మరణం తర్వాత జీవితం గురించిన వివరాలు చెప్పటం కాదు. పంచాగ్నివిద్య చెప్పింది ఉపాసన కోసం. రెండో ఉద్దేశం వైరాగ్యం సృష్టించటంకోసం. ఎలా? జీవుడు పునరపి జననం, పునరపి మరణం పొందుతూ సంసారంలో పడి కొట్టుమిట్టాడుతుంటాడని అర్థమవుతుంది దీనిద్వారా.

శ్రుతి అందుకే మరణం తర్వాత ప్రయాణం గురించిన పూర్తి వివరాలు ఇవ్వలేదు. మరణం తర్వాత ఏమవుతుంది అనేది పూర్తిగా ఊహాజనితమైన చర్చే. అయినా, ఫర్వాలేదు. ఎందుకంటే వేదాంతం మరణం తర్వాత జీవితాన్ని నమ్మమని చెప్పటం లేదు. వేదాంతం ప్రస్తుత జీవితంలోని సంసారం గురించి, ప్రస్తుత జీవితంలో మోక్షం ఎలా పొందాలి అనే దాని గురించి చెబుతుంది. ఇది బాగా గుర్తుంచుకోవాలి. జీవనసంసారం గురించి జీవన్ముక్తి గురించి, చెపుతుంది. ఇచ్చిన వివరాలన్నీ ఉపాసనకోసం ఇవ్వబడ్డాయి. అవి నిజమా,

కాదా అన్నది పట్టించుకోకూడదు. ఒకవేళ నిరూపించుకోవాలని చూసినా, వేరే మార్గమేమీ లేదు. శ్రుతి మీరు ఉత్తరంవైపుకు వెళతారు అంటే, మనం దాన్ని నిరూపించగలమా? శాస్త్రమే ప్రమాణం అని దయానంద స్వామీజీ ఎప్పుడూ చెబుతారు. శ్రుతి ఏ వివరాలిస్తే వాటిని స్వీకరించాలి. మిగతావి మనకు తెలిసే మార్గం లేదు అనే విషయం మనం గ్రహించాలి. దీన్ని స్టాచ్యూటరీ వార్నింగ్ కింద తీసుకోవాలి.

దీనినుంచి ఇంకో విషయం గ్రహించాలి మనం. పురుషబీజం స్త్రీలో ప్రవేశిస్తున్నప్పుడే, అందులో జీవుడు ఉన్నాడు. కొంతమంది గర్భస్థ శిశువు 3,4 నెలల వరకు మాంసపిండం మాత్రమే, అందులో ప్రాణం ఉండదు అనుకుంటారు. అది పొరపాటు. ఆ సమయంలో రూపురేఖలు ఏర్పడవు కాని ప్రాణం ఉంటుంది. అందుకే అబార్షన్ చేయించటం భ్రూణహత్య అవుతుంది. ఇదీ పంచాగ్నివిద్య.

## ఖండం 5.10- ప్రశ్నలు 1, 3

ఇందులో ఒకటోప్రశ్నకు, మూడో ప్రశ్నకు సమాధానాలు వస్తాయి. జవాబులు వరుసక్రమంలో లేవు. ముందు ఐదవ ప్రశ్నకు జవాబు వచ్చింది. అది ముందు తెలిస్తే, తక్కినవి అర్థం చేసుకోవటం తేలిక. ముందు, ప్రశ్నలు మళ్లీ ఒకసారి చూద్దాము.

ప్రశ్న 1: ఈ లోకంనుంచి జీవులు పైకి ఎక్కడికి వెళ్తారో తెలుసా?
ప్రశ్న 3: శుక్లగతి, కృష్ణగతి ఎక్కడ విడిపోతాయో తెలుసా?

మూడవ ప్రశ్నలో మనకి మొదటి ప్రశ్నకి కొంచెం జవాబు వస్తుంది. జీవులు రెండు మార్గాల ద్వారా పైకి వెళ్తాయి. వాటిని శుక్లగతి, కృష్ణగతి అంటారు. శుక్లగతిని దేవయానమార్గం అనీ, కృష్ణగతిని పితృయానమార్గం అనీ కూడా అంటారు. శుక్లగతిని ఉత్తరాయణగతి అని, కృష్ణగతిని దక్షిణాయనగతి అని కూడా అంటారు.

**అగ్నిర్జ్యోతిరహః శుక్లః షణ్మాసా ఉత్తరాయణమ్।**
**తత్ర ప్రయాతా గచ్ఛంతి బ్రహ్మ బ్రహ్మవిదో జనాః॥** – గీత 8.24

ఆ మార్గాలకు ఆయా దేవతలు అధిష్ఠానదేవతలు. అంతేకాదు వారు జీవిని ఒక స్థానంనుంచి ఇంకో చోటుకు తీసుకువెళతారు కూడా. అందుకే వాళ్ళకు ఆదివాహికులు అని ప్రత్యేకమైన పేరు కూడా ఉంది.

శుక్లగతి, కృష్ణగతి ఎక్కడ విడిపోతాయన్న ప్రశ్నకు ఆయా గతుల్లో వెళ్ళగలిగే అర్హత ఎవరికిఉందో కూడా చెపుతున్నది ఉపనిషత్తు.

**దశమ ఖండం మంత్రం 1: తద్య ఇత్థం విదుః** – పంచాగ్ని ఉపాసన లేదా వేరే ఏదైనా ఉపాసన చేసిన వ్యక్తి. పంచాగ్ని ఉపాసనే ఎందుకు పేర్కొంది? ఇక్కడ ప్రస్తుతం దాని గురించిన చర్చ ఉంది కాబట్టి, ఈ పంచాగ్ని ఉపాసన చేసిన గృహస్థుల గురించి చెపుతున్నది.

గృహస్థు నిత్య, నైమిత్తిక కర్మలు తప్పనిసరిగా చేయాలి. మీమాంసలో నిత్యకర్మలు అంటే రోజూ చేసే పని కాదు. ఎప్పుడే కర్మలు చేయాలో అవి చేయాలి. గృహస్థు రెండు విధాలుగా చేయవచ్చు. కేవల కర్మ చేయవచ్చు, లేదా కర్మ, ఉపాసనల సముచ్చయం (రెండూ కలిపి) చేయవచ్చు. గృహస్థు కర్మలు చేసి తీరాలి. ఉపాసన చేస్తే చేయవచ్చు, లేదా చేయకపోనూ వచ్చు. గృహస్థు కేవలకర్మ చేస్తే పితృయానమార్గం ద్వారా వెళతాడు. కర్మ, ఉపాసనల సముచ్చయం చేస్తే దేవయానమార్గం ద్వారా వెళతాడు.

**యే చేమేఽ రణ్యే** – వానప్రస్థ ఆశ్రమానికి చెందిన వ్యక్తులు. వానప్రస్థం ఉపాసన ప్రధానం. గృహస్థాశ్రమం కర్మ ప్రధానం. వానప్రస్థంలో కర్మ చాలా తక్కువ ఉంటుంది. యజ్ఞోపవీతం ఉంటుంది కాబట్టి కర్మలు పూర్తిగా మానటానికి లేదు. అరణ్యే అంటే వానప్రస్థాన్ని ప్రస్తావిస్తున్నది.

**సంన్యాసాశ్రమం** – సంన్యాసాశ్రమం జ్ఞానప్రధానంగా ఉంటుంది. కాని కొంత ఉపాసన కూడా చేయవచ్చు. అతను కూడా వస్తాడు ఇందులో. శంకరాచార్యులు నైష్ఠిక బ్రహ్మచారి కూడా వీళ్ళ తెగలోకి వస్తారంటారు.

**శ్రద్ధా తప ఇత్యుపాసతే** – కష్టసహిష్ణుత్వం తపః అంటారు. అనేక అంశాలు అందులో వస్తాయి. అంటే ఒక నియంత్రణ ఉండాలి. అది కూడా ఎలా చేయాలి? శ్రద్ధగా. అంతేకాదు ఉపాసన కూడా చేయాలి. ఇప్పుడు మార్గం –

**తే అర్చిషమభిసమ్భవన్తి** – అర్చిః అంటే వాచ్యార్థం జ్యోతి. ఇక్కడ దేవత. అందుకే ఈ మార్గాన్ని అర్చిరాదిమార్గం అని కూడా అంటారు.

**అర్చిషోఽ హర్** – అర్చి దేవతనుంచి పగటి దేవతను;
**అహరహ్న ఆపూర్వమాణ పక్షం** – పగటి దేవతనుంచి శుక్లపక్ష దేవతను;
**అపూర్యమాణపక్షాద్యాన్షడుదఙ్జేతి మాసాగ్ంస్తాన్** – శుక్ల పక్ష దేవత నుంచి ఆరు మాసాలను (ఉత్తరాయణ దేవత);

**మంత్రం 2: మాసేభ్యస్సంవత్సరగ్ం** – ఉత్తరాయణ దేవతనుంచి సంవత్సర దేవతను;
**సంవత్సరాదాదిత్యమ్** – సంవత్సర దేవతనుంచి ఆదిత్యుని,
**ఆదిత్యాచ్చన్ద్రమసం** – ఆదిత్యునినుంచి చంద్రుని,

**చన్ద్రమసో విద్యుతం** – చంద్రునినుంచి విద్యుద్దేవతను చేరుతారు.
**తత్పురుషోऽమానవస్స ఏనాన్బ్రహ్మ గమయతి** – విద్యుద్దేవతనుంచి అమానవపురుషుడు వచ్చి బ్రహ్మలోకానికి తీసుకువెళతాడు.
**ఏష దేవయానః పంథా** – ఇది శుక్లగతి.

**బ్రహ్మ గమయతి** – అంటే సత్యం, జ్ఞానం, అనంతం బ్రహ్మ కాదు. నిర్గుణం బ్రహ్మ కాదు. సర్వవ్యాపకమైన నిర్గుణ బ్రహ్మను బ్రహ్మలోకానికి పరిమితం చేయలేము. అక్కడ బ్రహ్మలోకంలో సాధకుడు ఆనందంలో ఓలలాడుతూ ఉండవచ్చు, లేదా బ్రహ్మద్వారా బ్రహ్మజ్ఞానం పొంది తర్వాత ప్రళయం వచ్చినప్పుడు విదేహముక్తి పొందుతాడు. ఇదే విషయం 4.15.5లో కూడా వచ్చింది. క్రమముక్తి పొందవచ్చు. బ్రహ్మజ్ఞానం పొందకపోతే మళ్ళీ జన్మనెత్తక తప్పదు.

**ఆబ్రహ్మ భువనాల్లోకాః పునరావర్తినోऽర్జున** – గీత 8.16

**మంత్రాలు 3, 4:** ఇప్పుడు గ్రామంలో ఉన్న గృహస్థు గురించి – అంతకు ముందు 'అరణ్యే' అన్న పదం వచ్చింది. ఇప్పుడు 'గ్రామ'. అరణ్యే ఉపాసకులను సూచిస్తే 'గ్రామ' కేవల కర్మిష్ఠుల గురించి చెబుతున్నది. కర్మలు మూడు రకాలు – ఇష్టాపూర్తేదత్తం.

**ఇష్టం – ఇష్టమగ్నిహోత్రాది వైదికం కర్మ**

అగ్నిహోత్రం, వైశ్వదేవంవంటి వైదికకర్మలు

**పూర్తం – పూర్తం వాపీకూపతటాకారామాది కరణమ్**

దిగుడు బావులు, నూతులు, చెరువులు త్రవ్వించటం – సత్రాలను కట్టించటం. చలివేంద్రాలను పెట్టించటంలాంటి సేవాకార్యాలు.

**దత్తం – బహిర్వేది యథా శక్త్యర్హేభ్యో ద్రవ్యసంవిభాగో దత్తమ్**

యజ్ఞంలో కాకుండా విడిగా, శక్తిని మించకుండా యోగ్యులైన వారికి ధనాన్ని పంచిపెట్టటం.

ఇతి ఉపాసతే అంటే ఉపాసనచేసేవాడు కాదు, ఇష్టాపూర్తేదత్తం చేసేవాడు అని అర్థం.

మనుష్యుల్లో నాలుగు రకాలు ఉన్నారు – జ్ఞాని, ఉపాసకుడు, కర్మిష్ఠుడు, ఇవేవీ కానివాడు– వేదాంతపరిభాషలో కర్మిష్ఠుడు, ఇవేవీ కానివాడికన్నా ఉన్నతస్థాయిలో ఉంటాడు కాని, జ్ఞాని, ఉపాసకులకన్నా తక్కువస్థాయికే చెందుతాడు. ఊరంతా అతన్ని ఎంత కొనియాడినా, అతను ఎన్ని పుణ్యకార్యాలు చేసినా అతను శుక్లగతిలో వెళ్ళలేడు. బ్రహ్మలోకాన్ని చేరలేడు. అతను కృష్ణగతి ద్వారా వెళతాడు.

అతని మార్గం ఇలా ఉంటుంది –

**తే ధూమ మభిసమ్భవన్తి** – వీరు ధూమదేవతను పొందుతారు;
**ధూమాద్రాత్రిగ్ం** – ధూమం నుంచి రాత్రిని;
**రాత్రేరపరపక్షం** – రాత్రినుంచి కృష్ణపక్షాన్ని;
**అపరపక్షాద్యాన్షడ్దక్షిణైతి మాసాగ్ం స్తాన్** – కృష్ణపక్షం నుంచి దక్షిణాయనాన్ని పొందుతారు.
**నైతే సంవత్సరమభిప్రాప్నువంతి** – వీరు సంవత్సర దేవతను పొందరు.

ఇక్కడ కృష్ణపక్ష, శుక్లపక్ష మార్గాలు విడివడతాయి.

**మాసేభ్య: పితృలోకం** – మాసాలనుంచి పితృలోకాన్ని;
**పితృలోకాదాకాశమ్** – పితృలోకంనుంచి ఆకాశాన్ని;
**ఆకాశాచ్చన్ద్రమసమ్** – ఆకాశంనుంచి చంద్రుని (పొందుతారు)
**ఏష సోమో రాజా** – ఈ చంద్రుడు ఓషధులకు ప్రభువు.

**తద్దేవానామన్నం తం దేవా భక్షయన్తి** – ఇక్కడ వ్యాచ్యార్థం తీసుకుంటే వారిని దేవతలు భక్షిస్తారు అని వస్తుంది. కాని లక్ష్యార్థం ప్రకారం దేవతలు వారిని ఉపయోగించుకుంటారు అని అర్థం తీసుకోవాలి. అంటే దేవతలకు వారు సేవ చేస్తే, దేవతలు వారికి ప్రతిఫలంగా రంభ, ఊర్వశుల నృత్యాలను తిలకించే అవకాశంలాంటివి ఇస్తారు.

**టూకీగా** – దీనితో 1, 3 ప్రశ్నకు జవాబులు వచ్చేశాయి. ప్రశ్న-1 – రెండు మార్గాలు – శుక్లగతి, కృష్ణగతి. శుక్లగతి ద్వారా చివరికి బ్రహ్మలోకం చేరుకుంటే, కృష్ణగతిద్వారా చంద్రలోకం చేరుకుంటారు. ప్రశ్న-3 – ఈ రెండు మార్గాలు సంవత్సరదేవత దగ్గర విడిపోతాయి.

**మంత్రాలు 5-7:** ఈ మంత్రంలో రెండవ ప్రశ్నకు జవాబు వస్తుంది.

ప్రశ్న-2 ఎలా తిరిగి వస్తారో తెలుసా?

**యథేతం** – విడిగా అడగనవసరం లేదు. ఎలా వెళ్ళారో అలా తిరిగి వస్తారు అంటున్నది ఉపనిషత్తు.

**తస్మిన్యావత్సమ్పాతముషిత్వా** – సంపాతం అంటే పుణ్యకర్మ. జీవికి సుఖదుఃఖాలను ఇవ్వటానికి అతని ముందుకు వస్తుంది పుణ్యకర్మ. యావత్సంపాతం అంటే పుణ్యకర్మ మొత్తం ఉన్నంతవరకూ పుణ్యలోకాల్లో ఉంటాడు. **తస్మిన్యావత్సమ్పాతముషిత్వా** అనే ఈ మాటలను శంకరాచార్యులువారు తరచు వాడతారు.

**తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం**

**క్షీణేపుణ్యే మర్త్యలోకం విశంతి।** – గీత 9.21

**అథైతమేవాధ్వానం పునర్నివర్తన్తే** – కర్మ క్షయమయ్యేవరకూ పుణ్యలోకాల్లో ఉండి, తర్వాత తిరిగి వస్తాడు. ఎలా?

**యథేతం** – వెళ్ళిన తోవలోనే వస్తాడు. అంటే ఆకాశం, ఆకాశంనుంచి వాయువు, వాయువునుంచి ధూమం, ధూమంనుంచి మేఘం, మేఘంనుంచి పృథివిలో ధాన్యం, యవలు, మొక్కలు, చెట్లరూపంలో పుడతాడు. అంటే చెట్లలో కూడా జీవుడు ఉంటాడు. మరి చెట్లను కోస్తే ఈ జీవికి బాధ కలుగుతుందా? కలుగదు. ఎందుకంటే జీవి, మానవశరీరం పొందాకే కర్మఫలాన్ని అనుభవించగలడు. అంతవరకు ప్రయాణం చేయగలడు కాని, అనుభవించ లేడు. ఇంతవరకూ ప్రయాణం కూడా సాఫీగా సాగుతుంది.

**దుర్నిష్ప్రపతరమ్** – దాని తర్వాతనుంచి ప్రయాణం చాలా కష్టంగా ఉంటుంది. జీవి పురుషునిలో ప్రవేశించడం చాలా అరుదు. ఎందుకు? శంకరాచార్యులు అనేక కారణాలు ఇస్తారు.

**రేతస్సిఞ్చతి** – జీవి అన్నం ద్వారా పురుషునిలో ప్రవేశించాలి. అన్నం తినబడాలి, అది కూడా పురుషుడు తినాలి. పురుషునిలో జీవి అది రేతస్సుగా మారాలి. స్త్రీలు, వృద్ధులు, బ్రహ్మచారులు, పిల్లలు, సన్న్యాసులు తింటే జీవి పుట్టలేదు. రేతస్సును విడిచే పురుషుడు తినాలి. ఆ రేతస్సును స్త్రీలో వదలాలి.

**తద్భూయ ఏవ భవతి** – స్త్రీలో ప్రవేశించి శిశువుగా పుట్టినప్పుడు, ఆ తల్లిదండ్రుల ఆకారాన్ని పోలి ఉంటుంది కాని మరియొక జాతికి చెందదు.

**విశేషం –** మన శరీరం ఉన్నతమైనదా, నీచమైనదా అన్నది పూర్వజన్మలో మన పుణ్యకర్మనిబట్టి ఉంటుంది. పుట్టుక ఆకస్మికంగా జరిగేది కాదు. పుట్టుక అనుకోకుండా జరిగింది అన్నమాటను శాస్త్రం ఒప్పుకోదు.

**తద్య ఇహ రమణీయచరణా** – అంటే సదాచారవంతుడు;

**తద్యోని** – ఉత్తమజన్మను; **అభ్యాశో హ** – శీఘ్రముగానే పొందుతాడు.

ఉత్తమజన్మ అంటే బ్రాహ్మణుడుగా గాని, క్షత్రియుడుగా గాని, వైశ్యుడుగా గాని జన్మిస్తాడు. వీరిని ద్విజులు అంటారు. వీరికి ఉపనయనం జరుగుతుంది. వేదాలను అధ్యయనం చేసి, జ్ఞానమార్గంలోకి వెళ్ళి మోక్షం పొందే అవకాశం ఉంది.

**అథ య ఇహ కపూయచరణా** – ఎవరైతే దురాచారపరులో వారు;

**అభ్యాశో హ యత్తే కపూయాం యోనిమాపద్యేరన్** – శీఘ్రంగా దుష్టయోనిలో పుడతారు.
**శ్వయోనిం వా సూకరయోనిం వా చన్డాలయోనిం వా** – వారు కుక్కగా గాని, పందిగా గాని, ఛండాలుడిగా గాని పుడతారు. ఛండాలుడంటే అవైదిక పురుషుడు. అతను వేదాలను నమ్మడు.

**టూకీగా –** దీనితో రెండవ ప్రశ్నకు జవాబు ముగిసింది. ఎలా తిరిగి వస్తారో తెలుసా? వెళ్ళిన మార్గంలోనే తిరిగివస్తారు.

**మంత్రం 8:** ప్రశ్న 4 – ఎందుకు స్వర్గలోకం నిండిపోవటం లేదో తెలుసా?

**అథైతయో: పథోర్న కతరేణ చ న తానీమాని క్షుద్రాణి** – శుక్లగతి, కృష్ణగతి కాకుండా మూడో మార్గం ఉంది– ఏమీ చేయనివారు, ఇతరులకు హాని చేసేవారు అధోగతి ద్వారా వెళతారు. వారు అల్పప్రాణులుగా పుడతారు. దోమలు, ఈగలు, క్రిమికీటకాదులుగా పుడతారు.

**జాయస్వ మ్రియస్వేతి** – పుడతారు, వెంటనే మరణిస్తారు. అలా అనేకసార్లు పుట్టి, మరణిస్తుంటారు కొందరు జీవులు.

**తత్తృతీయగ్ం స్థానం తేనాసౌ లోకో న సంపూర్యతే** – ఇది మూడవస్థానం. ఇటువంటి జీవులు ఎక్కువ ఉండటంవల్ల స్వర్గలోకం నిండటం లేదు.

**మంత్రం 9**: పంచమహాపాతకం గురించి చెపుతున్నది ఉపనిషత్తు.

**స్తేనో హిరణ్యస్య** – బంగారాన్ని దొంగిలించినవాడు;
**సురాం పిబన్** – మద్యాన్ని త్రాగేవాడు;
**గురోస్తల్పమావసన్** – గురువును కించపరిచేవాడు;
**బ్రహ్మహా చైతే పతన్తి** – బ్రహ్మహత్యను చేసినవాడు;
**పంచమశ్చాచరగ్ం స్తైరితి** – పై వాళ్ళతో కలిసి తిరిగేవాడు.

**మంత్రం 10: న పాప్మనా లిప్యతే** – దానికి విరుద్ధంగా ఎవరైతే పంచాగ్ని ఉపాసన చేస్తాడో అతడు వారితో కలిసి తిరిగినా కూడా అతనికి పాపం అంటదు.

**శుద్ధః పూతః పుణ్యలోకో భవతి** – ఎవరైతే ఈ విధంగా ఉపాసిస్తారో అతడు శుద్ధుడు, పవిత్రుడు అయి, పుణ్యలోకాలకు వెళతాడు. ఈ విధంగా పంచాగ్నివిద్య ఫలం వచ్చింది.

**టూకీగా –** స్వర్గం ఎందుకు నిండటం లేదో తెలుసా అనే నాలుగో ప్రశ్నకు జవాబు – అధోలోకానికి వెళ్ళే జీవులు ఎక్కువ ఉంటారు. వారు పుడుతూ, వెంటనే మరణిస్తూ ఉంటారు.

ఈ ఐదు ప్రశ్నల్లో మొదటిది, ఐదవది ముఖ్యమైనవి. మొదటిది కూడా శుక్లగతి, కృష్ణగతుల గురించి వేరేచోట నేర్చుకుంటాము. అందుకని పంచాగ్నివిద్య గురించి ముఖ్యంగా తెలుసుకోవాలి. పంచాగ్నివిద్యకు రెండు ఫలాలు చూశాము.

**ఇహలోక ఫలం** – మహాపాపితో కలిసి తిరిగినా పాపం అంటదు.
**పరలోక ఫలం** – బ్రహ్మలోకప్రాప్తి, క్రమముక్తి.

## ఖండాలు 5.11–5.24 3 వైశ్వానరవిద్య

**విశ్వవిరాట్ ఐక్య ఉపాసన** – ఇంకొక క్షత్రియుడు గురువు అవుతాడు, బ్రాహ్మణులు శిష్యులు అవుతారు. ఇదీ ఇందులో విశేషం. క్షత్రియుడు అశ్వపతి లేదా కేకయరాజు. కైకేయికి తండ్రి ఆయన. ప్రశ్నోపనిషత్తులో లాగా ఇక్కడ కూడా ఆరుగురు శిష్యులు ఉంటారు. వారి పేర్లు చెప్పేబదులు అశ్వపతి శిష్యషట్క సంవాదం అనవచ్చు దీనిని. ఖండం 11 నుంచి 24 వరకు సంభాషణరూపంలో ఉంటుంది. అంశం విరాట్ ఉపాసన. దీన్నే **వైశ్వానరవిద్య** అంటారు. ఇది అంగీ ఉపాసన. దీనితో పాటు ఒక అంగకర్మ కూడా ఉంది. అది ప్రాణాగ్నిహోత్రం. ఈ ఉపాసనను ఒక ఆఖ్యాయిక (కథ) ద్వారా చెపుతున్నది ఉపనిషత్తు.

**మంత్రం 1:** ఈ కథద్వారా కొన్ని ముఖ్యమైన అంశాలను చెప్పకనే చెపుతుంది. శిష్యుల పేర్లు–

> **ప్రాచీనశాల ఔపమన్యవః సత్యయజ్ఞో పౌలుషిః ఇంద్రద్యుమ్నో భాల్లవేయః**
> **జనశ్శార్కరాక్ష్యః బుడిలో ఆశ్వతరాశ్విః**

రెండు పేర్లు ఎందుకు? ఒకటి వాళ్ళ పేరు, ఇంకోటి వంశం పేరు. ఉదాహరణకు, **ప్రాచీనశాల ఔపమన్యవః** అంటే ఉపమన్యుని పుత్రుడు ప్రాచీనశాలుడు.

**మహాశాలా మహాశ్రోత్రియాః** – వీరు మామూలు మనుష్యులు కారు. మహాసంపన్నులు. అందువల్ల మహాదాతలు కూడా.

> **శౌనకో హ వై మహాశాలోఽంగిరసం విధివదుపసన్నః పప్రచ్ఛ** – ముండకమ్

**సమేత్య మీమాగ్ంసాంచక్రుః** – వారు ఒకచోట చేరి చర్చలు చేసుకున్నారు.

**కో న ఆత్మా కిం బ్రహ్మేతి** – సమష్టి బ్రహ్మకు సమానమైన వ్యష్టి ఆత్మ ఏది? ఉపాసనలో బ్రహ్మ అన్నప్పుడల్లా నిర్గుణబ్రహ్మను కాకుండా, సగుణ బ్రహ్మను తీసుకోవాలి. అందువల్ల వ్యష్టిపరంగా విశ్వ, సమష్టిపరంగా విరాట్‌ల గురించిన చర్చ ఇది. అంటే ఇది **విశ్వ విరాట్ ఐక్య ఉపాసన** అవుతుంది. వారి చర్చలో వారికి సమాధానం దొరకలేదు. అప్పుడు గురువు

దగ్గరకి వెళ్ళారు. గురువు పేరు ఆరుణి. ఆయననే ఉద్దాలకుడు, గౌతముడు అని కూడా అంటారు.

**మంత్రం 2:** మాకు విరాట్ గురించి చెప్పగలరా అని అడిగారు. ఆరుణి తనకు కూడా పూర్తిగా తెలియదని చెప్పాడు.

**మంత్రాలు 2-5:** వాళ్ళని కేకేయరాజు దగ్గరకు వెళ్ళమని గౌతముడు చెప్పాడు. తాను కూడా వారితో కలిసి కేకేయ రాజైన అశ్వపతి దగ్గరకు వెళ్ళాడు. ఆ విధంగా శిష్యులు ఆరుగురు అయ్యారు.

వచ్చిన బ్రాహ్మణులను, రాజు సాదరంగా ఆహ్వానించి, వారికి విడివిడిగా సత్కారాలు చేయించాడు. ఆ రోజు విశ్రాంతి తీసుకోమని మర్నాడు ఏం కావాలో అడిగాడు. ఎవరైనా రాగానే ఎందుకు వచ్చారని అడుగకూడదు.

రాజు వారికి దక్షిణనిచ్చాడు. బ్రాహ్మణులు క్షత్రియులనుంచి దానాన్ని స్వీకరిస్తారు. కాని ఈ బ్రాహ్మణులు స్వీకరించలేదు. రాజు బాధపడ్డాడు. ఎందుకంటే రాజ్యంలో పాపాలు చెలరేగుతుంటే, ఆ పాపం రాజుకు అంటుకుంటుంది. అటువంటి పాపపు రాజునుంచి దానం స్వీకరించకూడదు. వారు స్వీకరించకపోయేసరికి, తనలో వారు ఖచ్చితంగా దోషం చూస్తున్నారని భావించి, తన రాజ్యం గురించి ఇలా చెప్పాడు.

**న మే స్తేనో జనపదే** – నా రాజ్యంలో దొంగలు లేరు.
**న కదర్యః** – దానము చేయనివాడు లేదు.
**న మద్యపః** – మద్యమును త్రాగువాడు లేదు.
**నానాహితాగ్నిః** – వైదికకర్మలు చేయనివాడు లేదు.
**నావిద్వాన్** – ఉపాసన చేయని వాడు లేదు.
**న స్వైరీ** – పరస్త్రీవ్యామోహం ఉన్నవాడు లేదు.
**స్వైరిణీ కుతః** – పరస్త్రీ వ్యామోహం లేనప్పుడు, చెడు నడవడికల స్త్రీ సంభవమే కాదు.

ఇవన్నీ తన గురించి గొప్పలు చెప్పటానికి చెప్పలేదు. తను దానం ఇచ్చేందుకు అర్హుడనని చూపుకోవటానికి చెప్పాడు. అప్పుడు కూడా వారు స్వీకరించలేదు. తను ఇచ్చింది చాలలేదేమో అనుకున్న రాజు, తాను యజ్ఞం చేయబోతున్నానని, ఋత్విక్కులకు ఇవ్వబోయేటంత ధనం వారికీ ఇస్తాననీ చెబుతాడు.

**వసన్తు భగవన్త** – దయజేసి పూజ్యనీయులైన మీరు ఉండండి.

**మంత్రం 6:** శిష్యులు ఆరుగురూ ఇలా చెప్పారు.

**యేన హైవార్థేన పురుషశ్చరేత్తగ్ం హైవ వదేత్** – ఏ ప్రయోజనంకోసం వెళతారో ఆ విషయం మాత్రమే చెప్పాలి. మనం నేర్చుకోవాల్సిన మరో మంచి నియమం.

**వైశ్వానరగ్ం సమ్ప్రత్యధ్యే** – వైశ్వానరవిద్య నీకు తెలుసు. అది మాకు చెప్పు అన్నారు.

**మంత్రం 7:** గురువుకు విద్య తెలిస్తే చెప్పననకూడదు. కాని ఉత్తమజాతి బ్రాహ్మణులకు తను గురువెలా అవగలడు? అందుకని రేపు రండి అన్నాడు. కొంతమంది మర్నాడు తిరిగి వెళ్ళరు. కాని ఈ శిష్యులు వెళ్ళారు. రాజు మామూలు ఆచారనియమాలు పాటించకుండానే, అంటే వారికి ఉపనయనం చేయించకుండానే, విద్యను బోధించాడు.

**ప్రత్యేక అంశాలు:** ఇందులో కథగాని, శిష్యుల పేర్లు గాని నిజమవవచ్చు. కాకపోవచ్చు. కాని వీటి ద్వారా కొన్ని విషయాలు గ్రహించాలి మనము.

1. గురు స్తుతి – విద్య గురువుద్వారానే నేర్చుకోవాలి.
2. విద్య మహిమ – విద్య మామూలు విద్య కాదు.
3. శిష్య లక్షణం – అభిమానత్యాగం, వినయం, అమానిత్వం.

శిష్యులు మహాశాల, మహాశ్రోత్రియ అయినా, ఇంకో గురువు దగ్గర నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండాలి. జిజ్ఞాస బలంగా ఉంటే అహం పక్కన పెడతారు. తాను రాజైనా కూడా, తానే గురువు దగ్గరకు వెళ్ళాలి.

4. గురులక్షణం – జిజ్ఞాస ఉన్న శిష్యునికి బోధించాలి.

## ఖండాలు 5.12-5.17

ఆరు చిన్న ఖండాలు. గురువు విద్య బోధించే ముందు, ఒక్కొక్క శిష్యుని విరాట్ గురించి అతనికి ఉన్న అవగాహన ఏమిటో తెలుసుకున్నాడు ముందు. వారు చెప్పిన సమాధానం విని, అది మెచ్చుకుని, దానివల్ల కలిగే మంచి ఫలం చెప్పి, కాని తన దగ్గరకు రాకపోయుంటే, ఏ నష్టం జరిగేదో చెప్పాడు.

ఇది విశ్వవిరాట్ ఐక్య ఉపాసన. విరాట్‌ని నా శరీరంలో ఊహించుకోవాలి. అంటే జీవేశ్వర ఐక్య ఉపాసన. ఇది సగుణ ఈశ్వర అని మర్చిపోకూడదు. ఐక్యం కూడా జ్ఞానంవల్ల కాదు, ఊహించుకోవటంవల్ల. స్థూలశరీరం స్థూలప్రపంచంతో ఎన్నటికీ సమానం కాలేదు. రెండింటిలోని చైతన్యం ఒకటే అని తెలుసుకుంటే అది జ్ఞానం. రెండూ ఒకటే అని ఊహించుకుంటే అది ఉపాసన.

## ఖండం 5.12

**మంత్రం1: ఔపమన్యవ కం త్వమాత్మానముపాస్సే** – మొదటి శిష్యుని రాజు ప్రశ్నించాడు. ఆ శిష్యుని పేరు ఔపమన్యుడు. నువ్వు ఏ ఆత్మను ఉపాసిస్తున్నావు?

**దివమేవ భగవో రాజన్** – పూజనీయుడైన ఓ రాజా, నేను ద్యులోకాన్ని విరాట్‌గా పూజిస్తున్నాను అన్నాడు. అతని ఇంకోపేరు ప్రాచీనశాలుడు.

అశ్వపతి జవాబుతో గురులక్షణం తెలుస్తుంది. శిష్యుడు చెప్పినదాన్ని వెంటనే తప్పు అనకూడదు. అలాగని సరియైనదనీ చెప్పకూడదు. **సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్.** సత్యాన్ని ప్రియంగా చెప్పాలి.

**సుతేజా ఆత్మా వైశ్వానరః** – నువ్వు ఆత్మగా ఉపాసిస్తున్న ద్యులోకం సుతేజాగా పేరు పొందింది. దాన్ని ఉపాసించటంవల్ల నీకు ఫలం కలుగుతుంది.

**తస్మాత్తవ సుతం ప్రసుతమాసుతం కులే దృశ్యతే** – ఫలం ఇప్పటికే పొందావు. సుతం, ప్రసుతం, ఆసుతం మూడూ సోమరసాలే. వేర్వేరు యజ్ఞాల్లో వేర్వేరు సోమరసాలు వాడతారు.

ఆ సోమరసాన్ని కూడా విభిన్న పద్ధతుల్లో తీస్తారు. తెచ్చే విధం కూడా భిన్నంగా ఉంటుంది. ఉదాహరణకు –

**అరుణాయః ఏకహాయస్య పింగాక్ష్య** – ఎర్రరంగులో ఉండి, ఒక సంవత్సరం వయసు ఉన్న, పసుపు కళ్ళు ఉన్న దూడను సోమలత ఉన్నవానికి ఇచ్చి, దాన్ని తెచ్చుకోవాలి. రసం తీసేటప్పుడు కూడా మంత్రం ఉంటుంది.

**ఫలం** – నీ వంశంలో సోమరసాలు వస్తాయి అని గురువు చెప్పాడు. అంటే నీ వంశంలో యజ్ఞయాగాదులు చేసే ఐశ్వర్యం ఉంటుంది.

**మంత్రం 2:** మరికొన్ని ఫలాలు పొందావని చెప్పాడు.

**అత్స్యన్నం** – మంచి జీర్ణశక్తి ఉండి, మంచి ఆహారాన్ని భుజించావు.

**పశ్యతి ప్రియం** – ఇష్టమైనవి చూశావు.

**అస్య కులే బ్రహ్మవర్చసం భవతి** – ఈ ఉపాసన ఎవరు చేస్తారో, వారి కులంలో బ్రహ్మవర్చస్సు ఉంటుంది. బ్రహ్మవర్చసులో బ్రహ్మ అంటే వేదం, వర్చస్సు అంటే కాంతి. వేదజన్యకాంతి పొందుతాడు అని అర్థం.

**మూర్ధా తే వ్యపతిష్యత్** – ఇప్పుడు విమర్శిస్తున్నాడు. నువ్వు కేవలం తలనే వైశ్వానరుడిగా భావిస్తున్నావు. అంగాన్ని అంగీగా పొరపడుతున్నావు. అదృష్టం బాగుండి నా దగ్గరకు వచ్చావు. లేకపోతే నీ తల నేలకూలి ఉండేది.

ఈ బెదిరింపును అక్షరాలా తీసుకోకూడదు. నువ్వు చేస్తున్న ఉపాసన అసంపూర్ణం అని చెప్పాడు అంటే అంగ ఉపాసన నింద, అంగి ఉపాసన స్తుతికోసం చేశాడు. –

## ఖండం 5.13

**మంత్రం 1:** ఇప్పుడు రెండవ శిష్యుడిని అడిగాడు గురువు. ఆ శిష్యుని పేరు సత్యయజ్ఞం పౌలుషి. అతని ఇంకోపేరు ప్రాచీనయోగ్యుడు.

**ఆదిత్యమేవ భగవో రాజన్** – ఆదిత్యుడిని ఉపాసిస్తున్నాను.

**విశ్వరూప ఆత్మా వైశ్వానరః** – ఆదిత్యుని విశ్వరూపుడు అని అంటారు అని గురువు చెప్పాడు. విశ్వరూపం అంటే గీతలో కృష్ణుడు చూపిన విశ్వరూపం కాదు. వివిధరూపాలు (రంగులు) ఉన్న ఆదిత్యుడు.

**ఫలం: తస్మాత్తవ బహు విశ్వరూపం కులే దృశ్యతే** – నీ వంశంలో అనేకమైన, అనేక రూపాలున్న సాధనలు ఉన్నాయి. అవికాక,

**మంత్రం 2: ప్రవృత్తోశ్వతరీరథః** – రెండు కంచర గాడిదలున్న రథం,

**దాసీనిష్కః** – దాసీలు, వారికి ఇవ్వటానికి సమృద్ధిగా ధనం,

**అత్స్యన్నం పశ్యసి ప్రియమత్త్యన్నం పశ్యతి ప్రియం భవత్యస్య బ్రహ్మవర్చసం కులే** – ఇవి ఇంకా అన్నింటికీ వస్తాయి. ఎవరైతే ఈ ఉపాసన చేస్తారో, అతను సమృద్ధిగా అన్నం తింటాడు, మంచివి చూస్తాడు. అందరికీ బ్రహ్మవర్చస్సు ఉంటుంది.

**చక్షుష్ట్వేతదాత్మ న ఇతి హోవాచాన్ధోఽ భవిష్యో యన్మాం నాగమిష్య** – ఈ వైశ్వానరుడు ఆత్మకు కన్ను. నువ్వు నా దగ్గరకి రాకపోయి ఉంటే, నువ్వు గ్రుడ్డివాడివి అయి ఉండేవాడివి.

## ఖండం 5.14

మూడవ శిష్యుడు ఇంద్రద్యుమ్న భల్లవేయుడు. ఇంకో పేరు వైయాఘ్రపద్యుడు.

**వాయుమేవ భగవో రాజన్** – నేను వాయువుని పూజిస్తున్నాను.

**పృథగ్వర్త్మాఽ ఽత్మా** – అనేక మార్గాలు కలదిగా ప్రసిద్ధి పొందింది.

**ఫలం: పృథగ్రథశ్రేణయోఽ నుయన్తి** – వస్త్ర, అన్న ధనాది రూపాలైన అనేక వస్తువులు, అనేక రథాలు నీకు వచ్చాయి.

**మంత్రం 2: ప్రాణస్త ఉదక్రమిష్యత్** – ఈ వైశ్వానరుడు ఆత్మకు ప్రాణశక్తి. నువ్వు నావద్దకు రాకపోయుంటే నీ ప్రాణం పోయి ఉండేది.

## ఖండం 5.15

**మంత్రం 1:** నాల్గవ శిష్యుడు జనం శార్కరాక్ష్యుడు.

**ఆకాశమేవ భగవో రాజన్** – ఆకాశాన్ని వైశ్వానరుడిగా ఉపాసిస్తున్నాను.

**బహుల ఆత్మా వైశ్వానరః** – ఇది బహుళమని ప్రసిద్ధి పొందింది.

**ఫలం: తస్మాత్త్వం బహులోఽసి ప్రజయా చ ధనేన చ** – నీకు సమృద్ధిగా సంతానం, ధనం ఉంది.

**మంత్రం 2: వ్యశీర్యద్యన్మాం నాగమిష్య** – ఈ వైశ్వానరుడు ఆత్మకు మధ్యభాగము. నువ్వు నాదగ్గరకి రాకపోయుంటే నీ శరీర మధ్యభాగం నష్టమై ఉండేది.

## ఖండం 5.16

**మంత్రం 1:** ఐదవ శిష్యుడు బుడిల మాశ్వతరాశ్వి

**అప ఏవ భగవో రాజన్** – నీరునే వైశ్వానరుడిగా ఉపాసిస్తున్నాను.

**రయిరాత్మా వైశ్వానరః** – అది రయిగా ప్రసిద్ధి చెందింది.

**ఫలం: రయిమాన్పుష్టిమాన్** – సంపన్నుడవు, పుష్టిగలవాడవు అయ్యావు. ఎందుకంటే నీరునుంచి పంటలు, పంటలనుంచి ధనమూ వస్తాయి. శరీరపుష్టికి ఆహారం సమృద్ధిగా దొరకటమే కారణం.

**మంత్రం 2: బస్తిస్తే వ్యభేత్స్యద్యన్మాం నాగమిష్య** – ఈ వైశ్వానరుడు ఆత్మకు మూత్రాశయం. నువ్వు నా దగ్గరకు రాకపోయుంటే, నీ మూత్రాశయం పగిలి ఉండేది.

## ఖండం 5.17

**మంత్రం 1:** ఆరవ శిష్యుడు ఉద్దాలక ఆరుణి. అతని ఇంకో పేరు గౌతముడు.

**పృథివీమేవ భగవో రాజన్** – పృథివిని వైశ్వానరుడిగా ఉపాసిస్తున్నాను.

**ప్రతిష్ఠాత్మా వైశ్వానరః** – అది ప్రతిష్ఠగా ప్రసిద్ధి చెందింది.

**ఫలం: తస్మాత్త్వం ప్రతిష్ఠితోఽసి ప్రజయా చ పశుభిశ్చ** – నీకు పేరు ప్రతిష్ఠలతో పాటు సమృద్ధిగా సంతానం, పశువులు ఉన్నాయి.

**మంత్రం 2: పాదౌ తే వ్యమ్లాస్యేతాం** – ఈ వైశ్వానరుడు ఆత్మకు రెండు పాదాలు. నువ్వు నా దగ్గరకు రాకపోయుంటే నీ పాదాలు శిథిలమై ఉండేవి.

**విశ్లేషణ:** ఈ ఆరుగురు వైశ్వానరుని ఒక్కొక్క అంగంగా మాత్రమే చూస్తున్నారు. ఏనుగుని గుడ్డివారు ఒక్కొక్క అంశమే చూసి, ఆ అంగమే ఏనుగు అని అనుకొన్న కథ తెలిసిందే.

ఈ ఆరుగురి ఉపాసనల్లో పంచభూతాల్లో నాలుగు వచ్చేశాయి. ఆకాశం, వాయువు, నీరు, పృథివి; ఇవి కాక స్వర్గలోకం, సూర్యుడు వచ్చాయి. అగ్ని మిగిలింది. దాన్ని గురువు చెప్పాడు. ఇవి సమష్టిపరంగా చెప్పబడ్డాయి. ఇవి వ్యష్టిలో కొన్ని అవయవాలకు అధిష్ఠానదేవతలు. అందుకే గురువు వ్యష్టిలో ఆయా అంగాలు దెబ్బతింటాయని చెప్పాడు. వ్యష్టిలో పైనుంచి కిందకి వర్ణన రూపంలో వచ్చాయి అవి. అవి వరుసగా – తల, కన్ను, ప్రాణం, శరీర మధ్యభాగం, మూత్రాశయం, పాదాలు.

## ఖండం 5.18

**మంత్రం 1:** ఇంతవరకూ గురువు, ఒక్కొక్క శిష్యుని ఉపాసనా తీరుని తెలుసుకుని, అతని ఉపాసనా ఫలం చెప్పి, దానివల్ల కలిగే దోషం కూడా చెప్పాడు. అంటే వారు పూర్తిగా, సరిగ్గానూ లేరు. పూర్తిగా తప్పుగానూ లేరు.

**పృథగివేమమాత్మానం వైశ్వానరం** – మీరు ఈ వైశ్వానర ఆత్మను వేర్వేరు భాగాలుగా విభజించి ఉపాసిస్తున్నారు.

**యస్త్వేతమేవం ప్రాదేశమాత్రమ్** – ఎవరైతే ఈ వైశ్వానర ఆత్మను నేనుగా ఉపాసిస్తారో,

**సర్వేషు లోకేషు సర్వేషు భూతేషు, సర్వేష్వాత్మస్వన్నమత్తి** – అతను అన్ని లోకాల్లో, అన్ని ప్రాణుల్లో అన్ని రూపాల్లో ఆహారాన్ని భుజిస్తాడు. అంటే తను అన్ని జీవరాశులను ఒకటిగా భావిస్తాడు. అవి తింటే తాను ఆనందిస్తాడు.

**మంత్రం2:** ఈ మంత్రాల్లో విరాట్, విశ్వ ఐక్య ఉపాసన వస్తుంది. విరాట్‌లోని ఒక్కొక్క అంగం, నాలోని ఒక్కొక్క అంగానికి అధిష్ఠానదేవత. ఇది తైత్తిరీయంలో చూసిన పాంక్త బ్రహ్మ ఉపాసనకు దగ్గరగా ఉంది. అందులో ఆధ్యాత్మపాంక్తం, ఆధిభూత పాంక్తం కలిసివస్తాయి.

**మూర్ధైవ సుతేజ** – ద్యు లోకం తల; **చక్షుర్విశ్వరూపః** – విశ్వరూపుడైన సూర్యుడు చూపు; **ప్రాణః పృథగ్వర్త్మాఽఽత్మా** – అనేక మార్గాలుగల వాయువు ప్రాణం; **సన్దేహో బహులో బస్తిరేవ రయిః** – నీరు మూత్రాశయం; **పృథివ్యేవ పాదౌ** – పృథివియే పాదాలు.

ఇక్కడివరకూ శిష్యుల జవాబులు వచ్చాయి. తర్వాత వచ్చే మంత్రంలో గురువు మరికొన్ని చెప్పాడు.

**ఉర ఏవ వేది** – వక్షఃస్థలం యజ్ఞవేదిః; **లోమాని బర్హిః** – రోమాలు దర్భలు; **హృదయం గార్హపత్యః** – హృదయం గార్హపత్యాగ్ని; **మనోఽన్వాహార్యపచనా**– మనసు దక్షిణాగ్ని; **ఆస్యమాహవనీయః** – నోరు ఆవహనీయాగ్ని. అగ్ని ఒకటే. భిన్నయజ్ఞాలకు భిన్నవిధాల్లో అగ్నిని వాడుతారు. శ్రౌతకర్మకు వాడే అగ్ని వేరు. ఉపనయనానికి వాడే అగ్ని వేరు; ఒక్కముక్కలో ఈ మూడు అగ్నులూ విరాట్. ఇదే భావన ముండకంలో –

**అగ్నిర్మూర్ధా చక్షుషీ చన్ద్రసూర్యౌ దిశః శ్రోత్రే వాగ్వివృతాశ్చ వేదాః**
**వాయుః ప్రాణో హృదయం విశ్వమస్య పద్భ్యాం పృథివీ హ్యేష సర్వభూతాన్తరాత్మా॥**
– ముండకమ్ 2.1.4

విష్ణుసహస్రనామంలో కూడా చిన్న తేడాతో
**భూః పాదౌ యస్య నాభిర్వియదసురనిలశ్చంద్రసూర్యౌ చ నేత్రే।**
**కర్ణావాశాశ్శిరో ద్యౌర్ముఖమపి దహనో యస్య వాస్తేయ మబ్ధిః।** – విష్ణుసహస్రనామమ్

దీనితో వైశ్వానరవిద్య ముగిసింది.

## ఖండాలు 5.19–5.24

వీటిలో ఉపాసన అంగకర్మ వస్తుంది. సాధారణంగా ప్రతి ఉపాసనకు ఒక దృక్పథం లేదా, ఒక వ్రతం చెపుతుంది ఉపనిషత్తు.

**అన్నం న నిన్ద్యాత్** – తైత్తిరీయమ్

విరాట్ ఉపాసకుడు అన్నాన్ని నిందించకూడదు.

ఇక్కడ అంగకర్మ చూస్తాం, వైశ్వానర ఉపాసనకు. అతను తినే విధానాన్ని మార్చుకోవాలి. తను తినే ఆహారాన్ని ముందు వైశ్వానర అగ్నికి నివేదించాలి. ఎలా? ప్రాణాయ స్వాహా, అపానాయ స్వాహా లాగా. దీన్ని ప్రాణాగ్ని హోత్రం అంటారు. పంచప్రాణాలకు మనం తినే ప్రథమ ముద్దలను నైవేద్యంగా అర్పించాలి.

## ఖండం 5.19

భోక్త మొట్టమొదటి ఆహారాన్ని ప్రాణాయ స్వాహా అని తీసుకోవాలి. అప్పుడది హోమద్రవ్యంగా అవుతుంది. అలా చేయటంవల్ల ఆహారాన్ని తనకు మాత్రమే తీసుకోకుండా, సమష్టికోసం తీసుకుంటున్న భావన కలుగుతుంది. ఆ హోమంతో ప్రాణం తృప్తి చెందుతుంది. ప్రాణం తృప్తి చెందితే కన్ను, కన్ను తృప్తి చెందితే ఆదిత్యుడు, ఆదిత్యుడు తృప్తి చెందితే ద్యులోకం, ద్యులోకం తృప్తి చెందితే ఆదిత్యలోకంలో ఉన్నవారంతా తృప్తి చెందుతారు.

**తస్యాను తృప్తిం తృప్యతి** – భోక్త కూడా తృప్తి చెందుతాడు.

**ఫలం:** సంతానం, పశువులు, సమృద్ధిగా ఆహారం, చక్కని జీర్ణశక్తి, శరీరకాంతి, బ్రహ్మవర్చస్సులను పొందుతాడు.

## ఖండం 5.20

భోక్త రెండవ ముద్దని వ్యానాయ స్వాహా అని తీసుకోవాలి. ఆ హోమంవల్ల వ్యానం తృప్తి చెందుతుంది. వ్యానం తృప్తి చెందితే చంద్రుడు, చంద్రుడు తృప్తి చెందితే దిక్కులు, దిక్కులు తృప్తి చెందితే చంద్రుడు అధిష్టించి ఉన్న పర్వాల్లో అందరూ తృప్తి చెందుతారు. భోక్త కూడా తృప్తి చెందుతాడు.

**ఫలం:** పైన చెప్పినట్టుగా సంతానం, పశువులు, సమృద్ధిగా ఆహారం, చక్కని జీర్ణశక్తి, శరీరకాంతి, బ్రహ్మవర్చస్సులను పొందుతాడు.

## ఖండం 5.21

భోక్త మూడో ముద్దని అపానాయ స్వాహా అని తీసుకోవాలి. ఆ హోమంవల్ల అపానం తృప్తి చెందుతుంది. అపానం తృప్తి చెందితే వాగింద్రియం, వాగింద్రియం తృప్తి చెందితే అగ్ని, అగ్ని తృప్తి చెందితే పృథివీ, పృథివీ తృప్తి చెందితే, అగ్ని అధిష్టించి ఉన్న పర్వాల్లో అందరూ తృప్తి చెందుతారు. భోక్త కూడా తృప్తి చెందుతాడు.

**ఫలం:** పైన చెప్పినట్టుగా సంతానం, పశువులు, సమృద్ధిగా ఆహారం, చక్కని జీర్ణశక్తి, శరీరకాంతి, బ్రహ్మవర్చస్సులను పొందుతాడు.

## ఖండం 5.22

భోక్త నాలుగో ముద్దని సమానాయ స్వాహా అని తీసుకోవాలి. ఆ హోమంవల్ల సమానం తృప్తి చెందుతుంది. సమానం తృప్తి చెందితే మనసు, మనసు తృప్తి చెందితే పర్జన్యుడు, పర్జన్యుడు తృప్తి చెందితే విద్యుత్తు, విద్యుత్తు తృప్తి చెందితే, పర్జన్యుడు అధిష్టించి ఉన్న పర్వాల్లో అందరూ తృప్తి చెందుతారు. భోక్త కూడా తృప్తి చెందుతాడు.

**ఫలం:** పైన చెప్పినట్టుగా సంతానం, పశువులు, సమృద్ధిగా ఆహారం, చక్కని జీర్ణశక్తి, శరీరకాంతి, బ్రహ్మవర్చస్సులను పొందుతాడు.

## ఖండం 5.23

భోక్త ఐదో ముద్దని ఉదానాయ స్వాహా అని తీసుకోవాలి. ఆ హోమంవల్ల ఉదానం తృప్తి చెందుతుంది. ఉదానం తృప్తి చెందితే త్వగింద్రియం, త్వగింద్రియం తృప్తి చెందితే, వాయువు, వాయువు తృప్తి చెందితే ఆకాశం, ఆకాశం తృప్తి చెందితే, వాయువు, ఆకాశం అధిష్టించి ఉన్న పర్వాల్లో ఉన్న అందరూ తృప్తి చెందుతారు. భోక్త కూడా తృప్తి చెందుతాడు.

**ఫలం:** పైన చెప్పినట్టుగా సంతానం, పశువులు, సమృద్ధిగా ఆహారం, చక్కని జీర్ణశక్తి, శరీరకాంతి, బ్రహ్మవర్చస్సులను పొందుతాడు. ఈ ఉపాసనను **ప్రాణాగ్నిహోత్రం** అంటారు. ప్రతిరోజూ మనం తినేటప్పుడు ఈ ప్రాణాగ్నిహోత్రం చేయాలి. ప్రాణం అంటే పంచప్రాణాలు వస్తాయి. దీనిద్వారా ఆహారం వ్యష్టినుంచి దేవతకు వెళ్ళి, దేవతద్వారా అన్ని జీవరాశులకూ వెళుతుంది.

ఎందుకు దీన్ని పంచప్రాణాగ్నిహోత్రం అంటారు? విరాట్ ఉపాసనలో నోరు ఆహవనీయాగ్నిగా, హృదయం గార్హపత్య అగ్నిగా, మనసు దక్షిణాగ్నిగా ఉపాసన చేయబడ్డాయి. అగ్నిహోత్ర యజ్ఞం ఆహవనీయాగ్నిలో చేయాలి. ఇక్కడ నోరుని ఆహవనీయాగ్నిగా చూపింది. అందువల్ల ఆహవనీయాగ్నిలో వేసిన ఆహారం ఏమవుతుంది? అగ్నిహోత్రం అవుతుంది. దీని వెనుకనున్న తర్కం అది.

ఈ విరాట్ ఉపాసనవల్ల నోటిలోకి తీసుకున్న ఏ ఆహారం అయినా అది విరాట్‌కి పెట్టినట్టు, విరాట్ ద్వారా మొత్తం మానవాళికి పెట్టినట్టు అవుతుంది.

## ఖండం 5.24

**మంత్రం 1: వైశ్వానర ఉపాసన స్తుతి.** వైశ్వానర అంటే విరాట్. ఈ ప్రాణాగ్నిహోత్రం చేసే విరాట్ ఉపాసకుడు ఉంటే, అతను నిత్యాగ్నిహోత్రం చేసి ఉపాసన చేయని వానికన్నా ఎన్నోరెట్లు అధికుడు. అంటే రెండో వ్యక్తి నిత్యాగ్నిహోత్ర కర్మ చేస్తాడు కాని ఉపాసన చేయడు. మొదటి వ్యక్తి అగ్నిహోత్ర కర్మ చేయడు కాని తినేముందు ఆహారాన్ని ప్రాణాగ్నిహోత్రంగా చేస్తాడు. అది విరాట్ ఉపాసనతో కూడినది. ఉపాసకుని ప్రాణాగ్నిహోత్రం, అనుపాసకుని (ఉపాసన చేయని) కర్మిష్ఠ కర్మకన్నా అధికం. అంతేకాదు, నిత్యాగ్నిహోత్రం మాత్రమే చేసి, విరాట్ ఉపాసన చేయకపోతే లాభం లేదు అంటున్నది శ్రుతి.

**యథాఽఙ్గారానపోహ్య భస్మని జుహుయాత్** – విరాట్ ఉపాసన చేయకుండా, అగ్నిహోత్రం చేస్తే, మండే కట్టెలను పక్కకు తప్పించి, బూడిదలో హోమం చేసినట్టు అవుతుంది. కాని శంకరాచార్యులు దానికి ఒక మాట కలుపుతారు. నిత్యాగ్నిహోత్రం వృథాకాదు. దానికి కూడా ఫలం ఉంది. కాకపోతే ఉపాసన కూడా జత కలిపితే, ఫలం అధికంగా ఉంటుంది.

**అన్యస్తుత్యర్థం అన్యనిందా నిందాయాం తాత్పర్యం నాస్తి**

ఒకదాన్ని పొగడటం తప్ప, ఇంకోదాన్ని నిందించటం కాదు ఇక్కడ.

**మంత్రం 2:** ఉపాసకుడు ప్రాణాగ్నిహోత్రంవల్ల అందరికీ పరోక్షంగా ఆహారాన్ని అందిస్తున్నాడు. వారు తృప్తి చెందుతారు.

**సర్వేషు లోకేషు** – అన్ని లోకాల్లో;

**సర్వేషు భూతేషు** – అన్ని జీవరాశులు;

**సర్వేష్వాత్మసు** – అన్ని కరణాలు తృప్తి చెందుతారు. అలాంటి ఒక్క మంచి వ్యక్తి ఉన్న సంఘం మొత్తం బాగుపడుతుంది.

**మంత్రం 3**: ఇందులో ఫలం వస్తుంది. సర్వపాపనాశనం జరుగుతుంది. ఈ ఉపాసన, ప్రాణాగ్నిహోత్రం చేయటంవల్ల అన్ని పాపాలు తొలగిపోతాయి. దీనికి ఒక ఉదాహరణ ఇచ్చింది శ్రుతి. నిప్పులో వేయబడ్డ గడ్డిపోచ వెంటనే కాలిపోయినట్టుగా, అతని పాపాలన్నీ ఈ ప్రాణాగ్నిహోత్రంలో కాలిపోతాయి.

**మంత్రం 4:** ఇంకో ఫలం కూడా చెపుతున్నది. కొత్తపాపాలు కూడా అంటవు. దుస్సంగంవల్ల వచ్చే కొత్త పాపాలు అంటవు. ఇంతకు ముందు పంచాగ్నివిద్య గురించి చూసినప్పుడు, పంచమహాపాతకాలలో దుస్సంగత్వం ఐదో మహాపాతకంగా చూశాము. పంచాగ్నివిద్య ఉపాసకునికి ఈ పాపం అంటదని కూడా చూశాము. అలాగే ఇక్కడ కూడా అలాంటి ఫలం చెపుతున్నది. చండాలునితో ఆహారం పంచుకుంటే మామూలుగా దాన్ని అశౌచం అంటారు. దుస్సంగ దోషం అంటారు. కాని ఇక్కడ ఆ దోషం అంటదు. అతనికి జీవరాసులన్నీ విరాటే. అందుకని అతనికి ఎదుటివ్యక్తి చండాలునిగా అనిపించదు.

**తద్వైశ్వానరే హుతగ్ంస్యాత్** – అది వైశ్వానరోపాసన చేసినట్టు. దాని గురించి ఒక ఋగ్మంత్రం ఉంది.

**మంత్రం 5:** ఈ జగత్తు మొత్తం ఈ ఉపాసకునిమీద ఆధారపడి ఉంది. ఎలా? ఆకలిగొన్న పిల్లలు తల్లిచుట్టూ చేరి, అన్నంకోసం ఎలా అడుగుతారో, అలా అందరూ విరాట్‌మీద ఆధారపడతారు. విరాట్ ఎవరు? ఈ ఉపాసకుడు. ఎందుకంటే విరాట్, ఉపాసకుడు భిన్నం కాదు. అందుకని జీవరాసులన్నీ విరాట్‌మీద ఆధారపడతాయి అంటే, విరాట్‌కీ ఉపాసకునికీ మధ్య భేదం లేనందువల్ల, ఈ ఉపాసకునిమీద ఆధారపడతాయి.

**అగ్నిహోత్రముపాసత** – ఇక్కడ అగ్నిహోత్రం అంటే ప్రాణాగ్నిహోత్రం. అగ్నిహోత్రం అంటే అగ్నిహోత్రి అని అర్థం. ఇతని మీద ఆధారపడతాయి అంటే అక్షరాలా ఆధారపడతాయి అని కాదు. అతను నిస్స్వార్థంగా ఉండి, తక్కినవారిని నిస్స్వార్థపరులనుగా మార్చుతాడు.

ఇక్కడితో ప్రాణాగ్నిహోత్రంతో కూడిన వైశ్వానర ఉపాసన ముగిసింది. దీనివల్ల మనం నేర్చుకునే పాఠం అన్నం తినేముందు మంత్రం పఠించి తినాలి.

# ఏకాదశ ఉపనిషత్తుల సారం

## ఛాందోగ్యోపనిషత్ - అధ్యాయం 6

1-5 అధ్యాయాలు - సగుణ ఈశ్వర ఉపాసన - జ్ఞానయోగ్యతా ప్రాప్త్యర్థం
6-8 అధ్యాయాలు - నిర్గుణబ్రహ్మజ్ఞానం

నిర్గుణబ్రహ్మజ్ఞానానికి ఒక్కొక్క అధ్యాయంలో ఒక్కొక్కపేరు వస్తుంది. సత్‌చిత్ ఆనందబ్రహ్మలోని సత్ అంశాన్ని ఆరవ అధ్యాయం, ఆనంద అంశాన్ని ఏడవ అధ్యాయం, చిత్ అంశాన్ని ఎనిమిదవ అధ్యాయం బోధిస్తాయి. ఏడవ అధ్యాయం భూమవిద్యను బోధిస్తుంది. భూమ అంటే పూర్ణం అంటే ఆనందం. అందుకని దీన్ని **భూమవిద్యా ప్రకరణం** అని కూడా అంటారు. అలాగే ఎనిమిదవ అధ్యాయం తురీయం గురించి చెబుతుంది. అందుకని దీన్ని **తురీయవిద్యా ప్రకరణం** అనీ, బ్రహ్మ చెపుతారు కాబట్టి ప్రజాపతి ప్రకరణం అనీ అంటారు. 6వ అధ్యాయం సత్ గురించి చెపుతుంది కాబట్టి దీన్ని **సద్విద్యా ప్రకరణం** అంటారు.

**6 – సద్విద్యా ప్రకరణం**
**7 – భూమావిద్యా ప్రకరణం**
**8 – తురీయవిద్యా ప్రకరణం / ప్రజాపతివిద్యా ప్రకరణం**

ఉపనిషత్తులన్నింటిలోకీ ఛాందోగ్యోపనిషత్ చాలా ముఖ్యమైనది. అందులోనూ ఆరవ అధ్యాయం ఇంకా ముఖ్యమైనది. దానికి కారణాలు అనేకం –

1. ఈ అధ్యాయంలోనే జ్ఞానబోధ మొదలవుతుంది.
2. ఈ అధ్యాయంలో ఉపాసన గురించి ఏమాత్రం ఉండదు.
3. ఎంతో ముఖ్యమైన మహావాక్యం ఈ అధ్యాయంలోనే వస్తుంది. అదికూడా తొమ్మిదిసార్లు.

తత్త్వమసి అన్నది మహావాక్యం. మహావాక్యం అంటే –

> **జీవ ఈశ్వర ఐక్య బోధకవాక్యమ్**
> **లేదా అఖండార్థ బోధక వాక్యమ్**

యజుర్వేదాన్ని రెండూ కలిపి ఒకటిగా తీసుకుంటే, నాలుగు వేదాల కిందకి వస్తాయి. వాటికి నాలుగు ప్రముఖ మహావాక్యాలున్నాయి.

| **వేదం** | **ఉపనిషత్తు** | **మహావాక్యం** |
|---|---|---|
| ఋగ్వేదం | ఐతరేయం | ప్రజ్ఞానం బ్రహ్మ |
| సామవేదం | ఛాందోగ్యం | తత్త్వమసి |
| అథర్వణవేదం | మాండూక్యం | అయమాత్మా బ్రహ్మ |
| యజుర్వేదం | బృహదారణ్యకం | అహం బ్రహ్మాస్మి |

ఇవికాక జీవ,ఈశ్వర ఐక్యాన్ని చూపించే ఏ వాక్యం తీసుకున్నా మహావాక్యమే. అలాంటివి ఒక్కొక్క ఉపనిషత్తులో ఎన్నో వస్తాయి.

4. మీమాంస శాస్త్రంలో ఈ అధ్యాయాన్ని ఉదాహరణగా తీసుకుంటారు. ఏదైనా దేనిగురించి చెప్తోంది అని నిర్ణయించటానికి మీమాంస శాస్త్రంలో షడ్లింగాలు ఉంటాయి.

**ఉపక్రమోపసంహారౌఅభ్యాసః అపూర్వతా ఫలం అర్థవాదోపపత్తీ చ లింగం తాత్పర్యనిర్ణయే॥**

**ఉపక్రమోపసంహారం** – ఏ విషయంతో మొదలవుతుందో, దానితోనే ముగుస్తుంది.

**అభ్యాసం** – చెప్పదలచుకున్న విషయాన్ని పదే పదే చెప్పడం.

ఈ అధ్యాయంలో తత్త్వమసి శ్వేతకేతో అన్న వాక్యం 9సార్లు వస్తుంది.

| | | |
|---|---|---|
| **అపూర్వత** | – | విషయం కొత్తదిగా ఉండాలి. |
| **ఫలం** | – | దానివల్ల కలిగే ప్రయోజనం ఉండాలి. |
| **అర్థవాదం** | – | దాని గురించి గొప్పగా ఉండాలి. |
| **ఉపపత్తి** | – | దాని గురించి వాడే ఉపమానాలు ఉండాలి. |

**లింగం తాత్పర్యనిర్ణయే** – వీటివల్ల అందులోని తాత్పర్యం ఏమిటో నిర్ణయించవచ్చు.

## అధ్యాయం – 6 వివరాలు

| | | | |
|---|---|---|---|
| ఖండం | 1 | – | గురుశిష్యుల పరిచయం |
| ఖండం | 2- 7 | – | తత్త్వమసిలో తత్ పద విచారణ |
| ఖండం | 8 | – | తత్త్వమసిలో త్వం పద విచారణ |
| ఖండం | 9- 7 | – | తత్త్వమసిలో అసి పద విచారణ |

## ఖండం 6.1 – 1 గురుశిష్యుల పరిచయం

1) **గురుశిష్యుల పరిచయం**– ఈ ఖండాన్ని ఆఖ్యాయిక అంటారు. ఆఖ్యాయిక అంటే కథ. ఈ కథ గురుశిష్యులను పరిచయం చేయటమే కాదు, గురువు లక్షణాలు, శిష్యుని లక్షణాలు, విద్య గొప్పతనం కూడా అంతర్లీనంగా సూచిస్తుంది.

ఒకరోజు ఆరుణి తన పుత్రుడైన శ్వేతకేతుతో మన కుటుంబంలో వేదాలు చదవకుండా ఎవరూ లేరు. అందువల్ల నువ్వు కూడా నేర్చుకో అని చెప్పి, శ్వేతకేతుని గురుకులానికి పంపించాడు. అప్పుడు శ్వేతకేతుకి పన్నెండేళ్ళు. ఇంకొక పన్నెండేళ్ళు విద్య నేర్చుకుని తిరిగివచ్చాడు. కాని విద్యాగర్వంతో తిరిగివచ్చాడు.

**సర్వాన్వేదానధీత్య మహామనా అనూచానమానీ స్తబ్ధ ఏయాయ** – 6.1.2

వేదాలు, వేదాంగాలు అన్నీ నేర్చుకోవటంవల్ల తను గొప్ప పండితుడిని అనుకున్నాడు. అనూచానమానీ అనీ అంటే బోధ చేసే సమర్థుడిని అని కూడా అనుకున్నాడు. దానితో స్తబ్ధ అంటే గర్వం వచ్చింది. ఈ విషయం తండ్రి గ్రహించి అతని గర్వం అణచటానికి ఒక ప్రశ్న వేశాడు.

**యేనాశ్రుతగ్ం శ్రుతం భవిత్యమతం మతమవిజ్ఞాతం విజ్ఞాతమితి॥**

ఏ జ్ఞానం పొందితే, విననిది విన్నట్టుగా, ఆలోచించనిది ఆలోచించినట్టుగా, తెలియనిది తెలిసినట్టుగా అనిపిస్తుందో ఆ విద్య నేర్చుకున్నావా అని అడిగాడు. ఇదే అర్థం వచ్చే ప్రశ్న ముండకోపనిషత్తులో కూడా చూస్తాము.

**కస్మిన్ను భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి॥**

ఏ ఒక్కటి తెలుసుకుంటే సర్వం తెలిసినట్టవుతుందో అది తెలుసా అని అక్కడ శిష్యుడు, గురువును అడిగాడు. అలాంటి ఒక విద్య ఉందని తెలియని శ్వేతకేతు నమ్మలేకపోయాడు. అప్పుడు ఆరుణి అక్షరలక్షలు విలువ చేసే వాక్యం చెబుతాడు. ఈ వాక్యాన్ని ఉటంకించకుండా వేదాంతం నేర్చుకోలేము.

**వాచాఽఽరంభణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్॥**

ఒక్కటి తెలిస్తే అన్నీ తెలుస్తాయి అంటే ఒక్క కారణం గురించి తెలిస్తే, అన్ని కార్యాలూ తెలిసినట్టే అంటున్నాడు ఆరుణి. **ఏకకారణవిజ్ఞానేన సర్వకార్యవిజ్ఞానం భవతి**

ఒకటే ఉపాదానకారణం, వివిధ నామరూపాలతో అనేక కార్యాలుగా మారుతుంది. ఈ నామరూపాలను విశ్లేషణ చేస్తే, అన్నింటిలోనూ ఉన్నది ఒక్కటే వస్తువనీ, నామరూపాలు పైపై తేడాలేననీ తెలుస్తుంది. వాటికి కారణం లేనిదే విడిగా ఉనికి లేదు కాబట్టి, కారణం తెలిస్తే, కార్యం తెలిసినట్టే. కారణం ఏకం, కార్యం అనేకం. ఇది చూపించటానికి ఆరుణి మూడు ఉదాహరణలను ఇస్తున్నాడు. అవి మట్టి–కుండ, బంగారం–ఆభరణాలు, ఇనుము–గోళ్ళ కత్తెర. మొదటి ఉదాహరణ చూద్దాము. మట్టిముద్దనుంచి కుండ ఏర్పడుతుంది.

**వాచా౽౽రంభణం వికారో నామధేయమ్** – వికారం అంటే ఇక్కడ కార్యం. కార్యం ఏర్పడగానే దానికొక పేరు వస్తుంది. వాగింద్రియం ఇస్తుంది ఆ పేరు.

**మృత్తికేత్యేవ సత్యమ్** – మట్టి మాత్రమే సత్యం, కుండ మిథ్య. ఈ సూత్రం ప్రకారం బంగారం మాత్రమే సత్యం, ఆభరణాలు మిథ్య; ఇనుము మాత్రమే సత్యం, గోళ్ళ కత్తెర మిథ్య. ఈ విధంగా కార్యం మిథ్య, కారణం సత్యం కాబట్టి కారణం గురించి తెలుసుకుంటే, మొత్తం కార్యప్రపంచం గురించి తెలిసినట్టు అవుతుంది అని వివరిస్తాడు తండ్రి.

శ్వేతకేతు తనను తాను రక్షించుకోవటానికి, మా గురువుకు కూడా ఈ విషయం తెలిసి ఉండదు; ఒకవేళ తెలిసి ఉండి ఉంటే, నాకు చెప్పకుండా ఎలా ఉండేవారు అని చెప్పి, తండ్రిని భగవాన్ అని సంబోధించి, ఆ విద్య ఏదో మీరే బోధించండి అని, తను శిష్యునిగా మారతాడు. తథా సోమ్యేతి హెూవాచ. అలాగే సౌమ్యుడా అని తండ్రి చెప్పాడు. తథాస్తు అన్నట్టన్నమాట. ఇక్కడితో బోధకు సందర్భం తయారయింది. ఇక్కడనుంచి బోధ గురుశిష్యుల సంవాదంగా కొనసాగుతుంది.

## ఖండాలు 6.2-6.7 – 2 తత్త్వమసిలో తత్ పద విచారణ

2) **తత్ పద విచారణ – సృష్టి ప్రకరణం**

బోధ మొదలవుతూనే మరొక అక్షరలక్షలు విలువ చేసే వాక్యంతో మొదలవుతుంది. ఈ వాక్యాన్ని ఉటంకించకుండా, బ్రహ్మజ్ఞానాన్ని బోధించలేడు గురువు.

**సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్**

బ్రహ్మను అనేక పేర్లతో వ్యవహరిస్తాయి ఉపనిషత్తులు.

| | | |
|---|---|---|
| అక్షరం బ్రహ్మ | – | ముండకమ్ |
| సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ | – | తైత్తిరీయమ్ |
| తురీయం బ్రహ్మ | – | మాండూక్యమ్ |
| సత్ బ్రహ్మ | – | ఛాందోగ్యమ్ |

**సత్ ఏవ ఆసీత్** – ఈ సత్ బ్రహ్మ మాత్రమే ఉంది. ఎప్పుడు?

**ఇదమ్ అగ్రే** – ఈ ప్రత్యక్ష గోచరంగా ఉన్న ఈ జగత్తుకు ముందు. ఎలా ఉంది?

**ఏకమేవాద్వితీయమ్ – ఏకమ్ ఏవ అద్వితీయమ్** – సజాతీయ విజాతీయ స్వగతభేద రహితం బ్రహ్మ మాత్రమే ఈ సృష్టికి పూర్వం ఉంది.

ఇక్కడ సృష్టి గురించి వస్తుంది కాబట్టి, ఈ భాగాన్ని సృష్టి ప్రకరణం అని కూడా అంటారు. సృష్టికి పూర్వం సత్ మాత్రమే ఉంది. అవ్యక్త నామరూపాలతో కూడిన సత్ మాత్రమే ఉంది.

**సోఽకామయత। బహు స్యాం ప్రజాయేయేతి**

**సః అకామయత** – పరమాత్మ సంకల్పించాడు.

**బహు స్యాం ప్రజా యేయేతి॥** – నేను అనేకంగా పుడతాను అని. దీన్నిబట్టి పరమాత్మ అభిన్న, నిమిత్త ఉపాదానకారణం అని అర్థం అవుతుంది. సృష్టి గురించి ఒక్కొక్క ఉపనిషత్తులో ఒక్కొక్క రీతిలో వస్తుంది. ఇక్కడ రెండు దశల్లో సృష్టిని చూస్తాము. సూక్ష్మభూతాలు, స్థూలప్రపంచం + స్థూలశరీరం.

**దశ 1**

తైత్తిరీయోపనిషత్తులో మొదటి దశలో ముందు సూక్ష్మపంచభూతాలు వస్తాయి. పంచభూతాలు అంటే ఆకాశం, అగ్ని, వాయువు, జలం, పృథివి. కాకపోతే ఛాందోగ్యోపనిషత్తులో మూడు భూతాల గురించే వస్తుంది. ఇక్కడ ఆకాశం, వాయువులను వదిలేసింది. ఎందుకంటే అవి అమూర్తం. కంటికి కనబడవు. అందువల్ల పరమాత్మనుంచి అగ్ని, అగ్నినుంచి నీరు, నీటినుంచి భూమి వచ్చాయి అంటుంది. ఇక్కడ పృథివిని అన్నం అంటుంది. ఈ భూతత్రయానికి ఒక పేరు ఉంది. దాన్ని **తేజోఽబన్న సృష్టి** అంటారు.

తేజో = తేజః (అగ్ని); ఆపః – నీరు; పృథివి – అన్నం.

అంటే తేజః అప్ అన్నం, తేజః + అప్ + అన్నం = తేజోఽబన్నమ్

దీనితో సూక్ష్మభూత సృష్టి అయింది. అంటే దశ 1 అయింది.

**దశ 2**

ఉపనిషత్తు సృష్టిని ఒక వరుసక్రమంలో వివరంగా చెప్పటం లేదు. మధ్యలో కొన్ని దశలను వదిలివేస్తోంది. చెప్పిన దశలను కూడా ముందు, వెనకా చెబుతోంది. తత్త్వబోధని ఆధారంగా తీసుకుని మనం వాటిని పూరించుకోవాలి. నిజానికి ఆరు దశల్లో సృష్టి అవుతుంది.

సూక్ష్మభూతాలు,
సూక్ష్మప్రపంచం, సూక్ష్మశరీరాలు
స్థూలభూతాలు
స్థూలప్రపంచం, స్థూలశరీరాలు

ఇంతవరకూ సూక్ష్మభూతాల సృష్టి చూశాము. అది కూడా ఇక్కడ ప్రత్యేకంగా మూడు భూతాల గురించే చెప్పిందని కూడా చూశాము. సూక్ష్మప్రపంచం, సూక్ష్మశరీరాల గురించి చెప్పలేదు. అది మనం పూరించుకోవాలి. సూక్ష్మప్రపంచం, సూక్ష్మశరీరాలు సృష్టించాక, నేను వీటిల్లో ప్రతిబింబచైతన్యంగా ప్రవేశించాలి అనుకున్నాడు. కారణప్రపంచంలో ప్రతిబింబ చైతన్యం ఈశ్వరుడు, కారణశరీరంలో ప్రతిబింబచైతన్యం ప్రాజ్ఞ. సూక్ష్మప్రపంచంలో ప్రతిబింబ చైతన్యం హిరణ్యగర్భ, సూక్ష్మశరీరంలో తైజస. తరువాత స్థూలభూతాల సృష్టి జరగాలి. కాని పరమాత్మ స్థూలప్రపంచం, స్థూలశరీరాలు సృష్టిస్తాను అనుకున్నాడు.

మనం ముందు స్థూలభూతాల సృష్టి చూద్దాము. అసలైతే పంచసూక్ష్మభూతాలనుంచి పంచీకరణం జరిగి, పంచస్థూలభూతాలు వస్తాయి. కాని ఇక్కడ మూడు సూక్ష్మభూతాల సృష్టే చూస్తాము కాబట్టి, దీన్ని త్రివృత్తీకరణం అంటారు. అంటే మూడు కలుపుతాము. ఇక్కడ స్థూల అగ్ని తయారు చేయాలనుకోండి. ఇప్పుడు నాలుగు కప్పుల కొలత తీసుకుందాం. రెండు కప్పులు అగ్ని, ఒక కప్పు జలం, ఒక కప్పు పృథివి కలపాలి. అంటే,

4 స్థూల అగ్ని = 2 సూక్ష్మ అగ్ని + 1 సూక్ష్మజలం + 1 సూక్ష్మపృథివి

సూక్ష్మ అగ్నిని తన్మాత్ర అంటారు. అంటే అది మాత్రమే ఉంది. స్థూల అగ్నిలో తక్కిన రెండూ కలుస్తాయి. స్థూలభూతాలనుంచి స్థూలప్రపంచం, స్థూలశరీరాలు సృష్టించబడతాయని చూశాము. ఈ స్థూలప్రపంచం, శరీరాల సృష్టిని ముందే ఇలా చేస్తాను అనుకున్నాడని, తరువాత సృష్టించాడని వస్తుంది. స్థూలప్రపంచం, స్థూలశరీరాల సృష్టి కూడా రకరకాలుగా వస్తుంది. ఇక్కడ మూడు తెగలుగా వర్ణిస్తున్నది ఉపనిషత్తు.

**త్రీణ్యేవ బీజాని భవంతి** – మూడే ప్రాథమిక కారణాలున్నాయి. వాటి పుట్టుక తీరునిబట్టి మూడు తెగలుగా అభివర్ణించవచ్చు. అవి **అండజం జీవజముద్భిజ్జమితి**.

1. **అండజమ్** – అండం అంటే గ్రుడ్డు. జం అంటే పుట్టటం. గుడ్డునుంచి పుట్టిన జీవులు. పక్షులు, పాములు.

2. **జీవజమ్** – జీవినుంచి పుట్టినవి. అంటే తల్లి యోనినుంచి పుట్టినవి. మనుష్యులు, పశువులు.

3. **ఉద్భిజమ్** – నేలను చీల్చుకుని పుట్టినవి. చెట్లు.

4. **స్వేదజమ్** – తేమనుంచి పుట్టినవి. క్రిమికీటకాదులు. శాస్త్రంలో ఈ నాలుగవ రకం కూడా చెబుతారు. ఇక్కడ చెప్పలేదు కాని అండజంలో కలిపేసుకోవచ్చు.

వీటిని సృష్టించి వీటిలోకి ప్రతిబింబచైతన్యంగా పరమాత్మ అనుప్రవేశం చేశాడు. స్థూలప్రపంచం ప్రతిబింబచైతన్యం విరాట్, స్థూలశరీరం ప్రతిబింబచైతన్యం విశ్వ.

ఇంతవరకూ సృష్టి గురించి వచ్చింది. దీన్ని అధ్యారోపం అంటారు. సృష్టి జరిగింది అని చెప్పటం అధ్యారోపం; సృష్టికి అంటే జగత్తుకి విడిగా ఉనికి లేదు అని కొట్టివేయటం అపవాదం. ఇప్పుడు అపవాదం చూద్దాము. ఈ అపవాదానికి ఉపనిషత్తు పూర్తి స్థూలభూతాలు, భౌతిక ప్రపంచం తీసుకోకుండా నాలుగే ఉదాహరణలు తీసుకుంది.

సూక్ష్మభూతాలకు ప్రత్యేకమైన రంగులు ఉన్నాయి. సూక్ష్మ అగ్ని ఎరుపురంగులో, సూక్ష్మ నీరు తెలుపురంగులో, సూక్ష్మపృథివి నలుపురంగులో ఉంటాయి. స్థూలభూతం మూడింటి మేలుకలయిక కాబట్టి ఒక్కొక్క దాంట్లోనూ మూడు రంగులూ తెలుస్తాయి. స్థూలభూతాల్లోనే కాదు, వాటితో తయారైన స్థూలప్రపంచంలో కూడా. ఆ విషయాన్ని ఇక్కడ నాలుగు ఉదాహరణలద్వారా నిరూపిస్తున్నాడు గురువు ఆరుణి. మూడు భూతాలకు ప్రతీకగా స్థూల అగ్నిని, స్థూలప్రపంచానికి ప్రతీకగా సూర్యుని, చంద్రుని, విద్యుత్తును తీసుకున్నాడు. అదెలాగో చూద్దాము.

**స్థూల అగ్ని** – ఒక మంటని తీసుకుంటే అది అగ్నితత్త్వం అవుతుంది. అందులో మూడు సూక్ష్మభూతాలూ ఉన్నాయి.

| | |
|---|---|
| అగ్నిలో కనబడే లోహితం ఎరుపు రంగు | – సూక్ష్మ అగ్నితత్త్వం |
| మంటలోపలి భాగం తెల్లగా ఉంటుంది | – జలతత్త్వం |
| దీపం వత్తుకు దగ్గరగా కొంతమేరకు నల్లగా ఉంటుంది | – పృథివీతత్త్వం |

అందువల్ల అసలు స్థూల అగ్ని అనేదే లేదు. స్థూల అగ్ని కార్యం, సూక్ష్మభూతాలు కారణం. కారణానికి భిన్నంగా కార్యానికి ఉనికి లేదు. స్థూల అగ్ని అని విడిగా ఏమీ లేదు.

**వాచాఽఽరంభణం వికారో నామధేయం**

స్థూల అగ్ని, తక్కిన భూతాలు నామధేయాలు తప్ప ఏమీ కావు. పేరుకు మాత్రమే ఉన్నాయి. **నామ్ కే వాస్తే** అంటాము హిందీలో. ఇది మీ వాక్కుకు వస్తువు మాత్రమే. అంటే ఆ పేరు మీ నాలుకలోనే ఉంది కాని స్థూల అగ్ని అని విడిగా లేదు. అందువల్ల ఇది మిథ్య. ఇది మిథ్య అయితే ఏమిటి సత్యం?

**త్రీణి రూపాణీత్యేవ సత్యమ్**

ఇది ఇంకొక అక్షరలక్షల విలువ చేసే వాక్యం. స్థూలభూతాలన్నీ మిథ్య అయితే, ఏమిటి సత్యం? వాటి కారణం సత్యం. వాటి కారణం ఏమిటి? సూక్ష్మభూతాలు. త్రీణిరూపాణి అంటే వాచ్యార్థం మూడు రంగులు. ఆ మూడు రంగులు ఏమిటి? ఎరుపు, తెలుపు, నలుపు. అవి వేటిని సూచిస్తాయి? వరుసగా సూక్ష్మ అగ్ని, సూక్ష్మజలం, సూక్ష్మపృథివిని సూచిస్తాయి. అందువల్ల త్రీణిరూపాణీత్యేవ సత్యం అంటే మూడు సూక్ష్మభూతాలే సత్యం.

దీన్నించి మనం ఇంకొంచెం వెనక్కి వెళ్ళాలి. ఈ మూడు సూక్ష్మభూతాలు కూడా మూల కారణం కాదు. అవి కూడా కార్యాలే కాబట్టి అవి కూడా మిథ్యే. మరేమిటి సత్యం? వాటి మూలకారణం. ఏమిటది? సత్‌బ్రహ్మ. సత్‌బ్రహ్మకు మూలకారణమేమిటి? దానికి మూలకారణం వేరే లేదు. సత్‌బ్రహ్మే మూలకారణం. మొదటి మంత్రానికి వెళతాము.

**సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్**

స్థూలభూతాలకు ప్రతీకగా అగ్నిని చూశాము ఇంతవరకూ. ఇప్పుడు స్థూలభౌతిక ప్రపంచంనుంచి ఉదాహరణలు చూద్దాము.

**సూర్యుడు**

| | | |
|---|---|---|
| ఆదిత్యుడు ఉదయిస్తున్నప్పటి ఎర్రటి రంగు | – | అగ్నితత్త్వం |
| తెల్లని రూపం | – | జలతత్త్వం |
| నల్లని చుక్కలు | – | పృథివీతత్త్వం |

వాచారంభణం వికారో నామధేయం – సూర్యుడు కేవలం నామరూపాలు మాత్రమే.

**త్రీణి రూపాణీత్యేవ సత్యమ్**
**సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్**
**బ్రహ్మ సత్యం, జగత్ మిథ్యా.**

**చంద్రుడు, విద్యుత్** – వీటిల్లో కూడా ఈ మూడు రంగులే చూస్తాము. ఈ దశలన్నీ దాటుకుంటూ రావాలి. బ్రహ్మ సత్యం, జగత్ మిథ్యకి వస్తాము. అప్పుడు గురువు మొదట్లో చెప్పినది గుర్తుకు తెచ్చుకోవాలి.

**ఏకకారణజ్ఞానేన సర్వకార్యజ్ఞానం భవతి**
**బ్రహ్మ విజ్ఞానేన, సర్వం విజ్ఞాతం భవతి**

ఈ జ్ఞానం పొందినవారు గొప్ప విద్వాంసులు అవుతారు. నయాగరా జలపాతాలు ఏమిటి? బ్రహ్మ+నామరూపాలు; మానససరోవరం ఏమిటి? బ్రహ్మ+నామరూపాలు. అందువల్ల ఈ విద్వాంసులు **కశ్చనః అశ్రుతమమతమవిజ్ఞాతమ్** అంటారు. అంటే మా కుటుంబంలో విననిది, ఆలోచించనిది, తెలియనది లేదు అంటాం. ప్రశ్న అలాగే మొదలయింది.

**యేనాశ్రుతగ్ం శ్రుతం భవత్యమతం మతమవిజ్ఞాతం విజ్ఞాతమితి॥**

ఏ ఒక్కటి తెలుసుకుంటే అన్నీ తెలిసినట్టు అవుతుందో, దాని గురించి తెలుసుకున్నావా అని ఉద్దాలకుడు శ్వేతకేతుని అడిగాడు. ఇప్పుడేమో మూడు రంగుల గురించి (మూడు భూతాల గురించి) తెలుసుకుంటే, అన్నీ తెలుసుకున్నట్టవుతుందని చెబుతున్నాడు.

రంగులు తెలిసిన చోట ఇలా చెప్పవచ్చు సరే, రంగులు స్పష్టంగా తెలియకపోతే ఏం చేస్తారు అంటే, అప్పుడు కూడా అవి ఈ మూడు రంగుల మేలుకలయిక అని చెబుతాము అంటారు వారు. ఎందుకంటే అవి మూడు సూక్ష్మభూతాల మేలుకలయిక కదా అంటారు.

ఇంతవరకూ సూక్ష్మభూతాలు సత్యం, స్థూలప్రపంచం మిథ్య అని చెప్పుకువచ్చాడు గురువు.

**అధ్యాత్మం** – ఇప్పుడు స్థూలభూతాలనుంచి వచ్చిన ఈ స్థూలశరీరం మిథ్య అని చూపించుకు వస్తాడు గురువు. ఆ సందర్భంలో కొంచెం పక్కకి వెళ్ళి, మరికొన్ని వివరాలు కూడా చెబుతాడు. అవేమిటో చూద్దాము.

**ఇమాస్తిస్రో దేవతాః పురుషం ప్రాప్య త్రివృత్త్రివృదేకైకా భవతి।।**

**ఇమాస్తిస్రోదేవతాః** – ఈ మూడు దేవతలు. ఇక్కడ మూడు స్థూలభూతాలు గురించి చెబుతున్నాడు.

**పురుషం ప్రాప్య** – మనుష్య శరీరంలో అన్నరూపంలో ప్రవేశిస్తాయి.

**త్రివృత్త్రివృదేకైకా భవతి** – ఒక్కొక్క స్థూలభూతం, శరీరంలో మూడు పేటలుగా మారుతాయి. అంటే,

శరీరం కార్యం, స్థూలభూతాలు కారణం

ఇంక తరువాత దశలు మనకు తెలిసినవే. అవి మళ్ళీ చూద్దాము.

స్థూలభూతాలు కార్యం, సూక్ష్మభూతాలు కారణం
**త్రీణి రూపాణీత్యేవ సత్యమ్**

సూక్ష్మభూతాలు కార్యం, బ్రహ్మ కారణం

కార్యం – వాచాఽఽరంభణం వికారో నామధేయమ్

అందువల్ల – బ్రహ్మ సత్యం, జగత్ మిథ్య

**ఏకకారణవిజ్ఞానేన, సర్వకార్యవిజ్ఞానం భవతి।।**

అధ్యాత్మికంగా కూడా మూడు వస్తువులను చెబుతున్నాడు గురువు. అవి అన్నం, నీరు, అగ్ని.

**అన్నం (పృథివీతత్త్వం)** – మనం తిన్న అన్నం మూడు భాగాలుగా విభజించబడుతుంది లోపల. అవి స్థూలభాగం, మధ్యభాగం, సూక్ష్మభాగం.

| | |
|---|---|
| అత్యంత స్థూలభాగం | – మలంగా పోతుంది |
| మధ్యభాగం | – మాంసం అవుతుంది |
| అత్యంత సూక్ష్మభాగం | – మనస్సు అవుతుంది. |

మనస్సు అవుతుంది అంటే మనస్సులో రేగే గుణాలను అది ప్రేరేపిస్తుంది.

**నీరు (జలతత్త్వం)** – మనం తాగిన నీరు మూడు భాగాలుగా విభజించబడుతుంది లోపల.

| | |
|---|---|
| అత్యంత స్థూలభాగం | – మూత్రంగా పోతుంది |
| మధ్యభాగం | – రక్తంగా మారుతుంది |
| అత్యంత సూక్ష్మభాగం | – ప్రాణశక్తి అవుతుంది. |

**అగ్ని (అగ్నితత్త్వం)** – మనం తిన్న అగ్ని మూడు భాగాలుగా విభజించబడుతుంది లోపల. ఇక్కడ అగ్ని అంటే నెయ్యి, నూనె. అగ్ని విషయంలో మూడూ ఉపయోగపడేవే.

| | |
|---|---|
| అత్యంత స్థూలభాగం | – ఎముక అవుతుంది |
| మధ్యభాగం | – మూలుగు (మజ్జ – బోన్‌మారో) అవుతుంది |
| అత్యంత సూక్ష్మభాగం | – వాక్కు అవుతుంది. |

వీటివల్ల తేలిన విషయం – అక్షరలక్షలు పలికే వాక్యం

**అన్నమయగ్ం హి సోమ్య మన ఆపోమయః ప్రాణస్తేజోమయీ వాగితి।**

ఈ ఉపనిషత్తులో పృథివిని అన్నంగా వ్యవహరిస్తున్నారని మర్చిపోకూడదు.

| | |
|---|---|
| మనస్సు కార్యం | – పృథివి కారణం |
| ప్రాణం కార్యం | – జలం కారణం |
| వాక్కు కార్యం | – అగ్ని కారణం |

మనస్సు జడమే అని నిరూపించటానికి ఈ వాక్యమే మనకు ఆధారం. అందువల్లనే దీన్ని అక్షరలక్షలు పలికే వాక్యం అన్నారు. అలాగే ప్రాణమే ఆత్మ అనే అపోహను కూడా తొలగిస్తుంది ఇది. వాక్కు కూడా కార్యమే. మూడింటిలోనూ ఉన్న **మయ** అన్న పదం, అవి కార్యం అని సూచిస్తుంది.

దీని తరువాత దశలను ముందే చూసేశాము. శరీరం కార్యం, స్థూలభూతాలు కారణం నుంచి చూడాలి. శ్వేతకేతుకి కూడా బాగా అర్థమైంది కానీ ఇంకా చెప్పండి అన్నాడు, గురువు కూడా బోధను కొనసాగిస్తున్నాడు.

ఈ అక్షరలక్షలు విలువ చేసే మంత్రాన్ని వివరించటానికి ఒక ప్రయోగం చేస్తున్నాడు గురువు. శ్వేతకేతుని 15 రోజులు అన్నం తినకుండా ఉండి చూడు. కానీ నీకు కావాల్సినంత నీరు త్రాగు అన్నాడు. అలాగే చేసి 16వ రోజున శిష్యుడు గురువు దగ్గరకు వచ్చాడు. గురువు ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం చెప్పు అన్నాడు. శిష్యుడు, ఓ భగవాన్! నాకు అవి స్ఫురించటమే లేదు అని చెప్పాడు. అంటే ఏమిటి కారణం?

**అన్నమయగ్ం హి సోమ్య మనః**

అన్నం అనే కారణం లేకపోయేసరికి, మనస్సు అనే కార్యం బలహీనమయింది. కాని ప్రాణం నిలబడి ఉంది. ఎందుకు? నీరు కావాల్సినంత త్రాగాడు.

**ఆపోమయః ప్రాణః**

ఇప్పుడు గురువు అన్వయ వ్యతిరేకన్యాయం పాటించాడు. ఉద్దాలకుడు చేసిన ప్రయోగంలో వ్యతిరేకన్యాయం చూశాము. అన్నం లేకపోతే, మేధాశక్తి లేదు. ఇప్పుడు అన్వయపద్ధతిని చూడబోతున్నాము. మళ్ళీ 15 రోజులు అన్నం తిని రమ్మన్నాడు. అలాగే 15 రోజుల తర్వాత వచ్చాడు. అప్పుడు ఉద్దాలకుడు అడిగిన ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం అప్పచెప్పగలిగాడు.

**అన్నభావే మేధాభావః**

అన్నం తినగానే మేధస్సు తిరిగివచ్చింది. అందువల్ల మనస్సుకి కారణం అన్నమే. దీనివల్ల మన వాక్యం నిరూపించబడింది. అన్నం మనస్సుకు, నీరు ప్రాణానికి, అగ్ని వాక్కుకి శక్తినిస్తుంది అని. మొదటి రెండూ నిరూపించబడ్డాయి, మూడోది ఉపలక్షణంగా తీసుకోవాలి. దీనితో అధ్యారోప అపవాదం ముగిసింది.

**బ్రహ్మ సత్యం జగత్ మిథ్యా**

బోధ పూర్తి అయింది. అంటే తత్త్వమసి మహావాక్యంలోని తత్పద విచారణ సృష్టి ప్రకరణ ద్వారా, అధ్యారోప–అపవాద ప్రక్రియద్వారా చేశాడు గురువు. ఇప్పుడు వేదాంతసారంలో రెండవభాగం మిగిలింది. అది జీవో బ్రహ్మైవ నాపరః. దానికి ముందు త్వం పదవిచారణ చేయాలి. అది ఖండం 8లో చూస్తాము.

## ఖండం 6.8 – 3 తత్త్వమసిలో త్వం పదవిచారణ

3) **తత్త్వమసిలో త్వం పద విచారణ** – ఇంతవరకూ (2–7 ఖండాల్లో) తత్ పద విచారణ అయింది. సత్ బ్రహ్మ జగత్ కారణం కాబట్టి,

సత్ బ్రహ్మవిజ్ఞానేన సర్వవిజ్ఞానం భవతి

అని తెలుసుకున్నాం. కాని సత్‌బ్రహ్మజ్ఞానం పొందటం ఎలా?

ఆత్మవిజ్ఞానేన బ్రహ్మవిజ్ఞానం భవతి

ఆత్మజ్ఞానం పొందితే, బ్రహ్మజ్ఞానం పొందినట్టే.

త్వం పద విజ్ఞానేన తత్ పదార్థ విజ్ఞానం భవతి

ఇప్పుడు త్వం పద విచారణ చూడబోతున్నాము.

దశోపనిషత్తులలో ఛాందోగ్యోపనిషత్తు, బృహదారణ్యకోపనిషత్తులు ప్రత్యేకమైనవి. ఒక ప్రత్యేకత, అవి కొన్ని సంస్కృతపదాలను తీసుకుని, వాటిని ప్రత్యేకంగా విడదీసి, ప్రత్యేక అర్థాన్ని ఇస్తాయి. దీన్ని తెలుగులో పదాల గారడీ అంటారు. సామాన్య నిర్వచనాన్ని వదిలేసి, విశేషనిర్వచనం ఇస్తాయి. ఈ పదాల గారడీ బృహదారణ్యకంలో శాకల్యబ్రాహ్మణంలో వస్తే, ఇక్కడ ఈ అధ్యాయంలో వస్తుంది.

ఇక్కడ ఉపనిషత్తు అలా మూడు పదాలను తీసుకుంది. అవి స్వపితి, అశానాయా, ఉదాన్య. మామూలుగా జీవితం అంటే మరణించేదాకా లేచామా, తిన్నామా, పడుకున్నామా అన్నట్టు ఉండకూడదు అంటాము. ఇవి మనకు చాలా సుపరిచితమైన పదాలు. ఈ నాలుగు పదాలనే తీసుకుని ఉపనిషత్తు వేదాంతసారం బోధించింది. ఎంత అద్భుతం! బ్రహ్మ అంటే ఏమిటో వీటిల్లోనే కాచి వడబోసింది. ఉపనిషత్తు తీసుకున్న పదాలు, వాటి వరుసక్రమం – పడుకున్నామా, తిన్నామా, త్రాగామా, మరణించామా!

**పడుకున్నామా** – మొదటి మంత్రంలో ఐక్యం రెండు పద్ధతుల్లో చూపిస్తున్నది. అవి సుషుప్తి విచారణ, స్వపితి పద నిర్వచనం.

**సుషుప్తి విచారణ** – దీనిద్వారా ఒక వ్యక్తి సుషుప్తిలో శుద్ధసత్‌లో లయమవుతాడని తెలుస్తుంది. ఎందుకు? కార్యం ఎప్పుడూ కారణంలో లయమవుతుంది. కుండ మట్టిలో లయమవుతుంది. అందువల్ల కార్యం ఎందులో లయమయితే, అది దాని అధిష్ఠానకారణం. జీవి సుషుప్తిలో శరీరం, మనస్సు, చిదాభాస, ఇంద్రియాలు కూడా పడుకుంటాయి కాబట్టి, చైతన్యం ప్రకటితమవకపోయినా లయమవదు కాబట్టి సుషుప్తిలో జీవి శుద్ధసత్‌లో

లయమవుతుంది. అందువల్ల అది జీవియొక్క స్వస్వరూపం. అప్పుడు నేను ఉన్నానని ఎలా చెప్పగలడు జీవి? సుషుప్తిలో జీవి లేకపోతే, లేచాక 'నేను బాగా నిద్రపోయాను,' అని చెప్పలేడు. దీని ద్వారా జీవాత్మ పరమాత్మతో ఐక్యం అవుతుంది అని అర్థమవుతున్నది.

సుషుప్తిలో మాత్రమే సంపూర్ణ ఆనందం కలుగుతుంది. అందువల్ల సుషుప్తి మన అసలు స్వరూపం అయితే, సుషుప్తిలో కలిగే ఆనందం మన అసలు స్వరూపం అవాలి. మన స్వరూపంలో లయం అవటంవల్ల సుషుప్తికి ఒక పేరు వచ్చింది. అది **స్వపితి**.

**స్వపితి పద నిర్వచనం** – ఇప్పుడు స్వపితిపద నిర్వచనం ద్వారా ఇదే విషయం చెబుతున్నది. స్వపితి అనే పదం అసలు స్వప్ ధాతువునుంచి వచ్చింది. దాని అర్థం నిద్రపోతున్నాడు. కాని ముందే చెప్పినట్టుగా ఇక్కడ ఉపనిషత్తు పదాల గారడీ చేసి, దాని గౌణ అర్థం తీసుకుంది.

స్వపితి = స్వమ్ + అపీతః

స్వమ్ అపీతో భవతి ఇతి స్వపితి

స్వమ్ అంటే స్వరూపం, అపీతః అంటే లయమవటం. అందువల్ల స్వమ్ అపీతో భవతి అంటే స్వస్వరూపంలో లయమవటం. ఇంతకుముందు సుషుప్తిలో ఉండేది శుద్ధసత్ మాత్రమే అన్నాము. స్వపితిలో స్వస్వరూపంలో లయం అవుతుంది అంటున్నాము కాబట్టి,

| | |
|---|---|
| సుషుప్తి | = స్వపితి |
| సత్‌బ్రహ్మ | = స్వస్వరూపం |
| స్వస్వరూపం | = సత్ బహ్మ |
| జీవస్వరూపం | = బ్రహ్మస్వరూపం |

అందువల్ల జీవస్వరూపజ్ఞానేన బ్రహ్మస్వరూపజ్ఞానం భవతి

**బ్రహ్మస్వరూపజ్ఞానేన సర్వజ్ఞానం భవతి॥**

**తస్మాత్ జీవస్వరూపజ్ఞానేన సర్వజ్ఞానం భవతి॥**

**తిన్నామా** – ఉపనిషత్తు బ్రహ్మ గురించి చెప్పటానికి ఎంత మామూలు విషయాలు తీసుకుందో చూడండి! ముందేమో నిద్ర గురించి చెప్పింది. ఇప్పుడు ఆకలి, దాహం గురించి చెప్పబోతున్నది. ఈ మూడు అనుభవాలు నాకు అవలేదని ఎవరూ చెప్పలేరు కదా! అందుకని తెలిసిన మామూలు విషయాలలోంచి తెలియని అసాధారణ విషయంలోకి వెళుతున్నది.

ఇప్పుడు అశనాయా పదానికి విశేష అర్థం చూస్తాము. అశనాయా పదం అశ్ ధాతువు నుంచి వచ్చింది. అశ్ అంటే తినటం. అశనాయా అంటే అశితుమ్ ఇచ్ఛ. అంటే తినాలనే ఆశ. తినాలని ఎప్పుడు అనిపిస్తుంది? ఆకలి వేస్తే. ఆకలి ఎప్పుడు వేస్తుంది? తిన్నదంతా

అరిగిపోయినప్పుడు. తిన్నదంతా ఎప్పుడు అరిగిపోతుంది? జీర్ణకోశరసాలు అన్నాన్ని జీర్ణించి శరీరం అంతటికీ అందజేసినప్పుడు. అందుకని ఉపనిషత్తు ఈ చివరి అర్థం వచ్చేలాగా అశనాయా పదాన్ని అశ+నాయా చేసింది. అశ అంటే అశితుమ్ అన్నం. అంటే తిన్న అన్నం. నాయా అంటే నయతి ఇతి నాయాః అంటే తీసుకువెళ్ళేది. ఇప్పుడు మొత్తం కలిపిచూస్తే అశనాయ అంటే తిన్న అన్నాన్ని శరీరానికి తీసుకుపోయే జీర్ణకోశరసాలు. అసలు అర్థం ఆకలి.

ఎందుకు ఇలా చేసింది? ఎందుకంటే, దీనివల్ల శరీరానికి పోషణ ఇచ్చేది అన్నమే అని తెలియటానికి. అప్పుడు శరీరం కార్యం అవుతుంది, అన్నం కారణం అవుతుంది. తిన్న అన్నం మూడుగా విభజింపబడి, శరీరానికి దోహదం చేస్తుందని ఇంతకముందే చూశాము. అక్కడ కూడా శరీరం కార్యం, అన్నం కారణం అని చూశాము. అన్నం అంటే పృథివీతత్త్వం ఇక్కడ. ఇక్కడనుంచి వెనక దశలకు వెళ్ళాలి.

పృథివికి నీరు కారణం, నీటికి అగ్ని కారణం, అగ్నికి (మధ్యలో పెద్ద గెంతు గెంతి) కారణం సత్ బ్రహ్మ. సత్ బ్రహ్మే సృష్టిస్థితిలయ కారణం.

అందువల్ల బ్రహ్మ సత్యం, జగత్ మిథ్య

**తాగామా** – ఇప్పుడు పదాల గారడీలో మూడో పదం చూస్తాము. అది **ఉదన్య**. ఉదన్యకి పర్యాయపదం పిపాస. పాతుమ్ ఇచ్ఛా పిపాస. రెండింటి అర్థం దాహం. అందువల్ల ఇక్కడ ఉపనిషత్తు దాహానికి పిపాస పదం తీసుకోకుండా ఉదన్య పదం తీసుకుంది.

**ఉదకం పాతుమ్ ఇచ్ఛా ఉదన్య॥**

ఇందాక ఆకలికి చూసినట్టే కారణాల తోరణాలు చూడాలి. దాహం ఎందుకు వేస్తుంది? లోపల నీరు ఎండిపోయినప్పుడు. నీరు ఎప్పుడు ఎండిపోతుంది? వైశ్వానర అగ్ని దహించి వేసినప్పుడు. అందువల్ల వైశ్వానర అగ్ని కారణం, దాహం కార్యం. వైశ్వానర అగ్నిని విశేష అర్థంగా తీసుకుంది ఉపనిషత్తు.

ఉదన్యని ఉద+న్యగా విడదీసింది. ఉద అంటే ఉదకం. న్య అంటే నయతి. అందువల్ల ఉదన్య అంటే **ఉదకం నయతి ఇతి ఉదన్య**. ఉదకనాయని తగ్గిస్తే ఉదన్య అయింది. దీనివల్ల గ్రహించాల్సింది ఏమిటి? వెనక్కి వరుసగా అన్వేషించుకుంటూ వెళ్ళాలి.

**జలం కార్యం, అగ్ని కారణం**
**అగ్ని కార్యం, సత్‌బ్రహ్మ కారణం**

కార్యం – **వాచాఽఽరంభణం వికారో నామధేయం**. దానికి విడిగా ఉనికి లేదు.

కారణం – సన్మూలా స్సోమ్యేమాస్సర్వాః ప్రజాస్సదాయతనాస్సత్ప్రతిష్ఠాః

ఇది కూడా అక్షరలక్షలు విలువ చేసే వాక్యం.

| | |
|---|---|
| **సన్మూలా ఇమాస్సర్వాః ప్రజాః** | – సత్తే సృష్టి కారణం |
| **సదాయతనాః** | – సత్తే స్థితి కారణం |
| **సత్ప్రతిష్ఠా** | – సత్తే లయ కారణం |

కాబట్టి బ్రహ్మ సత్యం, జగత్ మిథ్య.

ఈ విషయం మనకు అర్థమైందో లేదోనని ఉపనిషత్తే ప్రత్యక్షంగా చెబుతున్నది మళ్ళీ.

**ఇమాస్తిస్రో దేవతాః పురుషం ప్రాప్య త్రివృత్త్రివృదేకైకా భవతి**

ఈ మూడు భూతాలు మనుష్యశరీరంలో ప్రవేశించి, ఒక్కొక్క స్థూలభూతం శరీరంలో మూడు పేటలుగా మారుతుంది.

**మరణించామా** – ఇప్పుడు మరణం గురించి చెప్పబోతున్నది. సుషుప్తి, మరణం, ప్రళయం– అన్నింటిలోనూ బ్రహ్మలో లయమవుతాయి. అందువల్ల బ్రహ్మ చివరి లయకారకుడు.

మరణించేటప్పుడు ఇంద్రియాలు మనస్సులో లయమవుతాయి. గడగడ మాట్లాడే వ్యక్తి కూడా మరణకాలంలో చెప్పాలనుకున్నది చెప్పలేకపోతాడు. శక్తి క్షీణిస్తుంది. నోరు మెదుపుతాడు కాని మాట బయటకు రాదు. మాట్లాడలేకపోతే ఆ నిస్సహాయస్థితిలో కళ్ళవెంట నీరు కారుతుంది. తరువాత మనస్సులో ఆలోచనలు కూడా ఆగిపోతాయి. అంటే మనస్సు ప్రాణంలో లయమవుతుంది. ప్రారబ్ధకర్మ ముగిసేదాకా ప్రాణం ఉంటుంది.

ప్రారబ్ధకర్మ ముగిశాక ప్రాణం కూడా వెళ్ళటం మొదలుపెడుతుంది. తక్కిన ప్రాణాలు శక్తిని కోల్పోతాయి. ఉదానం తీసుకువెళుతుంది కాబట్టి అది ఒక్కటే శక్తివంతంగా ఉంటుంది. అజ్ఞాని జీవుడు, జ్ఞాని జీవుడు ఇద్దరూ బ్రహ్మలో లయమవుతారు. కాకపోతే అజ్ఞాని జీవునికి సంచితకర్మలు దగ్ధమవవు. అందుకని అతనికి పునర్జన్మ ఉంటుంది.

**మంత్రం 7:** ఇంతవరకూ జగత్తు సత్‌బ్రహ్మనుంచి వచ్చిందని చూశాము.

**కార్య–కారణ సంబంధం**

1. కార్యం = కారణం+ నామరూపాలు
2. కారణం = కార్యాలన్నింటికి ఆత్మ. అంటే వాటి అధిష్ఠానం. వాటి సారం.

3. కారణం వాటి అధిష్ఠానం అంటే కారణం లేకుండా కార్యానికి విడిగా ఉనికి లేదు. అందువల్ల కారణం సత్యం, కార్యం మిథ్య.

4. కారణమే అన్ని కార్యాలలోనూ ఉంది.

5. అందువల్ల కారణజ్ఞానేన సర్వకార్యవిజ్ఞానం భవతి

**ఏకజ్ఞః సర్వజ్ఞః భవతి**

ఇప్పుడు కార్యం పదాన్ని జగత్తుతోనూ, కారణ పదాన్ని బ్రహ్మతోనూ మార్చి చూద్దాము.

1. జగత్తు = సత్‌బ్రహ్మ + నామరూపాలు.
2. సత్ జగత్తంతటికీ ఆత్మ. సత్‌బ్రహ్మ అధిష్ఠానం. సత్‌బ్రహ్మ సారం.

మనం మట్టికుండ అంటున్నాము. కుండను సత్యం చేసి మట్టిని దానికి విశేషణంగా వాడుతున్నాము. నిజానికి కుండగా ఉన్న మట్టి అనాలి. అలాగే ఉనికి ఉన్న జగత్తు అంటున్నాము. జగత్తును సత్యం చేసి, ఉనికిని దానికి విశేషణంగా వాడుతున్నాము. నిజానికి జగత్తుగా ఉన్న ఉనికి అనాలి. అందువల్ల జగత్తుకు ఆత్మ బ్రహ్మ. అంటే జగత్తు అధిష్ఠానం బ్రహ్మ.

3. బ్రహ్మ జగత్తుకు అధిష్ఠానం అంటే బ్రహ్మ లేకుండా జగత్తుకు విడిగా ఉనికి లేదు. అందువల్ల బ్రహ్మ సత్యం, జగత్ మిథ్య.

4. బ్రహ్మే జగత్తంతా అనేక నామరూపాలతో ఉంది. ఉదాహరణకు భూలోక సత్తా, భువర్లోక సత్తాగా ఉంది.

5. అందువల్ల సత్ విజ్ఞానేన సర్వవిజ్ఞానం భవతి.

అలా అయితే సత్ విజ్ఞానం పొందటం ఎలా?

ఈ ప్రశ్నలో అర్థం లేదు. బ్రహ్మను ఎప్పుడు అనుభవించటం లేదు? సర్వదా బ్రహ్మ అనుభవం ఉంది. అన్నివేళలా, అన్ని చోట్లా బ్రహ్మ అనుభవం ఉంది. నిజానికి వేదాంతం మనకు సవాలు విసురుతున్నది. సరే బ్రహ్మను చూస్తానంటున్నావు కదా, బ్రహ్మను తప్పించుకోవటానికి ప్రయత్నం చేయి. బ్రహ్మను తప్పించుకోవాలంటే ఉనికి లేని వస్తువులను అనుభవించాలి. నామరూపాలు మారుతాయి కాని ఉనికి ఉంటుంది. ఇంగ్లీషులో బుక్ ఈజ్, టేబుల్ ఈజ్, పెన్ ఈజ్ అని చెపుతూ వస్తాము. పేర్లు మారాయి కాని ఈజ్, ఈజ్, ఈజ్ ఉంటూనే వస్తుంది. ఈజ్‌నెస్ మారదు. ఆ ఈజ్‌నెస్సే బ్రహ్మ. అందువల్ల బ్రహ్మను అన్ని వేళలా అన్నిచోట్లా అనుభవిస్తూనే ఉన్నాము. నిర్గుణబ్రహ్మను చూడటం ఎలా?

అయినా మనకు తృప్తి లేదు. నేను అనుభవిస్తున్నది నామరూపాలతో ఉన్న బ్రహ్మను. సగుణ బ్రహ్మను. నాకు శుద్ధ చైతన్యాన్ని, నిర్గుణబ్రహ్మను అనుభవించాలని ఉంది. నిర్గుణ, నిరుపాధిక, నిర్విశేష బ్రహ్మను చూడాలని ఉంది. కనీసం కొంచెంగానన్నా చూడాలి.

**తత్త్వమసి**

నిర్గుణబ్రహ్మను వస్తువుగా చూడలేము. అనుభవం నామరూపాలతో అవుతుంది.

జగత్ = సత్‌బ్రహ్మ+నామరూపాలు
సత్‌బ్రహ్మ = జగత్–నామరూపాలు

సత్‌బ్రహ్మను చూడాలంటే నామరూపాలు తీసేయాలి. ఎలా తీయాలి? నామరూపాల జగత్తును ఇంద్రియాలనే ప్రమాణంతో చూస్తాము. ఇంద్రియాలనే ప్రమాణాలను తీసేయాలి. ఎన్నో లైట్లు వెలుగుతున్న గదిని చీకటిగా చూడాలనుకున్నారనుకోండి. ఏం చేస్తారు? దానికి రెండు పద్ధతులు ఉన్నాయి. ఒకటి ఒక్కోలైటూ ఆర్పుకుంటూ రావటం. ఇంకోటి మీరే కళ్ళు మూసుకోవటం. అప్పుడు చీకటి మిగులుతుంది. చీకటి నాకు తెలియటం లేదే? అయితే చూడు, చూడాలంటే కళ్ళు తెరవాలి. కళ్ళు తెరిస్తే చీకటిని చూడలేవు.

అలాగే నిర్గుణ బ్రహ్మను చూడాలంటే ప్రమాణాలు వాడలేము.అందుకే అశబ్దం, అస్పర్శం, అరూపం అన్నారు. నిర్గుణబ్రహ్మను ఎన్నటికీ అనుభవించలేము. ప్రమాణం వాడితే అది సగుణబ్రహ్మ అవుతుంది. ప్రమేయరూపం వస్తుంది.

అసలు నిర్గుణబ్రహ్మ ఉందా?

నిర్గుణబ్రహ్మను చూడలేమంటే అసలు నిర్గుణబ్రహ్మ ఉందా? లేక తరతరాలుగా చెపుతున్న అబద్ధమా?సర్వప్రమాణ అగోచరం అయితే అసత్ అనచ్చు కదా. సత్ బ్రహ్మను అనుభవించటానికి ఎన్నడూ ప్రయత్నించలేము. ఎందుకంటే సత్‌బ్రహ్మను అనుభవించే నువ్వే శుద్ధ చైతన్యానివి. ఏదైనా తెలుసుకోవాలి అనుకుంటే నువ్వు (ప్రమాతా) చిత్+నామరూపం అవుతావు. నువ్వు అనుభవించే వస్తువు సత్+నామరూపం అవుతుంది.

చిత్+నామరూపం = ప్రమాతా
సత్+నామరూపం = ప్రమేయం

ప్రమాతా, ప్రమేయాలలోంచి నామరూపాలు తీసేస్తే ఏం మిగిలింది? శుద్ధచిత్, శుద్ధసత్తా. సత్తే చిత్ , చిత్తే సత్తా. ప్రమాతా, ప్రమేయాల తేడా తెలియదు. తెలుసుకునే వ్యక్తి, తెలియబడే వస్తువుల మధ్య తేడా లేదు.

**సత్త్వమేవ త్వం, త్వమేవ సత్**

అప్పుడు **ఆత్మజ్ఞానేన సర్వజ్ఞః భవతి**

అప్పుడు జ్ఞాని సర్వజ్ఞుడు అవుతాడు. ఆత్మజ్ఞానంవల్ల సర్వజ్ఞానం కలుగుతుంది కాబట్టి సర్వజ్ఞుడు అవుతాడు. ఇప్పుడు సత్‌కి చెప్పిన 5 అంశాలు చిత్‌కు వర్తిస్తాయి.

1. జగత్తు = చిత్ + నామరూపాలు.
2. చిత్ జగత్తంతటికీ ఆత్మ.
3. చిత్ సత్యం, జగత్ మిథ్య.
4. చిత్తే జగత్తంతా అనేక నామరూపాలతో ఉంది.
5. **చిత్‌విజ్ఞానేన సర్వ విజ్ఞానం భవతి.**

ఇప్పుడు మంత్రం చూద్దాము.

**స య ఏషోఽణిమా** – సత్ అణువుకన్నా సూక్ష్మమైనది.

**అవిషయత్వాత్, అప్రమేయత్వాత్, సర్వప్రమాణ అగోచరత్వాత్.**

**ఐతదాత్మ్యమిదగ్ం సర్వం** – సత్తే అన్నిటికీ ఆత్మ.

తత్ సత్యం – అదే సత్యం.
స ఆత్మా – ఆ సత్తే జగత్తులో నామరూపాలుగా వ్యక్తమవుతున్నది.

**తత్త్వమసి శ్వేతకేతో** – ఆ సత్తా నువ్వే శ్వేతకేతు. సత్తే చిత్, చిత్తే సత్. తత్ ఏవ చిత్ భవతి, చిత్ ఏవ తత్ భవతి.

ఇదంతా, ఎందుకు వచ్చింది? ఈ అధ్యాయం మొదట్లో వచ్చిన ప్రశ్నను మర్చిపోకూడదు.

**యేనాశ్రుతగ్ం శ్రుతం భవిత్యమతం మతమవిజ్ఞాతం విజ్ఞాతమితి॥**

ఏ ఒక్కటి తెలుసుకుంటే సర్వం తెలుసుకున్నట్టవుతుంది? దానికి ఉద్ధాలకుడు చెప్పిన జవాబు.

**ఏకకారణవిజ్ఞానేన సర్వవిజ్ఞానం భవతి**

తర్వాత బ్రహ్మను కారణంగా నిరూపించాడు. అప్పుడు–
**బ్రహ్మవిజ్ఞానేన, సర్వవిజ్ఞానం భవతి**

ఇప్పుడు ఆ బ్రహ్మవు నువ్వే అంటున్నాడు. అంటే
**ఆత్మవిజ్ఞానేన, సర్వవిజ్ఞానం భవతి**

తత్త్వమసిలో బ్రహ్మను కారణంగా నిరూపించటం ద్వారా తత్ పద విచారం ముగుస్తుంది. ఆత్మను బ్రహ్మగా నిరూపించటం ద్వారా త్వం పద విచారం ముగుస్తుంది. అసి అంటే ఐక్యం చెప్పకనే చెప్పినట్టయింది. ఆత్మ = బ్రహ్మ అంటే అసి వచ్చేస్తుంది. ఇక్కడితో బోధ ముగిసినట్టే.

## ఖండాలు 6.9-6.16 - 4 తత్త్వమసిలో అసిపద విచారణ

4) **తత్త్వమసిలో అసి పద విచారణ** - ఎనిమిదో ఖండంతో శ్రవణం భాగం అయిపోయింది. తొమ్మిది నుంచి మననం భాగం మొదలవుతుంది. ఈ భాగంలో **తత్త్వమసి శ్వేతకేతో** వాక్యం 9 సార్లు వస్తుంది. వేదాంతసారాన్ని నిర్ణయించటానికి, శాస్త్రం ఈ ఆరో అధ్యాయాన్ని ప్రతీకగా తీసుకుంటుంది. శాస్త్రంలో సారాన్ని నిర్ణయించటానికి షట్‌లింగ విచారణ చేస్తారు. అందులో ఒక అంశం అభ్యాసం. ఏదైనా పదేపదే చెప్పబడితే దాన్ని అభ్యాసం అంటారు.

**ఐతదాత్మ్యమిదగ్ం సర్వం తత్సత్యగ్ం**

**స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో** మొత్తం 9 సార్లు చెప్పబడింది.

**ఖండం 9** - 1. సుషుప్తిలో బ్రహ్మలో లయమవుతుంటే నాకెందుకు తెలియటం లేదు?

దానికి జవాబు ఒక దృష్టాంతంతో సహా వస్తున్నది ఈ ఖండంలో. వ్యష్టిగా మన కర్తృత్వ, భోక్తృత్వ, ప్రమాతృత్వాలలో వ్యత్యాసం ఉంటుంది. సుషుప్తిలో ఈ మూడూ పోతాయి. ప్రమాతృత్వం ఉండనప్పుడు, ఇతరులను కూడా తెలుసుకోలేము. ప్రమాతృ ప్రమేయ ప్రమాణ భేదం లేనప్పుడు ప్రమా (జ్ఞానం) ఎలా సాధ్యం?

తేనెటీగలు భిన్నపుష్పాలనుంచి సేకరించిన తేనెను ఒకచోట కలుపుతాయి. వాటిని ఒకదాంట్లో కలిపేవరకూ, వాటికి భిన్నత్వం ఉంటుంది. కాని కలిశాక తేడా తెలియదు. అలాగే నిద్రలో సింహంనుంచి దోమ వరకూ అన్నీ ఒకటే. అన్నీ బ్రహ్మలో లయమవుతాయి. కాని బ్రహ్మలో లయమయినట్టు ఎందుకు తెలియదు అంటే, ముందే చూసినట్టుగా ప్రమాతృత్వం ఉండదు. ఆ బ్రహ్మ ఎవరు? **తత్త్వమసి శ్వేతకేతో.**

**ఖండం 10** - 2. సుషుప్తిలో లయం తెలియకపోయినా, లేచాక ఎందుకు తెలియటం లేదు?

సుషుప్తిలో ప్రమాతృత్వం ఉండదు కాబట్టి తెలియదు అంటున్నారు బాగానే ఉంది; లేచాక ఎందుకు తెలియటం లేదు? లేచాక, ప్రమాత కూడా లేస్తాడు కదా, అప్పుడెందుకు, 'నేను బ్రహ్మలో లయమయ్యాను,' అని చెప్పలేకపోతున్నాము?

ఏమిటా జవాబు? చాలా తేలిక. నిద్ర లేచాక బ్రహ్మలో లయమయినట్టు గుర్తు తెచ్చుకోలేము. ఎందుకంటే మనకు తెలిసినదాన్నే గుర్తు తెచ్చుకోగలము. బ్రహ్మలో లయమయ్యామని తెలిస్తే కదా, గుర్తు తెచ్చుకునే అవకాశం ఉండేది. నిద్రలో అజ్ఞానంలో ఉన్నాము. అందువల్ల ఒక్కముక్కలో చెప్పాలంటే నిద్రపోతున్న వ్యక్తికి తెలియదు, లేచిన వ్యక్తి గుర్తు తెచ్చుకోలేడు.

దృష్టాంతం కవితాధోరణిలో సాగుతుంది. నదులకు రెండు విషయాలు తెలియవు.

1. సముద్రంలో కలిశాక, నేను గంగను, నేను యమునను అనే జ్ఞానం లేదు.

2. మళ్ళీ పుట్టాక, నేను సముద్రంలో లయం చెంది సముద్రంనుంచి వచ్చాను అనీ తెలుసుకోలేవు.

అంటే లయా తెలియదు, పుట్టుకా తెలియదు. ఇంకొక విధంగా చెప్పాలంటే, జ్ఞానమూ లేదు, జ్ఞాపకమూ లేదు. అలాగే మనకు బ్రహ్మలో లయమయినట్టు తెలియదు కాబట్టి, దాని గురించి లేచాక కూడా చెప్పలేము. అంటే మనకు కూడా జ్ఞానమూ లేదు, జ్ఞాపకమూ లేదు. ఆ బ్రహ్మ ఎవరు?

**తత్త్వమసి శ్వేతకేతో**

**ఖండం 11** – 3. మరణించాక జీవాత్మ ఉంటుందంటే, నాకు ఎందుకు తెలియటం లేదు?

ఛాందోగ్యోపనిషత్తు మన చుట్టూ ఉన్న చిన్నచిన్న విషయాలే తీసుకుని, పెద్ద బోధ చేస్తున్నది. ఇంతకుముందు తేనె, నదుల గురించి చెప్పింది. ఇప్పుడు పెద్ద చెట్టును తీసుకుంది. పునర్జన్మకు నిదర్శనం ఈ దృష్టాంతం. ఇది వృక్షదృష్టాంతం.

చెట్టును కింద భాగంలో కొట్టినా, మధ్యభాగంలో కొట్టినా, పైభాగంలో కొట్టినా రసం కారుతుంది. దీన్నిబట్టి జీవాత్మ చెట్టు అంతటా ఉంది; కొమ్మ కొమ్మలోనూ ఉంది, ప్రతి ఆకులోనూ ఉంది అని అర్థమవుతున్నది. అదే ఒక కొమ్మ కిందికి రాలి పడిపోతే అందులో జీవం ఉండదు. **కొమ్మ మరణం జీవాత్మ మరణం** కాదు. అలాగే చెట్టు మరణించినా జీవాత్మ మరణించదు. జీవాత్మ చెట్టును విడిచిపెట్టింది అనాలి.

అదే విధంగా శరీరంలో అంగాలు పనిచేయకపోతే, జీవుడు ఆ అంగాలను విడిచిపెట్టినట్టు అర్థం. ప్రారబ్ధకర్మ ముగియగానే, ఈ శరీరం మొత్తం రాలిపోతుంది. శరీరం పడిపోయినా, జీవుడు మరణించడు. జీవుడు శరీరాన్ని విడిచిపెట్టాడు అనాలి. జీవుడు అనాది. నువ్వు శరీరానివి కాదు. శరీరానికి చైతన్యాన్ని ఇస్తున్నావు. నీ స్వరూపమేమిటి?

**తత్త్వమసి శ్వేతకేతో**

**ఖండం 12 –** 4. ఇంద్రియ అగోచరమైన బీజం, ఇంద్రియ గోచరమైన వృక్షాన్ని ఎలా ఉత్పత్తి చేయగలదు?

ప్రమాణాలకందని బ్రహ్మ ఇంత విశాల జగత్తును ఎలా సృష్టించగలదు? దానికి ఉద్దాలకుడు న్యగ్రోధదృష్టాంతం తీసుకున్నాడు. న్యగ్రోధ అంటే మర్రిచెట్టు. శ్వేతకేతుని ఎదురుగా ఉన్న మర్రిచెట్టునుంచి ఒక మర్రిపండును తెమ్మన్నాడు. అలాగే తెచ్చాడు శ్వేతకేతు. దాన్ని పగలగొట్టు అన్నాడు. లోపల ఏం ఉన్నాయి అంటే అణువులలాంటి చిన్నగింజలు ఉన్నాయి అన్నాడు. ఒక గింజను పగలగొట్టు అన్నాడు. గురువు ఏం చెబితే అది చేస్తున్నాడు. దాంట్లో ఏముంది అంటే ఏమీ కనబడటం లేదు భగవాన్ అన్నాడు.

కంటికి కనబడనంత మాత్రాన ఈ గింజలో ఏమీ లేదని కొట్టిపారేయలేము. అందులో మర్రిచెట్టు అనే మహావృక్షం అవ్యక్తరూపంలో ఉందని, తర్కపరంగా ఆలోచించి, అర్థం చేసుకోవాలి. అవ్యక్తరూపంలో ఉన్న మర్రిచెట్టును శ్వేతకేతు చూడలేకపోతున్నాడు. కాని అంత చిన్న చుక్కలాగా ఉన్న దానినుంచి, ఇంత మహావృక్షంగా పెరిగిపోతున్న మర్రిచెట్టు వచ్చింది. అలా ఆ సూక్ష్మమైన బ్రహ్మ ఎంతో విశాలమైన జగత్తుకు కారణమయింది. ఆ బ్రహ్మవు నువ్వే.

**తత్త్వమసి శ్వేతకేతో**

**ఖండం 13 –** 5. **బ్రహ్మ జగత్తంతా నిండి ఉంటే, నాకెందుకు కనబటం లేదు**?

బంగారు ఆభరణంలో బంగారాన్ని చూడగలుగుతాము. కాని బ్రహ్మను ఎందుకు చూడలేకున్నాము? జగత్తు కార్యమైతే కార్యమంతటా కారణబ్రహ్మ ఉన్నట్టు తెలియాలి కదా?

బ్రహ్మ తెలియటం లేదు అంటే బ్రహ్మను తెలుసుకునే ప్రమాణం వాడటం లేదు అని అర్థం. అందువల్ల సరియైన ప్రమాణం వాడాలి. మనకు తెలిసిన ఐదు ప్రమాణాలు కూడా పనిచేయవు. ఇవికాక ఆరో ప్రమాణమైన శాస్త్రాన్ని వాడాలి. దాన్ని గురుశాస్త్ర ఉపదేశ ప్రమాణం అని కూడా అంటారు.

ఈ విషయాన్ని ఒక చిన్న ప్రయోగం ద్వారా నిరూపించబోతున్నాడు ఉద్దాలకుడు. దీన్ని **లవణదృష్టాంతం** అంటారు. చాలా చిన్న ప్రయోగం. ఖర్చులేని వ్యవహారం. కేవలం ఒక గ్లాసు, ఒక పెద్ద ఉప్పు కణిక, కొంచెం నీళ్ళు అంతే. దీంట్లోంచి వేదాంతసారం ఆపోసన పడుతున్నాడు.

ముందురోజు రాత్రి ఉప్పుకణిక తెచ్చి నీళ్ళలో పోసి, మర్నాడు పొద్దున్న తన దగ్గరకు తీసుకురమ్మన్నాడు. అలాగే చేసాడు శ్వేతకేతు. అప్పుడా ఉప్పుకణికను తీయమంటాడు.

అది కంటికి కనబడదు. చేతితో తడిమి చూడమంటాడు. స్పర్శకు అందదు. అంటే రెండు ఇంద్రియశక్తులకు అందలేదు. అవి చూపు, స్పర్శ. అంటే ఉప్పు లేనట్టా! మూడు చోట్లనుంచి నీటిని తాగి చూడమంటాడు. అంతా ఉప్పగా ఉంటుంది. అందువల్ల ఒక ప్రమాణానికి అందనంత మాత్రాన అది లేదనకూడదు. పై ఉదాహరణ తీసుకుంటే, జగత్తు నీరు, ఉప్పు బ్రహ్మ. నీరంతటా ఉప్పు తెలిసినట్టు, జగత్తనే నీరు అంతటా బ్రహ్మ అనే ఉప్పు కరిగి, సర్వవ్యాపకమయింది. అందువల్ల బ్రహ్మ ఇంద్రియప్రమాణాలకు అందనంత మాత్రాన లేదనకూడదు.

బ్రహ్మను ఉపనిషత్ శాస్త్రంద్వారానే తెలుసుకోగలము. లౌకిక ప్రమాణం అనాత్మనే చూపగలవు. ఈ బ్రహ్మ ఎవరు?

**తత్త్వమసి శ్వేతకేతో**

**ఖండం 14 –** 6. శాస్త్రప్రమాణం చెప్పి ఊరుకోకుండా గురువుకు ఎందుకు ప్రాముఖ్యతను ఇచ్చింది?

ముందు ఖండంలో బ్రహ్మను శాస్త్రప్రమాణం ద్వారానే తెలుసుకోగలము అన్నాడు గురువు. ఇక్కడ గురువు ప్రాముఖ్యత గురించి చెబుతున్నాడు. మన శాస్త్రాన్ని స్వంతంగా చదివితే అర్థం కాకపోగా, అపార్థం చేసుకునే ఆస్కారం ఉంది. సరిగ్గా అర్థం కాకపోతే బ్రహ్మను నిరాకరించే ప్రమాదం ఉంది. అందువల్ల గురువుద్వారా నేర్చుకోవాలి. ఆ గురువు మంచి గురువునుంచి నేర్చుకుని ఉండాలి. ప్రతి గురువుకూ ఒక గురువు ఉంటాడు. ఆది గురువెవరు? భగవాన్! దీనికొక దృష్టాంతం చెబుతున్నాడు. దాన్ని గాంధారదేశదృష్టాంతం ద్వారా చెబుతున్నాడు. గాంధారదేశం అంటే ఇప్పటి ఆఫ్ఘనిస్తాన్. కొందరు దొంగలు గాంధారదేశానికి చెందిన ఒక వ్యక్తిని దోచుకుని, అతని కళ్ళకు గంతలు కట్టి, నిర్జనమైన అడవిలో వదిలివేస్తారు. అతను రక్షించండి, కాపాడండి అని గట్టిగా అరుస్తాడు. అటువైపుగా వెళుతున్న ఎవరో పుణ్యాత్ముడు వచ్చి కళ్ళకు గంతలు విప్పి, అతనికి ఎటు వెళ్ళాలో చెప్పాడు.

ఇప్పుడు ద్రాష్టాంతం. అతనిలాగే ఆత్మ, పరమాత్మ, బ్రహ్మ అయిన మనకు అజ్ఞానమనే గంతలు కట్టబడి ఉన్నాయి. పుణ్యపాపాలనే తస్కరులు మనను పంచకోశం లేదా శరీరత్రయం అనే అడవిలో తెచ్చి కట్టి పడేశారు. గురువు వచ్చి శాస్త్రబోధ చేశాడు. మనం గంధారదేశం చేరుకున్నాము. అంటే బ్రహ్మజ్ఞానం పొందాము. ఆ జ్ఞానం ఏమిటి?

**తత్త్వమసి శ్వేతకేతో**

**ఖండం 15 – 7 జ్ఞానికీ, అజ్ఞానికీ మరణకాలంలో ప్రాణం పోయే క్రమం ఒకటేనా?**

జ్ఞానికీ, అజ్ఞానికీ ప్రాణం పోయే తీరు ఒకటే. కాకపోతే అజ్ఞానికి పునర్జన్మ ఉంటుంది. జ్ఞానికి ఉండదు. దీన్ని **మరణదృష్టాంతం** ద్వారా చూస్తాము. ఇంతకుముందు కూడా మరణదృష్టాంతం వచ్చింది. కాకపోతే అక్కడ అజ్ఞాని జీవి మరణం గురించి అయితే, ఇది జ్ఞాని జీవి మరణం గురించి. మరణం ఏ వరుసక్రమంలో అవుతుంది? వాక్కు మనస్సులో, మనస్సు ప్రాణంలో, ప్రాణం తేజస్సులో, తేజస్సు పరబ్రహ్మలో లయమవుతాయి. అజ్ఞానికి సంచితకర్మ ఇంకా ఉంటుంది కాబట్టి, దాన్ని అంతకాలం అనీ, జ్ఞాని మరణాన్ని పరాంతకాలం అనీ అంటారు.

ఈ ఉపనిషత్తులో అన్నీ అగ్నినుంచి వచ్చాయని సృష్టిక్రమం వచ్చినప్పుడు చూశాము. ప్రళయంలో వ్యతిరేకదిశలో లయం అవుతాయి అన్నీ. అందుకే అన్నీ అగ్నిలో లయమయితే, అగ్ని బ్రహ్మలో లయమవుతుంది.

మరణం నిర్వచనం శుద్ధసత్తా అవ్యక్తరూపంలోకి మారటం. శుద్ధసత్తా వెళ్ళిపోయింది అనకూడదు. సూక్ష్మశరీరం స్థూలశరీరాన్ని వదిలి వెళ్ళిపోతుంది. బ్రహ్మలో లయమవుతుంది. బ్రహ్మలో లయమవుతుంది అంటే అది వేరే ఏదో కాదు. అది నువ్వే.

**తత్త్వమసి శ్వేతకేతో**

గురువు తత్త్వమసి శ్వేతకేతో అని బోధిస్తే, శిష్యుడు అహం బ్రహ్మ అస్మి అని అర్థం చేసుకున్నాడు. దీన్ని అపరోక్షజ్ఞానం అంటారు.

అందుకని అంతా మీ చేతిలో ఉంది. మీరు అహం జీవః అస్మి అంటారా, తత్త్వమసి శ్వేతకేతో అనే వాక్యాన్ని జీర్ణించుకొని అహం బ్రహ్మ అస్మి అంటారా?

# ఏకాదశ ఉపనిషత్తుల సారం

## ఛాందోగ్యోపనిషత్ - అధ్యాయం 7

ఏడవ అధ్యాయం కూడా బ్రహ్మవిద్య గురించే బోధిస్తుంది. ఆరవ అధ్యాయంలో బ్రహ్మను సత్‌బ్రహ్మ అంటే, ఇక్కడ భూమా అంటున్నది. భూమకు రెండు అర్థాలున్నాయి. రెండూ వస్తాయి ఇక్కడ.

1. అనంతం – అనంతమైనది. దేశకాలవస్తుపరిచ్ఛేదశూన్యం, అంటే దేశం, కాలం, వస్తువుల పరిమితులకతీతమైనది.

2. ఆనందం – ఆనందం. అందువల్ల ఇక్కడ ఆనందరూప బ్రహ్మ గురించి వస్తుంది.

ఆనందం బాహ్యంగా ఎక్కడో లేదు. 'ఆనందం నీ స్వరూపం' అని చెప్పబోతున్నది ఉపనిషత్తు. **'అల్పే సుఖం నాస్తి,'** అని ధైర్యంగా చెపుతున్నది. అల్పవస్తువులలో అంటే పరిమితి ఉన్న వస్తువులలో సుఖం లేదు. అయితే ఎందులో ఉంది? వేదాంతసారంలో రెండవ సూత్రం గుర్తుంచుకోండి.

**శాశ్వతమైన శాంతి, ఆనందం, భద్రతలు నానుంచే వస్తున్నాయి.**

అంతేకాదు, ఆత్మానందం అనుభవంలోకి వచ్చే బాహ్యవస్తువు కాదు అని కూడా చెపుతున్నది. ఎందుకు అనుభవంలోకి రాదు? ఎందుకంటే అది అనుభవించే బాహ్యవస్తువు కాదు. అనుభవం కోరే 'నేనే' కాబట్టి. అందుకని ఆత్మానందం పొందటం ఎలా అని ఎన్నడూ అడుగకూడదు. అదేకాదు ఆత్మ అనుభవం పొందటం ఎలా, బ్రహ్మ అనుభవం పొందటం ఎలా అని కూడా అడుగకూడదు. ఎందుకు? ఆత్మ అన్నా, బ్రహ్మ అన్నా నేనే కాబట్టి. ఆత్మానందం బాహ్యంగా దొరికేది కాదు కాబట్టి. ఆనందం నా స్వరూపం కాబట్టి. ఇది చాలా బాగా అర్థం చేసుకోవాల్సిన ముఖ్యమైన పాఠం.

కాదు, కూడదు, ఆత్మానందం పొందితీరాలి అంటే, శాస్త్రం ఒకటే మార్గం ఉంది అంటున్నది. ఏమిటది? మీ అందమైన ముఖాన్ని మీకు చూసుకోవాలని ఉందనుకోండి. దాన్ని ప్రత్యక్షంగా చూడగలరా? లేరు. కాకపోతే దాని ప్రతిబింబాన్ని అద్దంలో చూడగలరు. అది అక్షరాలా అసలు మొహం కాదు, ప్రతిబింబం మాత్రమే. మీ ముఖాన్ని ప్రతిబింబించే అద్దం ఉన్నంతవరకే, మీ ప్రతిబింబం ఉంటుంది. అందుకని ఒక విషయం మర్చిపోకూడదు. అద్దంలో మీ అందమైన ముఖాన్ని చూసుకుంటున్నప్పుడు, అది అద్దానికి చెందినది కాదు, మీకు చెందినది.

అలాగే నేను ఆత్మానందం అనుభవించాలంటే అసలు సిసలు ఆత్మానందాన్ని అనుభవించలేను. ఎందుకు? అర్థం లేని ప్రశ్న! అది నేనే కాబట్టి. అలాగైతే ప్రతిబింబిత ఆత్మానందాన్ని పొందటం ఎలా? జీవితంలో ఎప్పుడు, ఏ ఆనందాన్ని పొందుతున్నా, ఒక విషయం ఎప్పుడూ గుర్తుంచుకోవాలి. ఏమిటది? ఆ ఆనందం ఆ వస్తువులో లేదు, అది మీనుంచి వస్తుంది. అద్దంలో కనిపిస్తున్న ప్రతిబింబం అద్దానికి చెందకుండా, మీకు చెందుతుందా, లేదా? అలాగే వస్తువులో కనిపిస్తున్న ప్రతిబింబం ఆ వస్తువుకు చెందకుండా, మీకు చెందుతుంది. ఈ తేలికైన సూత్రాన్ని గుర్తు పెట్టుకుంటే చాలు.

జ్ఞాని ఆత్మానందాన్ని ఎలా పొందుతాడు? అతనికేదో, ఎక్కడినుంచో ప్రత్యేకంగా ఆనందం వచ్చి ఒళ్ళో వాలుతుందనుకోకండి. జ్ఞాని ఆత్మానందాన్ని రెండు రకాలుగా పొందుతాడు.

1. ప్రారబ్ధం తెచ్చిన ఏ ఆనందాన్ని అనుభవిస్తున్నా, జ్ఞాని దాన్ని విషయానందం అనుకోడు. దానికి అతను మరోపేరు పెట్టుకుంటాడు. ఏమిటది? ఆత్మానందం. అది నా ప్రతిబింబం అనుకుంటాడు.

2. అనంతమైన ఆత్మానందాన్ని పొందాలని ఎదురుచూడడు. ఎందుకు? అది తన స్వరూపం అని తెలుసుకాబట్టి. సంగీతం ఆనందం కానీ, అన్నం ఆనందంకానీ, పుస్తకం ఆనందం కానీ, మనవడి ఆనందం కానీ – ఏ ఆనందం పొందినా అది ప్రతిబింబ ఆనందమే కాని బింబ ఆనందం కాదు. బింబ ఆనందం నేనే!

పంచదశిలో విద్యారణ్యులవారు ఈ విషయం గురించే చెపుతారు. 'ఆత్మానందాన్ని అనుభవిస్తున్నారు ఎప్పుడూ,' అంటారు. వేదాంత అధ్యయనంవల్ల విషయానందాన్ని ఆత్మానందంగా మార్చి చూడగలగాలి. ఎటువంటి ఆత్మానందం? ప్రతిబింబిత ఆత్మానందం. విషయానందాన్ని ప్రతిబింబిత ఆత్మానందంగా చూడటమే కాదు. అద్దంలో కనబడే ప్రతిబింబానికి మూలం ఏమిటి? దిక్కులు చూడకండి. మూలం మీ అసలైన మొహమే. అది బింబం. అద్దంలోది ప్రతిబింబం. బింబం ఉందని చెప్పటానికి ఆధారం ఏమిటి? బింబం లేనిదే ప్రతిబింబం ఎక్కడనుంచి వస్తుంది? అందుకని ప్రతిబింబిత మొహం ఉందంటేనే బింబ మొహం ఉన్నట్లు అర్థం. అందుకని ఏదైనా అనుభవిస్తున్నప్పుడల్లా, 'నేను బింబాన్ని, నేను అనుభవిస్తున్నది నా ప్రతిబింబాన్ని!' అని చెప్పుకుంటూ ఉండాలి. అలా ఆత్మ ఆనందస్వరూపం, ఆనందానికి మూలం ఆత్మే. వేరే ఎందులోనూ ఆనందం లేదు.

ఒక స్వామీజీ చక్కగా వర్ణించారు. 'బజారులో ఏ తినుబండారం కొన్నా అందులో ఉన్న ఆహారదినుసులు ఏమిటో చెప్తుంది కాని, 'ఆనందం' అనే దినుసు కూడా ఉందని ఎందులోనన్నా ఉంటుందా?' ఆనందం 3% లేదా 30% లేదా 90% అని ఉంటుందా?

ఉండదే! దీన్నిబట్టే తెలుస్తోంది, ఆనందం బాహ్యవస్తువులలో ఎందులోనూ దొరికేది కాదని. దానికి ఒకటే మూలం ఉంది. ఏమిటది? 'నేనే ఆనందస్వరూపాన్ని.' బింబ ఆనందాన్ని అనుభవించాలని ఎదురు చూడకండి. నేను ఆనంద ఆత్మను అని ప్రకటించుకోవాలి. ఇదే భూమవిద్య అనే ఈ అధ్యాయంలో అంశం. ఈ నేపథ్యంతో అధ్యాయంలోకి అడుగుపెడదాము.

ఏడవ అధ్యాయంలో 26 ఖండాలు, 53 మంత్రాలు ఉన్నాయి. ఈ అధ్యాయాన్ని ప్రధానంగా 4 అంశాలుగా విభజించవచ్చు. అవి,

1. ఆఖ్యాయిక – ఖండం 1 (కొంతభాగం)
2. ప్రతీక ఉపాసనాని 15 – ఖండాలు 1–15
3. బ్రహ్మవిద్యా సాధనాని 6 – ఖండాలు 16–22
4. బ్రహ్మవిద్య/భూమా విద్య, 3 నిర్వచనాలు – ఖండాలు 23–26

ఈ నేపథ్యంతో అధ్యాయంలోకి అడుగుపెడదాము.

## ఖండం 7.1 (కొంతభాగం) –1 ఆఖ్యాయిక

**1 ఆఖ్యాయిక** మొదటి ఖండంలో గురుశిష్యులను పరిచయం చేస్తున్నది. బ్రహ్మవిద్య గురుశిష్యుల సంవాదం రూపంలో వస్తుంది. శిష్యుడు గురువును భగవాన్ అని సంబోధిస్తే, గురువు శిష్యుణ్ణి సౌమ్య అని పిలుస్తాడు. ఇక్కడ గురువు సనత్కుమారుడు, శిష్యుడు నారదమహర్షి. సనత్కుమారుడు సుబ్రహ్మణ్యస్వామి అవతారం. ఈ అధ్యాయం చివరలో **తం స్కంద ఇత్యాచక్షతే** అని వస్తుంది.

ఒకసారి నారదమహర్షి సనత్కుమారుని దగ్గరకు శాస్త్రప్రకారం వెళ్ళాడు. సనత్కుమారుడు నువ్వు ఏం నేర్చుకున్నావో ముందు అది చెప్పు. నీకు ఎంతవరకు తెలుసో చెబితే, దానికన్నా ఉన్నతస్థాయి విద్య బోధిస్తాను అన్నాడు. నారదులవారు తనకి తెలిసిన విద్యల పట్టిక చదువుతున్నాడు. 'నేను ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణవేదం, ఇతిహాస పురాణాలు, వ్యాకరణం, పితృదేవతలకు చేసే శ్రాద్ధకర్మలు, గణితశాస్త్రం, భవిష్యవాణి, నిధి నిక్షేపాలు తెలుసుకునే విద్య, తర్కశాస్త్రం, నేతి శాస్త్రం, నిరుక్తశాస్త్రం, వేదాంగాలు, భూతవిద్య, క్షత్రవిద్య, నక్షత్రవిద్య, సర్పవిద్య, దేవజనవిద్య నేర్చుకున్నాను.' ఇదంతా అనాత్మవిద్య అని నారదులవారికీ తెలుసు.

**శృతగ్ం హ్యేవ మే భగవద్దృశేభ్యః** – ఈ క్రింది వాక్యం మీలాంటి మహాత్ములనుంచి విన్నాను.

**తరతి శోకమాత్మవిత్**

ఇది కూడా అక్షరలక్షలు విలువ చేసే వాక్యం. ఆత్మజ్ఞానం పొందిన వ్యక్తి శోకమనే సముద్రాన్ని దాడుతాడు. దీనివల్ల ఆత్మజ్ఞానం ఒక్కటే సంసారమనే అజ్ఞానాన్ని పారద్రోలగలదు అని స్పష్టంగా తెలుస్తున్నది. అందువల్ల తనకు ఏం కావాలో కూడా కోరుతున్నాడు.

**సోఽహం భగవః శోచామి** – ఓ భగవాన్! నేను శోకంలో ఉన్నాను.

**తం మా భగవాన్ శోకస్య పారం తారయతు** – ఓ భగవాన్! మీరే నన్ను శోకమనే సాగరం యొక్క ఆవలితీరానికి తీసుకువెళ్ళాలి. అంటే నారదులవారు ఆత్మవిద్య కోసం అడిగాడు.

ఇక్కడితో ఆఖ్యాయిక అయింది. ఆత్మవిద్య ఒక్కటే సంసారనివృత్తి చేయగలదనీ, దానిని గురువుద్వారానే పొందాలనీ అర్థమవుతున్నది.

## ఖండాలు 7.1–7.15 – 2 ప్రతీక ఉపాసనాని

నారదుడు ఆత్మవిద్యకోసం అడిగాడు. సనత్కుమారుడు కూడా బోధ చేద్దామనుకున్నాడు కానీ, నారదులవారిని ముందు సిద్ధం చేయాలనుకున్నాడు. అందుకని ముందు కొన్ని వరుస ప్రతీక ఉపాసనలు చెప్పుకొస్తున్నాడు. ప్రతీక అంటే ఒక ఆలంబనంమీద దేనినైనా ఉపాసన చేయటం. ఇక్కడ ఒక్కొక్క ప్రతీకమీద అనంతమైన బ్రహ్మను ఉపాసన చేయమంటున్నాడు. అలా 15 ఉపాసనలు బోధిస్తాడు.

## ఖండం 7.1 – 1 నామబ్రహ్మ ఉపాసన

**నామైవైతత్** నీకు తెలిసిన విద్యలన్నీ నామమాత్రమే. అవి నామం తప్ప మరేమీ కాదు. అన్నీ పదాలు, కేవలం పదాలు.

**వాచాఽఽరంభణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్**

కార్యం నామరూపాలు తప్ప ఏమీ కాదు. కారణం లేకుండా కార్యానికి విడిగా ఉనికి లేదని ఆరవ అధ్యాయంలో చూశాము. నీకున్న జ్ఞానమంతా నామమాత్రమే అంటే అదంతా మిథ్య అని అర్థం. నామం మిథ్య అయినా, జగత్తంతా వ్యాపించి ఉంది కాబట్టి అది అనంతం.

అందువల్ల నామం మొదటి ప్రతీక. నామం అంటే పదం అని తీసుకోవాలి. ప్రతి పదార్థానికీ ఒక పదం ఉంటుంది. అందువల్ల పదాన్నే బ్రహ్మగా భావించి ఉపాసన చేయి

అన్నాడు. ఈ ఉపాసనతో మొదలు పెట్టటానికి కారణం నారదుల వారి మనస్సంతా నిండి ఉన్నది నామాలే నామాలు.

**మొదటి ఉపాసన – నామబ్రహ్మ ఉపాసన**

నారదులు, నామం నిజంగా అనంతమా అంటాడు. సనత్కుమారుడు, కాదు, దానికన్నా కొంచెం పెద్దది ఇంకోటి ఉంది అని చెప్పి, రెండోదాన్ని ప్రవేశపెట్టాడు. ప్రతిసారీ నారదులవారు దీనికన్నా పెద్దది ఉందా అని అడగటం, దానికంటే శ్రేష్ఠమైనది నిశ్చయంగా ఇంకొకటి ఉందని సనత్కుమారుడు చెప్పటంవల్ల అలా మొత్తం 15 ఉపాసనల దాకా వెళతాము. అలా నామంతో మొదలుపెట్టి, ప్రాణం దాకా వెళతాము. దీని ఉద్దేశ్యం ఏమిటంటే, నామంనుంచి ప్రాణానికి వెళ్ళేలోపు, శిష్యుని మనస్సు అంతకంతకూ విశాలమవుతుంది. అంతేకాదు, మరింత సూక్ష్మదృష్టి పెరుగుతుంది. ఈ 15 దశలూ దాటాక, సనత్కుమారుడు అసలు బ్రహ్మ గురించి బోధిస్తాడు.

నామబ్రహ్మ ఉపాసన చేయి అని చెప్పేముందు, నారదుడు చదివిన పట్టికనంతా అక్షరం పొల్లు పోకుండా మళ్ళీ చదివి, సనత్కుమారుడు,

**నామైవైతత్ తన్నామోపాస్స్వేతి**

అవన్నీ కేవలం నామమే! అందువల్ల నువ్వు నామబ్రహ్మ ఉపాసన చేయి అని చెప్పి దాని ఫలం కూడా చెబుతున్నాడు.

ప్రతి ఉపాసనకూ రెండు రకాల ఫలం ఉంటుంది. నిష్కామ ఉపాసన చేస్తే జ్ఞానయోగ్యతా ప్రాప్తి కలుగుతుంది. సకామ ఉపాసన చేస్తే ఆ ఉపాసనకు తగ్గ ఫలం వస్తుంది. ఎవరైతే నామబ్రహ్మ ఉపాసన చేస్తారో, వారు ఏ ఆటంకం లేకుండా ఎక్కడికి కోరితే అక్కడికి వెళ్ళగలరు. ఎంతవరకు? ఏ లోకాలలో నామం విస్తరిస్తే, ఆ లోకాలకు వెళతారు. అన్ని ఉపాసనలకూ సమానంగా ఉన్న అంశం, ఆ ఉపాసన వ్యాపకత్వం.

## ఖండం 7.2 – 2. వాక్కు బ్రహ్మ ఉపాసన

**వాగ్వావ నామ్నో భూయసీ** – నామంకన్నా విస్తీర్ణమైనది వాక్కు. వాక్కు అంటే వాగింద్రియం. వాక్కు కారణం, పదాలు కార్యం. ఒక గంట మీరు మాట్లాడితే, మీ పదాలను ఉత్పత్తి చేసే మీ వాక్కు వాటికి కారణం. కార్యకారణాలలో కారణమే, కార్యంకన్నా విస్తీర్ణమైనది.

అదికాక, వాగింద్రియం వల్లనే మాటలు వస్తున్నాయి. వావ అంటే వత్తి పలకటం. వాక్కే నిశ్చయంగా నామాలకన్నా గొప్పది. వాగింద్రియం మాత్రమే నారదులవారికి వచ్చిన

విద్యలన్నింటినీ తెలియచేస్తుంది. అంతేకాక, సనత్కుమారుడు వాగింద్రియం చెప్పేవాటిని మరికొన్నింటిని చెబుతున్నాడు. లోకాల గురించి, పంచభూతాల గురించి, దేవతలు, మనుష్యులు, పశుపక్ష్యాదులు, గడ్డి, వృక్షాలు, క్రూరమృగాలు, చిన్న పురుగులు, చీమలు, వీటన్నింటి గురించి మాట్లాడగలుగుతున్నాము. అంతేనా! కొన్ని అసాధారణ విషయాలు కూడా ఉన్నాయి. ధర్మం గురించి, అధర్మం గురించి, సత్యం గురించి, అసత్యం గురించి, మంచివారి గురించి, చెడ్డవారి గురించి, మనస్సుకు నచ్చినవాటి గురించి, నచ్చనివాటి గురించీ వాగింద్రియమే మాట్లాడుతుంది.

అంతేకాదు, ఒకవేళ వాక్కు లేకపోతే ఏమవుతుందో కూడా చెబుతున్నాడు. పైన చెప్పిన వేటి గురించీ మనం మాట్లాడలేము. అవన్నీ ఉపనిషత్తు మళ్ళీ పేర్కొంటుంది. అందువల్ల వాగింద్రియాన్ని ఉపాసన చేయి.

**ఫలం** – నామంకన్నా వాగింద్రియం మరింత విశాలం కాబట్టి అతను మరింత విశాలమైన లోకాల్లో యథేచ్ఛగా సంచరించగలుగుతాడు. నిష్కామ ఉపాసన ఫలం అన్నింటికీ ఒకటే– జ్ఞానయోగ్యతాప్రాప్తి. నారదునికి సకామ ఉపాసనమీద కోరిక లేదు. ఆత్మవిద్యకోసం వచ్చాడు కాబట్టి వాక్కుకన్నా గొప్పది ఉందా అని అడుగుతాడు.

## ఖండం 7.3 – 3. మనోబ్రహ్మ ఉపాసన

**మనో వావ వాచో భూయః** – మనస్సు నిశ్చయంగా వాగింద్రియం కంటే గొప్పది. మామూలుగా మనః అంటే మనస్సు అని అర్థం. కాని శంకరులవారు దీనికి ప్రత్యేకమైన అర్థం ఇస్తున్నారు. మనః అంటే **మనస్వనం** అంటున్నారు. తేలికగా చెప్పాలంటే కోరిక అని అర్థం. కోరికకూ, వాక్కుకూ మధ్య కార్యకారణసంబంధం ఉంది. వాక్కు కార్యం, కోరిక కారణం. అలా మనస్సు కారణం అవటంవల్ల అది మరింత భూమా, అంటే మరింత వ్యాపించి ఉంటుంది. అందువల్ల **మనో బ్రహ్మ ఉపాసన** చేయమంటున్నారు.

ఈ మూడు – నామం, వాక్కు, మనస్సు – తీసుకుంటే, నామం కార్యం, వాక్కు కారణం; వాక్కు కార్యం, మనస్సు కారణం. కార్యం కారణంలో ఇమిడివుంటుంది. అందువల్ల చివరికి నామం, వాక్కు రెండూ మనస్సులో అంటే కారణంలో ఇమిడివున్నాయి. దీనికి ఉపనిషత్తు ఒక ఉదాహరణ కూడా ఇస్తున్నది. మీ చేతిలో రెండు పండ్లు ఇమిడివున్నట్టుగా అంటున్నది. రెండు రేగిపండ్లు కాని, ఉసిరికాయలు కాని, అలా మనస్సు అనే పిడికిలిలో వాక్కు, నామం ఇమిడిపోతాయిట. ఎంత ఊహాజనితమైన వివరణ!

అన్ని ఖండాలూ ఇలాగే ఎంతో ఊహాజనితంగానూ, కవితా ధోరణిలోనూ, ప్రశంసా ధోరణిలోనూ సాగిపోతాయి. ఎంతో బాగుంటాయి. చదివి ఆనందించాల్సిన అందం ఉంది వాటిలో. మనం ఆ ఉపాసనలు చేస్తామా లేదా అన్నది వేరే విషయం. వాటిలోని కవితా ధోరణిని ఆస్వాదించటానికైనా చదవాలి.

ఎప్పుడైతే ఒక వ్యక్తి తన మనస్సులో ఈ క్రింది పనులను చేయాలని అనుకుంటాడో, అప్పుడే చేయగలడు. ఏమిటవి? వేదమంత్రాలను పఠించాలని అనుకుంటే, వేదాలను పఠిస్తాడు. నేను పెళ్ళి చేసుకోవాలి, పిల్లలను కనాలి, జంతువులను పెంచుకోవాలి లాంటివన్నీ ముందు కోరికతో మొదలవుతాయి. వచ్చే జన్మలో నేను మళ్ళీ భూలోకంలో పుట్టాలి లేదా స్వర్గలోకం పొందాలి. ఇవన్నీకూడా కోరికలే. అందువల్ల మనస్సులో ఏ కోరిక ఉంటే, అది నెరవేరుతుంది.

**మనోహ్యాత్మా** – మనసే ఆత్మ. ఇక్కడ ఆత్మ అంటే కర్త అనే నేను. మనస్సువల్లనే నేను కర్తగా వ్యవహరించగలను.

**మనో హి లోకః** – పూర్తిగా ఊహాజనితమైన ఆలోచన. కర్తే అనేక కర్మలు చేయటం ద్వారా భూలోక, భువర్లోక, సువర్లోకాలను పొందుతాడు.

**మనో హి బ్రహ్మ** – మనస్సే లోకాలకు కారణం కాబట్టి మనస్సే బ్రహ్మ. అందువల్ల మనోబ్రహ్మ ఉపాసన చేయాలి.

**ఫలం** – ఉపాసకుడు 14 లోకాల్లో ఎక్కడికి కావాలంటే అక్కడికి వెళ్ళగలడు.

## ఖండం 7.4 – 4. సంకల్పబ్రహ్మ ఉపాసన

**సంకల్పో వావ మనసో భూయాన్** – సంకల్పమే మనస్సు కన్నా నిశ్చయంగా గొప్పది. ఇక్కడ సంకల్పానికి అర్థం శంకరులవారు వేరే ఇస్తున్నారు. సంకల్పం అసలు అర్థం కోరిక. ఆ అర్థాన్ని మనస్సుకు చూసేశాము కాబట్టి ఇక్కడ సంకల్పం అంటే నిశ్చయాత్మక వృత్తి అని అర్థం తీసుకోవాలి. నిశ్చయంగా ఇది మంచి, ఇది చెడు అనే చెప్పేది బుద్ధి. అందువల్ల సంకల్పం అంటే బుద్ధి అని చెప్పవచ్చు. బుద్ధి ఇది మంచిది అని చెబితే, మనస్సు దాన్ని కోరుతుంది. అది వాక్కురూపంలో బయటకు వచ్చి, పదంగా ఉచ్చరింపబడుతుంది. అంటే వైదిక మంత్రాలను ఉచ్చరిస్తుంది. ఇప్పుడు వెనక్కి వెళితే పదం వాక్కునుంచి, వాక్కు కోరికనుంచి, కోరిక సంకల్పంనుంచి పుట్టాయి. గిన్నెలో గిన్నెలు ఉన్నట్టుగా, అంటే మనస్సు కార్యం, సంకల్పం కారణం అవుతాయి.

ఈ కార్యకారణ గొలుసులో, సంకల్పం మూలకారణం తక్కినవన్నీ కార్యాలు అయ్యాయి. అందువల్ల తక్కిన కార్యాలకు సంకల్పమే సృష్టి స్థితి లయ కారణం. ఇక్కడనుంచీ ఉపనిషత్తు కవితాధోరణిలో, ఊహాత్మకంగా చెప్పుకుపోతున్నది. ఎంత అద్భుతమో చూడండి! ప్రకృతిలో దేన్ని చూసినా దానికి సంకల్పం ఉన్నట్టు అనిపిస్తుంది. వాయువు, ఆకాశం, జలములు, అగ్ని సంకల్పించాయిట. వాటి సంకల్పంవల్ల ప్రకృతిలో అన్నీ పద్ధతి ప్రకారం పనిచేస్తున్నాయి. పంచభూతాల సంకల్ప నిమిత్తంగా వర్షం సంకల్పిస్తున్నది. పంచప్రాణాలు సంకల్పించాయి. పంచప్రాణాలు సంకల్పిస్తే మంత్రాలు చక్కగా పఠించగలుగుతాము. కర్మలు సంకల్పిస్తే, కర్మఫలం కూడా మంచిది వస్తుంది. అందువల్ల అన్నింటికీ మూలకారణం సంకల్పం. అందువల్ల సంకల్పబ్రహ్మ ఉపాసన చేయి.

**ఫలం** – అతను ఈశ్వరుని సంకల్పంచేత సృష్టించబడిన లోకాలకు వెళతాడు. నారదునిలాగా త్రిలోకసంచారం చేయవచ్చు.

## ఖండం 7.5 – 5. చిత్తబ్రహ్మ ఉపాసన

**చిత్తం వావ సంకల్పాద్భూయో** – చిత్తం సంకల్పంకంటే నిశ్చయంగా పెద్దది. ఇక్కడ శంకరులవారు చిత్తం అంటే ప్రజ్ఞ అంటున్నారు. దేశకాలపరిస్థితులను చక్కగా అంచనా వేసే ప్రజ్ఞ. ఆ ప్రజ్ఞ లేనివానికి ఏదైనా శాస్త్రం బాగా తెలిసినా కూడా ఆ జ్ఞానం కూడా లేనట్టే అంటారు. సందర్భానికి తగ్గ తెలివితేటలు లేకపోతే అతని జ్ఞానం వృథా! చదువుండి ప్రజ్ఞలేని వ్యక్తికన్నా, ప్రజ్ఞ ఉండి చదువులేని వ్యక్తినే ఇష్టపడతారు.

ముందు నాలుగింటికీ కారణం నామం, వాక్కు, మనస్సు, సంకల్పాలకు చిత్తమే సృష్టి, స్థితి, లయ కారణం. అందువల్ల చిత్తబ్రహ్మ ఉపాసన చేయి.

**ఫలం** – అతను నిత్యలోకాలకు వెళ్ళి, నిత్యంగా ఉంటాడు.

## ఖండం 7.6 – 6. ధ్యానబ్రహ్మ ఉపాసన

**ధ్యానం వావ చిత్తాద్భూయః** – ధ్యానం నిశ్చయంగా చిత్తంకంటే గొప్పది. ధ్యానం అంటే ఇక్కడ ఏకాగ్రత అని తీసుకోవాలి. ధ్యానం చేసేటప్పుడు ఒక్క వస్తువుమీదే మనస్సు నిలిపి ఉంచుతాము. ధ్యానం చిత్తానికి కారణం. చిత్తం కార్యం. చిత్తం అంటే దేశకాల పరిస్థితుల గురించి చక్కటి అవగాహన అన్నాము. పరిసరాలను ఎప్పుడు గమనించగలము? ఏకాగ్రత ఉంటే. ఉపనిషత్తు మళ్ళీ కవితా ధోరణిలో పడిపోయింది. ప్రకృతిని సరిగ్గా గమనిస్తే, ప్రతిదీ ధ్యానం చేస్తున్నట్లు ఉన్నదట. ఎంత అద్భుతమైన కల్పన. ప్రకృతి తమ నియమాలను సడలించటానికి ఇష్టం లేనట్టుగా ఉందిట. భూలోకం, భువర్లోకం, సువర్లోకాలు, నీరు,

సముద్రాలు, పర్వతాలు, దేవతలు, మనుష్యులు అన్నీ, అందరూ ధ్యానం చేస్తున్నట్టుగా ఉన్నారు. కొండశిఖరాలకు వెళ్ళి చూస్తే, నిటారుగా నిల్చున్న కొండలు ఎవరో యోగి ధ్యానం చేస్తున్నట్టుగా ఉంటాయి. ఇదొక ఊహాచిత్రం! ఇంతవరకు కల్పన. ఇప్పుడు ధ్యానస్తుతి.

జీవితంలో రాణించినవారు ధ్యానసాధనను చేసినట్టు అర్థం. దానికి భిన్నంగా, అంటే ధ్యానరహితంగా ఉన్నవారు, అల్పులు, ఎప్పుడూ గొడవలు పెట్టుకుంటారు. ఎదుటివారి దోషాలను గట్టిగా ఎత్తి చూపుతారు. వారి భాష కూడా హీనంగా ఉంటుంది.

**ఫలం** – అన్ని లోకాలలో యథేచ్ఛగా తిరిగే ఫలం.

## ఖండం 7.7 – 7. విజ్ఞానబ్రహ్మ ఉపాసన

**విజ్ఞానం వావ ధ్యానాద్భూయః** – విజ్ఞానమే నిశ్చయంగా ధ్యానంకన్నా గొప్పది. విజ్ఞానం అంటే శాస్త్రార్థవిజ్ఞానం. ముఖ్యంగా ఉపాసనాకాండ శాస్త్రార్థవిజ్ఞానం. ధ్యానం చేసి ఏకాగ్రత పెంచుకోవాలంటే, దానికన్నా ముందు ధ్యానం గురించిన జ్ఞానం ఉండాలి. ఆ జ్ఞానం వేదాలనుంచి వస్తుంది. ధ్యానం నుంచి నామం వరకూ ఒకదానికొకటి పెనవేసుకుని ఉన్నాయి అని మర్చిపోకూడదు. ఇప్పుడు వీటన్నింటికీ మూలకారణం విజ్ఞానం.

విజ్ఞానంవల్లనే వీటన్నిటినీ తెలుసుకోగలమని ఒక పెద్ద పట్టికను ఇస్తున్నాడు సనత్కుమారుడు. ధర్మం–అధర్మం; సత్యం–అసత్యం; ప్రియం–అప్రియం; ఈలోకం–పై లోకాలు – అన్నీ విజ్ఞానంవల్లనే తెలుసుకోగలము. అందువల్ల విజ్ఞానం బ్రహ్మ ఉపాసన చేయాలి.

**ఫలం** – విజ్ఞానం, జ్ఞానం ఉన్న లోకాలకు వెళతాడు. శాస్త్రీయజ్ఞానం విజ్ఞానం అయితే, లౌకికజ్ఞానం జ్ఞానం అవుతుంది. లోకాలకు విజ్ఞానం, జ్ఞానం ఉండవు. ఆ లోకాల్లో విజ్ఞానం, జ్ఞానం ఉన్నవారు ఉంటారు.

## ఖండం 7.8 – 8. బలబ్రహ్మ ఉపాసన

**బలం వావ విజ్ఞానాద్భూయః** – బలం నిశ్చయంగా విజ్ఞానంకంటే గొప్పది. బలం అంటే శక్తి. శారీరక శక్తి ఉంటేనే మానసిక శక్తి ఉంటుంది. మానసిక శక్తి ఉంటే జ్ఞానశక్తి ఉంటుంది. అందుకే విజ్ఞానంకన్నా బలం గొప్పది. బలం ఉంటేనే అతను లేచి నిలబడగలడు. గురువుకు పరిచర్యలు చేయగలడు. పరిచర్యలు చేస్తేనే అతనికి ప్రియశిష్యుడు అవగలడు. అప్పుడే అతనికి దగ్గరగా వెళ్ళి శాస్త్రశ్రవణం చేయగలుగుతాడు, మననం చేయగలుగుతాడు, జ్ఞానం పొందగలుగుతాడు అంటున్నాడు సనత్కుమారుడు. ఇక్కడ శ్రవణ, మనన, నిదిధ్యాసనలు

ఆత్మజ్ఞానం గురించి కాదు. ఉపాసన జ్ఞానం గురించి. బలం ఉంటేనే కర్త అవగలదు, భోక్తగా కర్మఫలాన్ని అనుభవించగలడు.

అంతేకాదు, ఉపనిషత్తు సమష్టిపరంగా కూడా చెబుతున్నది. పృథివికి బలం ఉండటంవల్లనే తన చుట్టూ తాను తిరుగుతూ, సూర్యుని చుట్టూ తిరగగలుగుతుంది. భువర్లోకం, సువర్లోకం, పర్వతాలు, దేవతలు, మనుష్యులు, పశుపక్ష్యాదులు, గడ్డి, చెట్టు చేమలు, క్రూరమృగాలు, క్రిమికీటకాలు, ఎగిరే పురుగులు, చీమలవరకూ బలంవల్లనే నిలిచివున్నాయి. ఒక్కముక్కలో చెప్పాలంటే లోకమంతా బలం చేతనే నిలిచివుంది. అందువల్ల బలబ్రహ్మ ఉపాసన చేయాలి.

**ఫలం** – అన్నింటిలాగానే కామచారత్వ ఫలం. అంటే యథేచ్ఛగా తిరిగే ఫలం.

## ఖండం 7.9 – 9. అన్నబ్రహ్మ ఉపాసన

**అన్నం వావ బలాద్భూయః** – అన్నమే బలంకంటే నిశ్చయంగా గొప్పది. ఎందుకంటే బలం కార్యం, అన్నం – తిన్న అన్నం – కారణం.

ఆరవ అధ్యాయంలో గురువు ప్రయోగంద్వారా చూపించాడు ఈ అంశాన్ని. అక్కడ 15 రోజులు అన్నం తినకుండా ఉండి రమ్మన్నాడు శ్వేతకేతుని. ఇక్కడ పదిరోజులు అన్నం తినకుండా ఉంటే, అతను మరణించే అవకాశం ఉంది. మరణించకుండా ఒకవేళ జీవించి ఉన్నా, అంతకుముందు ఖండంలో చెప్పిన పనులేవీ చేయలేడు అంటున్నది ఉపనిషత్తు.

**అదృష్టా ఉ శ్రోతా ఉ మన్తా ఉ బోద్ధా ఉ కర్తా ఉ విజ్ఞాతా భవతి.**

సరిగ్గా చూడలేడు, సరిగ్గా వినలేడు, సరిగ్గా మననం చేయలేడు. సరిగ్గా అర్థం చేసుకోలేడు. సరిగ్గా కర్మలు చేయలేడు. సరిగ్గా కర్మఫలభోక్త అవలేడు. ఇదంతా గొలుసు వ్యవహారం.

ఇప్పుడతనికి పదిరోజుల తర్వాత అన్నం పెడితే, అతను ఇప్పుడు చెప్పినవన్నీ చేయగలడు. అన్నం తింటేనే బలం; లేకపోతే లేదు. అందువల్ల బలానికి కారణం అన్నం. అందువల్ల అన్నబ్రహ్మ ఉపాసన చేయాలి.

**ఫలం** – సమృద్ధిగా అన్నం, జలం దొరికే లోకాలకు వెళతాడు. యథేచ్ఛగా తిరుగుతాడు.

ఇలా 15 ఖండాల్లో చెప్పాలా; ఒక్క ఖండంలో చెప్పేయవచ్చు కదా అనిపిస్తుంది. కాని అదే ఉపనిషత్తు ప్రత్యేకత. అలా సంభాషణరూపంలో తీరిగ్గా ఒక్కొక్కటీ చెబుతుంది. పైగా రెండు వైపులా చెబుతున్నది – అంటే అన్నం తింటే ఏం చేయగలమో, తినకపోతే ఏం చేయలేమో చెప్పింది.

## ఖండం 7.10 – 10. జలబ్రహ్మ ఉపాసన

**ఆపో వావాన్నాద్భూయః** – జలములే నిశ్చయంగా అన్నం కంటే గొప్పవి. ఎందుకంటే వర్షాలు సమృద్ధిగా కురిస్తేనే పంటలు బాగా పండుతాయి. అందువల్ల జలం కారణం, అన్నం కార్యం అవుతాయి.

వర్షం సరిగ్గా పడకపోతే జీవులందరూ కలత చెందుతారు. అన్నం సమృద్ధిగా పండదని ఖంగారు పడతారు. దానికి బదులుగా వర్షం సమృద్ధిగా కురిస్తే, జీవులందరూ ముఖ్యంగా రైతులు ఆనందిస్తారు. అంతేకాదు, సమష్టిపరంగా బలం గురించి చెప్పిన పట్టికనంతా చెప్పి, అన్నీ జలంనుంచి వచ్చినవే అంటున్నది ఉపనిషత్తు. భూలోకంనుంచి చీమల దాకా మళ్ళీ చెప్పుకొచ్చింది. అందువల్ల **జలబ్రహ్మ ఉపాసన** చేయాలి.

**ఫలం** – ఎవరైతే జలంమీద బ్రహ్మ ఉపాసన చేస్తారో, అతను కోరినవన్నీ పొంది, తృప్తి గలవాడు అవుతాడు. అంతేకాక, జలంయొక్క వ్యాప్తి ఉన్నంతమేరకు ఇతనికి యథేచ్ఛగా గతి ఉంటుంది.

## ఖండం 7.11 – 11. అగ్నిబ్రహ్మ ఉపాసన

**తేజో వావాద్భ్యో భూయః** – తేజస్సు నిశ్చయంగా జలముకంటే గొప్పది. పంచభూతాల సృష్టి క్రమం చూస్తే అగ్నినుంచి జలం వచ్చింది. మన అనుభవం కూడా దానితో ఏకీభవిస్తుంది అంటున్నాడు సనత్కుమారుడు. అగ్నితత్త్వం వాయువు ద్వారా ఆకాశాన్నంతా వేడెక్కిస్తుంది. మనుష్యులు బాగా వేడిగా ఉంది, దానివల్ల బాగా ఉక్కగా ఉంది, ఖచ్చితంగా వాన పడబోతుంది అంటారు. ఆ విధంగా వాన కురిసే ముందు అగ్నితత్త్వమే ముందు తనను తాను ప్రకటించుకుని, తరువాత వానను సృష్టిస్తుంది. అంతేకాదు, అగ్నితత్త్వమే మెరుపుల రూపంలో కనిపిస్తుంది.

మనుష్యులు మళ్ళీ మెరుపులు మెరుస్తున్నాయి, ఉరుములు ఉరుముతున్నాయి, ఖచ్చితంగా వర్షం కురవబోతోంది అంటారు. మళ్ళీ దీన్నిబట్టి అగ్ని కారణం, జలం కార్యం అని తెలుస్తున్నది. అందువల్ల అగ్నిబ్రహ్మ ఉపాసన చేయాలి.

**ఫలం** – మరణించాక అతను తేజస్సు పొందుతాడు, ప్రకాశవంతమైన లోకాలకు వెళతాడు, యథేచ్ఛగా తిరుగుతాడు.

## ఖండం 7.12 – 12. ఆకాశబ్రహ్మ ఉపాసన

**ఆకాశో వావ తేజసో భూయాన్** – ఆకాశం నిశ్చయంగా తేజస్సుకంటే గొప్పది. ఆకాశం అగ్నికి కూడా కారణం; కాని ఇక్కడ సనత్కుమారుడు కారణత్వమనే ఈ కారణం చెప్పటం

లేదు. ఇంకొక కారణం చెబుతున్నాడు. ఆకాశంలోనే అన్నీ ఉన్నాయి. అంటే ఆకాశం తనలో అన్నీ ఇముడ్చుకునే గిన్నెలాంటిది. అందుకని ఆకాశంలోనే తక్కిన నాలుగు భూతాలు, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, గ్రహాలు, జీవులు అందరూ ఉన్నారు. ఆకాశంలో ఉండటమే కాదు, వాళ్ళ వ్యవహారం కూడా ఆకాశంలోనే నడుపుతున్నారు. ఆకాశంలోనే సంభాషణ జరుపుతున్నారు, రమిస్తున్నారు, దుఃఖిస్తున్నారు. అందువల్ల **ఆకాశబ్రహ్మ ఉపాసన** చేయాలి.

ఉపనిషత్తుల్లో బ్రహ్మ గురించి వర్ణించేటప్పుడు బ్రహ్మతో పోల్చగలిగినదేమైనా ఉంటే అది ఆకాశం అని వస్తుంది. ఆకాశాన్ని అర్థం చేసుకోవాలంటే దానికి చాలా సూక్ష్మబుద్ధి ఉండాలి. ఆకాశాన్ని అర్థం చేసుకుంటే అంతకన్నా సూక్ష్మమైన చైతన్యాన్ని అర్థం చేసుకోవటం తేలిక. ఎందుకంటే ఆకాశానికీ, బ్రహ్మకూ అనేక అంశాలు సమానంగా ఉన్నాయి. రెండూ అరూపం, సర్వవ్యాపకం, అపరిచ్ఛిన్నం, శుద్ధం. అన్నీ వాటిలో ఇమిడిపోతాయి. చాలా అరుదుగా ఆకాశ ఉపాసన గురించి వస్తుంది. ఇక్కడ, తైత్తిరీయోపనిషత్తులో వస్తుంది.

**ఫలం** – సర్వవ్యాపక ఆకాశఉపాసన చేస్తే, అతను కూడా సర్వవ్యాపకమైన లోకాలకు వెళతాడు.

## ఖండం 7.13 – 13. స్మరణబ్రహ్మ ఉపాసన

**స్మరో వావాకాశాద్భూయః** – స్మరణం నిశ్చయంగా ఆకాశంకంటే గొప్పది. స్మరః అంటే స్మరణం; అంటే జ్ఞాపకశక్తి. ఆకాశాన్ని, జ్ఞాపకశక్తిని ఎలా కలుపుతాము? శంకరులవారు అది ఎలా సాధ్యమో చెబుతున్నారు. ఒక వస్తువుయొక్క ఉపయోగం మన జ్ఞాపకశక్తిమీద ఆధారపడివుంది. ఉపయోగం తెలియకపోతే ఆ వస్తువు ఉండీ లేనట్టే కదా! ఒక పెన్నును మొదటిసారి ఒక చిన్న పాపాయికి ఇస్తే, అది టక్కున్న నోట్లో పెట్టుకుంటుంది. కాని మీరు అలా చేస్తారా? దాని ఉపయోగం తెలుసు. అలా ఆకాశంలో వ్యవహారాలు నడుపుతాము అని తెలుసు మీకు.

కొంతమందికి ఈ స్మరణ లేకపోతే వారు ఏ శబ్దాన్నీ వినరు. దేనినీ సంకల్పించరు. దీనికి భిన్నంగా స్మరణం ఉంటే శబ్దాన్ని వింటారు. తరువాత సంకల్పిస్తారు, తరువాత తెలుసుకుంటారు అంటున్నది ఉపనిషత్తు. స్మరణం చేతనే వీరు నా పుత్రులు, ఇవి నా పశువులు అని తెలుసుకుంటారు అంటున్నది ఉపనిషత్తు. అందువల్ల స్మరణబ్రహ్మ ఉపాసన చేయాలి. దీన్ని తత్త్వబోధ పరిభాషలో చిత్తం అంటారు.

**ఫలం** – స్మరణంయొక్క వ్యాప్తి ఎంతమేరకు ఉంటుందో, అంతమేరకు అతనికి యథేచ్ఛగా గతి ఉంటుంది.

## ఖండం 7.14 – 14. ఆశబ్రహ్మ ఉపాసన

**ఆశా వావ స్మరాద్భూయసీ** – ఆశ స్మరణం కంటే నిశ్చయంగా గొప్పది. ఆశ అంటే కామం, తృష్ణ, ఆకాంక్ష. ఇక్కడ కూడా శంకరులవారు ఆదుకుంటారు. అంతఃకరణంలో ఉండే ఆశవల్లనే మనిషి తను స్మరించదగిన దానిని స్మరిస్తాడు అంటారు. మీకు దేనిమీద ఆకాంక్ష ఉంటే దాన్నే గుర్తుంచుకుంటారు. అందువల్ల ఆశ కారణం, స్మరణం కార్యం.

ఆశతో వర్ధిల్లచేయబడిన స్మరణమే మంత్రాలను అధ్యయనం చేస్తుంది; కర్మలను చేస్తుంది; పుత్రులను, పశువులను కోరుకుంటుంది; ఇహలోక, పరలోకాలను కోరుకుంటుంది. అందువల్ల **ఆశబ్రహ్మ ఉపాసన** చేయాలి.

శాస్త్రంలో సాధారణంగా కామాన్ని మోక్షానికి శత్రువుగా అభివర్ణిస్తారు. కామాన్ని విలన్‌గా చూస్తారు. కాని కామానికి సానుకూల లాభం కూడా ఉందని అర్థం చేసుకోవాలి. దాని పేరు ఇచ్ఛాశక్తి. ఇది మనుష్యులకు మాత్రమే ఉంది. ఇచ్ఛాశక్తి ఉంటేనే జ్ఞానశక్తి, క్రియాశక్తి పనిచేస్తాయి. అవిద్యతో అశుద్ధం కాని కోరికలు కోట్లు ఉండనీ, అవి సమాజానికి మేలు చేస్తాయి అంటారు విద్యారణ్యులవారు. అందువల్ల కామబ్రహ్మ ఉపాసన చేయాలి.

**ఫలం** – అతని కోరికలన్నీ ఆటంకాలు కలుగకుండా తీరుతాయి. ఆశ యొక్క వ్యాప్తి ఎంతమేరకు ఉంటుందో, అంతమేరకు అతనికి యథేచ్ఛగా గతి ఉంటుంది.

## ఖండం 7.15 – 15. ప్రాణబ్రహ్మ ఉపాసన

**ప్రాణో వా ఆశాయా భూయాన్** – ప్రాణం నిశ్చయంగా ఆశకంటే గొప్పది. బ్రహ్మ ఉపాసనకు ముందు వచ్చే చివరి ఉపాసన ఇది. సమష్టిస్థాయిలో హిరణ్యగర్భ బ్రహ్మ ఉపాసన, వ్యష్టిస్థాయిలో ప్రాణబ్రహ్మ ఉపాసన. వ్యష్టిగా ప్రాణం జీవశక్తి అయితే, సమష్టిపరంగా హిరణ్యగర్భ ప్రాణశక్తి. అందువల్లనే ఆశకన్నా గొప్పది. నిజానికి ఒక వ్యక్తి జీవించి ఉంటేనే కదా, ఆశ ఉండే అవకాశం ఉండేది.

ఎలాగైతే ఒక చక్రంయొక్క ఇరుసుకు ఆకులు కలుపబడి ఉన్నాయో, అదేవిధంగా ఈ ప్రాణంమీదనే సర్వం ఆధారపడి ఉంది. ప్రాణం తనంత తానుగా, స్వతంత్రంగా పనిచేస్తుంది; ప్రాణమే ప్రాణాన్ని ఇస్తుంది. ప్రాణమే తీసుకుంటుంది. ప్రాణం తండ్రి, ప్రాణం తల్లి, ప్రాణం సోదరుడు, ప్రాణం సోదరి, ప్రాణం ఆచార్యుడు, ప్రాణం బ్రాహ్మణుడు అని చెప్పి ప్రాణంయొక్క గొప్పదనాన్ని అన్వయ వ్యతిరేకపద్ధతిద్వారా చూపిస్తున్నది ఉపనిషత్తు. ఎవరైనా తండ్రిని కాని, తల్లిని కాని, అన్నను కాని, చెల్లిని కాని, ఆచార్యుని కాని, బ్రాహ్మణుని కాని తగని మాటలు మాట్లాడితే, అతనిని ఉద్దేశించి పెద్దలు నువ్వు

అలాంటి మాటలతో వారిని హత్య చేసిన వాడవు అవుతున్నావు అంటారు. ఇది అన్వయం.

ఇప్పుడు వ్యతిరేకం. పైన చెప్పిన ఆరుగురిలో ఎవరిలోనైనా ప్రాణం పోతే, శరీరాన్ని కూడా గౌరవంగా చూడరు. దీన్ని అత్యంత దారుణంగా వర్ణిస్తున్నది. ఒకవేళ ఏ భూకంపంలోనో, సునామీలోనో అనేకమంది ఒక్కసారిగా మరణిస్తే ఆ శరీరాలను దగ్గరకు చేర్చటానికో, విడదీయటానికో శూలం వాడినా ఎవరూ ఏమీ అనరు. నువ్వు వారిని హత్య చేసిన వాడివి అవుతావు అనరు.

ఈ అన్వయ వ్యతిరేక వాదనవల్ల ప్రాణమే అన్ని జీవులకూ ఆధారం అని అర్థమైంది. అందువల్ల ప్రాణబ్రహ్మ ఉపాసన చేయాలి. ఈ ఉపాసన తక్కిన 14 ఉపాసనలకన్నా శ్రేష్ఠమైనది. అందువల్ల ఇంతవరకూ ఇవ్వని బిరుదు ప్రాణబ్రహ్మ ఉపాసనకునికి ఇస్తున్నది ఉపనిషత్తు. ఏమిటది? **అతివాది.** వాది అంటే మాట్లాడేవాడు. అతి అంటే గొప్ప. అతివాది అంటే గొప్పగా మాట్లాడేవాడు. గొప్ప విశేషణం అతనికి కాదు; అతను చెప్పే ప్రాణానికి చెందుతుంది.

ఎవరైతే ఈ సత్యాన్ని దర్శనం చేస్తారో, అంటే తన శరీరంలో ఉన్న ప్రాణమే జగత్తంతా హిరణ్యగర్భతత్త్వంగా ఉందని గ్రహిస్తాడో అతన్ని అతివాది అంటారు. అతను ప్రాణం గురించి మాట్లాడుతూనే ఉంటాడు. ఎవరైనా అతనిని అతివాదివి నువ్వు అన్నా, అతను అవును, నేను అతివాదిని అంటాడు ఉత్సాహంగా. అందువల్ల ప్రాణబ్రహ్మ ఉపాసన చేయాలి.

ఇక్కడితో ఉపాసనలు ముగిశాయి.

## 7.15. ప్రాణబ్రహ్మ ఉపాసన లేదా హిరణ్యగర్భ బ్రహ్మ ఉపాసన

ప్రాణం అంటే సమష్టి ప్రపంచంలో హిరణ్యగర్భ లేదా సూత్రాత్మ అని చూశాము. అందువల్ల ప్రాణబ్రహ్మ ఉపాసన అంటే హిరణ్యగర్భ బ్రహ్మ ఉపాసనగా తీసుకోవాలి. ఈ ఉపాసనను ముగిస్తూ సనత్కుమారుడు,

**ప్రాణో హ్యేవైతాని సర్వాణి భవతి**

అన్నాడు. అందువల్ల నారదుడు, ప్రాణమే ఆత్యంతిక కారణం అనుకున్నాడు. కాని అది సాపేక్షిక కారణం మాత్రమే. హిరణ్యగర్భ మాయాసహిత ఈశ్వరుని నుంచి పుట్టాడు. నారదుడు ప్రాణమే ఆత్మ అని పొరబడటానికి ఇంకో కారణం కూడా ఉంది. ప్రాణం గురించి మాట్లాడేవ్యక్తిని అతివాదీ అంటారన్నాడు గురువు. అందుకని నారదుడు అదే ఆత్మ

అనుకుని, దీనితో ఆత్మబోధ అయిపోయిందనుకున్నాడు. అందుకని దీనికన్నా గొప్పది ఉందా అని అడగలేదు. కాని నారదుడు అడక్కపోయినా, గురువు ఇంకా చెప్పటానికి సిద్ధంగా ఉన్నాడు. దీన్నిబట్టి శిష్యునికి ప్రశ్న ఎలా అడగాలో తెలియకపోయినా, సరియైన ప్రశ్న వేయకపోయినా, గురువు అతనికి బోధ చేయాలని అర్థమవుతున్నది. ఇది మనని తరువాత వచ్చే అంశంలోకి తీసుకువెళుతున్నది.

## ఖండాలు 7.16-7.22 - 3 బ్రహ్మవిద్యా సాధనాని

సనత్కుమారుడు నారదా ఇది విను. నిజం చెప్పాలంటే, ఎవరైతే జగత్కారణం బ్రహ్మ, సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ గురించి చెబుతారో అతనినే అసలైన అతివాది అంటారు. హిరణ్యగర్భ గురించి చెప్పే అతను ఆపేక్షిక అతివాది అయితే, బ్రహ్మ గురించి చెప్పే వ్యక్తి ఆత్యంతిక అతివాది. దీన్నిబట్టి నిర్గుణబ్రహ్మ మాత్రమే సత్యం అనీ, ఇంతవరకూ చెప్పిన 15 ఉపాసనలూ మిథ్య అని చెప్పకనే చెప్పినట్టవుతున్నది. ఇప్పుడు ఉపాసనలు వెనకనుంచి వెళితే ప్రాణం, ఆశ, స్మరణం, ఆకాశం, వాయువు, అగ్ని, నీరు, పృథివి, బలం, విజ్ఞానం, చిత్తం, సంకల్పం, మనస్సు, వాక్కు, నామం అన్నీ మిథ్య అయిపోతాయి. **జగత్ మిథ్య, బ్రహ్మ సత్యం.** అందువల్ల బ్రహ్మవాది సత్యవాది అవుతాడు.

సత్యవాది అవటానికి 6 సాధనలు చెబుతున్నాడు సనత్కుమారుడు. పై మెట్టునుంచి కింది మెట్టుకు వస్తున్నాడు. అంటే అత్యున్నతస్థాయినుంచి దానికింద స్థాయికి వస్తున్నాడు. ఆ దశలు చూద్దాము.

1. **సత్య విజ్ఞానం** – బ్రహ్మ గురించిన జ్ఞానం ఉంటే నేను బ్రహ్మ గురించి మాట్లాడగలను. అందువల్ల సత్యవాది అవ్వాలంటే దానికి ముందు దశ సత్యవిజ్ఞానం.

2. **సత్య మననం** – సత్య విజ్ఞానం ఎప్పుడు పొందగలను? సత్య మననం ఉంటే. మననం అంటే సత్యబ్రహ్మ గురించిన విచారణ. విచారణ జ్ఞానాన్ని కలుగజేస్తుంది. సత్య మననాన్ని ఉపనిషత్తు **మతి** అంటున్నది. సత్యబ్రహ్మ గురించిన విచారణ చేయాలంటే శాస్త్రప్రమాణం లేదా ఉపనిషత్తు ప్రమాణం తీసుకోవాలి. ఎందుకంటే కేవలం ఉపనిషత్తే బ్రహ్మ గురించి చెబుతుంది. వేదపూర్వభాగం కూడా చెప్పదు. అందువల్ల సత్యవిజ్ఞానం కావాలంటే శాస్త్రప్రమాణం తీసుకోవాలి.

3. **శ్రద్ధ** – శాస్త్రప్రమాణం తీసుకోవాలంటే శ్రద్ధ ఉండాలి. శ్రద్ధ అంటే నమ్మకం. శాస్త్రం మీద, గురువుమీద కూడా. అందువల్ల మతి కావాలంటే శ్రద్ధ ఉండాలి.

4. **నిష్ఠ** – గురువుమీద, శాస్త్రంమీద శ్రద్ధ ఉండాలంటే నిష్ఠ ఉండాలి. నిష్ఠ అంటే ఏమిటి? గురుశాస్త్ర సేవ లేదా శుశ్రూష. సేవ చేసిన కొద్దీ శ్రద్ధాభక్తులు పెరుగుతాయి. శాస్త్రానికి ఎలా సేవ చేస్తాము? పారాయణం చేయటం ద్వారా. పూర్వం శిష్యులు అంతేవాసులుగా ఉండి, గురువుకు సేవ చేసేవారు.

5. **కృతి** – సేవ చేయాలంటే కృతి ఉండాలి. కృతి అంటే ఇంద్రియ నిగ్రహం, చిత్త ఏకాగ్రత అంటున్నారు శంకరులవారు. కృతి ఉంటేనే గురువు దగ్గరకు వెళ్ళి వేదాధ్యయన శ్రవణం చేయగలుగుతారు.

6. **ఆనందం** – కృతి ఉండాలంటే ఆనందం ఉండాలి. దీన్ని సుఖజ్ఞానం అంటారు. ఇన్ని దశలు దాటి, బ్రహ్మజ్ఞానం పొందాలంటే, ఒక్క షరతు మీదే అది సాధ్యం. ఏమిటది? అతివాది అయితే అనంతమైన ఆనందం పొందుతాను అని సాధకునికి తెలియాలి. అందువల్ల ఆనందప్రాప్తి జ్ఞానానికి పైనుంచి చివరి దశ. దీన్ని సుఖజ్ఞానం అంటారు. ఎప్పుడైతే సాధకుడు ఆనందం దొరికే అవకాశముందని గ్రహిస్తాడో, అప్పుడే కృతి చేస్తాడు; నిష్ఠ చూపుతాడు; శ్రద్ధ చూపుతాడు; సత్య మననం చేస్తాడు; చివరికి సత్యవిజ్ఞానం పొంది సత్యవాది అవుతాడు.

అనంతమైన సుఖం దొరుకుతుందని తెలిస్తేనే ఈ ఆరు దశలూ దాటుతాడు సాధకుడు. అంటే ముందు అతనికి సుఖం గురించి నిశ్చయంగా తెలియాలి.

ఆ సుఖం గురించి తెలుసుకోవాలనుకుంటున్నాను అంటాడు నారదుడు. అది ఈ అధ్యాయంలోనే ముఖ్యమైన భూమావిద్యకు దారితీస్తుంది.

## ఖండాలు 7.23–7.26 – 4 బ్రహ్మవిద్యా/భూమావిద్య

ఈ భాగంలోనే భూమావిద్య మొదలవుతుంది. అంటే అసలు బోధ వస్తుంది. ముందు ఖండంలో సుఖం **విజిజ్ఞాసితవ్యమితి** అన్నాడు నారదుడు. దానికి సనత్కుమారుడు ఇస్తున్న జవాబు –

**యో వై భూమా తత్సుఖం నాల్పే సుఖమస్తి** – 7.23.1

ఇది కూడా అక్షరలక్షలు విలువ చేసే వాక్యం. అనంతమైన భూమాయే సుఖం లేదా ఆనందం. అల్ప విషయాల్లో ఆనందం లేదని చెబుతున్నాడు సనత్కుమారుడు. భూమ పుల్లింగం, దామ పదం లాగా. భూమా అంటే ఆనందం. సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ నిర్వచనంలో అనంతం అంటే ఆనందం. ఇక్కడ భూమా అంటున్నాడు అంటే ఆనందం బ్రహ్మ.

అల్ప విషయాల్లో సుఖం లేదు అంటే పరిమితి ఉన్న ఏ వస్తువులోనూ ఆనందం లేదు. అశాశ్వతమైన వస్తువులో, మనస్సులో, శరీరంలో, ఆలోచనల్లో ఆనందం లేదు. అలా

ఎలా అంటారు? నాకు సంగీతంనుంచి, నాట్యంనుంచి, మంచి ఆహారంనుంచి ఆనందం వస్తుందని ఎవరైనా వాదిస్తే, దానికి జవాబు – అవి నిజంగా ఆనందాన్నివ్వవు. కేవలం బింబానందాన్ని ప్రతిబింబింపజేసేందుకు అనువైన అవకాశాన్ని కలుగజేస్తాయి తప్పితే వాటంతట అవి ఆనందాన్నివ్వవు. అందువల్ల భూమావిద్య పొందాలి.

**భూమా నిర్వచనం – యత్ర నాన్యత్పశ్యతి నాన్యత్ శృణోతి నాన్యద్విజానాతి స భూమా ।**

**యత్ర (బ్రహ్మ శుద్ధ సత్)** – ఇక్కడ సత్ గురించి ప్రత్యేకంగా చెప్పలేదు. మనం ఆరో అధ్యాయంనుంచి తెచ్చుకోవాలి.

**సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్**

ఉన్నదొకటే బ్రహ్మ.

**నాన్యత్ పశ్యతి** – చూసే వ్యక్తి, చూడబడే వస్తువు అని రెండు లేవు.

**నాన్యత్ శృణోతి** – వినేవాడు, వినబడే వస్తువు అంటూ భిన్నంగా లేవు.

**నాన్యత్ విజానాతి** – తెలుసుకునే వ్యక్తి, తెలుసుకోబడే వస్తువు అంటే రెండు భిన్నంగా లేవు.

**స భూమా** – భూమా అంటే అద్వైతవస్తువు అయింది.

ఇంకో విధంగా చెప్పాలంటే అద్వైతంలో త్రిపుటి లేదు. ప్రమాతా, ప్రమాణం, ప్రమేయం అనే మూడు వస్తువులు లేవు. అందువల్ల ద్వైతం లేదు, నానాత్వం లేదు, బ్రహ్మ అద్వైతసత్తా.

అయితే బ్రహ్మను తెలుసుకోవటం ఎలా? ఇంగ్లీషులో వాల్ ఈజ్, ఛెయిర్ ఈజ్, టేబుల్ ఈజ్ అంటూ వస్తుంది. ఈ పదాల్లోని నామరూపాలను తీసివేస్తే మిగిలేది ఈజ్, ఈజ్, ఈజ్. ఈ ఈజ్‌నెస్సే శుద్ధ సత్తా, శుద్ధ సత్తానే బ్రహ్మ. ఇక్కడ బ్రహ్మనే భూమ అంటున్నాడు. ఇలా నామరూపాలను తీసేస్తూ వచ్చి శుద్ధ సత్తాను చూడటం అనేది ద్వైత నిషేద వాక్యం. ఈ నిషేద వాక్యాల ద్వారా రెండు అంశాలు తెలుస్తాయి.

ఉనికి ఉన్నదాన్నీ త్రోసిపుచ్చలేము, ఉనికి లేనిదాన్నీ త్రోసిపుచ్చనవసరంలేదు. అయితే దేన్ని కొట్టివేయగలము? ఈ రెండింటికీ భిన్నంగా ఉన్నదాన్ని, సదసద్భ్యామ్ అనిర్వచనీయం మిథ్య

ఉనికి ఉండీ లేనట్టుగా అనిపించేది మిథ్య. అలా జగత్తు ఒక కాలంలో ఉండి, ఇంకొక కాలంలో లేదు కాబట్టి మిథ్య. బ్రహ్మ సత్, చిత్, ఆనందం. బ్రహ్మను ఆనందంగా నిర్వచించటం రెండు చోట్లే చూస్తాము. ఇక్కడ, బృహదారణ్యకంలో మాత్రమే. అక్కడ **విజ్ఞాన ఆనందం బ్రహ్మ** అంటే ఇక్కడ **సుఖం** అంది.

అద్వైత ఆత్మ గురించి ద్వైత అవస్థలోనే, అది కూడా జాగ్రదవస్థలోనే నేర్చుకోవాలి. అది కూడా గురుశాస్త్ర ఉపదేశంద్వారా తెలుసుకుని బ్రహ్మనిష్ఠలో ఉండాలి. ద్వైతప్రపంచం వ్యవహారిక సత్యంలోకి వస్తుంది. అద్వైతబ్రహ్మ దానికన్నా ఉన్నతమైన పారమార్థిక సత్యంలోకి వస్తుంది. అందువల్ల ద్వైతప్రపంచానికి విలువ లేదు.

ఉదాహరణకు అద్దంలో నా ముఖం చూస్తాను. కాని అక్కడ ఉన్నది నేను ఒక్కడినే. రెండోది నా ప్రతిబింబం. అంటే ద్వైత అనుభవం ఉంది, కాని అద్వైతజ్ఞానం కలిగింది. అదే విధంగా ద్వైత అనుభవాన్ని పొందుతూ, గురుశాస్త్ర ఉపదేశం ద్వారా అద్వైతబ్రహ్మజ్ఞానం పొందవచ్చు. అనుభవం జ్ఞానాన్ని ఎన్నడూ సవాలు చేయలేదు అని గుర్తుంచుకోవాలి. సూర్యోదయాన్ని చూస్తూనే ఉన్నా, అది నిజం కాదని విజ్ఞానశాస్త్రంద్వారా తెలుసు. అద్వైతజ్ఞానాన్ని పొందటానికి ధ్యానంలోకో, నిర్వికల్పసమాధిలోకో వెళ్ళనవసరం లేదు. కళ్ళు తెరుచుకునే అద్వైతబ్రహ్మను తెలుసుకోవచ్చు.

**అథ యత్రాన్యత్పశ్యత్యన్యచ్ఛృణోత్యన్యద్విజానాతి తదల్పమ్**

వ్యావహారిక ప్రపంచంలో చూసే వ్యక్తి వేరు, చూడబడే వస్తువు వేరు; వినే వ్యక్తి వేరు, వినబడే శబ్దం వేరు; నేర్చుకునే వ్యక్తి వేరు, నేర్చుకోబడే వస్తువు వేరు. అలాంటి ప్రపంచంలో పొందే సుఖం అల్పం. అది అనంతమైన సుఖం కాదు. మరి నాకు బాహ్యవస్తువులు చూసినప్పుడు ఆనందం కలుగుతోంది కదా అంటే అది ప్రతిబింబానందం అని చూశాము.

ఉదాహరణకు అద్దంలో మీ ముఖం చూస్తున్నారు అంటే అద్దంలో మూడు అంశాలు ఉన్నాయి. ఫ్రేము, అద్దం, మీ అందమైన ముఖం. వాటిలో అద్దానికి చెందినవేమిటి? రెండే– ఫ్రేము, అద్దం. అద్దంలో కనబడే మీ ముఖం అద్దానికి కాదు. ఒకవేళ అద్దానిదైతే, ఇంకో వ్యక్తి అదే అద్దంలో చూసినప్పుడు, అతనికి రెండు ముఖాలు కనిపించాలి. మీ ముఖం, అతని ముఖం. అవునా, కాదా? అందువల్ల అద్దంలో కనిపించేవి రెండే, మూడవది మీ ముఖం, మీ భుజాలమీదే ఉంది.

అలాగే మీరు ఒక వస్తువులో ఆనందం పొందుతున్నప్పుడు కూడా మూడు విషయాలను అనుభవిస్తున్నారు. అవి నామం, రూపం, ఆనందం. నామం, రూపం మాత్రమే వస్తువుకు చెందుతుంది. ఆనందం మీకు చెందుతుంది. అందువల్ల అద్దంలో ముఖం లేనట్టుగా, వస్తువులో ఆనందం లేదు. అది అల్పం. వ్యవహారిక ప్రపంచంలో ప్రతిదీ అల్పం. అందువల్ల సుఖం లేదు.

**యో వై భూమా తదమృతమ్**

ఏదైతే భూమయో అది నిశ్చితంగా అమృతం. అమృతం అంటే అనంతం; మరణం లేనిది. ప్రతిబింబ ఆనందంలో తారతమ్యాలు ఉంటాయి. వాటిని ప్రియమోదప్రమోదాలు అంటారు. మామిడిపండు గురించి వింటే మీకు ప్రియం కలుగుతుంది. దాన్ని తెచ్చుకుని మీ ఎదురుగా పెట్టుకుంటే మోదం కలుగుతుంది. దాన్ని తింటే ప్రమోదం కలుగుతుంది. కాని భూమానందంలో లేదా బ్రహ్మానందంలో ఈ స్థాయీభేదాలు ఉండవు. కాకపోతే భూమానందం అనుభవంలోకి రాదు. అనుభవంలోకి వచ్చేది ప్రతిబింబానందం.

అందువల్ల భూమానందాన్ని ఎలా అనుభవించాలని అడగకూడదు. అసలు ఆ ప్రశ్నే తప్పు. మీ అసలైన ముఖాన్ని ఎన్నడూ ఎలా చూసుకోలేరో, అలా మీ అసలైన ఆనంద స్వరూపాన్ని కూడా మీరు ఎన్నడూ అనుభవించలేరు. అసలైన ఆనందం అనుభవించేది కాదు, స్వీకరించేది.

ఎవరైనా నేను నిర్వికల్పసమాధిలో బ్రహ్మానందాన్ని పొందాను అంటే అది పొరపాటు. అతను ఆనందం అనుభవించి ఉండవచ్చు. అందులో ఏమాత్రం సందేహం లేదు. కాని దాన్ని బ్రహ్మానందం అనుకోవటంలోనే ఉంది పొరపాటంతా. అది ప్రతిబింబ ఆనందం మాత్రమే. అయితే ప్రతిబింబ ఆనందాన్ని అనుభవించాలా, వద్దా? తప్పకుండా అనుభవించండి, కాని ఆ వస్తువు దూరమైనా బాధపడకండి. అసలైన మాస్టర్ కాపీ మీ దగ్గరే ఉంది. మీ మాస్టర్ కాపీ అయిన బ్రహ్మానందం మిమ్మల్ని విడిచిపోదు. ఇక్కడితో భూమ నిర్వచనం అయింది.

**ఏది భూమయో అది నిశ్చయంగా అమృతం**
**ఏది భూమకు భిన్నంగా ఉందో అది అశాశ్వతం**

ఈ బ్రహ్మానందం ఎక్కడ ఉందని నారదుడు అడుగుతాడు. దానికి రెండు జవాబులు చెబుతాడు సనత్కుమారుడు.

**స్వే మహిమ్ని (ప్రతిష్ఠితః)** – దాని మహిమలోనే ప్రతిష్ఠితమై ఉంది.
**యది వా న మహిమ్నీతి** – లేదా, అది దేనిమీదా ఆధారపడిలేదు.

మామూలుగా ఒక వ్యక్తి మహిమ అతనికున్న వస్తువులవల్ల వస్తుంది. అంటే అతను వేరు, అతని వస్తువులు వేరు. అందువల్ల భూమా తన మహిమమీద ఆధారపడి ఉంది అంటే భూమాకు కొన్ని వస్తువులు ఉన్నాయి. భూమా వేరు, వస్తువులు వేరు అనుకుంటే ద్వైతం వస్తుంది. అందువల్ల సనత్కుమారుడు వివరిస్తున్నాడు. బ్రహ్మకు మహిమను కూర్చే వస్తువులు ఉంటాయనుకోకూడదు. నేను బ్రహ్మ దాని మహిమమీదే ఆధారపడివుందని చెప్పినప్పుడు

ఇలా తనకంటే భిన్నమైన వాటిని ఆశ్రయించి ఉందని చెప్పటం లేదు అంటున్నాడు సనత్కుమారుడు. ఎందుకంటే అలా చెబితే ద్వైతం వస్తుంది. అందువల్ల బ్రహ్మకు ఏదీ ఆధారం కాదు అనే రెండవ నిర్వచనం సరిపోతుంది.

ఉన్నదొకటే బ్రహ్మ, బ్రహ్మకు ఏ వస్తువులూ లేవు అంటే ఈ జగత్తు మాటేమిటి? జగత్తు బ్రహ్మ స్వంతం కాదా అనే ప్రశ్న వస్తుంది. దానికి జవాబు – ఈ జగత్తు బ్రహ్మది కాదు, జగత్తే బ్రహ్మ. అనేక నామరూపాలతో బ్రహ్మే జగత్తుగా భాసిల్లుతున్నాడు.

**సర్వం బ్రహ్మమయం జగత్**

దీన్ని బాధాయాం సామానాధికరణ్యమంత్రం అంటారు. ఎందుకంటే ఇందులో జగత్తును మిథ్యగా తీసివేసి, బ్రహ్మను అద్వైతబ్రహ్మగా నిరూపిస్తాము.

**ఏవేదగ్ం సర్వమితి (స భూమా)**

ఈ భూమయే కింద ఉంది, పైన ఉంది, వెనక ఉంది, ముందు ఉంది, కుడివైపు ఉంది, ఎడమవైపు ఉంది. ఒక్కముక్కలో చెప్పాలంటే అంతటా భూమయే ఉంది.

**జగత్తును సరిగ్గా అర్థం చేసుకుంటే అది బ్రహ్మ**
**బ్రహ్మను సరిగ్గా అర్థం చేసుకోకపోతే జగత్తు**

అందువల్ల భూమాను లేదా బ్రహ్మను తెలుసుకోవటానికి కళ్ళు మూసుకోనవసరం లేదు. ఉన్నదంతా భూమా తప్ప ఏదీ కాదు.

ఇంత చెప్పినా మళ్ళీ సనత్కుమారునికి ఒక అనుమానం పట్టుకుంది. ఆ భూమా సత్, ఆ భూమ చిత్, ఆ భూమ ఆనందం అని చెప్పుకుంటూపోతే, 'ఆ' భూమా ఏదో వస్తువు అయిపోతుంది. ఒక అల, అలలన్నీ నీరు, సముద్రం నీరు, బుడగ నీరు, అంతా నీరు అని చెబితే చాలదు; నీ సంగతి ఏమిటి అంటే నేనూ నీరునే అంటుంది. అందువల్ల అల, 'అలలన్నింటి వెనకా, సముద్రం వెనకా, బుడగ వెనకా ఉన్న నీటిని నేనే,' అని చెప్పగలగాలి. సః ని అహంగా మార్చి చెప్పగలగాలి.

**అథాతః** – అది బ్రహ్మ అని చెప్పాక,

**అహంకారాదేశ ఏవ** – నేను బ్రహ్మను అని చెప్పాలి. ఇక్కడ అహంకారం అంటే అహం అనే శబ్దాన్ని భూమ స్థానంలో ఉపయోగించటం. నేనే పైన ఉన్నాను, కింద ఉన్నాను అని ఆ పట్టిక అంతా చెప్పాలి. మొదటిభాగం రెండోభాగం కలిపితే మహావాక్యం.

**స ఏవ భూమా అధస్తాత్ = అహంకారాదేశ ఏవాహమేవాధస్తాత్**

భూమా = నేను అని వచ్చింది కాబట్టి ఇది మహావాక్యమంత్రం.

అహం బ్రహ్మ అస్మి అనగానే సరిపోదు. అహం అంటే ఏమిటో సరిగ్గా తెలియాలి. అందువల్ల మళ్ళీ సనత్కుమారుడు ఖంగారు పడ్డాడు. అహం వాచ్యార్థం తీసుకుంటే అహంకారం. స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు, చిదాభాస ఉన్న వ్యష్టి. కాని అహం బ్రహ్మ అస్మిలో అహం అంటే సాక్షిచైతన్యం. సాక్షిచైతన్యంగా నేను అంతటా ఉన్నాను.

**ఆత్మైవేదగ్ం సర్వమితి॥**

అయితే జీవి = నేను మాటేమిటి? అది నేను వేసుకున్న తాత్కాలిక వేషం. స్వప్న దృష్టాంతం చూస్తే స్వప్నప్రపంచంలో నేను ఒక జీవిని. కాని నేను లేచి, జాగ్రత్ శరీరంతో మమేకం చెందితే, నేను స్వప్నప్రపంచానికి సృష్టికర్తను. అదే విధంగా నేను స్థూలశరీరంతో మమేకం చెందితే నేను జీవిని. సాక్షి చైతన్యం నేను అని అర్థం చేసుకుంటే నేను సృష్టికర్తను, నేను పరమాత్మను.

**ఫలం** – ఆత్మజ్ఞానం పొందితే కలిగే ఫలం కూడా వివరిస్తున్నాడు.

**ఆత్మరతిరాత్మక్రీడ ఆత్మమిథున ఆత్మానందః**

జ్ఞాని ప్రపంచంలోని ఆనందాలన్నింటినీ ఒక్కసారిగా పొందుతాడు. ఎందుకంటే ప్రపంచంలోని ఆనందాలన్నీ తన ప్రతిబింబం అని అర్థం చేసుకుంటాడు. ఆ ఆనందాలు కొన్నింటిని చెబుతున్నాడు గురువు.

**ఆత్మరతిః** – రతి అంటే జ్ఞాపకాలలో రమించటం. కాని జ్ఞాని ఆత్మలోనే రమిస్తాడు.

**ఆత్మక్రీడాః** – క్రీడ అంటే బాహ్యసాధనలతో వినోదం పొందటం కాని అతనికి క్రీడ కూడా ఆత్మానందమే.

**ఆత్మమిథునః** – అనుబంధాలవల్ల కలిగే ఆనందం. కాని జ్ఞానికి అదికూడా ఆత్మానందమే.

ఒక్కముక్కలో చెప్పాలంటే ప్రతిదీ ఆత్మానందమే. బాహ్యవస్తువుల్లో దొరికే ఆనందం ప్రతిబింబానందం. అది వచ్చినా ఆనందమే, పోయినా ఆనందమే.

ముందేమో సర్వం బ్రహ్మ అంది. తరువాత ఆత్మ సర్వం అంది. ఈ రెండూ కలిపితే బ్రహ్మ = ఆత్మ. బ్రహ్మ, ఆత్మల ఐక్యం పరోక్షంగా చెప్పబడింది. ఆరవ అధ్యాయంలో తత్త్వమసి శ్వేతకేతో వాక్యంద్వారా ప్రత్యక్షంగా చెబితే, ఇక్కడ ఆనందం రూపంలో ఐక్యం పరోక్షంగా చూపిస్తున్నది. ఇక్కడ ఆనందానికి నాలుగు పదాలు వాడింది – రతి, క్రీడ,

మిథునం, ఆనందం. ఇవన్నీ హెచ్చుతగ్గులున్న ఆనందాలు. వీటినే ప్రియమోదప్రమోదాలుగా ఇప్పుడే చూశాము.

ఈ జ్ఞానం పొందిన వ్యక్తి జీవించి ఉండగా జీవన్ముక్తి, మరణించాక విదేహముక్తి పొందుతాడు. విదేహముక్తి పొందిన జ్ఞాని ఎక్కడ ఉంటాడు?

**తస్య సర్వేషు లోకేషు కామచారో భవతి**

14 లోకాల్లో ఎక్కడైనా యథేచ్ఛగా ఉంటాడు. సత్ చిత్ ఆనందరూపంగా అంతటా ఉంటాడు.

దీనికి భిన్నంగా జ్ఞానం పొందకపోతే, అదృష్టకర్మతో యుద్ధం చేయాలి. ఒక్కరోజు కాదు, ఎప్పుడూ. మీరు కళ్ళకు గంతలు కట్టుకుని, ఒక యోధునితో మల్లయుద్ధం చేయాల్సి ఉంటే, మీ పరిస్థితి ఎలా ఉంటుంది? అతను మీకు కనబడడు, మీరు అతనికి చక్కగా కనబడతారు. మీరు ఒకవైపు చూస్తుంటే, అతను ఇంకోవైపునుంచి వచ్చి మిమ్మల్ని గుద్దుతాడు; మొహం పచ్చడి చేస్తాడు. అదృష్టకర్మ కూడా అంతే. అందువల్ల సంసారంలో పడి అహం జీవోస్మి అంటూ బాధపడతారా? జ్ఞానం పొంది అహం బ్రహ్మ అస్మి అంటారా? రెండింటి ఫలం చూశారు కదా! నిర్ణయం మీ చేతిలో ఉంది. ఇక్కడితో భూమవిద్య ముగిసింది.

మళ్ళీ ఈ సారాన్ని సనత్కుమారుడు ఆఖరి ఖండంలో చెప్పి, తన బోధ అర్థంకాని కొంతమందిని దృష్టిలో పెట్టుకుని వారి సాధన ఎల్.కె.జి. నుంచి మొదలుపెట్టాలని చెబుతున్నాడు.

1. మనస్సును శుద్ధి చేసుకోవాలంటే ముందు ఆహారంమీద అదుపు ఉండాలి. అంటే ఇంద్రియ నిగ్రహంవల్ల చిత్తశుద్ధి ఏర్పడుతుంది. ఇది కర్మయోగం.
2. చిత్తశుద్ధి పొందాక ధృఢమైన జ్ఞానం పొందాలి. ఇది జ్ఞానయోగం.
3. జ్ఞానం రాగానే హృదయగ్రంథులు విడివడతాయి. ఇది ఫలం.

**అవిద్యాకామకర్మణామ్ విప్రమోక్షః**

అవిద్య అంటే అజ్ఞానం. అజ్ఞానంవల్ల కోరిక, కోరికవల్ల కర్మ చేస్తారు. అదే సంసారం. ఈ సంసారంనుంచి విడివడతారు.

ఈ అధ్యాయం ఎలా మొదలయిందో అలా ముగిసింది.

**తం భగవన్ శోకస్య పారం తారయతు** – మీరు నన్ను శోకంయొక్క ఆవలి తీరానికి తీసుకు వెళ్ళండి అని నారదులవారు సనత్కుమారుణ్ణి కోరాడు.

**తమసస్పారం దర్శయతి తగ్ం స్కంద ఇత్యాచక్షతే** – ఆచార్య సనత్కుమారునిగా అవతారం ఎత్తిన సుబ్రహ్మణ్యస్వామే నారదుడిని (తద్వారా మననూ) సంసారమనే ఆవల తీరానికి తీసుకువెళ్ళినందుకు మనం నమస్కరిస్తున్నాము.

# ఏకాదశ ఉపనిషత్తుల సారం

## ఛాందోగ్యోపనిషత్ - అధ్యాయం 8

ఆరవ అధ్యాయం బ్రహ్మను సత్‌రూప బ్రహ్మగానూ, ఏడవ అధ్యాయం బ్రహ్మను ఆనంద రూపబ్రహ్మగానూ వర్ణించింది. ఇప్పుడు చిత్‌రూప బ్రహ్మగానిర్వచనం వస్తుంది. అవస్థాత్రయ సాక్షి రూపమైన బ్రహ్మను చూస్తాము. ఈ విధంగా 6, 7, 8 అధ్యాయాలు బ్రహ్మయొక్క సచ్చిదానందస్వరూపాన్ని వర్ణించాయి.

ఎనిమిదో అధ్యాయంలో 15 ఖండాలు ఉన్నాయి.

| | | |
|---|---|---|
| 1-6 ఖండాలు | - | సగుణ బ్రహ్మ ఉపాసన |
| 7-12 ఖండాలు | - | నిర్గుణ బ్రహ్మజ్ఞానం |
| 13-15 ఖండాలు | - | కొన్ని ఆధ్యాత్మిక సాధనలు |

సగుణబ్రహ్మ ఉపాసనకు ఆలంబనం మన హృదయంలో ఉండే ఆకాశం. హృదయంలో ఉండే ఖాళీ ప్రదేశాన్ని హృదయాకాశం అనీ దహరాకాశం అనీ అంటారు. హృదయంలో ఉండే ఆ పరిమితమైన ఆ దహర ఆకాశంలో సగుణ ఈశ్వర ధ్యానం చేయాలి. అందుకే ఈ ఉపాసనను దహరవిద్య అంటారు. మన హృదయంలో చేసే ఈశ్వరధ్యానం కాబట్టి ఈ ఉపాసన చాలా ప్రఖ్యాతి చెందింది. బ్రహ్మసూత్రాల్లో దహర అధికరణం అనే ఒక అధికరణంలో ఈ దహరవిద్యను విపులంగా చర్చించటం జరిగింది.

ఈ ఉపాసనలో మన శరీరం ఆలయంగానూ; హృదయం గర్భగుడిగాను, హృదయంలో వున్న చైతన్యం ఈశ్వరునిగానూ అభివర్ణించబడ్డాయి. ఈశ్వరుని బాహ్యంగా ధ్యానిస్తే భేద ఉపాసన అవుతుంది. ఇక్కడ హృదయంలో ధ్యానిస్తున్నాం కాబట్టి అభేద ఉపాసన అవుతుంది. కర్మకాండలో ఈశ్వరుని బాహ్యంగా చూస్తాము. ఉపాసనకాండలో ఈశ్వరుని మనలో ఉన్నట్టుగా ఊహించుకుని అభేద ఉపాసన చేస్తాము. జ్ఞానకాండలో ఈశ్వరునికీ, మనకూ భేదం లేదని నేర్చుకుని అభేదజ్ఞానం పొందుతాము. అలా భేదజ్ఞానంనుంచి అభేద ఉపాసనకు వచ్చి అక్కడనుంచి అభేదజ్ఞానానికి వెళతాము. ఇది మన ప్రయాణం. అందుకని ఈ ఉపాసన చాలా ముఖ్యమైనది.

ఈ నేపథ్యంతో ఖండాలలోకి అడుగుపెడదాము.

## ఖండాలు 8.1-8.6 -1 సగుణబ్రహ్మ ఉపాసన

### ఖండం 1 - అష్టగుణ ఈశ్వర ఉపాసన

ఖండాలు 1-6 సగుణబ్రహ్మ ఉపాసన గురించి చెబుతాయి. ఇక్కడ ప్రత్యేకత గురుశిష్యుల పేర్లు రావు. ఉపనిషత్తే గురుశిష్యుల సంవాదం ఊహించుకుని, సగుణబ్రహ్మ ఉపాసనను వారి సంవాదంద్వారా ప్రవేశపెడుతున్నది.

మన స్థూలశరీరం బ్రహ్మపురం. ఈ పురంలో బ్రహ్మ అనే రాజు నివసిస్తున్నాడు. ఈ పురంలో రాజు నివసించే ఇంటిని రాజసౌధం అంటున్నది ఉపనిషత్తు. ఆ రాజసౌధం హృదయపుండరీకం. పుండరీకం అంటే తామరమొగ్గ. హృదయం తలక్రిందులుగా ఉన్న తామరమొగ్గలా ఉంటుంది. ఆ హృదయం పరిమాణం దహరం అంటే చాలా చిన్నది. అంత చిన్న హృదయంలో ఇంకా చిన్న మనస్సు ఉంది. మనస్సులో ఆలోచనలు పుడుతున్నాయి. ఆ ఆలోచనలను తెలుసుకుంటున్న ఒక సాక్షిచైతన్యం ఉంది.

హృదయంలో రెండు ఆకాశాలు ఉన్నాయి. ఒకటి భూతాకాశం (పంచభూతాలకు చెందినది), రెండోది చిదాకాశం. సాక్షిచైతన్యాన్ని చిదాకాశం లేదా దహరాకాశం అంటారు. అదే బ్రహ్మ, అదే ఈశ్వరుడు. ఈ చిదాకాశాన్ని ఈశ్వరునిగా అర్థం చేసుకుంటే అది జ్ఞానం, కాని ఇక్కడ జీవాత్మ - పరమాత్మ ఐక్యం గురించి బోధించటం లేదు. ఉపాసన చేయమంటున్నది. ఐక్యాన్ని అర్థం చేసుకుంటే అది జ్ఞానం; ఐక్యాన్ని ఊహించుకుంటే అది ఉపాసన. ఇక్కడ ఉపనిషత్తు గురుశిష్యుల మధ్య ఊహాజనితమైన సంభాషణద్వారా ఈ ఉపాసనను ప్రవేశపెడుతున్నది.

ఈ దహరాకాశ ఈశ్వరునిలో ఏం ఉందో తెలుసుకో అని గురువు చెబితే, శిష్యుడు ఇలా అడిగే అవకాశం ఉంది. శరీరం బ్రహ్మపురం అనుకున్నా, అందులో హృదయం పుండరీకంలో దహరాకాశం ఉంది అనుకున్నా, అంత చిన్న ఈశ్వరునిలో ఏం ఉంటుంది? అందులో ఏం ఉన్నాయో నేను అన్వేషణ చేసి తెలుసుకోవాల్సినంత విలువైనది ఏం ఉంటుంది?

దీనికి గురువు జవాబు - ఈశ్వరుడు నీ హృదయంలో ఉన్నాడంటే, ఈశ్వరుడు నీ హృదయంలోనే లేడు. ఈశ్వరుడు నీలోనూ, బయట కూడా ఉన్నాడు. చైతన్యం శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు. సర్వవ్యాపకం. సర్వవ్యాపకమైన చైతన్యాన్నే ఈశ్వరుడు అంటారు. ఈశ్వరుడు జగత్ కారణం. కారణ ఈశ్వరుని హృదయంలో ఉన్నట్టుగా ఎందుకు ఊహించుకోవాలి? దానికి మూడు కారణాలు.

1. ఈశ్వరుడు హృదయంలో కూడా ఉన్నాడు.
2. ఈశ్వరుడు హృదయంలోనే చైతన్యంగా ప్రకటితమవుతున్నాడు.
3. జగత్తు మొత్తం సగుణ ఈశ్వరునిలో ఉంది. ఈ సర్వవ్యాపక ఈశ్వరుడు నీ హృదయంలో ఉన్నాడు.

**అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థితః** – గీత 10.20

ఈ వర్ణనే కృష్ణపరమాత్మ చెప్పిన ఈ శ్లోకానికి ఆధారం.

ఇప్పుడు శిష్యునికొక సందేహం కలుగుతుంది. ఈశ్వరుడు హృదయం లోపల ఉంటే, శరీరం మరణిస్తే ఈశ్వరుడు కూడా మరణించడా? ఈశ్వరుడు మరణిస్తే జగత్తంతా నాశనమయిపోదా? కుండ నిండా పాలు ఉంటే, కుండ బద్దలయితే పాలు ఒలికిపోతాయా, లేదా?

గురువు ఈ ఉదాహరణ తప్పు అని చెబుతారు. కుండలో పాలే కాదు, ఆకాశం కూడా ఉంటుంది. కుండలోని ఆకాశాన్ని తీసుకోవాలి. ఆకాశం కుండలోనూ ఉంది, బయటా ఉంది. కుండలో ఆకాశాన్ని ఘటాకాశం అనీ, బయట ఉన్న ఆకాశాన్ని మహదాకాశమనీ అంటారు. కుండ పగిలిపోతే ఘటాకాశం మహదాకాశంలో లయమయిపోతుంది. అలాగే శరీరం నశించినా ఈశ్వరుడు నశించడు. ఈ ఈశ్వరుని బ్రహ్మపురం అంటారు. ఏతత్ సత్యం అంటాడు గురువు.

ముందేమో శరీరాన్ని బ్రహ్మపురం అన్నాడు గురువు; ఇప్పుడు ఈశ్వరుని బ్రహ్మపురం అంటున్నాడు. అదెలా? వాటిని విడదీయటంలో ఉంది భేదం.

బ్రహ్మపురం – బ్రహ్మయొక్క పురం – శరీరం, ఈశ్వరునికి పురం
బ్రహ్మపురం – బ్రహ్మే పురం – ఈశ్వరుడే అందరికీ పురం

వేదాంతాన్ని మూడు దశల్లో బోధిస్తాయి ఉపనిషత్తులు. దానికి ఆకాశం ఉదాహరణ ఇస్తాయి.

1. ఈ గదిలో ఆకాశం ఉంది.
2. ఆకాశం ఈ గదిలోనే కాదు, బయట కూడా ఉంది.
3. ఆకాశం నిజానికి ఈ గదిలో లేదు. ఆకాశంలోనే గదులన్నీ ఉన్నాయి.

ఇప్పుడు దీన్నే శరీరానికీ, బ్రహ్మకూ అన్వయిద్దాము. శరీరం గది, బ్రహ్మ ఆకాశం.

1. శరీరంలో బ్రహ్మ ఉన్నాడు.
2. బ్రహ్మ ఈ శరీరంలోనే కాదు, బయట కూడా ఉన్నాడు.
3. బ్రహ్మ నిజానికి ఈ శరీరంలోనే లేదు, బ్రహ్మలోనే శరీరాలన్నీ ఉన్నాయి.

అందువల్ల మొదటి దశలో బ్రహ్మ, పురంలో ఉన్నాడు అంటే, చివరి దశలో బ్రహ్మ అనే పురంలో అన్నీ ఉన్నాయి అంటున్నాము.

ఇక్కడ్నుంచీ ఈ సగుణబ్రహ్మ నిర్వచనం ఇవ్వబోతున్నది ఉపనిషత్తు. అందువల్ల ఈ భాగాన్ని అష్టగుణవిశిష్ట ఈశ్వరవర్ణన అంటారు. ఈ అష్టగుణ విశిష్ట ఈశ్వర ఉపాసన చేసిన వ్యక్తి, ఈశ్వరునిలో లయమవుతాడు.

**మయ్యర్పితమనోబుద్ధిః మామేవైష్యస్య సంశయమ్ –** గీత 8.7

అతను ఎప్పుడూ ఈశ్వరచింతనలోనే ఉంటాడు కాబట్టి మరణకాలంలో కూడా ఈశ్వరునే స్మరిస్తాడు. ఈ ఎనిమిదవ అధ్యాయంలో ఆరు ఖండాల సారాంశం గీతలో ఎనిమిదో అధ్యాయంలో వస్తుంది. ఈశ్వరునికి మనం చూడబోయే 8 లక్షణాలను ఉపాసకుడు కూడా పొందుతాడు. అందువల్ల దహరాకాశ ఉపాసన చేయమంటున్నది ఉపనిషత్తు. ముందుగా ఆ ఎనిమిది గుణాలు చూద్దాము.

1. **అపహతపాప్మా** – కర్మఫలం అంటదు. పాప్మ అంటే మామూలుగా పాపం. కాని పుణ్యం, పాపం రెండూ తీసుకోవాలి. ఈశ్వరునికి పుణ్యపాపకర్మల ఫలం అంటదు. ఎందుకు? ఆయనకు కర్తృత్వభావన ఉండదు కాబట్టి.

2. **విజరః** – వృద్ధాప్యం ఉండదు. జర అంటే వృద్ధాప్యం. విజరః అంటే వృద్ధాప్యం ఉండదు. అది కూడా కర్మ వల్లే వస్తుంది.

3. **విమృత్యుః** – మరణం లేదు. ఈశ్వరుడు కారణం కాబట్టి మరణం లేదు. ఈశ్వరుడు కూడా మరణిస్తే తరువాత వచ్చే సృష్టి రాదు కదా!

4. **విశోకః** – శోకం లేదు. ఈశ్వరుడు జ్ఞాని కాబట్టి.

5. **విజిఘత్సః** – ఆకలి లేదు. ఆకలి కూడా కర్మజన్యమే.

6. **అపిపాసః** – దాహం వేయదు.

7. **సత్యకామః** – సత్యమైన కోరికలు ఉన్నవాడు. అంతేకాదు ఆయన కోరికలన్నీ తీరతాయి.

8. **సత్యసంకల్పః** – కోరికలు తీరటానికి ప్రయత్నం చేయనవసరం లేదు.

## ఖండం 8.2 – ఈశ్వర ఉపాసన ఫలం

ఈ ఖండంలో ఉపాసకుడు సత్యకాముడు, సత్యసంకల్పుడు ఎలా అవుతాడో వివరంగా వస్తుంది. ఈ ఉపాసకుడు పితృలోకంలో ఉన్న పితృదేవతలను చూడాలనుకున్నా, మాతృదేవతలను చూడాలనుకున్నా, అన్నను, చెల్లిని, మిత్రులను, సుఖాలను, ఆభరణాలను, అన్నపానాలను, గీతవాద్యాలను ఏవి చూడాలనుకున్నా, సంకల్పం మాత్రంచేతనే అనుభవించగలడు.

**యం యమన్తమభికామో భవతి యం కామం కామయతే।**

ఒక పెద్ద పట్టిక చెప్పీ చెప్పీ అలసిపోయిన ఉపనిషత్తు ఒక్కముక్కలో చెప్పాలంటే, అతను ఏది కోరుకుంటే అది తీరుతుంది అని చెప్పింది. ఇలా ఉపాసకుడు పొందే సిద్ధుల గురించి వేరే ఏ ఉపనిషత్తులోనూ రాదు. సంకల్ప మాత్రంచేత 14 లోకాల్లో ఏది కోరుకుంటే అది పొందవచ్చు.

## ఖండం 8.3 – ఈశ్వర ఉపాసన ఫలస్తుతి

ఉపాసకునికి ఏ కోరిక ఉన్నా అది తీరుతుంది. ఎందుకు? అతని హృదయాకాశం ఈశ్వరుడు. ఈశ్వరుడు విశ్వాధారం. అందువల్ల జగత్తు మొత్తం అతని హృదయంలోనే ఉంది. అందువల్ల సంకల్పమాత్రంచేత కోరిక తీరుతుంది. అందరికీ హృదయాకాశంలో జగత్తు ఉన్నా, ఉపాసకునికే ప్రత్యేక శక్తి ఉంటుంది. అతను చేసే ఉపాసనవల్ల అతను సత్యకాముడు, సత్యసంకల్పుడూ అవుతాడు. అతని ప్రపంచం సంకల్పసిద్ధం.

నిజానికి సుషుప్తిలో ప్రతిరోజూ ఈశ్వర ఐక్యాన్ని మనం అనుభవిస్తున్నాము. కాని అజ్ఞానంవల్ల మనం తెలుసుకోలేకున్నాము.

**ఇమాః సర్వాః ప్రజాః అహరహర్గచ్ఛన్త్య ఏతం బ్రహ్మలోకం**

ఒక పేదవానికి తన ఇంటి కిందే ఒక పెద్ద బంగారు నిధి ఉన్నా, అతనికి ఆ విషయం తెలియనట్టే, మనకు మన హృదయాకాశంలోనే ఈశ్వరుడనే నిధి ఉందని తెలియదు. నిజానికి ప్రతిరోజూ ఆ నిధి దగ్గరకు వెళ్ళి వస్తున్నా, మనకు తెలియటం లేదు. ఈశ్వరుడు నిధిలాగా మన హృదయంలో ఉండటంవల్ల ఈశ్వరునికి ఒక నిర్వచనం ఇస్తున్నది ఉపనిషత్తు. అది **హృద్యయమితి నామ**. హృదయం అంటే మామూలుగా గుండె. కాని ఇక్కడ దాన్ని ఈశ్వర నామాల్లో ఒకటిగా వ్యవహరిస్తున్నది.

ఎందుకంటే ఆయన హృది+అయమ్= హృదయమ్; హృదయంలో లభ్యమయ్యే పరమాత్మ. అందువల్ల హృదయమ్ అనే పేరు నిర్వచనాన్నిబట్టి కూడా హృదయంలో ఈశ్వరుడు ఉన్నాడని తెలుస్తున్నది. హృద్యయమ్ పదేపదే అంటే హృదయం అవుతుంది.

**అహరహర్వా ఏవంవిత్స్వర్గం లోకమేతి**

ఈ ఉపాసకుడు, పరమాత్మతో ప్రతిరోజూ లయమవుతున్నాడు. ఇక్కడ స్వర్గలోకం అంటే హృదయంలో ఉన్న పరమాత్మ. ఎప్పుడు? సుషుప్తిలో. అజ్ఞాని కూడా లయమవుతాడు కాని అతనికి తెలియదు. ఉపాసకునికి తెలుసు. అందువల్ల ఉపాసకుడు సుషుప్తిని పవిత్రమైన అవస్థగా, అద్వైత అవస్థగా భావిస్తాడు.

**సత్యమితి నామ** – ఇప్పుడు ఇంకొక పేరు ఇస్తున్నది ఉపనిషత్తు. ఉపనిషత్తులో సత్యం పేరును రకరకాలుగా విశ్లేషిస్తారు. **సత్+త్యత్** అని విడదీస్తారు బృహదారణ్యకంలో. కాని ఇక్కడ వేరే విధంగా వస్తుంది. పదాల గారడీ చూస్తాము, ప్రత్యేకించి బృహదారణ్యకంలోనూ, ఛాందోగ్యంలోనూ. ఇక్కడ,

**సతీయమితి** – స+తీ+యమ్ గా విడదీస్తున్నది. మధ్యలో ఉన్న అక్షరం 'త'ను పలకలేము కాబట్టి, దాన్ని ఉపనిషత్తే 'తీ' చేసింది. వాటి అర్థాలను ఉపనిషత్తే ఇచ్చింది.

స అనే అక్షరం సత్‌ను అంటే అమృతాన్ని సూచిస్తుంది. సత్ అంటే శుద్ధ సత్తా. అది శాశ్వతం. తరువాత ఏది తి అంటే తకారం గలదో, అది వినాశి. మర్త్యంలో కూడా 'త' శబ్దం ఉంది. యమ్ అనే అక్షరం, అమృతం, మర్త్యం అనే పైన చెప్పిన రెండు అక్షరాలను నియమిస్తుంది. అందువల్ల సత్యం అంతిమ అర్థం – ఆ పరమాత్మ శాశ్వతత్వాన్ని, అశాశ్వతత్వాన్ని నియమించేవాడు. అందువల్ల అజ్ఞాని జీవులకు పునరపి జననం, పునరపి మరణం ఇస్తే, అదే పరమాత్మ జ్ఞాని జీవికి మోక్షం ఇస్తున్నాడు.

ఎవరైతే సత్త్వగుణ విశిష్ట పరమాత్మ ఉపాసన చేస్తారో, ఆ ఉపాసకుడు జీవించి ఉండగా, ప్రతిరోజూ సుషుప్తిలో పరమాత్మ ఐక్యం చవిచూస్తాడు; మరణించాక క్రమముక్తి పొంది, పరమాత్మలో ఐక్యం అవుతాడు.

## ఖండం 8.4 – ఈశ్వరునికి ఇంకొక నిర్వచనం సేతువు

ఇప్పటిదాకా రెండు నిర్వచనాలను చూశాము. అవి హృద్యయం, సత్యం. ఇప్పుడు సేతువు పదం వాడుతున్నది. సేతువు అంటే పొలాలకు రక్షణకోసం కట్టే దడిలాంటిది. సేతువుకు ఇంకో అర్థం కూడా ఉంది. వంతెన అని కూడా అంటారు. ఇక్కడ అర్థం వంతెన కాదు, కాపాడేది అని. విశ్వాన్ని నియంత్రించేవాడు లేదా రక్షించేవాడు. ప్రకృతిలో అన్నీ

ఒక నియమం ప్రకారం నడుస్తున్నాయి. ఆ నియమం కాపాడేవాడు సేతువు. ఈ పరమాత్మ గొప్పతనం ఏమిటి? కాలాతీతం, పుణ్యపాపాలకు అతీతుడు. పుణ్యపాపాలు ఎవరిని అటకాయించాలో తెలుసుకోవటానికి పరమాత్మ దగ్గరికి వెళతాయే కాని పరమాత్మని అటకాయించటానికి కాదు. అందువల్ల పరమాత్మకు **అపహతపాప్మా** అనే బిరుదు ఉంది. ఎవరైతే ఈ ఉపాసన చేస్తారో, అతను కూడా వీటన్నింటికీ అతీతంగా ఉంటాడు.

## ఖండం 8.5 – బ్రహ్మచర్య స్తుతి

ముందు ఖండంలో ఎవరైతే ఉపాసన + బ్రహ్మచర్యం పాటిస్తారో, వారికి మాత్రమే పరమాత్మప్రాప్తి అని చెప్పింది. ఈ ఖండంలో బ్రహ్మచర్యాన్ని స్తుతిస్తున్నది. దానికి ఒక ప్రత్యేక పద్ధతిని ఎన్నుకున్నది. తక్కిన అన్ని సాధనలను బ్రహ్మచర్యంలో**8.** కలిపివేసింది. ఆ విధంగా బ్రహ్మచర్యం = యజ్ఞం; బ్రహ్మచర్యం = ఉపవాసం; బ్రహ్మచర్యం = మౌనం. ఒక్కముక్కలో చెప్పాలంటే బ్రహ్మచర్యం పాటిస్తే చాలు, తక్కిన ఉపాసనలన్నీ ఇందులోకి వచ్చేస్తాయి. ఈ సందర్భంలో వానప్రస్థంలో చేసే ఉపాసనాఫలం బ్రహ్మచర్యం పాటిస్తే వస్తుంది అని చెబుతూ పదాల గారడీ చేస్తున్నది ఉపనిషత్తు. వానప్రస్థం అంటే అరణ్యం+ అయనం; అరణ్యంలో ఉండటం. అరణ్యం పదాన్ని అర+ణ్య=బ్రహ్మలోకంగా విడదీసింది ఉపనిషత్తు. అరణ్యం బ్రహ్మలోకప్రాప్తి ఎలా అవుతుంది?

**అరశ్చ హ వై ణ్యశ్చార్ణవౌ బ్రహ్మలోకే**

అర్ణవ అంటే సముద్రాలు. బ్రహ్మలోకంలో రెండు సముద్రాలు ఉన్నాయి. అరము, ణ్యం అనే పేర్లు గల సముద్రాలు ఉన్నాయి. అందువల్ల అరణ్యాయనం అంటే అరం, ణ్యం అనే సముద్రాలు ఉన్న బ్రహ్మలోకాన్ని పొందుతాడని అర్థం. బ్రహ్మలోకవర్ణన రావటంతో బ్రహ్మలోక వర్ణన మరికొంత వస్తుంది. బ్రహ్మలోకం, కైలాసం, వైకుంఠం అన్ని పదాలూ ఒక్కటే. ఈ బ్రహ్మలోకం భూలోకంనుంచి మూడోది అయిన సువర్లోకంలో ఉంది. భూలోక, భువర్లోక, సువర్లోకాలు తీసుకుంటే సువర్లోకం మూడో స్థానంలో ఉంది. సువర్లోకంలో మహర్లోకం, జనలోకం, తపోలోకం, సత్యలోకం వస్తాయి. సత్యలోకం అంటే బ్రహ్మలోకం. అది ఊర్ధ్వలోకం, అత్యంత పై స్థాయిలో ఉంది.

బ్రహ్మలోకంలో ఇరం, మదీయం అనే అద్భుతమైన రసాలు సమృద్ధిగా ఉన్నాయి. అక్కడ సోమరసమనే అద్భుతమైన రసాన్ని ఇచ్చే పెద్ద అశ్వత్థవృక్షం ఉంది. బ్రహ్మదేవుడే స్వయంగా నిర్మించిన పురమది. అటువంటి లోకం ఎలా ఉంటుంది? అంతా బంగారుమయం. దహరాకాశ ఉపాసన చేసిన వ్యక్తి, అది కూడా బ్రహ్మచర్య దీక్షతో కలిపి చేసిన వ్యక్తి మాత్రమే ఈ బ్రహ్మలోకాన్ని పొందుతాడు. తక్కినవారు పొందరు. పైగా ఈ ఉపాసనను జీవితాంతం చేయాలి.

## ఖండం 8.6 – నాడీ ఖండం

హృదయంనుంచి 72000 నాడులు వస్తాయనీ, అందులో 101 నాడులు ముఖ్యమైనవనీ ప్రశ్నోపనిషత్తులో చూస్తాము. ఆ నాడుల్లో రంగులతో కూడిన రసం ఉంది. ఆ రసాన్ని నాడీరసం అంటారు. ఆ రంగులు బంగారు రంగు, తెలుపు, నీలం, పసుపు, ఎరుపు. ఇలా రంగులు ఎందుకు ఉన్నాయంటే ఉపనిషత్తే వివరిస్తున్నది. ఆదిత్యుడు ఇంద్రధనుస్సు రంగులతో ప్రకాశిస్తాడు. ఈ సూర్యకిరణాలు భూమ్మీద ప్రసరించినప్పుడు, మనుష్యులమీద కూడా ప్రసరించి, నాడుల్లోకి చొచ్చుకుపోతాయి. నేను చూడలేదు అంటే అందుకే నేను చెబుతున్నాను అంటున్నది శాస్త్రం. మనం చూడలేని విషయాలను శాస్త్రం బోధించాలి. అందువల్ల సూర్యుని కిరణాలలోని ఏడురంగులు అందరి నాడుల్లో వ్యాపిస్తాయి.

ఈ సూర్యరశ్మి నాడుల్లోనే లేదు, సూర్యమండలంవరకు వ్యాపించి ఉంది. ఈ సూర్యరశ్మి హృదయాన్నీ, సూర్యమండలాన్నీ కలిపే రహదారి. ఉపాసకుడు మరణించినప్పుడు, అతని సూక్ష్మశరీరం హృదయంనుంచి మొదలై, నాడిద్వారా సూర్యరశ్మితోపాటు ప్రయాణించి, సూర్యమండలానికి, అక్కడినుంచి బ్రహ్మలోకానికి వెడుతుంది. ఈ సూర్యరశ్మి రెండు గ్రామాలను లేదా రెండు పట్టణాలను కలిపే రహదారిలాగా రెండు లోకాలను కలుపుతున్నది. అవి భూలోకం, బ్రహ్మలోకం.

ఈ జీవుడు మరణం అప్పుడే కాదు, జీవించి ఉన్నప్పుడు కూడా నిరంతరం మూడు అవస్థల్లోనూ ప్రయాణిస్తాడు. జాగ్రదవస్థలో హృదయంనుంచి బయటకు వచ్చి వ్యవహారం నడుపుతాడు. స్వప్నావస్థలో నాడుల్లోనే తిరుగుతాడు. సుషుప్తిలో ఆ నాడులద్వారానే, హృదయంలోకి వచ్చి విశ్రాంతి తీసుకుంటాడు. హృదయాకాశంలో పరమాత్మ ఉన్నాడని చూశాము. అందువల్ల సుషుప్తిలో జీవాత్మ, పరమాత్మతో ఐక్యం చెందుతుంది. అందువల్ల ఆనందస్థితిలో ఉంటాడు. తక్కిన మనుష్యుల జీవి ఏదో ఒక నాడినుంచి బయటకు వెళుతుంది మరణకాలంలో. ఈశ్వర ఉపాసకుని జీవి మాత్రం సుషుమ్న నాడిద్వారా ప్రయాణించి, బ్రహ్మరంధ్రంద్వారా బయటకు వచ్చి, సూర్యరశ్మిలో ప్రయాణించి ఆదిత్యమండలం చేరుకుంటుంది. ఆదిత్యమండలం ఈ ఉపాసక జీవికి బ్రహ్మలోకానికి ద్వారం. ఇక్కడ టోల్‌గేట్‌లాగా, అక్కడ ఆదిత్యమండలం టోల్‌గేట్. అతను ఉపాసకుడో కాదో చూస్తాడు సూర్యుడు. ఉపాసకుడు కానివాడిని నిజానికి సుషుమ్ననాడి దగ్గరే నిరోధిస్తాడు.

ఆ విధంగా దహర ఉపాసకజీవి సుషుమ్ననాడినుంచి, బ్రహ్మరంధ్రంనుంచి బయటకు వచ్చి బ్రహ్మలోకానికి చేరుకుంటాడు. అక్కడ అతను క్రమముక్తి పొందుతాడు. దీనితో సగుణబ్రహ్మ ఉపాసన ముగిసింది.

## ఖండాలు 8.7-8.12 - 2 నిర్గుణబ్రహ్మజ్ఞానం

## ఖండం 8.7 - ఆఖ్యాయిక

నిర్గుణబ్రహ్మజ్ఞానం బోధించటానికి ఒక కథద్వారా గురుశిష్యులను పరిచయం చేస్తున్నది ఉపనిషత్తు. గురువు సాక్షాత్తూ సృష్టికర్త బ్రహ్మ; శిష్యులు ఇంద్రుడు, విరోచనుడు. ఇంద్రుడు దేవతలకు రాజైతే, విరోచనుడు రాక్షసులకు రాజు.

ఒకానొకప్పుడు బ్రహ్మ ఒక పెద్ద చాటింపు వేయిస్తాడు. అష్టగుణవిశిష్ట పరమాత్మ ఉన్నాడు. ఆ గుణాలు దహరాకాశ ఉపాసనలో సగుణబ్రహ్మకు చూసినవే. అవి వరుసగా అపహతపాప్మా, విజరః, విమృత్యుః, విశోకః, విజిఘత్సః, అపిపాసః, సత్యకామః, సత్యసంకల్పః. ఈ బ్రహ్మజ్ఞానం బోధిస్తాను. ఈ జ్ఞానం పొందితే కలిగే ఫలం 14 లోకాలను పొందుతాడు. ఒక్కముక్కలో చెప్పాలంటే పూర్ణత్వం పొందుతాడు.

కాని ఇక్కడ ఒక సందేహం రావచ్చు. ఇక్కడనుంచీ నిర్గుణబ్రహ్మజ్ఞానం గురించి వస్తుందని చెబుతూ, సగుణబ్రహ్మలక్షణాలనే వర్ణిస్తున్నాడేమిటి బ్రహ్మ? దానికి జవాబు పరమాత్మకు రెండు అంశాలు ఉంటాయి. అవి సగుణబ్రహ్మ + నిర్గుణబ్రహ్మ. నిర్గుణబ్రహ్మ ఆయన ఉన్నత స్థితి. ఇంతకుముందు తత్ త్వం అసి లోని తత్ పదవాచ్యార్థం చూశాము. ఇప్పుడు తత్ పదలక్ష్యార్థం చూస్తాము. ప్రస్తుతం ఈ వర్ణన సగుణబ్రహ్మదే.

**సః అన్వేష్టవ్యస్స విజిజ్ఞాసితవ్యః**

ఈ పరమాత్మ గురించి అన్వేషించాలి, తెలుసుకోవాలి అన్నాడు. అంటే గురుశాస్త్ర ఉపదేశంద్వారా తెలుసుకోవాలి.

బ్రహ్మ వేసిన ఈ చాటింపును దేవతలు, అసురులు ఇద్దరూ కర్ణాకర్ణిగా తెలుసుకున్నారు. కోరికలనీ తీరుస్తుంది; లోకాలనూ పొందవచ్చు అంటే ఆశ పుట్టింది. ఈ ఆత్మ గురించి తెలుసుకోవాలి అనుకుని వారివారి రాజులను పంపటానికి నిశ్చయించుకున్నారు. ఆ విధంగా దేవతల రాజు ఇంద్రుడు, అసురుల రాజు విరోచనుడు వెళ్ళారు. వారు రాజులైనా బ్రహ్మనే తమ రాజ్యాలకి రమ్మని పిలవలేదు. వారే గురువు దగ్గరికి వెళ్ళాలని తెలుసు. అది కూడా రాజు హోదాలో వెళ్ళలేదు. ఇద్దరికీ రెండో వ్యక్తి వస్తున్నట్టు తెలియదు. ఇద్దరూ సమిధలు తీసుకుని వెళ్ళారు.

బ్రహ్మ లేదా ప్రజాపతి వారిని తన దగ్గర 32 సంవత్సరాలు ఉండి అంతఃకరణశుద్ధి పొందాలి అన్నాడు. ఇంద్రుడు, విరోచనుడు రాజులు. సేవలు అనుభవించటమే కాని, సేవ

చేయటం ఎరుగనివారు. కాని పల్లెత్తు మాట అనలేదు. ఇది సంప్రదాయం. ఇంకొక విషయం, వారిద్దరూ కలిసి వచ్చారని ప్రజాపతి అనుకుని, ఇద్దరినీ కలిపి సంబోధిస్తున్నాడు. వారు కూడా వారి శత్రుత్వాన్ని చూపటం లేదు.

అలా 32 సంవత్సరాలు గురుశుశ్రూష చేశాక, మీరు ఏ విద్య కోరి ఇలా బ్రహ్మచర్య దీక్ష చేపట్టారు అని అడిగారు. మీ చాటింపు విని వచ్చాము అని తేలికగా చెప్పి ఉండవచ్చు. కాని ఇద్దరూ ప్రజాపతి వేయించిన చాటింపు మొత్తాన్ని కూడా అక్షరం పొల్లు పోకుండా తిరిగి చెప్పారు. ఒక్కముక్కలో చెప్పాలంటే సగుణ నిర్గుణ పరమాత్మ విద్య పొందటానికి వచ్చాము అన్నారు.

## ఖండాలు 8.8 - 8.11

ఇంతవరకూ అఖ్యాయిక అంటే కథ. ఇంక బోధ మొదలవుతుంది. పరమాత్మ అంటే ఎవరో కాదు, చైతన్యం. అందువల్ల చైతన్యస్వరూపపరమాత్మ బోధ వస్తుంది. మాండూక్యోపనిషత్తులో చతుష్పాద ఆత్మ వర్ణన వస్తుంది.

జాగ్రత్ ప్రపంచాన్ని స్థూలశరీరంద్వారా అనుభవించే చిదాభాస – విశ్వ

స్వప్నప్రపంచాన్ని సూక్ష్మశరీరంద్వారా అనుభవించే చిదాభాస – తైజస

సుషుప్తి అవస్థను కారణశరీరంద్వారా అనుభవించే చిదాభాస – ప్రాజ్ఞ

ఈ మూడు చైతన్యం వేసుకునే మూడు వేషాలు. ఆ వేషాలను చిదాభాసగా వేసుకుంటుంది. అసలు చైతన్యానికి ఇంకో పేరు ఉంది. అది తురీయం. విశ్వ తైజస ప్రాజ్ఞలు మిథ్య; తురీయం ఒక్కటే సత్యం. తురీయానికి ప్రమాతృ, ప్రమాణ, ప్రమేయ త్రిపుటి లేదు. దేశకాల వస్తుపరిమితులు లేవు. ఇవేవీ లేని ఆత్యంతిక చైతన్యమే పరమాత్మ.

ఇదే బ్రహ్మ బోధించబోతున్నాడు. కాకపోతే ఈ పదాలను వాడకుండా, వేరే నాలుగు పదాలను వాడబోతున్నాడు. పదాలు మాత్రమే భిన్నం, భావం ఒకటే.

విశ్వ – అక్షిపురుషః

తైజస – స్వప్నపురుషః

ప్రాజ్ఞ – సుప్తపురుషః

తురీయం – ఉత్తమపురుషః

పురుషః అంటే పురుషుడు కాదు, పురుషః అంటే చైతన్యం లేదా ఆత్మ.

. **అక్షిపురుషుడు ఆత్మ.** విశ్వను అక్షిపురుషుడని ఎందుకన్నాడు? ఎందుకంటే జాగ్రదవస్థలో, విశ్వ నడిపే వ్యవహారమంతా కన్నుల ముందే జరుగుతుంది. బృహదారణ్యకంలో కుడికన్నుమీద ఉపాసన వస్తుంది.

ప్రజాపతి ఆ ఇద్దరు శిష్యులతో ఇలా చెప్పాడు, 'ఏ చైతన్యమైతే మొత్తం స్థూలశరీరం అంతటా వ్యాపించి ఉందో, ఏదైతే జాగ్రత్ వ్యవహారం నడుపుతుందో, ఏదైతే ప్రముఖంగా కంటి వెనుక ఉందో, అది **అక్షిపురుషుడు**. ఈ చైతన్యాన్నే ఆత్మ అనీ, పరమాత్మ అనీ అంటారు.'

**య ఏషోఽక్షిణి పురుషో దృశ్యత ఏష ఆత్మేతి**

ఇది ఒక మహావాక్యం. అక్షిపురుషుడు = ఆత్మ. ఈ ఆత్మలక్షణం ఏమిటి?

**ఏతదమృతమభయమేతద్ చ బ్రహ్మేతి**

ఈ ఆత్మ అమృతం, అభయం, దేశకాలాతీతబ్రహ్మ.

ప్రజాపతి చెప్పింది ఒకటి; ఇంద్రుడు, విరోచనుడు అర్థం చేసుకున్నది ఇంకోటి. గురువు చెప్పింది శిష్యుడు సరిగ్గా అర్థం చేసుకోకపోవటం సర్వసాధారణంగా జరిగేదే. గురువు చెప్పిందేమిటి? కన్ను వెనుకనున్న చైతన్యం, కంటికి చైతన్యాన్ని ఇచ్చిన చైతన్యం – ఆత్మ.

శిష్యులు అర్థం చేసుకున్నది ఏమిటి? కన్ను అద్దంలా ఉండి ప్రతిబింబమాధ్యమంలా పనిచేస్తుంది. అద్దంలాంటి కంట్లో ప్రతిబింబించే స్థూలశరీరాన్ని ఛాయాపురుషుడు అంటారు. ఆ ప్రతిబింబం కూడా ఎదుటివారి కంట్లో కనబడుతుంది. అందువల్ల ఈ శిష్యులు స్థూలశరీర ప్రతిబింబాన్ని ఆత్మ అనుకున్నారు.

మామూలుగా చాలామంది స్థూలశరీరాన్ని ఆత్మగా భావిస్తారు. అదే పెద్ద తప్పు. వీరు ఇంకా పెద్ద తప్పు చేస్తున్నారు. స్థూలశరీరపు ప్రతిబింబాన్ని ఆత్మగా తీసుకుంటున్నారు. అందువల్ల ఆత్మ అంటే ఛాయాశరీరం అనుకున్నారు. వారు గురువుతో కన్నులో, నీటిలో, అద్దంలో కూడా ఛాయాశరీరం ఏర్పడుతున్నది. ఈ మూడింటిలో ఆత్మ ఏది అని గురువును అడిగారు. గురువు వీరిది ఎంత వెర్రి ఆలోచనో అని ఖండించలేదు. ఎందుకంటే గురువు సాధారణంగా శిష్యులను విమర్శించడు. అందుకని అవును, ఛాయాపురుషుడే అక్షిపురుషుడు. మూడింటిలోనూ ఉన్నది ఒకటే అన్నాడు. ఒక విధంగా ప్రజాపతి చెప్పింది కూడా నిజమే. అక్షిపురుషుడంటే చైతన్యం. చైతన్యం సర్వవ్యాపకం. అందువల్ల ఆ చైతన్యం కన్నులో, నీటిలో, అద్దంలో ఉంది.

వారు చెప్పింది నిజమేనని ఒప్పుకున్నా కూడా, ప్రజాపతి వారి అభిప్రాయాన్ని కొంచెంగా సరిదిద్దాలనుకున్నాడు. అదికూడా పరోక్షంగా అంటే ఒక ప్రయోగం ద్వారా విశదీకరించాలనుకున్నాడు. అందువల్ల నీళ్ళు నిండుగా ఉన్న ఒక పెద్ద పాత్రను తెప్పించాడు. వారిని ఆ నీటిలో వారి ప్రతిబింబాలను చూసుకోమన్నాడు. వారి ఛాయాశరీరాలను చూసుకున్నారు వారు. ఇప్పుడు వారిని రాచరికపు దుస్తులు వేసుకుని, గడ్డం, గోళ్ళు తీయించుకుని

మళ్ళీ నీళ్ళలో చూడమన్నాడు. ఇప్పుడూ ప్రతిబింబం కనిపిస్తోంది. అందువల్ల ప్రతిబింబ శరీరం సవికారం అనీ, ఆత్మ నిర్వికారమనీ, శాశ్వతమనీ తెలుసుకుంటారని భావించాడు ప్రజాపతి. కాని వారు ప్రతిబింబమే ఆత్మ అని భావించి, ఆత్మజ్ఞానం పొందామని తృప్తిపడి వారి లోకాలకు తిరుగు ప్రయాణం సాగించారు. ప్రజాపతి మాత్రం వారు సరిగ్గా జ్ఞానం పొందలేదని నిరాశలో మిగిలిపోయాడు. పైగా ఈ సగం సగం నేర్చుకున్నదే తక్కినవారికి కూడా బోధిస్తారని బాధపడ్డాడు.

వెనక్కి వెళ్ళే దారిలో ఇంద్రుడూ, విరోచనుడూ విడిపోయారు. త్రోవలో ఒకసారి తను నేర్చుకున్నది సమీక్షించుకున్నాడు విరోచనుడు. తమను నగలు వేసుకోమన్నప్పుడు ప్రతిబింబానికి వేయలేదు కదా, బింబశరీరానికి వేసుకున్నారు. అసలు బింబశరీరం ఎలా ఉంటే, ఛాయాశరీరం దానిలా ఉంది. అంటే ఆత్మ ఛాయాశరీరం కాదు. ఆత్మ బింబ(స్థూల) శరీరం అని తన అభిప్రాయాన్ని మార్చుకున్నాడు. ఆత్మ లేదా నేను అంటే శరీరం! శరీరం పడిపోతే ఆత్మ కూడా పడిపోతుందని అర్థం చేసుకున్నాడు. దీన్ని **అసురదర్శనం** అంటారు. వీరు స్వర్గనరకాలను, పునర్జన్మను, శ్రాద్ధకర్మలను నమ్మరు.

ఇంద్రుడు కూడా దారిలో తను నేర్చుకున్నదాన్ని సింహావలోకనం చేసుకున్నాడు. ప్రతిబింబ చైతన్యం మారుతూ వస్తున్నది; బింబశరీరం ఎలా ఉంటే అలా ఉంటుంది; చివరికి బింబ శరీరం నాశనమయితే, ప్రతిబింబం కూడా నశిస్తుంది. ఆత్మ లక్షణం ఏమిటి? అమృతం, అభయం. అలాంటప్పుడు ఇంత చిన్న విషయం తనెలా అర్థం చేసుకోలేకపోయాడు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఇంద్రుడు ప్రజాపతిని నిందించలేదు. తనే సరిగ్గా అర్థం చేసుకోలేదు అనుకున్నాడు. అందుకని ప్రజాపతి దగ్గరికి మళ్ళీ వెళ్ళి, మళ్ళీ ఆత్మవిద్యను బోధించమని అడుగుతాడు. తరువాత మళ్ళీ వెనక్కి ఎందుకు వచ్చావు అన్నాడు.

ప్రతిబింబశరీరం మారుతున్నది కాబట్టి ఆత్మ కాదు, బింబశరీరం కూడా వికారాలు చెందుతుంది. ఒక కన్ను పోవచ్చు, రెండు కళ్ళు పోవచ్చు, శరీరానికి దెబ్బ తగలవచ్చు, శరీరం రాలిపోవచ్చు కూడా. అందువల్ల ఆత్మ అశాశ్వతమైన శరీరం కాదు, అక్షిపురుషుడు శరీరం కాదు. అయితే అక్షిపురుషుడు ఎవరు? ప్రజాపతి నువ్వు తప్పుగా అర్థం చేసుకున్నావని అర్థం చేసుకున్నది నిజమే, నీకు బోధిస్తాను, కాని మళ్ళీ 32 సంవత్సరాలు నా దగ్గర ఉండి శుశ్రూష చేయాలి అన్నాడు. అలాగే అన్నాడు ఇంద్రుడు.

2. **స్వప్నపురుషుడు ఆత్మ** – అక్షిపురుషుడంటే విశ్వ అని చూశాము. స్వప్నపురుషుడంటే తైజస. ఈ తైజసే ఆ విశ్వ. విశ్వ = తైజస = బ్రహ్మ.

వ్యావహారికంగా వారిరువురూ వేరు, వారి అనుభవాలు వేరు. కాని శరీరాల పరంగా కాకుండా, ఆ రెండింటి వెనుక ఉన్న చైతన్యాన్ని తీసుకుంటే రెండూ ఒకటే. స్వప్నపురుషుడు అదే చైతన్యం, మనం దుస్తులు మార్చుకున్నట్టుగా స్వప్నశరీరాన్ని ధరించి, స్వప్నప్రపంచాన్ని సృష్టించి, అందులోకి స్వప్నశరీరంతో అడుగుపెట్టింది. అక్కడ స్వాప్నికుడు సంకల్పమాత్రంచేత, తన వాసనలద్వారా స్వప్నప్రపంచాన్ని సృష్టిస్తాడు. ఈ స్వప్నప్రపంచం అతనిలోంచే వచ్చింది. స్వప్నశరీరంద్వారా పనిచేస్తున్న ఈ చైతన్యమే ఆత్మ అని చెప్పాలని గురువు ఉద్దేశ్యం. ఈ చైతన్యం ఈ మాధ్యమం లేకపోయినా ఉంటుంది. అది అమృతం, అభయం. ఇక్కడ పాత్రని మార్చి చూపించాడు. స్థూలశరీరాన్ని మార్చి సూక్ష్మశరీరాన్ని చూపిస్తున్నాడు. స్వప్నపురుషుడు అని చెప్పటంద్వారా శిష్యునికి రెండు చూపిస్తున్నాడు. స్వప్నశరీరం, చైతన్యం.

రెండు చూపించినా శిష్యుడు **స్వప్నశరీరమే ఆత్మ** అనుకున్నాడు. శాంత హృదయుడై వెళ్ళిపోయాడు. ఆత్మను, అనాత్మను కలిపాడు. అది మూల అవిద్యవల్ల కలిగింది. మళ్ళీ కథ మొదటికి వచ్చింది. మళ్ళీ త్రోవలో విశ్లేషించుకున్నాడు. స్థూలశరీరానికి ఏం జరిగినా, స్వప్నపురుషునికి ఏమీ అవటం లేదు. స్థూలశరీరంలో కళ్ళు హఠాత్తుగా పనిచేయటం మానేసినా, స్వప్నంలో అతను గుడ్డివాడవడు. అలా జాగ్రత్ శరీరం స్వప్నపురుషుని బాధించకపోయినా, స్వప్నప్రపంచం బాధిస్తుంది. అంటే స్వప్నపురుషుడు కూడా ప్రారబ్ధకర్మను, సంసారాన్ని తప్పించుకోలేడని ఇంద్రుడు గ్రహించి మళ్ళీ వెనక్కి వెళ్ళాడు. ప్రజాపతి మళ్ళీ 32 సంవత్సరాలు ఉండమన్నాడు.

3. **సుప్తపురుషుడే ఆత్మ** – ఇంద్రుడు మొదటి రెండు సందర్భాలలోను పాత్రను తీసుకుని, వస్తువును వదిలేశాడు. అందువల్ల పాత్ర లేకుండా, కేవలం చైతన్యం గురించి చెబుదామనుకున్నాడు. సుషుప్తిలో పాత్ర కనబడదు. శరీరం, ఇంద్రియాలు, మనస్సు పడుకుంటాయి. సుషుప్తిలో చైతన్యం మాత్రమే ఉంటుంది. అందువల్ల ఇప్పుడు మూడవ దశను ప్రవేశపెడదామనుకుంటున్నాడు ప్రజాపతి. **సుప్తపురుషుడు ఆత్మ**. సుప్తపురుషుడు అంటే సుషుప్తిలో ఉండే శుద్ధచైతన్యం. సుషుప్తిలో కారణశరీరం ఉంటుంది కాని, అది అవ్యక్తంగా ఉంటుంది. అందువల్ల చైతన్యానికి దేశకాల పరిమితిలు లేవు. అందువల్ల అది అభయం. అమృతం అని చెప్పవచ్చు అనుకున్నాడు ప్రజాపతి. సుషుప్తిలో ఏమీ లేనట్టు అనిపిస్తుంది కాని, నిజానికి సుషుప్తిలో సాక్షిచైతన్యం అనే నేను ఉన్నాను. ఈ చైతన్యమే ఆత్మ. అది అమృతం, అభయం. సుప్తపురుషుడిని ప్రాజ్ఞ అంటారు.

సుప్తపురుషుడే ఆత్మ అని భావించిన ఇంద్రుడు తృప్తి చెంది వెళ్ళిపోయాడు. మళ్ళీ త్రోవలో విశ్లేషించుకున్నాడు. జాగ్రదవస్థలో నా గురించి నేను మాట్లాడగలను,

స్వప్నపురుషునిగా కూడా నేను నా గురించి మాట్లాడగలను కాని సుప్తపురుషునిగా నేను సుప్తపురుషుని అని చెప్పలేను. నేను సర్వవ్యాపకమైన చైతన్యాన్ని అనీ చెప్పలేను. అక్కడ నేను లేను, శూన్యమే ఉంది. సుషుప్తిలో నేను అనే వ్యక్తి లేడు, నాకొక వ్యక్తిత్వం లేదు. అసలు నాకు ఉనికే ఉన్నట్టు లేదు. అందువల్ల ఈ బోధలో నాకేం ఫలం కనబడటం లేదు. నాకీ జ్ఞానం వద్దు.

శుద్ధచైతన్యం వ్యవహారం నడపలేదు. నేను శుద్ధచైతన్యాన్ని అనీ చెప్పలేదు. అలా చెప్పాలంటే మనస్సు, ఇంద్రియాలు కావాలి. నేను ఆత్మను అని చెప్పలేని ఆత్మ ఉంది సుషుప్తిలో. నేను ఫలానా అని చెప్పగలిగిన అహంకారం పడుకుంది సుషుప్తిలో. ఇంత పెద్ద సాధన చేసేది నేను లేను అని తెలుసుకోవటానికా! ఉన్నది శూన్యం అని తెలుసుకోవటానికా! దీనివల్ల నాకేం ప్రయోజనం కనబడటం లేదు అనుకుంటాడు ఇంద్రుడు. అందువల్ల మళ్ళీ వెనక్కి వచ్చాడు.

అప్పటివరకూ ప్రజాపతి మూడు బోధలు చేశాడు. అక్షిపురుషుడు ఆత్మ, స్వప్నపురుషుడు ఆత్మ, సుప్తపురుషుడు ఆత్మ అని. మూడింటిలోనూ సమానంగా ఉన్న చైతన్యాన్ని తెలుసుకుంటాడనుకున్నాడు. కాని ఇంద్రుడు మూడింటిలోనూ విషయం గ్రహించలేదు. ఇంక మిగిలింది తురీయం. మూడు అవస్థల్లోనూ ఉండి, మూడింటికీ అతీతంగా ఉన్నది.

**అవస్థాత్రయ సాక్షిచైతన్యం.**

మాండూక్యోపనిషత్తులో దీనికే తురీయం పేరు వస్తుంది. **చతుర్థం మన్యంతే స ఆత్మాః.** ఈసారి తురీయం గురించి చెప్పేటప్పుడు ఇంకో 5 సంవత్సరాలు ఉండమన్నాడు ప్రజాపతి. మొత్తం 101 సంవత్సరాలు (32+32+32+5=101) ఉన్నాడు ఇంద్రుడు ఆత్మజ్ఞానం పొందటానికి.

## ఖండం 8.12

ఈ ఖండం చాలా ముఖ్యమైనది. ఆత్మ నిర్వచనం వస్తుంది ఇందులో.

**తదస్యామృతస్యాశరీరస్యాత్మనోऽధిష్ఠానమ్**

**ఆత్మనో అధిష్ఠానమ్** – ఈ నశించే శరీరం, నాశనం లేని ఆత్మకు అధిష్ఠానం. ఇక్కడ అధిష్ఠానం అంటే భోగ ఆయతనం. ఎటువంటి ఆత్మకు? అది చాలా ముఖ్యం.

**అశరీరస్య** – శరీరం లేని ఆత్మకు. చైతన్యానికి శరీరంతో సంబంధం లేదు. కాంతి నా చేతిమీద పడుతున్నది కాని అది నా చేతికి బంధింపబడి కాని, దానికి కట్టుబడి కాని,

దానితో సంబంధం ఉన్నది కాని కాదు. అలాగే ఆత్మ శరీరంలో ఉంది కాని దానికి శరీరంతో సంబంధం లేదు. శరీరానికి అనారోగ్యం వస్తే ఆత్మ అయిన నాకు రాదు. అందువల్ల నేను సదేహం కాదు. ఎప్పటికీ విదేహమే అని చెప్పగలగాలి. అందువల్ల **అశరీరస్య** ఒక ముఖ్యమైన పదం.

**అమృతస్య** – ఇంకొక ముఖ్య పదం. చైతన్యం నాలుగవ సూత్రం శరీరం మరణించినా, చైతన్యం ఉంటుంది. అలాగే 'నేను చైతన్యాన్ని, నాకు శరీరంతో సంబంధం లేదు, మనస్సుతో సంబంధం లేదు, రాగద్వేషాలతో సంబంధం లేదు. నేను నిత్యముక్త, అసంగ ఆత్మను,' అని అర్థం చేసుకోవాలి.

**సశరీరః** – నేను జీవుడిని అనుకుంటే ఎప్పటికీ ముక్తి పొందలేను. సశరీరం అంటే దేహ సంబంధం లేదా మనస్సంబంధం ఉంటే ఎప్పటికీ జీవితంలో ఒడిదుడుకులు ఉంటూనే ఉంటాయి. దీనికి పరిష్కారం ఏమిటి? శరీరం, మనస్సులకు అతీతంగా ఎదగటమే. దీనినే ఆంతర సన్న్యాసం అంటారు. ఆంతర సన్న్యాసం స్వీకరిస్తే భాష మారుతుంది. అంతకుముందు, నాకు సమస్య ఉంది అంటే ఇప్పుడు నా మనస్సుకు సమస్య ఉంది అనే స్థాయికి ఎదుగుతాము. ఆంతర సన్న్యాసం లేనిదే, మోక్షం సాధ్యం కాదు.

నేను అశరీరంగా ఎలా అవుతాను? దానికి ఆత్మహత్య చేసుకోనవసరం లేదు. త్రిపుటినుంచి ద్విపుటికి రావాలి. త్రిపుటి అంటే నేను, జగత్తు, ఈశ్వరుడు. మనం మామూలుగా ఉండేది త్రిపుటిలో. ద్విపుటిలో రెండే ఉన్నాయి. ఆత్మ, అనాత్మ. చైతన్యం ఆత్మ; శరీరం, మనస్సు అనాత్మ. నేను ఆత్మను అని సస్వరూపం తెలుసుకుంటే, అనాత్మ ప్రపంచంలో జరిగేవేవీ నన్ను బాధించవు. ఇది వేదాంతసూత్రాల్లో ఐదవ సూత్రం.

జీవుడుగా నేను ఎన్నటికీ మోక్షం పొందలేను. ఆత్మగా నేను నిత్యముక్తుడను. మోక్షం అనేది భవిష్యత్తులో జరగబోయే సంఘటన కాదు. అందుకని నేను జీవుడు భావననుంచి నేను ఆత్మను అనే నిజానికి రండి. త్రిపుటినుంచి ద్విపుటికి రండి. తమాషా ఏమిటంటే నేను అశరీరాన్ని అని చెప్పటానికి, నేను శరీరాన్ని వాడుతున్నాను. ఆత్మ శరీరంలో ఉన్నప్పుడు సశరీరంగా కనిపిస్తుంటుంది. కాని, నిజానికి అన్నివేళలా చైతన్యం అశరీరమే.

కాని చైతన్యం సశరీరంగా కనిపించటంవల్ల, ఉపాధికున్న పరిమితులను, ఇంద్రుడు చైతన్యానికి ఆపాదించాడు. పరిమితులు విధిస్తే దాన్ని విశ్వ, తైజస, ప్రాజ్ఞ అంటాము. పరిమితులు తీసేస్తే ఈ మూడూ తురీయమే. కాని ఇంద్రునికి అర్థం కాలేదు. అందువల్ల ఈసారి ప్రజాపతి ప్రత్యక్షంగా, స్పష్టంగా చెప్పాడు.

**ఆత్మ అశరీరం**

ఎవరైతే నేను ఆత్మను అని తెలుసుకుంటాడో అతను అశరీరుడు. ఎవరైతే నేను శరీరాన్ని అని అపోహ పడతాడో అతను సశరీరుడు. ఎప్పుడైతే నేను అశరీరుని అని అర్థం చేసుకుంటాడో అప్పుడు జగత్తును చూసి నువ్వు నన్నేమీ చేయలేవు అని ధీమాగా అనగలడు. జ్ఞానం పొందితే, ప్రియమోదాలు వదిలేసి, నేను బింబానందాన్ని అని తెలుసుకుంటాడు. దీనితో నాలుగు దశలూ అయిపోయాయి. విశ్వ, తైజస, ప్రాజ్ఞ, తురీయం. అవస్థాత్రయం వివేకం జరిగింది.

**అవస్థాత్రయ సాక్షి ఆత్మ.**

ఈ బోధ జరిగింది. దీని సారాంశం ఏమిటి? ముందేమో చైతన్యాన్ని శరీరంయొక్క విశేషణంగానో, లక్షణంగానో భావించటం జరగింది. ఇప్పుడు వేదాంతవిచారణద్వారా, బుద్ధిలో శరీరం వేరు, ఆత్మ వేరు అని విడదీసి చూడగలగటం వచ్చింది. నేను శరీరాన్ని, నాలో చైతన్యం ఉంది అనే దశనుంచి నేను చైతన్యాన్ని, నాలో అన్ని శరీరాలు ఉన్నాయి అనే దశకు రావటం జరిగింది. అలా మన వేదాంత విచారణ సశరీరంనుంచి అశరీరానికి సాగాలి. అది బాహ్యప్రయాణం కాదు, అంతః ప్రయాణం.

ఈ ప్రయాణం అర్థం కావటానికి ఉపనిషత్తు ఒక ఉదాహరణ ఇస్తున్నది. ఆకాశంలో వాయువు, మేఘం, మెరుపు, ఉరుము – నాలుగు ఉన్నాయి. ఈ నాలుగూ ఆత్మ. వాటికి శరీరం లేదు. మేఘాలకు రూపాలున్నట్టు కనిపిస్తాయి కాని వాటికి మనిషిలాగా అంగాలు లేవు. సర్వవ్యాపకమైన ఆకాశం శరీరంతో పోల్చబడింది. వాన కురవక ముందు అన్నీ ఆకాశంలో కలిసిపోయాయి. సూర్యభగవానుడు వాన కురిపిస్తాడు. వాన కురిసినప్పుడు ఆకాశంనుంచి వాయువు విడిగా, మేఘాలు విడిగా, ఉరుములు విడిగా, మెరుపులు విడిగా వస్తాయి. ఇవన్నీ ఆత్మ, ఆకాశం అనాత్మ. సూర్యభగవానుడు వానద్వారా ఆత్మ, అనాత్మ వివేకం చూపాడు.

ఇప్పుడు దీన్ని శరీరానికీ, ఆత్మకూ అన్వయిద్దాము. అజ్ఞానంలో ఉన్నప్పుడు ఆత్మ, అనాత్మ కలిసిపోయాయి. జ్ఞానసూర్యుడు గురువుద్వారా ఆత్మ–అనాత్మ వివేకం చూపాడు.

| | |
|---|---|
| వాయువు, మేఘం, ఉరుము, మెరుపులు | – ఆత్మ |
| ఆకాశం | – శరీరం |
| నిర్మల ఆకాశం (రెండూ కలిసిపోవటం) | – అజ్ఞాన అవస్థ |

అజ్ఞానికి ఆత్మ–అనాత్మ వివేకం లేదు.

జ్ఞానిపరంగా చూస్తే,

| | |
|---|---|
| వాయువు, మేఘం, ఉరుములు, మెరుపులు | – మూడు శరీరాలు మాత్రమే |
| ఆకాశం | – ఆత్మ |
| నిర్మల ఆకాశం | – నేను అశరీరం |

జ్ఞానికి ఆత్మ–అనాత్మ వివేకం ఉంది. అలా జ్ఞాని తన స్వస్వరూపంలో ప్రకటితమవుతాడు. ఏ విధంగా? నిత్యముక్త ఆత్మగా. 'అయితే ఎప్పుడు నిత్యముక్తి వస్తుంది?' అంటారు కొందరు. అంటే పదాలను అర్థం చేసుకోకుండా వాడేస్తూ ఉంటారు.

నేను ఆత్మను, నాకు రాగద్వేషాలు ఉన్నాయి అనటం ఎంత తప్పో, ఆలాంటిదే పై వాక్యం కూడా అంతే తప్పు. 'అయితే మోక్షం రావాలని కోరుకోకపోతే, మోక్షం వస్తుందా?' ఇంకో అర్థంలేని ప్రశ్న. వేదాంతం నువ్వు మోక్షం పొందననవసరం లేదు, ముందే పొందేశావు అంటుంది. వేదాంతం ఆత్మ అనుభవాన్ని ఇవ్వదు. నువ్వు ఆత్మవు, నువ్వు నిత్యముక్తుడవు అని తార్కికంగా విడమర్చి చెబుతుంది. ఆత్మను తురీయం అని మాండూక్యోపనిషత్తులో చూస్తాము. ఇక్కడ **ఉత్తమపురుషుడు** అంటుంది ఉపనిషత్తు. గీతలో కూడా ఉత్తమపురుషుడు అని వస్తుంది. ఉపనిషత్తు ఆత్మను ఉత్తమపురుషుడు అనటమే కాదు, ఉత్తమపురుషునితో ఐక్యం పొందిన జ్ఞానిని కూడా ఉత్తమపురుషుడు అంటున్నది. ఇక్కడితో బోధ అయిపోయింది.

ఇక్కడనుంచి ఫలం వస్తుంది. ఫలం – జీవన్ముక్తి, విదేహముక్తి. జీవన్ముక్తి పొందిన జ్ఞాని అంతటా తిరుగుతాడు. అంటే అన్ని శరీరాలూ ఆత్మ అయిన నాలో ఉన్నాయని అర్థం చేసుకుంటాడు. జీవన్ముక్తివల్ల లాభం ఏమిటి? జ్ఞాని ఒక వ్యక్తిగా ఆనందాల వెంట పరుగులు తీయడు. అందరూ ఆనందిస్తుంటే, అది తన ఆనందంగా భావిస్తాడు. తాతయ్య, బామ్మ ఇంటికి పిల్లలు, మనవళ్ళు, మనవరాళ్ళు వస్తే వారందిరినీ కళ్ళారా చూసే ఆనందిస్తారు. ఇంతకన్నా గొప్ప ఆనందం జ్ఞానిది. ఎందుకు? అతనిది వసుధైక కుటుంబం. ఆనందం వస్తువులో లేదు, నాలో ఉంది. అన్ని ఆనందాలు నావే అని అర్థం చేసుకుంటాడు. దీన్నే జీవన్ముక్తి అంటారు.

జ్ఞాని శరీరం కూడా వృద్ధాప్యానికి లోనవుతుంది. అనారోగ్యం పాలవుతుంది కాని అతను ఈ ఒక్క శరీరంమీద దృష్టి నిలపడు. అందువల్ల అతనికి జగత్తు సుందరమయం. జగత్తు విశ్వరూప అనాత్మ అని తెలుసుకుంటాడు. ఇంద్రుడు, ఇంద్రునిద్వారా తక్కిన దేవతలు ఈ తురీయ ఆత్మ గురించి నేర్చుకున్నారు. తురీయ ఆత్మే విశ్వ, తైజస, ప్రాజ్ఞ రూపంలో ఉందని నేర్చుకున్నారు. దీనివల్ల వారు పొందిన సర్వలోకాలను పొందారు, అన్ని భోగాలు పొందారు. బ్రహ్మ, బ్రహ్మజ్ఞానం నేర్పిస్తానని చాటింపు వేయించినప్పుడు ఈ రెండు ఫలాలూ

దక్కుతాయని చెప్పాడు. ఇప్పుడు ఈ జ్ఞానం పొందిన ఇంద్రుడు, దేవతలు పొందారు అని చెప్పి, వారే కాదు, ఎవరు నేర్చుకున్నా, వారు పూర్ణత్వం పొందుతారని చెబుతున్నది ఉపనిషత్తు. ఆ ప్రజాపతి ఎలా చాటింపు వేయించాడో, అదే పదాలతో ముగించింది ఉపనిషత్తు. దీనితో దహరవిద్య కూడా ముగిసింది. దహరవిద్యను ఈ అధ్యాయంలో 1-6 ఖండాలవరకూ సగుణబ్రహ్మరూపంలో చూస్తే, 7-12 వరకూ నిర్గుణబ్రహ్మవిద్యద్వారా చూశాము.

## ఖండాలు 8.13-8.15 - 3 కొన్ని ఆధ్యాత్మిక సాధనలు

ఇక్కడ్నుంచి కొన్ని చెదురు మదురు భావాలను చెబుతున్నది ఉపనిషత్తు. వేదాంతశాస్త్రంలో వీటిని ఖిలఖండాలు అంటారు.

### ఖండం 13 - ఉపాసకుని ప్రార్థన

ఈ ఖండంలో సగుణబ్రహ్మ ఉపాసకుడు చేసే ప్రార్థన. ముఖ్యంగా మరణ సమయంలో చేసే ప్రార్థన వస్తుంది. ఈశావాస్యంలోనూ, బృహదారణ్యకంలోనూ ఇటువంటి ప్రార్థనే చూస్తాము.

ఇక్కడ ఉపాసకుడు, 'నేను బ్రహ్మలోకంనుంచి మనుష్యజన్మను పొంది, ఈ లోకం వచ్చాను. ఇక్కడ బ్రహ్మ నా హృదయాకాశంలో ఉన్నాడు. నేను ఈ హృదయాకాశంనుంచి మళ్ళీ బ్రహ్మలోకానికి వెళ్ళాలి. ఉపాసనద్వారా పుణ్యం పొంది, పాపాన్ని తగ్గించుకుంటాను,' అంటున్నాడు. గుర్రం ఒక్కసారిగా రోమాలను విదిలించి, దుమ్ము దులుపుకున్నట్టుగా, నేను నా పాపాలనే దుమ్ము దులుపుకుంటాను. చంద్రుడు, రాహువు కోరలనుంచి తప్పించుకున్నట్టుగా, నేను కూడా పాపాలనే రాహువు కోరలనుంచి తప్పించుకుంటాను. నా ప్రారబ్ధకర్మ ముగిశాక, ఈ శరీరంనుంచి విడివడ్డాక, నేను కృతాత్మను అవుతాను అంటున్నాడు. అంటే ఉపాసనవల్ల మనస్సును శుద్ధి చేసుకుంటాను అంటున్నాడు.

ఇక్కడ ఒక విషయం గమనించాలి. హృదయాకాశంలో ఉన్న సగుణబ్రహ్మను **శ్యామ** అంటున్నది ఉపనిషత్తు. శ్యామ అంటే చీకటి. బ్రహ్మను చీకటితో ఎలా పోలుస్తున్నది? శంకరులవారు, మనష్యులకు బ్రహ్మ ఉన్నట్టే తెలియదు కాబట్టి చీకటితో సమానం అంటున్నారు.

### ఖండం 14 - ఉపాసకుని ప్రార్థన

శంకరభాష్యం లేనిదే, పరమార్థానంద స్వామీజీ బోధ లేనిదే ఈ మంత్రాలను అర్థం చేసుకోవటం చాలా కష్టం.

ఉపాసకుడు సగుణబ్రహ్మ ఉపాసన దహరాకాశంలో చేశాడు. కారణబ్రహ్మమీద ఉపాసన చేశాడు. అందువల్ల ముందు కారణబ్రహ్మ నిర్వచనం ఇస్తున్నది.

**ఆకాశో వై నామ** – ఉపనిషత్తు బ్రహ్మను ఆకాశం అంటున్నది ఇక్కడ. ఆకాశానికి ఉన్న ప్రకాశత్వాన్ని తీసుకోవాలి ఇక్కడ. అంతేకాదు, ఈ బ్రహ్మ సృష్టి, స్థితి, లయ కారణం అంటున్నది.

ఈ ఉపాసకుడు కారణబ్రహ్మ ఉపాసన జీవితాంతం చేస్తాడు. తన జీవిత చరమాంకంలో మళ్ళీ కారణబ్రహ్మకు క్రమముక్తికోసం ప్రార్థన చేస్తున్నాడు. నేను బ్రహ్మలోకానికీ, రాజసౌధం లాంటి సభాప్రాంగణంలోకి వెళ్ళుదును గాక! అక్కడికి వెళ్ళి బ్రహ్మజ్ఞానం పొంది, బ్రహ్మతో ఐక్యం పొందుదును గాక! జ్ఞానంద్వారా నేను ఆత్మను అని తెలుసుకోవాలి, నేను కీర్తిమంతులలో కీర్తిమంతుని అవుగాక అంటున్నాడు. అంటే జ్యోతిషాం జ్యోతి అయిన ఆత్మను అని తెలుసుకోవాలి.

## ఖండం 15 – రెండు సాధనలు

అందమైన ముగింపు మంత్రం. ఈ బోధ సాక్షాత్తూ భగవానునినుంచే గురుశిష్య పరంపరగా వచ్చింది. ఇందులో రెండు సాధనలు ఉన్నాయి.

1. సగుణబ్రహ్మ ఉపాసన – ఫలం క్రమముక్తి.
2. నిర్గుణబ్రహ్మజ్ఞానం – ఫలం జీవన్ముక్తి, విదేహముక్తి.

ఈ రెండింటిలో ఏది ఎన్నుకోవాలో నిర్ణయం మీ చేతులలో ఉంది.

సగుణబ్రహ్మ ఉపాసన, నిర్గుణబ్రహ్మజ్ఞానం – రెండూ బ్రహ్మ ప్రజాపతికి చెప్పాడు. 14 ప్రజాపతులు ఉన్నారు సృష్టి మొదట్లో. ప్రజాపతి మనువుకు చెప్పాడు. మనువు తన పిల్లలకు, తన శిష్యులకు చెప్పాడు. ఇదీ గురుపరంపర. ఈ విద్యని ఎలా నేర్చుకోవాలి? గురుకులానికి వెళ్ళి అభ్యసించాలి. బ్రహ్మచర్యంలో, గృహస్థాశ్రమంలో యజ్ఞయాగాదులు చేయాలి. వానప్రస్థాశ్రమంలో ఉపాసన చేసి, సన్న్యాసాశ్రమంలో జ్ఞానం పొందాలి.

ఒక వ్యక్తి ఈ ఆశ్రమ నియమాలను పాటించి సాధనలు చేసి, ఉపాసన చేసో, జ్ఞానం పొందితేనో ఏమవుతుంది?

**బ్రహ్మలోకమభిసంపద్యతే** – బ్రహ్మలోకానికి వెళతాడు. దీనికి రెండు అర్థాలు ఉన్నాయి.

సగుణబ్రహ్మ ఉపాసన చేస్తే బ్రహ్మలోకానికి వెళ్ళి, క్రమముక్తి పొందుతాడు.

నిర్గుణబ్రహ్మజ్ఞానం పొందితే, బ్రహ్మ చైతన్యంతో ఐక్యం పొంది జీవన్ముక్తి, విదేహముక్తి పొందుతాడు.

**న చ పునరావర్తతే న చ పునరావర్తతే**

ఏ విధంగా చూసినా బ్రహ్మలో ఐక్యం అవుతాడు. మళ్ళీ తిరిగిరాడు. మళ్ళీ రెండోసారి చెప్పటం ఉద్దేశ్యం ఇక్కడితో ఈ మంత్రం ముగిసింది. ఈ ఖండం ముగిసింది, ఈ అధ్యాయం ముగిసింది, ఉపనిషత్తే ముగిసింది.

**శాంతిపాఠం**

**ఓం ఆప్యాయన్తు మమాంగాని వాక్ప్రాణశ్చక్షుః శ్రోత్రమథో బలమింద్రియాణి చ సర్వాణి। సర్వం బ్రహ్మౌపనిషదం మాఽహం బ్రహ్మ నిరాకుర్యాం। మా మా బ్రహ్మ నిరాకరోదనిరాకరణమస్త్వనిరాకరణం మేఽస్తు। తదాత్మని నిరతే య ఉపనిషత్సు ధర్మాస్తే మయి సన్తు తే మయి సన్తు॥**

**ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

# ఏకాదశ ఉపనిషత్తుల సారం

## బృహదారణ్యకోపనిషత్ – అధ్యాయం 1

ఉపనిషత్తులలో ఆఖరిదీ, అత్యంత ముఖ్యమైనదీ అయిన బృహదారణ్యకోపనిషత్తులో అడుగు పెడుతున్నాము ఇప్పుడు.

**వేదం** – ఈ ఉపనిషత్తు శుక్లయజుర్వేదానికి చెందినది. ఈశావాస్యోపనిషత్తు కూడా ఈ వేదానికి చెందినది. ఈశావాస్యాన్ని మంత్రోపనిషత్తు అనీ, బృహదారణ్యకాన్ని బ్రహ్మణోపనిషత్తు అనీ అంటారు. బ్రహ్మణోపనిషత్తు అయిన బృహదారణ్యకాన్ని, మంత్రోపనిషత్తు అయిన ఈశావాస్యానికి భాష్యం అనీ అంటారు.

శుక్లయజుర్వేదానికి రెండు శాఖలు ఉన్నాయి. అవి కాణ్వశాఖ, మాధ్యందిన శాఖ. బృహదారణ్యకోపనిషత్తు రెండు శాఖల్లోనూ ఉంది. రెండు భిన్నశాఖల్లో ఉన్నా, చిన్న చిన్న భేదాలు తప్ప, రెండింటిలోనూ మంత్రాలు ఒకటే. ఈ రెండింటిలో శంకరాచార్యులవారు కాణ్వశాఖకు చెందిన బృహదారణ్యకోపనిషత్తుకు భాష్యం రాస్తే, స్వామీ విద్యారణ్యజీ మాధ్యందిన శాఖకు చెందిన బృహదారణ్యకోపనిషత్తుకు భాష్యం రాశారు. మనం శంకరాచార్యులవారు రాసిన భాష్యం ఆధారంగా ఈ ఉపనిషత్తును నేర్చుకుంటున్నాము.

**ఆ పేరెలా వచ్చింది?** ఒక కారణం, ఉపనిషత్తులను సాధారణంగా సన్యాసులు అధ్యయనం చేస్తారు. వారు సమాజాన్ని వదిలి, అరణ్యంలో నివసిస్తారు.

**అరణ్యే అధీయమనత్వాత్ ఆరణ్యకమ్**

అరణ్యం అంటే అడవి, అధీయతే అంటే నేర్చుకుంటారు. అరణ్యం అంటే అక్షరాలా అడవిలో ఉంటారని కాదు, సమాజానికి దూరంగా ఉండి, ఉపనిషత్తులను అధ్యయనం చేస్తారు. అందువల్ల ఆరణ్యకమనే పేరు వచ్చింది. బృహత్ అంటే చాలా పెద్దది అని అర్థం.

ఈ ఉపనిషత్తు చాలా పెద్దది అని రెండు కోణాల్లోంచి చెప్పవచ్చు. అది అన్నింటికన్నా చాలా పెద్ద ఉపనిషత్తు అవటమే కాక చాలా లోతైనది కూడా. బృహదారణ్యకోపనిషత్తు ప్రత్యేకత ఏమిటంటే, అందులో అన్ని ఉపనిషత్తులలో ఉన్న అంశాలు ఉండటమే కాదు, తక్కిన వాటిల్లో లేని ప్రత్యేక అంశాలు కూడా ఉన్నాయి. ఈ ఉపనిషత్తులో 434 మంత్రాలు ఉండటంవల్ల అది బృహత్ అయింది.

నిజానికి ఛాందోగ్యోపనిషత్తులో 627 మంత్రాలున్నాయి. మంత్రపరంగా చూస్తే ఛాందోగ్యోపనిషత్తు దీనికన్నా పెద్దది. కాని దీన్ని ఛాందోగ్యోపనిషత్తుకన్నా పెద్ద ఉపనిషత్తు అని రెండు కారణాలవల్ల చెప్పవచ్చు. ఒకటి, మంత్రాల సంఖ్య తక్కువ ఉన్నా, మంత్రాలు చాలా పెద్దవి. ఇంకొకటి, శంకరాచార్యులవారి భాష్యం ఛాందోగ్యభాష్యంకన్నా రెట్టింపు ఉంటుంది. దానికి కారణం ఛాందోగ్యంలో జ్ఞానభాగం బృహదారణ్యకంకన్నా తక్కువ. మొదటి ఐదు అధ్యాయాలు పూర్తిగా ఉపాసనలకు కేటాయించబడ్డాయి. వాటికి శంకరులవారి భాష్యం ఎక్కువగా ఉండదు.

అదే బృహదారణ్యకానికి వచ్చేసరికి, అందులో జ్ఞానకాండ, కర్మకాండ కలగలిపి ఉంటాయి. అందువల్ల శంకరాచార్యులవారి భాష్యం వీటిమీద చాలా విస్తారంగా ఉంటుంది. శంకరులవారి ఉపనిషత్తుల భాష్యాలలో, బృహదారణ్యకోపనిషత్తుయొక్క భాష్యం ఒక మాగ్నమ్ ఓపస్. బ్రహ్మసూత్రాల భాష్యంతో ధీటుగా నిలిచింది.

రెండు ఉపనిషత్తులూ గద్యభాగంలో ఉంటాయి. ఛాందోగ్యోపనిషత్తులో ఉపాసన అధ్యాయాలు వేరుగా ఉంటాయి కాబట్టి, అవి వద్దనుకుంటే, 6–8 అధ్యాయాలు మాత్రం అధ్యయనం చేస్తే చాలు. జ్ఞానయోగం వీటిల్లో వచ్చేస్తుంది. కాని బృహదారణ్యకంలో అలా విడదీయలేము కాబట్టి, మొత్తం అంతా అధ్యయనం చేయాల్సిందే.

**అధ్యాయాలు, మంత్రాలు** – బృహదారణ్యకోపనిషత్తులో ఆరు అధ్యాయాలు ఉన్నాయి, 434 మంత్రాలు ఉన్నాయి. మళ్ళీ ఈ ఆరు అధ్యాయాలనూ మూడు కాండలుగా పేర్కొంటారు. వాటి వివరాలు –

1. ఉపదేశకాండము – మధుకాండము – అధ్యాయాలు 1, 2
2. ఉపపత్తికాండము – మునికాండము – అధ్యాయాలు 3, 4
3. ఉపాసనకాండము – ఖిలకాండము – అధ్యాయాలు 5, 6

ఉపదేశకాండంలో ఉపదేశం ప్రధానంగా ఉంటుంది. దీన్ని మధుకాండం అని కూడా అంటారు. ఎందుకంటే అందులో మధుబ్రాహ్మణం ఉంది.

ఉపపత్తికాండంలో తర్కం ప్రధానంగా ఉంటుంది. ఇది మనన ప్రధానంగా కూడా ఉంటుంది. రెండు అధ్యాయాల్లోనూ యాజ్ఞవల్క్య ముని పాత్ర ప్రధానంగా ఉంటుంది. అందువల్ల మునికాండం అని కూడా అంటారు.

ఉపాసన కాండంలో ఉపాసన ప్రధానంగా ఉంటుంది. ఖిల అంటే భిన్న అంశాలు. ఇందులో భిన్న అంశాలు ఒకచోట ఉండడంవల్ల దీన్ని ఖిలకాండం అని కూడా అంటారు.

దీన్ని అనేక కూరలు వేసి చేసే అవియల్ కూరతో పోల్చవచ్చు. ఆరు అధ్యాయాల సారాంశాన్ని చూద్దాము. ఇప్పుడు మొదటి అధ్యాయాన్ని చూద్దాము.

**శాంతిపాఠం** – అన్ని ఉపనిషత్తులలాగే, ఈ ఉపనిషత్తుకూ శాంతిపాఠం ఉంది. శుక్లయజుర్వేదానికి శాంతిపాఠం ఓం పూర్ణమదః పూర్ణమిదం. దీని వివరణ ఈశావాస్యోపనిషత్తులో కూడా చూశాం. ఇప్పుడు టూకీగా చూద్దాము.

**ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే।**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే ॥**
**ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

మాములుగా శాంతిపాఠంలో శరీరపరంగా విఘ్నాలు కలుగకుండా తొలగించమనీ, మన ఇంద్రియాలు ఆరోగ్యకరంగా ఉండి, బ్రహ్మవిద్య నేర్చుకునేందుకు అనువుగా ఉండాలనీ ప్రార్థిస్తాము. కాని ఈ శాంతిపాఠంలో వేదాంతసారం అంతా వచ్చేస్తుంది.

**పూర్ణమదః పూర్వమిదం** – అది పూర్ణం, ఇది పూర్ణం. అంటే బ్రహ్మ, జీవుడు ఇద్దరూ పూర్ణం. మహావాక్యం వచ్చేసింది – జీవ, ఈశ్వరులు ఏకం.

**పూర్ణాత్ పూర్ణముదచ్యతే** – పూర్ణంనుంచి పూర్ణం వచ్చింది. బ్రహ్మ జగత్కారణం, జగత్తు కార్యం – జీవ, ఈశ్వరుల మధ్య కార్యకారణ సంబంధం ఉంది.

**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే** – పూర్ణంలోంచి పూర్ణం తీసేస్తే పూర్ణమే మిగులుతుంది. జీవ, జగత్తులనుంచి ఆత్మను విడదీస్తే, అనాత్మకు ఉనికి లేదు.

బ్రహ్మ సత్యం జగన్మిథ్యా

ఇలా వేదాంతసారాన్ని చెప్పే శాంతిపాఠాన్ని వస్తునిర్దేశప్రార్థన అంటారు. వస్తునిర్దేశం అంటే వేదాంతసారాన్ని ఒక్క మంత్రంలోకి కుదించటం.

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః**

## అధ్యాయం 1

మొదటి కాండంలోని మొదటి అధ్యాయం ఇది. ఈ అధ్యాయంలో 6 ఖండాలున్నాయి. ఇక్కడ ఖండాలను బ్రాహ్మణాలు అంటారు. మొదటి అధ్యాయంలో 80 మంత్రాలు ఉన్నాయి. ఈ బ్రాహ్మణాలకు పేర్లు ఉన్నాయి. ఆ బ్రాహ్మణాలు చూస్తూ వద్దాము.

## 1.1. అశ్వమేధ బ్రాహ్మణము

ఇందులో విరాట్ ఉపాసన చూస్తాము. గీతలో విశ్వరూప దర్శనం చేశాము. ఇక్కడ విరాట్ ఉపాసనలో కూడా భగవంతునిమీద ఉపాసన చేస్తాము. భగవంతుని విశ్వరూపాన్ని చూడలేము కాబట్టి, ఆలంబనగా ఒక అశ్వాన్ని లేదా గుర్రాన్ని సూచిస్తున్నది ఉపనిషత్తు. దీన్ని **అశ్వే విరాట్ ఉపాసన** అంటారు. ఇందులో గుర్రంలో ఒక్కొక్క భాగాన్ని, విశ్వంలో ఒక్కొక్క భాగంతో పోల్చి ఉపాసన చేస్తారు. అశ్వంయొక్క 25 భాగాలను తీసుకుని, ఒక్కొక్క భాగాన్ని విరాట్‌యొక్క ఒక్కొక్క అంశంతో పోలుస్తుంది ఉపనిషత్తు.

ఉదాహరణకు అశ్వంయొక్క తల ఉషోదయం; కన్ను సూర్యుడు; ప్రాణం గాలి; నోరు వైశ్వానర అగ్ని; శరీరం కాలం. అశ్వమేధయాగాన్ని కేవలం క్షత్రియులు లేదా రాజులే చేయాలి. తక్కిన వర్ణాలవారు చేయలేరు. వారు ఈ ఉపాసన చేస్తే అశ్వమేధయాగం చేసిన ఫలం వస్తుంది. దీనికి కలిగే ఫలం హిరణ్యగర్భపథప్రాప్తి.

## 1.2. అగ్ని బ్రాహ్మణము

అగ్ని అంటే మామూలు అగ్ని కాదు. ఇది కూడా అశ్వమేధ యాగానికి చెందిన అగ్ని. ఈ యాగం కూడా క్షత్రియుడు మాత్రమే చేయగలడు కాబట్టి తక్కిన వర్ణాలవారు అగ్ని ఉపాసన చేయవచ్చు. అగ్నిని కూడా విరాట్‌గా భావించి ఉపాసన చేయాలి. ఉపాసన ఒకటే, ప్రతీక మారింది అంతే. దీన్ని **అగ్నౌ విరాట్ ఉపాసన** అంటారు.

అగ్నియొక్క పది దిక్కులను విరాట్‌యొక్క పది అంశాలతో పోలుస్తారు. అగ్ని తూర్పుదిక్కు– విరాట్ తల; పడమరదిక్కు – విరాట్ కింది భాగము; ఉత్తర, దక్షిణ దిక్కులు – విరాట్ ప్రక్కభాగాలు, ఇలా సాగుతుంది.

## 1.3. ఉద్గీథ బ్రాహ్మణము

ఈ బ్రాహ్మణంలో ప్రాణ ఉపాసన చూస్తాము. ప్రాణం అంటే సమష్టి ప్రాణం లేదా హిరణ్యగర్భ. ప్రాణానికి కొన్ని గుణాలను ఆపాదించి ఆ గుణాలమీద ఉపాసన చేయాలి. దీన్ని **గుణవిశిష్ట ప్రాణ ఉపాసన** అంటారు.

ఎ) **ప్రాణం గొప్పతనం – విశుద్ధత్వం** – ప్రాణం ప్రతి ఒక్కరిలోనూ శుద్ధంగానే ఉంటుంది. అది నేరస్థునిలోనైనా, సాధువులోనైనా కూడా, అతని ఇంద్రియాలను, అంతఃకరణనుబట్టి, మంచివాడో, చెడ్డవాడో నిర్ణయిస్తారు. ప్రాణం మాత్రమే శుద్ధం. అందుకే ప్రాణ ఉపాసన చేస్తే, అతన్ని చెడు ఏమీ చేయలేదు. దీనికి ఒక కథ చెబుతారు.

ఇంద్రియాలు ప్రాణ ఉపాసన చేయటం మొదలుపెట్టగానే వాటిలో ఉన్న అసురులు వాటిని ఉపాసన చేయనీయకుండా అడ్డుపడ్డాయి. అంటే వాటిలో చెడు ఆలోచనలు కలుగజేశాయి; చెడు పనులను చేయించాయి; చెడు వస్తువులు చూపించాయి. తరువాత ప్రాణం ఉపాసన మొదలు పెట్టగానే అసురులు ప్రాణంమీదకు కూడా వచ్చారు. కానీ ఈసారి వారు ప్రాణశక్తిని ఏమీ చేయలేకపోగా వారే నాశనమయ్యారు. అందువల్ల ప్రాణం–విశుద్ధం.

బి) **అంగిరసత్వం** – అంగిరసః అంటే అంగాలకు రసం. అంగాలన్నింటికీ మూలమైనది. అందువల్ల ప్రాణం శ్రేష్ఠం అని కూడా అంటారు. తక్కిన అంగాలు ఉన్నా లేకపోయినా మనిషి ఉంటాడు; కాని ప్రాణం లేకపోతే మనిషి శవం అవుతాడు. ఎవరైనా మరణిస్తే అతని ప్రాణం పోయింది అంటాము కాని ఇంద్రియాలు పోయాయి, మనస్సు పోయింది అనము. ఇవి కాక ప్రాణానికి మరికొన్ని గుణాలు ఉన్నాయి. అవి దూర్నామత్వం, భర్తృత్వం, ఉద్గీథ.

సి) **దూర్నామత్వం** – దూర్ అంటే దూరం. ప్రాణం అశుద్ధత్వానికి దూరంగా ఉంది కాబట్టి, దూర్నామత్వమనే పేరు వచ్చింది.

డి) **భర్తృత్వం** – భర్తృత్వం అంటే అన్నింటినీ భరించేది. ప్రాణం అన్ని ఇంద్రియాలకూ ఆధారం; అన్నింటినీ రక్షిస్తుంది.

ఇ) **ఉద్గీథ** – ఉద్గీథ అంటే సామవేదాలలో గానం చేసే ఓంకారం. హెచ్చుస్థాయిలో గానం చేస్తారు కాబట్టి ఉద్గీథ అయింది. వాక్కుతో కూడిన ప్రాణం సామగానంలోని ఓంకారం అంటున్నది ఉపనిషత్తు.

ఈ గుణాలతో కూడిన ప్రాణానికి ఉపాసన చేస్తాము కాబట్టి దీన్ని **గుణవిశిష్ట ప్రాణ ఉపాసన** అంటారు.

ఈ ఉపాసనకు జపం జోడిస్తే, పూర్తి ఫలం కలుగుతుంది అంటున్నది ఉపనిషత్తు.

**అసతో మాసద్గమయ తమసో మాజ్యోతిర్గమయ, మృత్యోర్మా అమృతం గమయ**

ఈ సందర్భంలో ఈ జపం అర్థం ఇలా వస్తుంది.

**అసతో మాసద్గమయ** – ఓ దేవా, నన్ను తప్పు కర్మనుంచి సరియైన కర్మకు, తప్పు ఉపాసననుంచి సరియైన ఉపాసనకు తీసుకువెళ్ళు.

**మృత్యోర్మా అమృతం గమయ** – శాస్త్రీయకర్మ, ఉపాసనల అజ్ఞానంనుంచి శాస్త్రీయకర్మ, ఉపాసనల జ్ఞానానికి తీసుకువెళ్ళు.

**తమసో మా జ్యోతిర్గమయ** – నేను సరియైన కర్మ, సరియైన ఉపాసన చేస్తే నాకు హిరణ్యగర్భ పథం పొందేలా చేయి.

ఈ ప్రార్థన ప్రాణాన్ని ఉద్దేశిస్తూ చేసేది. ఇక్కడ ప్రాణం అంటే హిరణ్యగర్భ.

## 1.4. బ్రహ్మవిద్యా బ్రాహ్మణము

దీన్ని పురుషవిధ బ్రాహ్మణము అని కూడా అంటారు. ఎందుకంటే,

**ఆత్మైవేదమగ్ర ఆసీత్ పురుషవిధః**

అని వస్తుంది మొదటి మంత్రంలో. ఈ బ్రాహ్మణములో ఏడు అంశాలు ఉన్నాయి.

1) **ఉపాసన ఫలం** – హిరణ్యగర్భ ఉపాసన చేస్తే అన్నింటికన్నా ఉత్తమమైన ఫలం వస్తుంది నిజమే. ఆ ఫలం హిరణ్యగర్భ పథం. గొప్ప కర్మలు, గొప్ప ఉపాసనలు చేస్తే, దానికి గొప్ప ఫలాలు వస్తాయని చూపటానికి అత్యుత్తమ ఫలాన్ని చెబుతున్నది. కాని హిరణ్యగర్భ పదవి కూడా సంసారంలోకే వస్తుందని హెచ్చరిస్తున్నది కూడా. అది సూచించటానికి హిరణ్యగర్భకు కూడా భయం కలిగిందని చెబుతున్నది. తను పుట్టినప్పుడు 'ఏకాకి'గా ఉన్నాడు. తను ఒంటరిగా ఉండటంవల్ల భయపడ్డాడు. కాని ఇక్కడ అక్షరలక్షలు చేసే మంత్రం వస్తుంది.

**ద్వితీయాద్వై భయం భవతి**

రెండోది ఉంటేనే భయం వస్తుంది. తను కాకుండా వేరే ఎవరూ లేరనే జ్ఞానంవల్ల హిరణ్యగర్భకు భయం పోయింది. అద్వైతసిద్ధాంతంలో ఈ వాక్యాన్ని తరచు ఉటంకిస్తారు. హిరణ్యగర్భ ఒంటరిగా ఉండటంవల్ల తన ఆనందంకోసం ఈ జగత్తునంతా సృష్టించాడు. ఇది రెండవ అంశంలోకి దారితీస్తుంది. ఇది వేదాంతంలోని అంశం.

2) **సృష్టి ప్రకరణం** – హిరణ్యగర్భ తను అసంపూర్తిగా ఉన్నానని, తనకొక తోడు కావాలనీ సృష్టించాడు. అందువల్ల హిరణ్యగర్భే మనుష్యజంటగా ఉద్భవించాడు. ఒకరినొకరు కౌగలించుకుని ఉన్నట్టుగా ఉద్భవించాడు. తన శరీరాన్ని రెండుగా పడేటట్టుగా చేశాడు. శంకరులు వారిని మనువు, శతరూప అని అన్నారు. వీరిద్దరూ రెండు చెక్కలుగా ఉన్న ఒక పప్పులా ఉన్నారు.

హిరణ్యగర్భ సృష్టిని నాలుగు విభాగాలుగా చేశాడు. మనుష్యసృష్టి, పశ్వాదిసృష్టి, దైవసృష్టి, అన్న–అన్నాదసృష్టి. సృష్టి ఆయన గొప్పదనానికి నిదర్శనం అయితే, సృష్టికారణం ఆయన సమస్యను చూపుతున్నది. తోడుకోసం సృష్టిచేశాడు.

ఈ సృష్టిని **నామరూపవ్యాకరణం** అంటారు. అవ్యక్తంనుంచి వ్యక్తంలోకి రావటమే సృష్టి. వ్యక్తంలోకి నామరూపాలద్వారా వస్తుంది.

3) **అనుప్రవేశ శ్రుతి** – ఇది చాలా ముఖ్యమైన అంశం. దీనికి శంకరులవారు చాలా వివరంగా భాష్యం రాశారు.

**తద్ధేదం తర్హ్యవ్యాకృతమాసీత్ । స ఏష ఇహ ప్రవిష్టః ।**

అవ్యక్తంలో ఉన్న జగత్తుకు నామరూపాలు ఇచ్చి తరువాత పరమాత్మే అనుప్రవేశం చేశాడు. జీవాత్మరూపంలో పరమాత్మ ఉన్నాడు. పరమాత్మ సాక్షిరూపంలో మనస్సు వెనక అందుబాటులో ఉన్నాడని అర్థం. స్వప్నప్రపంచాన్ని మనం సృష్టించి, స్వప్నశరీరంతో మనమే దానిలోకి అడుగుపెట్టినట్టుగా, పరమాత్మ జగత్తును సృష్టించి దానిలోకి జీవాత్మగా అనుప్రవేశం చేశాడు. స్వప్నప్రపంచంనుంచి లేస్తే జాగ్రత్ పురుషునికి తనే సృష్టించి, తనే అందులోకి అనుప్రవేశం చేసినట్టు తెలుస్తుంది. అలాగే పారమార్థిక స్థాయికి లేస్తే బ్రహ్మగా నేను ఈ జాగ్రత్ ప్రపంచాన్ని సృష్టించి, అందులో అనుప్రవేశం చేశానని తెలుస్తుంది.

**అహమేవ సృష్టిః**

సృష్టి మొత్తం జరిగాక, హిరణ్యగర్భ నేనే మొత్తం జగత్తురూపంలో ఉన్నాను; నేను మనుశతరూపలనయ్యాను; నేనే పశువులనయ్యాను; నేనే దేవతలనయ్యాను; నేనే అన్నం అన్నాదం అయ్యాను అనుకున్నాడు. అందువల్ల ఎవరైతే హిరణ్యగర్భ ఉపాసన చేస్తారో, వారు సృష్టికర్తతో మమేకం చెందుతారు.

4) **విద్యాసూత్రం** –

**ఆత్మేత్యేవోపాసీత – ఆత్మా ఇతి ఏవ ఉపాసీత।।** – 1. 4. 7

ఈ మంత్రం చాలా ముఖ్యమైన మంత్రం. దీన్ని విద్యాసూత్రం అంటారు. ఇందులో మహావాక్యం వస్తుంది. ఇది ఈ ఉపనిషత్తులో రాబోయే తక్కిన మహావాక్యాలకు పునాది. అందువల్ల దీన్ని ముఖ్యమహావాక్యం అంటారు.

దీని అర్థం బ్రహ్మను ఆత్మగా తెలుసుకో. బ్రహ్మ అంటే జగత్ కారణమైన బ్రహ్మ. ఆ బ్రహ్మ జగత్తుకు ముందు ఉన్నాడు; జగత్తును సృష్టించాడు; జగత్తులో అనుప్రవేశం చేశాడు. ఇంద్రియాలకు భిన్నంగా ఉండి, సాక్షిచైతన్యంగా జీవిలో ఉన్నాడు. దీన్ని ఉపక్రమ వాక్యం అంటారు. ఉపసంహారం ఈ బ్రాహ్మణం చివర్లో నేతినేతి వాక్యాలతో వస్తుంది. అందువల్ల ఇది విద్యాసూత్రం అయింది.

5) **ఆత్మ అన్నింటికంటే ప్రియమైనది –**

**ఆత్మానమేవ ప్రియముపాసీత** – 1.4.8

ఇది కూడా చాలా ముఖ్యమైన మంత్రం. ఈ మంత్రం సారాంశం ఆత్మ అన్నింటికంటే ప్రియతమమైనది. ఆత్మ అంటే పరమాత్మకు భిన్నంగా లేని ఆత్మ. ఆత్మ అన్నింటికన్నా ఎలా ప్రియతమమైనది? వేదాంతం ప్రకారం అందరూ సమానంగా ప్రేమించేవి రెండే విషయాలు. ఇవి తిరుగులేని నిజాలు. అవి సుఖం, సుఖసాధనం. ఈ సూత్రంలో మనం గ్రహించాల్సిన విషయం – మనం మనను తప్ప ఎవరినీ ప్రేమించలేము. ఈ వాదన మన నమ్మకాలను కూకటివేళ్ళతో పెకళించి వేస్తుంది. మనం పెద్ద అఘాతంలో కూరుకుపోయినట్టు ఉంటుంది. కాని ఇది నిజం. కాని జ్ఞాని అందరినీ బేషరతుగా ప్రేమిస్తాడంటుంది ఉపనిషత్తు. అదెలా సాధ్యం? జ్ఞాని ప్రేమ సార్వజనీన ప్రేమ కాబట్టి.

ఇక్కడ ఉపాసీత అంటే జ్ఞానం. ఆత్మ మాత్రమే ప్రియమైనది అనే జ్ఞానం పొందాలి. ఆత్మజ్ఞానం పొందితే పూర్ణత్వభావన వస్తుంది. నేను పూర్ణుణ్ణి అనే జ్ఞానం పొందితే ఇంక దుఃఖం ఎలా ఉంటుంది? కాబట్టి జ్ఞాని ప్రేమ, స్వార్థంతో కూడినది కాదు. జ్ఞాని శత్రువును కూడా ప్రేమిస్తాడు, అనాత్మగా కాదు; ఆత్మగా!

ప్రపంచంలో ఎవరిని ప్రేమించినా అది షరతులతో కూడినది. మనను మాత్రమే బేషరతుగా ప్రేమిస్తాము. దీన్ని మైత్రేయీ బ్రాహ్మణంలో ఇంకా వివరంగా చూస్తాము. ఇప్పుడు జ్ఞానఫలం పూర్ణత్వం అని గుర్తుంచుకుంటే చాలు.

6) **మహావాక్య మంత్రం** – పేరెన్నికగన్న నాలుగు మహావాక్య మంత్రాలలో పేరెన్నికగన్న బృహదారణ్యకంలో ముఖ్యమైన అహం బ్రహ్మ అస్మి మహావాక్యం వస్తుంది.

**బ్రహ్మ వా ఇదమగ్ర ఆసీత్। తదాత్మానమేవావేత్। అహం బ్రహ్మాస్మీతి। తస్మాత్తత్సర్వమ భవత్** – 1.4.10

**అగ్రే** – మామూలుగా అగ్రే అంటే సృష్టికి పూర్వం. కాని ఇక్కడ అజ్ఞాన అవస్థలో ఉన్నప్పుడు అని అర్థం.

**బ్రహ్మ వా ఆసీత్** – బ్రహ్మ మాత్రమే ఉన్నాడు. ఎలా ఉన్నాడు?

**ఇదమ్** – జీవాత్మ చైతన్యంగా ఉన్నాడు. బ్రహ్మే జీవాత్మరూపంలో ఉన్నాడు.

**తదాత్మానమ్ ఆవేత్** – బ్రహ్మ తన గురించి తెలుసుకున్నాడు.

**ఏవ** – తనను తాను. అంటే శరీరవ్యతిరిక్త ఆత్మను. ఏం తెలుసుకున్నాడు?

**అహం బ్రహ్మ అస్మి ఇతి** – నేను బ్రహ్మను, అజ్ఞాన అవస్థలో ఉండి, సంసారి జీవిగా కనబడుతున్న నేను, సాక్షాత్తూ బ్రహ్మనే.

**తస్మాత్ సర్వమ్ అభవత్** – అందువల్ల. అంటే అహం బ్రహ్మ అస్మి జ్ఞానం పొందటంవల్ల బ్రహ్మ సర్వం తానే అయ్యాడు. ఇంకో విధంగా చెప్పాలంటే సర్వాత్మభావనను పొందాడు. బ్రహ్మ తనను తాను తెలుసుకున్నాడు అంటే తన గురించి తప్పుగా అనుకున్న భావనను తొలగించుకున్నాడు అని అర్థం.

జీవాత్మ పదం వాడుతున్నాము కాని, జీవాత్మ అంటే వేరే ఎవరో కాదు. అక్షరాలా పరమాత్మే. ఇది అవస్థా భేదమే కాని వస్తుభేదం కాదు. ఆ విధంగా జీవాత్మ, పరమాత్మ ఐక్యం చెప్పబడింది ఈ మంత్రంలో. ఈ మహావాక్యం కొందరు సాధకులు ఒకచోట చేరి బ్రహ్మ గురించి చర్చ చేసుకున్న సందర్భంలో వస్తుంది.

జి) **అవిద్యాసూత్రం** – సః దేవానాం పశుః – దీన్ని అవిద్యాసూత్రం అంటారు. ఇంతకు ముందు జ్ఞాని స్తుతి జరిగింది. అతను ఏ దేవతకూ దాసోహం అవడు. దేవతలు కూడా అతనికి అడ్డుపడలేరు. ఇప్పుడు అజ్ఞాని గురించి చెబుతున్నది ఉపనిషత్తు. అజ్ఞాని ఎప్పటికీ సంసారిగా ఉంటూ, జననమరణ వృత్తాలలో పడి కొట్టుమిట్టాడుతూ ఉంటాడు. అంతేకాక ఒకవేళ అతను జ్ఞానం పొందాలనుకున్నా కూడా దేవతలు అతనికి ఆటంకం కలిగిస్తుంటారు.

**అథయోఽన్యాం దేవతాముపాస్తేఽన్యోఽసావన్యోఽహమస్మీతి న స వేద**

– 1.4.10

ఎవరైతే తనకూ, దేవతలకూ మధ్య భేదభావాన్ని చూస్తారో, వారు అజ్ఞానులు. అసౌ అంటే తను పూజించే దేవత. అన్యః అంటే తనకు భిన్నంగా ఉంది; అన్యోహమస్మి ఇతి – నేను ఆ దేవతకు భిన్నంగా ఉన్నాను; యః అన్యం దేవతాముపాస్తే – అలా భేదబుద్ధితో ఎవరైతే ఉపాసన చేస్తారో, సః న వేద – అతను మూఢుడు. అటువంటివారికి ఉపనిషత్తు ఒక కొత్త బిరుదుని ఇస్తున్నది.

**సః దేవానాం పశుః**

భేదబుద్ధితో పూజ చేసినవాడు దేవతలకు పశువు అంటున్నది ఉపనిషత్తు. పశువులతో పోల్చటం అమానుషం కాబట్టి, అలా ఎందుకు చెప్పిందో ఉపనిషత్తే వివరిస్తున్నది.

అనేక జంతువులు మనుష్యులకు సేవ చేస్తాయి. వాటికోసం అవి ఏమీ చేసుకోవు. అలాగే మనుష్యులు, దేవతలకు పశువులలాగా సేవలు చేస్తారు. అనేక యజ్ఞాలు చేస్తారు.

గృహస్థులుగా మనమేం చేస్తాం? మన పనివారు మనను విడిచి వెళ్ళకూడదనుకుంటాము. వారికి ఇంతకన్నా మంచి ఉద్యోగం రాకూడదనుకుంటాము. అలాగే దేవతలు కూడా మనం పూజలు మానేసి, జ్ఞానానికి వెళ్ళటానికి ప్రయత్నిస్తే, మనకు అనేక ఆటంకాలను కలిగిస్తారు. ఒక్క వ్యక్తి పూజ చేయటం ఆపినా, ఒక్క వ్యక్తి వేదాంతం క్లాసుకు వెళ్ళినా దేవతలకు ఇష్టం ఉండదు. అది అప్రియం అవుతుంది. వారికి సేవ చేసే పశువులవంటి మనుష్యులు తగ్గిపోతారు. అందువల్ల వారు ఆటంకాలు కలుగజేస్తారు. ఈ వాక్యం ఎవరు చెబుతున్నారు? సాక్షాత్తూ ఉపనిషత్తే చెబుతున్నది.

అవిద్యాసూత్రం సారాంశం, కర్మకాండకు మాత్రమే అంకితమయి, కర్మకాండ ముఖ్యం అనుకునేవారు మూఢులు, వారు దేవతలకు పశువులు. దీన్ని అవిద్యాకామకర్మ అంటుంది శాస్త్రం.

**వర్ణాశ్రమ ధర్మాలు** – ఈ అంశం అవిద్యాసూత్రంమీద వ్యాఖ్యానం. అంటే దేవానాం పశుః మీద వ్యాఖ్యానం. ఎప్పుడైతే కర్మకాండ గురించి వస్తుందో, అప్పుడు వర్ణాశ్రమధర్మం గురించి చర్చ వస్తుంది. ఇక్కడ వర్ణసృష్టి చూస్తాము. ముందుగా దేవతలలో వర్ణాల సృష్టి గురించి వస్తుంది. దేవతలలో నాలుగు వర్ణాలు – దేవబ్రాహ్మణులు, దేవక్షత్రియులు, దేవవైశ్యులు, దేవశూద్రులు.

వర్ణాశ్రమ కర్మ అనుష్ఠానం చేయటానికి నాలుగు వర్ణాలు సృష్టించబడ్డాయి. ఆ విధంగా వారు దేవతలకు పశువులు అయ్యారు. ఎంత గొప్ప కర్మలు చేసినా కూడా వారు మోక్షం పొందలేరు. మళ్ళీ విద్యాసూత్రానికి వస్తాము. ఆత్మేత్యేవోపాసీత. ఆత్మజ్ఞానం పొందితేనే మోక్షం పొందుతారు.

**పంచమహాయజ్ఞాలు** – మళ్ళీ దేవానాం పశుః విషయంలోకి వస్తున్నాము. 16వ మంత్రంలో ఉపనిషత్తు మరో అడుగు ముందుకు వేసి, అజ్ఞాని దేవతలకే పశువు కాదు, అందరికీ పశువు అంది. అతను శాస్త్రం ప్రకారం, అందరికీ ఋణపడి ఉన్నాడు. వారికి సేవ చేయటం ద్వారా, ఆ ఋణం తీర్చుకోవాలి. అంటే అతను పంచమహాయజ్ఞాలు చేయాలి. అవి దేవయజ్ఞం, ఋషియజ్ఞం, పితృయజ్ఞం, మనుష్యయజ్ఞం, పశుయజ్ఞం.

ఆత్మజ్ఞానం సంసారబంధంనుంచి తొలగించి, మోక్షాన్నిచ్చేటట్టయితే, ఎందుకు అందరూ ఆత్మజ్ఞానానికి వెళ్ళరు? దానికి జవాబు కామం అంటున్నది ఉపనిషత్తు. బ్రహ్మచారీ అజ్ఞాని, భార్య, పిల్లలు, మనుష్యవిత్తం, దైవవిత్తం కావాలనుకుని పెళ్ళి చేసుకుంటాడు. చివరికి దేవతలకు పశువుగా మారుతున్నాడు. దీనితో నాలుగవ బ్రాహ్మణము అయిపోయింది.

## 1.5. సప్తాన్న బ్రాహ్మణము

ఈ బ్రాహ్మణంలో వేదాంతం లేకపోయినా, ఇది కూడా చాలా ముఖ్యమైన బ్రాహ్మణము. ఇందులో కూడా అవిద్యాసూత్రం కొనసాగుతుంది. అంటే సంసారం గురించిన విషయం కొనసాగుతుంది. ముందు బ్రాహ్మణములో బ్రహ్మను సృష్టికర్తగా చూస్తే, ఇప్పుడు జీవిని సృష్టికర్తగా చూస్తాము. అలాగే ముందు బ్రాహ్మణములో జీవుణ్ణి భోగ్యవస్తువుగా చూస్తే, ఇప్పుడు జీవుణ్ణి భోక్తగా చూస్తాము.

జీవుడు, జగత్తును తను అనుభవించటానికి సృష్టించాడు. దీన్ని సప్తాత్మక లేదా సప్త భోగ్యాత్మక ప్రపంచం అంటారు. ఏడు భోగ్యపదార్థాలు ఉన్నాయి. జీవుడే తన కర్మలద్వారా, ఉపాసనలద్వారా ఈ ప్రపంచాన్ని సృష్టించాడు. మనం జ్ఞాని అయిన మరుక్షణం ఈ భోగ్యప్రపంచం మనకు అవసరం లేదు. సంస్కృతంలో భోగ్యవస్తువును అన్నం అంటారు. అన్నం అంటే ఒక అర్థం తినే అన్నమే. ఇంకో అర్థం అనుభవంలోకి వచ్చే వస్తువు. జీవుడే సృష్టించాడు అని తెలుసుకుంటే, భగవంతుడు ఈ సృష్టినెందుకు చేశాడు అనే మన సందేహానికి జవాబు దొరుకుతుంది. మనమే సృష్టించాము అంటే అక్షరాలా సృష్టించామని కాదు; ఈ సృష్టికి మన కర్మలే పరోక్షకారణాలు.

జీవుడు సృష్టించిన సప్తాన్నాలు ఇవి.

1. సాధారణ అన్నం – అన్ని జీవరాశులూ అంటే మనుష్యులు, పక్షులు, వృక్షాలు రోజువారీ తీసుకునే అన్నం.

2, 3. దేవ అన్నం – దేవతలకు ఇచ్చే ఆహుతులు.

4. పశు అన్నం – పశువులకు, మనుష్యులకు, మనుష్యులలో పాపాయిలకు అన్నం అంటే పాలు. ఈ నాలుగూ ఇతరులకు ఇచ్చే అన్నాలు. తరువాత వచ్చేవి వ్యష్టి శరీరంలోని అంగాలు. అవి–

5, 6, 7. మనః వాక్, ప్రాణః – మనస్సు, వాక్కు, పంచప్రాణాలు. ఇవి తన స్వంత ఆనందంకోసం ఉపయోగించేవి.

ఇంకో కోణంలోంచి చూస్తే మొదటి నాలుగూ సాధన అన్నాలయితే, తక్కిన మూడూ సాధ్య అన్నాలు. ఎందుకంటే మన మనస్సు, వాక్కు, ప్రాణం మనం ఇతరులకు చేసిన దానంబట్టి ఉంటాయి. ఇప్పుడు మనకు మంచి మనస్సు లేదంటే మనం మన పూర్వజన్మలో పై అన్నాలను దానం చేయలేదన్నమాట. ఎవరైతే హిరణ్యగర్భమీద లేదా విరాట్‌మీద సప్తాన్నరూప ఉపాసన చేస్తారో, వారు హిరణ్యగర్భపథం పొందుతారు.

**మనస్సు నిర్వచనం**

**కామః సంకల్పో విచికిత్సా శ్రద్ధా ఉ_శ్రద్ధా ధృతిరధృతిః**
**హ్రీర్ధీర్భీరిత్యేతత్సర్వం మన ఏవ** – 1.5.3

ఈ మంత్రంలో ఉపనిషత్తు, మనస్సుయొక్క నిర్వచనంతో పాటు, దానికి ప్రమాణం కూడా ఇస్తున్నది. ఈ నిర్వచనం చాలా ముఖ్యమైనది. దృక్‌దృశ్య వివేకంలో ఈ పదాలను చూస్తాము, కాకపోతే పద్యరూపంలో.

మనస్సు అంటే అనేక వృత్తుల (ఆలోచనల) సముదాయం. అలాంటి వృత్తులను కొన్ని ఉదాహరణగా ఇచ్చింది ఉపనిషత్తు. అవి కామం, సంకల్పం, విచికిత్సా (సందేహం), శ్రద్ధ, అశ్రద్ధ, ధృతి, అధృతి, హ్రీ (వినయం), భయం. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఈ మంత్రంద్వారా ఉపనిషత్తు స్పష్టంగా చెబుతున్నది. రాగద్వేషాలు మనస్సుకు అంటే అనాత్మకు చెందుతాయి కాని, ఆత్మకు చెందవు అని. అంతేకాదు, మనస్సు కంటికి కనపడకపోయినా, ఇంద్రియాలు పని చేస్తున్నాయంటే, మనస్సువల్లనే అని చెబుతున్నది ఉపనిషత్తు.

ప్రాణంయొక్క శ్రేష్ఠత్వాన్ని కూడా చూస్తాము ఈ బ్రాహ్మణములో.

## 1.6. ఉక్థ బ్రాహ్మణము

మొదటి అధ్యాయంయొక్క ముఖ్యాంశం అధ్యారోపం. అధ్యారోపంలో జీవిని కర్మగా, భోక్తగా చూశాము. ఈ ఆరవ బ్రాహ్మణములో తక్కిన అధ్యారోపాలన్నింటినీ కలిపి టూకీగా చూస్తాము.

**త్రయం వా ఇదం నామ రూపం కర్మ** – 1.6.1

మొత్తం ప్రపంచం అవ్యక్తం, వ్యక్తం – అంతా నామరూపకర్మ త్రయం. దీన్ని సంక్షేపవాక్యం అంటారు. సంక్షేపవాక్యం ఒక సూత్రం. వ్యక్తప్రపంచం సాధ్య, సాధన ప్రపంచంగా ఉంది. అవ్యక్తంలో ఈ విభేదం కనపడదు.

**నామం** – ప్రపంచం అంతా నామమయం. నిజానికి ఒక వస్తువు గురించి ఆలోచించాలంటే దాని పేరుతోనే ఆలోచించగలము. వస్తువునూ, నామాన్నీ ఎన్నటికీ విడదీయలేము. వాక్కునుంచి అనేక నామాలు వస్తాయి. ఇక్కడ వాక్కు అంటే సామాన్యశబ్దం. అందువల్ల వాక్కుకు ఒక కొత్త బిరుదు వచ్చింది. అది ఉక్థము.

**రూపం** – అనేక రూపాలన్నీ చక్షువుమీద ఆధారపడి ఉన్నాయి. ఇక్కడ చక్షువు అంటే సామాన్యరూపంగా తీసుకోవాలి. అంటే సామాన్యరూపమే మొత్తం ప్రపంచంలోని అన్ని రూపాలకూ ఉపాదాన కారణం. అందువల్ల సామాన్యరూపాన్ని కూడ ఉక్థము అంటారు.

**కర్మ** – ప్రపంచం అంతా అనేక కర్మల సముదాయం. మనిషి, జంతువు, చెట్టు, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు – దేన్ని చూసినా ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తూనే ఉంటుంది. నామానికి సామాన్య శబ్దం, రూపానికి సామాన్యరూపం చూసినట్టే, ఇప్పుడు కర్మకు సామాన్యకర్మ ఉంది. అది ఆత్మ. ఇక్కడ ఆత్మ అంటే శరీరం. శరీరం ఉక్థము.

ఈ విధంగా ప్రపంచం మొత్తం నామరూపకర్మల సమ్మేళనం. అదే విధంగా మనిషి కూడా నామరూపకర్మల సమ్మేళనమే. మామూలుగా తక్కిన ఉపనిషత్తులు జగత్తును నామరూపాలుగా వ్యవహరిస్తాయి. బృహదారణ్యకోపనిషత్తు దానికి అదనంగా కర్మను కలిపింది. ఉదాహరణకు కుండను తీసుకుంటే కుండకు పేరు, రూపంతో పాటు కర్మ ఉంది. దాని సామాన్యకర్మ నీరు నింపుకోవటం.

నామరూపకర్మలు మూడు అయినా, ఇవి ఒకే ఆత్మ. ఆత్మ అంటే శరీరం అని చూశాము. శరీరం దేహేంద్రియ మనస్సుల సముదాయమైన పిండం. సమష్టి ప్రపంచాన్ని బ్రహ్మాండం అంటే, వ్యష్టి శరీరాన్ని పిండాండం అంటారు.

నామరూపాత్మక శరీరానికి (కర్మ కూడా కలుపుకోవాలి) ఉపనిషత్తు **సత్యం** అనే పేరు ఇచ్చింది. ఈ శరీరంలో ప్రాణం ఉంది. ప్రాణాన్ని అమృతం అంటున్నది. ప్రాణం సూక్ష్మశరీరానికి ప్రతీక. స్థూలశరీరం పడిపోయాక కూడా సూక్ష్మశరీరం ఉంటుంది. కాని స్థూల శరీరంచేత సూక్ష్మశరీరం కప్పివేయబడింది. అంటే స్థూలశరీర అభిమానంచేత, నేను సూక్ష్మశరీరాన్ని అని తెలుసుకోలేకపోతున్నాను.

స్థూలశరీర అభిమానం వదుల్చుకుని సూక్ష్మశరీరానికే రాలేకపోతున్నాను; ఇంక ఆత్మజ్ఞానానికి రావటానికి ఇంకెంత కష్టపడాలో!

ఇక్కడితో అధ్యారోపం ముగిసింది. మొదటి అధ్యాయం ముగిసింది.

# ఏకాదశ ఉపనిషత్తుల సారం

## బృహదారణ్యకోపనిషత్ - అధ్యాయం 2

ఇప్పుడు బృహదారణ్యకోపనిషత్తులో రెండవ అధ్యాయాన్ని చూద్దాము. ఇది చాలా ముఖ్యమైన అధ్యాయము. ఇందులో ఆరు బ్రాహ్మణాలు, 62 మంత్రాలు ఉన్నాయి. ఒక్కొక్కటిగా చూద్దాము.

### 2.1. అజాతశత్రు బ్రాహ్మణము

ఇది ముఖ్యమైన బ్రాహ్మణము. అజాతశత్రువు అనే రాజు గార్గ్య అనే బ్రాహ్మణునికి బోధ చేస్తాడు, కాబట్టి దీనికి అజాతశత్రు బ్రాహ్మణము అనే పేరు వచ్చింది. కాని దీన్ని గార్గ్య బ్రాహ్మణము అని కూడా అంటారు. గార్గ్య వైపునుంచి పేరు జాగ్రత్తగా గమనించండి. గార్గి కాదు గార్గ్య. తరువాత వచ్చే అధ్యాయంలో గార్గి అనే స్త్రీ వస్తుంది. ఇక్కడ గార్గ్య ఒక బ్రాహ్మణుడు. అతని ఇంకో పేరు బాలాకీ. ఈ బ్రాహ్మణాన్ని మళ్ళీ నాలుగు అంశాలుగా విభజించవచ్చు. అవి సగుణబ్రహ్మ, జీవస్వరూపం, జీవ-బ్రహ్మ ఐక్యం, ఉపనిషత్తు.

1) **సగుణ బ్రహ్మ** - గార్గ్య అజాతశత్రువు దగ్గరికి వెళ్ళి బ్రహ్మ గురించి బోధిస్తానన్నాడు. అతనికి తెలిసింది సగుణబ్రహ్మ గురించి మాత్రమే. సగుణబ్రహ్మను హిరణ్యగర్భ అని కూడా అంటారు. నిర్గుణబ్రహ్మ ఈ హిరణ్యగర్భకన్నా ఎక్కువ, కాని గార్గ్యకు తెలియదు, ఈ విషయం అజాతశత్రువుకు తెలుసు. గార్గ్యకు అజాతశత్రువుకు తెలుసని కూడా తెలియదు. 2-13 మంత్రాలవరకు గార్గ్య హిరణ్యగర్భ ఉపాసన గురించి చెబుతాడు. గార్గ్య హిరణ్యగర్భ గురించి చెప్పబోయినప్పుడల్లా, అజాతశత్రువు నాకు ఇది తెలుసు, నేను దీనిమీద ఉపాసన చేశానని చెప్పాడు.

వ్యష్టి శరీరంలో 19 అంగాలు ఉంటాయి. పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, పంచప్రాణాలు, నాలుగు అంతఃకరణలు. వీటికి అధిష్ఠానదేవతలు ఉంటారు. ఉదాహరణకు కన్నుకు అధిష్ఠానదేవత - సూర్యుడు. వాక్కుకు అధిష్ఠానదేవత అగ్ని. ఈ అధిష్ఠానదేవతలకు అధిష్ఠానదేవత హిరణ్యగర్భ. హిరణ్యగర్భ గుణాలను ఈ అధిష్ఠానదేవతలకు ఆరోపించి ఉపాసన చేస్తే, ఆ యా గుణాలు ప్రతిఫలంగా వస్తాయి.

ఉదాహరణకు ఆదిత్యునిమీద ఉపాసన చేస్తే ఆదిత్యునికి ఉన్న గుణాలు అతిష్ఠా, మూర్ధా, రాజా, ఆ ఉపాసకునికి వస్తాయి. అలా గార్గ్య 12 ఉపాసనలు చెప్పాక, ఇంతేనా తెలిసింది. ఇంతే తెలిస్తే, అది బ్రహ్మ గురించి తెలిసినట్టు కాదని అజాతశత్రువు చెప్పాడు.

ఇది బ్రహ్మజ్ఞానం కాదు అన్నాడు. గార్గ్యకు తనకు జ్ఞానం ఉందన్న గర్వం ఉండేది. అందువల్ల దృప్తబాలాకీ అని కూడా అంటారు. కాని తనకు తెలిసింది బ్రహ్మజ్ఞానం కాదని తెలియగానే తనకు ఉపదేశం చేయమని అజాతశత్రువుని కోరాడు. అజాతశత్రువుకు గురువుగా వచ్చిన గార్గ్య శిష్యునిగా మారాడు. అది రెండవ అంశానికి దారి తీస్తుంది.

2) **జీవస్వరూపం** – నిజానికి క్షత్రియుడు, బ్రాహ్మణునికి బోధించకూడదు. కాని అజాతశత్రువు, యోగ్యతకలిగిన శిష్యునికి ఈ నియమాలను సడలించవచ్చని, గార్గ్య చేతులను పట్టుకుని లేచి నిలబడ్డాడు.

గార్గ్యను తీసుకుని నిద్రపోతున్న ఒక వ్యక్తి దగ్గరకు వెళ్ళాడు. అతన్ని బృహత్, పాండరవాసః, సోమరాజన్ పేర్లతో పిలిచాడు. అతను లేవలేదు. శరీరాన్ని తాకాడు, లేవలేదు. తీవ్రంగా కుదిపాడు, అప్పుడు లేచాడు. ఈ సన్నివేశాన్ని ఆధారంగా చేసుకుని అజాతశత్రువు బోధించాడు. ఏం బోధించాడు?

- అతను సుషుప్తినుంచి లేచాడు కాబట్టి జీవించి ఉన్నాడు.
- పేరు పెట్టి పిలిస్తే పలకలేదు కాబట్టి అతను నిజానికి ఇంద్రియాలు కాదు, సూక్ష్మశరీరం కాదు.
- ముట్టుకుంటే లేవలేదు కాబట్టి అతను నిజానికి స్థూలశరీరం కూడా కాదు.

దీన్నిబట్టి అతని స్థూలశరీరం, ఇంద్రియాలు సుషుప్తిలో పడుకుంటాయని, జాగ్రదవస్థలో పనిచేస్తాయని అర్థమవుతుంది. ఒక అవస్థలో వచ్చి, ఇంకొక అవస్థలో లేనిది తన స్వస్వరూపం అవదు. అంటే జీవి అంటే ఇంద్రియాలు, మనస్సు, శరీరం కాదు. ఇవేవీ జీవి కాకపోతే, మరి జీవి ఎవరు? జీవస్వరూపం ఏమిటి? మూడు అవస్థల్లోనూ ఉండేది స్వస్వరూపం. అదే చైతన్యం. జీవస్వరూపం ఆత్మచైతన్యం.

3) **జీవ–బ్రహ్మ ఐక్యం** – ఆత్మ స్థూల, సూక్ష్మశరీర వ్యతిరిక్తం అని చూశాము. సుషుప్తిలో అతిశయించిన ఆనందం పొందుతాము అంటుంది ఉపనిషత్తు. జాగ్రదవస్థలో పొందే ఆనందం తారతమ్యాలు ఉన్న ఆనందం. ఏదైనా ఒక వస్తువు లయమవ్వాలంటే దాని కారణంలో లయమవుతుంది. ఉదాహరణకు, ఆభరణాలను కరిగిస్తే బంగారం అవుతుంది. ఆ సూత్రం ప్రకారం జీవాత్మ పరమాత్మలో లయమవుతుంది. సుషుప్తిలో నిర్విశేషజ్ఞానంగా ఉంటాము మనం. అందువల్లనే సుషుప్తిలో ఆనందంగా నిద్రపోయాను అంటారు. అప్పుడు పరమాత్మలో ఐక్యం అవటంవల్ల పూర్ణత్వభావన కలుగుతుంది.

ఈ నిర్విశేష చైతన్యమే జగత్కారణం అని చెబుతున్నాడు అజాతశత్రువు. నిర్విశేషచైతన్యం మన స్వస్వరూపం. అందులో మనం సుషుప్తిలో లయమవుతాము.

ఆ చైతన్యంనుంచే లోకాలు, మనుష్యులు, దేవతలు అందరూ వచ్చారని చెప్పి, జీవాత్మ పరమాత్మ ఐక్యం కూడా సూచిస్తున్నాడు.

జీవాత్మ పరమాత్మల ఐక్యం సూచించటానికి రెండు ఉదాహరణలు ఇస్తున్నాడు.

**స యథోర్ణనాభిస్తంతునోచ్చరేత్** – మొదటి ఉదాహరణ ఊర్ణనాభి అంటే సాలెపురుగు. సాలెపురుగు ఉపాదానకారణం, నిమిత్తకారణం. అలా బ్రహ్మ అభిన్న నిమిత్త ఉపాదాన కారణం.

**యథాగ్నేః క్షుద్రా విస్ఫులింగా వ్యుచ్చరంతి** – అగ్నినుంచి నిప్పురవ్వలు ఏర్పడటం రెండవ ఉదాహరణ. ఇక్కడ కార్యకారణసంబంధం చూస్తాము. అగ్ని కారణం, నిప్పురవ్వలు కార్యం. కారణం లక్షణాలు కార్యంలోకి వెళతాయి. అగ్ని లక్షణాలు కాంతి, వేడిని నిప్పురవ్వల్లో కూడా చూస్తాము. అగ్ని ఏకం, నిప్పురవ్వలు అనేకం. పరమాత్మస్వరూపం సత్‌చిత్ ఆనందం. జీవాత్మస్వరూపం కూడా అదే. పరమాత్మ ఏకం, జీవాత్మలు అనేకం.

4) **ఉపనిషత్ – తస్య ఉపనిషద్.** తస్య అంటే ఆత్మ. జీవాత్మ పరమాత్మల ఐక్యం సూచించే ఆత్మ. అవస్థాత్రయ వివేకం ద్వారా అజాతశత్రువు జీవాత్మ పరమాత్మల ఐక్యం చూపించాడు. ఇక్కడ ఉపనిషత్తు అంటే అర్థం రహస్యనామం. ఆత్మకి ఒక రహస్యనామం చూస్తాము ఇక్కడ. అది –

**సత్యస్య సత్యమ్** – ఇది సత్యానికి సత్యం. ముందు అధ్యాయంలో ప్రాణం సత్యం అని చూశాము. ప్రాణం అంటే సృష్టి మొత్తం అని చెప్పవచ్చు. శాస్త్రం దాన్ని వ్యావహారిక సత్యం అంది. ఆత్మ ఈ సత్యానికి సత్యం. అంటే ఆత్మ పారమార్థిక సత్యం.

ఉపనిషత్తే సత్యస్య సత్యం అంటే ఏమిటో 2, 3 బ్రాహ్మణాలలో వివరిస్తుంది.

## 2.2. శిశుబ్రాహ్మణము

సత్యస్య సత్యం అంటే వ్యావహారిక సత్యంయొక్క పారమార్థిక సత్యం అని చూశాము. వ్యావహారిక సత్యాన్ని మళ్ళీ రెండుగా విభజించవచ్చు. అవి వ్యష్టి, సమష్టి. బ్రహ్మ – పారమార్థిక సత్యం. బ్రహ్మ ఈ వ్యష్టి, సమష్టిల వ్యావహారిక సత్యంయొక్క సత్యం. అంటే వీటికి అతీతంగా ఉన్నది బ్రహ్మ. మూడు పదాలను చూశాము.

వ్యష్టి వ్యావహారిక సత్యం
సమష్టి వ్యావహారిక సత్యం
పారమార్థిక సత్యం

**వ్యష్టి వ్యావహారిక సత్యం** – ఈ శిశుబ్రాహ్మణంలో ఈ వ్యష్టి వ్యావహారిక సత్యాన్ని చూస్తాము. ఇందులో చాలా సాంకేతిక పదాలు ఉంటాయి. బోధ తేలికగానే ఉంటుంది. ఈ పదగుంభనాలవల్ల అమ్మో అనిపిస్తుంది, అంతే. ఇక్కడ వ్యష్టికి ప్రతీకగా ప్రాణాన్ని తీసుకుంది ఉపనిషత్తు. ప్రాణం అంటే స్థూల, సూక్ష్మశరీరాలుగా తీసుకోవాలి. ప్రాణానికీ, శరీరానికీ మధ్య సంబంధం ఉంది. శిశుబ్రాహ్మణములో శిశువు అంటే ఇక్కడ మానవ శిశువును కాదు, దూడను చూస్తాము. దూడకు సంబంధించిన నాలుగు అంశాలను ప్రాణం పరంగా చూస్తాము.

| | **దూడ (శిశువు)** | **ప్రాణం** |
|---|---|---|
| ఆధానమ్ | చావడి | శరీరం |
| ప్రత్యాధానమ్ | ఒక ప్రత్యేక ప్రదేశం | తల |
| స్థూణమ్ | దుంగ | ప్రాణశక్తి |
| దామమ్ | తాడు | అన్నం |

ఈ బ్రాహ్మణములో రెండవ మంత్రంలో ప్రాణస్తుతి జరుగుతుంది. దేవతలు ప్రాణాన్ని కళ్ళ ద్వారా ఉపాసిస్తున్నారు. అక్కడ కూడా పోటీ. ఏడుగురు దేవతలు కంటిలో ఏడు భాగాలను ఉపాసన చేస్తున్నారు.

| **దేవత** | **కన్నులోని భాగం** |
|---|---|
| రుద్రుడు | కంటిలోని ఎర్రభాగాన్ని |
| వరుణుడు | కంటినీరును |
| ఆదిత్యుడు | కనుపాపను |
| అగ్నిదేవత | నల్లగుడ్డును |
| ఇంద్రుడు | తెల్లగుడ్డును |
| పృథివీ | కింద కనురెప్పను |
| స్వర్గలోక దేవత | పై కనురెప్పను |

పూజిస్తారు. దీనిద్వారా ప్రాణంయొక్క గొప్పతనాన్ని చూస్తాము. స్థూలశరీరం కంటికి కనబడుతుంది. దాన్ని మూర్తశరీరం అంటారు. సూక్ష్మశరీరం కనబడదు కాబట్టి దాన్ని అమూర్తశరీరం అంటారు. ఈ మూర్తామూర్త శరీరాలను వ్యష్టి అంటారు. సూక్ష్మశరీరంతో కారణశరీరాన్ని కలుపుకోవాలి. ఈ వ్యష్టిని ప్రాణ ఉపాసన ద్వారా వివరించింది ఉపనిషత్తు.

ఉత్తమ అధికారి సత్యస్య సత్యం అనే నిర్వచనంలోని మొదటి సత్యం ప్రాణం అని అర్థం చేసుకుని, రెండవ సత్యానికి వెళ్ళాలి. మూడవ బ్రాహ్మణములో సమష్టి వ్యావహారిక సత్యాన్ని, పారమార్థిక సత్యాన్ని చూస్తాము.

## 2.3. మూర్తామూర్త బ్రాహ్మణము

ముందు బ్రాహ్మణములో వ్యష్టిపరంగా స్థూలశరీరం మూర్తం అనీ, సూక్ష్మశరీరం అమూర్తం అనీ చూశాము. అది అధ్యాత్మస్థాయి. ఇక్కడ సమష్టిపరంగా చూస్తాము. దీన్ని అధిదైవస్థాయి అంటారు. అధిదైవస్థాయిలో ఆకాశం వాయువు అమూర్తప్రపంచం; అగ్ని, జలం, పృథివి మూర్తప్రపంచం. వీటిని సత్యం అంది. సత్యాన్ని సత్+త్యత్‌గా విడదీయాలి. సత్ అంటే మూర్తప్రపంచం, త్యత్ అంటే అమూర్తప్రపంచం. మూర్తం అంటే ప్రత్యక్షగోచరం, అమూర్తం అంటే అగోచరం. వీటిని సత్యం అంటుంది ముందు. దీన్ని అధ్యారోపం అంటారు. తరువాత వీటిని నేతినేతి పద్ధతిద్వారా సత్యం కాదని నిరూపిస్తుంది. దీన్ని అపవాదం అంటారు.

శాస్త్రంలో ఈ అధ్యారోప–అపవాద ప్రక్రియ ముందు జగత్తును పరిచయం చేసి, తరువాత దాన్ని మిథ్యగా కొట్టివేస్తుంది. నేతి అంటే న+ఇతి. బ్రహ్మ ఇది కాదు, ఇది కాదు అని ఖండించుకుంటూ రావటం.

అపవాదంలో **సత్యస్య సత్యం**లోని మొదటి సత్యాన్ని తిరస్కరించటంద్వారా రెండవ సత్యాన్ని నిలబెట్టాలి.

> **అథాత అదేశో నేతి నేతి న హ్యేతస్మాదితి నేత్యన్యత్పరమస్త్యథ**
> **నామదేయగ్ం సత్యస్య సత్యమితి ప్రాణా వై సత్యం తేషామేష సత్యమ్** – 2.3.6

అథ – తరువాత; అతః – అందువలన; అధ్యారోపం అయినందువలన; ఇక్కడనుంచి సత్యస్య సత్యం నిర్వచనం చూడబోతున్నాము. దీని నిర్వచనం మూర్తామూర్త ప్రపంచం అని చెప్పినట్టుగా చెప్పటం లేదు. నేతి, నేతి అని వ్యతిరేక పద్ధతిలో చెప్పబోతున్నది. ఎందుకంటే ఆత్మ సానుకూల నిర్వచనానికి అందదు. అలా అన్నింటినీ నిషేధిస్తే మిగిలేది –

**సత్యస్య సత్యమితి** – సత్యస్య సత్యం మిగులుతుంది. దాన్నే సాక్షిచైతన్యం అంటారు. ఎందుకు నేతి నేతి పద్ధతి వాడిందో, ఉపనిషత్తే వివరిస్తుంది.

**న హ్యేతస్మాదితి నేత్యన్నత్పరమస్తి** – నేతి నేతి అనే ఈ ఉపదేశాన్ని మించి గొప్పది మరొకటి లేదు. నేతి నేతి ద్వారా స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలను, స్థూల, సూక్ష్మ కారణ ప్రపంచాలను కొట్టివేస్తే మిగిలేది ఆత్యంతిక సత్యం.

**ప్రాణా వై సత్యం తేషామేష సత్యమ్** – బ్రహ్మ సత్యంయొక్క సత్యం. అంటే ప్రాణం (మూర్తామూర్తప్రపంచం) సత్యం అయితే, బ్రహ్మ ఈ సత్యానికి సత్యం.

## 2.4. మైత్రేయీ బ్రాహ్మణము

ఇది ముఖ్యమైన బ్రాహ్మణాలలో ఇంకా ముఖ్యమైన బ్రాహ్మణము. మొత్తం బృహదారణ్యకోపనిషత్తులోనే చాలా ముఖ్యమైన బ్రాహ్మణము. దీన్ని మైత్రేయీ బ్రాహ్మణము అంటారు. ఎందుకంటే ఇందులో మైత్రేయీ–యాజ్ఞవల్క్యుల సంవాదం రూపంలో జరుగుతుంది. మైత్రేయీ బ్రాహ్మణము అని ఎందుకు అన్నారు, యాజ్ఞవల్క్య బ్రాహ్మణము అనవచ్చు కదా అంటే స్త్రీకి ఇచ్చిన విలువ అది. నిజానికి యాజ్ఞవల్క్యను ఈ ఉపనిషత్తులో హీరో అనవచ్చు. ఈ బ్రాహ్మణము కాకుండా, మూడు, నాలుగు అధ్యాయాలు మొత్తం యాజ్ఞవల్క్యుని బోధని వివరిస్తాయి. రెండింటినీ కలిపి మునికాండము అని చెప్పి వదిలేసింది కాని, ఎక్కడా యాజ్ఞవల్క్య బ్రాహ్మణము అనే పేరు లేదు.

అది పక్కన పెడితే, ఈ అధ్యాయం యాజ్ఞవల్క్యుడు, తన రెండవ భార్య అయిన మైత్రేయిని పిలిచి, తను సన్న్యాసం స్వీకరిద్దామనుకుంటున్నాననీ, అందువల్ల తన ఆస్తిని ఇద్దరు భార్యలకూ పంచుతాననీ చెబుతాడు. మైత్రేయి ఇలా అడిగింది –

**యన్ను మ ఇయం భగోస్సర్వా పృథివీ విత్తేన పూర్ణా స్యాత్ కథం తేనామృతా స్యామితి॥**

ఓ భగవాన్! ఒకవేళ డబ్బుతో నిండివున్న ఈ పృథివి అంతా నాది అయినా కూడా, నేను అమృతత్వాన్ని, మోక్షాన్ని పొందుతానా? నీ ఆలోచన సబబే, ఆస్తివల్ల సుఖం వస్తుంది కాని ఆనందం రాదు అంటాడు యాజ్ఞవల్క్యుడు.

**అమృతత్వస్య తు న ఆశా అస్తి విత్తేన** – ధనంవల్ల అమృతత్వం లభిస్తుందనే ఆశ లేదు. అక్షరలక్షలు విలువ చేసే వాక్యం.

భర్త ఇంత ఆస్తిని సునాయాసంగా వదిలి వెళ్ళిపోతున్నాడంటే, అతనికి ఇంతకన్నా విలువైనదేదో దొరికి ఉంటుందని గ్రహించింది ప్రాజ్ఞురాలైన మైత్రేయి. అందువల్ల మీరు ఏ జ్ఞానం పొంది, దీన్ని వదులుకుని వెళుతున్నారో, ఆ జ్ఞానాన్ని నాకు బోధించండి అని కోరింది.

యాజ్ఞవల్క్యుడు మురిసిపోతాడు. నాకు నువ్వు ముందే ప్రియమైనదానివి. **ప్రియం భాషసే** – ఇప్పుడు కూడా నాకు ప్రియమైన మాటలు మాట్లాడుతున్నావు అంటాడు. రా, నీకు బోధ చేస్తాను, శ్రద్ధగా విను అంటారు. అంతేకాని, ఆ ప్రియమైన మాటలు విని నా మనస్సు మార్చుకుంటాను, సన్న్యాసం స్వీకరించను అనటం లేదు.

సన్న్యాసం పదం వచ్చినప్పుడల్లా శంకరాచార్యులవారు సన్న్యాసిని స్తుతించే అవకాశాన్ని వదులుకోరు. అందువల్ల ఈ బ్రాహ్మణము మొదట్లో, చివర్లో కూడా సన్న్యాసభాష్యం వ్రాశారు.

ఇక్కడనుంచీ యాజ్ఞవల్క్య బోధ మొదలవుతుంది. దాన్ని మనం 7 చిన్న మెట్లుగా విడగొట్టుకుని చూద్దాము. ఇంతవరకూ నేర్చుకున్న అంశాలే మళ్ళీ వస్తాయి.

1. **ఆత్మ ప్రియతమః –**

**ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి –** 2. 4. 5

ఈ మంత్రంనుంచి బోధ మొదలవుతుంది. ఇది అక్షరలక్షలు విలువ చేసే వాక్యం. అంతేకాదు, అందరికీ ఒక షాక్ ట్రీట్‌మెంట్ ఇచ్చే వాక్యం. భర్తకు, పిల్లలకు అంకితమైపోయాను, నాకంటూ ప్రత్యేకం ఏమీలేదు, నాది నిస్వార్థప్రేమ అని అనుకునే వారందరికీ ఇది ఒక పిడుగులాంటి సూత్రం.

మనం ఎవరిని ప్రేమించినా, వారిని ప్రేమించటంవల్ల మనకు ఆనందం కలుగుతుంది కాబట్టి ప్రేమిస్తున్నాము అనేది ఈ మంత్రం సారాంశం. దీన్ని ఇంగ్లీషులో **లాజిక్ ఆఫ్ లవ్** అంటారు. పూజ్య స్వామీజీ **వియ్ లవ్ అదర్స్ టు సీ అవర్ ప్లీజ్‌డ్ సెల్ఫ్ ఇన్ దెమ్** అంటారు ఈ మంత్రం వివరించేటప్పుడు. దానికి ఆయనిచ్చే వివరణ ఇలా ఉంటుంది –

నాకు ఫలానా వ్యక్తి అంటే ఇష్టం

అతను నాకు ఇష్టమైన పనులు చేస్తాడు.

అంటే ఏమిటర్థం? అతను అతనుగా ఇష్టం లేదు; అతను నాకు ఆనందం కలుగజేస్తాడు కాబట్టి ఇష్టం. ఎప్పుడైతే ఆనందం కలగజేయటం మానేస్తాడో, అప్పుడే ప్రేమ కూడా తగ్గిపోతుంది. పూజ్య స్వామీజీ ఇంకోటి చెబుతారు, ముందేమో ఐ లవ్ యూ (I love you) అంటారుట. తరువాత నచ్చకపోతే ఐ ఎలవ్ యూ టు గో (I allow you to go) అంటారుట.

జీవితంలో అలా మనకు నచ్చని డ్రెస్‌ను, ఇల్లును, కారుని వదిలేసుకుంటాము. ఇప్పుడు భార్యను/భర్తను కూడా వదిలేస్తున్నారు. భగవంతుణ్ణి కూడా మన కోరిక తీర్చకపోతే వదిలేస్తాము. ఇక్కడ పెద్ద పట్టికే ఇస్తున్నాడు యాజ్ఞవల్క్యుడు. భర్త భార్యను, భార్య భర్తను, పిల్లలను, ధనాన్ని, బ్రాహ్మణుణ్ణి, క్షత్రియుణ్ణి, లోకాలను, దేవతలను, ప్రాణులను, అందరినీ తనను తృప్తి పరుస్తారు కాబట్టి ప్రేమిస్తారు అని తేల్చి చెప్పేశాడు.

ఈ మంత్రం సారాంశం ముందే చూసినట్టుగా నాకు ఏది ఆనందం కలిగిస్తే అది నాకు ప్రియం. దీనిలో అంతర్లీనంగా ఉన్న సందేశం అనాత్మ అసలు లేదా శాశ్వతమైన ఆనందాన్ని ఇవ్వలేదు.

2. **ఆనంద హేతుత్వం** – స్వచ్ఛమైన ప్రేమ ఒక్క ఆత్మమీదే (అంటే నా మీదే) సాధ్యమవుతుంది. భగవంతునిమీద స్వచ్ఛమైన ప్రేమ పుట్టాలంటే, నేనూ, భగవంతుడూ ఒక్కటే అవాలి.

సగుణబ్రహ్మను పూజించినా స్వచ్ఛమైన ప్రేమ ఉండదు. అనాత్మ దుఃఖరూపం. అందువల్ల అనాత్మనుంచి ఆత్మవైపు తిరగాలి. వైరాగ్యం అంటే అనాత్మనుంచి వెనక్కి తిరగటం, ముముక్షుత్వం అంటే ఆత్మవైపు తిరగటం.

ఇది రెండు దశల్లో చేయాలి.

మొదటి దశ **ఆనందప్రాప్తి = ఆత్మప్రాప్తి** అని తెలుసుకోవటం. అంటే పరమానందం కావాలంటే ఆత్మను తెలుసుకోవాలి. ఆత్మ ఒకవేళ దుఃఖహేతువైతే ఎవరూ ఆత్మను ప్రేమించరు. అలా ఎందుకు అంటున్నారు? ఎందుకంటే అందరూ ఆత్మను ప్రేమిస్తున్నారు అంటే ఖచ్చితంగా ఆత్మ ఆనందహేతువై ఉండాలి. క్యాన్సర్ వ్యాధి వచ్చి చావుబతుకుల్లో ఉన్న వ్యక్తి ఆత్మహత్య చేసుకుందామనుకుంటాడు. అప్పుడు కూడా అతను ఆత్మహత్య చేసుకుందామనుకుంటున్నది, తనను తాను ద్వేషించటంవల్ల కాదు; ఆ తీవ్రమైన అనారోగ్యాన్ని భరించలేక. అలా ఎలా తేల్చి చెప్పగలరు అంటే, అతనికి నీ వ్యాధికి ఫలానా చోట వైద్యం ఉంది, మళ్ళీ మామూలు మనిషివి అవుతావు అని చెప్పిచూడండి. అతను వెంటనే తన ప్రయత్నాన్ని విరమించుకుంటాడు. అంటే అతను ద్వేషించేది తనను కాదు, తనకొచ్చిన మహమ్మారి రోగాన్ని అని చెప్పకనే చెప్పినట్టవుతుంది. అందువల్ల ఆత్మ ఆనందహేతువు.

**ఆత్మజ్ఞానం పొందాలి** – రెండవ దశ **ఆత్మప్రాప్తి = జ్ఞానప్రాప్తి** అని తెలుసుకోవటం. అంటే ఆత్మను తెలుసుకోవాలంటే ఆత్మ గురించిన జ్ఞానం పొందాలని తెలుసుకోవాలి.

**ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః**

ఇంకో అక్షరలక్షల విలువ చేసే వాక్యం. ఆత్మజ్ఞానాన్ని శ్రవణ, మనన, నిదిధ్యాసనాల ద్వారానే పొందగలమని నిరూపించే వాక్యం. అంటే గురువు ద్వారా శాస్త్రాన్ని అధ్యయనం చేయాలి.

3. **ఆత్మ చైతన్యస్వరూపం** – జ్ఞాని జీవించి ఉండగా, చైతన్యం కార్యకరణసంఘాతంలో ఉన్నట్టుగా ఉంది. చైతన్యం సర్వవ్యాపకం, రూపరహితం అయినా మనశ్శరీరాలలో అందుబాటులో ఉండటంవల్ల దానికి పరిమితి ఉన్నట్టుగా ఉంది. సర్వవ్యాపకమైన, కాలపరిమితి లేని, వస్తుపరిమితిలేని చైతన్యం సామాన్య చైతన్యం. దీన్ని బింబచైతన్యం అని కూడా అంటారు. దేహేంద్రియ మనోబుద్ధులలో ఉపహితమైన చైతన్యం వ్యష్టిగా అనిపిస్తుంది. దాన్ని చిదాభాస అంటారు. చిదాభాస అంటే చైతన్యంయొక్క ప్రతిబింబం. చిదాభాసవల్లనే జీవుడు నేను అనుకుంటాడు. అంతేకాదు తనకు కాలపరిమితి, వస్తుపరిమితి ఉందనుకుంటాడు. ఈ చిదాభాసను విశేషచైతన్యం అని కూడా అంటారు.

**ఏవం వా అరే ఇదం మహద్భూతమనంతమపారం విజ్ఞానఘన ఏవ**

ఎలాగైతే ఉప్పుకణికను సముద్రంలో వేస్తే అది సముద్రంలో లయమైపోతుందో, అదే విధంగా అవిద్య తొలగి, ఒక వ్యక్తికి అహం బ్రహ్మ అస్మి జ్ఞానం కలిగి, ఆ జ్ఞాననిష్ఠలో నిలబడితే, అతని కార్యకరణ ఉపాధి పోతుంది. చిదాభాస లేదా విశేషచైతన్యం పోతుంది. జ్ఞాని మరణం తరువాత విదేహముక్తి పొందుతాడు.

ఈ మంత్రం చాలా ముఖ్యమైనది. ఇందులో రెండు చైతన్యాలు స్పష్టంగా సూచించబడ్డాయి. చిదాభాస గురించి ప్రమాణం ఈ మంత్రం ఒక్కటే.

**మహద్భూతం అనంతమ్ అపారమ్** – చిత్ అనంతం, అపారం. చైతన్యం కార్యకారణ విలక్షణం, శుద్ధచైతన్యం, ఏకమేవాద్వితీయం. అందువల్ల ఘనం. అంటే ఉన్నదొక్కటే. చైతన్యం అని దాని అర్థం. అంటే జగత్తు మిథ్య, బ్రహ్మ సత్యం.

4. **జగత్కారణం** – చైతన్యరూపజగత్కారణం. సృష్టి, స్థితి, లయ కారణం. దీన్ని మూడు దృష్టాంతాలతో వివరిస్తుంది ఉపనిషత్తు. చైతన్యం లేదా ఆత్మ ఉపాదాన కారణం అని తార్కికంగా చూపిస్తున్నది. మట్టినుండి కుండ వచ్చింది. మట్టి లేకుండా కుండ లేదు. మట్టి సామాన్యరూపం, కుండ విశేషవస్తువు. అదే విధంగా చైతన్యం సామాన్యరూపం, జగత్తు విశేషవస్తువు అవుతాయి. విశేషవస్తువు ద్వారా సామాన్యరూపాన్ని గ్రహించగలుగుతాము. ఉపనిషత్తు కుండ–మట్టి ఉదాహరణ కాకుండా, మూడు ఉదాహరణలను చూపిస్తున్నది. అవి దుందుభి, శంఖం, వీణ. మూడూ మూడు రకాల వాయిద్యాలు. ఈ మూడింటిలో సామాన్యశబ్దం, విశేషశబ్దం ఉన్నాయి. సామాన్యశబ్దం అంటే వాయిద్యం వాయిస్తున్నంతసేపూ మ్రోగే శబ్దం. విశేషశబ్దం అంటే అందులో వచ్చే రకరకాల శబ్దాలు, రాగాలు, హెచ్చుతగ్గుల స్థాయిలు. దీని అర్థం విశేషశబ్దం సామాన్యశబ్దానికి భిన్నంగా లేదు. సామాన్యశబ్దాన్ని వినగలిగితేనే, విశేషశబ్దాన్ని వినగలుగుతాము. అంటే చెవిటివాడు రెండింటినీ వినలేడు.

ఈ ఉదాహరణలో ఆత్మస్థితి కారణం. ఆత్మ సృష్టికారణం అని చూపటానికి అగ్ని దృష్టాంతం చూస్తాము. బాగా మండుతున్న అగ్నినుంచి పొగ, నిప్పురవ్వలు, మంట వచ్చినట్టుగా, భగవంతుని నిశ్వాసంనుంచి నాలుగు వేదాలు, ఇతిహాస పురాణాలు వచ్చాయి.

లయ కారణంగా చూపటానికి నదులు సముద్రంలో కలిసినట్టుగా జగత్తు మొత్తం పరమాత్మలో లయమవుతుంది అంటున్నది. ఆ విధంగా ఆత్మ సృష్టి, స్థితి, లయ కారణం.

5. **సర్వాత్మకం – ఇదగ్ం సర్వం యదయమాత్మా** – 2.4.6

ఇంకొక అక్షరలక్షలు విలువ చేసే మంత్రం.

**ఇదం బ్రహ్మేదం క్షత్రమిమే లోకా ఇమే దేవా ఇమాని భూతానీదగ్ం సర్వం యదయమాత్మా**

ఈ బ్రాహ్మణడు, ఈ క్షత్రియుడు, ఆ లోకాలు, ఈ దేవతలు, ఈ ప్రాణులు, ఈ సర్వమూ ఆత్మనే. ఇదంతా ఆత్మ అంటే పరమాత్మ ఎక్కడో దూరంగా ఉన్నాడు. ఆ పరమాత్మే సర్వం అనుకునే ప్రమాదం ఉంది. ఎక్కడో ఆకాశంలో ఉన్న ఆత్మ గురించి చెప్పటం లేదు. అయమాత్మా గురించి చెబుతున్నది. నేను ఆత్మను, నేను సర్వాత్మను అంటున్నది ఉపనిషత్తు. ఆత్మ సర్వం, నేను ఆత్మను కాబట్టి, నేను సర్వం అని తెలుసుకుంటే నాకు పూర్ణత్వం కలుగుతుంది. ఈ జ్ఞానంవల్ల పూర్ణత్వప్రాప్తి, సర్వాత్మభావన కలుగుతుంది.

**జగన్మిథ్యాత్వం** – ఉన్నదంతా ఆత్మే అని చెబితే, ఆత్మకు భిన్నంగా వేరే ఏదీ లేదని పరోక్షంగా చెప్పినట్టు. అంతేకాదు, ఆత్మమీద ఆధారపడకుండా ఏదీ లేదు. అంటే జగత్తుకు విడిగా ఉనికి లేదు. కాబట్టి **ఆత్మా సత్యం, జగత్తు మిథ్యా.**

6. **ఆత్మ నిర్వికల్పం** – చిదాభాసతో కూడిన మనస్సు ద్వైతాన్ని చూస్తుంది. అంటే వస్తువులను చూస్తుంది, శబ్దాలను వింటుంది. జ్ఞానం పొందుతుంది నేను వేరు, ప్రపంచం వేరు అనుకుంటుంది. కాని ఆత్మజ్ఞానం పొందిన వ్యక్తి ఎలా ఉంటాడు?

**యత్ర వా అస్య సర్వమాత్మైవాభూత్తత్** – ఎప్పుడైతే అతనికి సర్వం ఆత్మే అవుతుందో, అతను

| | |
|---|---|
| **కేన కం జిఘ్రేత్** | – దేనితో దేనిని వాసన చూస్తాడు? |
| **కేన కం పశ్యేత్** | – దేనితో దేనిని చూస్తాడు? |
| **కేన కం శృణుయాత్** | – దేనితో దేనిని వింటాడు? |
| **కేనం కమ్ అభివదేత్** | – దేనితో దేని గురించి మాట్లాడతాడు? |
| **తత్కేన కం మన్వీత** | – అప్పుడు దేనితో దేని గురించి ఆలోచిస్తాడు? |
| **తత్కేన కం విజానీయాత్** | – అప్పుడు దేనితో దేనిని తెలుసుకుంటాడు? |

జ్ఞానికి ద్వైతం ఉన్నట్టుగా ఉంటుంది, నిజంగా ఉండదు. ద్వైతమివ భవతి. ఇవ చాలా ముఖ్యం. ఉన్నట్టుగా ఉంటుంది అని అర్థం. అలా అర్థం చేసుకున్న వ్యక్తి జీవన్ముక్తుడు అవుతాడు.

7. **ఆత్మ అప్రమేయం** – ఆత్మ ఆబ్జెక్టు కాదు, ఆత్మ సబ్జెక్టు.

**యేనేదగ్ం సర్వం విజానాతి తం కేన విజానీయాద్విజ్ఞాతారమరే కేన విజానీయాదితి॥**

– 2.4.14

**యేనేదగ్ం సర్వం విజానాతి** – ఏ ఆత్మవల్ల అన్నీ తెలుసుకుంటాడో,

**తం కేన విజానీయాత్** – దాన్ని దేనితో తెలుసుకుంటాడు?

**విజ్ఞాతారమరే కేన విజానీయాదితి** – విజ్ఞాతను దేనితో తెలుసుకుంటాడు?

ఈ వాక్యాల సారాంశం సబ్జెక్టు, ఆబ్జెక్టు ఎన్నటికీ కాలేదు. ఆత్మ ఎప్పటికీ సబ్జెక్టు, ఎన్నటికీ ఆబ్జెక్టు కాదు.

**ఎవర్ ది ఎక్స్‌పీరియన్సర్, నెవర్ ది ఎక్స్‌పీరియన్స్‌డ్**

అనుభవిస్తున్న నువ్వే అది ఎప్పటికీ, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ

దీనికి ఉదాహరణలు – కన్ను, కెమెరా. ప్రపంచాన్నంతా చూసే కళ్ళు తమను తాము చూసుకోలేవు. అన్నింటినీ ఫోటో తీసే కెమెరా, తనను తాను తీసుకోలేదు. అలాగే ఆత్మవల్లనే అన్ని అనుభవాలూ తెలుస్తాయి కాని, ఆత్మ అనుభవం పొందలేము.

## 2.5. మధు బ్రాహ్మణము

ఇది కూడా చాలా ముఖ్యమైన బ్రాహ్మణము. దీనిలోని బోధను ఐదు భాగాలుగా చూద్దాము.

1. **ప్రపంచ మిథ్యాత్వం** – జగత్తు మొత్తం ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉందని చూపిస్తున్నది ఉపనిషత్తు. ఎప్పుడైతే రెండు వస్తువులు ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉన్నాయని నిరూపిస్తామో, అప్పుడే ఆ రెండింటిలో ఏదీ స్వతంత్రమైనది కాదని చెప్పకనే చెప్పినట్టవుతుంది. స్వతంత్రమైనవి కావంటే అవి మిథ్య అని అర్థం. జగత్తులో ఒకదానిమీద ఒకటి ఆధారపడినవన్నీ మిథ్య అయితే, వాటికి భిన్నమైన అధిష్ఠానం ఏదో ఉండి ఉండాలి. ఈ సత్య అధిష్ఠానం మన రెండవ అంశం.

ప్రపంచ మిథ్యాత్వాన్ని వివరించటానికి ఉపనిషత్తు మొత్తం ప్రపంచాన్ని మూడుగా విభజించింది. అధ్యాత్మం, అధిభూతం, అధిదైవం.

అధ్యాత్మం – ఒక వ్యక్తిలో ఉన్న పందొమ్మిది అంగాలు. ఉదా: కన్ను, చెవి, వాక్కు, మొ॥

అధిభూతం – బాహ్యంగా ఉన్న స్థూల పంచభూతాలు. చంద్రుడు, మొ॥

అధిదైవం – మన అంగాలకు అధిష్ఠాన దేవతలు. ఆదిత్య దేవత, ఆకాశ దేవత, మొ॥

కొన్ని ఉదాహరణలు చూద్దాము.

| **అధ్యాత్మం** | **అధిభూతం** | **అధిదైవం** |
|---|---|---|
| కన్ను | సూర్యమండలం | సూర్యదేవత |
| వాక్కు | అగ్నిమండలం | అగ్నిదేవత |
| నాలుక | జలం | వరుణదేవత |

వీటినే వేరే విధంగా చెప్పాలంటే జీవ, జగత్తు, ఈశ్వరులు అనవచ్చు. వీటి మధ్య పరస్పర అనుబంధాన్ని చూపించటానికి మధువు అనే పదం తీసుకుంది. మధువు అంటే కార్యం అనీ, భోగ్యవస్తువు అనీ చెప్పవచ్చు. దీన్ని పరస్పర ఉపకార్య ఉపకారరూపప్రపంచం అని చెప్పవచ్చు. అలా 14 అంశాల మధ్య ఉన్న పరస్పర అనుబంధాన్ని చూస్తాము.

2. **ఆత్మ అధిష్ఠానం** – ఒకదానిమీద ఒకటి ఆధారపడినప్పుడు, దానికి అధిష్ఠానం భిన్నంగా ఉంటుంది అని వ్యాప్తి వాక్యం అర్థం. జగత్తుకు అధిష్ఠానం ఆత్మ. దీనికి స్వప్నవృత్తాంతం ఉదాహరణగా చెబుతారు. స్వప్నంలో స్వాప్నికుడు స్వప్నప్రపంచంమీద ఆధారపడతాడు. స్వప్నప్రపంచం స్వాప్నికునిమీద ఆధారపడుతుంది. ఈ రెండింటికీ భిన్నంగా ఉన్న అధిష్ఠానం– జాగ్రత్ పురుషుడు.

ఈ సూత్రం ప్రకారం జగత్తులో అన్నీ ఒకదానిమీద ఆధారపడి ఉన్నాయి కాబట్టి, జగత్తు కూడా మిథ్య అవుతుంది. దానికి అధిష్ఠానం అయిన ఆత్మ సత్యం అవుతుంది.

బృహదారణ్యకంలో అలా అనేక విధాలుగా **బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా** వస్తుంది.

ఆత్మ అధిష్ఠానం అని నిరూపించటానికి ఒక ఉదాహరణనిస్తున్నది.

**తద్యథా రథనాభౌ చ రథనేమౌ చ అరాః సర్వే సమర్పితాః।** – ఎలాగైతే రథంయొక్క ఇరుసులో రథం చక్రం ఆకులు గుచ్చబడి ఉన్నాయో, అలా ఆత్మలో సకల భూతాలు, సకల దేవతలు, సకల లోకాలు, సకల ప్రాణులు, సకలజీవాత్మలు సమర్పించబడి ఉన్నాయి. చక్రాలు, ఆకులు కదిలినా, రథనాభి కదలనట్టుగా, కదలని ఆత్మమీద కదిలే ప్రపంచం ఆధారపడి ఉంది.

3. **పురుషః** – పరమాత్మ స్థూలశరీరాలను సృష్టించాక, సూక్ష్మశరీరాలుగా వాటిల్లో అనుప్రవేశం చేసాడు. పక్షి అంటే ఈ సందర్భంలో సూక్ష్మశరీరం.

**పురః స పక్షీ భూత్వా పురః పురుష ఆవిశదితి** అనుప్రవేశం చేశాడు అంటే చేసినట్టుగా అనుకోవాలి. అనుప్రవేశంవల్ల పరమాత్మకు పురుషః అనే ప్రత్యేక పేరు ఏర్పడింది. ఉపనిషత్తే

రెండు అర్థాలు ఇస్తుంది. మొదటి నిర్వచనం– **పురిశయః ఇతి పురుషః –** శరీరాల్లో ఉన్నాడు. రెండవ నిర్వచనం – **పూరయతి సర్వమ్ ఇతి పురుషః** – సర్వవ్యాపకం.

4. **అయమాత్మా బ్రహ్మ–** పరమాత్మ సూక్ష్మశరీరంగా అనుప్రవేశం చేయటంవల్ల ఒక్క పరమాత్మ అనేక జీవాత్మలుగా కనిపిస్తున్నాడు. ఈ పరమాత్మే పది, వేలు, అనేకాలు, అనంతాలు కూడా అవుతున్నాడు. అనేక, అనంత ఇంద్రియాలుగా అవుతున్నాడు. బ్రహ్మ కార్యకారణ విలక్షణం, అంతరము లేనివాడూ బాహ్యం లేనివాడు.

**అయమాత్మా బ్రహ్మ** – ఇది ఒక మహావాక్యం. ఆ బ్రహ్మను నేను. ఇది సంపూర్ణమైన బోధ. వేదాంతసారమంతా ఒక వాక్యంలో వచ్చేసింది. మాండూక్యంలో కూడా ఇదే వాక్యం వచ్చింది.

**సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ** – తైత్తిరీయమ్

**అపూర్వమనపరమనంతరమబాహ్యమ్ అయమ్ ఆత్మా బ్రహ్మ** అంది ఇక్కడ.

ఇంకో విధంగా చెప్పాలంటే సజాతీయ విజాతీయ స్వగతభేదరహితం బ్రహ్మ. ఆత్మ నిర్వచనం ఏమిటి?

5. **సర్వానుభూః** – ఆత్మే సర్వాన్ని అనుభవిస్తుంది. అంటే సాక్షిచైతన్యం. అనుభవిస్తుంది వాక్యాన్ని అక్షరాలా తీసుకోకూడదు.

**ఎవ్వర్ ది ఎక్స్‌పీరియన్సర్, నెవ్వర్ ది ఎక్స్‌పీరియన్స్‌డ్**

అంటాము కూడా. కాని ఆత్మ నిర్వికారసాక్షి. అద్దంలో మీ ప్రతిబింబం ఏర్పడటానికి మీ ప్రయత్నం లేదు. అదే విధంగా ఆత్మ అనుభవిస్తుంది అంటే, ఆత్మ సమక్షంలో, పనులు అవుతాయి. దీన్ని సర్వానుభూః అంటారు.

ఆత్మ = చైతన్యస్వరూపం
బ్రహ్మ = సజాతీయ విజాతీయ స్వగతభేదరహితం

అందువల్ల ఆత్మ = బ్రహ్మ అంటే చైతన్యరూపమైన ఆత్మే సజాతీయ, విజాతీయ, స్వగతభేద రహితమైన బ్రహ్మ.

**ఇదగ్ంసర్వం యదయమాత్మా**

అర్థం ఇక్కడ కూడా వచ్చింది. ఈ బోధను మధువిద్యా అంటారు. ఇది అథర్వణ ఋషి, అశ్వినీ కుమార్ల మధ్య సంవాదరూపంలో సాగింది.

## 2.6. వంశ బ్రాహ్మణము

మధు బ్రాహ్మణముతో అసలు బోధ ముగిసింది. ఆరవ బ్రాహ్మణము విద్యాస్తుతికోసం చెప్పబడింది. దీనిద్వారా ఇవి గురుపరంపరగా వస్తున్నదని, కాలాన్ని తట్టుకుని నిలబడిందని అర్థమవుతుంది. సాక్షాత్తూ భగవంతునితో మొదలుపెట్టి నేటి గురుశిష్యుల పేర్లు ఇస్తుంది. ఇది స్వాధ్యాయంకోసం, జపించటంకోసం కూడా చెప్పబడిందని శంకరులవారు అంటారు.

ఇందులో ముఖ్యమైన మంత్రాలు: 1–20
3–6
4 – 5, 6, 10, 12, 14
5 – 14, 15, 18, 19

# ఏకాదశ ఉపనిషత్తుల సారం

## బృహదారణ్యకోపనిషత్ – అధ్యాయం 3

మూడవ అధ్యాయములోకి వెళ్ళే ముందు కొన్ని విషయాలు పునశ్చరణ చేసుకుందాము. బృహదారణ్యకంలో మూడు కాండలు, ఒక్కొక్క కాండలో రెండేసి అధ్యాయాలు చొప్పున, వెరసి ఆరు అధ్యాయాలు ఉన్నాయి. మనం మొదటి కాండాన్ని చూశాము. దాన్ని మధుకాండము అంటారు. దానికి ఆ పేరు మధుబ్రాహ్మణమునుంచి వచ్చింది.

ఇప్పుడు మనం రెండవ కాండములోకి అడుగు పెట్టబోతున్నాము. మూడు, నాలుగు అధ్యాయాలను కలిపి మునికాండము అంటారు. ఇందులో గురువు యాజ్ఞవల్క్యముని. అన్ని బ్రాహ్మణములలో యాజ్ఞవల్క్యుడు వస్తాడు కాబట్టి దీన్ని యాజ్ఞవల్క్యకాండము అని కూడా అంటారు. ఈ కాండంలో మొదటి అధ్యాయాన్ని చూద్దాము. ఇందులో 9 బ్రాహ్మణములు, 92 మంత్రాలు ఉన్నాయి. 9 బ్రాహ్మణములు ఈ విధంగా ఉంటాయి:

1–3 బ్రాహ్మణములు – ఉపాసన ప్రధానం – త్వం పద ప్రధాన విచారణ
4–8 బ్రాహ్మణములు – ఉపదేశ ప్రధానం – తత్ పద ప్రధాన విచారణ
9 బ్రాహ్మణము – ఉపసంహారము

ఈ అధ్యాయము ఒక కథతో మొదలవుతుంది. జనక మహారాజు ఒక పండిత సభ ఏర్పాటు చేశాడు. ఆ బ్రహ్మవేత్తలలో అత్యున్నత వ్యక్తికి వేయి గోవులను ఇస్తానని ప్రకటించాడు. ప్రతి ఒక్క గోవుకు పదేసి పాదముల (ఒక కొలత) బంగారం, రెండు కొమ్ములకు అలంకరిపబడి ఉన్నాయి. ఈ వాదోపవాదాలలో యాజ్ఞవల్క్యముని గెలిచి, తానే అత్యున్నత పండితునిగా నిరూపించుకున్నాడు. ఎనిమిదిమంది యాజ్ఞవల్క్యునితో భేటీకి దిగారు. గార్గి అనే స్త్రీ రెండుసార్లు వాదించటంవల్ల తొమ్మిది బ్రాహ్మణములు వచ్చాయి. అందరితో వాదించి గెలిచాడు. ఈ నేపథ్యంతో ఈ అధ్యాయంలో ఒక్కొక్క బ్రాహ్మణాన్ని చూద్దాము.

### 3.1. అశ్వల బ్రాహ్మణము

జనక మహారాజు పెద్ద యజ్ఞం చేశాడు.

**తత్ర హ కురు పాంచాలానాం బ్రాహ్మణా అభిసమేతా బభూవుః** – దానికి కురు పాంచాల దేశాలకు చెందిన బ్రహ్మవేత్తలు వచ్చి చేరారు.

**కః స్విదేషాం బ్రాహ్మణానామనూచానతమ ఇతి** – వీరిలో అతిశయించిన వేదవిత్తముడు ఎవరో తెలుసుకోవాలనుకున్నాడు. దానికోసం బంగారం తొడగబడిన కొమ్ములుగల వేయి ఆవులను తెప్పించాడు. మీలో ఎవరైతే అతిశయించిన బ్రహ్మవేత్తలో, వారు ఈ గోవులను తీసుకొని వెళ్ళవచ్చు అన్నా కూడా ఎవరూ సాహసించలేదు. అప్పుడు యాజ్ఞవల్క్యుడు తన శిష్యుణ్ణి ఉద్దేశించి, ఓ ప్రియమైన సామశ్రవసా! ఈ గోవులను మన గోశాలకు తీసుకువెళ్ళు అన్నాడు. శిష్యుడు గురువాజ్ఞను పాటించటానికి ముందుకు వచ్చాడు. యాజ్ఞవల్క్యుడు శుక్లయజుర్వేదంలో దిట్ట. శిష్యుడు సామవేదాన్ని అధ్యయనం చేశాడు. అంటే యాజ్ఞవల్క్యుడు వేదవిత్తముడే కాదు, చతుర్వేదవిత్తముడు కూడా అని చెప్పవచ్చు.

కాని ఇది తక్కిన పండితులకు అవమానంగా తోచింది. అది యాజ్ఞవల్క్యుని అహంకారంగా భావించారు. విదేహరాజైన జనకుని కొలువులో అశ్వలుడు అనే హోతా (ఋత్విక్కు) ఉన్నాడు. అతను, 'నువ్వే వేదవిత్తముడివి అనుకుంటున్నావా' అని ప్రశ్నిస్తే, యాజ్ఞవల్క్యుడు వినయంగా, 'మేము గోవులను కోరేవారం మాత్రమే! నాకు అవసరం ఉంది కాబట్టి తీసుకుంటున్నాను' అన్నాడు. దానికి బదులుగా అశ్వలుడు, మామూలుగా ఈ గోవులు ఇక్కడ పెట్టినవి కాదు. శ్రేష్ఠునిగా నిరూపించుకున్నవారికి దానం చేసే గోవులు అని చెప్పాడు. అందువల్ల నాతో వాదించి గెలువు అనే అర్థాన్ని సూచించాడు.

ఈ బ్రాహ్మణంలో అశ్వలుడు యాజ్ఞవల్క్యుని ఎనిమిది ప్రశ్నలు వేశాడు. అందువల్ల ఈ బ్రాహ్మణానికి అశ్వలబ్రాహ్మణము అనే పేరు వచ్చింది. యాజ్ఞవల్క్యుడు వాటన్నిటికీ దిగ్విజయంగా జవాబులు చెప్పాడు. ఈ ప్రశ్నలను రెండు అంశాలుగా చూడవచ్చు. అవి కర్మసహిత ఉపాసనాని, సంపదుపాసనాని.

1. **కర్మసహిత ఉపాసనాని** – వీటిని యజ్ఞ అంగ ఉపాసనలు అని కూడా అంటారు. అంటే వీటిని విడిగా చేయలేరు. యజ్ఞంలో ఒక భాగంగా చేస్తారు.

కర్మలు మూడు రకాలు ఉన్నాయి. అవి స్వాభావిక కర్మ, కేవల కర్మ, ఉపాసన సముచ్చిత కర్మ. చివరిది మొదటి రెండు కర్మలకన్నా ఉన్నతమైనది. ఇది అతిమోక్షానికి దారితీస్తుంది. అందువల్ల దీన్ని అతిమోక్ష ఉపాసన అంటారు. కాని అడిగిన తీరు వేరు, జవాబు చెప్పిన తీరు వేరు.

స్వాభావిక కర్మ, కేవల కర్మలను మృత్యువుగా అభివర్ణించాడు అశ్వలుడు. దానినుంచి యజమాని, ఋత్విక్కులు అతిమోక్షాన్ని ఎలా పొందుతారు అని అడిగాడు. దానికి యాజ్ఞవల్క్యుడు నాలుగు రకాల ఉపాసనలు చెప్పాడు. ప్రతి ఉపాసనలోనూ ఋత్విక్కు మూడు విషయాలను కలిపి ఉపాసన చేయాలి. దాన్ని ఐక్య ఉపాసన అంటారు. అవి

యజమానియొక్క ఒక అంగం, ఒక వేదానికి చెందిన ఒక ఋత్విక్కు, ఒక దేవత. వీటి సారాన్ని ఈ క్రింది పట్టికలో చూడవచ్చు.

| **ఋత్విక్కు** | **ఇంద్రియం** | **దేవత** |
|---|---|---|
| హోతా | వాక్కు | అగ్ని |
| అధ్వర్యుడు | కన్ను | ఆదిత్యుడు |
| ఉద్గాతా | ప్రాణం | వాయువు |
| బ్రహ్మ | మనస్సు | చంద్రుడు |

ఈ ఐక్య ఉపాసన చేస్తే మృత్యువును అధిగమిస్తారు. కాలపరిమితిని దాటుతారు. ఈ సందర్భంలో స్వర్గలోకాన్ని ఎలా పొందగలరు, స్వర్గలోకానికి మెట్లు లేనట్టుగా ఉంది కదా అని అడుగుతాడు. దానికి యాజ్ఞవల్క్యుడు స్వర్గలోకానికి ఒక నిచ్చెన ఉందనీ, ఆ నిచ్చెనను పట్టుకుని వెళ్ళవచ్చనీ, దాని పేరు ఐక్య ఉపాసన అనీ చెప్పాడు.

2. **సంపదుపాసనాని** – అశ్వలుడు మరో నాలుగు ప్రశ్నలను అడిగితే, వాటికి యాజ్ఞవల్క్యుడు నాలుగు సంపదుపాసనలను ప్రవేశపెట్టాడు. సంపదుపాసన అంటే ఒక చిన్న కర్మను చేస్తూ, దాన్ని పెద్ద కర్మగా ఊహించుకోవటం. నికృష్టవస్తువుమీద ఉత్కృష్టవిషయాన్ని ఊహించుకోవటం. రోజువారీ చేసే భోజనానికి ముందు ప్రార్థన జోడిస్తే, మాములు కర్మ అయిన భోజనం, యజ్ఞంగా మారుతుంది. ఆ ప్రశ్నలూ, జవాబులను ఒక పట్టికగా చూడవచ్చు.

| **ఋత్విక్కు** | **కర్మ** | **సంఖ్య** | **ఉత్కృష్టఫలం** |
|---|---|---|---|
| హోతా | దేవతలను ఆవాహన చేస్తాడు | మూడుసార్లు | భూలోక, భువర్లోక, సువర్లోకాలు |
| అధ్వర్యుడు | ఆహుతలను వేస్తాడు | మూడుసార్లు | సువర్లోక, భువర్లోక, భూలోకాలు |
| బ్రహ్మ | యజ్ఞ పర్యవేక్షణ చేస్తాడు | ఒకరి ద్వారా | విశ్వే దేవతల లోకాలు |
| ఉద్గాతా | దేవతలను స్తుతిస్తాడు | మూడుసార్లు | భూలోక, భువర్లోక, సువర్లోకాలు |

ఈ జవాబులతో తృప్తి చెందిన అశ్వలుడు విరమించాడు.

## 3.2. ఆర్తభాగ బ్రాహ్మణము

ముందు బ్రాహ్మణంలో ఐక్య ఉపాసన చేస్తే హిరణ్యగర్భ లోకానికి వెళతారనీ, దాన్ని అతిమోక్ష ఉపాసన అంటారనీ చూశాము. ఈ బ్రాహ్మణములో హిరణ్యగర్భలోకం కూడా సాపేక్షిక అమృతత్వాన్ని ఇస్తుంది తప్పితే, మోక్షాన్నివ్వదు అని చూస్తాము. దీన్ని కూడా రెండు అంశాలుగా విభజించవచ్చు. అవి – హిరణ్యగర్భ సంసారిత్వం, మోక్షసాధనం.

1. **హిరణ్యగర్భ సంసారిత్వం** – ఇక్కడ ప్రశ్నలు ఆర్తభాగుడు అడిగాడు కాబట్టి దీన్ని ఆర్తభాగ బ్రాహ్మణము అంటారు. ముందు బ్రాహ్మణములో మనుష్యులు చిక్కుకున్న మృత్యుకోరలు కాలం రూపంలో సూర్యుడు, చంద్రుడు అని చూస్తే, ఇప్పుడు హిరణ్యగర్భ చిక్కుకున్న మృత్యుకోరలు ఏమిటో ఈ బ్రాహ్మణంలో చూస్తాము. అవి రెండు రకాలు – గ్రహాలు, అతిగ్రహాలు. మొదటి భాగంలో గ్రహ, అతిగ్రహాల గురించి చూస్తాము.

'గ్రహాలెన్ని, అతిగ్రహాలెన్ని?' ఆర్తభాగుడు అడిగితే గ్రహాలు ఎనిమిది, అతిగ్రహాలు ఎనిమిది అని చెప్పాడు యాజ్ఞవల్క్యుడు. గ్రహాలంటే ఇక్కడ ఇంద్రియాలు. అవి మనను అదుపులో పెడతాయి. వాటి శక్తి ఎంత ఎక్కువంటే, అవి మనను అనేక దిక్కులకు పరుగులు పెట్టిస్తాయి. ఇంద్రియాలు గ్రహాలైతే, విషయవస్తువులు అతిగ్రహాలు. విషయవస్తువులు ఇంద్రియాలను అదుపులో పెడతాయి. టీవీ చూడవద్దనుకున్నా, కళ్ళు టీవీకి ఎంతలా అతుక్కుపోతాయో వేరే చెప్పాలా? ఉదాహరణకు జిహ్వ గ్రహం అయితే రసం అతిగ్రహం. రసం చేసే పని రుచి చూడటం. ఇది వ్యష్టిపరంగా.

ఇదే సూత్రాన్ని హిరణ్యగర్భకు కూడా ఆపాదించాలి. హిరణ్యగర్భను సమష్టి ఇంద్రియాలు, సమష్టి విషయవస్తువులు బంధిస్తాయి. దీన్నిబట్టి హిరణ్యగర్భ కూడా ఉపాధిలో బంధింప పడ్డాడని, ఆ సమష్టి ఉపాధిని గ్రహాలు, అతిగ్రహాలు నియంత్రిస్తున్నాయని తెలుస్తుంది.

2. **మోక్షసాధనం** – హిరణ్యగర్భ కూడా గ్రహ, అతిగ్రహ లక్షణ మృత్యువుచేత బంధింపబడేటట్టయితే, ఆ మృత్యువును అన్నంలా తినేవారెవరైనా ఉన్నారా అన్నది ప్రశ్న. దానికి పరోక్షంగా ఇచ్చిన జవాబు ఆత్మజ్ఞానం పొందిన జ్ఞానే గ్రహ, అతిగ్రహ లక్షణ మృత్యువును జయించి సంసారాన్ని దాటుతాడు. అటువంటి జ్ఞాని ఎలా మరణిస్తాడో తెలుసుకోవాలంటే ముందు అజ్ఞాని గురించి చూడాలి. అజ్ఞాని మరణించినప్పుడు ప్రాణం బయటకు వస్తుంది. ప్రాణం బయటకు పోవటాన్ని **ప్రాణోత్క్రమణం** అంటారు. ప్రాణోత్క్రమణం జరిగిందంటే పునర్జన్మ ఉంటుందని అర్థం. కాని జ్ఞాని మరణిస్తే, అతను ఉబ్బుతాడు, గాలితో నింపబడతాడు. శరీరం మరణించి పడివుంటుంది. ప్రాణం సమష్టి ప్రాణంలో లయమైపోతుంది. అందువల్ల జ్ఞానికి పునర్జన్మ లేదు. విదేహముక్తి పొందుతాడు. అందువల్ల జ్ఞానికి ప్రయాణం లేదు. జ్ఞాని మరణించాక ఒక్కటి మాత్రం మిగిలి ఉంటుంది. ఏమిటది? జ్ఞాని నామం.

ఒక అజ్ఞాని మరణించాక అతని జీవుణ్ణి ఏది నియంత్రిస్తుందని ఆర్తభాగుడు ప్రశ్నిస్తే, అది నిండు సభలో ప్రశ్నించేది కాదని, వారిరువురు విడిగా వెళ్ళి చర్చించుకుని, కర్మ మాత్రమే నియంత్రిస్తుందని తేల్చుకున్నారు. అంటే అతను సంసారి. దీనితో ఆర్తభాగుడు శాంతించాడు.

## 3.3. భుజ్యు బ్రాహ్మణము

ఈ బ్రాహ్మణంలో కూడా రెండు అంశాలు చూస్తాము. ఇక్కడ భుజ్యుడు ప్రశ్నలు అడిగాడు కాబట్టి, దీన్ని భుజ్యు బ్రాహ్మణము అంటారు. ఇందులో అంశాలు – అశ్వమేధ యాగఫలం, హిరణ్యగర్భ సంసారిత్వం.

1. **అశ్వమేధ యాగఫలం** – భుజ్యుడు హిరణ్యగర్భలోకం గురించి అడిగాడు. కాని ప్రత్యక్షంగా అడగకుండా, ఒక కథ చెప్పి, పారిక్షితులు ఎక్కడ ఉన్నారని అడిగాడు. యాజ్ఞవల్క్యుడు కూడా పరోక్షంగానే చెబుతాడు. అశ్వమేధయాగం చేసినవారు ఎక్కడికి వెళతారో, పారిక్షితులు కూడా అక్కడికే వెళతారు అన్నాడు. అంతేకాని ఆ లోకమేమిటో చెప్పలేదు. భుజ్యుడు అడిగాక, హిరణ్యగర్భలోకానికి వెళతాడు అని చెప్పాడు.

2. **హిరణ్యగర్భకు సంసారిత్వం** – హిరణ్యగర్భ కూడా సంసారిలోకే వస్తాడని అంతకుముందు చూశాము. ఇక్కడ కూడా అదే వస్తుంది, కాకపోతే పరోక్షంగా. హిరణ్యగర్భలోకానికి ప్రయాణాన్ని వివరిస్తాడు. లోకాల కొలతలను కూడా ఇస్తాడు. భూలోకం ముప్పయిరెండు దేవరథ అహ్నాలు ఉంది; దానికి రెండురెట్లు పృథివీతత్త్వం, దానికి రెండురెట్లు సముద్రతత్త్వం ఉంది. అక్కడ బ్రహ్మాండంయొక్క రెండు కపాలాలను అండకపాలాలంటారు. వాటి మధ్య స్థానం ఎంత సన్నగా ఉంటుందంటే, దాన్ని శాస్త్రం క్షురకత్తి కొనతోనూ, ఈగ రెక్కతోనూ పోల్చింది. అగ్నిదేవుడు పక్షిరూపంలో ఈ అశ్వమేధయాజులను తీసుకువెళ్ళి వాయువుకు అందజేస్తే, వాయువు హిరణ్యగర్భలోకానికి తీసుకు వెళతాడు అన్నాడు. ఆ లోకాలకు, వాటికి ప్రయాణాన్ని వివరించటంద్వారా దేశపరిచ్ఛిన్నాన్ని సూచిస్తున్నాడు. అందువల్ల బ్రహ్మకు కూడా సంసారిత్వం తప్పదని చెప్పకనే చెప్పినట్టు అవుతున్నది.

దీనితో భుజ్యుడు శాంతించాడు.

ఇక్కడితో వేదపూర్వభాగం అంశం ముగిసింది. వేదవిత్తముడు అంటే వేదపూర్వభాగంలోనూ, వేద అంతభాగంలోనూ ఆరితేరి ఉండాలని సూచిస్తున్నాడు. యాజ్ఞవల్క్యుడు రెండింటిలోనూ దిట్ట. 4–8 బ్రాహ్మణములు జ్ఞానకాండను సూచిస్తాయి.

## 3.4. ఉషస్త బ్రాహ్మణము

ఈ బ్రాహ్మణములో ఉషస్తుడు అనే బ్రాహ్మణుడు యాజ్ఞవల్క్యుణ్ణి జ్ఞానకాండనుంచి ప్రశ్నలు వేస్తాడు. ఎక్కువగా ఈ అధ్యాయంలో బ్రాహ్మణములు, ప్రశ్నలు వేసే బ్రాహ్మణుల పేరిట వచ్చాయి. అన్నింటిలోనూ జవాబు చెప్పేది యాజ్ఞవల్క్యుడే. ఈ బ్రాహ్మణములో

ఒక్కటే ముఖ్య అంశం ఉంది. అది జీవాత్మస్వరూపం లేదా ఆత్మవిద్య. అందువల్ల ఇందులో చాలా ముఖ్యమైన మంత్రాలు ఉన్నాయి. ఇక్కడ ప్రశ్నలు అడిగే బ్రాహ్మణులు కూడా పండితులే. అందువల్ల ఉషస్తుడే బ్రహ్మ గురించి ఒక అద్భుతమైన నిర్వచనం ఇచ్చాడు.

**యత్సాక్షాదపరోక్షాద్బ్రహ్మ య ఆత్మా సర్వాంతరస్తః మే వ్యాచక్ష్వేతి॥**

దీని అర్థం సర్వవ్యాపి అయిన బ్రహ్మ విశ్వంలో అన్నింటిలోనూ వాటి సారంగా ఉంది. ఈ నిర్వచనమే మహావాక్యాన్ని సూచిస్తుంది. అది చెప్పి, దాని గురించి నువ్వు అంతా చెప్పు అంటున్నాడు ఉషస్తుడు.

**జీవాత్మ స్వరూపం** – యాజ్ఞవల్క్యుడేమీ తక్కువ తినలేదు. ఆయన కూడా ఒక్కవాక్యంలో చెప్పాడు.

**ఏష త ఆత్మా సర్వాంతరః**

ఈ నీ ఆత్మయే సర్వానికి సారం. నీ ఆత్మ అంటే స్థూల, సూక్ష్మశరీరాల్లో ఉన్న ఆత్మ. అంటే నీలో ఉన్న ఆత్మే నువ్వు చెప్పిన అన్ని భూతాల అంతరాత్మ. అలా పరోక్షంగా చెప్పటం కాదు. ఇది ఎద్దు, ఇది గుర్రం అని ఎలాగైతే ఎవరైనా చెబుతారో, అంత స్పష్టంగా చెప్పు అంటాడు ఉషస్తుడు.

అప్పుడు అక్షరలక్షలు చేసే మంత్రం వస్తుంది. బృహదారణ్యంలో అలాంటివి ఎన్నో ఉన్నాయి.

**న దృష్టేర్ద్రష్టారం పశ్యేర్న శ్రుతేః శ్రోతారం శృణుయా న మతేర్మన్తారం మన్వీథా న విజ్ఞాతేర్విజ్ఞాతారం విజానీయాః।**

దీని సారం ఆత్మ తెలుసుకోబడే ఆబ్జెక్టు కాదు, తెలుసుకునే నువ్వే అది. జగత్తు, శరీరం, మనస్సులు ఆబ్జెక్టుగా తెలుస్తాయి. కాని వీటిని చూసే ఆత్మను చూడలేము.

**న దృష్టేర్ద్రష్టారం పశ్యేః –** చూపును చూసే సాక్షిని నువ్వు చూడలేవు.
**న శ్రుతే శ్రోతారం శృణుయాః** – శబ్దాన్ని వినే సాక్షిని నువ్వు వినలేవు.
**న మతేర్మంతారం మన్వీథాః** – మనస్సును మననం చేసే సాక్షిని నువ్వు మననం చేయలేవు
**న విజ్ఞాతేర్విజ్ఞాతారం విజానీయాః** – బుద్ధిని తెలుసుకునే సాక్షిని నువ్వు బుద్ధి ద్వారా తెలుసుకోలేవు.

అలా అయితే సాక్షి ఉన్నట్టు ఎలా తెలుసు? ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును ఒకటి సాక్షిగా చూస్తోందని తెలుస్తున్నది. అదే ఆత్మ లేదా సాక్షిచైతన్యం.

**అతోఽన్యదార్తం** – అతః అన్యత్ ఆర్తం – ఈ వాక్యం చాలా ముఖ్యమైనది. అద్వైతానికి ఆయువుపట్టు ఇది. అతః అంటే సాక్షి కానిది; అన్యత్ – తక్కినవన్నీ (జగత్తు, శరీరం, మనస్సు) ఆర్తం – మిథ్యా.

మొత్తం కలిపి బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా అని అర్థం వస్తుంది. ఇందులో ప్రతి బ్రాహ్మణమూ ఈ సారంతో ముగుస్తుంది. ఈ జవాబుతో ఉషస్తుడు విరమించాడు.

## 3.5. కహోల బ్రాహ్మణము

కహోలుడు అనే బ్రాహ్మణుడు అడుగుతాడు కాబట్టి దీన్ని కహోల బ్రాహ్మణము అంటారు. ఇందులో రెండు అంశాలు చూస్తాము. అవి – ఆత్మ అసంసారి, సాధనలు.

కహోలుడు ఆత్మ గురించి ఇంకా చెప్పమంటాడు. దాని ఉద్దేశ్యం, తత్ పద విచారణ, ఐక్యం కూడా కావాలని.

1. **ఆత్మ అసంసారి – యోఽశనాయాపిపాసే శోకం మోహం జరాం మృత్యుమత్యేతి।**

ఏదైతే ఆకలిని, దాహాన్ని, శోకాన్ని, మోహాన్ని, వృద్ధాప్యాన్ని, మృత్యువును అతిక్రమిస్తుందో అది ఆత్మ.

ఇదీ ఆత్మ నిర్వచనం. ఒక్కముక్కలో చెప్పాలంటే ఆత్మ అసంసారి. సంసారాన్ని సాగరంతో పోలుస్తారు. సాధారణంగా ఆ సాగరంలో ఆరు అలలు మనను సుతారంగా తాకి వెళ్ళవచ్చు లేదా ముంచేయవచ్చు అంటుంది ఉపనిషత్తు. అవి ఆకలి, దాహం, శోకం, మోహం, వృద్ధాప్యం, మృత్యువు.

| | |
|---|---|
| అశనాయా పిపాసలు | – ప్రాణానికి చెందినవి |
| శోకమోహాలు | – మనస్సుకు చెందినవి |
| జరామృత్యువులు | – శరీరానికి చెందినవి |

ఆ విధంగా ఈ ఆరూ, మూడు స్థాయిల్లో మనిషిని కుదిపివేస్తాయి. అత్యేతి – ఆత్మ మాత్రం వీటికి అతీతమైనది. అది నిత్యముక్త ఆత్మ. ఈ వర్ణనను మహావాక్యంగా తీసుకోవచ్చు.

2. **సాధనలు** – రెండు మార్గాలు సూచించబడ్డాయి. సాక్షాత్ సాధన – ఆత్మజ్ఞానం, సహకారీ సాధన – సన్న్యాసం. ముందు సహకారీ సాధనను చూస్తాము.

**పుత్రైషణాయాశ్చ విత్తైషణాయాశ్చ లోకైషణాయాశ్చ వ్యుత్థాయాథ భిక్షాచర్యం చరన్తి।**

బ్రాహ్మణులు (ఈ ఆత్మను తెలుసుకుని) పుత్రులు కావాలి, లోకాలు గెలవాలి, ధనం సంపాదించాలి అనే ఈ కోరికలకు అతీతంగా ఎదిగి, సన్న్యాసం స్వీకరిస్తారని అర్థం. వారు

నిత్యానిత్యవస్తువివేకంద్వారా, ఆత్మవల్లనే మోక్షం వస్తుంది; అనాత్మవల్ల రాదని తెలుసుకుని సన్న్యాసం స్వీకరిస్తారు. సన్న్యాసం అర్థం చూడగానే శంకరాచార్యులవారికి పండగే! వెంటనే సన్న్యాసభాష్యం రాసేస్తారు. కాని గృహస్థులకు దాన్ని ఆంతరసన్న్యాసంగా తీసుకోవాలి. ఇది సహకారీ సాధన. మరి సాక్షాత్ సాధన ఏమిటి?

**తస్మాద్బ్రాహ్మణః పాణ్డిత్యం నిర్విద్య బాల్యేన తిష్ఠాసేత్।**

అంటే సాక్షాత్ సాధన అయిన శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలి. వాటికి ఇక్కడ వచ్చిన పదాలు వరుసగా పాండిత్యం, బాల్యం, మౌనం.

**అతోఽన్యదార్తమ్** – బ్రహ్మ కానిది ఏదైనా మిథ్యే. మళ్ళీ బ్రహ్మ సత్యం జగన్మిథ్యా వేదాంత సారం వస్తుంది.

దీనితో కహోలుడు ఉపరమించాడు.

## 3.6. గార్గీ బ్రాహ్మణము

ఇక్కడ ప్రశ్న వేసినది గార్గీ అనే బ్రహ్మవాదిని. చాలామందికి యాజ్ఞవల్క్యునికి ఇద్దరు భార్యలు ఉన్నారని తెలుసు; వారి పేర్లు మైత్రేయి, కాత్యాయని. గార్గిని యాజ్ఞవల్క్యుని భార్యగా పొరపాటు పడతారు కొందరు. కాని ఆమె బ్రహ్మజ్ఞానానికి అంకితమైన పండితురాలు. బ్రాహ్మణులందరిలోకి ప్రముఖ వ్యక్తి. అందువల్ల ఆమె మళ్ళీ 8వ బ్రాహ్మణములో వస్తుంది.

ఇందులో కూడా రెండు అంశాలు ఉంటాయి. కాకపోతే రెండవ అంశాన్ని యాజ్ఞవల్క్యుడు సూచనప్రాయంగా తన జవాబులో చొప్పిస్తాడు. అవి ఆత్మ సర్వాంతరః, హిరణ్యగర్భ జ్ఞానం.

1. **ఆత్మ సర్వాంతరః**

**యత్సాక్షాదపరోక్షాద్బ్రహ్మ య ఆత్మా సర్వాంతరః** – 3.4.1

బ్రహ్మ గురించిన ఈ నిర్వచనాన్ని ఉషస్తుడు నాలుగవ బ్రాహ్మణములో ఇచ్చాడు. ఈ సర్వాంతరః పదం చాలా ముఖ్యమైనది. అందువల్ల ఇక్కడ్నుంచీ అంటే 6, 7, 8 బ్రాహ్మణాలలో ఈ అంశమే చర్చనీయాంశమైనది.

అంతరః అంటే అక్షరాలా తీసుకుంటే లోపల. కాని వేదాంతంలో అంతరం అంటే అధిష్ఠానం. కుండకు అధిష్ఠానం (ఆధారం) మట్టి; ఆభరణాలకు అధిష్ఠానం బంగారం. ఇంకో విధంగా చెప్పాలంటే అంతరతత్త్వం కారణం అవుతుంది, బాహ్యంగా ఉన్నది కార్యం అవుతుంది. అంతరతత్త్వం అపరిచ్ఛిన్నం అవుతుంది, రెండోది పరిచ్ఛిన్నం అవుతుంది. అలాగే అంతరతత్త్వం సూక్ష్మం అవుతుంది, బాహ్యం స్థూలం అవుతుంది.

ఇవన్నీ కలిపితే కారణసూక్ష్మ అపరిచ్ఛిన్న వస్తువు, కార్యస్థూలపరిచ్ఛిన్న వస్తువుకు అంతరాత్మ. సర్వాంతరం తెలుసుకోవాలంటే ఒక కార్యంనుంచి దాని కారణానికి వెళ్ళి, ఆ కారణానికి కారణం వెతుక్కుంటూ వెళ్ళాలి. ఎంతవరకూ? దాని మూలకారణం వచ్చేదాకా. అప్పుడే అది సర్వాంతరం అవుతుంది. ఇక్కడ కారణాన్ని గార్గి ఓతం, ప్రోతం అంటుంది. దాన్ని పడుగుపేక అని కూడా అంటారు.

మొదటి ప్రశ్నకు గార్గి తనే నమూనాగా ఒక జవాబు ఇచ్చి, దాని ఆధారంగా ప్రశ్నలు వేస్తూ వస్తుంది. భూమికి ఓతం, ప్రోతం నీరు. నీటికి ఓతం, ప్రోతం ఏమిటి? దానికి వాయువు అని యాజ్ఞవల్క్యుడు చెప్పాడు. అలా పన్నెండు లోకాలు జవాబులుగా వస్తాయి. భూమి కారణంనుంచి చూస్తే నీరు, వాయువు, అంతరిక్షలోకం, గంధర్వలోకం, ఆదిత్య లోకం, చంద్రలోకం, నక్షత్రలోకం, దేవలోకం, ఇంద్రలోకం, ప్రజాపతిలోకం, బ్రహ్మలోకం. పై లోకానికి వెళ్ళేకొద్దీ వాటి సూక్ష్మత్వం పెరుగుతూ వస్తుంది. బ్రహ్మలోకం చివరగా వస్తుంది. అది సూక్ష్మతమలోకం.

2. **హిరణ్యగర్భ జ్ఞానం** – యాజ్ఞవల్క్యుడు సూచన ప్రాయంగా చెప్పించిన అంశం ఇది. బ్రహ్మలోకానికి అంతరం ఏమిటని గార్గి అడుగుతుంది. నిజానికి దానికి జవాబు బ్రహ్మలోక అధిపతి, హిరణ్యగర్భ. ఆయన చేతనతత్త్వం. ప్రత్యక్ష, అనుమాన ప్రమాణాలకు చేతనతత్త్వం అందదు. అందువల్ల బ్రహ్మను తెలుసుకోవాలంటే వాటిని వదిలి శాస్త్రప్రమాణానికి రావాలి. అందువల్ల హిరణ్యగర్భను **అనతి ప్రశ్న్యాం వై దేవతామ్ అతిపృచ్ఛసి** అంటున్నాడు. నువ్వు అతి ప్రశ్నలు వేస్తున్నావు.

**తే మూర్ధా వ్యపతత్** – అలా అనతి ప్రశ్నలు వేస్తే నీ తల ఊడి పడుతుంది అని హెచ్చరిస్తున్నాడు యాజ్ఞవల్క్యుడు.

దీని అర్థం ఇది అపౌరుషేయజ్ఞానం. అందువల్ల శాస్త్రం ద్వారానే తెలుసుకోవాలి. ఈ బెదిరింపుకు భయపడి అప్పుడు తగ్గుతుంది గార్గి. కాని రెట్టించిన ఉత్సాహంతో 8వ బ్రాహ్మణంలో మళ్ళీ వస్తుంది.

సర్వాంతరం ఏమిటో తెలుకునే మన ఈ ప్రయాణంలో భూలోకంనుంచి మొదలుపెట్టి బ్రహ్మలోకంవరకూ చేరుకున్నాము. అక్కడిదాకా జడప్రపంచం వస్తుంది. దానినుంచి చేతనతత్త్వంలోకి అడుగుపెడతాము. బ్రహ్మలోకానికి అధిపతి హిరణ్యగర్భ; హిరణ్యగర్భకు కారణం ఈశ్వరుడు; ఈశ్వరునికి కారణం నిర్గుణబ్రహ్మ. ఇకముందు మనం బ్రహ్మలోకంనుంచి హిరణ్యగర్భకు, హిరణ్యగర్భనుంచి ఈశ్వరునికి, ఈశ్వరునినుంచి నిర్గుణబ్రహ్మకు ప్రయాణం చేస్తాము. ఈ మంత్రాలలో హిరణ్యగర్భను సూత్రం అనీ, ఈశ్వరుణ్ణి అంతర్యామి అనీ, నిర్గుణబ్రహ్మను అక్షరబ్రహ్మ అనీ చూస్తాము.

## 3.7. అంతర్యామి బ్రాహ్మణము

ఈ బ్రాహ్మణంలో ఉద్దాలకుడు ప్రశ్నలు వేస్తాడు. ఇంతవరకూ ప్రశ్నలు వేసిన బ్రాహ్మణుని పరంగా బ్రాహ్మణము పేరు వచ్చింది. కాని దీనికి అంతర్యామి బ్రాహ్మణము పేరు అంతర్యామి గురించిన బోధవల్ల వచ్చింది. ఇందులో కూడా రెండు అంశాలు చూస్తాము. అవి హిరణ్యగర్భ, ఈశ్వరుడు. కాకపోతే ఇక్కడ సూత్రం, అంతర్యామిగా చూస్తాం.

1. **సూత్రం** – ఉద్దాలకుడు ఒక కథ చెప్పి, అందులో ఒక గంధర్వుడు రెండు ప్రశ్నలు అడిగాడని చెబుతాడు. ఇప్పుడు మొదటి ప్రశ్న చూద్దాము. సూత్రం గురించి తెలుసా అని అడిగాడు. గంధర్వుడే సూత్రాన్ని ఇలా నిర్వచిస్తున్నాడు.

**అయం చ లోకః పరశ్చ లోకః సర్వాణి చ భూతాని సన్దృబ్ధాని భవన్తి**

సూత్రం ఈ లోకాన్ని, పరలోకాన్ని, అన్ని జీవాలను కలిపి ఉంచుతాడు. సూత్రం అంటే హిరణ్యగర్భ అని చూశాము. అనేక పూలను ఎలాగైతే దారం ఒక మాలగా కలిపి ఉంచుతుందో, అలా అన్ని జీవరాసులూ ఒకే విశ్వాత్మలో కలిసి ఉన్నాయి. హిరణ్యగర్భ సకల జీవరాసులను కలిపి ఉంచుతాడు కాబట్టి హిరణ్యగర్భకు సూత్రం అనే పేరు వచ్చింది. యాజ్ఞవల్క్యుడు దానికి తడుముకోకుండా, ఒక్క మంత్రంలో జవాబు చెబుతాడు.

**స హోవాచ వాయుర్వై గౌతమ తత్సూత్రమ్**

ఓ గౌతమా! ఆ సూత్రం నిశ్చయంగా వాయువే. వాయువు అంటే గాలిగా తీసుకోకూడదు. వాయుదేవతగా తీసుకోవాలి. వాయుదేవత సమష్టి ప్రాణదేవత. గంధర్వుడు చెప్పిన నిర్వచనం అంతా వాయువు పేరు చెప్పి మళ్ళీ చెప్పాడు అంటే సూత్రం ఈ లోకాన్ని, పరలోకాన్ని, అన్ని జీవులను కలిపి ఉంచుతాడని చెప్పాడు. ప్రాణతత్త్వమే ఒక వ్యక్తిలోని అన్ని అంగాలను కలిపి (దేహరూపంగా) ఉంచుతుంది. ఆ వ్యక్తి మరణిస్తే ప్రాణం పోయింది అంటాము. అందువల్ల ప్రాణతత్త్వమే జీవనానికి ఆధారం. ఈ జవాబుతో ఉద్దాలకుడు తృప్తి చెందాడు.

2. **అంతర్యామి** – రెండవ ప్రశ్న కూడా ముందే అడిగాడు. మనం ఇప్పుడు చూస్తున్నాము. అంతర్యామి ఎవరు? అంతర్యామి నిర్వచనం –

**య ఇమం చ లోకం పరం చ లోకగ్ం సర్వాణి చ భూతాని యోఽన్తరో యమయతీతి॥**

అతను లోపల ఉన్నవాడై ఈ లోకాన్ని, పరలోకాన్ని, అన్ని జీవాలను కూడా నియమించుతున్నాడు. అంతేకాదు ఆ గంధర్వుడు ఎవరైతే ఆ అంతర్యామిని నిశ్చయంగా తెలుసుకుంటారో –

**స బ్రహ్మవిత్సలోకవిత్స దేవవిత్స భూతవిత్స ఆత్మవిత్స సర్వవిదితి** – అతను బ్రహ్మవేత్త, లోకాలను తెలిసినవాడు, దేవతలను తెలిసినవాడు, వేదాలను తెలిసినవాడు, ప్రాణాలను తెలిసినవాడు, ఆత్మను తెలిసినవాడు, సర్వం తెలిసినవాడు అవుతాడు అన్నాడని చెప్పి, యాజ్ఞవల్క్యునికి జవాబు తెలియని పక్షంలో అతని తల ఊడిపడగలదని కూడా బెదిరిస్తాడు.

**మూర్ధా తే వ్యపతిష్యతీతి**

యాజ్ఞవల్క్యుడు మామూలు మనిషి కాదు, సాక్షాత్తూ విష్ణుమూర్తి అవతారం అంటారని అతనికి తెలియదు. ఈ ప్రశ్నకు తక్కిన మంత్రాలలో చాలా వివరంగా జవాబు చెప్తూకు వస్తాడు యాజ్ఞవల్క్యుడు. అందువల్ల ఈ బ్రాహ్మణానికి అంతర్యామి బ్రాహ్మణము అనే పేరు వచ్చింది.

ఈ మంత్రాలలో అంతర్యామి స్వరూపం గురించి వస్తుంది. అంతర్యామి సూత్రం లోపల ఉండి సూత్రాన్ని నియంత్రిస్తాడు. ఇంకో విధంగా చెప్పాలంటే ఈశ్వరుడు హిరణ్యగర్భ లోపల ఉండి హిరణ్యగర్భను నియంత్రిస్తాడు. ఇక్కడ తత్త్వబోధ గుర్తుకు తెచ్చుకోవాలి.

**శుద్ధ చైతన్యం**

| **వ్యష్టి ప్రతిబింబాలు** | **సమష్టి ప్రతిబింబాలు** |
|---|---|
| స్థూలశరీరం – విశ్వ | స్థూలప్రపంచం – విరాట్ |
| సూక్ష్మశరీరం – తైజస | సూక్ష్మప్రపంచం – హిరణ్యగర్భ |
| కారణశరీరం – ప్రాజ్ఞ | కారణప్రపంచం – ఈశ్వరుడు |

హిరణ్యగర్భ – సమష్టి సూక్ష్మప్రపంచ సహిత చైతన్యం
ఈశ్వరుడు – సమష్టి కారణప్రపంచ సహిత చైతన్యం

ఈశ్వరుడు హిరణ్యగర్భను నియంత్రిస్తాడు. ఇందులో పదాలపరంగా చూస్తే అంతర్యామి, సూత్రానికి ఆంతరంగా ఉండి నియంత్రిస్తాడు. ఎవరెవరిలో అంతర్యామి అంతరంగా ఉన్నాడో మూడు స్థాయిల్లో చూపించాడు.

**అధిదైవం** – సమష్టిలో పృథివీ దేవత, జలదేవత, అగ్నిదేవత, అంతరిక్ష దేవత, వాయు దేవత, ద్యులోకదేవత, ఆదిత్య దేవత, దిగ్దేవత, చంద్రతారకల దేవత, ఆకాశ దేవత, తమస్ దేవత, తేజస్ దేవతలు.

**అధిభూతం** – అన్ని జీవాలలో కూడా ఉన్నాడు. అధిభూతాన్ని భౌతిక శరీరాలుగా అభివర్ణిస్తారు.

**అధ్యాత్మం** – వ్యష్టిలో ఘ్రాణేంద్రియం(ప్రాణం), వాక్కు, చక్షువు, శ్రోత్రం, మనస్సు, త్వగింద్రియం, విజ్ఞానం(బుద్ధి), జననేంద్రియం.

అంతర్యామి అధిదైవం, అధిభూతం, అధ్యాత్మాలలో వాటి లోపల వాటికి చెందిన శరీరాలలో ఉన్నాడు. కాని వాటికి ఆ విషయం తెలియదు. అంతర్యామి వాటిలోపల ఉండి వాటిని నియంత్రిస్తాడు కాబట్టి ఈశ్వరునికి అంతర్యామి పేరు వచ్చింది.

**అంతరో యమయతి ఇతి అంతర్యామి॥**

అంతర్యామి అందరినీ నియంత్రిస్తాడు! అంటే కర్మఫలదాతగా కర్మఫలాలను ఇస్తాడు. అది కూడా తనకు తోచినట్టుగా కాదు, మనం చేసిన కర్మలకు తగ్గ ఫలాలను ఇస్తాడు. అంతర్యామిని ఇలా నిర్వచించాక యాజ్ఞవల్క్యుడు అంతర్యామి స్వరూపలక్షణాన్ని వివరిస్తున్నాడు.

అంతర్యామి సమష్టిపరంగా సమష్టికారణ ప్రపంచం లేదా మాయ; వ్యష్టిపరంగా చైతన్యం లేదా సాక్షిచైతన్యం. అంతర్యామి స్వరూపాన్ని ఇక్కడ సాక్షిచైతన్యంగా చూపించదలుచుకున్నాడు యాజ్ఞవల్క్యుడు.

సాక్షిచైతన్యాన్ని అద్రష్టా, అశ్రోతా, అమంతా, అవిజ్ఞాతా అంటున్నాడు. ఈ అద్రష్టా పదం ఇప్పటికే రెండుసార్లు చూశాము.

**న దృష్టేర్ద్రష్టారం పశ్యేః॥**

చూపుని చూసే ఆత్మను నువ్వు చూడలేవు.

మనస్సు ద్రష్ట 1 అయితే సాక్షిచైతన్యం ద్రష్ట 2 అవుతుంది. మనస్సు సవికార ద్రష్ట అయితే, సాక్షిచైతన్యం నిర్వికారద్రష్ట.

**అదృష్టో ద్రష్టాఽ శ్రుతశ్శ్రోతాఽ మతో మంతాఽ విజ్ఞాతో విజ్ఞాతా**

ఇందులో ద్రష్టా, శ్రోతా, మంతా, విజ్ఞాతా పదాలు మనస్సును సూచిస్తే, అదృష్టః, అశ్రుతః, అమతః అవిజ్ఞాతః పదాలు సాక్షిని సూచిస్తాయి.

ఇప్పుడు రెండింటినీ కలిపిచూస్తే సాక్షి లేదా ఆత్మ చూసేది కాని చూడబడేది కాదు; వినేది కాని వినబడేది కాదు; ఆలోచించేది కాని ఆలోచన కాదు; తెలుసుకునేది కాని తెలియబడేది కాదు.

మొదట చూసిన నాలుగు పదాలను చూస్తే – ఆత్మ సర్వమనోవృత్తి సాక్షి

తరువాత చూసిన నాలుగు పదాలూ చూస్తే – ఆత్మ ఎప్పటికీ సబ్జెక్ట్ కాని, ఆబ్జెక్టు ఎన్నటికీ కాదు.

ఆత్మ అంటే ఈశ్వర ఆత్మ లేదా అంతర్యామి ఆత్మ.

**నాన్యోఽతోఽస్తి ద్రష్టా నాన్యోఽతోఽస్తి శ్రోతా నాన్యోఽతోఽస్తి మన్తా నాన్యోఽతోఽస్తి విజ్ఞాతైష త ఆత్మాన్తర్యామ్యమృతః** – ఈ నాలుగు వాక్యాలను కలిపి తీసుకోవాలి. ఇవి జీవాత్మ పరమాత్మ ఐక్యాన్ని ఎలా సూచిస్తాయో చూద్దాము.

**అతః అన్యః ద్రష్టా నాస్తి**

అతః అంటే అంతర్యామినః. అంతర్యామినః అన్య ద్రష్టా నాస్తి అంటే అంతర్యామి కాకుండా వేరే ద్రష్టా లేదు. అలా ఆ నాలుగు వాక్యాల అర్థం ఒక్కవాక్యంలో చూస్తే అంతర్యామి కాకుండా అనుభవించే వ్యక్తి వేరే లేదు. అనుభవించే వ్యక్తి ఒకరే. అది ఈశ్వరుడు.

సమష్టి ఉపాధిపరంగా చూస్తే ఈశ్వరుడు, వ్యష్టి ఉపాధిపరంగా చూస్తే జీవుడు.

**అతోఽన్యదార్తం** – అంతర్యామి సత్యం, అమృతం, తక్కినదంతా నాశనమయ్యేది, మిథ్య.

బ్రహ్మ సత్యం జగన్మిథ్యా

దీనితో ఉద్దాలకుడు వెనుతిరిగాడు.

## 3.8. అక్షర బ్రాహ్మణము

గార్గి ఆరవ అధ్యాయంలో బ్రహ్మలోకానికి అంతరం ఏమిటని అడిగింది. బ్రహ్మలోకానికి అధిపతి హిరణ్యగర్భ అని ఆవిడకు చెప్పకుండా అతిప్రశ్నలు వేస్తే నీ తల వేయి ముక్కలవుతుంది అన్నాడు. అప్పుడు ఊరుకుని, ఇప్పుడు రెట్టించిన ఉత్సాహంతో ముందుకు వచ్చింది. ఆ మధ్యలో యాజ్ఞవల్క్యుడు బ్రహ్మలోక అధిపతి హిరణ్యగర్భ అనీ, హిరణ్యగర్భ లోపల ఉండి ఆయనను నియంత్రించేది ఈశ్వరుడు అని చెబుతాడు. కాకపోతే మనం అక్కడ చూసిన పదాలు సూత్రం, అంతర్యామి.

ఈ బ్రాహ్మణం చాలా ముఖ్యమైనది. ఎందుకంటే ఇందులో నిర్గుణబ్రహ్మ గురించి వస్తుంది. నిర్గుణబ్రహ్మను అక్షరం బ్రహ్మ అనికూడా అంటారు. అందువల్ల ఈ అధ్యాయానికి అక్షర బ్రాహ్మణము అని పేరు వచ్చింది. ఇక్కడ కూడా రెండు అంశాలు ఉన్నాయి. అవి – అంతర్యామి, అక్షరం బ్రహ్మ.

1. **అంతర్యామి** – గార్గి తను ఆరవ అధ్యాయంలో అడిగిన పదాలతోనే ఇప్పుడు కూడా హిరణ్యగర్భకు లేదా సూత్రానికి ఓతం, ప్రోతం ఏది అని అడిగింది. ఆవిడ హిరణ్యగర్భను ఆకాశానికి పైన, భూమికి కింద, రెండింటి మధ్యలో ఉండి, అన్ని కాలాల్లోనూ ఉంటాడని, సర్వాత్మకుడు అని వర్ణించింది.

యాజ్ఞవల్క్యుడు ఆవిడ చెప్పిన నిర్వచనం అంతా మళ్ళీ చెప్పి ఆ సూత్రానికి ఓతం, ప్రోతం **ఆకాశం** అని చెబుతాడు. ఇక్కడ ఆకాశం అంటే పంచభూతాలలో ఒకటైన ఆకాశం కాదు, ఈశ్వరుడు లేదా అంతర్యామి. ఈశ్వరుడు అంటే సమష్టి కారణ ప్రపంచ సహిత చైతన్యం.

2. **అక్షరం బ్రహ్మ** – ఆకాశంయొక్క ఓతం ప్రోతం ఏది అని అడిగింది గార్గి. చాలా కష్టమైన ప్రశ్న అడిగానని భావిస్తుంది గార్గి. అందువల్ల ముందే తక్కిన బ్రాహ్మణులతో చెబుతుంది. నా ఈ రెండు ప్రశ్నలకు యాజ్ఞవల్క్యుడు జవాబు చెప్పగలిగితే, ఇంక మీలో వేరెవరూ ఆయనను బ్రహ్మవిద్యలో నిశ్చయంగా జయించలేరు అని హెచ్చరించింది కూడా. యాజ్ఞవల్క్యునివంటి సర్వజ్ఞులకు నిర్గుణబ్రహ్మ గురించి చెప్పటం సమస్యే కాదు. నేను అక్షరబ్రహ్మను వివరించి చెడ్డపేరు తెచ్చుకోను కాని, అంతకు ముందు ఋషులు ఎలా చెప్పారో అలా నేను చెబుతాను అన్నాడు.

ఇక్కడ నేతి నేతి పద్ధతి ద్వారా, 25 నిషేధపదాలద్వారా బ్రహ్మను వర్ణిస్తాడు యాజ్ఞవల్క్యుడు. ఈ మంత్రం (3.8 8) అక్షరలక్షలు విలువ చేసే మంత్రం. మంత్రం సారాంశం చూద్దాము.

1. ఆత్మ ద్రవ్యం కాదు – వస్తువు కాదు
   స్థూలం కాదు, సూక్ష్మం కాదు, పొట్టిది కాదు, పొడుగుది కూడా కాదు.

2. గుణం లేదు – గుణాలు లేవు
   ఎరుపు కాదు (రంగులు కాదు), ద్రవ్యం కాదు, నీడ కాదు, చీకటి కూడా కాదు.

3. పంచభూతాలు కాదు
   వాయువు కాదు, ఆకాశం కాదు (తక్కినవి కలుపుకోవాలి).

4. సంబంధం లేదు
   అసంగమ్ – దేనితోనూ సంబంధం లేదు.

5. జ్ఞానేంద్రియాలు లేవు
   రుచి లేదు, వాసన లేదు, కన్ను లేదు, చెవులు లేవు. జ్ఞానేంద్రియాలు లేవు కాబట్టి కర్మ చేయదు.

6. కర్మేంద్రియాలు లేవు .
   అవాక్ – వాక్కు లేదు (తక్కినవి కలుపుకోవాలి).

7. మనస్సు లేదు
   మనస్సు లేదు, తేజస్సు లేదు.

8. పంచప్రాణాలు కాదు

అప్రాణం – ప్రాణం కాదు.

ఈ విధంగా సూక్ష్మశరీరంలో ఉన్న 19 అంగాలను నిషేధించటం జరిగింది. అవి పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, నాలుగు అంతఃకరణాలు, పంచప్రాణాలు – ఇవి కాక మరికొన్ని చెప్పాడు యాజ్ఞవల్క్యుడు.

ముఖం లేదు, కొలవబడదు, లోపల లేదు, అలాగని బయటా లేదు. అలా అన్నింటినీ నిషేధించుకుంటూ రావటం ద్వారా మిగిలిందేమిటి? నేను సాక్షిచైతన్యాన్ని.

అది దేనినీ తినదు, దాన్ని ఏదీ తినదు. అంటే ఆత్మ కర్తా కాదు, భోక్తా కాదు. ఈ నిషేధాలద్వారా బ్రహ్మను అనుభవించలేను, అనుభవించనవసరం లేదు, ఎందుకంటే ఆ బ్రహ్మను నేనే కాబట్టి అని అర్థమవుతుంది. బ్రహ్మ అన్నా, సాక్షిచైతన్యం అన్నా, ఆత్మ అన్నా ఒక్కటే. ఆత్మ అకర్తా, అభోక్తా అని నిరూపించబడుతుంది.

అలా నిషేధవాక్యాల ద్వారా అక్షరబ్రహ్మను నిర్వచించాక యాజ్ఞవల్క్యుడు అక్షరబ్రహ్మను అంతర్యామిగా వర్ణిస్తున్నాడు. ఎందుకంటే అక్షరబ్రహ్మే అంతర్యామి.

నిర్గుణబ్రహ్మ + మాయ = ఈశ్వరుడు; ఈశ్వరుడు – మాయ = నిర్గుణబ్రహ్మ.

ఇంకో విధంగా చెప్పాలంటే అక్షరబ్రహ్మ నిర్గుణబ్రహ్మ, అంతర్యామి సగుణబ్రహ్మ.

**సగుణబ్రహ్మ గుణాలు** – సృష్టికర్త, లయకర్త, అనుగ్రహకర్త, కర్మఫలదాత, సర్వజ్ఞుడు, సర్వశక్తివంతుడు, సర్వాంతర్యామి, సర్వేశ్వరుడు. అక్షరబ్రహ్మ, అంతర్యామి భిన్నస్థాయిలకు చెందినవారు. సగుణబ్రహ్మ వ్యావహారిక సత్యానికి చెందితే, నిర్గుణబ్రహ్మ పారమార్థిక సత్యానికి చెందుతుంది.

అక్షరబ్రహ్మ అంతర్యామిద్వారా సూర్యచంద్రులు, కాలతత్త్వాన్ని, నదులను, సముద్రాలను, అదృష్టపుణ్యఫలాలను నియంత్రిస్తున్నది. అంటే అంతర్యామి శాసనాన్ని అంతర్యామి ప్రకృతి సూత్రాలుగా నియంత్రిసాడు.

ఈ అక్షరబ్రహ్మజ్ఞానంవల్లనే మోక్షం వస్తుంది.

**ఏతదక్షరం గార్గి విదిత్వా అస్మాల్లోకాత్ ప్రైతి స బ్రాహ్మణః** – ఎవరైతే మరణించేలోపు ఈ అక్షరబ్రహ్మను తెలుసుకుంటారో, అతనే జ్ఞాని. తక్కినవారు కృపణులు అంటున్నారు.

ముగించే ముందు అక్షరబ్రహ్మకు ఇంకొక నిర్వచనం ఇస్తున్నాడు. ఇంతకుముందు నిర్వచనాన్ని నిషేధముఖలక్షణంగా చూశాము. ఇప్పుడు వేరే రూపంలో చూస్తాము.

ఈ నిర్వచనాన్ని అంతర్యామికి కూడా ఇవే పదాలతో చూశాము. దీన్నిబట్టి కూడా అంతర్యామి, అక్షరబ్రహ్మలు ఒకటేనని తెలుస్తున్నది. అది,

**అదృష్టమ్ ద్రష్టశ్రుతగ్ం శ్రోత్రమతం మంత్రవిజ్ఞాతం విజ్ఞాతృ.** దీని అర్థం ఆత్మా అద్రష్టా, అశ్రోతా, అమంత, అవిజ్ఞాతా. ఆత్మ సబ్జెక్టు. ఆత్మ ఆబ్జెక్టు కాదు.

**నాన్యదతోఽస్తి ద్రష్టృ నాన్యదతోఽస్తి శ్రోతృ నాన్యదతోఽస్తి మన్తృ నాన్యదతోఽస్తి విజ్ఞాత్రే తస్మిన్ను ఖల్వక్షరే గార్గ్యాకాశ ఓతశ్చ ప్రోతశ్చేతి**

ఒక్కముక్కలో చెప్పాలంటే అక్షరబ్రహ్మకు భిన్నంగా వేరే ఏదీ లేదు. ఈ అక్షరం బ్రహ్మే అంతర్యామియొక్క ఓతం, ప్రోతం అన్నాడు యాజ్ఞవల్క్యుడు.

వీటితో తృప్తిపడిన గార్గి మళ్ళీ తక్కిన బ్రాహ్మణులకు తన మాటను గుర్తు చేస్తుంది. అతన్ని బ్రహ్మవిత్తుగా స్వీకరించి, వెనక్కి తగ్గండి అని చెబుతుంది. అయినా వినకుండా శాకల్యుడు ముందుకు వస్తాడు.

## 3.9. శాకల్య బ్రాహ్మణము

శాకల్యుడు యాజ్ఞవల్క్యుణ్ణి ప్రశ్నలు అడుగుతాడు. ఈ బ్రాహ్మణానికి శాకల్య బ్రాహ్మణము అనే పేరు వస్తుంది. ఇక్కడ కూడా రెండు అంశాలు చూస్తాము. అవి – హిరణ్యగర్భ, ఔపనిషద్ పురుషః

1. **హిరణ్యగర్భ** – దేవతలు ఎంతమంది అని శాకల్యుడు అడిగితే, ఒక్క హిరణ్యగర్భే 3306గా, 33, 6, 3, 2, 1½, 1 గా ప్రకటితమవుతున్నాడు అంటాడు యాజ్ఞవల్క్యుడు.

| | |
|---|---|
| 33 దేవతలు | – 8 వసువులు, 11 రుద్రులు, 12 ఆదిత్యులు, ఇంద్రుడు, ప్రజాపతి |
| 1½ దేవత | – వీచే వాయువు, 1½ కి ఇంకొక అర్థం అధికమైన సమృద్ధికి మూలం |
| 1 దేవత | – హిరణ్యగర్భ |

ఇదీ హిరణ్యగర్భ మహిమ. దీని తర్వాత **అష్టవిధ హిరణ్యగర్భ ఉపాసన** గురించి చెబుతాడు యాజ్ఞవల్క్యుడు. ఈ ఉపాసనను సకామంగా చేస్తే అన్నం సమృద్ధిగా దొరుకుతుంది, ప్రాణశక్తి బాగుంటుంది. నిష్కామ ఉపాసనగా చేస్తే చిత్తఏకాగ్రత, చిత్తవైశాల్యత కలిగి, జ్ఞానయోగప్రాప్తి కలుగుతుంది.

శాకల్యుడు యాజ్ఞవల్క్యునిమీద ప్రశ్నల వర్షం కురిపిస్తూపోతే, యాజ్ఞవల్క్యుడు అతన్ని హెచ్చరిస్తున్నాడు. ముందు, నిన్ను పిచ్చివాణ్ణి చేసి తక్కిన బ్రాహ్మణులు నిన్ను ఆడిస్తున్నట్టుగా తోస్తున్నది. నువ్వు నిప్పుతో చెలగాటమాడుతున్నావు సుమా అని సూచించటానికి నిన్ను

నిప్పులను నొక్కి తీసే పటకారుగా వారు వాడుతున్నారు అంటాడు. అయినా అతను పట్టించుకోకుండా ప్రశ్నలు అడుగుతూనే ఉంటాడు. దానివల్ల పంచవిధహిరణ్యగర్భ ఉపాసన కూడా వచ్చింది. యాజ్ఞవల్క్యునికి అసహనం పెరుగుతున్నది మళ్ళీ అడుగుతుంటే. ఈసారి **అహల్లికేతి హోవాచ యాజ్ఞవల్క్యః**. యాజ్ఞవల్క్యుడు శాకల్యుణ్ణి ఓ ప్రేతా అని సంబోధించాడు. అహల్లిక అంటే ప్రేతం అని అర్థం.

ఈ ప్రశ్నలకు జవాబులద్వారా ప్రపంచానికి ఆధారం ఇంద్రియాలు, ఇంద్రియాలకు ఆధారం మనస్సు- శాస్త్రంలో హృదయం అంటే మనస్సు- మనస్సుకు ఆధారం శరీరం. శరీరానికి ఆధారం పంచప్రాణాలు. ఆధారానికి ఇక్కడ ప్రతిష్ఠ పదాన్ని చూస్తాము. మనస్సు, శరీరం, ప్రాణం - మూడూ ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉన్నాయి. ఇవి మూడూ ఒక త్రికోణం. ఇక్కడితో శాకల్యుని ప్రశ్నల వర్షం ముగుస్తుంది. అతని దగ్గర అంతకన్నా ప్రశ్నలు లేవు. అతనికి తెలిసిందంతా మిథ్యా జగత్తు గురించే.

ఇప్పుడు యాజ్ఞవల్క్యుడు, శాకల్యుణ్ణి తిరిగి ప్రశ్నిస్తాడు. అష్టవిధ హిరణ్యగర్భుడు మిథ్య; పంచవిధ హిరణ్యగర్భుడు మిథ్య; హృదయం (మనస్సు) మిథ్య; శరీరం మిథ్య; ప్రాణం మిథ్య; ఈ మిథ్యాప్రపంచానికి అధిష్ఠానం ఎవరు?

2. **ఔపనిషద్ పురుషః** - ఔపనిషదం పురుషుడు అంటే ఉపనిషత్తులలో వివరించిన అధిష్ఠానం ఎవరు? అంటే పరోక్షంగా నీకు నిర్గుణబ్రహ్మజ్ఞానం లేదు అంటున్నాడు. ఈ ఔపనిషదం పురుషం గురించి చెప్పు. లేదా -

**తం చేన్మే న వివక్ష్యసి మూర్ధా తే విపతిష్యతీతి**

ఒకవేళ నువ్వు దానికి జవాబు చెప్పలేకపోతే, నీ తల ఊడిపడగలదు అన్నాడు. ఇంతకు ముందు రెండుసార్లు హెచ్చరించాడు. ఇప్పుడు ప్రత్యక్షంగానే బెదిరించాడు.

ఇక్కడితో వారి సంవాదం ముగుస్తుంది. శాకల్యుడు చెప్పలేకపోయాడు కాబట్టి అతని తల ఊడిపడిందని, అతని శిష్యులు అతని ఎముకలను పితృసంస్కారంకోసం ఇంటికి తీసుకువెళు తుండగా దొంగలు వాటిని కూడా అపహరించారనీ ఉపనిషత్తు అందుకుని పూర్తి చేస్తుంది. కథను కథగానే తీసుకోవాలి. దీనికి కర్మకాండలో ఒక సందర్భంలో యాజ్ఞవల్క్యుడు అతన్ని శపించాడని వస్తుంది.

ఇంతకీ యాజ్ఞవల్క్యుడు అడిగిన ప్రశ్నకు జవాబు రాలేదు. యాజ్ఞవల్క్యుడు కూడా చెప్పడు. ఎందుకంటే ఈ అధ్యాయాన్ని జల్పం అంటారు. అంటే ఇందులో బోధ ప్రధానంగా ఉండదు. ఎదుటివ్యక్తిని వాదనలో ఓడించటమే లక్ష్యంగా ఉంటుంది. కాని మనకు

తెలుసుకోవాలనే కుతూహలం ఉంటుంది కాబట్టి, ఉపనిషత్తే జవాబు చెబుతుంది. నిజానికి ఈ నిర్వచనాన్ని ఇప్పటికే 2, 4, 5 బ్రాహ్మణాలలో చూశాము.

**స ఏష నేతి నేతి ఆత్మా** – ఈ ఆత్మ ఇది కాదు, ఇది కాదు అని నిరూపించబడింది.
**సర్వనిషేధ అవధిః** – అన్నింటినీ నిషేధించుకుంటూ వస్తే మిగిలేది ఆత్మ.

ఇక్కడ చెప్పిన నిర్వచనాన్ని చూద్దాము.

**అగృహ్యో న హి గృహ్యతే** – ఆత్మ గ్రహించబడేది కాదు
**అశీర్యో న హి శీర్యతే** – ఆత్మ శిథిలమవదు
**అసంగో న హి సజ్యతే** – అది అసంగం
**న వ్యథతే** – దుఃఖం లేదు
**న రిష్యతి** – మరణం లేదు.

యాజ్ఞవల్క్యుడు, శాకల్యుడు మరణించాక, తనే ఒక ప్రశ్న వేస్తాడు. దీనికి జవాబు మీలో ఎవరైనా చెప్పవచ్చు లేదా అందరూ కలిసి చెప్పవచ్చు అంటాడు. ఆ ప్రశ్న మనిషి మృత్యువుతో నరకబడితే ఏమూలం (కారణం)నుంచి జన్మిస్తాడు. దీనికి మనిషి మళ్ళీ పుట్టడు అని కాని, రేతస్సునుంచి పుడతాడు అని కాని, పుట్టి ఉన్నాడు కదా అని జవాబు చెప్పకూడదు అనికూడా చెబుతున్నాడు. అంటే జీవవృక్షానికి మూలం ఏమిటి? దీనికి జవాబు బ్రహ్మ. బ్రహ్మ నిర్వచనం **విజ్ఞానమానందం బ్రహ్మ** అని ఉపనిషత్తే ఇస్తుంది.

విజ్ఞానం అంటే చిత్; ఆనందం అంటే ఆనందం. విజ్ఞానమానందం అంటే చిదానంద బ్రహ్మ. వేరే ఎక్కడా ఈ నిర్వచనం చూడము.

కర్మకాండను పాటించే అజ్ఞానికి బ్రహ్మ నిమిత్త కారణంగా ఆశ్రయం అయితే, జ్ఞానం పొంది నిష్ఠలో ఉన్న జ్ఞానికి బ్రహ్మ ఉపాదానకారణంగా ఆశ్రయం.

ప్రశ్న – జీవిని మళ్ళీ పుట్టేటట్టు ఎవరు చేస్తున్నారు? జవాబు – బ్రహ్మ. దీని అర్థం, వ్యవహారిక స్థాయిలో ఉన్న అజ్ఞానిని సోపాధిక బ్రహ్మగా రక్షిస్తే, పారమార్థిక స్థాయికి ఎదిగిన జ్ఞానికి నిరుపాధిక బ్రహ్మగా ఆశ్రయం అవుతుంది.

ఇక్కడితో తొమ్మిదవ బ్రాహ్మణము అయిపోయింది. మూడవ అధ్యాయము అయిపోయింది.

ఈ అధ్యాయములో ముఖ్యమైన మంత్రాలు:
బ్రాహ్మణము 2 – 11, 13
బ్రాహ్మణము 4 – 1, 2, 5

# ఏకాదశ ఉపనిషత్తుల సారం

## బృహదారణ్యకోపనిషత్ - అధ్యాయం 4

బృహదారణ్యకోపనిషత్తులోని నాలుగవ అధ్యాయంలోకి అడుగు పెట్టేముందు కొన్ని అంశాలు చూద్దాము. ఈ ఉపనిషత్తులో మూడు ఖండాలు, ఆరు అధ్యాయాలు ఉన్నాయని చూశాము. ఒకసారి అవి గుర్తు తెచ్చుకుంటే -

1. ఉపదేశకాండము - మధుకాండము - అధ్యాయాలు 1, 2
2. ఉపపత్తికాండము - మునికాండము - అధ్యాయాలు 3, 4
3. ఉపాసనాకాండము - ఖిలకాండము - అధ్యాయాలు 5, 6

మనం రెండవ కాండములో మొదటి అధ్యాయాన్ని చూశాము. ఇప్పుడు రెండవ కాండములోని రెండవ అధ్యాయంలోకి అడుగుపెట్టబోతున్నాము. అధ్యాయాల సంఖ్యాపరంగా చూస్తే నాలుగవ అధ్యాయం ఇది. 3, 4 అధ్యాయాలను మునికాండము అంటారు. రెండింటిలోనూ ప్రధానపాత్ర వహించేది యాజ్ఞవల్క్యముని కాబట్టి ఆ పేరు వచ్చింది.

రెండు అధ్యాయాల్లోనూ యాజ్ఞవల్క్యముని వేదాంతబోధ చేస్తాడు కాని, ఈ రెండింటిలోనూ సూక్ష్మభేదం ఉంది. మూడవ అధ్యాయంలో బోధ వాదనరూపంలో సాగుతుంది. అక్కడ బోధకన్నా పాండిత్య ప్రదర్శనకు ఎక్కువ ప్రాముఖ్యత ఉంటుంది. అక్కడ సందర్భం వేరు. అక్కడ బ్రాహ్మణులు, యాజ్ఞవల్క్యునినుంచి విద్య నేర్చుకోవటానికి రాలేదు. యాజ్ఞవల్క్యుని పాండిత్యానికి ఎదురు నిల్చోటానికి వచ్చారు. అందువల్ల ఇటువంటి వాదనలో జ్ఞానం కాదు ప్రధానం, గెలుపు ముఖ్యం. అందువల్లనే చివరి బ్రాహ్మణములో యాజ్ఞవల్క్యుడు అడిగిన ప్రశ్నకు శాకల్యుడు జవాబు చెప్పలేకపోతే, యాజ్ఞవల్క్యుడు కూడా చెప్పడు. ఉపనిషత్తు చెబుతుంది.

గార్గి, యాజ్ఞవల్క్యుణ్ణి రెండు ప్రశ్నలనే బాణాలను సంధించి వదిలితే, యాజ్ఞవల్క్యుడు వాటికి అద్భుతంగా సమాధానం ఇస్తాడు. గార్గి అతని పాండిత్యానికి తను నమస్కరించటమే కాక, తక్కిన పండితులకు కూడా అతని పాండిత్యాన్ని స్వీకరించి, వాదనలను ఆపమని సలహా ఇస్తుంది కూడా. అయినా కూడా లెక్కచేయకుండా శాకల్యుడు వచ్చి, మధ్యలో యాజ్ఞవల్క్యుడు హెచ్చరించినా వినక వాదించటంతో అతని తల చెక్కలవుతుంది.

ఈ విధంగా, వాదోపవాదాల ద్వారా విద్య బోధించటాన్ని జల్పం అంటారు. ఇందులో నేర్చుకోవాలనే తపనకన్నా, గెలవాలనే అహంకారం రాజ్యమేలుతుంది. ఈ వాదనలు వాడిగా,

వేడిగా ఉంటాయి. అందువల్ల స్వామీచిన్మయానందజీ ఈ జల్పంలో వేడి పుడుతుంది, జ్ఞానమనే కాంతికన్నా అంటారు.

ఇప్పుడు మనం చూడబోయే నాలుగవ అధ్యాయాన్ని వాదం లేదా సంవాదం అంటారు. ఇందులో యాజ్ఞవల్క్యుడు గురువుగా బోధ చేస్తాడు. జనకమహారాజు, తక్కిన ఆచార్యుల వద్ద కూడా నేర్చుకున్నా యాజ్ఞవల్క్యుని ముందు చాలా వినయంగా, శ్రద్ధగా విద్య నేర్చుకుంటాడు. అందువల్ల బృహదారణ్యకంలో అన్ని అధ్యాయాల్లోకి ఈ నాలుగవ అధ్యాయం చాలా ముఖ్యమైన అధ్యాయం. ఈ నేపథ్యంతో ఈ అధ్యాయంలోకి అడుగుపెడదాము. ఇందులో ఆరు బ్రాహ్మణాలు, 42 మంత్రాలు ఉన్నాయి.

## 4.1. షడాచార్య బ్రాహ్మణము

ఒకసారి యాజ్ఞవల్క్యుడు, జనకమహారాజుని దర్శించటానికి వెళతాడు. జనకమహారాజు ఆయనను సాదరంగా ఆహ్వానించి, 'ఓ యాజ్ఞవల్క్యా! దేనికోసం వచ్చారు? పశువులను కోరా, పరమాత్మ గురించి ప్రశ్నలు వినటానికా?' అని అడుగుతాడు. రెండింటికోసమూ వచ్చాను అంటాడు యాజ్ఞవల్క్యుడు.

**సగుణబ్రహ్మ ఉపాసనలు** – రెండవ మంత్రంనుంచి ఏడవ మంత్రంవరకూ యాజ్ఞవల్క్యుడు ఆరు సగుణబ్రహ్మ ఉపాసనలను బోధిస్తాడు. ఈ ఆరు సగుణబ్రహ్మలనూ ఆరుగురు భిన్న ఆచార్యులు జనక మహారాజుకు పరిచయం చేశారు. ఆ బోధ అసంపూర్ణంగా ఉందని యాజ్ఞవల్క్యుడు దాన్ని పూర్తి చేస్తాడు. అది ఇలా సాగుతుంది.

యాజ్ఞవల్క్యుడు నీకు తక్కిన ఆచార్యులు చెప్పినదేమిటో చెప్పు; దాన్ని మేము వింటాము అంటాడు. వాక్కే బ్రహ్మయని శైలినిజిత్వా ఋషి చెప్పాడు అంటాడు జనకుడు. తల్లిదండ్రులు, గురువు అయిన వ్యక్తి చెప్పినది సత్యమే. నిజమే, వాక్కే బ్రహ్మ కాని దానితో ఉపాసన జోడించాలి, నువ్వు పూర్తి జ్ఞానం పొందలేదని యాజ్ఞవల్క్యుడు ఆ బోధను పూర్తి చేస్తాడు.

దానితో తృప్తి చెందిన జనకుడు ఏనుగులాంటి ఒక ఆంబోతును, వెయ్యి ఆవులను దక్షిణగా ఇస్తానంటాడు. శిష్యునికి ఉపదేశం పూర్తి చేయకుండా దక్షిణను తీసుకోకూడదని మా తండ్రిగారు భావించేవారు అని యాజ్ఞవల్కుడు చెబుతాడు. అలా ఆరుగురు గురువుల వద్ద తను నేర్చుకున్నది జనకుడు చెప్పటం, యాజ్ఞవల్క్యుడు ఆ బోధను పూర్తిచేయటం, ప్రతిసారి దక్షిణ ఇస్తానని జనకుడూ, ఇప్పుడే వద్దని యాజ్ఞవల్క్యుడూ అనటం జరుగుతూ వస్తుంది. ఈ బ్రాహ్మణం చివరలో కూడా ఇంకా యాజ్ఞవల్క్యుడు తీసుకోలేదు. అంటే ఇంకా బోధ కొనసాగుతుందని అర్థం.

ఈ బ్రాహ్మణంలో గమనించాల్సిన ముఖ్య అంశాలు – జనకుడు రాజైనా, కేవలం రాజ్యభారంతో ఊరుకోకుండా, జ్ఞానం పొందుతాడు. యాజ్ఞవల్క్యుడు తక్కిన ఆచార్యులకన్నా గొప్ప పండితుడు. ఆరుగురు ఆచార్యులు చెప్పిన బోధ గురించి వస్తుంది కాబట్టి దీనికి షడాచార్య బ్రాహ్మణము అనే పేరు వచ్చింది. ఆరుగురి బోధను, అధిష్ఠానదేవతలను యాజ్ఞవల్క్యుడు చెప్పిన ఉపాసన, ఫలాన్ని ఈ క్రింది పట్టికలో చూద్దాము.

| **ఋషి** | **శరీరంలో అంగం** | **అధిష్ఠాన దేవత** | **ఉపాసనఫలం** |
|---|---|---|---|
| జిత్వా | వాక్కు | అగ్నిదేవత | వాక్కు బ్రహ్మాండంగా ఉంటుంది |
| ఉదంకుడు | ప్రాణం | వాయుదేవత | పూర్ణాయుష్షు ఉంటుంది |
| బర్కుడు | చక్షువు | ఆదిత్యుడు | కంటిచూపు బాగుంటుంది |
| భారద్వాజుడు | శ్రోత్రం | దిగ్దేవత | చెవులు బాగా పనిచేస్తాయి |
| సత్యకాముడు | మనస్సు | చంద్రుడు | మనస్సు ఆనందంగా ఉంటుంది |
| శాకల్యుడు | హృదయం | హిరణ్యగర్భుడు | హృదయం ఆరోగ్యకరంగా ఉంటుంది |

అధిష్ఠానదేవతల పేర్లు ఇక్కడ రాలేదు, మనం కలుపుకున్నాము. తక్కిన గురువులు శరీరంలో అంగం గురించి చెపితే, దానికి యాజ్ఞవల్క్యుడు ఉపాసన జోడించి, వాటి ఫలం కూడా చెబుతారు. ఈ ఉపాసనలకు రెండు ఫలాలు చెబుతాడు. ఈ లోకంలో జీవించి ఉండగానే, ఉపాసనయొక్క బలంచేత దేవతగా కొలవబడి, దేహం పడిపోయాక దేవతలనే పొందుతాడు. ఈ ఉపాసనను **చతుష్పాద సగుణబ్రహ్మ ఉపాసన** అంటారు.

## 4.2. కూర్చ బ్రాహ్మణము

ఇందులో కూడా గురుశిష్యులు యాజ్ఞవల్క్యుడు, జనకుడే. చతుష్పాద సగుణబ్రహ్మ గురించి బోధించాక యాజ్ఞవల్క్యుడు అప్పుడు వెళ్ళిపోయి, మళ్ళీ ఇంకొకరోజు వచ్చినట్టుగా ఊహించుకోవాలి. జనకుడు ఎత్తైన సింహాసనంమీద కూర్చుని ఉన్నాడు. దాన్ని **కూర్చం** అంటారు. యాజ్ఞవల్క్యుడు రాగానే జనకుడు **కూర్చం**నుంచి దిగివస్తాడు కాబట్టి, ఈ బ్రాహ్మణం ఈ పదంతో మొదలవుతుంది కాబట్టి దీన్ని కూర్చ బ్రాహ్మణము అంటారు. ఇక్కడ జనకుడు కూర్చంనుంచి దిగిరావటంవల్ల, శిష్యుడు ఎంత చక్రవర్తి అయినా గురువుకు గౌరవం చూపాలని తెలుస్తున్నది.

**చతుష్పాద ఆత్మవర్ణన** –ముందు అధ్యాయంలో సగుణబ్రహ్మ గురించే వచ్చింది. నిర్గుణబ్రహ్మ గురించి రాలేదు. సగుణబ్రహ్మ జ్ఞానం దశలవారీగా నేర్చుకుని నిర్గుణబ్రహ్మజ్ఞానం పొందాలి. సాధకుని వీలుకోసం, సగుణబ్రహ్మ మూడు దశలుగా విభజించబడింది. అవి – స్థూల

సగుణబ్రహ్మ, సూక్ష్మ సగుణబ్రహ్మ, కారణ సగుణబ్రహ్మ. మూడు సగుణబ్రహ్మలు మూడు అవస్థలతో పెనవేసుకుని ఉన్నాయి. అవి వరుసగా జాగ్రదవస్థ, స్వప్నావస్థ, సుషుప్తి అవస్థ.

చైతన్యం ఈ మూడు అవస్థల ద్వారా వ్యవహారం నడుపుతుంది. చైతన్యం ప్రతిబింబ చైతన్యాలద్వారా స్థూల, సూక్ష్మ, కారణ శరీరాల్లో ప్రకటితమయితే, మరొక మూడు ప్రతిబింబ చైతన్యాలద్వారా స్థూల, సూక్ష్మ, కారణ ప్రపంచాలలో ప్రకటితమవుతుంది. వాటి పేర్లు చూద్దాము.

| | |
|---|---|
| వ్యష్టి శరీరం | సమష్టి ప్రపంచం |
| స్థూల శరీరం – విశ్వ | స్థూల ప్రపంచం – విరాట్ |
| సూక్ష్మ శరీరం – తైజస | సూక్ష్మ ప్రపంచం – హిరణ్యగర్భ |
| కారణ శరీరం – ప్రాజ్ఞ | కారణ ప్రపంచం – ఈశ్వరుడు |

ఈ ప్రతిబింబ చైతన్యాల జంటద్వారా బింబచైతన్యజ్ఞానం పొందుతాము. దీన్ని చతుష్పాద ఆత్మజ్ఞానం అంటారు. ఇక్కడ అంత వివరంగా రాదు కాని, మాండూక్యోపనిషత్తులో చాలా వివరంగా వస్తుంది. ఇక్కడ ఈ పాదాల్లో తిరిగే జంటను ఇంద్ర–ఇంద్రాణి అంటారు. ఇంద్ర అసలు పేరు ఇంధుడు. ఇంధుడు అంటే ప్రకాశించువాడు అని అర్థం. అదే క్రమేపీ ఇంద్రగా మారింది.

1. **ప్రథమపాదం** – ప్రథమపాదంలో ఇంద్ర–ఇంద్రాణి జంటను చూస్తాము. ఇంకో విధంగా చెప్పాలంటే జాగ్రత్ పురుషుడు–జాగ్రత్ ప్రపంచం జంట.

ఇంద్రుడు కుడికన్నులో ఉన్న జాగ్రత్ పురుషుడు

ఇంద్రాణి ఎడమకన్నులో ఉన్న ఇంద్రాణి

2. **ద్వితీయపాదం** – ఇక్కడ కూడా ఇంద్ర–ఇంద్రాణి పదాలు వస్తాయి. ఇంకో విధంగా చెప్పాలంటే తైజస–హిరణ్యగర్భ. ఇక్కడ ఈ జంట ఉండే స్థానం మారుతుంది. వాటి సంగమస్థానం హృదయాకాశం. వారికి అన్నం లోహితపిండం. వారు కప్పుకునే వస్త్రం హృదయం, వారు తిరిగే మార్గం హితానాడులు. ఒక వెంట్రుకని తీసుకుని నిలువుగా వెయ్యి ముక్కలుగా కత్తిరిస్తే ఎంత మార్గం ఉంటుందో, హితానాడిలో అంత మార్గం ఉంటుంది. అంత మార్గంలో వీరిరువురూ జంటగా షికార్లు కొడతారు.

3. **తృతీయ పాదం** – ఇక్కడ జంట ప్రాజ్ఞ–ఈశ్వరుడు. ఇక్కడ కూడా ఇంద్ర–ఇంద్రాణీల పదం వాడతాము కాని ఇక్కడ భేదం లేదు. భేదం అసలు లేదు అనకూడదు, అవ్యక్తంగా ఉంది. జాగ్రదవస్థలో కనబడే భేదాలు ఇక్కడ కనబడవు. ఈ శూన్యస్థితిని అవిద్య లేదా అజ్ఞానం అంటారు.

4. **చతుష్పాదం** – నాలుగవ పాదంలో ఇంద్ర–ఇంద్రాణీలు లేరు. శుద్ధచైతన్యం మాత్రమే ఉంటుంది. దీన్ని తురీయం అంటారు. శుద్ధచైతన్యం, ఆత్మ, బ్రహ్మ, తురీయం – ఏదైనా ఒకటే. ఆత్మను సానుకూల పదాలతో చెప్పలేము కాబట్టి ఉపనిషత్తు నేతి–నేతి పద్ధతిని ఎన్నుకుంది. ఈ నేతి–నేతి పద్ధతిని ప్రత్యేకించి బృహదారణ్యకోపనిషత్తులోనే రెండు, మూడు సార్లు చూస్తాము. నేతి నేతి అంటే న ఇతి న ఇతి – అంటే ఇది కాదు, ఇది కాదు.

తృతీయ పాదానికీ, చతుష్పాదానికీ మధ్య ఉన్న భేదం ఏమిటి? తృతీయపాదం అయిన సుషుప్తిలోనూ ద్వైతం ఉండదు; నాలుగవ పాదం అయిన తురీయంలోనూ ద్వైతం ఉండదు. తృతీయపాదంలో ద్వైతం లేదు అనకూడదు. అది అవ్యక్తంగా ఉంటుంది. సమాధి అవస్థలో కూడా అంతే. ద్వైతం అవ్యక్తంగా ఉంటుంది. కాని తురీయంలో ద్వైతం అవ్యక్తంలో కూడా లేదు. తురీయాన్ని జ్ఞానితో పోల్చవచ్చు. ఎందుకంటే జ్ఞానికి ద్వైతం అవ్యక్తంలో ఉన్నా, వ్యక్తంలో ఉన్నా అతనికి ఏమీ మార్పు కనబడదు. ద్వైతంలో ఉంటే వ్యక్తంగా ఉన్నప్పుడు నేను విశ్వ లేదా తైజస అవుతాను; అవ్యక్తంలో ప్రాజ్ఞ అవుతాను. కాని అద్వైతంలో ఉంటే మూడు అవస్థల్లోనూ నేను అద్వైత ఆత్మనే. అందువల్ల తురీయం అంటే నాలుగవ అవస్థ కాదు; తురీయం అంటే నా స్వరూపాన్ని నేను సరిగ్గా అర్థం చేసుకోవటం.

అందువల్ల తురీయానికి అసంగః పదం వేశాడు యాజ్ఞవల్క్యుడు. నేను అసంగం అయితే, నేను దేన్నీ వదులుకోనవసరం లేదు, అసంగత్వం నా స్వరూపం కాబట్టి, నేను ద్వైతంనుంచి విముక్తి పొందాను అంటే సంసారంనుంచి విముక్తి పొందాను అని అర్థం చేసుకోవాలి.

దీనితో **చతుష్పాద ఆత్మవర్ణన** అయిపోయింది. యాజ్ఞవల్క్యుడు, ఓ జనకా! నువ్వు మోక్షం పొందావు అంటాడు. దీని ద్వారా జ్ఞానం పొందాక, ఏమీ కర్మ చేయనవసరం లేదని అర్థమవుతున్నది. జనకుడు, ఓ యాజ్ఞవల్క్యా! నేను ఏ మోక్షాన్ని అనుభవిస్తానో, నువ్వు కూడా అదే మోక్షాన్ని అనుభవించుగాక అన్నాడు. తరువాత జనకునికి తన పొరపాటు తెలిసింది. తను అభయం బ్రహ్మ గురించి నేర్చుకుంటేనే అభయం (మోక్షం) పొందితే, అభయం బ్రహ్మ గురించి నేర్పించిన గురువు ఇంకా మోక్షం పొందకుండా ఉంటాడా?

గురువు ముక్తపురుషుడు. ఆయనకు తాను కొత్తగా ఇచ్చేది ఏముంది? కాని ఆనందంతో పొంగిపోతున్న జనకుడు నా విదేహరాజ్యం మొత్తం నీకు సమర్పిస్తున్నాను అన్నా జనకునికి తృప్తి తీరలేదు. నేను కూడా నీకే చెందుతాను అన్నాడు. రాజ్యం కాని, రాజు కాని యాజ్ఞవల్క్యునికి తృణప్రాయం. కాని అనంతమైన మోక్షం పొందినందుకు, రాజు తనకున్నదంతా త్యజించాడు అని అర్థం చేసుకోవాలి.

## 4.3. స్వయంజ్యోతి బ్రాహ్మణము

ఇది కూడా యాజ్ఞవల్క్య, జనకుల సంవాదరూపంలో సాగుతుంది. ఇది మొత్తం బృహదారణ్యకంలోనే అత్యంత పెద్ద బ్రాహ్మణము. 38 మంత్రాలు ఉన్నాయి ఇందులో. ఇది అత్యంత పెద్దదే కాదు, అత్యంత ముఖ్యమైనది కూడా. ఇందులో అక్షరలక్షల విలువ చేసే మంత్రాలు అనేకం ఉన్నాయి. ఇందులో ఆత్మ స్వయంజ్యోతిగా నిరూపించబడుతుంది. అందువల్ల దీన్ని స్వయంజ్యోతి బ్రాహ్మణము అంటారు.

ఆత్మజ్యోతిని పరిచయం చేసేముందు, కొన్ని సాపేక్షిక జ్యోతులను పరిచయం చేస్తుంది ఉపనిషత్తు. అవి – సూర్యుడు, చంద్రుడు, అగ్ని, వాక్కు (శబ్దం). పగలు సూర్యుని సమక్షంలో, రాత్రి చంద్రుని సమక్షంలో, అమావాస్యరాత్రి అగ్ని సమక్షంలో, అగ్ని కూడా లేనప్పుడు వాక్కు సమక్షంలో వ్యవహారాలు నడుపుతాము. ఇవన్నీ బాహ్యజ్యోతులు. ఇప్పుడు చూడబోయేది ఆంతరజ్యోతి. అది ఈ నాలుగు జ్యోతులకు జ్యోతి.

ఈ నాలుగు జ్యోతులు కూడా పని చేయనప్పుడు, ఈ మనిషికి ఏ జ్యోతి ఉందని జనకుడు ప్రశ్నిస్తాడు. అటువంటి పరిస్థితి స్వప్నావస్థలో సాధ్యం అంటున్నారు శంకరులవారు.

**ఆత్మా ఏవ అస్య జ్యోతిర్భవతి**

సాక్షిచైతన్యాన్ని పరిచయం చేస్తున్నాడు యాజ్ఞవల్క్యుడు. ఆత్మ, సాక్షి చైతన్యరూపంలో, ఆంతరజ్యోతిగా ఉంది. జాగ్రదవస్థలో వ్యవహారం నడిపేటప్పుడు కూడా ఆత్మజ్యోతి ఉంటుంది కాని అప్పుడు దాని గురించి తెలియదు.

### 1. ఆత్మ దేహవ్యతిరిక్తం – కతమ ఆత్మేతి?

వీటిలో ఆత్మ ఏది అంటున్నాడు జనకుడు. వీటిలో అంటే స్థూలశరీరం, ఇంద్రియాలు, మనస్సు, ప్రాణం.

**యోఽయం విజ్ఞానమయః ప్రాణేషు హృద్యంతర్జ్యోతిః (సః ఆత్మా)**

ఇదొక అక్షరలక్షల విలువ చేసే మంత్రం. ఆత్మ అంటే ప్రాణం పక్కన, హృదయం లోపల జ్యోతిగా ఉన్న విజ్ఞానమయ పురుషుడు.

ఇక్కడ జ్యోతి పదాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. జ్యోతి అంటే మన హృదయం లోపల వెలిగే జ్యోతి కాదు. కొంతమంది ధ్యానంలో కూర్చుని లోపల వెలిగే ఈ జ్యోతిని చూడాలని ప్రయత్నం చేస్తారు. జ్యోతి నిర్వచనం, ఏ కాంతి సమక్షంలో మనకు వస్తువులు కనబడుతున్నాయో, ఏ కాంతి లేకపోతే వస్తువులు తెలియటం లేదో అది జ్యోతి.

ఈ నిర్వచనం ప్రకారం ఇంతకుముందు చూసిన సూర్యుడు, చంద్రుడు, అగ్ని, వాక్కులు జ్యోతులే.

అంతేకాదు మన ఇంద్రియాలు కూడా జ్యోతులే. అంత సూర్యకాంతిని కూడా కన్ను లేకపోతే చూడలేము. అలాగే మనస్సు ఒక జ్యోతి. కన్ను వెనక మనస్సు లేకపోతే, సూర్యోదయం ఎంత అద్భుతంగా ఉన్నా, దాని అందాన్ని ఆస్వాదించలేము. ఆ విధంగా ప్రతి ఒక్క ప్రమాణం కూడా జ్యోతి.

కాని ఆత్మను మాత్రమే జ్యోతిషాం జ్యోతిః అనగలము. ఎందుకంటే తక్కిన జ్యోతులన్నీ ఆత్మవల్లనే జ్యోతులుగా పనిచేయగలుగుతున్నాయి. సాక్షికి మనస్సు పని చేస్తున్నా తెలుస్తోంది, పని చేయకుండా పడుకున్నా తెలుస్తోంది.

ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును సాక్షిగా చూసేది సాక్షిచైతన్యం.

అందువల్ల ఆత్మ జ్యోతిషాం జ్యోతి అయింది. ఈ ఆత్మ చైతన్యం సర్వవ్యాపకం. అంటే ఈ చైతన్యం నాలోనే లేదు, అందరు మనష్యుల్లోనూ ఉంది; వారి మధ్యలో కూడా ఉంది. ఈ చైతన్యం సర్వవ్యాపకమైనా దాన్ని ఒక్కచోటనే గ్రహించగలము. అది మనస్సు. మనస్సు ఎక్కడ ఉంది? హృదయంలో.

ఆత్మ హృదయంలో ఉంది అంటే అక్షరాలా హృదయంలో ఉందని తీసుకోకూడదు. ఆత్మ హృదయంలో తెలుస్తుంది అని అర్థం. హృదయంలో ఉంది అంటే ఆత్మ హృదయంలో పట్టేటంత చిన్నది మాత్రమే అని అనిపిస్తుంది. అందువల్ల సర్వవ్యాపకమైన ఆత్మను హృదయంలో గుర్తించవచ్చు అనాలి.

ఆత్మ ప్రాణానికి దగ్గరగా ఉంది, ఆత్మ మనస్సులో ఉంది – ఈ రెండు వాక్యాలవల్ల ఆత్మ సూక్ష్మశరీరంలో ఉన్న 19 అంగాల్లో ఏదీ కాదు. **ఆత్మ దేహవ్యతిరిక్తం.** ఇది ఆత్మ నిర్వచనం. ఇప్పుడు అత్యంత ముఖ్యమైన పదానికి వస్తున్నాము.

**విజ్ఞానమయః** – ఆత్మ శుద్ధచైతన్యం. శుద్ధచైతన్యం అవ్యవహారం, అగ్రాహ్యం, అలక్షణం, అచింత్యమ్. అది వేరే రూపంలో వ్యవహారం నడుపుతుంది.

పరమాత్మ జీవాత్మగా అనుప్రవేశం చేశాడు. చిత్ చిదాభాసగా వ్యవహారం నడుపుతున్నది. చిదాభాస బుద్ధితో పూర్తిగా మమేకం చెందిపోయింది. జీవాత్మకు ఇంకొక పేరు విజ్ఞానమయం. జీవాత్మ ఎవరు? పరమాత్మ. పరమాత్మ అంటే చిత్. చిత్ చిదాభాసగా వ్యవహారం నడుపుతున్నది. చిదాభాస అంటే ప్రతిబింబచైతన్యం. ఈ చిదాభాసనే జీవాత్మ అనీ, విజ్ఞానమయం అనీ అంటారు. చిదాభాస మనస్సులో (ఇక్కడ బుద్ధిలో) ప్రతిబింబిస్తుంది కాబట్టి, ఈ రెండింటికీ మధ్య విడదీయరాని అనుబంధం ఉంది.

జీవాత్మ = బుద్ధి + చిదాభాస

పరమాత్మ జీవాత్మగా దిగివచ్చాడు. జీవాత్మ బుద్ధితో అనుబంధం పెంచుకుంది. అందువల్ల పరమాత్మ ఎవరు అంటే విజ్ఞానమయ ఆత్మ అన్నారు. ఎలా పడిపోయామో చూడండి. జీవాత్మ లోకాల మధ్య తిరుగుతూ ఉంటుంది. చైతన్యం విషయంలో చాలామందికి సరియైన అవగాహన ఉండదు. జడవస్తువుల్లో చైతన్యం లేదు అంటారు. ఎందుకంటే చిదాభాస లేకపోవటంవల్ల చిత్ తెలియదు. చిదాభాస కర్తా, భోక్తా కాని ఆత్మ అకర్తా, అభోక్తా. మనకు గీతలో ఆత్మ అకర్తా అని అనేకసార్లు వస్తుంది కాని ఉపనిషత్తులో ప్రత్యక్షంగా ఆత్మ అకర్తా అని రాదు.

**ధ్యాయతీవ లేలాయతీవ** – మనిషి చేసే పనులు రెండే. జ్ఞానం పొందటం, కర్మ చేయటం. ఇవ పదం అక్షరలక్షలు చేసే పదం. ఆత్మజ్ఞానం పొందుతున్నట్టుగా, కర్మ చేస్తున్నట్టుగా ఉంది కాని ఆత్మ అకర్తా. నేను ఆత్మను, నేను ఆంతరజ్యోతిని.

ఈ మంత్రం సారాంశం నేను కార్యకరణసంఘాతానికి భిన్నంగా ఉన్నాను. నేను అకర్తా, అప్రమాతా. నేను వ్యవహారం నడపటానికి స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలను ధరిస్తాను. నేను వీటికి భిన్నంగా ఉన్న ఆత్మను. నా చిదాభాస బుద్ధిలో ఏర్పడి, బుద్ధి పని చేస్తున్నది. ఆ బుద్ధి చేసే పనులను నేను చేస్తున్నాను అనుకుంటున్నాను. కాని నేను **దేహ వ్యతిరిక్తం**.

**సంసారవర్ణన** – ఉపనిషత్తు స్వయంజ్యోతియొక్క రెండు అంశాలను చర్చిస్తున్నది. అవి చిత్ స్వరూపం, చిదాభాసస్వరూపం లేదా పారమార్థికస్వరూపం, వ్యావహారికస్వరూపం. పారమార్థిక స్వరూపం అంటే విజ్ఞానం. వ్యావహారికస్వరూపం అంటే విజ్ఞానమయ ఆత్మ. ఇక్కడ్నుంచీ ఉపనిషత్తు పురుషః పదాన్ని వాడుతూ ఉంటుంది. అది జీవాత్మ అవచ్చు, పరమాత్మ అవవచ్చు. ఇప్పుడు జీవాత్మస్వరూపాన్ని వర్ణిస్తున్నది.

**స వా అయం పురుషో జాయమానః**

సర్వగత, నిత్యపురుషుడు జీవాత్మగా, చిదాభాసగా, ప్రతిబింబచైతన్యంగా పుడుతున్నాడు. పునరపి జననం, పునరపి మరణం పొందుతూనే ఉన్నాడు. జన్మ అంటే ఏమిటి?

**శరీరమ్ అభిసంపద్యమానః** – జాయమానః అంటే పుట్టటం. అభిసంపద్యమానః అంటే పదేపదే కొత్త శరీరాన్ని పొందుతున్నాడు. కొత్త శరీరాన్ని పొందుతున్నాడు అంటే పదేపదే మరణిస్తున్నాడు.

**స ఉత్క్రామన్ మ్రియమాణః** – మరణం నిర్వచనం ఇది. శరీరంనుంచి పైకి పోవటం.

ఈ పురుషుడు ఒక శరీరం తీసుకోవటంద్వారా పుడుతున్నాడు, దాన్నుంచి పైకి పోవటం ద్వారా మరణిస్తున్నాడు. అంటే ఇహలోక, పరలోకాల మధ్య తిరుగుతాడు. వాటిని స్వప్నం ద్వారా తెలుసుకోవచ్చు అంటున్నాడు యాజ్ఞవల్క్యుడు. అందువల్ల స్వప్నాన్ని సంధ్యా స్థానం అన్నాడు. సంధ్యా స్థానం అంటే రెండు స్థానాల మధ్య ఉండే స్థానం.

ఇక్కడ వేరే ఎక్కడా చూడని ఒక కొత్త అంశాన్ని చూస్తాము. మామూలుగా స్వప్నం అంటే జాగ్రదవస్థలో చూసినవాటిని రీప్లే చేసేది అనే నిర్వచనం వస్తుంది. కాని ఇక్కడ, బాల్యంలో ఒక వ్యక్తి చూసే స్వప్నం ఈ జన్మది కాదని, పూర్వజన్మ అనుభవాలలోంచి అనీ; అలాగే వృద్ధాప్యంలో చూసే స్వప్నం రాబోయే జన్మ గురించి అనీ చెబుతున్నది. పసివయస్సులో పూర్వజన్మవాసనలను స్వప్నంలో చూస్తే, వృద్ధాప్యంలో మరుజన్మ వాసనలను స్వప్నంలో చూస్తాడు కాబట్టి స్వప్నాన్ని సంధ్యాస్థానం అన్నారు. వచ్చే జన్మలో తన జీవితం ఎలా ఉంటుందో ఒక ట్రైలర్ చూస్తాడు.

2. **ఆత్మ స్వయంజ్యోతి, స్వప్నప్రపంచం ద్వారా** – జీవాత్మ స్వప్నంలోకి వెళ్ళినప్పుడు మాత్రం అపాదాయ– ఒక అంశాన్ని మాత్రం విడదీసి పట్టుకుంటాడు. అంటే వాసనలను మాత్రమే తీసుకువెళతాడు. దేహాభిమానాన్ని వదులుకుంటాడు అప్పుడు. స్వప్నప్రపంచం ఏ జ్యోతివల్ల ప్రకాశిస్తుంది? స్వప్నంలో బాహ్యజ్యోతి ఉండదు. స్వయం ప్రకాశకమైన సాక్షిచైతన్యంవల్ల స్వప్నప్రపంచం ప్రకాశిస్తుంది. సాక్షికి మనస్సులాగా బాహ్యజ్యోతి అవసరం లేదు.

**అత్రాయం పురుషః స్వయం జ్యోతిర్భవతి**

చాలా ముఖ్యమైన వాక్యం. ఆత్మయొక్క స్వయంజ్యోతి స్వప్నంలో తెలుస్తుంది. మూడు అవస్థల్లోనూ ఉంటుంది కాని తక్కిన రెండు అవస్థల్లో తెలియదు. జాగ్రదవస్థలో రెండు జ్యోతులు ప్రకాశిస్తున్నాయి. అవి ఆత్మజ్యోతి, మనస్సనే జ్యోతి. మనస్సు పనిచేస్తున్నప్పుడు ఆత్మ గురించి తెలియటం లేదు. సుషుప్తిలో మనస్సు పడుకోవటంవల్ల ఆత్మజ్యోతిని ప్రకాశింపజేసేది లేదు.

స్వప్నంలో కూడా మనస్సు పనిచేస్తుంది కాని అక్కడ మనస్సు కర్మగా ఆత్మవల్ల చూడబడుతుంది. జాగ్రదవస్థలో మనస్సు కర్తగా బాహ్యప్రపంచాన్ని చూస్తుంది. మనస్సును ఆబ్జెక్టుగా తెలుసుకునే సబ్జెక్టు ఇంకొకటి ఉంది. అది సాక్షిచైతన్యం.

ఉదాహరణకు నేను పుస్తకాన్ని చూస్తున్నాను వాక్యాన్ని తీసుకుంటే పుస్తకాన్ని చూస్తున్న నేను మనస్సు, మనస్సును చూస్తున్న నేను సాక్షిచైతన్యం. నేను అంటే మనస్సు + చైతన్యం. ఇప్పుడు జాగ్రద్‌పురుషుడు, స్వప్నపురుషుడు, సుప్తపురుషుడు, మనస్సు, సాక్షి పదాలను

తీసుకుందాము. నేను చూస్తున్నాను, నేను కలగంటున్నాను, నేను పడుకున్నాను పదాలు వరుసగా మూడు అవస్థలలోని ముగ్గురు పురుషులకు చెందుతాయి. ఈ మూడు అవస్థలోనూ, నేను, నేను, నేను అని చెప్పేది మనస్సు. కాని మనస్సు మూడు అవస్థలలోనూ ఉందని సాక్షిచైతన్యంవల్లనే చెప్పగలుగుతున్నాము. ఇంకో విధంగా చెప్పాలంటే –

అవస్థాత్రయ ఆశ్రయం మనస్సు; అవస్థాత్రయ సాక్షి ఆత్మా.

అందువల్ల నేను అంటే ఆత్మ, అనాత్మల మేలుకలయిక. నేను అంటే మనస్సు + సాక్షి. సాక్షి స్వయంజ్యోతి; మనస్సు సాక్షివల్ల ప్రకాశింపబడుతున్నది.

స్వప్నప్రపంచం ఎలా ఉంటుందో వర్ణిస్తుంది ఉపనిషత్తు. ఈ నిర్వచనాన్ని కూడా ఎక్కడా చూడము.

**న తత్ర రథా న రథయోగా న పంథానో భవంతి అథ రథాన్ రథయోగాన్ పథస్సృజతే।**

ఇంకా ఉంది. వాటి సారం మాత్రం చూద్దాము. స్వప్నంలో రథాలు లేవు, రథాలకు కట్టే గుర్రాలు లేవు. అవి వెళ్ళటానికి అవసరమైన మార్గాలు కూడా లేవు. మనస్సే వీటిని సృష్టిస్తోంది. అలాగే ప్రియ, మోద, ప్రమోదాలను సృష్టిస్తోంది. అక్కడ నీటిమడుగులు, సరస్సులు, నదులు లేవు. మనస్సే వీటిని సృష్టిస్తున్నది. నిజానికి ఉపనిషత్తు ఆత్మ పదం వేసింది దానికి వివరణ ముందే చూశాము. మనస్సు చూస్తుంది కాని ఆత్మవల్లనే చూస్తుంది అని. స్వప్నావస్థలో శరీరం మరణించినట్టుగా ఉంటుంది. అందువల్ల ఆత్మ శరీరంనుంచి బయటకు వచ్చి, స్వప్నలోకంలోకి వెళుతుంది. ఆత్మ సర్వవ్యాపకం. వెళ్ళినట్టుగా అని అర్థం చేసుకోవాలి. స్వప్నావస్థ వర్ణన ఇంకా కొనసాగుతున్నది. స్త్రీలతో కలిసి ఆనందిస్తాడు, నవ్వుతాడు, భయపడతాడు. స్త్రీలతో అంటే తక్కిన మనుష్యులందరితో అని అర్థం చేసుకోవాలి.

ఈ విధంగా స్వప్నవృత్తాంతవర్ణన ఇవ్వటానికి కారణం స్వప్నం మనోవృత్తి మాత్రమే అని నిరూపించి, తద్వారా స్వప్నాన్ని ప్రకాశింపజేసేది బాహ్యజ్యోతి కాదు, ఆంతరజ్యోతి అని చూపించటానికి.

**అత్రాయం పురుషః స్వయంజ్యోతిర్భవతి**

**ఆత్మ స్వయంజ్యోతి** రెండవ నిర్వచనం. దీన్ని స్వప్నప్రపంచంద్వారా విశ్లేషించాడు యాజ్ఞవల్క్యుడు.

ఇప్పటిదాకా ఆత్మ నిర్వచనాలు రెండు చూశాము. అవి ఆత్మ దేహవ్యతిరిక్తం, ఆత్మ స్వయంప్రకాశకం లేదా స్వయంజ్యోతి.

3. **ఆత్మ కర్మ విలక్షణం** – కర్మలు మూడు రకాలు. అవి – సంచితకర్మ, ప్రారబ్ధకర్మ, ఆగామికర్మ. కాని ఆత్మ కర్మవిలక్షణం. ఈ కర్మఫలాలు ఆత్మకు అంటవు. దీన్నికూడా స్వప్నవృత్తాంతం ద్వారానే నిరూపిస్తాడు యాజ్ఞవల్క్యుడు.

జీవుడు మూడు అవస్థల్లోనూ తిరుగుతుంటాడు. స్వప్నంలో కొన్ని కర్మలు చేస్తాడు, ఆ కర్మఫలాలను కూడా అనుభవిస్తాడు. కాని స్వప్నంనుంచి లేచి జాగ్రదవస్థకు వస్తే ఆ కర్మలు కాని, ఆ కర్మఫలాలు కాని ఉండవు. తరువాత జాగ్రదవస్థలో కొన్ని కర్మలు చేస్తాడు, కొన్ని కర్మఫలాలను అనుభవిస్తాడు. కాని అతను మళ్ళీ స్వప్నంలోకి వెళ్ళేసరికి ఈ కర్మలు కాని, ఈ కర్మఫలాలు కాని ఉండవు. అంటే ఒక అవస్థలోని కర్మలు, కర్మఫలాలు ఇంకో అవస్థకు వెళ్ళటం లేదు. అవి తాత్కాలికంగా వస్తున్నాయి, పోతున్నాయి. అలా వచ్చిపోయేవి శాశ్వతం కాదు. ఆత్మ నిత్యం, శాశ్వతం. అందువల్ల ఆత్మకు కర్మ అంటదు. జీవునికి చైతన్యం స్వాభావికం. ఎందుకంటే చైతన్యం మూడు అవస్థల్లోనూ ఉంటుంది కాబట్టి. పుణ్యపాపాలు ఒక అవస్థలో ఉండి, ఇంకో అవస్థలో పోతాయి. అందువల్ల ఆత్మ అసంగం, కర్మ విలక్షణం.

**అసంగో హి అయం పురుషః**

ఇంకో అద్భుతమైన వాక్యం ద్వారా **ఆత్మ కర్మ విలక్షణం** అనే మూడవ నిర్వచనాన్ని ఇస్తాడు యాజ్ఞవల్క్యుడు.

4. **ఆత్మ కామవిలక్షణం** – ఇంచుమించు అదే వర్ణన ద్వారా ఆత్మ కామ విలక్షణం అని నిరూపిస్తాడు యాజ్ఞవల్క్యుడు. ఇక్కడ జాగ్రదవస్థను వివరిస్తాడు. జాగ్రదవస్థలో అనుభవించేవి తక్కిన అవస్థల్లో అనుభవించదు. అది అనుభవించేది మనస్సు. జీవుడు మూడు అవస్థల్లోనూ తిరుగుతూ ఉంటాడు, అంటే ఏ అవస్థకూ చెందదని తెలుస్తున్నది. ఈ మూడు అవస్థల్లోనూ తిరిగేది మనస్సు. జీవస్వరూపం సాక్షిచైతన్యం. అందువల్ల ఆత్మ కామవిలక్షణం.

జీవాత్మ మూడు అవస్థల్లో తిరిగినా, ఆత్మ అసంగం అని నిరూపించటానికి రెండు ఉదాహరణలనిస్తున్నాడు యాజ్ఞవల్క్యుడు.

**మహామత్స్యదృష్టాంతం** – నీటిలో ఉన్న ఒక పెద్ద చేప కాసేపు ఈ ఒడ్డుకూ, కాసేపు ఆ ఒడ్డుకూ తిరుగుతుంది. కాసేపు మధ్యలో ఉంటుంది. కాని ఏ ఒడ్డున ఏం జరిగినా దానికేం అవదు. రెండు ఒడ్డులు జాగ్రత్, స్వప్నావస్థలు. మధ్యభాగం సుషుప్తి. అలాగే జీవాత్మ కూడా రెండు అవస్థల్లో తిరిగి, అలసిపోతే, సుషుప్తిలోకి వెళుతుంది. కాని ఈ అవస్థల్లో ఏం జరిగినా, ఆత్మ చలించదు.

**పక్షి దృష్టాంతం** – ఒక పక్షి ఆకాశంలో రోజంతా ఎగిరి, సాయంకాలం తన గూటికి తిరిగి వస్తుంది. జీవుడు కూడా జాగ్రత్, స్వప్నప్రపంచాల్లో తిరిగి, అనేక మిశ్రమఫలాలను పొంది, రాత్రి తన గూడు అయిన కారణశరీరంలో పడుకుంటాడు. జీవుడు అనేక మిశ్రమఫలాలను అనుభవించినా ఆత్మకు అంటదు. ఆత్మ అసంగం. ఈ ఉదాహరణలను కూడా ఏ ఉపనిషత్తులోనూ చూడము.

ఈ రెండు దృష్టాంతాలద్వారా యాజ్ఞవల్క్యుడు ఒక సందేశాన్ని అందిస్తున్నాడు. జీవుడు జాగ్రత్, స్వప్నావస్థల్లో ద్వైతాన్ని, తద్ద్వారా సంసారాన్ని అనుభవిస్తాడు. సుషుప్తిలో అద్వైతాన్ని, మోక్షాన్ని అనుభవిస్తాడు.

**యత్ర సుప్తో న కంచన కామం కామయతే న కంచన స్వప్నం పశ్యతి॥**

సుషుప్తిలో ఏ విషయవస్తువులనీ కోరదు, ఏ స్వప్నాన్నీ చూడదు. అందువల్ల జీవన్ముక్తునిలా ఉంటాడు.

నేను ఒకసారి సంసారం, ఇంకోసారి మోక్షాన్ని అనుభవిస్తే నా అసలు స్వరూపం ఏమిటి? నేను సంసారిని, మోక్షాన్ని సుషుప్తిలో తాత్కాలికంగా అనుభవిస్తున్నాను అనుకోవాలా?, లేక నేను ముక్తపురుషుని. తాత్కాలికంగా సంసారాన్ని అనుభవిస్తున్నాను అనుకోవాలా? రెండు అవస్థల్లో సంసారాన్ని అనుభవిస్తాను కాబట్టి, సంసారినే అనుకునే అవకాశం ఉంది. కాని నేను ముక్తపురుషుణ్ణి అని సుషుప్తి ద్వారా నిరూపించబోతున్నాడు యాజ్ఞవల్క్యుడు.

**మోక్షవర్ణన, సుషుప్తి ద్వారా**

సుషుప్తిని మోక్షంతో పోలుస్తున్నాడు యాజ్ఞవల్క్యుడు. కాని ఒక విషయం గుర్తుపెట్టుకోవాలి. నిజంగా సుషుప్తి మోక్షాన్ని ఇవ్వదు. సుషుప్తి మోక్షాన్ని ఇచ్చేటట్టయితే శాస్త్రం ఎందుకు, గురువు ఎందుకు, బోధ ఎందుకు? ఎందుకంటే మోక్షానికీ, సుషుప్తికీ చాలా పోలికలున్నాయి.

**అవిద్యాకామ కర్మ అభావః** – సుషుప్తిలో అవిద్యాకామ కర్మలు ఉండవు. ఈ మూడూ ఒకదాన్ని వెన్నంటి ఒకటి ఉంటాయి. అవిద్య అంటే అజ్ఞానం. అవిద్యవల్ల కామం ఏర్పడుతుంది. కామం అంటే కోరిక. కోరిక కర్మకు దారి తీస్తుంది. కర్మ సంసారంలో పడవేస్తుంది. అందువల్ల అవిద్య, కామం, కర్మ అనే ఈ మూడు పదాలూ మనకు సంసారకారణాలు. సుషుప్తిలో ఆత్మస్వరూపం అవిద్యాకామకర్మ అభావః. అందువల్ల సుప్తపురుషుణ్ణి (సుషుప్తిలో పురుషుణ్ణి) బ్రహ్మ ఏవ అంటున్నాడు.

సుషుప్తిలో జీవాత్మ పరమాత్మలో ఐక్యం అవుతుంది. అంటే ప్రాజ్ఞ ఈశ్వరునితో ఐక్యం అవుతుంది. ఈ ఐక్యాన్ని ఉపనిషత్తు తనదైన బాణీలో చెబుతున్నది. ప్రియమైన భార్య కొన్ని

నెలలు తనను వదిలి, ఏ పిల్లల దగ్గరికో వెళ్ళివచ్చాక, ఆ విరహం తరువాత భర్త, భార్యను గాఢపరిష్వంగంలోకి తీసుకుంటే, పరిసరాలను మర్చిపోతాడు. అదే మైమరపు ఆత్మ విషయంలో జరుగుతుంది. జాగ్రత్, స్వప్నప్రపంచాల్లో తిరిగి తిరిగి అలసిపోయి, రాత్రి సుషుప్తిలో పరమాత్మలో ఐక్యం అయ్యేసరికి, జీవాత్మ మైమరచిపోతుంది. అందువల్ల సుషుప్తిలో శోకం ఉండదు. ఇది సుప్తపురుషుని స్వరూపం.

**అనన్వాగతం పుణ్యేనాన్వగతం పాపేన తీర్ణో హి తదా సర్వాన్ శోకాన్ హృదయస్య భవతి॥**

సుషుప్తిలో పుణ్యంతో సంబంధం ఉండదు, పాపంతో సంబంధం ఉండదు. హృదయంలో ఉన్న శోకాలన్నింటినీ అతిక్రమిస్తాడు. మనస్సు హుషారుగా ఉన్నప్పుడు జీవునికి ఆనందమో, బాధో కలుగుతుంది. మనస్సు పడుకున్నప్పుడు ఆ జీవునికి సుఖదుఃఖాలు అంటవు.

ఈ అధ్యాయంలో 21–33 మంత్రాల్లో సుషుప్తిని మోక్షంగా వర్ణిస్తాడు యాజ్ఞవల్క్యుడు. సుషుప్తి అక్షరాలా మోక్షం కాదు, మోక్షానికి అతి దగ్గర ఉదాహరణ అనే విషయం మర్చిపోకూడదు. కాని ఈ మంత్రాల్లో మోక్షానికి అద్భుతమైన నిర్వచనాలు వస్తాయి. జీవన్ముక్తుని నిర్వచనం వస్తుంది.

1. **శోకరహితం –**

**ఆప్తకామః ఆత్మ కామః అకామః**

**అకామః** – అందుకని కోరికలు లేనివాడు.

తర్కం చూశారా? సుషుప్తిలో కోరికలు తీరినట్టుగా ఆనందంగా ఉంటాడు. ఎందుకంటే అతను సర్వాత్మభావనలో ఉంటాడు కాబట్టి. అందువల్ల శోకరహితంగా ఉంటాడు.

2. **ఆత్మ చైతన్యం, ఆత్మ నిత్యం**

జాగ్రత్ అవస్థలో నిర్వికారద్రష్ట అయిన ఆత్మ మనస్సును చేతనపరిస్తే మనస్సుతో కూడిన తను వ్యవహారద్రష్ట అయిన చిదాభాస ద్వారా ప్రపంచాన్ని చూస్తుంది. సుషుప్తిలో మనస్సు పడుకుంటుంది కాబట్టి చిదాభాస పనిచేయదు. నిర్వికారద్రష్ట అయిన ఆత్మ నిత్యదృష్టితో మనస్సును చూస్తుంది.

3. **అద్వైతం** – అన్ని వ్యవహారాలూ ద్వైతంలోనే సాధ్యం; అద్వైతంలో సాధ్యం కాదు అంటున్నాడు యాజ్ఞవల్క్యుడు. ఎందుకంటే కర్మ వ్యవహారానికి త్రిపుటి కావాలి. కర్మ, కర్త, కరణం కావాలి. జ్ఞానవ్యవహారానికి త్రిపుటి – ప్రమాత, ప్రమాణం, ప్రమేయం కావాలి. ఈ మూడూ సుషుప్తిలో ఉండవు, ఆత్మలో కూడా ఉండవు.

**యత్ర అన్యదివ స్యాత్ తత్ర అన్యః అన్యత్ పశ్యేత్॥**

అద్వైతమే ఆత్మస్వరూపం అని నిరూపించటానికి ఈ మంత్రం సాక్ష్యం. అన్యదివ స్యాత్- అన్యత్+ఇవ+స్యాత్. ఇవ అంటే ఉన్నట్టుగా ఉంది. నిజంగా లేదు. ఇది అక్షరలక్షలు విలువ చేసే పదం. ఇవ అనటంవల్ల భేదం మిథ్యావ్యవహారం, అద్వైతం పారమార్థిక స్వరూపం.

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా**

ఇది వేదాంతసారం. జగన్మిథ్యా అంశం శంకరులవారు సృష్టించినది కాదు.

**అథ యత్రైనం ఘ్నంతీవ జినంతీవ హస్తీవ విచ్ఛాయయతి గర్తమివ పతతి** - 4.3.20

స్వప్నప్రపంచం గురించి వర్ణించినప్పుడు కూడా ఇవ, ఇవ, ఇవ పదేపదే వచ్చింది. అంటే స్వాప్నికునికి తనను కొడుతున్నట్టుగా, తనను వశం చేసుకుంటున్నట్టుగా, ఏనుగు తరుముతున్నట్టుగా, గోతిలో పడుతున్నట్టుగా అనిపిస్తుంది.

**అద్వైతః భవతి**

సుషుప్తిలో అతను తన అద్వితీయస్థితిలో నిలుస్తాడు అని వస్తుంది. ఇక్కడ ఇవ పదం రాలేదు. అందువల్ల,

**ద్వైతం మిథ్య, అద్వైతం సత్యం.**

**ఏకః సలిలః అద్వైతః** - సజాతీయ విజాతీయ స్వగతభేదరహితం ఆత్మ.

**ఏషః బ్రహ్మలోకః** - ఇది ఒక మహావాక్యం. ఏషః అంటే అద్వైత ఆత్మ. బ్రహ్మలోకం అంటే అక్షరాలా బ్రహ్మలోకం కాదు. సర్వవ్యాపి అయిన బ్రహ్మ. ఈ అద్వైత స్వరూపమే, నీ ఆత్మ స్వరూపం తెలుసుకోవటమే నీ పరమగతి. దీన్ని ఆత్మానందం లేదా బ్రహ్మానందం అంటారు. అంటే దాన్ని పూర్ణత్వంగా తీసుకోవాలి. పూర్ణత్వానికి తారతమ్యాలు లేవు.

**ఏషోఽ స్య పరమ ఆనందః ఏతస్యైవానందస్యాన్యాని భూతాని మాత్రాముపజీవంతి॥**
- 4.3.32

ఆత్మ ఆనందస్వరూపం. విషయానందం కేవలం ప్రతిబింబానందం. అది ఆత్మానందంలో ఒక అంగం మాత్రమే అని చెబుతుంది ఈ మంత్రం. ఈ సందర్భంలో ఆనందమీమాంస జరుగుతుంది. ఇంచుమించుగా తైత్తిరీయోపనిషత్తులో ఉన్నట్టే ఉంటుంది. ప్రతిబింబానందం రెండు రకాలుగా పొందవచ్చు. మనస్సు కోరిందల్లా పొంది, లేదా వైరాగ్యం పొంది. కాని

బింబానందం జ్ఞానమార్గంవల్లనే పొందగలము. సముద్రమంత పెద్ద ఆనందస్వరూపులం మనమయితే, అందులోని నీటిబొట్టులోని భాగమంత ఆనందం మాత్రమే మనం విషయానందరూపంలో పొందుతున్నాము.

**సంసారవర్ణన, జాగ్రదవస్థ ద్వారా**

జీవుడు సుషుప్తిలో ఉన్నాడు. ఇప్పుడు అతనిని జాగ్రదవస్థలోకి తీసుకురావాలి. సుషుప్తిలో కొంతకాలం ఉన్న ఈ జీవి, స్వప్నంలోకి వచ్చి, అక్కడ రమించి, చరించి, పుణ్యపాపాలను అనుభవించి, మళ్ళీ జాగ్రదవస్థకు వస్తాడు. ఇంక జాగ్రదవస్థలోకి వచ్చిన ఈ జీవుడు అనేక కర్మలు చేసి, అనేక పుణ్యపాపాలను పోగేసుకుని, వృద్ధుడై, మరణానికి సిద్ధంగా ఉన్నట్టు ఊహించుకోవాలి. చర్చలో ఉన్న అంశం సంసారవర్ణనం. సంసారం అంటే ఒక లోకంనుంచి ఇంకొక లోకంలోకి పోవటం. బ్రతికుండగా వెళ్ళలేడు కాబట్టి, అతను మరణించాలి. వైరాగ్యం పెంచటంకోసం మరణవర్ణన. దీనికి మూడు దృష్టాంతాలను ఇస్తున్నాడు గురువు.

ఎ) **శకటదృష్టాంతం** – ఒక వ్యక్తి ఇల్లు మారినప్పుడు తన వస్తువులన్నింటినీ పెట్టెల్లో వేసుకుని బండిలో తీసుకువెళతాడు. ఆ బరువును మోయలేక బండి చప్పుడు చేస్తుంది. అదే విధంగా జీవాత్మ శరీరాన్ని వదిలేటప్పుడు కర్మల పుణ్యపాపఫలాలు, సంచితకర్మలు, ఇంద్రియాలను పోగేసుకుని బయలుదేరుతుంది. బండి చేసే చప్పుడు జీవి చేసే చప్పుడు, మూలుగు, ఏడుపు.

బి) **ఫలదృష్టాంతం** – ఒక పండు పరిపక్వం అయ్యేదాకా చెట్టును అంటిపెట్టుకుని ఉంటుంది. కాని అది పరిపక్వమయ్యాక చెట్టుతో ఎంత అనుబంధం ఉన్నాకూడా దానినుంచి రాలిపోతుంది. అలాగే ఈ జీవాత్మ అనే పండుకు శరీరం అనే చెట్టుతో ఎంత అనుబంధం ఉన్నా, సమయం రాగానే దానినుంచి విడిపోక తప్పదు.

సి) **రాజదృష్టాంతం** – ఒక రాజు ఒక ప్రదేశాన్ని వదిలి వెళ్ళేటప్పుడు మందీమార్బలంతో వెళతాడు. అలాగే జీవాత్మ కూడా ఈ శరీరాన్ని వదిలివెళ్ళేటప్పుడు పంచప్రాణాలనే మంత్రులు, జ్ఞానేంద్రియాలనే సేవకులు, కర్మేంద్రియాలనే సైనికులతో వెళుతుంది. రాజుని కొత్త ప్రదేశంలో స్వాగతించటానికి చాలామంది ఎదురుచూసినట్టుగా, కొత్త శరీరంలోని గోళకాలతో ఇంద్రియాలు కలవటంకోసం, వాటిని చైతన్యవంతం చేసే అధిష్ఠానదేవతలు కూడా రావాలి.

ఈ విధంగా సంసారవర్ణన గురించి మూడు ఉదాహరణలు చూస్తాము. తరువాత వచ్చే బ్రాహ్మణములో కూడా 6వ మంత్రంవరకూ సంసారవర్ణనే కొనసాగుతుంది.

## 4.4. శారీరక బ్రాహ్మణము

స్వయంజ్యోతి బ్రాహ్మణంలో చివర్లో చూసిన సంసారవర్ణన ఈ బ్రాహ్మణములో కూడా 6వ మంత్రంవరకూ కొనసాగుతుంది అని చూశాము. ఈ బ్రాహ్మణమును శారీరక బ్రాహ్మణము అంటారు. శరీరం అంటే స్థూలశరీరం; శారీరకం అంటే శరీరంలో ఉండేది. 'క' ప్రత్యయం దానికున్న పరిమితిని సూచిస్తుంది. అందువల్ల శారీరక అంటే బాధాతప్త జీవాత్మ. ఎందుకంటే అది ప్రయాణం చేస్తుంది కాబట్టి. ఇంకా మరణకాల వర్ణనే సాగుతున్నది.

1. **సంసారవర్ణన –** మరణకాలంలో జీవాత్మయొక్క ఇంద్రియాలు వాటి గోళకాలనుంచి విడివడి, హృదయం దగ్గరకు వస్తాయి. ఇంద్రియాలు సూక్ష్మశరీరంలో కలిస్తే, వాటి అధిష్ఠానదేవతలు సమష్టి దేవతలతో కలుస్తాయి. జీవాత్మ, ప్రాణం, ఇంద్రియాలతో కలిసి బయటకు 101 నాడుల్లో ఏదో ఒక నాడినుంచి వెళుతుంది. జీవాత్మతోపాటు మూడు విషయాలు వెళతాయి. అవి  ఉపాసన, కర్మ, సంస్కారాలు. ఉపాసన అంటే దేని గురించి ఎక్కువగా ఆలోచిస్తాడో అది. కర్మ అంటే పుణ్యపాపకర్మలు. సంస్కారాలు అంటే పూర్వజన్మవాసనలు. మరణకాలంలో  ఈ మూడింటిలో దేన్నీ మనం ప్రయత్నపూర్వకంగా నిర్దేశించలేము. అందువల్ల ముందునుంచీ ఉన్నతమైన ఆలోచనలు, ఉన్నతమైన కర్మలు చేస్తూ ఉండాలి.

జీవుడు ఒక శరీరంలోంచి ఇంకొక శరీరంలోకి మారటాన్ని ఒక ఉదాహరణతో చెబుతాడు గురువు. గడ్డిపురుగు గడ్డిపోచనుంచి ఇంకో గడ్డిపోచమీదకు వెళ్ళేటప్పుడు ముందు భాగాన్ని ముందు కదిపి, రెండవ గడ్డిపోచమీద తలభాగం పెట్టి, అప్పుడు రెండవ భాగాన్ని కదుపుతుంది. అలాగే కొత్త శరీరాన్ని తీసుకున్నాక, ఈ శరీరాన్ని వదులుతాడు అంటాడు గురువు. అంటే మానసికంగా వాసనల ద్వారా అందులోకి వెళ్ళిపోతాడు అని అర్థం చేసుకోవాలి అంటారు శంకరులవారు. అలా కొత్త జన్మను తీసుకున్నాక, జీవాత్మ దానిలో పూర్తిగా మమేకం చెందుతుంది.

**స వా అయమాత్మా బ్రహ్మ**

**అయమాత్మా బ్రహ్మ** – మాండూక్యోపనిషత్తు మహావాక్యం.

చాలా మామూలుగా మహావాక్యాన్ని వేసింది. ఈ జీవాత్మ నిశ్చయంగా బ్రహ్మ. జీవాత్మ=పరమాత్మ. ఇది ఒక మహావాక్యం. కాని తమాషా ఏమిటంటే ఈ జీవాత్మ ఇంత అవస్థలు పడి మరణించి, మళ్ళీ ఎక్కడో పుట్టి, మళ్ళీ అవస్థలు పడాల్సిన అవస్థ లేకపోయినా అవస్థలు పడుతోంది. తన ఉన్నతస్థాయిని పోగొట్టుకుని, విజ్ఞానమయ ఆత్మ అయింది. అలా బుద్ధితో, మనస్సుతో, ప్రాణంతో, కళ్ళతో, చెవులతో, స్థూలశరీరంతో తాదాత్మ్యం చెందుతుంది. ఎందుకిలా జీవుడు సంసారంలో పడి కొట్టుమిట్టాడుతున్నాడు?

**కామమయ ఏవాయం పురుష ఇతి స యథాకామో భవతి తత్క్రతుర్భవతి।**
**యత్క్రతుర్భవతి తత్కర్మ కురుతే యత్కర్మ కురుతే తదభిసంపద్యతే॥**

ఈ సంసారి కామాలతో (కోరికలతో) నిండినవాడు – 4.4.5

ఎటువంటి కోరికలు ఉంటే, అటువంటి సంకల్పం చేస్తాడు; ఎటువంటి సంకల్పం చేస్తాడో, అటువంటి కర్మలు చేస్తాడు. ఎటువంటి కర్మలు చేస్తే, అటువంటి ఫలం పొందుతాడు. దీన్నే అంతకుముందు **అవిద్యాకామకర్మ**గా చూశాము. ఇక్కడ అవిద్య చెప్పలేదు. దాన్ని కలుపుకోవాలి. అటువంటి ఫలం పొందుతాడు అంటే అటువంటి జన్మ పొందుతాడు.

**ఇతి ను కామయమానః**

ఇదీ కోరికలతో కూడిన సంసారి వర్ణన. ఇది ఈ బ్రాహ్మణములోని మొదటి అంశం.

2. **మోక్షవర్ణన**

**అథ అకామయమానః యః అకామః నిష్కామః ఆప్తకామః ఆత్మకామః**

అథ అంటే ఇక్కడనుంచీ అంశం మారుతున్నది. ఇప్పుడు కోరిక లేని వ్యక్తి గురించి చూస్తాము. ఇది చాలా ముఖ్యమైన నిర్వచనం. ముందు ఆత్మకామఃతో మొదలుపెడదాము.

**ఆత్మకామః** – అనాత్మకామం ఉంటే దాని కర్మఫలాలు మూడు దుఃఖాలను ఇస్తాయి. అవి – బంధకత్వం, అతృప్తికరత్వం, దుఃఖమిశ్రితత్వం. కాని లౌకిక విషయాలమీద వైరాగ్యం పెంచుకుని, వాటిని వదులుకోవటానికి సిద్ధపడటమే ఆత్మకామః.

**ఆప్తకామః** – ఆత్మను కోరితే, ఆ వ్యక్తి అన్ని కోరికలనూ తీర్చుకోగలుగుతాడు. తృప్తోభవతి, పూర్ణోభవతి. మోక్షాన్ని లక్ష్యంగా పెట్టుకుంటే తక్కిన మూడు పురుషార్థాలు కూడా తీరతాయి.

**నిష్కామః** – ఆప్తకామం నిష్కామానికి దారి తీస్తుంది. వేదాంతానికి రాకముందు అనేక కోరికలు ఉండివుంటాయి. కాని వేదాంతాన్ని అర్థం చేసుకున్నాక, ఆ కోరికలు అర్థం లేనివిగా కనిపిస్తాయి. అవి తీరినా సంతోషమే, తీరకపోయినా సంతోషమే.

**అకామః** – నిష్కామః కాబట్టి అకామః అవుతాడు. కోరికలు తీరతాయి కాబట్టి కోరికలు ఉండవు. కోరికలు ఉండవు కాబట్టి అకామయ మనః అవుతాడు. ఈ జ్ఞాని విదేహముక్తి పొందుతాడు.

**న తస్య ప్రాణాః ఉత్క్రామంతి** – ప్రాణ ఉత్క్రమణం అంటే పునర్జన్మ. జ్ఞానికి ప్రయాణం లేదు.

**బ్రహ్మైవ సన్ బ్రహ్మ అప్యేతి** – 4.4.6

ముందే బ్రహ్మ అయిన జీవాత్మ బ్రహ్మలో ఐక్యం అవుతుంది. అక్షరలక్షల విలువ చేసే వాక్యం. జ్ఞాని జ్ఞానం పొందాక, జీవించి ఉన్నన్నాళ్ళూ జీవన్ముక్తి అనుభవించి, ప్రారబ్ధకర్మ ముగిసి, మరణించాక సమష్టిలో కలిసిపోతాడు. స్థూలశరీరం రాలిపోతుంది. సూక్ష్మశరీరం సమష్టి సూక్ష్మప్రపంచంలోను, కారణశరీరం సమష్టి కారణప్రపంచంలోనూ ఐక్యం అయిపోతుంది. అందువల్ల జ్ఞానికి మరణానంతరం ప్రయాణం లేదు. అతను జీవించి ఉండగానూ బ్రహ్మే, మరణించాక కూడా బ్రహ్మే. జీవించి ఉండగా **శరీరంలో ఉన్నట్టుగా** ఉన్నాడు; మరణించాక శరీరంనుంచి **బయటపడ్డట్టుగా** ఉన్నాడు.

పాము తన కుబుసాన్ని ఏ పుట్టమీదో విడిచిపెట్టి, ఇంకొక చోటికి వెళ్ళిపోతుంది. జ్ఞాని కూడా తన శరీరాన్ని వదులుతాడు అంటే శరీర అభిమానాన్ని వదులుతాడు.

మోక్షాన్ని ఎలా పొందాలంటే కామనివృత్తి చేయాలి. కామం దానంతట అది పోదు. కోరికలను తీర్చినా, అనంతంగా పుట్టుకొస్తూనే ఉంటాయి. కామానికి మూలకారణమైన అజ్ఞానాన్ని పారద్రోలాలి. అజ్ఞానాన్ని పారద్రోలాలంటే ఆత్మజ్ఞానాన్ని పొందాలి. అది ఒక్కటే మార్గం.

**కామనివృత్తి = అజ్ఞాననివృత్తి = జ్ఞానప్రాప్తి**

జ్ఞానమార్గ ఏవ మోక్షమార్గః. జ్ఞానమార్గం మోక్షం పొందే అనేక మార్గాలలో ఒకటి కాదు. ఇది మూడవ అంశంలోకి దారితీస్తుంది.

3. **జ్ఞానస్తుతి** – జ్ఞానం పొందిన ఋషి జ్ఞానాన్ని ఇలా స్తుతిస్తాడు.

**అణుః పంథా వితతః పురాణో మాగ్ం స్పృష్టోఽనువిత్తో మయైవ**

**అణుః పంథా** – జ్ఞానమార్గం సూక్ష్మమైన బ్రహ్మ గురించి బోధిస్తుంది కాబట్టి ఇది కూడా చాలా సూక్ష్మమైనది.

**వితతః** – ఈ జ్ఞానమార్గం విస్తీర్ణమైనది.

**పురాణః** – సనాతనం. పురా అపి నవః – పాతదయినా ఇప్పటికీ కొత్తది.

**మాగ్ం స్పృష్టోఽనువిత్తో మయైవ** – నన్ను స్పృష్టించింది. అంటే నాచే పొందబడింది అని అర్థం. ఋషి నేను జ్ఞానమార్గానికి వెళ్ళాను అనటం లేదు. జ్ఞానమార్గం నాచే పొందబడింది అంటున్నాడు. అంతేకాదు, అనువిత్తోమయైవ అంటే ఆ జ్ఞానం నాలో పూర్తిగా జీర్ణించుకోబడింది అంటున్నాడు. ఆ విధంగా జ్ఞానులు బ్రహ్మను పొందుతారు. అంటే జీవించి ఉండగా జీవన్ముక్తి, మరణించాక విదేహముక్తి పొందుతారు. జ్ఞానమార్గాన్ని

స్తుతించటానికి, కర్మ ఉపాసనలను నిందిస్తుంది ఉపనిషత్తు. అవి పాటించినవారు కన్ను కానరాని చీకటిలోకాలకు వెళతారు అంటుంది.

శారీరక, మానసిక బాధలు జ్ఞాని కూడా తప్పించుకోలేదు. కానీ నాకే ఎందుకు వచ్చిందని జ్ఞాని వాపోడు. అనేక మహావాక్యాలద్వారా, వాటి ఫలంద్వారా జ్ఞానస్తుతి చేస్తున్నది ఉపనిషత్తు.

**తస్య లోకః సః ఉ లోక ఏవ**

జ్ఞానఫలాన్ని మెచ్చుకోవటంద్వారా జ్ఞానస్తుతిని చేస్తున్నది ఉపనిషత్తు.

**తస్య లోకః** – లోకః అంటే ఇక్కడ ఆత్మ. తస్య ఆత్మ (బ్రహ్మ కలుపుకోవాలి). అంటే బ్రహ్మజ్ఞానియొక్క ఆత్మ.

**సః ఉ లోక ఏవ** – ఇక్కడ కూడా లోకః అంటే ఆత్మ. బ్రహ్మపదాన్ని కలుపుకోవాలి. ఇంతకుముందు వాక్యంలో జ్ఞానిలో బ్రహ్మ ఉన్నాడు అంటే ఇప్పుడు బ్రహ్మలో జ్ఞాని ఉన్నాడు అని వస్తుంది. జ్ఞానే బ్రహ్మ; బ్రహ్మే జ్ఞాని. అంటే ఇద్దరూ ఒక్కటే.

ఎవరైతే స్వయంప్రకాశకమైన ఆత్మ గురించి తెలుసుకుంటారో, ఆ ఆత్మ ఎవరో కాదు, కాలాతీత పరమాత్మ అని తెలుసుకుంటారు.

**న తతో విజుగుప్సతే** – అతను దేనికీ చలించడు. ఈ ఫలం ద్వారా జ్ఞానస్తుతి చేస్తున్నది ఉపనిషత్తు.

ఎవరైతే స్వయంజ్యోతి ఆత్మనైన నేను బ్రహ్మ అని తెలుసుకుంటారో వారు అనంతమే అవుతారు.

బ్రహ్మకూ జగత్తుకూ అధిష్ఠాన–అధ్యాస సంబంధం ఉంది. ఆ బ్రహ్మను నేనే అనే జ్ఞానం పొందితే నేను అమృతాన్ని అవుతాను. నేను శాశ్వతుణ్ణి అని తెలుసుకోవటానికి వీలులేకుండా అడ్డుపడుతున్న ప్రతిబంధకాలను నివారిస్తుంది జ్ఞానం.

ఆత్మ గురించి తెలుసుకున్నవారు బ్రహ్మ గురించి తెలుసుకుంటారు. అంటే దీని అర్థం, ఆత్మ = బ్రహ్మ.

బ్రహ్మను మనస్సువల్లనే తెలుసుకోవాలి. అది కూడా సంస్కరించబడిన మనస్సువల్లనే తెలుసుకోవాలి. దీన్నిబట్టి నిర్వికల్పసమాధిలో బ్రహ్మజ్ఞానం పొందలేము అని అర్థమవుతున్నది. అంతేకాదు, గురుశాస్త్ర ఉపదేశంద్వారానే పొందాలి అని కూడా వస్తుంది. దాన్ని అనుద్రష్టవ్యం పదం సూచిస్తుంది.

**మహాన్ అజః ఆత్మా విజ్ఞానమయః ప్రాణేషు** అంటున్నాడు. మహాన్ అజః అంటే అనంతం అయిన పుట్టుక లేని పరమాత్మ. విజ్ఞానమయ ఆత్మ అంటే జీవాత్మ. పరమాత్మని వర్ణించేటప్పుడు సగుణ ఈశ్వరుడు, నిర్గుణ ఈశ్వరుడు - ఇద్దరినీ వర్ణిస్తాడు. వాటి మధ్య ఉన్నది నామభేదమే కాని వస్తుభేదం కాదని గుర్తుంచుకోవాలి.

4. **జ్ఞానసాధన** - జ్ఞానసాధనలో మళ్ళీ రెండురకాల సాధనలు ఉన్నాయి. అవి, సాక్షాత్ సాధన, పరంపర సాధన (సహకారీ సాధన).

**కర్మకాండ + ఉపాసన కాండ = సహకారీ సాధన; జ్ఞానకాండ = సాక్షాత్ సాధన**

**తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషంతి యజ్ఞేన దానేన తపసాఽనాశకేన ఏతమేవ విదిత్వా మునిర్భవతి** - 4.4.22

**తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషంతి** - ఇక్కడ బ్రాహ్మణా అంటే శాస్త్రఅధ్యయనం చేయటానికి బ్రహ్మచర్య ఆశ్రమాన్ని స్వీకరించినవారు. వారు వివిదిషంతి అంటే బ్రహ్మజ్ఞానం పొందాలనే కోరిక ఉండి, దానికోసం ప్రయత్నం చేస్తారు.

**యజ్ఞేన దానేన** - ఈ పదాలు గృహస్థాశ్రమాన్ని సూచిస్తాయి. అతను యజ్ఞాలు, వాటితోపాటు దానాలు చేయాలి.

**తపసా అనాశకేన** - ఈ పదాలు వానప్రస్థాశ్రమాన్ని సూచిస్తాయి. తపస్సు అంటే ఉపాసన చేయాలి. అనాశకేన అంటే మితాహారం తీసుకోవాలి.

**ఏతమేవ విదిత్వా మునిర్భవతి** - ఈ విధంగా మూడు ఆశ్రమాల ధర్మాలు పాటించి విద్య నేర్చుకుంటే, అతను ఆత్మ గురించి తెలుసుకుంటాడు. ముని పదం సన్న్యాసాశ్రమాన్ని, సాక్షాత్ సాధనను సూచిస్తుంది. అలా జ్ఞానం పొందిన వ్యక్తి ఆత్మలోకమే కావాలంటాడు అంటున్నది ఉపనిషత్తు. ఆత్మలోకాన్ని ఇంకో లోకంగా తీసుకోకూడదు. స్వయంప్రకాశక ఆత్మజ్ఞానంలో నిలబడతాడు.

**తే హ స్మ పుత్రైషణాయాశ్చ విత్తైషణాయాశ్చ లోకైషణాయాశ్చ వ్యుత్థాయ** - 4.4.22

కర్మఠునికి ఉండే మూడు కోరికలు - పుత్రులు, ధనం, స్వర్గలోకప్రాప్తి అనే కోరికలను త్యజిస్తాడు.

అతను పొందే ఆత్మజ్ఞానం ఏమిటి? నేతి నేతి పద్ధతిలో, ఈ ఉపనిషత్తులోనే రెండుసార్లు చూశాము. ఇప్పుడూ చూస్తాము.

**స ఏష నేతి నేత్యాత్మా అగృహ్యో న హి గృహ్యతే అశీర్యో న హి శీర్యతే, అసంగో న హి సజ్యతే, అసితో న వ్యథతే, న రిష్యతి** – 4.4.22

అన్నింటినీ ఇది కాదు, ఇది కాదు అని నిషేధించుకుంటూ వస్తే, చివరికి ఏది మిగులుతుందో, అది ఆత్మ. ఆత్మ సర్వప్రమాణ అగోచరం, అపక్షీయరహితం, అసంగం, వ్యథరహితం, మరణరహితం.

5. **జ్ఞానఫలం** – జ్ఞానఫలాన్ని ఎన్నో రకాలుగా సూచిస్తారు. ఇక్కడ నాలుగు ఫలాలను సూచిస్తున్నాడు యాజ్ఞవల్క్యుడు. ఒకటి అపరాధభావననుంచి మోక్షం.

**అతః పాపమకరవమ్ అతః కల్యాణమకరవమ్** – 4.4.22

నేను ఇందువల్ల పాపాలు చేశాను, ఇందువల్ల పుణ్యకార్యాలు చేయలేకపోయాను. వీటిని ఇంగ్లీషులో కమిషన్స్ అండ్ ఒమిషన్స్ (commissions and omissions) అంటారు. ఇవే మనిషిని కృంగదీస్తాయి. కాని జ్ఞాని ఈ రెండింటికీ చలించడు. **కృత అకృత తరణం** అంటారు దీన్ని.

**కర్మణా న వర్ధతే నో కనీయాన్** – 4.4.23

పుణ్యకర్మవల్ల పూర్ణత్వం ఎక్కువ అవదు; పాపకర్మవల్ల తక్కువ అయిపోదు. ఈ విషయాన్ని జ్ఞాని అర్థం చేసుకుంటాడు. దాన్ని **సర్వపాప తరణం** అంటారు.

**నైనం పాప్మా తరతి సర్వం పాప్మానం తరతి**
**నైనం పాప్మా తపతి సర్వం పాప్మానం తపతి**

పాపం అతని దగ్గరకు వెళ్ళలేదు, అతను పాపాలకు అతీతుడవుతాడు; పాపం అతన్ని దహించలేదు, అతను అన్ని పాపాలను దహించివేస్తాడు. అజ్ఞానిని పాపం దహించివేస్తే, జ్ఞాని పాపాన్ని దహించివేస్తాడు. దీన్ని సర్వపుణ్యపాపతరణం అంటారు. పాపంతో, పుణ్యాన్ని కూడా కలుపుకోవాలి. ఇది మూడవ జ్ఞానఫలం.

అజ్ఞాని అవిద్యాకామకర్మవల్ల సంసారంలో పడి తిరుగుతాడు అని చూశాము. జ్ఞాని **అవిద్యాకామకర్మ రహితుడు** అవుతాడు. అది నాలుగవ ఫలం. దీన్ని ఇలా చూస్తాము.

**విపాపః విరజః అవిచికిత్సః బ్రాహ్మణో భవతి**

అంతా చెప్పి, ఓ సామ్రాట్ ఈ ఆత్మనిష్ఠే బ్రహ్మలోకం అంటాడు యాజ్ఞవల్క్యుడు.

**ఏనం ప్రాపితోఽసీతి హోవాచ యాజ్ఞవల్క్యః**

నువ్వు బ్రహ్మలోకానికి తీసుకురాబడ్డావు అని జనకుడిని మెచ్చుకుంటున్నాడు. దానికి మురిసిపోయిన రాజు, మొత్తం తన విదేహరాజ్యాన్ని, తనను తాను సమర్పించుకుంటాడు యాజ్ఞవల్క్యునికి.

## 4.5. మైత్రేయీ బ్రాహ్మణము

మైత్రేయీ బ్రాహ్మణాన్ని రెండవ అధ్యాయములో నాలుగవ బ్రాహ్మణముగా చూశాము. ఇప్పుడు ఇంచుమించు అదే మంత్రాలతో, అదే పేరుతో మళ్ళీ నాలుగవ అధ్యాయంలో, ఐదవ బ్రాహ్మణంగా చూస్తున్నాము. ముందు వచ్చినదాన్ని ఉపోద్ఘాతం అంటే దీన్ని ఉపసంహారం లేదా నిగమనం అంటారు. ఇందులో కొత్తగా చెప్పిన అంశాలను మాత్రమే చూద్దాము.

మొదటి మంత్రం ఈ కథకు ఉపోద్ఘాతంగా వస్తుంది. అది మనం ముందే చూసేశాము. ఈ కథను ఒక కేస్‌స్టడీలా తీసుకోవచ్చు.

ఇక్కడ కొత్తగా వచ్చిన అంశం ఆత్మ సృష్టి కారణం అని చెప్పేటప్పుడు శబ్దప్రపంచం, అర్థప్రపంచం రెండూ భగవంతునినుంచే వచ్చాయని వస్తుంది. సాధారణంగా ఏదో ఒకటే వస్తుంది. ఎందుకంటే ఒకటి చెబితే, ఇంకొకటి చెప్పినట్టే అర్థం. ఒక ప్రాణి భూమ్మీద పడగానే అతనికి నామకరణం జరుగుతుంది. అలా రూపం, నామం వెంటవెంటనే జరుగుతాయి.

ఇక్కడ అర్థప్రపంచం సృష్టి గురించి కొత్తగా వచ్చింది. ఈ శబ్దప్రపంచం, అర్థప్రపంచం మొత్తం భగవంతుని ఉచ్ఛ్వాస నిశ్వాసలే.

**అస్యైవైతాని సర్వాణి నిశ్వసితాని**

భగవంతుడు గాలి బయటకు వదిలితే అది సృష్టి; గాలి లోపలకి పీల్చుకుంటే అది లయ.మనం గాలి పీల్చి, వదిలినంత తేలికగా భగవంతుడు పద్నాలుగు లోకాలను సృష్టి చేస్తున్నాడు, లయం చేస్తున్నాడు.

1. **ఆత్మ సజాతీయ విజాతీయ స్వగతభేద రహితం–** ఆత్మలక్షణాల్లో ముఖ్యంగా చెప్పేది ఈ నిర్వచనం. ఆత్మ శుద్ధచైతన్యం.

**స యథా సైంధవఘనోఽ నంతరోఽ బాహ్యః**

ఉప్పు స్ఫటికాన్ని నీళ్ళలో వేసి పైనుంచి, మధ్యనుంచి, అడుగునుంచి రుచి చూసినా కూడా ఆ నీళ్ళు కూడా ఉప్పగానే ఉంటాయి. అలాగే మొత్తం జగత్తు ఆత్మ అనే ఉప్పుతో నిండివుంది.

2. **ఆత్మ అవినాశి –**

**అవినాశీ వా అరేఽ యమాత్మాఽ నుచ్ఛిత్తి ధర్మా**

వికారాలు లేని ఆత్మకు నశించటం అనే ధర్మం లేదు. ఆత్మ సర్వవ్యాపకం; దానికి నాశనం లేదు.

**స ఏష నేతి నేత్యాత్మా**

ఈ మంత్రం ఈ మైత్రేయీ బ్రాహ్మణంలో కొత్తగా ఉంది కాని ఇప్పటికే దీన్ని మూడుసార్లు చూశాము. ఆత్మజ్ఞానాన్ని నేతి నేతి పద్ధతి ద్వారా పొందాలి. ఈ మంత్రంలోని చివరిభాగం ముందు మైత్రేయీ బ్రాహ్మణంలో లేదు, ముందు మూడుసార్లు చూసిన మంత్రాల్లోనూ లేదు.

**ఏతావత్ అరే ఖలు అమృతత్వమ్**

దీనితో బోధ పూర్తి అయింది. ఇది సంపూర్ణజ్ఞానం, ఈ జ్ఞానమే అమృతత్వసాధనం అని అర్థం చేసుకోవాలి.

ఇక్కడితో మైత్రేయీ బ్రాహ్మణము అయిపోయింది. నిజానికి ఇక్కడితో మొత్తం వేదాంత బోధే ముగిసింది. ఈ నాలుగవ అధ్యాయంలోనే మొత్తం జ్ఞానకాండ వస్తుంది. 5, 6 అధ్యాయాలలో కర్మ, ఉపాసనలు వస్తాయి.

## 4.6. వంశ బ్రాహ్మణము

ఈ బ్రాహ్మణము గురుశిష్య పరంపరను ఇస్తుంది కాబట్టి, దీన్ని వంశ బ్రాహ్మణము అంటారు. విద్యాస్తుతికోసం ఈ గురుశిష్యపరంపర ఇవ్వబడింది. ఈ విద్య సాక్షాత్తూ పరమాత్మనుంచే వచ్చింది. అందువల్ల అది పదికాలాలు నిలిచింది; దీనిమీద శ్రద్ధ ఏర్పడింది. బ్రహ్మ ఆదిగురువు. ఆ ఆదిగురువుకు నా నమస్కారము. ఆదిగురువుకు నమస్కారం చేస్తే శిష్యపరంపర అంతటికీ ఈ నమస్కారం వెళుతుంది.

దీనితో ఆరవ బ్రాహ్మణము, నాలుగవ అధ్యాయం, రెండవ కాండము అయిపోయాయి.

# ఏకాదశ ఉపనిషత్తుల సారం

## బృహదారణ్యకోపనిషత్ – అధ్యాయం 5

ప్రతి ఒక్క ఆధ్యాత్మిక సాధకుడు తప్పనిసరిగా పాటించాల్సిన ఆధ్యాత్మిక సాధనలు నాలుగు. ఈ నాలుగు సాధనలను మరణించేదాకా లేదా విదేహముక్తి పొందేదాక పాటించాలి. అవి – కర్మయోగం, ఉపాసనాయోగం, సద్గుణత్వం, జ్ఞానయోగం.

1. **కర్మయోగం** – కర్మయోగంలో పంచమహాయజ్ఞాలను తన శక్తి మేరకు పాటించాలి. పంచమహాయజ్ఞాలను ఒక్కముక్కలో చెప్పాలంటే పరోపకారకర్మలు అనవచ్చు. పరోపకార కర్మలు అంటే సమాజానికి మేలు చేకూర్చే కర్మలు. ఇవి జీవితాంతం చేయాలి, జ్ఞానం పొందే ముందూ, జ్ఞానం పొందాక కూడా. కాకపోతే వాటి పేర్లు మారతాయి. జ్ఞానం పొందక ముందు పరోపకారకర్మలను కర్మయోగం అంటే, జ్ఞానం పొందాక చేసే అవే పరోపకారకర్మలను లోకసంగ్రహంకోసం చేసే కర్మలు అంటారు. అప్పుడు కర్మయోగం అనకూడదు. మనం జీవించి ఉన్నందుకు భగవంతునికి మనం చెల్లించే రుసుము అన్నమాట అవి.

చిన్మయానందస్వామి అద్భుతంగా వర్ణిస్తారు – మీరు జీవించి ఉన్నన్నాళ్ళూ ప్రపంచంనుంచి ఎన్నో తీసుకుంటున్నారు, మీరు పీల్చే గాలిని, మీరు తినే ఆహారాన్ని, మీరు అనుభవించే సూర్యరశ్మిని, వాటికి ప్రతిఫలంగా మీరు తిరిగి సమాజానికి మీ వంతు సేవ చేయటం మీ కనీసధర్మం.

ఈ పరోపకారకర్మలు అసాధ్యం కూడా కాదు. మీరు మంచాన పడి, లేవలేని పరిస్థితిలో ఉన్నా కూడా పరోపకారకర్మలు చేయగలరు. అదెలాగంటారా? ఈ క్రిందిది పఠించటమే!

**సర్వే భవంతు సుఖినః సర్వే సంతు నిరామయాః।**
**సర్వే భద్రాణి పశ్యంతు మా కశ్చిత్ దుఃఖభాగ్ భవేత్॥**

ఈ ప్రార్థన మీకు తెలిసే ఉండి ఉంటుంది. ప్రపంచంలో అన్ని జీవుల క్షేమం కోరే ప్రార్థన ఇది.

**సర్వే భవంతు సుఖినః** – ప్రపంచంలోని జీవరాశులన్నీ సుఖంగా ఉండుగాక!

**సర్వే సంతు నిరామయాః** – ఇక్కడ సర్వే మనుష్యః అనలేదు. సర్వే సంతులో సకల జీవరాశులు వస్తాయి, చెట్లతో సహా! ప్రతి ఒక్కరూ శారీరక, మానసిక ఆరోగ్యం అనుభవించుగాక.

**సర్వే భద్రాణి పశ్యంతు** – వార్తాపత్రిక తెరిస్తే, ఎటువంటి దుర్వార్త ఉండకుండుగాక!
**మా కశ్చిత్ దుఃఖభాగ్ భవేత్** – ఎవరికీ ఎటువంటి దుఃఖం కలుగకుండుగాక!

పైకి ప్రార్థన చేసే ఓపిక లేకపోయినా ఫర్వాలేదు! మనస్సులోనే మనస్ఫూర్తిగా అందరి మేలు కోరుతూ జపిస్తే చాలు. ఆ మాటకొస్తే ఈ ప్రార్థనే చేయాలని కూడా లేదు. మీకు తెలిసిన ఏ ప్రార్థన చేసినా కూడా, దానివల్ల మీకు వచ్చిన పుణ్యాన్ని జీవరాశి మేలుకోరి ధారపోస్తున్నానని మనస్ఫూర్తిగా అంటే చాలు. అది కూడా కర్మయోగం లేదా లోకసంగ్రహ కర్మ అవుతుంది.

2. **ఉపాసనాయోగం** – రెండవ ఆధ్యాత్మిక సాధన ఉపాసనాయోగం. దీన్ని ఈశ్వరధ్యానం అంటారు. ఇది కూడా రెండు పద్ధతుల్లో చేయవచ్చు. అవి ఏకరూపధ్యానం లేదా అనేకరూపధ్యానం అంటారు. అనేకరూపధ్యానాన్ని విశ్వరూపధ్యానం అని కూడా అంటారు.

**శాంతాకారం భుజగశయనం పద్మనాభం సురేశం**

అని గడగడా పఠించుకుంటూ పోకుండా, దాన్ని అర్థం చేసుకుంటూ పఠిస్తే అది ఏకరూపధ్యానం అవుతుంది.

**విశ్వాధారం గగన సదృశం**

ఇదే శ్లోకంలో కొన్ని పదాలు విశ్వరూప ఈశ్వరదర్శనానికి కూడా వస్తాయి. మీకు ఏ రూపంలో కొలవాలని ఉంటే, ఆ రూపంలో ఈశ్వరధ్యానం చేయవచ్చు. ఏ రూపంలో కొలిచినా, అర్థసహితంగా ధ్యానం చేయాలి. అది కూడా జీవితాంతం చేయాలి. కాకపోతే జ్ఞానం పొందే ముందు చేసే ధ్యానాన్ని ఉపాసన అంటే, జ్ఞానం పొందాక చేసే ధ్యానాన్ని నిదిధ్యాసనం అంటారు. రెండింటిలోనూ ఈశ్వరధ్యానమే ఉంటుంది, కాకపోతే ఈశ్వరుణ్ణి ధ్యానించే దృక్కోణంలో భేదం ఉంటుంది.

జ్ఞానం పొందకముందు చేసే ధ్యానంలో, ఈశ్వరుడు అంటే ఒక పరిమితి ఉన్న సగుణ ఈశ్వరుడు. కాని జ్ఞానం పొందాక చేసే ధ్యానంలో, ఈశ్వరుడు నిర్గుణ ఈశ్వరుడు. సగుణ ఈశ్వరుడు వ్యావహారిక స్థాయికి చెందితే, నిర్గుణ ఈశ్వరుడు పారమార్థిక స్థాయికి చెందుతాడు. ఈ రెండు రకాల ధ్యానంలో ఏదో ఒకటి జీవితాంతం చేయాలి. కాకపోతే పేర్లు మారతాయి, దృక్పథం మారుతుంది. జ్ఞానం పొందకముందు చేసే ధ్యానాన్ని ఉపాసన అంటారు. అది జ్ఞానయోగ్యతాప్రాప్తిని ఇస్తుంది. జ్ఞానం పొందాక చేసే ధ్యానాన్ని నిదిధ్యాసనం అంటారు. అది జ్ఞాననిష్ఠలో నిలబెడుతుంది.

3. **సద్గుణత్వం** – సద్గుణాలను పెంపొందించుకోవాలి. వాటిని గీతా పరిభాషలో చెప్పాలంటే దైవీసంపత్తిని పెంపొందించుకోవాలి.

**తదాత్మని నిరతే య ఉపనిషత్సు ధర్మాః తే మయి సంతు॥** – శాంతిపాఠం

విలువలను పెంపొందించుకునే శక్తినివ్వమని చేసే ప్రార్థన ఇది. విలువల గురించి భగవద్గీతలో చూస్తాము.

**అమానిత్వమదంభిత్వమ్ అహింసాక్షాంతిరార్జవమ్॥** – గీత 13.8

**అభయం సత్వసంశుద్ధి** – గీత 16.1

కృష్ణపరమాత్మ పేర్కొన్న అన్ని విలువలనూ జీవితాంతం పాటించాలి. వీటిని కూడా జ్ఞానం పొందక ముందు సాధన అయితే, జ్ఞానం పొందాక లక్షణం లేదా అలంకారం అవుతుంది. జ్ఞానికి అమానిత్వం పర్ఫ్యూమ్, అదంభిత్వం సెంట్, అహింస పౌదరు, శాంతి లిప్‌స్టిక్ అవుతాయి. అలా సాధనరూపంలో గాని, అలంకారరూపంలో గాని చేయాలి.

4. **జ్ఞానయోగం** – జ్ఞానయోగం అంటే వేదాంత అధ్యయనం. ఒక క్రమపద్ధతిలో క్రమం తప్పకుండా ఒక గురువువద్ద శాస్త్రాన్ని అధ్యయనం చేయటం జ్ఞానం పొందకముందు చేస్తే, జ్ఞానం పొందాక మననం, నిదిధ్యాసనం చేయాలి. అవి జ్ఞాననిష్ఠలో నిలబెడతాయి. శ్రవణం మాత్రమే చేస్తే, నేర్చుకున్న జ్ఞానం గాలికెగిరి పోతుంది. కొందరు శిష్యులు, స్వామీజీతో చెబుతారుట 'స్వామీజీ మీరు సెలవలిస్తే, వేదాంతం కూడా మానుంచి సెలవు తీసుకుంటుంది.' అలా జరగకుండా ఉండాలంటే శాస్త్రాన్ని జ్ఞానం పొందకముందు విచారణరూపంలోనో, నిష్ఠారూపంలోనో అధ్యయనం చేస్తూనే ఉండాలి.

ఈ నాలుగు సాధనల్లో మొదటి మూడూ సహకారీసాధనలు అయితే, నాలుగవది సాక్షాత్ సాధన. వీటిని మళ్ళీ ఒకసారి టూకీగా చూద్దాము.

| | **జ్ఞానం పొందకముందు** | **జ్ఞానం పొందాక** |
|---|---|---|
| కర్మ | కర్మయోగంలా | లోకసంగ్రహంకోసం |
| ఉపాసన | సగుణ ఈశ్వరధ్యానంలా | నిర్గుణ ఈశ్వరజ్ఞానంగా |
| విలువలు | సాధనలా | అలంకారంలా |
| జ్ఞానం | విచారరూపంలో | నిష్ఠారూపంలో |

అలా, ఈ నాలుగూ జీవితాంతం కొనసాగించాలి. వేదాంతజ్ఞానం పొందాక కూడా ఈ సహకారీ సాధనలను వదలకూడదు. జ్ఞానం పొందాక కూడా వీటిని చిన్నచూపు చూడకూడదు. వచ్చిన చిక్కేమిటంటే, ఈ సహకారీ సాధనల విషయంలో రెండు

భిన్నప్రవృత్తులను చూస్తాము. కొంతమంది వాటిని చిన్నచూపు చూస్తే మరికొందరు వాటికే పెద్దపీట వేస్తారు. రెండూ తప్పే.

జ్ఞానయోగానికి వచ్చి, అహం బ్రహ్మ అస్మి జ్ఞానం పొందినవారు నేను బ్రహ్మను, నాకు ఇంకా ఈ సాధనలెందుకు అని వాటిని చిన్నచూపు చూస్తారు. మరికొంతమంది ఈ సహకారీ సాధనలకు – కర్మ, ఉపాసన, విలువలకు – ఎంతగా విలువనిస్తారంటే అవే ముఖ్యసాధనలు అని పొరపాటుపడి జ్ఞానం దాకా రానే రారు. నేను వీటిని శ్రద్ధగా చేస్తున్నాను, నాకు జ్ఞానం అవసరం లేదు. ఇవే నాకు ఒక శుభముహూర్తాన మోక్షం ఇచ్చేస్తాయి అంటారు.

రెండు అభిప్రాయాలూ తప్పే అంటుంది వేదాంతం. వేదాంతం నేర్చుకున్నాక కూడా, ఆత్మజ్ఞానం పొందాక కూడా, సహకారీ సాధనలను మర్చిపోకూడదు అంటుంది. అందువల్లనే ఆత్మజ్ఞానం ముఖ్యసాధనమే అయినా, ఉపనిషత్తులు అనేక సహకారీ సాధనలను కూడా ఇస్తాయి.

| | |
|---|---|
| తైత్తిరీయోపనిషత్తు | – 1, 3 వల్లీలు |
| ఛాందోగ్యోపనిషత్తు | – 1–5 అధ్యాయాలు |
| బృహదారణ్యకోపనిషత్తు | – 5, 6 అధ్యాయాలు |
| భగవద్గీత | – 16, 17 అధ్యాయాలు |

ఈ నేపథ్యంతో బృహదారణ్యకోపనిషత్తులోని ఐదవ అధ్యాయంలోకి అడుగుపెడదాము. బృహదారణ్యకోపనిషత్తులోని మొదటి రెండు అధ్యాయాలను ఉపదేశకాండము అనీ, తక్కిన రెండు అధ్యాయాలను ఉపపత్తికాండము అనీ అంటే చివరి రెండు అధ్యాయాలను ఉపాసనా కాండము అనీ అంటారు. చివరి రెండు అధ్యాయాల్లో అనేక భిన్న ఉపాసనలు ఉండటంవల్ల ఖిలకాండము అనికూడా అంటారు.

ఐదవ అధ్యాయం పూర్ణమదః అనే శాంతిపాఠంతో మొదలవుతుంది. ఈ శాంతిపాఠం ఉపనిషత్తు మొదట్లో రాకుండా, ఇక్కడ వస్తుంది. శంకరులవారు కూడా దీనికి భాష్యం ఇక్కడ రాశారు. కాని ఇది అద్భుతమైన ధ్యానశ్లోకం కాబట్టి, మనం మొదటి అధ్యాయం మొదట్లోనే దీని వివరణ చూశాము. ఇది చాలా ముఖ్యమైన శాంతిమంత్రం కాబట్టి, దాని వివరణ మళ్ళీ టూకీగా చూద్దాము.

**ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణముదచ్యతే ।**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే॥**
**ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

**పూర్ణమదః పూర్ణమిదం** – జీవాత్మ పూర్ణం, పరమాత్మ పూర్ణం అంటే జీవాత్మ పరమాత్మల ఐక్యాన్ని సూచిస్తుంది. ఇదొక మహావాక్యం.

**పూర్ణాత్ పూర్ణముదచ్యతే** – పూర్ణమైన పరమాత్మనుంచి, పూర్ణమైన జీవాత్మ ఉద్భవించింది. ఇది కార్యకారణ సంబంధాన్ని సూచిస్తుంది.

**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవ అవశిష్యతే** – పూర్ణంలోంచి పూర్ణం తీస్తే, పూర్ణమే మిగులుతుంది. అంటే ఆత్మ లేకుండా అనాత్మ జగత్తుకు విడిగా ఉనికి లేదు. జగత్తు మిథ్య, బ్రహ్మ సత్యం. ఇదీ ఈ వాక్యం అర్థం.

ఈ అధ్యాయం చిన్న అధ్యాయం. 29 మంత్రాలే ఉన్నాయి. కాకపోతే 15 బ్రాహ్మణాలలోకి విస్తరింపబడి ఉన్నాయి. వీటిలో రెండవ బ్రాహ్మణము విలువలను బోధిస్తే, తక్కిన 14 ఉపాసనలను బోధిస్తాయి. అందువల్ల ముందు రెండవ బ్రాహ్మణము చూద్దాము.

## 5.2. ప్రాజాపత్య బ్రాహ్మణము

ఇందులో మూడు విలువలను ప్రజాపతి బోధిస్తాడు. అవి **దమం, దయ, దానం.** ప్రజాపతి బోధిస్తాడు కాబట్టి దీన్ని ప్రాజాపత్య బ్రాహ్మణము అంటారు.

దీన్ని ఒక ఆఖ్యాయిక రూపంలో, అంటే కథ రూపంలో చూస్తాము. ఈ కథ ప్రజాపతికీ, దేవాసుర మనుష్యులకూ మధ్య జరుగుతుంది. ప్రజాపతి అంటే సగుణబ్రహ్మ లేదా బ్రహ్మదేవుడు. దేవతలు, అసురులు, మనుష్యులు బ్రహ్మ దగ్గర, బ్రహ్మచర్యజీవనం గడిపారు. బ్రహ్మదేవుడు వీరు ముగ్గురికీ తండ్రే కాదు, గురువు కూడా. కొన్నాళ్ళు వీరు గురుకులవాసం చేశాక, ఒక్కొక్కరుగా వచ్చి వారికి ఉపదేశం చేయమని కోరారు. ప్రజాపతి వారికి, 'ద ఇతి' అనే ఒకే ఒక అక్షరాన్ని ఉపదేశించాడు. దాని అర్థాన్ని ఎవరికి వారు వారికి తగ్గట్టుగా తీసుకున్నారు. 'ఓమితి' అన్నాడు ప్రజాపతి. అవును! మీరు సరిగ్గానే తెలుసుకున్నారని ప్రజాపతి పలికాడు.

దేవతలకు ఇంద్రియనిగ్రహం లేదు కాబట్టి దమము పాటించమన్నాడని వారు అన్నారు; అసురులకు కోపం ఎక్కువ కాబట్టి, వారిని దయను పాటించమన్నాడని వారు అన్నారు. మానవులకు దానగుణం ఎక్కువగా లేదు కాబట్టి, వారిని దానం చేయమన్నాడని వారు అన్నారు. దీన్నిబట్టి విలువలు అందరికీ తెలుసు, తెలియాల్సింది ఆ విలువలయొక్క విలువ అని అర్థమవుతుంది.

ఈ బోధ ఎప్పుడో జరిగినా కూడా, ఈ దైవవాక్కును ఇప్పటికీ మనం ఆకాశవాణిగా వింటూ ఉంటాము.

**ఏషా దైవీ వాగనువదతి స్తనయిత్నుర్ద ద ద ఇతి**

ఈ ఉపదేశాన్నే మేఘగర్జన అనే దైవీవాక్కు ద ద ద అని వినిపిస్తుంది. దాని అర్థం, దమమును, దత్తగుణమును (దాన గుణమును), దయాగుణమును కలిగి ఉండండని చెబుతున్నది. ఉపనిషత్తు, మళ్ళీ ఈ మూడు గుణాలను మనుష్యులు పాటించాలని చెబుతున్నది.

శంకరులవారు ఇక్కడ ఒక చిన్న విచారణ చేస్తున్నారు. దేవతలకు, అసురులకు చెప్పిన విలువలను మనుష్యులు ఎందుకు పాటించాలి? దానికి రెండు జవాబులు కూడా ఇస్తున్నారు.

1. బోధ ఎవరికి జరిగిందని కాదు, చెప్పింది ఎవరో చూడాలి. చెప్పింది సాక్షాత్తూ బ్రహ్మదేవుడే. బ్రహ్మదేవుడు చెప్పిన దైవవాక్యాన్ని ఆజ్ఞగా పాటించాలి. అందువల్ల దేవతలకు చెప్పిన దమము, మనుష్యులకు చెప్పిన దానము, అసురులకు చెప్పిన దయను కూడా పాటించాలి.

2. దేవతలు, మనుష్యులు, అసురులు – ఒక్క మనిషిలోనే ఉన్నారు. అంటే ప్రతి ఒక్కరిలోనూ దైవీసంపత్తి, మానుషీసంపత్తి, ఆసురీసంపత్తి ఉంటుంది. ఒక్కోసారి ఒక్కో లక్షణం ప్రస్ఫుటమవుతుంది. అందువల్ల కూడా ఈ మూడు విలువలనూ పాటించాలి.

వీటినే కృష్ణపరమాత్మ నివృత్తిరూపంలో చెప్పాడు. కామం, క్రోధం, లోభం – ఈ మూడూ నరకద్వారాలు అన్నాడు. ఈ విలువలను ఈ అధ్యాయంలోని తక్కిన బ్రాహ్మణాలలో చెప్పిన ఉపాసనలకు జోడించాలి.

## 5.1. ఓం ఖం బ్రహ్మ బ్రాహ్మణము

ఇప్పుడు మొదటి బ్రాహ్మణాన్ని చూద్దాము.

**ఓం ఖం బ్రహ్మ** – ఈ బోధ ఓం ఖం బ్రహ్మ పదాలతో మొదలవుతుంది కాబట్టి ఈ బ్రాహ్మణాన్ని ఓం ఖం బ్రహ్మ బ్రాహ్మణము అంటారు. దీనికి **ఇతి ఉపాసీత** అని కలుపుకోవాలి. ఖం అంటే ఆకాశం. ఆకాశరూపబ్రహ్మ ఉపాసన చేయాలి. ఆకాశరూప ఉపాసనకు ఓంకారం ప్రతీక. ఈ వ్యాఖ్యానాన్ని కౌరవ్యాయణి అనే ఋషియొక్క పుత్రుడు చెప్పాడు.

ఓంకారం అటు నిర్గుణబ్రహ్మకు, ఇటు సగుణబ్రహ్మకు కూడా ఆలంబనమే. అదీ ఓంకారంయొక్క ప్రత్యేకత. వేదం మొత్తంలో రెండే విషయాలు నేర్చుకుంటాము. అవి సగుణబ్రహ్మ, నిర్గుణబ్రహ్మ. ఆ విధంగా వేదం బ్రహ్మద్వయం గురించి చెబుతుంది. ఓంకారం బ్రహ్మద్వయానికి ప్రతీక.

ఓంకారః ఏవ వేదః। వేదః ఏవ ఓంకారః॥

అందువల్ల ఓంకారమనే ప్రతీకమీద ఆకాశరూపబ్రహ్మ ధ్యానం చేయాలి.

## 5.3. హృదయ బ్రాహ్మణము

ఇది చాలా చిన్న బ్రాహ్మణము. ఈ అధ్యాయంలో మూడవ బ్రాహ్మణమునుంచి తొమ్మిదవ బ్రాహ్మణమువరకూ, హిరణ్యగర్భ ఉపాసనను చూస్తాము. హిరణ్యగర్భ అంటే సమష్టి సూక్ష్మప్రపంచ అధిష్ఠానదేవత. హిరణ్యగర్భను బ్రహ్మ అనీ, ప్రజాపతి అనీ అంటారు.

ఈ బ్రాహ్మణములో ఉపాసన – **హృదయరూపేణ హిరణ్యగర్భ ఉపాసన**. హృదయం అంటే మామూలుగా గుండె. కానీ ఉపనిషత్తులో మనస్సు లేదా అంతఃకరణం అని వస్తుంది. అంటే హృదయంలో ఉన్న మనస్సు. అందువల్ల దీనిని అంతఃకరణరూపేణ హిరణ్యగర్భ ఉపాసన అని కూడా అనవచ్చు. ఉపనిషత్తు హృదయం పదంలోని అక్షరాలు కూడా పవిత్రమైనవేనని అంటున్నది.

హృదయం అనే పదానికి మూడు అక్షరాలు ఉన్నాయి. అవి – హృ+ద+యమ్.

హృ – తీసుకురావటం,
ద – శక్తిని ఇవ్వటం,
యమ్ – లోకాలకు తీసుకువెళ్ళటం.

ఇంద్రియాలు అనేక వస్తువులను తీసుకువచ్చి, తమతమ శక్తిని మనస్సుకు ఇచ్చి, జీవాత్మను స్వర్గలోకానికి తీసుకువెళతాయి. ఇంద్రియాలు అనేక విషయాలను మనస్సుకు తీసుకు వచ్చినట్టుగా, ఇతరులు ఈ ఉపాసకునికి అనేక కానుకలను ఇస్తారు; ఇంద్రియాలు మనస్సుకు శక్తిని ఇచ్చినట్టుగా, ఇతరులు అతనికి శక్తిని ఇస్తారు. చివరగా అతను స్వర్గలోకానికి వెళతాడు.

## 5.4. సత్య బ్రాహ్మణము

ఇది కూడా చిన్న బ్రాహ్మణమే. ఇందులోనూ ఒకటే మంత్రం ఉంది. సత్యంమీద హిరణ్యగర్భ ఉపాసన చేస్తారు కాబట్టి, దీన్ని సత్య బ్రాహ్మణము అన్నారు. ఈ ఉపాసనను **సత్యరూపేణ హిరణ్యగర్భ ఉపాసన** అంటారు.

హిరణ్యగర్భను ఈ పదాలతో స్తుతిస్తున్నది ఉపనిషత్తు. మహత్ అంటే గొప్పది (దేశపరిచ్ఛేదము లేని; యక్ష్యం అంటే గొప్పది అని కాబట్టి పూజనీయమైన; ప్రథమ జం

అంటే మొట్టమొదట పుట్టిన అని అర్థం) అన్నీ కలిపి ఈ మహత్ యక్ష ప్రథమజరూప హిరణగర్భ ఉపాసన సత్యంమీద చేయాలి.

**మహద్యక్షం ప్రథమజమ్**

మూర్తామూర్త బ్రాహ్మణములో సత్యం పదాన్ని సచ్చ+త్యచ్చగా విడదీశాము. సత్ అంటే మూర్తప్రపంచం. త్యత్ అంటే అమూర్తప్రపంచం. ఆకాశం, వాయువు అమూర్తప్రపంచం కిందికి వస్తే; అగ్ని, జలం, భూమి మూర్తప్రపంచం కిందికి వస్తాయి. సమష్టి సూక్ష్మశరీరం అమూర్తప్రపంచం కిందికి వస్తుంది; సమష్టి స్థూలప్రపంచం మూర్తప్రపంచం కిందికి వస్తుంది. అంటే హిరణ్యగర్భ శరీరం సమష్టి మూర్తామూర్తప్రపంచం. అందువల్ల ఇది సమష్టి ప్రపంచరూపేణ హిరణ్యగర్భ ఉపాసన.

ఈ ఉపాసన ఫలం అసత్యశత్రువును జయిస్తాడు అంటే అబద్ధాలు చెప్పే బలహీనతను జయిస్తాడు. మరణించాక పుణ్యలోకాలకు వెళతాడు.

## 5.5. సత్యబ్రహ్మ సంస్థాన బ్రాహ్మణము

ఈ బ్రాహ్మణము కూడా హిరణ్యగర్భ ఉపాసన గురించే చెబుతున్నది. ఇక్కడ అంగ ఉపాసనను చెబుతున్నది. అంగి అంటే ముఖ్యమైన ఉపాసన. హిరణ్యగర్భ ఉపాసన అంగి ఉపాసన. ఉపాసన గురించి చెప్పేముందు, మొదటి మంత్రంలో హిరణ్యగర్భను స్తుతిస్తున్నది. ముందు బ్రాహ్మణములో వాడిన మహత్, యక్షం, ప్రథమజం పదాలను ఇక్కడ వివరిస్తున్నది.

మహత్ – హిరణ్యగర్భనుంచి విరాట్, విరాట్‌నుంచి దేవతలు, మనుష్యులు, పశువులు వచ్చారు. అలా జగత్తు కారణం కాబట్టి మహత్.

యక్షం – దేవతలందరూ కొలుస్తారు కాబట్టి యక్షం.

ప్రథమజ – అందరికన్నా ముందు పుట్టాడు కాబట్టి ప్రథమజ.

దేవతలు హిరణ్యగర్భను సత్యంగా కొలుస్తారు. ఇక్కడ సత్యాన్ని మూడు అక్షరాలుగా విడదీస్తుంది ఉపనిషత్తు. అవి స+తి+యమ్. ఈ మూడు అక్షరాల్లో **స** అక్షరం, **యమ్** అక్షరం సత్యాన్ని సూచిస్తే, మధ్యలోని **తి** అక్షరం అసత్యాన్ని సూచిస్తుంది. ఈ అసత్యం రెండువైపులా సత్యంతో పట్టుకోబడి ఉంది అంటే ఈ సత్యం అసత్యాన్ని కప్పేస్తుంది. ఈ సత్యాన్ని తెలుసుకుని ఎవరైతే సత్యగర్భ ఉపాసన చేస్తారో, వారిని అసత్యం ఏమీ చేయదు. భాష్యకారులు ఇంకొక అడుగు ముందుకు వేసి, ఇటువంటి సత్యోపాసన చేసినవారు, వారికి తెలియకుండా అబద్ధం చెప్పినా, భగవంతుడు అతని పలుకును సత్యవాక్కు అయ్యేలాగా చేస్తాడు అంటారు.

ఇప్పుడు హిరణ్యగర్భ ఉపాసన రెండు స్థానాల్లో చూస్తాము. **స్థానద్వయే హిరణ్యగర్భ ఉపాసన.**

1. ఆదిత్య మండలంమీద ఉపాసన – అధిదైవ ఉపాసన
2. దక్షిణ అక్షిమీద ఉపాసన – అధ్యాత్మిక ఉపాసన

దీనిద్వారా అధ్యాత్మికం, అధిదైవికం ఒకదానిమీద ఒకటి పరస్పరం ఆధారపడి ఉన్నాయని అర్థమవుతుంది. ఈ ఆదిత్యుడు తన సూర్యకిరణాలద్వారా వ్యష్టిలో ప్రతిష్ఠితుడై ఉన్నాడు. జీవుడు ఆ దేవతకు అర్ఘ్యం సమర్పించటంద్వారా తోడ్పడతాడు. ఈ విధంగా సమష్టి, వ్యష్టి రెండూ కూడా హిరణ్యగర్భ రూపమే. ఇది మనం తెలుసుకునే మొదటి అంశం.

రెండవ అంశం అరిష్టదర్శనం అంటారు. అంటే అశుభసూచకం. ఒక వ్యక్తి మరణశయ్యమీద ఉన్నప్పుడు నెమ్మదిగా అధిష్ఠానదేవతలు, ఆయా ఇంద్రియాలనుంచి తమ శక్తిని తీసుకుంటారు. అప్పుడు మరణశయ్యమీద ఉన్న వ్యక్తిని సూర్యకాంతులు బాధించవు. అంటే అతను అంత వేడికిరణాలు ఉన్న సూర్యుణ్ణి చంద్రునిలా చూస్తాడు. అతనికి అలా సూర్యకాంతి ఎప్పుడైతే తెలియలేదో, అది అరిష్టసూచన. అతను మరణాన్ని సమీపిస్తున్నాడని సంకేతం.

1. **ఆదిత్యమండలంమీద హిరణ్యగర్భ ఉపాసన** – ఇది కూడా ఇంకొక అంగ ఉపాసన. ఇక్కడ హిరణ్యగర్భ ఉపాసనను ఆయన అవయవాలతో పాటు చేస్తాము. ఆ అవయవాలు తల, రెండు చేతులు, రెండు పాదాలు. వీటిని వ్యాహృతి మంత్రాలతో పోలుస్తాము. అవి భూః భువః సువః.

భూః – తల – తల ఒకటి; భూః అక్షరం ఒకటి
భువః – రెండు బాహువులు – బాహువులు రెండు; అక్షరాలు రెండు
సువః – రెండు కాళ్ళు – కాళ్ళు రెండు; అక్షరాలు రెండు.

ఆదిత్యమండలే వ్యాహృతి అవయవక హిరణ్యగర్భ ఉపాసన.

హిరణ్యగర్భకు ఒక రహస్యనామం ఇస్తున్నది ఉపనిషత్తు. అది అహః. అహః రెండు ధాతువులనుంచి వచ్చింది.

హన్ ధాతువునుంచి వచ్చినదాని అర్థం – హింసించటం
హా ధాతువునుంచి వచ్చినదాని అర్థం – విడిచి పెట్టటం.

ఈ విధంగా ఈ ఉపాసన చేసిన వ్యక్తి పాపాలను నశింపజేసి, పాపాలను విడిచి పెడతాడు.

2. **దక్షిణ అక్షిమీద ఉపాసన** – ఇంచుమించు ముందు ఉపాసనలాగానే ఉంటుంది. మళ్ళీ అవే వ్యాహృతులు, అవే అంగాలు. అంతకుముందు ఆదిత్యమండలంమీద చేస్తే, ఇప్పుడు కుడికంటిమీద చేస్తారు అంతే. ఉపాస్యదేవత ఒకటే, ఉపాసన చేసే స్థానం మారుతుంది అంతే. కాకపోతే ముందు రహస్యనామం అహః అంటే ఇక్కడ రహస్యనామం అహమ్. అంటే నేను. ఇది కూడా హన్, హాల ధాతువులనుంచే వచ్చింది. అందువల్ల దీని ఫలం కూడా ఒకటే. ఈ ఉపాసన చేసిన వ్యక్తి పాపాలను నశింపజేసి, పాపాలను విడిచిపెడతాడు. దీన్ని – దక్షిణ అక్షితస్థ వ్యాహృతి అవయవక హిరణ్యగర్భ ఉపాసన అంటారు.

## 5.6. మనో(మయ) బ్రాహ్మణము

ఈ బ్రాహ్మణము కూడా హిరణ్యగర్భ ఉపాసననే సూచిస్తుంది. దీన్ని **గుణవిశిష్ట హిరణ్యగర్భ ఉపాసన** అంటారు. అంతకుముందు అధ్యాయంలో పంచవిధ హిరణ్యగర్భ ఉపాసన, అష్టవిధ హిరణ్యగర్భ ఉపాసన చూశాము. ఇక్కడ హిరణ్యగర్భను హృదయంమీద ఉపాసన చేస్తాము. ఇక్కడ కూడా ఐదు గుణాలు చూస్తాము. అవి మనోమయం, ప్రకాశస్వరూపం, సర్వస్య ఈశానుడు, సర్వస్య అధిపతి, సర్వానికి నియంత. హృదయంలో ఉన్న మనస్సులో ఉండే హిరణ్యగర్భ పరిమాణం ఎంత ఉంటుంది?

**యథా వ్రీహిర్వా యవో వా** – ధాన్యపుగింజ అంతగాని, గోధుమగింజ అంతగాని ఉంటాడు. సర్వవ్యాపకమైన హిరణ్యగర్భ హృదయంలో అలా ఉంటాడు. హిరణ్యగర్భను మనోమయ పురుషుడిగా చూడటంవల్ల ఈ బ్రాహ్మణాన్ని మనో(మయ) బ్రాహ్మణము అంటారు.

## 5.7. విద్యుద్బ్రాహ్మణము

ఇక్కడ కూడా ఇంకో విధమైన హిరణ్యగర్భ ఉపాసనను చూస్తాము. ఇది **విద్యుత్ రూపేణ హిరణ్యగర్భ ఉపాసన.** అందువల్ల ఈ బ్రాహ్మణాన్ని విద్యుద్బ్రాహ్మణము అంటారు.

విద్యుత్ అంటే మెరుపు. కేనోపనిషత్తులో కూడా విద్యుత్ ఉపాసన చూస్తాము. అక్కడ యక్షుడు మెరుపులాగా క్షణంసేపు మెరిసి, మాయమవుతాడు కాబట్టి విద్యుత్ ఉపాసన చేయమన్నారు అక్కడ. ఇక్కడ ఉపనిషత్తు వేరే కారణం చెబుతున్నది. విద్యుత్ అనే పదానికి పగలగొట్టి (చీకటిని) తరిమికొట్టేది అని వ్యుత్పత్తి. విద్యుత్ ఒక్కోసారి చెట్లను, మనుష్యులను కూడా నాశనం చేస్తుంది. కాని సాధారణంగా ఆ మెరుపు చీకటిని నాశనం చేస్తుంది. ఈ ఉపాసన చేస్తే, అతనికి ప్రతికూలమైన పాపాలను నశింపజేస్తుంది. ఎందుకంటే విద్యుత్తే బ్రహ్మ.

వేదాంతజ్ఞానం పొందాలనుకునే సాధకునికి ఈ ఉపాసన తోడ్పడుతుంది. అతను చేసిన పాపాలను ఈ ఉపాసన తొలగించి, అతనికి గురుప్రాప్తిని, శ్రవణప్రాప్తిని, జ్ఞానప్రాప్తిని కలుగజేస్తుంది.

## 5.8. వాగ్ధేను బ్రాహ్మణము

ఇది కూడా హిరణ్యగర్భ ఉపాసనే. హిరణ్యగర్భను వేదాలుగా చూస్తాము ఇందులో. వాక్కు అనే ధేనువును ఉపాసించాలి.

**వాచం ధేనుముపాసీత**

ఇక్కడ వేదాలను వాక్కు అనే కామధేనువుతో పోలుస్తున్నది ఉపనిషత్తు. ఆ ధేనువుయొక్క నాలుగు స్తనాల ద్వారా దేవతలకు, మనుష్యులకు, పితృదేవతలకు ఆహారాన్ని సమర్పిస్తారు. ఆ ధేనువుకు ప్రాణమే ఆంబోతు; మనస్సే దూడ. గురువు బోధ చేయటానికి ప్రేరణ శిష్యుడు. వాక్కు రూపేణ వేదాలను పలకాలంటే మనస్సులో ప్రేరణ కలగాలి. ఆ విధంగా మనస్సు ప్రేరణ ఇస్తే, ప్రాణం శక్తినిస్తే, వాక్ ధేనువు వేదాన్ని ఇస్తుంది. ఈ ఉపాసన పేరు **వాగ్ధేనురూపేణ హిరణ్యగర్భ ఉపాసన**. అందువల్ల ఈ బ్రాహ్మణానికి వాగ్ధేను బ్రాహ్మణము అని పేరు వచ్చింది.

## 5.9. వైశ్వానరాగ్ని బ్రాహ్మణము

ఇది కూడా హిరణ్యగర్భ ఉపాసనే. ఈ హిరణ్యగర్భ వ్యష్టి కడుపులో వైశ్వానరాగ్ని రూపంలో ఉన్నాడు. అందువల్ల ఈ ఉపాసనను **వైశ్వానరాగ్నిరూపేణ హిరణ్యగర్భ ఉపాసన** అంటారు. అందువల్ల ఈ బ్రాహ్మణానికి వైశ్వానరాగ్ని బ్రాహ్మణము అని పేరు వచ్చింది.

ఏ అగ్ని అయితే వ్యక్తి లోపల ఉన్నాడో, ఏ అగ్నితో ఈ ఆహారం జీర్ణం చేయబడుతున్నదో, ఏ అగ్ని ఈ ఆహారాన్ని స్వీకరిస్తున్నదో, ఆ అగ్నే వైశ్వానరుడు. ఆ వైశ్వానరుడు లోపల ఉన్నాడని తెలియటానికి ఉపనిషత్తే ఒక మార్గం చెబుతున్నది. చెవులను రెండింటినీ మూసి ఆ వ్యక్తి వింటే ఏ శబ్దాన్ని వింటాడో, ఆ ఘోష ఆ అగ్నికి చెందినదే.

ఇక్కడ కూడా ఇంకొక అరిష్టదర్శనాన్ని చూస్తాము. ఏ వ్యక్తికైతే చెవులు మూసుకుంటే, తనలో వైశ్వానరఘోష వినబడదో, అతనికి మరణం ఆసన్నమయినట్టే అర్థం. ఆ శబ్దం హిరణ్యగర్భ దీవెన.

## 5.10. గతి బ్రాహ్మణము

ఇంతకుముందు బ్రాహ్మణమువరకూ హిరణ్యగర్భమీద అనేక ఉపాసనలు చూశాము. ఈ బ్రాహ్మణములో **హిరణ్యగర్భ ఉపాసన ఫలం** చూస్తాము. ఈ ఉపాసనకు రెండు ఫలాలు ఉన్నాయి. అవి నిష్కామ ఉపాసన అయితే చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత కలుగుతాయి. అదే సకామ ఉపాసన అయితే బ్రహ్మలోకప్రాప్తి కలుగుతుంది. అతని ప్రయాణం గురించి చెబుతుంది కాబట్టి, ప్రయాణాన్ని గతి అంటారు. కాబట్టి ఈ బ్రాహ్మణాన్ని గతి బ్రాహ్మణము అంటారు.

ఉపాసకుడు శుక్లగతి ద్వారా బ్రహ్మలోకం చేరుతాడు
కర్మఠుడు కృష్ణగతి ద్వారా స్వర్గలోకం చేరుతాడు
జ్ఞానికి ప్రయాణమే లేదు, జ్ఞాని గతిరహితుడు.

ఇక్కడ ఉపాసకుని గతి చూస్తున్నాము. అతను శుక్లగతి ద్వారా బ్రహ్మలోకానికి వెళతాడు. అక్కడ అతను బ్రహ్మ దగ్గర జ్ఞానం పొంది, ముక్తి పొందవచ్చు లేదా అక్కడ కూడా జ్ఞానం పొందకుండా తిరిగి రావచ్చు. అక్కడ ముక్తి పొందితే దాన్ని క్రమముక్తి అంటారు.

ఇక్కడ గతి బ్రాహ్మణములో మూడు దేవతలనే చూస్తాము. అవి వాయుదేవత, ఆదిత్య దేవత, చంద్రదేవత. మరణానంతరం ఒక రిలే రేసులా ఒక్కొక్క దేవతా తీసుకువెళ్ళి, ఇంకొక దేవతకు సాధకుణ్ణి అప్పచెబుతుంది. బ్రహ్మలోకానికి చేరుకున్నాక, అక్కడ కొన్ని కల్పాల కాలం ఆనందంగా ఉంటాడు.

## 5.11. తపో బ్రాహ్మణము

ఈ బ్రాహ్మణము ఎంతో ఉపయోగకరమైన బ్రాహ్మణము. అందరూ గుర్తుంచుకోదగ్గ బ్రాహ్మణము. శారీరక బాధను తపస్సుగా స్వీకరించాలి. కష్టసహిష్ణుత్వం తపః. ఇక్కడ మూడు రకాల తపస్సులను వర్ణిస్తున్నది ఉపనిషత్తు.

1. అనారోగ్యం వచ్చి, మాడాల్సి వస్తే, దాన్ని ఉపవాసంగా భావించటం.

సాధకుడు తను మరణించినట్టుగా ఊహించుకుని, మరణానంతరం జరిగే కార్యాలను బ్రతికుండగానే ఈ కింది విధంగా ఉహించుకోవాలి.

2. తన శవాన్ని శ్మశానానికి తీసుకువెళితే, దాన్ని అరణ్యానికి వెళ్ళినట్టుగా వానప్రస్థాశ్రమానికి వెళ్ళినట్టుగా భావించటం. శ్మశానాన్ని శివుని ఆలయంగా భావించటం.

3. తన శవదహనం చేయటాన్ని అగ్నిప్రవేశంగా భావించటం. అగ్నిదేవతలో లయమయినట్టుగా భావించటం.

ఈ మూడు రకాల తపస్సు చేస్తే ఉన్నత లోకాలకు వెళతాడు. అదే నిష్కామ ఉపాసన చేస్తే చిత్తశుద్ధి పొందుతాడు. దీనివల్ల భయాలన్నిటిలోకి పెద్దదైన మృత్యుభయం పోతుంది. ఈ తపస్సు గురించి చెబుతుంది కాబట్టి దీన్ని తపో బ్రాహ్మణము అంటారు.

## 5.12. అన్నప్రాణ బ్రాహ్మణము

మళ్ళీ కొన్ని హిరణ్యగర్భ ఉపాసనలు చూస్తాము. ఇక్కడ ఉపాసనను **అన్నప్రాణరూపేణ హిరణ్యగర్భ ఉపాసన** అంటారు. అందువల్ల ఈ బ్రాహ్మణాన్ని అన్నప్రాణ బ్రాహ్మణము అంటారు.

అన్నమే బ్రహ్మ అని కొందరు చెబితే, ప్రాణమే బ్రహ్మ అని మరికొందరు చెబుతారు. అది కూడా సరికాదు. ఎందుకంటే అన్నం లేకపోతే ప్రాణం శుష్కించిపోతుంది; ప్రాణం లేకపోతే అన్నం కుళ్ళిపోతుంది. అందువల్ల అవి ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉన్నాయి.

అన్ని ప్రాణులు అన్నాన్ని ఆశ్రయించి ఉన్నాయి. అన్ని ప్రాణులు ప్రాణంలో రమిస్తాయి. ఈ రెండూ అంటే వి+రమ్ కలిపి వీరం అయింది. అందువల్ల ఈ రెండు గుణాలూ కలిసిన అన్నప్రాణాలమీద చేసే ఉపాసన వీరగుణవిశిష్ట అన్నప్రాణరూపేణ హిరణ్యగర్భ ఉపాసన. ఈ ఉపాసన చేస్తే అతన్ని అన్ని ప్రాణులూ ఆశ్రయిస్తాయి; అతనిలో రమిస్తాయి.

## 5.13. ఉక్థ బ్రాహ్మణము

ఇక్కడ హిరణ్యగర్భ ఉపాసన ఇంకొకటి చూస్తాము. సమష్టి హిరణ్యగర్భనే వ్యష్టిలో ప్రాణం అంటాము. ప్రాణానికి అనేక గుణాలున్నాయి. ఇక్కడ నాలుగు గుణాలను చూస్తాము. అందువల్ల ఈ ఉపాసన **గుణవిశిష్ట ప్రాణరూపేణ హిరణ్యగర్భ ఉపాసన**. ఆ నాలుగు గుణాలు ఉక్థత్వగుణం, యజుస్వగుణం, సమత్వగుణం, క్షత్రత్వగుణం.

1. **ఉక్థత్వగుణం** – ఉక్థం అంటే ప్రాణమే. అన్నిటిని లేపి నిలబెదుతుంది. ప్రాణశక్తి బాగా ఉంటేనే, ఎవరైనా హుషారుగా ఉంటారు. అందువల్ల ప్రాణాన్ని శక్తినిచ్చేదిగా ఉపాసన చేయాలి. నిష్కామ ఉపాసన చేస్తే చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత ఏర్పదుతాయి. సకామ ఉపాసన చేస్తే ఇహలోకఫలం, పరలోకఫలం కలుగుతాయి.

2. **యజుస్వగుణం** – యజుః అంటే మామూలు అర్థం యజుర్వేదం. లక్ష్యార్థం యజుః అంటే మనుష్యులను ఒకచోటికి చేర్చేది అని అర్థం చేసుకోవాలి. దానిద్వారా నలుగురితో కలుస్తాడు.

3. **సమత్వగుణం** – ప్రాణబ్రహ్మను సామరూపంగా ఉపాసించాలి. ఇక్కడ కూడా సామ అంటే సామవేదం కాదు; సంగమాన్ని పొందటం. అంటే ప్రాణంలో అందరూ చక్కగా కలిసి ఉంటారు.

4. **క్షత్రత్వగుణం** – ప్రాణం క్షత్రం అని ఉపాసించాలి. ఇక్కడ క్షత్రం అంటే క్షత్రియుడు కాదు; రక్షించేది అని అర్థం. ప్రాణం ఈ దేహాన్ని గాయంనుంచి రక్షిస్తుంది. ఈ విధంగా నాలుగు గుణాలమీద ఉపాసన చేయాలి. మొదటి గుణం ఉక్థం కాబట్టి ఈ బ్రాహ్మణాన్ని ఉక్థబ్రాహ్మణము అంటారు.

## 5.14. గాయత్రీ బ్రాహ్మణము

ఇక్కడ కూడా ఇంకో రూపంలో హిరణ్యగర్భ ఉపాసన చూస్తాము. గాయత్రీ పాదాలమీద ఉపాసన. ఇది **గాయత్రీ రూపేణ హిరణ్యగర్భ ఉపాసన.** గాయత్రీ మంత్రంలోని నాలుగు పాదాలు తీసుకుని నాలుగు ఉపాసనలు చెబుతున్నది ఉపనిషత్తు.

ప్రథమ పాదంలో ఎనిమిది అక్షరాలు ఉన్నాయి – తత్సవితుర్వరేణ్యమ్
వాటిని మూడు లోకాలతో సమానం చేయాలి. భూమీ, అంతరిక్షమ్, ద్యౌః
కాకపోతే మంత్రంలో ణ్యమ్‌ను ణియమ్ అని, ద్యౌని రెండుగా తీసుకోవాలి అంటున్నది ఉపనిషత్తు.

ద్వితీయ పాదంలో ఎనిమిది అక్షరాలు ఉన్నాయి – భర్గో దేవస్య ధీమహి
వేదత్రయంతో పోల్చాలి – ఋచః, యజూంషి, సామాని

తృతీయ పాదంలో ఎనిమిది అక్షరాలు ఉన్నాయి – ధియో యోనః ప్రచోదయాత్
ప్రాణాలతో పోల్చాలి – ప్రాణః, అపానః, వ్యానః
ఇక్కడ కూడా వ్యానని వి+యా+న గా తీసుకోవాలి.

ఇంతవరకూ శబ్దరూప పాదాలు.

ఇప్పుడు నాలుగవ పాదం అర్థరూపపాదం – తపించే సూర్యుడు

ఈ మూడు పాదాల సారం – హిరణ్యగర్భ

సమష్టి సూక్ష్మశరీర అధిష్ఠానం వ్యష్టి అంతటికీ అధిష్ఠానం అవాలి కదా. కనబడని హిరణ్యగర్భకు కనబడే సూర్యుడు ప్రతీక. ఈ ఉపాసనకు ఫలం ఉపాసకుడు సూర్యునిలాగా శోభతో, కీర్తితో ప్రకాశిస్తాడు.

**గాయత్రీ నిర్వచనం** – మామూలుగా గాయత్రీ నిర్వచనం – గాయత్రీ మంత్రాన్ని జపిస్తే రక్షణ కలుగుతుంది. కాని ఇక్కడ ప్రాణం అంగాలను రక్షిస్తుంది కాబట్టి ప్రాణాన్ని గాయత్రీ అంటున్నది. అంగాలను గయాః అంటున్నది. గయాః అంటే పాడేది లేదా మాట్లాడేది. అది వాక్కు. వాక్కుకు వాడిన గయాః పదాన్ని అన్ని అంగాలకు వాడింది ఉపనిషత్తు. అంతేకాదు ఈ ఉపాసనలో కన్నుకు సత్యం అనీ, ప్రాణానికి బలం అనీ పేర్లు పెట్టింది.

**గాయత్రీ స్తుతి** – నిజానికి గాయత్రీ మంత్రం అంటే గాయత్రీ ఛందస్సు. అసలు గాయత్రీ మంత్రం పేరు సావిత్రీ మంత్రం. సవితదేవత అంటే సూర్యదేవతకు చేసే ప్రార్థన కాబట్టి సావిత్రీ మంత్రం. ఇక్కడ ఉపనిషత్తు గాయత్రీ ఛందస్సే గొప్పది అంటున్నది. ఎందుకు? గాయత్రి ప్రాణాన్ని సూచిస్తున్నది కాబట్టి, గాయత్రీ మంత్రమే శ్రేష్ఠం.

**గాయత్రీ ఉపాసకుని స్తుతి** – మామూలుగా ఎవరినుంచైనా దానం స్వీకరిస్తే, వారికి ఋణపడి పోతామని నమ్మకం. కాని గాయత్రీ ఉపాసకునికి ఈ పరిగ్రహదోషం అంటదని ఉపనిషత్తు చెబుతున్నది. ఎందుకంటే ఈ ఉపాసన చేసిన వ్యక్తి త్రిలోకాలను, మూడు వేదాలను, అన్ని ప్రాణులనూ జయిస్తాడు. అందువల్ల అతనికి దేశం మొత్తం దానం చేసినా, కర్మఫలాన్ని ధారపోసినా, ఎవరైనా సేవ చేసినా, అతనికి ప్రతిగ్రహదోషం అంటదు. ఇక నాలుగవ పాదంమీద ఉపాసన చేసిన వ్యక్తికి వచ్చే ఫలం అనంతఫలం.

**మూడు ఫలాలు** – గాయత్రీ నమస్కారాలు చేస్తే మూడు ఫలాలు కలుగుతాయి. శత్రువులు చేసే విఘ్నాలు తొలుగుతాయి. ఇష్టమైనవి కలుగుతాయి. మూడవ ఫలం ఉందని చెప్పటానికే కాని చేయటానికి కాదు. అది తన శత్రువు కోరిక తీరకుండుగాక అని చేస్తారు.

**గాయత్రీ ముఖం** – దీనికొక ఆఖ్యాయిక చూస్తాము. ఒకప్పుడు బుడిలుడు అనే గాయత్రీ ఉపాసనకుడు ఉండేవాడు. అతను ఒకసారి జనకమహారాజు దగ్గరికి వెళ్ళాడు. గాయత్రీ ఉపాసనకునికి ప్రతిగ్రహదోషం ఉండదని చూశాము కదా! నీకు ఏనుగంత ప్రతిగ్రహదోషం ఎలా ఉంది అని అడుగుతాడు జనకుడు. నాకు గాయత్రీయొక్క ముఖం గురించి తెలియదు. అందువల్ల గాయత్రీ ఉపాసన ఫలం పూర్తిగా పొందలేకపోయానని అంటాడు. గాయత్రీదేవియొక్క ముఖం అగ్నిదేవత అని జనకుడు చెబుతాడు. అగ్నిలో ఎన్ని కట్టెలు వేసినా అది అన్నింటినీ ఎలా దహించివేస్తుందో, అలా అగ్నిముఖం ఉన్న గాయత్రీ ఉపాసన చేసిన వ్యక్తికి అతని పాపాలు దహించుకుపోయి, అతను శుద్ధుడు, పవిత్రుడు, అజరుడు, అమృతుడు అవుతాడు. హిరణ్యగర్భఫలం పొంది అమృతుడు అవుతాడు.

## 5.15. సూర్యాగ్ని ప్రార్థనా బ్రాహ్మణము

ఇందులో నాలుగు మంత్రాలు ఉన్నాయి కాని ఈ నాలుగూ కలిపి ఒకటే మంత్రంగా చెప్పింది ఉపనిషత్తు. ఇవి చాలా ప్రసిద్ధి చెందిన మంత్రాలు. ఈ నాలుగు మంత్రాలనూ ఈశావాస్యోపనిషత్తు చివర్లో చూస్తాము. బృహదారణ్యకం ఈశావాస్యానికి వ్యాఖ్యానం. అందువల్ల ఇక్కడ చూడటంలో ఆశ్చర్యం లేదు.

ఈ మంత్రాలు ప్రార్థనరూపంలో ఉంటాయి. అవి అగ్నిదేవతకు, సూర్యదేవతకు చేసే ప్రార్థనలు. అందువల్ల ఈ బ్రాహ్మణానికి **సూర్యాగ్ని ప్రార్థనా బ్రాహ్మణము** అని పేరు వచ్చింది. ఈ ప్రార్థన ఎవరైనా, ఎప్పుడైనా చేయవచ్చు కాని ముఖ్యంగా సూర్య, అగ్నిదేవతల ఉపాసకులు, అది కూడా మరణం సమీపించినప్పుడు చేసే ప్రార్థన అంటారు శంకరులవారు.

ఇతను అజ్ఞానీ ఉపాసకుడు. జీవితాంతం ఉపాసనే చేస్తున్నాడు, ఆత్మజ్ఞానానికి రాలేదు.

**సూర్య ఉపాసన**

**హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపిహితం ముఖమ్ ।**

ఓ సూర్యదేవతా, నేను సూర్యమండలంద్వారా ప్రయాణం చేసి హిరణ్యగర్భలోకానికి వెళ్ళాలి. కాని ఆ సూర్యమండలం ద్వారం హిరణ్మయ పాత్రతో కప్పివేయబడింది. ఆ ద్వారాన్ని తెరువు. నేను శాస్త్రం నిర్దేశించిన ధర్మాలన్నీ పాటించాను. అవి – దమం, దానం, దయ. నువ్వు పోషణ కర్తవు, ఏకర్షివి, యముడవు, సూర్యుడవు, ప్రజాపతి పుత్రుడివి. నీ కాంతిని తగ్గించు. ఎందుకంటే నీ మిరుమిట్లు గొలిపే కాంతివల్ల నేను చూడలేకపోతున్నాను.

**యోఽసావసౌ పురుషస్సోఽహమస్మి॥**

సూర్యమండలంలో ఉన్న హిరణ్యగర్భ నేనే. నేను అహంగ్రహ ఉపాసన చేశాను. హిరణ్యగర్భ ఉపాసన, సూర్యదేవతను ప్రతీకగా తీసుకుని చేశాడు. అందువల్ల అతని ఉపాసనలకు ప్రత్యక్షసాక్షి సూర్యుడు.

**అగ్ని ఉపాసన** – అతను నిత్యనైమిత్తిక కర్మలు చేశాడు. దానికి ప్రత్యక్షసాక్షి అగ్నిదేవత.

**ఓం క్రతో స్మర కృతగ్ం స్మర క్రతో స్మర కృతగ్ం స్మర॥**

ఓ అగ్నిదేవతా, నేను చేసిన కర్మలన్నీ గుర్తు తెచ్చుకో అని, రెండుసార్లు చెబుతున్నాడు. మరణకాలంలో చేస్తున్నాడు కదా, గొంతు నీరసంగా ఉంది, అగ్నిదేవత విన్నాడో లేదో అని మళ్ళీ చెబుతున్నాడు. ఓ అగ్నీ! నన్ను శోభనమార్గంద్వారా నువ్వు తీసుకువెళ్ళుగాక. శోభనమార్గం అంటే శుక్లమార్గం. నీకు నేను చేసిన కర్మలు, ఉపాసనలు అన్నీ తెలుసు.

ఇది నిస్సహాయస్థితిలో చేస్తున్న ప్రార్థన. క్రమముక్తి పొందటానికి ఇది ఆఖరి అవకాశం. దానికోసం నీకు పదేపదే నమస్కారాలు చేస్తున్నాను అంటున్నాడు ఉపాసకుడు. సాష్టాంగ నమస్కారాలు చేయలేడు, లేచి నిలబడటమే కష్టం మరణకాలంలో. అందువల్ల మాటలతోనే నమస్కారం చేస్తున్నాను అంటున్నాడు; పైగా మరణకాలంలో మాటద్వారా కూడా నమస్కారం చేయగలనో లేదో. ఇప్పుడు పెట్టే నమస్కారమే అంత్యకాలంలో పెట్టినట్టుగా భావించు అంటున్నాడు సాధకుడు అగ్నిదేవతతో. ఇది ఒక అద్భుతమైన మంత్రం.

దీనితో పదిహేనవ బ్రాహ్మణము అయిపోయింది, ఐదవ అధ్యాయం అయిపోయింది.

## బృహదారణ్యకోపనిషత్ - అధ్యాయం 6

అధ్యాయాలు 5, 6లను కలిపి ఉపాసనాకాండము అంటారని చూశాము. ఈ అధ్యాయంలో కూడా కొన్ని ఉపాసనలను చూస్తాము. ఇందులో ఐదు బ్రాహ్మణములు, 75 మంత్రాలు ఉన్నాయి. మొదటి మూడు బ్రాహ్మణములూ ఇంచుమించుగా ఛాందోగ్యోపనిషత్తులోని ఐదవ అధ్యాయంలోని మొదటి మూడు ఖండాలలాగానే ఉంటాయి.

### 6.1. ప్రాణ సంవాద బ్రాహ్మణము

ఇది కూడా హిరణ్యగర్భ ఉపాసన. హిరణ్యగర్భను ప్రాణం రూపంలో చూస్తాము. అందువల్ల ఈ ఉపాసనను ప్రాణరూపేణ హిరణ్యగర్భ ఉపాసన అంటారు. దీన్ని ఒక కథ ద్వారా చూపిస్తున్నది. కథను ఆఖ్యాయిక అంటారు. కథను కథగా తీసుకోవాలి కాని, ఇదెలా సాధ్యం అనుకుంటే, దీన్ని ఆస్వాదించలేరు.

మన సూక్ష్మశరీరంలో 19 అంగాలు ఉన్నాయి. అవి పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, పంచప్రాణాలు, నాలుగు అంతఃకరణాలు ఉన్నాయి. ఇక్కడ ఉపనిషత్తు వీటికి ప్రతీకగా ఐదు అంగాలను తీసుకుంది. అవి వాక్కు, కన్ను, చెవులు, మనస్సు, ఉపస్థ (జననేంద్రియం). వీటన్నిటికీ ఒక్కొక్క గుణమే ఉంటే, ప్రాణానికి రెండు గుణాలు ఉన్నాయి. వాక్కుకి వసిష్ఠత్వం, కన్నుకు ప్రతిష్ఠత్వం, చెవులకు సంపదత్వం, మనస్సుకు ఆయతనత్వం, ఉపస్థకు ప్రజాతత్త్వం అనే గుణాలు ఉంటే ప్రాణానికి జ్యేష్ఠత్వం, శ్రేష్ఠత్వం అనే రెండు గుణాలు ఉన్నాయి.

అందువల్ల ఈ అంగాల మధ్య ఒకసారి గొడవ వస్తుంది. దేనికదే నేను గొప్ప అంటే నేను గొప్ప అని వాదించుకుంటాయి. అవి తేల్చుకోలేక, ప్రజాపతి దగ్గరకు వెళ్ళి మాలో ఎవరు వసిష్ఠుడో చెప్పండి అన్నాయి.

**కో నో వసిష్ఠ ఇతి**

కాని బ్రహ్మ తను తీర్పు చెప్పకుండా వారినే వారి గొప్పతనం ప్రత్యక్షంగా తెలుసుకోవటానికి ఒక ప్రయోగం చేసి చూడమన్నాడు. ఏమిటది? మీలో ఎవరైతే పైకి నిష్క్రమించినప్పుడు, ఈ దేహాన్ని చాలా అపవిత్రంగా లోకం భావిస్తుందో, అది మీలో వసిష్ఠం అన్నాడు బ్రహ్మ.

అప్పుడు శరీరంలోని ఒక్కొక్క అంగం బయటకు వెళ్ళి రావటం మొదలుపెట్టాయి. ఒక ఏడాది బయట ఉండి, తిరిగి వచ్చేవి. అలా ఇంద్రియాలు ఎలా బయటకు వెళ్ళాయి అని అడగకూడదు. ఇది ప్రాణశక్తిని స్తుతించటానికి చెప్పబడిన ఒక ఊహాజనితమైన కథ మాత్రమే!

వాగింద్రియంతో మొదలవుతుంది ఆ ప్రయోగం. ప్రాణం ముందు వెళ్ళదు. అవి వరుసగా వాక్కు, చక్షువు, శ్రోత్రం, మనస్సు, ఉపస్థ. అవి బయటకు వెళ్ళి, సంవత్సరం పాటు లేకపోయినా, తక్కిన అన్ని పనులూ మామూలుగా జరిగిపోతున్నాయని ఆయా ఇంద్రియాలు గ్రహించాయి. వాక్కు లేకపోతే, మూగవారు జీవించినట్టూ జీవించాయి; కన్ను లేకపోతే గుడ్డివాడు చూడలేకపోయినట్టుగా చూడలేకపోయామనీ, చెవులు లేకపోతే చెవిటివారు వినలేనట్టుగా వినలేకపోయామనీ, మనస్సు లేకపోతే మూఢులు తెలివిలేనివారిగా ఎలా ఉంటారో, అలా ఉన్నామనీ, జననేంద్రియం లేకపోతే పిల్లలు లేనివారు పిల్లలు లేకుండా ఎలా ఉంటారో అలా ఉన్నామనీ, తక్కిన జీవితమంతా సాఫీగానే గడిచిందనీ, తక్కిన ఇంద్రియాలు చెప్పాయి. అలా ఈ అంగాలకు గర్వభంగం కలిగి, అవి వాటివాటి స్థానాల్లోకి ప్రవేశించాయి.

ఇప్పుడు ప్రాణం వంతు వచ్చింది. తక్కిన అంగాల విషయంలో అవి సంవత్సరం పాటు బయటకు వెళ్ళాయని చెప్పుకుంటూ వచ్చింది ఉపనిషత్తు. కాని ప్రాణం విషయం వచ్చేసరికి, ప్రాణం బయటకు వెళ్ళిందని చెప్పలేదు.

**అథ హ ప్రాణ ఉత్క్రమిష్యన్** – ప్రాణం పైకి నిష్క్రమించబడింది.

**యథా మహాసుహయస్సైంధవః షడ్వీశశంకూన్ సంవృహేత్** – సింధుదేశానికి చెందిన పెద్ద మంచి గుర్రం కాళ్ళకు కట్టిన మూటలను ఏ విధంగా పెకలించి వేస్తుందో,

**ఏవగ్ం హైవేమాన్ ప్రాణాన్ సంవవర్హ** – అదే విధంగా ఈ ఇంద్రియాలను పెకలించి వేసింది.

ప్రాణం పైకి లేవగానే, ఇంద్రియాలు కూడా శరీరంనుంచి బయటకు లాగబడినట్టు అయింది. అప్పుడా ఇంద్రియాలన్నీ ప్రాణాన్ని వేడుకున్నాయి. అవి ఓ భగవాన్, నువ్వు వెళ్ళవద్దు, నువ్వు లేకుండా జీవించే శక్తి మాకు లేదు అన్నాయి. అయితే నాకు సుంకాన్ని కట్టండి అని ప్రాణం అడిగితే, సరే అన్నాయి ఇంద్రియాలు. అప్పుడు వరుసగా వాక్కు తనకున్న వసిష్ఠ గుణాన్ని, కన్ను తనకున్న ప్రతిష్ఠ గుణాన్ని, చెవులు తమకున్న సంపద గుణాన్ని, మనస్సు తనకున్న ఆయతనం గుణాన్ని, ఉపస్థ తనకున్న ప్రజాతి గుణాన్ని ధారపోసాయి. దానితో రెండు గుణాలు ఉన్న ప్రాణానికి, ఇప్పుడు ఏడు గుణాలు వచ్చాయి.

ప్రాణం నాకు ఆహారమేమిటి, వస్త్రమేమిటి అని అడిగింది. కుక్కలు, క్రిములు, కీటకాలు, పక్షులు తినే ఆహారాలతో సహా – అన్ని ప్రాణులచేత తినబడే ప్రతి ఆహారం నీకు అన్నం అన్నాయి అవి. అంటే ఒక్కముక్కలో చెప్పాలంటే ప్రాణాన్ని సర్వ అన్నభోక్తా అనవచ్చు.

**ఆపో వాస ఇతి** – జలములే నీకు వస్త్రం అన్నాయి ఇంద్రియాలు. అన్నం తినేముందు, తిన్నాక ఆచమనం చేసిన నీరే ప్రాణానికి వస్త్రం అన్నాయి. నీటిని వస్త్రం అంటే, వస్త్రంగా భావించి ఉపాసన చేయాలి.

ఈ ప్రాణ ఉపాసన చేసిన వ్యక్తికి ఏ రోజు కూడా తినకూడనిదానిని తినాల్సిన పరిస్థితి రాదు. ఇది **సప్తగుణ విశిష్ట ప్రాణరూపేణ హిరణ్యగర్భ ఉపాసన**. ప్రాణానికీ, ఇంద్రియాలకూ మధ్య సంభాషణ జరిగింది కాబట్టి ఈ బ్రాహ్మణాన్ని **ప్రాణసంవాద బ్రాహ్మణము** అంటారు.

## 6.2. కర్మవిభాగ బ్రాహ్మణము

ఈ బ్రాహ్మణములో ఇంకొక ఉపాసన చూస్తాము. దీన్ని **పంచాగ్నివిద్య** అంటారు. ఈ పంచాగ్నివిద్య కూడా ఛాందోగ్యోపనిషత్తులో ఐదవ అధ్యాయంలో, మూడవ ఖండంలో వస్తుంది. దీనికి ఉపోద్ఘాతంగా ముందు ఒక కథ, గురుశిష్యుల మధ్య సంభాషణ రూపంలో వస్తుంది.

ఛాందోగ్యోపనిషత్తులో, శ్వేతకేతు గురుకులంలో విద్య ముగించుకుని వచ్చాక, విద్యాగర్వంతో ఉండటం గమనించాడు తండ్రి ఉద్దాలకుడు. అతని గర్వాన్ని అణచటానికి ఏ ఒక్క విద్య నేర్చుకుంటే సర్వం నేర్చుకున్నట్టు అవుతుందో, ఆ విద్య నేర్చుకున్నావా అని తండ్రి అతన్ని అడిగాడు. ముందు అలాంటి విద్య ఉండదని వాదించినా, తండ్రి ఉందని చూపిస్తే, గర్వం తగ్గించుకుని, నాకు నువ్వే నేర్పించు అన్నాడు అణకువగా. ఆ సందర్భంలో వచ్చిన బోధే తత్త్వమసి మహావాక్యం.

ఇప్పుడు ఈ బృహదారణ్యకంలో, ఆరవ అధ్యాయంలో, రెండవ బ్రాహ్మణంలో కూడా శ్వేతకేతు ప్రవాహణ జైవలి అనే రాజు దగ్గరకు గర్వంగానే వచ్చాడు. రాజు అతన్ని కుమారా అని ఆత్మీయంగా సంబోధించి, అతను విద్యావంతుడు కాబట్టి, అతన్ని ఐదు ప్రశ్నలు అడిగాడు. అవి –

1. మరణం తర్వాత జీవులు వెళ్ళే మార్గం ఏమిటి?
2. జీవుడు మళ్ళీ ఎలా తిరిగివస్తాడు?
3. ఇంతమంది మరణిస్తున్నా స్వర్గలోకం ఎందుకు నిండటం లేదు?
4. ఏ దశలను దాటుకుని జీవుడు మనుష్యలోకానికి తిరిగివస్తాడు?
5. శుక్లగతి, కృష్ణగతుల్లో వెళ్ళటానికి సాధనలు ఏమిటి?

శ్వేతకేతుకి వీటిల్లో దేనికీ సమాధానం తెలియలేదు. రాజు అతన్ని అవమానించకుండా, తన ఆతిథ్యం స్వీకరించమని కోరినా, అతను అవమానాన్ని భరించలేక, కోపంగా తండ్రి

దగ్గరకు వెళ్ళాడు. తండ్రిని ఇవి నాకెందుకు బోధించలేదని కోపంగా అడుగుతాడు. తండ్రి నాకు తెలిసిందంతా నీకు చెప్పాను! ఇవి నాకూ తెలియవు; పద, మనమిద్దరం రాజు దగ్గరకు వెళ్ళి నేర్చుకుందాము అన్నాడు. అజ్ఞానం పాపం కాదు, అజ్ఞానాన్ని పెంచి పోషించకూడదు. కాని శ్వేతకేతు కోపం ఇంకా తగ్గకపోవటంతో అతను రానన్నాడు. గౌతముడు ఒక్కడే రాజు దగ్గరికి వెళ్ళాడు.

రాజు గౌతముణ్ణి సగౌరవంగా ఆహ్వానించి, సంపదలేవో ఇస్తాననన్నాడు. కాని గౌతముడు తనకు అవేవీ వద్దనీ, తనకు విద్యను బోధించమనీ కోరుతాడు. అప్పటి వర్ణాశ్రమ ధర్మం ప్రకారం రాజు, బ్రాహ్మణునికి బోధించకూడదు. కాని గౌతముడు కోరాడు కాబట్టి, ఆ సంప్రదాయాన్ని తప్పించి, మీకు బోధిస్తాను అన్నాడు. పైగా గౌతముడు బాధపడకుండా, ఈ విద్య క్షత్రియులకు మాత్రమే తెలుసు; బ్రాహ్మణులకు తెలియదు అన్నాడు.

9–14 మంత్రాలలో పంచాగ్నివిద్యను బోధిస్తాడు. ఇది చాలా ముఖ్యమైన విద్య. ఇక్కడ విద్య అంటే ఉపాసన. ఈ పంచాగ్నివిద్య నాలుగవ ప్రశ్నకు జవాబుగా వస్తుంది. అందువల్ల మళ్ళీ ఒకసారి 4వ ప్రశ్నను చూద్దాము.

4. ఏ దశలను దాటుకుని జీవుడు మనుష్యలోకానికి తిరిగివస్తాడు?

దానికి జవాబు టూకీగా ఐదు దశలను దాటుకుని మనిషిగా వస్తాడు. ఐదు దశలనూ అగ్నిగా భావించి ఉపాసన చేస్తారు కాబట్టి, దీనిని పంచాగ్నివిద్య అంటారు.

ముందు ఈ పంచాగ్నివిద్య గురించి సూక్ష్మంగా చూద్దాము.

ఈ పంచాగ్నివిద్య వైదిక జీవితాన్ని గడిపిన ఒక గృహస్థు గురించి వస్తుంది. అతను తను జీవించి ఉన్నంతకాలం గార్హపత్యాగ్నిని కొలుస్తాడు. 40 సంస్కారాలు చేస్తాడు. అతను మరణించాక, అతనికి దహనసంస్కారం చేస్తారు. దాన్ని అంత్యేష్టికర్మ అంటారు. అంత్యేష్టి కర్మలో ఈ వైదికపురుషుని శరీరాన్ని గార్హపత్యాగ్నిలో కాలిస్తే, ఆ అగ్ని అతనికి ఒక స్థూలశరీరాన్ని ఇస్తుంది. అది పేరుకే స్థూలశరీరం కాని, అది చాలా సూక్ష్మంగా ఉంటుంది. కంటికి కనబడదు. ఇది కూడా పాంచభౌతికమే అయినా, నీరు ప్రధానంగా ఉంటుంది. అందువల్ల దీన్ని జలశరీరం అంటారు.

ఈ జలశరీరంలో సూక్ష్మశరీరం, కారణశరీరం, ప్రతిబింబచైతన్యం ప్రయాణం చేస్తాయి. ఆ ప్రయాణం ఐదు దశల్లో సాగుతుంది. ఈ జలశరీరం మొదటిదశ. ఇది స్వర్గలోకానికి వెళుతుంది. స్వర్గలోకం అగ్ని 1. దానిలో వేసే ద్రవ్యం జలశరీరం. దానినుంచి వచ్చే ఫలం సోమశరీరం. ఆ ఆహుతినుంచి సోమరాజు ఉదయిస్తుంది. అలా 5 దశలను ఒక పట్టికలో చూద్దాము.

| దశ | ద్రవ్యం | అగ్ని | ఫలం | వివరణ |
|---|---|---|---|---|
| 1 | జలశరీరం | స్వర్గ అగ్ని | సోమశరీరం | సోమరాజు |
| 2 | సోమశరీరం | పర్జన్య అగ్ని | వృష్టిశరీరం | వర్షం |
| 3 | వృష్టిశరీరం | పృథివీ అగ్ని | ఓషధీశరీరం | అన్నం |
| 4 | ఓషధీశరీరం | పురుష అగ్ని | రేతశ్శరీరం | రేతస్సు |
| 5 | రేతశ్శరీరం | స్త్రీ అగ్ని | పురుష శరీరం | మనిషి జన్మ |

ఆ విధంగా జలశరీరం స్వర్గలోకానికి వెళ్ళి, వానద్వారా భూమికి చేరి, వృక్షంలోకి వెళ్ళి, తద్వారా పురుషబీజంలోకి వెళ్ళి, దానినుంచి స్త్రీ యోనిలోకి వెళ్ళి మనిషిగా జన్మ పొందుతుంది. ఒక్కొక్క దశను అగ్నిగా వర్ణిస్తుంది ఉపనిషత్తు. ఆ విధంగా పంచాగ్నిద్వారా వచ్చాము కాబట్టి మనమంతా అగ్నిపుత్రులం. అగ్నిచేత పునీతులమయ్యాము.

ఇదీ పంచాగ్నివిద్య.

ప్రశ్న 5 – శుక్లగతి, కృష్ణగతుల్లో వెళ్ళటానికి సాధనలు ఏమిటి?

**శుక్లగతి** – పంచాగ్ని ఉపాసన చేసినవారు శుక్లగతిద్వారా వెళ్ళటానికి అర్హులు. వారే కాదు, నైష్ఠిక బ్రహ్మచర్య అనుష్ఠానం చేసినవారు, హిరణ్యగర్భ ఉపాసన చేసినవారు, సన్న్యాస ఆశ్రమధర్మ అనుష్ఠానం చేసినవారు అర్హులు.

శుక్లగతిలో మరణించిన జీవిని తీసుకువెళ్ళే దేవతలను అర్చిరాది దేవతలు అంటారు. అర్చిదేవత, అహర్దేవత, అపూర్యమాణ పక్షం (శుక్లపక్షం), ఉత్తరాయణ దేవత, దేవలోకం, ఆదిత్యలోకాలకు వెళతారు. రిలే రేసులాగా ఒక్కొక్క దేవత తరువాత దేవతకు అందజేస్తుంది. బ్రహ్మలోకంనుంచి ఒక ప్రత్యేకమైన దేవత వచ్చి ఈ జీవుని తీసుకువెళుతుంది. ఆ దేవతను బ్రహ్మమానసపుత్రుడు అంటారు.

బ్రహ్మలోకంలో కూడా తారతమ్యాలు ఉంటాయి. ఎందుకంటే వారు చేసే తీరులో, వారి శ్రద్ధాభక్తులలో వ్యత్యాసాలు ఉంటాయి. అందువల్ల వారి ఆనందంలో తారతమ్యాలు ఉంటాయి. అక్కడ సాక్షాత్తూ బ్రహ్మద్వారా బ్రహ్మజ్ఞానం పొంది, అక్కడ ఉన్నన్నాళ్ళూ జీవన్ముక్తి పొంది, ప్రళయకాలంలో విదేహముక్తి పొందుతారు.

**కృష్ణగతి** – యజ్ఞం, దానం, తపస్సు ఆచరించినవారు కృష్ణగతిలో వెళతారు. వారిని ధూమదేవత రాత్రిదేవతకు, రాత్రిదేవత కృష్ణపక్షదేవతకు, కృష్ణపక్షదేవత దక్షిణాయణ దేవతకు, దక్షిణాయణ దేవత పితృలోకదేవతకు, పితృలోకదేవత చంద్రలోకానికి తీసుకువెళతారు. చంద్రలోకం అంటే స్వర్గం. అక్కడ దేవతలకు సేవ చేస్తారు. పుణ్యఫలం క్షీణించగానే తిరిగివస్తారు.

ఇప్పుడు మొదటి మూడు ప్రశ్నలకు జవాబులు చూద్దాము.

1. మరణం తరువాత జీవుడు వెళ్ళే మార్గం తెలుసా?
జవాబు – శుక్లగతిలో కాని, కృష్ణగతిలో కాని వెళతాడు.

2. జీవుడు మళ్ళీ ఎలా తిరిగివస్తాడు?
జవాబు – ఆకాశంనుంచి వాయువుకు, వాయువునుంచి వర్షానికి, వర్షంనుంచి పృథివికి చేరి అన్నం అవుతాడు. అన్నంగా పురుషునిలో చేరి, పురుషునినుంచి స్త్రీలోకి వెళ్ళి మళ్ళీ జన్మ పొందుతాడు.

3. ఇంతమంది మరణిస్తున్నా కూడా స్వర్గలోకం ఎందుకు నిండటం లేదు?
జవాబు – కేవలకర్మ కూడా చేయనివారు అధోగతి పాలవుతున్నారు. వారు క్రిమికీటకాలుగా పుడుతున్నారు.

ఈ విధంగా ఇందులో మూడు ముఖ్య అంశాలను చూశాము. అవి పంచాగ్నివిద్య, శుక్లగతి, కృష్ణగతి. కర్మఫలం గురించి చెబుతుంది కాబట్టి ఈ బ్రాహ్మణాన్ని కర్మవిభాగ బ్రాహ్మణము అంటారు. కర్మ అంటే అందులో ఉపాసన కూడా వస్తుంది.

## 6.3. శ్రీమంథ బ్రాహ్మణము

ఈ బ్రాహ్మణములో **శ్రీమంథ కర్మ** గురించి వస్తుంది కాబట్టి దీన్ని శ్రీమంథ బ్రాహ్మణము అంటారు. ఇది కడుపుతో ఉన్న స్త్రీలకు చేసే సీమంతం కాదు; శ్రీ అంటే లక్ష్మీదేవి. లక్ష్మీదేవి కృప పొందటానికి చేసే యజ్ఞం.

ఈ శ్రీమంథ కర్మలో రెండు అంశాలు ఉన్నాయి. మంథ అనే ఒక ముద్దను తినటం; శ్రీప్రాప్తికోసం తినటం. అంటే తినటం సాధన; ఐశ్వర్యం పొందటం సాధ్యం. ఈ కర్మను నాలుగు దశల్లో చేయాలి. ఇది వేదపూర్వభాగంలో వస్తుంది. అవి సంభారం, హోమం, ప్రాశనం, జపం.

1. **సంభారం**

ఎ) ఈ వ్రతం మొదలు పెట్టటానికే చాలా నియమాలు ఉన్నాయి. ఇది ఉత్తరాయణ కాలంలో శుక్లపక్షంలో మొదలుపెట్టాలి.

బి) ఒక పుణ్యతిథిని ఎన్నుకున్నాక, దానికంటే పన్నెండు రోజుల ముందునుంచే ఉపవాసం ఉండాలి. అంటే 12 రోజులు పాలు మాత్రమే ఆహారంగా తీసుకోవాలి. 13వ రోజు వ్రతం చేయాలి.

సి) యజ్ఞానికి కావాల్సిన వస్తువులను సమకూర్చుకోవాలి. మేడిచెట్టుయొక్క కర్రతో చేసిన కంచంలో కాని, చమసపాత్రలో కాని ముద్దను తయారుచేయాలి.

డి) ముద్దను కవ్వంతో చిలకాలి. అది కూడా మేడికర్రతోనే చేయాలి.

ఇ) ఆహుతులను వేసే స్రువం కూడా మేడిచెట్టుదే అవాలి.

ఎఫ్) అగ్నిలో వేసే సమిధలు కూడా మేడిచెట్టువే అవాలి.

జి) పల్లెటూర్లలో దొరికే పది రకాల ధాన్యాలను అంటే గోధుమలు, బియ్యం, పప్పులు, పళ్ళు, మొదలైనవాటిని సమకూర్చుకోవాలి.

హెచ్) దానికి వాడే నెయ్యిని కూడా స్థాలీపాక పద్ధతిలోనే సంస్కరించాలి.

ఐ) హోమకుండం ఏర్పాటు చేయాలి. మంత్రాలు చదువుతూ చేయాలి. ఒక ప్రత్యేకమైన చీపురుతో ఊడవాలి.

జె) తరువాత అగ్నిని వెలిగించాలి.

ఈ ఏర్పాట్లన్నీ చేసి, యజ్ఞం చేస్తే, అతనికి కలిగే ఫలం మహత్వం. ఇక్కడ మహత్వం అంటే ఐశ్వర్యం పొందుతాడు.

2. **హోమం** – హోమకుండంలో ఉన్న అగ్నిలో ఆజ్యం పొయ్యాలి, అది కూడా మంత్రాలు పఠిస్తూ చేయాలి. తనకు ఐశ్వర్యం పొందకుండా అడ్డుపడుతున్న దేవతలను శాంతపరచటానికి చేస్తాడు.

ఇవికాక మరికొన్ని ఆహుతులు చూస్తాము. ప్రాణానికి ఏడు గుణాలని చూశాము. అవి జ్యేష్ఠత్వం, శ్రేష్ఠత్వం, వసిష్ఠత్వం, ప్రతిష్ఠత్వం, సంపదత్వం, ఆయతనత్వం, ప్రజనత్వం. ఈ గుణాలను జపిస్తూ, రెండేసి చొప్పున ఆహుతులను వేసి, మిగిలిన నేతిని తన ముందు ఉంచుకున్న మంథముమీద వేయాలి.

మళ్ళీ మరికొన్ని ఆహుతులను చూస్తాము. ఇప్పుడు ఒక్కొక్కటే వేయాలి. అగ్నియే స్వాహా అని అగ్నిలో ఆహుతి వేసి, స్రువంలో మిగిలివున్న నేతిని మంథము మీద వేయాలి. అలా వరుసగా సోమదేవత, భూ, భువ, సువర్లోకాలు, బ్రాహ్మణుడు, క్షత్రియుడు, భూతకాలం, భవిష్యత్కాలం, విశ్వం, సర్వం, ప్రజాపతి (హిరణ్యగర్భ)లకు వేస్తూ రావాలి.

3. **ప్రాశనం** – ఇది మంథాన్ని తినే పద్ధతి. అది కూడా హడావుడిగా తినకూడదు. దీనిలో మళ్ళీ మూడు దశలు ఉన్నాయి. కాని ఆ దశలు – ముందు ఈ మంథాన్ని ముద్దగా తయారు చేసుకోవాలి. పది ధాన్యాలు, పళ్ళతో కూడిన ఆపిష్టాన్ని మేడికర్రతో చేసిన

పాత్రలో పెట్టి, హోమం చేసినప్పుడు నెయ్యి చుక్కలను వేస్తాడు కదా, దాన్ని కవ్వంతో చిలికి ముద్దగా చేయాలి. చేత్తో కలపకూడదు. ఇప్పుడు దశలవారీగా తినాలి.

ఎ) **అభిమర్షణమ్** – ఆ మంథాన్ని ముట్టుకుని హిరణ్యగర్భని దానిమీద ఆవాహన చేస్తూ, హిరణ్యగర్భను స్తుతించే మంత్రాలను పఠించాలి.

బి) **ఉద్యమనమ్** – ఈ మంథం ఉన్న చమసపాత్రను ఎత్తి పట్టుకుని మళ్ళీ ప్రాణతత్త్వాన్ని కీర్తించాలి. ఇదంతా వేదభాషలో ఉంది. ఇప్పుడు ఈ మంథాన్ని నాలుగు ముద్దలుగా చేయాలి. అందువల్ల మంథాన్ని చేసేటప్పుడే ఎంత చేయాలో అవగాహన ఉండాలి. నాలుగు ముద్దలను, ఒక్కొక్క ముద్దగా మొత్తం నోట్లో పెట్టేసుకునేంత చేయాలి.

సి) **ప్రాశనమ్** – ఇప్పుడు నాలుగు మంత్రాలను పఠిస్తూ ఒక్కొక్క ముద్దా తినాలి. అవి గాయత్రీ మంత్రంయొక్క మూడు పాదాలు, చివరగా మూడూ కలిపిన మంత్రం. ప్రతిపాదంతోపాటు మధుమంత్రం కూడా జపించాలి.

4. **జపం** – చేతులు కడుగుకొని, నీటిని త్రాగి, హోమకుండానికి పశ్చిమదిక్కుకు వచ్చి, తూర్పువైపు తిరిగి కూర్చోవాలి. ఆ అగ్నికుండం దగ్గరే రోజంతా గడపాలి. బయటకు వెళ్ళకూడదు. రాత్రి అక్కడే తల తూర్పువైపు పెట్టుకుని పడుకోవాలి. మర్నాడు పొద్దున్న నిద్రలేచాక, సంధ్యావందనంతోపాటు ప్రత్యేకమైన పూజను చేయాలి.

ఈ కర్మ ఎంత మహిమగలదంటే ఈ మంథాన్ని ఎండిపోయిన మోడుపై జల్లితే, కొమ్మలు మొలిచి, ఆకులు తొడుగుతాయి. ఇంకా గురుపరంపరను జపించాలి.

అలా ఈ యజ్ఞం చేస్తే ధనప్రాప్తి, ఐశ్వర్యప్రాప్తి కలుగుతుంది.

## 6.4. పుత్రమంథ బ్రాహ్మణము

ఈ బ్రాహ్మణము గృహస్థాశ్రమ ధర్మాల గురించి చెబుతుంది. గృహస్థు ఒక్కడే రాబోయే తరాన్ని ఉత్పత్తి చేయగలడు. పుత్రులకు జన్మనివ్వటమే కాక, వారి సంస్కారాన్ని కూడా పెంపొందించాలి. ఒక మనిషి చేయాల్సిన 40 సంస్కారాల్లో మొదటి ఎనిమిది, అతను తనకు తాను చేసుకోలేడు. అతని ఆధ్యాత్మిక ఎదుగుదలకోసం తల్లిదండ్రులు చేస్తారు. ఈ సంస్కారాలు గర్భాదానంతో మొదలయ్యి ఉపనయనం దాకా ఉంటాయి.

తల్లిదండ్రులు చేసే ఈ ఎనిమిది సంస్కారాల్లో మూడు పుట్టకముందు చేస్తే, ఐదు పుట్టాక చేస్తారు. ఈ సంస్కారాలు చేయటంద్వారా ముందు తరానికి దైవీసంపత్తిని అందించిన వారవుతారు. 40లో 8 తల్లిదండ్రులు చేస్తే, అతను బ్రహ్మచర్య ఆశ్రమంలో 5, గృహస్థాశ్రమంలో 27 చేయాలి.

ఇప్పుడవన్నీ చూడబోవటం లేదు మనం. తల్లిదండ్రులు చేసే ఎనిమిదిలో ఉదాహరణగా మూడు చూడబోతున్నాము. అవి గర్భాదానం, జాతకర్మ, నామకరణం. ముందు బ్రాహ్మణములో ఐశ్వర్యంకోసం ప్రసాదం తీసుకుంటారు కాబట్టి, అది శ్రీమంథ బ్రాహ్మణము అయింది. ఇక్కడ పుత్ర ఉత్పత్తికోసం ప్రసాదం తీసుకుంటారు కాబట్టి, ఇది **పుత్రమంథ కర్మ.** అందువల్ల ఇది పుత్రమంథ బ్రాహ్మణము అయింది.

1. **గర్భాధానం**

ఎ) **గర్భాధానకర్మ** – గర్భాధానకర్మను వివరించటానికి ఉపనిషత్తు స్త్రీపురుషసంయోగాన్ని వివరిస్తున్నది. ఇది పాపకర్మ కాదు, అలా అయితే, మొత్తం గృహస్థాశ్రమమే పాపపంకిలం అయిపోతుంది. అలా అంటే మొత్తం మానవాళే పాపులు అయిపోతారు.

వేదాలు ప్రాకృతకర్మ లేదా స్వాభావికకర్మలను కూడా సంస్కృతకర్మలుగా మార్చుకోమంటుంది. ఈ మార్పు ఎలా జరుగుతుంది? సరియైన దృక్పథం, సరియైన క్రమశిక్షణద్వారా. తీసుకునే ఆహారాన్ని సంస్కృతకర్మగా మలుచుకున్నట్టుగా, స్త్రీపురుషుల సంయోగాన్ని కూడా వాజపేయయజ్ఞంలా చూడాలి. అంటే ఆ కర్మ మోక్షప్రాప్తి లేదా ధర్మప్రాప్తికోసం చేసేదిగా ఉండాలి. ఎప్పుడైతే తొలికలయికను గర్భాదానసంస్కారంగా భావిస్తారో, అప్పుడే వారి కలయికవల్ల పుట్టిన శిశువును యాగఫలంగా భావిస్తారు. ధార్మిక పుత్రప్రాప్తి కలిగినట్టుగా భావిస్తారు. ఇదీ సరియైన దృక్పథం.

సరియైన కలయికకు కూడా కొన్ని నియమాలు ఉన్నాయి. 1) ఆ స్త్రీ, పురుషులు భార్యాభర్తలై ఉండాలి. 2) పవిత్రంగా ఉండాలి. 3) సరియైన ప్రదేశంలో, సరియైన సమయంలో చేయాలి. 4) భార్యాభర్తల మధ్య మంచి అవగాహన ఉండాలి.

బి) **గర్భాధాన వ్రతాలు** – భార్య, భర్త తమకెలాంటి పుత్రుడు కావాలనుకుంటే, దానికి సంబంధించిన నియమం పాటించాలి. అంటే, ఒక పద్ధతిలో తయారుచేసిన మంథాన్ని తినాలి. అది క్షీరాన్నమో, దధ్యోదనమో, మరేదో కావచ్చు. దీన్ని పుత్రమంథ కర్మ అంటారు. వీరు ఎటువంటి శిశువును కోరవచ్చు?

1) అమ్మాయో, అబ్బాయో ఎవరు కావాలో నిర్ణయించుకోవచ్చు.
2) శిశువు పరావిద్య నేర్చుకోవాలో, అపరావిద్య నేర్చుకోవాలో నిర్ణయించుకోవచ్చు.
3) శిశువు రంగు ఎలా ఉండాలో నిర్ణయించుకోవచ్చు.
4) శిశువు కన్ను ఏ వర్ణంలో ఉండాలో నిర్ణయించుకోవచ్చు.

సి) **గర్భాధాన సంస్కారం** – ఇందులో మళ్ళీ మూడు అంశాలు ఉన్నాయి. అవి అగ్నిహోత్రం, నియమాలు, ప్రార్థన.

1) అగ్నిహోత్రం – అగ్నిహోత్ర వివరాలు ఉంటాయి.

2) నియమాలు – వారి మధ్య చక్కని అనుబంధం ఎలా ఉండాలో చక్కని ఉదాహరణలద్వారా చూపిస్తుంది ఉపనిషత్తు. ఋగ్వేదం–సామవేదం ఒక జంట; సంగీతం–సాహిత్యం ఒక జంట; రాత్రి–పగలు ఒక జంట; ఆకాశం–భూమి ఒక జంట.

3) ప్రార్థన – ఆరోగ్యకరమైన శిశువుకోసం గర్భాధాన సమయంలో ప్రార్థన చేస్తారు. ఆ ప్రార్థన ప్రజాపతికి ఉంటుంది. ఆ పుట్టే శిశువు బ్రహ్మలాగా ఉండాలని ప్రార్థన. గర్భాధానం అంటే గర్భస్య ఆదానం. జీవుడిని పురుషబీజంనుంచి స్త్రీయోనికి మార్చటం. పంచాగ్నివిద్యలో నాలుగు, ఐదు అగ్నులుగా పురుషశరీరం, స్త్రీ శరీరాలను చూశాము.

2. **జాతకర్మ**

జాతే సతి క్రియమాణం కర్మ – జాతకర్మ

పుట్టగానే చేసే కర్మ. జాతకర్మలో ఐదు దశలు ఉన్నాయి. అవి ప్రోక్షణం, హోమం, ప్రార్థన, కర్మజపం, ప్రాశనం.

1. **ప్రోక్షణం** – శిశువు జన్మిస్తున్నప్పుడు, భర్త భార్యమీద నీళ్ళు జల్లి ప్రార్థన చేయాలి. ఈ ప్రార్థన ప్రాణశక్తికి లేదా ప్రాణదేవతకు చేస్తాడు. దీని సారాంశం, ఓ వాయుదేవుడా, సముద్రంలాంటి నా భార్యనుంచి అలలాంటి నా పుత్రుడు జన్మించటానికి నువ్వు తోడ్పడుతున్నావు. నా పుత్రుడు క్షేమంగా బయటకు వచ్చేటట్టు, తల్లికి ఏమీ అవకుండా ఉండేటట్టు చేయి.

2. **హోమం** – ఈ హోమం పుత్రుడు పుట్టగానే చేయాలి. కుదరకపోతే, 11వ రోజు కాని, ఇంకొక అనువైన రోజున కాని, శిశువు ఆరోగ్యంకోసం చేయాలి.

3. **ప్రార్థన** – శిశువును ఒళ్ళో కూర్చోపెట్టుకుని అతని ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధికోసం, వంశాభివృద్ధికోసం చేసే ప్రార్థన ఇది. పుత్రునిలోకి ప్రాణశక్తిని నింపే మానసిక ప్రార్థన ఇది.

4. **కర్ణజపం** – వాక్కు అనే పదాన్ని తన పుత్రుని కుడిచెవిలో మూడుసార్లు ఉచ్చరిస్తాడు. వాక్కు వేదాలను సూచిస్తుంది. వేదాలు శబ్దప్రధానం. మూడుసార్లు ఎందుకు చెప్పాలంటే అవి మూడు వేదాలను సూచిస్తాయి. అవి ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం. నిజానికి

నాలుగు వేదాలు ఉన్నా, అథర్వణవేదం గురించి ఎక్కువగా చెప్పరు. అలా వాక్కు అనే పదాన్ని ఉచ్చరించటంవల్ల, వేదాలన్నీ పుత్రునిలోకి ప్రవేశించి, అతన్ని పునీతుణ్ణి చేస్తాయనీ, అతనికి వేదాలమీద శ్రద్ధ ఏర్పడుతుందనీ నమ్మకం.

5. **ప్రాశనం** – దీన్నే మనం అన్నప్రాశనం అంటాం. దీనికి **దధిమధుఘృతం** కలిపినదాన్ని నోట్లో పెట్టాలి. అంటే పెరుగు, తేనె, నెయ్యిలను పెడతారు. దీన్ని బంగారంతో పెట్టాలి. దధి పెడుతూ నీకు భూలోకాన్ని, మధువు పెడుతూ భువర్లోకాన్ని, నెయ్యి పెడుతూ సువర్లోకాన్ని ఇస్తున్నాను అంటారు. అంటే నీకు సర్వం ఇస్తున్నాను అంటారు. శిశువు అలా సర్వం పొందాలనే సదుద్దేశంతో చేసే కర్మ ఇది.

3. **నామకరణం** – దీన్ని చాలా టూకీగా చెప్పింది ఇక్కడ ఉపనిషత్తు. తండ్రి ఒక ప్రత్యేకమైన పేరు చెప్పాలి. అది రహస్యమైన నామం. ఈ పేరే పిల్లలందరికీ పెడతారు. ఈ పేరు వేదోఽసి అంటే వేదః అసి. ఇది ఒక మహావాక్యం. నువ్వు బ్రహ్మవు అని చెబుతుంది కాబట్టి మహావాక్యం. ఆ పేరు రహస్యం ఎందుకంటే ఆ పేరు అర్థం అతనికి అప్పుడు తెలియదు. అతను పెరిగి పెద్దయి, శిష్యుడయి, బ్రహ్మవిద్య నేర్చుకున్నప్పుడు తెలుస్తుంది. ఈ పేరు అతనికి పెడతారు కాబట్టి అది వ్యవహారానికి పనికి రాదు.

అందువల్ల ఆ శిశువును పిలవటానికి వీలుగా ఇంకొక పేరు పెడతారు. దానికి కూడా ఎన్నో నియమాలు ఉంటాయి. ఫలానా అక్షరంతో మొదలవ్వాలి, ఇన్ని అక్షరాలు ఉండాలి.

**స్తనదానకర్మ** – ఈ కర్మను జాతకర్మతో పాటు లేదా నామకరణంతో పాటు చేయాలి. దీన్ని స్తనదానకర్మ అంటారు.

భర్త భార్య దగ్గరకు శిశువును తీసుకువెళ్ళి, పాలివ్వమని చెప్పాలి. అప్పుడు సరస్వతీదేవికి ప్రార్థన చేయాలి. ముందుగా సరస్వతీదేవిని స్తుతించాలి. ఆమెవల్ల తన శిశువుకు జ్ఞానం, తెలివితేటలు, స్వచ్ఛత, ఐశ్వర్యం, మంగళకరమైన అంగాలు పొందాలని చేసే ప్రార్థన. అంటే శిశువు రాణించటానికి కావాల్సినవన్నింటినీ ప్రసాదించమని కోరుతాడు.

పాలు ఇచ్చేది తల్లే అయినా, ఆ తల్లి స్తనంలో పాలుగా మారి శిశువును దీవించమని సరస్వతీదేవిని కోరుతున్నాడు తండ్రి. ఓ సరస్వతీ, నా శిశువుకు పాలిస్తున్నది నా భార్య కాదు, సాక్షాత్తూ చదువుల సరస్వతి అయిన నువ్వే. ఇక్కడ చదువు అంటే చదువు ఒక్కటే కాదు, అన్ని సంపదలూ వస్తాయి.

గర్భాధాన సమయంలో బ్రహ్మదేవుణ్ణి ప్రార్థిస్తాడని చూశాము. ఓ దేవా, నువ్వు నాలో ప్రవేశించి, నా ద్వారా నాకు పుత్రుణ్ణి ప్రసాదించు అన్నాడు అప్పుడు. ఇప్పుడు సరస్వతీదేవిని,

నా భార్యలో నువ్వు ప్రవేశించు అంటున్నాడు. అంటే ఏదీ యాంత్రికంగా జరగటం లేదు. అంతా ఒక పవిత్రమైన, మంగళకరమైన క్రతువుగా సాగుతున్నది. తండ్రి బ్రహ్మ, తల్లి సరస్వతి అయితే వారి శిశువు మాములుగా ఉంటాడా? అతను కూడా బ్రహ్మస్వరూపుడు, సరస్వతీపుత్రుడు అవుతాడు.

దాని తరువాత తన శిశువును స్తుతిస్తాడు. నువ్వు గొప్ప శిశువ్వి అంటున్నాడు. నువ్వు నాకన్నా గొప్పవాడివి అవుతావు, నాకన్నా మాత్రమే కాదు, నా తండ్రిని మించినవాడివి అవుతావు అంటున్నాడు. తండ్రిని మించిన తనయుడు, తాతను మించిన మనవడు అనే నానుడులు అందువల్లనే వచ్చాయి. అంతేకాదు, అందరికన్నా ఎక్కువ ఐశ్వర్యం పొందుతావు, కీర్తిప్రతిష్ఠలు పొందుతావు, బ్రహ్మవర్చస్సుతో వెలిగిపోతావు అంటున్నాడు.

ఇవన్నీ తండ్రికి ఎలా తెలుసు? ఇదంతా మనస్తత్వశాస్త్రం. చిన్నప్పటినుంచి బలమైన సానుకూల ఆలోచనలు నింపితే అతను వృద్ధిలోకి వస్తాడు. అందువల్లనే పూర్వం నామకరణం కూడా వారి కోరికల మేరకు చేసేవారు. అపారమైన విద్యాబుద్ధులు కలగాలంటే అతనికి విద్యాసాగర్ అని పేరు పెట్టేవారు. పదేపదే ఆ పేరును పదిమంది ఉచ్చరిస్తే ఆ పేరు బలం ఉంటుంది.

దాని తర్వాత తన భార్యను అభినందిస్తాడు. నువ్వు గొప్ప పని చేశావు. నీ జన్మ ధన్యమైంది అంటాడు. అలా తను తండ్రిగా ఎదగటంవల్ల తన జన్మ కూడా ధన్యమైంది అనుకుంటాడు. దీనితో సంస్కారాలన్నీ ముగిశాయి.

## 6.5. వంశ బ్రాహ్మణము

ఇందులో వంశం అంటే ఆచార్య పరంపరయొక్క క్రమం చెప్పబడుతున్నది. ఈ ఋషి పరంపరను చెప్పటంలో ఐదు ఉద్దేశ్యాలు ఉన్నాయి. అవి –

1. ఇది ఒక విధమైన ఋషియజ్ఞం. దీనివల్ల చిత్తశుద్ధి కలుగుతుంది.

2. ఈ విద్య ఎంత ప్రాచీనమైనదో తెలుస్తుంది. పదికాలాలు నిలిచిన విద్య ఇది.

3. ఈ గురుపరంపరలో ఆదిగురువు సాక్షాత్తూ బ్రహ్మదేవుడే. ఆయన వేదరూప ప్రజాపతి. ఈ విద్య అపౌరుషేయం కాబట్టి తిరుగులేని విద్య.

4. పుత్రుడు జన్మించి గుణవంతునిగా పెరగటంలో తల్లి పాత్ర ప్రధానమైనది అంటారు. అందువల్ల ఆచార్యుల పరంపరను కీర్తిస్తూ శ్రుతి వారిని, వారివారి తల్లుల పుత్రులుగా పరిచయం చేసింది.

5. మూడవ మంత్రంలో యాజ్ఞవల్క్యుడు నేర్చుకున్నాడని; అందువల్ల దీనిని వాజసనేయి సంహిత అంటారనీ చూశాము. ఇది యాజ్ఞవల్క్యునికి ఇంకో పేరు. అతని బోధను శుక్లయజుర్వేదం అంటారని ఉపనిషత్తే చెబుతున్నది. ఈ మంత్రాలు శుక్లములు అంటే దోషరహితాలు, అపూర్వాలు అని అర్థం.

ఇక్కడితో ఐదవ బ్రాహ్మణము, ఆరవ అధ్యాయము, మూడవ కాండము ముగిశాయి. బృహదారణ్యకం ముగిసింది. స్వామీజీ బోధించిన ఏకాదశ ఉపనిషత్తుల సారం కూడా ముగిసింది.

**శాంతి పాఠం**

**ఓం పూర్ణమదః పూర్ణమిదం**
**పూర్ణాత్ పూర్ణముదచ్యతే।**
**పూర్ణస్య పూర్ణమాదాయ**
**పూర్ణమేవావశిష్యతే॥**
**ఓం శాంతిః శాంతిః శాంతిః॥**
**ఓం శ్రీ గురుభ్యో నమః॥**

ముందు విఘ్నాలు లేకుండా చెయ్యమని కోరటానికి శాంతిపాఠం పఠిస్తే, ఇప్పుడు విఘ్నాలు లేకుండా బృహదారణ్యకోపనిషత్తు అధ్యయనం అనే బృహత్కార్యం విజయవంతంగా ముగిసినందుకు, స్వామీజీ బోధించిన **ఏకాదశ ఉపనిషత్తుల సారం** కూడా ముగిసినందుకు కృతజ్ఞతా పూర్వకంగా బ్రహ్మదేవునికి, వేదమాతకు, ఋషిపరంపరకు ప్రత్యేకించి స్వామీ పరమార్థానందజీకీ నమస్కారం చేస్తున్నాము.

**హరిః ఓమ్।**

**ఓం తత్సత్। సర్వం శ్రీకృష్ణార్పణమస్తు॥**

# ఏకత్వంలో భిన్నత్వం - భిన్నత్వంలో ఏకత్వం

స్వామీజీ బోధించిన **ఏకాదశ ఉపనిషత్తుల సారం**లో చెప్పిన అంశాలనుంచి జాలువారిన ఒక ఆలోచనా ప్రవంతి. **- మద్దూరి రాజ్యశ్రీ**

**ఉపోద్ఘాతం**

**అనంతశాస్త్రం బహువేదితవ్యమ్, అల్పశ్చ కాలో బహవశ్చ విఘ్నాః ।**
**యత్సారభూతం తదుపాసితవ్యం, హంసో యథా క్షీరమివాంబుమిశ్రమ్ ॥**

శాస్త్రం అనంతంగా ఉంది, నేర్చుకోవాల్సింది చాలా ఉంది; సమయం చాలా తక్కువ ఉంది. ఆటంకాలు ఎన్నో వస్తున్నాయి. అన్నీ అధ్యయనం చేసే తీరిక లేకపోతే, ఏకాదశ ఉపనిషత్తుల సారం నేర్చుకున్నా చాలు.

1) **ఉపనిషత్తుల వివరాలు –** ఈ క్రింది పట్టికలో ఏ వేదానికి ఏ ఉపనిషత్తులు చెందుతాయో, వాటిల్లో వచ్చే నాలుగు ప్రసిద్ధమైన మహావాక్యాలు ఏమిటో, ఆయా వేదాలకు చెందిన శాంతిపాఠాలు ఏమిటో ఒక్కచోట చూడవచ్చు.

| **క్రమసంఖ్య** | **వేదం** | **ఉపనిషత్** | **మహావాక్యం** | **శాంతిపాఠం** |
|---|---|---|---|---|
| 1. | ఋగ్వేదం | ఐతరేయమ్ | ప్రజ్ఞానం బ్రహ్మ | వాఙ్మేమనసి |
| 2. | కృష్ణయజుర్వేదం | కఠ, తైత్తిరీయమ్ | – | సహ నావవతు |
| 3. | శుక్లయజుర్వేదం | ఈశ, బృహదారణ్యకమ్ | అహం బ్రహ్మాస్మి | పూర్ణమదః |
| 4. | సామవేదం | కేన, ఛాందోగ్యమ్ | తత్త్వమసి | ఆప్యాయంతు |
| 5. | అథర్వణవేదం | ప్రశ్న, ముండకమ్, మాండూక్యమ్,కైవల్యమ్ | అయమాత్మా బ్రహ్మ | భద్రం కర్ణేభిః |

2) **ఉపనిషత్తు నిర్వచనం –** ఉపనిషత్తు పదానికి కూడా అనేక అర్థాలు ఉన్నాయి. వేద అంతభాగంలో వస్తుంది కాబట్టి వేదాంతం అనీ, జ్ఞానాన్ని బోధిస్తుంది కాబట్టి జ్ఞానకాండ అనీ, బ్రహ్మజ్ఞానాన్ని బోధిస్తుంది కాబట్టి బ్రహ్మవిద్య అనీ, ఆత్మజ్ఞానాన్ని బోధిస్తుంది కాబట్టి ఆత్మవిద్య అనీ అంటారు. ఇవికాక, ఉపనిషత్తు పేరెందుకు వచ్చిందో చెప్పటానికి ఒక శ్లోకమే ఉంది –

**ఉపనీయేమమాత్మానాం బ్రహ్మాపాస్తద్వయం తతః ।**
**నిహంత్యవిద్యాం తజ్జం చ తస్మాదుపనిషన్మతా ॥**

**ఉపనీయమ్** – దగ్గరగా తీసుకువెళ్ళేది; ఎవరిని, ఎవరి దగ్గరికి?

**ఇమమ్ ఆత్మానామ్** – ఈ జీవాత్మని ఆ పరమాత్మ దగ్గరికి. ఎటువంటి బ్రహ్మ?

**ఆపాస్తద్వయం** – ద్వైతం కాని బ్రహ్మ. నిర్వికల్ప బ్రహ్మ. ఈ రెండూ కలవటంవల్ల ఏం చేస్తుంది?

**నిహంతి అవిద్యాం** – అజ్ఞానాన్ని నాశనం చేస్తుంది. బ్రహ్మకీ, జీవాత్మకీ మధ్య భేదం సృష్టించిన అజ్ఞానాన్ని నాశనం చేస్తుంది. అంతేనా?

**తజ్జం చ** – అజ్ఞానమనే అవిద్యవల్ల పుట్టిన సమస్తాన్నీ నాశనం చేస్తుంది. ఒక్కముక్కలో చెప్పాలంటే సంసారాన్ని.

అందువల్ల ఉపని అంటే జీవాత్మ, పరమాత్మలను కలిపేది. షత్ అంటే సంసారాన్ని నాశనం చేసేది అని ఒక అర్థం.

**వరుసక్రమం**

పది ఉపనిషత్తులకు శంకరాచార్యులవారు భాష్యం రాశారు. వాటిని తేలికగా గుర్తుంచుకోవటానికి ఒక శ్లోకరూపంలో ఉంటుంది.

> **ఈశ కేన కఠ ప్రశ్న ముండ మాండూక్య తిత్తిరిః।**
> **ఐతరేయం చ ఛాందోగ్యం బృహదారణ్యకం తథా॥**

అందువల్ల అద్వైత వేదాంతం నేర్చుకునే మనం ఈ 10 ఉపనిషత్తులనూ నేర్చుకోవటమే కాక, చిన్మయానంద స్వామీజీ, దయానంద స్వామీజీ బోధించే కైవల్యోపనిషత్తు కూడా నేర్చుకున్నాము. అందువల్ల ఇప్పుడు మనం ఏకాదశ ఉపనిషత్తుల సారం చూశాము. శంకరులవారు భాష్యం రాసినది గుర్తుంచుకోవటానికి ఇచ్చిన వరుస క్రమంలో నేర్చుకోకుండా, మనకు తేలికగా అర్థమయ్యే ఒక వరుసక్రమాన్ని ఏర్పరచారు పరమార్థానంద స్వామీజీ. ఆ వరుసక్రమంలోనే ఉపనిషత్తులనూ, వాటి సారాన్నీ కూడా బోధించారు. ఇప్పుడు అదే వరుసక్రమంలో పొందుపరచటం జరిగింది. అది ముండకం, కేన, కఠ, కైవల్యం, తైత్తిరీయం, మాండూక్యం, ఈశావాస్యం, ఐతరేయం, ప్రశ్న, ఛాందోగ్యం, బృహదారణ్యకం.

3) **గురుశిష్యుల సంవాదం** –చాలామట్టుకు ఉపనిషత్తుల్లో బోధ గురుశిష్యుల సంవాదం రూపంలో ఉంటుంది కాని కొన్నింట్లో బోధ వచ్చేస్తుంది. బోధ వచ్చేది ఈశావాస్యం, ఐతరేయం. గురు, శిష్యుల సంవాదంలో కూడా భేదాలు చూస్తాము. ఒక శిష్యుడు, ఒక గురువు; అనేక శిష్యులు, ఒక గురువు; అనేక శిష్యులు, అనేక గురువులు ఉంటారు.

4) **శాంతిపాఠాల సారం – అద్వైత సారం**

దశ శాంతి మంత్రాలు పఠిస్తేనే అద్వైత సారం అంతా వచ్చేస్తుంది.

**ఆప్యాయంతు మమాంగాని వాక్ప్రాణశ్చక్షుః శ్రోత్రమథో బలమింద్రియాణి చ సర్వాణి** – నా అంగాలన్నీ బలంగానూ, ఆరోగ్యంగానూ ఉండుగాక.

**భద్రం కర్ణేభిః శృణుయామ దేవా** – నా చెవులు మంగళకరమైనవి వినుగాక.

**వాఙ్మే మనసి ప్రతిష్ఠితా మనో మే వాచి ప్రతిష్ఠితమ్** – నా మనోవాక్కాయ కర్మలు ఒక్క త్రాటి మీద నడవాలి.

ఇవన్నీ శిష్యుని అర్హతలను సూచిస్తాయి. అర్హత ఉంటే చాలదు, దైవకృప తోడవ్వాలి.

**శం నో మిత్ర శం వరుణః శం నో భవత్వర్యమా** – తన అంగాలకు అధిష్ఠానదేవతలను ప్రార్థిస్తున్నాడు శిష్యుడు.

**మా మా బ్రహ్మ నిరాకుర్యామ్** – నేను ఈ విద్యను జీర్ణించుకోవటానికి నాకు సమయం పట్టవచ్చు. ఇతనికి ఆత్మవిద్య రాదు అని బ్రహ్మ నన్ను నిరాకరించకుండుగాక.

అలాగని పూర్తిగా భగవంతునిమీదే భారం వేసి వదిలేయకూడదు అని కూడా తెలుసు శిష్యునికి. అందువల్ల తన వంతు ప్రయత్నం గురించి కూడా చెబుతున్నాడు.

**అనేనాధీతేన అహో రాత్రాన్ సందధామి** – నేను నేర్చుకున్నదాన్ని రాత్రింబగళ్ళు వల్లెవేస్తాను.

**మాహం బ్రహ్మ నిరాకుర్యాత్** – బ్రహ్మజ్ఞానం అంత తేలికగా పొందలేకపోవచ్చు. అందువల్ల నేను బ్రహ్మను నిరాకరించకుండుగాక. నాకు శ్రద్ధ ఉండుగాక.

ఈ జ్ఞానం తనంతట తను పొందలేడు. ఈ విద్య గురుపరంపరగా వస్తున్నవన్నీ గురువు ద్వారానే పొందాలి అని కూడా తెలుసు శిష్యునికి. అందుకని ఇద్దరి అనుబంధం గురించి, ఆరోగ్యం గురించి ప్రార్థిస్తున్నాడు శిష్యుడు.

**యో బ్రహ్మాణం విదధాతి పూర్వం** – ఈశ్వరుడే బ్రహ్మకు వేదాలను నేర్పాడు.

**తన్మామవతు తద్వాక్తారమవతు** – నన్ను రక్షించు, నా గురువును రక్షించు.

**సహ నావవతు, సహ నౌ భునక్తు** – గురుశిష్యుల నిద్దరినీ రక్షించు. బ్రహ్మవిద్యను శాస్త్రం ద్వారానే పొందాలి.

**సర్వం బ్రహ్మోపనిషదమ్** – బ్రహ్మ సర్వవ్యాపకం. ఈ సర్వవ్యాపకమైన బ్రహ్మ గురించి ఉపనిషత్తు ద్వారానే తెలుసుకోవాలి. బృహదారణ్యకోపనిషత్తులో ఔపనిషదం పురుషః అని వస్తుంది.

వేదాంతసారం – **బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః.**

జీవో బ్రహ్మైవ నాపరః – జీవ ఈశ్వర ఐక్యాన్ని సూచిస్తుంది.

**పూర్ణమదః పూర్ణమిదం** – మహావాక్యం అంటే ఐక్యాన్ని సూచిస్తుంది.

**పూర్ణస్య పూర్ణామాదాయ పూర్ణమేవ అవశిష్యతే** – బ్రహ్మ సత్యం, జగన్మిథ్య వేదాంతబోధతో పాటు విలువలను కూడా పెంపొందించుకోవాలి.

**ఋతం వదిష్యామి సత్యం వదిష్యామి** – నేను ఋతం, సత్యాలను పాటిస్తాను.

**ధర్మాస్తే మయి సంతు తే మయి సంతు** – ఉపనిషత్తుల్లో చెప్పబడిన విలువలను కూడా నేను పెంపొందించుకుందును గాక!

ఇవన్నీ పాటించి ఆత్మజ్ఞానం పొందితే కలిగే ఆనందం కూడా శాంతిపాఠంలోనే వస్తుంది.

**ద్రవిణగ్ం సవర్చసమ్ సుమేధా అమృతోఽక్షితః** – నేను కాంతివంతమైన ఆత్మజ్ఞానం అనే ఐశ్వర్యాన్ని పొందాను. నేను సర్వజ్ఞుడైన బ్రహ్మను. నేను అమృతం.

అందువల్ల రోజూ దశ శాంతి మంత్రాలను పఠించాలని అంటారు పరమార్థానంద స్వామీజీ.

5) **సృష్టి ప్రకరణం – విగానం** – దీనికొక సూత్రం ఉంది. యత్ర విగానం వర్తతే తత్ర తాత్పర్యం నాస్తి – ఇలా భేదాలు ఉంటే శ్రుతి దానికి ఎక్కువ ప్రాముఖ్యతనివ్వటం లేదని అర్థం. ముందుగా అధ్యారోపం.

## సృష్టి గురించి అధ్యారోప ప్రక్రియ

చాలా ఉపనిషత్తుల్లో బ్రహ్మవిద్య సృష్టి ప్రకరణంతో మొదలవుతుంది. కాని ఏ ఒక్క ఉపనిషత్తులోనూ, ఇంకొక దానిలో వచ్చినట్టుగా ఉండదు. దాన్ని విగానం అంటారు. అంత వైవిధ్యం ఎందుకు ఉంది అంటే ఎలాగూ జగత్తును మిథ్యగా కొట్టివేసేటప్పుడు, ఎలా చెపితేనేమి అంటారు. దానికి శాస్త్రం అధ్యారోప అపవాద ప్రక్రియ వాడుతుంది. అధ్యారోపంలో సృష్టి జరిగిందనీ, సృష్టికర్త బ్రహ్మ అనీ వస్తుంది. అపవాదంలో బ్రహ్మ లేకుండా జగత్తుకు విడిగా ఉనికి లేదు కాబట్టి జగత్తును కొట్టివేస్తుంది. బ్రహ్మ నిర్వచనం అప్పుడు ఇలా వస్తుంది – కార్యకారణ విలక్షణం బ్రహ్మ.

ముందుగా అధ్యారోపం చూద్దాము. బ్రహ్మను జగత్కారణం బ్రహ్మగా వర్ణించటాన్ని తటస్థ లక్షణం అంటారు.

ఎ) **తైత్తిరీయోపనిషత్ – భృగువల్లీ – తటస్థ లక్షణం**

> **యతో వా ఇమాని భూతాని జాయంతే । యేన జాతాని జీవంతి ।**
> **యత్ప్రయంత్యభిసంవిశంతి । తద్విజిజ్ఞాసస్వ । తద్బ్రహ్మేతి ।**

తటస్థ లక్షణం పరోక్షంగా వస్తుంది కాని, అది కూడా చాలా ముఖ్యమైన లక్షణం.

జన్మాద్యస్య యతః - బ్రహ్మసూత్రాలు 2

నిజానికి వ్యాసాచార్యులవారు తన బ్రహ్మసూత్రాల్లో రెండవ సూత్రంలోనే బ్రహ్మను నిర్వచించటానికి ఈ తటస్థలక్షణాన్నే తీసుకున్నారు. దీని అర్థం - దేనినుంచి జీవరాశులన్నీ పుట్టాయో, దేనిచేత జీవించుచున్నాయో, దేనిలో ఇవన్నీ లయమవుతున్నాయో అది బ్రహ్మ. అంటే బ్రహ్మ జగత్తుయొక్క సృష్టి, స్థితి, లయ కారణం.

బి) **తైత్తిరీయోపనిషత్ - బ్రహ్మానందవల్లీ**

**తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః। ఆకాశాద్వాయుః। వాయోరగ్నిః। అగ్నేరాపః। అద్భ్యః పృథివీ। పృథివ్యా ఓషధయః ఓషధీభ్యోఽ న్నమ్। అన్నాత్పురుషః॥** - 1

ఏ ఉపనిషత్తులో సృష్టి ప్రకరణం గురించి చెప్పాల్సివచ్చినా దీన్ని ఉటంకిస్తుంటారు. ఏ బ్రహ్మ, ఆత్మ ఒకటేనో, ఆ బ్రహ్మనుంచి ఆకాశం, ఆకాశంనుంచి వాయువు, వాయువునుంచి అగ్ని, అగ్నినుంచి నీరు, నీటినుంచి భూమి, భూమినుంచి వృక్షాలు, వృక్షాలనుంచి పురుషుడు పుట్టారు. పురుషుడు అంటే మొత్తం జీవరాశిని తీసుకోవాలి. ముందుగా పంచభూతాల సృష్టి, దాన్నుంచి పాంచభౌతికాల సృష్టి జరిగిందని చూస్తాము.

సి) **ఛాందోగ్యోపనిషత్ - తేజోబన్న సృష్టి**

తైత్తిరీయోపనిషత్తులో పంచభూతాల సృష్టి జరిగాక, పాంచభౌతికాలు వచ్చాయని చూశాము. ఛాందోగ్యోపనిషత్తులో మూడు భూతాల సృష్టే చూస్తాము. అందువల్ల తక్కినవన్నీ ఈ మూడు భూతాలనుంచే వస్తుందనీ చూస్తాము.

**తదైక్షత బహు స్యాం ప్రజాయేయేతి। తత్తేజోఽ సృజత।**

ఈశ్వరుడు నేను అనేకంగా అవుతాను అనుకున్నాడు. అగ్నిని సృష్టించాడు.

**తత్తేజ ఐక్షత బహు స్యాం ప్రజాయేయేతి తదపోఽ సృజత।**

అగ్ని నేను అనేకంగా అవుతాను అనుకుంది. అగ్ని జలతత్త్వాన్ని సృష్టించింది.

**తా ఆప ఐక్షన్త బహ్వ్యః స్యామ్ ప్రజాయేమహీతి తా అన్నమసృజంత**

జలం నేను అనేకంగా అవుతాను అనుకుంది. అన్నాన్ని సృష్టించింది. ఛాందోగ్యంలో అన్నం అంటే పృథివీ అని తీసుకోవాలి.

ఈ విధంగా అగ్ని, జలం, పృథివీ అనే భూతత్రయాలు పుట్టాయి. ఇవి సూక్ష్మభూతాలు. వీటిని కలిపి తేజోబన్న సృష్టి అంటారు.

తేజో = తేజః (అగ్ని); ఆపః = నీరు; అన్న (అన్నం) = పృథివీ. అంటే తేజః + అప్ + అన్నం = తేజోబన్నం.

వీటినుంచి సమష్టి స్థూలప్రపంచాన్ని ముందు చెబుతుంది ఉపనిషత్తు.

డి) **ప్రశ్నోపనిషత్ – మిథునసృష్టి** భగవస్కుతో హ వా ఇమాః ప్రజాః ప్రజయన్త ఇతి

భగవాన్ ఈ ప్రాణకోటి ఎక్కడనుంచి పుట్టింది అని శిష్యుడు వేసిన ప్రశ్నకు ప్రజాపతి ముందు మిథునసృష్టి చేశాడు. మిథునం అంటే జంట. వాటి పేర్లు రయించ, ప్రాణంచ. అవి రయి, ప్రాణ. అవి రెండూ విభిన్న వస్తువులు కావు; చూడటానికి విభిన్నంగా ఉన్నట్టు కనిపించినా, అవి కలిస్తేనే ఆ వస్తువు పూర్ణం అవుతుంది. ప్రజాపతి లోకసృష్టి, కాలసృష్టి, అన్నసృష్టి, మనుష్యసృష్టి చేశాడని చెబుతాడు గురువు. ప్రజాపతి అంటే బ్రహ్మ. దీన్ని ఒక పట్టికలో చూద్దాము.

## సృష్టిప్రకరణం

| సృష్టి | 1 | 2 |
|---|---|---|
| 1. మిథునసృష్టి | రయి | ప్రాణ |
| | మూర్తప్రపంచం | అమూర్తప్రపంచం |
| 2. లోకసృష్టి | చంద్రుడు | ఆదిత్యుడు |
| 3. కాలసృష్టి | | |
| సంవత్సరం | దక్షిణాయనం | ఉత్తరాయణం |
| నెల | కృష్ణపక్షం | శుక్లపక్షం |
| రోజు | రాత్రి | పగలు |
| 4. అన్నసృష్టి–రేతస్సు | శోణితం | శుక్రం |
| 5. మనుష్యసృష్టి | స్త్రీ | పురుషుడు |

ఇ) **బృహదారణ్యకోపనిషత్ – మను, శతరూప జంట**

హిరణ్యగర్భ తాను అసంపూర్తిగా ఉన్నాననీ, తృప్తిగా లేననీ, తనకొక తోడు కావాలనీ సృష్టించాడు. అందువల్ల హిరణ్యగర్భే మనుష్యజంటగా ఉద్భవించాడు. అది కూడా ఒకరినొకరు కౌగలించుకుని ఉన్నట్టుగా ఉద్భవించారు. తన శరీరాన్ని రెండుగా పడేటట్టుగా చేశాడు. అందుకని వారు రెండు కాదు, ఒకటే. శంకరులు వారిని మనువు, శతరూప అని అన్నారు. వీరు రెండు చెక్కలుగా ఉన్న ఒక పప్పులా ఉన్నారు. తరువాత వారిని స్త్రీ, పురుషులుగా విడదీశాడు. వారినుంచి మనుష్యజాతి అంతా పుట్టింది. ఇది మనుష్యసృష్టి.

శతరూప మనువును అతను హిరణ్యగర్భ కాబట్టి తనకు తండ్రితో సమానం, అతనిని భర్తగా ఎలా భావించను అని ఆవుగా మారింది. మనువు ఎద్దుగా మారాడు. ఆమెతో కలవటంవల్ల గోసంతతి వచ్చింది. అలా ఆమె ఆడ గుర్రం అయితే, అతను మగ గుర్రం; ఆమె ఆడ గాడిద అయితే, అతను మగ గాడిద; ఆమె ఆడ మేక అయితే అతను మగ మేక; ఆమె గొర్రె అయితే అతను పొట్టేలు అయ్యాడు. ఆ విధంగా ఈ జగత్తులో చీమల వరకు ఏయే ప్రాణుల జంటలు కలవో, వాటిని అన్నింటినీ సృష్టించాడు.

ఎఫ్) **ముండకోపనిషత్ - 4 దశల్లో సృష్టి**

**తపసా చీయతే బ్రహ్మ తతో౽న్నమభిజాయతే।**
**అన్నాత్ప్రాణో మనః సత్యం లోకాః కర్మసు చామృతమ్॥** - 1.1.8

దశ 1 - బ్రహ్మ - కారణ అవస్థ ఒకటి
(అన్నం) ఈశ్వరుడు - కారణ అవస్థ రెండు
ప్రాణం, మనస్సు - సూక్ష్మ అవస్థ
సత్యం, లోకం - స్థూల అవస్థ

దీనితో లోకసృష్టి అయింది.

జ్వలిస్తున్న అగ్నినుంచి

**యథా సుదీప్తాత్ పావకాత్**
**విస్ఫులింగాః సహస్రశః ప్రభవంతే సరూపాః॥**

జ్వలిస్తున్న అగ్ని నుండి అదే స్వభావంగల వేలాది నిప్పురవ్వలు ఏ విధంగా ఉద్భవిస్తాయో, అలాగే అక్షరం బ్రహ్మనుంచి అనేక రకాలైన జీవాలు ఉద్భవించి, అందులోనే లయమవుతున్నాయి.

జి) **ఐతరేయోపనిషత్తు - కథారూపంలో**

స ఈక్షత లోకాన్ను సృజా ఇతి. లోకాలను సృష్టిస్తాను అనుకున్నాడు బ్రహ్మ. మామూలుగా లోకాలను 14 లోకాలుగా చూస్తాం, లేదా త్రిలోకాలుగా చూస్తాం. త్రిలోకాలు అంటే భూలోక, భువర్లోక, సువర్లోకాలు. కాని ఈ ఉపనిషత్తులో నాలుగు లోకాలను సృష్టించాడు అని వస్తుంది.

**అమ్భః పరేణ దివం ద్యౌః ప్రతిష్ఠా** - అంభః పరేణ దివం - స్వర్గలోకానికి పైన ఉన్న లోకాలు. స్వర్గంతో కలిపి ఐదు. వాటిని అంభః అంటున్నది.

**అంతరిక్షం మరీచయః** – అంతరిక్షం అంటే భువర్లోకం. అది మరీచీ.

**పృథివీ మరః** – భూలోకంలో ఎక్కువగా జనరాశి మరణిస్తారు.

**యా అధస్థాత్తా ఆపః** – కింద ఉన్న ఏడు లోకాలు.

దాని తరువాత బ్రహ్మ గోళకం, ఇంద్రియం, అధిష్ఠానదేవతలను జతలు, జతలుగా సృష్టించాడు.

దేవతల కోరిక మీదట వారికి మనుష్య శరీరం ఇచ్చి, ఎలా ప్రవేశించాలో నిర్దేశించాడు. ఆకలిదప్పులను అందరు దేవతలతోనూ ఉండమన్నాడు. అన్నాన్ని సృష్టిస్తే అన్నం పరుగు తీసింది. అన్ని అంగాలూ దాని వెంట పరుగు తీసినా, అపానం మాత్రమే పట్టుకోగలిగింది. ఇలా సృష్టి గురించి తమాషాగా, కథగా వస్తుంది.

హెచ్) **<u>కైవల్యోపనిషత్</u> – ఒక్క మంత్రంలో**

ఏతస్మాజ్జాయతే ప్రాణో మనః సర్వేంద్రియాణి చ।
ఖం వాయుర్జ్యోతిరాపశ్చ పృథ్వీ విశ్వస్య ధారిణీ॥ - 15

అక్షరాలా ఇదే మంత్రం ముండకోపనిషత్తులో కూడా వస్తుంది. ఇక్కడ మొత్తం సృష్టి రాదు. ముఖ్యమైనవి మాత్రం చెప్పబడ్డాయి. ముందు రెండవ పాదం చూద్దాం.

**ఖం వాయుర్జ్యోతిరాపశ్చ పృథ్వీ విశ్వస్య ధారిణీ** – వరుసక్రమంలో ఆకాశం, వాయువు, అగ్ని, నీరు, భూమి అన్నీ ఈశ్వరుడినుంచి ఉద్భవించాయి.

**ప్రాణో మనః సర్వేంద్రియాణి చ** – పంచప్రాణాలు, నాలుగు అంతఃకరణలు, పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు వచ్చాయి. ఇది వ్యష్టి పరంగా సృష్టి.

ఐ) **మాండూక్యోపనిషత్ – అజాతివాదము సత్యము**

మాండూక్యోపనిషత్ అసలు సృష్టే జరగలేదు పొమ్మంటుంది. ఒకవేళ జరిగింది అనాలంటే మిథ్యాజగత్తు పుట్టింది అనాలి అంటారు.

**మిథ్యా జగత్తు పుట్టింది అంటే అది మిథ్యా సృష్టివాదము**
**నిజం జగత్తు పుట్టలేదు అంటే అది అజాతివాదము అవుతుంది.**

పేరేదైనా అర్థం ఒకటే అంటారు గౌడపాదాచార్యులవారు.

జె) **అనుప్రవేశ శ్రుతి** – సృష్టి ప్రకరణం గురించి చూసినప్పుడు ఒక విషయం మర్చిపోకూడదు. భగవంతుడు జగత్కారణం అంటే ఉపాదాన కారణమా, నిమిత్త కారణమా? రెండూ అంటుంది శాస్త్రం.

అభిన్న నిమిత్త ఉపాదాన కారణం బ్రహ్మ

**స ఈక్షత లోకాన్ను సృజా ఇతి।** - ఐతరేయం

**సోఽ కామయత బహు స్యాం ప్రజాయేయేతి।**
**తదైక్షత బహు స్యాం ప్రజాయేయేతి॥** - ఛాందోగ్యం

స ఈక్షత, సోఽ కామయత, తదైక్షత పదాలు నిమిత్త కారణాన్ని సూచిస్తే, బహుస్యాం ప్రజాయేయేతి ఉపాదాన కారణాన్ని సూచిస్తాయి.

అనుప్రవేశ శ్రుతి కూడా ఉపాదాన కారణాన్ని సూచిస్తాయి.

**తత్సృష్ట్వా తదేవానుప్రావిశత్।**
**స ఏతమేవ సీమానం విదార్యైతయా ద్వారా ప్రాపద్యత॥** - ఐతరేయం

**స ఏష ఇహ ప్రవిష్టః॥** - బృహదారణ్యకం

### సృష్టి గురించి అపవాద ప్రక్రియ

ఎ) **కైవల్యోపనిషత్**

దీన్ని కైవల్యంలో చాలా తేలికగా చూస్తాము. ముందేమో 15వ మంత్రంలో పంచభూతాలూ, వ్యష్టిలోని 19 అంగాలు వచ్చాయని చెబుతుంది. అది అధ్యారోపం.

23, 23 మంత్రాల్లో వీటిని నిషేధిస్తుంది.

**న పుణ్యపాపే మమ నాస్తి నాశో న జన్మ దేహేంద్రియబుద్ధిరస్తి** - 22

**న భూమిరాపో న చ వహ్నిరస్తి న చాఽనిలో మేఽస్తి న చాంబరం చ** - 23

శుద్ధచైతన్యంగా నాకు పుణ్యపాపాలు లేవు; నాకు శరీరం లేదు; మనస్సు, బుద్ధి లేవు. నాకు జన్మ లేదు, మరణం లేదు. పారమార్థిక స్థాయికి ఎదిగితే, పంచభూతాలు కూడా లేవు. జగత్తు వ్యావహారిక స్థాయికి చెందినది.

బి) **ఛాందోగ్యోపనిషత్**

ఛాందోగ్యోపనిషత్‌లో మూడు భూతాలనుంచి సృష్టి వచ్చిందని చూశాము. అది అధ్యారోపం. అపవాదంలో **త్రీణి రూపాణీత్యేవ సత్యమ్** ద్వారా చూపిస్తున్నది.

త్రీణిరూపాణి అంటే మూడు రంగులు. అవి ఎరుపు, తెలుపు, నలుపు. అవి వరుసగా సూక్ష్మఅగ్ని, సూక్ష్మజలం, సూక్ష్మపృథివీని సూచిస్తాయి. అందువల్ల త్రీణిరూపాణీత్యేవ సత్యం అంటే మూడు సూక్ష్మభూతాలే సత్యం. దీన్నుంచి మనం ఇంకొంచెం వెనక్కి వెళ్ళాలి.

ఈ మూడు సూక్ష్మభూతాలు కూడా మూలకారణం కాదు, వాటి మూలకారణం ఏమిటి సత్‌బ్రహ్మ.

ఈ దశలను చూపించటానికి ఉపనిషత్తు స్థూలప్రపంచంలోంచి నాలుగు ఉదాహరణలు తీసుకుంది. అవి అగ్ని, సూర్యుడు, చంద్రుడు, విద్యుత్తు. మనం సూర్యుని ఉదాహరణ చూద్దాం. సూర్యుడు ఉదయిస్తున్నప్పుడు కనిపించే ఎర్రని రంగు అగ్ని రూపాన్ని, తెల్లని రూపం నీటిని, నల్లనిచుక్కలు సూక్ష్మపృథివీ సూచిస్తాయి. ముందు సూర్యుని ఒక కార్యంగా స్వీకరించాము. ఇప్పుడు సూర్యునిలో ఉన్న మూడు రంగులు మూడు సూక్ష్మభూతాలు తప్ప ఏవీ కావు.

ఇందాకటి దశలు చూస్తే - త్రీణి రూపాణి అంటే సూక్ష్మభూతాలు.

అవి కూడా సత్యం కాదు, బ్రహ్మ మాత్రమే సత్యం.

బ్రహ్మ సత్యం, జగత్ మిథ్య

తక్కిన ఉదాహరణలకూ ఇవే దశలు. శరీరపరంగానూ ఇవే దశలు. వ్యష్టిపరంగా మనస్సు, ప్రాణం, వాక్కుల విషయంలో చూస్తాము. ఈ మూడు వరుసగా పృథివీ తత్త్వం, జలతత్త్వం, అగ్నితత్త్వాలనుంచి వచ్చిన కార్యాలు. దీన్నుంచి తక్కిన దశలకు వెళ్ళాలి.

శరీరం కార్యం, స్థూలభూతాలు కారణం
స్థూలభూతాలు కార్యం, సూక్ష్మభూతాలు కారణం
సూక్ష్మభూతాలు కార్యం, బ్రహ్మ కారణం

అందువల్ల బ్రహ్మ సత్యం, జగత్ మిథ్య

సి) **బృహదారణ్యకోపనిషత్ – సత్యస్య సత్యం**

అధ్యారోప అపవాద ప్రక్రియ ద్వారా బ్రహ్మ సత్యం, జగత్తు మిథ్య అని చూపిస్తుంది.

సత్యస్య సత్యాన్ని రెండవ అధ్యాయంలో 3, 4 బ్రాహ్మణాలలో చూస్తాము.

సత్యం అంటే వ్యావహారిక సత్యం; సత్యస్య సత్యం అంటే వ్యావహారిక సత్యానికి సత్యం. అంటే పారమార్థిక సత్యం. వ్యావహారిక సత్యాన్ని మళ్ళీ రెండుగా విభజించవచ్చు. అవి వ్యష్టి, సమష్టి.

**అధ్యారోపం** – శిశుబ్రాహ్మణంలో వ్యష్టి వ్యవహారిక సత్యం కింద ప్రాణం గురించి చూస్తాము. ప్రాణం స్థూల, సూక్ష్మశరీరాలకు ప్రతీక. ఇంకో విధంగా చెప్పాలంటే మూర్తామూర్త శరీరాలు. ఈ వ్యష్టిని ప్రాణ ఉపాసన ద్వారా వివరించింది ఉపనిషత్తు. వ్యష్టి పరంగా

చూస్తే అది అధ్యాత్మం. సత్యస్య సత్యం అనే నిర్వచనంలోని మొదటి సత్యం అర్థం చేసుకుని మూడవ బ్రాహ్మణానికి వెళ్ళాలి.

ఇప్పుడు మూర్తామూర్త బ్రాహ్మణంలో సమష్టి పరంగా చూస్తాము. దీన్ని అధిదైవస్థాయి అంటారు. అధిదైవస్థాయిలో ఆకాశం, వాయువు అమూర్తప్రపంచం; అగ్ని, జలం, పృథివి మూర్తప్రపంచం. వీటిని సత్యం అంటుంది ముందు. దీన్ని అధ్యారోపం అంటారు. తరువాత వీటిని నేతినేతి పద్ధతిద్వారా సత్యం కాదని నిరూపిస్తుంది. దీన్ని అపవాదం అంటారు. అపవాదంలో సత్యస్య సత్యంలోని మొదటి సత్యాన్ని తిరస్కరించటంద్వారా రెండవ సత్యాన్ని నిలబెట్టాలి. నేతినేతిద్వారా స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలను, స్థూల, సూక్ష్మ, కారణ ప్రపంచాలను కొట్టివేస్తే మిగిలేది ఆత్యంతిక సత్యం.

**ప్రాణా వై సత్యం తేషామేష సత్యమ్** - బ్రహ్మ సత్యంయొక్క సత్యం. అంటే ప్రాణం వ్యావహారిక సత్యం అయితే, బ్రహ్మ ఈ సత్యానికి సత్యం.

డి) **మాండూక్యోపనిషత్ - అజాతివాదము సత్యము**

**కార్యపరంగా** - స్వప్నంనుంచి లేస్తే స్వప్నం మిథ్య; జాగ్రదావస్థనుంచి స్వప్నానికి వెళితే జాగ్రత్ ప్రపంచం మిథ్య. ఈ రెండు ప్రపంచాలూ మిథ్య - ఇది మిథ్యాసృష్టివాదము.

**కారణపరంగా** - తురీయం బ్రహ్మ అద్వైతం, నిర్వికారం
నిర్వికారం బ్రహ్మ కారణం కాలేదు. కారణం కావాలంటే అది సవికారం అవ్వాలి.
బ్రహ్మ కాలాతీతం; కార్య-కారణాలు కాలంలో జరగాలి.
అందువల్ల నిజంగా సృష్టి జరుగలేదు - ఇది అజాతివాదము.

**కార్యకారణ సంబంధం పరంగా** - జగత్తుకు-బ్రహ్మకు కార్యకారణ సంబంధం నాలుగు విధాలుగా లేదు.
ఎ) అసత్ వస్తువునుంచి అసత్ వస్తువు రాలేదు
బి) అసత్ వస్తువునుంచి సత్ వస్తువు రాలేదు
సి) సత్ వస్తువునుంచి సత్ వస్తువు రాలేదు
డి) సత్ వస్తువునుంచి అసత్ వస్తువు రాలేదు

**సత్ వస్తువునుంచి సత్ వస్తువు రాలేదు** - కార్యకారణ సంబంధం ఉండాలంటే రెండు భిన్నవస్తువులు, విడిగా ఉనికి ఉన్నవి ఉండాలి. కుండ మట్టినుంచి వచ్చినా, కుండకు విడిగా ఉనికి లేదు. అంటే మట్టి, కుండ రెండు పేర్లు కాని వస్తువు ఒకటే.

**అందువల్ల జగత్ మిథ్య, బ్రహ్మ సత్యం - ఇది అద్వైతం**

6) **గతి సామాన్యదర్శనం - జీవో బ్రహ్మైవ నాఽపరః** మహావాక్యం. గతిసామాన్యదర్శనం అంటే ఏ ఉపనిషత్తు తీసుకున్నా దాని సారం ఒకటే.

**వేదాంతసారం - బ్రహ్మ సత్యం జగన్మిథ్యా**
**జీవో బ్రహ్మైవ నాఽపరః**

ముందు రెండవ వాక్యాన్ని చూద్దాము. ఇది మహావాక్యాన్ని సూచిస్తుంది. జీవ ఈశ్వర ఐక్యాన్ని సూచించేది మహావాక్యం. అది తెలియటానికి నాలుగు మహావాక్యాలను ప్రసిద్ధి చెందేలా చేశారు ఆచార్యులు. అవి చూద్దాము ముందు. చెప్పేది ఒకటే అంశం అయినా చెప్పే విధానంలో విశేషం కనబడుతుంది.

ఎ) **అహం బ్రహ్మ అస్మి - బృహదారణ్యకోపనిషత్**

**బ్రహ్మ వా ఇదమగ్ర ఆసీత్। తదాత్మానమేవావేత్। అహం బ్రహ్మాస్మీతి। తస్మాత్తత్సర్వమభవత్**

అగ్రే - అజ్ఞాన అవస్థలో
**సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్ -** ఛాందోగ్యోపనిషత్
**ఆత్మా వా ఇదమేకమ్ ఏవాగ్ర ఆసీత్** - ఐతరేయోపనిషత్

ఈ రెండు చోట్ల అగ్రే అంటే సృష్టికి పూర్వం. కాని ఈ మంత్రంలో అగ్రే అంటే అజ్ఞాన అవస్థలో ఉన్నప్పుడు అని అర్థం.

**బ్రహ్మైవ ఆసీత్** - బ్రహ్మ మాత్రమే ఉన్నాడు.

ఎలా ఉన్నాడు?

ఇదమ్ - జీవాత్మ చైతన్యంగా ఉన్నాడు.

అందువల్ల బ్రహ్మే జీవాత్మ రూపంలో ఉన్నాడు.

**తదాత్మానమ్ అవేత్** - బ్రహ్మ తన గురించి తెలుసుకున్నాడు.

**ఏవ -** తనను తాను. అంటే శరీరవ్యతిరిక్త ఆత్మను. శుద్ధ ఆత్మ అన్నా, కేవల ఆత్మ అన్నా, లక్ష్యార్థ ఆత్మ అన్నా, సాక్షిచైతన్యం అన్నా ఒకటే. తాను కార్యకరణసంఘాతానికి విలక్షణంగా ఉన్న ఆత్మ అని తెలుసుకున్నాడు.

ఏం తెలుసుకున్నాడు?

**అహం బ్రహ్మ అస్మి ఇతి -** నేను బ్రహ్మను, అజ్ఞాన అవస్థలో ఉండి, సంసారి, జీవిగా కనబడుతున్న నేను, సాక్షాత్తూ బ్రహ్మనే.

**తస్మాత్ –** అందువల్ల; అహం బ్రహ్మాస్మి జ్ఞానం పొందటంవల్ల ఏమయింది?

**సర్వమ్ అభవత్ –** ఆ బ్రహ్మ సర్వం తానే అయ్యాడు. లేదా, జీవాత్మరూపంలో ఉన్న ఆ బ్రహ్మ. బ్రహ్మజ్ఞానం పొందటంవల్ల సర్వాత్మభావనను పొందాడు.

బి) **తత్త్వమసి శ్వేతకేతో – ఛాందోగ్యోపనిషత్**

1. జగత్తు = సత్‌బ్రహ్మ + నామరూపాలు.
2. సత్ జగత్తంతటికీ ఆత్మ. సత్‌బ్రహ్మ అధిష్ఠానం. సత్‌బ్రహ్మ సారం.

మనం మట్టికుండ అంటున్నాము. కుండను సత్యం చేసి మట్టిని దానికి విశేషణంగా వాడుతున్నాము. నిజానికి కుండగా ఉన్న మట్టి అనాలి. అలాగే ఉనికి ఉన్న జగత్తు అంటున్నాము. జగత్తును సత్యం చేసి, ఉనికిని దానికి విశేషణంగా వాడుతున్నాము. నిజానికి జగత్తుగా ఉన్న ఉనికి అనాలి. అందువల్ల జగత్తుకు ఆత్మ బ్రహ్మ. అంటే జగత్తు అధిష్ఠానం బ్రహ్మ.

3. బ్రహ్మ జగత్తుకు అధిష్ఠానం అంటే బ్రహ్మ లేకుండా జగత్తుకు విడిగా ఉనికి లేదు. అందువల్ల బ్రహ్మ సత్యం, జగత్ మిథ్య.

4. బ్రహ్మే జగత్తంతా అనేక నామరూపాలతో ఉంది. ఉదాహరణకు భూలోక సత్తా, భువర్లోక సత్తాగా ఉంది.

5. అందువల్ల సత్ విజ్ఞానేన సర్వం విజ్ఞానం భవతి.

అలా అయితే సత్ విజ్ఞానం పొందటం ఎలా?

ఈ ప్రశ్నలో అర్థం లేదు. బ్రహ్మను ఎప్పుడు అనుభవించటం లేదు? సర్వదా బ్రహ్మ అనుభవం ఉంది. అన్నివేళలా, అన్ని చోట్లా బ్రహ్మ అనుభవం ఉంది. నిజానికి వేదాంతం మనకు సవాలు విసురుతున్నది. సరే బ్రహ్మను చూస్తానంటున్నావు కదా, బ్రహ్మను తప్పించుకోవటానికి ప్రయత్నం చేయి. బ్రహ్మను తప్పించుకోవాలంటే ఉనికి లేని వస్తువులను అనుభవించాలి. నామరూపాలు మారుతాయి కాని ఉనికి ఉంటుంది. ఇంగ్లీషులో ఒక బుక్ ఈజ్, టేబుల్ ఈజ్, పెన్ ఈజ్ అని చెపుతూ వస్తాము. పేర్లు మారాయి కాని ఈజ్, ఈజ్, ఈజ్ ఉంటూనే వస్తుంది. ఈజ్‌నెస్ మారదు. ఆ ఈజ్‌నెస్సే బ్రహ్మ. అందువల్ల బ్రహ్మను అన్ని వేళలా అన్నిచోట్లా అనుభవిస్తూనే ఉన్నాము. నిర్గుణబ్రహ్మను చూడటం ఎలా?

అయినా మనకు తృప్తి లేదు. నేను అనుభవిస్తున్నది నామరూపాలతో ఉన్న బ్రహ్మను. సగుణ బ్రహ్మను. నాకు శుద్ధ చైతన్యాన్ని, నిర్గుణబ్రహ్మను అనుభవించాలని ఉంది. నిర్గుణ, నిరుపాధిక, నిర్విశేష బ్రహ్మను చూడాలని ఉంది. కనీసం కొంచెంగానన్నా చూడాలి.

**తత్త్వమసి**

నిర్గుణబ్రహ్మను వస్తువుగా చూడలేము. అనుభవం నామరూపాలతో అవుతుంది.

జగత్= సత్‌బ్రహ్మ+నామరూపాలు
సత్‌బ్రహ్మ= జగత్–నామరూపాలు

సత్‌బ్రహ్మను చూడాలంటే నామరూపాలు తీసేయాలి. ఎలా తీయాలి? నామరూపాల జగత్తును ఇంద్రియాలనే ప్రమాణంతో చూస్తాము. ఇంద్రియాలనే ప్రమాణాలను తీసేయాలి. ఎన్నో లైట్లు వెలుగుతున్న గదిని చీకటిగా చూడాలనుకున్నారనుకోండి. ఏం చేస్తారు? దానికి రెండు పద్ధతులు ఉన్నాయి. ఒకటి ఒక్కోలైటూ ఆర్పుకుంటూ రావటం. ఇంకోటి మీరే కళ్ళు మూసుకోవటం. అప్పుడు చీకటి మిగులుతుంది. చీకటి నాకు తెలియటం లేదే? అయితే చూడు, చూడాలంటే కళ్ళు తెరవాలి. కళ్ళు తెరిస్తే చీకటిని చూడలేవు.

అలాగే నిర్గుణ బ్రహ్మను చూడాలంటే ప్రమాణాలు వాడలేము.అందుకే అశబ్దం, అస్పర్శం, అరూపం అన్నారు. నిర్గుణబ్రహ్మను ఎన్నటికీ అనుభవించలేము. ప్రమాణం వాడితే అది సగుణం బ్రహ్మ అవుతుంది. ప్రమేయరూపం వస్తుంది

సి) **తత్త్వమేవ త్వమేవ తత్** – కైవల్యోపనిషత్

తత్ ఏవ త్వం – ఆ బ్రహ్మ నువ్వే; త్వమ్ ఏవ తత్ – నువ్వే ఆ బ్రహ్మవు.ఆ బ్రహ్మవు నువ్వే. నువ్వే ఆ బ్రహ్మవు అని మళ్ళీ తిరగేసి చెప్పటంలో రెండు సూక్ష్మమైన వివరణలున్నాయి.

1. కొన్ని వాక్యాలను తిరగేసి చెప్పలేము. ఉదాహరణకు **భారతదేశంలో పుట్టిన ప్రతి ఆంధ్రుడూ భారతీయుడే.** ఈ వాక్యాన్ని తిరగేసి చెప్పలేము. ప్రతి ఆంధ్రుడూ భారతీయుడు అవుతాడు కాని ప్రతి భారతీయుడూ ఆంధ్రుడు కాడు. తమిళుడు కావచ్చు, పంజాబీ కావచ్చు, గుజరాతీ కావచ్చు, మరేదైనా రాష్ట్రానికి చెందిన వాడు కావచ్చు.

2. జీవాత్మ పరమాత్మ అంటే అది అంశ, అంశి సంబంధం కావచ్చు. అంటే జీవాత్మ పరమాత్మలో ఒక భాగం అని పొరపడే అవకాశముంది. అంశ అంశి భావాన్ని నిరాకరించడం కోసం చెప్పబడింది. ఇలా తిరగేసి చెప్పటంలో ఇంకో అంతరార్థం జీవాత్మ, పరమాత్మ పూర్తిగా ఒకటే అని చెప్పటం.

డి) **అయమాత్మా బ్రహ్మ** – మాండూక్యోపనిషత్

అయమాత్మా బ్రహ్మ. ఇదొక మహావాక్యం. బ్రహ్మ అంటే వేరే ఏమిటో కాదు,

ఈ ఆత్మే. ఈ మంత్రంలోనే రెండు ఈక్వేషన్లు వచ్చాయి.

సర్వం = బ్రహ్మ; బ్రహ్మ = ఆత్మ; అందువల్ల సర్వం = ఆత్మ.

చూడటానికి రెండు భిన్న విచారణలుగా కనిపిస్తున్నా రెండింటి గమ్యం ఒకటే. అందువల్ల ఓంకార విచారణను, ఆత్మ విచారణతో పోల్చి చేస్తాము. అందువల్ల ముందు ఆత్మ విచారణను పరిచయం చేస్తున్నది ఉపనిషత్తు.

**చతుష్పాద ఆత్మ విచారణ: మంత్రాలు 3-7**

ఐదు మంత్రాలు ఆత్మయొక్క నాలుగు పాదాల గురించి వివరిస్తాయి. ఆత్మ అంటే ఎవరో కాదు, నేను.

ఎ) **మంత్రం 3** - ఈ మంత్రం స్థూల ఆత్మను వివరిస్తుంది. ఈ ఆత్మ జాగ్రదవస్థలో, జాగ్రత్ ప్రపంచంలో వ్యవహారం నడుపుతుంది. అందువల్ల అది బహిష్ప్రజ్ఞః. ఈ జంట పేరు విశ్వ-విరాట్.

బి) **మంత్రం 4** - ఈ మంత్రం సూక్ష్మ ఆత్మను వివరిస్తుంది. ఈ ఆత్మ స్వప్నావస్థలో, స్వప్నప్రపంచాన్ని చూస్తుంది. అందువల్ల అది అంతఃప్రజ్ఞ. ఈ జంట పేరు తైజస- హిరణ్యగర్భ.

సి) **మంత్రాలు 5, 6** - ఈ మంత్రాలు కారణ ఆత్మను వివరిస్తాయి. ఈ ఆత్మ సుషుప్తి అవస్థలో, కారణ శరీరంలో లయమవుతుంది. ఏమీ కార్యక్రమాలు ఉండవు కాబట్టి ప్రజ్ఞానఘనః. ఈ జంట పేరు ప్రాజ్ఞ-ఈశ్వర.

ఈ విధంగా ఈ మూడు పాదాలు గుణాలున్న ఆత్మను వివరిస్తాయి.

తురీయమైన నేను బహిష్ప్రజ్ఞ కాదు, అంతఃప్రజ్ఞ కాదు, ఘనఃప్రజ్ఞ కాదు అంటే ఈ విశ్వ, తైజస, ప్రాజ్ఞలను కాదు. అవి నేను వేసుకున్న వేషాలు. ఆ విధంగా ప్రమాతృత్రయ విలక్షణమ్. **ప్రమేయత్రయ విలక్షణమ్** -

పంచజ్ఞానేంద్రియాలకు, పంచకర్మేంద్రియాలకు, అనుమాన ప్రమాణానికి, మనోవృత్తికి, వాక్కుకి అందదు. అంటే సర్వప్రమాణ అగోచరమ్. ఆ విధంగా **ప్రమాణత్రయ విలక్షణమ్.**

**ప్రమాతృప్రమేయత్రయ అధిష్ఠానమ్** -

**ఏకాత్మప్రత్యయసారం ప్రపంచోపశమం శాంతం శివమద్వైతం చతుర్థం మన్యంతే స ఆత్మా స విజ్ఞేయః॥**

ఇ) **అయమాత్మా బ్రహ్మ** - బృహదారణ్యకమ్

మాండూక్యంలో వచ్చిన మహావాక్యమే బృహదారణ్యకంలో కూడా వచ్చింది.

**అయమాత్మా బ్రహ్మ** - ఇది ఒక మహావాక్యం. ఆ బ్రహ్మను నేను. ఇది సంపూర్ణమైన బోధ. వేదాంతసారమంతా ఒక్క వాక్యంలో వచ్చేసింది.

అయమాత్మా బ్రహ్మ - మాండూక్యం

మాండూక్యంలో కూడా ఇదే వాక్యం వచ్చింది. ఇది బ్రహ్మను, జీవాత్మ, పరమాత్మ ఐక్యాన్నీ కూడా వివరించింది.

అయమాత్మా బ్రహ్మ అనే మహావాక్యాన్నిచ్చి, ఉపనిషత్తే బ్రహ్మను, ఆత్మను వివరిస్తున్నది.

అపూర్వం, అనంతరం, అనపరం, అబాహ్యం బ్రహ్మ అంది. ఇదొక అద్భుతమైన నిర్వచనం బ్రహ్మకు.

**సత్యం జ్ఞానమ్ అనంతం బ్రహ్మ - తైత్తిరీయం**

తైత్తిరీయంలోని ఆ నిర్వచనానికి దీటుగా నిలుస్తుంది ఈ నిర్వచనం. శంకరులవారు తరచు ఈ రెండూ ఉటంకిస్తుంటారు. బ్రహ్మ కారణం కాదు, కార్యం కాదు; బ్రహ్మ బయటా లేదు, బ్రహ్మ లోపలా లేదు. ఇదే నిర్వచనాన్ని ఇంకో విధంగా చెప్పాలంటే సజాతీయ, విజాతీయ, స్వగతభేదరహితం బ్రహ్మ.

**సదేవ ఇదమగ్ర ఆసీత్** - ఐతరేయం

ఆత్మ నిర్వచనం ఏమిటి?

**సర్వానుభూః** - ఈ ఆత్మయే సర్వాన్ని అనుభవిస్తుంది.

**ఆత్మ = చైతన్యరూపం**

**బ్రహ్మ = సజాతీయ విజాతీయ స్వగతభేదరహితం**

అందువల్ల ఆత్మ = బ్రహ్మ. చైతన్యరూపమైన ఆత్మే సజాతీయ, విజాతీయ స్వగతభేదరహితమైన బ్రహ్మ. ఆ విధంగా జీవాత్మ పరమాత్మ ఐక్యం వచ్చింది. ఇది మధువిద్యా బోధ. సర్వాత్మ భావనను బోధిస్తున్నాడు. ఇదే భావనను మైత్రేయీ బ్రాహ్మణంలో కూడా చూస్తాము.

ఎఫ్) **ప్రజ్ఞానం బ్రహ్మ - ఐతరేయోపనిషత్**

**కోఽయమాత్మేతి? కతరః స ఆత్మా** - నేను ఎవరు? ఈ రెండింటిలో ఏది ఆత్మ? బ్రహ్మరంధ్రం ద్వారా పరమాత్మ ప్రవేశించాడు. అరికాలినుంచి హిరణ్యగర్భ ప్రవేశించాడు. ఏది అసలు ఆత్మ? చిద్రూప పరమాత్మనా, చిదాభాసరూప హిరణ్యగర్భనా?

కో౽హమితి – నేను శరీరం కాను, నేను ఇంద్రియాలను కాను, నేను మనస్సు కాను. అవి నేను కాకపోతే నేనెవరిని అని మనిషి ఎప్పుడో ఒకప్పుడు ప్రశ్నించుకోకపోతాడా అని పరమాత్మ అనుకుంటాడని రెండవ అధ్యాయంలో చూశాము. సరిగ్గా అలాగే చర్చ జరుగుతుంది మూడవ అధ్యాయంలో. సూక్ష్మశరీరంలో ఉన్న ఏ అంగమూ కూడా ఆత్మ కాదు. ఎందుకు? అవి ప్రమాణాలు కాబట్టి, మార్పు చెందుతాయి కాబట్టి. శరీరం, ఇంద్రియాలు, మనస్సు, ఇవేవీ నేను కాకపోతే, నేను ఎవరు? వీటిని సాక్షిగా చూస్తున్నది ఒకటి ఉంది. అదే సాక్షిచైతన్యం. ఇక్కడ ప్రజ్ఞానం అన్నది ఉపనిషత్తు. చైతన్యాన్ని ఎలా తెలుసుకోవాలి?

చైతన్యం + వృత్తి = అనుభవం
చైతన్యం = అనుభవం - వృత్తి

అనుభవంలోంచి వృత్తిని తీసేస్తే మిగిలేది చైతన్యం మాత్రమే.

మారే అనుభవాలు – మారే వృత్తులు = మారని చైతన్యం.

మారే చైతన్యం అనకూడదు. ఇక్కడితో త్వం పదార్థ విచారణ ముగిసింది.

**ప్రజ్ఞానం బ్రహ్మ** – ప్రతి వృత్తి వెనకనున్నది ఈ చైతన్యం. అదే బ్రహ్మ. ఆత్మ = బ్రహ్మ అని ముందే చూశాము. ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్. ఈ బ్రహ్మ ఎక్కడ ఉందో ఒక పెద్ద పట్టికనే ఇచ్చింది ఉపనిషత్. సీమటపాకాయ టపాటపా మ్రోగినట్టు, గడగడా ఒక పెద్ద పట్టిక వస్తుంది. ఈ బ్రహ్మే చతుర్ముఖ బ్రహ్మ, ఇంద్రుడు, ప్రజాపతి, దేవతలు, పంచభూతాలు, జీవరాశులు, మనుష్యులు, జంతువులు, వృక్షాలు, క్రిమికీటకాలు, పక్షులు అన్నింటిలోనూ ఉంది. ఇది తత్ పదార్థ విచారణ.

**సర్వం తత్ప్రజ్ఞానేత్రమ్** – ఉన్నదంతా ప్రజ్ఞానేత్రం. మొత్తం జగత్తుకు ఉనికిని ఇస్తున్నది ప్రజ్ఞానం. అంటే ప్రజ్ఞానం లేకుండా జగత్తుకు విడిగా ఉనికి లేదు. బ్రహ్మ చైతన్యం సత్యం జగన్మిథ్యా.

**ప్రజ్ఞానే ప్రతిష్ఠితమ్** – జడమైన జగత్తుకు ప్రజ్ఞానం సత్తా ప్రదాత. కారణం కార్యం అంతటా ఉంటుంది.

ఇటువంటి ప్రజ్ఞానాలు ఎన్ని? ఒకటే. నేను ప్రజ్ఞానం, నేను చైతన్యాన్ని, నేను సజాతీయ, విజాతీయ, స్వగత భేదరహితం బ్రహ్మను. **అహం బ్రహ్మ అస్మి.** అసి పదార్థం అర్థం కూడా వచ్చింది.

**జి) జీవ ఈశ్వర ఐక్యం - ముండకోపనిషత్**

ముందు మంత్రం (11వ మంత్రం) ఆత్మ ఆబ్జెక్ట్ కాదు. తెలుసుకోబడే వస్తువు కాదు. తెలుసుకోవటానికి ప్రయత్నించే నువ్వే అంటోంది.

**మొదటి గెంతు - నేను = ఆత్మ.**

సరే నేను ఆత్మను అని ఒప్పుకున్నా కూడా, అంతకు ముందు మంత్రం (10వ మంత్రం) ఆత్మను తెలుసుకున్న వాడు బ్రహ్మను తెలుసుకున్నట్టు అంది.

ఎ = బి; బి = సి; అందువల్ల ఎ = సి సూత్రం ప్రకారం

నేను = ఆత్మ; ఆత్మ = బ్రహ్మ; అందువల్ల నేను = బ్రహ్మ

అంటే మనచేత రెండో గెంతు గెంతిస్తోంది.

**రెండవ గెంతు - నేను = బ్రహ్మ.**

ఈ గెంతు గెంతితే సరిగా నిల్చోలేము అనుకుంటే ఇక్కడ ఇంకో పెద్ద గెంతు గెంతిస్తోంది. ముందు ఖండంలో (ముందు మంత్రంలో కాదు) బ్రహ్మ జగత్కారణం అంది. మళ్ళీ వరుసగా చూసుకుంటూ పోతే తేలేది ఏమిటి?

నేను = జగత్కారణం.

నేను = ఆత్మ; ఆత్మ = బ్రహ్మ; బ్రహ్మ = జగత్ కారణం, అందువల్ల నేను = జగత్కారణం.

నేను అన్నప్పుడల్లా ఆ నేను ఎవరన్నది మర్చిపోకూడదు. నేను శరీరం కాదు. ఇంద్రియాలు కాదు. మనసు కాదు. నేను అంటే ఆత్మ. అంటే నేను = జగత్ కారణం.

**మూడవ గెంతు - నేను = జగత్ కారణం.**

హే గురో ఇదంతా నాకు కొరుకుడు పడటం లేదు అంటే నువ్వు స్వప్నప్రపంచంలో చేస్తున్నది అదే అంటోంది. స్వప్నంలో ఉన్నంతసేపూ అది నువ్వు సృష్టించిందని తెలియదు. స్వప్నంలోంచి లేచాకే తెలుస్తుంది. అలాగే జాగ్రత్ ప్రపంచం ఇంకో కలలాంటిది.

ఇంకా మన గెంతులు పూర్తికాలేదు. మోకాళ్ళ నొప్పితో నడవటమే కష్టమైన మనను ఏకంగా పెద్ద గెంతులే గెంతిస్తోంది ఉపనిషత్తు.

అన్ని కార్యాలూ, కారణానికి నామరూపాలు. అంటే కారణమే కార్యంగా భాసిల్లుతోంది. బంగారమే నామరూపాలున్న ఆభరణాలుగా భాసిల్లుతోంది. ఉన్నదంతా ఒకటే. ద్వితీయం ఉంటేనే భయం. ద్వితీయం లేకపోతే దేన్ని చూసి భయం? అంటే జగత్కారణం కార్యమంతటా ఉంది.

**నాలుగవ గెంతు – నేను = కార్యమంతటా భాసిల్లుతున్న జగత్కారణం**

ఇప్పుడు మంత్రంలోకి వెళ్దాము.

**బ్రహ్మైవేదమమృతం పురస్తాత్** – కారణం బ్రహ్మ అయిన నేనే ముందున్న జగత్తు.

**బ్రహ్మ పశ్చాత్** – కారణ బ్రహ్మ అయిన నేనే వెనుకనున్న జగత్తు.

**బ్రహ్మ దక్షిణతశ్చోత్తరేణ** – దక్షిణం వైపు, ఉత్తరం వైపు.

**అధ శ్చోర్ధ్వం చ ప్రసృతమ్** – నేనే పైనా, కిందా, సర్వత్రా

**బ్రహ్మైవేదం విశ్వమిదం వరిష్ఠమ్** – ఒక్కముక్కలో చెప్పాలంటే మొత్తం జగత్తులో నేనే శ్రేష్ఠమైన బ్రహ్మగా నెలకొని ఉన్నాను.

మొదటి పాదంలో అమృతం అనీ, ఆఖరిపాదంలో వరిష్ఠం అనీ వచ్చింది. రెండూ బ్రహ్మకు విశేషణాలు. అనేకం, అనిత్యం, అసారం, అసత్య ప్రపంచం అంతటా ఏకం, నిత్యం, సారం, సత్యమైన కారణం ఉంది. ఆ కారణం నేనే.

పై దశలన్నీ కలిపి ఒకసారి చూస్తే –

నేను = ఆత్మ; ఆత్మ = బ్రహ్మ; బ్రహ్మ = జగత్కారణం; జగత్కారణం = జగత్ కార్యమంతటా.

అందువల్ల జగత్కారణం బ్రహ్మనైన నేను (శరీరం, ఇంద్రియాలు, మనసు కాదు, ఆత్మను) జగత్తు అనే కార్యమంతటా భాసిల్లుతున్నాను. ఏక,నిత్య,సార, సత్య కారణం నేను అనేక, అనిత్య, అసార, అసత్యకార్య ప్రపంచం అంతటా ఉన్నాను.

హెచ్) **మయ్యేవ సకలం జాతం – కైవల్యోపనిషత్**

> **మయ్యేవ సకలం జాతం । మయి సర్వం ప్రతిష్ఠితమ్ ।**
> **మయి సర్వం లయం యాతి । తద్బ్రహ్మాద్వయమస్మ్యహమ్ ॥** – 19

ఇది ఒక అద్భుతమైన మంత్రం. వేరే ఏ ఉపనిషత్తులోనూ ఇటువంటి మంత్రాన్ని చూడము. నేను కలలో ఉండగా అందులో ఒక జీవిని అనుకుంటాను. కాని కల నుంచి లేచాక నేనే ఆ కలకు సృష్టి, స్థితి, లయ కారకుడిని అని తెలుసుకుంటాను. కాని కలలో ఉండగా చెప్పలేను. కల నుంచి లేచాకే చెప్పగలను. అలాగే ఈ జాగ్రత్ ప్రపంచంలో ఉన్నంతసేపు అది నిజమనుకుంటాను. దాన్నించి శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా లేచాక, అది కూడా ఒక స్వప్నమే అని తెలుసుకుంటాను. అసలు స్వప్నం అల్పస్వప్నం అయితే, ఇది మహాస్వప్నం అని చూశాము. నేను మహాజాగ్రత్ పురుషుడిని అయితేనే, ఈ జాగ్రత్ ప్రపంచం నానుంచి పుట్టి, నావల్ల స్థితి పొంది, నాలో లయమయ్యే మహాస్వప్నం

అని తెలుసుకుంటాను. ఈ మహా స్వప్నానికి నేనే సృష్టి, స్థితి, లయ కారకుడిని అని చెప్పగలిగితే, నాకు వేదాంతసారం బాగా అర్థమయినట్టు అర్థం.

**మయి ఏవ సకలం జాతం** – అంతా నానుంచే పుట్టింది. నేను జాగ్రత్ కారణం బ్రహ్మను. ఇది నిదిధ్యాసన చేసే మంత్రం. కాలం, దేశాలతో సహా అంతా నానుంచే పుట్టింది. కాని ఈ వాక్యం ఎప్పుడు నిజమవుతుంది? ఆ 'నేను' ఎవరో సరిగ్గా అర్థమయినప్పుడు. నన్ను నేను కార్యకరణసంఘాతగా భావించుకుంటే, ఈ మాటకు అర్థం లేదు. నేను ఎవరో సరిగ్గా అర్థం చేసుకోవాలి.

ఈ మంత్రం మీద నిదిధ్యాసన చేసేముందు నెమ్మదిగా పంచ అనాత్మల నుంచి అంటే వృత్తి, ఆస్తి, కుటుంబం లాంటి వాటినుంచి విడివడి, వాటిని మానసికంగా విశ్వరూప ఈశ్వరునికి అప్పచెప్పేయాలి. దీన్ని **ఆత్మనివేదన రూపభక్తి** అంటారు. ఈ భక్తిలో అహంకార, మమకారాలను మనసారా అప్పచెప్పేస్తాము. బలిచక్రవర్తి కథ దీనికి తార్కాణం. బలిచక్రవర్తి తనకున్నవన్నీ వదులుకున్నాడు. అంటే మమకారాన్ని వదులుకున్నాడు. వామనమూర్తి రెండు పాదాలతో మమకారం పోయింది. కాని అహంకారం ఇంకా మిగిలివుంది. మూడోపాదాన్ని తన తలమీద పెట్టమనటంతో అహంకారం కూడా పోయింది.

చైతన్యం అయిన నానుంచే ఈ సృష్టి వచ్చి కొన్ని క్షణాలు నాట్యం చేస్తున్నది. దాని కాలపరిమితి కొన్ని క్షణాలే అనవచ్చు. కాని వచ్చిన చిక్కేమిటంటే మనం బుడగలాంటి జీవితంతో మమేకం చెంది, ఆ బుడగకు అధిష్ఠానమైన నీటిని చూడటం లేదు. మనం చైతన్యస్వరూపులం అని తెలుసుకోవటం లేదు.

**మయి సర్వం ప్రతిష్ఠితమ్** – నేను అన్నిటికీ స్థితికారణాన్ని.

**మయి సర్వం లయం యాతి** – చివరికి, అన్నీ నాలో లయమవుతాయి. నేను లయకారణాన్ని. బ్రహ్మను సృష్టి స్థితి లయకారణం అంటారు. ఇక్కడ విద్యార్థి తను సృష్టి స్థితి లయకారణం అంటున్నాడు. అంటే అతను ఏం సూచిస్తున్నాడు?

**తత్ అద్వయం బ్రహ్మ అహమ్ అస్మి** – అతని అసలు స్వరూపాన్ని సూచిస్తున్నాడు. నేను పరమాత్మగా సృష్టి, స్థితి లయకారకుడిని కాని నా అసలు స్వరూపం – కార్యకారణ విలక్షణబ్రహ్మ, నిరుపాధిక బ్రహ్మ అహమస్మి. నేను సృష్టికర్తను అని అహంకారపరంగా చెపితే అది తప్పు కాని సాక్షిపరంగా చెపితే అది గర్వం కాదు; జ్ఞానం. జీవాత్మగా చూస్తే నేను కార్యం, పరమాత్మగా చూస్తే నేను కారణం. నేను కారణబ్రహ్మను. కారణపరమాత్మ అహమస్మి.

ఐ ) **అంగుష్ఠమాత్రః పురుషః** - కఠోపనిషత్

పేరుపొందిన నాలుగు మహావాక్యాలే కాక, ముండకోపనిషత్తులోనూ, కఠోపనిషత్తులోనూ అనేక మహావాక్యాలున్నాయి.

6) **ఆత్మ / బ్రహ్మ నిర్వచనాలు**

సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ; సత్ చిత్ ఆనంద ఆత్మా, భూమ, అక్షరం బ్రహ్మ, అవస్థాత్రయ సాక్షి, శరీరత్రయ విలక్షణం, పంచకోశాతీతం, పురుషోత్తముడు.

7) **ఆత్మ / బ్రహ్మ లక్షణాలు**

అకర్తా అభోక్తా, అప్రమేయం, సర్వవ్యాపకం, జ్యోతిషాం జ్యోతిః, చైతన్యస్వరూపం, సర్వ అధిష్ఠానం, నిరుపాధిక సోపాధిక చైతన్యం, అనంతం.

ఒక్కొక్క లక్షణం ఒక్కొక్క ఉపనిషత్తులో బాగా విశ్లేషించబడుతుంది.

ఎ) **అకర్తా అభోక్తా**

**మంత్రం - 19**

**హన్తా చేన్మన్యతే హన్తుం హతశ్చేన్మన్యతే హతమ్।**
**ఉభౌ తౌ న విజానీతో నాஉయం హన్తి న హన్యతే॥**

ఈ నిర్వచనం కూడా సూటిగా చెప్పలేదు. కొంతమంది నేను హంతకుడిని అనుకుంటున్నారు, కొంతమంది నేను చంపబడ్డాను అనుకుంటున్నారు కాని ఇద్దరూ సత్యాన్ని తెలుసుకోలేని వారే. ఆత్మ చంపేదీ కాదు, చంపబడేదీ కాదు అని యమధర్మరాజు చెప్తున్నాడు.

అంటే ఆత్మ అకర్తా అభోక్తా.

**నిరుపాధిక సోపాధిక చైతన్యం** - తదేజతి తన్నైజతి - ఈశ

ఆత్మ కదులుతుంది. ఆత్మ కదలదు.

బి) **అవస్థాత్రయ సాక్షి చైతన్యం**

అవస్థాత్రయ సాక్షిచైతన్యంగా ఆత్మను వర్ణిస్తే, రెండు విషయాలు గ్రహించవచ్చు.

- ఆత్మ చైతన్యస్వరూపం. ఎందుకంటే ఆత్మ జడం అయితే, దేన్నీ సాక్షీభూతంగా చూడలేదు.
- ఆత్మ తను చూసే మూడు అవస్థలకీ భిన్నం. ఎందుకంటే చూడబడే వస్తువు వేరు, చూసే వ్యక్తి వేరు. అంతే కాదు, శరీరం ఈ మూడు అవస్థలలోకే వస్తుంది అని కూడా గ్రహించాలి.

జాగ్రదవస్థలో మనసు ద్వారా బాహ్య ప్రపంచాన్ని అనుభవిస్తాము. స్వప్నావస్థలో మనసు సృష్టించిన అంతర్గత ప్రపంచాన్ని అనుభవిస్తాము. రెండింటిలోనూ మనసు చూస్తుంది. మొదటి అవస్థలో బాహ్య ప్రపంచాన్నీ, రెండో అవస్థలో తను సృష్టించిన అంతః ప్రపంచాన్నీ. క్రికెట్‌ని రెండుసార్లు చూసినట్టన్నమాట. మొదటిసారి లైవ్‌గానూ, రెండోసారి రికార్డెడ్‌గాను.

అలాగే జాగ్రదవస్థలో భౌతిక వస్తువులను చూస్తే, స్వప్నావస్థలో వాసనామయ వస్తువులను చూస్తుంది మనసు. జాగ్రదవస్థలో దేశకాలాలు వేరు.స్వప్నావస్థలో దేశకాలాలు వేరు. స్వప్నంలో పెళ్లయి పిల్లలు, పిల్లలకి పిల్లలు కూడా పుట్టేయవచ్చు. జాగ్రదవస్థలో ఉన్న శరీరం, స్వప్న, సుషుప్తి అవస్థలలో తెలియదు. స్వప్నావస్థలో ఉన్న శరీరం దాన్నుంచి బయటకు రాగానే మాయమవుతుంది. కాబట్టి శరీరం మారుతుంది కాని, చైతన్యం మారదు.

స్వప్నావస్థలో జాగ్రత్‌కాలం పోతుంది. సుషుప్తి అవస్తలో జాగ్రత్‌కాలం, స్వప్నకాలం రెండూ పోతాయి. పడుకున్నాను అని తెలుస్తుంది. కాని ఎంతసేపు పడుకున్నానో తెలియదు.

అందుకని జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలన్నింటిలోనూ సమానంగా ఉన్నది ఏమిటి? వీటిని చూస్తున్న చైతన్యం. అదెవరు? నేను! )

సి) **అప్రమేయం**

**అన్యదేవ తద్విదితాదథో అవిదితాదధి** – కేన

ఆత్మ తెలిసిన వస్తువు కాదు; తెలియని వస్తువు కూడా కాదు. రెండింటిలోనూ సమానంగా ఉన్నది వస్తువు అంటే ఆబ్జెక్టు. దీని అర్థం ఆత్మ అసలు ఆబ్జెక్టే కాదు, సబ్జెక్ట్ అయిన నువ్వే అది.

**తదేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం యదిదముపాసతే॥**

నువ్వు ఉపాసన చేస్తున్న దేవుడు బ్రహ్మ కాదు, ఉపాసన చేస్తున్న నువ్వే బ్రహ్మ అని తెలుసుకో. దీని అర్థం కూడా అదే. ఆత్మ ఆబ్జెక్టు కాదు సబ్జెక్టు.

**ఎవర్ ది ఎక్స్‌పీరియన్సర్, నెవర్ ది ఎక్స్‌పీరియన్స్‌డ్**
అనుభవిస్తున్న నువ్వే అది ఎప్పటికీ, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ

డి) **శరీరత్రయ విలక్షణం**

**శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనః** – కేన

చెవి పరంగా చూస్తే మూడు అంశాలను చూస్తాము.

ఎ) ఆత్మ వేరు, చెవి వేరు

బి) ఆత్మ చెవి అంతటా వ్యాపించి ఉంది

సి) ఆత్మ ఉండటంవల్లనే చెవిని చెవి అనగలుగుతున్నాము. అంటే చెవితో వినగలుగుతున్నాము. అంటే ఆత్మ శరీరంలోని అంగాలకు భిన్నంగా ఉంది.

ఇ) **జ్యోతిషాం జ్యోతిః**

**తుచ్ఛుభ్రం జ్యోతిషాం జ్యోతిః తద్యదాత్మవిదో విదుః॥** - ముండకం

జ్యోతికి సాంకేతిక అర్థం - జ్యోతి సమక్షంలో వస్తువులు తెలిసి, ఆ జ్యోతి లేకపోతే వస్తువులు తెలియకపోవటం. సూర్యుడు ఒక **జ్యోతి**. కాని అంత స్వయంప్రకాశక జ్యోతి కూడా గుడ్డివానికి తెలియదు. కన్ను ఒక **జ్యోతి**. కన్ను అంటే అన్ని ఇంద్రియాలనూ జ్యోతిగా తీసుకోవాలి. ఇంద్రియాల వెనుక మనస్సు ఉంటేనే అవి పనిచేస్తాయి. అందువల్ల మనస్సు ఒక **జ్యోతి**. ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును ఒకటి చూస్తుంది. అది సాక్షి చైతన్యం. అది **ఒక** జ్యోతి అనకూడదు. అదే జ్యోతి. అది **స్వయంప్రకాశక జ్యోతి**. దాన్ని ఎవరూ ప్రకాశింపజేయలేరు. అందువల్ల జ్యోతిషాం జ్యోతిః.

ఆత్మ ఆబ్జెక్టు కాదు కాబట్టి సర్వప్రమాణ అగోచరం. అందువల్ల దాన్ని నేతినేతి పద్ధతి ద్వారా తెలుసుకోవాలి. అది సూచించే మంత్రాలు కొన్ని చూద్దాము.

**న తత్ర చక్షుర్గచ్ఛతి న వాగ్గచ్ఛతి**
**నో మనో న విద్మో న విజానీమో యథైతదనుశిష్యాత్॥** - కేన 1.3

ఆత్మను కంటితో చూడలేము, మాటలు వర్ణించలేవు, మనస్సు తెలుసుకోలేదు. గురువు నాకు తెలియదు అంటున్నాడు, నాకే కాదు ఎవరికీ తెలియదు అంటున్నాడు.

**యత్ తదద్రేశ్యమ్ అగ్రాహ్యమ్ అగోత్రమ్ అవర్ణమ్ ।**
**అచక్షుఃశ్రోత్రం తదపాణిపాదమ్ ॥**

అది జ్ఞానేంద్రియాలకు అందదు, కర్మేంద్రియాలకు అందదు. పుట్టుక లేదు, రంగు లేదు. దానికి కళ్ళు, చెవులు లేవు. చేతులు, కాళ్ళు లేవు.

**అశబ్దమస్పర్శమరూపమవ్యయం తథారసం నిత్యమగంధవచ్చ యత్ ।**- కఠ 1.3.15

బ్రహ్మ శబ్ద స్పర్శ రూప రస గంధాలకు అతీతం. అంటే ఇంద్రియ అగోచరం.

ఆత్మ స్థూలం కాదు, సూక్ష్మం కాదు, పొట్టిది కాదు, పొడుగుది కాదు అలా సాగుతుంది.

8) **ఆత్మానాత్మ వివేకం**

ఆత్మానాత్మవివేకం దృక్‌దృశ్యవివేకంద్వారా చేస్తాము, పంచకోశవివేకంద్వారా చేస్తాము.

9) **గతిసామాన్యదర్శనం - బ్రహ్మ సత్యం - జగన్మిథ్యా**

వేదాంతసారంగా గతి సామాన్య దర్శనం అంటారనీ, ఏ ఉపనిషత్తులో చూసినా వేదాంత సారం ఒకటేననీ చూశాం. అందులో ఒకటి **బ్రహ్మ సత్యం జగన్మిథ్యా.**

బ్రహ్మ సత్యం అని చెబితే చెప్పండి కాని, జగన్మిథ్యా అని మీరెందుకు అంటారని శంకరాచార్యుల వారిని ప్రశ్నించారు కొందరు. అది ఆయన చెప్పారు కాని ఉపనిషత్తుల్లో లేదు అంటారు. బృహదారణ్యకంలోనే అనేకచోట్ల వస్తుంది. మాండూక్యోపనిషత్తులో అజాతివాదము సత్యముద్వారా జగన్మిథ్యాత్వం నిరూపిస్తారు; నిజానికి అధ్యారోప అపవాదంలోనే ఈ అంశం చూసేశాము.

**బృహదారణ్యకోపనిషత్**

అతోఽన్యదార్తం తో మూడు నాలుగు బ్రాహ్మణాలు ముగుస్తాయి. దాని అర్థం బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా.

సాక్షిచైతన్యాన్ని నువ్వు చూడలేవు, వినలేవు, మననం చేయలేవు, బుద్ధి ద్వారా తెలుసుకోలేవు.

ఏష త ఆత్మా సర్వాంతరః ఈ సాక్షిచైతన్యమే నీలో ఉంది. ఇదే సర్వానికి లోపల ఉంది.

అతోఽన్యదార్తం - అతః అన్యత్ ఆర్తం - ఈ వాక్యం చాలా ముఖ్యమైనది. అద్వైతానికి ఆయువుపట్టు ఇది. అతః అంటే సాక్షి కానిది; అన్యత్ - తక్కినవన్నీ (మనస్సు, జగత్తు,); ఆర్తం - మిథ్య. అంటే బ్రహ్మ సత్యం, జగన్మిథ్య.

ఈ అతోఽన్యదార్తం వాక్యం ఉషస్త బ్రాహ్మణంలో, కహోల బ్రాహ్మణంలో, అంతర్యామి బ్రాహ్మణంలో వస్తుంది.

**యత్ర అన్యదివ స్యాత్ తత్ర అన్యః అన్యత్ పశ్యేత్** - ఎక్కడ రెండవ వస్తువు ఉందో, అక్కడ రెండవదాన్ని చూస్తాడు. అలాగే తనకు భిన్నంగా ఉన్నదాన్ని వాసన చూస్తాడు; తనకు భిన్నంగా ఉన్నదాన్ని ఆస్వాదిస్తాడు. తనకు భిన్నంగా ఉన్నదాని గురించి మాట్లాడతాడు; తనకు భిన్నంగా ఉన్నదాని గురించి ఆలోచిస్తాడు; తనకు భిన్నంగా ఉన్నదాని గురించి చూస్తాడు; తనకు భిన్నంగా ఉన్నదాని గురించి తెలుసుకుంటాడు. అంటే ప్రమాతృ, ప్రమాణ, ప్రమేయాలు ఉన్నాయి జాగ్రదవస్థలో.

ఇప్పుడు మళ్ళీ ఒక సందేహం. జాగ్రదవస్థలో ద్వైతం ఉంది, సుషుప్తిలో అద్వైతం ఉంది అంటున్నది ఉపనిషత్తు. మనం ప్రతిరోజూ ద్వైత అనుభవాన్నీ, అద్వైత అనుభవాన్నీ కూడా పొందుతాము. అవునా? మరి అయితే **ఏది ఆత్మయొక్క నిజస్వరూపం**? ఆత్మ ద్వైతరూపమా, అద్వైతరూపమా, ద్వైతాద్వైత రూపమా?

కొంతమంది ద్వైతరూపమే సత్యం, అద్వైతరూపం ఆగంతుకం అంటారు. కొంతమంది ద్వైత, అద్వైతరూపం అంటారు. అంటే వారిది భేద అభేద వాదన. విశిష్టాద్వైతులది కూడా అదే. అద్వైతం ఆత్మ అద్వైతరూపం అంటుంది. అంటే ఇది అభేదం మాత్రమే అంటుంది. అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలము? ఈ మంత్రమే దానికి సాక్ష్యం లేదా బలం. ఉపనిషత్తు ఒక పదం వేసింది **అన్యదివ స్యాత్** (అన్యత్+ఇవ+స్యాత్). ఇవ అంటే ఉన్నట్టుగా ఉంది. నిజంగా లేదు. ఇది అక్షరలక్షలు విలువ చేసే పదం. ఇవ అనటంవల్ల భేదం మిథ్యా వ్యవహారం, మాయాకార్యం, అద్వైతం పారమార్థిక స్వరూపం.

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా**

**ఉపసంహారం**

అన్ని ఉపనిషత్తుల సారం ఒకటే అనీ, దాన్ని గతిసామాన్యదర్శనం అనీ అంటారు. పెద్ద ఉపనిషత్తులో పెద్ద ఆత్మ ఉండదు, చిన్న ఉపనిషత్తులో చిన్న ఆత్మ ఉండదు. చిన్న ఉపనిషత్తు అయిన ఈశావాస్యం నేర్చుకున్నా, పెద్ద ఉపనిషత్తు అయిన బృహదారణ్యకం నేర్చుకున్నా సారం ఒకటే. అలాంటప్పుడు ఇంత కష్టపడి ఇన్ని ఉపనిషత్తులు నేర్చుకోవాలా, ఏదో ఒకటి నేర్చుకుంటే సరిపోదా అనుకుంటారు కొందరు. క్రాష్ కోర్సు కావాలి కొంతమందికి. క్రాష్ కోర్సు కావాలంటే క్రాషయిపోతారు అంటారు పరమార్థానంద స్వామీజీ.

ఇన్ని ఉపనిషత్తులు నేర్చుకుంటేనే కాని వాటిలో ఉన్న వైవిధ్యం తెలియదు. చెప్పేది ఒకటే అయినా, ఎన్ని కోణాల్లో, ఎన్ని ప్రక్రియల్లో, ఎన్ని విభిన్న మంత్రాలతో వస్తుందో చూస్తే ఆశ్చర్యపోతారు. ఏవో చెదురుమదురుగా తప్ప, చాలా భిన్నంగా ఉంటాయి ఒక్కొక్కటీ.

ఇంకొక కారణం - ఎవరికి ఏ కోణంలో చెబితే హత్తుకుపోతుందో తెలియదు. ఒకరికి ఒక అంశం బాగా అర్థమయితే, ఇంకొకరికి ఇంకొక అంశం స్పష్టత ఇస్తుంది. అంతేకాదు, శాస్త్రం ఎంత అద్భుతం అనిపించకమానదు.

**అహో శాస్త్రమహో శాస్త్రమహో గురురహో గురుః।**
**అహో జ్ఞానమహో జ్ఞానమహో సుఖమహో సుఖమ్॥**

శాస్త్రం ఎంత అద్భుతం! జ్ఞానం ఎంత అద్భుతం! జ్ఞానఫలం ఎంత అద్భుతం! ఇన్ని అద్భుతాలను అందించిన గురువులు పరమార్థానంద స్వామీజీ ఇంకెంత అద్భుతం!

# ఏకాత్మ ప్రత్యయ సారం

**అద్వైత వేదాంతసారం**

స్వామీజీ బోధించిన **ఏకాదశ ఉపనిషత్తుల సారం**లో చెప్పిన అంశాలనుంచి జాలువారిన ఒక భావపరంపర. **– మద్దూరి రాజ్యశ్రీ**

**నాంతః ప్రజ్ఞం న బహిప్రజ్ఞం నోభయతః ప్రజ్ఞం న ప్రజ్ఞానఘనం న ప్రజ్ఞం నాప్రజ్ఞమ్।**

**అదృష్టమవ్యవహార్యమగ్రాహ్యమలక్షణమచింత్యమవ్యపదేశ్యమేకాత్మప్రత్యయసారం**

**ప్రపంచోపశమం శాంతం శివమద్వైతం చతుర్థం మన్యంతే స ఆత్మా స విజ్ఞేయః॥ 7**

నేనెవరు? నేను ఏకాత్మ ప్రత్యయసారం. ఈ విషయాన్ని మాండూక్యోపనిషత్ అవస్థాత్రయాన్ని విశ్లేషించి నిరూపించుకొస్తుంది.

నేను వింటున్నాను, నేను వస్తున్నాను – ఈ వాక్యాలలో ఉన్న నేను ఏకవచనం, ఉత్తమ పురుషుడు (ఫస్ట్ పర్సన్). ఆత్మ అంటే నేను, ప్రత్యయ అంటే ఎరుక లేదా అనుభవం. ఎరుక వాడదాము. ఆత్మప్రత్యయం అంటే నా ఎరుక. సారం అంటే ఇక్కడ ప్రమాణం. తురీయాన్ని నా ఎరుక అనే ప్రమాణం ద్వారా తెలుసుకోవాలి. ఎటువంటి ఎరుక? ఏకమ్. అంటే మారుతున్న అనుభవాల వెనుక మారకుండా ఉన్నదొకటి ఉంది. అది నేను. అది ఎలా తెలుసుకోవాలి? ఏకాదశ ఉపనిషత్తులు నేర్పిస్తాయి. అద్వైత వేదాంతమంతా వీటిలో వస్తుంది.

**1) కర్మకాండ**

ఎవరైనా సాధారణంగా సకామ కర్మతోనే తన ఆధ్యాత్మిక ప్రయాణాన్ని మొదలుపెడతారు. వేదపూర్వభాగం కూడా ఈ కర్మ చేస్తే ఈ ఫలం వస్తుందని ప్రేరేపిస్తుంది. అందువల్ల వేద అంతభాగం అయిన ఉపనిషత్తుల్లో కూడా ముందు కర్మను స్తుతిస్తుంది. కర్మ చేస్తే స్వర్గలోకానికి వెళతారని ముండకోపనిషత్తులో వస్తుంది.

**తదేతత్ సత్యమ్ ...**

**ఏష వః పంథాః సుకృతస్య లోకే॥** – 1.2.1

ఇది సత్యం. ఋషులు చెప్పారు. పుణ్యకర్మలు చేసినవారు పుణ్యలోకాలకు వెళతారు. వారిని స్వర్గలోక దేవతలు సాదరంగా ఆహ్వానిస్తారు అని వస్తుంది.

**ఏహ్యేహీతి తమాహుతయః సువర్చసః** – 1.2.6

రండి, రండి, ఈ స్వర్గం మీరు చేసుకున్న సత్కర్మల ఫలితంగా లభించింది అని ప్రియవచనాలు పలుకుతారు అని ఇంతలా కామ్యకర్మలను కీర్తించి వెంటేనే తరువాత మంత్రంలోనే వీరి కర్మఫలం శాశ్వతం కాదు, తిరిగి పుడతారు అంటుంది.

**ప్లవా హ్యేతే అదృఢా యజ్ఞరూపాః అష్టాదశోక్తమవరం యేషు కర్మ।**
**ఏతచ్ఛ్రేయో యేఽభినందంతి మూఢాః జరామృత్యుం తే పునరేవాపి యంతి॥** – 1.2.7

18 మంది నిర్వర్తించే ఈ యాగాలను **అవరం కర్మ** అనేసింది. అంటే తక్కువరకం కర్మలు. వీటిని ఆచరిస్తున్నవారు మూఢులు. వారి ప్రయత్నం నిలకడలేని తెప్పలతో సముద్రం దాటాలని ప్రయత్నించినట్టుగా ఉంటుంది. మళ్ళీ పుడతారు అని, ఇంకొక మంత్రంలో –

**ఇమం లోకం హీనతరం వా విశంతి॥** – 1.2.10

ఈ లోకంలోనో, ఇంకా హీనతరమైన లోకంలోనో పుడతారు అని విమర్శిస్తుంది.

సః దేవానాం పశుః – కర్మలు చేసేవారిని దేవతలకు పశువులు అంటుంది బృహదారణ్యకం.

2) **ఉపాసనాకాండ**

ఉపాసనకాండను కూడా ఏమీ తక్కువ విమర్శించదు. ఛాందోగ్యోపనిషత్తులోనూ, బృహదారణ్యకోపనిషత్తులోనూ అనేక ఉపాసనలు వస్తాయి. అందులో ప్రాణ ఉపాసన, హిరణ్యగర్భ ఉపాసన, పంచాగ్ని ఉపాసన పేరెన్నికగన్నవి. ఉపాసన చేసిన వ్యక్తి బ్రహ్మలోకానికి వెళతాడు, తిరిగిరాడు అంటుంది. అంటే క్రమముక్తి వస్తుంది అంటుంది ముందు.

**ఏతస్మాత్ న పునరావర్తంతే ।** – ప్రశ్న 1.10

బ్రహ్మలోకానికి వెళ్ళినవారు తిరిగిరారు అని కీర్తించినా, అది కూడా శాశ్వతఫలం కాదని విమర్శిస్తుంది.

**అంధం తమః ప్రవిశంతి యేఽవిద్యాముపాసతే ।**
**తతో భూయ ఇవ తే తమో య ఉ విద్యాయాగ్ం రతాః॥** – ఈశ 9

ఎవరైతే కేవలకర్మను చేస్తారో వారు చీకటి లోకాలకు వెళితే, కేవల ఉపాసన చేసినవారు ఇంకా కారుచీకటి లోకాలకు వెళతారు అని విమర్శిస్తుంది ఈశావాస్యోపనిషత్తు.

ఉపాసకులను కృపణులు అంటారు గౌడపాదాచార్యులవారు. ఎందుకంటే వారు ద్వైతంలోనే ఉంటారు.

**న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః** – కైవల్యమ్ 3

కర్మవల్ల మోక్షం రాదని ప్రత్యక్షంగా కుండ బద్దలుకొట్టి మరీ చెప్పేసింది కైవల్యోపనిషత్తు.

**పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో నిర్వేదమాయాన్నాస్త్యకృతః కృతేన**
– ముండకమ్ 1.2.12

కర్మలు చేసీ చేసీ, నిర్వేదం వచ్చి కర్మలవల్ల మోక్షం రాదని తెలుసుకుంటాడు మహనీయుడు అంటుంది ముండకం.

మరి దేనివల్ల మోక్షం వస్తుంది? జ్ఞానం పొందితేనే మోక్షం వస్తుంది. అలాంటప్పుడు కర్మ, ఉపాసనలను వేదమే నిర్దేశించింది కదా! ఎందుకలా చేసింది?

**కర్మయోగం లేనిదే జ్ఞానయోగం అసంభవం।**
**జ్ఞానయోగానికి రానిదే కర్మయోగం అసంపూర్ణం॥**

**జ్ఞానప్రసాదేన విశుద్ధ సత్త్వః తతస్తు తం పశ్యతే నిష్కలం ధ్యాయమానః॥**
– ముండకమ్ 3.1.8

ఈ మంత్రం సారాంశం – కర్మ, ఉపాసనలద్వారా సాత్విక అంతఃకరణ పొంది, సాధన చతుష్టయ సంపన్నుడై, నిదిధ్యాసనద్వారా జ్ఞానయోగం పొందాలి. నిదిధ్యాసన చెబితే శ్రవణ, మననాలు కూడా కలుపుకోవాలి.

3) **జ్ఞానకాండ** – ఈ విధంగా కర్మ, ఉపాసనలవల్ల మోక్షం రాదనీ, అవి జ్ఞానయోగ్యతా ప్రాప్తిని మాత్రమే ఇస్తాయనీ శాస్త్రం నొక్కివక్కాణిస్తుంది. వీటితో పాటు ధ్యానం, శ్వాసమీద ధ్యాస, కుండలనీ ధ్యానం, నిర్వికల్ప సమాధి, నామసంకీర్తనం – ఇవన్నీ వస్తాయి. కలియుగంలో నామసంకీర్తనం ఒకటే చాలు, జ్ఞానం పొందనవసరం లేదని ఒక అపోహ ఉంది. పైగా జ్ఞానం మాత్రమే మోక్షం ఇస్తుందని మీరెందుకింత ఉన్మాదంగా మాట్లాడతారని ఎదురు ప్రశ్నిస్తారు వారు.

చీకటిని వెలుతురు మాత్రమే పారద్రోలుతుందని అంటే, కలియుగంలోనైనా సరే, అందులో ఉన్మాదం ఏం ఉంది? గుడ్డి నమ్మకం ఏం ఉంది? చీకటిని అనేక మార్గల ద్వారా పారద్రోలగలమా? లేదే! ఒకటే మార్గం ఉంది. అది సత్యం. ఒక చీకటిగదిలో కూర్చుని విష్ణుసహస్రనామం చేస్తే పోతుందా? ఆ గది ఊడ్చి ముగ్గులు పెడితే పోతుందా? శీర్షాసనం వేస్తే పోతుందా? వీటినేమీ మనం కించపరచటం లేదు. వీటివల్ల పుణ్యం వస్తుంది కాని ప్రస్తుత సమస్యకి అది కాదు పరిష్కారం. చీకటిని పారద్రోలటానికి అనేక మార్గాలున్నాయనుకోవటం ఎంత అర్థంలేని పనో, అలాగే మోక్షానికి అనేక మార్గాలున్నాయి అనుకోవటం కూడా అంతే అర్థంలేని పని. ఇది సత్యం, సత్యం, పునః సత్యం. ఈ విషయాన్ని అనేక ఉపనిషత్తులు నిరూపిస్తాయి.

నాన్యః పంథా విముక్తయే – కైవల్యం. విముక్తి పొందటానికి వేరే మార్గం లేదు.

నాన్యేన హేతునా – కైవల్యం. వేరే మార్గ ఏమీ లేదు. **జ్ఞానాత్ ఏవ తు కైవల్యం** అంటారు అందుకే.

**తరతి శోకమాత్మవిత్** – ఛాందోగ్యం

నారదులవారికి తెలియని విద్య అంటూ లేదు, అయినా ఆత్మజ్ఞానం పొందితేనే శోకం పోతుందని తెలుసుకుని, గురువు దగ్గరకు వచ్చారు.

**బ్రహ్మవిదాప్నోతి పరమ్** – తైత్తిరీయం

బ్రహ్మజ్ఞానం పొందిన వ్యక్తి అన్నింటికన్నా శ్రేష్ఠమైన పరమపురుషార్థమైన మోక్షాన్ని పొందుతాడు.

**తత్ర కో మోహః కశ్శోక ఏకత్వమనుపశ్యతః** – ఈశ

ఉన్నదొకటే ఆత్మ అని నేర్చుకున్న జ్ఞానికి శోకమోహాలు ఉండవు.

**నేహ నానాస్తి కించన మృత్యోస్స మృత్యుం గచ్ఛతి** – కఠ

దానికి భిన్నంగా ఎవరైతే అజ్ఞానంలో ఉండి, ద్వైతాన్ని చూస్తారో, వారు పునరపి జననం, పునరపి మరణం పొందుతూనే ఉంటారు.

**అంధం తమః ప్రవిశంతి యేఽ సంభూతిముపాసతే** – ఈశ

ఉపాసన చేసేవారు చీకటి లోకాలకు వెళతారు.

అందువల్ల జ్ఞానంవల్లనే మోక్షం పొందుతారని స్పష్టంగా చెబుతుంది శాస్త్రం.

**4) సంసారం – పరిష్కారం**

సంసారాన్ని శాస్త్రం అనేక విధాలుగా వివరిస్తుంది. అహం మమ భావన అంటుంది. దీన్ని me-mine syndrome అంటారు. ఇంకొక నిర్వచనం – hurt and guilt. నన్ను ఎవరో బాధించారు, నేను అనవసరంగా ఎవరినో బాధించాను.

**కిమహగ్ం సాధు నాకరవమ్ । కిమహం పాపమకరవమితి ॥** – తైత్తిరీయం

నేను ఎందుకు ఈ మంచి పనులను చేయలేదు. అంటే ఒమిషన్స్ గురించి పశ్చాత్తాపం. నేను ఎందుకు ఇలా పాపపు పనులను చేశాను? అంటే కమిషన్స్ గురించిన పశ్చాత్తాపం. ఈ ఒమిషన్స్ కమిషన్స్‌లను కలిపి గిల్ట్ అంటాము. అంటే పశ్చాత్తాపం. ఈ పశ్చాత్తాపం అజ్ఞానిని పట్టి కుదిపివేస్తుంది.

**అశనాయాపిపాసే శోకం మోహం జరాం మృత్యుమ్।** – బృహదారణ్యకం

ఆరు అంశాలు మనను సంసారంలో పడవేస్తాయి అంటుంది.

ఇలా సంసారానికి ఏ పేరు పెట్టినా దానికి మూలకారణం శోధిస్తారు గౌడపాదాచార్యుల వారు. దీన్ని రెండు దశల్లో వివరిస్తారు.

**దశ 1 – ద్వైత దర్శనం** – అద్వైతం సత్యం, ద్వైతం మిథ్య అనే విషయం తెలియక, ద్వైతాన్ని సత్యంగా తీసుకోవటమే సంసారం.

**ద్వితీయాద్వై భయం భవతి**

రెండవది ఉంటే భయం వేస్తుంది అని ఉపనిషత్తులన్నీ ఘోషిస్తున్నాయి. ద్వైతం ఉంటే రాగద్వేషాలు వస్తాయి, ప్రవృత్తి నివృత్తులు వస్తాయి. సంసారం వస్తుంది.

**దశ 2 – మనసే కారణం** – ఇంకా లోతుగా విశ్లేషిస్తే, ద్వైతదర్శనం మనస్సు పని చేస్తున్నప్పుడే అవుతున్నదని అర్థం అవుతుంది. జాగ్రదవస్థలో, స్వప్నావస్థలో మనస్సు పనిచేస్తుంది. ద్వైతాన్ని చూపించి భయపెడుతుంది. సుషుప్తిలో మనస్సు పడుకుంటుంది. దానివల్ల వచ్చిన ద్వైత ప్రపంచమూ లేదు, దానివల్ల ఏర్పడిన సంసారమూ లేదు.

**మన ఏవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః॥** అమృతబిందు ఉపనిషత్

మనస్సు = సంసారం అని అంత ప్రత్యక్షంగా తెలియదు. ఎందుకంటే మధ్యలో కొన్ని దశలు ఉన్నాయి. మనస్సులో ఉన్న అజ్ఞానం వల్ల పొరపాటు పడతాము. నేను పరిమితి ఉన్న జీవిని అనుకుంటాము.

**అజ్ఞానం → పొరపాటు → కోరిక → కర్మ → కర్మఫలం → పునరపి జననం, పునరపి మరణం = సంసారం.**

మొదటిదీ, ఆఖరిదీ చూస్తే అజ్ఞానం = సంసారం.

అందువల్ల ఆత్మ అజ్ఞానం పోవాలంటే ఆత్మజ్ఞానం పొందటం ఒక్కటే మార్గం.

**5) ఔపనిషదం బ్రహ్మ** – ఆత్మజ్ఞానం పొందే పద్ధతిలో కూడా మళ్ళీ అనేక అపోహలు ఉన్నాయి. నా గురించిన అజ్ఞానం కదా, నేనెవరు అని నేను ధ్యానం చేస్తే నాకు ఆత్మ సాక్షాత్కారం అవుతుంది అనుకుంటారు చాలామంది. లేదా నిర్వికల్ప సమాధిలోకి వెళితే, మనస్సును శూన్యం చేస్తే ఆత్మ ఒక వెలుగులా వెలుగుతుంది అంటారు. వీటిని కించపరచటం లేదు కాని ఇవేవీ కావంటుంది శాస్త్రం.

**విద్ విచారణే విద్ సత్తాయాం విద్ జ్ఞానే విద్ లాభే। ఏతేషాం ధాతూనాం విషయే వర్తంతే యస్మాత్ తతో వేదాః ఇత్యుక్తః॥**

ఇది వేదం నిర్వచనం. బ్రహ్మ గురించిన విచారణ చేసి, బ్రహ్మ ఉన్నాడని చెప్పి, బ్రహ్మజ్ఞానం బోధించి, బ్రహ్మజ్ఞానఫలం గురించి చెప్పేది వేదం.

ఉపనిషత్ అర్థం కూడా గురు సమీపంలో కూర్చుని, నిశ్చయజ్ఞానం పొందితే, సంసారాన్ని నాశనం చేస్తుంది.

**ఔపనిషదం బ్రహ్మ** – శాంతిపాఠం

**ఔపనిషదం పురుషః** – బృహదారణ్యకమ్

ఉపనిషత్తుల ద్వారానే బ్రహ్మజ్ఞానాన్ని పొందాలి.

6) **గురు ఆవశ్యకత** – అలాగని శాస్త్రాన్ని స్వంతంగా నేర్చుకోవటానికి ప్రయత్నించకూడదు. స్వంతంగా నేర్చుకుంటే, సరిగ్గా అర్థం కాదు. సరిగ్గా అర్థం కాకపోయినా ఫర్వాలేదు, తప్పుగా అర్థం చేసుకుంటారు. అక్కడితో ఊరుకోకుండా, పదిమందికీ ఆ తప్పుడు జ్ఞానాన్నే అందజేస్తారు.

**స్వయం ధీరాః పండితం మన్యమానాః** – కొంతమంది మిడిమిడి జ్ఞానంతో వారే పండితులు అనుకుంటారు. ఇటువంటి వారిని మూఢాః అంటుంది ఉపనిషత్తు. వారు మూఢులైతే ఫర్వాలేదు.

**అంధేనైవ నీయమానా యథాంధాః**– వారు అజ్ఞానంలో ఉండి, మరికొంతమందిని అజ్ఞానంలో పడవేస్తారు.

అందువల్ల గురువుద్వారానే జ్ఞానం పొందాలి. లౌకిక విద్యనే ఒక గురువుద్వారా పొందాలంటే, బ్రహ్మవిద్య గురించి వేరే చెప్పాలా? మనస్సు ఉంటేనే అర్థం కాని విద్య, మనస్సును శూన్యం చేస్తే ఎలా అర్థమవుతుంది?

ఆ గురువు కూడా ఆషామాషీ గురువు అవకూడదు, స్వయంభూ గురువు అవకూడదు. ఇంకొక గురువు నుంచి నేర్చుకుని ఉండాలి. అప్పుడతని దగ్గర సాంప్రదాయ తాళం చెవి ఉంటుంది.

**న విజానీమో యథైతదనుశిష్యాత్** – కేనోపనిషత్తులో గురువు నువ్వు అడిగిన ప్రశ్నకు నాకు జవాబు తెలియదు. నాకే కాదు, ఇంకెవరికీ తెలియదు అని చెప్పి,

**ఇతి శుశ్రుమ పూర్వేషాం యే నస్తద్వ్యాచచక్షిరే** – కాని నా గురువులు నాకు చెప్పిన పద్ధతిలో నేను నీకు బోధిస్తాను అంటాడు.

**శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్** – ముండకమ్

గురువు అర్హత – శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువై ఉండాలి. అంటే గురువు ఒక సంప్రదాయ పద్ధతిలో నేర్చుకుని ఉండాలి. పొందిన జ్ఞానాన్ని నిష్ఠగా మలుచుకుని ఉండాలి.

**అనన్యప్రోక్తే గతిరత్ర నాస్తి** – కఠ

అనన్యగురువు చెప్పకపోతే శాస్త్రం సరిగ్గా అర్థం కాదు. పరమార్థానంద స్వామీజీ గురువు తలమీద మీట నొక్కితే శాస్త్రం వస్తుందనీ, సమర్థవంతుడైన గురువు చెబితే మనం వద్దనుకున్నా అర్థమయిపోతుందనీ చెప్పినమాట అక్షరాలా స్వామీజీకే సరిపోతుంది. ఆయన శాస్త్రంలో జీవిస్తారు. శాస్త్రమే ఆయన ఊపిరి.

7) **శిష్యుని అర్హత** – శాస్త్రాన్ని నేర్చుకోవటానికి వర్ణాశ్రమ నిబంధనలు లేవు. వయోపరిమితి లేదు. సాధన చతుష్టయ సంపత్తి ఉంటే చాలు. సాధన చతుష్టయ సంపత్తి అంటే వివేకం, వైరాగ్యం, ముముక్షుత్వం, శమాదిషట్క సంపత్తి. వీటి గురించి బృహదారణ్యకంలో వస్తుంది. కఠలో చిన్నపిల్లవాడైన నచికేతుడు తనకు ఆత్మవిద్య బోధించమని అడిగితే, యమధర్మరాజు అతనిలో ఈ అర్హతలు ఉన్నాయో లేదో పరీక్షించాకే బోధించాడు.

ప్రశ్నోపనిషత్తులో ఆరుగురు శిష్యులు పిప్పలాదుని బోధించమని అడిగితే, సంవత్సరం తరువాత బోధిస్తానన్నాడు. ఛాందోగ్యోపనిషత్తులో ఇంద్రుడు బ్రహ్మ దగ్గర (32+32+32+5), నాలుగుసార్లు కలిసి 101 సంవత్సరాలు ఉన్నాడు. ఈ కాలంలో గురువు శిష్యుని అర్హతను పరీక్షిస్తాడు. స్త్రీలు కూడా నేర్చుకోవచ్చు. మైత్రేయీ, గార్గిలను చూస్తాము. నిమ్నజాతికి చెందిన ఐతరేయ ఋషి ఐతరేయ బ్రాహ్మణాన్ని, ఆరణ్యకాన్ని, ఉపనిషత్తును అందుకున్నాడు.

8)**విద్య విశిష్టత** – గురుశాస్త్ర ఉపదేశం ద్వారానే విద్యను ఎందుకు పొందాలి అంటే ఈ విద్య ప్రత్యేకత అది. లౌకికవిద్యను అపరావిద్య అంటారు. అది ఆబ్జెక్టు గురించి చెబుతుంది. ఆ పద్ధతిని డైకాటమీ సిస్టమ్ అంటారు. నేర్చుకునే నేను వేరు, నేర్చుకునే ఆబ్జెక్టు వేరు. నేను ప్రమాతను, ఆబ్జెక్టు ప్రమేయం. దానికి ప్రత్యక్ష ప్రమాణం, అనుమాన ప్రమాణాలు ఐదు ఉన్నాయి.

కాని ఆత్మవిద్య లేదా బ్రహ్మవిద్య ఆబ్జెక్టు గురించి కాదు, సబ్జెక్టు అయిన నా గురించి బోధిస్తుంది. అందువల్ల ఈ ప్రమాణాలేవీ పనిచేయవు.

**న తత్ర చక్షుర్గచ్ఛతి న వాగ్గచ్ఛతి నో మనః॥** – కేన

ఆత్మజ్ఞానాన్ని కంటితో చూడలేము, మాటలతో వర్ణించలేము, మనస్సుకు అందదు. అంటే ఆత్మను ప్రత్యక్ష ప్రమాణం ద్వారా, తర్కం ద్వారా, ధ్యానం ద్వారా తెలుసుకోలేము. ఎందుకంటే ఇవన్నీ ఆబ్జెక్టుని సూచిస్తాయి. కాని ఆత్మ ఏమిటి?

**అన్యదేవ తద్విదితాదథో అవిదితాదధి** – ఆత్మ తెలిసిన వస్తువు కాదు, తెలియని వస్తువు కాదు. రెండింటిలోనూ సమానంగా ఉన్న పదమేమిటి? వస్తువు అంటే ఆబ్జెక్టు. అంటే అసలు ఆత్మ వస్తువే కాదు అంటే మరి ఆత్మ ఏమిటి? దిక్కులు చూడకండి, అది మీరే అంటుంది. కాకపోతే మీరెవరో తెలుసుకోవాలి. మీరు శరీరం కాదు, అనుభవించే నువ్వే అది ఎప్పటికీ, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ. మనస్సు కాదు, చైతన్యం.

**యత్ తదద్రేశ్యమ్ అగ్రాహ్యమ్ అగోత్రమ్ అవర్ణమ్**
**అచక్షుః శ్రోత్రం తదపాణిపాదమ్॥** – ముండకం

మళ్ళీ అదే. ఆత్మ అయిన మీరు ప్రత్యక్ష ప్రమాణానికి, అనుమాన ప్రమాణానికి అందదు. మీకు రూపం లేదు, మీరు నిర్గుణ బ్రహ్మ.

లోకాన్నంతా తేరిపారచూసే మీ కన్నులను మీరు చూసుకోలేరు. దానికి దర్పణం కావాలి. అలాగే లోకంలోని విషయాలన్నీ తెలుసుకునే మీరు, మీ గురించి స్వంతంగా తెలుసుకోలేరు. దానికి శాస్త్రమనే దర్పణం కావాలి. దాన్ని గురువే చూపించాలి. నా గురించి నాకు తెలియదా అని మీరంటే, మీ గురించి మీకు తెలిసింది తప్పు అంటుంది. శాస్త్రాన్ని ఆరవ ప్రమాణంగా తీసుకోవాలి. ప్రత్యక్ష ప్రమాణాన్ని ఎంత నమ్ముతారో, శాస్త్రాన్ని కూడా అంతగానూ నమ్మాలి.

9) **శాస్త్రమే ప్రమాణం**

**ఆత్మా వా అరే ద్రష్టవ్యశ్శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః** – బృహదారణ్యకం

ఆత్మావా అరే ద్రష్టవ్య అంటే అపరోక్షతయా జ్ఞాతవ్యః అంటే ఆత్మ నాకు భిన్నంగా లేదని తెలుసుకోవటం. ఇక్కడ తెలుసుకుంటేనే పొందటం.

అనాత్మ విషయంలో అలాకాదు, తెలుసుకుంటే పొందినట్టు కాదు. స్వర్గం గురించిన జ్ఞానం పొందితే, స్వర్గప్రాప్తి కలగదు. అనాత్మ విషయంలో రెండు దశలుంటాయి. అవి, జ్ఞానం పొందటం, దానికి తగ్గ కర్మ చేయటం. స్వర్గం గురించి జ్ఞానం పొంది, దానికి తగ్గ కర్మ చేయాలి.

**జ్ఞానం + కర్మ = అనాత్మ; జ్ఞానం = ఆత్మ**

ఆత్మ విషయంలో జ్ఞానం పొందితేనే చాలు మోక్షం పొందుతాము.

శ్రోత్రవ్యః – శ్రవణం; మంతవ్యః – మననం; నిదిధ్యాసితవ్యః – నిదిధ్యాసనం.

ఆత్మ గురించి తెలుసుకోవాలంటే, ఆత్మ గురించిన శ్రవణ, మనన, నిదిధ్యాసనాలు చేయాలి.

**శ్రవణం** – ఒక క్రమ పద్ధతిలో, క్రమం తప్పకుండా, ఒక సమర్థవంతమైన గురువు వద్ద కొన్ని సంవత్సరాలపాటు శాస్త్రం అధ్యయనం చేయాలి. ఇందులో ప్రతిపదమూ ముఖ్యమే. శ్రవణం అంటే **అజ్ఞాన నివృత్తి**.

**మననం** – శ్రవణంలో నేర్చుకున్నదాన్ని నిస్సంశయజ్ఞానంగా మలుచుకోవాలి మననంలో. మననం అంటే **సంశయ నివృత్తి**.

**నిదిధ్యాసనం** – నిస్సంశయజ్ఞానం కలిగాక, ఆ జ్ఞాననిష్ఠలో నిలబడగలగాలి. అంటే ఆ వేదాంతవాక్యాలమీద కొంతసేపు సమయాన్ని వెచ్చించి, వాటి గురించి ఆలోచించాలి. నిదిధ్యాసనం అంటే **విపర్యయనివృత్తి**. విపర్యం అంటే మనస్సులో ఎన్నాళ్ళుగానో ఉన్న వాసనలు, రాగద్వేషాలు. వాటిని తగ్గించుకోవటానికి నిదిధ్యాసనం తోడ్పడుతుంది.

10) **జ్ఞానఫలం**

ఈ జ్ఞానం కలిగితే పొందే లాభాలు –

1. **జ్ఞానం** – శాంతి, శివం, అద్వైతం, తురీయం నేను అనే జ్ఞానం బుద్ధిలో కలుగుతుంది. దానివల్ల సర్వజ్ఞత్వ ప్రాప్తి, బ్రహ్మణత్వ ప్రాప్తి, బ్రహ్మప్రాప్తి, పూర్ణత్వప్రాప్తి కలుగుతాయి.

2. **మోక్షం** – జీవించి ఉండగా జీవన్ముక్తి, మరణించాక విదేహముక్తి కలుగుతుంది. సంసారం నుంచి విడవడతారు.

**సర్వభూతేషు చాత్మానం తతో న విజుగుప్సతే॥** – ఈశ 6

ఆత్మజ్ఞానం పొందితే ఎవరినీ నిందించడు లేదా ఎవరినీ ద్వేషించడు.

**తదా విద్వాన్ పుణ్యపాపే విధూయ॥** – ముండకం 3.1.3

జ్ఞాని పుణ్యపాపాలను ఒక్కసారిగా వదుల్చుకుంటాడు.

**అహమన్నమహమన్నమహమన్నమ్**
**అహమన్నాదో అహమన్నాదో అహమన్నాదః॥** – తైత్తిరీయం

జ్ఞానం పొందిన వ్యక్తి ఆనందంగా సామగానం చేస్తాడు.

**ప్రతిబోధ విదితం మతం**

జ్ఞాని ఆత్మజ్ఞానం పొందాక, కొత్తగా ఏమీ అనుభవం పొందదు.

ఆత్మ అనుభవం పొందనవసరం లేదని, ప్రతి అనుభవం ఆత్మవల్లనే అవుతున్నదని తెలుసుకుంటాడు.

అలాగే తను మోక్షం కొత్తగా పొందనవసరం లేదని, తను లేనేలేని సంసారం ఉందని భ్రమ పడుతున్నాడని, తను ముందే నిత్యముక్త, శుద్ధ పురుషుడని అర్థం చేసుకుంటాడు. అంటే ఆత్మజ్ఞానం పొందటం అంటే బుద్ధిలో మార్పు కలగాలి. జ్ఞానం పొందాక కూడా, ప్రపంచం ఏమీ మారదు. కాని జ్ఞాని చూసే దృష్టి మారుతుంది. దాన్ని **పారడైమ్ షిఫ్ట్** అంటారు.

ఈ నేపథ్యంతో శాస్త్రంలోకి అడుగుపెడదాము.

1) **శాంతిపాఠం**

ఏ ఉపనిషత్తు నేర్చుకోవాలన్నా దానిముందొక శాంతిపాఠం పఠిస్తాము. ఆ శాంతిపాఠం ఆ ఉపనిషత్తు ఏ వేదానికి చెందినదైతే ఆ వేదానికి సంబంధించినదై ఉంటుంది. మనం ఇప్పుడు తైత్తిరీయోపనిషత్తులోని శాంతిపాఠం చూద్దాము.

**ఓం సహ నావవతు। సహ నౌ భునక్తు। సహ వీర్యం కరవావహై**
**తేజస్వి నావధీతమస్తు మా విద్విషావహై। ఓం శాన్తి శ్శాన్తి శ్శాన్తిః।**

దీని అర్థం గురుశిష్యుల మధ్య సత్సంబంధం ఉండాలి; గురువు శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ గురువై ఉండాలి; శిష్యునికి అచంచల దీక్ష, ప్రమాణబుద్ధి ఉండాలి. గురుశిష్యులిద్దరూ అవసరమైన ప్రయత్నం చేయాలి. శిష్యునికి జ్ఞానప్రాప్తి, జ్ఞానఫలప్రాప్తి కూడా కలగాలి. అధ్యాత్మిక, అధిభౌతిక, అధిదైవిక విఘ్నాలు కలగకుండా ఉండాలి. స్వామీజీ అంటారు, ఈ విధంగా స్టే ఆర్డర్ తెచ్చుకుని, జ్ఞానబోధలోకి అడుగుపెడదాము.

2) **ఆత్మజ్ఞానం**

**జ్ఞానేనాకాశకల్పేన ధర్మాన్ యో గగనోపమాన్।**
**జ్ఞేయాభిన్నేన సంబుద్ధస్తం వందే ద్విపదాం వరమ్।।**

**అస్పర్శయోగో వై నామ సర్వసత్త్వసుఖో హితః।**
**అవివాదోఽవిరుద్ధశ్చ దేశితస్తం నమామ్యహమ్।।** – మాండూక్యమ్ 4.1, 2

గౌడపాదాచార్యులవారి మంగళాచరణ శ్లోకాలద్వారా మనం కూడా నమస్కారం చేద్దాము. మంగళాచరణం అంటే ప్రార్థన. మొదటి కారిక అర్థం – ఆకాశంవంటి చైతన్యం, ఆకాశం వంటి చైతన్యం గురించి, ఆకాశం వంటి చైతన్యం అనే ప్రమాణంతో తెలుసుకుంటుంది. అటువంటి ఐక్యజ్ఞానం ఉన్న నారాయణుడికి నా ప్రమాణాలు. రెండవ కారికలో సాక్షాత్ ఆత్మవిద్యకే నమస్కారం చేస్తున్నారు. అందువల్ల ఆత్మజ్ఞానాన్ని స్తుతిస్తున్నారు. దానికి ఆరు గుణాలను పేర్కొంటున్నారు. అవి అసంగ ఆత్మ, పూర్ణత్వాన్ని ఇస్తుంది, ఆనందాన్ని కలుగజేస్తుంది, వాదనలకతీతం, విరోధాలు లేనిది, గురువు ద్వారానే నేర్చుకోవలసినది.

జీవాత్మ నిర్వచనం వేదపూర్వభాగంలో వేరేగా ఉంటుంది, వేదాంతభాగంలో వేరేగా ఉంటుంది. ప్రతివ్యక్తిలోనూ ఐదు అంగాలు ఉంటాయి. అవి స్థూలశరీరం, సూక్ష్మశరీరం, కారణశరీరం, ప్రతిబింబచైతన్యం, బింబచైతన్యం. బింబచైతన్యంవల్ల ఈ మూడు శరీరాల్లో ప్రతిబింబాలు ఏర్పడతాయి. ఆ మూడింటిని వరుసగా విశ్వ, తైజస, ప్రాజ్ఞ అంటారు. వేదపూర్వభాగంలో జీవాత్మ అంటే సూక్ష్మశరీరం, కారణశరీరం, ప్రతిబింబ చైతన్యం. ఈ మూడూ కలిసి ఒక వ్యక్తి మరణించాక ప్రయాణం చేస్తాయి. ఈ జీవాత్మ తను చేసుకున్న పుణ్యపాపాలకనుగుణంగా పునరపి జననం, పునరపి మరణం పొందుతుంది. స్థూలశరీరం ఇక్కడే కాలిపోతుంది. బింబచైతన్యం సర్వవ్యాపకం కాబట్టి దానికి ప్రయాణం ఉండదు.

3) **ఆత్మస్వరూపం**

వేదాంతభాగానికి వచ్చేసరికి జీవాత్మ నిర్వచనం మారుతుంది. జీవాత్మ అంటే బింబ చైతన్యం మాత్రమే. తక్కిన నాలుగూ కాదు.

ఎ) **చైతన్యస్వరూపం** – బింబచైతన్యం అనగానే దానికి 5 లక్షణాలను చెబుతారు స్వామీజీ. చైతన్యం ఐదు లక్షణాలు గుర్తుచేసుకుందాం.

బి) **న జాయతే మ్రియతే వా** – నిర్వికార చైతన్యం. శరీరానికి షడ్వికారాలు ఉన్నాయి. అస్తి జాయతే, వర్ధతే, విపరిణమతే, అపక్షీయతే, వినశ్యతి – ఆత్మకు చావుపుట్టుకలు లేవు. షడ్వికారాలు లేవు.

సి) **అకర్తా, అభోక్తా** – ఆత్మ కర్త కాదు, భోక్త కాదు. అంటే కర్మ చేయదు, కర్మఫలం అనుభవించదు. కర్త అవాలంటే కర్మ చేయాలి. కర్మ చేయాలంటే మార్పు చెందాలి. ఆత్మ నిర్వికారం అని ఇంతకుముందే చూశాము. మార్పు లేకపోతే కర్మ లేదు; కర్మ లేకపోతే కర్త కాలేదు. కర్త కాకపోతే భోక్త కూడా కాదు. అలా ఆత్మ నిత్య, ముక్త స్వరూపం అవుతుంది.

డి) **సర్వ అధిష్ఠానం** – ఆత్మ అధిష్ఠానం అంటే అన్ని వస్తువులకూ ఆధారం ఏదో అది. పూలదండలో ఉన్న దారం, పూలను కలిపి ఉంచుతుంది. పువ్వులు రాలినా దారం ఉంటుంది.

అలా ఆత్మ చైతన్యం. అనేక శరీరాల్లో అంతర్లీనంగా ఉంటుంది. ప్రాణుల హృద్గుహలో కొలువై ఉంది.

ఇ) **దేశకాల అతీతం** – ఆత్మ జగత్ సృష్టి, స్థితి, లయకారణం. ఇక్కడ లయ కారణంగా చూస్తాము. ప్రళయంలో మొత్తం ప్రపంచం అవ్యక్తంలోకి వెళ్ళిపోతుంది. దీని ద్వారా కాలం కూడా సృష్టిలో ఒక భాగమని యమధర్మరాజు చూపిస్తున్నాడు.

ఎఫ్) **ఆత్మ అకర్తా అభోక్తా** – మనకు గీతలో ఆత్మ అకర్తా అని అనేకసార్లు వస్తుంది కాని ఉపనిషత్తుల్లో అంత ప్రత్యక్షంగా ఆత్మ అకర్తా అని రాదు.

**ధ్యాయతీవ లేలాయతీవ** – మనిషి చేసే పనులు రెండే. జ్ఞానం పొందటం, కర్మ చేయటం. ఇవ పదం అక్షరలక్షలు చేసే పదం. ఆత్మజ్ఞానం పొందుతున్నట్టుగా, కర్మ చేస్తున్నట్టుగా ఉంది కాని ఆత్మ అకర్తా. నేను ఆత్మను, నేను ఆంతరజ్యోతి. బృహదారణ్యకంలోని ఈ మంత్రం సారాంశం నేను కార్యాకరణసంఘాతానికి భిన్నంగా ఉన్నాను. నేను అకర్తను. నేను వ్యవహారం నడపటానికి స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలను ధరిస్తాను. నేను వీటికి భిన్నంగా ఉన్న ఆత్మను. నా చిదాభాస బుద్ధిలో ఏర్పడి, బుద్ధి పని చేస్తున్నది. ఆ బుద్ధి చేసే పనులను నేను చేస్తున్నాను అనుకుంటున్నాను. కాని నేను దేహ వ్యతిరిక్తం.

జి) **ఆత్మ కర్మ విలక్షణం** – కర్మలు మూడు రకాలు. అవి సంచితకర్మ, ప్రారబ్ధకర్మ, ఆగామికర్మ. కాని ఆత్మ కర్మ విలక్షణం. ఈ కర్మఫలాలు ఆత్మకు అంటవు. దీన్ని స్వప్నపు వృత్తాంతం ద్వారా నిరూపిస్తాడు యాజ్ఞవల్క్యుడు.

జీవుడు మూడు అవస్థల్లోనూ తిరుగుతుంటాడు. స్వప్నంలో కొన్ని కర్మలు చేస్తాడు.

హెచ్) **ఆత్మ అప్రమేయం – అన్యదేవ తద్విదితాదథో అవిదితాదధి**

ఆత్మ తెలిసిన వస్తువు కాదు, తెలియని వస్తువు కాదు అంటే అసలు ఆత్మ ఆబ్జెక్టు కాదు. సబ్జెక్టు అయిన నువ్వే అంటుంది కేనోపనిషత్.

**ఎవర్ ది ఎక్స్‌పీరియన్సర్, నెవర్ ది ఎక్స్‌పీరియన్స్‌డ్**

అనుభవిస్తున్న నువ్వే అది ఎప్పటికీ, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ

ఆత్మ ఆబ్జెక్టు కాదు కాబట్టి ఆత్మను ప్రత్యక్షంగా వర్ణించలేము అంటుంది ఉపనిషత్తు. ఎందుకంటే పదాలు ఉన్నవి ఆబ్జెక్టును వర్ణించటానికే. అందువల్లనే నేతి–నేతి పద్ధతిని ఉపయోగిస్తుంది. నేతి అంటే న ఇతి. ఇది కాదు. ఇలా వర్ణించే మంత్రాలు అద్భుతమైనవి ఉన్నాయి.

**యత్ తదద్రేశ్యమ్ అగ్రాహ్యమ్ అగోత్రమ్ అవర్ణమ్**
**అచక్షుః శ్రోత్రం తదపాణిపాదమ్॥**

ఆత్మ ప్రత్యక్ష ప్రమాణాలకు అందదు, తర్కానికి అందదు. ఆత్మకు పుట్టుక లేదు, రంగు లేదు, కళ్ళు చెవులు లేవు, చేతులు కాళ్ళు లేవు అంటుంది.

ఐ) **సాక్షిచైతన్యం**

**సాక్షిచైతన్యం సర్వామనోవృత్తి సాక్షి**
**అదృష్టో ద్రష్టాఽ శ్రుతశ్రోతాఽ మతో మంతాఽ విజ్ఞాతో విజ్ఞాతా**

ఆత్మ ఎప్పటికీ చూసేది కాని చూడబడేది కాదు; ఆత్మ ఎప్పటికీ వినేది కాని వినబడేది కాదు; ఆత్మ ఎప్పటికీ ఆలోచించేది కాని ఆలోచన కాదు; ఆత్మ ఎప్పటికీ తెలుసుకునేది కాని తెలియబడేది కాదు. ఈ నాలుగు పదాలను కలిపి, ఒక్క పదంలో చెప్పవచ్చు. ఆత్మ ఎప్పటికీ సబ్జెక్టు కాని ఆబ్జెక్టు కాదు.

4) **పరమాత్మ స్వరూపం** – పరమాత్మను తటస్థలక్షణంగా వివరించవచ్చు. స్వరూపలక్షణంగా వివరించవచ్చు. ముందు తటస్థలక్షణం చూపిస్తాయి ఉపనిషత్తులు. ఎందుకంటే అది అర్థం చేసుకోవటం తేలిక. దానికి శాస్త్రం ఇచ్చే ఉదాహరణ దేవదత్తుని ఇల్లు ఎక్కడ అంటే, కాకి వాలిన ఇల్లు అని చెప్పటం. ఇది తాత్కాలికమే. కాకి ఎప్పుడో ఎగిరిపోతుంది. అలా బ్రహ్మను జగత్కారణంగా వర్ణించాక, జగత్తు మిథ్య అని, సృష్టి జరగలేదని కొట్టివేస్తుంది. ముందు మనం జగత్కారణ బ్రహ్మగా చూద్దాము.

**తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః। ఆకాశాద్వాయుః। వాయోరగ్నిః। అగ్నేరాపః। అద్భ్యః పృథివీ। పృథివ్యా ఓషధయః। ఓషధీభ్యోఽ న్నమ్, అన్నాత్పురుషః॥** – తైత్తిరీయమ్

జీవాత్మ పరమాత్మ ఏకమైన ఆత్మనుంచి ఆకాశం; ఆకాశం నుంచి వాయువు; వాయువు నుంచి అగ్ని; అగ్ని నుంచి నీరు; నీటి నుంచి భూమి; భూమి నుంచి వృక్షాలు; వృక్షాలనుంచి అన్నం; అన్నంనుంచి మనిషి వచ్చారు అంటుంది తైత్తిరీయోపనిషత్తు. మనిషి అంటే తక్కిన జీవరాశులన్నీ కలుపుకోవాలి. సృష్టి గురించి చెప్పగానే ముందుగా ఏ ఆచార్యుడైనా చెప్పే సృష్టి ప్రకరణం ఇది. కాని భిన్న ఉపనిషత్తుల్లో భిన్న వివరాలతో వస్తుంది సృష్టి. ఛాందోగ్యోపనిషత్తులో మూడు భూతాలనుంచే సృష్టి వచ్చిందని వస్తుంది. అవి అగ్ని, నీరు, భూమి. ప్రశ్నోపనిషత్తులో మిథునసృష్టి వస్తుంది. రయి, ప్రాణం అనే జంట వచ్చాయి. వాటి నుంచి అన్నీ జంటగా వచ్చాయని వస్తుంది. బృహదారణ్యకంలో మనుశతరూప అనే జంట పెనవేసుకుని పుట్టారని, వారి నుంచి మనుష్యసృష్టి, పశువుల సృష్టి వచ్చాయని

వస్తుంది. ఇలా భిన్నంగా చెప్పటాన్ని **విగానం** అంటారు. ఇలా ఎందుకు చెప్పింది అంటే వేదాంతసారం తెలుసుకోవాలి ముందు.

5) **వేదాంతసారం – బ్రహ్మ సత్యం జగన్మిథ్యా**

**జీవో బ్రహ్మైవ నాపరః॥**

ఈ వేదాంతసారం జీర్ణించుకోవటమే చాలా కష్టం. ఉన్నాడో లేడో తెలియని బ్రహ్మ సత్యం అంటుంది; ఎదురుగుండా ప్రత్యక్షంగా కనిపిస్తున్న జగత్తు మిథ్య అంటుంది. ఈ రెండూ ఎలాగోలా జీర్ణించుకుందామంటే ఆ బ్రహ్మ నువ్వు తప్ప వేరెవరో కాదు అంటుంది. నేనేమిటి, ఆ బ్రహ్మ ఏమిటి అనేది అసలే కొరుకుడు పడని వ్యవహారం. అందువల్ల ప్రస్తుతానికి ఈ రెండో వాక్యాన్ని పక్కన పెట్టి ముందు మొదటి వాక్యాన్ని చూద్దాము.

**ఎ) బ్రహ్మ సత్యం జగన్మిథ్యా**

ముందు బ్రహ్మ గురించి మరికాస్త చూద్దాము. బ్రహ్మను జగత్కారణం బ్రహ్మ అన్నాము. కాని ఏ కార్యానికన్నా రెండు కారణాలు కావాలి. నిమిత్త కారణం, ఉపాదాన కారణం. కుండను తీసుకుంటే కుండకు కుమ్మరి నిమిత్త కారణం; మట్టి ఉపాదాన కారణం. అలా సృష్టిలో ప్రతిదానికీ నిమిత్త కారణం వేరు, ఉపాదాన కారణం వేరు. కాని సృష్టి దగ్గరకు వచ్చేసరికి సృష్టికి ముందు సత్ మాత్రమే ఉంది అంటుంది.

**సదేవ సోమ్య ఇదమగ్ర ఆసీత్॥** – ఛాందోగ్యం

సృష్టికి ముందు సత్ (బ్రహ్మ) మాత్రమే ఉంటే బ్రహ్మ ఉపాదాన కారణమా, నిమిత్త కారణమా? రెండూ అంటుంది ఉపనిషత్తు. దానికి నిర్వచనం –

**అభిన్న నిమిత్త ఉపాదానకారణం**

అదెలా సాధ్యం అంటే మీ ఇంట్లో గూడు కట్టుకుని ఉన్న సాలెపురుగే ఉదాహరణ అంటుంది. సాలెపురుగు తనలోంచే దారం తీసుకుని, గూడు కట్టుకుంటుంది.

**యథోర్ణనాభిః సృజతే గృహ్ణతే చ॥** – ముండకం

బ్రహ్మ అంటే నిజానికి అద్వైతంలో నేర్చుకునే బ్రహ్మ నిర్గుణబ్రహ్మ. కాని సృష్టి ప్రకరణం గురించి చెప్పేటప్పుడు సగుణబ్రహ్మగా తీసుకోవాలి.

**నిర్గుణబ్రహ్మ + మాయ = ఈశ్వరుడు**

సగుణబ్రహ్మను ఈశ్వరునిగా వ్యవహరిస్తుంది శాస్త్రం. భగవద్గీతలో బ్రహ్మను పురుషుడు అనీ, మాయను ప్రకృతి అనీ వర్ణిస్తాడు కృష్ణపరమాత్మ. అదుగో నిర్గుణబ్రహ్మ + మాయ

అంటున్నారు, అంటే రెండు ఉన్నాయి కదా, ఉన్నదొకటే అద్వైతం అని ఎలా అంటారని ప్రశ్నించవచ్చు. మాయ నిర్గుణబ్రహ్మకు విడిగా లేదు. మాయ బ్రహ్మ యొక్క శక్తి. ఒక నాట్యాచార్యుడు వస్తుంటే, అదుగో నాట్యాచార్యుడూ, అతని నాట్యశక్తీ వస్తోంది అంటామా? అనము కదా! అలాగే నిర్గుణబ్రహ్మ ఒక్కటే.

నిర్గుణబ్రహ్మను అక్షరం బ్రహ్మ అని ముండకం, తురీయం అని మాండూక్యం, సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ అని తైత్తిరీయం, సత్ అనీ, భూమ అనీ, పురుషోత్తముడు అనీ ఛాందోగ్యం, ప్రజ్ఞానం బ్రహ్మ అని ఐతరేయం అంటాయి.

సృష్టి గురించి చెప్పేటప్పుడు మాయ నుంచి జగత్తు వచ్చింది అంటాము. కాని జగత్తును మిథ్యగా కొట్టివేసేటప్పుడు జగత్తు సృష్టికి కారణమైన మాయను కూడా మిథ్యగా కొట్టివేస్తాము. అప్పుడు బ్రహ్మ మాత్రమే సత్యం, జగత్తు మిథ్య అంటాము.

దీనికి శాస్త్రం అధ్యారోప అపవాద పద్ధతి ఉపయోగిస్తుంది.

ఉపనిషత్తు ఎంత చెప్పినా, జాగ్రత్ ప్రపంచం మిథ్య అని అంత తేలికగా స్వీకరించలేము. ఎందుకంటే మనం మిథ్య పదాన్ని సరిగ్గా అర్థం చేసుకోవటం లేదు.

మిథ్య నిర్వచనం – సదసద్భ్యామ్ అనిర్వచనీయం మిథ్యా. అంటే జాగ్రత్ ప్రపంచం లేదు అందామా అంటే అది మనకు అనుభవంలోకి వస్తోంది కాబట్టి ఉంది. అలాగయితే ఉందంటామా అంటే, స్వప్నంలోకి జారుకుంటే లేదు. నా స్వస్వరూపానికి లేచినా అది స్వప్నం 2గా తేలిపోతుంది. జాగ్రత్ ప్రపంచ మిథ్యాత్వమ్ వివరంగా గౌడపాదాచార్యులవారి కారికల్లో చూస్తాము.

జాగ్రత్ ప్రపంచాన్ని, స్వప్నప్రపంచంతో పోల్చి దానిలాగా, ఇది కూడా స్వప్నం 2 అంటుంది శాస్త్రం. స్వప్నాన్ని ప్రాతిభాసిక సత్యం అనీ, జాగ్రత్ ప్రపంచాన్ని వ్యావహారిక స్థాయి అనీ, బ్రహ్మను పారమార్థిక సత్యం అనీ అంటుంది. ప్రాతిభాసిక సత్యం నుంచి వ్యావహారిక స్థాయికి లేస్తే కల, స్వప్నం 1గా తేలిపోతుంది. అలాగే వ్యావహారిక స్థాయి నుంచి పారమార్థిక స్థాయికి లేస్తే జాగ్రత్ ప్రపంచం కూడా స్వప్నం 2 అంటుంది. స్వప్నం 1ని తేలికగానే స్వీకరిస్తాము. అయినా గౌడపాదాచార్యులవారు స్వప్నాన్ని మిథ్య అని ఆరు కారణాల ద్వారా నిరూపించారు. జాగ్రత్ ప్రపంచాన్ని కూడా మిథ్య అని అలాగే ఆరు భిన్న కారణాల ద్వారా నిరూపించారు. గౌడపాదాచార్యులవారు అసలు సృష్టే జరగలేదు అంటారు. ఆయన అజాతివాదము సత్యము అంటారు. దాన్ని అనేక కోణాల్లో వివరించారు.

బి) **జీవో బ్రహ్మైవ నాపరః** – ఇప్పుడు వేదాంతసారంలోని రెండవ అంశం చూద్దాము. జీవుడు బ్రహ్మ తప్ప వేరే ఏమీ కాదు. ఇది మహావాక్యాన్ని సూచిస్తుంది. జీవ ఈశ్వర

ఐక్యాన్ని సూచించేదేదైనా మహావాక్యమే. అలా ఉపనిషత్తుల్లో అనేక మహావాక్యాలు ఉన్నాయి.

మహావాక్యం బ్రహ్మతో మొదలుపెట్టి ఆత్మతో కలపవచ్చు లేదా ఆత్మతో మొదలుపెట్టి బ్రహ్మతో కలపవచ్చు.

**తత్త్వమసి** – ఈ మహావాక్యం బ్రహ్మతో మొదలుపెడుతుంది. ముందు సత్‌బ్రహ్మ నుంచి జగత్తు వచ్చిందని చూపిస్తుంది. అందువల్ల సత్ జగత్తంతటికీ అధిష్ఠానం. సత్ లేకుండా జగత్తుకు విడిగా ఉనికి లేదు. అందువల్ల బ్రహ్మ సత్యం, జగత్ మిథ్య. అందువల్ల సత్ విజ్ఞానేన సర్వవిజ్ఞానం భవతి అంటుంది. ఇలా అయితే సత్ విజ్ఞానం పొందటం ఎలా?

ఈ ప్రశ్నలో అర్థం లేదు. ది బుక్ ఈజ్, ది పెన్ ఈజ్, ది టేబుల్ ఈజ్ అని చెబుతూ వస్తున్న ఆ ఈజ్‌నెస్సే సత్‌బ్రహ్మ. ఆ సత్‌బ్రహ్మను అనుభవించటం ఎలా? ఎన్నడూ అనుభవించలేము. ఎందుకంటే సత్‌బ్రహ్మను అనుభవించే నువ్వే శుద్ధ చైతన్యానివి అంటుంది ఛాందోగ్యోపనిషత్తు.

**చిత్ + నామరూపం = ప్రమాతా**
**సత్ + నామరూపం = ప్రమేయం**

ప్రమాతా ప్రమేయాలలోంచి నామరూపాలు తీసేస్తే ఏం మిగిలింది? శుద్ధ చిత్, శుద్ధ సత్తా.

సత్తే చిత్, చిత్తే సత్ – **సత్వమేవ త్వం, త్వమేవ సత్** – తత్త్వమసి.

**ప్రజ్ఞానం బ్రహ్మ** – ఐతరేయోపనిషత్తు ఆత్మతో మొదలుపెట్టి బ్రహ్మతో ముగుస్తుంది.

**కోఽహమితి** – నేను ఎవరు అని ముముక్షువులు విచారణ చేసి, మనస్సులో ఉన్న ఆలోచనలను సాక్షిగా చూసేది ఒకటి ఉందని నేర్చుకున్నారు. దాన్ని సాక్షిచైతన్యం అంటాము. ఇందులో ప్రజ్ఞానం అని వస్తుంది.

**చైతన్యం + వృత్తి = అనుభవం**
**చైతన్యం = అనుభవం – వృత్తి**

మారే అనుభవాలలోంచి మారే వృత్తులు తీసేస్తే మిగిలేది మారని చైతన్యం. ఇదే ప్రజ్ఞానం బ్రహ్మ. ఈ బ్రహ్మ అంతటా ఉంది. చతుర్ముఖబ్రహ్మ, ఇంద్రుడు వారితో మొదలుపెట్టి, క్రిమికీటకాల వరకూ అంతటా ఉంది అంది. అలా జీవాత్మ, పరమాత్మ ఐక్యం వచ్చింది. అక్కడితో ఆగకూడదు. ఆ ఏకాత్మ నేనే అని అర్థం చేసుకోవాలి.

**అహం బ్రహ్మ అస్మి** – పరమాత్మ సృష్టి చేశాక, అనుప్రవేశం చేశాడు అని ఐతరేయంలో, బృహదారణ్యకంలో వస్తుంది. పరమాత్మ జీవాత్మగా అనుప్రవేశం చేసేముందు ఎప్పటికన్నా జీవాత్మ నేను ఎవరు అని విచారణ చేయకపోతాడా అనుకుని చేశాడని ఐతరేయంలో వస్తుంది.

**స ఏతమేవ సీమానం విదార్యైతయా ద్వారా ప్రాపద్యత**

బ్రహ్మరంధ్రం చీల్చుకుని ప్రవేశించాడు.

**స ఏష ఇహ ప్రవిష్టః** – బృహదారణ్యకమ్

జగత్ సృష్టి జరిగాక, పరమాత్మే స్వయంగా జగత్తులో ప్రవేశించాడు. దాని తరువాత అహం బ్రహ్మ అస్మి అని ప్రసిద్ధి పొందిన మహావాక్యం వస్తుంది. ఈ వాక్యం వచ్చేముందు కొందరు బ్రాహ్మణులు బ్రహ్మ గురించి చర్చించుకున్నారు. వీరు మూడు ప్రశ్నలు వేసుకున్నారు.

1. బ్రహ్మ, బ్రహ్మజ్ఞానం పొందకుండానే సర్వం అయ్యాడా?
2. బ్రహ్మ, దేని గురించో తెలుసుకుని సర్వం అయ్యాడా?
3. బ్రహ్మ, తన గురించి తాను తెలుసుకుని సర్వం అయ్యాడా?

ఉపనిషత్తు, వీటిల్లో చివరిది తీసుకుంది – బ్రహ్మ తన గురించి తాను తెలుసుకుని సర్వం అయ్యాడు. ఎలా? జీవాత్మ అజ్ఞాన అవస్థలో ఉన్నప్పుడు, ఉన్నది బ్రహ్మ ఒకటే. జీవాత్మే బ్రహ్మ! అందువల్ల శిష్యుడూ బ్రహ్మే, గురువూ బ్రహ్మే.

జీవాత్మ బ్రహ్మ కాబట్టి, జీవాత్మ జ్ఞానం పొందింది అంటే, బ్రహ్మ అహం బ్రహ్మ అస్మి జ్ఞానం పొందింది.

6) **సాధనలు** – ఇక్కడితో ఉపనిషత్తులోని శిఖరాగ్రానికి చేరుకున్నాము. అందువల్ల ఇంక కిందికి దిగిరావాలి. ఇప్పుడు వేదాంత సాధనలు చూద్దాము. ఇవి రెండు రకాలు. సాక్షాత్ సాధన, సహకారీ సాధన. జ్ఞానయోగం సాక్షాత్ సాధన. సహకారీ సాధనలు జ్ఞానయోగ్యతాప్రాప్తికి తోడ్పడతాయి.

ఎ) **సాక్షాత్ సాధన** – జ్ఞానయోగం సాక్షాత్ సాధన అని చూశాము. జ్ఞానయోగాన్ని శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా పాటించాలి.

**శ్రవణం** – శ్రవణంలో వేదాంతబోధను గురువు ద్వారా నేర్చుకోవాలి. గురువు అనేక ప్రక్రియల ద్వారా బోధ చేస్తాడు. అవి అధ్యారోప–అపవాద ప్రక్రియ, పంచకోశ వివేక ప్రక్రియ, అవస్థాత్రయ వివేక ప్రక్రియ, అన్వయ వ్యతిరేక ప్రక్రియ. అవికాక అనేక అంశాలు తీసుకుంటాడు.

**కుండ-మట్టి** – ఇది అధ్యారోప అపవాద ప్రక్రియలో చూశాము.

**బంగారం-ఆభరణాలు** – ఇది మాండూక్యంలో చూస్తాము. మూడు ఆభరణాలు చూస్తాము. అవి గాజు, గొలుసు, ఉంగరం. మూడూ బంగారం వేసుకున్న వేషాలు. వీటిలో అధిష్ఠానంగా ఉన్నది బంగారం. మూడు ఆకారాలుగా మారినా ఉన్నది బంగారం. అవి లేకపోయినా ఉన్నది బంగారం. అందువల్ల అలాగే జాగ్రదవస్థ, స్వప్నావస్థ, సుషుప్తి అవస్థ తురీయం వేసుకున్న వేషాలు. తురీయం వీటికి అధిష్ఠానం, వీటికి భిన్నంగా ఉంది. అందువల్ల విలక్షణం.

**సముద్రం-అల** – ఇది మహావాక్యానికి తోడ్పడుతుంది. అంత చిన్న అలలో ఉన్నదీ నీరే, అంత పెద్ద అలలో ఉన్నదీ నీరే. నీరే వీటికి అధిష్ఠానం. నీటిపరంగా రెండూ ఐక్యం. అలాగే అంత చిన్న జీవాత్మలో ఉన్నదీ చైతన్యమే, అంత పెద్ద పరమాత్మలో ఉన్నదీ చైతన్యమే. చైతన్యమే వీటికి అధిష్ఠానం. చైతన్యపరంగా రెండూ ఐక్యం.

**తాడు-పాము** – అక్కడ తాడును చూసి పాము అనుకుని, దానికి పాము లక్షణాలను ఆరోపిస్తూ ఖంగారు పడుతున్నాము. అలాగే ఆత్మను చూసి అనాత్మ అనుకుని, దానికి అనాత్మ లక్షణాలను ఆరోపించి, సంసారంలో పడిపోతున్నాము. అక్కడ టార్చ్‌లైట్ వేస్తే, ఇక్కడ శాస్త్రమనే టార్చ్‌లైట్ వేయాలి.

**స్వప్నప్రపంచం** – ఇది జాగ్రత్ ప్రపంచంయొక్క మిథ్యాత్వాన్ని నిరూపిస్తుంది. స్వప్నంలో ఉన్నంతవరకూ స్వప్నం సత్యంగా అనిపించినా, స్వప్నంనుంచి జాగ్రత్ ప్రపంచానికి లేస్తే స్వప్నం మిథ్యగా తెలిపోతుంది. అలాగే జాగ్రత్ ప్రపంచంలో ఉన్నంతవరకూ జాగ్రత్ ప్రపంచం సత్యంగా అనిపించినా, జాగ్రత్ ప్రపంచం నుంచి పారమార్థిక స్థాయికి లేస్తే ఇది కూడా స్వప్నం 2గా తెలిపోతుంది.

ఇలా వీటి ద్వారా వేదాంతసారాన్ని బోధిస్తే, ప్రకృతి ఒడిలో జీవించిన మన ఋషులు ప్రకృతిలోంచి ఉదాహరణలు తీసుకుని అనేక అంశాలు విశదీకరించారు.

i) కుక్క లేవగానే తన శరీరాన్ని విదిలించుకున్నట్టుగా, జ్ఞాని తన పుణ్యపాపాలను విదిలించుకుంటాడు.

ii) పాము తన కుబుసం విడిచి వెళ్ళిపోయినట్టుగా, జ్ఞాని శరీరంతో తన అనుబంధాన్ని విడిచి పెడతాడు.

iii) **మహామత్స్యదృష్టాంతం** – ఒక చేప ఈ ఒడ్డుకూ, ఆ ఒడ్డుకూ తిరిగి మధ్యలో పడుకుంటుంది. ఏ ఒడ్డుకూ చెందదు. అలాగే ఆత్మ మూడు అవస్థల్లోనూ తిరిగినా దేనికీ చెందదు.

దానికి భిన్నంగా అజ్ఞాని పరిస్థితి ఎలా ఉంటుంది?

i) **శకటదృష్టాంతం** – ఒక వ్యక్తి ఇల్లు మారినప్పుడు తన వస్తువులను పెట్టెల్లో వేసుకుని బండిలో తీసుకువెళతాడు. అలా అజ్ఞాని మరణించినప్పుడు తన పుణ్యపాపాలను, అంశాలను వేసుకుని వెళతాడు.

ii) **ఫలదృష్టాంతం** – ఒక పండుకు చెట్టుతో ఎంత అనుబంధం ఉన్నా, అది పరిపక్వం చెందాక నేలకు రాలక తప్పదు. అలాగే అజ్ఞాని జీవాత్మ ఈ శరీరంతో ఎంత అనుబంధం ఉన్నా, దానినుంచి విడిపోక తప్పదు.

ఇదంతా శ్రవణం దశలో జరుగుతుంది.

**మననం** – మననం సంశయనివృత్తి చేస్తుంది. పరమత ఖండన ద్వారా స్వమత స్థాపన చేస్తారు మన ఆచార్యులు.

**ద్వైతవాదుల ఖండన** – ఉపనిషత్తుల సారం జీవాత్మ పరమాత్మల ఐక్యం అయితే, ఉపనిషత్తులు బోధించే భేదవాక్యాల మాట ఏమిటి? మీరు మీకు నచ్చిన వాక్యాలను తీసుకుని, భేదవాక్యాలను వదిలేస్తామంటే అది అర్ధ అండ న్యాయం అవుతుంది. సగం గుడ్డును పొదుగుతాము, సగం గుడ్డును వండుతాము అనలేరు కదా!

**ద్వా సుపర్ణా సయుజా సఖాయా॥** – ముండకమ్

రెండు పక్షులు ఒకే వృక్షంమీద ఉన్నాయి. అవి జీవాత్మ, పరమాత్మ. ద్వైతం స్పష్టంగా తెలుస్తున్నది అంటారు ద్వైతవాదులు.

గౌడపాదాచార్యులవారు ఉపనిషత్తులు ద్వైతం గురించి చెబుతాయి నిజమే కాని, సందర్భం వచ్చినప్పుడల్లా ద్వైతాన్ని తీవ్రంగా విమర్శిస్తాయి అని అనేక మంత్రాలను ఉటంకిస్తారు.

**మృత్యోస్స మృత్యుమాప్నోతి య ఇహ నానేవ పశ్యతి॥** – కఠ 2.1.10

ఎవరైతే నానాత్వాన్ని చూస్తారో వారు మృత్యువు నుంచి మృత్యువుకు వెళతారు.

**తత్ర కో మోహః కశ్శోక ఏకత్వమనుపశ్యతః॥** – ఈశ

ఇక్కడ అద్వైతాన్ని ప్రశంసిస్తున్నది.

**నిదిధ్యాసనం** – నిదిధ్యాసనం వేరు, ఉపాసన వేరు. ఉపాసన జ్ఞానయోగ్యతాప్రాప్తి కోసం చేస్తే, నిదిధ్యాసన శ్రవణ మననాలు చేసి, నిశ్చయజ్ఞానం పొందాక చేస్తారు. అది జ్ఞానాన్ని జ్ఞాననిష్ఠగా మలుచుకోవటానికి తోడ్పడుతుంది. ఆత్మ నిత్యం, ఆత్మ సత్యం, ఆత్మ

అకర్తా అభోక్తా అని నేర్చుకుంటే, నిదిధ్యాసనంలో నేను నిత్యం, నేను సత్యం, నేను అకర్తా అభోక్తా అని పదేపదే ధ్యానం చేయాలి. మనస్సు ఒక ఆటాడిస్తుంది. కాని మనస్సును గెలవాలి. అమనీభావం చూపాలి అంటారు గౌడపాదాచార్యులవారు. అది రెండు రకాలుగా చేయాలంటారు.

1. **ద్వైత మిథ్యాత్వ నిశ్చయః** – మనస్సును (బుద్ధిని) ఉపయోగించి, జ్ఞానం ద్వారా ఎదురుగా కనబడే జగత్తు మిథ్య, బ్రహ్మ మాత్రమే సత్యం అని అర్థం చేసుకోవాలి.

2. **మనో మిథ్యాత్వ నిశ్చయః** – అనాత్మ ప్రపంచంలోకి జగత్తు, శరీరం, మనస్సు కూడా వస్తాయి కాబట్టి మనస్సు కూడా మిథ్య అని అర్థం చేసుకోవాలి.

నిదిధ్యాసనం చేయటానికి ప్రయత్నిస్తుంటే ప్రతిబంధకాలు కలుగుతాయి. వాటిని నివారించుకోవాలి.

బి) **సహకారీ సాధనలు**

కర్మయోగం, ఉపాసనయోగం, విలువలు సహకారీ సాధనలు.

**తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషంతి యజ్ఞేన దానేన**
**తపసాఽ నాశకేన ఏతమేవ, విదిత్వా మునిర్భవతి** – బృహదారణ్యకం

మూడు ఆశ్రమ ధర్మాలు పాటించి (బ్రహ్మచర్యం, గృహస్థ, వానప్రస్థం) తరువాత విద్య నేర్చుకుంటే ఆత్మజ్ఞానం పొందుతాడు.

ఆ విధంగా కర్మయోగం చిత్తశుద్ధిని, ఉపాసనాయోగం చిత్తఏకాగ్రతను కలుగజేస్తాయి. విలువలు సాధన చతుష్టయ సంపత్తిని పెంపొందిస్తాయి.

ముండకం పేర్కొన్నవి – సత్యం, తపస్సు, బ్రహ్మచర్యం, సూక్ష్మబుద్ధి, గురుపూజ, తీవ్రముముక్షుత్వం, బలం/పట్టుదల, అప్రమత్తత, వైరాగ్యం.

మాండూక్యంలో పేర్కొన్నవి – హేయం, జ్ఞేయం, ఆప్యం, పాక్యం.

7) **జ్ఞానఫలం** – జ్ఞానఫలం కూడా రెండు రకాలుగా వస్తుంది. ప్రత్యక్ష ఫలం, పరోక్ష ఫలం.

ఎ) **ప్రత్యక్ష ఫలం** – ఆత్మజ్ఞానం పొందుతాడు. బ్రహ్మ విదాప్నోతి పరమ్

బ్రహ్మజ్ఞానం పొందిన వ్యక్తి బ్రహ్మ అవుతాడు.

**హా3వు హా3వు హా3వు । అహమన్నమహమన్నమహమన్నమ్**
**అహమన్నాదో 3హమన్నాదో 3ఽ హమన్నాదః।** – తైత్తిరీయమ్

జ్ఞాని ఆనందంగా సామగానం చేస్తాడు అంటున్నది.

**అహం వృక్షస్య రేరివా కీర్తి పృష్ఠం గిరేరివ । ఊర్ధ్వపవిత్రో వాజినీవ**

నేను పర్వత శిఖరమంత ఖ్యాతి పొందాను. అమృతమైన ఆత్మజ్ఞానాన్ని పొందాను అని త్రిశంకు ఋషి చెబుతాడు.

బి) **పరోక్ష ఫలం** – ఒక్కముక్కలో చెప్పాలంటే జ్ఞాని జీవించి ఉండగా జీవన్ముక్తి, మరణించాక విదేహముక్తి పొందుతాడు.

**సోఽ శ్నుతే సర్వాన్ కామాన్సహ**

అన్ని కోరికలూ ఒక్కసారిగా తీరిపోతాయి. పూర్ణత్వభావనలో ఉంటాడు.

**భిద్యతే హృదయగ్రంథిః ఛిద్యంతే సర్వసంశయాః।**

**క్షీయంతే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే।।**

ఎవరు కార్యకారణ విలక్షణ బ్రహ్మను దర్శిస్తారో, వారికి హృదయంలో ముడులు విడిపోతాయి, అన్ని సందేహాలు సమసిపోతాయి, అన్ని కర్మలూ నశించిపోతాయి.

ఈ జ్ఞాననిష్ఠలో నిలబడటానికి పరమార్థానంద స్వామీజీ వేదాంతసూత్రాలు 5 ఇస్తారు. వాటిని మనం జీర్ణించుకుని, వాటిలో రమిస్తే అద్వైత వేదాంతంలో నిలిచి, జీవన్ముక్తిని అనుభవిస్తాము.

1. నేను సర్వవ్యాపకమైన చైతన్యాన్ని.
2. శాంతి, ఆనందం, భద్రతలు పొందే మార్గాన్ని నేనే.
3. కేవలం నా ఉనికివల్లే నా భౌతిక శరీరానికి జీవం ఏర్పడి, ఈ జగత్తులో వ్యవహారం నడపగలుగుతోంది.
4. ఈ జగత్తులో ఏం జరిగినా అది నాకు అంటదు.
5. నా అసలు స్వరూపాన్ని నేను మర్చిపోయి నా జీవితాన్ని భారంగా చేసుకుంటున్నాను. జ్ఞానయోగమనే విలువిద్యని సరిగ్గా సాధన చేసి, జీవితాన్ని ఒక ఆటగా మలచుకుంటాను.

స్వామీజీ బోధించిన **ఏకాదశ ఉపనిషత్తుల సారం** ముగిసినందుకు కృతజ్ఞతా పూర్వకంగా బ్రహ్మదేవునికి, వేదమాతకు, ఋషిపరంపరకు ప్రత్యేకించి స్వామీ పరమార్థానందజీకీ నమస్కారం చేస్తున్నాము.

**హరిః ఓమ్।**

**ఓం తత్సత్। సర్వం శ్రీకృష్ణార్పణమస్తు।।**

# దశశాంతి మంత్రములు

1. మం।। ఓం శం నో మిత్రః శం వరుణః। శం నో భవత్వర్యమా। శం న ఇన్ద్రో బృహస్పతిః । శం నో విష్ణురురుక్రమః । నమో బ్రహ్మణే। నమస్తే వాయో। త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి। త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మ వదిష్యామి। ఋతం వదిష్యామి। సత్యం వదిష్యామి। తన్మామవతు । తద్వక్తారమవతు। అవతు మామ్। అవతు వక్తారమ్।।

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః।।

2. మం।। ఓం సహ నావవతు। సహ నౌ భునక్తు। సహ వీర్యం కరవావహై। తేజస్వి నావధీతమస్తు, మా విద్విషావహై ।। ఓం శాన్తిః శాన్తిః శాన్తిః ।।

3. మం।। ఓం యశ్ఛన్దసామృషభో విశ్వరూపః। ఛన్దోభ్యోఽధ్యమృతాత్సంబభూవ। స మేన్ద్రో మేధయా స్పృణోతు। అమృతస్య దేవ ధారణో భూయాసమ్ । శరీరం మే విచర్షణమ్। జిహ్వా మే మధుమత్తమా। కర్ణాభ్యాం భూరి విశ్రువమ్। బ్రహ్మణః కోశోఽసి మేధయా పిహితః । శ్రుతం మే గోపాయ।।

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః ।।

4. మం। ఓమ్ అహం వృక్షస్య రేరివా। కీర్తిః పృష్ఠం గిరేరివ। ఊర్ధ్వపవిత్రో వాజినీవ స్వమృతమస్మి। ద్రవిణగ్ం సవర్చసమ్। సుమేధా అమృతోఽక్షితః।ఇతి త్రిశఙ్కోర్వేదానువచనమ్।।

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః ।।

5. మం।। ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే ।
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే।।

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః।।

6. మం।। ఓం ఆప్యాయన్తు మమాఙ్గాని। వాక్ప్రాణశ్చక్షుః శ్రోత్రమథో బలమిన్ద్రియాణి చ సర్వాణి। సర్వం బ్రహ్మౌపనిషదం । మాహం బ్రహ్మ నిరాకుర్యామ్। మా మా బ్రహ్మ నిరాకరోదనిరాకరణమస్త్వనిరాకరణం మేఽస్తు। తదాత్మని నిరతే య ఉపనిషత్సు ధర్మాస్తే మయి సన్తు। తే మయి సన్తు।।

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః।।

7. మం॥ ఓం వాఙ్మే మనసి ప్రతిష్ఠితా, మనో మే వాచి ప్రతిష్ఠితమ్। ఆవిరావీర్మ ఏధి। వేదస్య మ ఆణీస్థః। శ్రుతం మే మా ప్రహాసీరనేనాధీతేనాహో రాత్రాన్సందధామి। ఋతం వదిష్యామి। సత్యం వదిష్యామి। తన్మామవతు । తద్వక్తారమవతు। అవతుమామ్। అవతువక్తారమ్। అవతువక్తారమ్॥

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః॥

9. మం॥ ఓం భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః। భద్రంపశ్యేమాక్షభిర్యజత్రాః। స్థిరైరంగైస్తుష్టువాగ్ంసస్తనూభిః। వ్యశేమ దేవహితం యదాయుః। స్వస్తి న ఇన్ద్రో వృద్ధశ్రవాః । స్వస్తి నః పూషా విశ్వవేదాః । స్వస్తి నస్తార్క్ష్యో అరిష్టనేమిః । స్వస్తి నో బృహస్పతిర్దధాతు ॥

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః ॥

10. మం॥ ఓం యో బ్రహ్మాణం విదధాతి పూర్వం। యో వై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై। తగ్ం హ దేవమాత్మబుద్ధిప్రకాశం, ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే ॥

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః

# ఆర్షవిద్యా తరంగిణి ట్రస్ట్ కార్యక్రమాలు

## లక్ష్యం

ఆర్షవిద్యా తరంగిణి ట్రస్ట్‌ను స్వామీ పరమార్థానందజీ బోధనల స్ఫూర్తితో, ఆశీస్సులతో తెలుగుజాతికి అద్వైత వేదాంతాన్ని దశదిశలా బోధరూపంలో, గ్రంథాల రూపంలో వ్యాపింప చేయటానికి శ్రీ రాఘవరావు, శ్రీమతి రాజ్యశ్రీ దంపతులు శ్రీ రామమోహనరావు గారు, డా॥ యాదగిరి రావు గారు, డా॥ రాఘవరాజు గార్ల చేత స్థాపించబడింది.

1. **అద్వైత వేదాంత బోధ**

ఆన్‌లైన్ క్లాసులు M.S. Teamsలో వారానికి మూడురోజులు సాయంకాలం 6-7 అద్వైత వేదాంతబోధ జరుగుతుంది.

సోమవారం - శ్రీ విష్ణుప్రసాద్ గారు - వేదాంత డిండిమ

మంగళవారం - శ్రీ రాఘవరావు గారు - ఆపరోక్షానుభూతి

బుధవారం - శ్రీమతి రాజ్యశ్రీ గారు - బృహదారణ్యకోపనిషత్

సాంకేతిక సహకారం - శ్రీ రామమోహనరావు గారు, డా॥ యాదగిరి రావు గారు, శ్రీమతి శ్రీలక్ష్మి గారు.

క్లాసులకు ముందు - ర్యాపిడ్ ఫైర్ - సభ్యులచే

క్లాసులు అయ్యాక - ముందువారం జరిగిన బోధ యొక్క పునశ్చరణ - సభ్యులచే

2. **అద్వైత వేదాంత గ్రంథాల ప్రచురణ**

ఇప్పటిదాకా 22 గ్రంథాలు ప్రచురించబడ్డాయి. వాటిలో చాలామటుకు పునర్ముద్రణ చేయబడ్డాయి.

భగవద్గీత షట్కాలు - 3

సంక్షిప్త భగవద్గీత - 1

ఉపనిషత్తులు - 12

ప్రకరణ గ్రంథాలు - 3

ఇతర గ్రంథాలు - 3

(వివరంగా ఈ గ్రంథం చివర్లో చూడవచ్చు.)

3. **గురువులుగా తీర్చిదిద్దటం**

వేదాంతబోధ గురుశిష్యుల సంవాదరూపంలో ఉంటుంది కాబట్టి అలాగే రాయటం జరిగింది. అందువల్ల ఈ గ్రంథాలను చదివితేనే గురువు, మన ఎదురుగా కూర్చుని బోధ చేసినట్టు ఉంటుంది.

ఇదికాక, ఈ గ్రంథాలు Teacher's Manual గా తీర్చిదిద్దబడటంవల్ల గురువుల ప్రోద్భలంతో, సత్సంగ్ సభ్యుల ఉత్సాహంతో, వారికి జిజ్ఞాసులు దొరకటంతో 30 మంది సభ్యులకు పైగా గురువులుగా ఎదిగి ఆర్షవిద్యను వారి శిష్యులకు బోధిస్తున్నారు.

4. **గ్రంథాల వితరణ**

ఆర్షవిద్యా తరంగిణి ట్రస్ట్ పేరిట ప్రచురింపబడ్డ గ్రంథాలు తేటతెలుగులో, అద్వైత వేదాంతం అంటే ఏమిటో తెలియనివారికి కూడా అర్థమయ్యేలా స్వామీజీ ఆంగ్లంలో చేసిన బోధను యథాతథంగా అనువదించటం జరిగింది. అది పండితులను, పామరులను కూడా ఆకర్షించింది.

ప్రచురింపబడిన ప్రతి గ్రంథము కూడా ఆర్షవిద్యా తరంగిణి ట్రస్ట్ సభ్యులకు ఉచితం. వేదాంతంమీద శ్రద్ధ ఉన్న జిజ్ఞాసులు మా ట్రస్ట్ మెంబర్స్ అయితే వారికి కూడా ఉచితం. వేదపాఠశాలలకు, స్వామీజీలకు, గ్రంథాలయాలకు ఆర్షవిద్య బోధించే గురువులకు ఉచితం.

5. **సాఫ్ట్ కాపీలు**

ఆర్షవిద్యా తరంగిణి ట్రస్ట్‌కు arshavidya.app అనే ఒక వెబ్‌సైట్ ఉంది. ఆ వెబ్‌సైట్‌లో ప్రచురింపబడ్డ ప్రతి ఒక్క గ్రంథమూ పూర్తిగా ఉచితం. ఏ గ్రంథం కావాలన్నా, ప్రపంచంలో ఏ మారుమూల ఉన్నా అందులోనే చదువుకోవచ్చు; డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అలాగే ఈ గ్రంథాల సాఫ్ట్ కాపీలు www.telugubhakti.comలో కూడా పొందుపరచబడ్డాయి.

6. **యూట్యూబ్‌లో వీడియోలు**

ఆన్‌లైన్‌లో క్లాసులు అవగానే ఆ బోధ యొక్క వీడియో యూట్యూబ్‌లో డాక్టర్ మంచిరాజు రామానందశర్మగారు వాటికి రంగులు దిద్ది అప్‌లోడ్ చేస్తారు. ఇప్పటిదాకా ఉన్న బోధలు–

ఉపనిషత్తులు – 6
బ్రహ్మసూత్రాలు (చతుస్సూత్రీ)
భగవద్గీత – ఇంగ్లీషులో, తెలుగులో
ప్రకరణ గ్రంథాలు – 6

ఇవికాక,

ఉపనిషత్ కథలు
అద్వైత కథలు
వేదాంత జీవనవిధానం

అనేక పంచకాలు
ఆధ్యాత్మిక విషయాలు
గీతా మధురిమలు
షార్ట్స్
ర్యాపిడ్ ఫైర్
వేదాంత శిబిరాల్లోని బోధ
గురుపూర్ణిమ, శంకర జయంతి, గీతాజయంతి కార్యక్రమాలు
స్వామీజీ/స్వామినిజీల ప్రసంగాలు

ఇన్నిరకాలుగా పెట్టటంలోని లక్ష్యం ఒక ఉపనిషత్తును క్లాస్‌రూమ్ టీచింగ్‌లా నేర్చుకోవచ్చు. షార్ట్ రూపంలో మననం చేసుకోవచ్చు; ర్యాపిడ్ ఫైర్‌గా నిదిధ్యాసనం చేసుకోవచ్చు అని చూపటం.

7. **ఆచార్యుల బోధలు**

అవకాశం కుదిరినప్పుడల్లా స్వామిని/స్వామీజీల అనుగ్రహ భాషణం ఏర్పాటు చేయటం జరుగుతుంది.

ఆత్మలీనానంద స్వామినీజీ
సత్యవ్రతానంద స్వామినీజీ
పరాకాష్టానంద స్వామీజీ
కనిగిరి స్వామీజీ
ఆప్తానంద స్వామినీజీ

8. **ప్రత్యేక వేడుకలు**

అద్వైత వేదాంతంలో మూడు ప్రత్యేక సందర్భాలు ఉంటాయి.

| | | |
|---|---|---|
| గురుపూర్ణిమ | – | ఆర్ష ఆనంద్ కుటీర్ సభ్యులు |
| శంకర జయంతి | – | వేదాంతా సీనియర్ సిటిజన్ సభ్యులు |
| గీతా జయంతి | – | దయాసత్సంగ్ సభ్యులు |

ఈ వేడుకలను ట్రస్ట్ తరుపున ఆ యా సభ్యులు అంగరంగ వైభవంగా ఏర్పాటు చేస్తారు. వీటిలో గురువుల ప్రసంగాలు, సభ్యుల కదంబ కార్యక్రమాలు, పుస్తకావిష్కరణ, సన్మానాలు చోటు చేసుకుంటాయి.

విందుభోజనం ట్రస్ట్ ఏర్పాటు చేస్తుంది.

9. **వేదాంత శిబిరాలు**

ఆర్షవిద్యా తరంగిణి ట్రస్ట్ వేదాంత శిబిరాలను ఏదైనా పుణ్యక్షేత్రంలో ఏర్పాటు చేస్తుంది. అలా చేయటంలోని లక్ష్యం పదిరోజులు లౌకిక విషయాలను మర్చిపోయి, వేదాంతంలో మునకలు వేయటం; తోటి సత్సంగ్ సభ్యులతో కలసిమెలసి మెలగటం; వారి ప్రజ్ఞాపాటవాలను సాయంకాలం సత్సంగంలో చూపటం.

ఇప్పటివరకూ ఏర్పాటు చేసిన వేదాంత శిబిరాలు –

| | |
|---|---|
| కాశీ | – శృంగేరి మఠం |
| శ్రీశైలం | – శృంగేరి మఠం |
| నైమిశారణ్యం | – త్రిశక్తి ధామ్ |
| కంచి | – కామకోటి మఠం |
| ఉజ్జయినీ | – జైన్ మందిర్ |
| ఆనైకట్టి | – ఆర్ష విద్యా గురుకులం |

10. **ధార్మిక కార్యక్రమాలు**

ఆర్షవిద్యా తరంగిణి ట్రస్ట్ ఆవిర్భావానికి, ఎదుగుదలకు కారకులైన పరమార్థానంద స్వామీజీకి, గురువులు ఆత్మలీనానంద స్వామినిజీకి, సత్యవ్రతానంద స్వామినిజీకి కృతజ్ఞతా పూర్వకంగా గురుదక్షిణలు. ఏడాదికి ఒకసారి వేదపాఠశాలలకు బ్రహ్మయజ్ఞంలో భాగంగా కొంత ధనసహాయం అందించటం.

11. **బ్రహ్మయజ్ఞం**

సత్సంగ్ సభ్యులు కాని, తక్కిన జిజ్ఞాసులు కాని ఏమిచ్చినా, ఎంత ఇచ్చినా ఆర్షవిద్యా తరంగిణి ట్రస్ట్‌లో డిపాజిట్ చేయబడుతుంది. ఎవరినీ నోరు తెరిచి ధనసహాయం చేయమని కోరటం జరగదు. ఇచ్చినవారికి రసీదు ఇవ్వటం, ధనాన్నిబట్టి 80జి టాక్స్ ఎక్సమ్షన్ ఇవ్వటం కూడా ఉంటుంది. ఇలా సభ్యులు ఇచ్చిన సొమ్మును బ్రహ్మయజ్ఞం పేరిట గ్రంథ ప్రచురణలకు, ఇతర ధార్మిక కార్యక్రమానికి వాడబడుతుంది. కొంతమంది మహారాజపోషకులు ఒక గ్రంథానికి పూర్తిగా ఒక్కరే ఇతోధికంగా బ్రహ్మయజ్ఞానికి చేయూతనిచ్చారు, ఇస్తున్నారు.

12. **arshavidya.app**

ఆర్షవిద్యా తరంగిణి వెబ్‌సైట్‌లో కూడా క్లాసు ఆడియోలు, క్లాసు వివరాలు, కార్యక్రమాల ఫోటోలు ఉంటాయి.

# ఆర్ష విద్యా తరంగిణి పుస్తక ప్రచురణలు

## ప్రకరణ గ్రంథాలు

01. అద్వైతవేదాన్త పరిచయము
02. భజగోవిన్దమ్
03. దృగ్దృశ్య వివేకము

**శ్రుతి గ్రంథాలు**

01. ముండకోపనిషత్
02. కఠోపనిషత్
03. తైత్తిరీయోపనిషత్
04. ప్రశ్నోపనిషత్
05. ఈశావాస్యోపనిషత్
06. ఐతరేయోపనిషత్
07. ఛాందోగ్యోపనిషత్
08. కేనోపనిషత్
09. కైవల్యోపనిషత్
10. బృహదారణ్యకోపనిషత్
11. మాండూక్యోపనిషత్
12. ఏకాదశ ఉపనిషత్తుల సారం

## స్మృతి గ్రంథము

01. శ్రీమద్భగవద్గీత మొదటి షట్కము
02. శ్రీమద్భగవద్గీత రెండవ షట్కము
03. శ్రీమద్భగవద్గీత మూడవ షట్కము
04. సంక్షిప్త భగవద్గీత

## న్యాయ గ్రంథము

బ్రహ్మసూత్రములు - చతుస్సూత్రీ

## ఇతర గ్రంథములు

01. వేదాంత జీవన విధానము - 01
02. సద్దర్శనం